శ్రీ

# విక్రమ సింహపురి మండల సర్వస్వము.

1963

సంపాదకుడు.

వల్లిపిరెడ్డి చంద్రశేఖరరెడ్డి.

954.8441
[illegible]

AC. 25681

# 38.

# ※ ఇస్లాం పండుగలు ※

శ్రీ మహమ్మద్ రషీద్‌బాషా. బి. ఏ. బి. యల్.

అధివక్త - నెల్లూరు.

1. ఖుల్ హూ అల్లాహూ అహద్; 2. అల్లా హుస్ సమద్; 3. లం యలిద్ వలం యూలద్; 4. వలం యకుల్లహూ కుఫుం అన్ అహద్.

(సూరయే అల్ ఇఖ్లాస్ అధ్యా. 112 భా. XXX.)

1. అతడు అల్లా ఒక్కడే యని వచింపుము; 2. ఈ సర్వమున కధిష్ఠానమతడే; 3. అతనికి వంశోత్పత్తిలేదు. అతడు పుట్టుక లేనివాడు; 4. అతనికి అతడే సాటి.

ఇస్లాము మతము నూతనముకాదు. సృష్టినుండియు అమలునుండినదే మహమ్మదు ప్రవక్త మతస్రష్టకాదు. మతసంబంధమగు ప్రభుసమ్మిత శాసనములు మహమ్మదుకు కొన్ని శతాబ్దములకుముందే అబ్రహాము బోధించియుండెను. ఈమతమును సరిదిద్ది బోధించినవారిలో మహమ్మదు ప్రవక్తయే కడపటివారు. అతనికి ముందటిప్రవక్తలును వారివారి కాలమునందామతమునే ప్రచారముచేసిరి. మహమ్మదు ప్రవక్త, ఈ మతమును సృష్టించనందున, మహమ్మదీయ మతమని దీనిని పిలుచుట సరికాదు. ఈ మతమునకు 'ఇస్లాం' అనిపేరు. ఆమాటకు 'శాంతి' యని నిర్వచనము. పవిత్రమగు ఖురాను బోధించినట్లు ఇస్లాం మతస్థుడు తన్ను సృష్టించిన భగవంతుని యందును, అతడు చేసిన సృష్టియందును, సమస్థభావమును, శాంతమును చూపవలెను. ఇస్లామీయులు ప్రపంచములోని మతములన్నియు పరమేశ్వరుని నుండియే వెలువడిననియు వానిని బోధించుటకై ప్రాచీనకాలమున ప్రవక్తలరుదెంచిరనియు విశ్వసింపవలెను. మరియు నిస్లాముమతము శాంతిని, సర్వమత సహనమును బోధించును. ఈవిషయమున ఖురాన్ ఏ షరీఫ్ యిట్లనుచున్నది.

'ఈ గ్రంథమందు చెప్పుటను సంశయమున కవకాశములేదు. పాపము నుండి రక్షింపబడుట కిందు మార్గము చూపబడినది. అగోచరుడగు పరమేశ్వరునియందు నమ్మకముగల్గి, అతనిని ప్రార్థించుచు అతడొసగు సంపదతో తృప్తుడై ప్రాచీనధర్మముల ననుసరించుచుండినచో పరసుఖము నందుట నిశ్చయము.'

ప్రవక్త మహమ్మదు తానుబోధించి ధర్మములను తన దైనందిన జీవితమున పాటించుచుండెను. అవి గ్రంథమున నిబం

ధింపబడి, నేటికిని ఇస్లామీయులకు మార్గదర్శకము లగుచున్నవి. ప్రతి ఇస్లామీయుడును సర్వేశ్వరుడు డొక్కడే (యద్వితీయుడు) యని నమ్మి, ప్రవక్త సూక్తులనెల్ల నాచరించుచు, ప్రతిమానవుడును చేయు పాపపుణ్యములను బరీక్షించి, తీర్పుచెప్పు 'కడపటి' దినమ్ముదని నిస్సంశయముగ విశ్వసింపవలెను. ప్రతి ముస్లిమునకును సన్మార్గమును చూపుటకు 'ఖురానె ఈషరీఫీను ఓ ప్రవక్త బోధించిన ధర్మములును హదీజ్ ఉన్నవి. వానికి భిన్నముగా నెవడును ప్రవర్తింపరాదు. ముస్లిము లాచరించు పండుగలు ఖురానె షరీఫీ, హడీజ్ లోను శాసింపబడి యుండవలెను. లేనియెడల సనాతన ధర్మపరులగు ముస్లిములు వాని పట్ల ఆదరణ చూపరు.

ఈద్ పండుగ :

'ఈద్' అన నిరంతరానందమని యర్థము. ఇందు ఇదుల్ ఫితర్, ఇదుజ్ జుహా అనునవి ముఖ్యములు, వానిలోని అంతరార్థమేమన. ఆపండుగలలో ఇస్లామియు లొకచో సమావిష్టులై, సర్వేశ్వరునకు సాష్టాంగ నమస్కారము లర్పించుటయే. ఇందలి ముఖ్యసూత్రము, ప్రార్థించువారు పారలౌకిక జ్ఞానము నవగాహన చేసికొనుటయే.

మొహరం :

మహమ్మదీయ కాలమానములో ప్రథమ మాసమును మొహర మందురు. అనగా పరమ పవిత్రమని ఆపదమున కర్థము సనాతన పరులగు నిస్లామీయులు ఈ మాసములో 10 వ రోజున అనశనవ్రతము పూనెదరు. వారినమ్మకములో ప్రవక్త మోసెస్ ఈజిప్టు పాలకుడైన 'ఫేరేస్' దౌష్ట్య పరిపాలననుండి ఇజరాయీలను తప్పించి రక్షించిన దినము. ఇదిగాక పరమేశ్వరుడు ఆది దంపతులగు ఆదామ్ హవ్వాలను సృష్టించిన దినము. ఈమాసమున మొదటి 10 రోజులు శోకతప్తులుగ నుందురు. పూర్వము 'హుసేన్' అనువీరుడు ఇస్లాము మతరక్షణకై తన సహచరులను కర్బాలా ప్రదేశమునుండి రక్షించి. వీరమరణమందెను. దానిచిహ్నమే శోకము. దాని యైతిహ్యమిట్లుచెప్పుదురు.

ఖలీఫ్ అనునది ఇస్లాము మతస్థుల గురుపదము. అందుండువారు ఆ మతధర్మములనెల్ల పాటించి, పాలించువాడుగ నుండును. 5 వ ఖలీఫ్ మావియా అనంతరము అతని కుమారుడు యజీద్ తన పదలీ ఎన్నిక పద్ధతి నుల్లంఘించి ఖలీఫా పదవి నధిష్టించెను. అతడు విషయలోలుడుగ, నున్నంమన ఖిలాఫత్ పదవికి అనర్హుడుగ నెంచి కూఫాప్రజలు మహమ్మదు ప్రవక్తదౌహిత్రుడును, వీరుడునగు 'అలీ' కుమారుడగు హుస్సేనును, తమ్ము రక్షింపవలసినదిగా కోరిరి. అట్లు సంరక్షించుటకు వచ్చిన కూఫా ప్రజలలో లక్షమంది ఖడ్గదారులు సిద్ధముగా నున్నట్లు తెల్పిరి. కాని మక్కాలోనుండిన హుస్సేను మిత్రులు, కూఫాప్రజలు చలచిత్తులనియు, వారిమనస్సులు హుస్సేను పట్ల నున్నను, వారికత్తులు విరోధివర్గమువైపున నున్నవని వారించిరి. వెంటనే 140 వేల మంది కూఫాప్రజలు సంతకములుచేసి హుస్సేనుకు విజ్ఞప్తి పంపిరి. మిత్రుల సలహా వమ్ముచేసి హుస్సేను అజాబులను కట్టకట్టుకొని ఛాత్రు మిత్ర కళత్రములతోడ, 40

గుఱ్ఱపు రౌతులతోడ, 150 కాల్బంటులతోడ కూఫాపై దాడిసాగించెను. కూఫానేలు ఉప ప్రభువు, తన ప్రభువగు యజీద్‌కు దాడివిష యమై ఎఱుక పఱచెను. యజీదు కూఫాను సమీపింపవలదని హుస్సేనుకు హెచ్చరిక చేసెను. మొహరము మాస ప్రారంభమున హుస్సేను కూఫాకు ఉత్తరమున 25 మైళ్ళ లోనున్న కర్బాలా చేరెను. అతని స్వల్ప సేనలను యజీదు 4 వేల సైనికులతో నెదిరించెను. రాయభారము భగ్నమయ్యెను. యజీదు కూఫాయందలి ఉపగవర్నరుస కిట్లు ఆజ్ఞాపించెను. 'హుస్సేను' అతని అనుచరులు తన కలీఫాపదవికి తల యొగ్గి ప్రమాణము స్వీకరించిన వారిని దయతో చూడుము. లేదేని వారు ధిక్కరించిన చిత్రవధచేసి గుఱ్ఱముల కాళ్లతో వారినినలిపివేయుమని. శత్రు సేనలు హుస్సేనును యూఫ్రటీసునదిని దాటనివ్వలేదు. హుస్సేను తన సైన్యముతో కర్బాలావద్ద గుడారముల నిర్మించుకొని, యుద్ధసన్నాహముతో నుండెను. వారికి భోజన పానీయాదు లరికట్ట బడెను. హుస్సేనుకు సాయముచేయుదమని లేఖలు వ్రాసినారు, నిస్సహాయులై మిన్నకుండిరి. యజీదు సైన్యముతో తలపడెను. హుస్సేను గుడారములచుట్టును గుంటలుత్వ్వి, అందు కట్టెలువేసి నిప్పురగిలించి, శత్రువులను చొచ్చుకరానీక అరికట్టెను. హుస్సేను సహాయులు గూఢముగ నాహారపదార్థములను, పానీయములను బంపిరి. మొహరం 10 వ నాటికి కతిపయి సేనలే మిగిలినవి. తక్కినవారు వీరస్వర్గము చూరగొనిరి. ఆనాటి అపరాహ్ణమందు హుస్సేను యూఫ్రటీసు నదిలో నీరు త్రాగుచుండ వైరిసేనలోని ధానుష్కుడొకడు, అతని పెదవిని చీల్చునట్లొక బాణమును, వీపును చీల్చునట్లు వేరొకశరమును ప్రయోగించెను. అది వారి మాధ్యాహ్నిక ప్రార్థనా సమయము. అదియే హుస్సేను విషాదగాథ.

గుడారముల చుట్టును మంటలువేసి సేనలను భద్రపరచుకొని వైరినెదిరించిన హుస్సేను ఉదంత చిహ్నముగ ఈ నాటికిని మొహరం 10 వ నాడు గుంటముల నిండుగ అగ్నికణకలను నింపి, అందు నడచెదరు. అదియే నిప్పులగుండము త్రొక్కుట అని చెప్పబడుచున్నది.

ఇంకను 'షియా' మతస్థులు ఈ వీర గాథను నాట్య పురస్సరముగ భక్తి ప్రపత్తులతో ప్రదర్శించుటయు కలదు. ఆదినములలో 'పీర్ల చావడి (పంజామకాన్) లో ఆనాటి వీరుల జయపతాక చిహ్నములను వారి ఆయుధములను ఉంచి, భక్తితో గౌరవింతురు.

ఈదినములలో అనశన వ్రతమును పాటించుట శాస్త్రవిధి! అట్లుండ నేటివారు తెలియక ఈమొహరమును పండుగ దినముగ పాటించుచున్నారు. కొందరాదినములలో పులివేషములు ధరించి, ఆనాడు కర్బాలాలో రణరంగమున జూపిన వీర విహారమును అనుకరించు చుందురు. పులివేషము వేయుటలో హుస్సేను తండ్రియగు 'అలీ' వ్యాఘ్రమునకు సాటియగు ధైర్య సాహసములు కలవాడనుటకు స్మారకము. హుస్సేను కొలువులో అబిసీనియా దేశీయుడగు (సిద్దీ) యను నల్లని మల్లుడుండెను. వాని చిహ్నముగ నేటికిని ఆదినములందు

కొందరు నల్లటివేషము వేసికొని 'సిద్దీ' తత్త్వ
మును వెల్లడించుట కలదు. ఈపండుగ
దినములలో పేదవారు అర్ధలోభులై వేష
ములు వేయుట ఆచారమైనది. సనాతులను
ఇస్లామీయు లిట్టి వేషధారణకు విముఖులు

గూడూరు తాలూకాలోని కాకితల
పూడిలో షియా మతస్థులు పెక్కురున్నారు.
వారా పండుగను వైభవముగ జరుపుదురు.
స్త్రీపురుషులెల్లరు (ఆబాలవృద్ధము) ఆదిన
ములలో శోకించుచు, రక్తధారల పర్యం
తము గుండెలు బాదుకొందురు. ఆ పదిదిన
ములును శాఖాహారమునే భుజింతురు. అగ్ని
గుండము లేర్పరచి, వానిపై నడచెదరు.
ఈ కార్యక్రమమును 'అలావా' అందురు.
10 వ దినము తాబూత్ అనగా గుమ్మట
మును (హుస్సేను సమాధి రూపము)
నిర్మించి యూరేగింతురు. మకాన్‌లోని పం
జాలను సైనిక పతాకములను ఊరేగించి,
జలాశయములందు నిర్మాల్యము మొనర్చి,
విషాద గీతములను పాడుచు, మృతవీరు
లను సంస్మరించుచు గృహోన్ముఖు లయ్యె
దరు. ఆ పంజాలను వంశ, పారు, మం
జూషికలలో భద్రపరచెదరు.

సనాతనులగువారు 9 వ 10 వ దిన
ములలో ఉపవాస వ్రతమును పూనుదురు.
పీర్లవద్ద పాతేహా (నైవేద్యము) ప్రతినలు
చేయుదురు. కందుకూరు, అల్లూరు పదితర
ప్రాంతములందు షర్బత్తు పానీయములను
పంచిపెట్టుటకలదు. మొహరం 12 వ నాడు
నెల్లూరు పరిసర ప్రాంతీయులగు స్త్రీపురు
షులు దర్గామిట్టలో నుండు బారాషహీద్
సమాధులకడకేగి, దాశనమందు పతాక
మును గుమ్మటములను చేసి వదలుదురు.
స్త్రీలు సమాధులను దర్శించుట శాస్త్రనిషిద్ధ
మైనను ఆచారముగనున్నది.

రంజాన్ :

ఈ రంజాన్‌నెల శుద్ధ పాడ్యమి
ముస్లిములెల్ల రెదురుచూచుచు, నెలపొడుపు
రాకకై తొందరపడుచుందురు. నెలపొడుపు
కన్పింపగనే రంజాన్ మాస మారంభమై
నట్లు నిశ్చయింపబడి, ఆనాటిరాత్రి మసీదు
లలో 'రావీః' అను రాత్రి ప్రార్థనను సల్పి
అనశన దీక్షను వక్రమింతురు. ప్రతి యిస్లా
మీయునకును 'సామ్ (రోజా)' చాల ముఖ్య
మగు వ్రతము. భోజనము సూర్యోదయా
త్పూర్వము రెండుగంటలకు ముందే చేయ
వలెను. పగలంతయు భోజన పానాదులు
చేయరాదు. దైనం దినముగ దుస్సంకల్ప
ములు, దుర్భాషలు నిషేధింపబడినవి. ఈ
యనశనవ్రతము మత, నైతిక, సాంఘిక,
శారీరక దృష్ట్యా ఆదర్శ ప్రాయ
మైనది. ఈ వ్రతమును కొనసాగించుట
వలన శారీరక, మానసిక సంయమన మల
వడి క్షుత్పిపాసలను లోబరచుకొని, జితే
ద్రియతకు దారిచూపును. శ్రీమంతులైనను
నిరుపేదలైనను వ్రతము నుష్ఠింపవలసినదే
ఆ మాసములో ప్రతిదినము 5 పర్యాయ
ములు అందరును రాజు, పేద అను భేద
భావములేక ఒక్కచోగూడి ప్రార్థన సలుప
వలెను. శ్రీమంతులీవ్రతానుష్ఠానమం
దున్నప్పుడు క్షుద్బాధా పీడితులగు పేదల
కష్టములను గుర్తింప వీలగును. శారీరక
ముగ లంఘనము పరమౌషధముగదా!

ఈమాసమున సూర్యోదయమునకు
ముందే భుజించి, అస్తమానమువరకు భుజిం

పరుండి, భగవత్ప్రార్ధనతో కాలముగడు
పుట శాస్త్రసమ్మతము. ఇట్లు మరుమాసము
'షవ్వాల్' వచ్చువరకు నాచరించవలెను
మాసాంతమున ఇదుల్ పితర్' అను పం
డుగజేసికొందురు దానధర్మము లొనర్చు
టయే ఆపండుగకు ముఖ్యవిధి ప్రవక్త మహ
మ్మదుకు ఖురాన్ ఈ షరీఫ్ వ్యక్తమై గోచ
రించిన మాసము అందువలన ప్రతిరాత్రియు
'తారావీః' అను ప్రార్ధనలు మొదటినుండి
27 వ రాత్రివరకు జరుపనగును ఆ 27 వ
రాత్రిని 'లైలతుల్ ఖదర్' అనగా దివ్యమైన
రాత్రి అని వ్యవహరింతురు పవిత్రగ్రంథ
మారాటినుండి గోచరించుట కారంభమయ్యె
నని తలంచెదరు

ఇదుల్ ఫితర్

దానధర్మములిచ్చు పండుగ ఆనాటి
పూర్వాహ్ణమున నందఱు ఈద్గా' చోటచేరి
ఫిత్రా లేక ఖైరాత్ః (దానధర్మములు) చేసి
ప్రార్ధనలకు తరలుదురు అదానము చేయుట
ప్రతివానికి విధి మన దేశమునం దీనాడు
దాన (ఫిత్రా) పరిమాణము, 3, 4 శేర్ల
గోధుమ లేక బియ్యము పేదవారి పోష
ణకై అయాదారము ప్రబలినది కలిమికల
వారు వస్త్రదానమును జేయనగును తదుపరి
అందరును 'ఈద్గా' నిర్ణయించిన ఆరామ
విశాల ప్రదేశమందు ఇద్' ప్రార్ధనకు
చేరుదురు ఇట్టి ఇద్గా మన సింహపురిలోని
గవర్నమెంటు ట్రైనింగ్ కళాశాల వద్ద
నున్నది భక్తులందరు చేరినపిదప వారిలో
అగ్రేసరుడు (పేష్ఇమాం) మతప్రబోధము
చేయును. అతనికి, కొందరు నూతనవస్త్ర
ములనుగూడ సమర్పింతురు ప్రబోధానం

తరము శ్రోతలందరు దీన్' అని వాకొం
దురు దీన్ అనగా శ్రద్ధాభక్తి పెద్దపట్టణ
ములం దాసమయమూచనగ తుపాకి ప్రేల్చు
టయు కలదు పిదప ప్రతిముస్లిము భక్తు
డును వేరొకనిని ప్రేమతో కౌగిలించుకొని
ఆనందముతో ఇద్ ముబారక్' అని వచిం
చును ప్రతియింటిలో మధురపదార్ధములను
సేమియాతో జేసికొందురు

మీలాదేనబీ బారావఫాత్

మహమ్మదు జన్మించిన దినమును
మీలాదేనబీ అనియు, నిర్యాణ మందిన దిన
మును బారావపాత్ అనియువ్యవహరింతురు.
ముస్లిముల సంవత్సర తృతీయమాసమగు
రబ్బీవుల్ అవ్వల్ లో 12 వ దినము ఆ పం
డుగ తలంపబడును నిర్యాణ వర్ధంతి
అను తలంపున కొందరు ఉపవాస ముండు
టయు కలదు ఉరుసు అనగా వర్ధంతి

నెల్లూరునందు ఆదినమున ఖదమే-
రసూల్ అనగా ప్రవక్త పాదచిహ్నాతమగు
శిలను, మూయే ముబారక్ (ప్రవక్తకేశము)
ఒకదానిని గర్పివీధిలో భక్తులందరకు
దృష్టిగోచర మొనరింతురు ఆరాత్రి కాజీ
గృహమునుండి గంధముమ ఊరేగించెదరు.
గంధపాత్రను కాజీ స్వయముగ శిరమం
దుంచుకొని వీధిలో ఊరేగింపుతో వెడలును
తర్వాత ఆగంధ మందరకు పంచబడును.
పేదల కానాడు విరివిగ అన్నదాన మొనర్చ
బడును ప్రవక్తనుగూర్చియు, మతమును
గూర్చియు, అజ్ఞానమయమగు ప్రపంచము
నకు మహమ్మదు చూపిన వెలుగు బాటలను
గూర్చియు ప్రబోధము చేయుదురు. మరియు
ప్రవక్తపేర పాతేహా,(నివేదన)చేయుదురు.

అఖరిచార్ షంబా (అంతిమ సౌమ్య వారము) మహమ్మదీయ సంవత్సర రెండవమాసమగు సఫర్ అంతిమ బుధవారమునాడీపండుగ జరుపబడును. నాడు ముస్లిములు ఆరామప్రదేశములందును, పచ్చికబైళ్లయందును విహారము సల్పుదురు. ప్రవక్త అనారోగ్యస్థితినుండి కోల్కొని విహారము సల్పిన దినమని వారి విశ్వాసము. సింహపుర ఇస్లామీయులు బారాషహీద్ దర్గాప్రదేశమునకేగి అల్పాహారవిందు చేసికొందురు. ఈ యాచారమునకు సనాతన ఇస్లామీయులు సుముఖులుకారు. ప్రార్థనలు మాత్రము జరుపుదురు.

షబే మిరాజ్ :

అనగా ప్రవక్త స్వర్గమునకు పారలౌకికయాత్ర గావించుట యని అర్థము. గేబ్రియల్ (లేక జిబ్రాయీల్) అను దేవదూత ప్రవక్తకు సర్వేశ్వరుని అపరోక్షానుభూతిని కల్పించెను. సాంప్రదాయముగ నిశ్శబ్దమగు నిశీథమందు ప్రవక్త నిద్రనుండి ప్రబోధితుడయ్యెను. చూడగా కనుమేర దూరమున భానుతేజమున వెలుగొందు జిబ్రాయల్ దేవదూతను జూచెను. అతడు ప్రవక్త హృదయమును వెలికిదీసి సువర్ణ భాండమున శ్రద్ధాజలమున క్షాళనముచేసెను. బురాఖ్ (మానవ ముఖమగు గుఱ్ఱము) కూడ కన్పించెను. అది కన్నులు రత్నకాంతుల జిమ్ముచు, ముత్యములతో వెల్గు పక్ష్మములు కల్గియుండెను. దాని ఖురములు ఒంటెను బోలి సింహవక్షమును గల్గియుండెను. బురాఖ్ అనగా విద్యుల్లేఖకు ప్రతీకము. ఈ బురాఖ్ మానవుల మనస్సులను, మాటలను అర్థముచేసి కొనగలదుకాని, సంభాషింపజాలదు. ప్రవక్త దానినెక్కి జిబ్రయీల్ వెంటరా స్వర్గారోహణ మొనర్చెను.

ప్రథమమున శినాయ్ పర్వత శిఖరము చేరెను. అచ్చటనే మోసస్ ప్రవక్త మున్ను సర్వేశ్వరునితో సంభాషించెను. పిదప జీసను జన్మస్థలమగు బెత్లం చేరుకొనెను. అచ్చట ప్రవక్త ప్రార్థనలు సల్పెను. అంత నాతడు బురాఖ్ తో వెలుగునే సోపానముగ జేసికొని, రజత మయమగు ప్రథమ స్వర్గమును జేరి, అచ్చట ప్రథమ మానవుడగు ఆదమును కలిసికొనెను. తర్వాత అయోపూరిత ద్వితీయ స్వర్గము జేరెను. అచట ప్రవక్త నూహ్ః (Noah) ను కలిసికొనెను. అంత నవరత్న ఖచితమగు తృతీయ స్వర్గమును జేరి, యుసఫ్ను కలిసికొనెను. ఇట్లే సప్తమ స్వర్గమును జేరి ఇబ్రాహీమును కలిసికొనెను. అచ్చోటు సహస్ర దివ్యకాంతలు వెదజల్లుచుండెను. అచ్చట జిబ్రాయిల్ మహమ్మదును విడచి తాను విరమించెను. మహ్మద్ ఇంకను ఉన్నతమున నున్న స్వర్గమును ప్రవేశించి, సర్వేశ్వరునితో సంభాషించెను. ప్రవక్తకు సర్వేశ్వరుడు దైనందినమగు అయిదు ప్రార్థనలు ప్రభు సమ్మితముగా తెల్పెను. ఈ స్వర్గప్రయాణమంతయు క్షణకాలమున జరిగినది. ఈ తురీయావస్థ జ్ఞానము లౌకికులగు మానవులకు లభించుటకు కొన్ని శతాబ్దములు పట్టును.

షబే బరాత్ :

మహమ్మదీయ వత్సరమున ఎనిమిదవ మాసమగు షాబాన్ 16 వ దినము రాత్రి అంతయు సర్వేశ్వరుని ఆజ్ఞతో దేవదూతలు భూప్రదేశమునకు దాపుగ వచ్చెద

రనియు, అప్పుడు ప్రార్థించిన స్వామి స్వీకరించునని విశ్వాసము. ఆ దినముననే గతించిన వారినిగూర్చి స్మరించి ఫాతేహాల నర్పింతురు. సమాధులను పూలతో నలంకరింతురు. మానవు డొనర్చు ప్రతి కర్మ ఫలితమును దేవదూతలు సంవత్సరమున కొకసారి (ఆ దినము) గ్రంథస్థము చేయుదురట. ఆ దినమున చనిపోయినవారి , వారికిష్టమగు తినుబండారములను నివేదన మొనర్తురు. ఆ దినము ఖురానే-ఈ-షరీఫ్‌ను జదివి, దాని ఫలితమును పితరుల కర్పింతురు. సనాతను లగువారు రాత్రి అంతయు మశీదులలో గాని,గృహములందుగాని ప్రార్థనలు సలుపుదురు.

బక్రీద్ (లేక) ఇదు-జుహా :

అనగా ప్రాణార్పణచేయుట యని యర్థము. పండ్రెండవ మాసమును జిల్‌హిజ్జా 10 వ రోజున ఆ పండుగ నాచరింపబడును. ఈ మాసమున మక్కాకు తీర్థయాత్రను జరుపుదురు. ఇద్గాలో భక్తులుచేరి ప్రబోధ ప్రార్థనలు గావింతురు. ఉదయము గం. 10 లకు అవన్నియు ముగించుకొని, ప్రాణార్పణము చేయుటకై యిండ్లకు వచ్చెదరు. అర్పించిన పశుమాంసమును త్రిభాగములుగ జేసి, అందొకటి కుటుంబ వినియోగమున కుంచుకొని, వేరొకదానిని పరిసరవానుల కిచ్చి, మూడవదానిని బీదలకు దానమిచ్చెదరు. దీనినిగూర్చి ఈ క్రింది గాథ సాంప్రదాయజ్ఞులు చెప్పుట కలదు.

ప్రవక్త ఇబ్రహీమ్ తన కుమారుడగు ఇస్మాయిల్‌ను గాఢముగ ప్రేమించెను. సర్వేశ్వరు డాకుమారుని తన కర్పింపుమని శాసించెను. ఇబ్రహీమ్ అజ్ఞను శిరసావహించి, కుమారుని త్యాగమొనర్ప సిద్ధపడెను. అతని సాహసమునకు అచంచల భక్తికి ప్రభువు ఇస్మాయిలును రక్షించెను. ప్రియతమమగు వస్తుత్యాగము అతీతమగు పుణ్యకార్యమనుట జగమెఱిగిన విషయము కదా! ఇట్టిదానికి ఇస్లాము మతమున ప్రాధాన్య మీయబడినది.అర్పణసమయమున భక్తుడు త్రికరణశుద్ధిగ సత్యముననే నమ్మి తన సర్వస్వమును త్యాగముచేయును. పశువును త్యాగముచేయుట యన మానవుని యందు దాపరించియుండు పశుత్వమును విసర్జించుట. తనచేతనుండు ఈ మహత్కార్యము నొనరించి మానవుడు దైవస్థాయి నందుచున్నాడు. ఇట్లు పుణ్యకర్మలొనర్చి తన పశుత్వమునువీడి మానవుడు స్వర్గప్రాప్తి కర్హుడగుచున్నాడు.

లోకే కలంక మపహాతు మయం మృగాంకో
జాతో ముఖంతవ, పున స్తిలకాచ్ఛలేన ।
తధాపి కల్పయసి తన్వి కలంకరేఖాం
నార్యః సమాశ్రితజనంహి కలంకయంతి ॥

## విచిత్ర విచిత్రములు

# 3. ఉదయగిరి మంచినీటి వసతి.

ఉదయాద్రి చేరువన ఉదయగిరిపురము చారిత్రాత్మకముగ వర్ధిల్లినది. ఒరిస్సా గజపతుల పాలననుండి, విజయనగర రాజుల పాలనలోనికి వచ్చినది. విజయనగర సార్వభౌముల ప్రతినిధి ఇచ్చట పాలన మొనర్చుచుండెను. ఇయ్యది 16. శతాబ్ది నాటి చరిత్ర.

వారి కాలముననే కాబోలు - ఈ గ్రామవాసులకు మంచినీటి వసతి చిత్ర విచిత్రముగా నిర్మింపబడి, ఈనాటికిని ఆనీటి సదుపాయము అవిచ్ఛిన్నముగా జరుగుచున్నది.

కొండ సెలయేటి ధార, అవిరామముగా క్రిందికి శిలానాళికలద్వారా ఊరివరకు తీసికొనిరాబడి అచ్చట నొక తొట్టిని నింపును. ఆ తొట్టిలో నీరు కొంతవరకు నిండగనే, అందుండి భూగర్భమున నేర్పఱచిన శిలానాళికలగుండ, దిగువనుండు రెండవ తొట్టి నిండును. ఇట్లు అప్పటి గ్రామవసతులబట్టి అచ్చటచ్చట ఆరు తొట్లు నిర్మింపబడి యున్నవి.

ఒకటి నిండగనే, నీరు శిలానాళికలద్వారా దూరమున క్రిందుస్థాయిలో నుండు తొట్టి నిండును. ఇవి నిర్మించి ఈనాటికి 400 సం. యైనది. నీరు స్వచ్ఛమగుటచే, శిలానాళికలను గాని, ఈ తొట్లనుగాని మట్టి పేరుకొని పోలేదు. ఇట్టిది ప్రపంచమున మరెచ్చటను లేదని చెప్పవచ్చును.

కాని, హంపి నగరమందు ఎగువనున్న తుంగభద్రానది నీటిని, విరూపాక్ష దేవళముపైనుండి పాఱుదలచేయించి స్వామి అభిషేకమగునట్లు శిలానాళికలద్వారా ఏర్పాటు గావింపబడి యుండెను. ఇట్టిదే మొగలుల కాలమున ఆగ్రా కోటలో యమునా జలముల పారించు పద్ధతి యున్నది.

ఉదయగిరి యందలి విశేషమేమన, పర్వతమందలి జలపాతమును, జనోపయోగముగా నొనర్చుట. తదుపరి ఈనాటికిని ఉపయోగకరముగా నుండుట.

ఉదయగిరి యందు ఈ నీటితొట్లు ఆరున్నవి. అందు మందొజులు 2. (ఇందొకటి హరిజనుల వసతికి.) రోద్ద జొజు 1., రెడ్డిగారి జొజు - 1., బ్రాహ్మణవీధి జొజు 1., సత్రం జొజు - 1. తొట్టి చిత్రమును చిత్రఫలకము VIII న చూడుడు.

# 39.

# హరిహరరాయలు - బ్రాహ్మణక్రాక శాసనము

## (క్రీస్తు శకము 1377.)


శ్రీ కేసరి సుందరరామశర్మ, కావలి.

(సాహిత్య విద్యాప్రవీణ, విద్వాన్.)


నెల్లూరు మండలములోని కావలి తాలూకాకుఁ జెందిన 'బ్రాహ్మణక్రాక' కొక తామ్ర దానశాసనము కలదనియు, అయ్యది విజయనగరాధీశులైన రెండవహరిహరరాయ లొసఁగిరనియు, అనుకొనుచుండ వినుకలియే కాని, చూచుట తటస్థించినదికాదు. ఇప్పుడది తద్గ్రామవాసులైన చి॥ కేసరి శరచ్చంద్ర బాబు (యం.ఏ. విద్యార్థి) యొద్ద నుండఁగాఁ జూచు భాగ్య మబ్బినది. దేశచరిత్ర యెడలను గ్రామగౌరవము పట్లను అభిమాన ముంచి, శాసనమును బదిలపఱచిన వర్ధిష్ణువు శరచ్చంద్ర బాబు ప్రశంసాపాత్రుఁడు.



శాసనములు.

**శాసనాకృతి :**

ఈశాసన పత్రము లయిదును పలకల ఆకారముననున్నవి. ఒక్కొక్క రేకుపొడవు 12. 5 అంగుళములు, వెడలుపు. 7.7 అంగుళములు. ఆద్యంత పత్రములకు లోవలి ప్రక్కమాత్రమే యక్షరము లున్నవి. తక్కిన మూఁడురేకుల కిరుప్రక్కల వర్ణములు చెక్కఁబడినవి. రేకుల జవ లించుక యెత్తుగా నున్నవి. రేకులకు పైభాగమున గుండ్రని బెజ్జము వేసి, అందుండి రేకులొక బలిష్ఠమగు రాగి కంకణమునకు గ్రుచ్చఁబడియున్నవి. కంకణ మతికినచోట దుద్దువలె నొక దిమ్మయున్నది. కడియము, దిమ్మల వ్యాసము యథాక్రమముగ 4, 6 అంగుళములు 1. 8 అంగుళములు. ఒక్కొక్క రేకులో క్రమముగ 24-29-29-28-28-26-28-24 బంతులున్నవి. కొన్ని రేకులలో బంతికి 20 అక్షరములును, కొన్నిట 25 అక్షరము లున్నవి. మొత్తము 5 రేకులలో 112 శ్లోకములు దేవనాగరిలిపిలో స్ఫుటముగనే యున్నవి. అందుఁ గొన్నివర్ణములు నేఁటి దేవనాగరిలిపికి భిన్నముగనున్నవి. నందినాగరిలిపి కాబోలును. శాసనమంతయు ముగిసిన పిమ్మట 'శ్రీవిరూపాక్ష' అని తెలుఁగుకన్నడలిపి సంతకము కలదు.

విజయనగర రాజుల శాసనము లంతటను శ్రీవిరూపాక్ష లేక శ్రీరామచంద్ర అని

ముద్రయుండుట పరిపాటిగనున్నది అందు కుదాహరణముగ బిట్రగుంట శాసనమును జూడవచ్చును రెండవసంగముడు (కంపరాయల తనయుడు) తమగురువులైన శ్రీకంఠనాదుని ప్రోత్సాహమున క్రీ శ 1356 మేనెల తే 3 ది (దుర్ముఖి) నాడు 28 మంది బ్రాహ్మణులకు బిట్రగుంట అగ్రహారమిచ్చి దానికి • శ్రీకంఠపురమని పేరిడినట్లు శాసనముకలదు అందును గడపటఁ బంచాక్షరీ మంత్రమైన 'శ్రీవిరూపాక్ష' అను నామమున్నది దీనిని బట్టి విజయనగరాధీశులు తాము దానమొనర్చిన గ్రామములు 'నిత్యకల్యాణములుగ' విలసిల్లు చుండవలయునన్నతలంపునఁ గడపటఁ దమ యిష్టదైవముల నామములను లిఖించుట పరిపాటియైనవచ్చును

ఈశాసనమంతయు సంస్కృత పద్యరూపముగ నున్నది వివిధవృత్తములున్నవి. శైలి ధారాళము ప్రారంభముననుండు భగవన్నుతి, రాయలప్రతాప స్ఫూర్తి ప్రకటించు పద్యభావములు మనోహరములు ఇందు భ ధలకు భేదము పాటింపఁబడలేదు.

శాసన ప్రయోజనము

ఈ శాసనము విజయనగరమును బాలించిన రెండవ హరిహరరాయలది హరిహరరాయలు తమ తండ్రియగు బుక్క (II) రాయల ముక్తికొరకు (పితుఃముక్త్యై) నానాశాఖలకు నానాగోత్ర సూత్రములకు సంబంధించిన వేదశాస్త్ర పారగులగు బ్రాహ్మణోత్తములకు శాలివాహన శకము పన్నెండు వందల తొంబది యెనిమిదవ నళ' సంవత్సర ఫాల్గుణ బహుళ ప్రతిపత్తునాఁడు 'బుక్కరాయపుర' మను నామాంతరముంచి బ్రాహ్మణక్రాక గ్రామమును సర్వ స్వామ్యముల తోడను అష్టభోగముల తోడను ఆచంద్ర మాతారకముగ ననుభవించుటకై దానముచేసెను అందుకే యీ శాసనము పుట్టినది

శాసన విభాగము

ఈ శాసనమును స్థూలముగు 1 భగవన్నుతి 2 సంగమ వంశ ప్రశస్తి 3 హరిహరరాయల ప్రతాపము 4 దానకాలము 5 దానమిచ్చిన గ్రామమునకు హద్దులు 6 అంశల విభాగము 7 ప్రతిగ్రహీతల గోత్రనామములు 8 శాసన కావ్యకర్త నామము 9 శాసనాంతమునఁ బరిపాటిగ నుండు శ్లోకములు 0 శుభాశంసనము అని పది విధములుగ విభజింప వచ్చును

సంగమవంశ ప్రశస్తి

శాసనమునఁగల మొదటి ఆరు శ్లోకములును సరస్వతి, హరి యొక్క లీలావరాహము, విఘ్నేశ్వరుఁడు, పశుపతుల ప్రార్థనాపూర్వక మంగళ శ్లోకములు 7 నుండి 3 వ శ్లోకము వరకు హరిహరుని

---

• శ్రీకాంతపురమని కొన్నిగ్రంథములం దున్నది

ః నిధి నిక్షేపసంయుక్తం జలపాషాణసంయుతం అక్షీణ్యాగామిసహితం సిద్ధసాధ్య సమన్వితం (పెంచుకలదిన్నె శాసనము)

సర్వస్వము 16 వ పుట చూడుడు.

వంశ వర్ణన కలదు. దేవతలు మధించిన పాలకడలినుండి చంద్రుఁడు జనించెను. ఆ చంద్రవంశమున యదువు కల్గెను. ఆ వంశ పరంపరయందే సంగమ మహీపతి యుద్భవిల్లెను. అతనికి బుక్క(II)నృపతియు, నతనికి హరిహరుఁడును (II) బుట్టిరి. అతఁడే గ్రామదాత.

మొదటి హరిహరరాయల తమ్ముఁడగు బుక్కరాయలు (II) క్రీ. శ. 1351 లో విజయ నగర సింహాసనారూఢుఁ డయ్యెను. అతడు చూపిన శౌర్యము, కావించిన దానములు, ప్రదర్శించిన సర్వమత సహనము,నభూతో నభవిష్యతి అనవచ్చును. అతని పట్టపుదేవి మల్లమాంబిక. విద్యారణ్యులని జగద్విఖ్యాతిఁ గనిన మాధవాచార్యులాతనికడనే మంత్రిగ నుండెను.

ఆసీ ద్ధరిహరః కంపో బుక్కరాయ
మహీపతిః।
మారపో ముద్దపశ్చేతి కుమారాః తస్య
భూపతేః।
పంచానాం మధ్యగస్తేషాం ప్రశస్తో
బుక్కభూపతిః।
ప్రచండ విక్రమో మధ్యే పాండవానా
మివార్జునః॥

అతని కాలమున విద్యానగరరాజ్యము ఉత్తరమునఁ గృష్ణానది వఱకును, దక్షిణమున మధురానగరము వరకును, పూర్వ పశ్చిమ సముద్ర తీరముల వఱకును వ్యాపించియుండెను. అతఁడు క్రీ. శ. 1377 లో భౌతిక దేహమును జాలించెను.

అతని పిమ్మట తత్పుత్రుఁడగు హరిహరుఁడు (II) శా.శ. 1377 లోఁ బట్టాభిషిక్తుఁడై 1404 వఱకు రాజ్యపాలన మొనరించెను. అతనికిముందు విజయనగరమును బాలించిన హరిహర(I)రాయలును, బుక్కరాయలును మహామండలేశ్వర, ఒడయర్ అను బిరుదములను మాత్ర మందియుండ, నీతఁడు దాక్షిణాత్య ప్రభువులనెల్ల జయించి మహారాజాధిరాజ, రాజపరమేశ్వర బిరుదములంది చక్రవర్తియయ్యెను. క్రీ.శ. 1377-78 లో వ్రాయఁబడిన కనిగిరితాలూకా గురవాజిపేట చెన్నకేశవస్వామి దేవాలయ పురోభాగమందుండు శిలాఫలకముమీద హరిహరరాయలకు (II) •1. అరిరాయరగండ 2. బాసగెతప్పువ రాయరగండ 3. పూర్వ పశ్చిమ దక్షిణ సముద్రమధ్య యేకచ్ఛత్రాధిపతి 4. రాజాధిరాజ 5. రాజపరమేశ్వర 6. కలియుగ విషుణు (విష్ణు) 7. ధర్మప్రతిపాలక మొదలగు బిరుదము లున్నట్లు చెప్పఁబడినది.

ఈతనికడనే శ్రీ విద్యారణ్యులవారి సహోదరులగు సాయణాచార్యులు మంత్రిగ నుండిరి.

శ్రీమతీ జననీ యస్య సుకీర్తిః మాయణః
పితా
సాయణో భోగ (సోమ) నాథశ్చ
మనోబుద్ధి సహోదరౌ।
(పరాశర మాధవీయము)

మాధవుల (విద్యారణ్యుల) యింటి పేరు సాయణవారు. తల్లి శ్రీమతి, తండ్రి

• 1. అరిరాయరగండ = శత్రురాజులను శిక్షించువాఁడు; 2. బాసగెతప్పువరాయరగండ = అడితప్పిన రాజులను శిక్షించువాఁడు.

సాయణుఁడు మాధవుల యనుజులు సాయణ భోగనాథులుగఁ జెప్పఁబడిరి వారు ఆంధ్ర బ్రాహ్మణులు మాధవ సాయణుల ప్రతిభా వ్యుత్పత్తు లప్రతిమానములు ఇరువురును •అష్టాదశవిద్యల నెరిగినవారు, సదాచార పరాయణులు లౌకిక మార్గచణులు, వేద భాష్యకర్తలు

దానకాలము

హరిహరరాయలు శాలివాహన శకము 1298 కి సరియగు నళనామ సంవత్సర ఫాల్గుణ బహుళ పాడ్యమినాఁడు గ్రామమును దానము చేసెను శ్రీ యుత స్వామికణ్ణుపిళ్ల గారి జంత్రీనిబట్టి లెక్కవేయఁగా దానికి సరియగు ఇంగ్లీషుతేది క్రీ శ. 1377 ఫిబ్రవరి నెల 25 ది అగుచున్నది ఆనాడు బుధవారము (Wednesday) కాని శాసనమున వారవిషయమై స్పష్టముగాలేదు

'ముక్త్యై ర్పితుః హరిహరోయ సదా ద్విజేభ్యః' తండ్రి (బుక్కరాయల) కి ముక్తి కల్గుటకై కుమారుఁడు హరిహరరాయలు దానముచేసినట్లు శాసనమునఁ జెప్పఁబడుట చేతను, హరిహరుఁడు తనతండ్రి సపిండీకరణ కాలమున దానముచేసినట్లు అనుస్యూతముగ గ్రామవృద్ధులుచెప్పు కథలను బట్టియు, క్రీ శ 1377 నాటికే బుక్కరాయలు మరణించెననుట యథార్థము

స్థల నిర్దేశము :

దానమొసఁగఁబడిన గ్రామము బ్రాహ్మణక్రాక, అని యీవరకే చెప్పఁబడినది దానికి †బుక్కరాయపుర' మని నామాంతరముకలదు 'బ్రాహ్మణక్రాక'కు ఆపేరు దానసమయమున నొసఁగఁబడినది. ఇది కావలికి నైరృతి భాగమున దాదాపు 12 మైళ్ళదూరమువ నున్నది దానిహద్దు లీవిధముగ శాసనమునఁ బేర్కొనఁబడినవి.

తూర్పు : పాతురాయి, జమ్మిమడుగు, చొప్పిపుట్ట, కనుమర్ల కాలువ

ఆగ్నేయము : విడవలిగుంట.

దక్షిణము : నిల్వురాయి, దోమల దిన్నె, నక్కలగట్టు. నిల్వురాయి.

నైరృతి : కుదుమురాలగట్టు (గుట్ట)

పడమర : విడవలివేంచ (?) కలవల కుంట చీకురేకులకుంట కెణ్ణుర్లకుంట(?) మోదుగు మడుగు

వాయువ్యము : కామసాగరము, కామసాగరకట్ట, రెంటికుంటలు


• అంగానివేదా శ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః
ధర్మశాస్త్రం పురాణంచ విద్యాహ్యేతా శ్చతుర్దశ ॥
ఆయుర్వేదో ధనుర్వేదో గాంధర్వశ్చేతి తే త్రయః
అర్థశాస్త్రం చతుర్థంచ విద్యా హ్యష్టాదశైవ తాః ॥

† శా శ. 1266 లో బుక్కరాయలు నాచనసోమునకుఁ బినాకినీ తీరముననున్న పెంచుకల దిన్నె యను గ్రామమును 'బుక్కరాయపుర' మని పేరుపెట్టి దానము చేసెను. దాని విషయము వేరు.

ఉత్తరము : ఆరికుండము. బొద్దిమడుగు.

ఈశాన్యము : బొల్లి పోతాయిగుంట.

ఆ పేర్లన్నియు 'చిరంభవాః' అనాదిగా వాడుకలోనుండు పేర్లని శాసనమున సూచింపఁబడినది. హద్దులపేళ్ళు తెలుగు మాటలే కాని, అవికూడ సంస్కృత వాక్యములలో నిమిడియున్నవి. 'జలదంకి యామ్యే' జలదంకికి దక్షిణమున నున్నట్లును కలదు. ఇప్పటికిని ఆహద్దులన్నే వ్యవహరింపఁబడుచున్నవా? మాఱుపేరేదైనా యున్నవా? అను విషయమును కథాకోవిద గ్రామవృద్ధుల నడగి తెలిసికొన వలసియున్నది.


శాసనము.

క్రాకి యన నేమి?

క్రాకం ఫలాంచిత మగ్రహారం (శ్లో 20)

క్రాకు ర్విభాతి ఫలితో

జలదంకి యామ్యే (21)

అని దానకాలమప్పటికి గ్రామమునకు 'క్రాకు' అనియే వ్యవహారమున్నట్లు స్పష్టమగును. దానిని హరిహరరాయలు అగ్రహారముగ (భూసుర నివాస యోగ్యముగ) జేసి దానము చేసినట్లు చెప్పఁబడినది. దానినిబట్టి 'క్రాకు' అను సామాన్యగ్రామమునే 'ఫలాంచిత'ముగ అనఁగా వాపీకూపతటాక కచ్ఛపముల తోడను, ఆరామములతోడను ఒప్పునట్లొనర్చి •గణభోగ్యముగ దానము చేసినట్లు విశదమగును. ఒండె క్రాఁగు అను క్రియనుండి క్రాఁక శబ్ద మేర్పడినట్లు శ.ర. మునఁ గలదు. క్రాఁగు అనగాఁ దపించుట అని యర్థము త్రేతాగ్నులచే (ఆహవనీయ, దక్షిణాగ్ని, గార్హపత్యము) క్రాఁగు గృహములు కలదగుటచే 'క్రాక' అని వ్యవహారము కల్గియుండవచ్చునని కొందఱు వ్యాఖ్యానించుట కలదు. అనఁగా నిరతాగ్నిహోత్రులగు భూసురుల కావాస భూమియని వారి భావము. (నల్లిండ్లువలె)

ఇందుఁ దొలియర్థము గ్రహింతుమేని రాయల వితరణశీలత్వము, గ్రామ యశస్ఫూర్తి ప్రస్ఫుటములగును. మలియర్థము ననుసరింతుమేని, తొలుత నుండియుఁ బండితుల కావాసయోగ్యముగ నుండిన గ్రామమునే రాయలు దానమిచ్చె ననవలసి వచ్చును. అందు విశేషమేమియుఁ గన్పింపదు. ఇందేది సమంజసమో విజ్ఞు లూహింతురుగాక! కాలక్రమమున జనుల వాడుకలో నా గ్రామమే క్రాకు, క్రాక, కాక అయినది꞉.

అగ్రహార మననేమి :

మానసారమను శిల్పశాస్త్రమునందు

• గణభోగ్యము = విప్రసంఘము లేక సమూహ మనుభవింపఁ దగినది.

꞉ ఇతర శాసనములలో - బ్రాంహణకాక, బ్రాంహ్మలకాక అనియు వాడఁబడియున్నది. (హై. నె. జి. శా. సంపుటము.)

గ్రామభేదములు పండ్రెండుగఁ జెప్పఁబడినవి అందగ్రహార మన్యతమము

విప్రైర్విద్వద్భి రాభోగ్యం మంగలం చేతికీర్తితం।
అగ్రహార స్తదేవోక్తం విప్రేభ్యం స్త్రైః కామికాహ్వాయే ॥

విద్వాంసులగు విప్రులు నివసించు స్థానము 'అగ్రహార' మగును. అరవదేశమున వానినే మంగలములందురు. అవి వైదికవిద్యా వ్యాప్తికై ప్రాచీన రాజులచేతను నాయకులచేతను ఒసఁగఁబడుచుండెను. షట్కర్మ నిరతులగు భూసురులందు విద్యాదానము చేయుచు లోక కల్యాణమునకై యాగాదులొనరించుచు, నిశ్చింతగ జీవనము గడుపుచుండిరి.

అగ్రహార ద్వైవిధ్యము :

అగ్రహార మేకభోగమనియు, బహుభోగమనియు ద్వివిధముగ నున్నట్లు శాసనములు చెప్పుచున్నవి. ఒకవ్యక్తికే గ్రామమంతయు 'హక్కుభుక్త' మగునెడ నేకభోగము. పలువు రనుభవించుచో బహుభుక్తము. మరియు శ్రోత్రియుల భూములను సేద్యముచేయు రైతాంగమువారా యగ్రహారమున నివసింపక, తదనుబంధముగ దాపుననుండు చిన్న గ్రామములందుండుట ఆచారము. అగ్రామములను పాలెములందురు.(Hamlet)వానినే గ్రామ గ్రాసములు లేక గ్రామోపహారము లందురు. అగ్రహారములను దానముచేయునప్పు డాగ్రామములనుగూడ నొసఁగుట ఆనాటిరాజులకలవాటు. నేటికిని బ్రాహ్మణక్రాక పంచాయతీలో అనుమకొండపాళెము, కమ్మవారిపాళెము చేరియుండుటను బరికించినచో, అవి గ్రామోపహారములనియు, బ్రాహ్మణక్రాక బహుభుక్తమగు అగ్రహారమనియు నూహింపవచ్చును.*

కాకమ్మగుడి-కాకమ్మచెఱువు :

బ్రాహ్మణక్రాకకు ఉత్తరముగ, అగ్రహారమునకు దక్షిణముగ (మధ్య) కాకమ్మగుడికలదు. దానివెనుకనే చెఱువుండుటం బట్టి కాకమ్మ చెఱువని వ్యవహారము కలిగియుండవచ్చును. కాకతీయుల కులదేవత 'కాకతి'.

‡కాకతిర్వ్యకులో రాజా రంజతాం స్వగుణై ర్భువం,
కాకత్యాః పరాశక్తేః కృపయా కూశ్మాండవల్లికా
కాచిత్ పుత్ర మసూత తదేత త్కుల మనఘం
కాకతియ్యసంజ్ఞ మభూత్.
(కలువచేఱు శాసనము.)

కాకతి యను శక్త్యనుగ్రహమున గుమ్మడి తీఁగయం దొక బాలుఁడు జన్మించెనఁట. ఆ బాలకుని వంశము కాకతీయ వంశమని ప్రసిద్ధ మయ్యెనఁట. కాకతి జైనదేవతయనియు, ఆ వంశీయులలోఁ బూర్వులందఱా దేవత నారాధించుటచేఁ గాకతీయులని వ్యవహారముకలిగెనని మరికొందరు వ్యాఖ్యానించుటకలదు. ఆ కాకతిదేవతయే 'కాకమ్మ' కాఁబోలును. ఇప్పు డాగుడిలో కాకతమ్మ

* ఈ శాసనమున గ్రామోపహారముల పేర్లు చెప్పఁబడలేదు. చూడు కొల్లిపఱ శాసనము.
‡ ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక చూడుఁడు.

లేదు. అమెకు సైదోడగు ఏకవీరాదేవి మాత్రమున్నది. గుడినిర్మాణ విధానమును బట్టియుఁ, బరిసర శిథిలములను బట్టియుఁ బ్రాచీనమైనదని మాత్రము చారిత్రకు లూహించుట కవకాశమున్నది.

కాకమ్మ దేవతనుబట్టి 'క్రాక' అని గ్రామనామ మేర్పడి యుండవచ్చునని స్థానికులు చెప్పుటకలదు. అట్లగునేని శాసనమున ఆదేవత పేరైనను జెప్పఁబడకుండుటకు హేతువేమి? లేదేని విజయనగరరాజులు దేవత నవలావమొనర్చి, గ్రామమునే 'బుక్కరాయపురము' గా మార్చుటకు యత్నించిరనియు, కాని వారి సంకల్పము శాసనమాత్ర పరిమితమైనదనియు నూహించుట కవకాశము కలదా? మధ్యకాలమున జైన భక్తుఁడెవ్వఁడో కాకతి విగ్రహము నట ప్రతిష్ఠించెనని కతిపయులు వాకొనుట విశ్వసనీయమా? జనుల వ్యవహారమునుబట్టి చూచినచో 'క్రాక' అనుపదమునుండి కాక అనుపద మేర్పడుట సహజముకాని, కాక నుండి క్రాక యేర్పడుట ఎట్లుపొసఁగును. కాఁబట్టి కాకమ్మ దేవతవలన 'క్రాక' అను వ్యవహారము కల్గుట యుక్తిసహముగాఁ దోపదు.

గ్రామ విభాగక్రమము :

భాగా ఋగ్వేదినాం సార్ధ త్రయోవింశతి
కీర్తితాః।
యజుర్విదాం పున స్సార్ధ షట్త్రింశ
త్పరికీర్తితాః।
ద్వౌ సామవేదినో ర్భాగౌ ద్వౌభాగౌ
కేశవేశయోః।
ఏవంభాగా శ్చతుష్షష్టిరేవ తద్భాగ
భోగినః।
ప్రోక్తాః పంచయుతాష్షష్టి బుక్కరాయ
పురాధిపాః॥
(శ్లో 99, 100.)

అను శాసన వాక్యములవలన అగ్రహారము 64 భాగములుగ జేయఁబడి 65 మంది భాగస్థుల కివ్వఁబడినట్లు స్పష్టమగును. అందు ఋగ్వేదులకు 23 1/2, (23+1) యజుర్వేదులకు 36½ (36+1) సామవేదులకు 2, శివకేశవులకు 2 భాగములుగఁ జెప్పఁబడుటచేత భాగములు 64 అనియు, భాగభోగులు 65 మంది అనియు స్పష్టపఱుపఁబడినది. వృత్తిమంతులైన యీ ప్రతిగ్రహీతల నామములచివర, సుధీః పండితః, మనీషీ, శాబ్దికాగ్రణీః, శ్రౌతస్మార్త కళానిధిః, అద్వైత ద్వైతసదనం, జ్యోతిర్విదాంసీమా మొదలగు విశేషణము లుండుటను గమనింపవలెను.

కావ్య శాసనకర్త త్వష్ట :

ప్రస్తుత శాసనకర్త సోచన సూరి యనియు, నతడు శ్రీరామ భక్తాగ్రేసరుఁడనియుఁ గడపటఁ జెప్పఁబడినది. ఈశాసనమున ఋగ్వేదులలో సోచనార్యుఁ డొకఁడును (42 శ్లో) యజర్వేదులలో సోచన దైవజ్ఞుఁ డొకఁడును (71) భాగభాక్కులుగఁ జెప్పఁబడుటయేకాక.

అధీత యజురాదిత్య సూరిసూనుః
కవీశ్వరః।

• ఈ సర్వస్వములోని శ్రీపాదవారి 'నెల్లూరు మండల దేవాలయములు' అను వ్యాసము చూడుఁడు.

జ్యోతిః కలాకులగృహం శ్రీవత్సః
సోచనోబుధః ॥ 91

అని పేరొక సోచనబుధుఁడు పేర్కొనఁబడినాఁడు. అతఁడు యజుర్వేదపారగుఁడుగను జెప్పఁబడుటచే అతఁడే యీశాసనకర్త అయియుండునా యని తలంచుట కవకాశము కల్గుచున్నది. అయినను రెండవ హరిహరునికాలమునాటి మఱికొన్ని శాసనములను బరిశీలించినఁగాని యీవిషయము నిర్ణయింప వీలుకాదు.

శాసన విశేషములు :

1. బుక్కభూపాలున కుఁ'అనంతరసు' అనునాతఁడు ప్రధానిగ నుండెననియు, అతఁడు నీతి శాస్త్రవిశారదుఁడు, శౌర్యసమ్మేతుఁడనియు (11-12 శ్లో) శాసనమునఁ గలదు. బుక్కరాజాతనిపై రాజ్యభారముంచి నిశ్చింతగ కాలము గడిపినట్లును గలదు. ఇటీవల ప్రకటింపఁబడిన విజయనగర చరిత్రలలో నాతని పేరైనను గన్పించుటలేదు. అరసు అనఁగాఁ గన్నడమున 'రాజు' అని యర్థము. కొందఱకు బిరుదముగఁ గూడ వాడఁబడుట కలదు.

2. 'అధ్యాస్య హస్తినగరం నగరావతంసం' (12) అనఁగా బుక్కరాజు హస్తినగరమునధిష్ఠించి రాజ్యపాలన మొనర్చెనని వర్ణితమైనది. హస్తి నగరమనునది 'అనెగొంది' అనుటకు సంస్కృతీకరణము. అరవమున 'ఆనె' యన హస్తి (ఏనుఁగు) యర్థము. దానిని బట్టియే అనెగొందికి కుంజరకోన, 'హస్తినావతిపుర' అని వాడఁబడినట్లున్నది. విజయనగర నిర్మాణమునకు ముందు *'అనెగొంది' యందే ప్రభువులుండెడి వారని 'రాయవంశావళి' గ్రంథము చెప్పుచున్నది. (An inscription of A.D 1368=S.S. 1290 Current, Kılaka, states that Bukka lived at Hastinavatipura, — Indian Antiquary IV p. 206.)

3. కర్నూలు జిల్లాలోని మలమిడి కంబాలదిన్నె కైఫియతునుబట్టియు, వీరప్పయ్య కాలజ్ఞానమను గ్రంథమునుబట్టియు హరిహరుఁడు (II) శా.శ. 1302 (సిద్ధార్ధి) నుండి 1324 (చిత్రభాను) వఱకు (క్రీ.శ. 1380 నుండి 1402) 22 సం॥ రాజ్యమేలినట్లగును. కాని మఱికొన్ని శాసనములను బట్టి క్రీ. శ. 1377 నుండి 1404 వఱకు 27 సం॥ రాజ్యపాలన చేసినట్లు రూఢమగును. (Epigraphica Carnatica, Vo I, VIII, T 1129) కాఁబట్టి క్రీ. శ. 1377 లో బ్రాహ్మణకాశిక శాసనముపుట్టుట సమంజస మనవచ్చును. రాబర్టు స్యూయల్ ప్రభృతులు బుక్కరాయలు క్రీ. శ. 1349 నుండి 1379 వఱకును, హరిహరుఁడు (II) 1379 నుండి 1399 వఱకును రాజ్యము-చేసినట్లు వ్రాయుట సమంజస మనిపించుటలేదు. బుక్కరాయలు 1379 వరకు జీవించియుండెనేని అతని పుత్రుఁడు 1377 లో 'పితృముక్తి' కొరకు గ్రామ దానమొనర్చుట సంగతమెట్లగును. కాఁబట్టి క్రీ. శ. 1377 లో బుక్కరాయలు భౌతికదేహమును జాలించెననియు, ఆ పిదప తత్పుత్రుడు హరిహరరాయలు (II) సింహాసన మలంకరించెననియు, అతడు కావించిన మొదటి ధర్మ

* అనెగొంది విజయనగరమున కుత్తరమున తుంగభద్రాతీరమున నున్నది.

శాసన మిదియే అయియుండ వచ్చుననియు ఈశాసనమువలన నూహింప శక్యమగుచున్నది. దీనినిఁబట్టి భాస్కర భావదూరుడు బ్రాహ్మణక్రాకను దానము చేసెనను నెల్లూరు గెజిటీరు లోని వ్రాత పరాస్తమగుచున్నది.

4. ఈశాసనమునఁ బేర్కొనఁబడిన భాగస్వామ్యలను బట్టి చూచినచో నింత మంది శాస్త్రజ్ఞ సమవాయముగల అగ్రహారములు ప్రాచీన కాలమందైనను విరళములనియే చెప్పవచ్చును. వారి ప్రాభవమునుబట్టి అనాడా గ్రామము •ఘటికా స్థానముగ నుండెనన వచ్చును.


శాసనము.

5. అగ్రహార భాగ స్వాములలోఁ బ్రథమముగ

"ఋగ్వేదీ రాయపామాత్యో
భారద్వాజాన్వయాగ్రణీః ॥
(శ్లో॥ 30)

అని రాయప్ప పేర్కొనఁబడినాడు. అతఁ డమాత్యుఁడట. అన్నే, అప్పణ్ణ, మాయణ, చౌండిభట్టు, కల్లిదేవుఁడు, భైరవుఁడు, పోచన, దేవణార్యుఁడు, విఠ్ఠణ్ణ, పెరమాడి, అప్పాయభట్టరు, ముమ్మడిభట్టు, మొదలగువారున్నారు. ఆ పేర్లనుబట్టి చూచినచో వారెల్లరు కర్ణాటక ప్రాంతమువారనియు, అనాఁడు విజయనగర ప్రభువులపాలనలో నెల్లూరుండుటచే రాజాభిమానమును బొందిన విప్రులీ యగ్రహార మీయఁ బడిన దనియు స్పష్టమగును. సంగమవంశమంతరించుటతోడనో (1486) లేక విజయనగర సామ్రాజ్యమంతరించుటతోడనో (1565) వారిలో నధిక సంఖ్యాకులీప్రాంతమును వీడిరనియు. కతిపయులు మాత్రమిటనే నిలిచి పోయిరనియు నూహింప శక్యమగును. వారిలోఁ బలువురు కరణకమ్మలగుటకూడఁ దొలుత వారు కర్ణాటకులనుటను బలపఱచుచున్నది. నేటికిని కర్ణాటకమునఁ గరణకమ్మలు అధికముగనున్నారట.

6. సాయణునకు భాగస్వామ్యము :

యో వేదభాష్యకృద్ధీమాన్
మాయణాచార్యనందనః ।
అసౌ శ్రీ సాయణాచార్యో
భారద్వాజో యజుర్విదః ॥

యజుర్వేదులలోఁ బ్రథమ భాగస్వామిగ వేద భాష్యకర్తయగు సాయణాచార్యుఁడు చెప్పబడినాడు. హరిహర బుక్కరాయలు రాజ్యపాలన చేయు కాలమున నెల్లూరి మండలములోని ఉదయగిరి రాజ్యములో ములక-పాకనాటి ‡విషయములు చేరియుండెను. కంపభూపతి మరణానంతర మాతని పెద్దకుమారుఁడు సంగమరాజు (II) విక్రమసింహపురము రాజధానిగాఁ బాకనాటి విషయమును బాలించెను. అప్పుడు వేదభాష్యకర్తయు, సర్వజ్ఞుఁడనిపించుకొనిన మాధవవిద్యారణ్యుని సోదరుడును అగు సాయణా

• వైదికవిద్యావ్యాప్తికిని, ధర్మాధర్మనిర్ణయమునకును, ఉనికిపట్టును ఘటికాస్థానమందురు.

‡ విషయమనగా నిప్పటి జిల్లావంటి దేశభాగము.

చార్యుఁ డాసంగమునికడ మంత్రిగ నుండి నెల్లూరిలో నివసించెను.

బుక్కరాయలు క్రీ. శ. 1377 లో మరణింపగాఁ దర్వాత పరిపాలనకు వచ్చిన హరిహరరాయలకును సాయణుఁడు మంత్రిగ నుండెను. హరిహరుని కాలమున అతని కుమారుఁడగు దేవరాయలు యువరాజుగ నుండి ఉదయగిరిని పాలించెను. దీనినిబట్టి సాయణాచార్యులవారికి మన నెల్లూరితో నవినాభావ సంబంధము కలదనుట నిర్వివాదము. కాఁబట్టి పాకనాటి విషయములోఁ జేరిన 'క్రాకు' హరిహరుఁడు దానముచేయుట, అందు సాయణుఁడు భాగభాక్కుగ నుండుట, ఒక్క బ్రాహ్మణక్రాకకేకాక సింహపురి మండలమునకే యశోభూషణ మనవచ్చును.

మధ్యకాల స్థితి :

విజయనగరాజ్య ప్రాభవ మంతరించుటతోఁ బెక్కురు భాగస్థులు అగ్రహారమును వీడుటయు, అతర్వాత మహమ్మదీయుల పాలనలోఁగాబోలు, వారి భాగములు ప్రభుత్వము స్వాధీనము చేసికొని, స్థానికముగా నుండు కతిపయ భాగస్వాముల హక్కులకు భంగము రానీయక కాపాడిరి. అతర్వాత ఆనాటి ప్రభుత్వ పక్షమున వ్యవహరించుచుండిన పాళెగాండ్రకును, శ్రోత్రియులకును సరిపడనందున వారాగ్రామమును విడనాడి ఉత్తరముగ వచ్చి క్రొత్తగ గ్రామము నేర్పరచుకొనిరి. అప్పటినుండియు, బ్రాహ్మణక్రాక వేరుగను, అగ్రహారము వేరుగను నుండుట కారంభమయ్యెను. ఆంగ్ల ప్రభుత్వము ప్రారంభమైనపిదప శ్రోత్రియందారులెల్లరు తమ హక్కులు సక్రమముగ నమలుజరుగుటలేదని ప్రభుత్వమునకు నివేదింప, 19 వ శతాబ్దాంతిమ భాగమున మనమండలమున ఇనాం కమీషనరుగా నుండిన కీ. శే. పక్కి వెంచలరావు పంతులుగారు గ్రామమునంతయు 'సర్వే' చేయించి 28 మంది భాగస్థులకు సంబంధించిన షుమారు 5000 ల యెకరములుగల విస్తీర్ణమును, బ్రాహ్మణక్రాకనుండి 'కేసరివారి గర్భఖండ్రిగయినాం' అను పేరుతోఁ బ్రత్యేకించిరి.

వర్తమానదశ :

దానినే అవశిష్ట భాగస్థులు నేటికిని అనుభవించుచున్నారు. వారిలో కేసరివారు, గొట్టిముక్కలవారు ఋగ్వేద పారగులై, యజన యాజనాది షట్కర్మనిరతులై యుండిరి. ఋగ్వేదము నభ్యసించు విద్యార్థులాగృహస్థుల యిండ్లయందే భుజించుచు, గురువులను శుశ్రూషించుచుండిరి. అగ్రాంతీయుల కెట్టి ధర్మసంశయము కలిగినను వారివలన నివర్తి అగుచుండెను. నేడాప్రాభవము నభఃపుష్పమైనది. జాతీయ ప్రభుత్వమేర్పడిన ఎస్టేటు అబాలిషన్ అండ్ కన్వర్షన్ రైత్వారీ చట్టము ననుసరించి అగ్రహారము నామమాత్రావశిష్టమైనది.

వ్యాసరచనసకుఁ దోడ్పడిన గ్రంథములు :

1. శ్రీమల్లంపల్లి, సోమశేఖరశర్మ, కె. లక్ష్మణరావు, జయంతి రామయ్య పంతులుగార్ల శాసనవ్యాసములు.
2. శ్రీ వంగోలు వేంకటరంగయ్యగారి వ్యాసము (1926, మార్చి, భారతి.)
3. అంధ్రులచరిత్ర (చిలకూరివీరభద్రరావు.)
4. డా. రాయప్రోలు, సుబ్రహ్మణ్యం గారి లేఖలు.
5. విజయనగరచరిత్ర. (యన్. వేంకటరమణయ్య)

ప్రతి గ్రహీతల పట్టిక.

| వరుస నెం. | ప్రతి గ్రహీత పేరు | తండ్రి | గోత్రము | శాఖ | భాగము |
|---|---|---|---|---|---|
| 1. | రాయపామాత్య | బొమ్మరసు | భారద్వాజ | ఋక్ | 1 |
| 2. | మాయణసుధి | అప్పనార్య | విశ్వామిత్ర | ... | 1 |
| 3. | మాయణ | దేవణార్య | భారద్వాజ | ... | 1 |
| 4. | పెద్దిభట్ట | చౌండిభట్ట | కాశ్యప | ... | 1 |
| 5. | రామ | రామార్య | భారద్వాజ | ... | 1 |
| 6. | చౌండయార్య | సోమసూరి | ... | ... | 1 |
| 7. | కేశవ | అప్పయ | ఆత్రేయ | ... | 1 |
| 8. | తిప్పయ | మాధవార్య | గౌతమ | ... | 1 |
| 9. | శింగయ | కేశవార్య | అంగీరస గార్గ్యేత | ... | 1 |
| 10. | కల్లిదేవసుధీ | విష్ణుభట్ట | విశ్వామిత్ర | ... | 1 |
| 11. | హొన్నప్ప | అప్పార్య | శ్రీవత్స | ... | 1 |
| 12. | చంద్రసూరి | విద్యాధరబుధ | కాశ్యప | ... | 1 |
| 13. | పోచనార్య | శింగయార్య | భారద్వాజ | ... | 1 |
| 14. | నృహరి | పిన్నయార్య | వసిష్ఠ | ... | 1 |
| 15. | భైరవ | పెద్దిసూరి | గౌతమ | ... | 1 |
| 16. | శింగయసుధీ | భైరవార్య | కౌండిన్య | ... | 1 |
| 17. | అన్నప్ప | చౌండిభట్ట | విశ్వామిత్ర | ... | 1 |
| 18. | శింగయ | విఠ్ఠల | కాశ్యప | ... | 1 |
| 19. | అన్నయ | అన్నయ | విశ్వామిత్ర | ... | 1 |
| 20 | నరసింహ | నారాయణబుధ | ఆత్రేయ | ... | 1 |
| 21. | అప్పయ | పోచనార్య | భారద్వాజ | ... | 1 |
| 22. | దేవణార్య | నాదప్ప | శ్రీవత్స | ... | 1 |
| 23. | పెద్దిసూరి | చౌండయార్య | కాశ్యప | ... | 1 |
| 24. | గౌరిమణ | గోపాలసూరి | మౌద్గల్య | ... | ½ |
| 1. | సాయణాచార్య | మాయణాచార్య | భారద్వాజ | యజుస్ | 1 |
| 2. | విశ్వేశ్వరబుధ | సూరేంద్ర | ఆత్రేయ | ... | 1 |
| 3. | రామచంద్రబుధ | కూచిభట్ట | కాశ్యప | ... | 1 |
| 4. | నృహరి | నందిసూరి | కౌశిక | ... | 1 |
| 5. | యెల్లయకోవిద | సూరిభట్ట | హరీత | ... | 1 |
| 6. | రామాచార్య | నాగదేవార్య | భరద్వాజ | ... | 1 |
| 7. | శ్రీగిరి | శ్రీవల్లభ | శ్రీవత్స | ... | 1 |
| 8. | నరహరి | హరి | జామదగ్ని | ... | 1 |
| 9. | మల్లయకోవిద | విశ్వనాథ | గార్గ్య | ... | 1 |
| 10. | అనంత | అన్నయార్య | కౌశిక | ... | 1 |

| వరుస సెం. | ప్రతి గ్రహీత పేరు | తండ్రి | గోత్రము | శాఖ | భాగము. |
|---|---|---|---|---|---|
| 11. | సూరార్య | తిప్పనార్య | శాలంకాయన | యజుస్ | 1 |
| 12. | దైవజ్ఞశరణ | సూరయార్య | భారద్వాజ | ... | 1 |
| 13. | లక్ష్మప్ప | పిత్తణ | ... | ... | 1 |
| 14. | మాధవదీక్షిత | అన్నయార్య | హరీత | ... | 1 |
| 15. | నృసింహార్య | శ్రీ కేసరిబుధ | కాశ్యప | ... | 1 |
| 16. | భాస్కరబుధ | అప్పయభట్ట | కౌశిక | ... | 1 |
| 17. | పోచనదైవవిత్ | మంత్రాచార్య | హరీత | ... | 1 |
| 18. | అనంతార్య | పెరిమాడిబుధ | శ్రీవత్స | ... | 1 |
| 19. | పోతిసూరి | అక్కయార్య | ... | ... | 1 |
| 20. | కామదేవార్య | అప్పయార్య | హరీత | ... | 1 |
| 21. | శింగయకోవిద | పోచనార్య | ... | ... | 1 |
| 22. | పెద్దిసూరి | గోవిందార్య | ... | ... | 1 |
| 23. | మల్లికార్జున | లక్ష్మయార్య | కౌశిక | ... | 1 |
| 24. | కామయార్య | శింగయార్య | భారద్వాజ | ... | 1 |
| 25. | అయ్యలుకోవిద | ముమ్మడిభట్ట | ఆత్రేయ | ... | 1 |
| 26. | మల్లయ్యదైవజ్ఞ | గంగాధరబుధ | కాశ్యప | ... | 1 |
| 27. | నృహరి | కేదారార్య | శ్రీవత్స | ... | 1 |
| 28. | శింగయార్య | విశ్వనాథబుధ | భార్గవ | ... | 1 |
| 29. | అప్పయార్య | దేవరార్య | పరాశర | ... | 1 |
| 30. | అహోబలార్య | రామసూరి | ... | ... | 1 |
| 31. | భైరవకోవిద | భీమార్య | గౌతమ | ... | 1 |
| 32. | శింగయ | అప్పయ | భరద్వాజ | ... | 1 |
| 33. | అప్పాయభట్ట | పెమ్మయార్య | శ్రీవత్స | ... | 1 |
| 34. | నరహరి | అప్పయార్య | ఆత్రేయ | ... | 1 |
| 35. | అన్నయదైవజ్ఞ | మల్లయార్య | శాండిల్య | ... | 1 |
| 36. | పోచనబుధ | ఆదిత్యసూరి | శ్రీవత్స | ... | 1 |
| 37. | బౌలసుధీ | నాగదేవబుధ | హరీత | ... | 1 |
| 1. | వాసుదేవ | వల్లాడరాయ | గౌతమ | సామ | 1 |
| 2. | విఠ్ఠల | ... | ... | ... | 1 |
| 1. | కేశవ | దేవత | | | 1 |
| 2. | ఈశ్వర | ... | | | 1 |

## శాసన మూల శ్లోకములు

(మొదటిరేకు రెండవ ప్రక్క)

7 ♦అస్తి ప్రశస్తచరితో యదు శింమవంశే, వంశేస్య సంగమ మహీపతి రావిరాసీత్
తస్మా దశేష ధరణీ భరణార్గ బాహుః శ్రీవీర బుక్కనృపతి ర్నృపతీంద రాసీత్ ॥

8 యస్యాసిధేను రసితాని శితాగ్రధారా సంగ్రామసీమ్ని రిపుజీవ తృణాంకురాణి
ఆస్వాద్య సర్వభువనేషు ముహుర్దుహానా క్షీరం యశాం స్యహహ సంచరతే వృషేణ ॥

9 కాంతారసీమని దవానల మద్రిశృంగే మార్తాండకాంతి దహనం లవణాంబురాశౌ
ఔర్వానలంచ శివమ పరివీక్ష్య తత్ర తత్రభ్రమం త్యహహ యం

(రెండవరేకు మొదటి ప్రక్క)

కి త యత్ప్రతాపాః ॥

0 తస్య ప్రభూతమహిమా నృపరత్నమూర్తి కీర్తిప్రతాప పరిపూరిత భూనభోంతః
సర్వోపధాస్వతి విశుద్ధమతిప్రచార శ్రీమా ననంతరస ఆపిరభూ త్ప్రధానం

1 యస్య నీతివాగురికయా రిపు గృహీతా స్తాం స్తాం మహీ మధినవా ముఖిత స్త్యజంతి
యత్పాదపీఠ రుచిరోపల కాంతి జాల దర్వాంకురా నమతఏవ పునః స్ఫురంతి

2 తస్మి న్ప్రధానతిలకేఖిల సిద్ధతంత్రే భారం విధాయ స బుక్క భూపః
ఆధ్యాస్య హస్తినగరం నగరావతంసం వీరశ్రీయాసహ సమస్తసుఖా న్యభుంక్త

3 వీరాధిపో హరిహరో ధరణీశ్వరోభూ త్తస్మాత్కుమారఇవ తారకజి న్మహేశాత్
యో దానవారిరివ రాజత శంఖచక్ర పాణి ర్మహేంద్రఇవ సాంకుశ వజ్రపాణి

14 కించంద్రమా ధృతకళా విదధాంచినోతి కింజాహ్నవీ కలయతే విమలాం సమస్తాం
కిం క్షీరవారినిధి రాతనుతే ప్రమోదం లక్ష్మీపతేరితి యదీయయశ స్తువంతి ॥

5 దావానలః కిముతవా వడబానలోవా కల్పానలోయమితి పార్థివ భూమిపాలైః
దంధహ్యమాన హృదయై ప్రవితర్క్యమాణో యస్య ప్రతాపతపనః పరితో విభాతి

6 యన్యాసి దుగ్రమహిమా బహుశో రణేషు హత్వా సపత్నినికరా నథ వందకో భూప్
పాణిస్థ దైవతతరు స్సహకామధేనుం జత్వా ముకుందచరితం నితరా మయాసీత్ ॥

1 నుండి 6 - వ శ్లోకము వరకు 96 - వ పేజీలో నున్నవి

17. య ద్దానవారిపృషతా విదుషాంక రేష ముక్తాఫలంతి రథహస్తితురంగమంతి ।
రత్నంతి భూమి కనకాంబర భూరుహంతి ధేన్వాది దానమణి మందిర విభ్రమంతి ॥

18. తం హిందురాయ సురతాణ మఖండశౌర్య మాత్మోద్భవం హరిహరం ధరణీశతార్హం।
విజ్ఞాయ బుక్క ధరణీపతి రాత్మనైవ స్వంధర్మసంచయ మసా వనుభోక్తు మైచ్ఛత్ ॥

19. తేన క్షితీంద్రతిలకేన కృతాభిషేక స్సింహాసనం జయరమా జనసప్రధానం ।
ఆరుహ్య రోహణగిరిం ద్యుమణి ర్యథాసౌ భూరంజనం హరిహరో విజయంచ ధత్తే ॥

20. శాకే ష్వనందదినకృద్గణితే(౧౨౯౮)నశేష్టే (సాపే) తిథౌ ప్రథమకే బహుళే తపస్యే ।
క్రాకుం ఫలాంచిత ముదంచిత మగ్రహారం

(రెండవరేకు : రెండవ ప్రక్క)

ముక్త్యైపితు ర్హరిహరోయ మదా ద్ద్విజేభ్యః ॥

21. యః పాకనాటివిషయే సవిధేః పయోధేః క్రాకు ర్విభాతి ఫలితో జలదంకియామ్యో ।
'శ్రీబుక్కరాయపుర' మాహ్వయతో విధాయ సద్విప్రసాధకతతిం సహ సర్వభోగైః ॥

22. అథ సీమాః ప్రవక్ష్యంతే గ్రామస్యాస్య చిరంభవాః ।
పాతురాయి ర్ణమ్మిమడ్గుః పుట్ట శ్చోప్తిపాదాన్వితః ॥

23. కనుమర్లకాలువా ప్రాచ్యా మాగ్నేయ్యాం విశ్వలిప్రహవః ।
ది శ్యవాచ్యాం నిల్వురాయి ర్దిన్నె దోమలసంజ్ఞకః ॥

24. నక్కలోపపదోగట్టు ర్నిల్వురాయిశ్చ కిర్తితః ।
నైఋత్యాం కుడుమురాలుగట్టు స్థిరతరోమతః ॥

25. ప్రతీచ్యాం విడ్వలీవేంచః కుంటః కలపులాహ్వయః ।
చీకిరేంగులకుంటశ్చ కుంటః కెణ్ణర్ల సంజ్ఞకః ॥

26. తథా మోదుగుమడ్గుశ్చ వాయవ్యాం కామసాగరః ।
కట్టః కామసముద్రస్య విస్తృతో రెంటకుంటలుః ॥

27. అరికుండం బొద్దిమడ్గు రుదీచ్యా మురరీకృతః ।
ఈశాన్యాం బొల్లపోతాయకుంటః ప్రాక్తనసమ్మతః ॥

28. గజేంద్రైరి రష్టభిరివ ధ్రియమాణా వసుంధరా ।
సహ సీమాభి రష్టాభి ర్దిగ్భి గ్రామః ప్రకాశతే ॥

29. అంశా స్తత్ర చతుఃషష్టి స్తేనాకల్ప్యంత భూభుజా ।
అంశాధీశాః ప్రవక్ష్యంతే శాఖా గోత్రాహ్వయాన్వితం ॥

30. మహీజా మేరువద్ధీరో మానీ బొమ్మరసాత్మజః ।
ఋగ్వేదీ రాయపామాత్యో భారద్వాజాన్వయాగ్రణీః ॥

31. వేదాంత వ్యాకృతిస్థాన మప్పణార్యతనూభవః ।
ఋగ్వేదీ మాయణసుధీ విశ్వామిత్రస్య గోత్రజః ॥

32. ప్రథమామ్నాయపారీణః ప్రశమాభరణాన్వితః ।
భారద్వాజో దేవణార్యసుతో మాయణకోవిదః ॥

33. యః శాబ్దికాగ్రణీ స్తర్కవిద్యామూలమ్మదాంపదc ।
కాశ్యపః పెద్దిభట్టోసౌ చౌండిభట్టతనూభవః ॥

34. ఋగ్వేదీ తద్విధానజ్ఞ స్తల్లక్షణవిహారభూః ।
రామయార్యసుతో రామో భారద్వాజాన్వయోదయః ॥

35. ఋగ్వేద జన్మభవనం భవనం స్మార్తసంపదాం ।
భరద్వాజ శ్శౌండయార్య స్సోమసూరివరాత్మజః ॥

36. ఋగ్వేదనిధి రాత్రేయః సచ్చరిత్రవిభూషణః ।
కేశవః కరుణాభూమిః కొర వప్పయనందనః ॥

37. ఆహూ ర్యదన్వయంతజ్ఞా బుధా ముత్పత్తికారణం ।
మాధవార్యసుతః సోయం గౌతమ

(మూడవరేకు : మొదటి ప్రక్క)

స్తిప్పయాభిధః ॥

38. ఋగ్వేదవాదినా మాద్యః కేశవార్యతనూభవః ।
ఆంగీరస గారిపీతగోత్రః శింగాయకోవిదః ॥

39. బుధాం ప్రధానపదవీ విష్ణుభట్టస్య నందనః ।
విశ్వామిత్రః కల్లిదేవసుధీః సుకృతినాంవరః ॥

40. సుధీ రధీతవేదాంతః స యప్పార్యతనూభవః ।
శ్రీవత్సగోత్రసంభూతో హొన్నప్పార్యః బుధాంపదం ॥

41\. విజ్ఞాతప్రథమామ్నాయో విద్యాధరబుధాత్మజః ।
కృపానిధి శ్చంద్రసూరిః కాశ్యపాన్వయ సంభవః ॥

42\. శింగయార్యాత్మజో ధీమా న్భారద్వాజాన్వయోద్భవః ।
ఋగ్వేదీ కరుణాసింధుః పోచనార్యో మహాయశాః ॥

43\. వాసిష్ఠః పిన్నయార్యాత్మజాతో జాతకృపాంతరః ।
అంతరాసక్తనృహరిః నృహరి ర్మూర్తిమా న్భువాం ॥

44\. య ఋగ్విదామగ్రసర స్తద్విధానవిదామపి ।
గౌతమో భైరవసోఽయం పెద్దిసూరి తనూభవః ॥

45\. అధీతప్రథమామ్నాయః శ్రౌతస్మార్త కలానిధిః ।
కౌండిన్యః శింగయసుధీః భైరవార్యతనూభవః ॥

46\. విధిజ్ఞో విద్వదానందో విశ్వామిత్ర కులోద్భవః ।
చౌండిభట్టసుతో విద్వా న్నృగ్వేదీ అన్నపాభిధః ॥

47\. ప్రధాన మగ్విదాంపాత్రం పరం సుకృతసంహతః ।
కాశ్యప స్సింగయః శ్రీమా న్నప్పు విఠలనందనః ॥

48\. విశ్వామిత్రః పవిత్రాంతః పుత్రోన్నయమనీషిణః ।
ఆధార స్స విధానానా మృచా మన్నయకోవిదః ॥

49\. ఆత్రేయగోత్ర స్సన్మైత్రీపాత్ర మృగ్వేదపారగః ।
నరసింహో మహాప్రాజ్ఞో నారాయణబుధాత్మజః ॥

50\. భారద్వాజాన్వయజనిః పోచనార్య తనూభవః ।
ప్రథమామ్నాయపదవీ శ్రీమా నప్పయకోవిదః ॥

51\. ఋగ్విదా మగ్రణీ రగ్రగామీ స్మార్తకలావిధాం ।
శ్రేయోనిధి ర్దేవణార్యః శ్రీవత్సో నాదపార్యజః ॥

52\. యదీయమానసే సాంగ ఋగ్వేదః పరిజృంభతే ।
స పాపసం పెద్దిసూరిః కాశ్యప శ్చౌండయార్యభూః ॥

53\. ఏతే ప్రత్యేకమంశేనా అథార్థాంశాధి నాయకః ।
గోపాలసూరితనయః శ్రీమా నృగ్వేదపారగః ॥

54. మౌద్గల్యగోత్రజో విద్వా న్నాగిమణో ర్థాంశకాధిపః ।
ఏవం సమిలితాఃసార్ధ త్రయోవింశతి రంశకాః ॥

(మూడవరేకు : రెండవ ప్రక్క)

55. యో వేదభాష్యకృద్ధీమా న్మాయణాచార్యనందనః ।
అసౌ శ్రీసాయణాచార్యో భారద్వాజో యజుర్విధిః ॥

56. పదవాక్యప్రమాణానాం ప్రధానం యజుషాంపదం ।
ఆత్రేయసూరి స్సూరేంద్రసూను ర్విశ్వేశ్వరో బుధః ॥

57. త్రికాండి కూచిభట్టార్య తనూజ స్తర్కతంత్రభూః ।
కాశ్యపో యజుషాంసీమా రామచంద్రో బుధాగ్రణీః ॥

58. అద్వైతద్వైతసదనం సదనం యజుషామపి ।
నందిసూరిసుతో విద్వా న్నృహరిః కౌశికాగ్రణీః ॥

59. యజుర్విదా మగ్రసర శ్రౌతస్మార్తవిదామపి ।
హారీతః సూరిభట్టస్య సూను రెల్లయ కోవిదః ॥

60. నందనో నాగదేవార్యస్యాచలా నందవత్సలః ।
రామాచార్యో భరద్వాజో ద్వైతభూ ర్యజుషాంగృహం ॥

61. ఆయుర్వేదవిదాంసీమా యజుర్వేదవిదగ్రణీః ।
శ్రీవత్స శ్రీగిరిర్విద్వా న్శ్రీవల్లభ బుధాత్మజః ॥

62. అధీతయజురామ్నాయో బోధాయనహరే స్స్మృతః ।
విద్వా న్నరహరి ర్జామదగ్న్య వత్సాన్వయోద్భవః ॥

63. జ్యోతిశ్శాస్త్రం యజుర్వేదో యదన్వయవిభూషణం ।
స విశ్వనాథతనయో గార్గ్యో మల్లయకోవిదః ॥

64. అన్నయార్య సుతో విద్వా ననంతః శాంతమానసః ।
కలానిధి ర్యజుర్వేదీ కౌశికాన్వయసంభవః ॥

65. శాలంకాయన వంశ్యోయ శ్రౌతస్మార్తవిహారభూః ।
సోయం యజుర్వి త్సూర్యార్య స్తిప్పనార్యతనూభవః ॥

66. అధీత సూర్యసిద్ధాంత స్సూరయ్యాతనూభవః ।
భారద్వాజో యజుర్వేదీ దైవజ్ఞః శరణాభిధః ॥

67. భారద్వాజాన్వయోద్భూతః ప్రభుతాదారభూషణః ।
విఠ్ఠణ్ణతనయోఽవిద్వాన్ లఘ్ఘణ్ణోఽయజుషాంమహీ ॥

68. హారీత శ్రౌతసదనం స్మార్తమూర్తి రుదారధీః ।
అన్నయార్యాత్మజోఽధీత యజు ర్మాధవదీక్షితః ॥

69. యజుఃసాంగం సవేదాంతం సతంత్రం యత్రఖేలతి ।
కాశ్యపోఽసౌ నృసింహార్య శ్రీకేసరి బుధాత్మజః ॥

70. యత్కులం కలయంత్యార్యా స్తర్కతంత్ర యజుర్గృహం ।
కౌశికోఽప్పయభట్టాత్మ జాతోఽసౌ భాస్కరోబుధః ॥

71. మంత్రాచార్య తనూజాతో హారీతో యజుషాంనిధిః ।
సిద్ధాన్తసంహితా హోరావేదీ పోచన దైవవిత్ ॥

72. యజుర్వేదవిదా మగ్రసర, శ్రౌతస్మార్త

(నాల్గవరేకు : మొదటి ప్రక్క)

విదామపి ।

శ్రీవత్సవంశో నంతార్యః పెరిమాడి బుధాత్మజః ॥

73. కలావా న్మాబ్దికాగ్రియో అక్కయార్యతనూభవః ।
పోతిసూరి ర్యజుర్వేదీ శ్రీవత్స శ్రీవిలాసభూః ॥

74. అప్పయార్యాత్మజో విద్వా న్యజుర్వేదవిదాం వరః ।
హారీతః కామదేవార్య సూర్యానంద గుణోదయః ॥

75. యస్మి స్సాంగం యజుర్భాతి హారీతాన్వయమండనే ।
పోచనార్య సుతః సోయం నిట్ట శింగయ కోవిదః ॥

76. ఏతే ప్రత్యేకమంశేశా అధార్ధాంశాధినాయకః ।
గుణాధారో యజుర్వేదీ గోవిందార్యతనూభవః ॥

77. హారీతాన్వయభూః పెద్దసూరి రర్ధాంశకాధిపః ।
అథావశిష్టాభాగేశాః కథ్యంతే యజుషాఃక్రమాత్ ॥

78. లక్షయార్యస్య తనయో లీలాశాలా యజుశ్శ్రియః ।
కౌశికాన్వయసంజాతః కృపావా న్మల్లికార్జునః ॥

79. భూమి ర్గయాంతపుణ్యానాం భారద్వాజాన్వయోద్భవః ।
కామయార్యోయజుర్వేదీ శాంతిమా న్సింగయార్యజః ॥

80. యస్మి న్నుమ్మడిభట్టస్య సూనౌ సాంగం యజుఃకలాః ।
ప్రకాశంతే స్వతఃసోయ మాత్రేయో ప్యైలుకోవిదః ॥

81. జ్యోతిర్విద్యానిధి ర్జ్యోతి ర్గంగాధర బుధాత్మజః ।
కాశ్యపోయజురామ్నాయవేత్తా పుల్లయ దైవవిత్ ॥

82. యద్వంశో యజుషాంమూలం ద్వైతాద్వైతవిదామపి ।
కేదారార్య సుతస్సోయం శ్రీవత్సో నృహరిర్బుధః ॥

83. భర్గసేవా సమాసక్తో భార్గవాన్వయసంభవః ।
శింగయార్యో యజుర్వేదీ విశ్వనాథ బుధాత్మజః ॥

84. పరాశరాన్వయోద్భూతో దేవరార్యస్య నందనః ।
అన్నయార్యో ధైర్యభూమి రధీతయజురాగమః ॥

85. శాలావంతః సమాధారః శాలా శేషయజుశ్శ్రియః ।
అహోబలార్యశ్రద్ధాఢ్యో రామసూరి తనూభవః ॥

86. భీమార్యతనయో ధైర్యధరణీ గౌతమాన్వయః ।
మంత్రవేదీ యజుర్వేదీ మానీ భైరవ ॥

(నాల్గవరేకు : రెండవ ప్రక్క)

కోవిదః ॥

87. శ్రౌతమూలం స్మార్తమూలం యజుర్మూలం యదన్వయః ।
శింగయోసౌ భరద్వాజః కుంకటప్పయ నందనః ॥

88. పెమ్మయార్యాత్మజః శబ్దశాస్త్రాలంకృతిపారగః ।
అప్పాయభట్టో యజుషాం సూతి శ్రీవత్సవంశజః ॥

89. అప్పయార్యాత్మజోక్షీత యజు రాత్రేయగోత్రజః ।
విద్వా న్నరహరి శ్రీమా న్విజ్ఞాత వివిధాగమః ॥

90. సీమాజ్యోతిర్విదాం సీమా యజుషాం మల్లయార్యజః ।
శ్రీమా నన్నయదైవజ్ఞ శ్శాండిల్యాన్వయ సంభవః ॥

91. అధీత యజురాదిత్య సూరిసూనుః కవీశ్వరః ।
జ్యోతిఃకలా కులగృహం శ్రీవత్సః పోచనోబుధః ॥

92 తాంత్రిక స్తార్కిక శ్రీమా న్నాగదేవ బుధాత్మజః ।
హారీతో యజురాకారో బొమ్మకం సశ్యాబలఃసుధీః

93. ఏతే ప్రత్యేకమంశేశా ఏతదంశాస్తు సంఖ్యయా ।
సార్ధషట్సంయుతా త్రింశ దేవం సమ్య గుదీరితాః ॥

94. శల్లారురాయతనయః శాలా వ్యాకృతితర్కయోః ।
గౌతమః సామవేదాఢ్యో వాసుదేవః కలానిధిః ॥

95. పుత్రః శల్లారురాయస్య విదుషో విదుషాంవరః ॥
అధీతసామవేదశ్రీ విఠ్ఠలో గౌతమాన్వయః ॥

96. ఏతే ప్రత్యేక మంశేశా ద్వావుక్తా. సామవేదినౌ॥
శ్రీపాద కమలోద్భూతా విభాతి ఏబుధావగా ॥

97. యస్యాసౌ కేశవశ్రీమా నేత్రద్గా9మాధి దైవతం ।
ఏతే ప్రత్యేకమంశేశౌ ద్వావుక్తా కేశవేశ్వరౌ ॥

8. భాగా ఋగ్వేదినాం సార్ధ త్రయోవింశతి కీర్తితాః ।
యజుర్విదాం పునః సార్ధ షట్త్రింశ త్పరి కీర్తితా ॥

9. ద్వౌ సామవేదినోర్భాగౌ ద్వౌభాగౌ కేశవేశయోః ।
ఏవంభాగా శ్చతుష్షష్టిరేవ తద్భాగ భోగినః ॥

00. ప్రోక్తాః పంచయుతాష్షష్టి బుక్కరాయపురాధిపాః ।
సాష్టైశ్వర్యాః సాష్టభోగాః సానందౌదార్య మాసతే ॥

01. సర్వమాన్యం హరిహర స్యాజ్ఞయా పరిపాలితం ।
తమంగుల్యాపి నిర్దేష్టుం శంకంతే రాజపూరుషాః ॥

102. సర్వేతే శంకరాః సర్వమంగళాసక్త మందిరాః ।
విజయంతేతరా

(అయిదవరేకు : మొదటి ప్రక్క)

ఏషా బుక్కరాయపురేనిశం ॥

103. పాథోధర శిఖివరానివ సాభిలాషా న్పద్మాకరః కవివరానివ సానుబంధాన్ ।
శ్రీబుక్కరాయ పురమేత దమూ న్ద్విజేంద్రా నానందయ త్యనుకలం సరసాభిరామం ॥

104. సామాన్యోఽయం ధర్మసేతు ర్నృపాణాం కాలేకాలే పాలనీయో భవద్భిః ।
సర్వానేతా న్భావినః పార్థివేంద్రా న్భూయోభూయో యాచతే రా[illegible]

105. బహుభి ర్వసుధాదత్తా రాజభిః సగరాదిభిః ।
యస్య యస్య యదాభూమి స్తస్య తస్య తదాఫలం ॥

106. దానపాలనయో ర్మధ్యే దానా చ్ఛ్రేయోనుపాలనం ।
దానా త్స్వర్గ మవాప్నోతి పాలనా దచ్యుతం పదం ॥

107. శత్రుణాపి కృతోధర్మః పాలనీయః ప్రయత్నతః ।
శత్రురేవహి శత్రుస్స్యాత్ ధర్మశ్శత్రు ర్న కస్యచిత్ ॥

108. స్వదత్తాం పరదత్తాంవా యోహరేత వసుంధరాం ।
షష్టింవర్షసహస్రాణి విష్టాయాం జాయతే క్రిమిః ॥

109. సహస్రేణ తటాకానా మశ్వమేధ శతేనచ ।
గవాంకోటి ప్రదానేన భూమిహర్తా న శుధ్యతి ॥

110. ఏకైవ భగినీలోకే సర్వేషాం భూభుజామపి ।
నభోగ్యా నకరగ్రాహ్యా విప్రదత్తా వసుంధరా ॥

111. శ్రీమద్రామరథా ప్రధానసచివ శ్రీపాదపద్మాలినా
శ్రీమద్రామకృపావిహారవిలస ద్విద్యానవద్యాత్మనా ।
శ్రీమ త్ప్రచనసూరిణా విరచితం సత్సూక్తి ముక్తాన్వితం
శ్రీమచ్ఛాసనమేత దత్రజయతా దాచంద్రమాతారకం ॥

112. ఏతస్మి న్నగ్రహారే హరిహరధరణీపాల దానాంబురాశే
రుత్పన్నేఽతీవ రమ్యే స్ఫురదురుమహిమోదార సీమాభిరామే ।
సద్వృత్తే సత్ప్రకాశే సతతగుణయుతే సత్పదం సంశ్రితానా
మంశానాం నాయకాయావనిసుర నికరాయాస్తు శాస్తా ప్రశస్తి

— శ్రీ వి యా పా శ.

* * * * *

విచిత్ర విచిత్రములు

## 4. వెంకటగిరి - సర్ విన్‌స్టన్ చర్చిల్

వీరు రెండవ ప్రపంచయుద్ధమున, భూమిపై, సప్తసముద్రములపై ఆకాశమున సేనల నడిపించి, ఇంగ్లాండు దేశమును సంరక్షించిన యుద్ధవీరుడు. పాలనయందు మంత్రాంగము, విగ్రహసమయములందు తంత్రాంగము సవ్యసాచిత్వము జరపిన ధీశాలి. వీరు 1902 లో దక్షిణాఫ్రికాలో జరిగిన బోయర్ యుద్ధమైన పిదప భారతదేశమునకు వచ్చిరి. గుఱ్ఱములపై స్వారిచేయుచు 'పోలో' ఆటనాడుట వీరికి ఇచ్ఛాశక్తి, అప్పటికే, మన వెంకటగిరి రాజాగారి పోలో జట్టు ఈ ఆటయందు నజేయులుగా నుండిరి. చర్చిల్‌నకు పోలో ఆటకు పనికివచ్చు గుఱ్ఱములును ఉండెను. ఆనాడు బెంగుళూరులో చర్చిల్ జట్టు, మన వేంకటగిరి వారితో పోలో ఆటలు జరపిరి. చర్చిల్ జట్టు విజయమును చేకూర్చుకొనలేదు. మన స్థానిక జట్టు గెలుపొం దెను. తదుపరి చర్చిల్ తన తేజులను వేంకటగిరి రాజునకు విక్రయించి స్వదేశమునకు పోయెను.

మహామహుడగు చర్చిల్‌తో మన మండలమునకు బాదరాయణ సంబంధము కలదు.

## 5. సతి (లేక) సహగమనము

1) శ్రీ వేంకటగిరి దివాను స్వర్గస్థుడుకాగా, వారి సతీమణి సహగమనము 11-9-1819 ప్రాంతమున చేసెను.

2) 11-2-1822 న శేషయ్యనాయుడు చనిపోగా, వారి భార్యయు సహగమనము నకు ద్యుక్తురాలు కాగా, ప్రభుత్వోద్యోగులు వారించిరి. ఆమె బంధుగులు, ఆమె సతికావలసి నదేనని వాదించిరి. కాని కలెక్టరు విచారించి, బంధువులు ఆమెను నంతమొందింప దలచినా రని తీర్మానించి, వారిని అరెస్టుచేయించి, సతి ఉద్యమమును నివారించెను.

(నెల్లూరు రికార్డు Vol. 3119. పే. 223-6.)

• • • • •

ఈ 'సతీ' సహగమనతత్త్వమును గూర్చి శ్రీ ఎ. కె. కుమారస్వామిగారు తమ శివతాండవమను వ్యాస సంపుటిలో వివరముగా వ్రాసియున్నారు.

# 40.

# ★ వేదపండితులు ★

శ్రీ అ. సి. విశ్వనాథశాస్త్రులు, నెల్లూరు.

జీవరాసులు పలురకము లుండినను మానవజాతికి మాత్రమే పాంచభౌతికమని ప్రసిద్ధికలదు. అట్టిమానవజాతి స్వబుద్ధివైశద్యముతోఁ బలువిధములగు కృషినిచేసి జీవయాత్రగడుపుచున్నది.

మానవజాతితప్ప ఇతరజీవులు జీవనార్థమై ప్రత్యేకకృషి సల్పుటలేదు. అనఁగా పశుపక్ష్యాదులు క్షున్నివారణకై విద్యాభ్యాసంగముగాని, వ్యాపారాది వ్యవహారములనుగాని చేయుటలేదు. అట్లయ్యును వానికి క్షున్నివృత్తి కల్గుచున్నది.

'మను' వను మహర్షి యేర్పఱచిన కట్టుబాట్లకులోబడి ప్రవర్తించుట చేతనే మనకు మానవులని వ్యవహారమేర్పడినది. ఈనాటికిని నీతితప్పినవానిని మానవుడు కాదని నిరసించుటపరిపాటిగనున్నది. మానవుడు నడువదగిన మార్గమునుగూర్చియు, చేయవలసిన విధులనుగూర్చియు చేరదగిన గమ్యస్థానమునుగూర్చియు మనువు 'మనుస్మృతి' అనుపేర ఉత్కృష్టమగుగ్రంథమును రచించి యున్నాఁడు.

ఆ గ్రంథమును సునిసితముగఁ బరిశీలించితిమేని మానవుఁడు కేవలము అన్నవస్త్రముల సంపాదనకే నిరంతరము కృషి సాగింపరాదనియు కర్తవ్యాంశము మఱియొకటున్నదనియు గోచరముకాకపోదు. ఆ గ్రంథరాజములో-

ప్రత్యక్షేణానుమిత్యావా యస్తూపాయో న బుధ్యతే।
ఏనం విందంతి వేదేన తస్మా ద్వేదస్య వేదతా॥

చక్షురాదీంద్రియములతోఁ బ్రత్యక్షముగగాని, మనస్సు బుద్ధిమొదలగు నంతఃకరణములచే ననుమాన ప్రమాణమునగాని, తెలిసికొనఁజాలని దురవగాహవిషయమును తెలియజేయు గ్రంథరాశియే వేదమనియు, మానవుని యిహపరసుఖ ప్రాప్తికి వేదమే కల్పవృక్షమనియు స్పష్టీకరింప బడినది. దీనినిబట్టి వేదముమానవుని మానవత్వమును నిలబెట్టుటకుఁ బ్రధానాధారమగుచున్నది.

అనంతకోటి విషయపూరితమైన వేదరాసులలో ఋక్, యజుస్, సామ, అథర్వణ అనునాలుగు విభాగములు ముఖ్యములు. 'యస్య నిశ్వసితం వేదాః, అవేదములు ఆ విరాట్పురుషుని నిశ్వాసరూపములని శాస్త్రములుచెప్పుచున్నవి. వానికి రామాయణ, భారతాదులకువలెఁ గర్తలేదు. పురుషుఁడు జాగ్రతవస్థలోనున్నను, స్వప్నావస్థలోనున్నను, తత్తద్వ్యాపారపరాయణుడైయున్నను ఉచ్ఛ్వాస నిశ్వాసలప్రయత్నముగ జరిగిపోవుచున్నవి. వానికై మానవునిపూనిక అక్కరలేదు. అట్లే వేదములను భగవంతుని నిశ్వాసములుగ వర్ణింపబడుటచే అవి భగవత్కర్తృకములునుగాక నిత్యములని తేలుచున్నవి.

బృహదారణ్యకము 4. 5. 11 లో ఈవిష యమై వివరింపబడి యున్నది.

సయథార్ద్రై ధాగ్నేరభ్యాహితస్య పృథగ్ధూమా
వినిశ్చరన్తి, ఏవం
వా అరేఽస్య మహతో భూతస్య నిఃశ్వసిత
మేతద్య దృగ్వేదో
యజుర్వేదః సామవేదోఽథర్వాంగిరస
ఇతిహాసః పురాణం
విద్యాఉపనిషదః శ్లోకాః
సూత్రాణ్యను వ్యాఖ్యానాని వ్యాఖ్యా
నానీష్టం.
హుతమాశితం పాయితమ్, అయంచలోకః
పరశ్చలోకః సర్వాణిచ భూతాని;
అస్యైవైతాని
సర్వాణినిఃశ్వసితాని॥

• • • • •

ప్రాచీనకాలము నుండియు మన నెల్లూరుమండలము ఆంధ్రదేశమునకెల్ల తల లమానికయై, కవిత్వాది లలితకళలయందే కాక, వేదవేదాంగాది శాస్త్రజాలములందును ప్రవీణులైన విద్వాంసులచేత విరాజిల్లు చున్నదనుట జగద్విదితము. నెల్లూరుమండ లమున యజుర్వేదులు ప్రచురముగను, ఋగ్వేదులు విరళముగను, సామవేదులు కతిపయులుగ నున్నారు. కావలి తాలూకా లోని బ్రాహ్మణక్రాక అగ్రహారము పూర్వము ఋగ్వేద పండితులకును, యజన యాజనాది షట్కర్మనిరతులకును నిలయమై మండలమున కాభరణప్రాయముగ నుం డెను.

పినాకినీ తీరమునందు జన్నవాడ గలదు. అనగా యజ్ఞవాటికయని యర్థము. పూర్వము కశ్యపు డను బ్రహ్మర్షి అచ్చట యజ్ఞము చేసెననియు గార్హపత్యాగ్నినుండి కామాక్షీసహిత మల్లికార్జును దుద్భవించె ననియు స్థలపురాణము చెప్పుచున్నది. 13 వ శతాబ్దమునందు తిక్కనగారు నెల్లూరునందు యజ్ఞమొనర్చి, సోమయాజియై పంచమవేద మైనబరగు భారతాంధ్రీకరణ మొనర్చి, ముక్కోటి ఆంధ్రులకు వందనీయుడగుట సుప్రసిద్ధముగదా!

1890-95 ప్రాంతమున సూళ్ళూరు పేట ప్రాంతములోని చిట్టమూరు గ్రామ మున రామబ్రహ్మఘనపాఠి, సుబ్రహ్మణ్య ఘనపాఠి అను ఆవేదపండితులుండిరి. వారు క్రమ, జట ఘన, వర్ణక్రమాదులయం దస మాన ప్రజ్ఞకలవారు. వారు పెక్కు రాజా స్థానములందును, పెక్కు పట్టణములందును నేత్రావధానములొనర్చి ప్రాజ్ఞుల మెప్పువడ సిరి. కోవూరు తాలూకా అల్లూరు, నెల్లూరు తాలూకా దర్భఃమిట్ట గ్రామములు వేదపం డితులకు ఆలవాలముగనుండెను. అల్లూరులో శ్రీ వేదము సుబ్రహ్మణ్య సోమయాజులు సుప్రసిద్ధ వేదపండితులుగ నుండిరి. వారికి రామస్వామిశాస్త్రి సుబ్రహ్మణ్య సోమయా జులు, వెంకటరమణ సోమయాజులు, అను వారు సోదరులుగనుండిరి. సుబ్రహ్మణ్య సోమయాజులుగారి తండ్రి నారాయణ సోమ యాజులు, వారి తాత సీతారామ సోమయా జులు మొదలగువారెల్లరు ఘనపాఠీలగుటయే కాక, నిత్యాగ్నిహోత్రులై యదార్థముగ వేద మూర్తులని విఖ్యాతి గాంచియుండిరి. 'వేదము' వారను యింటిపేరే వారి ఖ్యాతిని వెల్లడించుచున్నది.

మరియు 1913-14 ప్రాంతమున దుర్భా వెంకసుబ్బాదీక్షితులు, దుర్భా వెం కయ్య అను ఇరువురు ఋగ్వేదమున పార

గులగుటయేకాక, శ్రౌత, ఆగమ శాస్త్రములందును, నిధులైయుండిరి. ఆ వెంచయ్య గారును, వేదమువారి కుటుంబీకులగు సీతారామ సోమయాజులుగారును తురీయాశ్రమము (సన్యాసము) స్వీకరించి జీవబ్రహ్మైక్యమును బొందిరి. అప్పే కొట్రా వేంకట నరసింహ సోమయాజులు, ఆ రామసోమయాజులు, ఆ. వేంకటాచెలపతి దీక్షితులు ప్రభృతులు నెల్లూరిలో వేదనిధులుగనుండిరి.

ఇటీవలవరకును నెల్లూరు, వేంకటగిరి, కావలి మొదలగు ప్రాంతములందు వేదపాఠశాలలుండినవి. నేడు నెల్లూరునందు మాత్రమే వేద సంస్కృత కళాశాలయమును, ఉపకుర్వాణ బ్రహ్మచర్యాశ్రమమందును, వేదపాఠశాలలు పనిచేయుచున్నవి. ఇప్పుడును పలువురు వేదపండితులు మండలమున వివిధప్రాంతములందు నివసించుచు, అనూచాన సాంప్రదాయమును పోషించుచున్నారు. మండలీయులు దేశకల్యాణమునకు వేద సంరక్షణ. వేదపండితుల పోషణ ముఖ్యమను విషయమును గమనించి, తత్పోషణకై యిత్తోధికముగఁ దోడ్పడుదురుగాక.

ఓం శ్శాంతిః

వేదాక్షరాణి యావన్తి పఠితాని ద్విజన్మభిః ।
తావంతి హరినామాని, కీర్తితాని న సంశయః ॥

~~~~~~~~

శ్రీరామం సురరాణ్ముఖామర వరై రారాధితాంఘ్రి ద్వయం ।
రాకారాజముఖం సరోజనయనం రాజాధిరాజం ముదా,
శూరం సూరకులాంబురాశి శశినం దైత్యాంధ కారారుణం
ధీరం వీరమరం (హం) స్మరామి సుఖదం స్వాంతే ససీతం సదా ॥
(పరశురామ పంతుల అనంతరామ పండితుని 'సీతావిజయము' నుండి)

వరదం భజామి శరదంబుద ప్రభం ద్విరదం ముఖేశుభరదం తనౌ నరమ్
గణనాథ మాత్మగణనా పరేష్టదం శశిఖండ మండిత శిఖండ మీశ్వరమ్
ప్రమితాక్షరోక్తి మమితా సురాంతకం స్మితభూషణం వితతభాను తేజసమ్
కలయామి చాప వలయాన్వితం ముదా శరధారిణం దశరాత్మజంప్రభుమ్ ॥
— దిట్టకవి లక్ష్మణకవి.

సీత్కారాణి కరాబ్జాత, ధూసనం చాపి యోషితాం ।
నయమోర్ధ నిమేషాస్తు మన్మధస్యాస్త్రతాంయయుః ॥
ఇవి 1962 'సాహితి' పత్రికనుండి గ్రహింపబడినవి.
సేకరించినవారు : డా॥ బి. రామరాజుగారు.

◆ ◆ ◆ ◆ ◆
~~~~~~~~

విచిత్ర విచిత్రములు

## 6. భైరవకోన - శ్రీనాథుని క్రీడాభిరామము

ఉదయగిరి తాలూకాలో సీతారామ పురమునకు దాపున భైరవ కోనగలదు. అందు శిల్ప చాతుర్యమునకుఁ దావలమగు గుహాలయములున్నవి. వానినిగూర్చి డా॥ రావిప్రోలు సుబ్రహ్మణ్యం (మద్రాసు) గారు వ్రాసిన ప్రత్యేక వ్యాసమీ సరస్వమున వేరొక చోట ముద్రిత మైయున్నది. - పే. 27.

శ్రీనాథ మహాకవి తన క్రీడాభిరామ కావ్యమున (వీథిరూపకమున) తిప్పయ వల్లభుడు తనకు మూడుగ్రామములు సర్వభోగములుగా జెల్లగా ములికినాటిలోని మోపూరిని జాలించెనని వర్ణించినాడు. మోపూరు నెల్లూరు మండలములోని ఉదయగిరి సీమలోనిదనుట జగత్ప్రసిద్ధము. అక్కడనే భైరవాలయమున్నది. తిప్పయ వల్లభుడా భైరవస్వామి భక్తుడట. పూర్వమా స్వామికి తిరునాళ్ళు వైభవముగ జరిగెడివనియు, ప్రజలు తండోప తండములుగ జేరెడు వారనియు, అందు జనుల వినోదమునకై ప్రాయికముగా నాటకములాడ బడెడివనియు అట్టివానిలో క్రీడాభిరామ మొక్కటనియు దెలియుచున్నది. ఆకావ్యమున మన భైరవస్వామి యిట్లు వర్ణింపబడినాఁడు.

సీ॥ చంద్రఖండములతో సరివచ్చునవచ్చు విమలదంష్ట్రా ప్రరోహములవాని।
భవదంపుఁ గొనలతోఁ బ్రతివచ్చునవచ్చు కుటిలకోమల జటాచ్ఛటలవాని।
నింద్రనీలములతో నెనవచ్చు నవచ్చు కమనీయతర దేహకాంతి వాని।
నుడురాజు రుచులతో నొఱవచ్చు నవచ్చు చందన్మ దాట్ట హాసములవాని॥

గీ॥ సిగ్గుమాలిన మొలవాని జటిలవాని
నెల్లకాలంబు ములికినాడేలువాని
వర్ధి మోపూర నవతారమైనవాని
భైరవునిఁ గొల్వ వచ్చిరి భక్తులెల్ల (పీఠిక)

క॥ నటులది దోర సముద్రము
విటులది యోర్గల్లు కవిటి వినుకొండ, మహా
పుటభేదన మీ త్రితయము
నిటఁగూరెను బ్రహ్మ రసికులెల్లరు మెచ్చన్॥ (పుట. 98)

నాటకకర్త వినుకొండవాడట. నటులు బల్లాళరాజుల రాజధానియగు దోరసముద్రము వారట. ప్రదర్శనస్థాన మోపూరి భైరవకోనయట.

# 41.

## ❀ పుదూరుద్రావిడుల చరిత్ర ❀

శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి, ఎం. ఏ.

ఆంధ్రదేశ చరిత్రలో భారతదేశ చరిత్రమందును ఇంతవరకును రాజులయు రాజకుటుంబములయు వంశావళులను చరిత్రలను నిర్మించుటయందే మన కాలమంతయు గడచి పోయినది గాని జనుల చరిత్రలను వ్రాయుటకు ఎట్టి తీవ్రప్రయత్నమును జరుగలేదు. కాని ఇవిరెండును పరస్పరాశ్రయములై జనుల చరిత్రకు మనకిప్పుడవకాశము వచ్చినట్లున్నది. సాధనసామగ్రియు కొంతచేరినట్లున్నది. ఈ విక్రమసింహపురి మండల సర్వస్వము ప్రథమప్రయత్నముగా కుదురుట ఎంతయు ముదావహము.

నెల్లూరి మండలములోని జనులలో ఎన్నియో తెగలున్నవి. ఆదినుండియు ఇచ్చట నుండువారేగాక కాలక్రమమున ఎంతెంత దూరములనుండియో వచ్చి నానావర్ణములువారు దేశములవారు ఇచ్చట స్థిరనివాస మేర్పరచుకొని ఈ మండలవారై పోయినారు. ఇట్లు వచ్చినవారిలో పుదూరుద్రావిడ బ్రాహ్మణులొకరు. వీరు తమగృహభాష తమిళమే యైనను దానిని తమయిండ్లవఱకే నియమించుకొని సకల వ్యవహారములయందును ఆంధ్రమునే అభిమానించి మెచ్చి భాషాసేవ చేసినవారిలో అగ్రగణ్యులు.

ఇట్టి యీపుదూరుద్రావిడుల చరిత్ర నెవరును నేటివరకును సమగ్రముగాను చారిత్రకదృష్టితోను వ్రాయలేదు. అందులకు కారణములు: చాలినంత సాధనసామగ్రి దొరకక పోవుటయు, సంఘము కొద్దిపాటి దగుటచేత పరస్పరమొకరి చరిత్ర మఱియొకరికి తెలియుటకెలన కలుగు సుహాసీనతయునే కాని దాదాపు ఆఱువది సంవత్సరముల క్రింద మాతాతగారు శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు సూర్యాలోకమను పత్రికలో పుదూరుద్రావిడులలోని మహనీయులను గూర్చి యొక వ్యాసమువ్రాసియుండిరి. అది నాకింతవఱకును ఎచ్చటనుదొరకలేదు. తర్వాత మావేదమువారే మాజ్ఞాతులు శ్రీవేదము వేంకటనరసయ్యగారను వారు సుప్రసిద్ధ నటులు నాటకకర్తలునేపథ్యప్రసాదనకళానిపుణులు, నల్లయ్యగారనఁబడువారు (వేంకటాలమయ్యగారి యన్నగారు) దాదాఁపు నలువది సంవత్సరములక్రింద శ్రమపడి ఊరూరికి ఇంటింటికిని పోయి పుదూరుద్రావిడుల వంశ వృక్షములను దాదాఁపు కొన్ని శతాబ్దములవఱకును సంపాదించి వంశచరిత్రను వెలికితీసిరి. వానికి అందుచేత 'వంశవృక్ష' మనియే పేరైనది. కాని వారు ఎప్పుటనో విశాఖపట్టణము జిల్లాలో శ్రీకూర్మము కడ సంచరించుచు ఆకస్మికముగా పరమపదించినందు వలన వారి యితరవస్తువులతో కూడ ఆనోటుబుక్కులును పోయినవి. దొరకలేదు. ఇప్పుడు

మనకు తెలిసి, పెద్దల చరిత్రలను వ్రాయు నప్పుడు వ్రాసిన చరిత్రనుగూర్చి కర్ణాకర్ణిగా విన్నవిషయములను మనవారు వ్రాయుచున్నారే గాని ఎవరును గట్టిగా చెప్పలేకున్నారు. నేనును వీరికన్న నెక్కువగా చెప్పలేను గాని నాకుదొరికిన చారిత్రకాధారములతో కొంత పునర్నిర్మాణమొనరింప ప్రయత్నింతును. పొరపాటులుండిన తర్వాత గట్టి యాధారములచేత దిద్దుకొందును.

పుదూరు ద్రావిడులని పేరువచ్చుటకు కారణము లిఖితపూర్వమైనది, ప్రాచీనము ఎచ్చటను దొరకలేదు. గాని కర్ణాకర్ణిగా పారంపరిగా, పెద్దలు చెప్పుకొనుచువచ్చిన విషయములను ముప్పది యేండ్లక్రింద (1920 మేనెల) పుదూరు ద్రావిడబ్రాహ్మణ మహాసభ జరిగినప్పుడు, నాటియగ్రాసనాధీశులై యుండిన శ్రీ చదలువాడ సుందరరామ శాస్త్రిగారిట్లు చెప్పియున్నారు.

'మన పూర్వులు దక్షిణ దేశమునుండి చిరకాలమునకుముందు వలసవచ్చి యీయాంధ్రదేశము వాసస్థానముగాఁగావించుకొనిరని వినుచున్నారము వారు పూర్వము వసించిన యగ్రహారము' కంద్రమాణిక్యమను పేరు గలదని తెలియుచున్నది. అది తంజావూరు జిల్లాలో (కుంభేశ్వరనిపురము) గుంభఘోణమునకుసమీపమున నున్నది. ఆదేశమునందు ద్రావిడ బ్రాహ్మణులలోఁ గంద్రమాణిక్య బృహచ్చరణ మనుశాఖ యిప్పటికిని గలదు. మనమందఱమును నాకంద్రమాణిక్య బృహచ్చరణ శాఖకుఁ జేరిన వారమని మన పెద్దలు చెప్పెదరు. ఈ కంద్రమాణిక్య బృహచ్చరణశాఖవారు, మనవా రాంధ్రదేశమున వ్యాపించినట్లు, కర్ణాటాదీ దేశములయందును వ్యాపించియున్నారు. మైసూరు ప్రాంతములయందును, మధుర తిరునల్వేలి జిల్లాలయందును నీకంద్రమాణిక్య బృహచ్చరణ బ్రాహ్మణ కుటుంబములను నేననేకములం జూచియున్నాను. వీరు ఏకారణమున ఏకాలమునందు విదేశవాసము ననుభవింప నారంభించిరో నిశ్చయింప శక్యముగాకున్నది. కంద్రమాణిక్య బృహచ్చరణము వారందఱును ప్రాయకముగా వేదశాస్త్రవేత్తలును విహితకర్మానుష్ఠాన పరాయణులును,తపస్సంపన్నులునై, యొప్పుచుండిరి. అందువలన వీరేదేశమునకుఁ బోయినను తద్దేశవాసులగు రాజులును మహారాజులును, చేయు నాదర సత్కార విశేషములకుంజిక్కి యక్కడనే నిలిచిపోయిరనుట యొకకారణముగ నుండవచ్చును.

'అట్లు మనపూర్వులును నట్టి కారణముల వలననే, యీ యాంధ్రదేశము నాశ్రయించి యుండవలెను. కాంచీపురము రాజధానిగాఁగల చోళసామ్రాజ్యము తెనుఁగుదేశమునందునుఁ గొంత భాగము నాక్రమించి యుండవచ్చుననుట యసంగతముఁగాదు. కొంతకాల మాంధ్రదేశమంతయు దానియేలుబడికి లోఁబడి యుండినను నుండవచ్చును......మనవారలేకాక యాంధ్రదేశమునఁ జేరిన ద్రావిడులు పెక్కు తెగలవారున్నారు. గోదావరి విశాఖపట్టణ మండలములయందు పేరూరు, దిమిలి' ఆరామము అనుమూఁడు తెగలవారు కలరు. ఈనెల్లూరు మండలము నందేయుండు తుమ్మగుంట ద్రావిడులను మన మెఱింగియున్నాము. వీరిలోఁ బేరూరు ద్రావిడప్రభృతులు ముప్ప-

దను నామమాత్రముననే ద్రావిడులుగాని
వారి యాచారమును భాషయు నాంధ్రములై
యున్నవి. ఈపేరూరు ద్రావిడులే కోనసీమ
ద్రావిడులనఁ బడుదురు. వీరు నెల్లూరు
మండలమునందే యనేకులు గలరు. వీరి
యందు నాంధ్రభాషయు, నాంధ్రాచారమును
మనము చూచుచున్నాము. ఇంతియగాక
ఈ తెగవారు ద్రావిడదేశమందు తామ్రపర్ణ
తీరమున బహుకాలముగా వసించుచున్నను
వారు గృహములలో తెనుఁగే మాట్లాడు
టయు, నాంధ్రాచారమునే యాచరించుటయు
నేఁ జూచియున్నాను. తుమ్మగుంట ద్రావి
డులు మాత్రము పెక్కండ్రు తెనుఁగే మాట
లాడుచున్నను, ద్రావిడాచారము మాత్రము
కలిగియున్నారు. మనకును వారికిని హవ్య
కవ్యవిధులు సమానముగ నున్నవి.

'ఇట్లు కొందఱియందు భాషాచార
ములు మారుటను, కొందఱియందు మాఱ
కుండుటను బట్టి వీరు ఆంధ్రప్రవేశమును జేసిన
కాలమునందు పరాపరవ్యవస్థ యంగీ
కార్యమని ప్రేమవంతుల యభిప్రాయము.
ఈమార్పులకు నితర కారణంబులున్నను
నుండవచ్చునుగాని వీరలందరును ద్రావిడ
రాజుల యేలుబడికి నాంధ్రదేశము లోబడి
యుండిన కాలమున నీదేశము నాశ్రయించి
యుందురనుట మాత్రము సంభావ్యముకాదు.
ఇతర ద్రావిడుల విషయమిప్పుడు, విచారిం
చుట యనవసరమై తోఁచినను మనపూర్వులీ
దేశముఁ జేరినకాలము నిశ్చయించ మనము
యత్నింపవలసియున్నది. అందులకు వలసి
నంత యాధారములు లేవు. కాని కొన్ని
మాత్రమిప్పుడు కాకున్నను. కాలాంతరమున
నైనను నిశ్చయ జ్ఞానము గలిగించునని

నావిశ్వాసము. దక్షిణదేశ ద్రావిడులకువలె
గాక మనవారి కుటుంబములన్నిటికి నింటి
పేళ్ళు గలవు. అవి ప్రాయకముగ గ్రామ
నామములై యున్నవి. కొన్ని మాత్రము
వేదము, పురాణము, మొదలగునవి పౌరుష
నామములుగఁ దోఁచుచున్నవి. ఒక యింటి
పేరు గలకుటుంబము లన్నియుఁ బ్రాయ
కముగా సగోత్రములుగాను, జ్ఞాతి సంబంధ
ముగలవిగాను నున్నవనుట ప్రసిద్ధము.
అందువలన నొక యింటిపేరుగల కుటుం
బము లన్నియు నొక కుటుంబమునుండి
వృద్ధి నొందినవిగా నిశ్చయింపవచ్చును.
పౌరుషనామములు గాకున్నను. గ్రామనామ
ములన్నియు మన కార్యమునకు సాధనము
లగుచున్నవి. మామిడిపూడి, నేలటూరు,
వావిళ్ల మొదలగు నివి తన్నామములుగల
కుటుంబములు, తత్తద్గ్రామాదూర వాస్తవ్యు
లగుట వలన సంతగా నిశ్చాయకములు
గావుకాని, ఉడాలి, చదలువాడ, మొదలగు
నామములుగల కుటుంబములు దత్తన్నామక
గ్రామములను చిరకాలమునకు మున్నే
త్యజించి, మన వినికికిగోచరముగాని కాలము
నుండి దూరదేశమున వసించుచున్నవి.
కావున నట్టి నామములిందులకు సాధన
ములు కావచ్చునని యెంచుచున్నాను. మన
పూర్వులు దక్షిణదేశమునుండి యిటకు
వచ్చినప్పుడా మొదట పుదూరను నగ్రహార
మున నివసించినట్లు మనపెద్దల కింవదంతి
కలదుగదా. వారీ పురమునకు నూతనపుర
మను నర్థముగల పుదూరను ద్రావిడ నా
మము పెట్టుటయును, వారి యాగమనమప్ప
టికి నూతనమనియు, నప్పటికి వారాంధ్ర
భాషాపరిచయము లేనివారనియు, తెలుపు

చున్నది. ఉడాలి ప్రభృతి కుటుంబములును మొదట నూతన పురాగ్రహారమున వసించియుండి, కొంతకాలము గడచిన పిమ్మట కారణ విశేషమున దేశాంతరమునకుఁ బోయి తత్తద్గ్రామాంతరములను వాసస్థానములుగా నేర్పఱచుకొని యుండవలెను. కావున వీరాగ్రామములయం దెప్పుడు వసించియుండిరో అరసి యెఱిఁగినయెడ నంతకు మున్నే మనపూర్వులు పుదూరుఁ జేరియుండవలెనని కాలావధి యేర్పడును.

'చదలువాడ' యనునది మాయింటి పేరు. చదలువాడ గ్రామము గుంటూరు జిల్లాలో వంగవోలు తాలూకాలో నున్నది. మాపూర్వులట నెప్పుడు వసించిరో యూహింప శక్యము గాకున్నది. అయినను గూడూరు తాలూకాలో నుండు కోట, వెంకనపాళెమను గ్రామము రెండువందల యిరువది సంవత్సరములకుముం దస్మత్పూర్వపురుషులగు సహస్రనామభట్టులనెడి వారికి దానముచేయఁబడినది. ఇప్పటికి నాలు తరములగుచున్నది. మాకిప్పుడు త్రిరాత్రజ్ఞాతులు గలరు. జ్ఞాతిత్వ సంబంధమును విడిచిన చదలువాడ కుటుంబములును గలవు. ఏడుతరములవరకు నాశౌచము దశరాత్రమనియు, పిమ్మట నేడు తరములు త్రిరాత్రమనియు, నావల నాశౌచసంబంధము విడుచుననియు, ధర్మశాస్త్రమువలనం దెలియుచున్నది. ఈ చదలవాడ కుటుంబములు వారెవ్వరికిని తమపెద్దలు చదలువాడ గ్రామము నెప్పుడు విడిచివచ్చిరో తెలియకున్నను, వీరందరును కౌశిక గోత్రజులగుట వలన నొక్క కుటుంబమునుండి యభివృద్ధి జెందిన వారనుట స్పష్టము. పదునాలుగు తరములైనంగాని ఆశౌచము నివర్తిల్లదు. ఇప్పుడు నాలు తరములకు కొన్ని కుటుంబముల నైదుతరములకు, వెంకన్నపాళెగ్రామదానకాలమునుండి ఇప్పటికి సుమారు రెండువందల యిరువది సంవత్సరముల కాలమైనది. కావునఁ బదునాలుగు తరములకును సుమారు ఏనూఱు సంవత్సరములు నిర్ణయింపవచ్చును అంతియగాక అస్మత్తాత పాదులవారు, తమ బాల్యమునఁ దమతండ్రి తాతలు మొదలగు వారివలన నిప్పటికే కనుపర్తిపాటి చదలువాడ వారితోఁ దమకు నాశౌచ సంబంధము లేనియట్లు విని యున్నామని చెప్పుచుండువారు. కావునఁ జదలువాడ గ్రా వాస కాలమునకు నీయైదువందలతో నింక నొకటి రెండువందల సంవత్సరములు చేర్పవచ్చును. అయినను అంతకన్నను దీర్ఘకాల మసంభవము కాదుకాని మాపెద్ద॥ చదలువాడ గ్రామమున నివసించుట యేడువందల సంవత్సరములకు ముందెప్పుడో యని నిర్ధారింపఁదగియున్నది. ఇందువలనఁ బుదూరు గ్రామముఁ జేరుటంతకు ముందే యెప్పుడో యని యవధి తెలియుచున్నది. ఈవిధముగా నితరగ్రామముల గురించియు విచారించిన యెడల నిజమెరుంగుటకు మార్గ మేర్పడునని తలంచుచున్నాను పుదూరుగ్రామ మెప్పు డెవనిచేత దానమీయఁబడెనో అనువిషయము విమర్శించుటిందుల కవశ్యకర్తవ్యమగు చున్నది. ఎట్లైనను మనపూర్వులీదేశముఁజేరుట వేయి సంవత్సరములకు ముందని నాయభిప్రాయము.'

'మనవారి దేశమునకు నొక్కొక్క కుటుంబముగఁ గాలక్రమముగ వచ్చి చేరిన

వారుగారు. అనేక గోత్రముల వారనేక కుటుంబము లేక కాలమునవచ్చి యీ దేశము జేరినట్లు తెలియుచున్నది. ఆకాలపు రాజు ఈ బ్రాహ్మణోత్తములను రాపించి పుదూరను నగ్రహారమును ఏర్పరచి,వీరికి స్వాస్థ్య వృత్తి వసతు లొసంగి. యిచ్చట నెలకొల్పి యుందురని యెంచుచున్నాను. వారందరు ఒక్క మొగ నీదేశమునందే నిలిచి దక్షిణమునకు గతాగతములు లేనివారై యక్కడి వారితో బంధుత్వ సంబంధములు విడిచిరి. దాక్షిణాత్యులకు వ్యతిరిక్తముగా నాంధ్రుల వలె మనవారు బాలురకు నక్షరారంభమున శివపంచాక్షరి వర్ణములు నుపదేశింపసాగిరి. కర్మ కాలక్రమము తెలియుటకై సూర్య సిద్ధాంత పద్ధతని వదలి చాంద్రమానము నాశ్రయించిరి. మనవారు దక్షిణదేశము విడుచుకాలమున నక్కడగూడ శివపంచాక్షరి వర్ణోపదేశాచారము కలిగియుండిన నుండవచ్చును. అప్పటికి సౌరమాన వాక్య గ్రంథము పుట్టలే దనుటయు సంభావితము గాదు. ఇప్పటికిం బెద్దకాలము గడచినను మన బంధువులయం దెల్లను నీ విశేషములు నెలకొనియున్నవి.'

శ్రీ సుందరరామ శాస్త్రిగారి యుపన్యాసపు ప్రతులు దొరకవుగావున నింతవిస్తరముగా నుదాహరించితిని. ఈవ్రాతను బట్టి పుదూరు ద్రావిడులందరును, తమిళదేశము నుండి వచ్చిరని పెద్దల విశ్వాసమని తేలినది. అందువలన వీరందరును మొదట పుదూరులో చేరి వ్యాపించిన వారని యు నభిప్రాయమైనది. కాని వీరు పుదూరున కెప్పుడువచ్చిరి, ఎందుకువచ్చిరి, ఏప్రభువు వీరికి అగ్రహారముగా పుదూరునిచ్చెను? అను ప్రశ్నలకు సరియైన సమాధానములు దొరకుటలేదు. ఊహలు చేయవలసియున్నది. కాని పుదూరునకు బ్రాహ్మణ పుదూరను పేరుండినట్లు శ్రీ యేనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్ర చరిత్రవలన తెలియుచున్నది. వీరు దాదాపు నూట యేబదియేండ్లక్రింద చెన్నపట్టణమందు సుప్రీమ్‌కోర్టు ఇంటర్‌ప్రెటరు అధికారము వహించియుండిన వారు. తాము పరివారముతో కాశీకి పోయివచ్చి ఆవిషయములు విపరముగా డైరీవలె వ్రాసినారు. దీనిని మొట్టమొదట శ్రీ పుదూరి నారాయణశాస్త్రిగారనువారు 1838 లో ముద్రించిరి. ద్వితీయ ముద్రణము 1869 లో పువ్వాడ వెంకటరావను వారు చేసిరి. తృతీయ ముద్రణము 1941-లో శ్రీ దిగవల్లి వెంకటశివరావుగారిది, వీరు వారు. 1838 లో ముద్రించిన పుదూరివారు చదలువాడవారు. ఈగ్రంథములో పుట 362 లో తాము యింటికి మరలు సందర్భమున వీరాస్వామిగారిట్లు వ్రాసియున్నారు.

'౨౭ తేది పుద యాత్ప్రాతఃము 3 గంటలకు లేచి యిక్కడికి $2\frac{1}{2}$ ఆమడ దూరములో వుండే నాయుడుపేట అనే వూరు ౯ గంటలకు చేరినాను. యిది పేటస్థలము గనుక సమస్త పదార్థాలు దొరుకును. మనుబోలుమొదలుగా వెంకటగిరి రాజువారి భూమి. ఈపేటలోను వారి సదావృత్తి అన్నసత్రము, సగరున్ను వున్నది. అక్కడ భోజనము చేసుకొని ౨ గంటలకు బయలువెళ్ళి యిక్కడికి కోసెడు దూరము లోవుండె బ్రాహ్మణపుదూరు చేరినాను. యీపూరు వారికాక పోయినా 50 యిండ్లు ఏర్పన్నండలి వుండే గ్రామము గనుకనున్న

నాపరివారల స్వకీయులు కొందఱు అక్కడ యున్నారు గనుకనున్ను యీవూరికి రావడ మయినది. యిక్కడ అనాది దేవాలయాలు రెండు ఆ బ్రాహ్మణుల పేదరికమునకుతగినట్లు కాపాడబడుచున్నవి. ఈ బ్రాహ్మణులకు ఈగ్రామము శ్రోత్రియము. ఈవూళ్ళో 29 తేది మధ్యాహ్న పర్యంతము నిలవడ మయినది.

బ్రాహ్మణ పుదూరనుటవలన బ్రాహ్మణేతరుల కేమైన కలదాయని విచారింపగా కలదని తెలిసినది. అసలు ఊరికి పడమటి భాగమున బ్రాహ్మణుల యిండ్లును తూర్పున తదితరుల యిండ్లును కలవు. ఊరు మల్లాము రోడ్డునకు ఉత్తరమున నున్నది. కాని నేను మా శ్రీ వేదము లక్ష్మీ నారాయణశాస్త్రిగారి వలన విన్నసంగతి యేమనగా, అసలు పుదూరిది కాదనియు, ఇది తర్వాత నెప్పుడో కట్టుకొన్న ఊరనియు, పుదూరికి ముందు పశ్చిమమున నొకచెఱువును, దానికి దూర్పున నొకశివాలయమును గలవు. వీనికి ఉత్తరపార్శ్వమున కొంత తూర్పువంపుగా మల్లాము రోడ్డున్నది. ఈ రోడ్డునకు దక్షిణమున శివాలయమునకు తూర్పుగా పూర్వము పుదూరున ద్రావిడ నివాసములుండెడివట. శివుని దృష్టిపడుట చేత తఱచు అగ్నిప్రమాదములు జరుగుచుండెడివట. ఒక మలయాళ బ్రాహ్మణ మంత్రశాస్త్రవేత్త ఆయూరికి వచ్చియుండి ఇప్పటి మంత్రశాస్త్ర వేత్తలతో నాలోచించి శివాలయమునకు ముందొక వినాయకుని స్థాపించిరట. అట్లుకూడ ఉపశాంతి లేక ఆ ఊరినే వదలి దూరముగా ఇప్పుడున్న చోట ఇండ్లు కట్టుకొనిరట. ఆ మొదటి యూరికి అగరము, భక్తసంజీవని యని పేరుండెడిదనియు, దాని నొకశిలాశాసనమున తాము చూచియుంటిమనియు, ఇప్పుడు ఆశిలయేమైనదో తెలియదనియు, కాని ఎన్నియో వ్యవహార పత్రములలో ఈపేరును తాము బాల్యములో చూచియుంటిమని శ్రీశాస్త్రిగారు చెప్పుచున్నారు.

పుదూరునకు సాక్ష్యమని వ్యవహారము. మొత్తము 86 స్వాస్థ్యములట. అన్నియిండ్లవారికిని సమానభాగములుగా దత్తమట. ఇది వెంకటగిరి దొరలిచ్చినదని ప్రతీతి. మొన్నటి వఱకును పరిపాలన కూడ వారిదేగదా. ఆదిలో దీనికి ఎట్టిపన్నుగాని లేకుండెననియు తర్వాత నేర్పడెననియు, ఆవిధమును మానాయనమ్మగారు (శేషమ్మగారు, అల్లాడి వారియింటి ఆడుబడుచు చిల్లిమూరు అల్లాడి సదాశివ శాస్త్రిగారి పెద్ద కుమార్తె) చెప్పగా వినియున్నాను. ఒకప్పుడు వెంకటగిరి దొరలలో నొకరైన వారెవరో ఈబ్రాహ్మణుల దర్శనార్థము అగ్రహారములోనికి వచ్చిరట. వారికి బ్రాహ్మణులందరును మర్యాదచేసి ఇంటింటికి కొంతరొక్కము వసూలుచేసి కానుకగా సమర్పించిరట. ఆదొరగారు వెడలిపోవునప్పుడు ప్రతిసంవత్సరము ఆవిధముగానే కానుక కోరిరట. అదిమొదలు మొగమాటముచేత సమర్పించుచు తుదకు అదే పన్నుగా నిలిచిపోయినదట.

పుదూరిచ్చిన రాజెవరో తెలియదు. వెంకటగిరి దొరలే యైయుండిన యెడల క్రీ. శ. 1500 కు ముందు కానేరదు. వెంకటగిరియందు నివసింపసాగిన మొదటివార యాచమనాయుడు 20 వ తరము నెల్లూరు

జిల్లాలో వీరి ప్రాచీన తామ్ర శాసనము క్రీ. శ. 1533 - 34 ప్రాంతమిది. (మా నెల్లూరిశాసనములు) సుందరరామశాస్త్రిగారి లెక్కప్రకారము ఈతారీఖుకంటె చాలముందునకు పోవలెను. పైగా వెలుగోటివారు కాకతీయుల నాశ్రయించి యుండినవారు. ఆమనగల్లు వీరి తొంటి నివాసప్రదేశము. క్రీ. శ. 1323 లో కాకతీయుల పతనానంతర మెప్పుడో నెల్లూరు మండలమునకు వచ్చి వెలుగోటిని సంపాదించిరి. మఱి చరిత్ర మూతము. ప్రతాపరుద్ర చక్రవర్తి కాలములో నెల్లూరి తెలుగుచోళ లింతను ఉండిరి. వీరి నెల్లూరి రాజ్యము కంచివఱకును వ్యాపించియుండెను. కంచికూడ చేరియుండెను. గణపతి చక్రవర్తి యవసాన కాలముననను, రుద్రాంబ కాలముననను, పాండ్యులు ఆక్రమించిన నెల్లూరు రాజ్యమును ప్రతాపరుద్రుని సైన్యములు విడిపించినవి. అప్పటి సేనాపతులు వెలుగోటి వారేగాని నాటి కీరాజ్యమును వారు సంపాదించుకొనలేదు. అగ్రహారమిచ్చు నధికారమును లేదు. ప్రతాపరుద్రుని యనంతరము వీరిది రాచకొండ. ఆతర్వాత అనపోతమాదా నాయకుల కాలములో వారు రాజ్యమును పంచుకొనఁగా మదానాయకుని దక్షిణపార్శ్వమున దేవరకొండ రాజధానియైనది. కొండవీడు రెడ్డిరాజులు రాజధాని. కృష్ణకు దక్షిణదేశము చాలవరకు వారిరాజ్యము. క్రీ. శ. 1390 ప్రాంతమున నెల్లూరిసీమయు దానికి దక్షిణమును విజనగరపు రెండవ హరిహరరాయలు జయించెను. కృష్ణకు దక్షిణమంతయు వారిదే అయ్యెను. ఉదయగిరి రాజ్యము విజయనగర పతనము వఱకు వారిదిగా నుండినది. తర్వాత చంద్రగిరి రాజులు నెల్లూరి మండలములో చాల భాగమున కధిపతులైరి. క్రీ. శ. 1336 లో విజయనగర రాజ్యస్థానము 1390 ప్రాంతము నెల్లూరు వారి స్వాధీనము. ఈకాలముననో లేక తత్పూర్వమో దాదాఁపు తిక్కనాదుల కాలముననో సుందరరామ శాస్త్రిగారు యూహప్రకారము పుదూరు ద్రావిడు లీదేశమునకు వచ్చియుండవలెను. శంద్రమాఠీర్య బృహచ్చరణమువారు మాధవవిద్యారణ్యులవలన మన్నన లందుటవలన విజయనగర రాజ్య ప్రారంభకాలమే సరియైనకాలమేమో.

కాని పుదూరు ఇంతప్రాచీనము కాదేమోయనియు, మనవారందరును ఏకకాలమున ఒకగుంపుగా రాలేదేమోయనియు తోచుచున్నది. వెంకటగిరి దొరలిచ్చినట్లు కొందరు పెద్దలవలన వినుటను బట్టియు, వారికి దొరతన మీగ్రామముమీద నేర్పడిన దానినిబట్టియు,కొంతశంకింపవలసియున్నది. పన్నులేని సర్వమాన్యమునకు, బ్రాహ్మణాగ్రహారమునకు,అందును పుదూరి వంటివండితులకు ఏరాజైన పన్ను విధించునా? ఎంత మొగమాట మున్నను వారిత్తురా. అదేదో అప్పుడే ఏర్పరుపఁబడిన స్వాస్థ్యమై యుండవలెను. ఇందులకు పుదూరును గురించిన శాసనాధారములను వెంకటగిరివారి 'రికార్డు'లను పరిశోధించుట యుక్తము. ఇందుల కనుగుణముగా ప్రాచీన గ్రామనామము అగరం భక్తసంజీవనియట. పైగా పుదూరు తర్వాత నిర్మితము. అంతేగాక పుదూరు ద్రావిడులకు ఈపేరు ఇటీవల నేర్పడినట్లు కనఁబడుచున్నది; ప్రాచీనముగా కానరాదు.

ఏనుఁగులవీరాస్వామి ‘బ్రాహ్మణ పుమా’ రన్నాఁడు. వీరందరును తమలో తాము మాటాడుకొనునప్పుడు మనవాఁడను నర్థముగల ‘నంబళవ౯’ అను తమిళపదమును వాడుదురేగాని పుదూరు ద్రావిడీ యనరు. పుదూరువారుఅనఁగా కొన్నికుటుంబాలవారికే అన్వయముగాని అందఱకును కాదు. ఆంధ్రులతో మాటలాడునప్పుడు ఆంధ్రులకర్థమగుటకై, తాము అప్పటము ‘అయ్యరులు’ కామని తెలుపుటకొరకు ‘పుదూరు ద్రావిడులు’ మని చెప్పుకొందురు. ద్రావిడులు ఆంధ్రదేశమందు ప్రసిద్ధులే.

కొన్ని కుటుంబములకే పుదూరివారను నియమము తర్వాత వచ్చియుండరాదా యని కొందఱు వాదింపవచ్చును. కాని పుదూరు పారంపర్యముగా మొదట వచ్చిచేరిన పదునొకండు గోత్రాలవారికి నెలవైయుండిన యెడల అందఱకును ఈ శ్రోత్రియముతో ఏదో యొకపాటిసంబంధ ముండి యుండవలెను గదా. ఉండిపోయినదన్న భావమైన నుండవలెను గదా. తమిళ దేశమునుండి వచ్చినది జ్ఞాపకము పెట్టుకొన్న వారు ఈ మాత్రము మఱచిపోయి యుందురా? అట్లుగాక ఎక్కువగా అల్లాడివారికిని, తర్వాత వారివద్దనుండి క్రీతమై మఱికొన్ని కుటుంబాలవారికిని మాత్రమే భాగముండి ఇతరులకు బొత్తుగా లేకపోవుటయేమి? పుదూరితో ఏనాడును ఎట్టి సంబంధమును లేని కుటుంబములు నేలటూరు, మామిడిపూడి, వేదం, పాకు మొదలైనవి గలవు. ఇంతేగాక ఈ ద్రావిడులలో ఏటికి (పెన్నకు) ఇవతలివారు అవతలివారని రెండుభేదములుండి, సంబంధ బాంధవ్యములు లేకయుండి, తర్వాత కలయిక యేర్పడినదని చెప్పుదురు. అందరును ఒక్క పుదూరునుంచి చీలినవారేయై యుండియెడల దీనికెట్లు వివరణము?

అన్నిటిని మించిన విషయమొకటి కలదు. పుదూరి ద్రావిడులనఁబడు వారందఱును స్మార్తులే అని తలంచువారు చాలమందిగలరు. అదిపొరపాటు. ఇంచుమించు పుదూరు వారందఱును ఒకప్పుడు వైష్ణవాచార్యులుగా కనబడుచున్నారు. పుదూరినుండి పోయి వైష్ణవులైనట్లు చెప్పుకొనుట లేదు. మఱి వైష్ణవులుగానుండి స్మార్తులైన చిన్నెలే గలవు. పుదూరు పూర్తిగా స్మార్త శ్రోత్రియముగాని వైష్ణవులకు ఇందులో సంబంధము లేదు. ఇందుచేతగూడ నిది తర్వాతదని నిశ్చయము, దీనిచరిత్ర నరయుదము.

పుదూరివారి వైష్ణవసంబంధమును గుఱించి తామువిన్న విషయములను కీ. శే. శ్రీ ఒంగోలు వెంకటరంగయ్య పంతులుగారిట్లు వ్రాసియుండిరి. (త్రిలిఙ్గ 1942, వేదము వేంకటరాయశాస్త్రిగారి జీవితము) ‘కండర మాణిక్యమనునది యొక గ్రామనామము. ఈపేరుగలయూళ్లు అఱవజిల్లాలలో నచట నచట నున్నవి. ప్రస్తుతమైయుండు ఊరు తంజావూరు జిల్లాలోని నన్నిలం తాలూకాలోనిదని తెలియుచున్నది. ఇదియే శాస్త్రులవారి శాఖాస్థావరము. ఈ గ్రామమున ననేక స్మార్త కుటుంబములును శ్రీ వైష్ణవకుటుంబములును అన్యోన్యముగ జీవించుచుండినట్లును, దాదాఁపు అయిదారు నూర్ల యేండ్లక్రింద పదునొకండు గోత్రముల స్మార్తులు ఖాను డాంబర వీరులచేతనో మఱి

యేయితరకారణములచేతనో ఆయూరువిడిచి వలసపోయిపోయి తుద తృణకాష్ఠజల సమృద్ధమగు నెల్లూరుజిల్లాలోని సువర్ణముఖి నదీ ప్రాంతముల విడిసినట్లును, ఆదేశపు దొర వీరి సౌశీల్యాదులను విద్యాతిశయమును గౌరవించి తనయేలుబడిలో సువర్ణముఖినది కనతిదూరమున నొకయగ్రహారమును నిర్మించి దాన్ని వీరికి దానముచేసినట్లును తెలియుచున్నది. క్రొత్తగ నివేశనమేర్పఱుపఁబడిన యగ్రహారమగుటచే తను ప్రతిగ్రహీతలు అఱవవారగుటచేతను దీనికి అఱవమున ‘ పుదూరు ’ అని పేరుపడినది. పుదూరు అనఁగా క్రొత్తయూరు. దానకాలమున దీని కింకొక పేరు పెట్టఁబడినదని కొందఱు చెప్పెదరు. అది రూఢిగ నేర్పడలేదు. చిరకాలాభ్యస్తమై ఈ కుటుంబముల వారికి పారంపర్యముగ పుదూరువారను పేరు నిలిచియున్నది.”

‘దీనికింకొకపేరు’ అగరం భక్తసంజీవని యని పైనతెలిసినదిగదా మఱి కంఠర మాణిక్యము సందేహాస్పదము. ఆ పేరిటివి రెండు గలవు. వీరు చెప్పినదిగాక పుదుక్కోట దగ్గర (రామనాథపురంజిల్లా) నొకటి గలదు. ఇందు ఏ కంఠరమాణిక్యము? పైగా బృహచరణము వారట. దీనింగూర్చి శ్రీపంతులవారిట్లు వ్రాసియున్నారు. (త్రిలిఙ్గ. 1942) ‘బృహచరణ శబ్దము వైదిక చరణవ్యూహములలో పఠింపఁబడలేదు. శబ్దార్థమును స్పష్టపడలేదు. ఎట్లైతో కొందఱికి శాఖాసమయమేర్పడి యున్నది. బృహచరణులలో మాంగుడి సత్యమంగళం, మిళగునాడు, కండర లేక కంఠరమాణిక్యం ఇత్యాద్యనేక శాఖలును గలవు. బహుశః చిరకాల నివాసస్థానములను బట్టి ఈ యుపశాఖనామము లేర్పడి యుండును.’ తమిళదేశమందు వీరెక్కువగా కంఠరమాణిక్య బృహచరణమువారు తంజావూరువారే యగుటవలన ఆగౌరవము తంజావూరికే యిచ్చినను వైష్ణవ సంబంధము ఇందులకు బాధకముగా నున్నది: ఇదియే పుదూరి సిద్ధాంతమునకు బాధకము. ఎందుల కనఁగా వీరిలో చాలమంది ఊర్ధ్వపుండ్రధారులు. శంకరాచార్యులను గురువుగా గ్రహింపరు. శ్రాద్ధాది ప్రక్రియలు వైష్ణవ పరముగా నున్నది. మీదుమిక్కిలి గంగపరము వైష్ణవులని నెల్లూరిలో నుండువారును వీరును చాలవరకు ఒక్క పోలికవారు ఒక్క కుదురునుండి చీలినవారను యొప్పును ఇంటిపేళ్లను గోత్రములును ఒక్కటే యైయుండుటేగాక భాషయు ఒక్కటేయై, మొన్నమొన్నటివఱకు ఆచారాదులను పాటించుచుండిరి. కొందఱికి తమ మూలపురుషుఁడు ఒక్కఁడేయన్నదికూడ జ్ఞాపకమున్నది. నేనెఱిఁగినంత మాత్ర ఒక్కరే ఉపాధ్యాయము చేయుచుండిరి. వైష్ణవస్మార్త భేదముండెడిదికాదు. సమాశ్రయణము చేయించుకొనుట వారి వారి యిష్టానుసారముగా నుండెడిది. ఇటీవల దక్షిణాది వైష్ణవులను చూచి గంగపరమువారును అట్లే దాక్షిణాత్యులను పుదూరివారును చాలవఱకు మారినారుగాని ఇప్పటికిని ఇరువురును ఒక్క కుదురవారేయని తలంచువారు కలరు. ఈ విషయమును గురించికూడ, రంగనాయకుల పేట వారుగాన, శ్రీవెంకటరంగయ్య పంతులుగా రిట్లు వ్రాసినారు. ‘ప్రథమ దశలో అందఱును స్మార్తులుగనుండి కొందరు

వైష్ణవమును స్వీకరించిరో లేక తొలుత అందరును శ్రీవైష్ణవులుగనుండి కొందరు స్మార్తులైరో నిర్ణయింప నలవిగానున్నది. ఏద్దియో పరిణామము జరిగియుండునని యూహించుటకు మాత్రము ఆస్పదము కలదు. నేలటూరు, కొమాండూరు, తిరుపతి, సరస్వతి, శింగరాజు, పూని, బండేపల్లి, వేదం, శిరోభూషణం ఇత్యాది ఇంటిపేళ్ళు గలిగి గోత్రసూత్రము లొకటిగనుండువా రుభయులలోనున్నారు. ఇట్టి సంశయాస్పదములగు కుటుంబములు మఱికొన్ని గలవు. ఒకే అగ్రహారములో భాగస్థులుగనుండి ఒకే గోత్రసూత్రములు గల స్మార్త కిడాంబి వారును శ్రీవైష్ణవ కిడాంబి వారును ... ... చిత్తూరు వేలూరు ప్రాంతముల నున్నారు. పై విషయముగాక ఈ పుదూరిగణమున చేరియుండు స్మార్తాచారముల ననుష్ఠించుచుండు శిరోభూషణము వారు, మామిడిపూడివారు, నేలటూరివారు శ్రీవైష్ణవులవలె తిరుమణి తిరుచూర్ణ పుండ్రముల ధరించుచు, ఆచార్యశబ్దమునుగూడ స్వనామాంతముల జేర్చుచున్నారు. ఆచార్య శబ్దమాత్రమున సాధింపదగిన దేదియులేదు. రావులందఱు రాజులా! పైనజెప్పిన విశేషాచారములు కొందిమందిలో నిలిచియుండుటచే ఈపుదూరివారి మతపరిణామములందు విమర్శసహములగు నంశము లున్నట్లు స్ఫురింపఁగలదు. ఇట్టి విషయముల నెల్ల కూలంకషముగ నిర్ణయింప శ్రీవెంకటరాయ శాస్త్రులవారే తగియుండిరి. వారీవిషయముల స్పృశించినటులలేదు.”

వాస్తవముగా నిది పరిశోధింపవలసిన విషయము. పుదూరు గంగవరమువారల గోత్రములను ఇంటిపేళ్లను ఒకపట్టికగా వ్రాసి చూచిన వాస్తవము బోధపడును.

:: పట్టిక ::

| పుదూరుద్రావిడులు | గంగవరము వైష్ణవులు | గోత్రము | ఇలవేల్పు |
|---|---|---|---|
| వేదము (బిక్క) | | కౌశిక | వేంకటేశ్వర |
| తిరుపతి | | ,, | ,, |
| కొండగుంట | తిరుపతి | ,, | ,, |
| కలువాడ | | ,, | శ్రీరాముడు |
| శ్రీవాసం | | ,, | వేంకటేశ |
| కొండూరు (చావలి) | కొమండూరు | ,, | ,, |
| బాపుగూరు | | ,, | ,, |
| నెల్లూరుపల్లి (మినమనపూడి) | | ,, | ,, |
| ఉప్పాలి (దండిగుంట) | | ఆత్రేయ | నరసింహ |
| ఆమూరు | | ,, | |
| వావిళ్ల | | ,, | |
| పెనుగు (పుకుహూ) | | ,, | |

| పుదూరుద్రావిడులు | గంగవరము | గోత్రము | ఇలవేల్పు |
| --- | --- | --- | --- |
| పాకు | | శ్రీవత్స | గురునాథ. |
| పజ్జుల | | ,, | వేంక. |
| శిరోభూషణము | శిరోభూషణము | ,, | వేంక. చెంచు |
| పురాణము | | ,, | c/c |
| కటికి | | కౌండిన్య | |
| పాటూరు | | కాశ్యప | వీరరాఘవ |
| గొట్టి (అంతరించిపోయినది) | | శతమర్షణ | |
| పూని (దయ్యాలు) | (పూని) | మౌద్గల్య | వెంకటేశ |
| అల్లాడి | | ,, | ,, |
| మేలనాత్తూరు (బెల్లం) | | ,, | ,, |
| గొడుగు | | ,, | ,, |
| నేలటూరు | నేలటూరు | భారద్వాజ | ,, |
| వేదము (కొడవలూరు) | వేదము | ,, | ,, |
| కొండూరు | | ,, | ,, |
| తిమ్మావజ్ఝుల | | ,, | ,, |
| అప్పలకుట్టి | | ,, | ,, |
| చంపటి | | ,, | ,, |
| తోపా | | ,, | ,, |
| సల్లారి | | ,, | ,, |
| కోట | | ,, | ,, |
| బొందు (బందువుల) | | ,, | ,, |
| తాళ్లూరు | | ,, | ,, |
| చదలవాడ (కాతెర) | | ,, | ,, |
| బండేపల్లి | బండేపల్లి | గౌతమ | వేంకటేశ |
| మామిడిపూడి | | ,, | ,, |
| కోలం | | ,, | ,, |
| సరస్వతి | సరస్వతి | హరిత | |
| సింగరాజు | సింగరాజు | ,, | |
| వా (ం) దారి | | ,, | |
| కాళహస్తి | | ,, | |
| ఘవనపల్లి | | ,, | |
| అనగప్ప, అప్పకాయల. | | ,, | |

వీనిలో చాలమందిని సందర్శించి పరిశోధించి వ్రాయుటకు నాకింకను అవకాశము దొరకలేదుగాని తెలిసినంతవరకు వారివారి వైష్ణవ సంబంధములను వ్రాయుచున్నాను.

మాది (బక్క) వేదము. కౌశిక గోత్రము. ఈ యింటిపేరి వారు ఈ గోత్రజులు గంగవరము వారిలో చేరుగాని, తిరుపతి వారున్నారు. మాది తిరుపతి వేదముట మాలో ప్రసిద్ధుఁడొక బక్క వాధ్యారి (ఉపాధ్యాయుఁడు) యుండినందున ఆపేరు వచ్చినదట. మావంశవృక్షము చూచిన మాకూటస్థుడు వేదము వెంకటరమణ సోమయాజులు ఒకానొక తిరుపతి తిరుమలాచార్యుల పౌత్రుని పౌత్రుఁడు. వంశవృక్షము చూచిన వేడుకగా నుండును. తిరుపతి తిరుమలాచార్యులకు ఇరువురు కొమాళ్ళు, వెంటద్రామాచార్యులు వరదాచార్యులనని. వరదాచార్యుల కొమారుఁడు వెంకటకృష్ణంభట్టు. ఈయన కుమారుఁడు మరల వరదాచార్యులు. వీరి కుమారుఁడే వేదము వేంకటరమణసోమయాజులు. భార్యవెంకమ్మ సోమిదేవమ్మ. వీరి కుమాళ్లు నలువురు. అందరును యజ్ఞము చేసినవారే. అందులో మూఁడవవారైన అణ్ణయ్య సోమయాజి (తిరుమలయజ్వ) యొక్క వంశస్థులముమేము. అతర్వాత మా జ్ఞాతులలో నెందఱో సోమయాజులుండిరిగాని, వీరి రెండవ కుమారులు మాతాతగారి తాతగారు వెంకటరాయశాస్త్రిగారి కడనుండి ఎవరును యజ్ఞముచేయలేదు. మా కూటస్థులగు వేంకటరమణ సోమయాజులు వారే మల్లయపాళెమును వడసినవారు. మాకు వేంకటేశ్వరస్వామి ఇలువేల్పు. మాజ్ఞాతులు వెంకట్రామాచార్యులవారి సంతతివారు ఇంకను తిరుపతివారని మాలో నున్నారు. వారును మావలె వైష్ణవమును వదలినారు. వదలని వారు గంగవరము వారితో చేరినట్లున్నారు. వేంకటరాయ నామధేయము మాకెట్లు వచ్చినదో తెలియదు. శ్రీకృష్ణ దేవరాయలవారు ఆముక్తమాల్యదలో వేంకటేశ్వర స్వామిని 'వెంకటరాయా' అని సంబోధించినారు. మాలో పనుగువారిలోను, బండేపల్లి వారిలోను, కొండపల్లూరి వేదమువారిలోను ఈ పేరు కనఁబడుచున్నది. దౌహిత్రులకు, అందును రెండవవారికి తల్లియొక్క తండ్రిపేరు పెట్టు నాచారము కలదుగాన దౌహిత్ర పరముగా వచ్చియుండవచ్చును. లేదా చంద్రగిరి రాజులలో వెంకటరాయ నామధేయులుండిరిగాన వీరికి తిరుపతి చంద్రగిరి సంబంధముచేత రాజాశ్రయమువలన రాజును మెప్పించుటకును పెట్టుకొనియుందురు.

మాలో కౌశికగోత్రజులలో పసలువాడ వారికి శ్రీరాముడు ఇలువేల్పు, అగుటయేగాక నామధారణము నేటికిని కలదు. వికారముగా నుండునని మానుచున్నారు. 'శాస్త్రి' పేరు పెట్టుకొని ఊర్ధ్వ పుండ్రములు ఎవరైన ధరింతురా! కొమాండూరు వారుభయులలోను నుండుట విశేషము. పూర్వపు పండితులు కొమాండూరు అనంతాచార్యులు సుప్రసిద్ధులు, గంగవరము వారు అట్లే (C. K Charlu) అను వారు (రావుబహద్దరు) గవర్నమెంటు అర్కియాలజిస్టు కొమాండూరువారు.

పువూరు ద్రావిడులలో శివత్స గోత్రజులలో శిరోభూషణము, పురాణము వారికి నేటికిని నామధారణమున్నట్లే. సుప్రసిద్ధులు

(S. V. Rangacharlu) శిరోభూషణము) వెంకటరంగాచార్లుగారు మావారే. దండిగుంట సూర్యనారాయణ శాస్త్రిగారి మేనల్లుడే. నేలటూరి వారిలో నీవైష్ణవ సంబంధము చాల స్పష్టము. పుదూరి నేలటూరివారింకను నేలటూరు గ్రామమును (నెల్లూరిలో ముత్తుకూరికి సమీపమున సముద్రతీరమున కలదు) వదలక నామధారణముతో సహా అనుభవించుచున్నారు. గంగవరము వారిలో నేలటూరువారు పుదూరువారినుండి చీలినవారే. పద్మనాభాచార్యులనువారికి, కేశవాచార్యులు శ్రీనివాసాచార్యులునని ఇరువురు కొమాళ్ళు. కేశవాచార్యుల కొమారులు శ్రీరంగాచార్యులు. వీరి కిరువురు కొమాళ్ళు (పొట్టి) రాఘవాచార్యులు. అణ్ణమాచార్యులునని. వీరిలో పెద్దవారు అనంతపురము శాఖకును రెండవవారు గంగవరము శాఖకును మూలపురుషులు. అణ్ణమాచార్యులవారే గంగవరమును సంపాదించిరి. వీరికి తాము బహుశః ఏడవతరము వారమేమో అని శ్రీమాన్ నేలటూరి రామదాసయ్యంగారు నాకుతెలిపినారు. ఈ గంగవరము వీరికి క్రీ. శ. 1650 ప్రాంతమున లభ్యమైనదట ప్రస్తుతము వీరికి నేలటూరని ఇంటిపేరేగాని ఆయూరితో నెట్టి సంబంధమును లేదు. కూడగా నేలటూరి వెంకటరమణయ్యగారి పూర్వులును, శ్రీమాన్ నేలటూరి రామదాసయ్యంగారి పూర్వులును ఒక యింటివారే. శ్రీవైష్ణవాచార్య శ్రేష్ఠులు.

ఇచ్చట గంగవరము వారి చరిత్ర తెలుపుట ముఖ్యము. ఈ గంగవరమును సంపాదించుటతోనే గంగవరము వైష్ణవులేర్పడిరి. మొదట నేలటూరివారే ఒక్కరే ఆయూరివారు. వారితో కోమాండూరివారు కొందఱు చేరి ఆయూరిలో భూములు సంపాదించుకొనిరట. ఆతర్వాత వైష్ణవులుగానే నిలిచినవారు కొందఱు వెడలిపోయిరి కొన్ని కుటుంబములవారు ఆ పేరుతో నిలిచిరి. నేలటూరువారి చరిత్రనుబట్టి అందరును తొలుత వైష్ణవులనియు, ఆయూరిలోనే నిలిచిపోయి తర్వాత నామధారణము మాత్రము నిలుపుకొని పుదూరివారితో చేరినవారు నేడు స్మార్తులుగా నైనారని తెలియుచున్నది. ఇట్లే భారద్వాజులు, వేదమువారు ఉభయులలోను కనబడుచున్నారు. సుప్రసిద్ధ శాస్త్ర సార్వభౌములు వేదము పట్టాభిరామ శాస్త్రిగారు ఈవంశమువారు. వీరికి నామధారణము లేదుగాని ఈ ఇంటిపేరు గోత్రము గంగవరములో నున్నదిగదా. ఈయింటిపేళ్ళెప్పుడేర్పడినవోగాని భారద్వాజ గోత్రమువారు రెండు కుటుంబాలవారు మాత్రము వైష్ణవులు. పుదూరువారిలో చాలమంది, వేదమును పౌరుష నామమును బట్టి చూడగా వేదాధ్యయన పరులెవరో తొలుత నేలటూరును సంపాదించి, నేలటూరువారు కాగా, ఇతరులు ఇతరవిధముల గ్రామములు సంపాదించి నిలిచియుందురు. ఇదంతయు క్రీ. శ. 1650 కు చాలకాలము ముందే జరిగియుండవలెను.

నేలటూరు శాసనము దొరకలేదుగాని మామిడిపూడివారి శాసనమున్నది. వీరు తమ మూలపురుషుడు నీలమేఘాచార్యులని యనుచున్నారుగాని, విజయనగర ప్రభువు సదాశివరాయలు, మామిడిపూడి గ్రామమును వైష్ణవోత్తముడైన అనంతయాచార్యుని కుమారుడు అపారయ్యకు దానమిచ్చినట్లు శాస

నము యస్. డి. ఐ. తా మ్ర ప ట్ట క లు. నెం. 14 శక 1471) క్రీ. శ. 1549-50 మూలమిట్లున్నది. 'తుంగభద్రా నదీతీరే విఠ్ఠలేశ్వర సంనిధౌ, గౌతమాన్వయ దుగ్ధాబ్ధి కల్ప వృక్షాయితాత్మనే వాదివారణ సింహాయ పరాపన్నంబనూత్రిణే యజుస్శినే యజుశ్శాఖాధ్యాయినే బుద్ధిశాలినే షట్కర్మ దేవవర్మణే షణ్ణామపిచశాస్త్రాణి నిర్వాయక నిజోక్తయే, వైష్ణవాగమ సిద్ధాన్తవేదినే బ్రహ్మవాదినే. వశిష్య శిష్యవర్గాణాం శ్రీభాష్యోపదేశినే శ్రీవెంకటేశ పాదాబ్జ తాత్పర్యాశ్రయణోల్లాసి చేతసే శ్రీమతే సంతయార్యస్య సు పు త్రా య సువృత్తయే, ఆచారయ్యాభిధానాయ సూరయ సూనృతోక్తయే, ఉదయాచలరాజ్యస్థం పాకనాడౌ కృతాంస్థితిం సర్వపల్యాఖ్య సీమాయాం సంప్రాప్తం ఖ్యాతిముత్తమాం తాళ్ళపూడివరగ్రామా త్ప్రాచీమాశాముపాశ్రితాం పడితాపోలు మశెడికాఖ్యగ్రామద్వయస్యచ, ప్రఖ్యాతామ్యస్త సీమాంతాత్ దక్షిణస్యాం దిశిస్థితం, నేటూరోః కృష్ణరాయపట్టణస్యద్వయోరపి గ్రామయోః యు క్త సీ మా న్తా త్ పశ్చిమాందిశ మాశ్రితం ముత్కూరునామకాగ్రామా సంప్రాప్తం దిశముత్తరాం విఖ్యాత శ్రీరంగరాజుపుర మిత్యపరాభిధం గ్రామం మామిడిపూండ్యాఖ్యం సర్వసస్యోపశోభితం సర్వమాన్యం.......పుత్రపౌత్రాదిభిర్భోగ్యం క్రమాదాచంద్రతారకం......'

ఈదానము సదాశివరాయల బావయైన అరవీటి రామరాజుతమ్ముడు తిరుమలరాయల కోరికపై జరిగినది. దానము తుంగభద్రానదీతీరమందలి విఠ్ఠలేశ్వరస్వామి సన్నిధిలో నీయబడినది. ఈఆచార్యులు వెంకటేశ్వరస్వామిభక్తుడు. వీరినిబట్టి ఆకాలమున నీయాచార్యులకు విజయనగరము ప్రభువుల కడ ఎట్టివలుకుబడియుండెనో తెలియగలదు. మామిడిపూడి వారు గంగవరమువారిలో లేరుగాని బందేపల్లివారున్నారు. నామధారులు ఆచార్యనామకులు. మామిడిపూడి వారే. బందేపల్లివారైనారుగాన వీరుగంగవరమువారితో 1650 కి తర్వాతచేరినట్లే. ఇట్లే హారితగోత్రమువారిలో సరస్వతి వారును, శింగరాజువారును ఉభయములలోనున్నారు. సుప్రసిద్ధపురాతత్త్వశాస్త్రజ్ఞులు ఆనూరి రంగసామి సరస్వతియనువారును, నెల్లూరినుప్రసిద్ధనటులు శ్రీ (బెంగుళూరు) సరస్వతి రంగస్వామయ్యంగారును వీరిలో చేరినవారే. పుదూరివారిలో వీరు ఊర్ధ్వపుండ్రముల నెప్పుడుదాల్చు చుండిరో తెలియదు. అల్లాడివారిలో నామధారులు క న బ డ రు గా ని వీరిలో చిలకయైన పూనివారు ఉభయులలో నున్నారు. పుదూరు పూనివారలకే మంత్రశాస్త్రవేత్తలగుటచే దయ్యాలవారనియు పేరు. ఇక మిగిలినవారిలో పాటూరు కలిశె వారలకు నామధారణముండినదోలేదో తెలియదు, గాని పాటూరివారి ఇలవేల్పు వీరరాఘవస్వామి. కలిశె వారికి వెంకటేశ్వరుడు. ఇక సొట్ట ఉడాల్యాదులును వైష్ణవసంబంధము గలవే వీరింగూర్చి హెచ్చుగా మున్ముందు చెప్పవలసియున్నది.

ఇంతవఱకు ఈ దొరికిన కొద్దిచారిత్రధారములతో చూచినంతలో పుదూరివారు స్మార్తులుగా ఎప్పటినుండి కంద్రమాణిక్యము నుండి ఏకాలమున పుదూరికివచ్చిచేరిరో తెలియలేదుగాని శ్రీకృష్ణదేవరాయాదుల కాలమునకు వీరందఱు శ్రీవైష్ణవాచార్యులుగా నుండి రాజాస్థానములలో పూజ్యులుగా నుండినది

మాత్రముస్పష్టము. ఆ తర్వాత కొంతకాలమునకు, వీరింకను వైష్ణవమును మానుకొనకముందే, కొందఱు గంగవరము వైష్ణవులుగా నేర్పడిరి. అటుతర్వాత నెప్పుడో అనగా క్రీ. శ. 1650 కి తర్వాత వీరందఱును చాలభేదించియుండవలెను. వైష్ణవ స్మార్తభేదము లేర్పడుటకు కారణము మా తాతగారు ఒకప్పుడు చెప్పినవృత్తాంతమును శ్రీమాన్ రామదాసయ్యంగారు నాకిట్లుతెలిపినారు. ఒకప్పుడు వెంకటగిరి దొరలయాజ్ఞచే బ్రాహ్మణసమారాధనమొకటి జరిగినదట. అట వంటవాండ్రు స్మార్తులు. రాజాశ్రితులైన కొందరు ఈవైష్ణవులలోనివారు అచటభోజనముచేసిరట. అంతటమిగిలినవారు వారిని వెలివేసిరట. వెలియైనవారు వెలిని లక్ష్యము చేయక తమ్ముసమర్థించుకొని స్వయమాచార్యులై తుదకు పుదూరువారుగా నిలిచిరట. ఇదియు పారంపరియేగాని ఒకటిమాత్రము సత్యము వైష్ణవులు స్మార్తులైరేగాని స్మార్తులు వైష్ణవులు కాలేదు; అట్లనుటకు సాక్ష్యము లేదు. స్మార్తులుగా నెంచకొన్న తర్వాతనే వెంకటగిరిరాజుల మైత్రి యేర్పడి కంద్ర మాణిక్యమువారితో సంబంధము కుదిరి ఈ కష్టప్రచారమునకు వచ్చినదేమోయని దోచుచున్నది. ఏలయనఁగా పుదూరు వారైన తర్వాతగూడ వైష్ణవము వీరిని పూర్తిగా వదలక నేటికిని కొంత అంటుకొని యుండుటయే నిదర్శనము.

పుదూరు ద్రావిడులవలెను గంగవరము వైష్ణవులవలెను తమిళము మాటలాడువారు వైష్ణవులు మఱికొందఱు గలరు. వారు ఉప్పూరు మంగలంపాడు అను శ్రోత్రియములవారు. ఈరెండు గ్రామములను నెల్లూరుజిల్లాలో సూళూరుపేటకు సమీపముననున్నవి. మంగలంపాడును క్రీ. శ. 1602-3 లో చంద్రగిరిరాజు మొదటి వెంకటరాయలు, ఆత్రేయ గోత్రుఁడును, అపస్తంబ సూత్రుఁడును, యజుశ్శాఖాధ్యాయియునైన, శ్రీరంగరాజార్య పౌత్ర జగన్నాథార్యపుత్ర శ్రీరంగ రాజార్యునికి దానమిచ్చినాఁడు. ఈయాచార్యుని వంశకర్త మహాపండితుఁడైన వేదాంతోదయనాచార్యులట. శ్రీరామానుజాచార్యులకు వంటచేసిపెట్టి సేవించుచుండెనట. ఈ వేదాంతోదయనాచార్యుల వంశములో జనించిన వారి హంసాంబువాహాచార్యులకు శిష్యులట కవి తార్కికసింహ బిరుదాంకితులైన వేదాంత దేశికులు. ఈదానము తిరుమలలో భగవత్సన్నిధానములో చేయఁబడినది. వేదాంతదేశికులు తమ మేనమామయైన రామానుజాచార్యులకడ చదివినారనియొకచరిత్రకలదు. బాల్యవిద్యముగిసి పెద్ద చదువులు వీరికడ చదివి నారేమో (N. D. I. Vol I శా. నెం. 6) మంగలంపాడునకు పోరూరు, జగన్నాథపురములని నామాంతరములు. చంద్రగిరి రాజ్యములో పడనాడులో నున్నదట ఉప్పూరుదాత ఆఱవరంగరాయలు. కాలము క్రీ. శ. 1647-8 శ్రీరామనవమినాడు. విలాసపురమను నామాంతరముగల ఉప్పూరు చంద్రగిరి రాజ్యమందలి, పోరూరుసీమలో, ఆత్రేయ గోత్ర, అపస్తంబసూత్ర, యజుశ్శాఖీయ కిడాంబి అనంతార్య పౌత్ర అనంతశయనార్యపుత్ర అనంతాచార్య వర్యునికి శ్రీరంగమందలి రంగనాథుని సన్నిధిలో దానమీయబడినది. (ఈ యుప్పూరుశాసనము(N. D. I. నెం7.) ఈ వైష్ణవుల చరిత్ర నాకింకను చక్కగా తెలియ

లేమగాని మాలో పునుగు (అత్రేయగోత్రము) వారికి ఈ యుహ్వారు మంగలంపాడు గ్రామాలతో సంబంధము కలదు. పునుగు మొదట పుళుహూగానుండి, ఆమాటకు తమిళమున అసత్యమని యర్థమగుటచే వీరు పునుగా మార్చుకొనిరట. కాని అట్టియింటిపేరేర్పడియుండునా అందును తమిళము గృహభాషగా గలవారిలో? అదేదోవేఱుపదమైయుండును. సూళూరుపేట, తుమ్మూరులో (నాయుడుపేట) కరియ మాణిక్యస్వామి దేవాలయములో దొరకిన యొక శాసనమున (N.D. I. Vol Sulurpet A. D. 1513 - 14) పొనగైనాడని యొకప్రదేశము కనఁబడుచున్నది. ఈనాటి లోని పులియూరు దేవుని కీయబడినది. శాసనప్రకాశకులు దీనికె పొలిగై? అని ప్రశ్నార్థక చిహ్నము ముద్రించినారు. ఈ 'పొలిగై' యే పులుగై, పునుగై యుండునేమో పరిశోధింపఁదగినది. ఈ ప్రదేశమంతయు పుదూరు చుట్టుపట్లనేగదా యున్నది.

ఈవిధముగా 'కవితార్కిక కేసరి' బిరుదాంకితులైన వేదాంత దేశికులకు గురువులుగా నుండినవారు మనమండలమందుండిరనుటయే మనకెంతో ఉత్కర్ష నాపాదించుచున్నది. ఇట్టి మహనీయుల పరంపరలో వచ్చినవారే పుదూరు ద్రావిడులు, ఇంకను కొంత లోతునకుపోయినచో వైష్ణవ మతప్రవక్తలైన మహనీయులు నాథముని ఆళవందారు రామానుజాచార్యులుకూడ పుదూరివారి పూర్వులాయనుట కవకాశము గలుగుచున్నది. ఇదివరలో చెప్పక వదలిన సొట్టి, ఉడాల్యాది, ఇంటిపేళ్ల ఇందులకు సహాయపడుచున్నవి. వీరిలో కాలక్రమమునందు నాథముని చాలప్రాచీనులు. తర్వాత ఆళవందారు ఆతర్వాత రామానుజాచార్యులు గనుక వీరి చరిత్రకే పోవలెను. తాని రామానుజ శిష్యులును అమత ప్రవక్తలలో నొక్కరు నయిన పుడాలి వరదరాజపండితుల చరిత్రచే చాల నూతనవిషయము తెలియగలదు.

శ్రీ మద్రామాయణ ప్రథమ దాక్షిణాత్య (సంస్కృత) వ్యాఖ్యాత ఉడాలి వరదరాజపండితుఁడనియు నాతఁడు పుదూరుద్రావిడనియు పరిశోధించి శ్రీ డాక్టరు రాఘవన్ మద్రాసు విశ్వవిద్యాలయములో సంస్కృత మహోపాధ్యాయులు చాలకాలము క్రిందట ప్రకటించినారు. (Annals of Oriental Research Vol. II Part 2) అందలి సారాంశమును నేను సంగ్రహముగా 1945 జూన్ భారతిలో ప్రకటించియుంటిని. దానినుండి రెండు మాటలుదాహరింతును. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథ భాండాగారమున ఉడాలి వరదరాజ పండిత రామాయణ వివేకతిలక వ్యాఖ్య యొకటి బాలకాండకు మాత్రము దొరకినది. దాని సర్గాంత గద్యలో "ఇతి ప్రథమాత్రేయ. గోత్రిణా ఉడాలి కుల తిలకసంభవేన వరదరాజేన చోలపణ్డిత బ్రహ్మమహారాజా పరనామ్నా విరచితే వివేకతిలకనామ్ని రామాయణవ్యాఖ్యానే బాలకాణ్డస్య ప్రథమ సర్గవ్యాఖ్యానమ్" అని కలదు. దీనిని చూచి, శ్రమవడి శ్రీ రాఘవన్‌గారు వెదకి ఈ వ్యాఖ్యను ఇదా ఱు భాండాగారముల నుండి కొంత కొంతగా లాగి సంపూర్ణముగా సంపాదించిరి. ఈతని కాలమును నాడ క్రీ. శ. 1250 ప్రాంతమని నిర్ణయించినారు. ఈ యుడాలిని రామా

యణ వ్యాఖ్యాతయైన గోవిందరాజ పండితుఁడే గాక ప్రాచీనులైన పిళ్లై లోకాచార్యులును, జీయర్ అనువారును ప్రశంసించి ఉదాహరించియున్నారట.

ఈ యుడాలి వరదరాజ పండితుఁడు రామాయణ వ్యాఖ్యాతలలో ప్రాచీనతముఁడు ఈతని వ్యాఖ్యయే తర్వాతి వారికి మార్గదర్శకమైనది. ఈవ్యాఖ్యను రచించుటకు తాను నాగరాది లిపుల ప్రతులను కూడ పరిశోధించి శ్రమపడి సమ్యక్పాఠ నిర్ణయ మొనరించిన ట్లితఁడు చెప్పుకొన్నాఁడు.

'నాగరాదిషు వర్ణేషు నాత్యన్తనిపు
ణైర్నరైః ।
ఖణ్ణనే స్ఖలితః పాఠః పారంపర్యేణ
లిఖ్యతే,
అతోఽత్ర సమ్యక్పాఠశ్చ తత్ర
తత్ర ప్రదర్శ్యతే,
బహుదేశసమానీత బహుకోశ
పరీక్షణాత్ ॥

ఇప్పటికిని ఉడాలివారి యిండ్లలో వరదరాజనుపేరు ఎక్కువ. వీరికి నరసింహస్వామి ఇలువేల్పు. ఉడాలివారే వావిళ్లేత్యాదివారైరి. శ్రీదండిగుంట సూర్యనారాయణశాస్త్రిగారు ఉడాలివారు. మాతాతగారు ఉడాలివారి దౌహిత్రులు.

శ్రీమద్రామానుజాచార్యులవారు ఆసూరికేశవాచార్యులవారి కుమారులు. వీరిది శ్రీపెరుంబూదూరు. ఈ కేశవాచార్యులు వైష్ణవులుగారు. నిరంతరము యజ్ఞయాగాదులు చేయుచుండి సర్వక్రతు సోమయాజులని ప్రసిద్ధినందియుండిరట. వీరిది హారీత గోత్ర యజుశ్శాఖ, అపస్తంబ సూత్రము. గంగవరములోని సరస్వతివారిలో అసూరు కనఁబడుచున్నది గోత్రమదే. ఇంకను వైష్ణవాచార్య పరంపరలో రామానుజులముందరి యాచార్యులు యామునాచార్యులనంబడు ఆళవందారు. వీరి సొట్టకులము, అనఁగా అది వారి యింటిపేరు. శఠమర్షణ గోత్రము వలన వచ్చినది. వైష్ణవ గురుపరంపరా ప్రభావములో చాల చోట్ల వీరిని 'సొట్టైకులత్తార్' అని చెప్పియున్నారు. వీరు గొప్ప వైష్ణవ గురువులైన నాథమునికి పౌత్రులు. వీరికి యుత్కర్ష అవైష్ణవ గ్రంథములను చదివిన అర్థమగును. ఈ 'సొట్ట' ఇంటిపేరుగా పుదూరుద్రావిడులలో నుండి ఇటీవలనే అంతరించిపోయినది. శ్రీ అల్లాడి కృష్ణస్వామి అయ్యంగారి అక్కగారు సొట్టివారి యింటికోడలు. వీరికి సంతానము లేనందున ఆయింటిపేరు అంతరించి పోయినది. యామునాచార్యుల జననము క్రీ. శ. 953 మధురలో. వీరి తాతగారైన నాథమునుల కాలము క్రీ.శ. 900 సుమారుగా గ్రహింపవచ్చును.

ఇంతవఱకు దొరికిన యాధారముల చర్చచేత పుదూరు ద్రావిడులయు గంగవరాది వైష్ణవులయు పూర్వులు వైష్ణవ మతస్థాపకులును మతోద్ధారకులును నైయుండిన మహనీయులేగాని ఇతరులు కారనియు కాలక్రమమున, 'స్వయమాచార్య పురుషః' అన్నట్లు పండితులుగాన తమ కుచితమని తోచినరీతిని ప్రవర్తించిరనియు గ్రహింపవలసియున్నది. తొలుత ద్రవిడ దేశములో నుండి రామానుజుల యనంతరము కొందరు తిరుపతిలో నిలిచి క్రమముగా ప్రభువుల యండ సంపాదించుకొని నెల్లూరు సీమలో వ్యాపించినట్లున్నారు. కొందఱింకను చాల

దూరము తెలంగాణము వఱకును, మరి కొందఱు రాజపుత్రస్థానము వఱకును కూడ పోయినజాడలు కనఁబడు చున్నవి. ఉదా. అల్లాడివారిలో మన మెఱింగిన వఱకు ఆత్రేయ గోత్రమువారు కానరారు. కాని మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమందు ఆత్రేయగోత్రజులు అల్లాడి రామచంద్ర శాస్త్రిగారి 'సిద్ధాంత శిరోమణి ప్రకాశ' మను ముద్రితాంధ్ర గ్రంథము దొరికినది. (దీనిని నాకుఁదెలిపినవారు మావేదములక్ష్మి నారాయణశాస్త్రిగారు) ఈ గ్రంథమందు హిందువుల గణిత శాస్త్రజ్ఞానమును పాశ్చాత్యుల సిద్ధాంతములతో పోల్చి తెలుపుచు మనవారుకూడ వెనుకంజవేసి జ్ఞానహీనులుగా నుండినవారు కారని నిరూపించి యున్నారు. వీరు సుబ్బాజీ లక్ష్మమ్మల పుత్రులట. 'లాన్సిలట్ విల్కినసన్ ఇనకోయరు' అను నాంగ్లేయుఁడు ఉత్తరహిందూస్థానములో 'చంద్రపురము'(?) మొదలైన ప్రదేశములు ఏలెగిరి. దొరవారి 'యాజ్ఞచొప్పున యథామతి సిద్ధాంత శిరోమణి ప్రకాశమనే ప్రబంధము ప్రథమం మహారాష్ట్ర భాషలో వ్రాసి వారికి నజరుచేస్తిని. అది బొంబాయిలో చాపించి కాశీ అవంతి సాగరానాగపురం పూనా కలకత్తా బొంబాయి లార్డుసాహెబుల వద్దకి సంస్థానీకుల వద్దకి పండితులవద్దకి పంపించినారు........తదనంతరం ఆంధ్రభాషన వ్రాయమని అజ్ఞచేస్తే సాంప్రతంవ్రాసినాను'' అని ఉపోద్ఘాతములో వ్రాసియున్నారు. దీనితారీఖు క్రీ. శ. 18౬౧. వరంగల్లుజిల్లా శాయంపేటలోని యొక శాసనమున Corpus of Insc. No.19 WG. 18 ప్రతిగ్రహీతలలో ఆత్రేయ సగోత్రము అల్లాడయ్య యను వారిపేరున్నది. ఈశాసనము రేచెర్ల ధర్మారావుగారిది. తారీకు 1460 క్రీ. శ. అల్లాడివారి యింటిపేరును గురించి యొకమాట చెప్పవలయును. ఆంధ్ర దేశములో బ్రాహ్మణేతరులలో అల్లాడి లేక అల్లాడ వారుగలరు. రెడ్డిరాజులలో నుండిరి. హెచ్చుగా వైష్ణవులు. ఇది తోఁచియేకాఁబోలు ఒంగోలు వెంకటరంగయ్యగారు (త్రిలిఙ్గలో) ఇట్లు వ్రాసియుండిరి......'అయితే వీరిలో 'అల్లాడివారు' 'శింగరాజువారు' అను ఇండ్ల పేళ్ళుండటంబట్టి బహుశః అల్లాడ రెడ్డిరాజుగారియొక్కయు శింగరాజుగారి యొక్కయు ఆశ్రయము వీరిలో కొందఱికి లభించియుండునను అనుమేయమునకు అవకాశము కలుగుచున్నది.' కంచి వరదరాజస్వామికి అరుళాళ పెరుమాళ్ అనుపేరుగలదు. 'అరుళ్' అనఁగా దయ. దయచే పాలించుదేవుడని యర్థము. అది క్రమముగా, 'అరుళాళ, అల్లాళ అల్లాడ-అల్లాడిగా మాఱియుండునని తోఁచుచున్నది. ఇందఱు వైష్ణవుల నడుమ అరుళాళ పెరుమాళ్ భక్తులు ఉండి క్రమముగా పెరుమాళ్ (వెంకటేశ) భక్తులగుటలో నాశ్చర్యమేమియు లేదు. సింగరాజువారు కూడ రాజాశ్రయముచేత ఆ యింటిపేరును పొందియుందురు. నియోగులలోను సింగరాజువా రున్నారుగాని భిన్నగోత్రజులు. కాఁబట్టి రాజుపేరు వారియింటిపేరై యుండుననుట సుసంభవమే.

చంద్రగిరిరాజుల ప్రాభవము అంతరించిన వెనుక వీరికి వెంకటగిరి వెలమదొరలయొక్కయు, కొండవీటి రెడ్డిరాజులయు ప్రాపు దొరకియుండును. నిదర్శనము అల్లాడి, చదలువాడావులు. దాదాపు రెండువందల

గ్రామములకు వీరు వ్యాపించినట్లు చెప్పుకొందురు. ఈ నడిమికాలములో వైష్ణవ మతములో మార్పులువచ్చినవి. మంగలంపాటిలో చదువుకొన్న వేదాంత దేశికులు మొదట కొంతమార్చిరి. వారిని కొందఱు అనుసరించిరి. అందుచేతనే గంగవరము వారిలోను పుదూరివారిలోను వడగల తెంగల నామములు ఏర్పడినవి. ఆతర్వాత ఆచార్యులలో నెవరి ప్రభావమెట్టిదోకాని తత్కాలున కొందఱు వైష్ణవమును వీడి స్మార్తులైరి. ఉదాహరణము మా మూలపురుషులైన తిరుపతి తిరుమలాచార్యులవారి సంతతివారు యజ్ఞమొనరించి స్మార్తపద్ధతుల ననుసరించిరి. బంధువులు వీరిని వదలలేక కొందఱు మాఱిరి. అట్లును కొందఱు పూర్వ వైష్ణవాభిమానమును నామధారములో మాత్రము కాపాడుకొనుచుండిరి. ఈ వైష్ణవసంబంధముచే కాఁబోలు పుదూరివారు శ్రీ శంకరాచార్యపీఠము వారికి గౌరవమిచ్చి ప్రణామాచరించినను తమకు గురువుగా నంగీకరింపరు. వీరికి గురువేలేఁడు ఒకప్పుడు శ్రీ శంకరాచార్యుల పరంపరలోని వారొకరు తమ గ్రామమునకు మధ్యాహ్నము దాఁటినవెనుక, భోజనానంతరము రాఁగా వీరాతిథ్య మీయలేదనియు, అందులకు వారాక్షేపింపగా, వీరు భోజనాత్పూర్వము వచ్చినవారికే ఆగౌరవమనియు, తర్వాత వచ్చినవారు తామే అడిగి పెట్టించుకొనవలెననియు వీరుబదులుచెప్పఁగా శంకరాచార్యులవారు కోపగించి శపించి వెడలిపోయిరని యొకకథకలదు. ఆతర్వాత గ్రామములోనివారు ఈవిషయమై వివాదపడి కొందఱు లేచివచ్చి పుదూరులోచేరిరనియు కొందఱు మొదటిచోటనే నిలిచిరనియు, ఇట్లు వెడలివచ్చినయూరు కంధమాణిక్యమనియు కూడ చెప్పుచున్నారు. ఇందులకు నిదర్శనము వీరు చెప్పునదేమనగా-ఆయూరిలో అమ్మవారి మట్టి విగ్రహమును పూజించుచుండిరట. తగవులాటలో తలపుదూరి వారికివచ్చినదట. దీనికి శరీరమును నిర్మించి ప్రతిసంవత్సరమును పూజ చేయుచుండిరట. అదే బొట్టిబొమ్మ జాతరయట. ఈకథలో వ్యత్యాసములు కూడ కలవు. నోటిమాటలలో మాఱియుండవచ్చును. ఇవెంతవఱకు విశ్వసనీయములోగాని వైష్ణవసంబంధపు బలిమినిబట్టి అనంతర పశ్చాత్కల్పితమని తోఁచుచున్నది.



మఱియొక ముఖ్యాంశము చెప్పవలసినదేదనగాపుదూరువారిది తమిళభాషవీరందఱును నేడు తమతమిళము తెనుఁగు సంపర్కముచే చెడిపోయినదని తలంచి, తమిళుల యెదుట మాటలాడుటకు సిగ్గుపడి మదరాసు తమిళము పరిశుద్ధమని భ్రమపడి వచ్చియు రాని అనుకరణము ప్రారంభింతురు పొరపాటు మదరాసుతమిళము అపరిశుద్ధము కలితి. పుదూరు గంగవరము మంగలంపాటి వారల తమిళములో ప్రాచీనతమిళవాఙ్మయపుఛాయలున్నవి. పదములు పరిశుద్ధములు. కొన్నిపదములు ప్రాచీనసంగం వాఙ్మయములోతప్పకానరావు. కొన్నిప్రాకృత పదములు. వీరిప్రయోగములుకొన్ని మధుర రామనాథము జిల్లాలలోనేడుచూడవచ్చును. కొందరు పాలఘాటుబ్రాహ్మణుల యుచ్చారణ పుదూరివారియుచ్చారణను పోలియుండును. ఉదా. ఒక్కపదముమాత్రమే.త్వరగా

అనుటకు మనవారు 'శ్రమం' 'శురుక్కై' అనరు. 'ఈణం' అందురు. 'ఈణంవా' ఈపదము ప్రాకృతకావ్యములలోను అతి ప్రాచీన తమిళ వాఙ్మయములోనుకలదు. ఇరా (ఉండరు) వారా (రారు) తారా (ఈయరు) పోహా (పోరు) ఇత్యాది ధాతు రూపములు నేడు ఇరుక్కమాట్టా, వర మాట్టా, తరమాట్టా, పోహమాట్టా అని మఱియొకపదమును కలుపుకొనుచున్నవి. ప్రాచీనతమిళములో నిది లేదు. ఇరు + ఆ, అని నఞ్ చేరి ధాతువే కొద్దిగామాఱుచున్నది. అన్నిటికన్న మిన్న నెల్లూరిలోని రెడ్లను వీరు (గంగవరము వారుకూడ). తమలో 'వళ్లాయన్' అందురు. ఇది చాలమర్యాదను తెలుపును తమిళదేశములో ఉత్తమ జాతి కృషీవలులను 'వెళ్లాళన్' అందురు. ఈవెళ్లాళపిళ్లెలు మదరాసులో మనకు క్రొత్తగాదు. కొలఁతలుకూడ వీరు తమిళములోనే చెప్పుకొందురు. ఉదా: కురుణి (కుంచము) మొదలైనవి. ప్రాచీనతమిళభాషను పరిశోధింపఁగోరువారి. వీరు గనివంటివారు. నాటి భాష వీరికడ నేటికిని సజీవమై యున్నది.

పుదూరుద్రావిడుల యర్వాచీన చరిత్రయు వారి పూర్వపాండిత్యాదులకు తగియే యున్నది. శ్రీపదలువాడ సుందరరామ శాస్త్రిగారు 1920లో నిట్లుపన్యసించి యున్నారు. 'ఇఁక మనవారు పుదూరను నగ్రహారమునఁజేరి పుదూరు ద్రావిడులను క్రొత్తబ్రాహ్మణశాఖగా నేర్పడినతరువాత నేతద్దేశజులగు నాంధ్రబ్రాహ్మణులమధ్య నెట్టియౌన్నత్యమును పొందియుండిరో మనము పరిశీలించి యాస్వాదింతము. అభివృద్ధిని బొందఁగోరువారు దమదమ పూర్వుల యౌన్నత్యమును విచారించి యెఱుంగవలెను. ఆకాలమునందలి యాచారమును విచారింపఁగా నీ యాంధ్రదేశమునందును బ్రాయికముగ నప్పుడధ్యయన సంపన్నులుకాని బ్రాహ్మణు లరుదుగ నుండి యుందురని యెంచవచ్చును. ......అసంఖ్యులగు నాంధ్రబ్రాహ్మణులు వీరియొద్ద విద్యార్థులైయుండిరి. వివిధశాస్త్రములయందు వీరిపాండిత్య మసమానమై యుండుటయేకాక ముఖ్యముగ వేదములయందు వీరివైదుష్య మెల్ల మహాబ్రాహ్మణబృందముచేతను బ్రభువర్యులచేతను బ్రశస్యమానమై యుండెను. పునహారాజధానియందు శ్రీమంతుని విద్వత్సభలోఁ బండితులనుబరీక్షించి వారలకు సంభావనలిచ్చు సమయములందుఁ బుదూరు ద్రావిడబ్రాహ్మణు లనఁగనే వారికి వేదము నందుఁబరీక్షసేయకయే యుత్తమసంభావన లిచ్చు సంప్రదాయముండె. పుదూరు ద్రావిడ బ్రాహ్మణులందరును సామాన్యముగ వేదమునందు నత్యంతనిష్ణాతులై యుండుట పరీక్షించి పరీక్షించి ప్రసిద్ధముగా నెఱింగి యున్న విషయము. కావున శ్రీమంతులవారు సౌకర్యార్థ మట్టియేర్పాటు గావించిరి. ఇంతకన్నను మనవారి వేదాధ్యయనసంపన్నతకు వేఱుతార్కాణకావలయునా? మఱియు వేద శ్రౌతవిద్యలందు నిరుపమమగు వైశారద్యము గలవారగుటవలన గొన్నికుటుంబములవారు వేదశబ్దమునే గృహనామముగాఁ బ్రాపించిరి. రెండువందల యేడ్లకుమున్ను పదలువాడ సహస్రనామభట్టులనువాడును కొడవలూరు వాజపేయులనువారును నద్భుతంబగు విద్యాతపోమహిమల వెలయుచుండిరి

పురాణములందు వినఁబడు మహర్షుల మహిమలను వారియందుఁ బ్రత్యక్షముగాఁ జూచి యనేకులు ప్రభువులు వారికిఁబెక్కు గ్రామములు సమర్పించిరి. వారి ప్రభావముల నిక్కడ వక్కాణింపఁ బూనినయెడ బహుగ్రంథవిస్తరమగును. మనవినికికి గోచరమైన కాలమునందును పెక్కండ్రు మహావిద్వాంసులను మనము గణియింపవచ్చును. అల్లాడివారికి మూలపురుషుడైన అల్లాడిభట్టులను పండితోత్తముల పాండిత్యప్రభావము ఈ క్రిందిశ్లోకముచే విశదమగును.

శ్లో॥ పరమాణుకవే రగ్రే పండితాః
పరమాణవః
పురతోల్లాడి భట్టస్య పరమాణు
రణోరణుః॥

పరమాణువను మహాకవి యొకడుండెనఁట. అతనియెదుటఁ బండితులందఱును పరమాణువులు అనఁగా పరాజయము నొందెడివారు. అల్లాడిభట్టులసమ్ముఖమున నాపరమాణుకవి యణువుకన్నను అణువయ్యెను, అనఁగా నత్యంతము పరాజయము నొందెను అని శ్లోకార్థము.

“విరూరుగ్రామమునఁ గౌడవలూరు పట్టాభిరామశాస్త్రులవా రుండిరి. వారు వేదశాస్త్రపారంగతులు. చెన్నపురి మహోన్నతన్యాయస్థానమున మహాపండితపదవి నలంకరించిరి. వీరు తర్కశాస్త్రవాదమునఁ దర్కాలంకార వాగీశ బిరుదాంచితులును, దినకరభట్టీయ వ్యాఖ్యాతలును నగు రామరుద్రభట్టాచార్యులను జయించి వారివలన మెప్పువడసినట్లు వినుచున్నాము. వీరు తర్కసంగ్రహనిరుక్తి, ముక్తావళీసుంబాష, తర్కవాదము, తర్కసంగ్రహటిప్పణి మొదలగు పెక్కుగ్రంథములనుఁ బ్రథమపాఠగ్రంథముమొదలు ఉద్గ్రంథములవఱకుఁ దర్కశాస్త్రమునందు రచించియున్నారు. ఈ యుదాహరించిన గ్రంథములను నేనుఁజూచియున్నాను. ఇవిగాక వేదలక్షణమునందును సాంప్రఛందస్సునందును సంగ్రహగ్రంథములు రచించినట్లు వినుచున్నాము. ఇవిగాక వీరు రచియించినవి గేయములగు మనోహరగీతము లనేకములు స్త్రీలు గానముసేయఁగా వినియున్నాను. (వీరేవేదం పట్టాభిరామశాస్త్రులవారు. విరూరివేదమువారు. భారద్వాజగోత్రము. వీరి చరిత్రను చాల సంగ్రహముగా శ్రీని. వేంకటరావుగారు తెలుగుసంస్కృతి సంపుటములో వ్రాసియున్నారు. ఈ శాస్త్రిగారు మా చినతాతగారైన వేదము వేంకటాచలయ్యగారి భార్య శాంభవమ్మగారి తండ్రికితండ్రియని జ్ఞాపకము. “ఆ కాలమున కుంపిణీప్రభుత్వమువారు తాము1812 లో నెలకొల్పిన ఫోర్టుసెంటుజార్జి కళాశాలలో ప్రధానాంధ్ర పండితునిగ నియమించిరి. అతఁడా పనియందు ఎనిమిదేండ్లుండి 1820 లో కీర్తిశేషుడయ్యెను......తెనుగుధాతుమాలనువ్రాసిరి. అది పొరపాటున చిన్నయసూరికృతముగా ముద్రితమైనది.... పద్యాంధ్రవ్యాకరణమును పట్టాభిరామపండితీయమనుపేర ఆంధ్రశబ్దచింతామణికి ఒకపెద్ద వ్యాఖ్యానమును ... తిరుక్కురళ్ లోని కొన్ని తమిళపద్యములకు సంస్కృతానువాదము గావించిరి. ఇంగ్లీషువారి పరిపాలన ప్రారంభమున పేరెన్నికగన్నపండితులలో పట్టాభిరామశాస్త్రిగారు ప్రథమగణ్యులు”
వే. వేం.)

,, వేంకటగిరిప్రాంతమునఁ గొంట్టు గుంట శంకరశాస్త్రులవారు సర్వతంత్ర స్వతంత్రులుండిరి. అల్లూరు గ్రామమున వేదము సీతారామసోమయాజులవారు (బక్క వేదము) వేదశ్రౌతవిద్యలందు మహాప్రాజ్ఞులై తపోబలసంపన్నులై యల్లూరి యాంధ్ర బ్రాహ్మణ మహాసభలయందు నగ్రసంభావనాగౌరవము వడసిరి. ఈ గౌరవము వారి వంశమువారి కిప్పటికిని జరుగుచున్నవి. నెల్లూరుప్రాంతమున నుండిన కొడవలూరి అప్పన్నశాస్త్రులవారును, అయ్యవశాస్త్రులవారును వేదశాస్త్రవైదుష్యమునం దెంతయు గణనీయులు. తత్సమకాలమునఁ బాపు యప్పన్న సోమయాజులు మొదలగువారు వేదశ్రౌతవిద్యాప్రవీణు లనేకులు గణశాస్త్రులుండిరి. కోటవెంకనపాళెమున మా జ్యేష్ఠ పితామహులు చదలవాడ సూర్యరామ శాస్త్రులువారనెడివా రాప్రాంతమునం దనేకులకు విద్యాగురువై వెలయుచుండిరి. వారి యొద్ద నేకకాలమున నరువండ్రు విద్యార్థులు కావ్యనాటకాదిసాహిత్యపాఠములు చదువుచుండినట్లు తెలియుచున్నది. దూరదేశముల నుండియు ననేకులు బత్యములుకొని తెచ్చి యుంచుకొని వీరియొద్దఁ జదువుచుండిరఁట. ఒకవృద్ధవైష్ణవాచార్యులు కృష్ణాజిల్లా కాపురమువారు తానాదేశమునుండి యీ శాస్త్రులవారియొద్దఁ జదువుకొనినట్లు నాతోఁజెప్పియున్నారు. ఈ శాస్త్రులవారు సంస్కృతమునందు మాధవీయమను నిరువది సర్గలకావ్యమును, వసంతశేఖరమను చంపువును, ప్రబంధరాజమను నాటకమును రచించిరి. కొన్ని యాంధ్రప్రబంధములుకూడ రచియించినట్లు వినవచ్చుచున్నది. కాని యీ గ్రంథముల నన్నిటిని వారి దౌహిత్రుల ప్రమాదము క్రిమిసాత్కృతము గావించెను. ముప్పదియైదు సంవత్సరములక్రింద (1920-35=1885) వారి శిష్యులగు నేలటూరు రంగాచార్యులవారు ఆ గ్రంథములయం దొక్కొక్కదానియందును కంఠస్థములగు కొన్ని మనోహర శ్లోకములఁ జదువగా నేను వినియున్నాను.

,, పుదూరు గ్రామవాస్తవ్యులగు పుదూరు (చదలువాడ) సీతారామశాస్త్రులవారు చెన్నపట్టణమునఁ గొంతకాలము వాసముచేసి బ్రౌన్‌దొరగారియొద్ద ముఖ్యపండితులై సంస్కృతాంధ్ర గ్రంథములనేకముల బరిశీలించిరి. అమ్మహాపండితులే యమరసింహప్రణీతమైన నామలింగానుశాసన నిఘంటువునకుఁ దెనుఁగుటీక వ్రాసినవారు. (వీరే పెద్దబాలశిక్షయను నద్భుత బాలశిక్షాత్మక గ్రంథమును వ్రాసినవారు. ఆంధ్రదేశమందు కొన్నికోట్లప్రతులు ముద్రితమైన పుస్తకమిది. దీవినెఱుఁగని యాంధ్రుడులేఁడు) వారికి సంస్కృతాంధ్రములయం దవ్యుత్పన్నమగు శబ్దము లేకుండెనని తత్పరిచయభాగ్యముగల దంపూరు వెంకటసుబ్బాశాస్త్రిప్రభృతులు చెప్పుట స్తుతిగాదని తదీయ నిఘంటుటీకయే తెలుపుచున్నది. మఱియు నాకాలమునఁ జెన్నపట్టణమునందు బురాణము కృష్ణశాస్త్రులవారు, పురాణము హయగ్రీవశాస్త్రులవారు అనుసోదరులుండిరి పురాణము కృష్ణశాస్త్రులవారు తర్కవేదాంతనిష్ణాతులై సన్న్యసించి యనేకులు సన్న్యాసులకు నాచార్యులై యొప్పిరి. పురాణము

హయగ్రీవ శాస్త్రులవారు ప్రెసిడెన్సి కాలేజి యాంధ్రపండిత పదవి నధిష్ఠించిరి. (వీరు చిన్నయ సూరికి సమకాలికులు) వీరే చెన్నపురిని మన హిందూ జనులలో మొట్టమొదట ముద్రాక్షరశాల నుంచినవారై సంస్కృతము నందును నాంధ్రమందును భారత రామాయణ భాగవతాది మహాగ్రంథముల ననేకములను, బరిశీలించి ముద్రించి ప్రకటించిరి. మహాజనులకు ముద్రిత స్పష్టాక్షరములను జదువు భాగ్యము కలిగించి మనోనయనానందము నొసంగిన ప్రథమపురుషులు.

మామిడిపూడి రామకృష్ణమాచార్యుల వారు పురిణి అను గ్రామము నధివసించి యుండిరి. వారు వేద వేదార్థ పరిజ్ఞానమునం దద్వితీయులని పండితులు పెక్కండ్రిప్పటికిని ప్రశంసించుచున్నారు. చదలువాడ సీతారామ శాస్త్రులనెడి వారు ప్రెసిడెన్సి కాలేజి యాంధ్ర ప్రధానపండితులై యుండిరి. (వీరు మాతాతగారికి మద్రాసు నార్మలుస్కూలులో చదువునప్పుడు గురువు అప్పుడు అచ్చట వీరును బహుజనపల్లి సీతారామాచార్యుల వారును ఉపాధ్యాయులు, తత్పూర్వము వీరు మదరాసు ముత్యాలపేట హైస్కూలు సంస్కృతాంధ్ర ప్రథమ పాఠశాలగా ప్రారంభింపఁబడిన కాలమున (1847) అచ్చట ఆంధ్రోపాధ్యాయులు. అప్పుడచ్చట మాముత్తాతవేదము వేంకటరమణ శాస్త్రిగారు సంస్కృతోపాధ్యాయులును. ప్రధానోపాధ్యాయులును బ. సీ. ఆచార్యులుగారును నుండిరి.) సంస్కృతాంధ్ర సారస్వతములయందు వారి సాహిత్యము నిస్సమానము. వారియొద్ద విద్యాభ్యాసము చేసినవా రిప్పుడు ననేకులు గలరు. (వీరు రచించిన గ్రంథము లనేకములు వావిళ్ళవారు ముద్రించియున్నారు.) వారి తమ్ములు చదలువాడ అనంతరామ శాస్త్రులవారి తర్కవేదాంత శాస్త్రములయందలి ప్రతిభావిశేష మాంధ్ర ద్రావిడ దేశమందంతటను సుప్రసిద్ధము. (వీరికి చిన్నాయన శాస్త్రియనియు వీరియన్నగారికి పెదనాయన శాస్త్రియనియు బంధువులలో పేరు. వా రవసానదశయందు సన్న్యసించి బ్రహ్మైక్యతా రసానుభవైకతానులై బ్రహ్మీభూతులైరి. వారు దీర్ఘాయువులుగ కున్నను. ఈదేశమున నలువదియేండ్లకు మిగిలిన వయసు గలిగిన వారిలో నితరజాతులలో నయితము వారి మహిమ నెఱుంగని వారు లేరు. వేదము వేంకట రమణశాస్త్రుల వారు వేదశాస్త్రములందును సంస్కృతాంధ్ర సాహిత్యములయందును నసమాన వైదుష్యముగలవారు. (వీరు మా ముత్తాతగారు. వీరిని గురించి మాతాతగారి జీవిత చరిత్రమందు వ్రాసియున్నాను) వారు చిరకాలము గోదావరి విశాఖపట్టణము జిల్లాలయందు రాజకీయ కళాశాలలలో సంస్కృతాంధ్ర పండితపదము నలంకరించి పెక్కండ్రు విద్యార్థులఁ గృతార్థులంగావించి విఖ్యాతిం గాంచిరి. ఇప్పుడు మన బంధువర్గములయందెల్లను శిరోమణి భూతులై తనరారుచున్న మహోపాధ్యాయ బిరుదాంకితులగు బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయ శాస్త్రులవారు వారి కుమారుల నుటకు నెంతయు సంతోషించుచున్నారు.

"మరియు నస్మచ్ఛ్వశురపాదులగు

వావిళ్ళ రామస్వామిశాస్త్రులవారి నిక్కడి వారిలో లనేకు లెఱింగియుందురు. వారు వేదశాస్త్రపారదృశ్వులై యాదిసరస్వతీనిలయ మను ముద్రాక్షరశాలకు స్వాములై పరాశర మాధవీయాది ధర్మశాస్త్ర గ్రంధములను కావ్యనాటకాది బహువిధ సంస్కృతాంధ్ర గ్రంథములను, ముద్రాక్షరాంకితములు గావించి యాంధ్రద్రావిడదేశములకు మహో పకారముఁ గావించిరి. వైదిక, వైదికశిష్టా చారమునందును తదేకతానులయందును, వారికింగల శుభమైన యభిసంధియు, నభి మానమును, ఆదరమును స్మరించినవారు గూడ శ్రేయోభాజనము లగుదురు. మఱి యును వేదశ్రౌతనిష్ణాతులు దండిగుంట గ్రామమునందు ఉడాలికృష్ణోపాధ్యాయుల వారు మొదలగువారును, ఆముదాలపాడు నందుఁ గొండగుంట భాస్కరశాస్త్రులవారు మొదలగువారును. పుదూరుగ్రామమునందు దిమ్మావజ్ఝల కోదండరామశాస్త్రులవారు అల్లాడిరామబ్రహ్మశాస్త్రులవారు మొదలగు వారును, శ్రీకాళహస్తియందు పూనె మహాదేవ శాస్త్రులవారు సరస్వతి రామస్వామిశాస్త్రుల వారు మొదలగువారును ననేకులు ప్రశం సార్హులుండిరి,

"మితాదారులగు శేషగిరిశాస్త్రులు యమ్. యే. గారు ప్రెసిడెన్సీకాలేజియందు సంస్కృతమహోపాధ్యాయ పదమునొంది సంస్కృతాంధ్రద్రావిడాది వివిధ భారత భాషలయందును, నాంగ్లేయాది నానావిధై రోపీయభాషలయందును, భాషాతత్త్వబోధక ములగు బహుగ్రంధముల రచియించి వినుతి గాంచిరి. (వీరు నాకుమాతామహులు. పది నెనిమిది భాషలలో పండితులేగాక సంగీత శాస్త్రమభ్యసించి 'వీణాగానకళానారద' లని ప్రసిద్ధినొందినవారు. సామగానమంద వారినిర్ణయమునకు తిరుగులేదని రైట్ ఆనరబుల్ వి. ఎస్. శ్రీనివాసశాస్త్రిగారొక ప్పుడు చెప్పియున్నారు. నేటికిని డాక్టర్ సి. పి. రామస్వామయ్యరుగారు వీరిని తమ గురువని ప్రశంసించుచుందురు వీరియాంధ్ర శబ్దతత్త్వము అందఱు ఎఱింగినదే. తమి ళములోను గ్రంథరచన చేసియున్నారు. వీరిసోదరులు టి. యమ్. వెంకటేశశాస్త్రి గారు సుప్రసిద్ధసంగీతవిద్వాంసులై వాగ్గేయ కారులై పాశ్చాత్యులనుగూడ మైలాపూరునకు తాముజరుపుచుండిన జనానాసంగీతపాఠ శాలకు ఆకర్షించుచుండిరి. వీరి వీణా (సంగీత) స్వయంబోధిని సుప్రసిద్ధగ్రంథము టి. ఎమ్. అనఁగా తాతవెళ్లి మితాదారులని యర్థము. మితాదారులు ఆదినములలో సేలముజిల్లాలో చిన్న జమీందారులవంటి వారు. అసలు ఇంటిపేరు పాకువారు, శ్రీవత్సగోత్రము.) ఇంకననేకులు నామె రుంగనివారు గణనీయులు మనవారిలో లేరని చెప్పవీలులేదు. ప్రస్తావవశమున నాకు శ్రవణగోచరులైనవారిని నేత్రగోచరు లైనవారినిఁ గొందరనిప్పుడు నా స్మృతికి విషయమైనవారి నుదాహరించితిని...... వర్తమానకాలమునందు నట్టి మహనీయుల సంఖ్య తఱచుగా తఱిఁగిపోవుచున్నను నిప్పు డును మనభాగ్యవశమున మనభావిశ్రేయ మునకు బీజభూతులైనవారు కొందరు లేక పోలేదు. మహోపాధ్యాయ బిరుదాంకితులగు వేదము వేంకటరాయశాస్త్రులవారి మహ త్త్వము మీరెంఱుంగనిదికాదు............

సంస్కృతాంధ్ర సాహిత్యప్రవక్తలనం ప్రసిద్ధినొందినవారు......ప్రకృతమునందు మనవా రనేకులు వేదమునందును సంస్కృత భాషయందును పరిశ్రమసేయుచున్నను నాం గ్లేయభాషయందు విద్యుల లగుచున్నారు. కొందఱు గొప్ప రాజకీయాధికారములం బొందుచున్నారు........."

నే నిదివరలో వ్రాసినట్లు శ్రీసుందర రామశాస్త్రిగారి యుపన్యాసము ఎప్పటను బొరకదుగానను, ప్రామాణికముగా నుండు ననియు నింతదూరము వారివ్రాత నుదాహ రించితిని. శ్రీసుందరరామశాస్త్రిగారును వేదశాస్త్రములయందును సంస్కృతాంధ్ర సాహిత్యమందును గొప్పపండితులు. వారి [illegible]వారు, మాతాతగారు, పురాణమువారు మొదలైనవారివలెనే వీరును చాకలిపేటలో శారదాంబావిలాస ముద్రణాలయముస్థాపించి యనేకగ్రంథములు ప్రకటించిరి. వీరి భగ వద్గీతవ్యాఖ్య జగద్విఖ్యాతము, నేటి వెంక టగిరి దొరగారు వీరికడ మంత్రోపదేశమును పొందినశిష్యులు. వేంకటగిరి సంస్థానము నాశ్రయించుకొనియుండిన వా రి లో మా వారు ఇంకను పలువురుగలరు. వీరిలో సరస్వతిశేషశాస్త్రిగారు సంస్కృతాంధ్రము లలో పండితులై వీ ణా వా ద కు లు లై మా మాతామహులు శ్రీ శేషగిరిశాస్త్రిగారికి వీణా గురువులై విరాజిల్లిరి. వారికుమారులు సరస్వతి సూర్యనారాయణ శాస్త్రిగారును కొంతఅట్టివారే. డాక్టరు నేలటూరు వెంకట రమణయ్య గారికి శ్వశురులు. ఇప్పటి వెంక టగిరి దొరవారి తాతగారు శ్రీ గోపాలకృష్ణ యాచేంద్రులవారు మాతాతగారిని ఆదరిం

చినవిధమును, తాతగారు [illegible] నాటకమును వారికి అంకితముగానిచ్చిరి జగత్ప్రసిద్ధవిషయము.

మా తాతగారిని గూర్చి [illegible] ఎక్కువగా నప్పుడు చెప్పవలసినదేమి. శ్రీవెంకటగిరివారే నాకు నెల్లూరి రెడ్డిరాజులు వీరిని అభిమానించి నేటికిని తమదగ్గరనే [illegible] చెప్పిన సుజనులనిరా [illegible] కానివారట ప్రత్యక్షపడియున్నది. తాత గారిని ఆదరించిన రేబాలవారు, [illegible] వారు, గనుపాటివారు, [illegible]వారు, [illegible]వారు, వారిలందుమద్దయవారు ఆంధ్ర వాఙ్మయచరిత్రమున సంకీర్తనోషక మహా శయులలో గణనీయులైనారు. మా చిన్నతాత గారు దేవము వెంకటాచలయ్యగారు చరి త్రవిభాగంలో ప్రాంతీయములను సంపాదించి న్యాయవాదులుగా నుండుటనే వ్రాసినవారి [illegible] చరిత్రలో నెం[illegible]నారు. జన్మనుసంవిధము [illegible] వీరిని [illegible] పురాణయుగ చరిత్ర సంస్కృతమును [illegible] ఫల ఉదాహరించియున్నారు. వీరి [illegible] ములు' అనుగ్రంథము లండన్ [illegible] కల్ సొసైటీవారి మన్నన లందినది. [illegible] పతిలోనుండిన అల్లాడి [illegible] రును కొంత వీరిమార్గమును అనుసరించిన ట్లున్నారు.

మావారిలోనే వ్రాయుచునేనుంచరిత్ర ఇంకను చక్కగా నన్వేషించి పరిశోధింప వలసియున్నది. వీనుగు వీరాస్వామిగారి కాశీయాత్రాచరిత్రను మొదట ముద్రించి చినవారని ముఖపత్రముమీద పు దూ రి నారాయణశాస్త్రిగారి పేరున్నది. వీరేగా

మదరాసులో అచ్చు ప్రారంభమైనది మొదలు వీరు గ్రంథముద్రణకార్యములలో నిమగ్నులగుచుండిరి. తాండారి పాపన్న శాస్త్రులవారనువారు నానార్థ రత్నమాలకు వ్యాఖ్య వ్రాసిరి. దండిగుంట పట్టాభిరామ శాస్త్రిగారు కొన్ని గ్రంథములు ముద్రించి నట్లు తెలియుచున్నది. వీరివంశములోని వారే పండిగుంట సూర్యనారాయణ శాస్త్రిగారు, పదలువాడ సుందరరామ శాస్త్రిగారితో కలసి చాలాకాలము పాఠశాల కళాశాల పాఠ్యగ్రంథముల టీకాతాత్పర్యములు వ్రాయుచుండిరి. వీరుభయులును ఆంధ్రమహాభారతమును కొంతవరకు లఘుటీకతో ముద్రించియున్నారు. పందొమ్మిదవ శతాబ్దపు పండితులలో శ్రీ వేదము వేంకటాచలశాస్త్రిగారు, చిన్నయసూరిగారి సమకాలికులు, పచ్చయప్ప కళాశాలలో నాంధ్రపండితులుగా నుండిరి. స్కాట్లండు మిషనుకాలేజి (ఇప్పుడులేదు)లో శ్రీకోట వెంకటసుబ్బాశాస్త్రిగారుండిరి. వీరు మితాదార్ శేషగిరిశాస్త్రిగారికి బావమరదులు. మదరాసులోనే నేలటూరు వెంకటసుబ్బాశాస్త్రిగారని యొకరుండిరి. నేటివలెనే ఆదినములలో మావారనేకులు ఆంధ్రపండితులు అనేకులు ఒక్కొక్కరొక్కొక్క తెనుగు వ్యాకరణము వ్రాసినవారుగలరు. మాముత్తాతగారు వేదము వెంకటరమణశాస్త్రిగారి లఘువ్యాకరణము చిన్నయసూరిగారి బాలవ్యాకరణమునకు ముందుది.

తాతవెళ్ళి మితాదారులగు శేషగిరి శాస్త్రిగారు, పదలువాడ సుందరరామ శాస్త్రిగారు, వేదము వేంకటరాయ శాస్త్రిగారు, వీరివంటి మహాపండితులు కోవకు చెందినవారు అల్లాడి మహాదేవ శాస్త్రిగారు. వీరిది పుదూరే. వీరితండ్రిగారు సుప్రసిద్ధులైన మహాపండితులు అల్లాడిరామబ్రహ్మ శాస్త్రిగారు. మహాదేవశాస్త్రి అధ్యయనానంతరము ఆంగ్లము చదివి బి. ఏ. ప్యాసై మైసూరు ప్రాచ్యలిఖిత భాండాగారమునకు అధికారియై లెక్కలేని వైదిక గ్రంథములను ప్రకటించి ఆభాండాగారమును అత్యుత్తమముగా నొనర్చిరి. వీరు సంఘసంస్కార ప్రియులైయుండిరి. చివరిదినములలో అడయారులో అనిబిసెంటమ్మగారి కడనుండి సంస్కృత గ్రంథములను ఆంగ్ల తర్జుమాలతో ముద్రించుటకు సాయపడిరి. హిందూమతముపై ఆంగ్లమున కొన్ని గ్రంథములు రచియించియున్నారు. వీరి కనిష్ఠ సోదరులు అల్లాడి నారాయణయ్యగారు గొప్ప మంత్ర సిద్ధికలవారు. డిప్యూటీ కలెక్టరుద్యోగముచేసి విరమించినను వైదికాచారమును వదలక ఓంకారమును సాధించి ఎన్నోవ్యాధులను తీర్థమిచ్చి నివర్తిల్లజేసినవారు. ఋషితుల్యులు, చమత్కారప్రియులు. శ్రీ ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారి శ్వశురులు.

మదరాసులో పచ్చయప్ప కళాశాలలోనుండిన శ్రీవేదము వేంకటాచల శాస్త్రిగారి పౌత్రులే సుప్రసిద్ధులైన నల్లయ్య (వేంకటాచలం) గారు. నల్లయ్యగారి యన్నగారు వేంకటనరసయ్యగారికి వంశవృక్షమను నామాంతర మేర్పడినది. అదిలోనే ప్రస్తుతము వీరెంతో మేధావులేగాక చక్కని చారిత్రక దృష్టితో పరిశ్రమించిరి. మఱి నల్లయ్యగారిని ఎఱుగని నాటక ప్రయోక్త

మదరాసులో లేఁడనిన నతిశయోక్తి కాదు. వీరు నాటకరచయితయు, ప్రయోక్తయు నగుటయేగాక చక్కని కళాకారులు. పాత్రధారణముతో తృప్తినందక ఆధునిక పద్ధతులలో వేషమువేయుటలో, నేపథ్యరచనలో (మేకప్) చాల నేర్పరులై యుండిరి. మదరాసు సుగుణసభవారికి ఎంతో సహాయభూతులై యుండిరి. మదరాసులోని మేకప్పు ఆర్టిస్టులు తాము వీరి శిష్యులమని నేటికిని చెప్పుకొను వారున్నారు.

ఇటీవలి వారిలో ప్రసిద్ధులు కీ. శే. శ్రీ అల్లాడి కృష్ణస్వామిగారు. సుప్రసిద్ధ న్యాయవాదులేగాక, చిరకాలము అడ్వకేటు జనరలు పదమందుండుటయేగాక భారత రాజ్యాంగ నిర్మాణమందు చాల ప్రముఖ పాత్రవహించిరి. వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రిగారు వ్యాపారమును చాలవిస్తరించి తండ్రిగారి ప్రతిష్ఠను నిలువబెట్టిరి. ఆధునికులలో శ్రీ ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారి ఆర్థిక, చారిత్రక, రాజకీయాది రచనలు ఎరుంగనివారు లేరు. చిన్నబాలురు మొదలు మహాపండితులవరకు ఎన్నివిధముల వచనరచన చేయవచ్చునో అన్నియు చేసినవారు. వీరి సోదరులు శ్రీరామ కృష్ణయ్యగారి రామాయణము తెనుఁగువచనరచనలో అమృత పాకమునకు దిగినది. చరిత్ర పరిశోధకులలో మత్శ్వశురులు శ్రీ నేలటూరు వేంకట రణమణయ్యగారు చేసిన కృషి నిస్తులము. సంస్కృతాంధ్ర ద్రావిడ కర్ణాటక శాసనముల పరిశోధనయేకాక అరబ్బిక్కు పర్షియన్ భాషలను ముస్లింసాయమున శ్రమపడి నేర్చుకొని ఆభాషలలోని గ్రంథములను పఠించి కాకతీయులయు విజయనగరము వారి చరిత్రల పరిశోధనలో వీరుకాంచిన కృషి అపారమును అనితరసాధ్యమును. ఆంధ్ర ప్రబంధ పరిశోధన వీరికి నిరంతర వినోదకార్యము. మావారనేకులు న్యాయమూర్తులు గలరు. వారికి మకుటాయమానులై శ్రీ కొండగుంట ఉమామహేశ్వరంగారు ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు జడ్జిగానుండిరి. మదరాసులో శ్రీ వేదము లక్ష్మీనారాయణ శాస్త్రిగారు, సంస్కృతాంధ్రములలో పండితులేగాక హైందవ గణిత శాస్త్రమందు చాల కృషి చేసి లీలావత్యాది గ్రంథములను టీకలతో ప్రకటించియున్నారు.

పుదూరివారిలో వట్టి శాస్త్రపండితులేగాక, యక్షగానాది కరచనలు చేసినవారు పలువురుకలరు. ఆధునికులలో కీ. శే. శ్రీ పురాణం పిచ్చయ్య శాస్త్రిగారు, నేలటూరి వెంకటరమణయ్యగారి మేనమామగారు కొన్ని యక్షగానములను విజయాశ్వ చరిత్రమను ప్రబంధమును వ్రాసియున్నారు. పూర్వికులలో భరతనాట్య శాస్త్రప్రవీణులుండిరి. కొందఱు జ్యోతిషమందు ప్రవీణులుండిరి. కీర్తనలు వ్రాసినవారు కలరు. ఏటి కాలువ సుందరరామశాస్త్రీగారి సప్తశతి కీర్తన ప్రశస్తమైనది. వీరందఱకును నెల్లూరు, కాళహస్తి, తిరుపతి, మదరాసులును తమిళదేశమందు తిరువత్తూరు కేంద్రస్థావరములుగా నున్నవి. నాటినుండియు నేటివఱకు పుదూరి ద్రావిడులు ఒక్కటే విధమైన స్వభావము గలవారుగా కనఁబడుచున్నారు. ఉద్యోగధర్మముచే ఆంధ్రదేశమున పలుతావుల

యుండేగాక దేశాంతర ఖండాంతరములకు పోయినను ఏకార్యమంద్రైనను దీక్ష, పట్టు దల, మనోనిశ్చయము, దృఢవిశ్వాసము, పెద్దలయందు కృతజ్ఞత, తమరు విధియైన కార్యమును చక్కగాచేయుట వీరిగుణములు వీరెంత సత్యసంధులనఁగా-అది ఆత్మకార్య హానికల్గించునంతటి చాదస్తముగా మారు నట్టి సత్యవాక్యప్రియులు. కపటమెరుఁగని వారు.

దక్షిణాది ద్రావిడులకును వీ రి కి ని చాలభేదముగలదు. వీరికి ఆంధ్రులయాదా స్యము పట్టువడినది. 1920 వరకును వర దక్షిణాదిబాధలు వీరికిలేకుండెను. అవి దక్షి ణాదినుండివచ్చినవి. అల్లునింటివారుకూడ సొ మ్ము లు పె ట్టు నా చా ర ముండెడిదట. కాని ఏవరేదిచేయక పోయినను పాటించుట గాని తలంచుటగానిలేదు. తమలోతాముగా నుండెడివారు. ఇప్పుడును తమపూర్వచరిత్ర స్మృతికిఁ దెచ్చుకొన్న, మరల సంఘీభావము నడుమ సడలినట్టిది, దృఢపడవచ్చును.

ఇట్టి వీరిచరిత్రను ఇంకనుపరిశోధించి ఎంతోవ్రాయుటకు అవకాశముకలదు. ఇది దిక్ప్రదర్శనమాత్రము.

కాన్తే తల్పముపాగతే విగలితా నీవీస్వయం బన్ధనాద్
వాసశ్చ శ్లథమేఖలా గుణధృతం ంచిన్నితంబే స్థితమ్
ఏతావత్సఖి వేద్మి కేవల మహం తస్యాంగ సంగేపునః
కోఽసౌ కాస్మి రతం నుకిం కథమపి స్వల్పాపిమే నస్మృతిః
— వికటనితంబాయాః

• • • • • •

దధభ్రమతికిం మహీతలలలంబితే చస్త్రిమాః
కృకృష్ణ వవదద్రుతం హహహసన్తి కిం వృష్ణయః
శిశీధు ముము ముంచమే వవన వక్త్రి మిత్యాదికమ్
మదస్ఖలిత మాలపన్ హలధరః శ్రియంవః క్రియాత్.
— విద్యాకరుని సుభాషిత రత్నకోశ

• • • • • •

వావము మహాత్ములయిన వారలతోడ నగునె చేయంగ
— మహాప్ర - I - 57

• • •

# 42.

# ★ ప్రాచీన విద్యాప్రభావము ★

ప్రొఫెసర్ టి. అంజన్, నెల్లూరు.

శ్లో॥ వాచా మాంధ్ర మయీనాం యః ప్రవక్తా ప్రథమోఽభవత్
ఆచార్యం తం కవీంద్రాణాం వందే వాగను శాసనమ్.

భారతదేశమున ననాదిగ ననేకమతములు, వర్ణములు, వర్గములు విలసిల్లినను, ప్రాచీనవిద్యావిధానము దాని ప్రభావము వలన ప్రజలెల్లరును సహజీవనమున కలవాటుపడి సుఖించుచుండిరి. గురుకులవాసము చేసి విద్యనార్జించు సనాతనపద్ధతి భారతావనియందు ఒక విశిష్టసంప్రదాయమును నెలకొల్పినది. విద్యార్థులు సద్గురువులకడ చక్కగవిద్యనేర్చి అధీతిబోధాచరణులై లోకమునకు మార్గదర్శకులగుచుండిరి. అట్టివిద్యావిధానము నిర్విఘ్నముగ సాగుటకు ప్రభుస్థానము నలంకరించినవారు బహువిధముల తోడ్పడుచుండిరి. అట్టి యపూర్వ విద్యావిధానము ననుసరించియే, క్రమముగ గ్రామములలో వీధిబడు లేర్పడినవి. ప్రతి గ్రామములో నొకదేవాలయము వెలసినట్లే ఒక వీధిబడియు నేర్పాటు చేయబడియుండెను. వానిని యేకోపాధ్యాయ పాఠశాలలని చెప్పనొప్పును. అందు విద్య చెప్పు యుపాధ్యాయుని బడిపండితుఁడని (బడిపండితులు)పిలచుచుండిరి. మఱికొందరు బడిపంతులు బీద విద్యార్థులకు తమ గృహముననే అన్నపానాది సౌకర్యములనొసఁగి విద్వాంసులుగఁజేయు చుండిరి. అట్టి సంప్రదాయము నేఁటికిని భరతఖండమున నటనట గాననగును. మత కుల వర్ణవర్గ విచక్షతలతో నిమిత్తములేక విద్యార్థులగువారికెల్లరకు విద్యాదానమొసఁగి యెల్లరను ధర్మన్యాయ మార్గమున గ్రమశిక్షణముతో నడుచుకొనునట్లు చేయుటయే అట్టి యేకోపాధ్యాయ పాఠశాలల ఆశయమై యుండెడిది. ఇట్టి విద్యావిధానమున నొక విశిష్ట మార్గము నేర్పఱచియుండిరి. దాని ననుసరించి విద్యార్థులు విద్య నభ్యసించుచుండిరి.

గృహస్థులు తమబిడ్డలను ఐదవయేట నక్షరాభ్యాసము చేయించుచుండిరి. కలిమిగలవారియక్షరాభ్యాస మహోత్సవమును కడు వేడుకతోఁ జేయుచుండుటయు క్రమముగ నారంభమాయెను. ఇట్టి వీధిబడి చదువు సాధారణముగ నాలేండ్లు సాగెడిది. అక్షరాభ్యాసము మొదలు, నాలేండ్లలో విద్యార్థు లెల్లరకును బాలశిక్ష, సుమతి శతకము, రుక్మిణీ కల్యాణము, గజేంద్రమోక్షము, మఱికొన్ని శతకములు వచనములు నేర్పించుటతోపాటు సాధారణమైన కొన్ని లెక్కలు, చక్కనివాచకము, నిర్దుష్టమైనశైలి ముచ్చటగూర్చు వ్రాత ఇత్యాదులయందును శిక్షితులను జేయుట క్రమశిక్షణము, ఇవి యేకోపాధ్యాయ పాఠశాలల అధ్యాపకుల కార్యక్రమమైయుండెడిది.

ఇటుల నాలుగేండ్లు పూర్తి కాగానే ఐదవయేట పెద్దపుస్తకమును పట్టించుట అలవాటుగనుండెను పెద్దపుస్తకమును పట్టించుట యనగా, మహాభారత పఠనము వ్యాకరణమును; శబ్దపరిచ్ఛేదమును అర్థజ్ఞానము నిమిత్తము అమరమును నేర్పుచుండిరి. ఇట్లొకటి రెండు సంవత్సరములు సాగునప్పటికి విద్యార్థులుచక్కగ నుత్తీర్ణులై తమంతట తాము గ్రంథ పఠనము గావించుట, అవసరమైన లెక్కలు వేయుట, చక్కని ముత్యాల కోవ యోయనునట్లు వ్రాతను నేర్చుచుండిరి. ఇంతటితో నీవిధి బడి చదువు అల్ప వ్యయముతో జరిగిపోయెడిది.

ఇంకను హెచ్చువిద్య నార్జింప నెంచిన విద్యార్థులు, శాస్త్ర పాండిత్యమును సంపాదింప నెంచినవారలును నాయాగురు వర్యులకడ కేగుచుండిరి. సంస్కృతాంధ్రములలో పంచకావ్యములు పఠించి భాషా వైదుష్యమును సంపాదించి పండితులగువారు కొందఱుందురు. ప్రాథమిక విద్యాభ్యాసము తోడనే తృప్తినందువారు కొందరుందురు. మఱికొందఱు ఉన్నత విద్యాభ్యాసము నిమిత్తమై అట్టి విద్వాంసులగు, గురువుల కడ కుంబోయి సుశిక్షితులై విద్యనేర్చి విద్వాంసులగుచుండిరి. మఱికొందఱు శాస్త్ర పాండిత్యమును నేర్వ కాశి గయ ప్రయాగ నవద్వీప ప్రాంతములకు బోయి మహా విద్వాంసు లగుచుండిరి. ఇట్లు ప్రాథమిక మాధ్యమిక, ఉన్నత కలాశాలాది నాల్గుదశలుగా, విద్యాభ్యాసమును చేయుచుండిరి. ఇట్లు అధీతి బోధాచరణులైనవిద్వాంసులు గ్రామములలో పట్టణములలో నివాసముల నేర్పరచుకొని విద్యాతురులగువారికి విద్య నేర్పుచుండిరి.

ఇట్టివీరు భారత రామాయణ భాగవతాది వివిధగ్రంథములలోని ధర్మన్యాయ సూత్రములను, భక్తిజ్ఞాన వైరాగ్యాది విశేషములను తెలిసినవారై గ్రామములందు పెద్దలై ప్రజలయందు పరస్పరవైషమ్యములను, రానీయక, వచ్చినవానిని సమర సభావమున సరిదిద్ది గ్రామజీవనమును సుఖతరముచేయుచుండిరి.

ఇట్టి విద్యావిధానము భారతావనియందన్ని రాష్ట్రములలో నొకేరీతినుండుటచే నీవిద్యావిధానమువలన సత్సంస్కృతి సంప్రదాయములు నెలకొనబడి సుఖించుచుండిరి. ముఖ్యముగ నాంధ్రరాష్ట్రమున వివిధప్రాంతములలో నీవిద్యావిధానము చక్కగ సాగిపోవుచుండెడిది.

అందుముఖ్యముగ మననెల్లూరు మండలమున నొకప్రత్యేకత నెలకొని నేటికిని యథాతథముగనే సాగుచున్నది. భారత భాగవత రామాయణాది వివిధగ్రంథ పఠనములందు, నా విశిష్టమార్గమును మనమండలము వీడలేదు. రెడ్డిరాజులపాలనములో శ్రీనాథాదిమహాకవు లనేకులు వర్ధమానులైన కారణమున నెల్లూరు మండలము నందలి సంపన్నగృహస్థులగువారు స్వయముగ విద్వాంసులగుటచేపండితాదరణమును పండితపోషణమును చేయుచునేవున్నారు. వారిని యనుకరించి యితరులు నట్లుచేయుచున్నారు. విద్యార్థులకు విద్యాసౌకర్యముల నిమిత్తము విరాళములను, మత కుల విచక్షణలులేక నొసగుచున్నారు.

# 43

## శ్రీ వీరశైవము

(పండితారాధ్యుల సాంబమూర్తి - నెల్లూరు)



భైరవకోనయందలి గుహాలయము, శివలింగము.

ఈవీరశైవము దాదాపు 300ల సంవత్సరములక్రితము ఉద్భవించినదని చెప్పనగును. అతఃపూర్వము బౌద్ధ జైన మత ప్రాబల్య మెక్కువగా దేశవ్యాప్తమై యుండెడిది. బౌద్ధజైనమతావలంబులగు రాజులెక్కువమైనారు. రాజాదరణచేత ఆ రెండుమతములు అభివృద్ధిచెందినవి.

తదుపరి 1150 ఆ ప్రాంతమున పెర్మాడిపశ్చిమ చాళుక్యవంశమున బిజ్జలుడను ప్రభువుద్భవించి కల్యాణకటకమును పరిపాలించెను. ఈబిజ్జలుని కోశాధ్యక్షుడుగా బండారుబసవేశ్వరుడను వీరశైవశిఖామణి నిర్ణయింపబడ్డాడు. ఇతడె వీరశైవమున కాదిపురుషు డనవచ్చును.

ఈ బసవేశ్వరుని జన్మమునకుపూర్వ సాక్షాత్పరమశివుడు 'భూలోకమున బౌద్ధ జైన చార్వాకాది మతములు అభివృద్ధిపొంది శివభక్తి యంతరించుచుండ ప్రమథగణములను తనతేజమునిచ్చి నందికేశ్వరుని, అతడే బసవేశ్వరుడు, కుమతఖండనం బొనర్చుమని పంపినటుల పాల్కురికి సోమనారాధ్య రచితపండితారాధ్య చరిత్రమున గలదు. మనచరిత్రలు మనకునమ్మకమేగదా! మనకాధారములు ఏది యెటులైనను వీరశైవమునకాధారుడా బసవేశ్వరుడేయని చెప్పనగును.

ఒక్కొక్కపుడు మతావేశపరులు మతముపేరిట చేయరాని దుష్కృత్యములు చేయుచుండ ఆ మతమునడచుటకు మరియొక మతము పుట్టుచుండునేమో! ఇందులకుదాహరణములు.

చారిత్రకపురుషుడైన కుమారపాల మహాప్రభువు పరమజైనుడు. అహింసాతత్వమును తనరాజ్యమున వ్యాపింపజేసినవాడు.

ఒకసారొకవ్యక్తి తనతలలోని పేనును గోటితో చంపినాడనితెలిసి కొలువుకు పిలిపించి అతని ధనమంతయుకొల్లగొని ఆధనముతో ఒకజినాలయమును కట్టించినాడట. మరియొకడు పచ్చిమాంసమును పట్టణములోనికితేగా వానితలను తీసివేయించినాడట! ఇట్టి ఆధారము లెన్నియేనిగలవు.



చుండి ఈశ్వరాలయద్వారమున మలచబడిన నందివాహన సాంబశివుడు.

ఏదియెటులైనను వీరశైవమునకాధారభూతుడు బసవేశ్వరుడనక తప్పదు.

బసవేశ్వరుడు వీరశైవపద్ధతుల నుప తప్పకుండ తాననుష్ఠించి తన భక్తులకు బోధించి ప్రపంచమున వ్యాపింపజేసినవాడు. వారి వీరశైవాచారపద్ధతులను వారి మాహాత్మ్యమునెరిగి అనేకమంది వారికి భక్తులైనారు. ఆభక్తులలో శ్రీపతిపండితుడుగూడ కలడు.

బసవేశ్వరుడు బిజ్జలప్రభునికడ కోశాధ్యక్షుడుగా నుండునపుడు శైవభక్తుల కెంత ధనముపంచిపెట్టినను కోశాగారము నిండుగానుండెడిదనియు, తనమీద ఎందరెన్ని చెప్పినను తనమహిమచేత కోశమునకెట్టి లోపము గలుగనీయకుండెనని చెప్పుదురు.

బసవేశ్వరుడు షట్కాల శివపూజాధురంధరుడు. శివోహమనుపదమును సార్థకమొనర్చినవాడు. మానవుని అన్నిపాపములను పోగొట్టుటకు విభూతి రుద్రాక్షలే ఆధారమని తాను ధరియించి ఇతరులచే ధరియింపజేసి వాటిమాహాత్మ్యమును ఇనుమడింపజేసినవాడు. స్త్రీలింటికిదూరమైనపుడు విభూతిస్నాన మొనర్చి వంటజేసిన అపాకము పరమశివమని వేదసార్థమని తానావిధముగనాచరించి ప్రపంచమునకు తెలియజేసి వీరశైవమును స్థాపించినవాడు. బసవేశ్వరుని సమకాలికులై వారిభక్తులై వీరశైవమ తాచరణ పరులైన వారలలో మడివాళమాచయ్య సిద్ధరామ షోడ్డలబాచరస-శివయోగదేవ సింబాళధగణేశ్వరాదులు ముఖ్యులు. వీరుగాక పండిత త్రియమని చెప్పబడు శ్రీపతిపండిత మల్లికార్జునపండిత మంచన పండితులలో మొదటిఇద్దరు. బసవేశ్వరాను సంధానము చేసినవారె!

ఆయిరుపురిలో శ్రీపతిపండితులు మహాప్రభావసంపన్నులు. వీరు ఒకానొకపుడు విజయవాడ ఇంద్రకీలాద్రిపై తపముచేయుచుండెను. అగ్నికార్యమునకై అగ్నికావలసి విజయవాడలో ప్రతిబ్రాహ్మణగృహమునకు వెళ్ళెను. ఒక్కరైనను అగ్నినివ్వనందున కోపించి గ్రామములో ప్రతియింటియందుండు అగ్నిహోత్రుని తనతపశ్శక్తిచే నాకర్షించి పట్టుబట్టలో మూటగట్టి ఇంద్రకీలాద్రిపైనున్న జమ్మిచెట్టుకొమ్మకు కట్టినాడు. గ్రామములో అగ్ని అభావమైనది. నిత్యకృత్యాలు అడుగంటగా కొంతమందిపెద్దలు, వారిమహిమ తెలిసినవారు, వెళ్లి వారిని ప్రార్థింప కనికరించి అగ్నినివిడువగా మరల



(మూలప్పేట యందుండిన వీరభద్రుడు.)

నిత్యకృత్యాముల కాటంకముతొలగెను. ఈ విషయమునుగూర్చి శ్రీపతిపండితారాధ్య పీఠ బిరుదమిట్లున్నది. 'శ్రీమద్విజయవాటికా కనకదుర్గా మల్లేశ్వర కృపా వరప్రసాదలబ్ధ శమితరు శాఖాంగారవస్త్రం బద్ధప్రభావ శ్రీపసుమంశ దీక్షశిక్షాధికారి' అని.

ఈవీరశైవారాధకులే మైలారులని చెప్పబడుదురు. ఈవీరశైవాచారము లతి భయంకరములు! సాహసోపేతములుగూడ. వీరభద్రునివల్లెము అసువ్రతము, నిప్పులు త్రొక్కుట, శరీరమునకు నారసములు గ్రుచ్చుకొనుట, గండగత్తెర వేసుకొనుట, కన్నులు పెకలించి శివున కర్పించుట, మొదలగునవి ఈలాంటి వీరకృత్యములు శివప్రీతిగానొనర్చి శివానుగ్రహమున మరల అవయముల పొందినటుల చారిత్రకాధారములు తెలుపుచున్నవి.

ఈ వీరశైవ పుష్పపల్లి బౌద్ధజైనాది మతముల నడుగంట జేసినదన్న అతిశయోక్తిగాదు. మతావేశమున జైనబౌద్ధాదులను చిత్రహింసలుపెట్టి పారద్రోలినటుల చారిత్రకాధారములున్నవి. కాని నానాటికి వీరశైవాచారులు సర్వమత సామరస్య మలవరచుకొనిరని తేలుచున్నది. ఇప్పటికిని వీరశైవము మహీశూరు రాష్ట్రమున ప్రాబల్యముగనున్నది అచటి వీరశైవులు లింగాయతులనియు ఉత్తర దేశమున లింగబలిజలనియు వ్యవహరింపబడుచున్నారు. వారిలో ఈ ప్రాచీనాచారము లిప్పటికి నున్నవి. జంగము దేవరలు గూడ ఈమతమునకు చెందినవారలె.

ఈ వీరశైవమున కాధార భూతుడైన బసవేశ్వరుని పేర పొత్తు వెలసినవి. బసవని మహిమలు దేశములో వ్యాపించినవి. పిల్లలకు బసవని పేరులు పెట్టుచున్నారు. బసవేశ్వరాలయములుగూడ కట్టినారు. బసవని గురించి గీతములు పద్దెములు రగడలు రచియింపబడినవి. ఇప్పటికిని బెంగుళూరులో బసవేశ్వరాలయమున్నది. ఆప్రదేశమునకు బసవన్నగుడి అనిపేరుగలదు. వీరశైవుల యాత్రాస్థల మా ఆలయము. ఇంక ఈ వీర



(మైలార వీరభటుడు తన శిరస్సును శివున కర్పించెను.)



(మైలార వీరభటుడు శపథము తీసుకొను చున్నాడు. ఎడమచేతి ఖడ్గముతో ఎడమ రెట్టను ఖండించుకొను చున్నాడు.)

శైవము మనసింహపురి మండలమునగూడ నున్నది. హరిహర నాథాలయముననుండి పదునైదు పర్వముల భారతమును తెలుగున రచియించిన తిక్కన సోమయాజి వీరశైవుడె 'రచనా సమయమున యే పొరపాటు జరిగినను గండగత్తెర వేసుకొందు' నని ప్రతిన పట్టి గ్రంథరచన సాగించినాడని ప్రతీతి గలదు. ఐనను హరిహరుల కభేదమని తలచి తనగ్రంథమును హరిహరనాథున కంకిత మొసగినాడు. గుడ్లూరు నీలకంఠేశ్వరాలయముననుండి అరణ్యపర్వ శేషమును పూరించిన ఎఱ్ఱాప్రగడయు వీరశైవుడే! రామాయణమును రచియించిన మొల్లయు ఆమెతండ్రి కేసనయు శ్రీకంఠ మల్లేశుని భక్తులగు వీరశైవులే. వీరలు సర్వమత సామరస్యము గలవారని తెల్పుటకు వారివారి రచనలె ప్రామాణ్యములు.

1850 వ శతాబ్దమున సింహపురి మండల స్కందపుర్య మండలాంతర్గత (కందుకూరు) మాచికాపుర నివాసి (మాచవరం) శ్రీపతి పండితారాధ్యుల లింగమూర్తి అయ్యవారు (పెద్దలింగయ్య) అదే ఉపమండలమునగల (1845) చుండియను గ్రామనివాసి. ములుగు పండితయ్య అయ్యవారు శివారాధన తత్పరులు. మహా ప్రభావ సంపన్నులని వారి చరిత్ర లిప్పటికిని ఆయా గ్రామాదుల పెద్దలవలన వినవచ్చును. ఆ యిరువురిలో లింగమూర్తి అయ్యవారు జీవించి యున్నంతకాలము అగ్రామమున మహమ్మారి స్ఫోటకాదులు రాలేదట. అనేక చిత్రాతిచిత్ర కృత్యము లొనర్చి ప్రజల కానందముగూర్చు పరోపకార పారీణుడు. రెండవవారగు పండితయ్యగారు చుండి సంస్థానాధీశుల గురువులు. ఒకనాడా పరమశైవుడు శివపూజచేసి నివేదనచేసినాడు. శివునకు నివేదించిన వస్తువు పరిహరింపడు. పరిహరింపనేరడదు. ప్రమాదవశమున పెరుగుపాత్రకు బదులు సున్నపుపాత్రను నివేదించినాడు. శివునిపై



(మైలార వీరభటుడు బల్లెము కొనను అఱచేతితో వంచి శివునకు శిరము సమర్పింప నుద్యుక్తుడైయున్నాడు.)

భారమువైచి భజించినాడు. మైకముగలిగి పవళించి ఒక యామము తరువాత లేచినాడు తాను ధరించిన స్ఫటిక ప్రాణలింగము నల్లని కప్పువైచినది. 'లింగా! సున్నమునార గించి బాధపడితివా తండ్రీ' యని కన్నుల నీరునించి ఏకాదశ రుద్రాభిషేక మొనరించినాడు. శివుని కప్పు తొలగినది. ఆ భక్తుని కానందము గల్గినది.

ఇట్టి మహావీరశైవులు సింహపురి మండలమున ఎక్కడెక్కడ ఎతెంతమంది మసిపాతలో మాణిక్యాలవలె నున్నారో!

శివోహమ్.

తద్జ్వాలాస్తంభతోం భోధరనికర సముజ్జృంభ గంభీరరావ
ఘృంభజ్జృంభ ద్విషద్విడ్ఢర దళనమిళద్దంభ దంభోళికేళిః ॥
పింజరాక్ష స్ఫులింగ పక్షితదితి సుతాధ్యక్ష సూతేస్నమక్షమ్ ।
రక్షామీక్షన్వళక్షద్యుతి వితతి నృహర్యక్ష రూపోక్షరోభూత్.

— సాహితి మే. 1962

◆ ◆ ◆ ◆ ◆ ◆

శ్లాఘ్యః సయేవగుణవాన్ రాగద్వేష బహిష్కృతా ।
భూతార్థ కథనేయస్య స్థేయస్యేవ సరస్వతీ ॥

— రాజతరంగిణి I - 7

◆ ◆ ◆ ◆ ◆ ◆

కోన్యః కాలంఅతిక్రాన్తం నేతుం ప్రత్యక్షతాంక్షమః ।
కవిప్రజాపతీం స్త్యక్త్వా రమ్యనిర్మాణ శాలినః ॥

— రాజతరంగిణి I - 4

◆ ◆ ◆ ◆ ◆ ◆

శ్లో॥ భావం జేకముఖంబుఁజేసికొని యాపద్ధ్వాంతభానున్ మహా
దేవుం బర్వతకన్యకాప్రియు దయార్ద్రీభూతచేతస్కు లో
కావిర్భావ వివర్ధనాలయకృతి వ్యాపారపారంగతున్
దేవేంద్రప్రముఖామరార్చితుని భక్తిప్రౌఢతం గొల్చెదన్

— హౌప్తి - I - 107

◆ ◆ ◆ ◆ ◆ ◆

ఉ॥ నీదెస నాదుచిత్తమున నెక్కొని యుండెడు భక్తి భద్రసం
పాదిని గాపుటచ్చెరువె భక్తజనాభిమత ప్రదాన వి
ద్యాదయితత్వ మేర్పడ జయం బొడఁగూర్పుము దేవసంశ్రితాం
భోదళనంబు నీకు వ్రత మ్ముల్లము నావయి నిల్పు మిత్రజిన్॥

— శల్య. I. 275

• • • • • •

శా॥ బాణజ్వాలలు బెట్టు సర్వగగన ప్రక్షోభణజ్వాల తా
క్ష్మాణస్ఫూర్తి చటచ్చటారముగా గర్ణోగ్రదావాగ్ని యు
ష్ణోదగ్రత వైరి సైన్యవన భస్మీభావ నిర్వాహ పా
కీణంబై వెలుంగొందె నిర్జఘులు వర్తింపంగ నేముబ్బగన్॥

— కర్ణ. II. 184

• • • • • •

ఉ॥ ఆపదఁదూలపోక సిరినందియుదింపక శౌర్యవృత్తిమైఁ
బాపులగెల్చియార్జవము బంధుజనాలికి నార్యకోటికిం
జూపుచు దీనులం గరుణఁజూచి తగంగలమాత్ర బ్రోచుచుం
గోపములేకయున్కి గలుగున్ దివిజాంశమునన్ జనించినన్

— అను. V. 84

• • • • • •

మ॥ స్ఫుటతత్త్వోదయ సంభృతైకపథురా భూతైకరక్షాధురా
తటినీపింఛమనోజ్ఞమౌళిలలితా దాంతాత్మ సంకీలితా
త్రుటితాతత్త్వ సమున్నతాశ్రితజనా దూరాంజనా సువ్రతో
త్కట శీలావనలోల దివ్యహృదయా ధర్మప్రసన్నోదయా!

— అను. IV. 448

• • • • • •

ఉ॥ ధారయుతంబుగా నడచు తాపసముఖ్యు లహింసపేర్మికై
కారుణికత్వ మగ్గలము గల్గి తలంతురు సర్వజీవులుం
దారును నొక్కరూపుగఁ బదంబడి పుత్త్రకళత్రయుక్తిఁ బెం
పారుదు రూర్ధ్వలోకమున సజ్జనమున్ మఱివచ్చుఁ గ్రమ్మఱన్॥

— అను. V. 20

# 44.

# సింహపురీస్థ మాధ్వ సంఘము

కీ. శే. మారేపల్లి కృష్ణాచార్యులు, నెల్లూరు

శ్లో॥ శ్రీమన్మధ్వమతే హరిః పరతరః - సత్యం జగత్ - తత్త్వతో
భేదో జీవగణాః - హరే రనుచరాః - నీచోచ్చ భావం గతాః
ముక్తిర్నైజసుఖానుభూతి - రమలా భక్తిశ్చ తత్సాధనం
హ్యక్షాదిత్రితయం ప్రమాణ - మఖిలామ్నాయైకవేద్యో హరిః

ప్రస్తుతము నెల్లూరు నందుండు మాధ్వులందరు గూడ కొంతకాలము క్రిందట ఇచటికి వలసవచ్చిన వారే యని తోచుచున్నది. వీరుమొదట మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతములయందలి వారు. వివిధముగా ఆంధ్రప్రాంతమునకు తరలివచ్చుటకు ఏదియో ప్రబలకారణ ముండియుండవలయును. బహుశా ఆయా ప్రాంతములయందు వీరికి జీవనము జరుగకయో, అన్యమతీయుల బాధ కోర్వజాలకయో యిటుల వచ్చియుందురు. వీరిలో కొందరు, జమీందారుల వలన భూవసతులను పారితోషికముగా పొందియు, వాటివలన వచ్చు రాబడితో కూడా జీవనము గడువక యిటువచ్చియుందురు. ఇటుల వచ్చినవారిలో ప్రస్తుతము నెల్లూరునందు కొన్ని గొప్ప కుటుంబములు నివసించుచున్నవి. వాని ప్రాముఖ్యత యిందు వివరింపబడును.

వేముగంటివారు

ఈ వంశీయులుకూడ షుమారు 400 సం॥ యితీవలనే యిచటికి వచ్చినట్లు తెలియుచున్నది. వీరు మైసూరు ప్రాంతమునుండి వచ్చిరి. వీరి పూర్వ వృత్తాంతము తెలియదు. గాని వీరిలో ముఖ్యులు, వేముగంటి వెంకటరావు, ఆతనిభార్య లక్ష్మమ్మగారలు. వెంకటరావుగారిచ్చట సిరస్తదారుగా నుండిరి. శ్రీమతి లక్ష్మమ్మగారు శ్రీమంతురాలై యుండి అనేక దానములు జేసి ఆ పేరే ప్రఖ్యాతి గాంచినది. వీరు నిత్యము అతిథిపోషణ, విద్యాన్నదానము చేయుచుండిరి. వీరు విశేషముగా దానధర్మములుచేసి కీర్తిని పొందిన కారణముననే వీరు నివసించు వీధికి వీరి యింటిపేరు పెట్టినట్లు తెలియుచున్నది. ఈ వంశీయులే రంగనాయకులపేటలో ఒక సత్రము కట్టించి, ప్రతినిత్యము నలుగురు బ్రాహ్మణులకు భోజన వసతి కల్పించినారు. పినాకిని నదీతీరమందు ఆంజనేయ దేవాలయమును నిర్మించి నిత్యనైవేద్య, దీపారాధనకు తగిన వసతి కల్పించినారు.

వీరు విశాఖపట్టణమునందొక ఆంజనేయ దేవాలయమును గట్టించిరి. అది నేటికిని అంగరంగ భోగములతో ఒప్పుచున్నది.

కంచివారు:

ఈ వంశమువారు 300 సం॥ పూర్వము కర్ణాటక ప్రాంతమునుండి యీ ప్రాంతమునకు వచ్చియుండినట్లు తెలియుచున్నది. వీరివంశీయుల పూర్వీకుల విషయముతెలియదు. కాని వీరియందు శ్రీ॥కంచి సుబ్బరావు కృష్ణస్వామియను సోదరులు ప్రసిద్ధులు.

శ్రీ॥ కంచి సుబ్బరావుగారు విద్యావివేకసంపన్నులై యీ గ్రామమునందే డిప్యూటీ కలెక్టరుగానుండిరి. వీరి ఉద్యోగ సమయమందు యనేకమందికి సహాయము చేసి పేరుతెచ్చుకొనిరి. వీరే నెల్లూరు సుందరగిరివారి వీధిలో ఉత్తరాదిమఠమును నిర్మింపజేసినారు. చిరతానూరు నందు, "సభాసత్రము" అను గొప్పనివేశమును నిర్మింపజేసి, ప్రతిసంవత్సరము డిసెంబరు నెలయందు, మాధ్వవిద్యావిషయిక సభ జరుగునటుల వేర్పాటుజేయించిరి.

శ్రీ॥ కృష్ణస్వామిరావుగారు. మొదట [illegible]యారి జిల్లాకోర్టునందు చిన్నయుద్యోగిగానుండి, న్యాయమూర్తులైన దొరగారి యభిమానముపొంది, తర్వాత ఒంగోలునందు, మునసబు పదవి నిర్వహించిరి. అచ్చటనుండి తిరువాన్కూరు మహారాజావారి కోరిక మేరకు మద్రాసు ప్రభుత్వ ఆదేశముమీద, తిరువాన్కూరు హైకోర్టునందు ప్రధాన న్యాయమూర్తిగకూడ నుండిరి. మరల ప్రభుత్వమువారు వీరిని మదరాసుకు పిలిపించగా మహారాజు వారియందుండు గౌరవాభిమానములకు చిహ్నముగ వారిని వదలక, తమ యొద్దనే యుంచుకొని దివానుపదవినిచ్చిరి. వీరున్యాయ మూర్తులుగా నుండగా, వీరితోడి న్యాయ మూర్తులవల్లను, ప్రభుత్వమువారి చేతను, యింతటివారు లేరనిపించుకొనిరి. ఇటుల వీరుతమ కర్తవ్య నిర్వహణయందు అప్రమత్తులైయుండి, ప్రజామన్ననలను పొందిరి.

బూరుగపల్లివారు:

ఈ వంశీయులు షుమారు 300 సం॥ పూర్వమే నైజాం యిలాక, గుల్బర్గా ప్రాంతమునుండి యిచ్చోటికి వలసవచ్చినట్లు తెలియుచున్నది. గుల్బర్గాజిల్లాకు సంబంధించిన "బూరగపల్లి" అనుగ్రామము వీరినివాసమై యుండవచ్చును. వీరు పూర్వమునుండి వైదికాచార సంపత్తి గలిగిన కుటుంబీకులు. ఆ కాలమందు వీరుండిన ప్రాంతమంతయు తురుష్కులు స్వాధీనపరచుకొని, మతవిషయములందు జోక్యము కలిగించుకొనుచుండుటచే, వీరు యీప్రాంతమునకు వచ్చినట్లు తెలియుచున్నది. ఈవంశీయులలో కొందరు గోదావరి ప్రాంతమునకు, కొందరు పినాకినీ ప్రాంతమునకు వచ్చిరి. నెల్లూరుచేరిన వారి వంశమునకు మూలపురుషుడు శ్రీ॥ మాధవాచార్యులవారు, యీప్రాంతమున, ఆర్కాటు నవాబును మెప్పించి, వారిడిన ఒకానొక కట్టడియందుత్తీర్ణులై * 'ఎలమంచిపాడు' అను శ్రోత్రియమును సంపాదించిరి. వారి పరంపరయందు వచ్చిన వారిలో

* కొన్నివేల యకరముల భూమిని సంపాదించి, కొందరు రైతులను చేర్చుకొని "ఎలమంచిపాడు" అను పేరుపెట్టి, అచట యజ్ఞమొనర్చినవారీ మాధవాచార్యులే.

యిటీవల వారియందు శ్రీనివాసాచార్యులు అనువారు, మండల మాధ్వులయందు అపార పాండితీ శేముషీగలవారై, మాధ్వమతాధికారత్వమును నిర్వహించుచు అన్యమతీయులచేగూడ మన్ననలను పొందిరి.

నందగిరివారు :

ఈ వంశీయులు షుమారు 400 సం॥ పూర్వమీప్రాంతమునకు హైదరాబాదు నుండి వచ్చినట్లుతెలియుచున్నది. వీరిలో కొందరు సంస్థానములందు ఉన్నతోద్యోగములయందున్నటులకూడ తెలియుచున్నది. ఇప్పటికివచ్చినవారిలో మొదటివారు శ్రీ॥ నందగిరి గోపాలరావుగారు. శ్రీ॥ జయరావు అనువారు యింగ్లండుకువెళ్ళి యచట, ఆంగ్లేయులకు అధ్యాపకులుగానుండి, యచటనుండి, రష్యాచక్రవర్తియైన జార్ ప్రభువులచే తమదేశమునకు ఆహ్వానింపబడి, యచట ప్రభుపుత్రులకు ఆంగ్లభాష బోధించుచుండి, యచటనే దేహయాత్రచాలించిరి. శ్రీ॥ రామారావు అనువారు ప్రథమ ప్రపంచసంగ్రామునందు ఆఫీసరు పదవియందుండి, యుద్ధమందు మరణించిరి. శ్రీ॥ లక్ష్మణరావు అనువారు సబ్‌జడ్జిగా నుండిరి. వీరికి సంబంధించిన భూమినే విక్రయించి, రామమూర్తి నగర్ అను పేరుపెట్టుకొని పట్టణాభివృద్ధికి చాలతోడ్పడిరి. శ్రీ॥ మధ్వరావు అనువారు గొప్ప పత్రికావిలేఖరిగానుండి, దేశమునలుమూలలు పర్యటించి, ఆయాసంస్థానములయందలి విశేషములు తెలియజేయు Encyclopaedia of the States in India ను వ్రాసిరి. వీరు రత్నపరీక్షయందు గొప్ప ప్రావీణ్యత సంపాదించి యిటీవలనే పరమపదించిరి.

కెంచంవారు :

ఈ వంశీయులు షుమారు 400 సం॥ క్రిందట, మహారాష్ట్ర దేశమందుండి హైదరాబాదుకువచ్చి, యచటనుండి నెల్లూరుకు 300 సం॥ పూర్వము వచ్చిరి.

వీరి వంశమునకు మూలపురుషులు కెంచం, శ్రీనివాసాచార్యులు. ఈ వంశీయులు సైనికోద్యోగులుగ నుండిరి. ఆ కాలమున మాధ్వరెజిమెంట్లుకూడ నున్నట్లు యీవంశీయులవల్లతెలియవచ్చుచున్నది. ఈ వంశమందు రామాచార్యులనువారు నెల్లూరు నందుండు మాధ్వమతమునకు అధికారులుగా నుండి, వ్యాసపూజాదులు జరుపుచుండిరి. వీరు కుంఫణీ ప్రభుత్వకాలమున మిలిటరీకి పాలసప్లయిచేయుచుండిరి. అందులకు గాను యీవంశీయులకు కొన్నిగ్రామములు గూడూరుతాలూకాలో మివ్వబడినట్లు తెలియవచ్చుచున్నది వీరిది గొప్పవండితవంశము. కెంచం సుబ్బణ్ణాచార్యులనువారు చాలాగ్రంథములను రచించిరి వీరియందిటీవలి వారైన కెంచం బిందుమాధరావుగారు, పౌరప్రముఖులై హిందూమహాసభలో సభ్యులుగనుండిరి. మొదట వీరు కాంగ్రెసువాదులే.

వారికుమారులైన శ్రీ॥ కెంచం. నారాయణరావు యింతకుముందు ద్వితీయప్రపంచ సంగ్రామసమయమున King's Commission లోనుండి ప్రస్తుతము న్యాయవాదగాపనిచేయుచున్నారు. వీరి సోదరులైన శ్రీ॥ పురుషోత్తమరావు Royal Indian Navy లోనుండి 1946లో బ్రిటిష్‌ప్రభుత్వముపై జరిగిన తిరుగుబాటులో పాల్గొన్నందున ఉద్యోగము నిరమింపబడి, అట

నుండి భారతీయ వైమానికదళములో పనిచేసి, విరమించుకొని, Social Service చేయుచూ, యిటీవల యింకకూరుపేట పంచాయతీ అధ్యక్షత వహించియున్నారు. ప్రస్తుతము భారత జర్మనీ మైత్రి సంఘమునకు కార్యదర్శిగా పనిచేయుచున్నారు.

న్యాపతివారు :

ఈ వంశీయులు షుమారు 200 సంవత్సరములకు పూర్వమీ ప్రాంతమునకు వచ్చినట్లు తెలియుచున్నది. వీరిలో కొంతమంది గుంటూరు జిల్లాకును కొందఱు నెల్లూరు జిల్లాకునువచ్చిరి. ఈ వంశీయులలో ఒకరైన శ్రీ॥ న్యాపతి సుబ్బారావుగారు నెల్లూరునుండి రాజమహేంద్రవరముచేరి అచ్చట న్యాయవాది వృత్తి నవలంబించి, దేశ ప్రఖ్యాతమైన కీర్తి నార్జించుటయేగాక ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వమున కౌన్సిలుమెంబరుగాకూడ నుండినారు.

సోనాలవారు :

వీరు 200 సం॥ పూర్వమే, పూనా ప్రాంతమునుండి యిచ్చటికి వచ్చినట్లు తెలియుచున్నది. వీరందరు కేవలము వైదికులనియే తెలియుచున్నది. వీరిని గురించి యధికముగా తెలియకున్నను, వీరు గొప్పపండితులనియు విద్వాంసులని మాత్రము తెలిసినది. వీరిలో శ్రీ॥ కృష్ణాచార్యులు అనువారు షట్శాస్త్రపారంగతులై వేదాంత, సాహిత్యములం దసమానులై యుండిరి. వీరియొద్ద విద్య నభ్యసించిన శిష్యబృందము అసంఖ్యాకము. వీరు కేవలము ద్వైతులయ్యు, అద్వైత విశిష్టాద్వైతులకును పరమాదరముతో విద్య చెప్పిన మహనీయులు. వారి శిష్యులు నేడును నెల్లూరులో నున్నారు.

శ్రీ మధ్వాచార్యుల జీవితము :

కర్ణాటక దేశమందు ఉడిపి సమీపమునందలి శివహళ్లి యను గ్రామము శ్రీ॥ మధ్వాచార్యులవారి జన్మస్థలము. వీరి తల్లి దండ్రులు, శ్రీ॥ మధ్యగేహభట్టు, వేదవతి యనువారలు. వీరు ఉడిపి క్షేత్రపాలకులైన శ్రీ యనంతేశ్వర స్వామివారి యనుగ్రహమున, సజ్జనోద్ధరణకైఅవతరించినారు. వీరు వాయు అంశసంభూతులు. జననమాది మహామహిమోపేతులై విరాజిల్లిరి. ఉపనయనానంతరము, వీరు శ్రీ అచ్యుత ప్రేక్షాచార్యులు యను వారియొద్ద విద్యనభ్యసించి అచిరకాలముననే సమస్త విద్యలను నేర్చి బాల్యముననే సన్యాసమును స్వీకరించి తమ గురువులకే గురువులైరి. అప్పటినుండి వీరు మతప్రచారమునకు పూనుకొనిరి. దుర్మత ఖండన పూర్వక స్వమత స్థాపనచేయుచు పర్యటన సాగించిరి. వీరు చూపిన మహిమాన్వితమైన కార్యము లనేకములుగలవు. వీరు స్థాపించిన మతమే 'ద్వైతము' ఈమత ముఖ్యోద్దేశము, జీవబ్రహ్మైక్యమను నదియసంభవము. అసంగతము. జీవుడువేరు, పరమాత్ముడు వేరు. ఎన్నటికి జీవుడు పరమాత్ముడు కాలేడు. జీవుడు పరమాత్మునికి ఎల్లప్పుడు భృత్యుడే. ఇటుల మతప్రచార కార్యక్రమమున, రెండుపర్యాయములు బదరికాశ్రమమునకువెళ్ళి, అచట తమపరమగురువులైన శ్రీ॥ వ్యాసులవారిని దర్శించి, తాము రచించిన గ్రంథములను వారికి వినిపించి వారి మన్ననలనుపొంది మరలివచ్చి తమ సదుపదేశముతో ననేకమంది సజ్జనులనుద్ధ

రించి. బ్రహ్మ సూత్రములకు భాష్యమును వ్రాసి శ్రీ వేదవ్యాసులవారి హృదయానుగుణముగా సమస్త గ్రంథరచన గావించియు మానవాశ్రిత కార్యముల నాచరించియు తమ గురువులను సందర్శించు కోరికతో మరల బదరీకాశ్రమమునకువెళ్ళి యచటనే నిర్యాణము పొందినట్లు చెప్పుదురు. వీరికి తల్లిదండ్రులు పెట్టినపేరు, వాసుదేవుడు. గురువుల వారుంచిన పేరు సుఖతీర్థులు, వీరి శాస్త్రము తేనెతో సమానముగా నున్నందున "శ్రీ మధ్వాచార్యులు అను నామధేయములతో విలసిల్లిరి.

అశేష విశ్వవైచిత్ర్య రచనారుచయే నమః
మహాగహన గూఢాయ నానారూపాయ విష్ణవే॥

దేవః పాయాదపాయాత్ త్రిభువన భవనస్తంభభూతః సయుష్మా
నాయుష్మాన్ యస్య భక్త్యాప్రభవతి పురుషః స్వర్గమార్గేఽపవర్గే।
మత్స్యః కూర్మోవరాహః పురుష హరివపుర్వామనో జామదగ్న్యః
కాకుత్స్థః కంసహన్తాస సుగతమునిః కల్కినామాచవిష్ణుః

— క్షేమేంద్రుడు.

తే॥ పౌరుషమ్ము దైవంబుతోడ్పాటులేక, ఫలముబొందంగనేరదు పార్థివేంద్ర
విత్తు సహకారి గాకున్న రిత్తనేల, వంధ్యమగుంగాక తాఫలవంత మగునె.

— అను. I. 136

తే॥ మేలురెండులోకంబుల మేలతెచ్చు, గీడునేసినఁదప్పదు కీడయగుట
గాన పురుషవర్తనమున కానుపాల్య, శీలమగుదైవమది ఫలసిద్ధిజేయు.

— అను. I. 137

క॥ క్షేత్రంబు పురుషకారము, ధాత్రీశ్వర బీజమరయుదైవము రెండున్
సూత్రపడకూడెనేనిం బాత్రంబగుఁ గర్మకరుఁడు ఫలమునకెందున్

— అను. I. '34

మహాస్రగ్ధర. పరమజ్ఞేయస్వభావా భవభయహరణ సాధనామానుభావా
కరఘేలచ్చక్రశూలా కలుషహృదయ సాంగత్యవైముఖ్యశీలా
కరుణాయత్తాంతరంగా కమలభవ మనః కంజ సంవాసభృంగా
దురితధ్వాంత ప్రదీపాతుల నిరసనసంస్తుత్య చిర్భాసరూపా॥

— సౌ. ప్రి. I. 237

ః ః ః ః ః ః

శ్లో॥ ప్రమోద భరతుంద్రిల ప్రమథ దత్తతాలా వలీ
వినోదిని వినాయకే డమరు డిండిమధ్వానిని।
లలాటతట విస్ఫుట త్పటు కృపీట యోనిచ్ఛటా
హతోద్ధత జటోద్భటో, గతపటో, నటో, నృత్యతి॥

ః ః ః ః ః ః

గీ॥ కయ్యమునకు యెప్పుడుఁ గాలుద్రువ్వుదు కార్యగతికిఁ బౌరవు''

విరా॥ IV. 207

ః ః ః ః ః ః

శ్లో॥ తమసాన్ధస్య లోకస్య వేష్టితస్య స్వకర్మభిః
జ్ఞానాంజన శలాకాభిః బుద్ధినేత్రోత్సవః కృతః ॥
నమోఽస్తుతే వ్యాస విశాలబుద్ధే ఫుల్లార విన్దాయత పత్రనేత్ర।
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః॥

ః ః ః ః ః ః

క॥ వినుపురుషుడు గావింపని, పనులకు దైవమదియెట్లు ఫలమొనరించున్
జనములు గార్యమునడపగ ననుకూలత నిచ్చుఁగాక యయ్యైఫలముల్॥

— అను. I. 135

ః ః ః ః ః ః

పరీక్షితుని నామ నిర్వచనము.

తే॥ ఆత్మకులము పరిక్షీణమైన జనన, మొందెఁగాన యిప్యభిమన్యు నందనునకు
నర్థమగుఁ బరిక్షిన్నామ మనియెఁగృష్ణుఁ డఖిలజనములువినఁ బౌరవాధినాథ॥

— అశ్వ. III. 200.

# 45.

# ★ శ్రీ కుసుమ హరనాథ ★

శ్రీ స్వయంపాకం శ్రీరామమూర్తి, బి.ఎ., బి.ఎల్., నెల్లూరు.



నెల్లూరు మండలమునందలి ఆధ్యాత్మిక చింతనలలో రామ, కృష్ణాది యవతారముల సేవించుటయేగాక, ప్రేమాధినాథులునూ, రాధాకృష్ణాభిన్న స్వరూపులునూ అయిన శ్రీకుసుమహరనాథుల సేవించువారును పెక్కులుగలరు. శ్రీకుసుమహరనాథులు పశ్చిమవంగదేశమందలి, బంకూర జిల్లాలోని, సోనాముఖ మహాక్షేత్రములో క్రీ॥ శ॥ 1865వ సంవత్సరము జూలై ·వ తేదీన ప్రపంచకల్యాణముకొరకు శ్రీ జయరామ బందోపాధ్యాయ, శ్రీమతి భగవతీ సుందరీదేవి అను పుణ్యదంపతులకు కనిష్ఠ పుత్రుడుగా ఆవిర్భవించిరి.


శ్రీకుసుమహరనాథుల జననమునకు సంబంధించిన; శ్రీబుద్ధదేవులు, శ్రీజీసెస్‌ప్రభువుల జననములకువలెనే పూర్వసూచనలు గోచరించినవి. భగవానుల తండ్రియగు శ్రీజయరామ బందోపాధ్యాయులు కలకత్తాలో వారికుటుంబవ్యాపారమును జరుపుచుండిరి. అప్పుడు సోనాముఖిక్షేత్రమునకు, దివ్యతేజోవిలాసితుడగు నొకసన్యాసి, వీరి గృహమునకేతెంచి, భిక్షనడిగెను. భగవతీ సుందరీదేవి ఆసన్యాసిని, వారు పూజించుచున్న శివాలయ ప్రాంతమున ప్రవేశపెట్టి, తీర్థప్రసాదములచే సంతుష్టిని గావించెను. ఆ మహనీయుడు, ఆరేయి అచ్చటనేయుండుట

కిప్పగించుటచే, శ్రీభగవతీ సుందరీదేవి ఆలయ తలుపులకు తాళమువేసి, తాను గృహముజేరెను. మరునాడు యథాప్రకారము తలుపులు తెరచిచూడగా, ఆ మహాపురుషు డంతర్ధానమైయుండెను. అదేరేయి కలకత్తాలోనుండు శ్రీజయరామ బందోపాధ్యాయులకు స్వప్నమందు సాక్షాత్కరించి, తనకు సోనాముఖిలో, శ్రీభగవతీ సుందరీదేవి యొసగిన ఆతిథ్యమునకు, తాను సంతుష్టుడైనట్లున్నూ, ఆమె గర్భవాసమున శ్రీభగవానులుద్భవించ బోవుచున్నట్లునూ చెప్పి, అంతర్హితుడయ్యెను. శ్రీమతి సుందరీదేవి సకాలమున గర్భవతియై, గర్భోదకశాయియగు మహావిష్ణుని, తనకు నాల్గవ కుమారునిగా, శ్రీహరనాథభగవానులను ప్రసవించెను. ఈ ప్రసవసందర్భమున ఒక విచిత్ర సంఘటనమేర్పడెను. శ్రీమతి భగవతీ సుందరీదేవి ప్రసవవేదనకోర్వలేక వారి గోశాలలోకి వచ్చునప్పటికి దుర్నిరీక్షణమై కాంతిపుంజములు ఆప్రదేశమునావరించెను. సాయమున కేతెంచిన యిల్లాండ్రకన్నులు మూతపడెను. శ్రీమతి సుందరీదేవికి తన ఒడలు తనకుతెలియలేదు. బిడ్డకేకవినగానే ప్రసవించినట్లు గుర్తెరిగి చూడగా, ప్రసవమునకు సంబంధించిన మాయగాని, యితర చిహ్నములేవియూ గానరావయ్యెను. ఆ మహనీయుడు చెప్పినమాటలకూ, యిట్టి అపూర్వ ప్రసవమునకు జాలా యచ్చెరువొందిరి. శ్రీమతి భగవతీసుందరీదేవి తన గర్భవాసమున శ్రీ భగవానులుద్భవించినట్లు భావించక తప్పనిదయ్యెను. శ్రీభగవానులే తనజననవిషమై "నాయీశరీరము మాత్రజనితమే యైనచో నేనుమైదాల్చు మానవుల పాపముచే నిదియేనాడో తుత్తునియలై పోయియుండెడిది''ని సెలవిచ్చియుండిరి.

బాల్యమునుండియు, తదనుగుణ్యముగనే, శ్రీ హరనాథ భగవానులు, అమానుష లీలల మఱిపెము గరపుచుండిరి. ఒకరోజున శ్రీమతి సుందరదేవి బిడ్డను ఉయ్యాలలో నుంచి పతిసేవ చేయుచుండగా నొక బ్రహ్మాండమైన నాగసర్పము తన ఫణమును విప్పి యుయ్యాలలోని బిడ్డ నాడించుచుండెను ఈ దృశ్యము చూచి ఆమె చాలా భయమునొందగా సర్పమప్పుడే యదృశ్యమయ్యెను. బిడ్డడు జనాకర్షణమైన సుందర విగ్రహము. ఆవిచిత్రమేమోకాని యెట్టిసుగ్మతయుండినను లాలించి లాలించి యెత్తుకొన్న తల్లులకు, వారి సుగ్మతలు మాయమగుచుండెడివి. బిడ్డ పోరుపెట్టి యేడ్చునప్పుడు, హరినామ సంకీర్తనతప్ప మరేదియు నూరట కల్గింపజాలదయ్యెను. శ్రీహరినాథులు నడక సాగించునప్పటికి యిరుగుపొరుగువారు ఏ వస్తువులుపోగొట్టు కొన్నను, ముచ్చటగా యీబిడ్డనడిగిన వెంటనే ఆవస్తువులున్న చోటికి తీసుకొనిపోయి చూపించువారు.

సోనాముఖిక్షేత్రమున శ్రీకందర్ప సుందరనారాయణ భట్టాచార్యులును, వారి ధర్మపత్నియగు చంద్రావళీదేవి నివసించుచుండిరి. పూర్ణగర్భవతియై, చంద్రావళీదేవి ప్రసవవేదమున పడుచుండగా, ప్రేమపాత్రురాలగు శ్రీమతి భగవతీసుందరీదేవి సాయమునకు వచ్చియుండెను. ఆమెతో గూడ ఆమె ముద్దుబిడ్డడగు ఐదేండ్లబాలుడు, శ్రీహరనాథభగవానులు వచ్చియుండిరి. ఎట్టకేలకు, 1870వ సం॥ము డిసెంబరునెల

14వ తేదీన (బుధవారం) చంద్రావళీదేవి మధ్యాహ్నం 3గంటలకు కుసుమతల్లిని ప్రసవించెను. ప్రసవమైనవెంటనే బిడ్డ కన్నులుతెరచుటగానీ, ఏడ్చుటగానీలేదు. అప్పటివారందరూ చాలాభయపడి, ఖిన్నులై చూచుచుండిరి. మనముద్దుబిడ్డడగు, శ్రీహరనాథభగవానులు, ఆవిచిత్రమునుచూచుటకు పురిటిమంచముయొద్దకువెళ్ళి పసిపాపముఖ



మున, తన ముఖచంద్రమునుమోపి. వీక్షించెను. వెంటనే కుసుమతల్లి కలువకన్నులు విప్పెను. శ్రీహరనాథులు మందస్మితము గావించిరి. కుసుమతల్లి చకోరవదనమున మకరందమాస్వాదించుచూ మందహాసము చేసెను. ఇట్లు గోలోకధామవాసులైన అనాదిదంపతులు, వారి లీలాజీవితమును భూలోకమున ప్రారంభించిరి. ఖేలలయందూ, ప్రణయకలహములందూ. విరహములందూ, ఆనందడోలికలందూ, వారి శైశవము గడిచెను.

శ్రీహరనాథభగవానులు విద్యాభ్యాసమునకై వారిగ్రామమునకు కొంతదూరమున నున్న పాఠశాలకేగుచుండిరి. వీరి అన్నగారగు శ్రీశివనారాయణులతో కూడ పాఠశాలకువెళ్ళి వచ్చుచుండెడివారు. భక్తప్రహ్లాదునివలె అప్పటి బాలురకందరికి హరినామ సంకీర్తన మభ్యసింపజేసెను. ఈ కాలమందు రెండుపర్యాయములు యుంటికొమ్ము నప్పుతోర మహనీయుడు వీరి వెనుకనే సాయముగా వచ్చుచుండెడివారు.

శ్రీమతి కుసుమకుమారీదేవి గోలోకనాథుడైన శ్రీకృష్ణభగవానుని అనపాయిని శక్తియైన సాక్షాత్ రాధాస్వరూపిణి. గోలోకనాథుడైన శ్రీకృష్ణభగవానులు ప్రేమరసస్వరూపులు. రాధాదేవి, మనుభవించినది మాదనాత్మక మహాభీరుడ భావమును వ్యక్తము చేయుచున్నది. అంతర్యామియు, నిర్లిప్తుడును సచ్చిదానంద స్వరూపుడునగు శ్రీకృష్ణ పరమాత్ముని బహిర్గతకళయే రాధారూపిణి. భక్తకోటికి శ్రీకృష్ణభగవానుని అనుగ్రహము ప్రాప్తించుటకు రాధారాణి అవలంబనమే ఆశ్రయభూతమైనది. శ్రీహరనాథభగవానులు, రాధారూపిణియైన శ్రీకుసుమకుమారీదేవివల్లనే తన లీలాకాండ జరుగుచున్నదని పలుమార్లు నొక్కివక్కాణించిరి. రాధాస్వరూపిణియైన శ్రీకుసుమకుమారీదేవిని, వంగదేశపు ప్రాచీన సాంప్రదాయమునననుసరించి, తొమ్మిదవయేటనే భగవాన్ శ్రీహరినాథులకిచ్చి అతివైభవముగా కల్యాణముజరుపబడెను.

శ్రీ హరనాథులు గ్రామమునందలి చదువుపూర్తిచేసుకొని క్రమేణ కళాశాలలో చేరి బి. ఏ. పరీక్షకు చదువునప్పుడుగూడా,

వారు పాఠశాలకు వెళ్ళివచ్చుచున్నప్పుడు అనుగమించి, సాయముగా వచ్చిన మహనీయుడు, పలుమార్లు దర్శనమిచ్చుచుండెడివారు. ఈ కాలమున శ్రీహరనాథులు పరనీయాంశములందాశక్తిలేక అన్యాక్రాంతచిత్తులై సమాధిస్థితిని పొందుచుండెడివారు.

శ్రీహరనాథ భగవానులకు క్రీ॥ శ॥ 1893వ సం॥ మున కాశ్మీరమున ఉద్యోగముదొరకెను. కాశ్మీరమునకు పోవునప్పుడు తనధర్మపత్నియగు శ్రీకుసుమతల్లిని, మాతృసేవకై సోనాముఖియందేయుంచి, ఉద్యోగమునకు జనిరి. క్రీ॥ శ॥ 1893వ సం॥ మునుండి 1913వ సం॥ వరకు శ్రీహరనాథులు కాశ్మీరమున ధర్మార్థశాఖాధ్యక్షులుగానుండిరి. పూజ్యపాదులు, "అమృత బజార్" పత్రికాసంపాదకులగు శ్రీ. శిశిర కుమార్ ఘోష్‌గారు, శ్రీవారు కాశ్మీరములో యుండునప్పుడు జరుగుచుండిన లీలాకాండనుగూర్చి తమ పత్రికాముఖమున తెలియపర్చుచుండెడివారు. శ్రీహరనాథభగవానులు వ్యాహాళికై, కాశ్మీరారణ్య ప్రాంతములందు తిరుగుచుండగా వ్యాఘ్రాది క్రూర జంతువులు వీరిచెంతజేరి యెంతో వాత్సల్యమున, శ్రీవారి పాదపద్మములను సేవించుచు సుహృదానందమును పొందెడివి. విషసర్పములు సైతమూ వారిని పెనవేసుకొని విడిచిపోవుటకు మనసురానట్లు పరితపించెడివి. ఇంతయేల, ప్రభు జీవితములో నొక్కదినమునుగూర్చి సంతృప్తికరముగా విషయమునుగూర్చుట విఫలమనోరథమగును. శ్రీవారు యింటికి తిరిగివచ్చునప్పుడు పలువిధములైన పక్షులు, మహదానందముతో వారి శరీరముమీదనే వ్రాలియుండెడివి. అందుచే శ్రీవారిని "చిడియాబాబా" యనికూడా కాశ్మీరవాసులు సంబోధించు చుండెడివారు. శ్రీవారు ఒకేకాలమునందు ప్రపంచములో వివిధప్రదేశములలోనున్న వివిధభక్తుల యిండ్లలోనుండి వారి యాతిథ్యమును స్వీకరించుట నిత్యసహజ ప్రకాశలీలయై యుండెను.

శ్రీ ప్రభువువారు కాశ్మీరములో యుండునప్పుడొక విచిత్రమైన సంఘటన జరిగెను. శ్రీవారు ఆఫీసు పనిమీద జమ్మూనుండి శ్రీనగరమునకువెళ్ళవలసియుండెను. ఈప్రయాణము అంచెలమీద జరుగవలయును. దుమేలీ యను యూరియొద్ద శ్రీ ప్రభువువారు అంచెగుఱ్ఱము మారవలసి వచ్చెను. అది యంతయూ అరణ్యప్రాంతము. ఇచ్చట శ్రీవారు టోంగా యెక్కునప్పటికి సాయంకాలము 3 గంటలయ్యెను. కొద్దిసేపటికి శ్రీవారికి స్మృతి తప్పెను, క్రమేణ టోంగాలో శవాకారముగా పడిపోయిరి. టోంగ తోలు నతడూ, శ్రీవారితో వచ్చువారునూ, శ్రీవారు స్వర్గస్థులైనట్లు నిశ్చయము చేసుకొనిరి. ఇదియింట్లుండ పూర్వము దర్శన మిచ్చుచుండిన మహనీయుడు, శ్రీవారికి సాక్షాత్కరించి, 'నాయనా! నీవు తనువును బాసితివ' ని చెప్పెను. అందులకు ప్రభువారు, తనకావిషయము తెలియుననియూ, మరల నాశరీరమునందు ప్రవేశించుటకిచ్ఛలేదనియూ, చెప్పిరి. అంత ఆమహనీయుడు శ్రీవారి శరీరమునందలి కోశములను అరువదినాలుగు భాగములు చేసి, శుభ్రపరచి తిరిగి అరువదిమూడు భాగములను ఆశరీరమునందుచేర్చి యందు ప్రవేశింపుమని శ్రీవారిని కోరెను. మహాప్ర

రుషుని యాజ్ఞానుసారము శ్రీహరినాథ భగవానులా శరీరమునందు ప్రవేశించిరి. దహన సంస్కారములకై ప్రయత్నించుచుండిన తనతోటీ వారలకది యత్యాశ్చర్యమును కలిగించెను. శ్రీవారి దేహము మునుపటి తన సహజమైన శ్యామలవర్ణమును విడిచి, కరగబోసిన బంగారు ఛాయవలె మారెను. నాటినుండియు, పర్వతములను వృషములనూ, ప్రకృతియందలి దేనిని జూచిననూ, వాని యంతర్గతమైన భావములను, చేష్టలను, మార్పులను, చూడగల్గు దివ్యదృష్టి గల్గెను. వేయేల శ్రీవారికి మనము నివేదన చేయ సంకల్పించుకొన్న అవినమే మనకు ప్రభువారినుండి, ఆసంకల్పమునకు జవాబు వచ్చుట వారి సహజలీలయై యుండెను.

మెసపుటోమియాలో మిలటరీలో పని చేయుచుండిన ఒకానొక అస్సాందేశస్థునికి నిమోనియా వ్యాధివల్ల చరమదశ సంప్రాప్తమయ్యెను. అతనారాత్రికి జీవించడని వైద్యులు నిర్ణయించిరి. అపుడాతనికి మూర్ఛవచ్చెను. ఆ మూర్ఛలో అతనికొక దృశ్యమయ్యెను. అదృశ్యములో నొకమహావర్చస్సు, గడ్డమునుదాల్చిన సాదుపుంగవుడు సాక్షాత్కరించి, నాయనా! నీకు బాద్యము పోయినది, స్వస్థత చేకూరినది. భయపడకుమని యాశీర్వదించెను. వెంటనే యాతనికి మెలుకువవచ్చి, అప్పుట వేచియుండు నర్సుని పిలిచి, తేనీరు తెప్పించుకొని త్రాగి, వార్తాపత్రిక చదువుకొనసాగెను. ఇది చావుతెలివియని యచ్చటివారు భావించిరి. వైద్యులువచ్చి పరీక్షించి, స్వస్థత చేకూరినదని నిశ్చయించిరి. కానీ ఆస్థితిలో అతను యుద్యోగములో సురల ప్రవేశించుట కర్హుడుకాడని, స్వగ్రామమునకు పంపిరి. ఇట్లుకొంతకాలము గడచిన పిదప, అతడు కలకత్తాలో తనస్నేహితునియింట నొక పత్రికముఖమున, తాను కలలో చూచిన మహాపురుషుని చిత్రపటమును చూచెను. అతని ఒడలు పులకరించి అశ్రధారలు వాహినులయ్యెను. స్నేహితుని వలన, అతడు, సోనాముఖియందలి, భగవాన్ శ్రీకుసుమ హరనాథులని తెలుసుకొని మరు బండికే యామహాపురుషుని దర్శించుటకు ప్రయాణమున కాయత్తుడయ్యెను. అది యేమి విచిత్రమోగాని, మరుసటి దినము ప్రభువు యొద్దనుండి, ఈతని విలాసమున కొక జాబువచ్చెను. అందు "నాయనా నన్ను చూచుటకు నీకుసమయము రాలేదు. ఈనాటి నుండి ఆరునెలలు గడచినపిదప, అస్సాం నుంచి మంచితేయాకు తీసుకొని, నన్ను చూడగలవని వ్రాసి యుండెను. ఆజాబు చూచుకొని అభక్తుడు పడిన వేదన అనుభవైక్యవేద్యము. గడువుపూర్తికాగానే ప్రభుయాజ్ఞానుసారము, అస్సాంనుంచి ఒక బస్తా మంచి తేయాకు తీసుకొని, బంకూర స్టేషప్‌లో రైలుమారి, ఆవేదనతో సోనాముఖి చేరెను. అచ్చటనుండి శ్రీవారి గృహమునకు పరుగిడుచూ వెళ్ళి, ప్రభువు వారినే గుర్తు పట్టలేక, ఠాకూర్ హరనాథుల దర్శించవలెనని, శ్రీవారినే యడిగెను. అంత శ్రీవారు "నాయనా! నీవు తేనీరు పుచ్చుకొనుము, యిప్పుడే వారిని దర్శించగలవ'ని సెలవిచ్చిరి. 'తేనీరు' అనుశబ్దము వినగానే తాను బంకూర స్టేషన్‌లో మరచివచ్చిన తేయాకు బస్తా గుర్తుకువచ్చి విలపించసాగెను. వెంటనే శ్రీవారు "నాయనా! ఏల

వగపెదవు? నీతేయాకు బస్తా తెచ్చుటకు మనిషిని పంపియుంటి' నని యాతనితో బల్కెను. అంత నాతడు, దిగ్భ్రాంతుడై ప్రభువు వారిని కలియజూచుసరికి, తాను కలలో జూచిన మహనీయుని యాకారము ప్రభువునందు ద్యోతకమయ్యెను. ఇంక యాభక్తుని యావేదన జెప్పనలవిగాదు.

ప్రభుకటాక్ష పాత్రులైన వారిలో దీర్ఘకాల దుర్ఘటములైన వ్యాధులు నుండి విముక్తి జెందినవారేగాక. మరణించి, పునర్జీవులైన వారు పెక్కులుగలరు. మన యాంధ్రదేశములో శ్రీ అదూరి సత్యనారాయణ గారు, వారి తల్లిగారితో గూడ కాశీ క్షేత్రమునకు వెళ్ళుచూ, నొక మహనీయుడు సోనాముఖిక్షేత్రమున నున్నట్లు విని మనప్రభువును సందర్శించెను. అప్పటికి శ్రీ కుసుమ హరనాథులు భగవత్స్వరూపులని వారికి విశ్వాసములేదు. కాశీక్షేత్రమునకు వెళ్ళనటువంటి శ్రీ సత్యనారాయణగారు అకాలముగ మరణించిరి. వీరికి దహన క్రియలకు ఏర్పాట్లు జరుగుచుండగా, వారి తల్లి శ్రీ కుసుమ హరనాథ భగవానుని తల్చుకొని, తన ఏకైక పుత్రుని అకాలమరణమునకు మిగుల విలపించెను. కరుణా సముద్రుడగు శ్రీ హరనాథ భగవానులు శ్రీ సత్యనారాయణగారికి ప్రాణదానము చేసెను. వారు తిరుగు ప్రయాణములో సోనాముఖి క్షేత్రమున హరనాథ భగవానుని దర్శించి వేనోళ్ళ స్తుతించుచూ, పూనాలో చాలా కాలము వుద్యోగముయిచేయుచు, ఫలితవయస్సున కాలధర్మమునొందిరి.

పశ్చిమ వంగదేశమున చంద్రనగర్ అనువట్టణములో రమాప్రసాద్ ఘోష్ బాబాయను పుణ్యపురుషుడుగలడు. వీరి సోదరి, తమాలినీమా ప్రభుభక్తురాలు. వీరు మొదటి ప్రపంచ సంగ్రామమున ఫ్రాన్సులో మిలిటరి యుద్యోగములోయుండి. తుపాకి కాల్పువల్ల మరణించి, పూడ్చబడుటకు శవ పేటికలో బిగించబడిరి. అట్టిసమయమున ప్రభుసందర్శనమయ్యెను. “నాయనా నీవు మరణించితివి. కానీ నీవు నన్ను విడువక స్మరించితివి. నీకు ప్రాణదానము జేయుచున్నాను, వెలుపలకు రమ్ము”ని సందేశము వచ్చినది. వచ్చుటయే తడవుగా పెట్టెకు కొట్టినబీలలు పీచ్చుకొనెను. ఘోష్‌బాబా పెట్టెనుండి వెలుపలవచ్చి తన పునర్జీవితము పై అధికారిని నివేదించుకొని తనమిలిటరీ జీవితము విముక్తిచేయించుకొనెను. వారు స్వగ్రామముచేరి, శ్రీవారిని సేవించుచూ, యిప్పటికిని జీవించియున్నారు.

విచిత్రమేమన భగవానుని దర్శించిన వారినేగాక. విశ్వాసములేనివారిని తదితరులనుగూడ శ్రీకుసుమహరనాథ భగవానులు వారి అపార నిర్వ్యాజ కటాక్షముచే రక్షించిరి. శ్రీవారు తమ సహజమూర్తి మత్వముతో రాజులు మొదలైన వారినిగూడా సామాన్యవేషముతోనే, సద్రుభావముతోనే తన చరణకమలములందు, వంగినమస్కరించునట్లు చేయుచుండిరి మనయాంధ్రదేశమున లక్షలాదిగాగల భగవాన్ శ్రీకుసుమ హరనాథ భక్తకోటికి నిది స్వానుభవసిద్ధమే.

ఇట్లు విశ్వమయులు, విశ్వాత్మకులు విశ్వసములైన శ్రీభగవాన్ కుసుమహరనాథులు, శ్రీకృష్ణప్రేమను వెదజల్లుటకై యాభువిన వతరించిరి. ప్రేమావతారులగు అవతార మూర్తులందరునూ, వారివారి

లీలావిభూతులవల్లనే భక్తహృదయముల నాకర్షించుకొని, పాపపంకిలమును తరింపజేసి, నిశ్శ్రేయసమొసగుదురు.

హత్రాస్ స్టేషన్‌లో నుద్యోగియగు శ్రీఅటల్ బిహారీనాంది యనునతడు, ప్రప్రథమమున శ్రీకుసుమహరనాథుల ప్రభావమును గుర్తించి తనస్నేహితులతోనూ, పరిచితులతోనూ, భగవానుని ప్రభావమును వెల్లడించెను. నాటినుండియూ వేనవేలు. శ్రీవారికటాక్షమునకు పాత్రులై వారి వారి సంకటములనుండి విముక్తులగుచుండిరి. కాశ్మీరములో శ్రీవారు వుద్యోగములో నున్నప్పుడు వారి భక్తకోటికి అమూల్యములైన లేఖలు వ్రాయుచుండెడివారు. శ్రీవారి అనుమతి తీసుకొని అటల్ బిహారీనాంది 392 లేఖలను "పాగల్ హరనాథ్ పత్రావళి" యను పేరుతో వంగభాషలో ప్రచురించెను. ఈ లేఖలను శ్రీవారు పర్యవేక్షించిరి. ఈ లేఖలు ఆంధ్ర, ఆంగ్ల, హిందీ, గుజరాత్ భాషల యందు అనువదింపబడినవి. ఇందు ప్రధానముగా నామసంకీర్తనమునకన్నా వేరొక తరుణోపాయము లేదనియూ, సకలవిధములైన ఆధివ్యాధులకు, నామముతప్ప భవౌషధముమువ్వేటికి లేదనియునూ, యెట్టిసంకోచములేక నెట్టి నిబంధనలు లేక హృదయపూర్వకముగా ప్రీతితో భగన్నామము చేయుచుండిన మనసంకటములన్నియూ శ్రీకృష్ణపరమాత్ముడు తప్పక తీర్చగలడనియూ, తీర్చియున్నాడనియూ, శ్రీభగవాన్ శ్రీహరనాథులు బోధించియున్నారు. మనము ప్రాచీనసాంప్రదాయములను, ఆచరణయందునూ, ఆదర్శములయందునూ. తప్పక ఆచరింపవలయుననియూ, భక్తిప్రపత్తులచేత, సంచితమును, ఆగామియునగు పాపచయము అగ్నిచేత దూదిరాశివలె భస్మమగుననియూ శ్రీవారు 'ఉపదేశామృతమున' బోధించియున్నారు. భక్తులు ఓర్వరాని రోగబాధ్యలను, భగవాన్ శ్రీ కుసుమహరనాథులు, తమపై నాకర్షించుకొని ఆబాధ నివారణచేసిన యత్యద్భుతచర్యలు వేలు గలవు. మన పాపభారము తాను మోయుదుననియు, మనము నిశ్చింతగా, హరినామముచేయుచూ, స్వర్గసామ్రాజ్యముననుండి, మన పాపభారములవల్ల తాను నరలోకముననున్ననూ, అంతకన్నా తన జన్మకు సాఫల్యతలేదని, మనలను బ్రతిమాలి, బుజ్జగించి, ప్రాధేయపడి, ప్రబోధించియున్నారు. ఇట్టివారు వ్రాయుజాబులలో 'మీపిచ్చిబిడ్డ' డని తన్ను సంబోధించుకొని యున్నారు. అట్టి శ్రీ కుసుమహరనాథులకె 'పాగల్' యను నామము ప్రసిద్ధికెక్కినది. ఆత్మార్పణ్యమేమన, నొకసత్రములో 'పాగల్' యను బిరుదము వహింపగల్గినది శ్రీ నిత్యానందునకే దక్కెననియూ, ఆ 'పాగల్' బిరుదము తనకబ్బుట తనజన్మ సాఫల్యమని శ్రీవారు నొకపరి వ్రాసియున్నారు.

భగవాన్ శ్రీహరనాథ తత్వమేదియని కొందరు పామరులు ప్రశ్నించుటకద్దు. ఈ విధముగానే ఉద్ధవులు శ్రీకృష్ణపరమాత్మను ప్రశ్నించియుండిరి. దీనికి శ్రీహరనాథ భగవానులుచెప్పిన సమాధానమే శ్రీకృష్ణభగవానులు ఉద్ధవులకుచెప్పియుండిరి. తత్వమిదియని తనకే తెలియదనియూ, దానితోభక్తులకేలాటి ప్రమేయము లేదనియు, భక్తుడు, తన బాగోగులను తానుచూచుకొను వానికి, తన పత్రావళిలో సంపూర్ణమైన

సమాధానము. పొరుగువారియెడ నెప్పుడుం
డిరి. ఇంటియందు ప్రతికూలముగా
తన్ను సురక్షితముగా, వారి హృదయ
ములో వారి దాచుకొనిన తనకు జ్ఞాన
మున్న కోరియుండెను. మరియు, ఇంటింటి
గా, నాగనాగా తనయందేయనంతటికి
అనుకూలముగానిదియు, తన వారి కాని
యన్ను కొందరనియు, శ్రీవారు సెలవిచ్చి
యుండిరి. ఒకతడియందు శ్రీవారు, «నావా
సముదాయము కాకుండ నేను నన్నప్పుడు" నా
సనిమన్నారు - నేను భక్తిపరాధీనుడనై
యున్న సమయములను. సజ్జనులగను జేయు
ము" అని సెలవిచ్చియుండిరి.

నామ సంకీర్తనము చేయునప్పుడు.
వ్యక్తిగత సంకీర్తనమునకన్న, సామూహిక
సంకీర్తన అమోఘఫలదాయకమని శ్రీవారు సెల
విచ్చియుండిరి. సంకీర్తనము చేయునప్పుడు
నిర్భయముగ, నిర్మలమైన మనస్సుతో సంకీర్త
నము చేయవలెను, భగవన్నామము పాడను
చేయుటయేగాక, అత్మ సంతోషము చేయ
ను, అనాథావరణ సంతోషము పవిత్రము
గా యుండునని శ్రీవారు నొక్కి వక్కాణిం
చిరి. భగవాన్ శ్రీకృష్ణ హరనాథులు,
తన భక్తులను. «మీరే నాకిష్టులు,
మీరే నా ప్రాణములు. మీరు యెట్టి
వైన కల్మషపూరితులైననూ, నాకు అకల్మష
మంటు" అని పదేపదే హెచ్చరించియుం
డిరి." మీసుఖము, నాసుఖము. మీదుఃఖమే
నాదుఃఖము. మీరే నాశరీరము, కనుక
మీరు మీ పాపభారము నామీపనైవైచి,
నిశ్చింతగా హరినామ, యానంద డోలిక
లలో దేలియాడుచుండుడు. మీకు సకల
సౌభాగ్యములు శ్రీకృష్ణ భగవానులు
చేకూర్చు నని శ్రీకృష్ణ హరనాథులు
పలుమారు నొక్కి వక్కాణించిరి.

ఇట్లు తన్ను సందర్శించిన వారికి,
ఉత్తరములేసిన వారికి, తన యందవిరామముగ
వారికి, దేశ, కాల, మత, భేదములేక, స్త్రీ
పురుష భేదము. అవతారమూర్తియగు భగ
వాన్ శ్రీకృష్ణ హరనాథులు రక్షించు
చున్నారు.

శ్రీవారు పరమపదించిరి శ్రీ॥ శ॥
1927 సం॥ మున నాటినుండియు, భక్తుల
హృదయములో వారిప్పటికి, నుండియై
యున్నారు. ప్రభువే శాపు, శరీరముతో
బంధింప బడియున్నప్పటికి, తన యంతర్యా
మిత్వమును, తన విభూతి మహిమలు
వ్యాపకమగు' నని సెలవిచ్చియుండిరి.
ఈ అనుభవములు «హరనాధయుగి"
యను మాసపత్రికలోను, ఆంగ్లమున
«Divine Pen" యను మాసపత్రికలో
పఠనము జూడనగును. ఆంధ్ర దేశమున
శ్రీవారి నామప్రచారమును «శ్రీకృష్ణ
హరనాథ్ సెంట్రల్ మిషన్" వారు.
హైదరాబాదునుండి చేయుచున్నారు. ప్రభు
నామ సంకీర్తన మహిమ యింతయని చెప్పుట
నలవికానిది. «కృష్ణహర" యను నామ
మును దినమునకు ఇరువదివేలు మాత్రమైన
జపించిన యెట్టి దుర్ఘటమైన వ్యాధులు
సహితము తప్పక నివారణము కాగలవు.
ఇది ముమ్మాటికి సత్యము.

నెల్లూరు మండలమునకు శ్రీ॥ శ॥
1940 వ సంవత్సరము శ్రీ రాళ్లబండి వీర
భద్రరావుగారు, B. A., LT., (Rtd.
D. E. O) వెంకటగిరిలో Deputy
Inspector గా పనిచేయుచున్నప్పుడు

భగవాన్ శ్రీకుసుమ హరనాథులు, వారిని తమ యుపకరణముగా జేసికొని నెల్లూరు మండలము నందలి యాత్రకోటికి నమూల్యమైన, అఖండములైన యుపన్యాసముల వలననూ, భజనల వలననూ, ఏకాహ, త్రయాహ, సప్తాహ నామసంకీర్తనల వలననూ ప్రచారము గావించుకొనెను. మరియు, ప్రస్తుతము, పుణ్యక్షేత్రమగు తిరుపతి వాస్తవ్యులగు శ్రీ వుండవల్లి అంజనేయదాసు దంపతులు, మన యాంధ్ర దేశము ననే గాక, ఇతర రాష్ట్రములందునూ, శ్రీకుసుమ హర' నామప్రచారము గావించుచూ, నామదీక్ష నొసగుచూ, తద్వారా యనేక రుగ్మతలను బాగుజేయుచూ, శ్రీ కుసుమ హరనాథ భగవానుల పాద కమలములయు వేలాది ప్రజలకు భక్తిని నెలకొల్పిరి. తత్ఫలితముగా నెల్లూరు మండలములో శ్రీ కుసుమ హరనాథ దేవాలయములు, మందిరములు, నెలకొల్పబడినవి. నెల్లూరులో కీ॥ శే॥ రాయవరపు సుబ్బారావు శ్రేష్ఠిగారునూ. కావలిలో శ్రీ సామి శేషాచలం శ్రేష్ఠిగారును దేవాలయములు నిర్మించి, నిత్య దీపనైవేద్య పూజాదికముల నేర్పరచిరి. సింగరాయ కొండయందు శ్రీ గాదిరెడ్డి వెంకటసుబ్బయ్య గారు బాబామందిరమును, సంకీర్తనా మందిరమునూ, కడురమ్యముగా నిర్మించిరి. ఇంకనూ యితర గ్రామములయందునూ, యనేకములైన మందిరములు నిర్మింపబడి భజనలు, సంకీర్తనములు గావింపబడుచున్నవి. ఆంధ్రదేశమున విశాఖ జల్లా, మవ్వాడ గ్రామములోనూ, గుంటూరు మండలమున, గుంటూరునూ, గోదావరి జిల్లా భద్రాచల క్షేత్రమందునూ, వరంగల్లు జిల్లాయందలి కంబళ్ళపల్లెలోనూ, భగవాన్ శ్రీ కుసుమ హరనాథ దేవాలయములు, ఆశ్రమములు, కడురమ్యముగా నిర్మితములైయున్నవి. హైదరాబాదు మొదలుకొని ప్రతి జిల్లాలోనూ, ప్రచార సంస్థలూ, సంకీర్తన మందిరములు నిర్మింపబడియున్నవి.

కాన. మనమందరము, కలియుగ కృపావతారులైన శ్రీ కుసుమ హరనాథ భగవానుల సేవించి. స్వీయునిగా జేసుకొని, వారి నిర్వ్యాజ, అపార కటాక్షమునకు పాత్రులమై, ధన్యుల మగుదుముగాక.

జైబోలో శ్రీకుసుమ హరనాథ భగవానులకు జై!

ఇఇఇఇఇ

పి॥

ఇయమనునయతి ప్రియం క్రుద్ధ మేషా
ప్రియే ణానునీతా ప్రసీద త్యసౌ ।
సప్తతన్త్రీ ర్న స్వైర్ఘట్టయన్తీ కలంకాకలీ
పంచమప్రాయ ముత్కంఠతా
వల్గు గీతాపదేశేన విక్రోశతి ॥

వ్యామిలిక—పాదతాడితక IV 24. 43. 44.

## చిత్ర విచిత్రములు

### 10

పవిత్రస్థలముల మాలిన్యముచేయు సమర్థులున్నారని చెప్పుటయు విచిత్రవిషయమే కాగలదు. మండపాల వీధియందు అనాదిగా శైవవైష్ణవ సంబంధమగు రెండు మండపములు గలవు. ఆస్తికులు, భక్తులనగు ఉభయకర్తల యుత్సవములు చేయునప్పుడు, ఆయా ఉత్సవ మూర్తులు నగరి ఊరేగింపు సమయములందు, భక్తుల కానుకల స్వీకరించుటకు ఆయా మండపములందు వేంచేయుట అనాది సంప్రదాయము. అట్టి పవిత్రమగుచోట్ల, ఇండ్లు కట్టికొని. వ్యాపారముకొరకై ఇంధనశాల నేర్పరచికొని యున్నారు. ఇట్లున్నవారిని, వీరికి ఈ అనుమతిచ్చిన వారిని నాస్తికులన చెల్లునా?

### 11

దేవళ ప్రాంగణమున మానవులు కాపురముండరాదు. ఇట్లుచేయుట మహాపాతకము. వైదిక సంప్రదాయము కలవారు కోవెలలందు వసించిన, వారికేగాక వారి వంశీయులకును ప్రమాద హేతువగును. ఆత్మకూరు శివాలయ గర్భగృహమందు ఒక వైశ్యకుటుంబము కాపురమున్నది. ఇది, లజ్జాకరమగు విషయమేగాక వారిశ్రేయస్సు కొఱకై ఈ అకృత్య పుణ్యమును గూర్చి వ్రాయడమైనది. ఆపుణ్యస్థలమును వదలి దేవతా మూర్తుల అచ్చట స్థాపించి, జీర్ణోద్ధారణచేసి, వారును ఆయూరి సమాజమువారును పుణ్యమును ప్రాప్తింప చేసుకొందురుగాక.

### 12

అనంతసాగరమునుండి సోమశిల పోవుమార్గముదాపున ఒక శ్రీరామ విగ్రహముండెడిది. ఎండకు తప్తమై, వానకు తడసి యుండుట, అనంతసాగర గ్రామస్తుడగు తురగా వెంకటయ్య (తండ్రి సుబ్బయ్య) వడ్డెకుల శేఖరుడు, ఓర్చుకొనలేక, ఉడుతాభక్తితో ఆ శ్రీరామునకు మందిరము నిర్మింపగోరి 1948 సం॥ నుండి తానొక్కడే దినమునకొకరాయి చొప్పున తెచ్చి దేవాయతనమును నిర్మించుచున్నాడు. రోముపట్టణము ఒక్క దినమున కట్టలేదుకదా! ఈపుణ్యచరిత్రుడు, తన జీవితమును శ్రీరామ కైంకర్యమందు లీనమొనర్చుకొనుచున్నాడు.

46.

# ఆశ్రమములు

శ్రీ సి. పి. రావు. ఎం. యస్.సి.

విక్రమ సింహపురి మండలమందలి
"ఆశ్రమములు"

హిందూమతమునకు అసలు పేరు 'సనాతనధర్మము'. మానవుడు తన జీవిత చరిత్రలోని వివిధావస్థలలో-బాల్య, యౌవన కౌమార, వార్థక్యావస్థ యందనుసరింపవలసిన యాయాధర్మముల నిది నిర్దేశించుచున్నది. 'ఆశ్రామ్యంతి స్వం స్వం తపః' యని తమ తమ నియతమైన తపఃక్రమమునను ష్ఠించుటే ఆశ్రమ లక్షణము. బ్రహ్మచర్య గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాసములని నాల్గు విధములుగా నాశ్రమ ధర్మములను నిబంధించియున్నారు. పట్టణవాసులే కానిండు అరణ్యవాసులే కానిండు, ఆయాదశలలోని ఆశ్రమ ధర్మములను పాటించినయెడల మానవజీవిత పరమ లక్ష్యమైన బ్రహ్మజ్ఞానము లభించునట్లుగా మన సనాతన ధర్మము నిర్దేశించుచున్నది. కాని మౌనము నవలంభించిన మునులు, తపస్సుచేయు తాపసులు, బ్రహ్మజ్ఞానా రూఢస్థితినొందిన మహర్షులు, తమ నివాసస్థలమును అరణ్యములందేర్పాటు చేసికొనుటచే యీమున్యాశ్రమములకు, ఋష్యాశ్రమములకు ప్రతిష్ట కల్గినది. ఈధర్మములను ఆదర్శయుతముగా నాచరణలోనుంచి ప్రాచీనార్య ఋషులు యీ 'ఆశ్రమ' ములకు పవిత్రత ప్రాముఖ్యత నార్జించిరి. తమ మహత్తర తపోశక్తిచే తమ కుటీరములే ఆధ్యాత్మిక విద్యాదాన కేంద్రములైన 'ఆశ్రమము' లుగా విలసిల్లజేసిన అత్రి, గౌతమ, జమదగ్ని, వసిష్ట, విశ్వామిత్ర, యాజ్ఞవల్క్య, పరాశర, వ్యాస, వాల్మీకాది మహర్షు లనేకులగుటను మన శాస్త్రములు తెల్పుచునేయున్నవి.

ఈ 20 వ శతాబ్దమునందు ఆదర్శనీయమైన ఆశ్రమ ధర్మనిరతులై మన సనాతన ధర్మము ననుసరించువారు చాల యరుదనియె చెప్పవచ్చును. ప్రస్తుతము 'ఆశ్రమ' మనేపదము సన్యాసులను స్ఫురింపజేస్తుంది ఈ 'ఆశ్రమవాసులు భక్తియోగ సంబంధమైన ఈశ్వర నామ జపసంకీర్తనాదులు; రాజయోగ పరమైన ప్రాణాయామధ్యానాది సాధనలు; కర్మయోగ రూపకమైన విద్యాలయ, గ్రంధాలయ, వైద్యాలయాదుల నిర్వహణ; జ్ఞానయోగ మార్గమైన వేదాంత విచారణ, వేదాంత గ్రంధ పఠనాది కార్య కలాపములందు నిమగ్నులై మానవజీవిత లక్ష్యసాధనకు మార్గదర్శకులై వర్తిల్లుచున్నారు. లౌకిక పారమార్థిక విద్యాదానకేంద్రములై ప్రఖ్యాతి నొందిన ఆశ్రమములెన్నో యున్నవి.

పూర్వకాలపు రాజులు, ఋషులను, వారి ఆశ్రమములను పోషించి, పూజించినట్లు, యీ ప్రజారాజ్యయుగమున ప్రజలే తమ యాధ్యాత్మిక పిపాసతీర్పు సాధుప

లను, వారి ఆశ్రమములను పోషించి పూజించుచున్నారు. ఆయా యాశ్రమ స్థాపకుల యాధ్యాత్మిక సాధన, తపోబలసౌన్న త్యాలపై ముఖ్యంగాను, అతదుపరి ప్రాంతీయ ప్రజల మానసిక పరిణామౌన్నత్యము దైవచింతనాది యాస్తిక్యతలపై వివిధ ఆశ్రమముల పరిస్థితులాధార పడియున్నవి. భారతదేశ జాతీయతకు హృదయమువంటిదైన 'ఆధ్యాత్మిక జీవనము' నకు చిహ్నములైన యీ 'ఆశ్రమము' లు దేశమంతట వెలసియున్నవి. మన సింహపురి మండలమునగూడ యిట్టి అధ్యాత్మిక విద్యాదాన కేంద్రము లున్నవనుటలో యతిశయోక్తి లేదు.

1. చిదానందాశ్రమము: (రాముడుపాళెం

సింహపురి పట్టణమునకు తూర్పుగా పోయి గంగపట్నంచేరి అచ్చటికి ఉత్తరంగా 2 లేక 3 మైళ్లు వల్లగా నడకసాగించిన రాముడుపాళెము చేరుతాము. ఈగ్రామప్రజల ప్రోత్సాహాదరణలతో స్వామి చిదానందగారి ఆశ్రమమును నిర్వహించుచున్నారు. షుమారు 14 సం॥ క్రితము 1949 లో ఈస్వామి యిచ్చటికి విచ్చేసారు. వీరు ఋషికేష్, వారణాశి, మున్నగు పుణ్యక్షేత్రములందున్న ఆశ్రమములను దర్శించి కొంత కాలమచట నివసించారు. శ్రీ మళయాళ స్వామిగారి వ్యాసాశ్రమమందు కొంతకాలమున్నపిదప యిచ్చటికి విచ్చేసి ఈ ఆశ్రమమును ఏర్పాటుచేసారు.

చుట్టూఖాళీస్థలముతో కూడిన కుటీరము, దానిచుట్టూ పొలాలు, చెట్లు ప్రశాంత వాతావరణముతో ఉంటుంది. పట్టణ వాతావరణంలో నివసించిన నాకు ఇసుకడొంకలో ఏకాంతమైన నడక, అటు, ఇటు వరిపొలాలు మధ్య మధ్య కాలువలుదాటి ఈ నిశ్శబ్ద ప్రశాంత వాతావరణంలోని ఆశ్రమం చేరేటప్పటికి మనస్సుకు చాలహాయి గొల్పినది. 'ఇక్కడేకొన్ని రోజులుందామా' యని అనిపించినది. ఇచ్చటికి ఒకమైలు దూరంలో సముద్రతీరమున్నది.

స్వామి చిదానందగారు చాల సాత్విక గుణసంపన్నులు. నేను ఆశ్రమంచేరేటప్పటికి స్వామిజీ భగవద్గీతలో 7 8 అధ్యాయ పఠనవలనకల్గెడి పుణ్యఫలితాన్నిగూర్చిన కధలలను పఠిస్తున్నారు. ఆగ్రామస్థులైన స్త్రీ పురుషులు ఆసక్తితో ఆలకిస్తుండినారు. ఆ కుటీరంలో శ్రీమళయాళస్వామి, శివానంద, వివేకానంద, రమణమహర్షి మున్నగు మహనీయుల చిత్రములున్నవి. ఉదయము భగవద్గీతాపారాయణ పూజాదులు, మధ్యాహ్నము పురాణాది సద్గ్రంధ పఠనము - అనుదిన కార్యక్రమముగా నిర్వహించబడుచున్నది.

2. బ్రహ్మానందాశ్రమము: (గంగపట్నం)

ఇనమడుగు సత్యానంద మహర్షివద్ద సన్యాసము పుచ్చుకొన్న శ్రీ స దా నం ద స్వామి గారున్నారిట. వీరికి సంస్కృతాంధ్రములలో జ్యోతిష్‌శాస్త్రములో పరిచయమున్నది. గంగపట్నం 'స్వామి' యనబడే వీరిని కలిసికొనగా యీ 'ప్రాంతప్రజలయందాశక్తి లేకుండుట చేతనే కార్యక్రమము నడుపలేకున్నానని తెల్పారు.

3. సత్యానందాశ్రమము: (ఇనమడుగు)

ఇనమడుగు నెల్లూరునకు 3 లేక 4 మైళ్ల ఉత్తరదిక్కుననున్నది. ఆగ్రామ భక్తురాలు శ్రీమౌనమ్మగారుసమర్పించినతోటలో




"భగవాన్ సత్యానంద మహర్షి"

1934సం॥న శ్రీస్వామి సత్యానంద గారీయాశ్రమమును నెలకొల్పిరి. ఇచ్చట 10 సం॥ లు తీవ్ర తపంబొనర్చి 1944సం॥ యోగసిద్ధి పొందిరి. అటుపిమ్మట సత్యానంద తీర్థావధూతయను పేర నాధ్యాత్మిక ప్రచారము చేయుచు సంచారము మొదలిడిరి. 1947 సం॥ నుండి 'విశ్వమీమాంస' పత్రికనుకూడ నడుపుచున్నారు. 1949 నుండి 1952 వరకు వేసవి పాఠశాలనునడపి లౌకిక, ఆధ్యాత్మిక విద్యలలో బాలబాలికలకు శిక్షణనిచ్చిరి.

ఇప్పుడీ ఆశ్రమము మనజిల్లాలో నున్నవానిలో పెద్దదని చెప్పవచ్చును. గీతాపారాయణ, పురాణకాలక్షేపాదులకనువగు 'విశ్వజ్ఞానవిహార' మనుహాలులో శ్రీ చైతన్య, శంకరాచార్య, రామానుజ, రమణ మహర్షి, వివేకానందాది మహనీయుల చిత్రపటములు సత్యానందస్వామిజీ ఫోటోలు యున్నవి. హాలునకు పశ్చిమమున శ్రీవెంకమాంబాలయమను యొక భక్తురాలి సమాధి యున్నది. తూర్పున గ్రంథాలయము దాని కవతల వంటగదియున్నవి. మిద్దెపైగదిలో స్వాములవారి నివాసము. మూడవఅంతస్థున 1955 వసం॥ కాశీనుండికొనితెచ్చిన శ్రీజగదాంబ, గౌరీశంకర్ నందీశ్వరుల పాలరాతి విగ్రహములు ప్రతిష్ఠింపబడియున్నవి.

1951 వ సం॥ స్వామీజీ సమాధి నిమగ్నులైనప్పుడుగల్గిన దివ్యాదేశానుసారము పశ్చిమగోదావరిజిల్లాలోని శ్రీ తారకేశ్వర శివలింగమునుతెచ్చి ఆశ్రమమున శ్రీ రక్షణమందిరమున ప్రతిష్ఠించిరి. ఆశ్రమ ఆరామములో వివిధ ఫలవృక్షములు భక్తుల నాహ్వానించుచుండును.

సత్యానందాశ్రమము.



ఈ ఆశ్రమ శాఖలు ఈ క్రింది ప్రాంతములలోకూడ నున్నవి.

1. శ్రీరమణ సత్యానంద భక్తసమాజము ఉంగుటూరు.
2. శ్రీ సత్యదేవ మహిళాసంఘము విజయనగరము.
3. శ్రీ గీతామండలి, ఖుర్దారోడ్డు.
4. శ్రీ తారకేశ్వర భక్తసమాజము, ఖర్గపూర్.
5. భగవాన్ సత్యానంద మహర్షి భక్తమండలి బొంబాయి.
6. శ్రీ సత్యానంద విహార్ ఎలమంచిలి, విశాఖపట్నం

ప్రస్తుత మాశ్రమ నిర్వాహణ యువకస్వామి బ్రహ్మానంద బ్రహ్మచారి, సత్యపాదానంద గార్ల చేతి మీదుగా జరుగుచున్నది. శ్రీ బొమ్మిసెట్టి యల్లమందయ్య, ప్రిన్సిపాల్ వివేకానంద విద్యాలయము; పి. రాధాకృష్ణగుప్త యం. ఏ., బి. యల్. అడ్వొకేటు తదితరులతో కార్యనిర్వాహక వర్గమేర్పడి ఆశ్రమము రిజిష్టర్డ్ సంస్థగా చేయబడియున్నది.

హరేరామక్షేత్రము: (ఇనమడుగు)

ఇనమడుగులో శ్రీరామకృష్ణానంద మహాస్వాములవారు 1954 సం॥ ఆంధ్ర ప్రదేశ్ హరేరామ సంఘము - హరేరామ క్షేత్రము' స్థాపించిరి. అందు సత్సంగ కాలక్షేపములు, భగవన్నామసంకీర్తనము, పర్వదినములందు విశేష కార్యక్రమములు జరుగుచున్నవి. 1960సం॥ న ద్వాదశ వర్షసత్రయాగము' ప్రారంభింపబడి జయప్రదముగ

జరుగుచున్నది. "హరేరామ హరేరామ, రామరామ హరేహరే హరేకృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే" అను మహా మంత్రము రేయింబవళ్ళు జపింపబడుచున్నది. ఇందు పాల్గొను భక్తులకు ఉచిత భోజనాది వసతుల నేర్పాటు చేసియున్నారు.

గ్రామమునకు పశ్చిమమున, రోడ్డుకు ఉత్తరముగా ఈ ఆశ్రమమున్నది. అందు ఒక హాలు, పూజామందిరము, మిద్దెపై స్వాములవారుండు గదియున్నవి. హాలులో శ్రీ రమణ మహర్షి, తుకారామ్, వివేకానందాదుల యొక్కయు, యీ ఆశ్రమ స్థాపకులైన శ్రీరామకృష్ణానంద మహాస్వాములవారి ఫోటోలు ఉన్నవి. పూజామందిరమున- శ్రీ అనంత కోదండ స్వామివారు శ్రీ అనంత వేణుగోపాలస్వామివారు ప్రత్యక్షదైవములై మానవుల మనోరథముల నీడేర్చుచున్నారు.

ఆశ్రమమును పోషించు భక్తులనేకులు మన జిల్లాలోను, యితర ప్రాంతములందును న్నారు. అడపాలకృష్ణారెడ్డి, (తురిమెర్ల) సాధ్వి తుంగాశేషమ్మ, (వుత్తేడు) గారలు స్వామిజీ నివసించు గది కట్టుటకు రూ. 6000 లు సమర్పించినారు.

### 5. యోగి రామమఠము లేక రామాశ్రమము (అన్నారెడ్డిపాళెం)

అన్నారెడ్డిపాళెమను గ్రామమున షుమారు 46 సంవత్సరముల క్రితము, వారి ప్రథమ గురువర్యులైన శ్రీ బహ్మానంద తీర్థ గారి యాజ్ఞానుసారము, శ్రీ రామయోగి వర్యులీ 'రామాశ్రమము' లేక 'యోగిరామ మఠము' నేర్పాటుచేసుకొనిరి. యోగవాశిష్టమునకు సజీవ వ్యాఖ్యానమనదగు తమ జీవితమే సాధకుల కుపదేశ-ఆదర్శములుగా శ్రీరామ యోగీంద్రులు యోగసాధనచేసి ఆత్మసాక్షాత్కారము పొంది, విహరించిన తపోభూమి యీ రామాశ్రమము.

గేటుదాటి యాశ్రమము ప్రవేశించిన వెంటనే కనబడు కట్టడమునందే క్రిందిగది యోగిగారు ప్రాణాయామ, జపధ్యానాదులు చేసి పవిత్రమొనర్చిన ప్రాంగణము. మిద్దె పైగదిలో వారు కొంతకాలముండిరి తర్వాత యిది ఆశ్రమానికివచ్చేసిన భక్తులుండుట కుపయోగింపబడెడిది. దీనికి సమీపమున ఆశ్రమ బావినుండి వచ్చు పన్ను పోయుకొట్టు, అనుపత్రిగది బ్రహ్మానందతీర్థ గ్రంథాలయగది యున్నవి. దీనికి తూర్పుగా వంటచేయుటకు, భక్తులు భోజనాదులు చేయుటకు పెద్దవసరాతో కూడిన రెండుగదు లున్నవి. వీనిని పార్లపల్లి గ్రామ భూస్వాములు, ప్రథమంలో స్వామిజీ ముఖ్యశిష్యులలో నొకరయిన శ్రీ యెట్టుబోలు సుబ్బరామిరెడ్డిగారు నిర్మించిరి. ఎంతో భక్తిశ్రద్ధలుకల్గి సాత్త్విక గుణసంపన్నులైన ఆదర్శ గృహస్థ శిష్యులు, పేడూరువాస్తవ్యులు శ్రీ నాగారెడ్డి సుందరరామిరెడ్డిగారు, తామెప్పుడైన వచ్చియుండి సాధన చేసికొనుటకు, లేకున్న భక్తుల వసతిగృహముగా నుండుట కనువగు కట్టడము, స్నానగది, వంటచేసికొను సకల పాత్ర సామాగ్రితో ఏర్పాటు చేసియున్నారు. దీనికి ప్రక్కనే స్వామిజీ ఆఖరుదశలో నివసించినగది, మరిరెండు చిన్నగదులు, భక్తులచే కట్టింపబడియున్నవి. ఆశ్రమతోటలో వివిధ ఫలవృక్షములు, గ్రామమండలి



శ్రీ రామయోగిగారు

ఆత్మారామ దేవాలయమునకు పుష్పకైంకర్యమునకు పూదోటయున్నది. యోగిగారి శిష్యులు సాత్విక గుణసంపన్నులైన గృహస్థ శిష్యులు శ్రీ గుంట్రా శేషురెడ్డిగారు శివాలయమును నిర్మించి, యందు యోగిగారిచే శివలింగ ప్రతిష్ఠ చేయించినారు. ఈ దేవాలయార్చనకు కూడ ఆశ్రమ పూతోటనుండి పుష్ప కైంకర్యము జరుగు నేర్పాటు చేయబడినది.


ఆశ్రమమునకు విచ్చేయు భక్తులపై ప్రేమాదరముల చూపుచుండెడి యోగిగారి తల్లి శ్రీరామమ్మగారి సమాధి యీతోటలోనే.

యున్నది. స్వామియందెంతో భక్తి శ్రద్ధలు కల్గి అఖరు దశలో వారి అనుమతితో ఆశ్రమముననే వసించుచు జప సాధనలో నుత్తమ స్థితినొందిన భక్తులు బండా బలరామరెడ్డిగారు 1961 సం॥న మరణించగా వారి సమాధికూడ తోటలోనే కట్టించు నేర్పాటు స్వామిజీ చేశారు.

శ్రీయోగిరామ యతీశ్వరులు 1962 వ సం॥ ఫిబ్రరి 12 వ దేదీన సిద్ధినొందిరి. ఆశ్రమ తోటలోనే యొకభక్తురాలు కట్టించిన కట్టడమందు శ్రీస్వామిజి సమాధి నిర్మింపబడినది. ఇచ్చట నిశ్శబ్దముగా ధ్యానము చేసికొనుట కనువగు, చిన్న గుహవంటి ఏర్పాటుకూడ నున్నది.

ప్రపంచ విఖ్యాతినొందిన పాశ్చాత్య రచయిత, యోగసాధకుడునైన పాల్ బ్రన్‌టన్ దొరగారు, కెనడా సాధకులైన డీగ్లస్ ఫేల్స్ దొరగారు, జకోస్లోవేకియా సాధకులు వాప్లెల్ కెక్, అమెరికా దేశీయులు ఆత్మజ్ఞాన సంఘము(Self-Realisation Fellowship) ను అంతర్జాయ సంఘ వుపాధ్యాక్షులు శ్రీ స్వామి క్రియా నందగిరి, ప్రసిడెంట్ రాజేంద్ర ప్రసాద్ గారు, మరియు ననేక భారతీయులు యోగిగారి సాంగత్య భాగ్యమబ్బిన వారెల్లరు శ్రీవారి అధ్యాత్మక సంపదను గూర్చి కీర్తించి యున్నారు.

భక్తులు నివసించుట కనువగు కట్టడములు, ఫలవృక్షములతో నున్న విశాలమైన తోట, 18 యకరముల మాగాణిభూమి అంతా షుమారు రెండులక్షల రూపాయల ఆస్తిపాస్తులున్న యీ ఆశ్రమము మన నెల్లూరు జిల్లాలోనేగాక, ఆంధ్రరాష్ట్రమందలి ప్రముఖ అధ్యాత్మక కేంద్రములలో నొకటిగా విరాజిల్లు నవకాశముతో నున్నది.



శ్రీ నారాయణ అవధూత

6. విజ్ఞానాశ్రమము తాడిపర్తి.

విరువూరునకు 3 మైళ్ళదూరంలో తాడిపర్తి గ్రామమున్నది. షుమారు 21 సం॥ క్రితము 1942 లో శ్రీనారాయణావధూత గారిచే యీ ఆశ్రమము స్థాపించబడినది. 1943 లో ఈగ్రామ భక్తులైన లక్కు సుబ్బరామిరెడ్డి, లక్కు పెంచలురెడ్డి గార్లు తదితర భక్తుల వదాన్యతతో యిప్పుడున్న కట్టడ మేర్పడినది.

షుమారు 1 1/2 సం॥ క్రితం సమాధి చెందిన శ్రీ నారాయణావధూతగారు ఈ ప్రాంత ప్రజల భక్తి గౌరవాలను చూరగొన్న మహనీయులు.

గేటు దాటిన వెంటనే ముందు ఖాళి స్థలముతో కూడిన షుమారయిన హాలు, ముందు వెనుక వరండాలు, మిద్దెపై అవధూతగా రుండిన గది యున్నవి. హాలులో శ్రీ మహర్షి మళయాళస్వామి రమణమహర్షి శ్రీ రామయోగి మున్నగు మహాత్ముల ఫోటోలు, నారాయణావధూత, సాధు సూరారెడ్డి, సాదు హనుమారెడ్డిగారల ఫోటోలున్నవి. ఈ ఆశ్రమస్థాపన నిర్వహణలో పాల్గొన్న శ్రీ సాధు సూరారెడ్డి నారాయణావదూతగార్ల సమాధుల పైన కట్టడము, సాధువులుండుటకు గది-యివన్ని వెనుక వైపున్నవి.

ఇప్పుడు మహర్షి మళయాళస్వామి వారి శిష్యులు, వారి సేవలో 3, 4, చాతుర్మాస్య వ్రతములలో పాల్గొన్నవారు సదాచార సంపన్నులైన శ్రీ సాధు హనుమారెడ్డి గారి మార్గ దర్శకత్వమున, ప్రొద్దున భగవద్గీత, మధ్యాహ్నము, రాత్రి, సత్కథా కాలక్షేపము సక్రమముగా జరుగుచున్నవి. ఆగ్రామస్థులు ముఖ్యంగా 'లక్కు' వంశస్థులు ఆధ్యాత్మిక జ్ఞానార్జనయందే యాశక్తి గల్గిన ఆదర్శ ప్రజలగుటచే యీ ఆశ్రమ నిర్వహణ మిప్పటికి సక్రమముగా నడుచుచున్నది.

7. శ్రీ శుకాశ్రమము : విరువూరు

పినాకినీ నదీ తీరమున సంగంగ్రామ సమీపమున నున్న విరువూరు గ్రామమందీ యాశ్రమమున్నది. ఇది షుమారు 18 సం॥ క్రితం 1945 న శ్రీమహర్షి మళయాళస్వామి గారి శిష్యులైన శ్రీ నారాయణా నందగిరి స్వాములవారిచే స్థాపించబడినది. ఓ పెద్ద హాలు, చుట్టూ వరండా, శ్రీ శుకమహర్షి పాలరాతి విగ్రహము, వెండితో చేయబడిన ఓమ్ ప్రణవాక్షరములున్న పూజామందిరము - మిద్దెపై స్వాములవారుండు గది ఇతర సాధకుల కివ్వబడిన 2 గదులు వున్నవి. బావి తోట — సమీపములోనే పినాకినీనదీ — ఆశ్రమ వాతావరణం చక్కగనేయున్నది. ఈ స్వాములవారు సంస్కృత పాండిత్యమున్నవారు. ఇచట — ప్రొద్దున ధ్యానము, గీతాపారాయణ, పూజ, మధ్యాహ్నము సత్గ్రంధ పఠనము సాయంత్రము పూజ ధ్యానము. సోమవారము భజనకూడ నుండును. పుణ్య దివసములందు, మహనీయుల జన్మదినోత్సవ సందర్భమున పురాణకాలక్షేపాది ప్రత్యేక కార్యక్రమములుండును. ఇచ్చట మౌనస్వాములనబడెడి వుత్తమ సాధకులు 12 సంవత్సరములుగా మౌన వ్రతమును పాటించుచున్నారు.

8. శ్రీ లక్ష్మణాశ్రమము - చిల్లకూరు

గూడూరు సమీపమున చిల్లకూరను గ్రామమున శ్రీ లక్ష్మణయోగీశ్వరులున్నారు వీరు రమణ మహర్షి శిష్యులు. 14 సం॥ ఏకాంతముగా కుటీరమునందే యుండి సాధన చేయుచుండిరి. శివరాత్రినాడు మాత్రము భక్తులకు దర్శనమిచ్చుచుండిరి. ఈ మధ్యనే మౌన విరమణ చేసినారు. ఇప్పుట స్వామిజీయొక్క అనుష్ఠానమే ఉప దేశ కార్యక్రమమైయున్నది.

9. శాంతి ఆశ్రమము గూడూరు.

సాధు వెంకటేశ్వర్లుగారి మార్గదర్శకత్వమున, గూడూరులో ఊరికివెలుపల సత్గ్రంధపఠన సత్సంగాది కార్యకలాపములతో నడచుచున్నది. ఇటీవల 1 1/2 సం। క్రితమే యీ ఆశ్రమమేర్పడినది. గీతాజయంతి మహనీయుల జన్మదినోత్సవములు ప్రత్యేక ఉపన్యాస పురాణకాలక్షేపాదులు జరుగుచుండును.

10. దత్తాత్రేయాశ్రమము : కసుమర్తిపాడు.

శ్రీ మళయాళస్వామి శిష్యురాలైన దత్తాత్రేయమ్మగారిచే నడుపబడుచున్న యీ ఆశ్రమమున సత్గ్రంధపఠనాది కార్యక్రమములు జరుపబడుచున్నవి. సుమారెనిమిది సంవత్సరములక్రితమిది ఏర్పాటయినది.

11. వీరారెడ్డిపాళెం-తులశమ్మ ఆశ్రమము గూడూరు.

శ్రీ మళయాళస్వామిగారి విగ్రహమిచట ఆవిష్కరింపబడియున్నది. స్వాముల వారుకూడ నిచటికి విచ్చేసి ఉపన్యాసముల నిచ్చియున్నారు. 12 సంవత్సరములుగా శ్రీతులశమ్మగారిచే, యిచ్చట, పూజ, సత్గ్రంధ పఠనాదులు నిర్వహింపబడు చున్నవి.

12, 13, అహోబిలమఠము - రంగనాయకులపేటయందు; దక్షిణామూర్తి మఠము స్టోన్‌హౌస్‌పేట యందున్నవి. ఇవి యిప్పుడు గృహస్థులచే నిర్వహింపబడుచు, దేవాలయములందువలె పూజ, ఉత్సవాది కార్యక్రమములు కల్గియున్నవి.

అహోబిల మఠమునందు డాక్టర్. కె. సంపత్ కుమారయ్యంగార్ ప్రతిష్ఠించిన శ్రీ వెంకటేశ్వర స్వామివారికి, వేదాంత దేశికర్ విగ్రహమునకు పూజాదులు జరుప బడుచున్నవి. ఇవి 5 గురు ట్రస్టీలచే, ఎస్. కేశవాచారిగారు మానేజింగ్ ట్రస్టీగ - కార్యనిర్వాహక వర్గమున్నది.

నెల్లూరు పట్టణమున పైజెప్పిన ఆశ్రమముల వంటివి గాక పోయినను, వాని వంటి ఆశయములు కల్గి కృషిచేయు 'సంఘములు' - సంస్థలు నున్నవి. వీనిలో ముఖ్యమైనవిట క్లుప్తముగా వర్ణింపబడి యున్నవి. ఇవిగాక శ్రీఠాకూర్ అనుకుల చంద్ర; ఠాకు కుసుమ హరనాథ్‌బాబు, పుటపర్తి సత్యసాయిబాబు; పరమహంస యోగానంద; మాతృ శ్రీ అనసూయాదేవి; మాతృ శ్రీ ఆనందమయి, స్వామి శివానంద మున్నగు మహనీయుల భక్తులు ఆయాపేర్లతో సంఘముల నేర్పరచి యున్నారు. వీనిని గూర్చి విస్తృతముగా వర్ణించుట కవకాశము చాలనందున ప్రయత్నించలేము.

1. శంకరమఠము, రాయజీవీధి :

నెల్లూరు రాయజీ వీధియందు మన్నది. ప్రస్తుతపు శంకరాచార్యులవారి పీఠమునకు

చెందినది. ఇది పురాతనమైనది. ఇచట పుష్పగిరి స్వామి వారికి చెందిన దేవతార్చనకలదు. అందుండు వారు ఆ విగ్రహములకు అనుదినము అర్చాదులు జరిపెదరు. ప్రస్తుత మీకార్యక్రమము శ్రీ విశ్వనాథ శ్రౌతిగారిచే నిర్వహింపబడుచున్నది. వివిధ మఠాధిపతులు పరివ్రాజకులు ఇచ్చటికి విచ్చేయుచుందురు.

ఈ మఠమునందు 15-4-53 తేదీన కొందరు నెల్లూరు పురజనులు ఆస్తిక వరేణ్యులు చేరి 'ధర్మమండలి' ని స్థాపించిరి. దీనికి శ్రీ ఎన్. శివరామయ్య బి. ఏ., బి. యల్. గారు అధ్యక్షులుగను శ్రీ సరస్వతుల సుబ్రమణ్యంగారు సెక్రటరీగను పని చేయుచున్నారు. షుమారు 60 మంది సభ్యులున్నారు.

ఈసంఘ యాజమాన్యమున ఆధ్యాత్మిక సంబంధమైన ఉపన్యాసము లిప్పించుట వేదవిహిత కర్మల చేయ ప్రోత్సహించుట వైదిక మతప్రచారము గావించుట భగవత్ భక్తి ప్రచారము గావించుట మున్నగు సత్కార్యములు నిర్వహింప బడుచున్నవి.

ఈ మఠమున ప్రతి సంవత్సరము శంకరాచార్య జయంతి మహోత్సవములు షడ్రాత్ర దీక్షతో వేద పారాయణ మహాన్యాస పూర్వక రుద్రాభిషేక ఉపన్యాసాదులతో ఘనముగా నిర్వహింప బడుచున్నవి.

ప్రతిసంవత్సరము - ఆశ్వయుజ మాసమునందు శరన్నవరాత్రము లతివైభవముగా జరుపబడుచున్నవి.

ధర్మమండలి యాజమాన్యమున అగ్నిహోత్రుల తాతాచార్యులవారు 1959 జూలై ఆగస్టు నెలలో 'వేదము-మానవుడు' అను శీర్షికపై ఆంగ్లమున ఉపన్యాసము లిచ్చిరి. అని తెలుగు తర్జుమా ప్రచురింపబడినది.

భగవద్ధ్యాన శ్లోకములు, ఆత్మవిద్య మున్నగు గ్రంధములు ప్రచురింపబడినవి.

## 2. పినాకినీ విద్యాపీఠము.

ఆర్షవిద్యలను ప్రోత్సహించుట, పండితులను సమ్మానించుట, అనువత్సరము జగద్గురు శంకరాచార్యుల జయంత్యుత్సవములను జరిపి తత్సందర్భమున పండితులచే ఉపన్యాసములజెప్పించుట మొదలగు కార్యక్రమమును జరుపు తలంపున 1947 లో నెల్లూరు కాసుఖేలవారి అగ్రహారమున ఈ విద్యాపీఠము స్థాపింప బడినది. స్థానికులుగా నుండు పెద్దలు పలువురందు సభ్యులుగా నున్నారు.

కాసుఖేలవారి అగ్రహారములోని శ్రీ సదాశివ వేదాంత ప్రవచన మందిరమున ప్రతిసంవత్సరము జగద్గురువుల జయంతిని జరుపుచు పలువురు పండితులను సత్కరించుచున్నారు. కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మ, శ్రీమాన్ నడాదూరు రంగ రామనుజాచార్యులు, శ్రీమాన్ యేటూరి శ్రీనివాసాచార్యులు, కల్లూరి వీరభద్రశాస్త్రి, పుల్య ఉమమహేశ్వరశాస్త్రి, కాళిదాసు వేంకట సుబ్బాశాస్త్రి ప్రభృతి పండితులు పలువురీ పీఠ పక్షమున 116 రూ లతో సమ్మానింపబడిరి. ప్రస్తుత మీ పీఠమునకు ముంగమూరు వేంకటసుబ్బారావుగారధ్యక్షులుగను. శ్రీ కాసారం రామారావు గారు కార్యదర్శిగను పనిచేయుచున్నారు.

పీఠము స్థాపింప బడినది మొదలు నేటివర
కును తదుద్ధరణకై పాటుపడువారు బాల
వ్యాస శ్రీ స్వయంపాకుల వేంకటశేషశాస్త్రి
గారు.

**3. సాయిబాబా భక్తమండలి :**

శ్రీషిర్డి సాయిబాబా భక్తులచే 1944 వ సం॥ శ్రీ బి. వి. నరసింహస్వామి అధ్వర్యమున యీ సంఘముద్భవించినది. 1941 వ సం॥ నుండి సాయిమందిరము నేర్పాటుచేసి పూజాదులు నిర్వహించుచుండిన సాయిభక్తులు శ్రీ డా॥ యం. కె. రాజగోపాలాచారిగారే యీ సంఘ స్థాపక కార్యదర్శి. శ్రీ యం. వి. సుబ్బారావుగారధ్యక్షులుగా ప్రథమము నుండి ఎన్నికగుచున్నారు. 1955 సం॥ న శ్రీ యన్. లక్ష్మీనారాయణగారు (ఎలెక్ట్రికల్ ఇంజనీర్) సంఘమును రిజిష్టర్ చేసిరి. 1956 సం॥ న డా॥ ఎస్. విశ్వనాథము, యం. శ్రీనివాసులురెడ్డిగారల సాయముతో కార్యదర్శి కృషిచేసి స్వతంత్రపార్కునకు తూర్పున 80 అంకణముల స్థలమును సేకరింప, శ్రీ రేబాల లక్ష్మీ నరసారెడ్డిగారు రూ. 14000 లు వ్యయపరచి సాయిమందిరము నిర్మించిరి. 1959 విజయదశమినాడు సాయిబాబా పాలరాతి విగ్రహమును ప్రతిష్ఠించిరి. ప్రతినిత్యము వచ్చిపోయెడు భక్తులతోను, పురాణ, హరికథ, ఉపన్యాస, భజనాదులతో మందిరము కళకళలాడుచున్నది.

**4. ప్రేమసంఘము - స్టోన్‌హౌస్‌పేట :**

కన్యకాపరమేశ్వరీ దేవాలయ ప్రాంగణమునకు దక్షిణముగా యీ సంఘ అధ్వర్యమున భగవద్గీతా భవనము నిర్మింపబడియున్నది. శ్రీకృష్ణ భగవానుల విగ్రహమునకు నిత్యపూజాదులు జరుపబడుచున్నవి.

సూర్యోదయాత్పూర్వమే సంఘ సభ్యులీ భవనమున సమావేశమై సూర్యనమస్కార, భగవద్గీతా పారాయణాది కార్యక్రమములనుభక్తిశ్రద్ధలతో జరుపుచున్నారు.

గీతాజయంతి, వివేకానంద జయంతి మున్నగు పుణ్యదివసములందు ప్రత్యేక ఉపన్యాసాది కార్యక్రమములు, సాధువులను సన్మానించి వారితో సత్‌సంగ, సత్‌గోష్ఠుల కవకాశము కల్గించుట యీసంఘ కార్యక్రమములో భాగమే. ఈసంఘ కార్యక్రమ నిర్వాహణలో శ్రీ జ్వాలా కృష్ణయ్య గారు ముఖ్యులు.

**5. శ్రీ వివేకానంద సౌహార్దసమితి, ప్రకాష్‌నగర్ :**

శ్రీ బొమ్మిసెట్టి యల్లమందయ్య బి. ఎ. వారి మిత్రులు యీ సంఘమును నిర్వహించుచున్నారు. వీరి అధ్వర్యముననే వివేకానంద గ్రంథాలయము, వివేకానంద విద్యాలయము (హిందీ) నడుపబడుచున్నవి. విద్యార్థినీ విద్యార్థులలో 'సనాతన ధర్మ' దృక్పథమును, ఆధ్యాత్మికవాసనా సంస్కారములను నాటి వ్యాప్తి చేయుట కిచట అమోఘమైన, శ్లాఘనీయమైన కృషి జరుగుచున్నది.

స్వామి వివేకానందుని విగ్రహ ప్రతిష్ఠతో కూడిన ఆలయము కేంద్రముగా వివేకానంద విద్యాలయ భవన నిర్మాణము చేయు సత్ సంకల్పముతో కృషి జరుగుచున్నది.

**6. శ్రీరమణ భక్తమండలి :**

కీ॥ శే॥ శ్రీ గిద్దలూరు సుబ్బరావు

శ్రీ పి. పుల్లయ్య, ఓరుగంటి వెంకట కృష్ణయ్య, మున్నగు రమణ భక్తులు యీ సంఘ అధ్వర్యమున గత 25 సం॥ రములుగా శ్రీ రమణ మహర్షి జయంత్యుత్సవముల నుత్సాహముతో నడుపుచుండిరి. ఇప్పుడిది మహర్షి రమణ యోగిరామ విజ్ఞాన సంఘమున విలీనమైనది.

7. శ్రీ మహర్షి రమణ - యోగి రామ విజ్ఞాన సంఘము :

1962 సంవత్సరము జూన్ మాసమున శ్రీ యస్. కృష్ణస్వామి (మద్రాసు) గారి అధ్యక్షతన సమావేశమైన శ్రీ రమణ భక్తులు, పరిశోధనా దృక్పథమునందా శక్తియున్న తదితరులచే ఈ సంఘము స్థాపించబడినది. శ్రీగుజ్జుము సుబ్బరామయ్యగారు అధ్యక్షులుగను,శ్రీ గ్రిద్దలూరు సాంబశివరావుగారు, సి. పి. రావ్ M. Sc. గార్లు కార్యదర్శులుగాను ఎన్నుకొనబడిరి.

సనాతనఋషులయొక్కయు, ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలయొక్కయు మార్గమైన పరిశోధనాదృక్పథము విచారణామార్గము (Research Spirit-PathofScientific Enquiry) ను .వ్యాప్తిచేయుట, సత్సంగ, సత్‌గ్రంథ పఠన, సత్‌కార్మాది ఆశయముల యువజనులలో ప్రోత్సహించుట, శ్రీ రమణమహర్షి యోగి రామయతీశ్వరుల జీవితాశయముల వ్యాప్తిచేయుట మున్నగునవి సంఘాశయములు.

మహనీయుల జన్మదివసముల సందర్భముల విద్యార్థులకు ఉపన్యాస, యోగాసన పోటీలు, తాము స్వయముగా చేసిన పరిశోధనలపై వ్యాసముల పఠించు పోటీలు ఏర్పాటు చేయుకార్యక్రమములు రూపొందించబడియున్నవి.

వీరిగృహమే ''ఆశ్రమము'':—

ఈ ఆశ్రమములు, సంఘములతో సంబంధములేకనే, వ్యక్తిగతముగా జీవిత గమ్యస్థానమైన ఆత్మజ్ఞానార్జనకైయోగసాధన కృషిచేయుచున్న మహనీయులుకూడ మన మండలమున నున్నారు. ఇట్టి మహాత్ములు సాధరణ గృహస్థులవలె బాహ్యజీవనము గడుపుచుండినట్లగుపడినను తీవ్రవైరాగ్య సాధనలచే అత్యుత్తమ ఆధ్యాత్మిక స్థితులను సాధించియున్నారు. ఇట్టి మహనీయులు నివసించు గృహములే ఆశ్రమములు మచ్చుకు రెండు ఉదాహరణముల సూచించెదను.

దామరమడుగు గ్రామ నివాసి సాధు జక్కారమణారెడ్డిగారు. స్వయంకృషిచే యోగశాస్త్రముల నభ్యసించి ఉండుటచే తను, విజ్ఞాన మార్జించి, ఏకాంతముగా ప్రాణాయామాది సాధనలు చేసిన మహనీయులైన రైతు గృహస్థులు. వీరితో ఆధ్యాత్మిక చర్చ హృదయాహ్లాదకారణము, మనోవికాస సంజనితమునగు యనుభవమే.

నెల్లూరు పట్టణమున సంతపేటలో శ్రీ సుబ్బరాయలుగారను పేర రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రస్తుతము సైకిల్‌షాప్ చూచుకొనుచున్నారు.వీరుసాధారణగృహస్థులవలె నగుపించినను, సాధకులైన వారికి యీ మహనీయుని ప్రత్యేకత గుర్తించుట కెంతో కాలముపట్టదు.

దత్తాత్రేయమఠము :

ఈమఠము ట్రంకురోడ్డులో పురమందిర దక్షిణద్వారమున కెదురుగానున్నది. అచ్చట అయిదారు వందల సంవత్సరములకు ముందు 'దత్తాత్రేయ' అను పరమ

హంస సిద్ధిపొందిన స్థలమని చెప్పుదురు. అమఠముయొక్క ప్రాక్పశ్చిమ ద్వారములందు 'శ్రీమద్విశ్వాధిష్ఠావన పరమహంస సద్గురు దత్తాత్రేయ స్వాములవారి ధర్మమఠం' అని శిలాఫలకములపై వ్రాయబడియున్నది. ఆతడు సిద్ధపురుషుడని చెప్పుదురు. క్రీ॥ శ॥ 1600 ప్రాంతమున అమఠమునందే శ్రీ పరమానంద తీర్థ అను మహనీయులుండిరనియు, వారే 'ముక్తికాంతా విలాస' మను వేదాంత పరమైన యక్షగానమునుగూడ రచించినట్లు చెప్పుదురు. వికారణముచేతనో ఆ శ్రమ ప్రాంతమంతయు పాడుపడియుండ, నిటీవల సమాధిపై శివలింగమును బ్రతిష్ఠించి ఆలయ నిర్మాణము నర్చిరి. 1917 ప్రాంతమున చెంగల్పట్టు మండల వాస్తవ్యురాలు శ్రీచిన్నరెడ్డోరుఎర్రవోబులురెడ్డి కుమార్తెయగు ఈశ్వరమ్మగారు అచ్చటనే రామమందిరమును నిర్మించి, పూజా నైవేద్యాదులను జరుపుచు నేడును ఆధ్యాత్మిక జీవితమును గడుపుచున్నారు.

మూలపేట శంకరమఠం :

శ్రీ మత్పరమహంస సత్యవ్రతానంద సరస్వతీ స్వాములవారు ఆ మఠమును స్థాపించి, అందు శంకర ప్రతిష్ఠగావించిరి. వారు 1927 లో వైదిక స్మార్త విద్యావ్యాప్తికై శ్రీ ఆంధ్ర మండలీయోప కుర్వాణ బ్రహ్మచర్య పోషకసంఘమును స్థాపించిరి. చాలకాలము ఆంధ్ర ప్రాంతములోని వేద పండితులను సన్మానించుచుండిరి. ఇప్పుడును అందు వేదపాఠశాల జరుగుచు నల్గురు విద్యార్థులు స్మార్తము నేర్చుకొనుచున్నారు. శంకరాగ్రహారమందు శ్రీ స్వాములవారు కట్టించిన యిండ్లు బాడుగలు నెలకు దాదాపు రు. 150 లు వచ్చుననియు, ఆ ఆదాయముతో ధర్మసంస్థ నడుపబడుచున్నదనియు చెప్పుదురు. ఇప్పుడా ఆశ్రమమునకు శ్రీ జి. వి. శివరామయ్యగారు సర్వాధికారిగను, శ్రీ కేసరి గురుమూర్తిశాస్త్రి, శ్రీ ఓరుగంటి వెంకటకృష్ణయ్యగార్లు అధ్యక్ష కార్యదర్శులుగను పనిచేయుచున్నారు.

క॥ మాయలు జూదముతోడన, పోయెంగాకింక నిచట (బోసగునెయన్ మ
త్నాయకము లడ్డసాళ్లే, నీయాచవిశేమి పొమ్ము నిలువక మామా!

శ్రీ I 362

God is an immortal Man, Man is an immortal God.

*Heraclitus.*

క॥ నరు లమరులగు మరమరులు, నరులగుదురు గాన నీవు నందనునకు భూ
వర వగవనేల యతనికిఁ జిరవీరస్వర్గ సుఖము, సేకుటీ యుండున్ ॥

శ్రీ II-1177



శ్రీ రామయోగి

# 47

# కోవూరు తాలూకా వెలిచర్ల శాసనము క్రీ. శ. 1510.

శ్రీ విద్వాన్ కేసరి సుందరరామ శర్మ. కావలి

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకాలోని వెలిచెర్ల శ్రోత్రియమునకు సంబంధించిన తామ్ర శాసనము నెల్లూరు న్యాయవాదులు శ్రీ పులుగుండ్ల ఆదినారాయణ మూర్తిగారు దయతో మాకొసంగిరి.

శాసనాకృతి :

శాసనము మూఁడురేకులుగా నున్నది. ఒకటొక్కటి 8 1/8 అంగుళముల పొడవు. 3 1/8 అంగుళముల వెడల్పు కలిగియున్నది. రేకుల పెడమవైపు బెజ్జముగల తొడిమ లున్నవి. పూర్వమవి రాగికడియమున గ్రుచ్చబడి యుండినవి కాఁబోలును. ఇప్పుడవి విడిగా నున్నవి. ఆద్యంత పత్రముల లోపలి ప్రక్కమాత్రమే అక్షరములు చెక్కబడినవి. శాసనము కొంత శ్లోకరూపమునను, కొంత తెనుగు గద్యరూపమునను, 'కలగా పులగముగ' నున్నది. మొదటి రేకుపై 12 పంక్తులును, తక్కినవానిపై తొమ్మిదేసి పంక్తులును ఉన్నవి.

శాసనము తెనుఁగు కన్నడలిపిలో నున్నది. పూర్వమాంధ్రభాషయు, కర్ణాటకభాషయు నొకే లిపిలో వ్రాయబడుచుండెడిది. దానినే తెనుఁగు కన్నడలిపియని లిపిశాస్త్రజ్ఞులు వ్యవహరింతురు. 12 వ శతాబ్దము వఱకును ఆంధ్ర కర్ణాటక లిపు లేకవిధమనుటకు శాసనము లాధారమగుచున్నవి. అతరువాత కాలము దారెంటికిని కొలఁదిగ మార్పు పొడసూపి కాలక్రమమున ముద్రణాదు లారంభమైన పిదప ఆభేదమింకను అధికమయ్యెను. కాని యిప్పటికిని నూటికి 90పాళ్ళు పోలికలు కన్పించుచునే యుండును. తెలుగు లిపి కన్నడులనుండి ఆంధ్రులు గ్రహించిరా, లేక తెలుఁగువారే కన్నడులకిచ్చిరా యనువిషయము చర్చనీయము.

శాసనప్రయోజనము :

ఈశాసనము క్రీ. శ. 16 వ శతాబ్దము మధ్యకాలము వఱకును పాకనాటిని పాలించుచుండిన ఓఢ్ర ప్రభువగు శ్రీ ప్రతాపరుద్ర గజపతిది.

కర రామాబ్ధి శీతాంశు సంఖ్యాక
శకవత్సరే
ప్రమోదోద న్యబ్దవరే మాసే కార్తిక
నామని
శుక్లత్రితియ్యాదివసే భార్గవస్యచ
వాసరే

కర 2, రామ 3, అబ్ధి 4, శీతాంశు 1 మొత్తముపై 2 3 4 1 అగును దానిని, 'అంకానాం వామతో గతిః' అను నియమానుసారము తలక్రిందుగ వ్రాయుదుమేని శా. శ. 1432 అగును. దానికి సరియగు, ప్రమోదూతనామ సంవత్సర కార్తీక శుద్ధ తదియ శుక్రవారము (క్రీ, శ. 1510) కోవూరుతాలూకా వెలిచర్ల గ్రామము పులుగుర్ల నివాసి, భరద్వాజ గోత్రుడు, యజుశ్శాఖాధ్యాయి, నారాయణ యజ్వపౌత్రుడు,

ధమ్మయ్య పుత్రుడు అగు కొండయ్య అను విప్రునకు సర్వ స్వామ్యములతో, సర్వభోగ సమన్వితముగ, దానముచేయబడినది.

1. శాసనస్థ విషయములు. ఇందు 23 శ్లోకములున్నవి. వానిలో వినాయక స్తుతి, ఆది వరాహస్తుతి, సూర్యస్తవము, గజపతుల వంశప్రశస్తి, దానకాలము, గ్రామ నిర్దేశము, ప్రతి గృహీతృ వంశాదికము, అభిశాపక విషయము ఇత్యాదులున్నవి.

2. ఇందు సూర్యవంశమున కపిలేంద్రుడు పుట్టెననియు, అతనికి పురుషోత్తమేంద్రుడు జనించెననియు, అతని కుమారుడే ప్రతాపరుద్ర గజపతి (గ్రామదాత) అనియు చెప్పబడినది. వీనికి 1-శ్రీమద్రాజాధిరాజేంద్ర పంచగౌడాధినాయక 2. వీరకేదార 3. మానగోవిందలాంఛన 4. విద్యానిధి 5. పాంకనాంటి చోళమండలనాయక 6. త్రిభువన తోడరమల్ల 7. రణబణిజార మొదలగు బిరుదములున్నట్లును చెప్పబడినది. శాసనాంతమున గజపతుల రాజచిహ్నములగు ఖడ్గశంఖముల ఆకృతు లున్నవి.

3. గ్రామనిర్దేశము :

1. తూర్పున దండు దోవనుగుంటరాయి, 2. ఆగ్నేయము చర్లోను విశండ్ల రాయి. 3. దక్షిణము, చెముళ్లగుంట, వాని పడమటి గట్టురాయి 4. నైరుతి రెవడిగుంట, పడమటి కొమ్మునరాయి. 5. పడమర, నిల్వురాయి. 6. వాయువ్యము వాగుదండరాయి, 7. ఉత్తరము ఉప్పు చెర్వు తూర్పుగొమ్ము రాయి. 8. ఈశాన్యము ముద్దులగుంట దండరాయి. ఈ హద్దులలోని వెలిచర్ల గ్రామము దానమీయబడినది.

4. శాసనభాష :

శాసనము తెలుగు లిపిలోనున్నను వర్ణదోషములు బహుళములుగా నున్నవి. అవి వ్రాయసగాని లోపముగా నుండవచ్చును. మచ్చుకు.

1. అనుస్వారముపైనుండు హల్లునకు ద్విత్వము : కొండ్డయ, దండ్డు, గుంట్టు, సుగంధ్ధ, సంస్సర్గ, మొ.

2. హ్రస్వదీర్ఘముల తాఱుమాఱు: దంష్ట్రాగ్రెణ(గ్రేణ) యత్కిత్రిః (త్కీర్తి) అంబ్భొజని (అంభోజనీ) సూనవె (సూనవే) మొ.

3. ఖ. షు.ల వ్యత్యస్తము : విఘ్నౌఘాః (విఘ్నౌఘాః)అనుట

4. రేఫసంయోగ స్థలములందు వలపలగిలక : మగ్గాః వర్తిః-కీర్తిః మొ.

5. ఈ శాసనమున గ్రహీత యొక్క పితామహుడు నారాయణ యజ్వయనియు, ధర్మవృద్ధికొరకై కొండయ్య ద్విజరాజునకు మగ్గరాజగన్నాథ సన్నిధియందు ఉదయగిరికి తూర్పున, జలదంకి స్థలమున, పాకనాటిలో జేరిన వెలిచర్ల గ్రామము దానమీయబడినట్లున్నది. శాసనము వ్రాసినవాని పేరిందు లేదు.

ప్రస్తుతము గూడూరు తాలూకాలో పొలిపాడు గ్రామము కలదు. ఆదియు శా. శ. 1432 ప్రమోద సంవత్సర పుష్య బహుళ త్రయోదశి మకర సంక్రమణ పుణ్యకాలమందు గౌతమ గోత్రుడును, యజుర్వేదియు, ఎఱ్ఱమరాజపుత్రుడును, వేదశాస్త్ర పారగుడునగు చంద్రమౌళియను భూసురునకు శ్రీకృష్ణదేవరాయలు గ్రామమును దానముచేసినట్లు పొలిపాడు శాసనముచెప్పు

చున్నది. వెలిచర్ల శాసనము పుట్టిన 2 నెలల 26 దినములకు పోలిపాడు శాసనము పుట్టినది. దీనినిబట్టి క్రీ. శ. 1510 నాటికి రాయలు చంద్రగిరి రాజ్యమునే పాలించుచుండెననియు, ఉదయగిరి రాజ్యము గజపతుల అధీనమందే యుండెననియు తెలియగలము.

ఈ శాసనమునుబట్టి పులుగుర్ళ గ్రామనివాసమున వారికా యింటిపేరు వచ్చినట్లు తెలియగలము. అదియే నేడు పులుగుంట్ల,పులిగెండ్ల, ఇత్యాదిగ వ్యవహారమున నున్నది. అగ్రహారీకులకును, గ్రామ రైతులకును జరాయతి హక్కువిషయమై కలిగిన వివాద సందర్భమున 1917 లో కావలి మునసబు కోర్టులోను, 1953 లో నెల్లూరు సబ్‌కోర్టులోను ఈశాసనము దాఖలు చేయబడినది. కృష్ణదేవరాయల పోలిపాడు శాసనము 1936 జులై భారతియందును; వెలిచెర్ల శాసనము 1936 ఆగష్టు భారతియందును ప్రకటింపబడియున్నవి.

## చిత్రవిచిత్రములు

13



మూరువలె రాయి ముందుకువచ్చి సిరాధారముగ నేర్పడిన గుహ, మాలెకొండ

మాలెకొండ పర్వతముపై చూరువలె ముందుకు ప్రసరించిన కొండరాతిపై ప్రాకృత భాషయందుండిన, బ్రాహ్మీలిపిలో నున్న శాసనము, పురావస్తు శాఖవారిచే 1937-38 సం॥ కనుగొనబడినది. (S. I. Epy. 1938) వీటికాలము క్రీ. పూ. 300 అని నిర్ణయింపబడినది. అక్షరములు అస్పష్టముగా నున్నవి.

నందసెట్టి కుమారుడైన సిరిపీరసెట్టి ఈ గుహాస్థళమును జైన, బౌద్ధ సన్యాసులకు చాతుర్మాస్య దీక్షకు వసతికి యోగ్యముగునట్లు చేసి, దానమిచ్చినట్లు శాసన సారాంశము. ఈ దాత రాతిని నునుపుచేసి, యతులు శయనించుటకు అరుగులవలె, వానిపై దిండుగనుండునట్లు రాతిని మలచియుంచెను. ఇట్టి వసతులగూర్చిన కొండగుహలు మధుర, రామనాథ, తిరునల్వేలి మండలములందును కాననగును.

ఈదాత అరువాహి (?) కులస్థుడనియునున్నది. దీనిబట్టి ప్రాచీనకాల చరిత్రాంశములు పరిశోధించిన ఆకాలమున కంచినుండి నెల్లూరు ఉత్తరము వఱకు గల దేశము అరువావడతలై అని పిలువబడుచుండెను. ఆపేరే ఈదాతకులమని తెలియుచున్నది. టాలమీ అను గ్రీసుదేశస్థుడు వ్రాసిన చరిత్రాంశములలో అరువర్నాయి అను జాతియుండు ప్రదేశమిదియనియు వ్రాసెను. వీరే అరవలనువారా? ఈ అరవ శబ్దముయొక్క పురాణ చరిత్ర ఇప్పటినుండి వచ్చినదని నమ్మవచ్చునా?

♦ ♦ ♦

మాల్యాద్రి చుండి గ్రామమునకు రెండుమైళ్ళలో నున్నది. చుండినుండి పడమటగా పోవుచుండ మాలాకారముగ నున్న పర్వత శ్రేణిని చూడగలము. అందు మేరు పూసగా ఈ మాల్యాద్రి యున్నది. ఇందు ప్రకృతి సిద్ధముగా కొండ ఏర్పడుటలోనే, కొండ వరాండావలె ముందుకు ప్రాకివచ్చి ఎత్తుగానుండును. దీనిక్రింది భాగము విశాలముగా నుండును. కొండ మొదలున గర్భగుడి నేర్పఱచి, అందు శ్రీ నృసింహదేవుని నెలకొల్పి, ముందు భాగమును మండపముగా నేర్పరచి, ఈ కోవెల అనాదిగా ప్రఖ్యాతిగాంచి యున్నది. అటవీ ప్రాంతమందున్నందున నిత్యపూజలు లేవు. వారమున కొకదినమిచ్చట పూజజరుగును. వందలాది భక్తులు, తమ బాస పట్టింపుల నెరవేర్చుకొనుటకు వత్తురు. ఇట్టి రాతి వరాండాలు మూడు నాల్గు కలవు. ప్రకృతి సౌందర్యము తిలకించవలసినదే. దేవుని మాహాత్మ్యము ఆస్తికులకు కొంగు బంగారము. విడిది చేయుటకు సత్రమున్నది. కొండపైన నీటివసతికూడ నున్నది.

(దీని వివరమింకను ఇందు 17 పుటలో నున్నది)

♦ ♦ ♦

ఇట్టి గుహాంతరాళమే, కావూరుతాలూకాలోని సిద్ధులయ్య కొండయందున్నది. ఇచ్చట శాసనము మృగ్యము. ఇందుండు విగ్రహములు ప్రాచీన కాలమునాటి జైన విగ్రహములని రూఢిగ చెప్పనగును. ఇందు పూర్వము జైన, బౌద్ధ సన్యాసులు విహార స్థళముగ నెంచి వాసము చేయుచుండిరి.

# 48

# మండలములో మఠాధిపతుల సంచారము.

శంకారూపేణ మచ్చిత్తం పంకీకృత
మవిద్యయా
కింకరీ యస్య సామాయా శంకరాచార్య
మాశ్రయే.

జగద్గురువులగు శ్రీ శంకర భగవత్పాదులు భారతదేశమునం దవతారమెత్తిన మహాపురుషులలో నుత్తమోత్తములు. భారత జాతీయ జీవననిర్మాణమునం దామహాపురుషుడు ధ్రువతార. వేదశాస్త్ర పురాణములను బుద్ధిబలమున మధించి అద్వైతామృతమును లోకమునకు ప్రసాదించిన దివ్యమూర్తి. ఆయన అనుభూతి పరిపూర్ణము. ప్రతిభ సర్వతోముఖము. వారి సిద్ధాంతమునకు మోకరిల్లని జాతిగాని, నివాళియెత్తని దేశముగాని లేదనుట అతిశయోక్తికాదు. వారి దివ్యవాణి సకల జనుల, సకలదేశముల మధ్య అడుగడుగున నిర్వాణమువలె వినబడుచు నేటికిని జనుల నుత్తేజ పరచుచున్నది.

శంకరులు తాము గ్రహించిన పరమార్ధ సత్యము భరత ఖండమందంతటను సుస్థిరముగ ప్రచారమగు చుండుటకును మానవజాతికి శాంతి కల్యాణములు ప్రసాదించుటకును, ద్వారకా క్షేత్రమున హస్తామలకాచార్యుల యాధిపత్యమున శారదాపీఠమును, బదరికాశ్రమమున తోటకాచార్యుల యాధిపత్యమున జ్యోతిర్మఠమును, జగన్నాథమున పద్మపాదాచార్యుల యాధిపత్యమున గోవర్ధన మఠమును, తుంగభద్రాతీరమున శృంగేరియందు సురేశ్వరాచార్యుల యాధిపత్యమున శారదాపీఠమును, కాంచీక్షేత్రమందు తమకు నివాస యోగ్యముగా నుండుటకై కామకోటి పీఠమును, స్థాపించిరి. వారాయా ప్రాంతములను భారతీయ సాంస్కృతిక జీవన స్రవంతుల మూలమున ఆప్లావితమొనర్చి యెడతెగని అద్వైత సస్యములను ముక్కారు పండింప దలచిరి. ఆపీఠములు నేటికిని ఆనూచాన సంప్రదాయములను విడనాడక కృషిని సాగించుచున్నవి. ఆపీఠాధిపతులు స్థానబలముచేతను, స్వయం ప్రతిభ చేతను కర్తవ్యమును గుర్తెరిగి, అప్పుడప్పుడు లోకానుగ్రహకాంక్షతో దేశసంచారము చేయుచు తమ కర్మానుష్ఠాన తత్పరతచేతను, దివ్యబోధలతోడను, తీర్థ ప్రసాద వినియోగములతోడను, జనులను శ్రీ చంద్రమౌళీశ్వరుల కృపాపాత్రుల గావించుచున్నారు. ఈ యిరువదవశతాబ్దమున మన మండలమున సంచారమొనర్చి, మన మండలమును పుణ్యభూమిగ నొనర్చి కొందరు శ్రీ చరణులను దెలిసికొందము.

కంచి కామకోటి పీఠాధిపతులు :

మోక్షదాయకములైన పట్టణములలో కంచి సుప్రసిద్ధము. అందు పరదేవతయగు

శ్రీ కామాక్షీదేవి త్రయస్త్రింశత్కోటి దేవతా సేవితుడగు ఏకామ్ర నాథునితోగూడి అప్పటి శ్రీ పీఠము నధిష్ఠించి, సమస్త కామములను భక్తుల కనుగ్రహించుచుండుట వల్లను, కోటి గుణితముగ తపస్సిద్ధి బడయ జేయుటయే గాక, మోక్షమునుగూడ ప్రసాదించు చుండుటచేతను అపీఠము కామకోటి పీఠముగ సార్థకమయ్యెను. ఆదిశంకరులు పరమేశ్వరానుగ్రహమున కైలాసమునుండి కొనివచ్చిన పంచ స్ఫాటిక లింగముల లోనిదగు యోగనామక స్ఫాటిక లింగమును బూజించుచు కంచియందే నివసించిరనియు; అద్వైత మతప్రబోధ మొనర్చుటకై యాంధ్ర సంప్రదాయవర్తియగు శ్రీ సురేశ్వరా చార్యులను ఆపీఠమున నధివసింప జేసిరనియు శంకర విజయము చెప్పుచున్నది. అపీఠము మొదట విష్ణుకంచియందు స్థాపితమైనను క్రమముగ శివకంచికిని, క్రీ. శ. 1743 లో కుంభకోణమునకును మార్చబడినట్లు చరిత్రచాటుచున్నది.

ప్రస్తుతమా పీఠమునకు శ్రీమన్మహేంద్ర సరస్వతీ శిష్యులగు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాముల వారధిపతులు. 29 పీఠాధిపతులలో 67 వ వారై క్రీ. శ. 1907 లో అధిష్ఠించిరి. అప్పుడు వారి వయస్సు 13 సంవత్సరములట. వారి పాండిత్యము, తపశ్శక్తి అపారములు వారు కాశ్యాది పుణ్యక్షేత్రములను సందర్శించి, మరలివచ్చునప్పుడు 1938 సం॥ నవంబరులో సింహపురికి విచ్చేసి. 1939 ఫిబ్రవరి 6 ది వరకు నిందేవసించి మండలీయుల నెల్ల తమభక్తకోటిగ పరిగణించి, భక్తులొసంగిన సపర్యలను అనుగ్రహ పూర్వకముగ గ్రహించిరి. శ్రీవారి స్ఫురద్రూపము శాంతి చంద్రికలు వెదజల్లు చిఱునవ్వు, బ్రహ్మతేజమును వెల్లివిరియజేయు ఫాలము అపారకరుణారసమును బ్రకటించు విశాల నేత్రములు, శాస్త్రోక్తముగ వారు కావించుచుండిన భగవదారాధనలు, పెక్కుసభలలో కావించిన లౌకికా లౌకికబోధలు మండలీయులకు మరతుమన్నను మఱపురావు.

స్వాములవారు నెల్లూరున విడిసియున్నపుడు మండలములోని వేదశాస్త్ర పండితులచే పెక్కుసదస్సులందు వాక్యార్థములను జేయించి, పండిత సన్మానములను గావించిరి.

శ్రీ వారు నెల్లూరులోని అన్ని దేవాలయములను, మఠములను, పెక్కు విద్యాసంస్థలను సందర్శించి సంతృప్తి వెల్లడించిరి. తిక్కన గ్రంథాలయము, సింహపురి వ్యాయామమండలి మొదలగు సంస్థలను దర్శించి ఆశీర్వదించిరి. పెక్కండ్రు సంపన్న గృహస్థులు వారిని తమ యిండ్లకు దీసికొనిపోయి, పాదపూజలు భిక్షలు జరిపి చరితార్థులైరి. చాతుర్వర్ణ్యములవారును వారిపట్ల ప్రదర్శించిన భక్తి ప్రపత్తులపారములు. శ్రీ స్వామివారికి నేటికి 70 యేండ్లు నిండినవి. ప్రస్తుతము శ్రీ జయేంద్ర సరస్వతీ స్వాములవారిని పీఠాధిపతులుగ జేసి, అన్నివిధముల వారికి మార్గదర్శకులై, కేవల పారమార్థిక చింతతో కాలము గడుపుచున్నారు.

శివగంగ పీఠాధిపతులు :

బెంగుళూరు ప్రాంతమండలి శివగంగ పీఠము శ్రీశంగేరీ శాఖామఠమై

యున్నది. శ్రీ సచ్చిదానందాభినవగంగాధర సుబ్రహ్మణ్య భారతీ స్వాముల వారా పీఠము నధిష్ఠించియుండిరి. వారును దేశసంచార మొనర్చుచు 1934 లో నెల్లూరు పట్టణమునకు సపరివారముగ విచ్చేసి, మధ్యాపతివారి వీధిలోనుండు శ్రీ. టి. వి. వెంకటరామయ్యగారింట బసచేసిరి. అప్పుడు వారి వయస్సు దాదాపు 35 సంవత్సరములుండవచ్చును. నిమ్మపండువంటి దేహకాంతి, బ్రహ్మతేజముట్టిపడు సుందరముఖము కన్నడ భాషామిళితమైన జిలిబిలితెలుగు భాష నెల్లూరు మండలీయులను అయస్కాంత సూచినివలె నాకర్షించినవి. రాయజీవీధిలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయమునందు ప్రతి సాయంసమయమందును ధర్మోపేత వివిధ విషయములనుగూర్చి, ఉదాహరణ పరంపరలతో ఉపన్యసించెడివారు. వారి పూజావిధానమును, వారి మూర్తి వైభవమునుగాంచి వేలాది ప్రజలు 'కన్నుల కపిలార్ధలాభంబు గల్గినట్లు' భావించెడివారు. దాదాపు రెండుమాసములు సింహనగరమందే యుండి, పెక్కుమంది పండితులను సమ్మానించిరి. కావలిలో శ్రీ దొడ్ల వెంకటరామరెడ్డిగారు రచించిన 'గీతాహృదయము'ను, పరిపూర్ణముగ విని సదభిప్రాయ మొసగిరి. వారు నెల్లూరులోనుండగా దేశకల్యాణ కాంక్షతో చండీయాగమొనర్చి, అన్నదానాదికమును సల్పిరి.

శృంగేరి పీఠాధిపతులు :

శృంగేరి మైసూరు రాష్ట్రమున కడూరు మండలమునందు ఓదూరు పట్టణమున కటువది మైళ్ళ దవ్వునుగా తుంగభద్రా నదీతీరమం దున్నది. అచ్చటికి 9 మైళ్లలో శృంగగిరి (కొండ) కలదు. అచ్చటనే ఋష్యశృంగ మహర్షి జనించినట్లు పురాణగాథ కలదు. అచ్చటనే మల్లికార్జునస్వామి గుడికలదు. 8 వ శతాబ్దమున జగద్గురు శంకరాచార్యులు ఆ పవిత్రస్థలమున పీఠమును స్థాపించి, అందు సురేశ్వరాచార్యులను నియమించిరి. వారే మండనమిశ్రులు. 13 వ శతాబ్దమున ఆపీఠములో విద్యాతీర్థ స్వామి అను మహనీయు లుండిరనియు, వారు శతవర్షములు పీఠాధిపత్యము వహించి కడపట లంబికాయోగమున సజీవులుగ సమాధి నందిరనియు చెప్పుదురు. విజయనగర రాజ్యస్థాపకులగు శ్రీ మాధవ విద్యారణ్యులవారు 1331 నుండి 1386 వరకు ఆపీఠమునుండి ధర్మ ప్రచారమొనర్చిరి. వారే శృంగేరిలో జగద్గురువుల వాలయమును, సువర్ణ శారదాదేవి ప్రతిష్ఠను గావించిరి. టిప్పు సుల్తాను, హైదరాలి మొదలగు మహమ్మదీయులును, పెక్కండ్రు మహారాష్ట్రులును ఆపీఠముపట్ల భక్తిశ్రద్ధలు కలిగియుండినట్లు చరిత్ర చాటుచున్నది. సురేశ్వరాచార్య గురుపరంపరలో 35 వ వారగు శ్రీ మదభినవ విద్యాతీర్థ స్వాములవారు ప్రస్తుతమా పీఠము నధిష్ఠించి యున్నారు.

వీరి పాండిత్యబలము, ఉపాసనాశక్తి అనన్యసదృశములు. వారు ఆంధ్రదేశ సంచారమొనర్చుచు 1961 మేనెలలో సపరివారముగ సింహపురికి విచ్చేసి భక్తులకు తీర్థ, ప్రసాద, కుంకుమాక్షతలను బంచియు, మృదుమధుర వాగమృతమున సకల శాస్త్ర సారమును వెదజల్లియు, పండిత గోష్ఠులను

సర్వీయు పౌరులను ధన్యుల గావించిరి. దేవాలయములను, మఠములను, విద్యాసంస్థలను సందర్శించిరి. వేదశాస్త్ర సదాచార సంపదగల పండితులను గౌరవించిరి. శ్రీ వీ. కృష్ణమూర్తి ఘనపాటి, వేదం సుబ్రహ్మణ్య శాస్త్రి (తంబిశాస్త్రి) ఉడాలి సుబ్బరామ శాస్త్రి (సంస్కృత కాలేజి ప్రిన్సిపాలు వీ. యస్. విశ్వనాధశ్రౌతులు, మొదలగు కతిపయవిద్వాంసులను సన్మానించిరి. శ్రీ శ్రౌతులుగారు మండలమున ధర్మ ప్రచారము చేయుచుండ వలసినట్లును, తత్ప్రత్యామ్నాయముగ మాసమునకు రు. 25 లు పీఠము వారిచ్చుచుండవలసినట్లును ఏర్పాటుచేసిరి.

పుష్పగిరి పీఠాధిపతులు.

కడప మండలములో చెన్నూరు సమీపమున పెన్నానది తీరమందు పుష్పగిరి కలదు. ఆ పీఠాధిపతులను శ్రీ శంకరుల పరంపరలోని వారనియే వినుకలి. ఆంధ్ర దేశమునకు గురుపీఠము వారిదనియే చెప్పనగును. వారును భారతీ సాంప్రదాయమునకు జెందినవారే. క్రీ. శ. 1885 ప్రాంతమున శ్రీ మదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వాములవారు పీఠమందుండిరి. వారి మంత్రోపాసనా మహిమ అపారమని ప్రతీతి. ఈ శాబ్దిత ప్రారంభమున శ్రీ విద్యా శంకరభారతీ స్వాములు పీఠాధీశ్వరులైరి. వారి కాలమునందే పీఠమున కార్తిక స్తోమ మెక్కుడైనదని చెప్పుదురు. వారు 1914 ప్రాంతమున నెల్లూరు మండలమున కొన్ని గ్రామములందు సయితము బంగారుకిరీటమును ధరించి,గజారోహణ మొనర్చిరట,వారి మూర్తి వైభవ మపారమని చెప్పుదురు. ప్రతి సాయంకాలమందును వారిసాన్నిధ్యమున పురాణకాలక్షేపము పండితులచే జరుపబడు చుండెను. వారు 1920 లో 'తర్లుపాడు' లో సిద్ధిపొందిరి. ఆ తర్వాత వచ్చిన పీఠాధిపతులు గుంటూరు జిల్లా రెంటపాళెములో నుండిరేకాని, మండల సంచార మొనర్చినట్లు లేదు. ప్రస్తుతము (1957 తర్వాత) శ్రీ విద్యానృసింహ భారతీస్వాములవారు పీఠాధిపతులుగ వ్యవహరింపబడుచున్నారు. వారు 1960 జులై నుండి సంవత్సర కాలము విద్యావ్యాసంగమున నెల్లూరు నందుండి భక్తులననుగ్రహించిరి. గతశతాబ్ద మధ్యభాగమునకీ॥శే॥ యరగుడిపాటివెంకటాచలం పంతులుగారు రాయజీవీధియందు మఠమును గట్టించి పుష్పగిరి పీఠాధిపతుల స్వాధీనము చేసిరి. అది నేటికిని శంకరమఠము పేరుతో వేదపండితులకు నిలయముగానున్నది. శిథిలావస్థలోనున్న మఠమును బునరుద్ధరించుట మండలాస్తికుల కర్తవ్యమై యున్నది.

వైష్ణవ మఠాధిపతులు :

వైష్ణవ మతమున వడగలై, తెన్గలై అని రెండు తెగల వారున్నారు. తొలివారికి అహోబిల పీఠాధిపతులును, మలివారికి వానమామల మఠాధిపతులును గురువులుగానున్నారు. తత్తత్పీఠాధీశ్వరులును అప్పుడప్పుడు మండలమునకు విచ్చేసి, భక్తులనను గ్రహించుట కలదు. 1845 లో వానమామలైజియ్యం గారు సింహపురికి విచ్చేసిరి. 1954 సంవత్సరములలో శ్రీ శిన్న కలయన్ రామానుజ జీయరుస్వామి వారు నెల్లూరికి విచ్చేసి, ధర్మ ప్రబోధముచేసి

భక్తుల ననుగ్రహించిరి. మూలపేట శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ పురోభాగమున వానమామల మఠాధిపతులకై ప్రత్యేకముగ మఠము నిర్మింపబడి యున్నది.

అహోబిల మఠాధిపతులకు కర్నూలు మండలములోని అహోబిలము మూలస్థానము. వడగలై తెగవారికి వారు గురువులై ధర్మ-మత ప్రచారములు గావించుచున్నారు. ఈ పీఠాధి పతులను ద్రవిడ దేశమున 'అళగియ సింగర్' (నరసింహస్వామి) అని వ్యవహరింతురు. 1948 లో ఆ పీఠాధీశ్వరులగు శ్రీరంగ శఠకోప యతీంద్ర మహాదేశిక జియర్ గారు సేతుయాత్రకు వెళ్లుచు సింహపురి కివచ్చిరి. 1958 లో శ్రీ వేదాంత దేశిక శఠగోపయతీంద్రులవారు నెల్లూరికి వచ్చి విద్వత్సభలను వాక్యార్థములను భక్తిప్రబోధమును సల్పి ప్రజల మన్ననలకుఁ బాత్రులైరి.

మధ్వమఠములు :

అద్వైత, విశిష్టాద్వైత, పీఠము లున్నట్లే ఉడిపి, అక్షోభ్యతీర్థ, ఉత్తరాది, రాఘవేంద్రస్వామి, వ్యాసరాయాది ద్వైత పీఠములును గలవు. వానిలోఁ గొన్నింటికి నెల్లూరులో శాఖా పీఠములున్నవి.

విలేకరి : కే. సు. రా. శర్మ.

శ్లో॥ కాంతోసి నిత్యమధురోసి, రసాకులోసి।
త్వాలింగితః కిమితినాథ! పరాఙ్ముఖోసి?
త్వత్ప్రీవరోరు కుచయుగ్మ మురో విభిద్య
పృష్ఠా ద్వినిర్గత మభూ త్కిమితి హ్యపేక్షి॥

◆ ◆ ◆ ◆ ◆ ◆


శ్లో॥ యుక్తం సభాయాం ఖలు మర్కటానాం శాఖాస్తరుణా మృదులాసనాని।
సుభాషితం చీత్కృతిరాతిథేయా దన్తైర్నఖాగ్రైశ్చ విపాటనాని॥
శ్లో॥ దుర్దిన నిశీధ పవనే నిఃసంచారాసు నగర వీధీషు
పత్యౌ విదేశ యాతే పరం సుఖం జఘనచపలాయాః.

(విద్యాకరుని సుభాషిత రత్నకోశము)

◆ ◆ ◆ ◆ ◆ ◆

శ్లో॥ శరీరం జ్ఞానజననం రోగోవిష్ణు స్మృతిప్రదః
విపద్వైరాగ్యజననీ త్రయం సుఖకరం సతామ్॥

సూచన : పే. 553-556 లను 557-560 గా గమనింపవలెను.



శ్రీ రంగనాయక దేవాలయ గోపురము.

శ్రీ కరుణాకర భక్తవశీకర, నరసుర వినికర శివకరఖర ద
ర్వీకర మదహర ధృతదర, శ్రీకర నెల్లూరివాస శ్రీరంగేశా.

1893 లో మిత్రులకోరికపై శ్రీ వావిలకొలను, సుబ్బారావుగారు 3 గంటలకాలములో 'తల్పగిరి రంగనాయక శతకము' ను వ్రాసిరి. అందు ప్రథమ పద్యము మొదలు 12 వ పద్యముదనుక నుండు పద్యాదిమాక్షరములఁ జదివిన 'శ్రీరంగనాయకీ నాయకాయనమ' అనియు; 81 నుండి 90 వరకు ప్రథమ పాద ప్రాసాక్షరములను కలిపి చదివిన 'వావిలకొలను సుబ్బారావు' అనియు, 91 వ పద్యము మొదటి పాదము బేసియక్షరములు చదివిన 'వావిలకొలను' అనియు; 94, 99 పద్యముల ప్రథమ పాద ప్రాసాక్షరముల జదివిన 'రామార్పణమస్తు' అనియు వచ్చును. ఈపద్యమా శతక రత్నములలోనొకటి.

# 49

# ≡ శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ≡

శ్రీ యరగుడిపాటి వేంకటసుబ్రహ్మణ్యం, బి. ఏ. బి. యల్.

అడ్వకేటు - నెల్లూరు.

"పినాకినీ జలస్నానా త్పినాక్యేవ
భవిష్యతి"

అని ఆర్యోక్తి. అందును ఉత్తరవాహిని అయిన ఉత్తర పినాకినీనదీ తీరము పవిత్రమైనది. అట్టి పుణ్యనదీతీరమున వేంచేసి యుండు శ్రీ తల్పగిరి రంగనాథస్వామివారి దేవాలయము అతి ప్రాచీనమైనదని పురాణేతిహాసములనుబట్టి తెలియుచున్నది. మన స్థలపురాణమునుబట్టి ఒకప్పుడు కశ్యపప్రజాపతి ఇచ్చోట యజ్ఞ మొనర్చెనని, అందలి త్రేతాగ్నులు శ్రీ రంగనాథస్వామి ఆలయముగను శ్రీ జన్నవాడ కామాక్షి ఆలయముగను శ్రీ వేదగిరి నృసింహస్వామి ఆలయముగను వెలసినవని తెలియుచున్నది. జన్నవాడ పేరు యజ్ఞవాటికయొక్క వికృతి. శ్రీ రంగనాథుడు పూర్వాభిముఖుడుగాక పశ్చిమాభిముఖుడైయుండుటకు కారణము ఈ త్రేతాగ్ని స్థానము లొకటినొకటి చూచుకొను అవశ్యకతయే యుండును.

ఇప్పటి గాలిగోపురమున్నచోట తత్పూర్వము శిథిలమైన ఒక గోపురముండినది. ఆగోపురము పైనున్న శాసనములో దానిని జనమేజయుడు కట్టించెనని యుండినది ఆశాసనమును మాప్రపితామహులు కీ॥ శే॥ యరగుడిపాటి వేంకటాచలం పంతులుగారు భద్రపరిపించిరట. కాని ఇప్పుడది కానరాదు. ఈవిషయముమాతండ్రిగారికి వారి తండ్రి కీ. శే. వరదయ్య పంతులుగారు చెప్పియున్నారని వారు రచించిన వేంకటాచలం పంతులుగారి జీవితచరిత్రలో నున్నది. (ఈ జీవితచరిత్ర అముద్రితము) ఈశాసనము కానరానందున జనమేజయుడు ఎవరో తేల్చుటకు వీలుకాదు. కాని జనమేజయు నామము భారతమును స్ఫురింప జేయుచున్నది. ఒకప్పుడారాజు శ్రీ తల్పగిరి రంగనాథుని సేవించెనేమో!

ఇక పురాణముల వదలి ఇతరవిషయముల పరిశీలింతము. మన నెల్లూరు ప్రాచీనకాలమునుండి అనగా మౌర్యయుగమునుండి చోళ మండలమునకు ఉత్తర సరిహద్దై యుండినది. ఈచోళమండలము (కోరమాండల్) ఉత్తరమున నెల్లూరునుండి దక్షిణమున తిరుచినాపల్లివరకును, పడమట మైసూరు రాష్ట్రములోని కూర్గువరకును వ్యాపించి యుండినది. ఈ చోళమండలమునకు దక్షిణ సరిహద్దులో కావేరీతీరమున శ్రీరంగ క్షేత్రమున్ను, ఉత్తర సరిహద్దులో పినాకినీనదీ తీరమున శ్రీ తల్పగిరి రంగనాథ క్షేత్రమున్ను, పడమట సరిహద్దున శ్రీరంగ పట్టణమున్ను, ఉండుట గమనార్హము. చోళులకు శ్రీ రంగనాథుడు కులదైవమనుటకు వేరు కారణము కావలయునా? శ్రీ రంగక్షేత్ర

ఎంత ప్రాచీనమైనదో అంత ప్రాచీనమైనది మన తల్పగిరి ఇప్పటికిని ముక్కోటికి శ్రీ రంగమునకు పోవుటకు బదులు తల్పగిరి రంగనాథుని ద్వారదర్శనము చేసుకొనుట ఆంధ్రదేశమున సంప్రదాయము ఉత్తర దేశము దివ్యనదులకున్ను, చోళపాండ్య మండలములు దివ్యనిధులకున్ను ప్రసిద్ధి చెందినవి ఈ మండలములకు ఉత్తర సరిహద్దున వెంచేసియుండు శ్రీ తల్పగిరి రంగనాథాలయము ప్రథమ దివ్యనిధి అయి సందునని ' పెన్నదాటితే పెరుమాళ్ళసేవ'' అనుసామెత ఆంధ్రదేశమున నేర్పడినది చోళమండల సంప్రదాయము ననుసరించియే ఈ దేవాలయమున అనాదిగ అగమశాస్త్రాను సారము పూజావిధానములు జరుగుచున్నవి

శ్రీ రంగనాథాలయములోని శాసనములను కొన్నింటిని పరిశీలింతము ఈశాసనములలో ఒకదానిలో (యన్ 57) ఇద్దరు కుళోత్తుంగదేవులు చెప్పబడినారు ఈ ఇద్దరు మధురను పట్టుకొన్నట్లు చెప్పబడినందున ఈ యిద్దరిలో ప్రథముడు మొదటి కుళోత్తుంగచోళుడు (1070-1 18) ద్వితీయుడు మూడవ కుళోత్తుంగ చోళుడు ( 78-1216) మూడవ కుళోత్తుంగ చోళదేవుడు నవీన చోళరాజులలో కడపటి గొప్పరాజు ఇతడు గొప్ప దేవాలయ నిర్మాత ఈతనికాలములో ఈ దేవాలయమునకు చాలధర్మములు కావింపబడినవి. యస్ 69 శాసనములో మూడవ కుళోత్తుంగరాజ రాజ్యమునకువచ్చిన 0 ఎట అనగా క్రీ. శ 188 వ సం॥ మున నెల్లూరులోని చోళుల సైన్యమునకు చెందిన మొదలియారులును ఈ యూరులోని మూడు వీదుల (వివీధిలో చెప్పబడలేదు) పౌరులును కలసి కొంతధనము స్వామి కిచ్చినట్లున్నది పూర్తివివరములు అగుపడుటలేదు తరువాతి శాసనము (యన్ 55) క్రీ శ 97-98 నాటిది ఈ సం మున జయకొండ చోళ మండలములోని (జయకొండ చోళమండలము దక్షిణ నెల్లూరు జిల్లా కోవూరుతాలూకాలై యుండవచ్చును ) నాడుల పెద్దలు కొందరు, చిత్రమేళుడు అను వారి అధ్యక్షతన రంగనాథాలయములోని ఉత్తరి మేళ మంటపమున సమావేశమై, శ్రీ స్వామివారికి 2 200, కుళీలు గుంటల అనగా సుమారు 2,20 ఎకరములు భూమిని దానమిచ్చినట్లు ఈ శాసనమును బట్టి తెలియుచున్నది తరువాతి శాసనము (యన్ 72) మూడవ కుళోత్తుంగ చోళ దేవుడు రాజ్యమునకు వచ్చిన ఇరువది యారవ సం ము అనగా క్రీ శ 1204 సం॥ము నాటిధి. ఈ సం॥ మున కుళోత్తుంగ చోళ మహారాజుగారి నోటిమాటగా వచ్చిన ఆదేశముప్రకారము అతని తెలుగు చోళ సామంతుడును, నెల్లూరును పాలించు వాడును అగుతమ్మ సిద్ధిరాజు (ఆయనకు మధురాంతక పొత్తపి చోళుడును నామాంతరము సైతము కలదు) శ్రీ రంగనాథస్వామికి ముందై నాడులోని (కోవూరుతాలూకా కావచ్చును ) తామర మడుపు గ్రామమును, (దీనికి చిత్రమేళ నల్లాడు అను నామాంతరము చెప్పబడినది ) ఇచ్చినట్లున్నది

తరువాతి శాసనము (యన్ ?) మూడవ కుళోత్తుంగ చోళదేవుడు రాజ్యమునకు వచ్చిన 31 వ సం॥ మున అనగా క్రీ. శ 1209 నాటిది. పై విధముగ

త్తుంగ మహారాజు నోటిమాటగా ఆదేశింపగా ఆతని సామంతుడు. తెలుగు చోళరాజు తమ్మ సిద్ధిపెద్దినాడు (నెల్లూరుతాలూకా) లోని 'పిక్‌కాడ్' గ్రామమును (ప్రస్తుతము పిడుకానిపల్లె) శ్రీ స్వామివారికి దానముచేసి నాడు. ఈ పిర్‌కాడ్‌గ్రామ సరిహద్దులు ఈ క్రిందివిధముగా సూచింపబడినవి. తూర్పు 'కోలూరు' గ్రామ పొలిమేర, దక్షిణమున 'మెరప్పయూర్' గ్రామపొలిమేర, పడమర 'ఆములూర్' గ్రామపొలిమేర, ఉత్తరము 'కొరుటూరు' గ్రామ పొలిమేర. శ్రీ స్వామి వారికి ఈ గ్రామములో ఇప్పటికిని పొల ములు గలవు. పై శాసనములు గాక యస్. 63, యస్. 64, శాసనములుకూడ మూడవ కుళోత్తుంగ చోళదేవుని కాలము నాటివి. ఆయన రాజ్యమునకు వచ్చిన తర్వాత అవి ఏ సం॥ రము నాటివో తెలి యదు. అందులో మొదటి శాసనములో కుళో త్తుంగుడు కొన్ని గ్రామములు (వాని పేరులు తెలియుటలేదు.) ఇచ్చినట్లును, రెండవదాని ప్రకారము ఆరాజు ఈ దేవాలయమునకు "పెట్టిదకుంద్రై" గ్రామమును దానముచేసి నట్లున్నది. పైశాసనములో మొదటిదానిలో (యస్. 63) దేవాలయ ధర్మకర్తలు కుళో త్తుంగునికి ఆధర్మమును ఆచంద్రార్కము నిర్వహింపెదమని హామీ యిచ్చినట్లు కూడ గలదు. పైశాసనములను బట్టి మూడవ కుళోత్తుంగుడు ఈ దేవాలయమున కపార సేవ కావించినాడని తెలియుచున్నది. ఈ కాలము నాటిదే మరియొక శాసనము (యస్. 75) గలదు. ఇది నెల్లూరు పాలిం చిన తెలుగు చోళులది. ఇది అసంపూర్ణము. ఇతర శాసనములవలె తమిళములోగాక గ్రంథాక్షరములలో వ్రాయబడినది. ఇది రంగనాధస్వామి ధ్వజస్తంభముపై కలదు. దీనిలో శక సం॥ ము ఇవ్వబడియుండలేదు. కరికాళ చోళ వంశీయులైన బేడబంధ, తమ్మసిద్ధి పేర్లుకలవు. వీరిద్దరు తిక్కన ప్రభువైన రెండవ మనుమసిద్ధికి పినతాతలు. బేడబంధ II తన అన్న మొదటి మనుమ సిద్ధి. తరువాత క్రీ. శ. 1192 లో రాజ్య మునకువచ్చి తన తమ్ముడైన మధురాంతక పొత్తపి చోళుడను నామాంతరము కలిగిన తమ్మసిద్ధికి (1205-9) నెల్లూరు రాజ్య మిచ్చెను.

కుళోత్తుంగ చోళుని తర్వాత చోళ సామ్రాజ్యమును పడగొట్టి పాండ్యుల రాజ్యమును నెల్లూరు మొదలు సింహాళము వరకు వ్యాపింప జేసినవాడును, పాండ్యు లలో ముఖ్యుడును అయిన సుందరపాండ్య దేవుడు రంగనాథాలయములోని (యస్. 61) శాసనకర్త (దానకాలము లేదు). ఇతనికి 1260 సం॥ ములో నెల్లూరులో పట్టాభిషే కము జరిగినట్లు చరిత్ర. బహుశః ఈ శాస నము 1260 సం॥ ము నాటిది కావోలు. కళింగరాయర్ అను వారి కోరికపై సుందర పాండ్యదేవుడు 'ముంద్రైనాడు' లోని 'మావడికుంద్రై' గ్రామమును తనపేర శ్రీ రంగనాథాలయములో కట్టబడిన సుందర పాండ్య సన్నిధిలో శ్రీ స్వామివారి ఉత్స వాది కైంకర్యములకై ఇచ్చెను.

తిక్కన ప్రభువైన రెండవమనుమ సిద్ధిమనుమడు మూడవ మనుమసిద్ధి నెల్లూ రును పాలించునపుడు అనగా క్రీ. శ. 1291 1316, ఈదేవాలయమునకు ధర్మము చేసి నట్లు కొన్ని శాసనములుకలవు. ఇతనికి

మధురాంతకపొత్త పిచోళ, రంగనాథ, రాజ గండ గోపాలదేవ అను నామాంతరములు కూడ ఉన్నట్లు ఈ శాసనములలో చెప్పబ డియున్నది. యస్. 71 శాసనము క్రీ. శ. 1296-97 నాటిది. ఈశాసనము ప్రకారము ఈరాజు ఈదేవాలయమునకు 'ముండైనాడు' లోని 'అలింగాడు' గ్రామము నిచ్చినట్లు తెలియుచున్నది ఇదిగాక 1299-1300 సంవత్సరపునాటి యస్. 62 1301-02 సంవత్సరపు యస్. 60, 1315-16 సంవ త్సరపు యస్. 74, శాసనముల ప్రకారము ఈ రాజు రంగనాథాలయమునకు కొన్ని గ్రామములను ఇచ్చినట్లు తెలియుచున్నది. పై శాసన పరిశీలనవలన మన నెల్లూరి చరిత్ర చాలవఱకు, ఈ దేవాలయ చరిత్రతో సంబంధము కలిగియున్నట్లు తేలుచున్నది.

పైశాసనములను పరిశీలింపగా తిక్కనసోమయాజి భారతము రచించుకాలమునాటికి, అనగా సుమారు 1280 సం॥ము నాటికి శ్రీ తల్పగిరి రంగనాథాలయము ఉచ్ఛస్థితిలో ఉన్నట్లు తెలియుచున్నది. కొందరు మన ఊరిలో హరిహరనాథాలయ మున్నట్లు చెప్పుచున్నారు. అట్టి దేవాల యమే ఒకటిఉండి, ఆదేవునికి తిక్కనవంటి మహాకవి తనభారతమును అంకితమొనర్చి యుండిన ఆదేవాలయము గొప్ప ప్రాము ఖ్యము గలదిగ ఉండెడిది. దానికి, నెల్లూరు పాలించిన తెలుగుచోళులు రంగనాథునికి వలెనే, యెన్నియో ధర్మములు శాసనరూప ములుగచేసి ఉందురు. కాని ఆదేవాలయ మున్నట్లు స్థలపురాణగాథగాని, పరంపరా గతమైన ఐతిహ్యయములుగాని, దానిశిథిల ములుగాని, కడకొక్క శాసనముగాని, లేకుం డుటవలన అట్టిదేవాలయము లేదని యే ఊహింప తగును. ఒక వేళ హరిహరుని విగ్రమొకటి దొరికినదని అనుకొన్నను అట్టి విగ్రహమునకు దేవాలయమొకటి కల దని ఊహించుటకష్టము. తిక్కన అట్టి దేవాలయమున్నట్లు యెక్కడను వ్రాయలేదు. ఈ హరిహరనాథ నామములోని హరి శబ్దము ఈపురములోని ప్రసిద్ధ వైష్ణవదివ్య నిధియు, చోళులకుల దైవమును అయిన తల్పగిరి రంగనాథుని సూచించుచున్నది. ఈ నామాంతమందలి నాథశబ్దము ఈయూ హను ధ్రువపరచుచున్నది. ఇందలి 'హర' శబ్దము ఈపురములో ప్రాచీనశైవనిధి అయిన మూలస్థానేశ్వరుని సూచించుచున్న దని ఊహింపనగును.

మన రంగనాథుని ఉదయగిరినుండి తెచ్చి ఉంచినారని ఇటీవల కొందరు వ్రాయగా చూచి ఉన్నాను. ఇందలి నిజ మేమనగా ఉదయగిరి మహమ్మదీయుల హస్తగతముకాగా వారిబారినుండి బహు సుందరమైన రంగనాథుని ఇప్పటి ఉత్సవ విగ్రహమును 'కంటె' అను, బలిజకుల సర్దారులు తమ ప్రాణము లొడ్డి తెచ్చి రంగ నాథుని దేవాలయమున ఉంచిరట. ఈ వం శీయులిప్పటికిని రంగనాథ స్వామివారి కల్యాణోత్సవ ఉభయకర్తలు. కాని రంగ నాథుని మూల విగ్రహమును దెచ్చిరనుట సరికాదు. అది అనాది.

ఇక శ్రీరంగనాథుని ఆధునిక యుగ ములో సేవించిన ధన్య జీవులనుగూర్చి కొంత ప్రస్తావించెదను. శ్రీరంగనాథ స్వామివారి మూలవిరాట్ వేంచేసియుండు విమానమును పునరుద్ధారణచేసి ఆ విమాన ములపై సువర్ణకలశములు నమర్చిన వార్తు

భక్తాగ్రేసరులగు శ్రీవేంకటాద్రి స్వామివారు. వారు మా ప్రపితామహులకు సమకాలికులు మిత్రులు. వారాకాలమున, మన జిల్లాలో చేరిఉండిన ఒంగోలు తాలూకా ఆకులల్లూరుకు చెందిన వారు. వారి పూర్వాశ్రమ నామధేయము అల్లూరు వేంకటరమణదాసు. వారు శ్రీరంగము, తిరుపతి, కంచి, మొదలగు దివ్యక్షేత్రములలో కోట్లరూప్యముల విలువగలిగిన ఆభరణాది కైంకర్యముల గావించిన వారు. వారి మహిమ, ప్రభావములు విశేషము దక్షిణ దేశమున ప్రకటితములయినందున, ఆదేశములో, వారి జీవిత చరిత్ర హరికథగా చెప్పబడుచున్నది. ఈ హరికథ ముద్రితము. ఇప్పటికి వారి శిష్యులు పరంపర శ్రీరంగమున ఉన్నారు.

మత్ప్రపితామహులు కీ. శే. శ్రీ మరగుడిపాటి వెంకటాచలం పంతులుగారు (19-9-1801-26-10-1874) ఈ దేవాలయమునకు కావించిన సేవ అపారము వీరి జన్మస్థానము కందుకూరు తాలూకా, కరేడు గ్రామము. వారు ఆగ్రామ కరణమును, సంపన్న భూస్వామియు, నిరతాన్నదాతయు, అగు అప్పయ్యపంతులవారి తృతీయపుత్రులు. వీరు నెల్లూరు జిల్లా సివిల్ అండ్ సెషన్స్ కోర్టులో శిరస్తారుగా పనిచేసిరి. వీరు సంస్కృతాంధ్రములలోనే గాక పారసీక, ఆంగ్ల, కన్నడ, ద్రావిడములలో కూడ పాండిత్యము సంపాదించినవారు. వారివద్ద వేదాంత శాస్త్రమభ్యసించుటకై సన్యాసులు సైతము నిరంతరము ఉండుటచే వారి వసతికై రాయజీవీధిలో శంకరమఠమును కట్టించిరి. వీరు తమ జీవితమును శ్రీరంగనాథుని కంకితమొనర్చిరి.

ప్రథమమున 1835 సం॥ మున రంగనాయకుల పేటలో చిత్రకూటమును కట్టించిరి. ఈచిత్రకూట కుడ్యములపై దశావతారములు, కృష్ణలీలలు, రామాయణ గాథలు, అద్భుతముగ చిత్రింప బడియున్నవి. దీనికి చుట్టూను వనమును సమీపమున కోనేరును త్రవ్వించిరి. ఆవనము కోనేరు ఈరెండును, 1874 సం॥ పెను ప్రవాహములో శిథిలమైనవి. నెల్లూరులో దర్శనీయమైన పురాతన నిర్మాణములలో చిత్రకూటమొక్కటి.

శ్రీ పంతులుగారు గోపుర కైంకర్యమునకు పూనుకొనుటకొక అద్భుత సంఘటనము కారణము. తెన్‌గలై వైష్ణవులకు గురుపీఠాధిపతులైన శ్రీ వానమామలై జియ్యంగారు 1845 సం॥ మునకు సరియగు విశ్వావసు సంవత్సర శ్రావణమాసమున నెల్లూరికివచ్చి, శ్రీ పంతులువారు కట్టించిన శ్రీ రంగనాథస్వామివారి చిత్రకూటమున బసచేసిరి. శ్రీ రంగనాథాలయము వైష్ణవ మతానుసారము దివ్య క్షేత్రము గాదని అనగా 108 తిరుపతులలో నొకటిగాదని, వారు శ్రీస్వామివారిని దర్శింపక కొన్ని దినములుండిరి. ఒకరోజు తెల్లవారుజామున వారి స్వప్నములో ఒక బ్రాహ్మణుడగుపడి 'నేను పనికిరానప్పుడు' నాయిల్లు నీకెట్లు పనికివచ్చును, లేలెమ్మని చెప్పుచు, తన చేతిలోని బెత్తముతో వారిని కొట్టెనట. వెంటనే శ్రీ జియ్యంగారు నిదురనుండి లేచి పినాకినీనదిలో స్నానముచేసి, శ్రీ రంగనాథుని దర్శించి, వారి తీర్థప్రసాదములు స్వీకరించిరి. అప్పటినుండి ఆపీఠస్థులకు తల్పగిరి రంగనాథక్షేత్రము 109 వ దివ్యక్షేత్ర

మైనది. తరువాత శ్రీ స్వాములవారు పంతులవారిని రావించి, మీరు కట్టించిన చిత్రకూటము తనయిల్లని. స్వామివారు సెలవిచ్చినారు. శ్రీరంగనాథునికి ప్రీతికలిగించిన ఇంతటి కైంకర్యము చేసిన మీరు, శ్రీస్వామివారి గోపుర కైంకర్యమునకు పూనుకొనుట ఉచితమనిచెప్పి ఆశీర్వదించి ప్రథమ విరాళముగ 100 రూ. ల నిచ్చివెళ్ళిరి.

వారి ఆదేశానుసారము శ్రీ పంతులవారు గాలిగోపుర కైంకర్యమునకు పూనుకొని 14 సం॥ ములు ఏకదీక్షగ పనిచేయించి, (1859) దానిని పూర్తిచేయించిరి. గాలిగోపురము ఎత్తు 96 అడుగులు ఏడవ అంతస్తునుండి సముద్రము చక్కగ అగుపడును. దక్షిణదేశములో ఇంతకన్న గొప్ప గోపురములున్నను, ఇంతటి కుదిరికయు, శిల్పచాతుర్యమునుగల గోపురము మరియొకటిలేదని దాక్షిణాత్య శిల్పులనేకులు చెప్పియున్నారు.

ఈ గోపురమునుగూర్చిన ఇతిహాసములలో ఒకటి ముఖ్యమైనది. గోపురమునకు కావలసిన తెల్లరాళ్లను బుచ్చిరెడ్డిపాళెం తిప్పను నరకించి పంతులవారు తెప్పించుకొనిరి. ద్వారశాఖలనుకూడ అచ్చటనుండియే తెప్పించిరి. ఈ ద్వారశాఖలు శ్రీ రంగనాథస్వామి గరుడవాహనారూఢుడైవచ్చుటకు వీలైనంత ఎత్తుగలవి. ఇట్టి నిడివియైన ద్వారశాఖలునాల్గు. వాటిని 10. మైళ్లదూరము నుండి తెప్పించుటకన్న, వాటిని పినాకినీనది దాటించుట కష్టతరమైనవని. అప్పటిలో నదిపై వారధిలేదు. అందుచేత ఇసుకలో రావలసియుండెను. ఈ ద్వారశాఖలో నొకటి యేటిలో వచ్చుచుండగా ప్రవాహము వచ్చినందున, దానిని నదిలో వదిలి రావలసివచ్చెను. ప్రవాహము తగ్గినవెనుక అద్వారశాఖ లాగుటకై ఎన్నివందలమంది ప్రయత్నించినను, కదలలేదు. ఈద్వారశాఖను త్యజించవలసివచ్చెను. కాని అట్టి ద్వారశాఖ మరియొకటి తయారుచేయించుటకు ఇక అసాధ్యము. అప్పటికే బుచ్చిరెడ్డిపాళెంలో అంతటి పొడవుగలరాయి దొరకుటకు అతి ప్రయాస అయినది. ఎట్లో నాలుగురాళ్ళు చిక్కినవి. ఇకదొరకుట దుర్లభము. ఏమి చేయవలయును? గోపురకైంకర్యము నిలచిపోవునని పంతులుగారికి తోచినది. వారు వెంటనే చేత తంబురను ధరించి ద్వారశాఖ ఉండిన చోటికివెళ్లి ఆశువుగ ఈక్రింది కీర్తనను కూర్చిపాడిరి.

శహానరాగము-చాపు తాళము.

రంగనీవు నామీద యుండఁదాయకుండు
రంగ ॥పల్లవి॥
మండలేశ్వరుఁడ నీ మరుగుఁజొచ్చితినయ్య
రంగ ॥అను పల్లవి॥
రాయివచ్చి జలధిజొచ్చిరాదు యేమిచేతు
రంగ।
యేటిలోనున్నరాతి నీడ్వనెవరితరముగాదు
రంగ ॥రంగ॥
పట్టుశాల్వఁగప్పుకొని పవళించి యున్నరంగ
యెంతవేడిన నామొరాలించ వేమిరంగ
॥రంగ॥
పల్లికొండరంగ నాతో పంతమేలనయ్య
రంగ
యెల్లయేనుగనెక్కి యెదురుగా వేంచేయు
రంగ ॥రంగ॥

ఆలివచ్చి మొన్ననాయె, యదియ చింత
తేమరంగ
గాలిగోపురముకొరకు కష్టపడితినయ్య
రంగ ॥రంగ॥
యరగుడిపాటి వేంకటాచలదాసు యిపుడు
యెంతవేడినను మొరాలకింపవేమి రంగా
॥రంగ॥

ఈ కీర్తన పాడుచుండ జనము మరల ప్రయత్నింపగా రాయి సులభముగా వచ్చినది. ఈ అద్భుతమును చూచినవారు చాలమంది ఇటీవలవరకు కలరు. ఈకీర్తన ఆంధ్రదేశమున హరిదాసులనేకులచే పవిత్రముగ పరిగణింపబడుచున్నది.

శ్రీ పంతులవారి మరణముకూడ ఒక అద్భుత సంఘటనము. 25-10-1874 తేదీన పినాకినీనదిలో అసామాన్యమైన వెల్లువ వచ్చెను. శ్రీ రంగని మూలవిరాడ్విగ్రహము మునిగిపోయి, నైవేద్య దీపారాధనలు నిలిచిపోయినవి. ఉత్సవ విగ్రహములను గోపురము మూడవ అంతస్థున చేర్చిరి. ఒకటవ అంతస్తు పూర్తిగ మునిగిపోయినది. పంతులవారు స్నానముచేసి జపమునకు కూర్చొని తిలకము పెట్టుకొనుచుండగా వారికుమారులు వరదయ్యపంతులుగారు ఈ విషయమును వారికి తెలిపిరి. ‹‹అటులనా›› అని పలికి వారు వెంటనే సమాధినిబూని మఱునటినాడు బ్రహ్మముహూర్తమువరకు ఆస్థితిలోనుండి, తరువాత దేహత్యాగముచేసిరి.

శ్రీ పంతులువారు రంగనాథునికి ఇంకను ఎన్నియో ఇతర కైంకర్యములను చేయించియున్నారు. ఇవి, రంగనాథస్వామి వారి ముఖద్వారము, పంతులవారి తిరుదా, మొదలగునవి. చిత్రకూటములో స్వామి వారికి డోలోత్సవమునకై పుణ్యకోటి విమానము చేయించినారు. ఈ విమాన శిల్ప నైపుణ్యము విశిష్టమైనది. శ్రీ పంతులవారు రంగనాథునికి తాను కైంకర్యములను జరుపుటయేగాక, తన బంధు మిత్రులను ప్రోత్సహించి వారిచే అనేక కైంకర్యములను జరిపించిరి.

శ్రీ పంతులవారి తరువాత పేర్కొనదగిన వారు, వారి సమకాలికులు, కీ. శే. శ్రీమతి వేముగుంట బొజ్జమ్మగారు. ఈమె భర్తగారు వేముగుంట వేంకటరావుగారు. ఈ జిల్లాలో తహశీల్దారుగా నుండిరి. అపర అన్నపూర్ణావతారము శ్రీ బొజ్జమ్మగారు, ఆమె రంగనాయకులపేటలో భక్తుల వసతికై ఒక సత్రమును కట్టించిరి. ఆమె చిలుకు ద్వాదశి రోజున మంటపాలవీధిలోని తమ ఇంటివద్దనుండు మంటపములో గరుడవాహనారూఢుడైన స్వామిని వేంచేపు చేయించి తమ ఇలవేల్పుఅయిన తులసీదేవితో కల్యాణము కావించువారు, ఈ ఉత్సవము ఇప్పుడును జరుగుచున్నది.

తరువాత పేర్కొనదగిన భక్తులు కీ. శే. ముప్పిరాల పెదనరసింహాచార్యులవారు. స్వామివారికి రత్నాల వైలుముడిని చేయించిరి. వారు ఆ కైంకర్యమునేగాక ఇంకను ఇతర ఎన్నొ కైంకర్యములను జరిపించియున్నారు. వారి మరణ సమయమున (1909) గూడ పినాకినిలో గొప్ప ప్రవాహము వచ్చినదట.

వారితరువాత వారి అన్నకుమారులు ముప్పిరాల చిన నరసింహాచార్యులవారు

వారిస్థానమునకు వచ్చిరి. వారు బంగారు గరుడవాహనమును, అద్దాల మంటపమును శ్రీ స్వామివారికి విష్ణు సహస్రనామములతో కూడిన పట్టు జరీదోవతులను, అమ్మవారికి అష్టోత్తరముతో కూడిన పట్టు జరీచీరెను, సమర్పించిరి. ఈ సహస్రనామముల పట్టు జరీదోవతి బహుసుందరమైనది. ప్రతినామము బంగారు జరీతో నేయబడినది. ఒకొక్క యక్షరము సుమారు రెండంగుళముల నిడివి కలది. ఇవి తెలుగక్షరములు; చాలసొంపుగ నేయబడినవి. ప్రతినామము ప్రణవముతో ప్రారంభమై 'నమః' అను పదముతో అంత్యమగును. ఇది అమూల్యమైన కైంకర్యము వీరు ఇంకను యెన్నో లెక్కకు మించిన ఇతర కైంకర్యములను చేసియున్నారు.

వీరు నిత్యము శ్రీ స్వామివారి పవ్వళింపు సేవకుకావలసిన పాలు, పండ్లు, కలకండ యింకను యెన్నో వస్తువుల సమర్చుకొని, యింటినుండిపోయి యాసేవ ముగియునంతవరకు స్వామి సన్నిధినుండి తరువాత యింటికివచ్చి నిదురించువారు. సహస్రనామముల పట్టుపంచలు నేయుటకై దక్షిణాదినుండి పట్టునేతగాండ్లనుపిలిపించి, తమయింట నేయించుచుండెడివారు. అప్పటిలో వారికి అస్వాస్థ్యమువలన బయటవెళ్ళి భక్తులనుచూచి ధనము వసూలుచేసికొనుటకు శక్తిచాలకుండెను. వారునిత్యమును పవ్వళింపుసేవ సమయములో శ్రీ స్వామివారితో నొకమిత్రునితో మాట్లాడునట్లు తన కైంకర్యము నిర్వహించుటకు వలసిన సహాయము నిమ్మని మొఱపెట్టుచుండుట నేనెన్నియోమారులు చూచియున్నాను. ఈరోజుతో పని నిలచిపోవునేమో యనిభయపడి నపుడెల్ల యెట్లో సమయమునకు ధనము వారికందుచుండెడిది. వీరు 1940 సంవత్సరము వరకు జీవించియుండిరి. వారికి సంతానములేదు. దత్తు (స్వీకారము) చేసుకొనుట కిచ్చగింపక తన సర్వస్వము శ్రీస్వామివారికి సమర్పించిరి.

ఇట్టి భక్తాగ్రేసరులచే సేవలనందిన శ్రీ తల్పగిరి రంగనాధస్వావారికి నిలయమి మైన మననెల్లూరు పుణ్యావిశేషము వర్ణనాతీతము. శ్రీ పంతులవారినిగూర్చి వారి సమకాలీనులను కీ॥ శే॥ పిళ్లారిసెట్టి కోదండరామ దాసుగారు తాము రచించిన తల్పగిరి రంగపతి శతకములో నిట్లు ప్రశంసించిరి.

శ్రీ మహనీయ భక్తివివశీకృతుడై భవదీయసన్నిధిన్
క్షేమకరాగ్రమంటప నికేతన గోపుర చిత్రకూటము
ల్కోమలభంగిఁగూరిచి యకుంఠిత నిత్యమహోత్సవంబు శో
భామతిఁజేయు నెఱగుడిపాటి ద్విజాన్వయు వేంకటాచల
గ్రామణి దల్తు దల్పగిరి రంగపతీ సుకృతీ కపామతీ.

---

క్రీ. శ. 1837 లో రంగనాథునకు గంటల ధ్వజస్తంభమును శ్రీ ఆనందరాయని వారి సతీమణి యమునా బాయమ్మ దానముచేసినట్లు ధ్వజస్తంభముమీఁద నుండు శాసనమునఁ గలదు. ఆ ఆనందరావు ఆనాటి నెల్లూరి సీమకు తహసిల్‌దారు.

# 50

# నెల్లూరు మండల నట నాటకశిల్ప చరిత్ర

శ్రీ యస్. రామదాసయ్యంగారు. యం. ఏ. యల్. టి.

నేను డెబ్బదిమూడవయేట చొచ్చినాడను. నేను పుట్టకమునుపో నోరెఱుంగని వాడనుగా నున్నపుడో నెల్లూరికి బయటి దేశపు నాటకసభలు 'ధార్వాడకంపెని' అనియు, 'బాంగ్లికంపెని' అనియు ఒకదాని వెనుక నొకటివచ్చి పెక్కు నాటకములు ప్రయోగింపగా తాము ఒకదానిని కూడ తప్పిపోనీకుండ చూచితిమని మానాయనగారు చెప్పుచుందురు. అందు ధార్వాడ కంపెని పెక్కు ప్రయోగింపలేదనియు, దానికంటెను బాంగ్లికంపెని శ్లాఘ్యమైనదనియు, బహు ప్రయోగములు కావించినదనియు చెప్పుదురు. బాంగ్లికంపెని యొడయుడు కూచిపూడి జట్టుల హాస్యగానివలె తమ నాటకములలో అన్ని ప్రధాన పాత్రలను అభినయించి ఆఱితేఱినవాడై తన జట్టునకు సర్వమును నేర్ప సమర్థుడై యుండెనట. నాయికపాత్రధరించు కేశవరావు అతినిపుణుడట. భీష్మ ప్రహ్లాద హరిశ్చంద్ర సారంగధర స్త్రీసాహసా ద్యనేకనాటకములు ప్రయోగింతురట. ఒడయుని కీర్తిని విన్న పౌరుల ప్రార్థన నంగీకరించి, అతడు సొంతముగా హరిశ్చంద్ర పాత్రము నటింపగా చూడ జనులు వెల్లువగా పొరలి వచ్చిరట. వీధిభాగవతము మాత్రమే పరిచితమైయున్న పౌరులకు ఉన్నత రంగమున పరదా గిరగిర పైకి పోవుటయు, ధగధగ వెలుతురులో దేదీప్యమానముగా వేషము లగపడుటయు, వారు అభినయించుటయు అవి రక్తియెంతో అంతకన్నను ఆశ్చర్యమును కలిగించినవట. ఇది 1880-1890 మధ్యకాలము కానోపును. అట్లు తాము ఆక్రొత్త వైఖరికి ఆశ్చర్య పడితిమని చెప్పుటచే ఆపక్కి నాటకములు అంతకు పూర్వము నెల్లూరులో లేవన్నమాట.

అట్లే అవి నెల్లూరి పౌరులలో నాట్యాభిరుచిని నాటి మొలకెత్తించిననియు చెప్పదగును. ఆమార్గమున నెల్లూరి నాట్యోత్సాహులు కొందరు ఊరినడిమివారు లక్ష్మీవిలాస నాటకసభయను పేరుతో సభగూడి ఏవియో నాటకములు తిప్పరాజువారి సత్రపు బందిటిలో అపుడపుడు ప్రయోగించుచుండిరి. కొందఱు సంతపేటవారు గూడూరు కంపెని అని ఒక సమాజముగా కూడి ఈ యూరనే కాక చుట్టుప్రక్క యూళ్లకును పోయి నాటకప్రదర్శనములు కావించుచుండిరి. ఆదినాలలో నెల్లూరి విద్యార్థులు మెట్రిక్యులేషను దాటిన పైచదువునకై దక్షిణ భారతమున కెల్ల ఒక్కటే యూనివర్సిటి స్థానమైన మదరాసునకు కాలేజిలలో చేరుటకై పోవుట వాడుక. కాలేజి చదువున ఆంగ్ల షేక్సుపియరు నాటకములును గీర్వాణ కాళిదాసాదుల నాటకములును పాఠ్యము లగును. మఱియు మదరాసు రాజధానియు గొప్పనగరమును అగుటచే అచట అప్పటికే

నేర్పు ప్రసిద్ధులు గడించివచ్చిన పార్సీకంపెనీల యద్భుతనాటక ప్రయోగములును చూడనగుచుండెను. షేక్స్పియరు నాటకములకు అంగ్లదేశమున ఆమహాకవికాలము మొదలుకొని నూర్లయేండ్లుగా ప్రయోగములును వాడుకయే. అని యెఱిగిన దొరలు క్రిశ్చియను కాలేజి మొదలగునెడల ఆపాత్యముల నేర్పుట కలిగియుండెను. అప్పుడే క్రిశ్చియను కాలేజలో కవిహృదయ చక్రవర్తి కీ. శే. వేదము వేంకటరాయశాస్త్రిలవారు కాళిదాసీయాదులను ఛాత్రసాహస్ర ప్రచారంబుగా నాటకములు తన్నిగమంబు గఱపినారు, అన్నట్లు నేర్పుచుండిరి. వారికి నెల్లూరున అభిజనాభిమానము. తచ్ఛిష్యులలో నెల్లూరివారును ఉండిరి. వారిలో రంగనాయకులపేట వాస్తవ్యులు (నెడమనూరు) కందాడై శఠకోప రామానుజాచార్యులును, కందాడై శ్రీనివాసన్ ఉరఫ్ దొరసామయ్యంగారును జ్ఞాతులు అన్యతములు. వారు మంచి రూపవంతులు, నాట్యప్రవీణులును. శ్రీ శాస్త్రిలవారు వారిలో శఠకోపుడు శకుంతలగాను, దొరసామి దుష్యంతుడుగాను, ఇతర పాత్రములకు ఇతరులంగూర్చియు మదరాసు విక్టోరియా పబ్లిక్ హాలులో శాకుంతలమును సంస్కృతమున (1890?) ప్రయోగింపించిరి. ఆ ప్రయోగము మిక్కిలియు చక్కగా కుదిరెనని దానికీర్తిని, అట్లే ఉత్తర రామచరిత్ర ప్రయోగపు (1893) గీర్తిని "ఇప్పటికిని నావీనులలో అనురణనముం గావించుచున్నవి......ఇప్పటికిని నాకన్నుల యెదుర మెలగుచున్నవి." అని శ్రీ శాస్త్రిలవారే స్వయముగా మాతో ఉగ్గడించిరి.

ఆ శఠకోపరామానుజ దొరసాములు వారి సావాసులు, తోడి విద్యార్థులు, ఇరుగుపొరుగువారు పిన్నలు పెద్దలు సమకాలికులు ఒక నాటకసమాజముగా అమెచ్యూరు డ్రామెటిక్ సొసైటీ అనుపేర 1891 (?) లో కూడి నాటక ప్రయోగములకుం గడంగిరి. 'అమెచ్యూర్' అనగా జీవికకై కాక, కేవల రసలోభముచేతను విరామ వినోదపరతచేతను నాటకములు ప్రయోగించుమాన్యులు అన్నమాట. ప్రాయికముగా ఇంగ్లీషు విద్యార్థులగుటను, కాలేజీలలో అంగ్ల ప్రయోగముల నెఱింగిన వారగుటను వారు తొలుత షేక్స్పియరు నాటకములనే ప్రయోగించుచుండిరి. తరువాత 1897 లో వారు కాళిదాస శాకుంతలమును-తమలో ముఖ్యులు మునుపు మదరాసులో దానిం బ్రయోగించి యుంటను తలంచుకొని ఇందు గీర్వాణముననే ప్రయోగించిరి. దొరసామయ్యంగారు దుష్యంతుడు, శఠకోపరామానుజాచార్యులు శకుంతల. వారు కాలేజిలో శ్రీ వేంకట రాయశాస్త్రిలవారి శిష్యులు, వారి శిక్షణచే అప్రాంతముల మదరాసు ప్రయోగమున నటించి మెప్పుగన్నవారు; శాస్త్రిలవారియందు అపారభక్తి గౌరవములు కలవారు. కాగా ఆయాట ఎంతయు శ్లాఘ్యముగా నుండెను. అంతట ఆషేక్స్పియరు మార్గానుసారముగా రచితములై, అచ్చుపడకయే చేతివ్రాతగా దొరకుచు ప్రయోగప్రచారము పొందుచున్న బళ్ళారి శ్రీ ధర్మవరము రామకృష్ణమాచార్యుల చిత్రనళీయము, పాదుకా పట్టాభిషేకము, విషాదసారంగధరము మొదలైనవి ప్రయోగార్థము వారిచే కైకొనంబడినవి. వానియందు

దొరస్వామి యన్న కందాడై కేశవాచార్యులు నళబాహుక వేషములను, నేలటూరు సింగరాచార్యులు దమయంతి వేషమును నేలటూరు పెదకృష్ణమాచార్యులు సుదేవుని వేషమును వేసి చిత్రనళీయమును మిక్కిలి రక్తిమీఱ నిర్వహించి రని ప్రతీతి. అప్లై పాదుకాదులును. చిత్రనళీయమును ఒకతూరి కాక కొన్నితూర్లు ప్రయోగించిరి కాబోలు. తరువాత 1898 లో వేదము వేంకటరాయ శాస్త్రులవారు రచించిన ప్రతాప రుద్రీయమును ప్రయోగించి, అది రక్తికట్టక పోగా, ఇక నది ప్రయోగార్హము కాదని మానుకొని ఆ చిత్రనళీయమును దాని తోబుట్టువులనే ప్రయోగించుచుండిరి.

నెల్లూరున ఇది కేవలము అమెట్యూర్లే కూడిన సభ. అట్టివే తరువాత ఇందుండి చీలి పెరిగి తేజరిల్లిన సమాజములును. అది వృత్తికై నాట్యము అవలంబించి నేర్చినవారివి కావు. కాళిదాసాది నాటకములందు సూత్రధారుడు తన భార్యను పిలిచి తాను ప్రయోగింపవలయు నాటకమునుగూర్చి సలహాలు పడుటయు, తామిరువురుం గలసి సభను రంజింప వని వడుటయు, "ఆవేసము వూని మానాయన రాగలడు" "ఈవేషము వూని మామామ రాగలడు" మనవారందఱును. ఆన్ని వేషములు పాత్యాభినయములను లెస్సగా నేర్చుకొని సన్నద్ధులై యున్నారు; అనుటయు, 'రంగాన' ఇకను మనము 'సంగీతము'- స్త్రీభిః కృతం తు సంగీతమ్ సంగీతక ముచ్యతే-అనగా స్త్రీలును కలసి కూర్చు సంగీతమును తొడంగుద మనుటయు, ఈ మొదలైనవి చూడ వృత్తికోసము నిపుణముగా, నాట్యము నేర్చిన కుటుంబముల కలిమి వారిచే భావింపబడెనా అని యనుమానము కలుగును. భరతముని మొదలు దశరూపక ప్రతాపరుద్రీయ దర్పణకారాదుల వఱకుం గల ఆచార్యుల యుపదేశములును ఆ కలిమిని తదావశ్యకతను సూచించును. కూచిపూడి భాగవతుల జట్టులవలె ఇందులకును అట్టి జట్టులు కలిగియుండిన, నాటక ప్రయోగ యోగక్షేమము ఇంకను అతిశయముగా ఉండియుండునేమో. లేనిదానికి చింతించి యేమిలాభము?

నాటకకవికి తన కృతుల ప్రయోగము జూచు నాస పట్టరాక యుండును. తాను ఒక జట్టును ఆశ్రయించుటో, ఒక జట్టుచే ఆశ్రయింపబడుటో తప్పక కలిగియుండు ననియు కాళిదాసు నాటకముల వలనను శ్రీహర్షుని నాటకములవలనను భవభూతి నాటకములవలనను ఊహింపదగును. కాళిదాసు 'సువిహిత ప్రయోగతయా' ప్రయోగ మెల్ల చక్కగా శిక్షితమై యున్నందన' అని పలికించుటచే, తన మిత్రులైన యానటుల శాకుంతలపు టొద్దికలను తాను పలుమాఱు చూచి సంతోషించినాడని తలంపదగియున్నది. అప్లే భవభూతిని నటులు ఒక్కెడ 'మిత్రధేయ మస్మాకమ్ అన్నాడు' ఒండెడ 'నిసర్గసౌహృదేన భరతేషు వర్తమానః' అన్నారు. విశ్వనాటక మహాకవి షేక్స్పియరు నాటకాల చరితమందును అట్టిది కాననగునని పండిత ప్రకాండులు చరిత్ర కనిపెట్టి యూహలు సేయుదురు. హామ్లెట్టు నట్టువులకు చేయు నభినయపు హెచ్చరికలన్నియు ఆకవి తన నాటకనటులకు పలుమారు చేయునవే అని యందురు. అప్లే

ఆంధ్రనాటకకవి ధర్మవరము రామకృష్ణమాచార్యులకు బళ్ళారిలో మిత్రులును ఆశ్రితులును కలసిన సొంత నటసభ సరసవినోదిని యనునది ఒకటి కూడెను. నేర్పరులు అందు చేరుటయు, అందు చేరి నేర్పరులగుటయు కలుగుచుండెను. శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిలవారు ఆంధ్ర గిర్వాణ సాహితి పారంగతులు, 'హూణహూపకరసంబుదరంబు నింపార దిగద్రావి గజ్జున త్రేన్చినవారు' సొంతముగా గొప్ప నాటకకవి, దత్ప్రయోగ రసికులు, శిష్యులచే ఆ గొప్ప నాటకములు ఆడించి చూచు కుతూహలమును నేర్పును కలవారు. ఆమెట్చూరు నాటకసభలో వారి శిష్యులును తన్మిత్రులును తత్ప్రవణులును అదొరసామియు, యరగుడిపాటి సోదరులును, ఇతరులును ఉండి, తత్ప్రతాప ప్రయోగము అశిక్షితమై అట్లు చెడినతర్వాత తాము గురు గౌరవముచేతను సద్వస్తు పక్షపాతముచేతను 'ఆంధ్ర భాషాభిమాని సమాజము' అనుపేర చెలి ప్రత్యేకముగా కూడి శ్రీ శాస్త్రిల యాధ్యక్షమున వారి రచనలను మాత్రమే ప్రయోగింతుము, (గీర్వాణములనేని), అను దీక్షతో వారి యవేక్షణ శిక్షలను పొంది నాటకములం బ్రయోగింప తొడంగిరి. అమిగిలిన అమెట్చూర్లు చిత్రనళీయాదులనే ప్రయోగించుటయు ఆంధ్ర భాషాభిమానులు గురుశిక్షితులై తత్కృతులనే ప్రయోగించుటయు, అది యొండొరుల కళలో మెరుగులు తేరుటకు హితస్పర్ధాయక మాయెను. ఆస్పర్ధ పొగపొగగా నెల్లూరి గాలిలో ఇటీవలివరకును కననగుచునే యుండును. ఆంధ్ర భాషాభిమాని శాకుంతలమును, రెండు రాత్రులుగా ప్రతాపరుద్రీయమును, ఉషను, నాగానందమును ఏటేట వేసంగి సెలవులలో ప్రయోగింపజొచ్చెను. శాకుంతల కీర్తి మఱి యే నాటకమునకు కలుగును! కావున దాని సాధుప్రయోగము అనన్యాదృశమగు ఉత్తమకీర్తిని గౌరవమును సమాజమునకు సంపాదించెను. ప్రతాపరుద్రీయము అతి ప్రౌఢమును అసదృశమును అను పేరుం బొందెను. నేడు అది స్వతంత్ర భారతమున నిస్తులాంధ్రజాతీయ నాటకరత్న మని సేతు హిమనగ మధ్యమున వాసికెక్కియున్నదిగదా. (దానికి చిరము తరువాతిది యైనను శ్రీ శాస్త్రిలవారి బొబ్బిలియు అన్ని విధాల అట్టిదే. మఱి అదేల అట్లు మింట కెగయలేదో? ఆపేరుగలవి ఆంధ్రమున మఱియు కొన్ని యున్నందున మాత్సర్యేర్ష్యాంధ్యమున కాబోలు) దాని సాధుప్రయోగము ఎంతయు, నాట్యకౌశలము అపేక్షించునది. ఆనాటక ములంబట్టి తన్నటులు అతి ప్రాగల్భ్యమును, ప్రౌఢిని, ప్రసిద్ధిని, పొందిరి. చిత్రనళీయాదులు ఏయూరికి పోయినను దొరకును. శాకుంతల ప్రతాపాదులు కావున ఆంధ్ర భాషాభిమానుల ప్రయోగములు ఒక వైలక్షణ్యమును ఒక స్థిర సంప్రదాయమును-నెల్లూరిపి అనదగిన వానిని ప్రతిష్ఠించినవి. పద్యమునకు ప్రకరణభావ రసములకు అనుగుణమగు రాగము నిశ్చయింప బడవలయును. దాని యారోహణావరోహణ మూర్ఛనము లన్నియు పద్యభావమున ఇమిడిపోవలయును. స్తోత్రపాత్రమంచు తప్ప అది పద్యమునకు అంతగా పెచ్చు ఉండకూడదు; అను నివి కొన్ని సూత్రములు.

ఇతరములలోవలె కాక, వారి నాటకములలో పాటలు అత్యంత విరాళములు అగుటయు తొంటి యాచార్యుల యనుశాసనముల వశముననుు, తమ నాటకములు వానిని జవదాటమివలనను, కాళిదాసాది ప్రతిభోత్తరుల గుఱియం దుంచుకొనుట వలనను. అట్లే కదా! కనుడు. చిత్రనళీయ సారంగధరాది తమ రచనలయందు బళ్ళారి ధర్మవరము రామకృష్ణమాచార్యులు అనుబంధముగా పెల్లుగా పాటలు రచించియున్నారు. అపాటలు ప్రయోగమున మిక్కిలియు జనరంజకము లగునని వారు తలంచుచునే, తమ తొలినాటకమగు చిత్రనళీయము పీఠికలో నిజముతముగా పాటలు పద్యములవలె భావ ప్రకటనకు అనుకూలింపవు అని తెలిపియున్నారు. విషాదసారంగధరోపోద్ఘాతముననుు ''ఇప్పటికిని ఈనాటకము ప్రచురితమై యుండదు......తొలుదొల్త నీనాటకము (లు) గేయభూయిష్ఠమై (ములై) యుండుట దా (వా) ని నట్లే ప్రచురింప సాధ్యములేదని యెంత నే, జెప్పినను వినరైరి' అని తద్గేయ భూయిష్ఠత దానిం బ్రచురింపరామికి నిమిత్తమనియు, దానిం దొలగించి తగ్గించి పద్యములం గూర్చి సంస్కరించినట్లైన ప్రచురింపదగు నన్న నిజాభిప్రాయమును సూచించిరి. అది అట్లే. యత్రాభినేయం వస్తు స్యాత్ తత్ర వాద్యం న యోజయేత్' అని భరతముని యనుశాసనము గలదు. అట్లే కాళిదాసు గ్రీష్మ ముంగూర్చి పాడవలయు నటిచే 'ఈసీసిచుమ్బిదాణి' అనిశ్లోకమునే తన్మయత గొల్పి ఎఱుక మఱపించి శ్రోతల చిత్తరుపులం జేయునట్లుగా పాడించెను. అ శాకుంతలముననే సంగీత శాలయందలి హంసపదికపాటను రాగపరీవాహమైనదా నికయ్యును 'అహిణవ మహులోలువో' అని శ్లోకమునే చెప్పెను. మాళవికలో మాళవిక ఛలికనాట్యమునకు మృదంగమున నెమళ్లను మెడలెత్తి కూయించిన మాయూరీ, మార్జన అప్పుడే అగిన ప్రేక్షా గృహమున క్షేత్రజ్ఞపదముం బురడించు పాటగా 'దుల్లహో పిఓ తస్సిం' మర్లభః ప్రియ స్తస్మిన్ అని గేయం అభినయన్త్యా' అనుచునే శ్లోకమునే చెప్పెను. వీనింబట్టియే నాటకాలలో పాడుట రంజనకైన నాట్యధర్మిగా నెలకొన్న దనదగును. మఱి విక్రమోర్వశిలో ఉర్వశీ విరహోన్మాదమున ఏడ్చుచు అప్రియను వెదకజొచ్చిన పురూరవునికి అందందు కొన్ని పిచ్చిగంతులును వానికి తగిన ప్రాకృతంపుబాటలును, నిజసంస్కృత భాషిత పునరుక్తులంబోనివి చెప్పెను. శ్రీహర్షుడు రత్నావళిలో వసంతోత్సవమున సారాకై పెక్కు నడుములు విరుగ ఆడజొచ్చిన చేటికలను ఇంచుక పాటం బొనిపెను. భరతముని ప్రభృత్యాచార్యులును అట్లే అనుశాసించినారు. 'అథ మదః సమ్మోహానన్ద సమ్భేదో మదో మధ్యోపయోగజః అమునా చోత్తమః శేతే మధ్యో హసతి గాయతి. మద్యసేవవలనం గలుగునది. తెలివిదప్పుటయొక్కయు. అనందముయొక్కయు మిశ్రము మదము. దీనివలన ఉత్తముడు పరుండును. మధ్యముడు నవ్వును పాడును......' 'అథోన్మాదః-చిత్తసమ్మోహ ఉన్మాదః కామశోకభయాదిభిః అస్థాన హాస రుదిత గీత ప్రలపనాది కృత్' కామ శోక భయాదులవలన చిత్త సమ్మోహము ఉన్మాదము అనబడును. అది అస్థానహాసమును

డదిత గీతప్రలపనాదులం గాపించును' అని ఇట్లు ప్రకృత్యను కరణమునకై రసరహస్య మెరిగిన మహాకవులు నాటకాన పాటల స్థానమునను పద్యపక్షపాతము ప్రకటించి, పాటలనే చొనిపినయెడ అవి యించుమించుగా పద్యపు నింపాది నాతిమందగతి వృత్తి శయ్యలు కలిగి ప్రత్యక్షరమును వాద్యప్రతిరుద్ధము గాక పిడిగా స్ఫుటముగా శ్రోతులకు వినంబడగల కూర్పునే పొందదగును అని ఉపదేశించినారు.

"శ్రీహర్షో నిపుణః కవిః అని కవి గొప్ప మొదటి గుణముగాను, ,, లోకే హారివ వత్సరాజచరితం" అను వస్తువు గొప్ప రెండవ గుణముగాను ప్రయోగమునకు అతిశయముం గూర్చునని బహునాటక ప్రణేత పెక్కునాటకము లాడించి చూచి యెఱిగినవాడు, మహాకవి రాజాధిరాజు శ్రీహర్షుడు అనతిచ్చెను. తేనె మేల్మికి మెంచును పొగడుదురు కాని తుమ్మెదను తలంపరు అను మర్యాదగా ఆ నటుల కౌశలమును ఎంతురు కాని వారిని నేర్పి దిద్దితీర్చిన యొజ్జం దలుపరు కాబోలు. కృతి మంచిదైన, దాని ప్రయోగమున ఎట్టినటుడును చక్కగా పాత్రము నేర్చి ఒక పాట నటించిన, వాడు పరీక్షలో తప్పిపోని గుణములు నూటికి ముప్పదియైదు నలుబది మార్కులు పొందగలడు. మఱి నటకౌశలము నాట్యశక్తిగుణ విశేషమునకు; ప్రథమశ్రేణి ద్వితీయము తృతీయము అను మొదల గుగణనకు కంబాడై దొరసామి అన్నిటను నాయకుడు, రాజునకు తగు స్ఫూర్తిప్రమణీయరూపసంపదగలవాడు; శ్రీరామునికి భవభూతి చెప్పిన నీరు నిండిన మేఘంపు గర్జనవలె గంభీరమాంసలమును, దశరధుని ప్రత్యక్షముగా తాపిన్నటులుంబోలె వాల్మీకి చెప్పిన

> దున్దుభిస్వన కల్పేన గమ్భీరేణానునాదినా
> స్వరేణ మహతారాజా జీమూత ఇవనాదయన్

> రాజ్యలక్ష్మణ యుక్తేన స్వరేణ

గంభీర దుందుభిస్వనముంబోలె రాచటీకమునకు తగినదియు నగు కంఠరవము గలవాడు; అనాయాసముగా గొంతు ఎత్తక అణచియే కడపటి బంతి ప్రేక్షకులకును శ్రావ్యముగా వినంబడునట్లు నూర్ల పద్యములు పాడగలవాడు, 'ఆఙ్గై రంతర్నిహితవచనైః' అని అభినేయ వాచికమంతయు ఆయాయంగములలో అట్లట్లు దూరియున్నట్లు నటింపగలడు, సాత్త్వికాభినయమునను నేర్పరి, భావముల పోటుపాట్లు వైవిధ్యమును మొగాన స్ఫుటముగా జూపగలవాడు. మంచి వ్యుత్పన్నుడు. వ్యుత్పత్తి నటునికి అనావశ్యక మని నాట్యాచార్యుల మతము. అది మిక్కిలి సరి, సత్యము అనుటకు నెల్లూరు నాగరాజరాయ, స్థానం నరసింహరాయ కందాళ్ల శ్రీనివాసాచార్యాది ప్రసిద్ధనటులు ఉదాహరణభూతులు. తత్త్వమదియ యైనను, వ్యుత్పత్తి ఒకింతయు మఱింతయు ఉపకరింపక పోదు. 'అబ్బాయి' రాజవు నీవు రంగాన నిముసమేని యేమరక తీవిగా వ్యూఢోస్కద్ధోరస్కుడవుగానే యుండవలయును. బొమ్మ ముందునకు వంచితివా వీపున గ్రుద్దెదను. అని శాస్త్రులవారు తాము దొరసామిని శిక్షించిరట, యరగుడిపాటి సోదరులు వేంకటాచలము పంతులు గోపాలకృష్ణరావులు, పొడుగు బంగారు

(ఉరఫ్) నేలటూరు తిరువేంగళాచార్యులు నేలటూరు (వీరగుంట) రామానుజాచార్యులు వారి మఱంది కొమాండూరు నరసింహాచార్యులు, నందగిరి హనుమంతరావు, గుటూరు శివకామయ్య, ఒక మధ్వరావు, గుండ్లపూడి సుబ్బయ్య, వేంకటరమణశాస్త్రిలు-ఈ ప్రభృతులు తొలి సమాజ సమవేతులలో ఒక కొందఱు. వేంకటాచలము శేఖరక ఢిల్లీ సుల్తాను శ్రీకృష్ణులు. గోపాలకృష్ణరాయ శార్ఙ్గరవ చెకుముకి బాణాసుర గరుత్మంతులు, పొడుగు బంగారు కణ్వ జమేదారు ఖుస్రూ యుగంధరులు, వీరగుంట రామానుజాచార్యుల వలీ తండేలు సిపాయి గంభీర వేషులు, శివకామయ్య యనసూయ చిత్రరేఖా శంభుహాసులు, మధ్వరాయని బాలరి విద్యానాథ కరేణుకలు, వేంకటరమణ (ఉరఫ్ మూనాటి) శాస్త్రిలపేరిగాడు నరసింహాచార్యుల యెల్లి-అన్నియు చిత్రమున వానికి అవె నాటి యని హత్తుకొని మాసిపోనివే. వీరందరు గూడ తమ తమ పాత్రములకు ఎంతయు తగినవారు. వారికి తరువాత మఱియెవరు ఆవేషాలు వేసినను వారు వీరినే అనుకరించుటయు, మఱి వీరికి ఎనరాక పోవుటయు. ఆ యెరగుడిపాటివారి వంశనాట్యప్రతిష్ఠ సినీ 'ప్రొడ్యూసరు' 'డైరెక్టరు' స్వయము మహానటుడు నైన వై. వి. రావునను, అతని యన్న కుంభరాణా యుగంధరాదులు నటించిన హనుమంతరావునను, జ్ఞాతి తమ్ముడు వేంకటసుబ్రహ్మణ్యమునందును, వారికి చాల నేరుపునుజ్ఞాతియగు శ్రీరామయోగియందును నిరూఢమైనది. దొరసామియయ్యంగారు నాట్యమునకై మఱియు వేమరుగొని వేఱు సమాజములందు వేఱునాటకములందు వేఱు వేఱుపాత్రలు దాల్చియు మిక్కిలి వేజరిల్లి, నడుమంత్రపు స్త్రీవేషమునను మాయయెఱుకతగా మిక్కిలి వాసిగాంచెను. ఆయనకు ఇతరులకు నాట్యము నేర్పు నేర్పును కలదు. నందగిరి హనుమంతరావు శకుంతలయు ఉషయు మిన్ను దిగివచ్చిన మెఱుపుదీగ, 'నానా శుద్ధాంతంబులను గానరాని మెరుగుబోడి, వట్టి తళుకు గాని యుత్తమశీలము తోచు నందగత్తె. ముగ్ధకన్యగా తొలిమూడు అంకలె శకుంతలగాను, ముగ్ధకన్య ఉషగాను తలపున మఱవరానివాడు. మఱి ప్రౌఢకు వలయు అభినయ చాతురి ప్రగల్భతను చాలనివాడు. షేక్స్పియరు రచనలలో ఒకానొకడు ఒక వేషమును నిర్చితుడు తప్పిపోయినందునను, మఱియొకడు వానిని పూసవలసి వచ్చినందునను కొన్ని భాషితములు చేర్చెననియు కొన్ని మార్చెననియు, కొన్ని తీసివేసెననియు, అట్లవానిని ఉద్దేశించి ఈపాత్ర కల్పితము అనియు అనునిట్టి విషయములుకూడ వానిచరిత్రలో వ్రత్పొట కలదు. అట్లే శ్రీశాస్త్రులవారు దొరసామిని రంగారాయడుగాను, కణ్వయుగంధర పాత్రప్రసిద్ధ పొడుగు బంగారుసుపాపారాయుడుగాను, వేంకటచలమును విజయరాముడుగాను, వీరగుంట రామానుజాచార్యులను బుస్సీదొరగాను మనసున తలచుకొని తమ 'బొబ్బిలియుద్ధమును' రచింపబూని రనుట కలదుగాని, అరచన నెఱవేరునప్పటికి వీరెవరును సమాజమున లేక ఇతరులే ఆ పాత్రల నిర్వహించిరి.

వీరిక పోగా మిగిలిన అమెట్యూరు నాటకసమాజమువారును నాటకములు ధర్మ

వరమువారివనియు ఇతరములును ప్రదర్శించుచునేయుండిరి. నేలటూరు సింగరాచార్యులు కంటిలో ఇంచుక మెల్లి కలిగియు ప్రధాన స్త్రీపాత్రను, దమయంతి కైకేయి చిత్రాంగి ప్రమీల మొదలగు దానిని నటించెను. ఒక్క సారంగధర ప్రయోగమునకు, ఆయన తా చిత్రాంగిపాత్రను నాడు తన శక్తి కొలది నటించితిని అనుకొన్నదానికి తన్నాటకకర్త బళ్ళారి రామకృష్ణమాచార్యులు (వృత్తిచే ప్లీడరు) అరుదెంచియుండి చూచి ఒకపాటిగ నున్నదిలే' అని ఉత్సాహము గొల్పని వాక్కు పలికెను. ఆపాత్రల యభినయమునకై అలవరచుకొన్న యాడుకులుకు చేష్టలు తాను హైస్కూలు అయ్యవారుగా ఉన్నప్పుడు ఆయనను పీడిపోలేదు అని ఆ క్రొత్తలో చిరము అనుకొనుచుందురు. మధుర శ్రీనివాసరావు చాల ముమ్మరుమానిసి భీమరాజు అంబార్థాను కృష్ణమూర్తి మంథర మటి అది కథలో కుజ్జ మఱుగుజ్జు పెద్ద గూనుకలది అని ప్రసిద్ధమైనను, తాను అజానుబాహువును అందగాడునై, యస్కట్టు తోడి మిటారిగా నై నిట్టనిలచినందున ఆవేషమునకు తగమి అరసికొననివాడు అరసికొని గూనుతెచ్చుకొని నటించియున్న లెస్సగా ఉండెడిదేమో. కొమాండూరు శ్రీనివాస రామానుజాచార్యులు వ్యత్యస్తపాదుడు. ఇంచుకకుంటి, కన్నులో', రవంత మెల్ల ఇట్టివాడయ్యు దశరథ రాజరాజనరేంద్రాది పాత్రలు పూనినవాడు. ఇట్టి దెల్ల 'ఆయా వేషములకు అర్హత విచారించి పూన్పదగును'ను భరతాదేశమును చెప్పి శిక్షించి, అనగా పాత్రాపాత్రములు చెప్పి నేర్పువారు లేని స్వాతంత్ర్యమును సూచించుచునే నాట్యమునకైన వారి తఱుగని యుత్సాహమును ప్రకటించును.

కాలక్రమమున ఆంధ్రభాషాభిమాన సమాజమువారును అమెట్యూరుసభవారును తమ తమ మార్గాల ప్రౌఢులగుచు ముమరు వాఱుచుండిరి. తరువాత తరమువారుగ క్రొత్త కాలేజి హైస్కూలువిద్యార్థులు క్రొత్త సభలు కూడజొచ్చిరి. అందొకటి బేజాన్ సొసైటీ; వీరు ఇంగ్లీషునాటకములను షేక్స్పియరును ఇంగ్లీషు హరిశ్చంద్రను ప్రదర్శించి, తరువాత చిత్రనళీయమును ప్రదర్శించిరి. అందు ప్రధానులు ఆంధ్రభాషాభిమాని దొరసామి జ్ఞాతులు శఠకోపరామానుజాచార్యులు తమ్ములు మణవాళన్, రంగసామియు, యరగుడిపాటి జానకిరామయ్య పత్రి నరసింహరావు ముంగమూరు వేంకటసుబ్బరావు, ఒవ్వేటి విశ్వనాథరావు ప్రభృతులు. అమెట్యూరుసభలో నాట్యోత్సాహము డీలపడుటయు ఈ క్రొత్తల యుత్సాహము పొంగుటయు గాంచి, ఆందలి ప్రముఖులు ప్రయత్నించి రెండు బృందముల వారిని ఒప్పింపగా వారు ఒక్కటిగా కూడి ప్రొగ్రెసివ్ యూనియన్, అనుపేర సమ్మేళనముం బొందిరి. చిత్రనళీయమును. చిరకారియను క్రొత్తనాటకమును ప్రదర్శించిరి. వారి పాతనాయిక' సింగరాచార్యులు ఇపుడు నాయకుడు నళుడాయెను. ముంగమూరు సుబ్బరావు దమయంతి వేషమును, కానుకేల రామచంద్రరావు సుదేవుని వేషమును, సుంకు కృష్ణసామిసెట్టి వీరనాయకునివేషమును, ఇతరులు ఇతరవేషములను దాల్చిరి. నళునివంటి నాయకవేషానను సింగరాచార్యులకంటిమెల్లను లెక్కిం

వక మాను పెట్టు? అందు బాహుకునియందు కొంత తగియుండునేమో. ఇతరులు ఒకపాటి నటులు జాబితాను పూరించుటవలన శిల్పచరిత్రలో గుణమేముండును? ఐనను ఈప్రాగ్రెసివ్ యూనియను నెల్లూరిపేరప్రముఖుల గొప్పయుద్యోగస్థులయు వకీళ్ళయు బడి పంతుళ్ళయు సభగా ఏర్పడి రీడింగురూము లైబ్రరీలు నిర్వహించుచు ఊరిలో సకలపరిపాలక వర్గములలోను మునిసిపల్‌కౌన్సిలు పండాఫీసు స్కూలు టౌన్‌హాలు కోఆపరేటివ్ మొదలగువానిలో చొచ్చుకొనుచు ఉండెను. వీరిం గూడిన మన క్రిందలోనైనను ఉద్యోగము దొరకు నేమో అనియు ఉన్నయుద్యోగాన వృద్ధికలుగునేమో అనియు ప్రాతకొత్త నటులకును కొంత ప్రత్యాశ ఒక బంధముగా నుండెడిది. తరువాత క్రమముగా ఇందలి పాత్రధారణ సమర్థులు కొందరు ఉద్యోగ వశమున గ్రామాంతరములకు పోవుటవలనను ఇతరులకు ఉత్సాహము వలుచబారుట వలనను ప్రొగ్రెసివ్ యూనియను నాటకములు క్రమముగా విరళము కాజొచ్చెను. 1908 కి తరువాత దానికి ఆకోలితేదు అని వంగవోలు వేంకటరంగయ్యగారు తమ వేంకటరాయశాస్త్రిల చరితమునం జెప్పిరి. కొందఱు మఱి మూడునాలు గేండ్లవరకుం గూడ వారికి ఆ చింతయుండెడిది అనిరి.

అప్పటికి పదునైదు పదునాఱేండ్లుగా శాస్త్రిలవారి నాటకములం బ్రయోగించుచున్న యాంధ్ర భాషాభిమానుల ననుసరించుచు బాలాంధ్ర భాషాభిమాని సమాజము అని కొందరు విద్యార్థులు నాట్యాభిమానులు ఒక సభగా కూడి శాస్త్రిశిష్య దొరసామయ్యంగారి యొజ్జనమువలన చక్కగా చేర్చి 1910 ప్రాంతమున నాగానందమును ఉషను ప్రతాప రుద్రీయమును ప్రయోగించిరి. ఆ ప్రయోగములు ప్రౌఢ, ఆంధ్ర భాషాభిమానుల ప్రయోగములతో తులతూగినవి. ప్రౌఢులలో గ్రాహ్యవాక్కులు చెప్పగా, అధ్యక్షులు శ్రీ శాస్త్రిలవారు తమ నాటకాల ప్రయోగముల గుణము నటవయఃశిథిలము కాకుండ వృద్ధియగుటకు బాలురను ప్రౌఢులును 1912 లో సమ్మేళనము గావించిరి. ‹‹సముచితమైన పాత్రనిర్ణయము, సమృద్ధమైన యధ్యాపనము సమృద్ధమైన యధ్యయనము సమృద్ధమైన అభినయోపదేశము, సమృద్ధమైన యొద్దికలు, సమృద్ధమైన యేకకృత ప్రయోగములును నాటక ప్రయోగ గుణసిద్ధి వృద్ధులకు ఎంతేని ఆవశ్యకమని వారు బోధించిరి. ఈమిళనములలో శ్రీ శాస్త్రిలవారు ఏర్పరచి రూఢిగొల్పిన నాట్య సంప్రదాయము చిరము మిక్కిలియు, ప్రకాశించుచుండినది. వీరిలో కొందఱు. సరస్వతి రంగసామయ్యగారి నాట్యప్రతిభ ఇంతంత యనరానిది. మంచి పృత్యన్యుడై జవాను మొదలు, చక్రవర్తి వఱకును, దాసిమొదలు రాణివఱకును. పురుషులయు స్త్రీలయు వేషముల దేనినేని, తనతీరు తనదే అన్నట్లు మఱి ఎవరికిని ఇంచుకయు అనుకరింపరానియట్లు, ప్రతిక్షణ నవనవ కల్పనలతో అభినయింప నేర్చిన యతి ప్రగల్భుడు ప్రతిభాశాలి రూపవంతుడు రంగయోగ్యముగా పద్యమును పాటను పాడనేర్చిన చతురుడు. నాట్యప్రతిభలో వాని సర్వతోముఖతలో దొరసామినే కాదు ఎల్లవారిని మించినవాడు. అతని శకుంతల దుష్యంత కణ్వులు, చిత్రరేఖ

యనిరుద్ధులు, ప్రతాపరుద్ర ఖుస్రూ పేరయ్య యుగంధరులు, మల్లమ్మ వేంకట లక్ష్మి రంగారాయ పాపారాయలు, జీమూత వాహన పురూరవులు చంద్రగుప్త మురళీ దాసులు అన్నియు ఇంతటివి యని కొలత చెప్పరానివే. కోవూరి గోపాలకృష్ణరావు నాయికాది స్త్రీపాత్రముల నేర్పరి. రంగ సామితో జోడువీడక యుండువాడు. కనుపర్తి వేంకట సుబ్రహ్మణ్యము బాణ కణ్వ యుగంధర తాండ్ర పాపారాయాది ప్రధాన ప్రశస్తపాత్రధారి. ఏతద్ వ్యాస రచయితయు ఒకడు, చెకుముకి వలీఖాను సుల్తాను బుస్సీత్యాది నానావేషధారి. నాగ రాజు సీతాపతిరావు సిపాయిమొదలు వజీరు వరకైన తురకవేషములందును, చాకలి పేరి గాడుగాను గొప్ప పేరుగాంచినవాడు. కొమాండూరు నరసింహాచార్యులు డిస్ట్రిక్టు బోర్డు హైస్కూలు హెడ్మాస్టరు పదవిని అందుకొన్నవాడు సిపాయి,వజీరు, పేరిగాడు గంభీరవేది మొదలగు వేసములు నిర్వహిం చినవాడు. డాక్టరు కందాళ్ళగోపాలసామి వలీఖాను హైదరుజంగులుగా ప్రసిద్ధికెక్కిన వాడు. పొణకా శేషరెడ్డి ఆంధ్రగీర్వాణ ముల సాహిత్యము గలిగి శాస్త్రులవారి శిష్యుడైనవాడును పేరిగాడుగా విరాజిల్లెను. వ్యాసవిస్తరభయమున నటులజాబితా పూరిం పమి శక్యముగామి మర్షణీయము. ఈ పేరి గాండ్రదఱును వేదమూర్తులగు పుదూరు ద్రావిడకులమున బుట్టి, తెలుగు రెండవ భాషగా బి. ఏ. పరీక్షనిచ్చిన కొండగుంట వేంకటరమణ (ఉరఫ్యానాది)శాస్త్రిచాకలి పేరిగాడగుటలో నాటకమనగా(holding the mirror up to nature) సృష్టికి ప్రతిసృష్టిగా నుండవలయు నను షేక్స్పి యరు సిద్ధాంతము సిద్ధించినటులుండును. వీని వెండిమురుగులు మసితబెట్టి మోకాటిపైకి కట్టిన ముతకమొలగుడ్డ, జాతీయమగు నుడి కారము చూడ ఇది వేసమా పుట్టుచాకియా యను భ్రాంతి కలుగక మానదు; అని శ్రీ వంగవోలు వెంకటరంగయ్య ప్రశంస కొండఱు నెల్లూరి గొప్పవారు శ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారు అనుదానియందు గన్న తొలిపేరిగానికి చేరువగు సమర్థాను కరణములే. కాళిదాసు శాకుంతలమును విక్రమోర్వశీయు ఉత్తరరామమును లోక మున్నంతకాలము అట్లే నవనవముగా, ప్రాతగిల్లక యుండునే కాని, మఱి వాని ప్రయోగమును శాస్త్రులవారి శిక్షణమున, నెల్లూరిలో ఆంధ్రభాషాభిమాని సమాజము అట్లు నిర్వహించినదానిని, మఱి యెందు ఎన్నడు ఎవరు చూడగలరు! విక్రమోర్వశి ఉత్తరరాములు తొలుమాఱు సమాజము ప్రయోగించుట 1920 లో, అదియే కడ మాఱును. ఆటుతర్వాత, ఆంధ్రభాషాభి మాని ఋణభార ధనాభావాదికమున క్రుంగి నటులును, కారణ విశేషములచే చెదరిపోవు టవలన నామశేషమైనది.

దేవానామిద మామనన్తి.........
భార ధనాభావాదికమున క్రుంగి, నటులును కారణవిశేషముల చెదరిపోవుటవలన నామ శేషమైనది.

దేవానా మిద మామనన్తి మునయః
కాన్తం క్రతుం చాక్షుషమ్
రుద్రే ణేద ముమాకృతవ్యతికరే
స్వాఙ్గే విభక్తం ద్విధా

త్రైగుణ్యోద్భవ మత్ర లోకచరితం
  నానారసం దృశ్యతే
నాట్యం భిన్నరుచే ర్జనస్య బహుధా
  ప్యేకం సమారాధనమ్.

అని మన భారతమున నాట్యవిద్య రెండువేలయేండ్లకు ముందు కాళిదాసుచేత ప్రశంసింపబడినది. అంతకును ముందునుండియు దాని సంప్రదాయము భరతసూత్రములలో సమగ్రప్రతిష్ఠితము. నటరాజును రంగనాథుడును నాట్యాధిదేవతలు హిందువుల పరదైవతములు. కాళిదాసునాటకముల లోని యానాటిమా అనాజూకు, రెండువేల యేండ్ల పురాతనము, నేటికిని సమగ్రముగా అందుకొనరాకయే యున్నది, మరి మించు టెక్కడిది? (తెరలయు రంగోపకరణములయు సౌకర్యములయు విశేషములు మాత్రము కలాభివృద్ధులు లెక్కసేయ దగునుగాక.) శ్రీవేదము వేంకటరాయశాస్త్రులవారి యాధ్యక్ష్య శిక్షణములచే ఆంధ్రభాషాభిమాని సమాజ విభవకాలమున ఆనాటి కొన్నాళ్ళు తళతళ మెఱసినది.

ప్రొగ్రెసివ్ యూనియనులో నాట్యకళ డీలుపడినది. తత్సమవేతులు కాని బాలురను యువతులును నాట్యమునకై ఉత్సాహము గొన్నవారు అందలి పెద్దలనే ఆశ్రయించి వేరు నాటకసమాజముగా జ్ఞానోదయ సమాజమనుపేర వీర్పడిరి. వీరు బళ్ళారి ధర్మవరము రామకృష్ణమాచార్యుల చిత్రనళీయ ప్రహ్లాద సారంగధరాదులనే కాక, తాము ఉపాధ్యాయునిగా ఆశ్రయించిన ముత్తరాజు సుబ్బారావుగారి కృష్ణతులాభారమును, ఇతరములను ప్రయోగింప జొచ్చిరి. వీరి ముఖ్యనాయకపాత్రము రావిప్రోలు సుబ్రహ్మణ్యమును, ముఖ్యనాయికాపాత్రము కందాళ్ల శ్రీనివాసాచార్యులును. రావిప్రోలు సుబ్రహ్మణ్యము, బాల్యమున ఆంధ్రభాషాభిమాని సమాజమున చిల్లర స్త్రీవేషములు అనసూయ బంభరిక నవమాలికలు తాల్చినవాడు, అభినయవిద్య సదంతరమునకు పాత్రైనాడు. ఎదిగి కంఠమున రాజలక్షణసదృశ మేఘనాధ గాంభీర్యము పొంది, పద్యపఠనమునను సమాజము ఫక్కి అలవరుచుకొని నళబాహుక హిరణ్యకశిపులు మొదలైన వేషముల మిక్కిలియు ప్రసిద్ధికెక్కెను. ఒకతూరి దుష్యంతుని పాత్రమును నటించెను. కందాళ్ళ శ్రీనివాసాచార్యులు నాయికా వేషములను దమయంతి లీలావతి చిత్రాంగి భామ మొదలగు వానిని కడు నేర్పుతో నిర్వహించునను ప్రసిద్ధిగాంచెను. వేసాన చాల నందమైన ఉత్తమస్త్రీగా మెఱపుటీగవలె ప్రకాశించువాడు. కాశీచెంచు సుబ్రహ్మణ్యము వీరనాయక వీరబాహు ప్రముఖవేషములు వేయువాడు, మంచినటన కౌశలము గలవాడు తరువాత మండలాంతరములందును ప్రసిద్ధిగాంచెను. ప్రహ్లాద నాటకమునగాని తులాభారమునగాని నారదపాత్రము ఎక్కువ నాట్యకౌశలమపేక్షించునది గాదు. అట్లే రామదాసున 'కబీరు' పాత్రమును. ఆవేషములు దాల్చి ప్రసిద్ధిగన్న నటుల నాట్యము మఱేమియు లేదు, వట్టి నిజగాన నైపుణి ప్రదర్శనము; అది 'నిపుణః కవిః' అని నాటకముల తొలి గుణమైన కవి నిపుణతకు చెందినది కాదు. అది తద్రచితము కాదుగదా; నాటకవస్తువునను చేరునది గాదు. ఊరక తత్ప్రవేశ నిష్క్రమణముల ప్రదర్శితము వట్టి కాలహ

రణము కలిగించునది. భావనలో దివ్యతతో కూడిన ఒక యందుకొనరాని మాధుర్యముగల యది భావనలోనే యుంచబడ దగును గాని దానిని మానిసినోట చొనిపి అబ్బె, ఇంతియేనా అని యనిపించకూడనిది. మఱియు నారదుని ప్రసిద్ధి వీణెపాటకు అది లేదు. దానికి ప్రసక్తియు లేదు. మరియు 'మహతి' స్థానమున వేసగాడు వ్రేలాడించుకొనునది అది యెంత పరిహాసాస్పదమైనది. నెల్లూరి నాట్యరంగాన (మఱియెందునుంగూడ) నారదునిపాట యంతయు అస్థాన విజృంభితము, కావున దానిని కత్తిరించిన, అనటునికి ఏప్రాగల్భ్యము మిగులునో అది మాత్రమే గణనీయము. అది యెంత యగును? కాళిదాసు నాటకనారదునికి నోట పాటలేదు. బుజాన వీణాకములేదు. మింటనుండి మబ్బులేని మెఱపుల మొత్తముగా దిగును.

నేలనూతల రామకృష్ణయ్య సుదేవ నారదాది పాత్రల నిర్వహించువాడు, ఆ సమాజ ప్రౌఢులలో ఒకడు. నాటకకవి తన కృతి ప్రయోగమునకు ఒక నటబృందమును ఆశ్రయించి, అందు ఇది నాదియను నభిమాన ప్రీతులు వహించుటయు తన నాటకమును మక్కువతో నేర్పుటయు, ఆ ప్రయోగమునకు తాను కరము సంతోషించుటయు, అవీక్షణమున అనటులు తేజీ మెఱుగెక్కుటయు ఒక రహస్యము, మున్నే సూచితము. కొంతవరకు తులాభారాది కవి ముత్తరాజు సుబ్బరావునకును ఈ సభకును అట్టి సంబంధము కలిగియుండెనని ఊహింపదగును. అధ్యక్షునిపట్టు చాలని దైన, నటులు, ప్రాయికముగా అవ్యుత్పన్నులు, అన్యోన్య స్పర్ధచే చెదరి నాట్యసభలు చీలి కలుపడుట కలుగును. అట్లు ఒకప్పుడు కొంత చీలినను ఇది సురల నొక్కటియై ఎదిగి క్రమముగా ఆంధ్రసభయను పేర ప్రతిష్ఠ చెందినది. నాటకప్రయోగము మిక్కిలి ధనసాధ్యమైనది అఢ్యుల సాయము గోరునది. శ్రీ తూములూరు శివరామయ్యగారు గొప్ప రసజ్ఞులు, అఢ్యులు, గ్రాహ్యావాక్కులు, నాటకములు ఆడించి చూచు వేడుక కలవారు. వారును వీ తన్నటులకు ఆశ్రయమిచ్చి, ప్రాపకులై చీలికలు అదికి ప్రోత్సహించి కట్టుబాటులు చేయగలిగి, ఆంధ్రసభను నాట్యప్రయోగదక్షము గావించిరి. తరువాత కవిపండిత దుర్భాసుబ్రహ్మణ్య శర్మగారును అందు కొంత ఆధ్యక్ష్యము పొందుటయు దానికి బలకరమాయెను. ఆంధ్రభాషాభిమాని సమాజమును దాని శ్రీ శాస్త్రిల యాధ్యక్షమును మనసునకు తెచ్చుకొని హితస్పర్ధ పెంచుకొని ఆంధ్రసభ తమ యధ్యక్షుల యవేక్షణమున అభ్యుదయ మార్గము పట్టెను. భ్రాతలు పెద్ద జి. సుబ్బారావు, చిన్న జి. సుబ్బారావులు, భ్రాతలు తూములూరు ఆదినారాయణయ్య శివకామయ్యలు, కాశి చెంచు సుబ్రహ్మణ్యము, ముంగమూరు నరసింహారావు కోట శ్రీనివాసరావు మోచర్ల రామకృష్ణయ్య కామరాజుగడ్డ శ్రీనివాసరావు, ఇంకను పలువురు (జాబితా పూర్తి చేయ శక్యముగామి మర్షణీయము.) అందునాడు నాడు ప్రసిద్ధగన్న నటులు. ఐనను రావిప్రోలు సుబ్రహ్మణ్య కందాళ్ళ శ్రీనివాసాచార్యులకు సాటికి వచ్చువాడు మఱి యుంచు ఏర్పడలేదు. తరువాత ఈ పట్టు

కొమ్మలును డీడి వ్రాలి అపట్టు సడలినది. ఆంధ్రసభ నేఁడును ఆంధ్రసభగా ఉన్నను తన్నాట్య సక్తి శక్తులు ఎండిపోయినవి.

కందాడై దొరసామయ్యంగారు (శ్రీనివాసన్) ఆంధ్రభాషాభిమాని సమాజ నాయక పాత్రముగా ప్రసిద్ధుడు నాట్యాతి తృష్ణచే దానిని వీడి సింహపురి సుగుణ విలాససభ యను పేర ఒకసభను నిర్మించు కొని పెక్కు నాటకములు, శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రులని సంప్రదాయమునకు వేరనివి ప్రదర్శించెను. తదాకృష్ణులై ఘంటసాల రాధాకృష్ణయ్య కాశీ వెంచు సుబ్రహ్మణ్యము, ఓరుగంటి వేంకటకృష్ణయ్య మొదలగు పలువురు తచ్ఛిష్యులుగా తదా శ్రితులుగా దానిలోను చేరియుండిరి. అల్లూరు రెడ్డి ప్రముఖుడు పర్వతరెడ్డి రామ చంద్రారెడ్డి తానొక నాటకసభను కూర్చి భక్తరామదాసు మొదలగు నాటకములు ప్రయోగించెను. తాను హిందూస్తాని మార్గమున కబీరు వేసమున తెనుగు నాటకమున గొప్పగా హిందూస్తాని పాడి మెప్పువడ సెను. ఆపాట నాటకమునకు అంతగా సంబంధపడదు, వేసము భావతరంగహీన శాంతరస ప్రధానమై అంతగా నాట్యకౌశల మపేక్షించునది కాదు. అది కొంతకలవారు అందలి యితరులే.

నెల్లూరిలో తరువాత తలయెత్తిన నటుల నందఱిని ప్రొగ్రెసివ్ యూనియను ఆంధ్రభాషాభిమాని ఆంధ్రసభ అనువానికి చేరువగానో దూరముగానో సంబంధపడిన వారింగానే తలంపవచ్చును. నెల్లూరి నాటక సంప్రదాయములు రెండు-ఆంధ్రభాషాభిమానులది శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి ప్రభవము ఒకటి, ప్రొగ్రెసివ్ యూనియనునది, దానిం బుట్టినదో దానిం బోలినదో ఆంధ్ర సభది యొకటి. ఇదానీంతనము లన్నియు ఆ రెండవ సంప్రదాయమునకు ఇంచు మించుగా చేరునవే. కొమాండూరు నరసింహాచార్యులు (కుంటి) అను హార్మోనియము పండితుడు తొలితొలి ఆంధ్రభాషాభిమానియు అమెట్యూరుసభయు ప్రయోగములకు హార్మోనియము ఫిడిల్ మొదలగు సహాయ వాద్యములను వాయించుచుండి ఆగాలిని పీల్చి బలిసిన రసికుడు, నిజధనార్జనోపాయముగా రాధాకృష్ణ విలాస సభయను నొక సభను గూర్చి, అందు నాయిక వేసమునకు స్థానము నరసింహారావును పిలిపించి కొన్ని ప్రయోగములు గావించెను. స్థానం నరసింహారావు సత్యభామ, చిత్రాంగి, జహ్వరి, చంద్రమతి యశోద మొదలగు పెక్కు నాయికవేసము లలో తన యతిలోక ప్రతిభను సామర్థ్యమును ప్రకటించెను. తరువాత నెల్లూరిలో స్త్రీపాత్రల నెరవడికి వానినో వానిం బోలిన వానినో ప్రయోగించువారికి అదియు కొంత మేలుబంతి కాజొచ్చెను. మంచెళ్ల వెంకటేశ్వర్లు మద్దూరి సుబ్రహ్మణ్యము (చిన్న) రామదాసయ్యంగారు వేగూరి వెంకటప్ప ప్రభృతులు తత్సమవేతులు కాఁబోలు.

నెల్లూరు నాగరాజరావు, బోర్డుస్కూళ్ల డ్రాయింగుటీచరు ప్రొగ్రెసివ్ యూనియను ఆంధ్ర సభలకు చెందియు చెందనివాఁడుగ నుండి, తాను సొంతముగ గొప్ప నాట్యకౌశల మార్జించిన నటుడు, కంస పఠాణరుస్తుం షాహారాము యుగంధరాది వేసములను మిక్కిలియు నేర్పుతో నటించినవాఁడు,

అంధ్రమున మండలాంతరములకు పోయి అక్కడివారింగూడి వారి మధ్యను తానే మొనగాడై 'అంధ్ర నాటక రంగోద్ధారక' అను బిరుదమును గడించినవాడు. మాధ్వుడైనందున, నెల్లూరి మాధ్వులకు పూజాప్రీతులకు పాత్రమై, తనకై వారు కూర్చిన నిజనాయకమగు మాధ్వ నాటక సభయందును ప్రధానుడుగా కొంతకాలము నటించెను. శిరోభూషణము కృష్ణమాచార్యులను ప్రొగ్రెసివ్ యూనియను అంధ్రసభలకు చెందియు చెందనివాడుగా నుండి నాయక పాత్రకై పేరుగొన్న మొక నటుడు. పాటలో దిట్ట. ప్రగల్భుడు, ఎందెందు తనకు ఆ యవకాశము కలుగునా యని వానిని వానిని కూడి నటించువాడు. పలుమారు హరిశ్చంద్ర వేషము వేసినవాడు. నళ బాహుకులయు విద్యానాథ రంగారావులయు వేషములును వేసినవాడు. సి.వి. రావణుడు. నెల్లూరి ప్రౌఢులలో నొకడైనవాడు. నెల్లూరి లిటరరీ యసోసియేషన్ అని ప్రొగ్రెసివాంధ్రసభా సభ్యులలో అన్యతరులే స్వయంపాకుల జానకి రామమూర్తి ముంగమూరి నరసింహరావు వెంకోబరావు వైద్యుల చంద్రశేఖరరావు ప్రభృతులు కూడి కొంతకాలము, అల్పకాలమే, షేక్స్పియరు ఇంగ్లీషు నాటకములు ప్రయోగించుచుండిరి. వీరిలో వెంకోబరావు ఆ స్త్రీవేషములలో నేర్పరి అనిపించుకొనెను. చంద్రశేఖరము తరువాత నెహ్రూ రాజేంద్ర మాళవియాది సకల భారతదేశ నాయక రూపానుకరణమున సకల భారత ప్రసిద్ధి గనెను. సరస్వతి ఆమెట్యూర్సు అని యొకసభ తలయెత్తెను. వరదరాజనాయుడు, ఒండెడ మీరాబాయి వేషము నొకపాటిగా నటించినవాడే ప్రధాన స్త్రీపాత్రగా, స్థానం నరసింహారాయాను కరణముగా, కృష్ణతులాభారము మొదలగు కొన్ని ప్రయోగములు గావించెను. నేటికిని 'సమాజ' 'ప్రొగ్రెసివ్' అంధ్రసభాది ప్రభవముగా 'ఫ్రెండ్సు యూనియన్' అనియు 'రినెయిసన్సు ఆర్టిస్ట్సు' అనియు నటులు తమ సభలకు పేరిడుకొని ప్రాత నాటకములను కొత్తనాటకములను కాదా చిత్కముగా ప్రయోగించుట కలిగియున్నది. కొలందవేలు శివప్రసాద శౌరిరాజ ప్రభృతులును, అనంతభొట్ల అదిశేష గాదేపల్లి రామార్య పులిగండ్ల రామకృష్ణాదులు తత్సమవేతులు. పాండవోద్యోగము, బొబ్బిలి, తుఫాన్ మొదలగు 'సోషల్సు' వారి ప్రదర్శనములు'. అల్లే మజ్జిగ విశ్వనాథరెడ్డి నాయకమగు 'లలిత కళానిలయము (-ఫైనార్ట్సు అసోసియేషన్-) అనార్కలి మొదలగు నభినవ ప్రయోగముం జూపెను. అన్నదేవుల గోపాలకృష్ణారెడ్డి నాయకముగా ఒక నటబృందము భక్తమాధవదాసు మొదలగు నభినవ ప్రయోగమును నెల్లూరి చుట్టుపట్ల చూపుచున్నది.

ఇది నెల్లూరి నటులయొక్కయు నాటకశిల్పముయొక్కయు లఘుచరిత్ర. ఇది అసమగ్రమైనను, ఆచరిత్ర నడచిన ముఖ్యమార్గములు ఇందు సమగ్రముగానే చూపబడినవనదగును. నటనామములను వానియుదాహరణమాత్రమునకు వలసినవి పరిగృహీతములె. ఒక్కటికూడ తప్పిపోనీని విడువని పూర్ణత సంపాదింప శక్యముగామి మన్నింపదగును. ఈ నెల్లూరిలో ఇతరమండలములం బ్రసిద్ధులగునటులు, బళ్ళారి రాఘవాచార్యులు కొన్నితూర్లును, తెనాలి స్థానం

నరసింహరాయబృందము కొన్నితూర్లును, బెజవాడ మైలవరమువారి యెడవల్లిసూర్య నారాయణ, ఉప్పులూరి సంజీవరాయల బృందము సావిత్ర్యాదియు సత్యవద్ధుర్యోధన దుష్యంతాదియు అన్నియు ఒకతూరియు, గుంటూరి హరిప్రసాదరావు, అప్పటికే ఎక్కువగా వయస్సుమళ్ళినవారు ఒక తూరియు,రంగాన అగపడినారు. అవకాశము కొలదియు ఖండాంతరములందును ప్రసిద్ధి కీర్తులు గన్న యసాధారణప్రజ్ఞాశాలి, నాట్య ప్రతిభాశాలి, మంచి వ్యుత్పన్నుడు, బళ్ళారి రాఘవాచార్యులు బహువిధ వేష విరాజితుడ కాని, మన నటాగ్రణులకన్నను అంత మిక్కిలి యెక్కువవాడు కాడనియు, దుష్యంతుడుగాను ప్రతాపరుద్రుడుగాను అనిరుద్ధుడుగాను మనవారికి తులతూగలేడుకాబోలనియు తోచెను. మరియు నెల్లూరిలో అట్లు పేరుగన్న ఢిల్లీసుల్తాన్ పట్టుకపోతాన్ అను యుగంధరువెట్టి. ఖానుని ప్రతిజ్ఞాయౌగంధరాయణమందలి యౌగంధరాయణుని వెట్టికి వేయిమడుంగులు ఎక్కువైనవి ఆయన తన చేత కాదనెననియు నటలోక వార్త. స్థానం నరసింహారావు అసాధారణ నాట్యప్రతిభా శాలి. మనయూరి చిత్రాంగిభామాదులను ఇంచుక మించునేమో కాని,మనవారికన్నను రూపాన ఇంచుక తక్కువ. ఉప్పులూరి సంజీవరాయనికి మౌగ్ధ్యము తక్కువ. శ్రీహర్ష నిపుణః కవిః అను నాటకమునకు వలెయు తొలిగుణము సావిత్రినాటకమునకు చాల తక్కువ. దాని తొలియంకాల శాకుంతలపు శృంగారపు వెక్కిరింతలో ధర్మాభ్యుద్ధరేణ చరణః అనుదాని పంపుట్టమున ఆ'వివృత్త - వదన యగుట' శకుంతలమౌగ్ధ్యముం గాక విక్రమోర్వశిలోని స్వర్వేశ్య యూర్వశి జాణ తనమును తోపించెను. ఎడవల్లి తాను మన దొరసామిని శుశ్రూషించితి ననెను గాని, మన నెల్లూరి యేదుష్యంతునికిని ఈడుగాడు. దుర్యోధనుడుగాను పలుకు అప్రసిద్ధస్వగతమున మన కాలేజి విద్యార్థుల పోటీలో చక్కగా నటించిన యరగుడిపాటి రామయోగికిని, అంతకంటెను చక్కగా నటించి పారితోషికమును ఒడిచికొన్న వేగూరు వెంకటప్పకును ఎనగాడు. సర్కారులో అతి ప్రసిద్ధిగన్న యాది నటశిఖామణి బందరు ఈదుని లక్ష్మణస్వామిని, వీరరౌద్రభయానకబీభత్సములం బ్రసిద్ధుని, ఆంధ్రమండలాలవారు తులాభారరచయిత నెల్లూరి ముత్తరాజు సుబ్బరాయ స్మారకనిధి సందర్భమున బందరులో జరిపిన పరాన్రుస్తుంపోటీలో విజయధ్వజము ఒడిచికొన్న నెల్లూరినటుడు ఆ పరదేశమున, స్వస్థానబలముగల ఆయూరిలో అన్నియేండ్లకు అరిదిగా తలపించి మరపించెనని గ్రాహ్యవాగగ్రణి కృష్ణాపత్రికాధిపతి నిజసంపాదకీయ వ్యాసమున ఉగ్గడించెనన, ఆ యాంధ్రనాటక రంగోద్ధారక నెల్లూరు నాగరాజరావు. దొరసామి రంగసామి ప్రభృతి నటనిశ్రేణిలో వారికి క్రింది మెట్టుగునని నెల్లూరిప్రసిద్ధి కలిగియుండగా.

"యద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సన్తి తత్ర వనౌకసః మత్తః ప్రత్యవరః కశ్చి న్నాస్తి సుగ్రీవసన్నిధౌ, అహం తావ దిహ ప్రాప్తః కిం పున స్తే మహాబలాః, న హి ప్రకృష్టాః ప్రేష్యన్తే, ప్రేష్యన్తే హీతరే జనాః"

అను వాక్యజ్ఞ పండిత హనుమద్భాషిత న్యాయమునను,

జేతారం దశకన్ధరస్య జితవా నే వార్జునం
భార్గవస్;
తం రామో యది కాకపక్షకధర; స్తత్పూ
రి తేయం కథా"

"పదితలలవాని జేతయగు వేయిచే
తుల యర్జునుని ఒక్కవ్రేటున నజేకివైచిన
భార్గవరాముని ధనువును అవలీలగా ఒడిచి
కొని బాలరాముడే అతనిని మహేంద్రము
నకు తఱిమినాడన, తరువాత కాండల కథ
కల్పన యెందులకు? అను అనర్ఘరాఘవ
వసిష్ఠభాషిత న్యాయమునను నెల్లూరు నట
నాటకచరిత్ర సకలాంధ్రమునం బ్రతిష్ఠిత
మయ్యెననుకొనెదా. (చూ.1963 మార్చి31,
ఏప్రిల్ 7 తేదుల ఆంధ్రపత్రిక సారస్వతాను
బంధము వడ్లమన్నాటి కుటుంబరావు వాక్య
ము.) గుంటూరి హరిప్రసాదరావు నెల్లూరి
రంగాన ఒకమాఱు అగపడినపుడు, అపుడు
వయసుమళ్ళియున్న తాను జవ్వనమున,
అసలు బళ్ళారి నశబాహూకాదుల మించినవా
డని గన్న కీర్తి తథ్యమయై యుండనోప
నను విశ్వాసము కలిగించెను కాని అప్పటికి
గొంతుకు పీనసదోష మాపాదిల్లియుండెను.
ఇకను ఆంధ్రజాతీయ మహానాటకములలో
నెల్లూరి శ్రీ వేదము వేంకటరాయశాస్త్రుల
ప్రతాపరుద్రీయమునకు వెనకరాని యగ్ర
తమ స్థానము సిద్ధమే కదా. నేటి "సోష
శ్య"లోను నెల్లూరి పులిగండ్ల రామకృష్ణ
"తుపాను"నకు తత్ప్రయోగమునకును
అట్లే వెనకరాని యగ్రతమ స్థాన మంగీ
కృతమే.

మూగసినిమాలు చాలకాలము క్రిం
దనే అరంభమైనవి. అందు శృంగారవీర
చరితములు భావప్రధాన నాట్యకౌశలమున
కన్నను నృత్యములు డాన్సులు, కత్తియుద్ధ
ములు మొదలగువానిం బ్రయోగించి ఆశ్చ
ర్యము గొల్పజొచ్చినవి. స్త్రీలే స్త్రీపాత్ర
ముల ధరించు నియమును ఏర్పడినది.
దూరాధ్వా చ వధో యుద్ధం రాజ్యదేశాది
విప్లవః వివాహో భోజనం శాపోత్సర్గౌ
మృత్యూరతం తథా శయనాధరపానాది
నగరాద్యుపరోధనమ్। స్నానాను లేపనే చై
వేభిర్ వర్జితో నాతివిస్తరః' అని భరతా
చార్యులు, యుద్ధము, రాజ్యదేశాది విప్లవ
ములు, మృత్యువు నగరముల ముట్టడులు
దూరాధ్వము మొదలైనవి అంకాన రంగాన
ప్రత్యక్షముగా చూపరాదన్న కట్టడ చేసి
నారు. మఱి సినిమాలలో ఇందు పెక్కులు
తప్పక చూపబడచు, అవే జనాకర్షకములై
నవి. శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రులవారి
బొబ్బిలి నాటకమున రెండవ యంకమున
బొబ్బిలి ముట్టడియు ఐదవయంకమున
బొబ్బిలి యుద్ధమును అత్యద్భుతముగా
వర్ణింపబడినవి. వారు వానిని రచించుచున్న
ప్పుడు (1915-6) అప్పటికి సినీమాలు
అవతరిల్లి యున్నందున, రంగము సామగ్రీ
సంపన్నమును,అందు దృశ్యమును అంతలో
తటాలున సినీమాగా చూపు సౌకర్యమును
ఉన్న, ఆముట్టడియు ఆయుద్ధమును ప్రేక్ష
కుల కన్నుల యెదుటం బ్రయోగింప దగును
అని యానతిచ్చిరి. కాగా అంకాన తన్నిషే
ధము తత్ప్రయోగాశక్యతానిబంధనము
కానోవును. (ఇతర నిషేధములకు ఇతర
కారణములు అరయదగును.)'రసము లోకో
త్తర చమత్కార ప్రాణము. చమత్కార
మనగా చిత్త విస్తార రూపము

విస్మయమను నామాంతరము గలది. దాని ప్రమాణత్వమును విశ్వనాథ కవిరాజు వృద్ధ ప్రపితామహులు, సహృదయ గోష్ఠిగరిష్ఠులు కవిపండిత ముఖ్యులు శ్రీమన్నారాయణ పాదుల వారు చెప్పినారట.

"రసే సారశ్చమత్కారః సర్వత్రాప్యనుభూయతే ॥ తచ్చమత్కారసారత్వే సర్వత్రాప్యద్భుతో రసః తస్మాదద్భుత మేవాహ కృతీ నారాయణో రసః"

ఇట్టి యద్భుతరసము ఇట్టి చమత్కారము నాటకములందునకన్నను సినీమాలలో ఎక్కువ. సినీమాలు మూకములే కాక, క్రమముగా భాషణగానముఖరములు కాగా, అందును ఒక్కొక్క యవయవమును ఒక్కొక్కముక్కయు నిపుణులచేతనే పలుమాఱు సుశిక్షితముగ ప్రయోగింపబడి ఆ యుత్తమోత్తమప్రదర్శనమును నేర్పుమీఱ ఫోటోపట్టియు శబ్దగ్రహణముచేసియు, ఆ ముక్కలను సొరిదింగూర్చి ఒకకథగా సినీమాలో ప్రదర్శింపగలుగుటచే, సినీమా ప్రదర్శనము నాటకప్రదర్శనమునకన్నను ఉత్కర్ష సంపాదింప గల్గిన దైనది. మఱియు సినీమా తన్నటులకు బహుధనము తెచ్చునదియు నైనది. కాగా సినీమాలు క్రమముగా నాటకములను అణగద్రొక్కివైచినవి. (అట్లే రేడియో సంగీతవిషయమున.) అట్లే నెల్లూరున వేఱుకారణములచేతను నాసిల్లఁజొచ్చిన నాటకములు సినీమాలచే బొత్తిగా రూపుమాసిపోయినవి. నాటకముల గొప్ప గుణములనెల్ల సినీమాలకు ఎక్కింపనగునుగాని సినీమా సౌకర్యములను సదుపాయములను అన్నింటిని నాటకమునకెక్కింపశక్యముగాదు. కాబట్టి నాటకము అడుగంట నశించినందులకు వందర నేల? సినీమాలను యథార్థముగా సంస్కరించినం జాలదా? మఱియు నేటి మేటి నటులను ఏర్చి కూర్చి కాళిదాసు శాకుంతల నాటకమును, నాటకమార్గమున ఆడించిన, అది ఆంధ్రభాషాభిమానుల తొంటి శాకుంతలప్రయోగమును మించమకదా, ఈ దేని యగుట సందియము.

ఇప్పుడును మెండితనముగా ప్రయోగింపబడు నాటకములు సినిమాల యొరవడిని ప్రయోగింపబడుచున్నవి. అందఱో నటులు అందఱో కొందఱో 'సినిమా చుక్కలు' అని సంగీతగాంధ్రను రేడియో ప్రసిద్ధులు అన్నట్లు జనాకర్షణకోసము ధనాకర్షణకోసము ప్రకటించుటయు వాడుకయైనది. ఇక నాటకము సినీమాకు లొంగిపోయినదనుటకు మఱి వేఱుతార్కాణ యేల? సినీమాలు పౌరాణిక చరిత్రకాద్యుదాత్త వస్తువులు మాని, ఇపుడు ఎక్కువగా నేటి సామాన్యజనకుటుంబ జీవితపు కథలను "సాంఘికములను" సోషళ్ళను కైకొనం జొచ్చినవి. నాటకములును కలిసినచోట వానిని అనుకరించుచున్నవి. నారసత్వ మెల్లనుంగూడ ఉదాత్తతం గోలుపోయి వార్తాపత్రికకథలయు డిటెక్టివు నవలలయు అంతస్తుకు దిగినవిగదా. "కావ్యేషు నాటకం రమ్యం" "సందర్భేషు దశరూపకం శ్రేయః" "నాటకాన్తంహి సాహిత్యం" అని యిటులెల్ల నాటకమునకు అగ్రస్థానము చెప్పి, దాని లెస్సదనమునకు గుణాధికతకు "శ్రీహర్షో నిపుణః కవిః, పరిషదప్యేషా గుణగ్రాహిణీ, లోకే హారి చ వత్సరాజచరితం నాట్యే చ దక్షా వయం, వస్త్వేకైక మపీహ

వాఞ్ఛితఫలప్రాప్తేః పదం, కింపునర్మద్భాగ్యోపచయాత్ సముదితః సర్వో గుణానాం గణః

అను నాల్గింటను తొలిమహాగుణమైన 'శ్రీహర్షో నిపుణః కవిః' అన్న కవిగొప్పతనమును లోకే హారి చ వత్సరాజచరితమ్ అన్న వస్తుగొప్పతనమును తగ్గనీయకూడదు సినీమాయు నాటకప్రకారవిశేషమగుటంబట్టి ఈనియమము, లెక్కయు దానియెడను వర్తించును. మఱి నేటి సినీమాలలో ఆశ్రేష్ఠత అపదైపోయినది. అది అట్లే గదా. కాళిదాసును భవభూతియు శ్రీహర్షుడును యుగాలకు శతాబ్ధులకు ఒక్కరు పుట్టగలరు గాని. న్యూస్‌పేపరు, మాదిరిగాను మాస పత్రికమాదిరిగాను నిత్యనవముగా నూర్లలెక్కగా ప్రకటింపబడు సినీమాలకు అట్టి రచనలును అట్టి రచయితలును కలుగగలవా కలుగగలరా? మఱి శాశ్వతగుణోదాత్తత కలదియు ఎన్నండేని ఒకదినము ఎప్పుడేని ఒకవారము ఏ మహిమాన్వుని రచనయో వానిలోను ప్రకటనము బొందవచ్చును.

నాట్యప్రయోగము 'దేవానామిద మామనన్తి (మా.పుట 28) అను కాళిదాసోక్తి ప్రకారము ఉభయలోక సమారాధనమైన క్రతువు గాన అది యుత్తమ ధర్మాచరణమే యగును. కావున నాటకమును శాకుంతలోత్తర చరితామలయు మృచ్ఛకటికా ముద్రారాక్షసాదులయు మిన్నందిన యంతస్తునుండి యీక్షుద్ర 'సోషల్' వరుసకు దిగలాగరాదు. ఆయుదాత్తతను కాపాడవలయును. కాన సినీమాలును అట్లు క్రిందపడ రాదదు, వానిని క్రిందపడనీకూడదు. జనమునకు ఉత్తమ వస్తు పక్షపాతమును నేర్పవలయును.

నాటకము ఉత్తమకావ్యము. దాని ప్రయోజనము 'సద్యః పర నిర్వృతి.' కాగా ఈక్షుద్ర ప్రయోగ దర్శనమున రవంత వినోదము కలుగునేమో కాని, నిర్వృతి-పరనిర్వృతి-కలుగదు. జనమును అందులకు మరపవలయును.

దాని మఱియొక ప్రయోజనము కాంతాసమ్మితతతోడి యుత్తమోపదేశము. షేక్స్‌పియరు నాటకములందును Holding the mirror up to nature తో కలసి గొప్ప యుపదేశములు లేకపోలేదు ఉపదేశ హీనప్రయోగములను అడంపవలయును. నాటకసమాజసిద్ధులలో ఉత్తములని కీ. శే. శ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారు తమ రచనలం బురస్కరించుకొని ఇట్లు చెప్పినారు. ''ఏయే లోకోత్తరచరిత్రమును మీరు ప్రదర్శింతురో ఆ యాచరిత్రమును మీయాచారంబునకుం దెచ్చుకొనుట. శాకుంతల మాడినందులకు పంచమాంకములోని దుష్యంతచర్య నవలంబించుటకన్న పురుషమాత్రునికి ధన్యత వేఱుకలదా? జీమూతవాహనుని కరుణాపారీణత నవలంబింపని యామాట యేల? ప్రతాపరుద్రీయము నాడియు ప్రభుభక్తియు నాయకవిశ్వాసంబును ఏకగ్రీవతయు లేని వట్టి కట్టెడి వెట్టి యేల? ఆసురవృత్తి మాని అనపాయి నవనీతచోర చరణాశ్రయణ మార్గము ం బొరయని బాణకథా నటనాడంబర మదేల? పాటుపడియు ఈఫల మనుభవింపమి అమృతముం బడయని క్షీరసాగరమథనంబ'' అని. మఱియు హిందువుల సనాతన ధర్మాసక్తాస్తిక్యపూర్ణచిత్తములకు

పావమఘ్యశ్చ పునాతు వర్ధయతు చ
శ్రేయాంసి సేయం కథా
మఙ్గల్యా చ మనోహరా చ జగతాం
మా తేవ గఙ్గేవ చ
తా మేతాం పరిభావయ న్త్వభినయై
ర్విన్యస్తరూపాం బుధాః
శబ్దబ్రహ్మవిదః కవేః పరిణత
ప్రజ్ఞస్య వాణీ మిమాం.
గంగాలక్ష్ములవోలె నీకథ జగత్
కల్యాణమై కాంతమై
త్రుంగం జేసి యఘంబు శ్రేయముల
సందోహంబుఁ బొందించుతన్
రంగత్ప్రజ్ఞక వాక్పతుర్ముఖ
కవి ప్రష్ఠోక్తి నీసత్కృతిన్
రంగంబందు బుధవ్రజం బభి
నయారాద్ధన్ విభావించుతన్.

అను భవభూతి వాక్కు బడియు, 'దేవానా మిద మామనన్తి మునయః' అను కాళిదాసు వాక్కునంబోలెను అముష్మిక శ్రేయః సిద్ధిప్రత్యాశయు వీడిపోదు.

ఇప్పుడు సర్కారువారు, ప్రదేశపు వారును అఖిలభారతపు వారును, రేడియోలో లఘునాటకములును లఘూకృతనాటకములును ప్రయోగ ప్రసారము గావించుటయు, నాటకరంగ పునరుద్ధరణకు పన్నాగములు ఊహించుటయు, నాటకముల రచింపించుటయు ప్రజారాజ్యమున ప్రజా వినోద సేవగాను, ప్రజా వ్యుత్పాదక సేవగాను తొడంగినారు కాబోలు. ప్రతిభ జన్మాంతర సంస్కార ప్రభవము సహభువు గాని క్రేయమును విక్రేయమును గాదు. అయినను వాని యవేక్షణలో అధికృతులు లావుజీతాలు మరగినవార కాని నిజధర్మ నిర్వహణమునకు సమర్థులు అగుమరని తోపదు. ఇటీవల రేడియోలో ప్రసారితమైన లఘూకృత ప్రతాపరుద్రీయమును వినగా, దాని పుట్టువు పూర్వోత్తరములు ఎఱింగిన నెల్లూరివారికి అయ్యో, ఇది యిట్లును పాడుసేయబడునా, తురకలయు చాకళ్ళయు రాజామాత్యభృత్యాదులయు సుల్తాన్ వజీరు సిపాయీలయు భాషితములను చక్కగా తత్తజ్జాతీయముగా ఉచ్చరింపనైనను నేర్వరైరే అని తోచినది. ఇక చేర్పు కూర్పు తివియుటలు ఉండనీ. రసజ్ఞుడు గుణజ్ఞుడు నామిత్ర మొకడు అనెను ''నెల్లూర శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రుల వారి శిష్యులు ప్రశిష్యులు ప్రతాప ప్రయోగ రహస్యము లెఱింగినవా రున్న వారిచేత ఆనాటకమును చెప్పించి 'టేపు రి-కార్డు' చేయింపడయను అని లోకమున ప్రజారాజ్యములకు ఇంగ్లండు గొప్ప దృష్టాంతము,తల్లింబోనిది. ప్రాచీన పెరిక్లియన్ అథెన్సు దానికిని తల్లింబోనిది, లోకానికి ఇంపులకు అమ్మమ్మ యనందగినది. చెప్పినాడు గదా ఆ యాథేన్సును గుఱించి Tyffe పండితుడు

"More than any man Pericles gave to the Atheniains that love of knowledge, of poetry, and of art, which remained to them ..........and has made Athens of service to mankind .... ...... ............plays written by great poets were performed at the cost of the state in a large open building before multitudes of people............These plays not only gave the people of Athens pleasure and helped to make them dislike coarse and stupid entertainments but set them thinking just as reading a good book does now."

— — — — —

FROM 'WORLD DRAMA' BY ALLARDYCE NICOLL. P. 940

The truth is, of course, that the dramatist working within the scope of a highly restricted art, must, if he wishes for success, give to his imaginative vision a clearer and closer focus than another literary artist need have. In the Greek classical division of kinds exists something beyond the merely temporary and what is revealed here finds corroboration in the Samskrt doctrine of RASAS. When Bharata presents his eight sentiments and declares that, although these may be mingled or associated with other subsidiary sentiments, each play must aim fundamentally at the arousing of one dominant emotion, he is recognising the quality that, in a different way was recognised by Aristotle and inspsired his arguments in the Poetics. (Bharata preceded Aristotle) If this judgment has validity, then obviously much of the amorphous realistic drama of our time can have little hope of permanence.It may please temporarily because of its depiction of current affairs, but its life span is destined to be short.

# 51

# ఏకపాత్రాభినయము

డా. వి. చంద్రశేఖరం, నెల్లూరు.

ఒక్కటే ప్రదర్శనములో ఒక్క నటుడే వివిధ పాత్రలను అభినయించడాన్ని మానోయాక్టింగు అంటారు. హరిశ్చంద్రుడు దుర్యోధనుడు, యుగంధరుడు, బాహుకుడు మొదలగు ఒక్కపాత్రలనే కొంతమంది నటిస్తారు. దాన్ని ఏకపాత్రాభినయం అనవచ్చు, కాని నాప్రదర్శనాలకు నేనుచూచిన యితర ప్రదర్శనాలకు బహుపాత్రాభినియం అనేదే సరియైన పదం.

నా ప్రదర్శనాల్లో నటుడిని నేను ఒక్కడినే; అయినా ఎన్నో పాత్రలను నేను పోషిస్తాను. ఒకరంగంలో ఇద్దరివలె మరి ఒకరంగంలో ఆరుమందిమోస్తరు నటించాలి. సుల్తాన్‌పేట సబ్ అసిస్టెంటు మెజిస్ట్రేట్ అనేనాటికలో మేజస్ట్రేటువేషంలో ప్రవేశించి, అతనితల్లి, అతనిభార్య ఇద్దరు బంట్రోతులు, మరియొకరు వీరి అందరి మోస్తరు స్వరమార్పులతో వేరు వేరు భావ ప్రకటనలతో ఒకరితరువాత మరొకరివలె నటించాలి. రాజమండ్రి హిందూసమాజం వారు 1933లో వారి ఆవరణలో నా ప్రదర్శనం ఒకటి ఏర్పాటుచేశారు. నాటిసభను అలంకరించిన పురప్రముఖులలో ప్రఖ్యాత కవి, నాటకకర్త శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంపంతులు గారు ఒక్కరు. ప్రదర్శనమైన మరురోజు ఆయూరిలోని గొప్పకవులను కళాకారులను కలుసుకోవడము నాకు అలవాటు (ఆరోజుల్లో) పంతులుగారి యింటికి వెళ్ళాను వారన్నారు. కొన్నిసీనులు నేను వింటుంటే చాలామందినటిస్తున్నట్టు నాకు తోచింది. ఒక్కరే యిన్నిపాత్రలను పోషించారని నమ్మడం నాకు చాలా కష్టంగా వున్నది అన్నారు.

1917-20 సంవత్సరాలలో నేను నెల్లూరు వి. ఆర్. హైస్కూలులో చదువుకొనే రోజుల్లో పి. యస్. రామస్వామిఅయ్యర్ అనే టీచరు వుండేవారు వారు చాలాగొప్ప నటులు. ఒక్కొక్కమాటు క్లాసులో అసలు పాఠాలు అటుంచి షేక్స్పియరు షెరిడన్ డికెన్సు, మొదలైనవారి రచనలనుండి కొన్ని ఘట్టాలను నటించేవారు. మాస్కూలులో Prof. Kiya అనేవారు ఒక్కరోజు మానో యాక్టింగు ప్రదర్శనమిచ్చారు. రంగస్థలం మీద యిటువంటి ప్రదర్శనం చూడడం నాకు అదేమొదటిసారి. ఆరోజుల్లో నెల్లూరు వారు వెంకోబరావుగారు చాలావూళ్లకువెళ్ళి మానోయాక్టింగు ప్రదర్శనాలిచ్చి చాలాకీర్తి సంపాదించారు. ఇవన్ని నామనస్సులో నాటుకోపోయాయి. నేనుకూడా యిటువంటి విద్యనేర్చుకోవాలి ప్రదర్శనాలివ్వాలి ప్రయాణాలుచేయొచ్చు క్రొత్తవూళ్ళు చూడవచ్చు కీర్తిపొందవచ్చు, అనితోచింది. ఆరోజుల్లో నేను జిల్లాబోర్డు గుమాస్తాను. ముప్పై ఆరో ముప్పైఏడో నెలజీతం. డబ్బుకూడా

వస్తుందని ఆశ. పైగా స్వేచ్ఛగా తిరగవచ్చు కాని తర్ఫీదుయిచ్చేవారు ఎవరు? నాఅంతట నేనే నేర్చుకోవాలి.

ఏదో ఒకసీను ప్రాక్టీసుచేయడం ఏదైనా టీపార్టీ, సభ జరుగుతుందని తెలిస్తే కార్యనిర్వాహకులను కలుసుకొని వారిఅనుమతితో అసందర్భాన అదిప్రదర్శించడం ఈ లా నాలుగు అయిదుసార్లుచేశాను. మొదటిది శ్రీ హరీంద్రనాథ్ చట్టోపాధ్యాయగారి Sleeper Awakened అనే యింగ్లీషు నాటకములోనిది. ఒకపెద్ద పొట్టతో ఒక అర్చకుడవేషంలో మంత్రాలనుశబ్దాలమాదిరి పుచ్చరిస్తూ నటించారు. పొట్టలు బ్బానవ్వారుప్రేక్షకులు, తర్వాత షేక్స్పియర్ వ్రాసిన మ్యాక్‌బెత్‌లో రెండుసీనులు, లేడీ మ్యాక్‌బెత్ వేషంలో ఆమె ఆమెభర్త యిద్దరి మోస్తరు నటించాను. తర్వాత షెరిడన్ వ్రాసిన School for Scandal మరా కసారిగురజాడఅప్పారావుగారికన్యాశుల్కం లో మొదటిసీను కొంతకాలమయినతర్వాత పెటినిఅన్నిటిని, యింకారెండింటిని కలిపి పూర్తిప్రదర్శనమివ్వాలి అనే కోరికపుట్టింది. ఆఫీసులో అరియర్సు ఎంతజాస్తి అవుతుంటే అంతజాస్తిగా యీకోరిక పెరుగుతూవచ్చింది.

ఒకవేషమునుండి మరొకవేషం శీఘ్రంగా ధరించడము ఏలాగో తెలియదు. డ్రస్సులు విగ్గులులేవు. ఉచితంగా యిస్తా నంటేమాత్రం ఎవరు ఏర్పాటుచేస్తారు. 1929 వ సం॥ ఆగస్టునెలలో గుమాస్తా ఒకరు గైరుహాజరు అవుతారు పెర్మనెంటు గుమాస్తా ఎవరైనా సెలవుపెట్టితే అతనికి సర్వీస్ కలిసివస్తుంది అన్నారు. దాంతో ప్రయాసలేకుండా నాకు సెలవుదొరికింది. ఒకరిదగ్గర రెండు పాతవిగ్గులు యింకొకరి వద్ద కొద్దిగా మేకప్‌వస్తువులు సంపాదించి ఒకరోజు కందుకూరుకు ప్రయాణం కట్టాను. అక్కడ హైస్కూలు హెడ్మాస్టర్ శ్రీ విస్సా నరసింగరావుగారు. ఎంతో ఆదరించి తర్వాత రెండురోజుల్లో నా ఆట ఏర్పాటు చేశారు. స్కూలువాళ్ళేకాక కొంతమంది యితరులుకూడా వచ్చారు. అదే నా మొదటి ప్రదర్శనం. అయినా నాగుండె అంతగా అదిరినట్లులేదు. ఎక్కడి ధైర్యమోవచ్చింది. 'మొదటిరోజుకదా, ఫరవాలేదు. ఇంకా అనుభవంకావాలి తర్వాత రాణిస్తుందనే నమ్మకం' అన్నారు శ్రీ నరసింగరావుగారు. 'రెండురూపాయలు ఖర్చు అయిందనే దుఃఖములేదు. కాని టైంవేస్టు అయిపోయింది. ఇకమీదట ఎవర్నీ బాధపెట్టకుండా తిరిగి నెల్లూరుకువెళ్ళి లక్షణంగా గుమాస్తాగిరి చేసుకో అన్నారింకొకరు.

ఇంకా చూస్తాం ఎవరెవరు ఏమిచేస్తారో అని అక్కడనుంచి కనిగిరికివెళ్లి ఒక ప్రదర్శనమిచ్చాను. అక్కడ అమెరికన్ మిషనరీ వారిపేరు జ్ఞాపకంరాలేదు. వారు మరుసటిరోజు నన్ను వారిబంగళాకు పిలిపించి ఆశీర్వదించి నాకు 5 రూపాయలు బహుమానం యిచ్చారు. తర్వాత అదేట్రిప్పులో ఒంగోలు, బాపట్ల, బెజవాడ, మార్కాపురములకు వెళ్లి, నావిద్య ప్రదర్శించాను.


1931 వ సంవత్సరములో కడపలో నాప్రదర్శనం జిల్లాజడ్జి మ్యాక్‌దొరగారు అధ్యక్షతవహించి వీరు కరుణం బాగానే నటిస్తున్నారు. కాని శృంగారాదుల్లో యింకా జాస్తిగా రాణించే లక్షణాలు వీరిలో నాకు కనబడుతున్నవి. కాబట్టి వినోదకరమైన

ఏకనటముఖ బహుపాత్రాభినయము.

నాన పట్టణ ప్రఖ్యాత భరతుడు శ్రీ వైద్యుల చంద్రశేఖరముగారి,
ఆహార్యాది కళానైపుణ్య విచిత్రములచే సువిదితము.




శ్రీ సాయిబాబా



శ్రీ పరమహంస రామకృష్ణసరమాత్మ.



శ్రీ కందుకూరు వీరేశలింగము పంతులు



శ్రీ వేంకటగిరి [illegible]

ప్రోగ్రాం వీరు యివ్వవలసినదని నేనుసలహా యిస్తున్నాను. ఉదయంనుంచి సాయంత్రం వరకు కష్టపడి పనిచేసివారిని ఒక గంట సేపైనా నవ్విస్తే అదికూడా ఒక దేశసేవగా భావించవచ్చును.' అన్నారు. అప్పటినుంచి ప్రజలను నవ్వించడమే నాజీవిత పరమావధి అయింది.

ఈ విద్యవల్ల ఉత్తర యిండియాలో కొన్ని నగరాల్లోను, దక్షిణదేశంలో అనేక పట్టణాల్లో, కాలేజీలలో. స్కూళ్ళలో, రిక్రియేషన్‌క్లబ్బులలో, పబ్లిక్ హాల్సులో వేలకొలది ప్రజలు నావిద్యచూచి ఆనందించారు. కాశీ, గయ, ప్రయాగ, పూరీ జగన్నాధ్, దక్షిణేశ్వర్, షిర్డీ, చిదంబరం, శ్రీరంగం, మధుర, రామేశ్వరం అనంతశయనం, తిరువణ్ణామలై మొదలైన పుణ్యస్థలాలు యాత్రాస్థలాలు సందర్శించే భాగ్యం కలిగింది.

శ్రీ రాధాకృష్ణన్ జవహర్ లాల్ నెహ్రూ, రాజేంద్రప్రసాద్, శ్రీమతి సరోజని నాయుడు, శ్రీనివాసశాస్త్రి మొదలగు ప్రముఖుల ముందు, నావిద్య ప్రదర్శించి వారిని ఆనందపరిచే భాగ్యంకలిగింది. కాని డబ్బుమాత్రం అంతగా రాలేదు. నాకు G. V. L. M. అనే డిగ్రీ బాగుటుందని ఒకరన్నారు. చాలా కష్టాలు పడవలసి వచ్చేది చాలాసార్లు. కాని కళాసేవచేయ గలుగుతున్నాననే సంతృప్తి, ప్రజల ఆనందం నాకు ఎప్పుడూ ఒకటానిక్‌వలె పని చేసేవి.

చావు అంటే ఏదో చెప్పలేని భయం నాకు చాలాసంవత్సరాలుండెది. ఒకరోజు ఒక వూళ్ళో ప్రదర్శనమిస్తున్నాను. ఒక సీను అయింది. వేసు కొన్న వేషం ఆపొక్కా అవరాయి, అవిగ్గతీసి వేరేమస్తులు ధరించి తర్వాత సీనుకు తయారవుతూ అద్దములో చూచాను. వేరేమనిషిగా నాకు నేనే కనబడ్డాను. వెంబడే ఒక ఆలోచన తట్టింది. చావుఅంటే యింతేకాబోలు. ఒకదేహంవదలి ఆత్మ మరొక దేహం ప్రవేశించటమే అని. అంతే, ఆ రోజు నుండి నాకు అభయం పోయింది. నాకేకాదు. యిటువంటి పిచ్చి భయం కలిగిన కొంతమంది యితరులు కూడా యీజ్ఞానంపొంది సుఖపడ్డారు,

1938 వ సంవత్సరములో బెంగుళూరులో ఒకమహాయోగిని దర్శించాను. వారు తపస్సుచేసే అగ్రహంలో నన్ను నా విద్య చూపింపుమన్నారు. ప్రదర్శనమైన తర్వాత వారిప్రక్కన నన్ను కూర్చోమని నాతోయిలాఅన్నారు. ‹‹ఆనందమే బ్రహ్మ ఒక్కనిమిషంలో అందరిప్రేక్షకుల మనస్సులను అణిచివేసి వారిని నవ్వుద్వారా ఆనందలో ముంచివేసినావు. నీవు ధన్యుడవు. ఈకార్యానికై భగవంతుడు నిన్ను ఉపయోగించుకొంటున్నాడు. నీవు నిమిత్తమాత్రుడివే'' ఎప్పుడూ యిది జ్ఞాపకముంటుంది. అయినా అప్పుడప్పుడు నేను చేయగలుగుతున్నాను అనే అహంకారం నాలోనుంచి తొంగిచూస్తూ నన్ను వెక్కిరిస్తూవుంటుంది.

రాత్రి 7 గంటలయినా ఆఫీసువదలి వెళ్లడానికి భయపడి మేడ మెట్లుదిగి యిరవై గజాలదాక చెప్పులు చేతుల్లో పెట్టుకొని దొంగతనంగాయింటికి వెళ్లే, ఆరోజుల్లో కూడా నా కళాకార్యక్రమాలకు అడ్డువేయక వుండడమేకాక, పరోక్షంగాను అప్పుడప్పుడూ

ప్రత్యక్షంగాకూడా ప్రోత్సాహమిస్తూ, కోరి నప్పుడంతా సెలవుయిచ్చి నన్ను ఎంతో ఆదరించిన మా అప్పటి ఆఫీసుమేనేజరు అయిన శ్రీ కె రామచంద్రరావుగారిని అధ్యక్షులుగా నుండిన శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి, శ్రీ పొణకా గోవిందరెడ్డిగార్లను, మానాటక సభాధ్యక్షులు అప్పటి మునిసిపల్ ఛేర్మెన్ అయిన శ్రీ యాహ్యాలీసాహెబ్ గార్లను యీసందర్భములో స్మరింపక తప్పదు

అథ విరలోన్నతదశనాం నిమ్నహనుం స్థూలచిపిటనాసాగ్రామ్
ఉల్బణచూచుకలక్షిత శుష్కకుచస్థాన శిథిలకృత్తితనుమ్
గంభీరారక్తదృశం నిర్భూషణ లంబకర్ణపాలీం చ
కతిపయపాండుర చికురాం ప్రకటశిరాం సంతతాయతగ్రీవామ్
సితధౌత వసనయుగలాం వివిధౌషధి మణిసనాథగలసూత్రాం
తన్వీ మంగులిమూలే తపనీయమయీంచ బాలికాం దధతీమ్ ॥

♦ ♦ ♦ ♦ ♦ ♦

స జయతి సంకల్పభవో రతిముఖశతపత్త్రి చుంబన భ్రమరః
యస్యానురక్త లలనానయనాన్త విలోకనంవసతిః ॥

♦ ♦ ♦ ♦ ♦ ♦

నిర్యన్త్రి కేలివిశదం సహజప్రేమానుబన్ధ రమణీయమ్
కార్యాన్తరాన్తరాయైరనుపహతం యాతు యౌవనం యువయోః
నిర్దయ మవిరతవాంఛం ప్రస్తత్రవ మవ్యవస్థితావరణమ్
ఉపచీయమానరాగం సతతంభూయా ద్భవత్సురతమ్

(దామోదరగుప్త-కుట్టనీమతమ్.

♦ ♦ ♦ ♦ ♦ ♦

మ॥ మును పారభ్యమునివ్వటిల్లఁగ మనోమోదంబునందేటు లె
ల్లనునోలిన్వెడలంగ రేకులు సముల్లాసంబునన్ బింకమె
క్కనయంబెక్కుచుఁగ్రందు పొందెడలిపిఁకన్ కేసరంబు ల్గడ
ల్కొనఁ దోడ్తోమధువుబ్బఁ జేరెలమిఁబొల్పుంబొందె నంభోజముల్ ॥

ఉర్వ్య 2-105

♦ ♦ ♦ ♦ ♦ ♦

# 52

# కళాజగత్తు

రూపశిల్పి కుమార్, నెల్లూరు

'కళాక్షేత్రం' అన్నపదం విన్నంతనే ఆభావన మదిలో మెదలినంతనే, ఏదో అనిర్వచనీయమైన ఆనందం పొర్లి ప్రవహిస్తుంది! నవరస భరితమైన జీవన గానాన్ని నవనాదులా శ్రుతులుగలిపి మధురంగా అల పిస్తవి ఏదోతెలియని, పైకి చెప్పలేని, భాష కందని, తీయనిబాధ, మధురమైన ఆవేదన మేన్ను పులకరింపచేస్తుంది దీని మూలం నోటితో చెప్పలేం. చేతితో వ్రాయలేం అందుకు హృదయమొక్కటే గీటురాయి!

' Life is a song  Life is a dance. There is a song in the dance and dance in the song. Life is a rhythmic tune and tuneful rhythm  There is a balance and harmony in the universe The individual must reprodece the tune and the rhythm in his day to day life '

నిత్యజీవితంలో మనం ఎన్నో చిత్ర విచిత్రాలను చూస్తున్నాం వాటిద్వారా కొన్ని అనుభూతుల్ని పొందుతున్నాం అంత టితో మానవునికి తృప్తి లభిస్తుందా? ఆ అను భూతి క్షణికంగా భావిస్తాడు మళ్లీ అసం తృప్తి ఇంకా ఏదోకావాలి, ఏదో అనుభ వించాలన్నకాంక్ష నిండి నిబిడీకృతమై ఉంటుంది మానవుని మస్తిష్కంలో, అలా గాక నిజమైన తృప్తి, మానసిక ప్రశాంత తను మానవుడు తన జీవితం ద్వారానే సాధించవచ్చు మోద ఖేదాలు మానవుని మనః ప్రవృత్తిమీద ఆధారపడి ఉంటాయి. ఎక్కడో వేరేలోకం ఉందని, మరెక్కడో స్వర్గం ఉందని పగటికలలు గంటూ జీవి తాన్ని వృధాగా ఖర్చుచేసేకంటె తనలోనే స్వర్గాన్ని, సౌందర్యాన్ని సృజించుకోవాలి అప్పుడే జీవితం గానంగా మారో ... నృత్యంగా లయిస్తుంది.

ప్రకృతే ఒక కళాఖండం, సామస్త కళాజగత్తు ప్రకృతిని ఆరాధించగలిగిన వాడు నిండైన,నిజమైన జీవన గానాన్ని విన గలుగుతాడు మానవుడు ప్రకృతిలోని అణు వణువులోనూ కళానికుంజాలు పెనవేసు కొని ఉన్నాయి అలా మన హృదయాలను సుశీతం చేసుకో గలిగినప్పుడు, సముద్రపు హోరులో శ్రుతితప్పని గానం వినిపిస్తుంది నిరంతరం, నిర్విరామంగా లేస్తు పడుతూన్న అలల్లో గతి తప్పని నాట్యాన్ని చూస్తాం

కఠిక శిలలనుండి సుందర శిల్పాలు ఉద్భవించినవి గులకరాళ్ళు, బంకమన్ను, ఎండుటాకులు రూపాంతరంచేత చిత్రకారుని కుంచెలో సొంపులు నింపుకున్నవి పెనుతు పాన్లు, భీకర యుద్ధాలు సైతం కవితకు మూలములైనవి

కఠిన హృదయాలను సైతం కరిగింప చేయగలిగే శక్తి గలిగిందికళ. ఇది ఒకరు నేర్పితే అబ్బేదిగాదు. ప్రకృతే మానవుడికి దాన్ని ప్రసాదిస్తుంది.

అవ్యాజమైన ఆనందాన్ని, మనోవికాసాన్ని, శాశ్వత ప్రశాంతిని, క్రాంతిని మానవజీవితాలకు ప్రసాదింపగలిగేది ఒక్క కళారాధన మాత్రమే!

ఇది నాస్వల్పమైన అనుభవంలో తెలిసున్న సత్యం! కళలను గురించి వ్రాయాలన్నా మాట్లాడాలన్నా జంకుతాను. నేనొక ఔత్సాహిక కళారాధకుణ్ణి, కళాసాగరాన్ని తరించటం ఎవరికి తరం? నా అనుభవాలు, అనుభూతులు కేవలం మేరువుముందు చెద పుట్టలాంటివి.

మొత్తంమీద ఒక ఆర్టిస్టుగా నాఅనుభవాల్ని సమగ్రంగా మీముందు ఉంచేందుకు ప్రయత్నిస్తాను ఎంతవరకు కృతకృత్యుణ్ణి కాగలనో......పఠితలకే వదలుతాను.

"Listen to the song of life Store in your memory the melodey you hear. Learn from it the lesson of har mony." "M.C."

నేనప్పుడు ఆరేండ్లవాణ్ణి. పిల్లకాయలతో వీధిలో గంతులిడుతూ ఆడుకుంటున్నాను. అప్పుడే రెండుగూడుబండ్లు వచ్చి మావీధి మిట్టమీద నిలబడ్డాయి. మేమంతా చుట్టూచేరాము చప్పట్లు కొడుతూ. బండ్లతో వచ్చిన తోలుబొమ్మలాట వాళ్ళను చూచి, రాత్రికి బొమ్మలాట వేస్తారట. బొమ్మలాటనగనే ఎక్కడలేని సంబరం వచ్చాను.

పెందలాడే స్నానముచేసి, భోంచేసి మామిత్ర బృందంతోపాటు ఆట ప్రారంభానికి యింకా రెండుగంటలు ఉందనగనే హాజరయ్యాం స్టేజికిముందు ఒక తెల్లగుడ్డ (ఇప్పుడు సినిమా తెర మాదిరి) కట్టారు. స్టేజిలోపల దీపాలుపెట్టారు. స్టేజి లోపల తెర కిరుప్రక్కలా మేదరపెట్టెలు. ఆమేదరపెట్టులలోంచి తోలుబొమ్మలు తీసి 'కీచకవధ'ఆడారు. 'కీచకవధ' బలే మజగా ఉంది. బంగాక్క కేతిగాడు బలే గానవ్వించారు. తెల్లవారిందాకా అలాగే నిద్రపోకుండా చూచాను. తోలుబొమ్మలాటవాళ్లు ఒక నెలపాటు మకాము మావీధిలోనే ఉండినారు. వాళ్ళ అన్ని ప్రదర్శనాలు చూడగలిగాను. ప్రదర్శనతోపాటు, వాళ్ళు ఎలా బొమ్మలను తయారుచేసుకొనేది కూడ చూడగలిగాను. అప్పటినుంచే, నేనూ ప్రారంభించాను. ఎక్కడ బట్టినా, గోడలమీద, 'ఓ, న, మాల' పుస్తకాలలో, చేతికి ఏది దొరికితే దానితో కేతిగాడు, బంగారక్క బొమ్మలు గీయడం, ప్రారంభించాను.

నేనొక ఆర్టిస్టుగా రూపొందటానికి కారణం ఆబొమ్మలాటవారు. అప్పటినుండి నామనస్సులో ఏవోవో భావాలు మొలకలెత్తేవి! నామేధస్సు క్షణం క్షణం తీరిక లేకుండా ఆలోచించేది. ఏవో పిచ్చిపిచ్చిగా మట్టితో బొమ్మలుచేసి,! వాటికి ఏవో రంగులు పూసేవాణ్ణి! ఆబొమ్మ మనిషిగాని పిల్లిగానీ, కోతిగానీ, ఏదైనగానీ మొత్తంమీద ఏదోఒకటి 'బొమ్మ' చేయాలని పట్టుదల, మట్టితెచ్చి ఇల్లంతా పాడుచేస్తున్నాడని మావాళ్ళు కోప్పడేవారు. అయినా నేను బొమ్మలను చెయ్యడం మానుకోలేదు. ఇదేకాకుండా

చిన్నప్పటినుంచి పగటివేషగాళ్లన్నా, వీధి భాగవతాలన్నా బాగాచూచి ఆనందించే వాణ్ణి.

కాలంగడిచింది. నేను హైస్కూలులో చదువుతున్నాను. అయితే పాఠాల చదువుకునేదానికన్నా చిత్రలేఖనము మీద ధ్యాస ఎక్కువ ఉండేది. అందువలన ఎప్పుడూ బొమ్మలు గీయడం వాటికి రంగులు పూయడం. ఆదేసమయములో పురమందిరం పునర్నిర్మాణం చేస్తూ కొత్త సీనులు చిట్టిబ్రదర్సు దగ్గర తయారు చేయించారు. అప్పుడు చిట్టి బ్రదర్సుతో సంబంధంపెట్టుకొని, ఇంకా చిత్రకళమీద ఉన్న నాధ్యాసను ఎక్కువ చేసుకున్నాను.

చదువు మానేసిన తర్వాత ‚చిత్రకళ' అభ్యసించాను. కొంతమంది ఉత్తమ కళాకారులవద్ద శిక్షణపొందాను సాంకేతిక పరీక్షలో కూడా ప్యాసయ్యాను, కాని ఎంత కష్టపడైనా చిత్రలేఖనంలో మంచి ప్రావీణ్యత సంపాదించుకోవాలనే బలమైన కోరిక నాలోఉంది. అందువలన చిత్రలేఖనమునకు సంబంధించిన గొప్ప పుస్తకాలు తెప్పించుకొని ప్రయోగాత్మక దృష్టితో చదివాను. ఇలా చేయడంవల్ల కొంతవరకు నా ఆశయం నెరవేరింది.

చిత్రలేఖనం తోపాటు ఛాయగ్రహణం లోకూడా కొంతఅభిలాషఉండి నెల్లూరులో ప్రఖ్యాతి చెందిన ఫోటోగ్రాఫర్ దగ్గర శిక్షణపొంది కొంతకాలం ఫోటోగ్రాఫర్‌గా కూడా రాణించాను. కాని ఛాయాగ్రహణకి ప్రాముఖ్యత ఇవ్వలేదు.

చిన్నతనం నుంచి సినిమాలు, నాటకాలు చూడడం ఒకసరదా. తత్ఫలితంగా బడిలో చదివేరోజుల్లో నేనూ, మావీధిలో కొందరు పిల్లలం కలసి ఏవో చిన్ననాటికలను ప్రదర్శించేవాళ్ళం. అప్పట్లో C. S.R. మాదవపెద్ది స్థానం, సంజీవరావు మొదలగు నటులు మా ఇళ్ళప్రక్కన ఉన్న "కృష్ణగాన సమాజము"లో రిహార్సల్సు వేసుకొనేవారు ప్రతిరోజు. అందువలన, నాటకాల మీద అభిలాష బాగాపెరిగింది, నటకుణ్ణి కాలేకపోయాను.

తలవని తలంపుగా ఆ అవకాశం లభించింది. నేను చదువుమానేసిన తర్వాత, పెయింటింగ్ లో శిక్షణపొందడం, పెయింటింగ్ శిక్షణ తర్వాత అప్పుడే శ్రీ యం. విశ్వనాధరెడ్డిగారు కొందరు ఉత్సాహవంతమైన యువకులు కలసి 'లలితకళానిలయం' స్థాపించారు. ఆ నాటకసంస్థకు, కవికోకిల దూవ్వూరు రామిరెడ్డిగారు దర్శకుడుగాను, నేను కళాదర్శకుడుగాను ఉండేవారము. వారి అమూల్యమైన సలహాలు నా అభిలాషలను బాగా సానపెట్టినాయి. లలితకళానిలయం నాటకాలకు కళాదర్శకత్వమే కాక, మేకప్‌కూడా నేనే చేయాలని కుతూహలం ఏర్పడింది. అందువలన ధైర్యము చేసి "Sacrifice" అనే ఇంగ్లీషు నాటకానికి నేనే స్వయంగా మేకప్ చేశాను. అదేనాజీవితంలో తొలిసారిగా Make up Artist పనిచేసిన నాటకం.

సహజంగా చిత్రలేఖనంలో ప్రవేశమున్నందువల్ల రంగులతో కుంచలతో పరిచయమున్నందువల్ల ‚‚మేకప్'' విషయంలో చాలా ఉత్సాహము చూపేవాణ్ణి.

ఒకసారి ‚‚ఆంధ్రనాటక కళాపరిషత్తు (బెజవాడలో జరిగినప్పుడు) లలితకళానిల

యం వారు తుపాను ప్రదర్శించి, ప్రథమ బహుమతి పొందారు. అప్పుడు డాక్టరు రాజారావ్‌గారు నన్ను 'Make.up' మీద ఒకపుస్తకం వ్రాయమన్నారు. సాహసించ లేకపోయ్యాను. కాని అప్పటినుంచి నాలో ఆ కోరిక బలీయంగా నాటుకొని పోయింది. తర్వాత ఆహార్యము, రంగస్థలాలంకరణముపై చాలా పుస్తకాలు సేకరించి చదివాను. ఆ నిర్వచనాల నన్నింటిని ప్రయోగంద్వారా సాధించాలనుకుంటూ ఉండగా చాలా నాటకసమాజములు, నటకులు తోడ్పడ్డారు.

ఈ నాఅనుభవాన్ని క్రోడీకరించుకొని "ఆహార్యం" మేకప్ పుస్తకాలను వ్రాయ గలిగాను. ఆంధ్రదేశములో పెక్కు కేంద్రాలలో జరిగిన నాటక పాఠశాలలద్వారా అనేకమందికి మేకప్‌కళపై శిక్షణ యివ్వగలిగాను. కళాభిమానుల, ఆదరాభిమానములు నాకెప్పుడూ ఉంటవని ఆశిస్తున్నాను. వారి అండదండలతో కళాక్షేత్రంలో ఒక కర్షకుణ్ణి. నిర్విరామకృషితో "కళాజగత్తు"కి నూతన శోభలను చేకూర్చాలని నా కాంక్ష.

ఉ॥ కడుఁబసిబిడ్డ వీఁ డొకటికా దపనానెఱుఁగండు ముంద రె
ట్యోడ నొకపాటెఱుంగఁ డెదయొంతయుఁ గోమల మెప్పుడైన నేఁ
గుడువఁగం బిల్తుగాని తనకుంగల యాఁకటిప్రొద్దెఱుంగఁడి
కొడుకిటుపోక కు న్మనముగుందెడు నిన్గని యాజిఁ దిల్లెడున్॥

పిరా: II. 213.

శా॥ ఆహ్లాద దదేమొ నేడు, పవనుండాకాశవాపీ తటా
శోకానేక వనాళి గ్రుమ్మఱుచునచ్చోడాగెనో, లేక గం
గాకల్లోలవతీ ప్రవాహముల నూగంబోయెనో; లేక కాం
తా కర్పూర కపోలపాళికల నిద్రా సక్తుఁడై యుండెనో!

చాటువు:

ఉ॥ ఆలసతయున్ విచిత్రతయు నత్యశనాదరణంబు రోగముం
గలయును లోభమున్ భయముఁ గామము క్రోధము లౌల్యమున్ విరో
షలు విను యోగసేవకు నదుష్టతఁ జేర్చిన యోగ మిచ్చు సి
ద్ధ లెనిమిదింట నప్రతిహతుండయి యోగి చరించు నెల్లెడన్

అను. V. 282

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ,
ప్రత్యాహార, ధ్యాన, ధారణ & సమాధి

# 53

# జైహింద్ నృత్యమండలి

"నాట్యాచార్య" కోట సుబ్రహ్మణ్యశాస్త్రి, నెల్లూరు.

అభ్యుదయ ప్రపంచ వాతావరణములోని ప్రజల అభిరుచులు అనుక్షణము నవీన పంథాలనే ద్రొక్కుచుండును. క్రొత్త యొక వింత పాతయొక రోత, అనునట్లు లలితకళలుగాని. మరేకళలుగాని మెఱుగులు పెట్టి కొలది మెప్పులందుచుండును. అందులో భరతనాట్యకళ యావద్భారత దేశ ప్రజలచే ఆకర్షింపబడుటయేగాక, ఖండ ఖండాంతరములలోకూడ అనుష్ఠింపబడి అగ్రస్థాన మలంకరించుచున్నది. ఈనాట్య శాస్త్రము పూర్వము భరతమహాముని జతుర్వేదముల సారము గ్రహించి పంచమవేదమగు యీ నాట్యవేదమును సృష్టించినట్లు శాస్త్రమే ప్రమాణము. భరతముని గొప్ప తపస్వి త్రికాలవేది చతుష్షష్టికళాధురంధరుడు. అందుకే బ్రహ్మదేవుడు అతనిచే యీ వేదమును కల్పించెను. లోకధర్మమునే నాట్యధర్మముగా కల్పించి అనేకవిషయములను క్రోడీకరించి అనుభవానికి దెచ్చుకొని తన శతశిష్యగణముచే తాను ప్రదర్శింపజేసి కృతకృత్యుడై ప్రమాణ గ్రంథముగా దీనిని నిర్ణయించెను.

భరతముని ప్రణీతమైన నాట్యశాస్త్ర వస్తువిషయమును ఆరవ అధ్యాయములో, మాతృకలంతయు పదునాల్గు ప్రకరణములుగ విభజింపబడినది. రసప్రకరణములో శృంగార హాస్య కరుణా రౌద్రాది నవరసములును, భావ ప్రకరణమందు విభావానుభావ స్థాయీ సంచారాది భావ భేదములును, అభినయ ప్రకరణమున అంగిక వాచక ఆహార్య సాత్వికాభినయములును స్పష్టీకరించియున్నారు. అయితే దేశమందు మాత్రము రెండు భిన్న సాంప్రదాయాలు భరతనాట్యము పేరుతో ఉత్తర దక్షిణ ప్రాంతములందు గలవు. ఉత్తరదేశ సంప్రదాయ నాట్యము మణిపురనృత్యమనియు, కథక్ నృత్యమనియు; దక్షిణ సంప్రదాయ నృత్యము తంజావూరి భరతనాట్యమనియు. మలయాళమున కథక్కళి యనియు పేర్కొనుచున్నారు. ఏసంప్రదాయమునకా సంప్రదాయము వారు భరతనాట్యమనే పేరునే చెప్పుకొనుచున్నారు. ప్రతికళలోను కొద్దియో గొప్పయో భేదము లగుపడుచుండినను, ఒకటి నృత్తప్రధానముగను మరొక్కటి నృత్యప్రధానముగను గన్పడుచుండును. మొత్తముమీద రెండు సాంప్రదాయాల ప్రదర్శనలు కన్నుల పండువొనర్చుచుండును.

అభినయశాస్త్రము అంతులేని అగాధమగు గంభీర సముద్రమువంటిది. నిజముగ నాట్యకళలో సంపూర్ణపరిణత రూపములు జూడవలెనన్నచో విభావానుభావాస్థాయీ సంచారభావాదులతో రసప్రధాన పాత్రగా తన్మయమై నర్తకీమణి తాదాత్మ్యమునొంది

అభినయించు నటనమే నటనము. అట్టి అవకాశము గల్గుటయే అరుదు. గల్గినచో రెండు కన్నులు చాలవు. ఈ అభినయకర్మకు శాస్త్రీయ సంగీతము ఉత్తమగేయకవిత్వము ముఖ్యాంగములు. ఇట్టి అభినయాత్మకమైన కథామాతృకను బహుపాత్రలు ప్రదర్శించెడి నాటకమునకు నాట్యమనిపేరు అనగా భావ రాగ తాళానుగుణ్యముగ నటించునాటకము గాన భరతనాట్యమైనది. దీనినే యక్షగానమనీ వీధినాటకమనీ అన్నారు. నాగరకతహెచ్చినకొలది వీధి నాటకములు మోటుదేలి స్టేజీనాటకములై కాలక్రమేణ వెండితెరలపై నిర్జీవరూపక ప్రధానములైనవి. ఏయేకళల కాయా కళలు విశిష్టతనందినను, సర్వప్రాణుల మనసుల రంజింపజేసి ఆకర్షించునదీ సంగీతనృత్య కళయే. అందుకే ,,శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గాన రసంఫణిః'' అన్నారు పెద్దలు. అంతియే గాక వరూధిని ప్రవరాఖ్యునితో ,,రహి మీర జంత్రగాత్రముల, రాల్ గరగింప జేయు విమల గాంధర్వంబువిద్యమాకు'' అన్నది. ఇంక నాట్యవిషయము. కీ. శే. ఉభయ భాషా ప్రవీణ, హరికథా పితామహ అదిభట్ల నారాయణదాసుగారు, అభినవ రంభ శ్రీమతి చాటువర్రు సుందరి నాట్యప్రదర్శనము తిలకించి ఆశువుగా ఆమెపై కొన్నిపద్యములు చెప్పినారు. అందులో.

,,చిత్రరూతలాగరే, యువతి నీ నాట్యంబు
   దిలకింప నెట్టియస్ఖలితులైన
ఆసువులేర్పడి కదలి ఆడకుండునె శిలా
   ప్రతిమలు నీనృత్యగతులజూడ.

కావున అట్టి రమణీయమగు కళయందెట్టి స్వారస్యము లేనిదే సిద్ధేశ్వర నారాయణతీర్థ జయదేవాదిభక్తులు, నారదతుంబురాది మునులు తన్మయులై తరింతురా; చివరకు పాకకళ చూచుకొన్నను వక్కకూరను పలువురు పలువిధములుగ మహారుచికరముగ వండుదురు. ఎన్నిరకముల మసాల ద్రవ్యాదులతో వంట వనితనమునుజూపినను, రుచికి మూలాధారముల ఉప్పు-పులుసు కారం అను మూడువస్తువులేగదా, రహస్యము. ఏదియెక్కువైనను తక్కువైనను రుచింపగల్గునా? ఏదియెంతెంత నుపయోగించుట అని తెలియుటే పాకకళనేర్పు. అట్లే నాట్యకళకు గూడ భావ-రాగ-తాళ అని మూడు ప్రధానాంశములు. దేశకాల పాత్రానుసారముగ సాంప్రదాయానుసరణి యే యే నాట్యాచార్యులెట్లెట్లు కృషి చేసినను పై మూడింటినేగదా గమనించి నడుపుట-కావున యేదో నూతనత్వమొలక జేయుటే కళారాధకుల సంకల్పము. ,,పాడిందే పాడు బాపనక్క'' అన్నట్లు వకరిని అనుసరించి ఆదేమార్గమున పోవుచు నవ్యకళా కన్యకు అంధత్వము గల్పించుట నామతముకాదు.

ఈ అభినయ విద్యాసాంప్రదాయము కృష్ణాతీరవాసులౌ కూచిపూడి అగ్రహార బ్రాహ్మణుల వరప్రసాదమని చిన్ననాడే నేను విని నందున పట్టుదలతో నేనా విద్య నభ్యసించితిని. నా పదునేడవ ప్రాయము నుండి యిరువదైదవ ప్రాయము వరకు కష్టించి నేర్చిన యీకళకు మెరుగులు దిద్దవలెననియే నా దృఢసంకల్పము. మామండలిలో నాట్యశిక్షణకు ప్రమాణ గ్రంథములు



కరణము

«నందికేశ్వర అభినయదర్పణ" భరత రసప్రకరణ" అభినయ స్వయంబోధిని హస్తరత్నావళి, తాండవలక్షణం మొదలగు నవి. అంతియే గాక, తరంగములు అష్టపదులు-క్షేత్రయ్య పదములు, అన్నమాచార్య పదములు, జావళీలు, వర్ణాలు కృతులు శిక్షణయివ్వబడును. మరియు క్రొత్త క్రొత్త నృత్య నాటికలు అనగా (Dance Dramas, Ballets) కోరియాగ్రఫి (Choreography) చేసి యుంచి ప్రద

ర్శన జేయు సామర్థ్యము గల్గింపుచున్నాను. అందులో కొన్నిటినుదహరించు చున్నాను. 1) సత్యభామా గర్వాపహరణం, (దశావతారఘట్ట మిందు జొప్పింపబడినది- 2) మేనకా విశ్వామిత్ర-3) గంగావతరణం 4) సైరంధ్రి (విరాటపర్వం) 5) గీతబోధ 6) సీతావనవాసం మొదలగు నృత్య నాటికలు, చిత్రవిచిత్ర పోకడలతోను చక్కని రచనలతోను చిత్రింపబడియున్నవి. మరియు, ఆనందకుమారస్వామి పైనను- శ్రీ శ్రీ జవహర్లాలుగారి పైనను-మరికొంత మంది స్తవనీయులగు పుణ్యపురుషులపై శబ్దముల రచించి ప్రదర్శన యోగ్యములుగా జేసియున్నాను. పైనా మహారాష్ట్రమణ భరతవీర ప్రబోధన మొదలగు నృత్యనాటికతో కళారాధన జేయుటకే యీ సంస్థ యేర్పడి కార్యక్రమముల జరుపుచున్నది.

మండలిస్థాపనకు పూర్వగాథ :

1926 సంవత్సరమున హైద్రాబాదులో నాంపల్లియందు మద్గురువరేణ్యుండగు కీ॥ శే॥ వేదాంత లక్ష్మీనారాయణగారి భామకలాపం అను కూచిపూడిపక్కి భరతనాట్య ప్రదర్శనమును శ్రీ శ్రీ చిత్రశిల్పనాట్యచాతురీ ధురీణుండగు కీ॥ శే॥ అడవి బాపిరాజుగారి యాజమాన్యమున జరుపబడినది. అందు లక్ష్మీనారాయణగారి హావభావ విలాసవిభ్రమాదులకును, నృత్తనృత్యలాస్య తాండవాది విభేదక ప్రదర్శనకును, తిస్ర మిశ్రాదితాళగతి లయాను గుణ్యాపద గమకములకును, సంయుతాసంయుతాదిహస్త వినియోగాదికములకును, అంగప్రత్యంగ ఉపాంగ అంతరంగాది సమయస్ఫూర్తి లయాను గుణ్యచలన మునకును, విభావాను భావ సంచారిభావాదులతో సమయోచిత అభినయకర్మకును ప్రేక్షకమహాశయులందరు హర్షపులకితగాత్రులై మహానందమునొందిరి. ఆ ప్రదర్శనసందర్భమున నేపథ్యమందు గురువుగారిచే నియోగింపబడిన నేను మృదంగ వాద్యమువాయించుచు, మధ్యమధ్య నృత్త సందర్భమున వారి గమకముననుసరించి అడవులక్రమములను జాతిభేదముగ మృదంగము పై పలికించుచుంటిని. ప్రదర్శనాంతరము శాస్త్రిగారు నన్ను ప్రత్యేకముగ ప్రేక్షక లోకానికి పరిచయముచేయుచు, యీకుర్రవాడు తనపేరు నిలుపగలడనియు, తనవద్ద యికనేను నేర్చుకొనవగిన విద్యారహస్యము ఇదివరకే బోధించితిననియు ఆనందోద్రేక హృదయుడై నుడివిరి. ఆనాటివారిఆశీస్సులే మామండలి శంకుస్థాపన కాధారభూతములు

హైద్రాబాదులో రెండు దినముల తర్వాత కొత్వాలు వెంకటరామిరెడ్డిగారి ఆధ్వర్యమున శ్రీ బూరుగుల రామకృష్ణరావుగారు, అడివి బాపిరాజుగారు, కురుగంటి సీతారామయ్యగారు ఇత్యాదిప్రముఖుల సమక్షములో రెడ్డిహాస్టలునందు మరొక ప్రదర్శన శాస్త్రిగారితోను,మధ్యమధ్య నాచేత కొన్నినృత్తప్రదర్శనలు జరిపింపబడినవి. తగురీతిశాస్త్రిగారిని సత్కరించిరి. వారుతమగ్రామమున కరుగుచు నన్నుపిలిచి కేవలము ఉద్యోగముపైననే ఆధారపడే దెందుకురా, నలుగురిపిల్లలకునేర్పి నాలుగు కాసులార్జించుకోరా నాయనా అని వెళ్లిరి. నేను ఒప్పుకొంటిని. అనాటి నుండి బాలికలకు కొంతమందిని నేర్పించుట తటస్థించెను కాలక్రమేణ 1928సం॥ నాటికి విద్యార్థినుల సంఖ్య పెరుగుచు వచ్చినది ఆదాయముగూడ నుండెడిది.

ముంపలిస్తావర.

రేనప్పటిదినములలో Eelctricity Power House నందు మెకానికల్ సెక్షనులో పర్మినెంటు ఉద్యోగియై పనిచేయుచుండిని నాట్యమునేర్చుకొను బాలికల సంఖ్య మున్నదివరకు పెరిగియుండుటచే మహాకష్టతరముగా సమర్ధించుకొనుచు కేవల కళో పాసనాదృష్టితో పర్మినెంటు ఉద్యోగమును మానుకొంటిని మాబంధువులందరికి బాధాకరమైనను, మహామంచిపని చేసినావని లో లోన సంతసించుచు శ్రీ శ్రీ బాపిరాజ గారు నన్ను అనునయవాక్యాల తో ఆదరించుచు గొప్ప ప్రారంభోత్సవముతో మండలి స్థాపనాది కార్యక్రమము జరిపించిరి అది 1930 సంవత్సరం ఏప్రిల్ నెల

క్లాసులవిభజన నెలబసువిధానము ఆర్సెస్ట్రావగైరా అన్నియు వా రి యి ష్టా ను సారమే జరిగినవి

నెలబరు

A ౧ చతురశ్రజాతి అడవు (Steps) 4 విధాలుమాత్రమే

౨. ఆదితాళవిమర్శ-- మూడుకాలములు (చేతితో)

,, ,, ,, , (కాలిపై)

(పాలవరుసలు ముక్తాయింపులు, కాలిపైన)

౩. పైతాళములో చిన్నజతులు 2మాత్రం (చేతిపైన)

,, ,, చిన్న-ముక్తాయిలు 2

౪. ఆయుమజాతుల ముక్తాయిల విమర్శ (ప్రాక్టికల్)

౫ ,, ,, ,, ,, (థియరి) 3 కాలం

౬. నృత్త, నృత్య భేదములు

౭ కరణములు-9మాత్రమె- వినియోగం (ప్రాక్టికల్)

౮ గ్రీవాభేదములు-దృష్టిభేదాలు- వినియోగం (థియరీ)

౯ అసంయుతహస్తములు- విమర్శ- కంఠ స్థంచేయదగిన శ్లోకాలు

౧౦ కమాచి స్వరజతి చిన్న గీతం, (ప్రాక్టికల్)

చిన్నపాట 4 జతులు, 2 ముక్తాయిలు

A 2 తరగతి

౧ రూపకతాళంలో అడవు (Steps)

౨ గమకం, గమనం, చలనం, కంపితం వీటిభేదాలు.

3 పైతాళములో జాతిముక్తాయిలు 3 మాత్రం (ప్రాక్టికల్)

,, ,, ,, ,, (థియరి)

౪. ప్లవరాదులు 2 చక్రీలు 2 అంగహారం1

౫ తీర్మానం సొల్లు (తత్కారం)విమర్శ

౬ ఆదితాళంలో 2 స్వరజతులు ,,

౭ ,, 2 చిన్నపాటలపై అభినయం

౮ అలారింపు-విమర్శ-

౯ సప్తతాళములు వాటిజాతులు విమర్శ (థియరీ)

౧౦ అసంయుత హస్తములు+సంయుత హస్తములు

ఇట్లే పూర్తిగ అన్నితరగతులకు నెలబరుకలదు వ్యాస విస్తరభీతిచే వ్రాయలేదు. సంస్థలో ఐదుసంవత్సరములకోర్సు జరుపబడును విద్యార్థినులు 5 వ యేట (ప్రాయము) మొదలుకొని శిక్షణ పొందగలరు. కాలక్రమేణ మామండలి అభివృద్ధి నలుమూలలకు ప్రాకినది అదివిని ఆనాథ

సేవాసదన్ సికింద్రాబాద్ ప్రొప్రైటరు శ్రీయుత భరతన్‌గారు తమ సదన బాలికల సహాయార్థమై ఒకచిన్న నృత్యనాటిక నేర్పించి ఆడింపవలెనని కోరిరి. ముక్కు పచ్చలారని ఆబాలికలచే సక్కుబాయి అను నృత్యనాటికను రచించి మూడు నెలలో వారికి నేర్పించితిని. అదిగని సదరు సభ్యులు ఆబాలికలచే (బెనిఫిట్ పెర్‌పార్‌మెన్సు) పెట్టించిరి. దైవము నాకు తోడైనాడు. ఆ పసికూనలు చెప్పినట్లు కష్టపడినారు. సుశిక్షితులైనారని పేరందినారు. విజయవంతముగ భక్తి రసప్రధానముగ అభినయించి ఆబాలగోపాలమును ఆనందాబ్ధినోలలాడించి అయ్యవారి ఘనతను ద్విగుణీకృతము గావించినారు.

కీర్తివ్యాప్తి :

ఆదినములలో భరతనాట్యమనిన మహావ్యామోహ ముండెడిది. అనేకమందిని రకరకాల కళాకారులను వివిధ పట్టణాల నుండి వ్యయప్రయాసల కోర్చి రప్పించుచు సత్కరించి ఆనందించు చుండెడివారు. పౌరులు గణపతి నవరాత్రుళ్ళు, వసంతోత్సవములు, వైవాహిక సందర్భములు, బహిరంగసభలు అని యేవేవో పురస్కరించుకొని ప్రదర్శనాతేర్పాట్లు జరుగుచుండెడివి. ప్రఖ్యాత నర్తకీమణులగు యోగంమంగళం సిస్టర్సు - రుక్మిణీ అరెండల్ పార్టీ- గోపీనాధ్ తంగమణి పార్టి మొదలగు వారి ప్రదర్శనము లొకవైపు, స్థానిక కళాకారులైన మా మండలి వారి ప్రదర్శనలొక వైపు జరుగుచుండెడివి. అప్పుడప్పుడు మహామహుల చే గొప్పగొప్ప బహిరంగసభలుకూడా, వీర్పాట్లనుచు హిందూమతాన్ని గూర్చియో లలిత కళలనుగూర్చియో, భక్తి తత్వాన్నిగురించియో గంభీరోపన్యాసములు జరిపింపబడుచుండెడివి. అట్టి తరుణములందు మా మండలి బాలికలచే నృత్యరూపముగ ప్రారంభోత్సవముల జరిపింప బడుచుండెడివి. ఒకనాడు నేటి ఆస్థానకవిగారగు శ్రీ కాశీ కృష్ణాచార్లుగార్లు సభనలంకరించి యుండిరి. ఉపన్యాసమునకు ముందు నృత్యప్రదర్శన గావించిన ఆబాలనర్తకీమణులను కవిగారు ముసిముసి నవ్వులతో మూర్ధ్ని ముద్దాడి ఆశీర్వదించి, క్రీగంట నన్నుచూచి వద్దకు రమ్మని పిల్చి వీపు తట్టుచు ఆశువుగా ఒక పద్యం చదివినారు. ఆసీసపద్యములోని ఒక పాదం మాత్ర మిందుదహరించుచున్నాను.

‘‘ఇటుకరాళ్ళనుగూడ కిటతకయనినృత్తమాడించు నేర్పునీయందుగలదు’’

అట్టి ప్రతిభ నాకానాడు గూర్చిన ఆనాటి బాలనర్తకీమణులే నేటి ప్రఖ్యాత యింటర్ నేషనల్ ఫేం నందిన కేరళసిస్టర్సు అనెడి విమల కమల లీలలు. అట్లే అనేక సదస్యములలో పండిత మహాశయుల సదభిప్రాయాములను, యోగ్యతా పత్రములను మామండలీ కళాకన్యారత్నము స్వీకరించినది. శ్రీ ఉప్పలూరు గణపతి శాస్త్రిగారు, శ్రీయుత ఉమామహేశ్వర పండితులుగారు మా చిరంజీవుల నెన్నియో మార్లు ప్రశంసించి ఆశీర్వదించి యున్నారు.

మా విద్యార్థినీ బృందము, గతయుద్ధ సహాయ నిధికై స్థానిక ప్రదర్శనాలేగాక గద్వాల సంస్థానం మొదలు మంతెన ధర్మపురి వేములవాడ వరకు పర్యటించి కొంత నిధి సేకరించి కృతకృత్యులైనారు.

ఈవిధముగ జయజయధ్వనులతో జైహింద్ నృత్యమండలివారు 1946 వ సంవత్సరము వరకు అంబరవీధిలో అంతులేని ఆనంద తాండవ మాడినారు.

పత్రకాల చక్రం :

<<నహిభవతి యన్నభావ్యం భవతి చ భావ్యం
వినాపియత్నేన కరతలగతమపి నశ్యతి
యస్యహి భవితవ్యతా నాస్తి''

అని మాగురువుగారు అటుండేవారు. కాలచక్రం మారేసరికి కంగారుపడుట సహజమే. కానున్నది కాకమానదని ధైర్యం తెచ్చుకొంటు ఆదాయం తగ్గుచుండే కొద్ది అనుమానాలు ప్రబలుచుండును. అవి అరికట్టు కొనుచుయెట్లో కాలక్షేపణచేయుచుండ, రాజకీయ పరిస్థితులలో తారుమారైనందున తాళలేక శికింద్రాబాద్ హైద్రాబాదులకు జైహింద్ అని చేతిలో ప్రాణాలు పెట్టుకొని బెల్లాబెదరై పలాయనం చిత్తగించాను. ఎట్లోదైవకృపచే విజయవాడ చేరుకొన్న వారిలో నేనొకడను. కాంగ్రెసుపార్టివారి కడుపుచలవన కాలక్షేపణ చేయుచుండ ఒకనాడొక పొట్లంకట్టిన చిత్తు కాకితపు ముక్కలు ఎదుటనగుపించినవి. అప్పుడే తిని పారవేసిన జిడ్డు మరకలతో నిండిన జిలేబి పొట్లంపేలికలు, శిధిలమై పోయిన అచ్చు కాగితపు పేలిక పై నిట్లున్నది.

<<సింహపురి చిత్రవిచిత్ర కళల
కాటపట్టువు ప్రోత్సాహమది హూళక్కి
గాని. అర్థిక జనులకు గల్పతరువు.
తెలివిలేనట్టి నడుడందు నిలువలేడు.''

అనియుండు పద్యం పలుమారు చదువుకొన్నాను. మరి నాల్గు పద్యములుండినవి గాని అస్పష్టముగా నుండినవి. అకాగితం టైటిల్ పేరు సింహపురి గంభీరం అని యున్నది. ఆపద్యాలు నన్నాకర్షించి నెల్లూరునకు పయనము గావించినవి.

సంక్షిప్తి :

ఎలాగైతేనేమి, 1947 జూన్ 15 తేది నాటికి సింహపురి వాస్తవ్యుడనైతిని. మిసెస్ మాధ్యూస్‌గారు నన్ను శికింద్రాబాదులో గుర్తించినవారు గాన చాలవరకు చేయూత నొసగినారు. తర్వాత టి. వి. యస్. పంతులుగారు అమె మాటపైన వారి మనుమరాలికి నాట్యము నేర్పించిరి. ఈ భరత నాట్యకళంటె మండిపడి అసహ్యించుకొని అధిక్షేపణచేసే యీ పురమందు మా కళాకన్నియ కాపురంచేయ లేదేమోనని అడుగడుగునకు సందేహించుచు కాలక్షేపము చేసితిని. కేవల సనాతన ధర్మపరాయణులగు వారి దృష్టిలో మా కళాకన్నియ దేవదాసివోలె అగుపించుచు, నవ్యమార్గాన్వేషులగు కళాప్రియులకు కళోద్ధారులకు వైదిక కన్నెవలె నగుపించుచు, ముముక్షులకు ముక్తికాంతయగుచు ఆశ్రయించిన వారికి అన్నపూర్ణేశ్వరి స్వరూపధారిణియగుచుండునని మా నమ్మకము. ఆ నమ్మకమే నన్ను కాపాడినది. తర్వాత పదిదినములలో శిఖరంవారివీధిలో చి॥ రాజమన్నారుగారి మేనకోడలగు చిరంజీవి మనోహరి అనుకన్యకు శిక్షణనొసగి ఆమె చే ప్రదర్శన మిప్పించుటలో పురప్రముఖుల ఆదరాభిమానముల నందగలిగితిని. వెంట వెంట యిరువదిమంది బాలికలు శిక్షణకై నెలలోపల చేరగల్గిరి. అందులో శోభారాణి, ఉషారాణి, శకుంతల, యశోద, లక్ష్మి, నందిని, సురేఖ మొదలగు బాలికలు చక్కగ

శిక్షితులై అనేక ప్రదర్శనములలో పాల్గొని అమాత్యశేఖరులచే ప్రశంసింపబడిరి. కొంత వరకు పురములోని అబాల గోపాలమునకు నాట్యకళమీద అభిమానముదయించి చైతన్యముకలిగెను. ఆదాయమునకు తోడు పురప్రముఖులు, సంపన్నగృహస్థులు, పెద్ద పెద్ద ఉద్యోగస్థులు అడ్వకేట్లు చేయూత నొసగుటలో ధైర్యము చిక్కినందున మాకళా కన్నియ దినదిన ప్రవర్ధమాన యగుచుండెను. బెజవాడనుండి కె. వి. చౌదరిగారను వారుయిక్కడకువచ్చి ప్రత్యేకముగా తమ బిడ్డ శిక్షణకై పిల్చుకొని వెళ్లినారు. ఆనాడు అచ్చట నేర్చుకొనిన బాలికయే యీనాటి ప్రఖ్యాత సినీ తార "కళాభూషణ బిరుదాంకితురాలగు సౌభాగ్యవతియగు సావిత్రి గణేశ్. ప్రస్తుతము విజయవాడ సిస్టర్సు పేరు ప్రఖ్యాతులందరికిని విదితమే ఆ సోదరమణులు సౌ॥ రాజ్యలక్ష్మి సుశీల అనువారలు మా మండలిలో సుశిక్షితులైనందుకున్ను విశేష గౌరవ కీర్తు లార్జించినందుకున్ను నేవంతయో గర్వింపదగియున్నది. కస్తూరిదేవి స్కూలు సహాయార్థము కేరళ సిస్టర్సు నాట్యము ఈయూరిలో జరిపించిరి. అప్పుడు ఆబాలికలు గురుభక్తి చూపుచున్నారో యనునట్లు రంగస్థలముపైన ప్రేక్షకుల యెదుట నాకు ఘనసన్మానముతో పుష్ప మాలాలంకరణజేసిరి. ఆసన్నివేశము చూచిన పౌరులకు నాటినుంచి నాపై మరి కొంత అభిమానముగల్గెను. మండలిలో విద్యార్థినుల సంఖ్యగూడ పెరుగుదల చూపించెను. కేవలము బాలికలేగాక బాలురు గూడ మామండలిలో సుశిక్షితులైరి. అట్టి వారిలో శ్రీయుత యస్. వి. టోంపెగారు. బి. ఏ. బి. టి. వీరు పురుష పాత్రకంటె స్త్రీ పాత్రధరించి అభినయించుటలో అందె వేసినచేయి. ఇది మా కళా కన్నియ ఆశీస్సు వారి ప్రత్యేక జిప్సీనృత్యము అబాల గోపాలమునకు విదితమే. ఇట్లే మరికొందరు పురుష శిష్యులలో చక్కగ శిక్షితులై నివురుగప్పిన నిప్పువోలె నున్నారు. సౌభాగ్యవతులు నిర్మల, భవాని, ఉషారాణి, శోభారాణి, యశోదా, వెంకటలక్ష్మి-భారతి మొదలగు విద్యావతులెందరో విద్యయందుత్తీర్ణులై పేరుప్రతిష్ఠలు నార్జించి సింహపురి కళకు వన్నెగూర్చియున్నారు. నేటివరకు మామండలిలో యీ పదునారు సంవత్సరములకుగాను నేర్చుకొనిన విద్యార్థులసంఖ్య 736 మంది. మిగత కొలవసంఖ్య సహస్రశబ్దము పూర్తిఅగువరకు పెద్దలాశీర్వాదము గావలెను.

పెద్ద పెద్ద బహిరంగసభలలోను, తిరునాళ్లలోను వైవాహికాదులలోను, నిధి సహాయ సేకరణాదులలోను, పోటీలలోను అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్సులోను కల్చరల్ అసోసియేషన్సులోను, యిది అది అననేల అన్నిటిలోను మా మండలి బాలికలు అనేక చిత్రవిచిత్ర ప్రదర్శనాలొసంగి మహా మంత్రులచే సహితము సువర్ణ రజితాదిపతకములంది ప్రజాభిమాన పాత్రులైనారు. గౌరవనీయులగు మంత్రివర్యులు శ్రీ సంజీవరెడ్డిగారు, శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు, శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు, శ్రీ శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డిగారు మహనీయులు ప్రత్యక్షముగా, స్వయముగా మావిద్యార్థినుల ప్రదర్శనలు తిలకించి

పులకించి, హర్షించి ఆశీర్వదించి, బహూక రించియున్నారు. మద్రాసు, రాయవేలూరు మొదలగు తమిళనాడులోగూడ అనేక ప్రద ర్శనాలిడి నెల్లూరుకళకు గౌరవమునిల్పి నారు. పురప్రముఖుల ఆదరాభిమానము లతో మా మండలి కళాకన్య వైభవోపేత ముగ రజతోత్సవము జరిపించుకొనినది. ఈ సమాజమిట్లు ప్రజాభిమానము నార్జించి శుక్లపక్ష చంద్రునివోలె దినదినాభి వృద్ధి యగుచున్నదనుటకు, ప్రబలకారణము కేవలకళోపాసకులు కళోద్ధారకులు, కళా పోషకులు, కళాభిమానులు గల సింహపురి క్రీగంటి ప్రసారమే.

సర్వేజనా; సుఖినోభవంతు.

ఇందలి చిత్రము కె. భవాని పాముడాన్సు.

## రుద్రకవి: జనార్ధనాష్టకము (శృంగారము)

సిరులుమించిన పసిమిబంగరు జిలుఁగుదుప్పటి జారఁగా
చరణపద్మముమీఁద దేహము చంద్రకాంతులుఁ దేరఁగా
మురువుచూపగ వచ్చినాఁడవో మోహనాకృతి మీరఁగా
గరుడవాహన దనుజమర్ధన కందుకూరి జనార్థనా. 1

అనపెట్టిన రాకపోతివి అయ్యెఁబో అటుమొన్ననూ
పూనిపిలువగ వినకపోతివి పొంచిపోవుచు మొన్ననూ
నేనుజూడగ గడచిపోతివి నీటుచేసుక నిన్ననూ
కానిలేరా దనుజమర్దన కంమకూరి జనార్దనా. 2

నిన్నరాతిరి చవికెలోపల నీవుచెలి కూడుంటిరా
ఉన్నమార్గములన్నియును నేనొకతెచేతను వింటిరా
విన్నమాత్రమెకాదుకా నినువీధిలోఁ గనుగొంటిరా
కన్నులారగ దనుజమర్దన కందుకూరి జనార్దనా. 3

దబ్బులన్నియుఁ దెలుసుకొంటిని తప్పుబాసలు సేయకా
మబ్బుదేరెడి కన్నుగవతో మాటిమాటికి డాయకా
ఉబ్బుచేసుక తత్తరంబున నొడలిపై జేయివేయకా
గబ్బితనమున దనుజమర్ధన కందుకూరి జనార్దనా. 4

బిత్తరంబున మొలకరెంపులు పెదవినెవ్వతె యుంచెరా
గుత్తమైన మిటారిగుబ్బల గుమ్మయెవ్వతె మెచ్చెరా

చిత్తగించక జీరువారను జెక్కిలెవ్వతె నొక్కెరా
కత్తిగోరుల దనుజమర్దన కందుకూరి జనార్దనా 5

జంటనేత్రము లంటిచూచితె జాజిపూవులు పూసెరా
మింటిగ్రోవను జూచుచుండగ మేఘవర్ణముగప్పెరా
కంటిలో నొకవండువెన్నెల కాయుచున్నది యేమిరా
కంటిలేరా దనుజమర్దన కందుకూరి జనార్దనా 6

అందగాయక కూడియుంటిమి అదెపోయెను నాటికి
ఇంచిమండిపడంగ నేటికి గదలుమెప్పటి చోటికి
ఉండరా నీమాటలకునే నోర్వజాలను మాటికి
గండిదొంగవు దనుజమర్దన కందుకూరి జనార్దనా 7

అలుకలన్నియుదీఱ నిపుడా అందకెప్పుడు వస్తివి
పిలిచి నవరత్నాలసొమ్ములు ప్రేమతో నెపుడిస్తివి
వలచి వలపించియును హరియి వదలకెప్పుడు మెస్తివి
కలసివిడక దనుజమర్దన కందుకూరి జనార్దనా 8

జనార్దన స్తోత్రము

అనాథ నాథ నాగతల్ప యజ్ఞ కల్పమానసిరం
జనార్తి నాశనాది శాపతీవృధార్థశా
సనాతనాతనాయ నాది సత్యకందుకూరిశ్రీ
జనార్దనాజనార్దన నసాహసారిమర్దనా

పరగు భూతములెల్ల పశువులు దాఁ బతిగావునఁ బశుపతి నా వెలుంగు
అను V 400.

రెండక్షరంబులు మృత్యువు మూఁడక్షరంబులు
బ్రహ్మం బవియెయ్యవి యంటేని వినుము
మమ యనునవియును నమమ యనునవియును నై యుండును
అశ్వ I 20

తే క్షమయు సత్యంబుఁ గృపయు శౌచమును గుదుల
వలనిభక్తియు నాయువుఁబొలుపునిచ్చు
నలుక బొంకు క్రూరత శుచితావగమము
గుణవిరోధ మాయువుఁ గడుఁ గుందఁజేయు
అను V. 30.

# 54

# సంగీతము-నెల్లూరు మండలము

శ్రీమాన్ మాడభూషి గోపాలాచారి, బి. ఏ. బి. యల్.

అడ్వొకేటు - నెల్లూరు.

"O Music
In your depths we deposit our hearts and souls, thou hast taught us to see with our ears, and hear with our hearts"

K. Gibrand.

శ్లో॥ శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి
గానరసంఫణీ॥

ప్రణవస్వరూపంబగునదియు, నాదాత్మకమై భక్తి ముక్తి పక్తి ప్రదంబగునట్టిదీ సంగీతము.

"బ్రహ్మగ్రంథి" యను చక్రము మోగాధారములారింటిలో మొదటిదైన, మూలాధారస్థానమునందుగల పమనాలుగు దళములతో నొప్పుచుండుచక్రము. ఇందు "న" కారమను ప్రాణవాయువు "ద" కారమను అగ్నికలయికచే ప్రేరేపింపబడి, నాభి, హృదయ, కంఠమూలముగ బయలు వచ్చుటచే నాదముపుట్టుచున్నది. ఈనాదము చేతనే పద వర్ణ కావ్య నాటకాలంకారశాస్త్రములును, స్వర వర్ణ మూర్ఛనాదులు పుట్టుచున్నవి.

శ్లో॥ గీతం వాద్యం తథానృత్యం త్రయం
సంగీతముచ్యతే॥ (సం॥ రత్నాకరము)

గీతము, వాద్యము, నృత్యము ఈ మూటికలయికచే సంగీతము వేర్పడుచున్నది

అన్యచ్చ :-

శ్లో॥ గీత వాద్యోభయం యత్ర సంగీత
మితికేచన
రాగ స్వరశ్చ తాళశ్చ త్రిభి
స్సంగీతముచ్యతే॥

ఈ మతప్రకారము, గీతవాద్యముల రెంటికలయికచే రాగ, స్వర, తాళములన బడు మూటికలయికచే సంగీతమేర్పడుచున్న దని తెలియవచ్చుచున్నది. కాని ఇదిసర్వత్ర వాగ్గేయకారకుల ఆమోదము పొందలేదు.

మానవునిహృదయంబున, సంగీతము ఏదోఒకరూపంబున వేర్పడుచున్నది. తన మనస్సులో, కూనరాగములు తీయుచు, ఆనందపరవశులుగాని మానవులు అరుదు. స్నానముచేయువేళగాని,ఏకాంతముననుండు సమయంబునగాని, తనకిష్టమగురాగములో బుద్ధిచాతుర్యంబునుబట్టి పాడుచుండును. బహుశః ఈ కూనిరాగములే, దేశ కాలపరి స్థితులనుబట్టి మానవుని బుద్ధికుశలతచే, క్రమేపి మార్పులుచెందుచు పలువురచే ఉన్నతస్థితికి తేబడినవి.

వవరసభరితంబై, సప్తస్వరములతో, డెబ్బదిరెండు మేళకర్తలతో శోభిల్లునది కర్ణాటకసంగీతము. "కర్ణే అటతీతి కర్ణాట" అను వ్యుత్పత్తిచే, చెవులకింపగు మధురమైన గానము కర్ణాటకసంగీతము.

సంగీత మాహాత్మ్యము:-

సంగీతము సామవేదమునుండి చతుర్ముఖుడగు బ్రహ్మచే గ్రహింపబడి, లోకోపకారార్థమై భరతమతంగాది వాగ్గేయకారకులచే వెల్లడి చేయబడినది.

శ్లో॥ సామవేదా దిదంగీతం సంజగ్రాహ
పితామహః॥ (సం॥ రత్నా)

శబ్దస్వరూపమైన కావ్యములను, సంగీతమును, భగవంతుని స్వరూపాంశమని తెలియవచ్చుచున్నది. భగవంతునికి గానమనిన బాలప్రీతి.

శ్లో॥ నాహం వసామి వైకుంఠే నయోగి
హృదయే రవౌ।
మద్భక్తా యత్రగాయంతి తత్రతిష్ఠామి
నారద॥

నేను వైకుంఠంబునందు వసింపలేను. యోగిహృదయంబునగాని, సూర్యమండలంబందుగాని వసింపలేను. నాభక్తులెచ్చట గానముచేయుదురో అచ్చటనే నేనుందును" అను ఈ భగవద్వాక్యంబుచే, గానము యొక్క సర్వోత్కృష్టత తెలియనగును.

నాదము :

ప్రాణానలసంయోగముచే గ్రంథిః స్థితంబగు నాదము త్రివిధములు. మంద్ర, మధ్య తారమని చెప్పబడుచున్నది.

శ్లో॥ వ్యవహారే త్వసౌ త్రేధా హృది
మంద్రోభిధీయతే।
కంఠేమధ్యో మూర్ధ్నితారో ద్విగుణ
శ్చోత్తరోత్తరః॥

నాదము హృదయమందు మంద్రమని, కంఠమందు మధ్యమని, శిరస్సునందు తారమని. ఈనాదమే హృదయమందు ఒక పాలైనచో, కంఠమందు రెండుపాళ్ళుగను, శిరమందు నాలుగుపాళ్ళుగనుండును. ఈ నాదమే 22 భేదములనుపొంది శ్రుతులగుచున్నవి. శ్రుతులు హృదయమునుండి యూర్ధ్వముగాగల 22 నాడులవలన పలికింపబడుచున్నవి. "శ్రూయంతే ఇతిశ్రుతయః" అనుటచే శ్రుతియన, వినదగినదనియర్థము.

శ్లో॥ శ్రవణార్థస్య ధాతోః క్తిః ప్రత్యయేచ
సుసంశ్రితే।
శ్రుతిశబ్దః ప్రసాధ్యోఽయం శబ్దజ్ఞైః
కర్మసాధనైః॥ (మతంగ)

శ్లో॥ శ్రవణేంద్రియగ్రాహ్యత్వా ద్ధ్వనిరేవ
శ్రుతిర్భవేత్॥ (విశ్వావసు)

చెవులకువిన దగినదియు, శ్రోత్రేంద్రియంబునకు గ్రాహ్యంబగునదియు శ్రుతియనబడును. ఇట్టిశ్రుతులు ద్వావింశతి సంఖ్యాకములై "తీవ్ర, కుముద్వతి" మొదలగు 22 పేర్లచే వెలయుచున్నవి.

"స్వతో రంజయతి శ్రోతృచిత్తం సస్వరముచ్యతే" శ్రుతియనంతరము కలిగెడి స్నిగ్ధమై, అనురణనాత్మకమై, స్వతఃరంజనము కలదియై, శ్రోతల చిత్తమునకు హాయిగొల్పునది స్వరము. స, రి, గ, మ, ప, ధ, ని యనునవి సప్తస్వరములు.

పశుపక్ష్యాదులు, చేయు శబ్దములు చెవులకు ఇంపైన నాదములతో కూడియున్న వని మనపూర్వీకులు తెలిసికొనిరి. కావుననే, సంగీతములోని స్వరములు, కొన్ని మృగ పక్ష్యాదులుచేయు శబ్దములను పోలియుండు నని నిర్ణయించిరి.

శ్లో॥ షడ్జం మయూరోవదతి, గావో ఋషభ
భాషిణః।
అజావికంతు గాంధారం క్రౌంచః
క్వణతిమధ్యమం॥
పుష్పసాధారణేకాలే పికఃకూజతి
పంచమమ్।
ధైవతంహేషతేవాజీ నిషాదం
బృంహతీగజః॥ (ఇత్యమరః)

నెమలికూత షడ్జమనియు, వృషభము వేయుఱంకె ఋషభమనియు, మేకఅరపు గాంధారమనియు క్రౌంచపక్షిధ్వని మధ్యమ మనియు, కోకిలస్వరము పంచమమనియు, గుఱ్ఱపుసకిలింపు ధైవతమనియు, ఏనుగు ఘీంకారము నిషాదమనియు రూపనిర్ణ యము చేసిరి. వీనినే శుద్ధస్వరములందురు. వీటికి శ్రుతిభేదముచే వికృతిస్వరము లేర్పడు చున్నవి; అని వివిధ వాగ్గేయకారకులు చెప్పి యున్నారు. పైన పేర్కొనబడిన సప్తస్వర ములకు, జాతి, వంశ అధిదేవత, నక్షత్ర, వార, ఛందస్సు, వర్ణ, భోజన, వస్త్ర, పుష్ప, వాహన, భార్య, రస, సాదృశ్యాది 19 లక్షణములు, శాస్త్రము లో చెప్పి యున్నారు.

ఇట్లు సప్తస్వరములతో కూడిన సంగీ తము, మార్గము, దేశ్యమని రెండువిధములు. మార్గసంగీతమన

శ్లో॥ అనాది సంప్రదాయంయ ద్గంధర్వై
స్సంప్రయుజ్యతే।
నియతం శ్రేయసోహేతు స్తద్గాంధర్వం
ప్రచక్షతే॥ (స్వరమేళకళానిధి)

అనాది సంప్రదాయముతో కూడినదై, గంధర్వులచే, దేవతలచే అభ్యసింపబడి. ఇతరులకు చెప్పబడినది ‚‚మార్గము''

శ్లో తత్ర దేశస్థయారీత్యా యత్స్యా
ల్లోకానురంజనం।
దేశేదేశేతు సంగీతం తద్దేశీ త్యభిధీయతే
(సం॥ దర్పణము.)

ఆయాదేశములలో (Regions) జనరంజకముగా చేయబడు గానము ‚‚దేశ్యము''

రాగము :-

స్వరముల ఆరోహణ, అవరోహణము లను మూర్ఛనలందురు. ఇట్టిమూర్ఛనలు ఇరువదియొక్కటిగలవు. స్వరములను, లెక్కకుసరిగా ప్రస్తరించుటయే స్వరప్రస్తార మనబడును. అట్టి ప్రస్తారమువలననే, వర్ణ ములనను సకించి చేర్చు స్వరములకు ‚‚అలంకార''ములనిపేరు. అలంకారములు ఎనిమిదియని చతుర్దండిప్రకాశికలో చెప్ప బడినది.

స్వరములయొక్కకదలింపు 'గమక' మనబడును. అట్టిగమకము శ్రోతలకు ఆహ్లాదమునిచ్చునదై యుండవలయును. గమకములు దశవిధములని, పంచదశ విధములని, శాస్త్రములో చెప్పబడియున్నవి.

శ్లో॥ యోసౌ ధ్వనివిశేషస్తు స్వరవర్ణ
విభూషితః।
రంజకో జనచిత్తానాం సరాగః
కథితోబుధైః॥

స్వర వర్ణముల చే నలంకరింపబడి శ్రోతల మనస్సును రంజింపజేయగల్గునట్టి ధ్వని విశేషము రాగము. రాగము దశవిధ లక్షణములు గల్గియుండును. రాగములలో మార్గ దేశియని రెండువిధములు. మార్గరాగములు స్వర్గములలో నున్నవని అచ్చట గానముచేయబడుచున్నదని, శాస్త్రము. దేశ్య రాగములు 4 విధములు.

1.) రాగాంగము :

జన్యరాగములకు ఆధారమైయుండు సంపూర్ణరాగములు. ప్రస్తుతము వాడుకలో నుండు 72 మేళకర్తరాగములు అవియే.

2.) ఉపాంగము :

రాగాంగమనబడు 72 మేళకర్తరాగములలో జనించునని, జన్యరాగములు.

3.) భాషాంగము :

ఒకరాగాంగములో జనించి మరియొక రాగాంగ వికృతిస్వరములలో యొకటియో, రెండో స్వరముల స్వీకరించి, వెలయునది.

4.) క్రియాంగ :

శ్లో। కరణోత్సాహసంయుక్తం క్రియాంగం
తేనహేతునా॥ (సం॥ దర్పణము)

ఇంద్రియములకు ఉత్సాహము గల్గించుటకు, యుద్ధమునందు వీరోచితసన్నివేశములందు సైనికుల నుత్సాహపరచుటకును పవిత్ర కార్యసమయములందు నుపయోగింపబడురాగము.

రాగములలో, ఘన, నయ, దేశ్యము లని 3 విధములు. సప్తస్వరములుగల్గినవి. "సంపూర్ణమని" 'ఆరుస్వరములు గల్గినవి' 'షాడవమని,' ఐదుస్వరములుకలవి 'ఔడవమని,' వక్రఆరోహణావరోహణము నొందినట్టి 'వక్రమను' పేర్లతో వెలయుచున్నవి.

రాగములు రసయుక్తములై యున్నవి. ఒక్కొక్క రాగమున, నవరసములలో నొక రసము ప్రధానముగా గల్గియుండును. రాగముయొక్క రసప్రాధాన్యము పురస్కరించుకొని, స్త్రీ, పుం నపుంసక రాగములుగా విభజింపబడియున్నవి.

శ్లో॥ రౌద్రేఽఅద్భుత స్తథావీరే పుంరాగైః
వరిగీయతే ।
శృంగార హాస్యకరుణ స్త్రీ రాగైశ్చ
ప్రగీయతే
భయానకేచ భీభత్సే శాంతిగాయ
న్నపుంసకౌ ॥ (సం॥ మకరంద.)

రౌద్రవీర అద్భుత రసప్రధానమైనవి పురుషరాగములనియు శృంగార, హాస్య, కరుణరసములు కల్గినవి స్త్రీ రాగములనియు, భయానక, బీభత్స, శాంతి రసపూరితంబులైనవి నపుంసక రాగములని నిర్ణయించినారు. రాగములు గానముచేయుటకు సమయములు నిర్ణయించియున్నారు.

రాగాలాపన :

రాగాలాపనకు "అలప్తి" ఆలాప్ అని పేరు. రాగాలాపన అక్షిప్తిక, రాగవర్ధిని, రాగవివర్ధిని, విదారి యను నాలుగు అంశములుకలసియుండును. భరతాచార్యుల మత ప్రకారము ఇవికాక, 'మకరిణి' అను పద్ధతి యున్నది.

తానం :

పూర్వము, దక్షిణాది రాష్ట్రములలో వాడుచుండిన 'తెన్నా' అను పద్ధతి ననుస

రించియుండును. దీనికిమూలము సప్తస్వరములు. 'అనంత, అనంత' అని పాడుటయే తానమని కొందరి అభిప్రాయము. తానము 21 విధములుగా పాడవచ్చును.

ఇవిగాక, తాయము, గీతములు, తిల్లాన, అనునవి సంగీతములోని కొన్ని యంశములు.

తాళము :-

శ్లో॥ త కారశ్శంకరః ప్రోక్తో ల కార
శ్శక్తిరుచ్యతే
శివశక్తి సమాయోగాత్తాళ ఇత్యభి
ధీయతే॥

తాళమను శబ్దములో "త"కారము శంకరుడు "ల"కారము శక్తి. ఈ శివశక్తి సమాగమముచే తాళము కల్గుచున్నది. ఇయ్యది హస్తద్వయ సంయోగ వియోగముచే, దశప్రాణంబులచే కూడుకొన్నది. నూరు తామరరేకులు ఒకదానిపై నొకటినుంచి, సూదితో పొడిచినపుడు అందు ఒకతామరరేకు తెగునంత కాలము 'క్షణ'మనబడును. 8 క్షణములు 1 లవము 8 లవములు 1 కాష్ఠ. 8 కాష్ఠలు 1 నిమిషము, 8 నిమిషములు 1 కళ. కళ అను కాలమానము సంగీత లయకు మూలము. తాళమునకు అనుద్రుతము, ద్రుతము మొదలగు షడంగములు కలవు. తాళములు ధ్రువ, మఠ్య, రూపక, ఝంప, త్రిపుట, అట, ఏక తాళములని వివిధములు. వీటి కన్నిటికి, పుట్టినదినము, నక్షత్రము, ఛందస్సు, అధిదేవత మొదలగునవి కలవు. ఒక్కొక్క తాళమునకు 5 జాతులుకలవు. కావున జాతి భేదముచే మొత్తము 7 × 5 = 35 తాళములు ఏర్పడుచున్నవి. సంగీతరత్నాకరము రీత్యా 120 తాళములన్నవని ఏర్పడుచున్నవి.

వాగ్గేయకారకుడు :-

సుశబ్ద, అపశబ్దముల నెఱింగి వ్యాకరణ పాండిత్యము, నిఘంటు ఛందోజ్ఞానము, శృంగారాది నవరసముల నెఱిగినవాడును, భాషాది గీతవాద్యనృత్య చాతుర్యముకలవాడును, ప్రబంధ గీతకీర్తనాదుల రచింప శక్తికలిగినవాడును, చతుర్విధ రాగ వర్ధనుల నెఱిగి గానముచేయ కలిగినవాడును, వాగ్గేయకారకుడన బడును.

గాయక లక్షణములు :-

మార్గ, దేశీయములనబడు సంగీతమును గుర్తెరింగి గానముచేయువాడు గంధర్వుడు. అనగా ఉత్తమ గాయకుడనిపేరు. గాయకులలో ఉత్తముడు, మధ్యముడు, అధముడని 3 విధముల గాయకులున్నారు. సంగీత శాస్త్రమును సాంగోపాంగముగ నెఱింగి మంచి శ్రావ్యమైన కంఠముకల్గి, జనానురంజకముగ, దోషరహితముగా, గానము చేయువాడు ఉత్తముడు. గాయక గుణములు లేక, దోషములు లేక, గానముచేయువాడు మధ్యముడు, దోషయుక్తుడైన గాయకుడు అధముడు. వీరుగాక. అన్యులకు సంగీతము నేర్పువాడు "శిక్షకు"డని యు ఇతరుల ఠంగిని అనుసరించి, వారి పంథాపద్ధతుల వలనే (Imitation) గానముచేయువాడు "అనుకారు"డనియు, రసోత్పత్తిగల్గ గానము చేయువాడు "రసజ్ఞుడు" అనియు, వినువారి మనస్సురంజింప జేయువాడు "రంజకుడు" అనియు. మిక్కిలి అశ్చర్యాతి శయముగ గానముచేయువాడు

(Originality & remarkability) ‹‹భావుకుడని’’ 5 విధములైన గాయకులున్నారు. వీరుగాక, ఒకడుగా గానము చేయువాడు ‹‹ఏకలుడని’’ మఱియొకరితో కలసి గానముచేయువాడు ‹‹యమళుడ’’నియు అనేకులతో కలసి గానము చేయువాడు ‹‹బృందకుడని’’ పిలువబడుచున్నారు.

శ్లో॥ రూపయౌవన శాలిన్యో గాయిన్యో
గాత్రవాన్మతా।
మాధుర్య మర్యధ్వన యశ్చతురా
శ్చతుర ప్రియా॥

మంచి రూపయౌవనముగల్గి, గాయకాగ్రణులవలె, గానముచేయ సమర్ధురాలై, శ్రావ్యమైన, మృదుమధురకంఠము (శారీరము Sweet & melodious voice) కలిగి, చతురప్రాగల్భ్యము, చతురక్రియల యందాశక్తిగలవారు ‹‹గాయనులు’’ అని పిలువబడుచున్నారు.

గాయకులు గానముచేయవలసిన పద్ధతులు చక్కగా శాస్త్రమందు వివరింవబడియున్నవి. గాయకుడు గానము చేయునప్పుడు కలుగు దోషములు 25 అని చెప్పబడినవి. అవి యేవనగా :

1. దంతములను కఱచుకొని గానము చేయువాడు, సందష్టుడు. 2. విరసముగ అధికధ్వనిగల్గ చేయువాడు, ఉద్ఘుష్టుడు. 3. ఉష్, ఉష్, అని ఛీత్కారముతో పాడువాడు, సూత్కారి. 4. భయముతో గానముచేయువాడు, భీతుడు. 5. సందేహముతో గానముచేయువాడు, శంకితుడు. 6. శరీరము కంపించుచు పాడువాడు కంపితుడు 7. భయంకరముగ నోరుతెఱచి పాడువాడు, కరాళుడు. 8. హెచ్చుతక్కువలైన స్వరములతో పాడువాడు వికలుడు. 9. కాకమువలె క్రూరధ్వని చేయువాడు కాకి. 10. తాళమువదలి గానము చేయువాడు, వితాళి. 11. ఒంటెవలె మెడయెత్తుకొని గానము చేయువాడు, కరభుడు. 12. మేకవలె నెమఱు వేయుచు పాడువాడు, ఉద్భటుడు. 13. గొంతుచుట్టు నరములు ఉబ్బునట్లు గానముచేయువాడు, ఝుంబకుడు. 14. బుగ్గలుబ్బునట్లుగా పాడువాడు తుంబకుడు. 15. గొంతును వక్రుటుగా చేసికొని పాడువాడు, వక్రుడు. 16. అవయవచేష్టలతో గానముచేయువాడు, ప్రసారుడు. 17. కళ్ళుమూసికొని పాడువాడు. వినిమీలకుడు. 18. రసహీనముగా గానముచేయువాడు, విరసుడు. 19. స్వరశుద్ధి లేని పాటగాడు, అపస్వరుడు. 20. మంచి యుచ్ఛారణలేక గద్గదత్వముతో గానము చేయువాడు అవ్యక్తుడు. 21. త్రిస్థానముల వదలి స్వేచ్ఛగా పాడువాడు. స్థానభ్రష్టుడు. 22. గానపద్ధతుల నెరుగక, ఇచ్చవచ్చినరీతి పాడువాడు అవ్యవస్థితుడు. 23. రాగముల నెరుగక, ఒకదానితో నొకటి కలిపి పాడువాడు మిశ్రకుడు. 24. గమకములు తెలియక గానముచేయువాడు, అనవదానుడు 25. ముక్కుతో గానము చేయువాడు. అనునాసికుడు.

సంగీతచరిత్ర :

మనదేశములో శాస్త్రముల చరిత్రాంశము ఎంత అస్పష్టముగా నున్నదో, ఆరీతిగనే, సంగీత శాస్త్రమునకును, సరియైన చారిత్రాత్మక, యాధారములు లేకున్నవి. సంగీతముయొక్క అవతరణ, వేదములు,

ఆరణ్యకములు మొదలగు ప్రాచీనగ్రంథ ములనుండి యూహింపవలసినదే గాని, రూఢిగ నిర్ణయించుటకు తగిన యాధార ములు చాలతక్కువ.

చతుర్ముఖుడగు బ్రహ్మ, లోకమునకు ఉపయోగార్థమై మతంగ భరతాది మును లకు, గాంధర్వవేదము తెలిపినట్లు ప్రతీతి. ఏదియెట్లున్నను, సామవేదము కాలమునాటికి సంగీతము ఉండినట్లు తెలియుచున్నది. సంగీతచరిత్రను స్థూలముగ 3 విధ ములుగ విభజింపవచ్చును. 1) అనాదినుండి భరతమతంగాది మునులకాలమువరకు. 2) మతంగాది మునులకాలమునుండి వేం కటమఖికాలమువరకు 3) ప్రస్తుతకాలము అనగా త్యాగరాజస్వామి ముందు తరువాత కాలము.

ఆదికాలమున, గానము ఒకే స్వరము లోన చేయుచుండిరి. ఋగ్వేదకాలములో బహుశః ఒకేస్వరమునందు, వేద గానము చేయుచుండిరి. దీనిని ''ఏకస్వరి'' ''ఆర్చిక'' గానమందురు. తర్వాత రెండు స్వరములలో గానము చేయుచుండిరి. దీనికి ''గాతిక'' యని యందురు. తదుపరి 3 స్వరములలో గానము చేయుచుండిరి. ఈ గానమునకే ''సామిక'' యనిపేరు. ఈ మూడుస్వరము లలో హెచ్చు శ్రుతిస్వరమునకు ఉదాత్త మనియు, తక్కువ స్వరమునకు అనుదాత్త మనియు, మధ్యస్వరమునకు ''స్వరిత'' మని పేర్లు. ఇందు స్వరితమనబడునదియే ఆధార స్వరము. సామగానము త్రిస్స్వరములో గానముచేయుటచే, దీనికి సామిక అనిపేరు వచ్చినదేమో;

ఐతరేయారణ్యకమున, వీణను గురించి, దానిని వాయించు పద్ధతినిగూర్చి, దానియాకారమును గురించి, ప్రస్తావింపబడి యున్నది. ఆకాలమునాటికి. వీణా, వేణు, మృదంగాది వాద్యములుండవచ్చును. వీణావాద్యము ఏర్పడుకాలమునాటికి, సం గీతశాస్త్రము, మంచిస్థితికి వచ్చియుండవల యును. శ్రుతిలయాది జ్ఞానములు పరిపూర్ణ ముగ గల్గియుండినగాని, వీణాగానము చేయుట దుర్లభము.

కాలికాపురాణమునందు, సంగీతము యొక్క ఉత్కృష్టత, వృక్షములపై సంగీత ప్రభావము తెలుపబడినది. సంగీతరసా స్వాదనముచే మొక్కలు, వృక్షములు బాగుగ వృద్ధిచెందుననియు, ఏసమయములో ఏరాగము గానముచేసిన, ఎట్టిఫలితము గల్గునో, ఆవిషయములన్నియు చెప్పబడి యున్నవి. మాళవ, లలిత, విభాస, భైరవ, కేదార, వరాళి, వసంత, దనాసి లేక ధనశ్రీ (ప్రస్తుతపు ధన్యాసి) రాగములు చాల ఉప యుక్తములని తెలుపబడినది. ఇటీవల, వృక్ష శాస్త్రవిజ్ఞానులు, పలుపు పరిశోధనలవలన వృక్షములు, సస్యములు, సంగీతము వినుట వలన, ద్విగుణీకృతముగ వృద్ధిచెందుచున్న వని కనుగొనబడినది.

రామాయణ కాలమునాటికి, సంగీ తము మంచి అభివృద్ధి నొందియుండెను. రావణుడు గొప్ప వైణికుడు, సంగీతజ్ఞాని. లవకుశులు వాల్మీకివిరచిత రామాయణ మును గానము చేసినట్లు మనకు తెలియును గదా. ఆకాలమునాటి రామభక్తుడు హనుమం తుడు ఖ్యాతిగడించిన గాయక శిఖామణి.

నాట్యశాస్త్రము :

భరతముని. బ్రహ్మమానసపుత్రుడనియు, బ్రహ్మచే సంగీత శాస్త్రము నుపదేశింపబడి. అప్సరస్త్రీలకు నాట్యశాస్త్రము నేర్పుమని యాదేశింపబడి, వారికొరకై "నాట్య" శాస్త్రమును రచించెను. భావ, రాగ, తాళములలో. మొదటియక్షరములను చేర్చిన "భరత" యని సిద్ధించుచున్నది. ఈనాట్య శాస్త్రము ప్రాచీనమైనదని కొందరి అభిప్రాయము. భరతముని రామాయణమునకు పూర్వముండెడివాడని ప్రతీతి. కాని కొందరు పాశ్చాత్య విమర్శకులు, ఈయన క్రీ. శ. మొదటి శతాబ్దివాడనియు, క్రీ. శ. నాల్గవ శతాబ్దివాడనియు నిర్ణయించిరి. కాని నెల్లూరువాస్తవ్యులగు శ్రీ యస్. యస్. కృష్ణమూర్తిగారి పరిశోధనాభిప్రాయము ప్రకారము భరతుడు, రామాయణాత్పూర్వము వాడని తెలియవచ్చుచున్నది. ఈ నాట్యశాస్త్రమున నాట్యమును గురించియు, సంగీతమును గురించియు వ్రాయబడియున్నది. మన నాటక్య నియమములకు ఇప్పటికి మూలగ్రంథము. ఇదిగాక, భరతుడు 'నాట్యసూత్ర' మను గ్రంథమును రచించినట్లు తెలియవచ్చుచున్నది.

నారద :

భరతముని తర్వాత ముఖ్యముగ పేర్కొనదగిన సంగీత శాస్త్రకారుడు నారద ముని. ఈయన బ్రహ్మపుత్రుడు త్రిలోక సంచారి, కలహప్రియుడగు నారద మహర్షియా కాదా అను ప్రశ్నయు సారాంశమింకను తేలలేదు. ఈయన 'సంగీతమకరంద' మను యుద్గ్రంథమును వ్రాసెను.

నారద మహర్షి గొప్పసంగీత వేత్తయనియు 'మహతి' యను వీణతోకూడ గానము చేయుననియు, ఈయన గాన సంప్రదాయమే ప్రస్తుతము వాడుకలోనుండు కర్నాటక సంగీత సాంప్రదాయమనియు తెలియవచ్చు చున్నది. ఈయన సంగీత మకరందము గాక 1) నారదశిక్ష 2) రాగనిరూపణము 3) నారసంహిత యను గ్రంధముల రచించెను. ఈయన రసప్రాధాన్యముల ననుసరించి రాగములను, స్త్రీ పుం నపుంసకములుగ విభజించెను. కొందరు పాశ్చాత్య విమర్శకులు నారదుడను గ్రంధకర్త క్రీ. శ. పదియవ శతాబ్దివాడని అభిప్రాయ పడుచున్నారు.

మతంగముని :

ఈమహర్షి అతి ప్రాచీనమైనవాడు. సంగీతమును గురించి, తన బృహద్దేశి యను గ్రంథమున విపులముగ వ్రాసియున్నాడు.

పంచతంత్రము :

క్రీ. శ. 570 లో విష్ణుశర్మచే రచించబడిన పంచతంత్రములో నొక చక్కటి కథయున్నది. దానివలన, పంచతంత్ర కాలమునాటికి సంగీతము పరిపూర్ణత నొందియుండెనని తెలియవచ్చుచున్నది. కథ సారాంశమేమన

ఒకానొక దినమున నొకగార్దభము ఆనందము కల్గించు రాత్రివేళ చక్కటి వెన్నెలలో తిరుగాడుచు సంగీతము గానము చేయ వలయునను అపేక్ష గల్గియుండ అచ్చటికి నక్కవచ్చెను. నక్కనుచూచి గార్దభము నక్కబావా అహ్లాదకరమైన ఈరాత్రిని చూచుచుండ నాకుగానము చేయవలయునని

ఆశగానున్నది యేరాగములో గానము చేయవలయునో చెప్పుమనెను. అందులకు ఆ టక్కరి నక్కబావ ఫక్కుననవ్వి నీవేమి గానముచేయుదేమి యని పరిహసింప గార్దభమిట్లనెను. ఏమీ నాకు గానముచేయుటకు తెలియదా? అటులైన వినుము. సంగీత శాస్త్రమునుగురించి చెప్పెదను. సంగీతము సప్తస్వరములు, మూడు గ్రామములు 21 మూర్ఛనలు, 49 మేళరాగములు, మూడు స్థాయిలు, నవరస భరితంబై 36 అలంకారములతో 40 వర్ణములతో నొప్పుచుండును. సంగీతమును ఆఱువిధములుగ గానముచేయవచ్చును. నక్కబావా పైవిధముగ గానము చేసిన 185 లక్షణములు గల్గిన సంగీతము శుద్ధముగ స్వచ్ఛముగ నుండును. ఈకథ మూలమున క్రీ॥ శ॥ 500 నాటికి సంగీత శాస్త్రము పరిణతి నొందియుండెనని తెలియుచున్నది.

సోమదేవుడు :

క్రీ॥ శ॥ 1131 నాటికి కళ్యాణి నగరము నేలుచుండినరాజగు సోమదేవుడు 1) అభిలషార్థ చింతామణి లేక మానసోల్లాసము 2) సంగీతరత్నావళి 3) రాగదర్పణము అను గ్రంథముల రచించెను

క్రీ॥ శ॥ 13 శతాబ్దిలో సారంగధరుడనువాడు సారంగధర పద్ధతి యను గ్రంథమును రంచించెను. లోచనకవికృతంబగు రాగతరంగిణి బహుశః ఈ శతాబ్దలోనిదే.

వీరితర్వాత ముఖ్యముగా నెన్నతగినవాడు కర్నూలుజిల్లాకు చెందిన అహోబల పండితుడు సంగీతపారిజాతమను గ్రంథమును రచించెను. హిందూస్థాని సంగీతమునకు మూలమనవచ్చును. ఇతని మతప్రకారము 24 శ్రుతులున్నవని తెలియుచున్నది. కాని 12 శ్రుతులుకన్న నుపయోగింపలేదు.

క్రీ. శ. 15వ శతాబ్దిలో, అక్బరు పాదుషా కొలువులో ఉండిన, దక్షిణదేశస్థుడగు, పుండరీకవిఠలుడు 'షడ్రాగచంద్రోదయ' రాగమాల' 'రాగమంజరి 'నర్తన నిర్ణయ, యను గ్రంథములువ్రాసెను. ఇతడు గొప్ప విద్వాంసుడు, గాయకుడు.

క్రీ. శ. 1550లో రామామాత్యుడనువాడు 'సర్వమేళకళానిధ' యను గ్రంథమును రచించెను. అప్పటికాలములో వాడబడుచుండిన రాగములను, ప్రప్రథమముగాపేర్కొని, దానిలక్షణాదులను వర్ణించినది ఇతడే.

క్రీ. శ. 1609లో రాజమహేంద్రవర వాస్తవ్యుడు, సోమనాథుడు 'రాగవిబోధ' మను యుద్గ్రంథమును వ్రాసెను. జనక' జన్య రాగములను నిర్ణయించినది ఇతడే.

క్రీ. శ. 16వ శతాబ్దమున, చోళమండల దేశస్థుడైన, గోవిందదీక్షితులు 'సంగీతసుధానిధి'యనుగ్రంథమును రచించెను. ఇతని రెండవకుమారుడే, వెంకటేశదీక్షితులు (వెంకటమఖి,) ఇతడు అత్యున్నతమైన 'చతుర్దండిప్రకాశిక' యను గ్రంథరాజమును వ్రాసెను. 10 ప్రకరణములలో సంగీతశాస్త్రమునంతయు, విశదముగా తెలిపెను. ప్రస్తుతపు కరాటక సంగీతమునకు,

మూలమైన 72 మేళకర్తలను నిర్ణయించిన దీతడే.

క్రీ. శ. 1763-1787 కాలములో, తంజావూరునేలిన, శరభోజి మహారాజు "సంగీతసారామృత"మను గ్రంథమును వ్రాసెను. వీరుగాక, నేపాళదేశవాస్తవ్యుడగు శుభంకరుడు 'సంజ్ఞానసాగరము'ను, క్రీ శ. 1308లో వ్రాసెను. క్రీ. శ. 1507 లో జ్యోతీశ్వరకవిశేఖరుడు వర్ణ రత్నాకర మును వ్రాసెను.

నెల్లూరుమండల గాయకులు.

వీణ వీరాస్వామి అయ్యంగారు :

వీరు గొప్ప వైణిక విద్వాంసులు. శ్రీ త్యాగరాజ స్వామికి సమకాలికులగు శ్రీ భాష్యకాచార్యులవారి ద్వితీయపుత్రులు. బుచ్చిరెడ్డిపాళెం వాస్తవ్యులు. పెద్దపవని జమీందారీ ఆస్థాన విద్వాంసులు. వీరు దేశములో నలుమూలల కచ్చేరీలుచేసి ప్రశంసలు బహుమతులు గడించిన మహనీయులు వీరి వీణాగానమునకు తచ్చూరి సింగరాచార్యులు, వీణ శేషణ్ణ మొదలగు సుప్రసిద్ధ గాయకులు ముగ్ధులై వేనోళ్ల పొగడిరి. వీరికి వీణ అయ్యంగారు అని మరొక నామధేయ ముగలదు. ప్రస్తుతము వైణిక విద్వాంసులుగ పేరుగడించి గాంధర్వ వేదామృత గ్రంథకర్తలైన శ్రీ టి. యన్. ఇ. వెంకట నారాయణాచార్యులు వీరి ప్రశిష్యులు

1. యానాది సోదరీమణులు :

వీరు కళావంతులు. తిరువత్తియూర్ త్యాగయ్యగారి శిష్యురాండ్రు. శ్రావ్యమైన కంఠములతో మధురముగ గానము చేయువారు. మద్రాసు, మైసూరు, దక్షిణ దేశమందు కచ్చేరీలు చేసి గొప్ప కీర్తిని గడించినవారు వీరి నివాసము బుచ్చిరెడ్డి పాళెము.

2. ముదిపర్తి రాఘవరాజు .

తిరువత్తియూర్ త్యాగయ్య శిష్యులు సంగీత విద్వాంసులు. పల్లవి స్వరకల్పనల యందు విశ్రుతులు.

3. దంపూరు సుబ్బరావు :

దంపూరు వాస్తవ్యులు. శైవబ్రాహ్మణులు. సంగీత సంస్కృతాంధ్రభాషలయందు మంచి ప్రావీణ్యము గలవారు. నెల్లూరునందు వెలసియుండు శ్రీ తల్పగిరి రంగనాథ స్వామివారిపై "సింహపురి" "తల్పగిరి" యను ముద్రతో అనేక జావళీలు, పదములు రచించినారు.

4. బుచ్చిరెడ్డిపాళెం వెంకటరత్నం :

ఇతడు సాతాని. సంగీత విద్వాంసులు ఈయనకు అనేకమంది శిష్యులున్నారు.

5. సింగపేట వేంకటరమణయ్య :

ఖ్యాతి గడించిన సంగీత విద్వాంసులు. నీడా మంగలం పంచాప కేశయ్యర్, తచ్చూరి సింగరాచార్యులవారి శిష్యులు. ప్రసిద్ధ రాగ, లయ విద్వాంసులు. అనేక శిష్య సంపత్తి కల్గినవారు.

6. వీణ సోమయాజులు :

నెల్లూరు వాస్తవ్యులు. పేరుగాంచిన వైణిక విద్వాంసులు.

7. నాయుడుపేట పూని వీరాస్వామిశాస్త్రిలు:

వీరు గొప్ప కర్ణాటక సంగీత విద్వాంసులు. 70 వీండ్ల క్రితము వీరే కర్ణాటక

సంగీతమును నెల్లూరిలో ప్రవేశపెట్టినట్లు ప్రతీతి. ఈయన శిష్యురాండ్రలో శెయ్యూరు శారద, నాయుడుపేట రాజమ్మ అనువార్లు నృత్య గానములందు ఖ్యాతి గడించినవారు.

8. రామన్నపాళెం వేణమ్మ :

రామనాథపురం శ్రీనివాసయ్యగారి శిష్యురాలు,

9. గండవరం కనకమ్మ :

సుప్రసిద్ధ నర్తకి. ఈమె శిష్యురాలే కళ్యాణి.

10. బుచ్చిరెడ్డిపాళెం మంగయ్య సోదరులు :

వీరు పేరుగాంచిన సంగీతవిద్వాంసులు. తిరుపతి నారాయణస్వామి శిష్యులు వీరికి పలువురు శిష్యులు.

11. వేమూరి కృష్ణయ్య :

ముదివర్తి రాఘవరాజు శిష్యులు. అల్లూరు వాస్తవ్యులు.

12. వీణ నారాయణదాస్ :

నెల్లూరు వాస్తవ్యులు. గొప్ప వైణిక విద్వాంసులు. వేరు ఉద్యోగములోనుండియు వైణికులుగా ఖ్యాతిగడించిరి. వీరికి నెల్లూరులో చాలమంది శిష్యులున్నారు.

13. నేలటూరు అనంతాచార్యులు :

నెల్లూరు వాస్తవ్యులు. మంచి కవి. హార్మోనియం వాయించుటలో బహునేర్పరి. హిందూస్థానీ, కర్ణాటక సంగీత విద్వాంసులు. వీరు కొన్ని త్యాగరాజకీర్తనలను స్వరసాహిత్యముతో, ‘‘ప్రజాబంధు’’ లో ప్రచురించియున్నారు.

14. తంజావూరు పద్మనాభరావు :

ప్రసిద్ధ విద్వాంసులు. వీణకుప్పయ్యగారి శిష్య పరంపరలోనివారు. మంచి గాయకులు. గవర్నమెంటు కళాశాలలో సంగీతోపాధ్యాయునియు నెల్లూరులోని గాయకులలో పెక్కుమందియు వీరి శిష్యులే.

15. కొమాండూరు నరసింహాచార్యులు :

రంగనాయకులపేట వాస్తవ్యులు. ఖ్యాతివహించిన హార్మోనియం వాద్య విద్వాంసులు. వీరికి, పెక్కుమంది శిష్యులు గలరు.

16. అణ్ణాస్వామి :

సుప్రసిద్ధ నాగస్వర విద్వాంసులు. పొట్టెపాళెంలో, వీరికి బత్తల నర్సారెడ్డిగారు బంగారు నాగస్వరము బహూకరించిరి

17. దామరమడుగుమస్తాన్ :

రేడియోలో నాగస్వరము వాయించు చుండిరి. ఇటీవలనే స్వర్గస్థులైరి.

18. వసకొండ చిన్నసామి :

నాగస్వరములో సిద్ధహస్తులు. వడబాదె కన్నయ్యగారి శిష్యులు. ముఖవీణ అను వాద్యమును చక్కగా వాయించెడివారు. ప్రసిద్ధ నాగస్వర వాదకులు.

19. ఈపూరు మునుస్వామి :

నాగస్వర విద్వాంసులు. 3 సంవత్సరముల క్రితము స్వర్గస్థులైరి.

20. కె. పుల్లయ్య :

నాగస్వరవిద్వాంసులు. సంగీతములో పేరుప్రతిష్ఠలు సంపాదించినారు. వీరికి శిష్యవర్గమెక్కువగా నున్నది.

21. అన్నారెడ్డి పోగిరెడ్డి :

ఇనమడుగు గ్రామవాసులు ‘‘జ్ఞాపక

బ్రహ్మ" బిరుదాంకితులగు అన్నారెడ్డి బలరామిరెడ్డిగారి సోదరులు. వైణికులు.

22. పేమూరు సరస :

ఈమె, ప్రఖ్యాతివహించిన నర్తకి. అభినయములో అందెవేసినచేయి. వీరభద్ర విజయం అను వీధిభాగవత నాటకములో ఈమె ఎఱుకలసాని పాత్రాభినయము జూచుటకై వేలకువేలుగా ప్రజలు వచ్చేవారు

23. బూటూరు సరసయ్య :

వీరు ప్రఖ్యాతిగాంచిన వాయులీన విద్వాంసులు.

24. వేమూరు రాఘాకృష్ణయ్య :

సింగపేట వెంకటరమణయ్యగారి శిష్యులు. వాయులీన వాద్యమున గొప్పమేధావి అను పేరుగడించుకొనినారు.

25. మద్దెల కృష్ణయ్య :

వీరు సుప్రసిద్ధ మృదంగ విద్వాంసులు.

26 రాళ్లపల్లి నటేశయ్య :

వీరు ఖ్యాతివహించిన సంగీతవిద్వాంసులు. వాయులీనమును చక్కగా వాయించెదరు. వీరు కరూర్ చిన్నస్వామి అయం. దొరస్వామిగార్ల శిష్యులు. వీరు ప్రస్తుతము, ఆంధ్ర సంగీతనాటక అకాడమీవారిచే ఉపకారవేతనమివ్వబడి, గురుకులవాసము నడిపించుచున్నారు. సంగీతశాస్త్ర జ్ఞానసంపన్నులు.

27. రాయప్రోలు సుబ్రహ్మణ్యం :

గొప్ప సంగీతవిద్వాంసులు. హరికథకులు, నాటకాభినయమునందు కడుచతురులు ఇటీవలనే యశః కాయులైరి.

28. నేలనూతల రామకృష్ణయ్య :

గానకళాకోవిదులు నటేశయ్య గారి శిష్యులు. నారద పాత్రధారులు.

29. పి. చెంచురామయ్య :

వీరు మంచి సంగీతజ్ఞానము కల్గిన విద్వాంసులు. పిల్లనగ్రోవి, వీణ, నాగస్వరము మొదలగు వాద్యములందు ప్రవీణులు. రేడియో గాయకులు.

30. తే. యం. కృష్ణమూర్తి :

సంగీత శాస్త్రిజ్ఞాన నిపుణులు. మంచి గాయకులు 'త్యాగరాజ సందేశము'ను గ్రంథమును వ్రాసెను. వీరు ప్రస్తుతము సబ్-జడ్జిగా పనిచేయుచున్నారు. అన్నమాచార్యుల కీర్తనలను గురించి పుస్తకము వ్రాసిరి.

31. జి- కె. సుబ్రహ్మణ్యం :

గూడూరు వాస్తవ్యులు వైద్యులు రేడియో గాయకులు.

32. బండ్లమూరి రామనాథశర్మ :

తిరుక్కోయిలూర్ రాముడు భాగవతర్ శిష్యులు. గొప్ప రేడియో గాయకులు.

33. కె. పి. నారాయణరావు :

వైణికవిద్వాంసులు సింగపేటవెంకటరమణయ్య, ఆర్. నటేశయ్యగార్ల శిష్యులు. వీరు న్యాయవాదులుగనుండి, ప్రస్తుతము, జిల్లామునసబుగా పనిచేయుచున్నారు. రేడియో గాయకులు.

34. యస్. పి. ఆర్. విశ్వలావుగారు :

సుప్రసిద్ధ రేడియో గాయకులు న్యాయవాదులు, పద్మనాభరావుగారి శిష్యులు

35. యం. గోపాలాచారి :

రేడియో గాయకులు న్యాయవాదులు

36. పి. యస్. వెంకటచలం :

టి. పద్మనాభరావుగారి శిష్యులు రేడియో గాయకులు.

37. కె. శ్రీనివాసులు :

నాగస్వర కోవిదులైన శ్రీ పులయ్య గారి కుమారులు. వైణికవిద్వాంసులు. రేడియో గాయకులు.

38 యస్. రామచంద్రరావు :

శ్రీ వల్లడం సంజీవరావుగారి శిష్యులు మురళీవాద్య నిపుణులు.

39. శ్రీమతి అష్టకాలవెంకమ్మ :

విఖ్యాత వాయులీన విదుషి.

40. శ్రీమతి మిట్టదొడ్డి సత్యవతమ్మ :

మనోరంజకముగా గానముచేయు రేడియో గాయకురాలు.

41. శ్రీమతి యస్. రంగనాయకి :

ప్రస్తుతము కస్తూరీదేవి విద్యాలయములో సంగీతోపాధ్యాయిని. రేడియో గాయకురాలు.

42. ధనికొండ గోపాల్ :

నాగస్వర విద్వాంసులు.

43. మోమిడి సుబ్బయ్య :

విఖ్యాత నాగస్వర రేడియో గాయకులు.

44. యం. రామయ్య :

శాస్త్రజ్ఞాన సంపన్నులైన, మార్దంగికులు.

45. పి. వేణుగోపాలరెడ్డి :

న్యాయవాదులు వీణ, ఫిడేలు, సితారు, మృదంగము, హార్మోనియము, మొదలగు వాద్యముల వాయించుటయందగ్రగణ్యులు.

46. చింతా సుబ్బరాయలు :

సుప్రసిద్ధ రేడియో మార్దంగికులు, ఎల్లాయపాళెం కాపురస్తులు.

47. అల్లూరు కోదండయ్య :

ప్రసిద్ధ నాగస్వరవిద్వాన్ ఎల్లప్ప శిష్యులు నాగస్వరవిద్వాంసులు.

48. డోలు వెంకయ్య, మునిరత్నం, చెంగయ్య, వెంకటముని, యానాదయ్య, ఎల్లప్ప, పిచ్చయ్య అనువారు సుప్రసిద్ధ డోలు విద్వాంసులు. లయజ్ఞాన సంపన్నులు.

49. పాణ్యం గోపీనాథశర్మ :

ప్రసిద్ధవాయులీన విద్వాంసులు బి. కే. విశ్వనాథశర్మ గారి శిష్యులు. ప్రస్తుతము వీరు సినిమారంగములో నున్నారు. పాణ్యం అనంతరామ భాగవతర్ గారి పుత్రులు.

50. పాణ్యం సుబ్రహ్మణ్యం :

పేరొందిన వాయులీన విద్వాంసులు. అనంతరామ భాగవతార్ గారి పుత్రులు.

51. యం. హనుమంతరాయశర్మ :

వీరు టి. పద్మనాభరావుగారి శిష్యులు వయోలిన్ విద్వాంసులు.

52. యం. సుందరరామిరెడ్డి :

న్యాయవాదులు 'బుల్ బుల్' తార అను జపానుతంత్రీ వాద్యముపై, కర్ణాటక సంగీతము వాయించుటలో సిద్ధహస్తులు

ఆ॥ మనసు మనసునంద మఱచి యాత్మని నాత్మయంద కాంచునట్టియతడు సర్వ।
విదుడు సకలభూత వితతియందును దనుఁ గనుచు నుండు నిర్వికల్పముగ॥
అశ్వ. II. 154.

♦ ♦ ♦ ♦ ♦ ♦

ఆ॥ జ్ఞానపూర్వమైన సన్న్యాసకలనంబు, పరమగతినొనర్చు భవ్యులార।
ద్వంద్వరహితుఁడైనతని జరామృత్యు ని స్తరణకరణమైన ధర్మమొందు॥
అశ్వ II 158

♦ ♦ ♦ ♦ ♦ ♦

క॥ హరి యాత్మ యజ్ఞునన కా, హరి కర్తనుఁడాత్మ హరియు నర్జునుడును నా।
నిరువురగుట క్రీడార్థం బరయగ, నదియొక్క వెలుగ యతులంబెందున్॥
ద్రో I 99

♦ ♦ ♦ ♦ ♦ ♦

తే॥ గుళ్ళఁజెఱువులుఁ గట్టించుఁ గోరి యూళ్ళ।
బగ్రహారముల్ గావించు నాంబి కేయుఁ
దథివ ధర్మతనూజుఁ డత్యంతహర్ష
చిత్తవృత్తియై యనుమతి సేయుచుండ॥
ఆశ్ర I 7.

♦ ♦ ♦ ♦ ♦ ♦

అసత్పథవృత్తికిఁ జేటుదప్పునే॥
సౌప్తి I 37

♦ ♦ ♦ ♦ ♦ ♦

నిద్రపోవుదురు; నిమురసావునట్టిదకాదె॥
సౌప్తి I 81

♦ ♦ ♦ ♦ ♦ ♦

మడుఁగుఁజీరయందు మసిదాఁకినట్లయ్యెడు॥
సౌప్తి I 81

♦ ♦ ♦ ♦ ♦ ♦

సీ॥ అతిథిపూజఁగడచినట్టి ధర్మపు గృహస్థులకు నొందు లేమిదెలుపుచున్న।
యది సమస్త కిల్బిషాపహ మీ యితిహాస మిచ్చు నెల్లయభిమతములు॥
అను. I 84

# ౫౫.

# సంగీత సాధనములు-వాద్యవిధులు

సంగీతవిద్వాన్ కే. అరుణాచలం.

ప్రొప్రైటర్, గణేశప్రెస్, నెల్లూరు.

సంగీతము :

సమ్యక్ × గీతం = సంగీతం అనగా, విన నింపయిన శబ్దము "కళారత్నం గీత" మన్నారు. చతుష్షష్టి కళలలో గీతము రత్నమువంటిదనీ, అందులో సంగీతము సానలుదీరి అపరంజిలో పొదగబడిన రత్నము వంటిదని చెప్పనగును. అందుకే "సంగీతమపి సాహిత్యం సరస్వత్యా స్తన ద్వయం. ఏక మాపాతమధురం అన్య దాలోచనామృతం' అన్నారు. సంగీత మనగా, మంచిశబ్దము చెవిబడినంతనే తన్మయత్వం కలిగించును. సాహిత్యం అక్షరజ్ఞానం కలిగి అంతరార్థముల తెలిసికొని, అనుభవించ గలిగితేనే, ఆనందం కలుగుతుంది. అదే, "పశుర్వేత్తి శిశుర్వేత్తి వేత్తి గానరసం ఫణీ" అంటే, మాటాడ శక్తిలేని, వివక్షణాశక్తిలేని పశువులు, పసిబిడ్డలు, పాములు, ఒకటేల సకలజీవజాలము ఆనందాంబుధి మునుంగును గదా! కనుక, సిద్ధాంతంలేని ఆచరణ అంధప్రాయం. ఆచరణలేని సిద్ధాంతం వంధ్యాప్రాయం; అన్నట్లు, శాస్త్రానుసారంగా శ్రుతిలయ బద్ధంగా ఆత్మానందం కలిగించు సుశబ్దమే సంగీతము. అదే మన కావ్యాల్లో కొందరు స్త్రీలు మహాదుఃఖముతో ఎలిగెత్తి ఏడ్చినను స్వరయుక్తముగా మాధుర్యముగా నుండునన్నారు.

"కంకణపాణి పల్లవయుగంబున వక్షము మోదికొంచు నా।
పంకరుహాక్షియేడ్చె పరిభావిత పంచమ సుస్వరంబునన్॥

ఆ సంగీతం, కర్ణాటక, హిందూస్థానీ, దాక్షిణాత్య, ఔత్తరీయ, ప్రాంతీయ, విదేశీయ, లలిత అను వేరువేరు పేర్లతో వ్యాప్తి పొందియున్నది. పేర్లెన్నైనా, సప్తస్వరముల కలయికే ముఖ్యముగానుండును. త్యాగరాజస్వామి "నాదలోలుడై బ్రహ్మానందమందవే మనసా-స్వాదుఫలప్రద సప్తస్వరరాగ నిచయసహిత" అని కళ్యాణవసంత రాగంలోనూ, "నాదతనుమనిశం, శంకరం నమామి మనసా శిరసా-మోదకర నిగమోత్తమ సామవేదసారం వారం వారం-సద్యోజాతాది పంచవక్త్రజ సరిగమపదని వరసప్తస్వర అని, చిత్తరంజని రాగంలోను నాదము, నాదోత్పత్తి విధానము నాదరూపము నాదమహిమలగూర్చి సెలవిచ్చియున్నారు.

కర్ణాటక సంగీతము :

ప్రయోగమునుబట్టి, దేశము పేరే, శాస్త్రీయ సంగీతమున కేర్పడినది. ఇందులో కీర్తికాయులు రామనాథపురం శ్రీనివాస అయ్యంగారు, హరినాగభూషణం మొదలగు విద్వాంసు లెందరో గలరు.

హిందూస్థానీ :

ఉత్తర హిందూదేశములోని శాస్త్రీయ సంగీతం, అక్బరు చక్రవర్తికాలంలోని తాన్ సేన్ మహనీయుడు, ఇందులకు మూలపురుషుడుగా చెప్పనగును. కీర్తిశేషులు కరీంఖాన్ మొదలగు సుప్రసిద్ధులెందరో గలరు. సింహపురిలో శ్రీ అబ్దుల్ ఆజీజ్ మొదలగు ప్రసిద్ధులుగలరు. అంతేగాక వీరు వివిధ వాద్యములందును సమర్థులు.

దాక్షిణాత్య :

దేశభేదములవల్ల, శాస్త్రీయ సంగీతమునకు కలిగినపేరు. గోవిందస్వామిపిళ్ళై, నైనపిళ్ళై, పల్లడం సంజీవరావు, మొదలగు గాయకశిఖామణు లెందరో గలరు.

ఔత్తరీయ, ప్రాంతీయ-ఆయా స్థలభేదముల ననుసరించి శాస్త్రసంగీతమున కేర్పడిన పేర్లే. శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు, శ్రీ చౌదయ్య, కీ॥ శే॥ పుష్పవనం, వనకోటి అమ్మాళ్. బెంగుళూరు నాగరత్నమ్మ మొదలగు వారిందు ప్రసిద్ధులు.

లలిత :

దీనిలోనూ శ్రుతిలయ బద్ధమైన సప్తస్వర సంయోగమే. అయితే సులభముగా వినుటకు, ఆనందించుటకు, వీలగునట్లుండును. ప్రస్తుతం చలనచిత్రములలో, నాటకములలో మిగులవ్యాప్తమైయున్న దిదియే.

విదేశీయ :

ఇతరదేశముల శాస్త్రీయ సంగీతమునకుపేరు. అనగా ఇంగ్లండు, అమెరికా, ఆఫ్రికా, రష్యా మొదలగు దేశములలోనిది. ఇదియు సప్తస్వర ప్రధానమే.

గాత్రసంగీతము :

అనగా కంఠముతో పాడుట. ఇందులో కంఠమాధుర్యము, సంగీత సాహిత్యజ్ఞానము, భావరసప్రదర్శనము సులభముగా బాగుగా తెలియనగును.

మరియు, ప్రస్తుతం సినిమాసంబంధముగా ఎన్నోరకములైన క్రొత్తవాయిద్యములు వచ్చినవి. వీనిలో వీణ, వేణు, మృదంగ, ఢక్కా. పటహ, కాహళ, మురజాదులు దేవతలు ఉపయోగించుచున్నట్లు పురాణముల వలన తెలియుచున్నది. సర్వవిద్యాధిదేవతయగు సరస్వతి వీణను ధరించియుండుట, నారదుడు సప్తతంత్రీవాద్యమును ధరించియుండుట, తుంబురుడు తంబురను ధరించియుండుట, దేవేంద్ర సభలలో గంధర్వాప్సరసల నృత్యసందర్భములలో, శివతాండవనృత్యములలో పైవాద్యములెన్నో వాద్యసమ్మేళనం(-ఆర్కెస్ట్రా)లో ఉన్నట్లు తెలియుచున్నది. ఇక శ్రీకృష్ణుడు వేణువును సమ్మోహనాస్త్రంగా ఉపయోగించుట మన మెరిగినదే గదా! దీని ననుసరించే యెన్నో తంత్రీవాద్యములు సృజింపబడ్డాయి. వాయులీనం - వయొలిన్ - ఫిడేల్, తంబుర, గోటు, సారంగ, సితార, వీణ, బుల్ బుల్ తార మొదలగునవి.

వీణ :

సప్తతంత్రులతో స్వరస్థానభేదముల తెల్పు మెట్లుగల్గి, రెండుచేతులవ్రేళ్ళతో

వాయింపబడునట్టి వాయిద్య విశేషము. దీనిలో, లయను నిలకడముగా తెల్పు మీటుకూడనుండును. ఇది సనాతనమైన వాయిద్యము. కొందరు ఈవాద్య సాధనమును తమముందు అడ్డముగానుంచుకొని వాయించెదరు. మరికొందరు (విశేషసాధనపరులు) నిలువుగనుంచుకొనియు వాయించెదరు.

గోటు :

ఇదియు వీణ వలెనేయుండును. కానీ మెట్లుండవు. ఎడమచేతితో లయమీటుచు, కుడిచేతిలో పిడికొయ్య అను సాధనముతో, అభ్యాసాతిశయముచే స్వరస్థానముల నొక్కుచు సంగీతము నుత్పత్తిచేయుదురు.

వాయులీనము :

నాల్గుతంత్రులు సామాన్యము. ఏడు తంత్రులుగూడ ఇపుడుపయోగమునందున్నవి. ఎడమ తొడమీద నిలువుగ పట్టుకొని యెడమచేతి వ్రేళ్ళతో తంత్రుల నొక్కుచూ, కుడిచేతితో 'కమాను' చే, తంత్రులమీద రాయుటచే నాద ముత్పత్తియగును.

తంబుర :

నాల్గు తంత్రులుగలిగి యుండును. కుడిచేతి చూపుడు వ్రేలితో, క్రమముగా అడ్డముగా నాలుగు తంత్రులను కల్పి మీటుటచే నాదముత్పన్నమగును. అనాదము నాధారముగా గొని సంగీతనాదమును దానితో మేళగింప చేసెదరు. దీనికే శ్రుతి,అనిపేరు. 'శ్రుతిర్మాతా లయఃపితా' అనగా సంగీతమునకిది తల్లివంటిది.

గట్ :

పై చెప్పబడిన తంబురయొక్క తంత్రులమీద ఒకచిన్న కట్టెవంటి సాధనముతో అభ్యాసవిశేషముచేత స్వరస్థానభేదముల తెల్పుకొని నొక్కుటచే ఇంపైన సంగీతముత్పన్నమగును. ఇది యెక్కువగా ఉత్తర హిందూదేశమునందు అమలులో నున్నది.

సారంగ :

ఇది ఫిడేలు వలెనేయుండు తంత్రీవాద్యము. దీనిని హిందూస్థానీ సంగీత విద్వాంసు లెక్కువగా నుపయోగింతురు. ఇపుడు మనప్రాంతమునగూడ ఇందులో నిపుణులున్నారు. ఫిడేలువలెనే 'కమాను' తో వాయించెదరు.

సితారు :

ఇది వీణవలెనే తంత్రులు, మెట్లు కలిగియుండి హిందూస్థాని విద్వాంసులచే ఎక్కువగా వాడబడుచున్నది. దీనిని నిలువుగనుంచుకొని వాయించెదరు. ఇదియు మన ప్రాంతమునను వ్యాప్తిలో నున్నది.

వేణు :

(మురళీ, పిల్లనగ్రోవి) ఇది సుమారు బొటన వ్రేలిలావున, ఒక అడుగుపొడవున ఉండు వెదురు. ఒక కొన మూయబడి ఒక కొన మూతలేక యుండును. మూయబడియుండు కొనకు సుమారు అంగుళము దూరములో ఒక రంధ్రముండును. మూతలేని కొన నుండి ఈవలివరకు వరుసగా యెనిమిది రంధ్రములుండును. ఆ రంధ్రముల మీద రెండుచేతుల వ్రేళ్ళనుమచ్చి మరియొక వైపుననుండు రంధ్రమునందు, నోటితో

గాలిని పూరించి ఊదుచు, వ్రేళ్ళ సంచలనముచేసిన. స్వరస్థాన భేదముగల సంగీతముత్పన్నమగును.

నాదస్వరము :

ఈ వాయిద్యమును ‹సన్నాయి' అనియు పిలిచెదరు. ఎఱ్ఱ చందనపు చక్కతో మొదలు సన్నగా, కొన వెడల్పుగా, ఒకగొట్టము ఆకారముతో చేయబడియుండును. స్వరస్థానభేధముల పల్కించుటకు రంధ్రములుండును. సన్నని కొనయందు బూరగనుంచి నోటితో ఊదుచూ, రంధ్రములపై రెండుచేతుల వ్రేళ్ళనుంచి కదిలికచే స్వరయుక్తమైన నాదము నుత్పత్తి చేయుదురు.

క్లారినెట్ :

ఇది నాదస్వరము వలెనే ఆకారము కల్గి యుండును. దీనిని (Ebony) ఏబోనీ అను కొయ్యతో చేయుదురు. దీనికి స్వరస్థానభేదముల తెల్పుటకు కమ్ములచే నమర్చిన మెట్లుండును. సన్నాయి వలెనే ఈ మెట్లను నొక్కుచు నోటితో వాయించెదరు. ఇది విదేశములలో సృజింపబడిన సాధనము.

హార్మోనియం :

ఈ సాధనమునకు ఇంగ్లీషు పేరు ఇది. అనగా స్వరభేదముల సంయోగము. ఇది వైదేశికమే. ఇది ‹పియానో' అను పేరుతో ప్రధానమైనవాయిద్యము వారికి నేటికిని కలదు. దానినాధారముగా జేసికొనే రకరకముగా వేరు వేరు పేర్లతో, ఈ సాధనముత్పత్తి అయినది. ఇది పెట్టె వలెనుండి, గాలిపూరణకులో పలిపూపిరితిత్తులు కలిగి, పైన సూక్ష్మమగు స్వరభేదవిసరములతో కూడిన మెట్లమర్పబడియుండును. ఎడమచేతితో వలయునంత వాయు పురాణముచేయుచు, కుడిచేతితో మెట్ల నొక్కుటవలన సంగీత మేర్పడును. ఈ మెట్లకు ఇంగ్లీషులో ‹రీడ్సు' అందురు. దీనిలో మురళి శబ్దమును కల్గించు మెట్లమర్చిన పెట్టె, ఫూట్ హార్మోనియం. ఆర్గన్‌రీడ్సు అమర్చినపెట్టె ‹లెగ్ హార్మోనియం'. కాళ్ళతో వాయు పూరాణము చేయుచు రెండుచేతులతో మెట్లనొక్కుటచే సంగీతము ఉత్పత్తియగును.

ఈవాద్యమును గూర్చి ఒక ప్రత్యేకమైన విషయము తోచుచున్నది. ఒక చేతితో గాలిపోసుకుంటూ, ఒక చేతితో మెట్లను నొక్కడమూ, కాళ్ళతో గాలిపోసుకుంటూ, రెండుచేతులతో మెట్లను నొక్కడమూ, అను విషయముల గూర్చి సమగ్రముగ నూహించిన అసలు, సంగీతము వినేందుకు, అనుభవించేందుకు ఆనందించేందుకు కూడ ప్రకృతి సిద్ధమైన కొంత జ్ఞానముకావలసియున్నది. విని ఆనందించుటకే ఇట్టిసితి అవసరమైతే, మెదడుతో, కాళ్ళతో, చేతులతో, సర్వశక్తుల వినియోగించి, యెదుటివారి ఆత్మశక్తి రేపి ఉత్తేజము కల్గించి, తన్మయత్వము కల్గించేందుకు ఎంత శాస్త్ర జ్ఞానము, అనర్గళమైన అభ్యాసము, సమర్ధతా, వలయునో ఊహింపలేము.-ఇక సామాన్యంగా నాటకాలకు పాటలకు, వాయించుట అట్లుండనిచ్చి శాస్త్రీయ సంగీతముచే సభలలో కచ్చేరీలలో తనీ వాయిద్యముగా, తంత్ర వాయిద్యముతో పాటు వాయించి, సభ్యుల రంజింపజేయుటకు పెద్ద

విద్వాంసుల ననుసరించి వాయింప గలుగుటకూ ఎంత విజ్ఞానమవసరమో ఊహాతీతము. ఇందు సకలావయములు పరిపూర్ణ సంగీత రసప్రసారముతో నిండియుండ వలసినట్లు తోచుచున్నది. ఇందులోనూ మనదేశంలో సుప్రసిద్ధులైన విద్వాంసులున్నారు. పైన పేర్కొనబడిన అన్నిరకములైన సంగీతమును ఈ వాయిద్యములో వాయింపవీలగును. మైసూరు రాష్ట్రమునందు బిడారం కిట్టప్ప, రాచప్ప మొదలగు గొప్ప విద్వాంసులు హార్మోనియమునే ప్రక్క వాయిద్యముగా పెట్టుకొని సంగీతమును పాడియున్నారు. ముఖ్యంగా ఉత్తర హిందూస్థానములో గవాయి విద్వాంసులెందరో దీని ననుసరించి నేటికిని పాడుచుందురు.

మోర్‌సింగ్ :

ఇది తంత్ర వాద్యములో చేరినదే. దీనిని నోటితోనే శబ్ద పూరణముచేయుచూ, చేతితో తంత్రిని మీటుటచే సంగీతనాదము కల్గును.

డోలు :

దీనిని మృదంగమువలెనే లయ ప్రస్తారముతో నాదస్వరము ననుసరించి వాయింతురు. దీనిని పనసకొయ్యతో తయారు చేయుదురు. ఇరువైపుల చర్మముచే మూయబడి యుండును. ఎడమవైపున ఒక చిన్న కొయ్యతోను కుడివైపున చేతితోను వాయింతురు. ఈవాయిద్యమునందు కీర్తి నార్జించిన వారెందరో గలరు.

డోలక్ :

ఒకచేయి పొడవున, డోలుకంటె వెడల్పుతక్కువైన కొయ్యగొట్టమునకు ఇరువైపుల చర్మము మూసియుండును. ఇది మృదంగమునకు ప్రాచీన వాయిద్యము· ఇరువైపుల రెండుచేతులతో వాయింతెదరు. దీనికి మృదంగమునకువలె ఒకవైపున బోన ముండదు. దీనిని వీధినాటకములు తోలు బొమ్మలాటలు భాగవతసేవలు జంగము కథలు మొదలగువానిలో నుపయోగించెడివారు. దీనిస్వరూప భేదములనే గంగిరెద్దు ఆటలలో బుఱ్ఱకథలలో వీధి వినోదములలో గూడ వాయింతెదరు. ఇవుడు దానికే కుడివైపున వెడల్పుతగ్గించి బోనమునుంచి సినిమాలలో గూడ నుపయోగించు చున్నారు.

కంజీర :

అరచేతివెడల్పున గుండ్రముగా నుండు కొయ్యచక్రముపై ఉడుముతోలు మూయబడియుండును. ఇదియు లయవిన్యాసమునకు సంబంధించిన వాద్యవిశేషము. ఆ కొయ్యచక్రమును ఎడమచేతితో పట్టుకొని వ్రేళ్ళతోనొక్కుచూ కుడిచేతితో చర్మముపై వాయింతెదరు. దీనికి ఒకటి రెండుచోట్ల గజ్జలుగూడ కట్టుదురు.

మృదంగము :

ఈ పదమువల్ల ప్రథమంలోనే మన్నుతోచేయబడి నున్నితమైన నాదములు కల్గించునది అని చెప్పనగును. డోలక్ అకారమునుకల్గి కురుచగా, కుడివైపున కరిణ కలిగి యుండును ఇదియు లయనాధారముగా కల్గిన శబ్ద సమ్మేళన వాయిద్యవిశేషమే.

తబలా (తబ్లా) :

పైచెప్పబడిన మృదంగమునే రెండు భాగములుచేసి, ముందు నిలువుగా పెట్టు

కొని, రెంటిమీద రెండుచేతులతో వాయించె దరు. ఇది ఉత్తరహిందూస్థానమున సృష్టిం పబడిన వాద్యవిశేషము. హిందూస్థానీ సంగీత విద్వాంసులు మనము మృదంగమునువ యోగించినట్లు, లయశాస్త్రపద్ధతులతో నుపయోగింతురు. ఇది క్రమక్రమముగా దేశ మంతట వ్యాపించి లలిత సంగీతమందును నాటకములందును, సినిమాలలోను నుపయోగింపబడుచున్నది.

ఘటము :

మట్టితో చేయబడినకుండ. లయప్రాధాన్యంతో రెండుచేతులతో శబ్దోత్పత్తి కలిగించెదరు. ఇందులోను ప్రసిద్ధిచెందిన వారు గలరు.

కొనుగోలు :

గాత్రముతో శ్రుతిబద్ధంగా, లయప్రాధాన్య శబ్దనడకలచే అహ్లాదమును కలుగజేయునది. దీనిని నృత్యవిశేషములలో ముఖ్యముగా వాడుదురు.

జలతరంగిణి :

నీటిలోపుట్టు అలల కదలికచే ఉత్పన్నమగు శబ్దసంయోగమునకు పేరు. ముప్పదిరెండు పాత్రల నుపయోగింతురు.

ఇవే ఇంకెన్నో పేర్లుగల నవీన వాయిద్యములును గలవు.

సింహపురి మండలములో, వేంకటగిరి సంస్థానములో "నౌబత్" అను పేరు గల కాలప్రామాణ్యమునుతెల్పుచు లయప్రాముఖ్యముగల్గిన శబ్దవిశేషముకలదు. ఇందు దాదాపుది వాద్యభేదములు కలిసియుండి వినుటకెంతో ఇంపుగా నుండును. ఇందులో సప్తతాళ ప్రసారముండును. నౌబతు, అను పేరునుబట్టి మహమ్మదీయ సంబంధముచే మనకు కల్గిన వాద్యవిశేషముగా నున్నది. ఈ నౌబతు అనునది ప్రతిసంస్థానములోను రాచరికమర్యాదగా నున్నట్లున్నది.

మరియు, ఈమండలమున వీనాదులు యెఱుకలు విశేషముగా సంగీతనాద సంబంధముగా ప్రసిద్ధిచెందియున్నారు. వీనాదులలో తప్పెటను అధారముగాగొని, శ్రుతి లీనముగా మంద్రములో పురుషుడు, తారములో స్త్రీ "సోదె" చెప్పుట గలదు. లయశ్రుతులలో తాదాత్మ్యము చెందడంలో, వారుద్దేశించిన దేవతగూడ ప్రసన్నమై వారిని భవిష్యత్తు పలికించుటలో ఉద్రూతలూగించును. ఇక, ఎఱుకలు ఏకతంత్ర సాధకమును మీటుచూ. ఆనాదము నాధారముగాగొని శ్రుతి లీనముగా, యెఱుక చెప్పుట విశేషమనదగును. ఏకతంత్రనాదము నాధారముగాగొని, యెందరో భక్తులు, బిచ్చగాండ్రుసహిత మెంతో మనోరమముగా భక్తిగీతముల పాడుట యీమండలమున చూడనగును. తప్పెట, తాషా, డమాయి, ఢంకా అనువాద్యములును కలవు. మన మండలమున ఈ వాద్యములను ఆయా సమయములందు, ఉచితరీతి, విశేష మనోజ్ఞనముగా వాయింపగలవారు కలరు.

వీణ :

1. కీర్తిశేషులు. కొండూరువరదయ్య 2. వీరాస్వామి అయ్యంగారు -(బుచ్చిరెడ్డి పాళెం) 3. గద్దం నరసారెడ్డి (వీరాస్వామి శాస్త్రి శిష్యుడు, వీరిశిష్యులు)మన మండలమున కలరు. 4. వీణ శేషన్న - వెంకటగిరి

5 వీరబ్రహ్మం - 6 కాళహస్తి వెంకటస్వామిరాజు 7 నారాయణదాసు 8 కుట్టి - వీరు అఫీషియల్ రిసీవరు ఆఫీసులో నౌకరిచేయుచూ వీణ వాయించుటయందు ఖ్యాతిగాంచినారు. 9. అంజనేయులు 10. శివరామయ్య -మూలపేట 1 . శ్రీమతి రాజామణి - కుట్టిశిష్యురాలు 12 గండవరం కళ్యాణమ్మ-వీణ యందేగాక, గాత్రమునందుకూడ ప్రవీణురాలు. గడ్డం నరసారెడ్డి శిష్యురాలు 13 శ్రీ పోట్లూరి చెంచురామయ్య -వీరు వీణ ఫ్లూటు, నాదస్వరం మొదలగువాద్యములలో ప్రఖ్యాతి చెందినారు 14 కె నారాయణరావు బి ఏ. బి. యల్ - డిస్ట్రిక్టు మునసఫ్ 15 శ్రీ కె శ్రీనివాసులు - మనమండలమున సుప్రసిద్ధ నాదస్వర విద్వాంసులు. కీ॥ శే॥ పుల్లయ్యకుమారుడు రేడియో ఆర్టిస్టు

ఫిడేలు

కీ॥ శే॥ యేటూరునరసయ్య -ఇందుకూరుపేట 2 నరసింహాచార్యులు -రంగనాయకులపేట - వీరు ఫిడేల్ వాయిద్యము నందేగాక, హార్మోనియమందును ప్రజ్ఞ గలవారు వీరెన్నో నాటకసమాజములను నెలకొల్పి నాటకములను ప్రదర్శింప జేసెడివారు 3 కీ శే రామయ్యవర్మ 4 కీ శే॥ జూటూరు నరసింహయ్య - వీరు గవర్నమెంటు స్త్రీల కళాశాలయందు అధ్యాపకులూ పనిచేసిరి

4 కీ శే పొంగూరు రామయ్య - ఫిడేలువాయిద్యము నందేగాక అన్నివాయిద్యములందును ప్రతిభగలవారు

5 కీ శే వేమూరు రాధాకృష్ణయ్య - వీరు సింగంపేట వెంకటరమణయ్య గారి శిష్యులు మన మండలమున ఎన్నో సభలలో మెప్పుగాంచి చిన్నతనముననే యశఃకాయులైరి 6 కీ శే. వేమూరు శ్రీనివాసయ్య - అల్లూరు 7 శ్రీ ప్రాణ్యం గోపాలకృష్ణయ్య 8 శ్రీ పాణ్యం సుబ్బయ్య 9 శ్రీ వై రామమూర్తి 10 శ్రీ హనుమంతశర్మ 11 శ్రీమతి అష్టకాల వెంకమ్మ 12 శ్రీమతి కాళహస్తి శకుంతలమ్మ 13 శ్రీ వేగూరు రామమూర్తి

మృదంగం ·

1. కీ॥ శే॥ గండవరం రంగప్ప 2 కీ॥ శే॥ కందికట్టు వెంకయ్య 3 కీ. శే కంచికిష్టమ్మ 4. కీ శే కందికట్టు వేమయ్య, 5. గండవరం వెంకటసుబ్బయ్య వీరు వలుచోట్ల మహావిద్వాంసులతో కూడ వాయించి వేనోళ్ళ పొగడ్తలనందరి. 6 కీ శే సీతాపతి 7 శ్రీ యం రామయ్య, వెంకటగిరి 8 శ్రీ జానకి రామయ్య 9 శ్రీ పుల్లయ్య 10 మల్లిఖార్జునం 11 కీ శే కందికట్టు కామయ్య 12 శ్రీ దొరస్వామి

తబలా ·

కీ శే షాషాబ్, 2 శ్రీ అబ్దుల్ అజీజు వీరిదువురూ హిందూస్తానీ కచ్చేరీలలో కూడ మృదుమధురముగా వాయించగలరు పైన పేర్కొనబడిన మృదంగము వాయించువారు కూడ తబ్లాను వాయించెదరు

సితారా, సారంగ ·

శ్రీ అబ్దుల్ అజీజు-వీరిశిష్యులెందరో గలరు

హార్మోనియం :

1. కీ. శే. నరసింహాచార్యులు. 2. కీ. శే. అల్లూరు వెంకటరత్నం-నాటకములలో మిగుల ప్రజ్ఞతో వాయించడమే గాక హిందూస్తానీ సంగీతమును గూడ వాయించెడివారు. మనోజ్ఞముగా వాంచగలవారు.

3. కీ. శే. కొణికి సుబ్బారావు 4. కీ. శే. వెంకటరత్నం 5. శ్రీ చెరుకూరు నరసింహం కందుకూరు. 6. శ్రీ రామిసెట్టి వీరాస్వామి 7. శ్రీ వెంకయ్య 8. శ్రీ ఈమని సుందర రామయ్య 9. శ్రీ భాష్యం 10 కీ. శే. రాఘవయ్య-వెంకటగిరి. 11. కీ. శే. వెంకట్రావు వెంకటగిరి.

నాదస్వరం ;

1 కీ॥ శే॥ మంగన్న బ్రదర్సు-బుచ్చిరెడ్డిపాళెం. 2. కీ॥ శే॥ పొన్నుస్వామి 3. కీ॥ శే॥ అన్నాస్వామి 4. కీ॥ శే॥ ఎల్లప్ప 5 కీ॥ శే॥ నరసింహం, 6 కీ॥ శే॥ శేషయ్య 7 కీ॥ శే॥ మునుస్వామి 8 కీ॥ శే॥ కొడవలూరు పుల్లయ్య-వీరు నాదస్వరం, ఫ్లూటు, కంజీర వాద్యములలో విశేష ప్రజ్ఞావంతులు వీరికి ఎంతో శిష్య వర్గము కలదు. 9 కీ॥ శే॥ పోట్లూరు పిచ్చయ్య-వీరు కాకినాడ కాంగ్రేసులో నాదస్వర వాద్యమునందు గొప్ప ప్రతిష్టను సింహపురికి సంపాదించినవారు 10 కీ॥ శే॥ మస్తాను 11 శ్రీ పోట్లూరు చెంచురామయ్య అండ్ బ్రదర్సు 12 శ్రీ గోపాలు 13 శ్రీ పోన్నూరు రామయ్య వీరు పుల్లయ్యగారి (కొడవలూరు) శిష్యులు 14 శ్రీ అల్లూరి బ్రదర్సు 15 శ్రీ మైపాడు బ్రదర్సు.

డోలు :

1 కీ॥ శే॥ రామయ్య, 2 వెంకయ్యగారి కుమారుడు పుల్లయ్య 3 ఎల్లప్ప 4 శ్రీ వినాదయ్య 5 కీ॥ శే॥ ఏకాంబరము 6 శ్రీ మునిరత్నం

కంజీర :

1 శ్రీ కోడవలూరు వెంకయ్య 2 శ్రీ ఎల్లప్ప

ఫ్లూటు :

1 కీ॥ శే॥ కొ పుల్లయ్య 2 శ్రీ పోలవరపు రామచంద్రరావు బి. ఏ. బి. యల్. 3. శ్రీ చెంచురామయ్య, 4. శ్రీ యస్. రామచంద్రరావు.

ఘటం :

జైహింద్ నృత్యమండలి వ్యవస్థాపకులు శ్రీ కోటసుబ్రహ్మణ్యం శాస్త్రి ఈ వాయిద్యమునందు నిపుణులు.

'సంగీత సుధాంబుధి' అన్నట్లు అపారమైన శాస్త్రమగుటచే పురాకృతసుకృతముచే కలిగిన గంధర్వాంశముననె ఈ జ్ఞానలవము కలుగగలదు. మానవ ప్రతిభావిశేషము వలన ఇంకను యెన్నియో కొంగ్రొత్త వాయిద్య విశేషములు సృష్టింపబడుచునే యున్నవి. ఉత్సాహవంతులైన యువకులెందరో అన్నిటియందును ప్రతిభనార్జించి, మన మండలమునకు కీర్తి నార్జించుచున్నారు. అట్టి యువకులపేర్లన్నియు నాకు పరిచయములెక ఇందు ప్రచురింప వీలుగాక పోయినందులకు చింతించుచున్నాను. అన్యాధా అపార్థము చేసుకొన కుందురుగాక.


"ఎందరో మహానుభావులు-అందరికిని వందనములు."

# 56.

# జాతరలు - సుద్దులు చెప్పే భైక్షుకులు

శ్రీ ఏ. వి. యస్. సుబ్బారావు. బి. ఏ. బి. యల్. కనిగిరి.

ఈ జాతులకు చెందినవారు నాకు తెలిసినంతవరకూ నాలుగు వర్గాల వారున్నారు. వారు 1. బైనీడి వారు 2. పంబల వారు 3. కొమ్ముల వారు 4. వల్మాటి వారు. వీరు మాల మాదిగ కులాలకు చెందినవారు. వీరు ముఖ్యంగా గ్రామదేవతల కొలుపుల సందర్భంలో సమావేశ మవుతూ వుంటారు. ఆ జాతరలలో నెల్లూరు జిల్లాలో ప్రతిసంవత్సరం తప్పకుండా జరిగేవి గంగమ్మ జాతరలు. అట్టి జాతర వొకటి నేరేళ్ళ వాగువద్ద, కనిగిరి తాలూకాలో వుండే గంగమ్మ గుడివద్ద జరుగుతుంది. ప్రతి వైశాఖ శుద్ధ పౌర్ణమినాడూ తప్పక జరుగుతుంది. అది యీ సంవత్సరం మేనెల తే 8 దీన జరిగింది. ఆ సందర్భంలో బడుగులవారనే పూజగొల్లలను, అన్ని కులాలవారిని బూతులు తిట్టే అనాది వారిని, వివాహం లేకుండా అమ్మవారి కంకితమై మాతంగకన్య అని పిలువబడే ఒక మాదిగ కన్యను గూడా మనం చూడవచ్చు. ఈ కులాలు వాటికి సంబంధించిన మూఢాచారాలు క్రమంగా నశించిపోతున్నవి.



1. బైనీడి వారు.

వీరు గౌతమ పురాణం చెప్పుతారు. వీరు మాల కులస్థులు. పరశురాముని యుద్ధం మొదలైన కథలుచెప్తారు వీరిజతలో సామాన్యంగా నలుగురుంటారు. కథ చెప్పేవాడు, కాళ్ళకు గజ్జలు కట్టుకొని, తలకు జలతారంచు ఎఱ్ఱ పాగా చుట్టుకొని, అడుగులు వేస్తూ, ముందుకు వెనుకకు పోతూ, సంప్రదంగా తిరుగుతూ, ద్విపదలో కథ చెప్తూ వుంటాడు.

పై ఫోటోలో కథ చెప్పువానిది పొదిలి తాలూకా చినారకట్ల. పేరు అంబటి గురవయ్య, వయస్సు సుమారు 70 సంవత్సరాలు. జమిలిక అనే వాద్యం వాయించే వాడాతని కుమారుడు. అతని పేరూ గురవయ్యే. వెనుక జిల్లాబోర్డు హరిజన మెంబరుగాకూడ వున్నాడు. తక్కిన యిద్దరి వీ కూడ చినారికట్లే. వారందరూ ఒక కుటుంబములోని వారే.

కథ చెప్పేవానికి కుడి చేతి వైపు వాయించే వాయిద్యాన్ని జమిలిక అంటారు. ఈ వాద్యం యిత్తడితో చేయబడి మానికంత గుండ్రంగా వుంటుంది. ఆ గొట్టాని కొక వైపు పల్చటి చర్మం కప్పబడి దాని మధ్య నుండి, ఒక తీగ గుచ్చబడి యుంటుంది. ఆ తీగను గొట్టానికి మరియొక వైపు అమర్చబడి యుండి కర్రకు అమర్చి దీనిని మెడలో కట్టుకొని, చిన్న కర్రతో గుండ్రంగా తిప్పుతూ వాయించడం వల్ల ఒక తాళయుక్తమైన శ్రావ్యమైన ధ్వని యేర్పడుతుంది.

కథ చెప్పేవానికి యెడమ చేతివైపున తిత్తిపూడే వాడుంటాడు. తిత్తి చిన్న మేకపిల్ల చర్మంతో చేయబడి వుంటుంది. కథ చెప్పేవాని వెనుకగా పాట పాడేవా డుంటాడు. వారు గ్రామాలలో, రాత్రులు 9 గంటల మొదలు 12 గంటలవరకు, పుక్కిటి పురాణాలు చెప్పుతూవుంటారు. సినిమాలు అందుబాటులేని ప్రజలకిదే వినోదం. తోలు బొమ్మలాటలే వారి సినిమాలు. వారికి భోజనం పెట్టించి ఎన్నిరోజులు కథ చెప్పించుకొంటే, సుమారన్నిపదులిచ్చి సత్కరించడం ఆచారం.



2. పంబలవాడు.

వీరు కూడా మాలలే. వీరు అంకమ్మ దేవత కథ చెప్పుతారు. కథ చెప్పేవాని కొక చేతులో పెద్దకత్తి కూడావుంటుంది, రెండవ చేతిలో రుమాలు పైనీదివారిలో లాగే

వెనుక పాట పాడే వాడుకూడా వుంటాడు. తిత్తిగూడ వుంటుంది. కాని పక్కవాయిద్యం మాత్రం జమిలికకు బదులు చిన్న వీరణం వుంటుంది. కథచెప్పేవాడు బైనీడి వాని లాగా, నృత్యం చేస్తూ కథచెప్పుతాడు. ఈ కథలు చెప్పేవారికి, వీధినాటకాలలో రాజు వేషం లాంటి ప్రత్యేకమైన వేషం కూడవున్నది. మచ్చుకు కథ యీక్రింది విధంగా సాగుతుంది.

శిలానదిలో మొదలు లేని వృక్షము. అవృక్షాని కాధారములేని కొమ్మ. అకొమ్మకు తాడులేని వూయల అందులో అంకమ్మ దేవత వూగుతూ వుండగా తినను తిండిలేక యిబ్బందిపడేరాజులు, మా రా చ వా ర నే తొ మ్మి ది మం ది అన్నదమ్ములు, వచ్చి ఆమెను కొలచేరు. ధూపదీప నైవేద్యా లర్పించారు. ఆడపిల్ల పుడితే అంకమ్మ, మొగపిల్ల వాడు పుడితే అంకయ్య అని పేరు పెట్టు కొంటామన్నారు. ఆమెను బ్రతిమాలి తమ రామగిరి కోటకు తీసుకొని వెళ్ళారు. అచ్చట పాలవెల్లి చవికె కట్టించి, రత్నాల గద్దె కట్టించి, ముత్యాల ముగ్గుపెట్టించి, అమ్మవారినచ్చట ప్రతిష్ఠించారు. మారాచ వారి దారిద్ర్యం వైదొలిగింది. వారు పట్టు కొన్నది బంగారుమైనది.

ఇదికూడ వుక్కటి పురాణమే. వంశానుగతంగా తండ్రి కుమారునికి, కుమారుడు తన కుమారునికి చెప్పుతారు. నేటిపిల్లలు పైనా యుద్ధానికైనా పోతాము కాని కథ నేర్చుకోమంటున్నారట. పై ఫోటోలో కథ చెప్పేవాని పేరు గొల్లముచ్చు రోశయ్య, అతనిది కనిగిరితాలూకా యేరువారిపల్లె. తక్కినవారిది కనిగిరే.



3. కొమ్ములవారు.


పై ఫోటోలో కథ చెప్పేవాడు కొమ్ము వూదుతారు. ఈ కొమ్ము రెండు విధములు. సాదాకొమ్ము పెదకొమ్ము. రెండు యిత్తడి గొట్టాల నొకదానిలో ఒకటి అమర్చ దంవల్లనే, సాదాకొమ్ము పెద కొమ్ముగా యేర్పడుతుంది. సాదాకొమ్ము దారెదు

పొడుగు బాగా అర్ధ చంద్రాకారంగా వుంటుంది రెండు లేక మూడు మూరుల కొమ్ము వూది, పక్కన బెట్టి, యాదవ పురాణం అనబడే కాటమరాజ కథ చెప్పుతాడు వాసు మాదిగలు కథ చెప్పేవారు, తాళ్ళూరి పెదవోబయ్య వారి మురాలో వెనుక పాట పాడేవాడు లేడు తిత్తి వూదేవాడు బొత్యం ఢుడు. పక్క వాయిద్యం వారికి కూడా వీరణమేను వీరందరిది కనిగిరికి 3 మైళ్ల దూరంలో వుండే తుమ్మగుంట

వీరి నాయకుడు వొక్కశుద్ధిగలవాడు చాలా పిట్టి కథలు చెప్పగలవాడు అయినప్పటికిని వాక్శుద్ధి కొంచెము తక్కువే ఇతనివద్ద మదన కుంభినీ యుద్ధము, కాటమరాజుకథ మొదలైన తాళపత్ర గ్రంధములున్నవి వీరు యాదవరాజుల కీర్తిగాయకులు

శ్రీ మహావిష్ణువు గొల్ల-శ్రీ మహేశ్వరుడు గొల్ల-బ్రహ్మదేవుడు గొల్ల-బ్రాహ్మణుడు గొల్ల-చల్ల త్రాగిన వారెల్ల గొల్లలే నంటాడు. వీరు సుద్దుల చెప్పేవారు వీరి నుడులు వింటే, గోదావరి జిల్లా నృత్యగీతం' 'భామకలాపం' జ్ఞప్తికి వస్తుంది

కాటమరాజు కాలములో జరిగిన యుద్ధం, కనిగిరి తాలూకా నేరేళ్ళ వాగు ప్రక్కన యుండె గంగదేవళం పంచలింగాల కొండ ఎదుటనూ చింతచెట్టు, పాలేరు ప్రవహించే ప్రదేశంలో జరిగిన సంగతి చరిత్ర ప్రసిద్ధం ఖడ్గతిక్కన పాల్గొన్న యుద్ధమిది.



4 గంగదేవళం

ఇప్పటికి యీ దేవళాన్ని, పరిశుభ్రంగా వెల్లవేయించి వుంచుతారు. బిడుగుల వారనే పూజగొల్లలు - నిత్య ధూపదీప నైవేద్యాలర్పిస్తారు. ఆలయములో గంగమ్మతల్లి

శిలావిగ్రహంకూడా వున్నది. ఇక్కడ ప్రతి సంవత్సరం మేనెలలో జాతర జరుగుతుంది. పోలీసువారి బందోబస్తు, ఆరోగ్యశాఖవారు గూడారంకూడా వేస్తారు. చాలా దుకాణాలు పెట్తారు. కలప సామాను, రైతులకు పనికి వచ్చే వాసాలు, కూదాలు, బండి పుంటీలు మొదలైన సామానమ్మే పెద్ద సంత శింగ రాయకొండ కనిగిరిరోడ్డు కిరువైపులా వుండే చింతవనంలో జరుగుతుంది. దర్శి తాలూకాలో గంగవరం వద్ద గుంటెగంగ, దొనకొండ వద్దనుండె గంగదొనకొండ లోనూ, ఇదేప్రకారం ఏటేటా వుత్సవాలు జరుగుతవి. అచ్చుట బైనీడివారు మొదలైన జాతుల వారు తప్పక సమావేశమౌతుంటారు.

**4. పల్నాటివారు :**

వీరు పల్నాటి వీరుల చరిత్ర చెప్తారు. వారు మాలకులస్తులు. వారి దొరముతా కనిగిరితాలూకా బల్లపల్లి దగ్గర బాలవెంకటాపురంలో వున్నారు. కాని వాళ్లు సంచారంలో వున్నందువల్ల నాకు తటస్త పడలేదు. చెన్నకేశవ స్వామిని కొలిచే జాతులు వీరిని సత్కరిస్తారు. వారు మధ్య మధ్య కత్తితో గుండెలమీద కొట్టుకొంటూ కథచెప్తుతారు.

పై కులాలు వాటికి సంబంధించిన మూఢాచారాలు క్రమంగా నశించిపోతున్నవి. జాతరలలో త్రాగి తందనాలాడడం, జంతు బలి మొదలయినవి పూర్తిగా నశించకపో యినా, పై కులాలు గ్రామాదులలో విహాటన చేయడం తగ్గింది. దానికొక ముఖ్యకారణం సినిమాలు చవుకగా అందుబాటులోకి రావడమే.

వీరికి అక్షరజ్ఞానం, వాక్శుద్ధి వున్నట్టయితే, వీరిచ్చే ప్రదర్శనలు, హరికథలు బుర్రకథలలాగే, చదువులేని వారికే గాక చదువుకొన్న వారికికూడా వినోదం కలుగజేయగలవు. మైకుబెట్టి, స్టేజికట్టి, బాగా ఆర్కెస్ట్రాను డైరెక్టు చేసినట్లు, డైరెక్టుచేస్తే యీ వినోదాన్ని చాలా రక్తికట్టించవచ్చు కూడాను. కొమ్ము, పీరణం, జమిలిగ మొదలైన వాద్య పరికరాలు క్రమంగా ప్రచారంలో తగ్గిపోతున్నందువల్ల వానిని సేకరించి పురావస్తు శాలలలో పెట్టించవచ్చును.

క॥ పనుకర్మం బొనరించును, జననము మరణంబునదియ సౌఖ్యముందుఃఖ।
బును గావించుందన చేసినదానిం బడకపోవ శివునకువశమే ॥

అను. I. 34

దూత లక్షణము.

క॥ హితుడవు మతిమంతుండవు చతురవచనకోవిదుఁడవు, సమయజ్ఞుఁడవు।
న్నతవంశవర్ధనుఁడ వింగితవేదివి నెచ్చెలివి సుకృతి వట్లగుటన్ ॥

ఉ. 1. 52.

"అరాతులు సాధులమెత్తురే"

♣ I 25

♦ ♦ ♦ ♦ ♦

ఉరగవిభునిఁబట్టు గరుడుని క్రియఁ దలవట్టికొనియె

ద్రో I 169

♦ ♦ ♦ ♦ ♦ ♦

తే ఎక్కు డెక్కటి పెనఁగిననింతవట్టు, పెనఁకువలు నిట్టులేచునే, పృథివినింక
జనము లీకురుపాండవసంగరంబు సెప్పికొండ్రు మనంబులచ్చెరువునొంద ॥

ద్రో I 178

♦ ♦ ♦ ♦

ఆ గురునిమాట సరకుగొనమి దుశ్శీలత పిట్ట పుడుకగోరుపిసుకఁద్రుంపఁ
గలవ మరుగు టుదయకాలాస్తమయ సమయముల భానుఁజూచుటాయువడఁచు

అను IV 90

♦ ♦ ♦ ♦ ♦

శ్రీమయవక్షస్స్థలగౌరీమయవామార్ధ బంధురీకృతసాంద
ర్యామృతరస కీర్తన విద్యామయ నిగమాంతవేద్య హరిహరనాథా

అను II ( )

♦ ♦ ♦ ♦

"సంబనఁగా నియతాశనత్వము"

అను IV 82

♦ ♦ ♦ ♦ ♦ ♦

నన్నునేఁజెప్పికొందునే యెన్నడైన నాత్మసంస్తుతి పారవశ్యంబగునె

♣ II 153

♦ ♦ ♦ ♦ ♦ ♦

క॥ జ్ఞాతులుదమలోఁబొందిన జేతోమోదమున వెలిగి చెలువొందు దుర
న్నీతింబాసిన విగత విభూతింగడుకౌరవులట్లు పొగయుదు రధిపా ॥

♣ II 162

# 57.

# యక్షగానములు *

శ్రీ ఇంద్ల సుబ్బారావు. బి. ఏ. బి. యల్. నెల్లూరు.

ఆంధ్ర సాహిత్య ప్రక్రియలకెల్ల వల మానికములు యక్షగానములు. అవి ప్రారంభములో వినోద కాలక్షేపమున కేర్పడి యుండి యుండవచ్చును. కాని కాలక్రమమున ప్రత్యేక సాహిత్యశాఖగా వర్ధిల్లినవి. యక్షగాన మనగానే అది సుర, యక్ష, గంధర్వ, సిద్ధ, సాధ్య, విద్యాధరులతో నేమైనా సంబంధమున్నదా యని యనిపించును. సంగీత, అభినయ, నృత్య కళలకు సంబంధించిన గాంధర్వ విద్యగావున దీనికి యక్షగానమని పేరువచ్చి యుండవచ్చును.

పూర్వము వివిధదేశములందు వెలసిన నాట్య సంగీతప్రక్రియ లనేకములు మత ప్రచారము కొరకేర్పడి యుండుట చరిత్ర ప్రసిద్ధము. గ్రీకుదేశపు నాటకోత్పత్తికి మత సంబంధ ప్రతిపత్తియే కారణము. గ్రీకు విషాదాంత రూపకములు మృతయోధుని సమాధికడ జరుపబడు నపరకర్మగా నవతరించినవి. అటులనే మన యక్షగానములు గూడ మత ప్రచారనిమిత్త మేర్పడిన వినోద కాలక్షేపమై యుండవచ్చును.

బొమ్మలాటల పరిణామమే యక్షగానములని శ్రీ నేలటూరు వేంకటరమణయ్య గారి యభిప్రాయము. మతబోధ కొరకు మన ప్రాచీనులు తిరునాళ్ళ, జాతర యాత్రలందు పురాణ గాధలను జనసామాన్యమునకు గన్నుల గట్టునట్లు బొమ్మలాటలందు ప్రదర్శించు చుండిరి. బౌద్ధమత ప్రచారము కొరకు, అశోకుడీ మార్గ మవలంబించినట్లు అతని శాసనములవల్ల తెలియు చున్నది. సూత్రధారుడు కథను గేయముగా పాడుచు బొమ్మల నాడించును. అట్టి గేయములే యక్షగానములై యుండును. కాలక్రమమున బొమ్మలకు బదులు మనుజులు వేషములను ధరించి ప్రదర్శింప దొడగిరి. సూత్రధారుడు గేయరూపమున కథను పాడుచుండ నుచిత వేషధారులైన నర్తకులు అభినయములతో కథను ప్రదర్శించుచుందురు. నేటి కేరళ దేశపు కథకళి దీనికి తార్కాణము. ఇప్పటికినీ మన బొమ్మలాటవారు యక్షగానముల నబకు గేయములనే పాడుచుందురు. బొమ్మలాటలకుగాను. వ్రాయబడిన యక్షగానము లనేకములున్నవి.

హరికథలు జంగముకథలు కూడ యక్షగానములలోని భాగమని కొందరి అభిప్రాయము. హరికథలు సర్వసామాన్యముగా మతప్రచార సాధకములు. ఆంధ్ర వాఙ్మయమున యక్షగాన ప్రసక్తి పాల్కురికి సోమనాధుని పండితారాధ్య చరిత్రలో క్రీ॥శ॥ 1280 గన్పట్టును. శివరాత్రి శ్రీశైల యాత్ర జాగరణములందు వినోద కాలక్షేపము లనేకములు వర్ణింపబడెను.

పాల్కురికి సోమనాదుడు తన రచనలో దేశీయ సంగీత నాట్య ప్రక్రియలు

పేర్కొనెను గాని యక్షగానముల పేరును వాడియుండలేదు. ఈ స్వల్పాధారముతో అప్పటి యక్షగానముల రూపురేఖలు ఇది మిత్థమని నిర్ణయించుట కవకాశము లేదు. క్రీ॥ శ॥ 1430 శ్రీ నాదుని భీమఖండ మందు యక్షగానముల ప్రశంసగలదు.

«కీర్తింతు రెవ్వాని కీర్తిగంధర్వులు
గాంధర్వమున యక్ష గానసరణి»

అని మొట్టమొదట యక్షగానమనెడి శబ్దము వాఙ్మయమున గనపట్టుచున్నది. యక్షగానమన్నది యొక గానసరణి. జక్కులవారను నొక తెగవా రీసరణి నవలంబించి గానముచేయుచు నృత్యములు చేయుచుండెడి వారనుటకు క్రీడాభిరామమున జక్కులపురంధ్రి యిందులకు తార్కాణము. యక్షగానములలో సంబంధం గలిగినవారుగా నూహింపదగినవా రాంధ్రదేశమున జక్కులవారు. వారొక తెగకుచెందిన కళావంతులు. యక్ష (జక్కు) శద్దము వారి జాతిని దెల్పునట్లుగా బరిణమించినది. ఆంధ్రదేశమున కర్నూలుజిల్లాలో జక్కసాని కుంట్ల, గుత్తితాలూకా జక్కలచెరువు, హిందూపురం తాలూకా జక్కసముద్రము మొదలగు గ్రామములపేర్లు జక్కులకు సంబంధిచినవే. జక్కురేకులను పదములు, జక్కిణి యను నృత్యవిశేషము వీరిపేరనే వెలసినవి.

యక్షణీ శబ్దభవమే జక్కిణి. జక్కిణి మతంగుని బృహద్దేశియమున లాస్యభంగుగా జెప్పబడినది.

కూచిపూడి భాగవతుల సాంప్రదాయక నాట్యములలో జక్కిణి దరువొక్కటి అందరకు తెలినదే.

యక్షగానముల నాధారముగా జీవించువారగుటచే వారికి జక్కులవారని పేరు కలిగియుండును. లేదా జక్కులవారిచే జీవనముగ గ్రహింపబడు సరణిగావున వాటికి జక్కులపాటలని పేరుగలియుండును జక్కులపాటలే యక్షగానములై విలసిల్లినవి.

డా॥ పి. వి. రాజమన్నారుగారు చెప్పినట్లు యక్షగానములు, సంగీత సాహిత్యములకు ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డ. ఇవి నాట్యగాన ప్రధానములైన దేశీయరూపక విశేషములు.

యక్షగానములందలి భాష బ్రజల వాడుకభాష నుడికారము జాతీయత నెక్కువగానుండి జనబాహుళ్యమున కుద్దేశింపబడియుండును. అప్పకవి పేర్కొనినట్లు రగడ భేదములేగాక పలువిధములైన దేశీయరచనలు యక్షగానములందు కానవచ్చుచున్నవి ప్రబంధలక్షణములు కొన్ని నాటకలక్షణములు పలురకములైన దేశీయ ఛందస్సులు పద్య గధ్యములు కలగలుపుగా గనిపించును మార్గపద్ధతి ననుసరించిన రూపకనిర్మాణమునగల అంకాది విభాగములు, విష్కంభాది ఉపవిభాగము లుండవు. ముఖ నిర్వాహణ సంధులతో కధావస్తువు ప్రదర్శింపబడును.

తొలుదొల్త విద్వాంసులు యక్షగానములుగా రచనలు సాగించక పోయినను క్రమముగా ప్రజాదరణ, రాజపోషణ గలుగుటచే, పెక్కురు వానినిచేబట్టిరి. తంజావూరు నాయక రాజుల కాలమున యక్షగానము లనేకములు రచియింపబడినట్లు తెలియుచున్నది.

క్రమముగ సంస్కృతాంగ్ల నాటక ప్రభావమున తెలుగునాటకము లవతరించిన పిమ్మట, రచయితల సంగీతజ్ఞానము సన్నగిల్లినందున యక్షగానములు వ్రాయువారి సంఖ్య తగ్గిపోయినది.

యక్షగానములు నెల్లూరు మండల కవులను ఎక్కువగా ఆకర్షించినట్లు తెలియుచున్నది. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర వ్రాసిన శ్రీ య. స్వి జోగారావుగారు పేర్కొనిన యక్షగాన కవులలో చాలమంది నెల్లూరుమండల వాసులైయున్నారు. అన్నిటి కంటె ముఖ్యముగా ప్రథమాంధ్ర యక్షగానమైన ,,సుగ్రీవవిజయము రచించిన కందుకూరు రుద్రకవి, నెల్లూరు మండలము వాఁడు. ఆకారణముచేత మండల విశిష్టతను చెప్పునప్పుడు నెల్లూరుమండల కవులు యక్షగాన వాఙ్మయమునకు చేసిన సేవను చెప్పకుండుటకు వీలులేదు.

1. • రుద్రకవి. ఇతడు కందుకూరులో వేంచేసియుండు జనార్ధనస్వామిని తన సుగ్రీవవిజయమునకు కృతిభర్తను జేసెను.

సుగ్రీవవిజయమందలి కథ రామాయణ కిష్కింధకాండనుండి గ్రహింపబడినది. ,,నాయెనర్పంబూనిన సుగ్రీవవిజయంబను యక్షగానంబునకు గథాక్రమం బెట్టిదనిన'' అని కథనారంభించెను ,,కరుణ భాసుర యక్షగాన ప్రబంధమని'' కవియే చెప్పియున్నాడు.

శ్రీరామ సీతావిహరము, నేలకొరిగిన వాలి వాదము, తారావిలాపము, మొదలగు సందర్భము లిందుకు నిదర్శనములు, ఇది శ్రవ్యదృశ్య ప్రయోజనాత్మకమైనదిగా దోచుచున్నది.

రుద్రకవి సుగ్రీవవిజయమును నేటికిని స్త్రీ వృద్ధ పామరాదులు వలువురు పాడుచుందురు.

ఇందు వాలివధమును గూర్చి పుర జనులచే కవిచేయించిన వాఖ్యాన మింపుగానున్నది. ''అయ్యో రాముడీవాలిని నిష్కారణముగనే చంపెనని కొందరనిరి'' సుగ్రీవుడు ద్రోహియై యన్నను చంపెను యిందు రామునిదోషమేమున్నదని కొందరనిరి. ''వాలి తారయు కొడుకు వలదని యెంత చెప్పుచున్నను వినక క్రొవ్వి యుద్ధమున తానేచచ్చెనని కొందరనిరి'' మనకేమిటికి వాలి ఇనతనూజుడు మేలుజనుల పాలిట వాడని యిష్టా నిష్టములను తటస్థతను వ్యక్తపరచిరి ఏ విషయముపైనైన అభిప్రాయ భేదములుండుట సహజముగదా.

ఇందు జంపె కులచజంపె ద్విపదలు ధవళులు, ఏలలు, అర్ధచంద్రికలు త్రిపుట అటతాళములు మున్నగు రచనలుగలవు. యక్షగానమునందు మొదటిదయ్యును, శ్రేష్ఠమై తరువాతివారలకు మార్గదర్శకమై యలరారుచున్నది.

2. • కంకంటి పాపరాజు :

ఈతడు తన విష్ణుమాయావిలాసమను యక్షగానమును శ్రీ మదనగోపాలుస్వామికి అంకితమిచ్చినాడు.

వ॥ విష్ణుమాయా విలాసంబను యక్షగానంబు రచియించి యాకృతికి నేవేల్పు

---

• ఈ యిరువురు కవుల చరిత్రలు వ్యా 19, యందు వివరింపబడి యున్నవి.

నధిపతి చేయుదునాయని తలంచుచున్నయెడ మత్కార్యహితఘటనాభి ముఖులగు కవి తిమ్మనార్య ప్రముఖులే లేమనుచున్నారు''

సీ॥ వరుస మీముత్తాత వల్లభామాత్యుండు
కృతకృత్యుడైమించె కృష్ణుగొల్చి
ఘనుడు మీతాత అయ్యనమంత్రి మదన
గోపాలు మంత్రోపాస్తి ప్రతిభజెందె
కరుణాద్రి మీతండ్రి కంకంటి అప్పయ
ప్రముఖుడు కా వృతశక్తి బాగుమీరె
శ్రీ వత్స గోత్ర వారిధి కౌస్తుభమురీతి
వారికంటెను నీవుమీరినావు.

గీ॥ పరసమాగర్వశరధిరత్నంబునీదు
తమ్ముడగునారసింహు చిత్తంబునిదియె
భక్తి కృతియమ్ము మదనగోపాలునకు
సద్గుణని దాన చాపరాయ ప్రధాన
అని తిమ్మనార్యుపంపున మదన గోపాలునికి అంకితమొసంగెను.

క్షీరసాగమథన సమయమున శ్రీ మహావిష్ణువు మోహినీ రూపమున రాక్షసులను వంచించి దేవతలను రక్షించినతరువాత మోహినీ ఉదంతము నారదునివలన విన్నవాడై కామదహనుడు ఆ మోహినీ విలాసము జూచి మోహించుట యిందలి కథాక్రమమై యున్నది. ఇందలి మోహినీ వాలకము నెల్లూరు నెరజాణల నేర్పంతయు కన్పట్టునటుల చిత్రించబడినది.

విష్ణుమాయావిలాసము శ్రవ్యదృశ్య ప్రయోజనాత్మక మైనదిగా విలసిల్లినది. ''భామిని దిలకించి బుధులెల్లపొగడ'' నిది బొసిల్లునని కవి ఆశయము.

3. తేకుమళ్ల రంగశాయి :

నెల్లూరు మండలకవి. జానకీపరిణయమును యక్షగానము రచించినట్లు యితని కృష్ణదండకములో జెప్పబడినది ఇతడు కంకంటి పాపరాజుకు సమకాలికుడు. ఈ జానకీ పరిణయమిపుడు లభించుటలేదు.

4. తేకుమళ్ల మృత్యుంజయుడు :

శ్రీ గౌరిశంకరవిలాసమను యక్షగానము రచించెను. తలమంచి గ్రామవాసి.

ఇందలి కథ తలమంచి పురమున గౌరీసమేతుడైయున్న రామలింగేశ్వరుడు భక్తులనుబ్రోచుటకై అడవికిపోయి తాపసినులతో క్రీడించుచుండెను.

దేవి విరహావస్థ. నారదునివలన అన్నియూతెలిసిన అంబ భవనాంభ్యంతరమునకుబోయి తలుపులు వేసికొనును. స్వామి ద్వారబంధమువద్ద దేవిని ప్రార్థించును. చివరకు భక్తులను బ్రోచుటకై అంబస్వామిని గలియును.

మునుల తపస్సే స్త్రీ రూపములు దాల్చెను. ఆ స్త్రీవిగ్రహములతోడి రతియే పార్వేట. అంబ విరహ, సంభోగ, విప్రలంభ శృంగార రసపూరిత మీయక్షగానము.

5. పరమానంద తీర్థయతి :

ఈతడు నెల్లూరు ప్రాంతమువాడు. ముక్తికాంతా పరిణయమను పదబాళికను రచించెను. దీనిని కవి యక్షగానమని చెప్పలేదు. ఇతనికి దత్తాత్రేయయోగి గురువుగా నుండెను, నెల్లూరున దత్తాత్రేయమఠమిప్పటి పురమందిరమున కెదుట నుండినట్లును, నామఠము నాశ్రయించి గ్రంధకర్తలనేకులు బయలుదేరిరనియు తెలియుచున్నది. పరమానంద యతికాలము క్రీ॥ శ॥ 1600 ప్రాంత

మని యూహింపబడుచున్నది. పదదాశిక యనగా పాడుచు రసమును అభినయరూపమున నావిష్కరించుట.

ఇందలికథ. సచ్చిదానందపురాధీశుడు తనపుత్రికయగు మోక్షకన్యకు స్వయంవరము చాటించును. వివిధమాతాధిపతులు, దేశాధిపతులు గలసభయందు కన్య ఒక్కొక్కరిని ఒక్కొక్కనెపమున తిరస్కరించి మోక్షకాంత సద్గురుడుదైవమని విశ్వసించి వేదాంతమతస్థుడగు వివేకజీవేశ్వరుని వరించుట ఇందలి ప్రధానవిషయము

ఈముక్తికాంత పరిణయగాథ యితివృత్తముగా చాలమందికవులు యక్షగానములు రచియించియున్నారు. ఇందలికథ రామణీయకతే యిందులకు కారణమై యుండవచ్చును.

6. పష్టుల నరసింహకవి :

దుష్యంత చరిత్రమను. యక్షగానమును కవి పెంచలుకోన, నరసింహస్వామికి అంకిత మొనర్చెను. కృతి ప్రోత్సాహకుడుగా ‹‹శ్రీ మన్మహామండలేశ్వర సంద్యాల నారాయణరాజు దేవ మహారాజులుగా‹ జెప్పబడినది. ఇందలికథ జగమెరిగినదే. కవికాలము క్రీ॥ శ॥ 1698

7. నరుకూచ నారాయణకవి :

పారిజాత నాటకమను యక్షగానమును రచించెను కవి నరుకూచ వాస్తవ్యుడు. ముత్తయ్య కాశమాంబ పుత్రుడు. కొండూరు వెంకటాచార్యుని శిష్యుడు. ఇది వేంకటగిరి రేచర్ల గోత్రజుడు, వెలుగోటి బంగారు యాచమనాయకుని కుమారుడైన కుమార యాచమనాయకుని కంకితముయచేబడెను. క్రీ.శ. 1777-1805. ఇతివృత్తము ప్రసిద్ధము. తిమ్మనార్యుని ప్రబంధమును చూచి తానీనాటకమును రచించినట్లు కవి చెప్పియున్నాడు. దీనికి అటభాగవతమని పేరుగలదు.

8. ఇటిపెల తిమ్మయ్య :

నెల్లూరుమండలకవి. కన్యకాపురాణమను యక్షగానము వ్రాసెను. తండ్రి చెన్నమశెట్టి. తల్లి లక్ష్మమ్మ శివరామయ్య ఈతని గురువు. గ్రంథవిషయము వైశ్యుల ఇలవేల్పు చరిత్రము. ప్రదర్శనకు బనికిరాదు.

9. అగస్త్యరాజు రామన :

అక్కమాంబా చెన్నమంత్రుల పుత్రుడు. ఇతని గ్రంథమున పామూరు (కనిగిరితాలూకా) మదన గోపాలస్వామి ప్రశంసగలదు. ఈతడు రచించిన సీతాకల్యాణమును, యక్షగానము సుగ్రీవ విజయమును బోలియున్నదిగాని అంత ప్రాచీనమైనదిగాదు. క్రీ॥ శ॥ 17-18 శతాబ్దముల నడిమకాలమున రచింపబడి యుండవచ్చును ఇందు సీతకడకు శ్రీరాముడే యెరుకతయై వచ్చుట విశేషము.

10. భారతి రామరాజు :

మాగధ వంశీయుడు. భాస్కర పుత్రుడు గ్రంధములన్నియు నితడు పోట్లమర్తి హరికి అంకితములుచేసెను. పోట్లమర్తి కడపజల్లా యందుగలదు. కాని యితడు నెల్లూరు మండల కవియైనట్లు నెల్లూరు మాన్యుయల్లో గలదు. ఇతని రచనలు,

1) జలక్రీడలు, భాగవత దశమస్కంధము పూర్వభాగ కథగలదు. కృష్ణునియాగడములు, గోపికలు యశోదతో చెప్పుట, గోపికా వస్త్రాపహరణము మొ.ఇదిచదువుట కును నటింపబడుటకు నుద్దేశింపబడినదని గ్రంథకర్తచే చెప్పబడినది.

2) గొల్లభామవేషము మొదట చల్ల నమ్మ వచ్చిన గొల్లభామకు ఒక బ్రాహ్మణునకు సంభాషణ. హాస్యరస ప్రసంగము లధికము. భారతి రామరాజు బాలింత వేషకథ 'పారిజాతము' కూడ వ్రాసెనని యందురు.

11. కొండూరు సీతారామకవి :

ఇతడు కొండూరు వేంకటేశ్వర వేంకమాంబల పుత్రుడు. నెల్లూరుజిల్లా వంగల్లు వాస్తవ్యుడు శివపారిజాతము,లీలావతి చరిత్ర కృష్ణవిలాసము,సావిత్రినాటకము మనయక్షగానములు రచించెనుఇతడుసావిత్రీనాటకము ఇందూరి నరసింహారెడ్డి ప్రోత్సాహమున మట్టి నగర చెన్నరాయని కంకితముగా రచియింపబడినది.

సావిత్రి చరిత్రము మూడురాత్రుల ప్రదర్శనకుగాను విశేషముగా విస్తరింపబడినది.

12. వరగంటి శేషగిరిదాసు :

ఈతని గ్రంథము జగన్మోహన శ్రీకృష్ణవిలాసము. వంగీపురం రంగాచార్యులచే క్రీ. శ. 1876 లో ప్రకటింపబడియెను.

వేణుగాన మాలించిన గోపికలు తమపనులుమాని శ్రీకృష్ణని వెదకుచుపోవుటయు,నాతడు వారలతో బాలతడవు నయ్యాటలాడి ప్రసన్నుడగుటయు, నిందలివిషయము. ఇతని యితరకృతులు సంగ్రహ రామాయణము,అష్టపదులు,భాగవత, రామాయణ అంధ్రీకరణములు. భక్తవత్సల శ్రీరామ సుధాకరము,హరికీర్తనలు, కుచేలోపాఖ్యానము, ధ్రువచరిత్ర, భగవద్గీతా వ్యాఖ్యానము. ఈయన రామాయణము యక్షగానము వ్రాసినట్లుకూడ తెలియున్నది గాని అగ్రంథము కనబడుటలేదు.

13. వరగంటి వేంకట రమణదాసు :

ఇతడు శేషగిరి దాసుపుత్రుడు. దండధరవిలాసము రచించెను. నెల్లూరు మూలాపేట వాస్తవ్యుడు. ఈ గ్రంథమునకే వికటవాది చరిత్రమని నామాంతరముగలదు.

ఇది గరుడ పురాణాంతర్గతమైనది. తండ్రి కుమాళ్ళ కృతులు యక్షగానములని పేర్కొనబడినను హరికథా ప్రాయములైన రచనలు. కవికాలం 1887 ప్రాంతము.

14. కురిచేటి సుబ్బరాయకవి :

ఈతని గ్రంథము గౌరీశంకర విలాసము. కవి విశ్వకర్మ కులస్తుడు. నాగలింగయ పుత్రుడు. అనుమలగిరి శివరామయ్యా శిష్యుడు. కాలం క్రీ॥ శ॥ 1889. రచన ప్రోత్సాహకుడు మినగంటి వాస్తవ్యుడు బండి వీరరాఘవరెడ్డి.

కథాక్రమము : మున్ను పలువురు వ్రాసిన శివపార్వతుల విహారము గౌరీ శంకరుల సంవాదము యక్షగానమని గ్రంథమందు పేర్కొనబడినది.

15. పడకండ్ల స్వామిరాయకవి :

ఇతడు ఆత్మకూరు తాలూకా పడకండ్ల గ్రామవాసి. కరిణీక మీతని వృత్తి,

కవిప్రథమ శాఖనియోగి కాశ్యపగోత్రుడు. నరసయ మంత్రి ప్రపౌత్రుడు, అన్నమరాజు పౌత్రుడు అక్కరాజు పుత్రుడు తల్లి లక్షమ్మ వీరదేశికుడితని గురువు.

కవి ,,వరగ లక్షణ కన్యకాపరిణయంబు నాటకముచేసి యాడించినాడ జగతి' యనిచెప్పుకొన్నారు.

16. చదలవాడ సూర్యరామకవి :

కవి గయోపాఖ్యానము యక్షగానమును రచించి దానిని గేయప్రబంధమనెను. చదలవాడ లక్షమాచ్యుతరామయ్యలకు పౌత్రుడు. సుబ్బలక్షమా సుబ్బరామయ్యలకు బుత్రుడు. నెల్లూరు తాలూకా అనంతవరం వరకవిపూడి గ్రామవాసిగా గన్పట్టుచున్నాడు. ప్రచురణకాలం 1889సం॥ వీరరాఘవ ముద్రాక్షరశాల నెల్లూరు.

17. గాయకవాడ పెద్దన :

ఇతడు మహారాష్ట్ర గాయకవాడ వంశజుడు. కాశ్యపగోత్రుడు అపస్తంబసూత్రుడు. నాగాయామాత్యపుత్రుడు, మెట్లవారిపాళెం వాస్తవ్యుడు. నలచరిత్రము, జంగము కధ,నలచక్రవర్తి నాటకాలంకారములు,హరిశ్చంద్రనాటకము, యితనికృతులు ఇతడు 1893 ప్రాంతమువాడని స్పష్టమగుచున్నది నలచక్రవర్తి నాటకాలంకారమును శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి అంకితమిచ్చెను హరిశ్చంద్రనాటకము వెలిగండ్ల నివాసి తోటరామనాయుని ప్రోత్సాహమున రచింపబడినది.

18. గొట్టెముచ్చు అబ్బయదాసు :

కావలితాలూకా మట్టిగుంట గ్రామవాసియగు రంగదాసు సుతుండు. పంచమ కులవైష్ణవుడు. తాను గాయకవాడ పెద్దన శిష్యుడనని గ్రంథములన్నిట చెప్పినాడు.

ఇతడు 20 శతాబ్దము పూర్వభాగమున నుండినట్లు చెప్పవచ్చును. ఇతనికృతులు. వీరవిజయవిలాసము (వెలిగండ్ల) శశిరేకాపరిణయము (మట్టిగుంట) ద్రౌపదీ కల్యాణము (పీమలవంట) సుందరసైంధవ గార్ధభ పరాభవనాటకము (ఆదిమూర్తి పురము) ఈ నాల్గును నెల్లూరు మండల మందలి ఆయా గ్రామ కామందుల ప్రోత్సాహమున రచింపబడినవి.

19. త్వరకవి రామకృష్ణయ్య :

ఇతడు శౌనకసగోత్రుడు. సీతమాంబా మంగనామాత్యుల పుత్రుడు పిలుకానిపల్లి వాస్తవ్యుడు ఈయన ఈ శతాబ్ద ప్రథమపాదమున నుండిరనియు యక్షగానముల ప్రదర్శనలు గావించుచు అమతానుకూల పాల్గొనుచుండెడువాడనియు దెలియుచున్నది. తాను నానావిధ యక్షగానములు రచించితినని చెప్పియున్నాడు. అందు భవానిశంకరవిలాసము, వీరభద్ర విజయము, విష్ణుమాయా విలాసమనునవి దొరకుచున్నవి. భవాని శంకరవిలాసము గద్యలో రచింపబడినది అతని యితరకృతులు రుక్మిణీ, రతి, ద్రౌపది పరిణయములు. ధ్రువోపాఖ్యానము తులసీ మాహాత్మ్యము, చెన్నకేశవ సంవాదము, రుక్మిణీసంవాదము, గోపాల మాహాత్మ్యము,గోపాల స్థలపురాణము, గజేంద్ర మోక్షము, సహస్రకంఠ రామాయణము.

భవానిశంకరవిలాసము యక్షగానము కొరుటూరు వల్మీకనాధస్వామి కంకితము చేయబడినది. పంజిమిట్ట రామలింగస్వామి నాయుడు కృతిప్రోత్సాహకుడు. దాసరాపన

మునికాంతల గూడివచ్చిన వాల్మీకనాధునకును, గామాక్షిని జరిగిన సంవాద మందలి కథావిషయము. వనకాంతలను గూడుటనగా మునులతపస్సులను గ్రహించుట. భక్తవల్లభుడు, భక్తులకొరకు నిజకాంతను వీడి భక్తి కాంతలతో క్రీడించుట.

వీరభద్రవిజయము, ఇందుకూరుపేట నివాసి సూరి సుబ్బానాయుని ప్రోత్సాహమువల్ల రచియింపబడినది. ఇందు దక్షయజ్ఞధ్వంసమునుండి గౌరి కల్యాణమువరకు గల కథ వర్ణితము. ఈరెండుకథలు "వాయుపురాణోక్త ప్రకారంబున రచింపబడిన యక్షగానములు"

ఈతని విష్ణుమాయావిలాసమున, తానుకృతి రచింపబూనిన కావ్యంబెట్టిదనిన.

గీ॥ సర్వవేదగీతశాస్త్ర పురాణేతిహాస
దేశకాలభాసితంబు
నీ పాదారవిందనిర్మలధ్యానంబు,
సకలవిషయసారసంగ్రహంబు॥

"గావున విష్ణుమాయా విలాసంబను మహాకావ్యంబు దెనుగున నాటకాలంకార కావ్యంబుగా విరచింపంబూనితిని" అని చెప్పియున్నాడు. కావ్యమందు ఇందుపూరి చెన్నకేశవ శౌరిని తలచి విరచించినట్లు చెప్పబడియున్నది.

ఇందు విష్ణుదేవుడు జూదమాడవలయునని తన మనోభీష్టంబు చెలితోచెప్ప అందుకు అత్తాకోడండ్రు సరస్వతీ, లక్ష్మివారి యామోదము చూపక" జూదంబువలన వాదంబును, ఖేదంబును, ఖేదంబును బుట్టుగాని మోదంబు గలుగదు "అని విష్ణుదేవునికి విన్నవించుకున్న "యవియట్లుండ నిమ్ము మన మిరువురము నేతత్కాలంబున సరససల్లాపంబుగా మన సరస్వతిని సాక్షిభూతంబుగా నుంచుకొని జూదంబాడిన నా జూదంబు వలన మోదంబును నాహ్లాదంబును గాని వాదంబుబొసగదు. ఖేదంబుబుట్టదు. ఖేదంబుగలుగదు' 'అని నేనోడిన నాకౌస్తుభ రత్నంబు నీకిచ్చద నీవోడిన నీశిరోరత్నంబు నాకిమ్ము యిదియెబన్నిదంబు' అని పందెములు పెట్టి యాడిరట.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని కూడ బందెములేని జూదమందు పసలేనట్లున్నదిగదా! ఇక అల్ప మానవకోటివిషయము చెప్పవలయునా "గ్రంథము సాంతముగా దొరకనందున పూర్తికథ" చెప్పుటకు సాధ్యముకాలేదు. దీని వ్రాతప్రతి శ్రీ అకలి శంకరయ్యగారొసగిరి.

**20. పురాణం పిచ్చయ్య :**

ఇతడు మనమండల పుదూరు ద్రావిడ శాఖకు జెందిన విద్యత్కవులలో నొకరు. తల్లి దండ్రులు సావిత్రీ లక్ష్మీనృసింహులు. తాతముత్తాతలు కేశవ కృష్ణాచార్యులు నేలటూరు వేంకట రామాచార్యులు గురువులు. ఈయన 1871-1951 సం॥ నడుమనుండిరని తెలియుచున్నది. వీరు మైరావణచరిత్ర, కపటవేశ్యా నాటకము, శశిరేకా పరిణయము, యక్షప్రశ్నలు, అర్జునవిజయము చిత్రాంగి సారంగధరము, గౌరీశంకర సంవాదము, మొదలగునవి వ్రాసిరి. కపటవేశ్యానాటకమున కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానము నందలి కధ గ్రహింపబడినది. కవి తనకృతులు యక్షగానములనియు యక్షగాన నాటకములనియు నాటకములనియు వ్యవహరించెను. వీరి కృతులపై హరికథల జంగంకథల ప్రభావము గోచరించును.

21. కాలంసెట్టి గురవయ్య :

కవి నెల్లూరు వాస్తవ్యుడు. బలిజకుల జుడు. ఇతని కృతులు చిత్రాంగినాటకము పురూరవ చక్రవర్తి జనన నాటకము. కాలం 1908 సం॥ అని ప్రచురణవలన తెలియుచున్నది.

రెండు కృతులును నాటకములనియే పేర్కొనబడినవి. కాని బాణీ యక్షగాన సరణి.

22. తిరుపతి చెంచు సుబ్బదాసు :

ఇతని నివాసము వేంకటగిరి ప్రాంతములోని కొచ్చెర్లకోట తల్లిదండ్రులు వరలక్ష్మి వేంకటరామాఖ్యులు. గురువులు మునలయాచారి. ఈతని రచన ఉషాపరిణయము. కృతిభర్త హాదిలి తాలూకా వల్లాయపుర నివాసి పాతకమూరి లక్ష్మీనరసింహం. ఈకవి నారాయణతత్త్వ విలాసమును నింకొక యక్షగానము రచించినట్లు తెలియుచున్నది.

23. పోకూరి సుబ్బరాయుడు :

ఇతడు కావలితాలూకా బ్రాహ్మణక్రాక నివాసి. ఈతని రచన శ్రీ హనుమద్విజయము, మైరావణ నాటకము.

కవివంశావళి :

సీ॥ వసుధ విశ్వబ్రాహ్మణవంశ సాగర
మందు జనియించినాడను।
ఘనముగాను పోకూరువారని లోకులు
పొగడంగ వెలిగి
పెద్దలసేవలు జేయువాడ సుబ్బరాయా
ఖ్యచే పెంపొంది
పార్వతీ పరమేశ్వరులచే గెల్వబడిన
వాదా కామాక్షమాంబిక
ఘనసుబ్బరాయల తనయుండనై కీర్తిదనరి
నాడ మదివేడ్కచే
ధర మైరావణునికథ యక్షగానముగ
వ్రాయంగమదిని
దలచి సత్కవిబృందము గొలిచిభక్తి
బ్రాహ్మణక్రాక
వేణుగోపాలుపేర నంకితమొనర్తు
శబ్దకావ్యాదులెరుగ,
తప్పుమన్నింపవలయు విద్వాంసులార
అని వినుతించినాడు ॥

ఈతడు చెరుకూరు బ్రహ్మేంద్రగురుస్వాములవారి శిష్యుడు మైరావణ నాటకము క్రీ॥ శ॥ 1914 ముద్రింపబడియెను. ఈకవి యితరకృతులు. గుణతారావళి, ఉమామహేశ్వరశతకము, త్రిపురాసురవధ, మానవధర్మ ప్రదీపిక. వచనరీతి లఘు వైద్యశాస్త్రము. సుందరాకాండ యక్షగానము.

24. పోట్లమర్తి భారతి రామరాజు పార్లపల్లి నివాసి :

ఉమామహేశ్వర విలాసమును యక్షగానము రచించెను. ఈకృతి ములుమూడి నారాయణరెడ్డి పౌత్రుడు వెంకట్రామరెడ్డి కుమారుడు నారాయణరెడ్డి ప్రోత్సాహమున రచించినట్లు తెలియుచున్నది.

గ్రంథము చక్కని శైలిలోనడిచినది యడవల్లి రామశాస్త్రి (బుచ్చిరెడ్డిపాళెం) వారిచే 1896న పరిష్కరింప బడినది.

కథావిశేషము పార్లపల్లి పార్వతీపతి ఉమతో విహరింపబోయి పార్వతిని విడిచి భక్తులను బ్రోచుటకు పోవును. ఉమావిర

హాము ఉమామహేశ్వర సంవాదము, ఇందలి వర్ణనయే అతిరమ్యములు. సూర్యాస్తమయము చక్కగా చెప్పబడినది.

క॥ బాలుండగు హిమధాముని పైలక్ష్యము
నిల్పి గగనభామిని వృద్ధుండేలా రవి
యని త్రోసిన జాలింబడి సూర్యుడపర
జలధిని మునిగెన్ ॥

ఆంధ్ర భాగవతము దశమస్కంధమునలోని పద్యమునుస్ఫురింప జేయుచున్నది.

క॥ తరుణుండగు శీతలకరు।
మరిగి, వియల్లక్ష్మి దన్నుమాని మతు
కడున్
ఖరకరుడున్నవి ద్రోచిన
కరణిన్ రవి పశ్చిమాద్రికడ
గ్రుంకెన్నృపా ॥

25. పెళ్లూరు మస్తానయ్య :

ఈతడు కులాలకులజుడు. రాకా కుంబార్ దాసు చరిత్రమును. పండరీపుర మహాత్యమును రచించెను. కవి దీనిని హరికధగా రచించినట్లు చెప్పియున్నాడు. నివాసము సంతపేట. 1958 ప్రాంతమువాడు ‹‹ఇది శ్రీ రాజయోగ మార్గంబును చెల్పిన గుంటూరు వాస్తవ్యులగు బ్రహ్మశ్రీ సత్యనారాయణ యోగిగారి పాదసేవకుండును, శ్రీ విష్వక్‌సేన వరప్రసాదలబ్ధి కవితా విలాస నలవంశ చంద్రసుధీర రాఘవదాసుగారి ప్రియ శిష్యుండును కుంభకార వంశజుండైన పెళ్లూరు వంశపారావార భక్తి దాసోహం బను వెలుగుచే ప్రకాశింపబడు కాశయ్యసెట్టి జేష్ట కుమారుండగు మస్తానుదాసుచే విరచితంబైన, శ్రీ రాకాదాసుని చరిత్రము పండరీ మహాత్యమున్ను సింహపురి వర్ణనముగ ఈ నిష్కామ యోగంబును గ్రంధము!! అని అంత్య పలుకులుగా కవి వ్రాసుకున్నాడు.

26. యరగుడిపాటి వేంకటాచలం పంతులు :

ఈయన రాసక్రీడయను యక్షగానమును రచించినట్లు ఈతని ప్రపౌత్రుడు శ్రీ. వై. . సుబ్రమణ్యంగారొక అముద్రిత గ్రంథము చూపిరి

ఈయన యక్షగానమున శ్రీకృష్ణుడు గోపికలు బృదావనమందు సల్పిన రాసక్రీడతే యితివృత్తము, వివిధవృత్తగీత సంవృత్తమై నానావిధ వర్ణలతో రసవత్తరముగా వీకావ్యము రచింపబడినది శ్రీకృష్ణుడు గోపాంగనలకు స్వకీయ తత్త్వోపదేశము చేయు ఘట్టము రమ్యముగా వర్ణింపబడినది.

కవి యితరకృతులు:భక్తిగీతము, ఘటగీతము,పద్మావతి చరిత్రము(వచనకావ్యము)

ఈ వ్యాసరచనకు ఆధారభూతమైన గ్రంథములు.

1. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర; యస్వీ జోగారావుగారు.

2. కుతుబ్‌షాయి సుల్తానులు, వ్యాస సంపుట సంపాదకుడు బి. రామరాజుగారు. వీరికి నాకృతజ్ఞతలు తెల్పుచున్నాను.

# 58.

# ఆశ్వికకందుకక్రీడ

## (పోలో ఆట)

చాళుక్య సోమేశ్వరుని (1131. AD.) అభిలషితార్థ చింతామణి-(మానసోల్లాసము) Vol II

అధ్యా VI పే 221-224

స్వపక్షే స్థాపయేదష్టావష్టౌ పక్షాన్తరేఽపి చ ।
అన్తఃపురైః కుమారైశ్చ సచివామాత్య మన్త్రిభిః ॥
అన్యైర్బహువిధైః పాత్రై రాజయోగ్యైః సమన్వితః ।
సుఖాసనం సమారుహ్య వాజినం ప్రియయా సహ ॥
తతః ప్రవిశ్య వాహ్యాళీం సహయాతాన్ ప్రవేశ్య చ ।
మండపే పూర్వసంక్లృప్తే యథాస్థానం నివేశయేత్ ॥
తతః స్వయం సమారోహేద్దివ్యం కాంభోజ వాజినమ్ ।
ధన్వాన్యన్తర మాత్రయాదన్తర్వా రయో స్తోరణద్వయమ్ ॥
తోరణస్తంభయోర్మధ్యం చతుర్ధన్వాన్తరాయతమ్ ।
కుర్యాత్ కందుకనిష్కాసాత్ జ్ఞాతుం జయపరాజయౌ ॥
యైశ్చ కన్దుకనిష్కాసః కృత స్తేషాం జయో భవేత్ ।
వక్రకుండలితాగ్రా స్యుర్వేత్రజాదృఢబన్ధనాః
శోణేనచర్మణానద్ధా ముఖేకృష్ణేనకుణ్ఠితాః ।
పంచాంగులపరీణాహా గోద్దికాశ్చాప్రమ (ప) మాత్రికాః ॥
శోభినాహేమపట్టేన క్వచిద్రత్నవిభూషితాః
ప్రగృహ్యగోద్దికాః సర్వే పక్షద్వితయ సాదినః ॥
ఆరోహేయు ర్వరాన్ వాహాన్ స్వాకారేణ సమీపగాః ।
సువృత్తః కందుకః కల్ప్యం పాటిత్రక దారుణా ॥
చర్మణావేష్టితం భవ్యం లోహితం వృష్టి రంజనమ్ ।
మహాల్యా ప్రేరయన్నశ్వం గోద్దికాగ్రేణ భూతలే ॥
కందుకం చాలయేదేకః పరతోరణసమ్ముఖమ్ ।
తత్పశ్చాదనుగచ్ఛేయుః ప్రతిపక్షాశ్చ సమ్ముఖమ్ ॥
ఆగచ్ఛేత తతస్త్వేకః కందుకం తాడయన్ బలాత్ ।
జవయుక్తేన వాహేన ప్రతీపం కందుకం నయేత్ ॥
ప్రతిపక్షస్తథైవాన్యః కందుకం పరివర్తయేత్ ।
వివయనోఽన్య సంఘుష్టా ద్యాతాయాత్రైస్తు కందుకమ్ ॥
క్రీడన్తః ప్రేరయేయుస్తే బహుధామాత్రకనేకశః ।
పురోఘాతేనతేష్వేకః పశ్చాద్ఘాతేనచాపరః ।
తిర్యగ్ఘాతైస్తథాచాన్యే బహిర్ఘాతై స్తథేతరః ।

గోద్దికాగ్రేణసంగృహ్యా నయేతాన్యో
విహాయసా ॥
గగనస్థంపరఃసాదీ గ్రేడి (ద్ది) కాగ్రేణ
ధారయేత్॥
అపరశ్చాశ్వవారోఽపి తమాదాయాప్ను
రాన్నయేత్
ఏవంసంకులఘాతేన కదుకం భువిచాంబరే।
నయన్తస్తోరణస్యాస్త ర్బహిర్నిష్కాస్య
కందుకమ్॥
జయంలభన్తే తత్పక్షా స్తూర్యనాద
విజృమ్భితం।
వినోద్య కందుకేనైవం జయమాసాద్య
భూపతిః ॥
తస్మాదవతరేదశ్వాత్ స్తూయ మానశ్చ
వందిభిః॥

అనఁగా స్వపక్షమునం చెనిమిది మందియు, పరపక్షమునం చెనిమిదిమంది యు జేరుదురు. భూపతి సచివామాత్య కుమారులతోడను, అప్తమిత్రగణముతోడను, క్రీడాస్థలమున కేగి, నిర్దిష్టసుఖాసనముల నుపవిష్టుడగును. అంత రాజు కాంభోజాశ్వము నధిరోహించి క్రీడోన్ముఖుడగును.

ఇరువక్షములందును తోరణ స్తంభములు (Poles of goals) నాల్గుధనుస్సుల ప్రమాణముగల దూరమున నాటబడి యుండును. వాని అంతరమునుండి కందుక నిష్కాసము జరుగుటవలన జయాపజయములు నిర్ధారితములగును.

ఆటాడువారు, వక్రములైన సుదృఢ వేత్రదండములను చేబూనుదురు. అవి రక్త చర్మముతో (ఎఱ్ఱని) పిడికట్టబడి, హేమ పట్టములతో, రత్నఖచితములై యుండును. వాని అంచలములు అయిదంగుళముల వెడల్పుగలవై బంతిని త్రోయుటకు (నిష్కాసమొనర్చుటకు) అనువుగ నుండును. ఇరువాగులవారును అట్టి సాధనములను (B A T S) బూని, తమ తమ పక్షములందుండు తోరణ సమీపస్థలమున అశ్వా రూఢులయ్యెదరు.

దేవదారువుతో చేయబడి, చర్మముచే కప్పబడి, వర్తులాకారముగ నుండి, నేత్ర పర్వమొనర్చు కందుకమును గోద్దికముతో (B A T) కొట్టుచు, నెదుటి పక్షమువైపు గుఱ్ఱమును స్వారిచేయించును. వానితో బాటు తత్పక్షీయులును బరుగిడుదురు. ప్రతిపక్షమువారును జవముగల వాహనములనెక్కి క్రీడాసాధనములబూని వారి కెదురుగఁ జను దెంచి, కందుకమును ఎదుట పక్షమువారి తోరణ సమ్ముఖమునకు గొనిపోవుటకు యత్నింతురు. ఇట్లొక వంకవారు ముందునకును, వేరొక వంకవారు వెనుకకును ప్రేరించుటచే చెండు యాతాయాతము లొనర్చుచుండును. కొందరా కందుకమును అడ్డముగను, బహిఃప్రదేశమునకును, మింటికిని, చిమ్ముట జరుగును. వేరొకడా చెండును పట్టుకొన, వేరొకడు దానిని మీది కెగురకొట్టును. ఇట్లు కందుకము భూమ్యాకాశముల విహరించుచు తుదకొక పక్షమువారి తోరణాంతరమునుండి వెలికి విసరబడును. అంతటితో వారు పరాజితులైనట్లును కందుక నిష్కాస మొనర్చిన వారు విజేతలైనట్లును గణింప బడుదురు.

అంత వందులు జయజయ ధ్వానములు సలుపుచుండ రాజు జతకాశ్వైయై అశ్వము నుండి దిగును.

"ఈపోలో" ఆటనుగూర్చి పింగళిసూరన, ప్రభావతీ ప్రద్యుమ్నమున (1560)

అ II వ : 29-42 కొంత వర్ణించెను అందలి ఆటలో బంతిని ఎగురవైచి క్రిందవడ కుండగనే, స్వారిచేయుచు దానిని ఆకాశవీధిని గొనిపోవుట ఆటయొక్క శిఖరస్థానముగా నున్నది.

చ॥ తనహృదయంబు వెంబడిన తప్పక ఘోటక మంత నంతనే
పనుపడ నిల్చి ముందఱకు దాఁటి కెలంకులకుం దొలంగి దా
వెనుకకు నేఁగుదెంచి కడువేడ్క యొనర్పగ బంతి యాడె నె
మ్మిని గనకంపుఁగోల నడి మింటనె త్రిమ్మరఁ దారికొట్టుచున్॥ 29

చ॥ ఎగురఁగవైచి కొట్టుటది యెంత భరంబని బంతి యగ్రగా
మిగవడిఁ బాఱవైచి పుడమింబడనీక యె దాని మీఁది చి
త్రగతి హయంబు దోలుచును గ్రమ్మఱ మీఁదికిఁగొట్టి యాడె విం
తగఁ దన చేతి రత్నమయదండము కాంతులు గాఁడిపాఱగన్ . 30

ఈ ఆటయందు గుఱ్ఱపుస్వారి ఎన్నిచిత్రగతుల చరించినది పైనుండి మరాళములు చూడ సూరన వర్ణించెను.

సీ॥ తొలుదొల్త నయ్యేక తురగంబు మండలగతి దారియగుచు నిక్కంబు తోఁచె
నా వెనుకను సహూపాశ్వాలి చెదరక చక్రాకృతిని బర్వనరణితోఁచె
నంతట ననతి స్ఫుటావయంబుగా, నెవసి యేకాంగ వేష్టనత తోఁచె
మదదద్విభూషణద్యుతి రాజిమాత్రంబు కొఱవి ద్రిప్పినరీతి మెఱసితోచె

గీ॥ నంతకంతకు గతివేగ మగ్గలింప రాగ వాగెయెచ్చరిక పరాకు జయ్య
యను జనులు జిచ్చవడి తమపని మఱవగఁ బరఁగు నమ్మేటి
నెరరౌతు ప్రాఢికతన.

ఈ క్రీడావిశేషములనుగూర్చి వేరొండు వ్యాసములున్నవి.

ఈ ఆట చాలా పురాతనమైనది. ప్రాక్ దేశములందు విరివిగా ఆడుచుండెడి క్రీడ. మనదేశమున నుండిన బ్రిటిష్ సైనికులీ ఆటయందు ఉత్తీర్ణులైరి. ఇంగ్లండు దేశమున ప్రథమమున హర్లింగ్‌షామ్ క్లబ్‌లో ఈ ఆటను ప్రారంభించిరి.

రక్షకు నల్గురు రౌతులాడుదురు. ఈ ఆటలాడు ప్రదేశము 300 గజములపొడవు 160 గజః వెడల్పు ఉండును. గుఱ్ఱముపై స్వారిచేయుచు, పొడువగు బెత్తముతో భూమిపైనున్న బంతిని గెంటుచు, ఎదురు పక్షమువారు భద్రపరచు తోరణము

:ధ్యకు కొట్టవలెను. ఇట్లుచేసినవారు విజయులు. ఈబెత్తము 53 అంగులముల పొడవుగనుండి, కొన భాగమున 8' పొడవుగల అడ్డకొయ్య యుండును. ఈ అడ్డకొయ్యనుండుటచే, క్రిందనున్న బంతిని కొట్టి, గెంటుటకు వీలగును. ఈబంతి పర్యటనమును గమనించి, గుఱ్ఱములును దాని వెంట పరుగెత్తును. ఈఆశ్వముల శిక్షణయు కౌశలయుతమగు కార్యము. ఈ బంతి 5 ఔన్సుల బరువుగానుండును. 8 నిమిషములు మాత్రమే ఒక ఆట ఆడుదురు. ఇట్లు ఏడు మారులాడిన ఒక పూర్తి ఆటయగును. ఈ ఆటల సమయమును, దేశదేశమున మారుచున్నది.

(సోమేశ్వరుని కావ్యాంతర్గత ఈ కందుక కేళీవర్ణనము గూర్చి మాకుతెల్పిన శ్రీ డా॥ రామరాజుగారికిని (కుమారి డి. సి. సరస్వతిగారికిని.) మావందనములు.

శీతేనోద్ధృషి తస్యమాష శిమివత్ చింతార్ణవే మద్యతః
శాంతాగ్నిం స్ఫుటితాధరస్య ధమతః క్షుత్ క్షామ కంఠస్యమే।
నిద్రాక్వాప్యవ మానితేవ దయితా సంత్యజ్య దూరంగతా
సత్పాత్ర ప్రతిపాది తేవ వసుధా నక్షీయతే శర్వరీ.

రాజతరంగిణి III-181

◆ ◆ ◆ ◆ ◆ ◆

అథాఽసదాస్త మనిన్ద్య తేజా జనస్య దూరో జ్ఞితమృత్యు భీతేః
ఉత్పత్తి మద్యస్తు వినాశ్య వశ్యం యథాహమిత్యేవ మివోపదేష్టుం.

◆ ◆ ◆ ◆ ◆ ◆

అవకాశః సువృత్తానాం హృదయాస్తర్న యోషితామ్।
ఇతీవ విహితౌ ధాత్రా సువృత్తౌ తద్బహిః కుచౌ॥

రాజతరంగిణి. VI-75

◆ ◆ ◆ ◆ ◆ ◆

క॥ విను సంసారమునకు విసు, వనిమర్త్యుఁడు శోకమోహవశగుఁడై మో
క్షనిరూఢి బడయ నేరఁడు మనము విరక్తముగ విసివి మఱి ముక్తిగనున్॥

అను. V. 228

# 59.

# ★ వ్యాయామ క్రీడలు - వెంకటగిరి ★

శ్రీ కె. యల్. నారాయణరావు. బి. ఏ. బి. యల్.

వేంకటగిరిపురీ వర్ణనము.

చ॥ నటితహరిజ్జయేందిరకు నాటకరంగ, మనంతవైభవో
త్కటమున కాలవాలము, తతస్ఫుట విద్యలకాటపట్టు, ను
ద్భటభటసింహకోటులకు ధర్మమహీధరగహ్వరంబు, వేం
కటగిరి పట్టణంబలరుఁ గాంతిజితామర రాజధానియై ॥

సీ॥ అచటిమహీసురు లతికళాధారులై ద్విజరాజులనఁ జాలవినుతిగాంతు,
రచటి రాజవరేణ్యు లరిబలహంతలై జిష్ణులనంగఁ బ్రసిద్ధిగాంతు
రచటి యూరుజులు పుణ్యజనైకపాలురై క్షితి శ్రీదులనఁగ విశ్రుతివహింతు,
రచటి శూద్రులు కుజనావనదక్షులై కుజనారియగు బలుఁ గుస్సు సేతు

గీ॥ రచటి వెలయాండ్రు సక్థినాసాక్షిగాత్రహసిత రంభాతిలోత్తమాహారిణీ హేమ
లగుచు విశ్రుతిగాంతు ర న్నగరికి సరిగాఁదగునే యమరా వలకాపురంబు.

వెంకటగిరిలో జమీందారుల పోషణ వలననేమి, హైస్కూలు విద్యార్థుల పరిశ్రమలవలననేమి వ్యాయామక్రీడలు అభివృద్ధి చెందియుండినవి. మానవశరీర ధార్ఢ్యమునకును ఆత్మరక్షణకును సాముగరిడీలు గుఱ్ఱపుస్వారీలును, వ్యాయామ క్రీడలయందు, పోలో, ఫుట్ బాలు, టెన్నిసు, బ్యాట్ మింటను, క్రికెట్టు, హాకి, స్కేటింగు బిలియడ్సు, ఫల్ గుడ్ కంగాటయేగాక, గుఱ్ఱపు స్వారీచేయుచు గురిపెట్టుట, పరుగెత్తుట, ఎత్తు దూరము దూకుట మొదలయిన అనేక క్రీడలలో వెంకటగిరి పౌరులు సాధనలుచేసి, అనేక బహుమతుల పొందుచుండిరి.


## సాము గరిడీలు :

పూర్వము ఆధునిక మారణయంత్రములు లేనిరోజులలో సైనికుల భుజబలము వలననే రాజ్యములు సరంక్షింపబడుచుండిన వనుసంగతి మనమందరము ఎఱింగినదియే. వెంకటగిరి జమీందారులు వారి రాజ్యరక్షణ కొరకు సాము గరిడీల నెలకొల్పి, అనేక జట్టులను, వస్తాదులను పోషించుచు తమ అంగరక్షకులకేగాక, తమ పరివారమునకు సంబతము, కట్టె, ఈటెకత్తి సాములయందు తరిఫీదు నిప్పించుచుండిరి. వారి స్వంతపోషణలో నుండినవే గాక గ్రామములోవారి ఆదరణలతో నిట్టి గరిడీలు అనేకములు

బడసియున్నారు. సదరు లక్ష్మయ్యగారి మనుమరాలు వేంకటగిరి బాలకోన్నత పాఠశాలయందు విద్యనభ్యసించుచు 1958 సంవత్సరముపాఠశాలనూతనభవన ప్రారంభోత్సవసమయమునందు 12 సంవత్సరములచిన్నారిపాపగానుండి శ్రీ శ్రీ సత్యసాయిబాబాగారియెదుట బహిరంగసభలో తన కట్టె కర్ర సాముయందలి ప్రావీణ్యతను

పోలో ఆట :

పోలోఅనగా గుర్రములపై స్వారి చేయుచు చేతిలో పిడిగల్గిన పొడుగాటి పేమునుంచుకొని దానితో నేలమీద వేయబడిన చెండును కొట్టుకొనుచు యెదుటిపక్షమునునిర్జించి వారిపై గోలువేయుట. ఫుట్‌బాల్‌వలెనే గుర్రములపై ఆడుదురు. ఒక్కొక్కప్రక్క నలుగురుఆటగాండ్రుమాత్రమే ఆడుదురు. ఇదినాలుగుచక్కర్లుగా



వేంకటగిరి పోలో టీము.

ప్రదర్శించి ప్రత్యేక అభినందనలను రజిత పతకమును బహుమతిగాపొందినది.

శారీరవ్యాయామములగురించి ముచ్చటించు సందర్భములో నేటి శ్రీ శ్రీ వేంకటగిరిరాజాగారు శ్రీ సర్వజ్ఞకృష్ణయాచేంద్రుల గురించి చెప్పకుండుట సరిగాదు. వారు కత్తిసామునందు అద్వితీయులు.

ఆడుదురు. ఒక్కొక్కచక్కరు $4\frac{1}{2}$ నిమిషములకాలము ఆడి మరల గుర్రములు మార్చుకొనుటకు వ్యవధితీసికొని మరల ఆటప్రారంభించెదరు. ఇటు 4 చక్కర్లు ఆడవలయును. ఈ ఆటకు రెఫరీలుగానుండువారున్ను గుర్రపుస్వారీచేయుచు, ఆటగాండ్రు చెండు వెంబడిగమనించుచు విజేతల నిర్ణయించెదరు. (పోలునుగూర్చి ఇందు వ్యా. నెం: 58 పే... 617 చూడుడు).

ఈ ఆట అనాదిగా ప్రాగ్దేశములయందు ఆడుచుండినట్లు ప్రాక్టికలపోలో గ్రంథమున వ్రాయబడియున్నది. గ్రంథకర్త ఒకపార్శికథకుడు వ్రాసినవిషయమును గ్రంథస్థముచేసెను. అరేబియారాజైన అమీర్ హంజా అనువారు యిండియాపై దండెత్తివచ్చినకాలములో వారి దండయాత్రామార్గములో రాజలక్షణములుకల్గిన యువకుండొకడు ఫకీరువేషముదాల్చి దీనాతిదీనముగ తనకుకనబడెననియు, అతడు తన్నాకర్షించెననియు, రాజాతనిని తనచెంతకుచేర్చుకొని పరామర్శించి దుఃఖహేతువును తెల్పకోరినట్లును అందులకా యువకుడు ఆ పట్టణములోని రాజకుమారి సౌందర్యరాశి అనియు ఆమెను తాను గాఢముగ ప్రేమించితిననియు కాని ఆమె తన్నెవ్వరు పోలో ఆటలో జయించెదరో వానిని వివాహమాడెదనని ప్రతిజ్ఞ చేసియున్నదనియు, ఆ ఆటతనకు తెలియనందున ఆమెను వివాహమాడజాలనికతన జనించిన విరహముచే తానట్లున్నట్లు విన్నవించుకొనెను. హంజా ఆయువకునకు అభయమిచ్చి తాను ఆమెతో పోలోఆటలో పోటీచేసి ఆమెను ఓడించి ఆమెనుఒప్పించి ఆ యువకునకు వివాహమొనర్చెనని వ్రాబడినది. అందువలన అరేబియారాజు హంజానాటినుండియు యీ ఆట మనదేశములోనున్నట్లు తెలియుచున్నది.

వెంకటగిరిలో పోలోఆట 1895 సంవత్సరముమొదలు ఆడబడుచుండినట్లు తెలియవచ్చుచున్నది. వెంకటగిరి ప్రభువు లు28వ పురుషాంతరమువారైన శ్రీ శ్రీ రాజారాజగోపాల కృష్ణయాచేంద్రులవారు ఏడుగురు అన్నదమ్ములు. వారిలో రాజావేణుగోపాలయాచేంద్రులవారు రాజా వెంకటకృష్ణయాచేంద్రులు వ్యాయామ క్రీడలయందు అత్యంత ఆశక్తినిచూపుచు తమకౌశలమును ప్రదర్శించుచుండిరి రాజావేణుగోపాలకృష్ణయాచేంద్రులు అవివాహితులు. వారు గుర్రపుస్వారియందు అందెవేసినచేయి. వారు 1893వ సంవత్సరములో నింగ్లండువెళ్ళి పోలోఆటను చూచివచ్చి వెంకటగిరిలో ప్రారంభించినట్లు తెలియుచున్నది. అప్పట్లో దక్షిణహిందూదేశములో బ్రిటీషుజాతికిచెందిన మిలిటరీవారు మాత్రమే యీ ఆటనాడుచుండిరి. మద్రాసు జింఖానాక్లబ్బులో పాశ్చాత్యులకుమాత్రమే సభ్యత్వముండెడిది. శ్రీ రాజా వెంకటకృష్ణ యాచేంద్రులవారు వెంకటగిరిలో ఒక తోట బంగళాకట్టించి 1891 సంవత్సరములో పత్తి మైదానము నొకదానిని యేర్పాటుచేసి వెంకటగిరి జింఖానాక్లబ్బును స్థాపించిరి. అందులో వెంకటగిరి ప్రభువులు వారి యుద్యోగస్తులు ఆశ్రితులు మాత్రము వారి అంగీకారములపై సభ్యులుగానుండిరి. ఆ క్లబ్బు యాజమాన్యమున ప్రతిసంవత్సరము దశరాలలో వ్యాయామ క్రీడోత్సవములు జరుపుచుండిరి. ఆ పత్తిమైదానములో నుండు పోలో ఆడుప్రదేశము ఉమ్మడి మద్రాసురాష్ట్రమంతటిలో చాల మంచి ప్రదేశమని యెంచబడుచున్నది.

వెంకటగిరిలో పోలో ప్రారంభించిన తర్వాత ప్రథమముగ 1899 సంవత్సరములో వాత్రేరులోజరిగిన పోలో టోర్నిమెంటులో శ్రీ రాజా వేణుగోపాలయాచేంద్రులు, శ్రీరాజా వెంకటకృష్ణయాచేంద్రులు మరియిద్దరు ఆంగ్లేయ సేనానులతోకలసి

టీముగాఆడి విజయమును సాధించిరి. శ్రీరాజా వేణుగోపాలయాచేంద్రులు రెండవ సారి యింగ్లాండునకు 1900 సంవత్సరములో వెళ్ళివచ్చిరి. తర్వాత వారు మైసూరు మహారాజుగారు కల్సుకొని టీముయేర్పాటు చేసుకొని బెంగళూరు టోర్నిమెంటులో మిలిటరీవారిని ఓడించిరని తెలియుచున్నది. 1902 లో అప్పుడే యిండియాకు మిలిటరీ ఆఫీసరుగావచ్చిన మాజీ బ్రిటీషుప్రధాని లార్డుచర్చిల్ గారు మంచి పోలో ఆటగాడనియు వారికి స్వంతముగా రెండుగుర్రము లుండినట్లును వారు బెంగుళూరులో మన వారితో పోలోఆటలో ఓడిపోయిరనియు వారు యింగ్లాండువెళ్లుచు వారి గుర్రములను రాజావేణుగోపాల యాచేంద్రులకు అమ్మి వేసి పోయినట్లు తెలియుచున్నది.

1903 లో మద్రాసులో జరిగిన పోలో టోర్నామెంటు నోలిస్ కప్పు పోటీలో శ్రీ రాజావేణుగోపాలుబాలారెడ్డిరామనాధం, షేక్ యిస్మాయిల్, బాలారెడ్డి కాళప్ప అను వారు ఆకప్పును గెల్చుకొనిరి. 3 సంవత్సరములు నోలీసుకప్పుటోర్నమెంటును వరుసగాగెల్చి ఆకప్పును మనవారు సొంతము చేసికొనిరి.

1908 లో మద్రాసులో జరిగిన పోలోటోర్నమెంటులో జస్టిసుబోదాం కప్పును శ్రీ రాజావేణుగోపాలకృష్ణయాచేంద్ర (2) యువరాజా ఆఫ్మైసూరు (3) బి. రామనాదం (4) కప్టన్ సి. బి. కార్టరు గారలు ఫైనల్సులో విజయముగాంచిరి. రాజావేణుగోపాల్ యాచేంద్రులవారును ఒకకప్పును పోలోపోటీలకు బహూకరించి వారిపేర టోర్నమెంట్లు జరిపించుచుండిరి.

పోలోఆట బ్రిటిషువారు మనదేశమును పరిపాలించునన్నంతకాలము ప్రశస్తిగానుండినది. మైసూరు సంస్థానము, హైదరాబాదు, జయపూరు, కూచిబీహారు సంస్థానములవారును యీ ఆటను దేశములో ప్రోత్సహించుచుండిరి. 1945 వర్కు యీఆట వేంకటగిరిలో పతాకస్థాయిలోనుండినవి. వారి టీములను గెల్వగల్గినవారుగాని, వారిపద్ధయుండిన ఉత్తమాశ్వకులతో సరియైనవాటిని తేగల్గినవారున్ను లేకుండిరి. ప్రస్తుతపు వేంకటగిరిరాజాగారు, 1916, లో బొంబాయికిని 1929 లో ఆస్ట్రేలియాకును వెళ్లి ఉత్తమాశ్వముల తీసుకొని వచ్చిరి. 1923 లో జరిగిన వేంకటగిరి రాజాగారి వెల్లింగుడను కమెమొరేషన్ పోలోకప్పును వేంకటగిరి ఆటగాండ్రు 1. ప్రస్తుతపు వేంకటగిరి రాజాగారు 2. రాజా రామరావుగారు 3. మీజంషామిర్యాబేగ్; 4. కాదర్ బేగ్ గార్లు విజయముగాంచిరి.

నేటి వెంకటగిరిరాజుగారి కనిష్టసోదరులు శ్రీ ప్రద్యుమ్న కృష్ణయాచేంద్రులవారు కాకినాడవద్ద కోలంకా యేస్టేటుకు దత్తతగావెళ్లిరి. వారును పోలోయందత్యంత శ్రద్ధవహించి "కోలంకా కప్పు" అనుపేరుతో పెద్దపోలో టోర్నమెంటునడపించిరి.

1927 సంవత్సరములో శ్రీ వెంకటగిరిరాజాగారు 2. శ్రీ బొబ్బిలి రాజాగారు 3. శ్రీ రాజా ఐ.వి. రామారావు గారలు గౌసుఖాన్ అనువారలు వెంకటగిరిటీముగా ఆడి పోలో టోర్నిమెంటుకప్పును గెల్చుకొనియున్నారు.

1927 మొదలు 1934 వర్కు ప్రతి సంవత్సరము వెంకటగిరిలో పోలోటోర్న

మెంట్లు జరుగుచుండెడివి. అందులో హైద్రాబాదు, సికింద్రాబాదు, బెంగుళూరు, మద్రాసులనుండి పోలోటీములు వచ్చి పాల్గొనుచుండెడివి. 1827లో శ్రీ బొబ్బిలిరాజుగారు కెప్టన్‌గా 2. శ్రీరాజా రామరావు 3. గౌసుఖాన్ 4. నరయ్యలతోటి ఒక టీమును యేర్పాటుచేసి వారు అనేక టోర్నమెంట్లను గెల్చిరి. ఆకాలములో వెంకటగిరి సంస్థానమువారికి మేలురకమైన గుర్రములు షుమారు 60 ఉండెడివి. వాటికి నెల 1కి ఒక్కొక్కగుర్రమునకు దాదాపురు. 200 లు ఖర్చుఅగుచుండెడిది ఈగుర్రములను వేసవికాలములో బెంగుళూరు ఉదకమండలము పంపుచుండెడివారు.

పోలో గుర్రపుస్వారి విషయముల గూర్చి వ్రాయునప్పుడు వెంకటగిరిరాజులకు అత్యంతసన్నిహిత బంధువులును వారితోటి నివసించుచుండిన శ్రీరాజా ఇనుగంటి వెంకట్రామారావుగారిని గూర్చి ప్రత్యేకముగా తెల్పవలసియున్నది. వీరు పోలో ఆటయందు అగ్రశ్రేణికి చెందినవారు. వీరిని యేటీములో చేర్చుకొన్నను హండీక్యాపులు యివ్వవలసియుండెను. దక్షిణహిందూదేశములోనేగాక జైపూరు, కూచి బీహార్ సంస్థానాధీశ్వరుల ఆహ్వానముపై వారి రాజ్యములకు ఉత్తర హిందూస్థానమునకు పోయి అక్కడ వారితోటి పోలో ఆడి, వారికి పోలో ఆటనేర్పి వారితోటి యింగ్లాండు మున్నగు పాశ్చాత్య దేశములకుగూడా పోయి వచ్చినవారు. వారికి ఒక పోలో టోర్నమెంటులో భుజములో దెబ్బతగిలి అది మొదలు వారు పోలోఆట ఆడుటమానివైచిరి.



మహారాజ పోలో టీము (వేంకటగిరి)

ప్రస్తుతపు వేంకటగిరి రాజుగారి తండ్రిగారైన కెప్టెన్ సర్ వి. గోవింద కృష్ణయాచేంద్రులవారి కాలమున వ్యాయామక్రీడలకు పందెములు, వేంకటగిరిలో ప్రవర్ధమానమైనవి. వారికి గుర్రపుపందెములయందును కుతూహలముండెడిది. వారు వేంకటగిరి రేసుకోర్సులు రూ 50,000/- రూపాయలతోడి వెంకటగిరి స్టాండు అను సౌధమును రేసుక్లబ్బువారికి ధర్మముగ నిర్మించిరి. 1920 కి పూర్వము పాశ్చాతులు గాక అన్యులు రేసుక్లబ్బులో స్టీవర్డుగాయుండుటకు వీలులేదు. అట్టిది 1920మొదలు 1936వరకు అవిచ్ఛిన్నముగా సర్ గోవిందకృష్ణయాచేంద్రులవారు స్టీవర్డుగానుండిరి. అంద గౌరవమును పొందినది వేంకటగిరి ప్రభువులే. పందెముగుర్రములు I. Son of Sin 2. Red cocade యింకా రెండు మొత్తం నాలుగు గుర్రములు వుండెడివి. పందెములలో మహారాజా అఫ్ వేంకటగిరి వారికప్పుగూడ ఒకటి పందెమునకు యివ్వబడి పందెములు జరుపబడుచున్నవి. వేంకటగిరివారిగుర్రములు అనేక గవర్నరుకప్పులను గెల్చియుండెను. గవర్నరుకప్పుగెల్చుట గుర్రపుపందెములలో ఒక ప్రత్యేకత. వీరిపందెపు గుర్రములకు నెల 1కి రూ 360/- చొప్పున ఖర్చుఅగుచుండెడిది. శ్రీ గోవింద యాచేంద్రుల వారు వేంకటగిరి జంఖానాక్లబ్బుకు రూ 10,000/- లు విరాళముగా యిచ్చియుండిరి.

ఈ వెంకటగిరి క్లబ్బులో టెన్నీసు టోర్నమెంటు జరుపబడుచుండెను. 1924 లో మూడు జిల్లాల టెన్నిసుటోర్నమెంటు జరుపబడెను. 1925 మొదలు ఆంధ్ర టోర్నమెంటు జరుపబడెను. ఈ సందబర్భములో వెంకటగిరి చరిత్రలో యిద్దరి ప్రముఖులగూర్చి వ్రాయనగును. ఒకటి కీ॥ శే॥ జి. కుప్పస్వామి అయ్యరు బి.ఏ , యెల్.టి. వీరు వేంకటగిరి ఆర్. వి. యం. హైస్కూలులో ఉపాధ్యాయులుగానుండిరి. వీరి పరిచయము వెంకటగిరికి 1913 లో. వీరు అప్పుడు, పచ్చప్ప కళాశాల మద్రాసులో విద్యార్థిగానుండి, వెంకటగిరి జంఖానాలో జరిగిన పుట్‌బాల్ టోర్నమెంటులో పచ్చప్ప కళాశాల వారి టీముతోవచ్చి వెంకటగిరిలో పోటీచేసిరి. వీరి ప్రదర్శనము ప్రజలనేగాక ప్రభువుల దృష్టి నాకర్షించినది. అందువలన వారిని వెంకటగిరి హైస్కూలులో ఉపాధ్యాయులుగా తీసికొనుటయు వారు వారి జీవితమునే వెంకటగిరికి అంకితముచేసి విద్యార్థులకు విద్యగరపుట యందేగాక వారిని భావి పౌరులుగా తీర్చి దిద్దుటయందును వెంకటగిరిలో వ్రాయామక్రీడలలో ప్రతి విద్యార్థికి మాత్రమేగాక, ప్రతి యువకునకు ప్రోత్సాహమిచ్చి, వెంకటగిరి వ్యాయామక్రీడల చరిత్రలో నొక నూతనాధ్యాయమును నెలకొల్పిరి. వీరు వెంకటగిరిలో పుట్‌బాల్, టెన్నిసు ఆటలేగాక బ్యాట్‌మెంటన్, హాకీ క్రికెటు, స్పోర్ట్సు మొదలైనవన్నియు ప్రవేశపెట్టిరి. వీరు వెంకటగిరి హైస్కూలు గేమ్సు కార్యదర్శిగా నుండిరి. వెంకటగిరి క్లబ్బులో కొన్ని సంవత్సరముల కాలము కార్యవర్గములోను కార్యదర్శిగాను పనిచేసిరి. అంతేకాదు వెంకటగిరి జంఖానాక్లబ్బు వారున్ను తమ క్లబ్బులో గౌరవ సభ్యునిగా నెంచుకొని వారి అమూల్యసలహాలను తీసికొను

చుండిరి. వెంకటగిరిలో వారి నెఱుగనివారే లేరు. వ్యాయామక్రీడలవల్ల అట్టి గౌరవ స్థానమును వారు వెంకటగిరియందేగాదు పొందినది, జిల్లాలో జరుగుచుండిన క్రిగ్‌సు టోర్నమెంటులోవారు రెఫరీగా అనేక సంవత్సరములు పనిచేసిరి. నిష్పాక్షికతయందు వీరిని చెప్పిన పిదపనే యితరుల చెప్పవలయును. వీరు అన్ని ఆటలయందును ప్రవీణ్యులే.

వీరి శిష్యులు వెంకటగిరి వాస్తవ్యులు అయిన రక్తదాత కీ॥ శే॥ యస్. వి. నరసింహారావు బి.ఏ., డి.పి.ఇ., బి.యల్. గారిని గూర్చి వెంకటగిరి వ్యాయామ క్రీడాచరిత్రలో నేగాదు, జిల్లా చరిత్రలో స్వర్ణాక్షరములతో వ్రాయవలయును. వారి జీవితము మరువరానిది. 1922 మొదలు 1937 వర్కు 15 సంవత్సరకాలము జిల్లాస్థాయిలో నేగాక రాష్ట్రస్థాయిలో పుట్‌బాల్, టెన్నిసు బ్యాండ్‌మింటన్, యితర వ్యాయామ క్రీడలలో అనేకకప్పులు, పతకములు, షీల్డులు గెలిచి, వెంకటగిరికేగాక, నెల్లూరు జిల్లాకు అకుంఠిత గౌరవమును సంపాదించిన ధీశాలి అంతేగాక యావద్భారత దేశములో శిబిదధీచులను మరిపించదగు తన రక్తదానముతో దిగ్గ్యాతి గొల్పి ఆత్మబలిదానము గావించిన దాత.

నరసింహారావుగారు తే 10-12-1905 దిన వెంకటగిరిలో ఒక పేదకుటుంబమున జన్మించిరి. 1935 వ సంవత్సరములో న్యాయవాది పరీక్షలో ఉత్తీర్ణులైరి. వీరికి చిన్ననాటనుండి వ్యాయామ క్రీడలయందు అభిరుచిమెండు. విద్యార్థిదశనుండి వ్యాయామ క్రీడలయందు తన శక్తిసామర్థ్యముల చాటుచుండెను.

1922 సంవత్సరములో నెల్లూరులో జరిగిన బ్యాడ్‌మెంటన్ పోటీలో స్పెషల్ పతకమును పొందిరి. 1925 సం॥ లో పుట్‌బాల్ బ్యాడ్‌మింటన్ పోటీలలో ప్రత్యేక పతకములనునెల్లూరులోపొందిరి. 1925లో వెంకటగిరిలో జరిగిన మూడుజిల్లాల టెన్నిసు టోర్నమెంటులో డబుల్సులో విజయము సాధించి ప్రథమ బహుమతిని సంపాదించిరి.

1926, 27, 28 సంవత్సరములలో మద్రాసులో జరిగిన టెన్నిసు పోటీలన్నిటిలో సింగిల్సులో విజయము సాధించి ప్రథమబహుమానములనుపొందిరి. సింగిల్సు ఛాంపియన్‌గా రజతపాత్ర బహూకరింపబడినది.

1928 లో మద్రాసులో జరిగిన ఆల్ యిండియా ఒలింపిక్ స్పోర్టులో 50 గ॥ 100 గ॥ పరుగులో ప్రథమ బహుమతిని బడసిరి. క్రికెట్టు బాలు దూరము విసరుట పుట్‌బాలు కిక్కు మొదలయిన ఆటలలో 19 బహుమతులు పొందిరి. 1929 లో వెంకటగిరిలో జరిగిన మూడుజిల్లాల టెన్నిసు పోటీలలో సింగిల్సు, డబుల్సు చాంపియన్ షిప్పును గెల్చుకొనిరి. ఆసంవత్సరము మద్రాసులో జరిగిన ఒలింపిక్ స్పోర్ట్సులో మరల 50 గ॥ 100 గ॥ పరుగులో ప్రథమ స్థానమందుకొనిరి. 220 గజముల పరుగులో మూడవ బహుమానము సంపాదించిరి. మొత్తముమీద 11 పాయింట్ల గెలుపుతో వ్యక్తిగత ఛాంపియన్ షిప్పు బహుమానమును బడసిరి. 1931 లో వెంకటగిరిలో జరిగిన మూడు జిల్లాల టెన్నిసు పోటీలలో మూడవ పర్యాయము సింగిల్సు

డబల్స్‌లో విజయముసాధించి రజిత పాత్రముల బహుమతిగా పొందిరి. 1932 లో మద్రాసు పోటీలలో 6 బహుమతులు సంపాదించిరి. 1933 లో కేరళ రాష్ట్రములో తిరువనంతపురములోను యితర ప్రాంతములలోను అన్ని టెన్నిసు పోటీలలో సింగిల్స్‌లో విజయముగాంచి కేరళ టెన్నిసు ఛాంపియన్ షిప్పు బిరుదును పొందిరి.

1934, 1935 సంవత్సరములలో మద్రాసులో S.I.A.A. వారి యాజమాన్యమున నడుపబడిన టెన్నిసుఛాంపియన్ షిప్పుపోటీలలో సింగిల్స్ ప్రథమ స్థానమును గెల్చుకొని టెన్నిసు ఛాంపియన్‌గా పరిగణింపబడిరి. వ్యాయామ క్రీడలయందు వీరికిగల ప్రేమ వీరిని ప్రోత్సహించి 1932 - 1933 సంవత్సరములలో Y. M. C. A. Director of Physical Education డిగ్రీని పొందునట్లు చేసినది. 1936, 1937, 1939, 1957 సంవత్సరములలో ఆంధ్రలో జరిగిన ఫుట్‌బాలు టోర్నమెంట్లలో వీరిని రెఫరీగా యేర్పరచి వీరి నిష్పాక్షిక నిర్ణయములకు ఉత్తమ రెఫరీగా నెన్నుకొనబడి బంగారు పతకములను బహూకరించిరి. వీరు షుమారు 105 పతకములు ట్రోఫీలు రజితపాత్రలు విజయ చిహ్నములుగా బడసిరి. శ్రీ నరసింహారావుగారు 3, 4 మాసములు గుండెజబ్బుతో వ్యాధిగ్రస్తులై తే 23-11-1962 ది రాత్రి పరమపదించిరి. కాని వీరు వ్యాయామ కళారంగములో సజీవులే.

:: వెంకటగిరి ప్రముఖ టెన్నిను ఆటగాండ్రు, మొదటి తరమువారిలో గాడిరాజ వర్ధనముగారు శ్రీ రాజా వెలికాని జగన్నాధరావుగారు పి. మహాదేవయ్యగారు కీ॥ శే॥ బాలారద్ద శ్రీరాములుగారు. వీరు పేరుపొందిన కుస్తీ గరడీ వస్తాదు. పోలో ఆటగాడైన కాళప్పగారి కొమార్డు. వీరు టెన్నిసులోనే గాక అన్ని ఆటపోటీలయందు 1916-1917 లో మద్రాసులో అనేకవిజయములు సాధించిరి. వీరు టెన్నిసులో ప్రవీణ్యులు వీరిని గెల్చి మొదటసెట్టు సంపాదించుట కష్టసాధ్యమైన పనిగా నుండెడిది. తరువాత వరుసలో వెంకటగిరి క్లబ్బు మార్కరు వసంచెంచయ్యగారు, వారికుమారుడు, వి. వెంకటరమణయ్య, అల్లుడు వి. వి. చలం అనువారలు జిల్లాల స్థాయిలో మంచిపేరును సంపాదించి విజయములు సాధించి శ్రీ గాడిరాజ గోపాలుగారును మంచిపేరును సంపాదించి యున్నాడు. వెంకటగిరి క్లబ్బు టెన్నిసు టోర్నమెంటుయందు జిల్లాలలో పేరుగాంచిన నెల్లూరు వాస్తవ్యులు కె. వి. రత్నముగారు. బెంగుళూరు ఛాంపియన్ రాచప్ప విజయవాడ ఛాంపియన్ కామేశ్వరరావు మద్రాసు ఆటగాడు మల్లేన్ సి. కృష్ణస్వామి రామనాధం పి. వి. సుబ్బరావు మొదలయినవారు పాల్గొని కొన్ని పోటీలలో విజయము గాంచియున్నారు.

ఫుట్‌బాలు :

ఇయ్యది వెంకటగిరిలో 1900 సం॥ నుంచి వాడుకలో నున్నట్లు తెలియుచున్నది కాని యీ ఆటలో ఉత్సాహము, ఆసక్తి, ప్రోత్సాహము 1910 లో ప్రారంభమైనది. 1910 లో వెంకటగిరిలో హైస్కూలు టీము వేలూరు టీమును ఓడించెను. దానితో ఆ

వేంకటగిరి ఫుట్ బాల్ చరిత్రలో సంచలనము కలిగినది. అప్పుడే వెంకటగిరి జంఖానా క్లబ్బువారు ఫుట్‌బాలు టీమును యేర్పాటు చేసి, వేలూరు టీమును జయించి వెంకటగిరి హైస్కూలు టీమును ఓడించిరి అది మొదలు హైస్కూలు టీమునకును జంఖానా వారికిని పోటీలు జరుగుచుండెను.

1912-13 మొదలు వెంకటగిరి జంఖానావారి యాజమాన్యమున ప్రతిసంవత్సరము ఆల్ ఇండియా ఫుట్‌బాలు టోర్నమెంటులు జరుపబడు చుండెను. వెంకటగిరికి మద్రాసునుంచి పచ్చియప్ప కళాశాల టీము పుదుప్పాకం టీము, రాజమండ్రి, ఏలూరు, విశాఖపట్నం, బెంగుళూరు, మైసూరునుంచి ఫుట్‌బాలు జట్లువచ్చి పోటీలు చేయుచుండెడివి. వీటితో స్థానిక టీములుగూడా పోటీ పడుచుండినవి. యీ ఆటలలోనుంచి స్థానికముగా ఖ్యాతిగాంచి తర్వాత రాష్ట్ర, భారతీ స్థాయిలో గూడా ప్రఖ్యాతి గాంచిన ఆటగాండ్రు వెంకటగిరిలో ఉద్భవించిరి.

1921 నుంచి 1925 వరకు మద్రాసులో వెటరినరి కాలేజిలో విద్యనభ్యసించి తదుపరి ఉద్యోగములో జిల్లా వెటరినరీ ఆఫీసరు ఉద్యోగముచేసిన వెంకటగిరి వాస్తవ్యులు శ్రీ జి. సి. శ్రీహరి అను వారు 1921 మొదలు 1925 వరకు మద్రాసులో సాటిలేని సెంటరు ఫార్వర్డు అని పేరును ఫుట్‌బాల్ క్రీడారంగములో సంపాదించిరి.

బి. శ్రీరాములు, పట్నం రాధాకృష్ణయ్య అను వెంకటగిరివారు మద్రాసు పుదుపాకం టీము. యితర టీములలో పేరెన్నికగన్న ఆటగాండ్రుగ 1913 మొదలు 1916 వరకు పేర్కొన బడుచుండిరి.

రాష్ట్ర స్థాయిలోనేగాక, అఖిలభారత స్థాయిలో పేరు సంపాదించినవారు శ్రీ మల్లిశెట్టి రాధాకృష్ణయ్యగారు, కీ॥ శే॥ తిరుమలశెట్టి చంద్రశేఖరముగారలు వీరిరువులు వెంకటగిరి వారు. 1931-1933 వరకు మద్రాసు పచ్చయప్ప కళాశాలలో బి. యే. చదువుచుండిరి. 1933 వరకు నిర్భేధ్యమై, తమ్మెవ్వరు గెలువజాలరనెడి మద్రాస్ జంఖానా ఫుట్ బాల్ టీమును, శ్వేతజాతివారు తప్ప యితరులకు స్థానములేని టీమును, పచ్చయప్ప కళాశాల టీము ప్రప్రథమముగా ఓడించి మద్రాసులో రికార్డు కలుగచేసినది. ఆ టీములో పైవారు రాధ, చంద్ర అను ప్రసిద్ధ నామములతో పాల్గొనిరి. వీరిరువురు ప్రత్యేక అభినందనకు పాత్రులై వెంకటగిరికి అజరామరకీర్తిని సంపాదించిరి.

1937 లో కలకత్తా లో జరిగిన యిండియన్ ఫుట్‌బాలు అసోసియేషన్ షీల్డు టోర్నమెంటు మద్రాసు ఫుట్‌బాలు అసోసియేషన్ తరపున పంపబడిన టీములో యం. రాధాకృష్ణయ్యగారొకరు. వీరు టీము విజయము సాధించలేక పోయినప్పటికి ఫుట్‌బాల్ ఛాంపియన్సు మోహన్ బగెను టీముతో స్పెషల్ పోటిలో పాల్గొనిరి. అందులో ప్రత్యేక అభినందనకు పాత్రులైన వారిలో రాధాకృష్ణ ఒకడు.

1938-1939 లో మద్రాసులో జరిగిన, 15 డివిజన్ మద్రాసు ఫుట్‌బాలు చాంపియన్ షిప్పు పోటీలలో విజయము సాధించిన మద్రాసు పచ్చియప్ప కళాశాల టీములో ఆడిన ఆటగాండ్రలో శ్రీ రాధాకృష్ణ ఒకరు. 1932 మొదలు 1939 వరకు ఫుట్‌బాలు రంగములో రాష్ట్ర రాష్ట్రేతర

స్థా॥లో శ్రీ యం. రాధాకృష్ణగారు వెంకటగిరికి మరువరాని కీర్తిని సంపాదించిరి.

ఇవిగాక "యిండోర్ గేమ్సు" లో బిలియర్డ్సు, టేబిలు టెన్నిసు మొదలయిన క్రీడలలోను వెంకటగిరి పౌరులు చాలమంది తయారైరి. హాకి కొంతకాలము ఆడిరిగాని దానిలో ముందంజవేయ జాలరైరి. బిలియర్డ్సు ఆటయందు వెంకటగిరి వాస్తవ్యులు బి. శ్రీరాములుగారును నెల్లూరు వాస్తవ్యులు వెంకటగిరి కాలేజి యింగ్లీషు అధ్యాపకులు వెంకటగిరి సంస్థానము ఉద్యోగములో యుంటూవచ్చిన యం. శ్రీరామ అయ్యంగారు, అనువారు అతి ప్రతిభావంతముగ నీఆట నాడుచుండిరి.

వేటయందును వెంకటగిరి రాజులు నైపుణ్యమును గాంచియుండిరి. వేటకొరకై అరణ్యములో రిజర్వుకంచెల నేర్పరుచుకొని అచ్చట వన్యమృగములను వేటాడుచుండిరి. కీ॥ శే॥ రాజాశ్రీ వెంకట కృష్ణయాచేంద్రుల వారు మాటులో కూర్చొనకనే పులులను పిలిచి నేరులో గురిపెట్టి కాల్చువారని ప్రతీతి. శ్రీ వెంకటగిరి రాజాగారి ద్వితీయ సోదరులు కీ॥ శే॥ మహారాజ కుమారుగారున్ను గురియందు అద్వితీయ ప్రతిభగాంచినవారు దమ్మిడీలను పైకి యెగురవేయగా అవి క్రింద పడులోగా వాటిని గురిచూచి కాల్చువారు.

కాని జమీందారీలు రద్దయినది మొదలు వ్యాయామ క్రీడలయందు వెంకటగిరిలో జాడ్యము, నిరుత్సాహము, జనించినది. జమీందారులు తమ గుఱ్ఱములనెల్ల పోగొట్టుకొని పోలో ఆటకు స్వస్తిచెప్పిరి. యితర వ్యాయామక్రీడలకు వారివలన తగు ప్రోత్సాహము కల్గుటలేదు తాము వివిధ వ్యాయామ క్రీడలలో పందెములు పెట్టుట నవరాత్రులయందు ఉత్సవములు చేయుట మానివైచిరి. అంతటితో తగుపోషణ లేనందున వీటియందలి ఉత్సాహము సన్నగిలి షుమారు 10 సంవత్సరములుగా వెంకటగిరి తన పూర్వ ఔన్నతిని కోల్పోవుచున్నది. కాని మరల టెన్నిసు అటయందు శ్రీ రాజా కుమారుగారు శ్రద్ధవహించుటవలన ఆటలో ప్రోత్సాహము, పాటవము చేకూరుచున్నది. ఇటీవలనే శ్రీ రాజ కుమారులు యితర ఆటగాండ్రు నెల్లూరు విచ్చేసి టెన్నిసుపోటీలో పాల్గొని పోయియున్నారు. ఆంధ్ర ప్రదేశగవర్నమెంటువారు వెంకటగిరిలో యీ వ్యాయామ క్రీడలకు తగు ప్రోత్సాహమిచ్చినయెడల నేటికిని ప్రథమ శ్రేణి ఆటగాండ్రను వెంకటగిరి తయారు చేయగలదని విశ్వసింపవచ్చును.

# 60.

# వేంకటగిరి క్రీడారంగము

శ్రీ జె. వి. యస్. ధర్మారావు, బి.ఏ., యల్.టి., వేంకటగిరి.

వేంకటగిరి నెల్లూరుజిల్లాలో సుమారు ఇరువదివేల జనాభాగల గ్రామము. గొప్ప రాజాస్థానము. 150 సంవత్సరముల పైగా ఈ సంస్థానమువారి ప్రోత్సాహమున సకల కళావిశేషములచే పెంపొందిన గ్రామము. వ్యాయామ క్రీడలయందును. అత్యున్నతి పొందినది. ఈ గ్రామము వెలిభాగములందు పూర్వులచే నెలకొల్పబడిన క్రీడా విహార ప్రదేశములు వ్యాయామ స్థానములు (Foot Ball, Polo Grouuds, Tennis Courts) ఇప్పటికి కానబడుచున్నవి. వీనిలో ప్రథమమున సుమారు 150 సంవత్సరముల క్రితము షరత్ బంగ్లా అను కట్టడము శ్రీశ్రీ రాజా సర్వజ్ఞ కుమార యాచమనాయనింవారు నిర్మించి గుఱ్ఱపు పందెములకు మైదానము ఏర్పరచి పందెములచ్చట జరుపుచుండిరి. కాని ఈ ప్రదేశము పూర్వౌన్నత్యమును చూపు శిధిలములుగా కానబడుచున్నవి.

పోలో :

శ్రీ వెలుగోటి రాజగోపాల కృష్ణయాచేంద్ర బహదూర్ G. C. I. E. వారి ప్రభుత్వకాలమున వారి ఐదవ తమ్ములగు శ్రీ రాజా వేంకట కృష్ణయాచేంద్ర బహదూరువారు పది ఎకరములపైన విస్తీర్ణము గల రెండు పోలో గ్రౌండులకు తగిన ప్రదేశమును మిక్కిలి ధనమును వ్యయపరచి ఏర్పరచిరి. దీనిలో ఒకమైలు గుఱ్ఱపు పందెములు, జరుగుటకు అవకాశముగల విస్తీర్ణము ఉన్నది. దీనికే 'పత్తేమైదానము' అని పేరుపెట్టి, అందు సమీపమున 'విజయ మహల్' అను పెద్ద సౌధమును 1893 వ సంవత్సరమున కట్టించిరి. ఇచ్చట పోలో, ఫుట్‌బాల్, టెన్నిస్ ఆటలు జంభానార్లబ్బు వారి యాజమాన్యమున ప్రతి సంవత్సరము జరుపుచుండిరి.

సైకిల్ పోలో :

పోలో ఆట వేంకటగిరిలో జరుగుచుండినపుడు, సైకిల్ పోలో ఆటను కీ॥ శే॥ మహరాజ్ కుమార్‌గారు ప్రారంభించి ప్రోత్సహించిరి. 1932-1933 లలో సైకిల్ పోలో పోటీ పందెములు జరుపబడినవి. అందు డాక్టరు టి. దామోదరం యమ్. వి. రత్నం, పి. చిన్నయ్య, యస్. ఈశ్వరయ్య, యస్. వెంకటదాసు మొదలగువారు ఎక్కువ ప్రతిభ చూపినవారు. ఇతర ప్రదేశములలో ఈ ఆట లేనందున ఎక్కువకాలము వాడుకలో లేకపోయినది.

క్రికెట్ :

రెండవ ప్రపంచయుద్ధము పోలో యుగమునకు స్వస్తి చెప్పగనే వేంకటగిరి సంస్థానము క్రికెట్ క్లబ్బు (V. S. C. C.)

స్థాపింపబడి, 1940 సంవత్సరమునుండి వేంకటగిరిలో క్రికెట్ యుగము ప్రారంభింపబడినది. దీనికి వేంకటగిరి శ్రీ కుమార్ రాజాగారియొక్క ఆటలోని నైపుణ్యము, ప్రోత్సాహము ముఖ్యకారణములు. కాని 1940 కి పూర్వముకూడ క్రికెట్ ఆట 1925 నుండి వేంకటగిరి క్రికెట్ క్లబ్ (వి. సి సి.) వారి యాజమాన్యమున ఏర్పడి యుండినది. వి. సి. సి. ఆటగాండ్రలో పేరుగాంచిన శ్రీ. కె. జె. ప్రసాద్ తొలుత సంస్థానము క్రికెట్ క్లబ్ వారికి కోచింగు నిచ్చుచుండిరి.

వేంకటగిరి సంస్థానము క్రికెట్ క్లబ్‌నకు 1940 లో మద్రాసు క్రికెట్ అసోసియేషన్‌తో అనుబంధ మేర్పడినది. ప్రతి సంవత్సరము మద్రాసునుండి పెద్ద ఆటగాండ్రతో మ్యాచెస్ ఆడుచుండిరి. సుప్రసిద్ధులైన ఆటగాండ్రను, ప్రభుత్వము వారిచే ఎన్నుకొనబడిన కోచ్‌లగు శ్రీ ఎ. జి. రాంసింగ్, శ్రీ కె. యస్. తన్నన్, శ్రీ వెన్స్‌లీ శ్రీ సి. యస్. నాయుడుగార్లు యొద్దనుండి శ్రీ కుమార్ రాజాగారు, శ్రీ వి. జి. కే యాచేంద్రులవారు, శ్రీ రాజగోపాలకృష్ణయాచేంద్రులవారు, శ్రీ ఎ. చెంగన్న, శ్రీ ఆర్. జగదీశ్వరం, శ్రీ సూరా మునస్వామి, మున్నగువారు ఆటను నేర్చుకొని వేంకటగిరికి పేరుతెచ్చిరి.

వేంకటగిరికి ప్రప్రథమమున మద్రాసునుండి పర్లాకిమిడి రాజావారి టీమువచ్చి వేంకటగిరి వారి టీముతో ఆంధ్ర విద్యాశాఖామాత్యులైన శ్రీ పి. వి. జి. రాజుగారు పాకిస్థాన్‌లో ఇండియా రాయబారి శ్రీ వి. పార్థసారథి, మద్రాసులో సుప్రసిద్ధులైన ఆటగాండ్రు శ్రీ బాలయ్య, శ్రీరామానుజం, (భట్టాచారి), యస్. కె. గురునాధంగార్లు, పాల్గొనిరి. ఇట్లు మాచెస్ ప్రతిసంవత్సరము వీరాడుచు మద్రాసు రాష్ట్రమునందు పేరుగాంచినారు. ప్రతిసంవత్సరము బెంగుళూరులో గూడ మ్యాచెస్ ఆడుచుండిరి. మద్రాసులో పేరుగాంచిన ఆటగాండ్రు వేంకటగిరికి వచ్చి ఆడుచుండిరి. 1950-51 లో మద్రాసు టీమునకును, గ్రామాంతర టీమునకును (City × Mofussil) మ్యాచి జరిగినది. గ్రామాంతర టీమునందు శ్రీ కుమార్ రాజాగారు, శ్రీ పి.జి.కే.యాచేంద్రులవారు, ఎ. చంగన్న పాల్గొనిరి.

1953 లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ యేర్పడినందున వేంకటగిరి సంస్థానము క్రికెట్ క్లబ్ దానితో అనుబంధమేర్పరచుకొనెను. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ యేర్పరచుటకు శ్రీ వేంకటగిరి కుమార్ రాజాగారి ప్రయత్నమే కారణమని చెప్పవలసియున్నది.

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు జోనల్ పోటీకి, లీగ్ ఛాంపియన్ షిప్ పోటీకి పెద్ద రోలింగ్ రజత పాత్రలను శ్రీ వెంకటగిరి కుమార రాజావారు బహూకరించిరి. 1954 లో జరిగిన జోనల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో వెంకటగిరియందు ఉత్తరమండలపు క్రికెట్ జట్టు దక్షిణమండలపు క్రికెట్ జట్టును ఓడించి సుప్రసిద్ధులైన శ్రీ సర్. విజయనగర మహరాజ్‌కుమార్ గారివద్దనుండి కప్పును బడసిరి. దక్షిణ మండలపు క్రికెట్ జట్టులో వేంకటగిరి ఆటగాండ్రు ఏడుమంది పాల్గొనిరి.

1955-56 లో జరిగిన లీగ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంటులో వేంకటగిరిటీము శ్రీకుమార్ రాజాగారి నాయకత్వమున గెలుపొంది మద్రాసు క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గారైన శ్రీ యస్. శ్రీరామన్‌గారి వద్దనుండి రజతపాత్రను బహూమతిబడసిరి. 1954లో శ్రీ జె. వి. యస్. ధర్మారావుగారు దక్షిణ మండల కార్యదర్శిగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో సేవచేయుచున్నారు.

శ్రీ వేంకటగిరి కుమార్ రాజాగారు 1954, 56, 59 సంవత్సరములో ఆంధ్ర రంజీట్రోఫీ టీములకు నాయకత్వము వహించిరి. వీరు ఈ ఆటలో "ఆలరౌండర్" అని పేరుపొందిరి. 1959 డిసంబరు 8, 9, 10 తేదులలో రంజీట్రోఫీపోటీ వేంకటగిరిలో ఆంధ్ర, కేరళ క్రికెట్ జట్లకు జరిగినది. ఆంధ్రజట్టు శ్రీ కుమార్ రాజాగారి నాయకత్వమున విజయము నందినది. శ్రీ వి.బి.కే. యాచేంద్రులవారు (స్లోబౌలర్) 60-61 సంవత్సరములో హైదరాబాదుతో పోటీ చేయునపుడు ఆంధ్ర క్రికెట్‌జట్టు నాయకత్వము వహించిరి. శ్రీ రాజా వి. రాజగోపాలకృష్ణ యాచేంద్రులవారు (మూడవ ప్రిన్స్‌గారి జ్యేష్ఠపుత్రులు) చాలకాలము మద్రాసులో ప్రాక్టీసుచేయుచు క్రికెట్‌నందు నైపుణతపొంది, 1956 నుండి ఆంధ్ర టీము నందుచేరి బ్యాటు చేయుటలోను, ఫీల్డింగులోను ప్రతిభను గాంచుచుండిరి. ఆంధ్ర జట్టునకు బ్యాటింగులో పట్టుగొమ్మగా నుండిరి. 1941 నుండి 1960 వరకు క్రికెట్ మహాయుగమని చెప్పవచ్చును.



టెన్నిస్ :

1960 నుండి శ్రీ వేంకటగిరి కుమార్ రాజాగారికి, వారి సోదరులకు టెన్నిస్ ఆట యందు ఉత్సాహముకలుగుటచేతను, వారికి క్రికెట్ ఆడుటకు తగిన వ్యవధి లేనందున టెన్నిస్ ప్రారంభించిరి. టెన్నిస్ ఆటయందు శ్రీ రాజకుమార్లకు 1960 నుండి శ్రద్ధ యేర్పడినది. కాని వేంకటగిరిలో టెన్నిస్ ఆట జింఖానాక్లబ్ యేర్పడక పూర్వము నుండిగూడ ఆడబడుచుండినది. కాన యీ ఆట 100 సంవత్సరములకు ముందునుండి యీ యూర నాడబడు చున్నటుల దాలనిదర్శనము లున్నవి. ఈ గ్రామమునకు వెలి భాగమునందు పలుతావులలో గచ్చుకోర్టులు యీ నాటికి కానబడుచున్నవి. ప్రస్తుతము వి. యస్. సి. సి. వారును, వేంకటగిరిక్లబ్ వారును యీఆటను ప్రోత్సహించుచున్నారు.

జింఖానా క్లబ్‌వారు జరుపు టోర్నమెంటులో 1922 లో శ్రీ రాజా వి. కృష్ణ బహదూర్, శ్రీ రాజా ఐ. వి. రామారావు గారు డబుల్స్ పందెములో గెలుపొందిరి. జింఖానాక్లబ్‌వారు ప్రతి సంవత్సరము టోర్నమెంట్లు జరుపుచుండిరి. ఈ పోటీలలో పాల్గొనిన వేంకటగిరివారు శ్రీ బి. శ్రీరాములు, శ్రీ రాజా ఐ.వి. రామారావుగారు, శ్రీ పి. మహాదేవన్, శ్రీ యస్. వి. నరసింహారావుగారు, శ్రీ రాజా సి. గోపాల్ రావుగారు, శ్రీ రాజా జగన్నాధరావుగారు, శ్రీ వనం చెంచయ్య మున్నగువారు.

1910, 11 లోనే వేంకటగిరి క్లబ్ యేర్పడినది. వీరును జింఖానా క్లబ్‌వారి ననుసరించి టెన్నిస్‌పోటీలను పెట్టుచుండిరి.

1925 లో జరిగిన టెన్నిస్ పోటీలో కే.శే. రక్తదాత శ్రీ యస్. వి. నరసింహారావు, శ్రీ రాజా సి. గోపాల్ రావుగార్లు డబుల్స్‌లో గెలుపొందిరి. రక్తదాతగారు టెన్నిసు పోటీలలో మద్రాసునందుగూడ గెలుపొందినారు. వీరు 43 పర్యాయములు రక్తదానముచేసినట్టివారు. వీరు మద్రాసు ప్రెసిడెన్సీ ఒలంపిక్స్‌లో 100, 50 గజముల పరుగులో 1929 సంవత్సరములో మొదటి బహుమతిని పొందిరి.

వేంకటగిరి క్లబ్‌వారు 1925 లో ఆంధ్ర జిల్లాలకు, మద్రాసునకును మహారాజావారిపేర టోర్నమెంటు ప్రారంభించిరి. ఈ సంఘముయొక్క అభివృద్ధికి కీ. శే. శ్రీ తాయి సుబ్బారావుగారు విశేషశ్రమ తీసికొని పనిచేయుచుండిరి. వేంకటగిరి క్లబ్ పోటీలలో ప్రఖ్యాతినొందిన ఆటగాండ్రగు శ్రీ రాచప్ప, శ్రీ కామేశ్వరరావు, శ్రీ యస్. వి. నరసింహారావు, శ్రీ రాజా ఐ.వి. రామారావు, శ్రీ బి. శ్రీరాములు మొదలగువారు గెలుపొందిరి. శ్రీ యస్. వి. కృష్ణస్వామి రవపటి సంవత్సరము పోటీచేసి విజయమును పొందియుండిరి.

వేంకటగిరి క్లబ్‌నుండి శ్రీ గాడి. రాజగోపాల్ జిల్లా పోటీలో గూడూరునందు ఎక్స్‌ప్రిన్సిపాల్ శ్రీ యమ్. యస్. రాఘవన్‌గారిని ఓడించి జిల్లా బిరుదము గాంచియుండెను.

1950 నుండి శ్రీ పి. వెంకటరామయ్య, శ్రీ జి. వెంకటచలం, రాయలసీమలో పోటీచేసి ఖ్యాతిగాంచిరి. వీరుపు ఘను నెల్లూరు, కడిరి, ప్రొద్దుటూరు, మదనపల్లి పోటీలలో విజయమునుపొందిరి. ఈ నాటికిని వీరు ఉద్దరును ఛాంపియన్‌లుగానున్నారు. 1961 లో జరిగిన మదనపల్లి టోర్నమెంటులో శ్రీ పి. వెంకటరామయ్య సింగిల్సులోను; శ్రీ పి. వెంకటరామయ్య, శ్రీ జి వెంకటచలం డబుల్సులోను గెలుపొందిరి. 1952 లో కదిరియందు జరిగిన పోటీలో శ్రీ కడియాల నరసయ్య, శ్రీ జి. వెంకటచలంతో చేరి డబుల్సులో గెలుపొందిరి.

ప్రస్తుత మాడుచున్న యువకులలో మంచి భవిష్యత్తును గాంచతగినవారు శ్రీ వి. రాజగోపాల కృష్ణయాచేంద్ర, శ్రీ వి. వి. కె. యాచేంద్ర, శ్రీ రాజా రామప్రసాద్ యాచేంద్ర, శ్రీ రాజా సాయికుమారయాచేంద్ర శ్రీ పి. నారాయణదాసు మున్నగువారు అని చెప్పవలసియున్నది.

టేబిల్ టెన్నిస్ :

టెన్నిస్ ఆట వేంకటగిరిలో చాల కాలమునుండి యుండినను (Table Tennis) ఆటమాత్రము 1958 నుండి వేంకటగిరి సంస్థానము క్రికెట్ క్లబ్బువారు యేర్పరచిన ఆంధ్ర టోర్నమెంటుతో వెలుగునకువచ్చినది. శ్రీ రాజగోపాల కృష్ణయాచేంద్ర టెన్నిసు ఆటలో నిపుణత చూపునట్లు Table Tennis లోను గొప్ప నేర్పుచూపుచు 1959, 1960 సంవత్సరములలో ఆంధ్ర Table Tennis సంఘము యేర్పరచిన వరుసస్థానములో మూడవ వారుగ ఎన్నుకొనబడిరి. Table Tennis నెల్లూరు జిల్లాలో వృద్ధిపొందుటకు వీలుగా నుండుటకు తే 4-11-62 లో

నెల్లూరుజిల్లా టేబిల్ టెన్నిస్ అసోసియేషన్ ఏర్పడినది. ఈ సంఘము ఆంధ్ర టేబిల్ టెన్నిస్ అసోసియేషన్‌తో అనుబంధము చేయబడినది. ఇందు శ్రీ రాజా యమ్. ఆర్. సి. అప్పారావుగారు అధ్యక్షులుగాను, శ్రీ జె. వి. యస్. ధర్మారావు కార్యదర్శిగ ఎన్నుకొనబడిరి. నెల్లూరు జిల్లాలో (Table Tennis) వృద్ధిపొందుటకు అన్నిసంఘములు జిల్లాసంఘమునకు అనుబంధముకల్గి టోర్నమెంటులో పాల్గొనవలసియున్నది.

బ్యాట్ మింటన్ :

వేంకటగిరిలో, (Badminton) కూడ సుమారు అరువది సంవత్సరములు ముందనుండి ఆడబడుచున్నది. కీ॥ శే॥ జూపల్లి ధర్మారావుగారి (వ్యాసకర్త పితామహులు) ప్రోత్సాహమున వేంకటగిరి బ్యాడ్మింటన్ క్లబ్బువారి యాజమాన్యమున ఆడబడుచుండినది. ఈ క్లబ్బువారు ప్రతిసంవత్సరము నెల్లూరు పోటీలలో పాల్గొనుచుండిరి. అప్పటి ఆటగాండ్రలలో శ్రీ జె. వేంకటరామారావు, శ్రీ జె. సూర్యప్రకాశరావు, శ్రీ పి. రామదాసు, శ్రీ జి. రాజరత్నం శ్రీ యస్. రాధాకృష్ణయ్య, శ్రీ కె. వెంకటరామారావు పేరుగాంచినవారు.

1918 నుండి శ్రీ టి. నీలకంఠరావు 'Jally Brothers Club' ను యేర్పరచి టోర్నమెంట్లు జయప్రదముగ జరిపెను. ఈ ఆటలో శ్రీ యస్. వి. నరసింహారావు, శ్రీ జి. రాజగోపాల్, శ్రీ బి. సుబ్బరామయ్య, శ్రీ జి. రాజగోపాలరావు, శ్రీ వి. కుప్పుస్వామి అయ్యర్ మొదలగువారు పేరుగాంచినవారు. ఈ ఆటలో నేర్పుచేతనే శ్రీ యస్. వి. నరసింహారావు టెన్నిసులో గొప్ప ఖ్యాతిని బొందెను.

స్పోర్ట్సు :

దసరాలో పదిదినములు జింఖానా క్లబ్బు, పత్తేమైదానములో స్పోర్ట్సు జరుపుచుండిరి. 1891-వ సంవత్సరము నుండి యీ పరుగుపందెములు, జింఖానా స్పోర్ట్సు అని జరుపబడుచుండెడివి. ఇందు ఉత్తర ప్రదేశముల నుండికూడవచ్చి పాల్గొనుచుండెడివారు. ఈ పందెములు 1946-వ సంవత్సరము వరకు శ్రీ వేంకటగిరి రాజావారిచే జరుపబడుచుండెడివి.

ఈ గ్రామము చిన్నదయ్యును అన్నివిధములైన ఆటలయందు ముందంజ వేయుచుండినదని వ్రాయుటలో అతిశయోక్తి యావంతయు కానబడదు. నెల్లూరు మొదలగు గొప్ప పట్టణములందును నీ యాటలింత యున్నతిగాంచలేకున్నవి యనుటలో కారణములు లేకపోలేదు. అవి ఎల్లవారికిని విదితములే. ఇయ్యది గొప్ప రాజాస్థానమగుట, నీయాటలకు సకలవిధ ప్రోత్సాహముండుట ముఖ్యమైన యంశము. అందుచే నిచట సన్నిరకములైన (Grounds) క్రీడారంగములు ఏర్పడి యీ యాటలకు అనుకూలములై యున్నవనుట రెండవ యంశము. అంతియగాక ఇచ్చోటి యువకులు అత్యుత్సాహభరితులై యాటలయందు పాల్గొనుచు నిందలి యాజాలవృత్తులు యొక్క సహకార సంపదల ననుభవించుచుండుట మూడవ యంశము. కావున ఇన్ని యంశములతో పెంపుగాంచిన యీ క్రీడారంగములను సామాన్య ప్రజానీకమునకు మిక్కిలి అందుబాటులో నుంచి పాలకులు తగిన ప్రోత్సాహమిచ్చెదరని ఆశించుచున్నాము.

## హరిహర ఏకరూపము

(హరివంశము - విష్ణుపర్వము 184.)

నచయుద్ధం మహాబాహో తవకృష్ణేన యుజ్యతే ।
నచయుధ్యసి కృష్ణం త్వమాత్మానం హి ద్విధాకృతమ్ ॥ 19

ఆత్మానం కృష్ణదేహస్థం పశ్యతి హ్యేకయోనిజమ్ ।
తతో నిస్సృత్య కృష్ణస్య న్యస్తవాదో భవన్మృథే ॥ 23

నచతౌ పశ్యతే కశ్చిద్యోగినౌ యోగమాగతౌ ।
ఏకో బ్రహ్మ తథాకృత్వా పశ్యల్లోక పితామహః ॥ 25

హరించ హరరూపేణ హరంచ హరిరూపిణమ్ ।
శంఖ చక్ర గదా పాణిం పీతాంబరధరం హరమ్ ॥ 28

త్రిశూల పట్టసధరం వ్యాఘ్రచర్మధరమ్ హరిమ్ ।
గరుడ ధ్వజంచ హరం హరించ వృషభ ధ్వజమ్ ॥ 29

అనాది మధ్య నిధన మేతదక్షర మవ్యయమ్ ।
తదేవతే ప్రవక్ష్యామి రూపం హరిహరాత్మకమ్ ॥ 32

యో వైవిష్ణుః సవైరుద్రోయో రుద్రః సపితామహః ।
ఏకామూర్తి స్త్రియోదేవా రుద్రవిష్ణు పితామహాః 33

రుద్రస్య పరమో విష్ణు ర్విష్ణోశ్చ పరమః శివః ।
ఏక ఏవద్విధా భూతో లోకేచ రతినిత్యశః ॥ 54

నవినాశం కరం విష్ణుర్నవినా కేశవం శివః ।
తస్మాదేక త్వమా యాతౌ రుద్రోపేంద్రౌతు తౌపురా ॥ 55

నమః పర్వతవాసాయ నమః సాగర శాయినే ।
నమః సురరిపుఘ్నాయ త్రిపురఘ్నాయ వైనమః ॥ 56

సమేత్యఋషిభిః సర్వైస్సుతౌ స్తౌతి మహాత్మభిః
వ్యాసేన వేదవిదుషా నారదేనచ ధీమతా.

# 61.


# నెల్లూరు మండల మల్లులు

మల్లాగ్రణి శ్రీ యన్. కాంతారావు
కనకమహల్, నెల్లూరు.

అరత్నీ ద్వే అరత్నిభ్యాం జానుభ్యాంచైవ జానునీ
శిరః శీర్ష్ణోరసోరస్తా వన్యోన్య మభిజఘ్నతుః. 3
పరిభ్రామణ విక్షేప పరిరంభావపాతనైః
ఉత్సర్పణా పసర్పణైశ్చా న్యోన్యం ప్రత్యరుస్థతామ్. 4
ఉత్థాపనై రున్నయనై శ్చాలనైః స్థాపనైరపి
పరస్పరం జిగీషన్తా వపచక్రతు రాత్మనః. 5

— కా. X - 44.

తొలుత నుండియు నెల్లూరు మండలము బాహుబల సంపన్నులకును, మల్లయుద్ధ విశారదులకును ప్రసిద్ధిచెందియుండెనని పెద్దలు చెప్పుచుండ వినుచుంటిమి. కాని వారిచరిత్ర లెవ్వియు సుస్పష్టముగ దొరకుటలేదు. మధ్యకాలమునసివురుగప్పిన నిప్పుచందమున మాటుపడియుండిన మల్ల



యుద్ధమునకు నేడు జీవనము పోసినది 'నెల్లూరు ఎంగ్‌మెన్ అథెలెటిక్ అసోసియేషన్' అని చెప్పుట సత్యోక్తియేకాని, అతిశయోక్తి కాదు. ప్రథమమున ఆ సంస్థలో వ్యాయామము, ఆసనములు, కత్తి, కట్టె, కొమ్ము యుద్ధములు, గోపురనిర్మాణములు, కుస్తీ పట్టుట మాత్రము అర్హతలనుబట్టి బోధింపబడుచుండెను.

మల్లయుద్ధము (కుస్తీ) నేర్చుకొనువారు బలవంతులుగను, తెంపరులుగను, ప్రాణమునిన తృణప్రాయముగ తలంచువారుగనుందురు. బాల్యమునుండియుక్రమశిక్షణగలిగి, చక్కగ వ్యాయామ మొనర్చువారే ఆ శిక్షణ కర్హులగుదురు. వారి కృషినిబట్టి విశ్రాంతియు వారి కవసరమగును. అందుచేతనే వారు జీవనోపాధిలేక రాజులచే పోషింపబడుచుండిరి. తొల్లిటి రాజులు, సంస్థానాధీశ్వరులు కవులను, పండితులను, గాయకారులను ఆదరించి పోషించునట్లే మల్లయుద్ధవిశారదులను సయితము పోషించుచుండిరనుట ప్రాచీనగ్రంథముల వలన స్పష్టమగును. భీముడు విరాటుని కడ వల

లుడుగా నున్నప్పుడు ఎడనెడ ఏనుగలతోడ కుస్తీ జరిపి, రాజుకు వినోదము కలిగించు చుండెనని భారతమును జదివినవారికి తెలియకపోదు. కాలక్రమమున రాజులంతరించిరి. సంస్థానాధిపతులు మాయమైరి. తన్మూలమున, మల్లయుద్ధములన్నను, మల్లవిద్య అన్నను రాజపోషణలేక అణగారినది.

కుస్తీ పట్టుటకు బాల్యమునుండియే, అనగా 14, 15 సంవత్సరముల వయస్సునుండియే ప్రారంభింపవలెను. ఏ విద్యగాని గురుశిక్షణ లేక రాణించుట కల్ల. కాబట్టి సుశిక్షితులైన ఉపాధ్యాయుల నాశ్రయించి క్రమశిక్షణతో మెలగి, విద్య కౌశలముల నార్జింపవలెను. ఆచార్యుడును శిష్యుని యోగ్యతానుసారముగ నరమరలు లేక, పట్లు, విడుపులు బోధింపవలెను. ఈ విద్యార్జన చేయువారికి సహనము ఏకాగ్రత, అత్యవసరములు. ఒకేవిధమైన వ్యాయామమును పలుమారు చేయవలసియుండును. శరీరాభివృద్ధికి కండలభివృద్ధికిజేయు కుస్తీచేయువారభ్యసించు వ్యాయామమునకును వత్యాసముకలదు.

మల్లయుద్ధాభ్యాసనము చేయువారు మనదేశమున 'గోదా' లో చేయుదురు. 'గోదా' అనగా మెత్తని యిసుకగల ప్రదేశము. ఆ ప్రదేశమునందు క్రిమికీటకములుగాని, చెత్తచెదారములుగాని లేకుండవలెను. అభ్యాసకులు తమ కరచరణములను శుభ్రముగా నుంచుకొని గోదాలో ప్రవేశింపవలెను. వారమున కొకమారు ముద్దకర్పూరము, గోదామట్టిలో కలుపుటమంచిది. నెలకొకసారి కర్పూరముపొడి పసుపు పొడి కలుపుటయు శ్రేష్ఠము. గోదాలో మన్ను రేగకుండుటకును, సూక్ష్మజీవులు నశించుటకును అప్పుడప్పుడు అవనూనె పోయుట మంచిది.

మన నెల్లూరులో 1927 లో ఉత్సాహవంతులగు యువకులుకొందరు 'ఎంగ్ మెన్స్ అథెలిటిక్ అసోసియేషన్.'అను సంస్థనేర్పరచిరి. అందు శ్రీ యన్. కనకంబాబు ముఖ్యుడు. ఆయెన స్వయం కృషితో, వ్యయప్రయాసలకు లోనై 'కుస్తీ' విద్య నభ్యసించిన దిట్ట. మన మండలమునందు 40 సం॥ నుండి చెప్పుకోదగిన జెట్టి వీరే అని చెప్పవచ్చును. సై. ప్రుల్లాగారు ద్వితీయులు. వీరు ప్రస్తుము వేంకటగిరి రాజాగారి హయ్యర్ సెకండరీ పాఠశాలలో వ్యాయామ శిక్షకులుగా నున్నారు.

వారి శిక్షణక్రింద కుస్తీనేర్చిన యువకులు పలువురున్నారు. వారిలో శ్రీ యన్. కాంతారావు, యన్. కృష్ణయ్య, ఆర్. మునుస్వామిగార్లు గణనీయులు. తూకములో తక్కువగానుండియు (98 పౌ) దక్షిణ భారతములో శ్రీ టి. శ్యామిసేలుగారు ఈ విద్యలో మేటిగా నెన్నబడిరి.

శ్రీ యన్. కాంతరావు నెల్లూరులోనే కాక మండలములోనెల్ల అసమానుడని పేరు వడసెను. 1948, 49. 50 సంవత్సరములందు తన శిష్యబృందముతో గుంటూరులో జరిగిన దక్షిణభారత కుస్తీపోటీలలో పాల్గొని, మూడు సంవత్సరములు మూడు వెండిగదలను ప్రథమ బహూమానములుగా బడసిరి. వారి శిష్యులుకూడ అదే పోటీలయందు పాల్గొని, ప్రేక్షకుల మన్ననల బడసిరి. వారు బలము, జతశ్రమము, కౌశలము శక్తి సహనగుణములను ప్రదర్శించి ప్రత్యేక బహూమతులను బడసిరి.

శ్రీ యర్రా. కాంతరావు 1948 నుండి 1952 వరకు మద్రాసులో జరిగిన ఓలింపిక్స్ పోటీలలో పాల్గొని ప్రథమములుగా గణనకెక్కిరి. 1952 సం॥ 'మద్రాసు' కేరళ, తమిళ, పోటీదారులను గెలిచి, పారితోషికముబడసెను.

వీరు 1953 లో కాకినాడలో కృష్ణప్ప అను జట్టీని పరాజితునిగా నొనర్చి రెండు గదలను పొందిరి. ఆసంవత్సరమే విశాఖపట్టణమున శ్రీ చొక్కా సుబ్బయ్యగారిని 10,000 మంది ప్రేక్షకులయెదుట కుస్తీలో నోడించి, రు 1116 లను బహుమతి గైకొనిరి. శ్రీ ఉప్పలపాటి సత్యరాజుగారిని గెలచి సువర్ణ హస్తకంకణము పడసిరి.

వారు శిష్యగణముతో విజయనగరము, బరహంపురము, కుర్దారోడ్డు, ఖరగపూరు, కలకత్తా, లాలానగర్, బిలాసపూరు రాయపూరు, నాగపూరు మొదలగు పెక్కు నగరములను పర్యటించి ప్రదర్శనలు జరిపి ఖ్యాతిగడించిరి.

1955 లో ప్రపంచ యువజనోత్సవ సందర్భమున కుస్తీకి ఎన్నుకొనబడి 'రష్యా-వార్సా' వెళ్లి గౌరవము వడసి వచ్చిన ఆంధ్రుడు నెల్లూరు నివాసియైన శ్రీ కాంతారావుగారే. 'వీలూరి కుస్తీ' వారి చరిత్రలో మరువరానిది. ఏలన వీలూరి నివాసి శ్రీ సూకరాజుగారు దాదాపు 8 మాసములు కృషిసల్పి, కాంతారావుగారితో సవాలుచేసి, మరల 3 మాసములు కాలవ్యవధిని బడసి 1956 డిసంబరులో కుస్తీ చేసిరి. రెండు లక్షలమంది ప్రేక్షకులునుండిరి. శ్రీ కాంతారావుగారు మూడు నిమిషములలో శ్రీ సూకరాజుగారిని 'చిత్తు' (సంపూర్ణఓటమి) చేసి ప్రజల హర్షధ్వానములతో, రు. 4000 లు పసదనము పడసిరి. ఆ ప్రదర్శన చూడ వచ్చిన ప్రజలు వారివారి గ్రామములకు వెళ్లుటకై ప్రభుత్వమువారు ప్రత్యేకరైళ్లను ప్రయాణసౌకర్యమునుకూడ నేర్పరచిరి.

1957 లో కేరళవాస్తవ్యులు ఆహాదుగారు నెల్లూరువచ్చి రాజాగారి కళాశాలా మైదానములో శ్రీకాంతారావుగారితో కుస్తీ జరిపి పరాభూతులైరి. నాటినుండి నేటివరకును ఆంధ్రప్రాంతమున వారికి సాటివేరొకరు లేరని చెప్పవచ్చును. వారు విశాఖపట్టణము, కాకినాడ, విజయవాడ, గుడివాడ, నెల్లూరు పట్టణములలో పోటీలు యేర్పాటుచేసి, యువకులను 'మల్ల' యుద్ధాభ్యాసముపట్ల ఉత్సాహవంతులుగ నొనర్చుచున్నారు.

మరియు మననెల్లూరికి సంబంధించిన జగజెట్టు శ్రీ ఆర్. మునుస్వామి, టి. శ్యామ్యూయల్‌గార్లు కటక్‌లో జరిగిన అఖిలపోటీకి ఆంధ్రప్రదేశ్ నుండి పోటీదార్లుగా నెంపబడి, పంపబడిరి.

శ్రీ ఐ. సంతానంగారు 62, 63 సం॥ ఆంధ్రప్రదేశ్ పక్షమున జలంధర్‌లో జరిగినపోటీలకు పంపబడిరి రాష్ట్రప్రభుత్వము వారును, మండలీయులును ఈ విద్యపట్ల

ఎక్కడు ప్రోత్సాహమిచ్చి వీర విక్రమసింహపురమను పేరు సార్థకపరుపవలెను. మనమండల యువతీ యువకులు, వీరపత్ని యగు చానమ్మను, అసమాన వీరోత్తంసు డగు రణతిక్కనకు నెల్లూరు 'పుట్టినిల్లు' ను మాట విస్మరింపకుందురుగాక.

మల్లుల ప్రతిభాశక్తులచే మనమండల శింగరాయ కొండవద్ద పాంధుల గొల్లగొట్ట వచ్చిన చెంచులు పడిన పాటును గూర్చి ఈ సర్వస్వమున చిత్రవిచిత్రమను శీర్షికననొక సంఘటనము గలదు. చూ. పే. 298. కంసుడు ఆంధ్రమల్లుల కాశ్రయమిచ్చెనని హరి వంశమున విష్ణుపర్వము శ్లో 87 న కలదు.

1) చాణూర మాదిశద్యుద్ధే కృష్ణస్య సుమహాబలమ్ 7/2

2) ఆంధ్రమల్లంచ నికృతిం ముష్టికంచ మహాబలమ్ 8/1

3) తదిదం ప్రస్తుతం రంగేయుద్ధం కృష్ణాంధ్ర మల్లయో ।
బాలః కృష్ణో మహానంధ్రః కథం నస్యాద్విచారణా! ॥ 17

4) అహంబాలో మహానంధ్రో వపుషా పర్వతోపమః 19/1

5) సంకర్షణస్తు సుచిరం యోధయిత్వా మహాబలః ।
ఆంధ్రమల్లం మహామల్లో మండలాని వ్యదర్శయత్ ॥ 53

6) ఆంధ్రతోషల కౌహత్వా కృష్ణసంకర్షణా వుభౌ 56/1

7) ఆంధ్రే తదామహామల్లె ముష్టికేచ నిపాతితే 57/2

పాటల జటాఘటిత జూటరుచికోటి ఘృశపాటిత తమిస్రవలయం
కూటశబరం పటునిశాటకుల ఘాట సుభమోట నరసైక నిలయం
కోటి శతకోటి సమకోటి నయనోత్థిత కృపీటభవ దగ్ధమదనం
నాటిత భువంప్రళయనాటక మహారచన పాటవచణం హృదిభజే

—పుట్టపర్తి - శివతాండవమ్

# 62.

# శ్రీ సింహపురి వ్యాయామ మండలి

శ్రీ పి. పుల్లయ్య, యం.ఏ., బి.యిడి.

ఓమ్ అథాతః పృథివ్యాది మహాభూతానాగ్ం
సమవాయగ్ం శరీరం యత్కఠినం సాపృథివీ
యద్రవం తదాపోయ దుష్ణం తత్తేజో
యత్సంచరతి సవాయుర్యత్సుషిరం తదాకాశం.

— శారీరకోపనిషత్.

'శరీరమాద్యంఖలు ధర్మసాధనం' అను ఆర్యోక్తిననుసరించి మానవ శరీరమును ధర్మమును సాధించుటకు ఉపయోగింపవలయునని తాత్పర్యము. మనుష్యుడు ధర్మార్థ కామముల సాధించుటకు శరీరమే ముఖ్యసాధనము. అట్టి శరీరము, ఆరోగ్యవంతముగ నుండిననే పై వానిని సాధించుటకు వీలగును. కావున ఆరోగ్యము, మనుష్యునికి అవసరము. కావుననే ఆరోగ్యమే మహాభాగ్య మనుసామెత అమలులోనికి వచ్చినది.

మనుష్యులు ఆరోగ్యవంతులుగ నుండుటకు ఆహారము మొదలైన విషయములతో పాటు శరీర వ్యాయామము అవసరము. కావున ప్రాచీనకాలమునుండియు భారత దేశమున వ్యాయామశాలలు లేక తాలిమ్ ఖానాలు స్థాపింపబడి వ్యాయామ శిక్షణ ఇవ్వబడుచుండెను. ఆ సాంప్రదాయ ప్రకారము నెల్లూరునందు సంతపేటలో బొమ్మా కేశవులు వారి తండ్రి చెంచుఓబులుగారి యాజమాన్యమున ఒక తాలిమ్‌ఖానాను, నెల్లూరు చాకలివీధియందు పసుపులేటి వేంకటసుబ్బయ్యగారి యాజమాన్యమునను, పత్తేఖానుపేటయందు చెంగయ్యగారును తాలిమ్ ఖానాలు స్థాపించి వ్యాయామమును నేర్పుచుండిరి. జండావీధియందు హాల్ తాలిమ్ అనునొకటియు, బార్కాసునందు మరొకటి పనిచేయుచూ వచ్చినవి. వానియందు దండెములు, బస్కీలు, కత్తి, కట్టసాములు నేర్పబడుచుండెను. వానిలో వ్యాయామము నేర్చినవారు వారి కౌశలమును దశరా, పీర్ల పండుగ మొదలగు పండుగలలో ప్రదర్శించుచూవచ్చిరి.

అటుల పై సంఘములు పనిచేయుచుండగ 1931 సం॥ రమున శ్రీ కె. యస్ సుందరరాజారావు, శ్రీ పాటూరు సుబ్బరామయ్య, నాగానరసింహము కీ॥ శే॥ జి. లక్ష్మయ్య, భట్టారం వెంకటసుబ్బయ్యగార్లు కలసి ఆలోచించి తాలీమ్‌ఖానాలలో చెప్పు వ్యాయామముగాక పారలల్ బారు, హారజాంటల్ బారు, వెయిట్ లిఫ్టింగ్, ఆసనములు

సూర్యనమస్కారములు మొదలగు వానియందును వ్యాయామ శిక్షణ నిచ్చుటకుగా శ్రీ సింహపురి వ్యాయామమండలి, స్థాపించిరి. అందు హైస్కూలు కాలేజిలో చదువుచు, మంచి నడవడికగలవారిని తదితరులను, సభ్యులుగ చేర్చుకొనవలయుననెడి నియమము ఏర్పరిచిరి.

ఆనియమము ననుసరించి కాలేజి హైస్కూలు విద్యార్థులు, తదితర ఉద్యోగస్థులు, పెద్దమనుష్యులు మాత్రమే అందు సభ్యులుగ చేర్చుకొనబడుచు వచ్చిరి. సభ్యుల వద్దనుండి కొద్దిమొత్తమే సాలుసరి చందాగా వసూలుచేయుచూ వచ్చిరి. మొదట కొద్ది కాలము వి. ఆర్. కాలేజి వరండాలో పనిచేసి తదుపరి చివుకుల మాలకొండయ్యగారి యింటికి పడమటి భాగముననున్న ఖాళీస్థలమును వాడుగకు తీసికొని అచ్చట మండలి కార్యక్రమములు జరుపుచుండిరి.

అప్పుడు మండలి స్థాపించినవారేగాక ఉడాలి సీతారామశాస్త్రి, బి. సుబ్రహ్మణ్యం గారు లేటు బొమ్మా కేశవులుగార్లు, నేను, తదితరుల అందులో చేరితిమి శ్రీ కె. యస్. సుందరరాజారావుగారు బారులమీదను, ఉడాలి సీతారామశాస్త్రి 12 ఆసనములు, సూర్య నమస్కారములయందును బి. కేశవులు జి. లక్ష్మయ్య కత్తికర్రసామును, బి. సుబ్రహ్మణ్యం వెయిట్‌లిఫ్టింగ్ దండములు, బస్కీలయందు సభ్యులకు శిక్షణ నిచ్చుచూ వచ్చిరి. నేను సభ్యుడుగా చేరి అన్నిటియందు శిక్షణపొంది ఆసములను, సూర్య నమస్కారములు నేర్చుచుంటిని.

ఆమండలికి శ్రీ కె. యస్. సుందరాజారావుగారు అధ్యక్షులుగనుండిరి. శ్రీ జి. చెంచురామయ్య, శ్రీ బొమ్మా కేశవులు తదితరులు ఉపాధ్యక్షులుగను, నేను కార్యదర్శిగ పనిచేసితిమి. సామాన్య సభ్యులు, పోషకులు, రాజపోషకులు గలసి 70 మందికి పైగ సభ్యులుగలరు. ఆ సంఘమునకు షుమారు రు. 1400 లు నెల్లూరు సెంట్రల్ కోఆపరేటివు బ్యాంకియందు మూలధనముగ గలదు. ఆధనమును ఆమండలికి స్వంతస్థలము కొనుటకు ఉపయోగించ వలయునని అప్పుడు తీర్మానము గావింపబడెను. కాని అయ్యది నేటికిని కార్యరూపము వహింపలేదు.

సింహపురి వ్యాయామమండలి పనిచేయుకాలమున, నెల్లూరు సంతపేటలో యంగ్ జమ్సు అసోసియేషను, కన్యకల ఆసుపత్రి ప్రాంతమున శ్రీ కనకం బాబుగారి యాజమాన్యమున ఒక సంఘము, స్టోనుహవుసుపేటలో వైశ్య వ్యాయామమండలి, నవాబుపేటలో శివాజి వ్యాయామమండలి, మూలపేట, పత్తేఖానుపేటలలో వ్యాయామసంఘములు, పనిచేయుచుండినవి. జండావీధియందు మరొక తాలీమ్‌ఖానా పనిచేయుచూవచ్చిన వాటియందు దేశీయ వ్యాయామములు కుస్తీ మొదలగువాటియందు బాలురకు పెద్దలకు శిక్షణ యివ్వబడుచుండెను. ఈనాడు. యేసంఘములు చక్కగ పనిచేయుటలేదని తెలియుచున్నది.

శ్రీ సింహపురి వ్యాయామమండలికి చాలమంది పెద్దలువచ్చి సంఘకార్య క్రమములను చూచి ఆనందించి వారి సలహాలను అభిప్రాయములను వ్రాసియుండిరి. వారిలో

శ్రీరామ జోగారావుగారు శ్రీ జి. వి. సుబ్బ రామయ్యగారు, యమ్. కె. ఫరూకిగారు, జి. వి. నరిశింహారావుగారు శ్రీ శ్రీ శ్రీ జగద్గురుకంచికామకోటి పీఠాధిపతులు, శ్రీ మదన మోహన విద్యాసాగర్ గార్లు ముఖ్యులు. ఆమండలి మొదటిదియు దశవార్షికోత్సవమును శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారి అధ్యక్షతన జరిగినది. వార్షికోత్సవ సందర్భముననను, అప్పుడప్పుడు మండలి సభ్యులచే వ్యాయామ ప్రదర్శనములు గావింపబడినవి. పలువురు వానినిచూచి ఆనందించిరి. జగద్గురు కంచి కామకోటి పీఠాధిపతులు మండలిని సందర్శించి ఆశీర్వదించిరి.

ఆమండలిలో 2 సంవత్సరములు వివిధశాఖలలో వ్యాయామ పోటీలు జరుపబడినవి. అందులో ప్రథములుగ వచ్చిన వారికి వారు (ఆ విద్యార్థులు) చదువుచుండిన తరగతులకు ఆసంవత్సరమునకు కట్టవలసి జీతమును కీర్తిశేషులైన శ్రీ వెల్లంకి వెంకటసుబ్బయ్యగారు, వారి తండ్రి వెంకటప్పయ్యగారి పేరట బహూమతిగా నిచ్చిరి. యస్. రామలింగయ్య అను యఫ్. ఏ. చదువు విద్యార్థియు యస్. యస్. యల్. సి. చదుపు డి. శ్రీనివాసులు అను విద్యార్థియు వరుసగ రెండుసంవత్సరములును బహూమతుల పొందిరి. నెల్లూరు హిందూమహాసభ అధ్వర్యమున ఆటలలో పోటీలు జరుపబడుచూ వచ్చినవి. ఆకార్యక్రమమును ఈ మడంలి సభ్యులు నడుపుచుండిరి.

ఆమండలియందు వివిధరకములైన దండెములు, బస్కీలు, సూర్యనమస్కారములు, షుమారు 20 రకముల ఆసనముల యందును, శిక్షణ యీయబడుచు వచ్చినది. పారలల్, హారజాంటల్ బారులందు, బరువు లెత్తుటయందును కత్తి, కట్టసాముల యందు ప్రత్యేక శిక్షణనిచ్చిరి. మండలి సభ్యులలోనొకరు శ్రీ వై. చెంచయ్యగారు ఒక సారి 1000 దండెములు, 3000 బస్కీలు చేయగలిగినంత శక్తిగల్గియుండిరి.

ఒకసారి నేనును కొంతమంది విద్యార్థులము కలసి నెల్లూరు మున్సిపాల్టివారు శ్రీ రంగనాథస్వామివారి బ్రహ్మోత్సవ సందర్భమున ఏర్పాటు చేయుచుండిన ప్రదర్శనములో వ్యాయామ ప్రదర్శనముల గావించితిమి. ఇతర వార్షికోత్సవములలో పురప్రముఖులైన సింహపురి హిందూ కేసరి శ్రీ పైడా సుబ్బరామయ్యగారును, కీర్తిశేషులైన మట్టాహరి నారాయణశేష్టి బి. ఏ. బి., యల్. గారు, (ఒంగోలు) గాలి నారాయణరావు గారు. యం. ఏ., యల్. టి. హరిజనోద్ధారక అన్నదాత ఆదినారాయణ, బి.ఏ., బి. యల్. గారు, శ్రీ రేబాల పట్టాభిరామిరెడ్డిగారు, శ్రీ రేబాల దశరథరామిరెడ్డిగారు, శ్రీ ఒంగోలు వెంకటరంగయ్యగారు పాల్గొని ఆశీర్వాదములు నిచ్చిరి.

ఆమండలిలో శిక్షణ పొందినవారు చక్కని ఆరోగ్యమును పొంది సుఖజీవనము గడుపుచున్నారు. వ్యాయామమండలి సక్రమముగ పనిచేయవలయునన్న ముఖ్యముగ కావలసినవి. 1) స్థలము, చిన్నభవనము. ఉత్సాహవంతముగ నేర్పదలచిన కొందరు అధ్యాపకులు, కొన్ని పరికరములు మాత్రము. విద్యార్థులకు వ్యాయామముల నేర్పదలచియున్న కొందరు ఉత్సాహవంతులైన వాడున్నను, స్థలము భవనము లేని కారణమున పని జరుగకున్నది. కావున సొంత

తదితర పెద్దలు వ్యాయామ శిక్షణయొక్క అవశ్యకతను గుర్తించి తగు ప్రోత్సాహమిచ్చిన మరల వ్యాయామమండలి చక్కగ పనిచేయుటకు వీలుగలుగగలదు.

ఆసనములు, సూర్యనమస్కారములు ప్రతిదినము చేయుచుండిన, మానవులకు వారి శరీరములు వారి స్వాధీనములో నుండుట తటస్థించును. నరములు బలముగలిగి మానవుడు ఆరోగ్యవంతుడుగ నుండుట కెంతయో తోడ్పడును.

కఱ్ఱ, కత్తి, సాములునేర్చిన మానవుడు తమ దాకచక్యమును వృద్ధిచేసుకొని ఆత్మరక్షణ గావించుకొనుటకు సమర్థడగును.

దండెములు బస్కీలు, బారులపైన వ్యాయామ శిక్షణనొందిన, కండపుష్టిగలిగి ఆరోగ్యమైన జీవనము చేయుటకు వీలగును. క్రమశిక్షణకు అలవాటుపడి మానవుడు మంచిగుణములనేర్చి చక్కగ జీవితమును గడువుటకు వీలు గలుగుచున్నది. అట్టి వ్యాయామ పరిశ్రమకు నేడు చక్కని పోషణ ఆదరాభిమానములు లభించుగాత!

ఇతిశమ్.

---

తపము పెంపును బలశౌర్య దర్పములును గలిగి లోకహితార్థంబుగాఁ జరింతు।
రేయుగంబున నరుఁడు నారాయణుండు నన ప్రసిద్ధికి నెక్కిన మునులు సుమ్ము ॥
— ఉ. II - 141

♦ ♦ ♦ ♦ ♦ ♦

మ॥ ఇదికర్ణాటధరాధృతి స్థిర భుజాహేక లబ్ధేభరా
దుదయోర్వీధరత్రిప్రతి వ్యకృత నవ్యోపాయనోష్ఠిషర
త్నదృగంచత్పద కృష్ణరాయ వసుధాధ్యక్షోదితా ముక్తమా
ల్యద నాశ్వాసము హృద్యపద్యముల నాద్యంబై మహింబొల్పగున్.
(రాయలు : ఉదయగిరియందు ప్రహరేశ్వరపాత్రుని జయించెను.)
— ఆ. మా I - 89

♦ ♦ ♦ ♦ ♦ ♦

అచ్ఛిన్నమేఖలమలబ్ధ దృఢోపగూఢ మప్రాప్తచుంబన మవీక్షిత వక్త్రకాన్తి।
కాన్తావిమిశ్రవ పుషః కృతవిప్రలంభ సంభోగసఖ్య మివపాతువపుః పురారేః ॥
— డా. రాఘవన్‌గారి శృంగారప్రకాశిక - పే. 6

♦ ♦ ♦ ♦ ♦ ♦

# 63.

# నెల్లూరుజిల్లాలో స్కౌటు ఉద్యమము

శ్రీ కె. యస్. సుందరరాజారావు, యం. ఏ., బి. టి.,
గౌరవ ఉపకార్యదర్శి, నెల్లూరు.

ఉపోద్ఘాతము :

స్కౌటు ఉద్యమము అంతర్జాతీయ సంఘ సేవాసంస్థ. అందు జాతి, మత, కుల, వర్ణ, ప్రాంతీయతత్త్వములకు స్థానములేదు. భగవద్గీత బోధించు నిష్కామ కర్మయే ఆ సంస్థ ముఖ్యాశయము. ఆ సంస్థ 1907-8 ప్రాంతమున సర్ బెడెన్‌పవల్ గారిచే స్థాపింపబడెను. అత డాంగ్లేయుడు. 1910 లో ఈ యుద్యమము మన దేశమందును ప్రారంభింపబడెను. కాని శ్వేతేతరులైన భారతీయుల కందు ప్రవేశము లేకుండెను.

కాని ఆసంఘముయొక్క ఉదారాశయములు కొందరు భారతీయుల నాకర్షించెను. భారతీయులకుకూడ నిట్టి శిక్షణ (Scout training) సంతరి చేకూర్చునని పూజ్యులు, మహనీయులైన శ్రీమతి డా॥ అనిబిసెంటమ్మగారును, పండిత మదనమోహన మాలవ్యగారును తలంచిరి. కావున దక్షిణ ఇండియాలో మద్రాసునందు 1916 లో అనిబిసెంటమ్మగారును, 1917 లో ఉత్తర ఇండియాలో మాలవ్యా పండితులు హిరేంద్రనాధ కుంజ్రూగారును స్కౌటు ఉద్యమమును ప్రారంభించిరి.

1920 లో బెడెన్ పవెల్‌గారి స్కౌటు సంఘమున భారతీయులకును ప్రవేశము కల్గెను. 1921 నుండి 1933 వరకు అనిబిసెంటమ్మగారు అఖిలభారతీయ ఛీఫ్ కమీషనరుగా పనిచేసిరి.

జిల్లాలోస్థాపన :

1924 లో నెల్లూరుజిల్లా స్కౌటు సంఘము ప్రారంభమయ్యెను. అప్పుడు వెంకటగిరి రాజాగారి కళాశాల ప్రిన్సిపాలుగ నుండిన కీ॥ శే॥ రాయసం వేంకటశివుడు యం. ఎ. గారు జిల్లా స్కౌట్ కమీషనరుగా నుండిరి. ప్రారంభదశలో కీ॥ శే॥ నాగరాజు పిచ్చిరాజు. రంగస్వామి, మన్నేపల్లి శ్రీరాములుగారు ఈ యుద్యమమున ప్రధానులుగ నుండిరి. శ్రీ నాగరాజు పిచ్చిరాజుగారి నాయకత్వమున శ్రీ వేగూరు వేంకటప్పయ్య, ఒంగోలు పద్మరాజుగార్లు బాలభటులుగా పనిచేసినట్లును, కొంత సన్మానమును పొందినట్లును, నాకు జ్ఞాపకమున్నది. 1926 లో ఇందుకూరుపేట వై. యం. సి. ఏ. సెంటరుకు సంబంధించిన శ్రీ డి. స్వామిదాసు జిల్లా స్కౌట్ కమీషనరుగ నేర్పాటుకాబడిరి. అప్పుడు కొన్ని ట్రైనింగు క్యాంపులు జరిగినవి. 1929 లో న్యాయవాది ప్రముఖులు శ్రీ పి. వున్నయ్యగారు కమీషనరుగా నేర్పాటై చాలకాలము పనిచేసిరి. వారి హయాములోనే శ్రీ యం. యస్ సుందరరాజారావు, కీ॥ శే॥ ధరణికోట

వేంకటరమణయ్యగార్లు కార్యదర్శులుగా నుండిరి.

1931 జులైలో చిన్నబజారులో నుండిన వి. ఆర్. సి. హైస్కూలు బ్రాంచి యందు శ్రీ కె. యస్. సుందరరాజారావు స్కౌటు ట్రూపును స్థాపించి నడుపుచుండిరి. ఆకాలమునందే శ్రీ పి. షణ్ముఖయ్యగారు జిల్లా కమీషనరుగను, యం. యస్. రాఘవన్ గారు సంఘాధ్యక్షులుగను, కీ॥ శే॥ ధరణికోట వేంకటరమణయ్య, కె. యస్. సుందరరాజారావుగార్లు సంయుక్త కార్యదర్శులుగ పనిచేయుచుండిరి. శ్రీ సేతు మాధవన్‌గారును, గ్రిద్దలూరు సుబ్బారావు, కాసుఖేల త్ర్యంబకరావు మొదలగు వారు స్కౌటు ఉద్యమముపట్ల శ్రద్ధాభక్తులతో పనిచేయుచుండిరి. 1939 లో కావలి పట్టణమున ఆంధ్ర స్కౌటు ర్యాలీ జరుపబడినది. 194 లో జిల్లా కమీషనరుగను, కార్యదర్శిగను పనిచేయుచుండిన శ్రీ కే. రామచంద్రారెడ్డి యం. ఏ. బి. యల్, కే. యస్. సుందరరాజారావు, యం. బి. టి. గార్లు అవడి యందు జిల్లా కమీషనరు ట్రైనింగు పొందిరి. అప్పుడు హైకోర్టు జడ్జీ శ్రీ కే. పి. లక్ష్మణరావు పంతులుగారు రాష్ట్రీ చీఫ్‌కమీషనరుగానుండిరి. 1942 లో నెల్లూరు మునిసిపల్ కమీషనరుగానుండిన శ్రీ సంజీవతలావరుగారు ఈ యుద్యమము పట్ల ఎక్కువ మక్కువ ప్రదర్శించిరి. వారి తర్వాత మునిసిపల్ కమీషనరుగా వచ్చిన శ్రీ యస్. కృష్ణయ్యశెట్టిగారు జిల్లా స్కౌటు కమీషనరుగను, అప్పుడు వి. ఏ.యం. హైస్కూలు మాస్టరు జె. యం. పీటరుగారు కార్యదర్శిగ నుండిరి. వారి కాలమందును కొన్ని ర్యాలీలు, ట్రైనింగు క్యాంపులు సమర్థతతో జరుపబడెను.

హిందూస్థాన్ స్కౌటు ఉద్యమము :

యుద్ధానంతరము 1947 లో స్వాతంత్ర్యము వచ్చుటయు, అదివరకే స్కౌటు ఉద్యమ స్థాపకుడైన సర్ బైడన్ పవెల్ ఇండియాకు వచ్చిన సందర్భమున భారతీయులనుగూర్చి వెలువరించిన భావములకు కుపితులైన స్కౌటు సంఘసేవా పరులు మద్రాసునందు ఆ సంఘమునుండి వేరుపడి హిందూస్థాన్ స్కౌటు సంఘమును ఏర్పరచిరి. అప్పుడు శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారు హిందూస్థాన్ సంఘమునకు రాష్ట్రీ చీఫ్ కమీషనరుగా నుండిరి. తత్ఫలితముగ మన మండలమందును హిందూస్థాన్ స్కౌటు ఉద్యమము ప్రారంభమయ్యెను. దానికి కీ. శే. వినుగు సుందరరామరెడ్డిగా రధ్యక్షులుగను, శ్రీ పి. సి. రెడ్డిగా రుపాధ్యక్షులుగను; కే. యస్. సుందరరాజారావు, మన్నేపల్లి హనుమంతరావు గార్లు కార్యదర్శులుగ నుండిరి. 1947 లో మదరాసు రాజధాని హిందూస్థాన్ స్కౌటు అసోసియేషన్ వారి అధ్వర్యమున మదరాసు నందలి అడయారులో రాష్ట్రీయ శిక్షణ కేంద్ర మేర్పరుపబడి, కబ్బింగు, స్కౌటింగు, రోవరింగ్, మొదలగు వానియందు పరిపూర్ణ తరిఫీ మనిచ్చిరి. ఆ ట్రైనింగుకు నెల్లూరు జిల్లానుండి శ్రీ సుందరరాజారావుగారు హాజరై శిక్షణ నందుటచేత స్కౌటునందు ప్రిలిమినరీ, అడ్వాన్సుడు ట్రైనింగు క్యాంపులకు క్యాంపు ఆఫీసరుగ నుండుటకు సర్టిఫికేటు నొసంగిరి. అప్పటి

నుండియే మన మండలమున హిందూస్థాన్ స్కాటు సంఘము అభివృద్ధి చెందెనన వచ్చును.

ఆదేసమయమున Boys scout సంఘముకూడ పనిచేయుచుండెను. ఆ సంఘమునకు గ్రిద్దలూరు లక్ష్మీనరసింహరావుగారు అసిస్టేంట్ కమీషనరుగ నుండిరి. 1950 లో స్వాతంత్రసిద్ధి ఫలితముగ స్కాటు సంఘములు అన్నియు కలసి. తొలుత హిందీ స్కాట్సు అనియు తదుపరి భారత్ స్కాట్సు అండ్ గైడ్సుగా రూపొందెను. 1955 లో వి. ఆర్. కాలేజి మైదానమునందు స్కాటుర్యాలీ జరిగెను. అప్పటి జిల్లాకలెక్టరు, జిల్లా కమీషనరు అయిన శ్రీ భూతరాజారావుగారు పతాకము నావిష్కరించి అధ్యక్షత వహించిరి. ట్రైనింగ్ కళాశాలా ప్రిన్సిపాలు, శ్రీ టి. యన్. వేంకటావధానిగారు స్కౌటింగును గూర్చి ముచ్చటించిరి.

1957 లో కాళంగినది వెల్లువవలన సూళ్ళూరుపేట ప్రాంత గ్రామవాసులు ధన, పశు, ఆస్తి, నష్టములను పొంది దురవస్థలకు లోనైరి. అప్పుడు జిల్లాసంఘము విరాళములకు విజ్ఞప్తిచేసి, పరిసర గ్రామములు తిరిగి రు. 2000 లు ధనమును 1000 శేర్లు బియ్యము, 100 పంచలు, 100 చీరెలు, రవికెలు, వరదబాధితులకు పంచిపెట్టిరి. 1959-60 నవంబరు నెలలో రాష్ట్ర సంఘ ఆదేశాను సారము మండలములో పలు ప్రాంతములందు స్కాటు, గైడు వార్షికోత్సవములు జరిపిరి. 1959 డిసంబరులో అస్సాం, కాశ్మీరము, మైసూరు మద్రాసు, పశ్చిమబెంగాల్ రాష్ట్రముల కాయా రాష్ట్రాధికారులకు అచ్చట ప్రకృతి వైపరీత్యమువలన బాధితులైన వారి కొరకు ఒక్కొక్క రాష్ట్రము రు 100 లను పంపి ఉదతాభక్తిని ప్రదర్శించిరి. 1962 డిసంబరులో "హార్స్లీహిల్సు" నందు జరుపబడిన పెట్రోలు లీడర్సుక్యాంపుకు, వి. ఆర్. హైస్కూలు, సెంట్‌పీటర్సు హైస్కూలు. ఆర్. యస్. ఆర్. మునిసిపల్ స్కూలు నుండి 10 మంది విద్యార్థులు పంపబడిరి. 1963 మార్చిలో జరిగిన రంగనాథస్వామి రథోత్సవ సందర్భమున ఈ సంఘ పక్షమున 80 మంది అమోఘమగు సేవచేసి అధికారుల మన్ననల నందిరి.

సింహావలోకనము :

స్కాటు సంఘము నెల్లూరునందు మొట్టమొదట 1924 లో స్థాపింపబడి నేటి వరకును పనిచేయుచున్నది. ఈ సేవా సంస్థయందు పెక్కురు విద్యాధికులు, రాజకీయ మత, కుల ప్రశక్తిలేక పనిచేసిరి.

ఈ సంస్థవారు సాధారణముగ, ఉత్సవ ఊరేగింపులందును యాత్రా స్థలములందును, అగ్ని వరద క్షామ బాధితులకు తగుసేవ చేయుటయందు నిమగ్నులై నిర్మాణ కార్యక్రమములయందు పాల్గొందురు.

ఈ ఏడు నెల్లూరు జిల్లాయందలి పలు ప్రాంతములయందు 110 స్కాటు గైడు యూనిట్లు గలవు. అనగా 110 మాస్టర్లు పనిచేయుచున్నారు. అందులో 10 మంది వుడ్‌బ్యాడ్జి ట్రెయినింగ్ అయిన వారు. మన జిల్లాలో కబ్బులు, స్కాట్లు, గైడ్లు బుల్‌బుల్సు అందరు కలసి షుమారు 1400 మంది

గలరు. జిల్లా సంఘముయొక్క సరాసరి సంవత్సరాదాయము షుమారు రూ. 1200, 1500 ఖర్చుగూడ ఇంచుమించుగ అదాయ మునకు సరిపోవును.

కాని ప్రస్తుతము జిల్లా సంఘమునకు స్వంత ప్రదేశము, భవనము, ఆఫీసు వస తులు, సిబ్బంది జిల్లాకు క్యాపింగు సెంటరు మున్నగు సౌకర్యము లేవియులేవు. నెల్లూరు కనిగిరి విద్యా జిల్లాలను కలిపిన కొన్ని సౌకర్యములు వీర్పడ వచ్చునేమోయని నా ఊహ ప్రజలు. గవర్నమెంటువారు తోడ్ప డుదురుగాక.

ఇతిశమ్

## బాబా ఫరీద్ (1200-1280 A. D.)

ఫరీదా దర్ దర్‌వేసీ గాఖడీ చలాం దునియా భత్త
ఖన్నీ ఉతాయీ సోట్లీ కిత్తె వజా ధత్త.

భగవంతుని ప్రేమచూరగొను మార్గము క్లిష్టమైనది. మానవుడు తనకర్మఫల ముల, తన్నుమించిన భారములైనను తానే భరించి ప్రయాణము సాగించవలెను.

ఫరీదా సక్కర్ ఖండ నివాత గుడ్ మాఖిఉ మాంగా దుధ్
సభే వస్తు మిఠిమాం రబ్ న పూజన్ తుధ.

చక్కెర, మధుతేనె, కలకండ, గుడము, పాలు, అన్నియు మధురములే, కాని ఇవేవియు పరమేశ్వరుని నామరుచితో సరిరావు. మధుతమమైనది స్వామిపూజ.

కాగా! చూడ్ న పింజరా బసై తడో హూర్ జాహి
జిన్ పింజరే మేరా సహూ బసై మాస్ న తద్‌హో ఖాహి.

విహంగమా! (కాకీ) నా శరీరమందంతటనుగల మాంస పిండముల తినుము. కాని దయయుంచి నా నాచక్షువుల జోలికి పోకుము. నా స్వామిని కన్నులార వీక్షింప ఆశ యున్నది.

జో సిర్ సాయీనాని వైసో సిర్ కీ జై కాయ
కన్నే హెర్ జలాయీయే జాలణ్ సందే థాయ్.

శేషశాయికి మ్రొక్కు శిరము శిరము. లేదేని, ఆ శిరమును మంటలో వేయుము.

ఈ ఫారీద్‌సూక్తులు కొన్ని శిక్కుల పుణ్యగ్రంథమగు గ్రంథసాహెబ్‌న గలవు. గురునానక్ ఫరీదు స్నేహితుడు.

# 64.

# నెల్లూరుజిల్లాలో యునానీ వైద్యము

శ్రీ డా॥ యమ్. ఎ. సలామ్.
మాజీ గౌరవ వైద్యులు, రిజిష్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్.

A

"యునాన్" అనునది గ్రీకుపదము. దీనినుండే యునానీ వచ్చినది. ఇది గ్రీసులో క్రీస్తుపూర్వంనుండీ ప్రాచుర్యంలో వున్నది. అలెగ్జాండర్‌చక్రవర్తి తన ప్రపంచదండయాత్రల్లో అన్నివైద్యపద్ధతులనుండి మంచిని ఏర్చి కూర్చి 'యునానీ' అని నామకరణము చేశారు. ఉత్తరహిందూదేశమునకు వీరే ఈ వైద్యవిధానాన్ని కొనితెచ్చారు. దక్షిణ ప్రాంతానికిఅరబ్‌వ్యాపారులు తమవ్యాపార సంబంధంగా దీన్ని పరిచయంచేశారు. ఈ యునానికి మొగలాయిరాజులు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధిచేశారు. యునాని వైద్యం నిరపాయకరమైనది. ఇందులో ఏలాంటివిషపదార్థాలు వుండవు. ఈమందులలో త్వరగా, తీక్షణంగా నయంచేసే గుణం అట్టే వుండదుకనుక, పక్షవాతము, కాలేయవ్యాధులు మున్నగు దీర్ఘకాలికవ్యాధులకు ఎంతకాలమైనా వాడవచ్చు. ఇవి చాలా రుచికరంగా వుంటాయి కనుక పిల్లలు, పెద్దలు, ముసలివాళ్ళు, అందరూ హాయిగా వీటిని తీసుకోవచ్చు. నెల్లూరుజిల్లాలో అనేకమంది "భిషక్కులు" (హకీమ్‌లు) ప్రసిద్ధికెక్కారు. బాలకాలంనుంచికూడా—అంటే నవాబ్‌లకాలంనుంచికూడా ఈవైద్యం మన జిల్లాలో ప్రసిద్ధిగావుంటూవస్తుంది. వ్యాధులకు మందులిచ్చే విధానంలోనేకాక శస్త్రచికిత్సలోకూడా ఇదిబాగా ఖ్యాతిలోవుంది.

నెల్లూరుపట్టణంలో రంగనాయకులపేటలో అనేకమంది ప్రఖ్యాతివహించిన హకీమ్‌లు నివసిస్తూవుండినారు కనుక ఆ పేటకు 'యునాన్' అనే మరోపేరుకూడా వచ్చింది. ఉదాహరణకు 1900 ప్రాంతంలో హకీమ్ సయ్యద్ నయమ్‌తుల్లా సాహెబ్, సయ్యద్ రహమ్‌తుల్లాసాహెబ్, సయ్యద్ గయాజుద్దీన్‌సాహెబ్, సయ్యద్ మౌల్వీ సాహెబ్ మరియు సులేమాన్‌సాహెబ్ ఈ వైద్యంలో ఖ్యాతి గడించారు. వారు "ముఫ్రా"లు (టానిక్‌లు), లేహ్యాలు తయారుచేసి పెద్దపెద్దజాడీలలో నిలువ వుంచేవారు. ఈమందులు మిక్కిలి విలువైనవే అయినప్పటికీ, ధనికులవద్దనుండిమాత్రమే డబ్బుతీసుకొంటూ బీదలకుమాత్రం ఉచితంగా ఇచ్చేవారు.

కాబూలిహకీమ్‌సాహెబ్ 1910-45 ప్రాంతంలో ఈవైద్యంలో బాగా కీర్తి గడించారు. ఈనాటికీ కొందరు వీరిమందులనూ ద్రావకాలనూ తమ ఇళ్ళలో నిల్వవుంచుకొని అవసరమొచ్చినపుడు వాడుకొంటూ వుంటారు. కీర్తిశేషులు జనాబ్ సౌదాగర్

మహబూబ్‌ఖాన్‌సాహెబ్ (మునిసిపల్ ఛేర్మెన్) గారిఇంట మధుమేహవ్యాధికి బాగా పనికివచ్చే ఔషధము ఒకటివున్నది ఈ మందును ఈనాటికీ అనేకులు వాడుతూ వున్నారు

కొన్నిరకాల వ్యాధులకు విశిష్టమైన ఔషధులకు (Specifics) పేష్వారీ హకీమ్ ఖలందార్‌ఖాన్‌సాహెబ్‌బాగా కీర్తి గడించారు హకీమ్ రంతుమియాసాహెబ్‌గారి వద్దవున్న అనేకమైన అట్టి మందులలో మూత్రపిండము నొప్పులకు ఒకచూర్ణము వుండేది దివాడిన ఒకటిరెండు నిమిషాలకే గుణాన్నిచ్చేది ఇది మూత్రపిండము నొప్పులకు కొరడా'వంటిది

సయ్యద్ నజిరుద్దీన్‌సాహెబ్‌కూడా మిక్కిలి ప్రఖ్యాతిగడించారు వారు రోగనివారణలో మిక్కిలిశ్రద్ధాసక్తులు తీసుకొనేవారు వైద్యం ప్రారంభించిన తర్వాత మూడునాలుగుసార్లుగావెళ్ళి రోగిని పరామర్శించి వచ్చేవారు

కొన్ని ప్రత్యేకమైన వ్యాధులను పోగొట్టడంలో బంగ్లూరిహకీమ్‌సాహెబ్, హకీమ్‌సయ్యద్‌హుస్సేన్‌సాహెబ్, హకీమ్ సయ్యద్‌అబ్దుల్లాసాహెబ్, హకీమ్‌సయ్యద్ హస్సాన్‌సాహెబ్‌గార్లు బాగా పేరుగడించారు

చిన్నపిల్లల వ్యాధులకు హకీమ్‌ఇబాదుల్లాసాహెబ్‌గారి మాత్రలు ఖ్యాతిలోకి వచ్చాయి. వీరి కుమారుడు డాక్టర్ సయ్యద్ సాహెబ్ నేడు ఈకోవలో బాగా కీర్తిగడించి నెల్లూరుపట్టణంలో వైద్యంచేస్తూవున్నారు

చప్పన చౌకగా వ్యాధులను నయంచేయడంలో సి ఎ ఎమ్ హైస్కూలులో డ్రాయింగ్ మాస్టర్‌గా వుండిన జనాబ్ మహ్మద్‌నజీరుద్దీన్‌సాహెబ్ అహ్మద్‌అన్సారీగారు బాగాపేరుమోసినవారు వారువ్రాసియిచ్చే మూలికలు రోజుకు రెండణాలకు మించకుండా బజారులో సులభంగా లభ్యమవుతాయి

నెల్లూరుజిల్లాబోర్డు వుంటున్నరోజుల్లో మూడుయునానీవైద్యశాలలు వుంటూవుండేవి కాని ప్రస్తుతము సీతారామపురం అనేఒక్కచోట మాత్రంవున్నది మిగతారెండూ ఆయుర్వేదశాలలుగా మార్చివేయబడ్డాయి

నెల్లూరు మునిసిపాలిటీవారుకూడా ఒకయునానీవైద్యశాలను నిర్వహిస్తున్నారు

(ఆంగ్లవ్యాసానికి అనువాదము)

# నెల్లూరుజిల్లాలో హోమియోపతి వైద్యము

డా జె వి రమణయ్య, కావలి

B

జిల్లాలో హోమియోపతివైద్యసంఘము 19.7 సం న నెల్లూరులో శ్రీ జె వి రమణయ్యగారి ప్రోత్సాహముతో స్థాపింపబడినది ప్రస్తుతము డా పద్మనాభరావుగారు అధ్యక్షులు డా సయ్యద్ ఉపాధ్యక్షులు ఈ సంఘము తరఫున డా జె వి రమణయ్యగారు ఆంధ్రప్రదేశ్ సంఘమునకు ఉపాధ్యక్షులుగా ఎన్నుకొనబడిరి వీరు హోమియో వైద్యవ్యాప్తికై చాల పాటుబడి, స్వయంకృషితో ఈ వైద్యవిధాన ప్రాముఖ్యతను మండల మందలి పెద్దలచే గణనీయముగ చేసినారు ఈ వైద్యవిధానము ఈనాడు మండలమంతయు వ్యాపించి ప్రజాదరణమును పొందుచున్నది

# 65.

# నెల్లూరు మండలము - ఆయుర్వేద ప్రచారము

శ్రీ స్వయంపాకుల వేంకటరమణశర్మ, నెల్లూరు

శ్లో॥ రాగాదిరోగాన్ సతతానుషక్తాన్
అశేషకాయ ప్రసృతా నశేషాన్
ఔత్సుక్యమోహారతిదా న్జఘాన
యో పూర్వవైద్యాయ నమోస్తు తస్మై

(వా ॥ టి ॥)

## ఆయుర్వేద నిర్వచనము

ఆయువుయొక్క పరిజ్ఞానమే ఆయుర్వేదము అనగా శారీరక, మానసిక, స్వాభావిక, ఆగంతుక అను పెక్కువ్యాధులనుండి పీడింపబడు జీవులను వానివానినుండి తప్పింపబడి, జీవితపరిమాణమును పొడుపు చేసికొను మార్గమును (అష్టాంగపద్ధతిలో) బోధించు శాస్త్రమునే ఆయుర్వేదమందురు మానవుడు నిర్వహింపవలసిన గురుతర బాధ్యతలకు శరీరము ప్రధానము దానినే "శరీర మాద్యం ఖలు ధర్మసాధనం" అని కాళిదాసాది కవులును నిర్వచించిరి ప్రాణుల కారోగ్యమునకు మించిన సంపద వేరొకటి లేదు ఆరోగ్యసంరక్షణకై ప్రాణాయామాసనాదులు, యుక్తాహారవిహారములు, సత్కర్మాచరణము మొదలగునవి ముఖ్యములు

## శాస్త్రప్రాశస్త్యము

ప్రాచీనకాలమున ధన్వంతరి, చరక, సుశ్రుత, వాగ్భటాదులు లోకమున ఆయుర్వేదశాస్త్రమును ప్రవేశపెట్టి మృత్యుముఖమున జొచ్చినవారికి ఔషధప్రయోగముచే పూర్ణాయురారోగ్యములనమకూర్చగలిగిరి ఆయుర్వేదవైద్యవిధానము అపూర్వమైనది శరీరావయవము ఒంటొంటి పాయసు పేర్కొంచునట్లు ఆయుర్వేదమునకు పెక్కుశాస్త్రముల తోడ్పాటు అవసరమగుచున్నది ఆయుర్వేదమును చక్కగ తెలియగవలయునన్న పదార్థవిజ్ఞానశాస్త్రము, ఓషధివిజ్ఞానము, రసాయనికవస్తువిజ్ఞానము, ఖగోళభూగోళ[illegible]నము మొదలగు విషయములను తెలిసియుండవలెను

శ్లో॥ ఏకం శాస్త్రమధీయానో నవిద్యాచ్ఛాస్త్రనిశ్చయం
తస్మాద్బహుశ్రుత శ్శాస్త్రం విజానీయాచ్చికిత్సకః

అని సుశ్రుతుడు చెప్పియున్నాడు

ఋషిపరంపరాగతమై, అజరామరమై వెలసిన ఆయుర్వేదము విదేశీయుల [illegible] పాలనమున నేటివరకు దిగజారిపోవుచుండె వెనుకటికాలమున భారతసంస్థానాధీశులు

పలువురీ శాస్త్రమును పోషించుటచేతనే నేటి కీమాత్రమైనను జీవించియున్నదన వచ్చును. ప్రస్తుతము మన నెల్లూరుమండలమున జరుగుచున్న ఆయుర్వేద ప్రచారమునుగూర్చి స్థూలముగ బరిశీలింతము.

**శ్యామయ్యంగారి ఆసుపత్రి :**

క్రీ. శ. 1894 ప్రాంతమున కీ. శే. పళ్లె చందలరావుపంతులు నెల్లూరులో 'కర్ణాటక వైద్యశాలను' స్థాపించి, బెంగుళూరు వాస్తవ్యులగు శ్రీమాన్ చక్రవర్తి శ్యామయ్యంగారిని వైద్యులుగా నియమించిరి. కొంతకాలమైన పిదప మద్రాసు నివాసులగు రావు బహదూరు కలవకణ్ణన్ శ్రేష్ఠి, దివాన్ బహదూరు రామానుజం శ్రేష్ఠిగారల విరాళముతో వైద్యశాల నడుపబడుచు, ధర్మాయుర్వేద వైద్యశాలగ వ్యవహరింపబడజొచ్చెను. జిల్లా బోర్డువారును యథోచితముగ విరాళమిచ్చుచుండిరి. ఆ వైద్యశాల పేదలపాలిటి పెన్నిధియై పౌరుల మన్ననలకు పాత్రమయ్యెను. కీ. శే. శ్యామయ్యంగారు ఆయుర్వేదశాస్త్రమును క్షుణ్ణముగ నభ్యసించిన వారగుటయే కాక, నిష్కపటస్వభావముకలవారు, శాంతచిత్తులు, అమృతహస్తులు. వారా ఆసుపత్రికి భూషణముగనుండుటచేతనే 'శ్యామయ్యంగారి ఆసుపత్రి' యని వినుతికెక్కెను. ఇటీవల ఆ ఆసుపత్రిని పురపాలకసంఘమువారు స్వాధీనము చేసికొని, మూలప్పేటయందు నడుపుచున్నారు అట్లే వేరొక ఆయుర్వేద ఆసుపత్రిని స్టోన్‌హౌస్‌పేటయందును పురపాలకసంఘ యాజమాన్యమున నడుపబడుచున్నది.

**పులుగుండ్ల నరసింహశాస్త్రి :**

వీరి అభిజనము ఉదయగిరితాలూకా కోటా మపల్లి. సంస్కృతాంధ్రములందు తలస్పర్శమైన ప్రజ్ఞకలవారు. ఆయుర్వేదభూషణ ఆయుర్వేదాచార్య మొదలగు బిరుదములను గడించి, మూలప్పేట సంస్కృత కళాశాలయందు చాలకాలము ఆయుర్వేదోపాధ్యాయులుగనుండి, పెక్కండ్ర కాయుర్వేదమును బోధించిరి. వారి శిష్యులు నేటికిని సింహపురమందును, బరిసరములందును వైద్యులై ప్రజాసేవ చేయుచున్నారు. వారు కేవలము వైద్యులేకాక, సంస్కృతాంధ్రములందు రసవత్కవిత్వము చెప్పగల సమర్థులైయుండిరి. వారు క్షేమేంద్రకవికృత దర్పదళనమును, ఆంధ్రమున పద్యరూపమున ననువదించిరి. అది త్వరలో సారస్వతప్రియుల ఆదరాభిమానములవలన ముద్రణభాగ్యమందగలదని ఆశింపవచ్చును.

**శ్రీమాన్ ఏటూరి శ్రీనివాసాచార్యులు :**

సింహపురి సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులలో శ్రీమాన్ శ్రీనివాసాచార్యులు ముఖ్యులనవచ్చును. వారు చాలకాలము కలవలకణ్ణన్‌సెట్టి ధర్మాయుర్వేద, స్టోన్‌హౌస్‌పేట పురపాల కాయుర్వేదవైద్యశాలలయందు పనిచేసిరి. వీరు కొంతకాలము జిల్లా బోర్డుకు సంబంధించిన ఆయుర్వేద ఆసుపత్రులకు శాస్త్రోక్తముగ మందులను సిద్ధముచేసి సప్లయి చేయుచుండిరి. 'యోగరత్నాకరమునకు' 'అమృతకర' అను వ్యాఖ్యానమును రచించి ప్రకటించినారు. వీరు కేరళదేశమునకు సంబంధించిన ధారాకల్పచికిత్సావిధానమునుగూడ అమలునందుంచిరి. సహృదయులు, పేదలపట్ల దయాదాక్షిణ్యములు చూపువారు.

తేనరి గురుమూర్తిశాస్త్రి :

దాదాపు 40 సంవత్సరములనుండియు శ్రీ శాస్త్రిగారు నెల్లూరులో వైద్యవృత్తి సల్పుచు, మండలమున ప్రసిద్ధికెక్కిరి. వీరును బాలకాలము మునిసిపల్ ధర్మాయుర్వేద వైద్యశాలయందు ప్రధానవైద్యులుగ నుండి విశ్రాంతి గైకొనిరి. వీరెట్టి పురాణ వ్యాధులనైనను బాగుపఱుచగలరనియు, శాంతచిత్తులనియు, ఆస్తికులనియు కీర్తి వహించిరి. వారిప్పటికిని వైద్యవృత్తి సల్పుచున్నారు.

నేలనూతల బలరామయ్య :

వీరు కీ॥ శే॥ పులుగుండ్ల నరసింహశాస్త్రిగారి శిష్యులు. స్టోన్‌హౌవుసులోని మునిసిపల్ ఆయుర్వేద వైద్యశాలయందు చిరకాలము పనిచేసి, విశ్రాంతి గైకొనియున్నారు. రోగనిదానమున ప్రజ్ఞకలవారని ప్రతీతి.

కురుగంటి తిరుపతిరెడ్డి :

వీరు సహకార శాఖోద్యోగిగా పని చేయుచున్నను, ఆయుర్వేద, హోమియోపతిక్, వైద్య శాస్త్రములందు కృషిసలిపిన సమర్థులు. నెల్లూరులో జిల్లా వైద్య సమ్మేళనము, అఖిల భారతాయుర్వేదీయ వైద్య సమ్మేళనాదులు జరుగుటకు వీరి ఉత్సాహమే ప్రధాన కారణమనవచ్చును. శ్రీ రెడ్డిగారు. 1950 లో 'వైద్యప్రభ' అను పేర వైద్య మాసపత్రికను ప్రారంభించి కొంతకాలము నడిపిరి.

కి. శే. విశ్వనాథం సుబ్బరామయ్య :

వీరు కోవూరునివాసులు. వైద్యము వారి కులవృత్తి యనవచ్చును. కంటి వైద్యములో నిపుణులు. వీరు కొంతకాలము జిల్లా బోర్డు సభ్యులుగగూడ నుండిరి.

గొంగళ్ల కృష్ణయ్యగారు :

వీరును మండలాయుర్వేద వైద్యులలో ముఖ్యులనవచ్చును. చక్కని నాడి జ్ఞానము, రోగనిదానము, చికిత్సావిధానము చేయువారని ప్రతీతి. వీరు బహుకాలము తాలూకాబోర్డు, జిల్లాబోర్డులకు సంబంధించిన ఆయుర్వేద వైద్యులుగ పనిచేసి, విశ్రాంతి గైకొని, ప్రస్తుతము నెల్లూరు రంగనాయకులపేటలో నివసించుచున్నారు. వీరు కేవలము వైద్యులేకాక, నూతన ఘటికార నిర్మాణ కర్తలుగా నున్నారు. అగడియార మునగల విశేషములు ఈ సర్వసమున వేరొకచోట వ్రాయబడియున్నవి. (చూ. చిత్రము - ఫలకము XXI.)

పిట్టల పిచ్చయ్య :

వీరు అల్లూరు అనువర్తిలో కాంపౌండరుగా నుండిరి. కొంత వేదాంత వాసన కలదు. వీరి లవంగాల మైనము, బదపు మాత్రలు, కుమారీ సత్త్వగుగ్గులు, నవీర మైనము మొదలగు వివిధౌషధములను వాడుచు, వివిధరోగ నివారణమున ప్రసిద్ధి గాంచిరి. బాలచికిత్సలో నిపుణులు.

త్సరకవి వేణుగోపాలు :

మానేగుంటపాడు నివాసులు. పిట్టల పిచ్చయ్యగారి శిష్యులు. వైద్య విద్యానిపుణులు. ఆ చుట్టు పట్టులనుండు వారికి వీరు ధన్వంతరిగ నుందురు.

పొజుల ఆదినారాయణసెట్టి :

వీరు కోవూరు నివాసులు. వీరు వ్రణ చికిత్సలో నందెవేసిన చేయి. జల్లెడకురు

వులు, నరములు, ఎముకలకు సంబంధించిన కురువులకు చక్కని మలాముతో పట్టీలను వేసి మాన్పుదురు ఆ వైద్యము వారి వంశ పారం పర్యముగ వచ్చుచున్నది ప్రస్తుతము కోవూరు బుద్ధివారి వీధిలో నివసించుచున్నారు

సురభి కృష్ణయ్య

వీరును దాదాపు నాల్గు దశాబ్దములుగ వైద్యవృత్తినల్పుచు మండలమున ఖ్యాతి గడించినవారు వెజ్జుదనము వారి కుల క్రమాగత మనవచ్చును పెక్కు రాజౌషధ ములనుగూడ సిద్ధముచేయుదురు చక్కని హస్తవాసికలవారు

పిషారి చిన అయ్యవారప్ప :

వీరి నివాసము కందుకూరు తాలూకా పెరిదేపి వైద్యులు భిషగ్రత్న, ఆయుర్వేదోపాధ్యాయ బిరుదములందినవారు 904 నుండియు పి సి. ఎ అండ్ కంపెనీ అను పేర ఆయుర్వేదౌషధ కర్మాగారమును స్థాపించి, నానావిధౌషధములను సిద్ధముచేసి వివిధప్రాంతములందు బ్రాంచిల నెలకొల్పి ఆయుర్వేద ప్రచారము, సాగించుచు దాదాపు 37 సం॥ నుండియు ఆయుర్వేద చంద్రిక అను మాసపత్రికనుగూడ నడుపుచున్నారు వారి మందులలో నారసింహ లేహ్యము, రోజాపుష్పలేహ్యము, గంధక రసాయనముమొదలగునవి సుప్రసిద్ధములు.

గూడూరు పరిసరమునను, నాయుడు పేటయందును, కావలి పరిసరములందును కందుకూరు తాలూకాలోను పక్షవాతము, భగందరము, కుష్టు మొదలగు దీర్ఘ వ్యాధులను వనమూలికలచేతను, భస్మములచేతను రూపుమాపు భిషజ్మణులున్నారు

మిశ్రవైద్యము అనగాఆంగ్లాయుర్వేద విధానములరెంటిని అభ్యసించి చికిత్సచేయుచు సింహపురమున ప్రసిద్ధి చెందినవారిలో శ్రీ చక్రవర్తుల రామయ్యంగారు, జొన్నలగడ్డ నారాయణయ్య, యస్ విశ్వనాధం ప్రభుతులు ముఖ్యులనవచ్చును. శ్రీ యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రిగారు కతిపయ వర్షములనుండి ధన్వంతరి జయంత్యుత్సవములను జరుపుచు ఆయుర్వేద ప్రచారము సాగించుచున్నారు

జిల్లాపరిషత్ వైద్యశాలలు .

ఈనాడు జిల్లా పరిషత్తువారి యాజమాన్యమున మండలములోని వివిధప్రాంతములందు 94 ఆయుర్వేద వైద్యశాలలు స్థాపింపబడి జనసామాన్యమున కారోగ్య భాగ్యము చేకూర్చుచున్నవి. జిల్లాపరిషత్తువారొక కేంద్ర ఔషధుల ఉత్పత్తి కేంద్రమును స్థాపించి, దానిమూలమున వివిధ వైద్యాలయములకు శాస్త్రీయౌషధములను పంపిణీ చేయుచున్నారు (చూ. ప్రథమ ఖండము పే 64)

ఉదయగిరి మూలికలు :

ఆయుర్వేద వైద్యమునకు మూలికలు ప్రధానములు కనిగిరి, వెంకటగిరి, శ్రీహరికోట పొదిలి, దర్శి మొదలగు ప్రాంతములు వివిధ వనమూలికలకు నిలయములని పరిశోధనవలన తేలినది మన మండలమున ఉదయగిరికొండ మహౌషధుల కనికిపట్టని ప్రతీతికలదు 918 లో డా కోమన్‌గారు తన బృందముతో మూడేండ్లపాటు ఉదయగిరి కొండలనెల్ల దిరిగి దాదాపు 150 మూలికలను, వాని గుణాధికములను

ప్రకటించి యున్నారు. ప్రస్తుతమా కొండలయందు భూచక్రగడ్డ, పెన్నేరుగడ్డ, మొగశిరగడ్డ, మేకముడుసుగడ్డ, నేలతాటిగడ్డ, కన్నెకోమలగడ్డ, నెమలిఅడుగు ఆకు (వ్రణ చికిత్సకు) సన్నజెట్టి పోతువేళ్లు, హనుమంతు బీరవేళ్ళు, కోడి అరివేళ్ళు, తిప్పతీగె, సహదేవి ఆకు, (పట్టునొప్పులకు) మొదలగు ఔషధులెన్నియో దొరకును. రాత్రులయందు విద్యుల్లతలవలెఁ బ్రకాశించుచు, జ్యోతిర్లతలు, సంధానకరణివంటి ఔషధులు కలవందురు. ఇప్పుడును పలువురు వైద్యులు, సన్యాసులు తత్ప్రాంతములందు ఔషధుల నన్వేషించుచుందురు. ప్రభుత్వము వారుదయగిరి కొండమీద చక్కని ఆరోగ్య సదనమును నిర్మించి, ఔషధీ పరిజ్ఞానముగల పెద్దలచే వివిధౌషధుల సంపాదనకు కృషి సాగించుట అవసరము.

ముగింపు :

ప్రజలు విశేష ధనవ్యయములేక, స్థిరతరారోగ్య వంతులగుటకు ఆయుర్వేదమే శరణ్యము. దానినిమించిన చికిత్సావిధానము వేరొకటి కలదనుకొనుట భ్రాంతి జనకము.

ప్రాచీన ఋషి సంప్రదాయ సిద్ధమైన ఆయుర్వేదము జనసామాన్యమున కుపకరింపవలయునన్న జాతీయ ప్రభుత్వాదరణ కావలెను. దేశమెల్లెడల ఆయుర్వేద గురుకులములు, ఆయుర్వేదౌషధ కర్మాగారములు, రోగులకు దగిన చికిత్సభవనములు, ప్రభుత్వమేర్పరుపవలెను. కేవలము ధనార్జనకై కృత్రిమ మందులను తయారుచేసి, ప్రజల పాలిటి మృత్యువులవలె చలామణి యగుచున్న వైద్య బ్రువులను కఠినముగ శిక్షింపవలెను. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు ఆయుర్వేద వైద్యవిధానము పట్ల మక్కువ ప్రదర్శించి యితోధికముగ కరావలంబన మొసగునుగాక.

శా॥ ఈ యుర్వీతలమందు వైద్యవిధులె
న్నేన్నల్గుగా కన్పిటన్
శ్రేయః ప్రాప్తియు, క్షేమలాభమును ద
ర్కింపంగ వేదావ్యపా
దేయంబై భగవత్ప్రసాదితమునై
దీపించుచున్నట్టి యీ,
యాయుర్వేదమొకండె యద్యమృత మ
ట్లాస్వాద్య మౌనెల్లెడన్.

---

ఘట చేటికల గీతము.

పాతకపుల్లిత కోకనదం సురియాలోకేన తజ్జీయతే ।
ఏవం మనుస్సత్తగతా సత్తా జరాభివేగేన మద్దీయస్తీతి
జరాయ పరిమద్దితమ్ ఏతం మిలాతచ్ఛవిచమ్మసిస్సితమ్
మరణేన భిజ్జతి ఏతం మచ్చుస్స ఘసం అమిసమ్
కిమీనం ఆలయం ఏతం నానాకుణపేన పూరితమ్
అసుచిస్స భాజనం ఏతం కదలిక్ఖంధసమం ఇదన్

బి. సి. లా; అశ్వఘోష. పే. 8.

గతేఽర్ధ రాత్రే పరిమన్ద మన్దం గర్జన్తి యత్రాప్యృషి కాలమేఘా
అపశ్యతీ వత్సమివేన్దు బిమ్బం తచ్ఛర్వరీ గౌరివహూంకరోతి.

—పాణిని.

♦ ♦ ♦ ♦

ఉపోఢరాగేణ విలోలతారకం తథాగృహీతం శశినానిశా ముఖం
యధా సమస్తం తిమిరాంశుకం తయా పురోఽపి రాగాద్ గళితం నలక్షితమ్ ॥

♦ ♦ ♦ ♦

అస్యాగిరేః శీతల కన్దరస్థః పారావతో మన్మథ చారుదక్షః ।
ఘర్మాలసాంగీ మధురాణి కూజన్ సంవీజతే పక్షపుటేన కాన్తామ్ ।

అమరనాథ గుహయందు ప్రతి పౌర్ణమినాటికి, మంచుతో లింగమేర్పడును. ఆనాడు, రెండు పావురములు గుహ ప్రవేశించి ఆతుహినలింగము చుట్టును ప్రదక్షిణ మొనర్చి, పోవుచుండును. యాత్రికులు ఆ విహంగమిథున దర్శనము చేసికొందురు.

సరోరుహాక్షీణి నిమీలయన్త్యా రవౌగతే సాధుకృతం నళిన్యా
అక్ష్ణాంహి దృష్ట్వాఽపి జగత్సమగ్రం ఫలం ప్రియాలోకన మాత్రమేవ ॥

♦ ♦ ♦ ♦

విలోక్య సంగమే రాగం పశ్చిమాయా వివస్వతః
కృతం కృష్ణం ముఖంప్రాచ్యా నహి నార్యో వినేర్ష్యయా॥

♦ ♦ ♦ ♦

క్షపాః క్షామీకృత్య ప్రసభ మపహృత్యామ్బు సరితాం
ప్రతాప్యోర్వీకృత్స్నాం తరుగహన ముచ్ఛోష్య సకలం।
క్వసంప్రత్యుష్ణాం శుర్గత ఇతిసమాలోకన పరా
స్తాడి ద్దీపాలోకాదిశిదిశి చరన్తీహ జలదా॥

—పాణిని

# 66. A
# అమెరికన్ బాప్టిస్ట్ మిషన్ ఆసుపత్రి

ఐ. గో. రే.

1890 సంవత్సరములో అమెరికన్ స్త్రీ డాక్టరు ఇడాఫేగారు ఇప్పటి వి. బి., యమ్. బాలికల పాఠశాల వెనుకనున్న బాడుగఇంట్లో స్త్రీలు, శిశువులకుగాను ఈ హాస్పిటల్‌ను స్థాపించారు. 1897 లో ఇప్పటి భవనము నిర్మాణమైంది. ప్రస్తుత మీ ఆసుపత్రిలో 150 మంచాలున్నాయి. మొదటి సంవత్సరములో 34 మంది రోగులు ఆసుపత్రిలో చేరారు. 1962 సంవత్సరములో 5000 పైగా రోగులు ఆసుపత్రిలో వుండి వైద్య సహాయం పొందారు. మరో 8,000 మంది కూడా ఆసుపత్రికివచ్చి వైద్యసౌకర్యాలు పొందారు.

1908 లో నర్సుల శిక్షణాలయ స్థాపన జరిగింది. ఆంధ్రదేశంలో నెలకొల్పిన మొదటి నర్సుల ట్రయినింగు పాఠశాలలో ఇదొకటి. నేడు ఇది ఉన్నతస్థాయి పాఠశాలగా రూపొంది హయ్యర్ గ్రేడు నర్సులకు, మంత్రసానులకు శిక్షణ గడుపుతుంది. ప్రస్తుతం 40 మంది విద్యార్థినిలు శిక్షణ పొందుతున్నారు. ఈ హాస్పిటల్ ప్రారంభంనుంచికూడా నర్సింగ్ విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధవహిస్తూవున్నది. ఇందుకుగాను చక్కటి పాఠశాల భవనం నిర్మించబడినది. ఇక్కడి నర్సింగ్ సూపరింటెంటు సోదరి ఎతెల్‌ఫారే అఖిలభారత సుశిక్షితులైన నర్సుల సమాజం ఆంధ్రశాఖకు అధ్యక్షురాలుగా వున్నారు.

హాస్పిటల్ ప్రారంభించిన ఈ 73 సంవత్సరాలలోను 37 గురు భారతీయ డాక్టర్లు పనిచేశారు. దాదాపుగా అందరూ రాయవేలూరులోని క్రిస్టియన్ మెడికల కాలేజిలో పట్టభద్రులైనవారె. ప్రస్తుతం డిప్లొమాపట్టము కలిగిన ఇద్దరు డాక్టర్లు, నర్సుశాఖ సూపరిండెంటు, నర్సుల శిక్షణాలయం డైరెక్టరు, పదవులలో వున్నారు. వీరిద్దరూ భారతీయ స్త్రీలే. వీరు రాయవేలూరులో శిక్షణపొంది ఆతర్వాత అమెరికాలో ఉన్నత వైద్య విద్యనభ్యసించారు.

ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో ఎక్స్‌రే ప్రయోగశాల, రక్తపూరణశాల మొదలగు సకల ఆధునిక వైద్య సహాయాలన్ని వున్నాయి. నెల్లూరు చుట్టుప్రక్కల డాక్టర్లకు సహాయంగా ఈ పరిక్షలు చేసివ్వడంకూడ వున్నది. శిశు వైద్యశాల, గర్భిణీస్త్రీలకు ప్రత్యేకమైన ప్రసవపూర్వ చికిత్సాలయం ద్వారా ఈ ఆసుపత్రి శక్తి వంచనలేకుండా సేవచేస్తున్నది. ప్రతిసంవత్సరం మిషన్ పాఠశాలల పిల్లలకు దాదాపు 1500 మందికి ఆసుపత్రివారు పరీక్షచేస్తారు.

రోగుల ఉపయోగార్థం ఆంధ్ర, ఆంగ్ల తమిళ ఉర్దూ గ్రంధములతో కూడిన గ్రంధాలయంకూడ వున్నది. ప్రతినిత్యమూ రోగులు చదువుకొనడానికి ప్రతివార్డువద్దకూ పుస్తకాలు తీసుకొని పోతారు. ఆసుపత్రిలోని నిరక్షరాస్యులైన ఉద్యోగులకుగాను

వయోజన విద్యా తరగతులుకూడ నడుపుతున్నారు. దీర్ఘకాలంగా హాస్పిటల్ లో నే వుండి వైద్యం తీసుకొవల్సిన బడిపిల్లలకు గాను పాఠాలు చెప్పడానికి ఒక క్రీస్తుమత బోధకుడుకూడా వున్నారు. ఇవన్నీ అక్కడి మతశాఖ పర్యవేక్షణలో జరుగుతాయి.

రోగులనుండి వారివారి ఆర్థిక స్థితిగతులనుబట్టి రుసుము వసూలుచేస్తారు. ఈ ఆసుపత్రి లాభాపేక్షలేక మానవ సేవయే ధర్మసూత్రముగా నమ్మి నెల్లూరు మండల వ్యాధిగ్రస్తులకు వైద్య సహాయము సగు ముఖ్య కేంద్రంగావున్నది. ప్రభుత్వ సహాయమేమీ లేదు. నర్సుల శిక్షణాలయానికి మాత్రం విదేశాలనుండి కొద్దిపాటి సహాయం లభిస్తున్నది. అందువలన రోగులనుండి రుసుము వసూలు చేయవలసిన నిమిత్త మేర్పడినది.

*ఆసుపత్రి పురోభివృద్ధిని ఈ క్రింది అంకెలే సూచిస్తాయి.*

| | సంవత్సరం. | | |
|---|---|---|---|
| | 1893 | 1940 | 1962 |
| వైద్యభాగము | | | |
| పడకలు — | 4 | 126 | 150 |
| హాస్పిటల్‌లోవుండి వైద్యం స్వీకరించినవారు ,, | — | 2,513 | 5,031 |
| హాస్పిటల్‌కువచ్చి వైద్యసౌకర్యం పొందినవారు | - | 6,043 | 8,064 |
| శస్త్రచికిత్సలు — | | 398 | 1,052 |
| కాన్పులు — | — | 447 | 1,128 |
| ప్రయోగశాల పరిక్షలు | — | 6,680 | 30,146 |
| ఎక్స్‌రేలు | | — | 896 |
| నూతన రక్తపూరణ కేసులు | — | — | 734 |
| ఉద్యోగులు | | | |
| అమెరికన్‌డాక్టర్లు | 1 | 1 | 1 |
| భారతీయ డాక్టర్లు | — | 3 | 4 |
| అమెరికన్ నర్సులు | 1 | 2 | 0 |
| భారతీయ నర్సులు | — | 45 | 60 |
| ఆర్థిక విభాగము | | | |
| హాస్పిటల్ పూర్తి బడ్జెట్ | రూ. 2,331 | రూ. 24,500 | రూ. 1,67,188 |
| జీతములు — | ,, 169 | ,, 1,11,293 | ,, 89,000 |
| విదేశ సహాయం | ,, 2,200 | ,, 6,300 | ,, 10,488 |
| ఒకనర్సు, మంత్రసాని తర్ఫీమకై ఖర్చు | — | — | ,, 5,984 |



కుమారి హెలన్ యమ్. బెంజమిన్,
ఆర్. ఎన్.

1926 నుండి నెల్లూరులో మిషనరీ నర్సుగావుండిన కుమారి బెంజిమిన్ అమెరికా చికాగోనగరమందలి ఇల్లినాయిస్‌లో 1899 సెప్టంబరు 13 న జన్మించినారు. ఆనగరంలో విద్యనభ్యసించి, నార్త్‌వెస్టరన్ విశ్వవిద్యాలయములో బి. ఎ. పట్టమును స్వీకరించినారు. ఆపిమ్మట చికాగోలోని సెయింట్ ల్యూక్స్ నర్సుల శిక్షణ కేంద్రంలో నర్సుశిక్షణ పొందారు.

కుమారి బెంజిమిన్‌గారు 1926 నుంచి 1961 లో, అమెరికాకు వెళ్లేవరకు నెల్లూరులోని అమెరికన్ బాప్టిస్టుమిషన్ ఆసుపత్రిలో వుంటూవచ్చారు. నెల్లూరు ఆసుపత్రిలో నర్సుల శిక్షణాలయ పర్యవేక్షణయే వీరి ప్రధానబాధ్యత. వీరి శ్రద్ధాసక్తులతో ఈ పాఠశాల పురోభివృద్ధిగాంచినది. తొలుత ఇందు ప్రాంతీయ భాషలోనే శిక్షణ గరిపెడివారు. ఇటీవలనే ఇండియన్ నర్సింగ్ కౌన్సిలువారు సూచించిన హయ్యర్‌గ్రేడ్ నర్సింగ్‌కోర్సును ప్రవేశపెట్టి బోధనాభాషగా ఇంగ్లీషును ప్రవేశపెట్టారు. మంత్రసాని కోర్సులో ఉన్నత విద్యకూడ ఈ కార్యక్రమంలోనిదే. ఈ వ్యాపకమేకాకుండా, వీరు, తెలుగు బాప్టిస్టుమిషన్, రాయవేలూరు క్రిస్టియన్ మెడికల్‌కాలేజి ఆస్పత్రి, మున్నగువాటికి చెందిన అనేక వైద్యసలహా సంఘాలలో సభ్యులుగా వుండి ఎనలేని సేవచేశారు.

ఆసుపత్రికి అనేక ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చి పెట్టారు. పేదవార నేకులకు వీరు సహాయమొనర్చి విద్య నభ్యసింపజేశారు. ఇద్దరు భారతీయ నర్సులను అమెరికాకుపంపి, వైద్యశాస్త్రంలో ఉన్నత విద్య నభ్యసింపించెను. ఇందుకు ఈమె యే ధనసహాయంచేసెను. వీరు భారతదేశం వీడిపోతూ తన జ్ఞాపకార్థం నర్సుల శిక్షణాలయానికై ఒక సుందర భవనాన్ని నిర్మించి ఇచ్చారు. ఇదియే ఈమె సేవాతత్పరతకు జ్ఞాపక చిహ్నమైవున్నది. వీటన్నిటితో పాటు కుమారి బెంజిమన్‌గారి వాత్సల్యమొక ఎనలేని జ్ఞాపకం. రోగులకు, నర్సు విద్యార్థినులకు ఈ మెఅంటే ఎంతయో ప్రీతి.

కుమారి బెంజిమిన్ దీర్ఘవ్యాధితో చికాగోలు 1962 జులై 21 న మరణించారు. వీరి (కవల) సహోదరి శ్రీమతి జి. బి. మార్టిన్‌గారు చాలాకాలం ఐక్యరాజ్య సమితిలో అమెరికా ప్రతినిధిగావుండిరి. బెంజమిన్‌గారు అమెరికాకు తిరిగి వెళ్లేముందుగా పేరొకసారి. భారతదేశమునకువచ్చి బెంజిమిన్‌నుచూసి వెళ్లారు.



లీనాయమ్. బెంజమిన్, యమ్ డి

డాక్టరు లీనా బెంజమిన్ న్యూయార్కులో 1875 అక్టోబరు 17 న జన్మించినారు. ఈమె 1902 లో ఇండియాకు వైద్యమిషనరీగావచ్చి నెల్లూరులోని అమెరికన్ బాప్టిస్ట మిషన్ ఆసుపత్రిలో చేరి, 1941 లో రిటైరయ్యేంతవరకు ఇక్కడేవున్నారు.

భారతదేశములోవున్న తుదిరోజులలో వీరు గొప్పగా సన్మానితులైనా, స్వతహాగా నిరాడంబరవ్యక్తి. ఈమె చూపరికాకపోయినప్పటికి, హృదయ సౌందర్యంవల్లనే పెద్దగా ప్రేమింపబడ్డారు. తెలుగు స్త్రీలు వీరిని "పెద్దమ్మగారు" అని పిలుస్తుండేవారు. వీరి అమూల్యమైన నిస్వార్థ సేవాతత్పరతను గుర్తించి ఆంగ్ల ప్రభుత్వం వీరిని స్వర్ణపతకాది బహుమానములిచ్చి సత్కరించిరి. నెల్లూరు చుట్టుప్రక్కలనున్న ఇండ్లకు వెళ్ళి స్వయంగా పురిటికేసులను చూసెడివారు. ఈదగాలి, ఇసుకపాలెం, ములుమూడి-ఈమూడు గ్రామాలకు తన సహోద్యోగులతో వెళ్లి చికిత్సలు జరుపుతూ క్రీస్తు మత సేవలు జరుపుతుండెడివారు. ఈ అనుభవాల మూలంగానే ఈమె మన మండల గ్రామీణులకు మిక్కిలి సన్నిహితురాలైనది.

డా॥ బెంజమిన్ మంచి నిర్మాణ కుశలురు. వీరు నెల్లూరులోవున్న 40 సంవత్సరములలో ఆసుపత్రికి అనుబంధముగా అనేక సుందర భవనముల నిర్మించి ఈ వైద్య కేంద్రమును గర్వప్రాయమైనదిగా చేసెను. మంచి పరిపాలనా దీక్షతతో ఆసుపత్రిని అభివృద్ధిపరచెను.

వీరు మంచి చికిత్సాపరురాలు. తన చేతులు చికిత్సకు అనువుగాకున్నను అట్టి

పనిచేయు స్త్రీడాక్టర్లు లేనందున తానే ఆత్మ విశ్వాసముతో పూనుకొని జయప్రదముగా శస్త్రచికిత్సలు జరిపెడివారు. సంవత్సరమునకు సగటున 300 శస్త్రచికిత్సలు జరిపెడిది.

వీరి ఛాయాచిత్రమును సింహపురి పురమందిరమున అలంకరించి వున్నారు. నేటికిని ఆసుపత్రిలోవున్న వీరి ఛాయాచిత్రమునకు ఉద్యోగులు, తదితరులు భక్తి ప్రపత్తులతో ప్రణమిల్లుదురు.

క్రైస్తవ వైద్యసంఘములో సభ్యురాలుగా వీరి ఎనలేని మిషనరీ సేవచేశారు. డాక్టర్ ఇడా. స్కడ్డర్‌తో కలసి రాయవేలూరులో వైద్యపాఠశాల స్థాపనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. భారత స్త్రీలు ఉన్నత విద్య నభ్యసించవలెనని ఆకాంక్షించెడివారు వారికి ఆర్థిక సహాయము నిప్పించి ఉన్నత వైద్య విద్యకై అమెరికాకు పంపెడివారు. ఆంధ్రభాషను ధారాళముగా మాటలాడ గలిగివుండెను. క్రైస్తవధర్మ సూత్రములనే నమ్మి ఉన్నత జీవితమును గడిపెను.

వీరు రిటైరయ్యే ముందుగా నెల్లూరు పురమందిర వీరికి పీడ్కోలు సూచనగా పెద్ద సభ జరిపి, ఈమె నిస్వార్థసేవపట్ల మండలీయులు తమ కృతజ్ఞతను ప్రదర్శించిరి. ఈసందర్భముననే ఈమె ఛాయాచిత్రమును పురమందిరమున అలంకరింపబడెను.

1941 లో నెల్లూరును వదలి స్వదేశమగు అమెరికాకు తిరిగి వెళ్ళినది. కీళ్లనొప్పులతో బాధపడి ?1 8-58 న స్వర్గస్తులై ఏసుప్రభువు ఆశీస్సులందుకొనెను.

# 66 B.

## గూడూరులో వైద్యసహాయము.

అంతర్జాతీయ సంస్థయగురోటరీక్లబ్ గూడూరులో నొకశాఖ నేర్పరచిరి తే 25-12-63 న. సంస్థ వారనేక లోక సంగ్రహకార్యముల చేయుచురు. అనారోగ్యులకు ఉచితముగా వైద్యసహాయము చేయుటకై, శ్రీవేంకటేశ్వరాలయమునకు పడమట భవనమును నిర్మించి, రోగులను పరీక్షించి, వారికి ఆరోగ్యము కూర్చుటకు, ఔషధములనిచ్చి, అమోఘమగు మానవసేవ చేయుచున్నారు.

వీరికి ఔషధములన్నియు, అమెరికా నుండి సరఫరాయగుచున్నవి. ఈ మందులు ఉన్నతస్థాయికి చెందినవైయున్నవి. నవీన పరిశోధనల ఫలితముగా, అమెరికాలో తయారైన మందులు గూడూరునకుచేరి, అచ్చట ఈరోటరీ వారిచే నడుపబడు శాఖ ద్వారా, జనులకు రోగనివారణార్థమై ఉపయోగింపబడుచున్నవి.

ఇట్టి ఉచితవైద్యసహాయ సంస్థలు ప్రపంచమున, నందున్న రోటరీవారిచే 500 నెలగొల్ప బడినవి. అందు గూడూరు దొక్కటి. రోటరీ సభ్యులకు, మనమండల వాసులు కృతజ్ఞులై యుండవలెను.

మున్ముందు ఈ సంస్థవారు మండల మారుమూలలకు mobile dispensary తో పర్యటించి, వైద్యసహాయమే పొందలేని అనారోగుల పాలిటి ధన్వంతురులగుదురు గాక!

సర్వేజనాస్సుఖినోభవంతు.

ఆత్మస్థితం గుణ విశేషమహంకృతస్య
శృంగార మాహురిహ జీవిత మాత్మయోనేః
తస్యాత్మ శక్తి రసనీయతయా రసత్వం
యుక్తస్యయేన రసికోఽయమితి ప్రవాదః ॥

డా॥ రాఘవన్ · శృం ప్ర పే 466.

♦ ♦ ♦ ♦

సత్త్వాత్మ నామమల జన్మవిశేషజన్మా
జన్మాన్తరానుభవ నిర్మిత వాసనోత్థః
సర్వాత్మ సంపదు దయాతిశయైక హేతుః
జాగర్తి కోఽపిహృది మానమయో వికారః ॥

డా రాఘవన్ శృం ప్ర పే 466

♦ ♦ ♦ ♦

యత్పాదపంకజరజః పరిమార్జితేషు చేతస్సు దర్పణతలా మలతాంగతేషు
శబ్దార్థసంపద ఉదారతరాః స్ఫురన్తి విఘ్నచ్ఛిదేఽస్తు భగవాన్ స గణాధిరాజః

శృం ప్ర I (1)

♦ ♦ ♦ ♦

ఉత్తిష్ఠ ధర్మేస్థిత శిష్యజుష్టే
కింపాదయోర్మే పతితోఽస్మి మూర్ధ్నా
అభ్యర్చనం మే న తథా ప్రణామో
ధర్మే యథైషా ప్రతిపత్తిరేవ
అద్యార్థవత్తే శ్రుతవచ్ఛ్రుతమ్
తచ్ఛ్రుతానురూపం ప్రతిపద్య ధర్మమ్
అశ్వఘోషుని సౌ నందము XV II
22, 25 .

# 14. చిత్రవిచిత్రాలు

## డా॥ గొంగళ్ల కృష్ణయ్యగారు నిర్మించిన బహుళార్థసాధక గడియారములు

నే. శ్రీ కృ.

అల్. జజార్ ని గూర్చి, అతడునిర్మించిన యన్త్రములనుగూర్చి బోస్టన్‌మ్యూజియమ్ అధికారులు, మాసర్వస్వమున వ్రాయను, చిత్రమును ప్రకటింప అనుమతిచ్చినందులకు వారికి మాకృతజ్ఞత తెలుపుచున్నాము. చూ. చిత్రఫలకము XXV.

పై వస్తుప్రదర్శనశాలయందు ఆరు లిఖిత పత్రములున్నవి. అవి కూఫీ అక్షరములు.

*కితాబ్ ఫిమ అరిఫత్ అల్ హియల్*
*లిల్ హందసీయ.*

(Book of the knowledge of ingenious geometrical contrivances.)

యన్త్ర నిర్మాణతత్త్వముల గూర్చిన గ్రంథము. దీనినే.

*అల్ జామి బైన్ అల్ ఇల్మ్ వల్ అమ్ల*
*అల్ నాఫి ఫిషినాత్ అల్ హియల్*

అనగా, విచిత్రములగు యంత్రముల కార్యకావ్యవివరణముల వర్ణనము. ఈ గ్రంథము అల్ జజారిచే క్రీ. శ. 1206 లో వ్రాయబడినది. ఇతడు నాటి పరిపాలకుడైన ఉర్తుఖిద్ సుల్తాన్ మహమ్మద్ అల్ మలిక్ అఫ్షాఫిహా (1200-1222) పాలనములో నుండెను. ఆసుల్తాను అల్ జజారిని ఇట్టి యన్త్రములు చేయుటకు ప్రోత్సహించి వాని నిర్మాణమైన పిదప వాటినిగూర్చిన వివరముల గ్రంథస్థము చేయమనెను.

ఇట్టియంత్రములలో నొకదానినిఇందు తటస్థముగ వర్ణించడమైనది. అల్ జజారీ నిర్మించిన ప్రథమ నీటి గడియారము (చిత్రమిందు ప్రకటింపబడినది) కాలయాపనమును తెలుపు ఘటీకారమును గూర్చి పూజ్యులైన ఆనంద కుమారస్వామివారు ఆంగ్లమున వర్ణించిరి. అదియే ఈ వ్యాస ఖండికకు ఆధారము.

ఈ ఘటీకారము సుమారు 12 అడుగుల ఎత్తుండును. ఇందు తొమ్మిది జానల పొడవు, 5½ జానల వెడల్పుగల్గిన కొయ్య తలుపుగలదు. పైభాగమున 12 చిన్నగదుల వలెనుండి తల్పులతో మూయబడియుండును. ఈ తల్పులు జంటగానుండి దినారంభమున మూయబడియుండును. వీనిక్రింద ఇంకొక శ్రేణిలో మఱి 12 గదులుండి ఒకేతలుపు కల్గియుండును. దినారంభమున ఒకేరంగు కల్గియుండును. వీటిక్రింద నొక అర్ధఅంగుళము వెడల్పుగల దారు ముందుకువచ్చియుండును. దీనిమొదట చంద్రవంకవలె

సుండు నదొక్కటి దినప్రారంభమగు నప్పటినుండి, దినాంతమునకు కుడికొనకు పోవును. ఈమూరుక్రింద ఇరుకొనలందును రెండు గూడులుండును. ఈ జంటగూడులలో రెండు పక్షులు రెక్కలవిస్తరించి నిలుచున్నట్లు నిర్మింపబడియుండును. ఈ గూడులమధ్య అర్థచంద్రాకారముగ 12 గుండ్రని చిన్న గూళ్లు గ్లాసుతో కప్పబడియుండును. ఈ రెండు పక్షులముందును చిన్నిగిన్నెలు క్రిందుగా సమర్చబడియుండును. ఈ గిన్నెలలోని అడుగుభాగమున మ్రోగుటకు వీలగునట్లు చేయబడెను.

క్రిందిభాగమున వివిధ వాద్యవాదకులు అమర్చబడియున్నారు. ఇద్దరు తూర్యధ్వని చేయువారు, ఇద్దరు మార్దంగికులు ఒక్కడు తాళమువేయువాడు

అగ్రభాగమున (పైన) అర్ధ చంద్రాకారముగనుండి దానిపై మేషాదిరాసులు చిత్రింపబడియుండును. ఇందు ఆరురాసులే దృశ్యములగును. చిత్రమందు కుడివైపునుండి మేషము, వృషభము, మిధునము, కర్కాటకము, సింహము, కన్య అర్థవలయాకారముగ చిత్రితమైయున్నవి. ఇందు పూర్ణబింబప్రాయమై స్వర్ణవర్ణయుతమై సూర్యబింబముండును. చిత్రమున ఇయ్యది మేషముండుచోట క్రిందుగనున్నది. అదృశ్యముగ క్రిందభాగమున చంద్రుని చిహ్నముండును.

దీనిని పరికించి కాలయానమును,
కనుగొనుపద్ధతి.

దినప్రారంభమున' అనగా సూర్యోదయ సమయమున మొదటి ద్వారమునుండి చంద్రవంకబోలు చిహ్నము మెల్లగా చూవునకందని చలనముతో, కదలి రెండవ ద్వారముపైకి వెళ్లక మధ్యనిలుచును. అప్పుడు పైశ్రేణియందున్న మొదటి జంటతలుపులు తెఱవబడును. అచ్చోటికి మానవ విగ్రహమొకటి ప్రత్యక్షమగును. వెంటనే ఈ తలుపులు మూయబడి వాటి రంగుమారును. అప్పుడే క్రింద ఇరువైపులనున్న పక్షులు ముందునకు వ్రాలి, తమ ముక్కులనుండి నొక్కొక్క లోహపుగుండును క్రిందనున్న పాత్రలలోనికి వదలును. ఆగుండు అందు పడగనే శబ్దముకల్గును. పక్షులు పైకిలేచి నిలుచుండును. అది ఒక గంటకాలమైనదని సూచన. ఇట్లు అరుగంటలుజరుగును. అరవ గంటకాగానే క్రిందనుండు వాద్యవాదకులు తూర్యధ్వను లొనరింతురు. ఇట్లే ఈ ధ్వనులు తొమ్మిదవ, పండ్రెండవ, గంటలకు జరుగును.

పైనను్న సూర్యచంద్ర బింబముల చలన మిట్లుజరుగును. దిన ప్రారంభమున సూర్యబింబము అనాటి సూర్యోదయప్రారంభమున నున్న రాసివద్దకు చేరును. ఇట్లే రాసి మారుచుండ అబింబమువద్దకు మరొకరాసి చేరును. ఇట్టు బింబమురాసి చలనముతో సూర్యాస్తమయము వఱకు మారుచుండును. దృశ్యముగ ఎప్పుడును అరురాసులుండును. అవి క్రిందికిపోయి మిగత అరురాసులు దృశ్యమగును.

ఇట్లే రాత్రులందు చంద్రచిహ్నము క్షీణవృద్ధిదశలలో ఆయారాసులవద్ద చేరుచుండును. రాత్రులందు క్రింది అర్ధవలయాకార శ్రేణిలోని గ్లాసులలో దీపకాంతులుండును. ఈకాంతి సన్నదిగవెల్వడి సమయయాపన మగు కొలది పూర్తిగ వెలుతురు

వచ్చును. ఇట్లు ఒక్కొక్క గంటకు జరుగుచుండును. ఆరు తొమ్మిది, పన్నెండు గంటలకు వాద్య ఘోష జరుగును. రాత్రి అంతమునకు రాగా అన్నియు వెలుగును. అది సూర్యోదయమునకు సూచన.

చిత్రమందు మొదటిద్వారముపై ఈ అక్షరములు లిఖించబడి యున్నవి.

అలైహి 'షలాత్-ప్రభువునకు సర్వేశ్వరుని ఆశీర్వాదములు. క్రింద ఇరుప్రక్కల నుండు పాత్రలపై లిఖింపబడిన అక్షరములు

ఇజ్‌లి మౌలానా అస్-సుల్తాన్ అల్ మలీక్.

చక్రవర్తియగు సుల్తానునకు సర్వ శుభములు చేకూరుగాత.

ఈ అక్షరములు గూఢలిపియందున్నవి. ఈచిత్రముపైన వ్రాసిన పదము లేవన.

వ హో జిహి షూరత్ ఫి ఔసస్తహూ వాఫ తన్.

ఈచిత్రము నా (అల్ జజారీ) చే వ్రాయబడినది. చిత్రమందు దినప్రారంభమై ఒక గంట గడచినది రెండవగంట ప్రారంభమగుచున్నది. సూర్యుడు మేషరాశియందున్నాడు.

పై బాస్టన్‌లో నున్న గడియారము నడచుటకు నీటిధారాపాతమే శక్తి. ప్రాచీన కాలమందిట్టివి కాలమానము గమనించుటకు ఉపయోగపడెడివి.

• • • •

మన సింహపురియందు ఆయుర్వేద డాక్టరుగానున్న గొంగళ్ళ కృష్ణయ్యగారు 1946-1947 లో బహూళార్థ సాధకమగు రెండుగడియారములు తయారుచేసిరి అందొకటి ఈ క్రిందివిషయముల సూచీదండములద్వారా తెలుపును, 60 ఘడియలు, పుష్కరకాలము (లగ్నము), 12 రాసులు, (మేషాది); 27 నక్షత్రములు, (అశ్విన్యాది) విఘడియలు, 12 గంటలు, 60 నిమిషములు, 7 రాహూకాలములు, 12, ఇంగ్లీషు నెలలు, 30/31 తేదులు, 7 వారములపేర్లు, వీటిని సూచించుటకు 7 వారములపేర్లు, గలవు. అందు లగ్నమును (పుష్కరకాలమును) చూపు సూచీదండము అపసవ్యముగా తిరుగును.

ఈయంత్రము తిరుగుటకు శక్తి చిన్నిచిన్ని చక్రములు. గుంష్లతో వారమునకొకసారి స్ప్రింగులను త్రిప్పియుంచిన, ఆస్ప్రింగులు వదులగునప్పుడు, మిగత చక్రములు తిరుగగా పై బహూలార్థ విషయముల తెల్పుచు, సూచి దండములు తిరుగును.

ఈ గడియారమును 29-6-1963 సాయంకాలము గ. 4-30 అనగా 26 ఘ. 30 విఘడియలకు వృశ్చికలగ్నమున, శనివారం వీక్షించి, ప్రచురించుటకై ఛాయాచిత్రము తీసికొనబడినది. ఈ యన్త్రము 1946-47 న తయారుచేయబడి 1947 లో జరిగిన జిల్లా వ్యవసాయ వస్తుప్రదర్శనమందు ప్రథమమున ప్రకాశన మొనర్పబడినది. 9-3-1947 దిగల సర్టిఫికేటునొకటి, ఈ యన్త్రనిర్మాతలైన డా. గొంగళ్లకృష్ణయ్యగారికిచ్చిరి. అందు ఆనాటి అధికారులు సంతకము చేయ మఱచిరి.

ఈ గడియారము పొడవు 3 అడుగలు. 2 అంగుళములు వ్యాసము 2 అ.

1 అం ముఖపత్రము DIAL అ 8½ అం గడియారము మందము 5½ అం పెద్దస్ప్రింగులు 2 గలవు సూచీదండములు వివరములు

1) లగ్న ఘడియలు, పుష్కరకాలము లగ్న నామములు, (రాసులు) లగ్ననక్షత్ర ములు చూపను 1 అం పొడవు 2) విఘడియలు ఘడియలు 8 అం పొడవు 3) 2 గంటలు చూపుచు 6 అం పొడవు 4) రాహూకాలము నిమిషములు చూపునది 5½ అం పొడవు 5) తేదులు, చూపునది 4 అం పొడవు ) వారములు చూపునది 3 అం పొడవు 7) నెలలు - జనవరి నుండి డిసెంబరువరకు చిన్నవస్తులము వెరుగానుండి ½ అం పొడవుగానుండును

రెండవ గడియారము నిప్లే కొన్ని విషయముల మాత్రము చూపును

1) ఘడియలు 2) విఘడియలు ) గంటలు 4) నిమిషములు 5) రాహూకాలము 6) లగ్నగత ఘడియలు-పుష్కరకాలము 7) లగ్నము 8) నక్షత్రములు. దీనికి 4 సూచీదండములుగలవు వీటిని చూపుగడియార ముఖము ను DIAL) కృష్ణయ్యగారి తమ్ముడు ఉమామహేశ్వర ముగారు వ్రాసిరి

ఈ గడియారము చక్రములు గుండ్రస్ప్రింగులతో తయారై ఈ గాటికి నిపై విషయముల ప్రదర్శించుచున్నది దీనికి నాల్గుసూచీదండములుగలవు. నందు నెలలు, వారములు తేదులులేవు మొదటిదానికంటె చిన్నది వీటిచిత్రము చిత్రఫలకములు XXI నగలవు )

• • • •

శృంగేరి మఠమున రాసి స్తంభ మంటప మొకటి కొన్నివందల సంవత్సరములకు పూర్వమే నిర్మింపబడియున్నది గుండ్రముగ మండపము కట్టియున్నది అందు 12 స్తంభములుకలవు దృక్సిద్ధాంతము ప్రకారము సూర్యోదయ మేరాసిలో 30 దినములు అగునో, ఆనెల సూర్యకిరణములు, ఒక స్తంభముపైబడును మిగత స్తంభములు నీడలోనుండును ఇట్లు ద్వాదశ మాసములకు ఈద్వాదశస్తంభములు నిర్మింపబడినవి ఆయామాసములందు సూర్యకిరణములు అయాస్తంభములపై ప్రసరించుచుండును ఈ మండపమువద్దనే శృంగేరిపీఠాధిపతులైన విద్యారణ్యయతీంద్రుల బృందావనముకలదు

ఇట్టిది ప్రపంచములో మరెచ్చటను లేని శిల్పప్రతిష్ఠ.

ప్రాచీన ఇంద్రప్రస్థపురము, నేటి దేహళీపట్టణము (ఢిల్లీ 272 BC ప్రాంతమున సముద్రగుప్త చక్రవర్తి వీడం తస్తుల ప్రాంశుధ్వజ భవనమును నిర్మించెను ఈ విమానకట్టడము చెంతనే 268 BC లో చంద్రగుప్తుడు II ఒకఅయస్స్తంభమును స్థాపించెను దానిపైనున్న శాసనమువలన, దీని సమీపముననే ఒకప్రాంశుధ్వజమున్నట్లు లిఖింపబడియున్నది అకట్టడము నిర్మించిన స్థాపకుడు తానుఅర్జించిన యశస్సునందే నిలిచియున్నాడని వ్రాసియున్నది

ఈ ప్రాంశుధ్వజమునకు విష్ణుధ్వజ కట్టడమని పేరుండెను

ఈకట్టడముండు ప్రదేశమునకు నేటి పేరు మెహరౌలీ అనా ప్రాచీనగ్రామము

మిహిరావళి. సూర్యాది గ్రహములచలనము (పరిణాహమహావాతము) కనుగొనుచోటు. ఈ ప్రాంతమున 27 నక్షత్రములకు 27 దేవళములుండెను. ఈనాడు అవన్నియు ధ్వంసము చేయబడి, ఆరాళ్ళతో నిర్మాణము చేయబడిన మసీదున్నది. సప్తవిమానములు సప్తస్వర్గములనియు, ఈ ప్రాంతభవనము 12 పలకలగా కట్టబడియుండుటచే. 12 రాసుల ప్రతీకలములనియు తెలియుచున్నది.

జూన్ 23 నాడు సూర్యరశ్మి ప్రసారముచే, దినము దీర్ఘతమముగా నుండును. ఆనాడీ భవనమునందు సూర్యప్రభలు కేంద్రీకరింపబడి, ప్రసారమగును. ఈ భవనము ఎత్తుగడలో 5 డిగ్రీలు ఉన్నతముగా నున్నది. (Elevation.)

ఈ భవనమానాడు అంతరిక్షపరీక్ష చేయు కేంద్రముగా పరిగణింప బడుచుండెను.

ఇట్టిభవనమునకు కుతుబ్ అని పర్షియన్‌భాషా నామము. మీనార్ అనగా ఉన్నతమైన కట్టడము నేడు పిలువబడు కుతుబ్ మీనార్ అను పదములకు భావార్థమిదియే.

దేహళిని నాలుగు సంవత్సరములే (1206-1210)కుతుబుద్దీను పరిపాలించెను. కుతుబ్ అను పేరు ఆకట్టడమున కుండుటచే ఆ బానిసవంశరాజు నిర్మించినట్లు ఈనాటివరకు అపోహ ప్రబలియున్నది.

సత్యమేమనగా ఈ అంతరిక్ష ప్రాంత భవనమును సముద్రగుప్త రాజాధిరాజు కట్టించెను. దాని పేరు విష్ణుధ్వజము.

డా. డి. యస్. త్రివేదగారు 1963 లో ప్రచురించిన ఇండియన్ క్రానాలజి అను గ్రంథమున పే. 28. నఈ విపులీకరణము గలదు.

కాశ్మీరమున మొగలులచే నిర్మింపబడిన, కొండచరియలలోని తోటలలో నొకదానిని నిషాద్ అనుపిలుచుచున్నారు. దీని నిర్మాణము 12 రాసులకు ప్రతీకముగా నిర్మింపబడినది ఇవి 12 అంతస్థులుగా నున్నవి.

---

శ్లో॥ సంతప్తా దశమధ్వజా త్రునికరై
స్సమ్మూర్ఛితా నిర్జలే
తుర్యద్వాదశవ ద్వితీయగతినా
వైరాదశాభసనీ
సా షష్ఠీకటి పంచమాచ నవమఃభ్రా
సప్తమీవర్జితా
ప్రాప్తా త్వష్టమవేదానాం
త్వమఘనా తూర్ణంతృతీయాభవ।

◆ ◆ ◆ ◆

ఉ॥ కన్యకు నైదుపాదములు కన్యకునేడు
విలోచనంబులున్
కన్యకు నాల్గుకర్ణములు కన్యకు
నాలుకుపద్మయుంబులున్
కన్యకు ద్వాదశంబనఁగ నాకణ
మద్యము మున్నుయుష్టయా
కన్యకు నీకునాకు బదిగావలెరా
యుమ దంగనాష్టకీ.
(వినోదకథాకల్పవల్లి పే. 176, 152.)

## లైలా - మజ్నూ (ఖయస్)

జిస్మ్ మజనూం రాజే రంజేదూరయే । అన్దర్ అమద్ నాగహాం రంజూరి యే॥
ఖూం బజోష్ అమద్ జే షోలా ఇష్తియాంఖ్। తాపదీద్ అమద్ బరాం మజునూం ఫినాంఖ్॥
పస్ తబీబ్ అమద్ బదారూ కర్దనష్। గుంఫ్త చారా నేస్త్ గైరజ్ రగ్ జనష్॥
రగ్ జదస్ బాయద్ బరావి దఫవి ఖూం। రగ్ జనే అమద్ బదాంజాం జూం ఫనూం॥
బాజూష్ బస్తో కుషాదాం నేషే ఊ। బాంగ్ బర్ జద్ బర్ వేఅ మాహూక్ జూ॥
ముజ్దే ఖుద్ బిస్తాంనో తర్కే ఫంస్దఖున్। గర్ బేమీరమ్ గో బేరో జిస్మ్ కోహూన్॥
గుంఫ్త అఖిర్ తూచే మీ తర్సీ అజీ చూం నమీ తరీస్ తో అజ్‌షేరే అరీ ॥
షేరో గుర్గో ఖిర్సో బూజో హరర్దదా । గిర్ద బర్ గిర్దతోషబ్ గిర్ద ఆమ్దా॥
గుంఫ్త్ మజునూ మన్న మీ తర్సమ్ జే నేష్। సబ్రే మన్అజ్ కోహ సంగీ హస్త బేష్॥
మున్ బిలమ్ బే జఖ్మనా సాయద్ తనమ్ । అషికమ్ బర్ జఖ్మహా బర్మే తనమ్॥
లేఖ్ అజ్ లైలా వజూదే మన్ పురస్త । ఈ సదఫ్ పుర్ అజ్ సింపాతే అం దరస్త్॥
తర్సమ్ ఏ ఫస్సాద్ అగర్ ఫస్దమ్ కునీ। నేష్‌రా నాగాహా బర్ లైలాజనీ॥
దానద్ అం అక్లే కిఊదిల్ రౌషనీస్త్ । దర్ మియానే లైలా ఏ మన్ ఫర్కనీ స్త్॥
మన్కే అమ్ వలైలా లైలా కేస్తమన్ మాయకే । రూహెమ్ అన్దర్ దో బదన్॥

జలాలుద్దీన్ రుమీ తన మస్నావి యను గ్రంథమున ఈ ప్రేమ సంఘట్టమునుగూర్చి వ్రాసెను. లైలా ఖయస్ అగాధప్రేమచరిత్ర ప్రఖ్యాతమైనది. మజ్నూ అనగా పిచ్చివాడు, ఆపిచ్చికి పేరు లైలా (యను ప్రేయసి) పిచ్చి, ఇట్లే దుష్యంతుడును శకుంతలావ్యాధి (VI అంకము)చే బాధితుడు.

లైలాఖయస్ ప్రేమయు వాల్మీకి చెప్పినట్లు -

I, 77-30, 31

ప్రియాతు సీతా రామస్యదారాః పితృకృతా ఇతి
గుణాద్రూప గుణాచ్చాపి ప్రీతిర్భూయోవ్యవర్ధత॥
తస్యాశ్చ భర్తా ద్విగుణం హృదయే పరివర్తతే
అన్తర్గత మపివ్యక్త మాఖ్యాతి హృదయం హృదా॥

ఖయస్ అనారోగ్యస్థితిలో నుండగా, ఆనాటి వైద్యకలావమున, దేహమునుండి రక్తము ను వెలికి దీయుటాచారమై యుండెను. ఖయస్ రక్తనాళమును కోయుటకై ఒక ఆయుధమును, వైద్యుడు తీసికొని వచ్చెను. ఆకత్తిని చూచి ఖయస్ గడగడ వణకెను. వైద్యుడు "ఖయస్ నీవు సింహములతో పోరాడగలవు కదా, ఈ చిన్నివైద్యాయుధ మేల నిన్ను భయపెట్టుచున్న' దనెను. అందులకా ప్రేమ మూర్తి, 'నాకు భయములేదు, గాని నారక్త మండలి ప్రతిబిందు వునను లైలావసించియున్నది. నీఆయుధము ఆట్టు ఆశ్రితయైన ప్రియురాలిని గాయపఱచునని' అనెను.

బంకే బిహారీనుండి - గ్రంథమునుండి

తిక్కన పద్యాంజలి. డా॥ దివాకర్ల వేంకటావధాని:



అగమగమ్యమైన పరమార్థము బాహిరపెట్టి, సర్వలో
కాగము రూపుమాపిన మహాత్ము(డు తిక్కనయజ్వ, తత్త త
త్రిగత నామధేయమును చేరమున(గ యుచేసి, జన్మ జ
న్మాగత పాపసంహతి నిదానముసల్పి తరించెనోయన(గ

> వాతెఱ వెల్గించు ప్రతివాక్యము వేదము(బోలె నత్యమై
> శ్రోతల పాపరాశులను మా(డగొనంగలయట్టిపల్కు, నీ
> మాతపవిత్ర(దు(గాంచినది పుత్రుని(గా ఘనతెన్గుతల్లి తా
> నే తొలినామచేసి పఠియించినదో గద యెంత పుణ్యము(గా.

కంపని, వాడిపోవని, నిగారపు పల్కు సుమమ్ములేర్చి, అ
నంత మహత్తర ప్రతిసగాథము భారతమాలగూర్చి, వాక్
సుందరి రమ్యకంధరకు కూర్చె నితండు నవీనశోభ త
త్త్వంపము నానియు(గా విడువ(జాలవు దాని సుధీద్విరేఫముల్.

అరిషడ్వర్గము సంయమించి, విమలాత్మానంద సామ్రాజ్యమం
బరివేష్టించిన తిక్కయజ్వ, పరబ్రహ్మము విజ్ఞాన భా
స్వరమై సన్నిధిచేసి, సంస్కృతి నిరాన ప్రజ్ఞమౌ విష్ణు శం
కర సామ్యమ్మును దెల్పి, చిన్మయ మనఃకంజాతునిన్ జేసినన్

యవనుల దండయాత్ర ఫలమందని నాటి తెనుంగురాజు లు
త్సవ సమయాల తూర్య నినదంబులతోఁ బరమేగువేళ, త
త్సవసిత కుంజరమ్ములకె చెల్లిన యానము కొల్లగొన్న, యా
కవి కవితాలతాంగి నడకల్ యతికైనను మోహరజ్జువుల్

ఒకసారి కృష్ణవేణిక ప్రావృషమ్మున పొంగుగా కదలిన పోల్కినడచి
ఒకసారి శుద్ధవైదిక ముఖాగత వేదమంత్రాల బిగువుతో మచ్చరించి
ఒకసారి సుకవిరాణ్ణికురుంబముచే నమస్కృతులందుకొనునట్టి సిరివహించి
ఒకసారి నవపుష్ప మకరంద వికిరమ్ము చైత్రమాసముభంగి సౌరభించి

తిక్కనకవి ప్రజాపతి దివ్య మేధ
బహిరితాంధ్ర కవిత్వ శంపాలతాంగి
తళుకు మెఱుపుల మెఱసి, ఆంధ్రప్రపంచ
మంతయును తనమయమ్ముగా నావరించె

పొలము నతిక్రమింపక, సుబోధకమై, రసమోడిగిల్లు కో
మలకుగు శైలి, అక్కఱరుమాలిన పొల్లుపదాలు వాడకే
తెలుఁగున దేశిమార్గమున తిక్కనయజ్వ సృజించినట్టి, యు
జ్జ్వల రచనమ్ము మాతృకకు సైతము లేని మెఱుంగు తీర్చెడిన్

యోగము నభ్యసించియును ఉత్తమ కావ్యము సాధనమ్ముగా
ఆగమవేద్యుఁడైన పరమాత్ముని సన్నిధిగన్న నిక్కపుం
బోగులు ముప్వురిప్పటికి పోతన-త్యాగయ-తిక్కయజ్వయు-
మూగురు మూగురె అమృతమూర్తులు ఆంధ్రుల పాలి దైవముల్


ఈమహనీయమూర్తి జనియించిన దివ్యకదాచ్రివృత్తిచే,
నీ మహియంతయున్ పరిమళించిన దే సుమహారమందొ త
ద్ధామల వాసనల్ పిలుచుకొన్నది యీ శుభవేళ కాన తత్
ప్రేమయమూర్తికిన్ నతులు చేయుద మి ష్టాదలెల్ల చేతులై.

( 934 లో ఆంధ్ర విశ్వ విద్యాలయ ప్రాంగణంలో శ్రీ విక్రమ దేవవర్మగారి అధ్య
క్షతను జరిగిన ప్రథమ తిక్కన జయంతి సభలో ఎం ఏ విద్యార్థిగా, డాక్టరు వేంకటావ
ధానిగారు వ్రాసి పఠించిన పద్యములు -సం జ 2 )

# 67.

# తిక్కన; భారత కృత్యవతారిక

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి



తిక్కన గంటపుటొర.

ఆంధ్రవాఙ్మయమున పూర్వకవులు పలువురు, తమకు స్వప్నమున భగవంతుడు కనబడి కావ్యరచనకు ప్రేరేచినట్లు కావ్యారంభములందు వ్రాసికొనియున్నారు. కొందరిప్పటికిని వ్రాయుచున్నారు. అది యొక ఆచారముగా నేర్పడినది. ఆ యాచారమునకు కవిబ్రహ్మ తిక్కన కృత్యవతారికయే ప్రభవము.

తిక్కన కేవలకవికాడు. వేదవేదాంగవేత్త; వైదికకర్మాచరణనిష్ఠాగరిష్ఠుడు; యథావిధిగా యజ్ఞమొనరించిన పవిత్రమూర్తి; భక్తికర్మజ్ఞానములు మూడింటను పరిపక్వతనందిన మహానీయుడు. ఆ మహాకవి కర్మమయమైన యజ్ఞముచేత తాను పవిత్రుడై, భారతరచనారూప వాఙ్మయయజ్ఞముచేత ఆంధ్రలోకమును పవిత్రము కావించినాడు. అట్టి మహానుభావునకు స్వప్నమున భగవత్సాక్షాత్కారము గల్గుట సర్వథా సంభావ్యమేగదా!

ఆ కాలమున శైవవైష్ణవమతములకు స్పర్థయు, తత్తన్మతావలంబులలో పరస్పర విద్వేషమును ప్రబలి, సంఘము విచ్ఛిన్నమగు లక్షణములు అంతంతకధికము కానారినవి. అప్పుడు కవిబ్రహ్మ అది శ్రేయోమార్గము కాదని గమనించి, శివకేశవాభేదరూప ధర్మాద్వైతమును నెలకొల్పి, ప్రజానీకమునకు ప్రబోధమొసగ సంకల్పించినాడు. తాను హరిహరనాథరూప పరతత్త్వమును భావనచేసి, అద్వైతానుసంధానమున నారాధించి, లోకమునకు ఉత్తమ మార్గదర్శియైనాడు. హరిహరరూపము తిక్కన భావనాకల్పితమనియే ప్రాజ్ఞుల యభిప్రాయము.

"అనహంకార నిరూఢ భావనారాధ్యునకున్"

అన్న తిక్కనవాక్యము ఆ యభిప్రాయమునే ధ్రువపరుచుచున్నది.

భక్తిభరిత భావావేశముతో తిక్కన యొకప్పుడు హరిహరనాథు నిట్లర్థించినాడు.

"కిమిస్థిమాలాం కిముకౌస్తుంభవా పరిష్కియాయాం బహుమన్యసే త్వమ్,
కింకాలకూటః కిమువా యశోదా స్తన్యం తవ స్వాదు వద ప్రభో! మే."

ఈ ప్రార్థనమునందలి భావమెంత రమణీయమో - అంతపవిత్రము. అందు వలన భక్తవత్సలుడగు హరిహరనాథుడు గాఢాదరమున నవధరించి, సంతసించి, తిక్కశర్మను కృతార్థునిజేయ సంకల్పించినాడు; నాకలోక నివాసియైన-తిక్కన తండ్రి కొమ్మనకు ముందు దర్శనమిచ్చి, యతనిని వెంటగొనివచ్చి, తిక్కనకు స్వప్నమున సాక్షాత్కరించి యనుగ్రహించినాడు.

తిక్కన హరిహరనాథుని దర్శించిన వృత్తము అవతారికలో అత్యంత రమణీయముగను, సత్యశోభితముగను వర్ణింపబడినది. ఆభాగము ఆకృతిచేత శ్రవ్యమే యయ్యును, రచనాచమత్కృతిచేత దృశ్యమననొప్పి, తిక్కన కవీంద్రుని భవిష్య ద్రచనా విధానమునకు మచ్చుముక్కగా తార్కాణింపతగియున్నది. ఆయన కథను సంభాషణల రూపమునను, ఆకారేంగితవర్ణనల రూపమునను హృదయంగముగా నడపుచు, శ్రవ్యకావ్యమునను దృశ్యకావ్యలక్షణములను హత్తించుచుండును. ఆ విధానమంతయు మనకీ యవతారికలోనే గోచరించును. ఆయన తనకు హరిహర నాథుడు దర్శనమిచ్చిన యాసన్నివేశమును సహజసుందరముగా, నెదుట జరుగు చున్నదా యన్నట్లు వర్ణించి, తనతో పాటు పఠితలకు గూడ ఆ దివ్యసాక్షాత్కారము ననుభవయోగ్యము కావించినాడు.

తిక్కన విరాటము మొదలు పదునేనుపర్వములును తుదిముట్ట విరచింప నిశ్చయించుకొని, ఆరచనా కౌతుకమున మనమలర నీప్రబంధమండలి కేపురుషు నధినాథునిగా జేర్కొనదగునని యాలోచించుచు నించుకనిద్రించెను. అప్పుడే కల లోనతనికి తండ్రి కనిపించి. హరిహరనాథుని కతనిపై గలిగిన కారుణ్యము తెర గెరిగించి "వీడె విజయంచేయుచున్నా"డని నిరూపించి చూపెను. తిక్కనయు సంభ్ర మసంభరితహృదయుడై యవ్వలను కనుంగొని, యాసర్వేశ్వరుని దర్శించి, సాష్టాంగ దండప్రణామం బాచరించి, నుదుట నంజలి ఘటించి యంతంతనిలిచెను. అంతనా దేవుం డతని వైదికమార్గనిష్టమగు వర్తమును, భక్తి భరితమైన భగవత్పాద నిరంతరస్మరణతాత్పర్యమును, కావ్యరసాసక్తిని ప్రశంసించి, అతడు రచింపనున్న భారతమునకు తన్నుఁ గృతిపతిగా చేయవలెనని యర్థించెను. ఇది తిక్కన భక్తిపా రమ్యమునకును, పరమేశ్వరుని యాశ్రిత సులభత్వమునకును నిదర్శనము.

తిక్కన ఆవిభునకేదో విన్నపము చేయదలచినవాడై ముందు తండ్రి యానన మాలోకించి, అతని యనుమతి వడసెను. ఇది యాతని సభాసాధుత్వమునకు తార్కాణము. పెద్దలు దగ్గర నున్నప్పుడు, ఏకార్యమునకైనను - వారి యనుమతి పొంది కడంగుట సభ్యతాలక్షణము. తిక్కన యిట్టి మెలుకువలను తన రచనలో నెల్లడల బ్రదర్శించుచునే యుండును.

ఆ మహాకవి హరిహరనాథునితో - "నీకరుణ నిట్లు పదస్థుడనైతి"-నని పల్కి, జన్మాంతరదుఃఖముల్ దొలఁగునట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే" యని బ్రహ్మానందస్థితి నర్థించెను. పరమేశ్వరుడు స్వయముగావచ్చి - "నన్ను నీకృతికి పతినిగావింపు" మని యర్థించుట కవికృత బహుసుకృత పరిపాకమునగాని లభింపదు. అది గుర్తించియే తిక్కన అహంకారమును విడిచి, "నీకరుణ నిట్లు పదస్థుడనైతి" నని వినయవినమితుడై విన్నవించుకొన్నాడు.

నిర్వచనోత్తర రామాయణము వ్రాయునాటికిని మహాభారత రచనకు తొడగునప్పటికిని తిక్కన మనఃపరిపక్వతలో చాల అంతరమేర్పడినది. అప్పుడతడు అహంకారమును పూర్తిగా పరిమార్జించినవాడు కాడు కావుననే "అమలోదాత్త మనీష నేనుభయకావ్య ప్రౌఢివర్తించు శిల్పమునం బారగుడ" నని చెప్పికొన్నాడు. ఇప్పుడు కవితావిషయమున నంతకంటెను పరిపక్వస్థితినంది యుండియు, అహంకారమును విడిచి, తానేదైన రచించిన నదియంతయును పరమేశ్వరుని యనుగ్రహవిశేషమే యని భావించుస్థితికి వచ్చినాడు. కనుకనే "నానేర్చినభంగిఁ జెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్" అని సవినయముగా చెప్పికొన్నాడు. అహంకారరహితమైన యిట్టి పరిపక్వస్థితి నందినవాడు కావుననే యతడు నశ్వర్యములైన కోరికలేవియుగోరక, జన్మాంతరదుఃఖమును దవ్వులకుద్రోయు బ్రహ్మానందస్థితి నర్థించెను. నిజమైన కట్టిస్థితి నందినవాడుగాని పంచమవేద రచనమున కర్హుడు కాజాలడు. ఇచ్చటి యీ సన్నివేశమంతయును అతని అర్హతను లెస్సగా వ్యక్తము చేయుచున్నది.

హరిహరనాథుడు తిక్కన యభిలాషము ననుసరించి, అతని ప్రార్థనమును మన్నించి - "జననమరణాదులైన సంసారదురితములకు నగపడకుండగఁ దొలఁగు తెరువు గను వెలుంగునీకిచ్చితి" నని యనుగ్రహించినాడు. తిక్కన ఆనందతుందిల హృదయారవిందుడై మేల్కాంచి, కలలోగన్న యానందమునే మరల మరల తలచుకొనుచు, ఆదేవునకు కృతిగా భారతమును రచింప నిశ్చయించుకొన్నాడు. ఆస్థితి యాతనికి మహాపదలాభముగా పరమానంద సంధాయకమైనది. తనపుట్టువు కృతార్థమయ్యెనని భావించుచు, హరిహరనాథదేవు నంతసన్నిధి కల్పించుకొని రచన కుపక్రమించినాడు.

తిక్కన తానురచింపబోవు భారతమును ప్రబంధమండలిగా భావించెను. ఆతనిదృష్టిలో భారతమునందలి ఒక్కొక్క పర్వము ఒక్కొక్క ప్రబంధము. ప్రబంధ మనగా కావ్యము. ఆతడు భారతమును కేవల మితిహాసముగాగాక బహుప్రబంధ కలిత మహాకావ్యముగా రచింప నిశ్చయించెను. ప్రధానవస్తు సంవిధానమునకు భంగము కలుగకుండ, రసభావములను చక్కగా పోషించుచు సమంజసములైన వర్ణనలతో - ఔచిత్యము పొలిమేరదాటకుండ భారతమహాకావ్యమును నిర్మించుటే ఆమహాకవి లక్ష్యము. అందువలననే కావ్యారంభమున - "అమ్మహాకావ్యంబు నర్థించు సంగతంబు చేసెద"నన్నాడు.

తిక్కన, భారతమును "ఆంధ్రావళి" మోదమొందవలెనను ఉద్దేశముతో రచించినాడు. ఆంధ్రావళి యనగా, పండితులును - పామరులునునైన ఆంధ్రులెల్లరునని యర్థము. నన్నయ రచితభాగము ప్రసన్నమైన శైలితోగూడినదైనను, సంస్కృత పదసమాసబహుళము. అందుచేత అది సంస్కృతభాషానిష్ణాతులైన పండితులకేగాని, ఆ భాషతో పరిచయములేని ఆంధ్రావళికి సులభముగా బోధపడదు. అది గమనించియే తిక్కన, తెలుగువారికెల్లరికిని అర్థము సులభమగునట్లు - తన రచన యంతయు - తేట తెనుగు మాటలతోనే సాగించినాడు. ఆయన "ఆంధ్రావళి మోదముంబొరయునట్లుగ రచింతు" ననుటలో భావమిదే.

తిక్క రచనలో మరియొక విశేషమును కలదు. ఆయన సాధారణములైన కథాభాగములనేకాక, అతిగహనములైన శాస్త్రార్థములనుసైతము మామూలు తెలుగు పలుకులతోనే సుబోధములు కావించినాడు. ఇది యలతియలతి తెలుగుకవుల కలవియైన పనికాదు. ఆ మహాకవి కొక్కనికే చెల్లినది. తెలుగు భారతమును తిక్కన చేయుటచేత తెలుగుభాష విస్తృతినందుటయేగాక, సమగ్రమైన స్వతంత్రభాషగా రూపొందినది. తిక్కన ఆంధ్రభాషా నిర్మాత. కావుననే లోకమాతనిని "కవిబ్రహ్మ" యని కీర్తించినది.

ఆంధ్రభాషకును, ఆంధ్రులకును తిక్కన చేసిన మహోపకారము నిరంతర స్మరణీయము. తిక్కన ఉత్తమ కవుల కాదర్శపురుషుడు; ఆయన భారతరచన ఉత్తమ కవిత్వమునకు మేలుబంతి.

"జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః"

# 68.

# తిక్కన - హరిహరనాథుడు

• డాక్టరు: తేరపరపు వేంకటరామకోటిశాస్త్రి, M.A., Ph.D.



హరిహరనాథుడు.

— బాదామి గుహ 100 బి. సి.

శ్రీయన గౌరినాఁ బరగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపముదాల్చి విష్ణురూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్.

---

• ఈ వ్యాసకర్త 'తిక్కన'పై ఉస్మానియా విశ్వవిద్యాలయమున వ్యాఖ్యానము (Thesis) వ్రాసి, డాక్టరు పట్టభద్రుడయ్యెను. ఆ వ్యాఖ్యాన మింకను అముద్రితముగా నున్నది. అందలి మహత్తు ఎంతయున్నదో, స్థాలీపులాకముగ ఈ వ్యాస సౌష్ఠవమున గ్రహింపవచ్చును.

తిక్కనగారి హరిహరనాథస్తుతిపరమైన మొదటి పద్యమది. ఇష్టసిద్ధికి తిక్కనగారు కొల్చినది పరతత్త్వమును. పరమనగా సర్వోత్కృష్టమని. పునరావృత్తి శంకావర్జిత మనియర్థము. తత్త్వం తథ్యమమృతం సత్యం పరమార్థః సతత్త్వమిత్యేతే ఏకార్థవాచినః పరమార్థసతో బ్రహ్మణో వాచకాః శబ్దాః అని శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యుల వారు తత్త్వ శబ్దార్థమును విచారించిరి. పరతత్త్వమనగా పునరావృత్తి శంకావర్జితమైన సత్యామృత స్వరూపాత్మకమైన బ్రహ్మము. ఆ బ్రహ్మమెట్టిది? భక్తజనంబు వైదికధ్యాయిత కిచ్చు మెచ్చునది. అనగా భక్తులయొక్క వైదికతకు, ధ్యాయితకు నిచ్చు మెచ్చునది. భక్తుల యొక్క వైదికతయనగా వైదిక భక్తి పరమైన కర్మలని యర్థము. వైదికభక్తియని యొకటున్నదా యన్నచో, ఉన్నది. లౌకిక వైదిక ఆధ్యాత్మికాది భక్తిభేదములను పద్మ పురాణము చెప్పినది. సంహితాధ్యయనాదికము - ఋగ్యజస్సామ మంత్రముల జపము-హవ్యహోమకర్మ - ఇవన్నియు వైదికభక్తిలోనివి. ధ్యాయము యొక్క భావము ధ్యాయిత. ధ్యాయమనగా అభ్యన్తరార్చనము. అనగా మానసికమైన అర్చనము. అనగా మానసిక భక్తి యొక్క కలిమి. ధ్యానధారణములు మానసికభక్తిలో ప్రధానములు. ధ్యానధారణములు, జ్ఞానైక దృష్ట్యధీనములు. మానసిక భక్తులనగా జ్ఞానులని తాత్పర్యము. వైదిక భక్తి కర్మపరము. మానసిక భక్తి జ్ఞానపరము. తిక్కనగారు వైదికధ్యాయిత అనుటవలన కర్మజ్ఞానములను రెండింటిని గ్రహించినట్లైనది. మరియు దాని నింకొక విధముగా గూడ సంభావింపవచ్చును. వైదికధ్యాయిత యనగా వైదికమార్గనిష్ఠమగు వర్తనముతోడి జ్ఞానమని. ఇది తిక్కనగారి కభిమతమైనదే. అనగా వైదికమైన యజ్ఞయాగాది క్రియావర్తనము కలిమిని జ్ఞానముద్వారా పరమేశ్వరుని భావించుట. అట్టివారు వైదికధ్యాయిత కలవారు. వారేమని పరమేశ్వరుని భావించుచున్నారు? విష్ణురూపాయ నమశ్శివాయ యని. విష్ణురూపాయ యనగా విష్ణుత్వము రూపముగాగల వానికొరకని. విష్ణుత్వమనగా దేశకాల వస్తు పరిచ్ఛేద శూన్యత్వము. వ్యాపన శీలము గల తత్త్వమని యర్థము. నిస్త్రైగుణ్యతయా శుద్ధత్వాత్ శివః-త్రిగుణాతీతమైన శుద్ధ తత్త్వము శైవము. శివవిష్ణుతత్త్వములు రెండును ఒక పరతత్త్వము యొక్క రెండు ముఖములు. ఆ పరతత్త్వమావిధముగా హరిహరంబగు రూపము దాల్చుచున్నది. రూపము దాల్చుచున్న పరతత్త్వమనగా "సోఽకామయత" అన్న తరువాతి పరతత్త్వము. ఆ పరతత్త్వము యొక్క ఆ ఇచ్ఛయే మాయ లేక ప్రకృతి. మాయోపహితమైనపుడు బ్రహ్మము సగుణము. సగుణబ్రహ్మము నామరూపాత్మకము. అనగా హరిహరాత్మకము బ్రహ్మము. హరిహరాత్మకమైనపుడు శ్రీయన గౌరినాబరగు

చెల్వకు చిత్తము పల్లవించును. అయినచో ఆ చెలువ యెవరు? ప్రకృతియే ఆమె. సగుణ బ్రహ్మమునకు హరి యని హరుడని నామరూపములున్నట్లే తదిచ్ఛకు శ్రీయని గౌరియని నామరూపములున్నవి. తదిచ్ఛయైన మాయ యందు తత్వగతత్త్వము ప్రతిబింబితుడు కాగా అది సగుణమై సృష్టి జరుగుచున్నది. గుణము త్రివిధము. అందువలననే ఆ పరతత్త్వము త్రిమూర్త్యాత్మకమగుచు సృష్టిస్థితిలయములను సంభావించుచున్నది. సృష్టిస్థితిలయములు శాశ్వతములుగావు, కనుక ఆ త్రిమూర్తులును శాశ్వతములుకావు. శాశ్వతమనగా సృష్టికి పూర్వమునను, స్థితికాలమునను, లయానంతరమునునైన ఉనికి. అట్టి యునికి కలది పరతత్త్వము మాత్రమే.

## ii

తిక్కన్నగారు హరినిగాని హరునిగాని కొల్చుకొనవచ్చును గదా? మరి అట్లాయన యేల చేయలేదు? ఏల చేయలేదనగా నాయనది భేదము లేనిభక్తి. అందువలననే హరిహరంబగు రూపముదాల్చు పరతత్త్వమును అనగా హరిహరనాథుని గొల్చెను. భారతీయ తత్త్వశాస్త్రపరిజ్ఞానమునుండి, సాంప్రదాయకమైన జ్ఞానసంపదయందు నిష్ఠకుదిరిన ఎవనికిగాని శివకేశవరూపకల్పనము, ఏతదర్చనా విధానము, ఇవన్నియు లోకమునకు పరమేశ్వర భావమునందు నిష్ఠకుదుర్చుటకును, ఆనిష్ఠ చెదరిపోకుండునట్లు చూచుటకును అని తెలియును. జీవేశ్వరాభేద ప్రతిపాదకమైన వైదికవాఙ్మయము యొక్క ఆంతర్యము లోకము తెలిసికొని ప్రవర్తించుట పూర్తిగా సాధ్యము కాదుగనుక, శివకేశవాది నామరూపకల్పనము జరిగినది. నిజమునకెంత అద్వైతభావునకైనను, ఏకాగ్రతకుదురుటకు నామరూపముల నాశ్రయింపక తప్పదు. శుద్ధాద్వైత మతాచార్యులు శ్రీమచ్ఛంకరులు బహువిధ నామరూపములతో పరమేశ్వరుని ధ్యానించుట గమనింపదగినది. అయ్యును ఆయా రూపమాత్రజ్ఞానముతో పరమేశ్వరధ్యానము తక్కువ స్థితియే. కేవల శివకేశవాది దేవతాజ్ఞానమందే బుద్ధిగలిగియున్నవారు, జ్ఞానాతిరిక్తమైన కర్మలను చేయువారు ప్రవేశించు అంధతమస్సునకంటె అధికమైన తమస్సున ప్రవేశించెదరని ఈశావాస్యమునందు వినబడుచున్నది. కేవల దేవతాజ్ఞాన మజ్ఞానవిషయమనియు, ఉపాస్యమగునీశ్వరాధికము బ్రహ్మము కాదనియు కేనమునందున్నది. జ్ఞానము సాధ్యము. అందుకు సాధనము చిత్తైకాగ్ర్యము. అందుకుపాసన మవసరము. ఉపాసనకు సాధనభూతమైనది శివకేశవాది దైవతము. అట్టిచో నాదైవతములను సాధనమాత్రమైన జ్ఞానముతో గొల్చుట అజ్ఞానము. ఆయాదైవతముల విషయమున భేదబుద్ధికలిమి

మరియు అజ్ఞానము. అందువలన తత్త్వమెరిగిన తిక్కన్న, శివకేశవాభేద బుద్ధి కలిమిని తన్నాథమూర్తియైన పరతత్త్వమును గొల్చెను. కొల్చుటయనగా నుపాసించుటయే. ఉపాసనకు నామరూపాత్మకమైన విగ్రహముండనే వలయునుగదా? అయినచో తన్నాథమూర్తియైన పరతత్త్వము నామరూపము లెట్టివి? నామము హరిహరనాథుడు. రూపము శివకేశవ లక్షణ లక్షితము.

మరి శివకేశవలక్షణ లక్షితుడైన హరిహరనాథుని తిక్కన్న సృష్టించినట్లు చెప్పవచ్చునా? చెప్పరాదు. శివకేశవాభేదముపనిషత్తులయందెట్లు చెప్పబడినదో, శివకేశవ లక్షణ లక్షితమైన పరమేశ్వర స్వరూపము పురాణములయందావిధముగనే వర్ణింపబడి యున్నది. "రుద్రస్త్వంవిష్ణుస్త్వంబ్రహ్మాత్వంప్రజాపతిః అహమేవహరిసాక్షాదహమేవసదాశివః" ఇట్టి ఉపనిషద్వాక్యములు కొల్లలుగా నున్నవి. మరియు నాశివకేశవా భేదము సదాజ్ఞప్తి యందుండుట కొరకే యన్నట్లుగా "శివాయవిష్ణురూపాయ శివరూపాయవిష్ణవే, శివస్యహృదయం విష్ణుర్విష్ణోశ్చహృదయంశివః, యథాశివమయోవిష్ణురేవం విష్ణుమయశ్శివః, యథాంతరం నపశ్యామి తథామేస్వస్తి రాయుషి" అను నది దైనందిన స్మార్తసంధ్యావందనమునందు ప్రవేశపెట్టబడియున్నది. మరియు తిక్కన్న "విష్ణురూపాయనమశ్శివాయ" అనుట "నమోరుద్రాయవిష్ణవే-" అను ఉపనిషద్వాక్యమును స్మరింపజేయుచున్నది. శివకేశవాభేదమింత ప్రసిద్ధము గనుకనే అభేదోపదేశాత్ శివాదినామభిః హరిరేవస్తూయతే అని శ్రీ మచ్ఛంకరులు విష్ణుసహస్రనామ భాష్యమునచెప్పినారు. పురాణములయందుకూడ శివకేశవభేదదృష్టి మిక్కిలిగా నిందింపబడినది. మరియు నందు శివకేశవులు తమ యభేదమును నొక్కి వక్కాణింతురు. తమ యభేదమును నిరూపించుటకు ఏకరూపమున దర్శనమిత్తురు. పద్మపురాణమున ఆదిఖండమున విష్ణుభక్తిమహాత్మ్యము చెప్పుసందర్భమున సూతుడు మహర్షుల నుద్దేశించి

హరిహరుల నభేదంబుగ నరసెడి పుణ్యాత్ములగుదు రపునర్భవు లా
పరమరహస్యము దెలియక హరిహరులకు భేదమెంతు రజ్ఞులుజగతిన్.

హరికంటె హరుని వేరుగ పరికించెడివారు నరకపతితులగుచు దు
స్తర యాతనలను గుడుతురు హరిహరులందొకడు గూడ నరయడు వారిన్

అని స్పష్టముగా చెప్పినాడు. శివపురాణమున శివుడు దక్షునితో "నీవిక (శివకేశవ) భేదబుద్ధినిం బాసి జ్ఞానివై యుపాసింపు" మనియు-

వెన్నునొల్లక నన్గొల్చుచున్నవాడు నన్నలిగి వెన్నునింగొల్చు చున్నవాడు
వీరలిర్వురు జమువీట వేగుచుండు రంబుజ హితుండు చంద్రుడు న్నందననుక.

అనియు కచ్చితముగా చెప్పినట్లున్నది. బ్రహ్మపురాణమున విష్ణువు మార్కండేయ మహర్షికి-

మా యిరువురకున్ భేదంబేయెడలన్ లేదు సుమ్మహీనమతీ! మా
యీ యిర్వుర భావములా మ్నాయవిధిన్ దలపనేకమని యెరుగనగున్.

అనిలాకాశములకువలె వనజాక్షమహేశ్వరులకు వరలమభేదం;
బని యెరుగనయ్య.

అని యుపదేశించినాడు. వామన పురాణమున విష్ణువు తనకు శివునితో అభేదమన్న విషయము దేవతలకు నిరూపించుటకు "సార్ధద్వయనయన మండితంబై బంగారు కుండలమ్ములతోడను, జటా గుడా కేశగరుడధ్వజంబులతో నెలసి మాధవ యుతమై, హారసర్పభూషణంబుల రాజిల్లి, గౌరాజినాచ్ఛాదిత కటిస్థలమునొప్పి సుదర్శనాసిహల శార్ఙ్గరాజితంబయి, పినాకశూలాజగవంబుల దేజరిల్లి, కపర్దఖట్వాంగ కపాల శంఖారావ సహితమగు హరిహరాత్మయ స్వరూపంబు" చూపినట్లున్నది. మరియు ఈ పురాణమునందే శివుడు విష్ణుద్వేషముగల గణేశులను తిరస్కరించి, వారు ప్రార్థింపగా చివరకు కనికరించి-

కనబడు నస్మద్విగ్రహమున మధుసూదనుడు దివ్యపురుషుండు మహా
దనుజహరుడైన శ్రీహరి ఘనతరముగు దీప్తితోడ గణవరులారా!

అని చెప్పి "అర్ధవిష్ణుకాలారి విగ్రహ కలితమైన" తన స్వరూపమును చూపించినాడు. ఈ విధమైన ఉదాహరణము లింకను మిగిలిన పురాణములయందును చూచుకొనవచ్చును. తిక్కనగారి హరిహరనాథసృష్టి విషయసంబంధి అంతర్యామిప్పటికి తెలిసియుండవలయును. "ప్రకటమహార్ధసౌరభ పరాశరనందన వాక్యమంజరీ ప్రకరసమర్చితా-వ్యాససమాసైకరూప-"ఇత్యాది తిక్కనగారి హరిహరనాథ సంబోధనలను పర్యాలోచించినను శివకేశవలక్షణలక్షితమైన హరిహరమూర్తి విశేషము వ్యాసవాఙ్మయమునందు నిరూపింపబడియున్నదన్న వైనము తెలియగలదు. హరిహర శబ్దముల కూర్పుకూడ వ్యాసునిదిగనే తిక్కనగారు చెప్పిరి. "నమోహరాయ

హి|ప్రాయ,నమోహారిహరాయచ" అని హరి వంశమునందున్నది. ఇంతకును చెప్ప వచ్చినదేమనగా శివకేశవాభేదము, తదేకరూపత తిక్కనకంటె బహుకా లమునుండదటనే భారతీయ వాఙ్మయమున ప్రసిద్ధగానున్నదని. ప్రసిద్ధ శబ్దార్థము ప్రధాన శబ్దార్థమును చెప్పదు. అంతవరకు పోనక్కరలేదు. ఆళ్వారులు వైష్ణవులుకదా! తిరుపతియందు వేంచేసియున్న స్వామినుద్దేశించి వారు పాయించిన పాశురములం దాస్వామి హరిహరాత్మకముగా కనుపించుటయున్నది.

తాళ్ళశడై యుమ్ నీళ్ ముడియుమ్ ఒణ్ మళువుమ్ శక్కరముమ్
శూళ్ళరవుమ్ పొన్నాణుమ్ తోన్రుమాల్ - శూళ్ళుమ్
తిరణ్ణరువి పాయుమ్ తిరుమలై మేలెన్దైక్కు
ఇరణ్డురువుమొన్దాయ్ ఇశైన్దు.

ఇది శ్రీ పేయాళ్వార్లు ప్రసాదించిన మూడవ తిరువన్దాదియందలి పాశు రము. శ్రీ వేంకటాచలమున వేంచేసియున్న స్వామివారికి తలపై జటలు, కిరీటము, చేతిలో గొడ్డలి, చక్రము, నడుమున సర్పాభరణము, బంగారు మొలనూలు అమ రియుండుటవలన ఇరణ్డు ఉరువుమ్= హరిహరస్వరూపములు రెండును, ఇశైన్దు= చేరి, ఒన్దాయ్ తోన్రుమ్=ఒకటిగా తోచుచున్నదన్నది దాని తాత్పర్యము. ఇట్టివి మరి కొన్నియు గలవు. ఆళ్వారుల కాలమెంత అనిశ్చయమైనను తిక్కనకంటె మునుపటివారే కదా! ఆళ్వారుల ఆపాశురముల సంగతి నెల్లూరులో ఉన్న తిక్కనకు తెలియదని గట్టిగా చెప్పవలను పడదుగదా! అందువలన ఉభయలక్షణ లక్షి తమైన హరిహరమూర్తివిశేషసంబంధి భావము తిక్కనకు ముందే పుష్కలముగా గలదు. ప్రసిద్ధమయినను ప్రధానముగా చెప్పబడి ప్రచారమునకు రాని హరిహర స్వరూపమును తిక్కన్నగారు విపులముగా వర్ణించి హరిహరతత్త్వమును పరతత్త్వ ముగా వక్కాణించిరని మాత్రమే ఆయనను గురించి చెప్పవలయును.

## iii

తిక్కన అద్వైతుల వక్కాణింపవలసి వచ్చినదని వచ్చును. అందుకు సమాధానముగా నాటి మతపరిస్థితులను గూర్చి పెద్దలు మాటాడుదురు. తిక్కన కాలము పదమూడవ శతాబ్దము. దాదాపా శతబ్దమంతయు ఆయన ఉన్నట్లు చెప్పవచ్చును. తిక్కనకు ముందు, ఆంధ్రదేశమును వదలినచో, తమిళ కన్నడ దేశములయందు మతవిషయమున నొక్కక్రొత్తయావేశమును కల్పించిన వ్యక్తు

లిద్దరున్నారు. శ్రీ మద్రామానుజులొకరు, శ్రీ బసవేశ్వరులొకరు. ఒకరు వైష్ణవమును మరొకరు శైవమును నెలకొల్పినారు. నెలకొల్పుటయనగా సృష్టించుట యని కాదు. అవి రెండును అంతకుమునుపే యున్నవి. వారిరువురును ఆ రెంటిని క్రొత్త యావేశముతో నింపి ప్రచారము చేసినారు. శ్రీ మద్రామానుజులు క్రీ. శ. 1050 నుండి 1155 వరకు ఒక శతాబ్దముకాలమున్నట్లు చెప్పబడుచున్నది. 1165 వ సంవత్సరమును చుట్టుకొని కన్నడదేశమును పాలించిన కాలచూరి బిజ్జలునిమంత్రి శ్రీ బసవేశ్వరులు. ఆంధ్రదేశమున చందవోలు రాజధానిగా కొంతభాగము పండ్రెండవ శతాబ్దమున పాలించిన వెలనాటి చోడులకాలమున, పండిత త్రితయము, ముఖ్యముగా మల్లికార్జున పండితుడున్నట్లు కొంత చరిత్రయున్నది. శ్రీపతిపండితుడు-శివలెంకమంచన పండితుడు, మల్లికార్జున పండితుడు. ఇది పండితత్రయము. వీరివల్లనే ఆంధ్రమున నాకాలమున శైవమతము పుంజుకొన్నది. కాకతీయులు తుదకు శైవులగుట ఆ మతము నిలువద్రొక్కుకొన్న దనుటకు గుర్తు.

శ్రీమద్రామానుజులు వైష్ణవమున కెంత చేసిరో ఒక విధముగా శైవమునకును అంతచేసిన తిక్కనకంటె పూర్వుడైన ఒక వ్యక్తిని గూర్చి గూడ చెప్పవలయును. ఆయన శ్రీకంఠుడు, నీలకంఠుడనియు నాయనను పేర్కొనుటకలదు. ఆయన శ్రీమద్రామానుజుల వాడములు ద్రొక్కుకొనుచు వచ్చిన వ్యక్తి. అనగా బ్రహ్మసూత్రాది వేదాంత విజ్ఞానము విష్ణుపరముగను, శివపరముగను సమన్వయింపబడి తిక్కనకు పూర్వమే ప్రచారమునకు వచ్చినదన్నమాట. శ్రీకంఠునకును శ్రీమద్రామానుజులకును గల ముఖ్యభేదము పరదైవత నిర్ణయమునందే. ఒకరు విష్ణువనిరి మరొకరు శివుడనిరి. అనగా అద్వితీయ పరబ్రహ్మము విష్ణువని, శివుడని రెండు భిన్న దృక్పథములు తిక్కనకు కొద్దికాలము ముందీదక్షిణ భారతదేశమున ప్రచారమునకు వచ్చినట్లు. మరియు నాంధ్రదేశమునను, ప్రక్కగానున్న కన్నడదేశమునను బసవేశ్వరుని (వీర) శైవము యొక్క తీవ్రతను గూడ నాకాలమున సంభావింపవలయును. విష్ణుపారమ్యవాదులైన శ్రీమద్రామానుజులకు తిరుపతి దేవస్థానముతో మిక్కిలి పరిచయమున్నది. ఒక విధముగా నాస్వామిని విష్ణువుగా స్థాపించి అర్చావిధానమును నిర్ణయించినది శ్రీమద్రామానుజులేయని చెప్పవలయును. ఆ సందర్భమున ఆ స్వామి శివుడను శైవులు కొందరున్నట్లును వారిని శ్రీమద్రామానుజులోడించినట్లును చరిత్ర చెప్పుచున్నది. మరియు నా పండ్రెండవ శతాబ్దమున జరిగిన పలనాటి యుద్ధమునకు మిగిలిన కారణములతోపాటు శైవవైష్ణవ మతభావములయునవలి

తీవ్రాభినివేశము కూడ ఒకటిగా నుండి యున్నదనుట నిరవకాశము కాదు. తిక్కన ఊహ తెలిసిన స్థితికి వచ్చునప్పటికి కొద్దికాలము నుండి దేశమున నేర్పడి యున్న పరిస్థితులివి :- ఇక తిక్కన సమకాలము పరిస్థితి చూడబోయినచో పాల్కురికి సోమనాథుడను వీరశైవ మహాప్రచారకు డొకాయన గలడు. ఆయన కాలము విషయమున ఏక వాక్యత కుదరలేదు. ద్వైతమతాచార్యులు శ్రీమధ్వా చార్యులవారు తిక్కన కాలమువారే. ద్వైతులొకరకము వైష్ణవులే. మొత్తము మీాద తిక్కన సమకాలమునందును శైవవైష్ణవభేదము ఒకరకము తీవ్రత కలిగియే యున్నదని చెప్పవలయును. కేవల మవైదికమైన జైనమును ఆకాలమున తానును ఉన్నానన్నట్లున్నది.

శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యుల అద్వైతమహా భాష్యములను త్రోసి రాజను తీవ్రతతో శ్రీమద్రామానుజులయు, శ్రీకంఠులయు, శ్రీమధ్వాచార్యులయు భాష్యములు వచ్చిన కాలమున, కర్మజ్ఞానములను వెనుక పట్టించిన కేవల భక్తిమతము లైన శైవవైష్ణవములు అన్యదేవతా నిరసనముతో వ్యాపించుచున్న కాలమున, సంఘమున మతవిషయికమైన అనైక్యము వేరు లన్నుకొనబోవుచున్న కాలమున "ఆంధ్రావళి మోదముం బొరయు" నొక మహనీయమైన కార్యమును నిర్వహించు టకు నవతరించిన "కారణ జన్ముడు" తిక్కన.

ఆయన నిర్వహించిన కార్యము శ్రీ మదాంధ్ర మహాభారతమును విరాట పర్వమాదిగా తుదిదాకించుట. శ్రీ మహాభారతము "ధర్మాద్వైతస్థితి" కలది. ధర్మ మనగా కర్మ. అద్వైతమనగా జ్ఞానము. పంచమవేదమైన మహాభారతము నట్టిదిగా తెనిగించి వ్రాయుట కర్మజ్ఞానములతోడి వైదికతను నిలబెట్టుట. ఆమహాభారతమున తనను గూర్చి చెప్పుకొనినాడు, తనది భేదములేని భక్తియని. అదిశివకేశవ భేదవా దమును, అన్యదేవతానిరసనమును త్రోసిపుచ్చేయుట. తన మహాభారతమును హరి హరనాథున కంకితమిచ్చెను. కృతిస్వామిని వర్ణించుమిషతో అద్వితీయ పరబ్రహ్మ మును హరిహరుల నిముడ్చుకొన్న సర్వాతిశాయి తత్త్వమునుగా ప్రపంచించి ఉప నిషద్రహస్యముల నెరిగించుటకా పనిచేయ బడినది. హరిహరనాథ రూపవర్ణన- ఉపాసనకొఱకుగా చేయబడినది. వెరసి తిక్కన్న చేసినది ఆత్మమోక్షావలంబియైన వైదికధర్మ సంస్థాపనము.

## iv

హరిహరనాథునుద్దేశించి శ్రీ మహాభారతమున తిక్కన వ్రాసిన పద్యములు మొత్తము నూటతొంబదిమూడు. ఈయన్నింటియందును ప్రధానమైన పద్ధతులు రెండున్నవి. పురాణప్రసిద్ధులైన శివకేశవుల విశిష్టలక్షణము లనేకముఖమున హరిహరనాథునియం దున్నట్లు వర్ణించుట యొకపద్ధతి. ఇది హరిహరనాథ స్వరూపవర్ణనము. ఉపనిషత్ప్రతిపాదితమైన అద్వితీయ పరబ్రహ్మముగా హరిహరనాథుని చెప్పుట. ఇది హరిహరనాథ తత్వనిరూపణము; ఇది రెండవపద్ధతి.

మొదటి పద్ధతి శివకేశవలక్షణములను కలిపి చెప్పుటయే గదా! ఈచెప్పుటలో కొంత పునరుక్తి యున్నది. స్థూలముగా నాచెప్పుటయిది. [1]బ్రహ్మాదులకు వంద్యుడు, [2]దానవసంహారకరుడు. [3]నగశరధిసివాసుడు, [4]శ్రీ పార్వతులతో కూడుకొన్నవాడు, [5]చంద్రసూర్యాగ్నులు నేత్రములుగా గలవాడు, తులసీదామము, అస్థిమాల వక్షము నందున్నవాడు, [7]భసితపరభాగుడును, శ్రీ వత్సపింఛలాంఛనుడును నైనవాడు, చక్రత్రిశూలములను ధరించిన వాడు, [9]పీతాంబరమును గజచర్మమును ధోవతిగను, ఉత్తరీయముగను చేసికొన్నవాడు, [10]గరుడ వృషభవాహనుడు, [11]గంగాదేవిని నెమలిపింఛమును అందముగా శిరస్సునందుంచుకొన్నవాడు, [12]స్మరభయ దర్పితక్షుభిత సామజమర్దన రక్షణక్రియాక్రమణ విలాస భాసురభుజుడు, [13]మన్మథ జననమునకు మరణమునకు హేతుభూతుడైనవాడు, [14]సోమపింఛాభిరాముడు, [15]పన్నగము తల్పముగను, భూషణముగను నైనవాడు, [16]బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు క్రమముగా నిజముఖ భుజోరుపాదములు జన్మస్థానములుగా చేసినవాడు - ఈ వర్ణన మీ విధముగా సాగిపోవును. ఈ స్వరూప వర్ణనమునకంటె తిక్కన రెండవపద్ధతి నిరూపణమునే అధికముగా ఆశ్వాసాద్యంత పద్యములయందు చేసెను.

హరిహరనాథు డద్వితీయపరబ్రహ్మముగా నిరూపించుపద్ధతియది. ఆ పద్ధతిని ఆపద్యములన్నియు ఉపనిషత్ప్రమాణములతో వ్యాఖ్యానము చేయబడినగాని అందున్నగొప్పతనము తెలియదు. ఉదాహరణముకొరకుగా నిచట ఆపద్యములందలి నాలైదు వాక్యముల యర్థము విచారింపబడు చున్నది.

1. ఓంకార వాచ్యునకు...... | విరా. 1. 32.

పరతత్వమైన హరిహరనాథుడు ఓంకారవాచ్యుడు. పరతత్వమే అద్వితీయ పరబ్రహ్మము. అది ఓంకార వ్యాచ్యము. 'ఓమితిబ్రహ్మ-ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ-

ఏతదాలంబనం శ్రేష్ఠ మేతదాలంబనంపరం. ఓంకారము పరాపరబ్రహ్మమునకు ప్రతీక తదుపాసనకాలంబనము. మరియు శ్రేష్ఠమైన యాలంబనము. అద్వితీయమైన పరబ్రహ్మము సంకల్పమాత్రముచేత సృష్టిని జరుపుచున్నది. ఆసంకల్పమే మాయ. ప్రకృతి. అది స్త్రీరూపము. అది హ్రీంకారవాచ్యము. ప్రణవము బ్రహ్మ ప్రణవమనియు, దేవీప్రణవమనియు ద్విధాభూతము బ్రహ్మప్రణవమోంకారము. దేవీప్రణవము హ్రీంకారము. సృష్టిని సంకల్పించిన బ్రహ్మము హ్రీంకారమయ మనోజ్ఞాలంకారోల్లాస నిత్యలాలిత్యుడుగా తిక్కన్న ఆపద్యమునందే ఉత్తరార్థమున చెప్పిరి. ఓంకార హ్రీంకారములు రెండును పరతత్త్వమునందే పర్యవసించును. సృష్టినిమిత్తము హ్రీంకార మభివ్యక్తమగును. అపుడు హ్రీంకారమయత బ్రహ్మమునందు చెప్పబడుచున్నది. ఆబ్రహ్మమే హరిహరనాథుడుగా తిక్కన్న చెప్పెను.

2. అన్నమయత్వాదివిరామోన్నతి వాఙ్మనసదూర... [ విరా. 1. 334

తైత్తిరీయ శ్రుతియందు నేతి నేతి మార్గమున బ్రహ్మోపదేశమున్నది. బ్రహ్మముకాని వానియందలి ఆత్మబుద్ధిని త్రోసిపుచ్చు విధానమది. పురుషుడు భార్యాపుత్రమిత్రాది సంసారములో తాదాత్మ్యమునుపొంది అదియే తాననుకొనుచున్నాడు. మునుముందది తానుకాదన్న బుద్ధిపుట్టింపవలయును. అందుకని అన్నరసము వలన నేర్పడిన యశరీరమే ఆత్మయనియు. ఆయాత్మయే నీవనియు చెప్పబడినది ఆత్మయనగా బ్రహ్మము. పురుషుని ఆత్మబుద్ధిని భార్యాపుత్రాదుల నుండి తొలగించి అన్నమయకోశమున కాకర్షించిన యనంతరమది యాత్మకాదని త్రోసిపుచ్చబడినది. అన్నమయకోశము ప్రాణమున్నందున పూర్ణమగుచున్నది. కనుక ప్రాణమయకోశమే ఆత్మ. అన్నమయమాత్మకాదు. ప్రాణమయకోశము నందలి ఆత్మబుద్ధియు తొలగించుటలో మనస్సువలన ప్రాణము పరిపూర్ణమగుచున్నందున మనోమయకోశమధికమనియు, అదియే ఆత్మయనియు చెప్పబడినది. మనోమయకోశము నుండి ఆత్మబుద్ధిని మరల్చుటకు విజ్ఞానమయకోశము ప్రవేశపెట్టబడినది. మనస్సు బుద్ధ్యహంకార చిత్తరూపమున విషయములను నిశ్చయించుచున్నది. అభిమానపడుచున్నది. గ్రహించుచున్నది. మనస్సునకీశక్తి ఎచ్చటనుండి వచ్చినది? విజ్ఞానమునుండి వచ్చినది. కనుక విజ్ఞానమునవలన మనోమయకోశము పూర్ణమగుచున్నదన్నమాట. అవుడు విజ్ఞానమయకోశమే ఆత్మ. ఇక విజ్ఞానమయకోశమునుండి ఆత్మబుద్ధి మరలింప బడుచున్నది. ఒక విషయమునకు సంబంధించిన జ్ఞానమువలన అంతరాంతరములయం దనుభూయమాన మగుచున్నది ఏదికలదో అది యానందము.

ఆయానందమువలననేకదా విజ్ఞానమయకోశము పూర్ణమగుచున్నది. కనుక విజ్ఞానమయకోశమున కాత్మ ఆనందము. ఆనందమువలన ఆనందమే అనుభూయమానమగుచున్నది. అనగా ఆనందము చేతనే ఆనందము పరిపూర్ణమగుచున్నది. అనగా అది స్వయంసంపూర్ణము. కనుక ఆనందమే ఆత్మ. ఆత్మయే బ్రహ్మము. బ్రహ్మమే నీవు. ఇది ఉపదేశక్రమము. ఇందు బ్రహ్మము అన్నమయాదికోశములయందు చూపబడి చివర కానందమయుడుగా తేల్చబడినాడు. ఉపాసకుడు అన్నమయకోశమునుండి బ్రహ్మోపాసనము ప్రారంభించి ఆనందమయకోశమున నెరిగికొన వలయును. ఉపాసన నిమిత్తమే తదుపదేశము జరిగినది. అనగా వేదాంతములయందు బ్రహ్మ మన్నమయాదికోశరూపమున చూపబడి కానివాడుగా నిరూపింపబడినాడు. అన్నమయాదికోశముల యందు విశేషముగా రమించుచున్న వాడయ్యును బ్రహ్మము వానికంటె ఉన్నతుడుగా నిరూపింపబడినాడు. అట్లు నిరూపింపబడిన బ్రహ్మమునే తిక్కన "అన్నమయత్వాది విరామోన్నతి" - అనిరి. మరియు నా బ్రహ్మము వాఙ్మనసదూరుడు - మనోమయకోశమున కాత్మగా చెప్పబడి కాదనబడిన విజ్ఞానమయకోశమున కాత్మయైన ఆనందమయుడగు బ్రహ్మము మనస్సుకు దూరమైనవాడే యగునుగదా మరి! మరియు వాక్కునకును నందక దూరముగనే ఉన్నాడు." నైవవాచా నమనసా ప్రాప్తుం శక్యో న చక్షుసా" - వాఙ్మనో నేత్రములచేత బ్రహ్మమును పొందుటకు వీలుకాదు. బ్రహ్మము వాగింద్రియముచేత ప్రకాశింప చేయబడదు. పైగా వాగింద్రియమునే ఆ బ్రహ్మము ప్రకాశింప జేయుచున్నది. ఆనందశబ్దముచేత చెప్పబడుచున్నాడనగా అనవచ్చును. గోవు అన్నశబ్దమునకర్థముగా నాలుగు పాదములుకలిగి, కొమ్ములుండి, గంగడోలుగలిగి, సితపీతాది వర్ణమయమైన శరీరముతో క్షీరములిచ్చు లక్షణము గలిగిన ఒక పదార్థమున్నట్లుగా ఆనంద శబ్దమున కర్థమై నిర్దేశింపదగిన వస్తువుగా బ్రహ్మములేదు. ఏది అనిర్దేశ్యమో, ఏది నిరతిశయ సుఖస్వభావముతో ననుభూయమానమగుచున్నదో దానిని సూచించుకొనుటకు మనము సంకేతముగా ఆనంద శబ్దమును వాడుకొనుచున్నాము. లక్షణయా ఆనంద శబ్దమా బ్రహ్మమును బుద్ధికందజేయుచున్నది. అందువలన బ్రహ్మము శబ్దముచేత చెప్పబడుటను నిరాకరించి నిర్విశేషమగుచున్నది. కనుకనే తిక్కన మనస్సుతోపాటు వాక్కునకును హరిహరనాథుడు దూరుడని చెప్పెను. హరిహరనాథుడనగా అద్వితీయ పరబ్రహ్మమే. కాకపోయినచో నట్లు తిక్కన వ్రాయుటకు వీలే యుండదు. బ్రహ్మము విషయమున ఆనంద శబ్దమెట్టిదో హరిహరనాథుడును నట్టిదే.

3. సూక్ష్మతర సంభాసా! మహాస్థూలమూర్తివిశేషా! ... [విరా. 4. 275.

ఆకాశశరీరం బ్రహ్మ యని శ్రుతి. ఆకాశశ్శరీరమస్య ఆకాశవద్వాసూక్ష్మం శరీరమస్యేత్యాకాశశరీరం కింతత్ ప్రకృతంబ్రహ్మ- అని దానికి శ్రీమచ్ఛంకరుల భాష్యము. బ్రహ్మము ఆకాశమువలె సూక్ష్మమైన శరీరము కలవాడు. తిక్కన్న దానినే ఇంకను నధికసూక్ష్మమని చెప్పిరి. మరియు నింకొకశ్రుతి, నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మంతత్ అనియనుచున్నది. సుసూక్ష్మమనగా సూక్ష్మతరమన్న మాటయే. ఆబ్రహ్మ మెంతగానూక్ష్మమైనదో మరొక ప్రక్క అంతగాస్థూలమైనది. ॥ అణోరణీయాన్మహతోమహీయానాత్మా-బృహచ్చతద్దివ్యమచింత్యరూపం సూక్ష్మాచ్చ తత్సూక్ష్మతరంవిభాతి ॥ - పరమాణువుకంటెను అత్యంతము సూక్ష్మమై, మహత్పరిమాణాకృతులైన పృథ్వ్యాదులకంటెను మహత్తైనది ఆత్మ. అది సర్వమును వ్యాపించి తనకంటె బృహత్పదార్థము లేనిదగుచున్నది. అది స్వయంప్రకాశము. చింతనచేయుటకు కూడ వీలుకానంత సూక్ష్మాతి సూక్ష్మముగా నాబ్రహ్మము ప్రకాశించుచున్నది. ఈవిధముగా వేదాంతములయందున్న యర్థమునే తిక్కన్న హరిహరనాథునిగూర్చి చెప్పిరి. అనగా అద్వితీయ పరబ్రహ్మ తత్త్వమే హరిహరనాథ తత్వమని.

4. రసాత్మక. కర్ణ.1. 320.

రసోవైసః రసంహ్యేవాయంలబ్ధ్వా ఆనందీభవతి - బ్రహ్మము రసస్వరూపము. ఆరసమునుపొందియే ప్రాణిజాత మానందము కలదగుచున్నది. జిజ్ఞాసువులు ప్రీతిపూర్వకముగా వేదాంత వాక్యమువలన కలిగిన జ్ఞానముచేత బ్రహ్మమును పొంది ఆనందించుచున్నారు. లోకమున తృప్తిహేతువులైన మధురపదార్థములు రసములనబడుచున్నవి. అట్లే బ్రహ్మము తృప్తిమూలమగుటచేత రసశబ్దముచేత చెప్పబడినదని శ్రీ మచ్ఛంకరులు వ్యాఖ్యానముచేసిరి. అఖండైక రసోహ్యాత్మా అఖండైకరసం నిత్యం అఖండైకరసంపరం అఖండైకరసా దన్యన్నాప్తినాస్తి - నిశ్చయముగా నఖండైక రసమైన ఆత్మయే నిత్యము. అదియే పరము. దానికంటె ఇతరమైనది లేదు లేదు. తననుమించి మరొకటి లేనిది పరబ్రహ్మము మాత్రమే. అది రసాత్మకము. హరిహరనాథుడు రసాత్మకుడు.

5. ఈక్షణ కలనాకృతార్థ... అశ్వ. 1. 231.

కలన శబ్దమున కర్థమాదానమని. ఈక్షణమనగా పర్యాలోచనము. పర్యాలోచనమును గ్రహించుట మూలమున చేయబడిన యర్థముకలవాడు, హరిహర

నాథుడు పర్యాలోచనమునకు తాత్పర్యము సంకల్పించుట బ్రహ్మము సంకల్పము
లన కృతార్థుడగుచున్నాడు. బ్రహ్మముచేత కృతమైన యర్థమీజగత్తు జగత్కర్తృ
త్వము బ్రహ్మము నందా సంకల్ప మూలముగనే ఆపాదింపబడుచున్నది. స ఈక్షత
లోకాన్ను సృజా ఇతి స ఇమాన్ లోకానసృజత - తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి
తత్తేజోऽసృజత లోకములను సృజించెదనుగాక యని ఆత్మసంకల్పించెను. ఆ సంకల్పిం
చిన యాత్మ ఈ ద్యులోకాదులను సృజించెను. నేను బహుప్రకారములుగ విస్తరించె
దను బహువిధ భూతాకారములు గలుగుదును అని ఆ పరమాత్మ సంకల్పించెను
అట్లే ఆ యాత్మ తేజస్సును సృజించెను అని యీ విధముగా నుపనిషత్తులయందు
బ్రహ్మము నందలి జగత్కర్తృత్వము సంకల్పమూలముగా చెప్పబడియున్నది. కను
కనే తిక్కన హరిహర బ్రహ్మమును ఈక్షణ కలనా కృతార్థుడని చెప్పినాడు
వేదాంత దర్శనమున జగత్కర్తృత్వము అను ప్రధానాదుల నుండి తొలగింపబడి
బ్రహ్మమునందు ప్రతిపాదింపబడుటకు మూలవిూ 'ఈక్షణ'మే ప్రథమాధ్యాయ
ప్రథమపాదమునందలి ఈక్షత్యధికరణము 'ఈక్షతేర్నాశబ్దం' ఇత్యాదిగా తదర్థ
ప్రపంచనార్థమే సాగినది ఈక్షతేః = వేదాంతములయందు జగత్కారణముగా
ఈక్షణము (సంకల్పము) వినబడుచున్నది అందువలన ప్రధానాదికము అశబ్దం =
వేదశబ్దములకు వాచ్యము కాదు కావున ఆ ప్రధానాదికము న = జగత్కారణము
కాదు - ఇక దీనిమీద కావలసినంత భాష్యమున్నది తిక్కన కద్వైత వేదాంత
మునందెంత నిష్ఠయున్నదియు అది యెంతగా నాయన యందు జీర్ణించినదియు
భావించుటకు ఈక్షణ కలనా కృతార్థుడుగా హరిహరనాథుడు చెప్పబడుట చాలును
ఇట్టి కేవల పారిభాషిక రచన మరియు నా పద్యములయందు గలదు భూమస్తుత్యా-
ని స్సీమ భూమా - ఇత్యాదిగా హరిహరనాథుని తిక్కన సంబోధించుటగలదు
వేదాంతములయందు బ్రహ్మము భూమ శబ్దముచేత చెప్పబడియున్నది యత్ర నాన్య
త్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి సభూమా - ఏ తత్త్వము నందు మరియొక
సాధనముచేత చూడదగినది వినదగినది తెలిసికొనదగినది లేదో అది భూమము
అనగా నిరతిశయమగు పరిపూర్ణత్వమే భూమ మనబడును. ఇట్టి పూర్ణత్వమొక్క
బ్రహ్మమునకేగలదు కనుక నదియే భూమము తిక్కన హరిహరనాథుడు
భూమముగా స్తుతింపబడుటను బట్టి నారానగా, హరిహరనాథుడ ద్వితీయ పర
బ్రహ్మమనియే అర్థము అద్వితీయ పరబ్రహ్మమైన హరిహరనాథుని తిక్కన
యోగపథమును బట్టియు నిరూపించుట ఆ పద్యములందుగలదు రెండుదాహరణ
ములు చూపబడుచున్నవి

1. త్రియుగ కమల వీధీ దీప్త సంచార లీలా! అశ్వ. 4. 287

త్రియుగ కమలములనగా నారుకమలములు. ఆయాకమలములయందు స్వయంప్రకాశకుడైన పరమాత్మ ఈశరీరమున సంచరించుచున్నాడు. యోగశాస్త్రమున కమలములే చక్రములుగాగూడ పేర్కొనబడుట గలదు. గుదస్థానమున మూలాధార చక్రమున్నది. దానికి నాల్గుదళములు. ఆదళములనే బీజాక్షరములతో పేర్కొందురు. ఆచక్రాధిదేవత వినాయకుడు. మర్మస్థానమునందలిది స్వాధిష్ఠానము. దాని కారుదళములు, బ్రహ్మదానికధిదైవతము. మణిపూరకమని నాభిస్థానమునందున్నది. అది పది దళములతో నున్నది. విష్ణువు అధిదైవతముగా గలదది. హృదయప్రదేశమునందున్న చక్రము అనాహతము. దానిదళములు పండ్రెండు. రుద్రుడు దాని యధిదైవతము. కంఠస్థానమునందలి చక్రము విశుద్ధచక్రమనబడును. దానికి దళములు పదునారు. జీవాత్మయేదాని కధిదైవతము. ఫాలభాగమున ఆజ్ఞాచక్రమున్నది. అది ద్విదళ. పరమాత్మయే దానికధిదైవతము. ఇవి షట్చక్రములు. ఆయాకమలములయందు హంసనాముడైన పరమాత్మ ఇవియే షట్కమలములువాయురూపమున సంచరించును. వాయురూపుడైన బ్రహ్మము సూత్రబ్రహ్మమనబడును. ఆసూత్రబ్రహ్మమాయారు కమలములగుండను సంచరించును. అది ఆయనకొక లీల. అట్టిలీలామయుడు హరిహరనాథుడు. అనగా నాయనయే సూత్రబ్రహ్మము.

2. పశ్చిమ నాడీ సరణ! శల్య. 1-404.

ఈ శరీరమునయందు పరమాత్మ పశ్చిమ నాడీమార్గమున సంచరించుచున్నాడు. శరీరమునందున్న ప్రధానమైన నాడికా దశకమున మరియు ముఖ్యమైనవి మూడు. ఇడ-పింగళ-సుషుమ్న. సుషుమ్న గుదస్థానమునందలి మూలాధారము నుండి సహస్రారము వరకు వెన్నెముక నాశ్రయించి వ్యాపించియుండునది. దానికి కుడి యెడమలయందు పింగళ - ఇడ నాసికారంధ్ర పర్యంతముగా నున్నవి. పరమాత్మ ప్రాణవాయు రూపమున నాసికారంధ్రములద్వారా గమనాగమనములు చేయుచుండును. సుషుమ్నకు కుడిప్రక్కగానున్న పింగళ పూర్వనాడి. ఎడమదిక్కగానున్న ఇడ పశ్చిమనాడి. ఈ ఇడానాడికి చంద్రనాడియని మరొక పేరును గలదు. ప్రాణయామము పూరక కుంభక రేచకములని త్రిధాభూతము. గాలిని లోనికి పీల్చుట పూరకము. పీల్చినగాలినట్లే కొంతకాలము నిలుపుట కుంభకము. గాలిని వదలుట రేచకము. ఒకసారి గాలినిపీల్చి నిలిపి వదలుట ఒక ప్రాణాయామము. ఎడమ ముక్కుద్వారా పూరకము. కుడి ముక్కుద్వారా రేచకము. చేయబడవలయును. ముందు పూరకము.

తరువాత రేచకము కదా! సాధారణ మానవుడు కూడ గాలిని పీల్చియే వదలును. పుట్టిన శిశువు మునుముందు గాలిని పీల్చుకొనియే చైతన్యవంత మగుచున్నది. గాలిని పీల్చుట ఎడమ ముక్కు ద్వారా, వదలుట కుడి ముక్కు ద్వారా. ఎడమ ముక్కు ఇడానాడి. అదియే పశ్చిమనాడి. పరమాత్మ పశ్చిమ నాడీసరణుడు. అనగా ప్రాణ వాయు రూపమున ముందు పశ్చిమనాడి మార్గమున గమించుచున్నాడని యర్థము. అట్లు గమించు సూత్రాత్మయే హరిహరనాథుడు. కనుకనే పశ్చిమ నాడీసరణుడుగా చెప్పబడినాడు.

ఈ విధముగా తిక్కన ఆశ్వాసాద్యంతముల యందు వ్రాసిన ఆ నూట తొంబదిమూడు పద్యముల యర్థమును విచారించుకొనుచు బోయినచో నొక గ్రంథ మగును. హరిహరనాథుని అద్వితీయ పరబ్రహ్మముగనే ఆయన సంభావించి వ్రాసినాడని చూపుటగా పైన కొన్ని వాక్యము లుదాహరింపబడినవి హరిహరనాథ తత్త్వము పరతత్త్వమే యని పిండితార్థము.

V

హరిహరనాథుని తిక్కన్న శివకేశవలక్షణలక్షితమైన పరతత్త్వముగా నిరూపించుచు వర్ణించినట్లిప్పటికి తెలియవలయును. ఇక తదాంతర్యము విచారింప బడ వలయును. - వేదాంత విజ్ఞానమెంతయున్నను మనన నిధిద్యాసస్వరూపమైన ఉపాసనముద్వారనే ఫలము గలుగును. ఉపాసనకొక ఆలంబనముండి తీరవలయును. అందు నిమిత్తమే ఉపనిషత్తు లోంకారమును శ్రేష్ఠమైన యాలంబనముగా పేర్కొన్నవి. తిక్కన్న ఓంకారాలంబనముతోడి బ్రహ్మోపాసనమే యిష్టము. అయినను లోకము దృష్ట్యా మూర్త్యాలంబనము నంగీకరించుటలో దోషము లేదని ఆయన తలంచెను. శరీరేంద్రియములతో నున్న అంతఃకరణము నామరూపరహితమైన బ్రహ్మమునందు కుదురుకొనుట అంత తేలికకాదు. అందువలన బ్రహ్మోపాసనకు మూర్త్యాలంబన మవసరమగుచున్నది. తిక్కన హరిహరనాథుని శివకేశవ లక్షణలక్షితుడుగా వర్ణించుటలోని ఆంతర్యమేమనగా శివకేశవ స్వరూపము లాలంబనముగా బ్రహ్మ ముపాస్యమని తెలియజేయుట. ఆలంబన మనగా సాధనమాత్రమే. సాధ్యముకాదు. సాధ్యము సాధింపబడిన తరువాత సాధనము త్యజింపదగినది. ఆవిధముగా త్యజింప దగిన శివకేశవరూపమున నున్న సాధనములవిషయమున హెచ్చుతగ్గుల నిర్ణయము గాని ఆ సాధనములే సాధ్యములన్న అజ్ఞానముగాని కూడదని నిరూపించుటకే తిక్కన్న పరబ్రహ్మమునందాయా లక్షణములను వర్ణించినది. ఏలక్షణముగాని పట్టని

పరబ్రహ్మము నట్లు వర్ణించుటలోని ఆంతర్యము నావిధముగా భావింపవలయును. మరియు నామరూపములతో శివకేశవాలంబనములను పట్టుకొని తద్భేదమును సంభావించుటయన్న అజ్ఞానమును తొలగద్రోయుట కొరకే తిక్కన్న శివకేశవుల నామరూపములు వ్యస్తములుగా నుండుటను గుర్తింపనివాడువలె తదుభయలక్షణ లక్షితమైన ఏకరూపమును హరిహరనాథ నామముతో పేర్కొనెను. అసలు శివకేశవ నామరూపములనే తొలగింపరాదాయనవచ్చును. తొలగింపరాదు. లోకసంగ్రహార్థైకబుద్ధ్యా సమకూర్పబడిన శివకేశవరూపముల విషయమునగల అజ్ఞానమును మాత్రమే తొలగింపవలయునుగాని, అందువలన భేదబుద్ధిరూపమైన అజ్ఞానము పెరుగుచున్నదని అసలునకే ఎసరుపెట్టరాదు. అందుకనియే తిక్కన్న శివకేశవ భేదమును నిరసించి. పురాణవాఙ్మయమున అప్రధానముగా నున్న శివకేశవుల ఏకరూపతను వెలికితీసి ప్రధానముగా వర్ణించినది. మరియు శివకేశవులాధారముగా పొందదగిన తన్నాథరూపమైన పరమవస్తువుగా హరిహరనాథుని కీర్తించినదియు ఉపాసనకాలంబనములైన శివకేశవుల విషయమున తిక్కన సమన్వయబుద్ధి పుట్టెడి. అనగా ఉపాసకుల సౌలభ్యముకొరకు ముందు శివకేశవలక్షణ లక్షితమైన బ్రహ్మమును చూపి క్రమముగా దానిని త్రోసి పుచ్చుచు శుద్ధసత్త్వ ప్రతిబింబితుడైన బ్రహ్మమును బహుముఖముల నిరూపించి, ఉపనిషత్తుల యందువలెనే తిక్కన్న, అద్వితీయమైన పరతత్త్వమాశుద్ధసత్త్వాతిరిక్తము సుమాయని సూచించినట్లు చెప్పవలయును.

## vi

ఇపు డిట్లనవచ్చును. శివకేశవలక్షణలక్షితమైన మూర్తిని ఉపాసకులకొరకు తిక్కన్న పేర్కొనిరి. గదా? ఆమూర్తి అర్చావతారముగా ప్రసిద్ధికిరాలేదేమి?-అని-దీనికి సమాధాన మిట్లూహింపబడుచున్నది. శివకేశవులకు వ్యస్తముగా విగ్రహారాధనావిధానమును స్పష్టముగా ప్రతిపాదించు శైవవైష్ణవ ఆగమములనుత్రోసిరాజనగల హరిహరాగమగ్రంథములు పుట్టిచెట్టుగట్టుకొనలేదు. తిక్కన్న స్వయముగా నట్టి ఆగమగ్రంథరచనకు పూనుకొనలేదు. అందుకు కారణమాయన జీవితధ్యేయమది కాదు. ఆయన మతాచార్యుడు కాదు. ఆయన అచ్చమైనకవి. ఇట్లున్నచో బాగుండునన్న యొకయూహ సాంప్రదాయకమైన మార్గమునుబట్టి చేసెను. తనయూహ ననుసరించి. దానిని ప్రపంచించుచు కొన్నిపద్యములు వ్రాసెను. పద్యములు వ్రాసినంత మాత్రమున పనికాదు. హరిహరనాథ విగ్రహలక్షణము, తదర్చనావిధానము, తద్దేవాలయ నిర్మాణవైఖరి-ఇవన్నియు ప్రత్యేకము నిరూపింపబడవలయును. అందు

బుద్ధికుదిరిన అనుయాయులు దేశమున నేర్పడి ప్రచారకులై మనవలయును. తిక్కన్న హరిహరనాథుని విషయమున నట్టిదేమియు జరుగలేదు. అందువలన ఆమూర్తి అర్చావతారముగా దేశమున ప్రసిద్ధికి రాలేదు. కాని అసలు దేశమున హరిహరనాథ విగ్రహము-తదర్చన పూర్తిగా లేకపోలేదు. భైరవుని కోనలోను,[2] బాదామిలోను హరిహరుల ఏకరూపమైన విగ్రహములున్నట్లు తెలియుచున్నది. మరియు మైసూరు రాష్ట్రమున హరిహర పట్టణము, అందు హరిహరనాథాలయము, పదుమూడవ శతాబ్దముననే కట్టబడినది, ఉన్నట్లు వినుచున్నాము. ఈ రీతి చెదురుమదురుగా మరొకటి రెండుచోట్ల నుండిన నుండవచ్చును. నెల్లూరులో హరిహరనాథాలయ ముండి యున్నదన్న దాని యాగామములు చారిత్రకులు చెప్పవలయును. ఇంతకును మన యాంధ్రదేశమున హరిహర నాథార్చన మిప్పుడు మచ్చునకైనను లేదు. ఒకప్పుడున్నదనుటకు కచ్చితమైన యాధారములును లేవు. మరియు నిప్పుడు దేశమున నక్కడక్కడ రెండుమూడు చోట్లగల హరిహరనాథార్చనకు తిక్కన్న ఎంతవరకు బాధ్యులన్న విషయముగూడ ఇత్థంభూతమని చెప్పుటకవకాశము కనుపించుటలేదు. అందువలన మొత్తముమీద తిక్కన్న హరిహరనాథుడర్చావతారముగా నిలువద్రొక్కుకొనలేదనియే చెప్పుటలెస్స.

ఇక తిక్కన్న విస్తరమహనీయముగా ప్రతిపాదించిన హరిహరనాథుని అద్వితీయ పరబ్రహ్మలక్షణమాయనకు గల అప్రతిహతమైన అద్వైతవేదాంత పరిజ్ఞానమునే సూచించును. అందువలన నదియు నాయనపేరు మీద చెలామణికి రాదగినదికాదు, కనుకనే రాలేదు.

## vii

మరి తిక్కన్న క్రొత్తగా చెప్పినదేమియనవచ్చును. ఏమియును లేదనియే సమాధానము. మొదలు ప్రతిదానియందును క్రొత్తదనమునకు నఱ్ఱులుచాచుటయే వివేకముకాదు. వేదాంత విజ్ఞానవిషయమున నదిపూర్తిగా అవివేకము. అద్వైతముగాని, విశిష్టాద్వైతముగాని శ్రీమచ్ఛంకరులును, శ్రీమద్రామానుజులును క్రొత్తగా సృష్టించినవి కాదుగదా! శ్రుతులయం దాయర్థములు గలవనియేవారు వ్యాఖ్యానించిరి. వారిజీవితములాయా తత్త్వార్థములను వ్యాఖ్యానించుటకొరకే ఏర్పడినవన్నట్లైనవిగనుక అద్వైతమనగనే శ్రీమచ్ఛంకరులును, విశిష్టాద్వైతమనగనే

శ్రీ మద్రామానుజులును స్ఫురింతురు. బసవేశ్వరుడు, శ్రీకంఠుడు, మొదలైనవారి జీవితములు శివపారమ్యమునే ప్రతిపాదించి ప్రచారముచేయుటతోడనే ముడిబడి యున్నవి గనుక వారిపేళ్లెత్తగనే శివపారమ్యవాదముయొక్క ముఖములుస్మృతికి వచ్చును. తిక్కన్నజీవితము మహాకవితాదీక్షామయముగాని మతతత్త్వాతికవిషయ ప్రచారప్రబోధదీక్షామయముకాదు ఎంతపరమోదాత్తమైన రచనాశిల్పముగలస్తోత్రములను శ్రీ మచ్ఛంకరులు వెలయించినప్పటికిని ఆయన కవికాదుకదా! అట్లే తిక్కన్నగారొక నూటతొంబదిమూడు పద్యములలో తనకుగల వేదాంతవిద్యాకౌశల్యమును ప్రకటించినమాత్రమున వేదాంతియగుటలేదు. హరిహరనాథుని నామ రూపములు తిక్కన్నవలన ప్రచారమునకు వచ్చినవి. అందువలన తిక్కన్న అనగనే హరిహరనాథుడు, హరిహరనాథుడనగనే తిక్కన్న స్ఫురింతురు. అది యంతమాత్రమే ఆయన మహాకవిత్వమునందు ప్రత్యయబుద్ధికలిగిన తరువాతి తెలుగు కవులలో నల్గురైదుగురు నాచనసోముడు, వేంకటనాథుడు, గోపరాజు, కంభంపాటి నారపామాత్యుడు మొదలగువారు తమకృతులను హరిహరనాథున కంకితమిచ్చి ఆదైవమును తిక్కన్నపద్ధతిని శివకేశవ లక్షణ లక్షితునిగా వర్ణించిరి. ఆధుని కులలో గూడ శ్రీ కాకరపర్తి కృష్ణమూర్తిశాస్త్రి వంటి వారొకరిద్దరు హరిహర నాథుని స్మరించుచున్నారు. శ్రీ మదప్పయదీక్షితులవారి కాలమువాడుగా ననుకొన బడుచున్న బోధేంద్రసరస్వతి అను ఆయన హరిహరాద్వైతభూషణము అనునొక గ్రంథమును సంస్కృతమున వ్రాసెను. ఇంతకుమించి హరిహరనాథ సంబంధి వాఙ్మయమును ప్రచారముగా కనిపించుటలేదు దీనికంతకును తిక్కన్న హరిహర నాథనామరూపకీర్తనము బలమే మూలముగా ననుకొనుటకు విప్రతిపత్తిలేదు.

అంతకును పర్యవసానమిది తిక్కన్న భేదములేని భక్తుడు. హరిహర నాథుడు శివకేశవ లక్షణలక్షితుడు. తిక్కన్న వైదికమార్గనిష్ఠమగు వర్తనముగల జ్ఞానయోగి. హరిహరనాథుడు పరబ్రహ్మోపాసన కాలంబనము. తిక్కన్నమహా కవిత్వ దీక్షావిధినొందిన శబ్దబ్రహ్మోపాసకుడు. హరిహరనాథుడు అకృతక మధు రోక్తివ్యాప్త సందీప్తపారుడు. తిక్కన్న పరమమైన అద్వైతి. హరిహరనాథుడు అద్వితీయపరబ్రహ్మము.

ఇతి శివమ్.

# 69.

## ★ వీరపత్ని చానమ్మ ★

బ్రహ్మతేజము, మహాక్షాత్రము నొక్కటఁ దనయందు చిక్కఁబట్టి పరశురామునివలె "ఇదంబ్రాహ్మ్యమిదంక్షాత్ర" మ్మని చాటిచెప్పి యసహాయశూరుఁడై యొప్పిన తన పతి యొకప్పుడు విధివశముచేత స్వబలము చెల్లాచెదరు కాఁగా రణరంగమునం దొంటరిపాటున నిలువరాక వీరవిహారము విరమించి యింటికి వచ్చుటచూచి, ఆతనికి వీరసందేశమిచ్చి ప్రబోధితుఁజేసి సమరోన్ముఖుఁగావించి వీరస్వర్గమిప్పించిన వీరపత్ని చానమ్మ ధన్యచరిత్ర మాంధ్రలోకమునకు నందు ముఖ్యముగ నాంధ్రరమణీమణులకును బ్రాతస్స్మరణీయము గదా!

చానమ్మ తిక్కన యర్ధాంగి, వీరవిక్రమములు నెఱపి యాతఁడు "ఖడ్గతిక్కన, రణతిక్కన" యను బిరుదు బీరములు వహించెను. తిక్కన కొట్టరువు సిద్ధయామాత్యుని జ్యేష్ఠ పుత్రుఁడు. విరాటపర్వముఁ దొట్టి తుదముట్ట నాంధ్రమహాభారతము "నంధ్రావళిమోదముంబొరయ," "బుధసంతోషము నిండార" రచియించిన తిక్కన సోమయాజీతనికిఁ బినతండ్రి కుమారుఁడు - పదమూఁడవ శతాబ్దియందు విక్రమసింహపురమున (నెల్లూరున) రాజ్యమేలిన మనుమసిద్ధిరాజునకు మంత్రి మణియై, సేనానియై రణతిక్కన వెలుగొందెను.

యాదవులకుఁ గాటమరాజు ప్రభువు, అతఁడు కనిగిరి సీమలోని యెఱ్ఱగడ్డపాడున కధిపతి. కనిగిరి సీమలో నొకప్పు డనావృష్టిదోషము సంభవించెను. పచ్చిక బీళ్ళన్నియు నెండి యెడారులగుటచేఁ బశువులకు మేఁతకఱవై పడె. అప్పుడు కాటమరాజును, యాదవులును దమ పసులమందలను మనుమసిద్ధిరాజు మేఁతబీళ్ళకుఁ దోలికొనివచ్చి పుల్లరినిచ్చు నొడంబడికపైని తొలకరించువఱకును మేపుకొనిరి. పశువుల మేఁతయైనఁ బిదప వారక్కడ తమ కోడెదూడలలో నేదో నష్టముకల్గినదన్న నెపమునఁ బుల్లరి నెగవేసిరి. అందుపై మనుమసిద్ధిరా జాలమందల నటకాయించెను అప్పుడు పోరుపొసఁగెను.

సిద్ధిరాజు గొప్పసైన్యమును సమకూర్చుకొని సమరసన్నాహములు సాగించెను తిరునామాల తిప్పరాజు, శ్రీకంఠరాజు, పెదవేఁగి చొక్కరాజు, పెదవరద

రాజు, అర్లకొండ అచ్చిరాజు, ఆదివన్నె మాదిరాజు, గయికొండ గంగరాజు, ఉర్లకొండ సోమన్న, ఉదయాద్రి ఉమ్మయ్య, చెన్నపట్టణము చంద్రశేఖరుడు, దేవముని వెంగళయ్య, పట్టుకోట బసవరాజు, కాళహస్తి పాపతిమ్మరాజు, వెలకంచి వెంగళపతిరాజు, ప్రభగిరి పట్టణము పద్మశేఖరుడు. మున్నగు యోధులు మనుమసిద్ధి రాజునకు బాసటలై వచ్చినిలిచిరి. ఈ వీరులందఱకు ఖడ్గతిక్కన మొనగాడై జైత్ర యాత్రకు వెడలెను.

కాటమరాజు గూడ యుద్ధసన్నద్ధుడయ్యెను, పల్నాటి ప్రభువైన పద్మనాయుడు, పల్లికొండ ప్రభువైన చల్ల పిన్నమనాయుడు, దొనకొండ అయితమరాజు, ఎఱ్ఱయ్య, పాచయ్యనాయుడు, ముమ్మయ్యనాయుడు, పుత్తనరాజు మొదలగు యాదవ వీరులు కాటమరాజునకు దోడ్పడవచ్చిరి. ఈ సైన్యమున కంతయు చిన్నమనాయుని మంత్రియైన బ్రహ్మరుద్రయ్యయను నారాధ్య బ్రాహ్మణుడాధిపత్యము వహించెను.

ఉభయవాహినులును పాలేటియొడ్డున బంచలింగాల కొండకడ డాకొని తలపడియెను. అప్పుడు దొమ్మియుద్ధము జరిగినది. అందు సిద్ధిరాజు సేనలు యాదవ వీరుల బరాక్రమ ధాటికి నాగలేక వీగఁబాఱజొచ్చెను. సిద్ధిరాజు సేనానాయకుడు ఖడ్గతిక్కన ధైర్యము చిటిలిపోయినది. ఇంతకు మున్నెన్నడు ఖుసిపోని అతని ఖడ్గధాటి మొద్దువాఱెను. నిజబలములు చేవదొఱగి చెట్టొకపిట్టయై చెదరిపోగా నొంటరి పాటున యుద్ధభూమియందు నివ్వెఱపడి నిలిచియున్న తిక్కన్నను దిలకించి ప్రతిపక్ష యోధుడైన పిన్నమనాయుడు.

"పోరునిలుపుమోయి భూసురోత్తముడ !
సరిగాదు మాతోడ సమరంబుసేయ
అగ్రజుల్ మీరు యాద (?) వులము మేము
ఉగ్రముల్ మామీద నుంపంగరాదు

—కాటమరాజు కథ.

అని అహామహ మికతో నెత్తిపొడుపుమాట లాడెను. అపుడు తిక్కన్న చేయునది లేక తన దురదృష్టమునకు దురపిల్లుచు మఱల నింకొకప్పుడు సేనలఁగూర్చుకొనివచ్చి తలపడవచ్చునని తలచి సంగ్రామ రంగము నుండి గుఱ్ఱమును మఱలించుకొని పురమునకు వచ్చెను.

వైరికి వెన్నిచ్చివచ్చిన తిక్కన్నను జూచి విక్రమసింహపురవాసు లీసడింపు పలుకులాడి వికావిక నవ్విరి. అవును, నవ్వరా? అయినింటఁబుట్టి కానిపని చేసినచో నవ్వరా? పుట్టినది శౌర్యమునకు విశ్రామ భూమియగు కొట్టరువునారి వంశమున; పూనినది అసాధారణము, నన్యదుస్సాధ్యమునైన వాహినీపతిత్వము; చేపట్టినది కఠోర ఖడ్గము; వహించినది "రణతిక్కన" యను వీరబిరుదము. అట్టిచో పగఱకు వెన్నిచ్చిన యెడల నవ్వులపాలు గాకుండునా?

ఇట్టి యీసడింపువాక్యము లాతని కింటియందు విస్తరించి వినిపించినవి. "కడుపు చెఱుపఁబుట్టిన ఈబరిగో" ట్టని సిద్ధయామాత్యుఁడు కొమారుని యుల్ల ముచ్చిపోనాడెను. తిక్కన స్నానమాడఁబోవ నాఁడువారు జలకమాడు మఱుఁగు పట్టున భార్య చానమ్మ నలకమంచ మడ్డుపెట్టి దానిపైఁ బసుపుముద్దనుంచి నీళ్ళబిందెఁ దెచ్చిపెట్టెను. "ఇదియే"మని వ్యసనపడి యాతఁడడుగఁగా చానమ్మ-

క॥ పగఱకు వెన్నిచ్చినచో నగరే నిను మగతనంపు నాయకులెందున్?
ముగురాఁడవారమైతిమి; నగపేటికి జలకమాడ నచ్చినచోటన్॥

అని ముదలకించి సూటిపోటు మాటలాడెను. ఇన్నాళ్ళదనుకఁ దలలోనాలుకవలె ననుకూలవతియైయుండిన అర్ధాంగి నేడిట్లు బెడిదురాలై యుండుట గమనించి యాతఁడు భోజనమునకు లేచెను. తల్లి ప్రోలమ్మ యన్నములో విఱిగినపెరుగు పోసెను- "ఇదియే" మని యాతడనఁగా నామె త్రుంచివైచినట్లు

క॥ అసదృశముగ సరివీరుల మసిపుచ్చక విరిగివచ్చు మగపందక్రియన్
గసవున్ మేయగబోయిన పసులున్ విఱిగినవి, తిక్క పాలు న్విఱిగెన్॥

అని తుటారించి తూలనాడెను.

చేసికొన్న భార్యయట్లు తాకనాడెను. కడుపారఁ గన్నతల్లియిట్లు త్రుంచి వైచెను. అందుతో నాతనికి ఉక్కురోషమువచ్చినది. నిప్పుకణములవంటివారి పోటు మాటలు వైరుల శరవర్షమునఁ జల్లారిన అతనిశౌర్యమును లేవంజోపి రవులఁబెట్టినవి. చిరకాలసముపార్జితమైన వంశప్రతిష్ఠమూపొంది యప్పుడు తిక్కసేనాని నిట్లని హెచ్చరించెను.

సీ॥ విజయాధిపుని దాడి వెనువెంటఁదగిలిన బ్రాణముల్ దాచిన పందగజమ!
పెంపేది పాలేట బిరుదలన్నియువైచి పరుగెత్తివచ్చిన పారుఁబోత!

దురములోఁ జావక దొరలెల్ల హసియింప మంచానఁ గొరిగిన కొంచెకాఁడ !
చతురంగబలముతో సమరంబుసేయక మానంబువిడిచిన మందబుద్ధి !
గీ॥ యనుచు నార్వేలవారు ని న్నపహసింప ధరణి నెల్లూరిలో నెట్లు తిరుగఁగలవు?
వైరులనుగెల్చి సత్కీర్తి వడయుమయ్య ! మంత్రికులహేళి ! తిక్కనామాత్యమౌళి !

అంతట తిక్కన్న తినుచున్న యన్నము విడిచిలేచి వెంటనే గుఱ్ఱమునెక్కి యుద్ధభూమికి కదలెను. అయితే ఇపుడాతనికి జయసంపాదనము ప్రధానప్రసక్తి గాదు. కొట్టరువువారి వీరవంశమునకుఁ దనమూలమున వచ్చిన మచ్చ దుడిచివేయవలయు ననియే ఆతని ప్రస్తుతదీక్ష. ప్రాణములకుఁ దెగించిన పరశురాముఁడు ఖడ్గముతోఁ గదనరంగమునఁ జొఱఁబడెను.

తిక్కదండనాథాగ్రణి ఖడ్గధాటికి మాఱులేకుండెను- "వచ్చినవాఁడు ఫల్గునుఁడు" ని యాదవ వీరులు బెదరిరి; పరిభ్రమించిరి. సమరాంగణమున రణతిక్కన పచరించిన యుద్ధక్రమమును జరిత్రకారుఁడిట్లభివర్ణించుచున్నాఁడు.

చ॥ పదటున వాజిరాహుతులపై దుమకించుచుఁ దిక్కఁడార్చినన్
బెదిరి పరిభ్రమించి కడుఁ బిమ్మట వీరులు భీతచిత్తులై
యదెయదె డాలు వాల్మెఱుఁగు లల్లవె అల్లదె యాతఁడంచనన్
గొదుకక యాజిఁజేసె రిపుకోటుల కందఱ కన్నిరూపులై.

ప్రతియెవ్వరును లేక వీరవిహారము సల్పుచున్న ఖడ్గతిక్కన్నను గని యాదవులసేనాని బ్రహ్మరుద్రయ్య ముందునకువచ్చెను. ఆ విప్రవరుల కిరువురకును జాల సేపు ద్వంద్వయుద్ధము జరిగినది. తుదకిద్దఱును నేలకొఱిగిరి. అప్పుడు క్షాత్ర మిళితమైన బ్రాహ్మణ్యము రక్తస్రవంతులతోఁ బ్రవహించినది.

ఇట్లు మొక్కపోని అసహాయ సాహసుఁడై విక్రమపౌరుషాదుల నెఱపి వీరస్వర్గమును జూరలాడి

ఉ॥ చిక్కక మన్మసిద్ధివిభుచే మున్నుగొన్న ఋణంబుదీర్చె మా
తిక్కనమంత్రి సోమశిల దేవరసాక్షిగఁ బెన్నసాక్షిగా
నెక్కిన వాజిసాక్షిగ మహి న్నుతికెక్కిన కీర్తిసాక్షిగా
స్రుక్కక మారుకొన్న రణశూరులు సాక్షిగఁ గొండసాక్షిగన్.

తనపతి వీరశయన మలంకరించిన శుభవర్తమాన మాలించి వీరపత్ని చానమ్మ నిశ్చింతతతో సహగమనముచేసినది.

సమరధర్మము వీసరఁబుచ్చివచ్చిన ఖడ్గతిక్కన్నకు వీరసందేశమిచ్చి రణమునకుఁబంపి యాతనికి వీరస్వర్గ సుఖమిప్పించి యాతఁడపయశఃకూపమునఁ బడకుండఁ గాపాడిన కీర్తి వనితాశిరోమణియగు చానమ్మది. పతి కెదురాడనోడి చానమ్మ మూగయైయుండినచో "ఖడ్గతిక్కన, రణతిక్కన" యని జనామోదమునొందియున్న పతి బిరుదు బీరములుబెడిసి కొట్టియుండును; యశోభరితమగు కొట్టరువువారి వంశము మర్త్యశఃపంకమున ద్రుంగుడువడియుండును; ప్రోలమాంబ వీరమాతయగుటకు బదులు భీరుమాతయై యుండును; విశేషించి తాను వీరపత్ని యనిపించుకొనుటకు వీలులేకుండయుండును. ప్రమాదించిన పతికి విధ్యుక్తవీరధర్మము జ్ఞప్తికిఁ దెచ్చి పరువుమర్యాదలు నిలిపి చానమ్మ వీరపత్ని యనిపించుకొనినది. కావుననే చానమ్మ కీర్తిప్రబంధమును నాఁటినుండి నేటివఱకుఁ దెనుఁగువారు పునశ్చరణ చేయుచున్నారు. పుట్టినింటికిఁ మెట్టినింటికి బరువుప్రతిష్ఠలు సంపాదించి తన ధన్యచరిత్రముచే మాతృభూమిని పునీతమొనర్పఁగలిగినఁ చానమ్మవంటి స్త్రీరత్నమును దమలో నొకతెగాఁ బడయఁగలిగినందుల కాంధ్రస్త్రీలోకము గర్వింపవలసి యున్నది.

అభిమానవతియైన అంగన ప్రాణనాయకుఁడు పిఱికి వాఁడగుట భరింపలేదు. అట్లగుటచేకదా, జోధపురాధీశ్వరుఁడైన జస్వంతసింగు మహాజహానుపక్షమూని ఔరంగజేబుపై నెత్తివెళ్లి యుద్ధమున గాయపడి యోడి పురమునకు రాఁగా మానవతియైన జోధపురరాణి పురద్వారము బిడాయించి "పరాజితుని దీనానను నీపురస్త్రీలకుఁ జూపనక్కరలే"దని కచ్చితముగఁ గబురుచేసెను. అయితే, జోధపురరాణివలె చానమ్మ కఠోరతపూనలేదు. మాటలతోడనే మనోరథ మీడేర్చుకొన్నది. ప్రమాదవశమునఁ బెడమార్గము ద్రొక్కిన పతులకు సరియైనమార్గమును జూపుటలో రమణీమణులు చానమ్మ చరిత్రమును మేలుబంతిగ జేసికొని యొదురుగాక!

వీరపత్నియయిన చానమ్మ విశ్రుతకీర్తికి విపులమగు నాంధ్రావనియంతయు విహారమందిరమై వెలయుచున్నది.

— ఆంధ్రభూమి సంపాదకుల అనుమతితో.

ప్రథమ ప్రచురణము - డిసెంబరు 1939.

తే॥ నిత్యుఁ డాత్ముండు దేహ మనిత్య మతఁడు
ముదిమిఁ దెవులున వికృతమై యది వికలతఁ
బొందుటయు దానిఁదొఱఁగి తాఁబోవునట్టి
దశకు మరణమ నేర్పరయ్యెఁ దనులతాంగి.

అను: V - 125

◆ ◆ ◆ ◆ ◆ ◆

తే॥ నాతి విను గ్రహచారంబు హేతువులుగ
నశుభములుశుభములు నరుఁ డాచరించు
గ్రహము సేయించునే తానకాక చేఁత
కొడయుఁడటు గాన ఫలములు గుడుపవలయు.

అను: V - 123

◆ ◆ ◆ ◆ ◆ ◆

తే॥ అధ్యయనమున మస్తకం బంటుటయును
నిద్రయును నశుచితతోడ నింద్యకోటి
శిరముగ్రోకంగఁదగ దిరుసేత మస్త
కంబు తైలంబుఁ బూయగాఁగాదు మేన.

అను: IV - 102

◆ ◆ ◆ ◆ ◆

శా॥ సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమైనుండి మా
తంగస్ఫూర్జిత యూథదర్శన సముద్యత్క్రోధమైవచ్చు నో
జం గాంతారనివాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
చ్చెం గుంతీసుతమధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్.

విరా: IV - 95

◆ ◆ ◆ ◆ ◆ ◆

శా॥ ఆశాపాశవిమోచనో పకరణవ్యాకోచ హృద్ధామ సం
క్లేశోత్సారక దివ్యనామ వరదృగ్లీలాప్తని స్సీమల
క్ష్మీ శుంభత్స్ఫురలోక చక్రపరశుచ్ఛిన్నా సురానీక వి
ద్యా శోభాస్ఫురణాకృతీ శమదమానంతర్య భాస్వీకృతీ.

ఆశ్ర: I - 184

◆ ◆ ◆ ◆ ◆ ◆

# 70.

## కాటమరాజు

శ్రీ ఇంట్ల సుబ్బారావు, బి.ఏ., బి.యల్.
అడ్వకేటు - నెల్లూరు.

కాటమరాజుకథ నెల్లూరు గుంటూరు మండలములందు కడుప్రసిద్ధమై గానముచేయబడుచున్న ద్విపదప్రబంధము. ఈ కథాప్రచారకులు ముఖ్యంగా యాదవులలో ఒక తెగ అయిన పికిలివారు, మాదిగలలో ఒక తెగయైన కొమ్ముమాండ్లు. వీరు కందుకూరు తాలూకా ముప్పాళ్ళగ్రామంలో ఉన్నారని ప్రతీతి. ఈ కథలు సామాన్యంగా గంగతిరునాళ్ళనెడి గ్రామ దేవతల జాతరలప్పుడు పాడుట ఇప్పటికిని నెల్లూరు గుంటూరు మండలములందు పాటింపబడుచున్నది. చరిత్ర ప్రసిద్ధమైన నీ కథవలన నెల్లూరు మండలము నేలిన నల్లసిద్ధిరాజు కాలమున నల్లసిద్ధికిని, కాటమరాజుకును పుల్లరివిషయమై యేర్పడిన వివాదము గోరంతలు కొండంతలై పెద్ద యుద్ధమైనట్లు తెలియుచున్నది.

నల్లసిద్ధిరాజు నెల్లూరుపట్టణమున సింహాసనారూఢుడై యేలుచుండగా వారివద్ద రణతిక్కన్న అనే బ్రాహ్మణ సేనాపతి యుండెను. కాటమరాజు యాదవ వంశజుడు. ఇతని పినతండ్రి పోలమరాజు, అతని కుమారుడు కరియావులరాజు. వీరు లంకమల, పాలకొండ, నల్లమల మొదలైన పర్వతప్రదేశములందు పసుగ్రాసమును నల్లసిద్ధివద్ద పుల్లరికి తీసికొనిరి. అరణ్యప్రదేశమందు కాటమరాజు గోగణము మేస్తున్నందున గోసంరక్షణార్థమై క్రూరమృగములను వారు వధిస్తూరావడంవల్ల మృగవధచేసి జీవనముచేయు కిరాతజాతి కాటమరాజుయెడల వైషమ్యమువహించిరి. ఒకనాడు నల్లసిద్ధిరాజు ఉంపుడుగత్తె పెంపుడుచిలుక పంజరమునుండి పారిపోయి ఆటవికశుకములంజేరి కాటమరాజు ఆవులమందల కడకు సమూహముగావచ్చి ధ్వనులుచేయగా కొన్ని గోవులు బెదరి, లేగలను ద్రొక్కి పారిపోయి గందరగోళము కావించినవి. అప్పుడు కాటమరాజు పినతండ్రి పోలమరాజు ఆ శుకసమూహమందున్న పెంపుడు చిలుకను చంపెను. ఆ నెపమున కిరాతులు నల్లసిద్ధి ఉంపుడుగత్తె పనుపున వేటనెపంబున కాటమరాజు పశువులను కొన్నింటిని చంపిరి. అందువలన కాటమరాజు కిరాతులను కొందరిని బరిమార్చి పుల్లరినిచ్చుటమానెను. "మీ దేశంలోని కిరాతకులు మా ఆవులను నిష్కారణంగా వధించినారు, గనుక మేము పుల్లరి నివ్వవలసినపనిలేదని ఖండిత

ముగా కాటమరాజు వ్రాసిపంపెను పుల్లరి క్రింద రావలసిన కోడెదూడలను తోలు కొనిరమ్మని సిద్ధిరాజు కొంత సైన్యము నంపెను. కాని కాటమరాజు సిద్ధిరాజు సైన్యమును త్రిప్పికొట్టెను సిద్ధిరాజు యుద్ధమునకుముందు భట్టనువానిచె రాయబార మంపెను కాని కాటమరాజు-

"రాయబారముచాలు రసికుడ వినుము, పుల్లరంటే కాసు పుట్టదిచోటను
నీమాట మీరాజు కెరిగింపవోయి, సమ్మతిగాదేని సరగమామీద
దండెత్తి మీరాజుఁ దరలి రమ్మనుము" పేజి - 3

అని రాయబారము తిరస్కరించి కయ్యమునకు కాలుదువ్వెను ఉభయులు యుద్ధసన్నద్ధులైరి కాటమరాజుసైన్యము వల్లికొండవద్దను, సిద్ధిరాజుసైన్యము సర్వేపల్లి మిట్టమీదను నిలిచినవి సిద్ధిరాజుసైన్యము-

"ఎనుబ దెన్మిదివేల యేకాంగవీరు, లొలయ దొమ్మిదివేల యుత్తమాశ్వములు
సారిది నెన్మిదివేల చొక్కపుచిల్పిపెలును నిరువదిలక్షల యేనుగోడిగలు
కరులును మూడువేల్ గడ లైదులక్ష, పరగంగ లొటిపిటల్ పదునైదువేలు
పసగల పచ్చలపాలకీల్ నూటుఁ, నరిగెలు నొకలక్ష యందలాల్ నూటు
నెరసి ముప్పదివేల వింజామరములు, డమ్మామ లేనూరు డాలులేనూటు
కొమరొప్ప జగజంపు గొడుగులేనూరు, తూపాకి విలుమూక తొమ్మిదిలక్ష
పమనైన శూలాల బండ్లు నార్నూరు, గడిమన్నెవారును గాక సర్దార్ల
నడిమి కొల్లలకాండ్రు నాలుగువేలు, ఒమలువాద్యమేళాలు పరగనేనూటు"

(యుద్ధానికి "Military Band ఉన్నట్లు తోచుచున్నది) పేజి - 14

ఇంత సైన్యము తనకున్నను-

'వారిమండలలోను వాసుదేవుండు, నారూఢి •బొల్లియావై పుట్టినాడు।
అందుచే కృష్ణ సహాయ మున్నదని, పదిఁబది యాదవుల్ పదరుచున్నారు"
అదియుగాగ "అతిధైర్యసాహసు లాచల్లవారు"

అని సిద్ధిరాజు అనుమానపడియు తనమంత్రియైన తిక్కన రణకౌతూహలము బుట్ట దన్ను రణమునకంపిన చల్లవారిసందరిని సమయించివత్తునని పలికెను రాజు-

• "బొల్లిఆవు" ఒకే కొమ్ముకలిగిన తెల్లని ఆవు దీని ప్రతిరూపమొకటి లోహమున రచింపబడి జలదంకి దేవళమున నున్నది.

"కరణాల దేయూరు కయ్యమేయూరు, చదువను, జదివింప సరి సంప్రతింప ।
వ్రాయను వ్రాయింప వ్యవహారసరణి, లెక్కింప మీకు జెల్లినది దంతెకాని ।
పగతుర నిర్జింప బనికాదు మీకు, నరుల కండలురాల్చ నలవాటులేదు" । పేజి - 16

అనిన తిక్కనమంత్రి రణకౌతూహలము మెచ్చి అతనిని కలని కంపుటకు సిద్ధిరా జియ్యకొనెను. తిక్కనయు రణమునకరిగి కడుసాహసమునబోరి. యుద్ధమందు తన సైన్యమంతయు మడిసిన పగతురు బ్రాహ్మణహత్య పనికిరాదని తిక్కనమంత్రిని విడిచిపుచ్చ, రణమునుండి పారి నిజగృహమున కరుదెంచెను. తండ్రి, తల్లి, భార్యయు తిక్కన యకృత్యమును నిరసించి అవమానించిరి.

తిక్కనతండ్రి సిద్ధనమంత్రి

"కొడుక! యీవంశంబు కడుదొడ్డదోయి, పెద్దకాలమునాడు పేరుమోసినది ।
పులికడుపున గొఱ్ఱె పుట్టుచందమునఁ, గలిగితివాయింతి గర్భంబునందు ।
పందవుగాని భావజ్ఞుడవుగావు, ఎందుకీప్రాణం బదేల యీబ్రమకు" । 19-20

రణము నుండి పారివచ్చిన తిక్కనను పురజనులు గేలిచేసిరి-

"తాటాకులనుమోసి తగవ్రాయగాని చెలగి యుద్ధముసేయ జేతనేమాను ।
యెదిరించినిలిచిన హెచ్చుసేనలను, సరిచేయ నవి యజ్ఞశాలలుగావు ।
అరులపోటులుగాని యక్షతల్‌గావు, మారణాగ్నులుగాని మంత్రాలుగావు ।
చనుదెంచుచక్రాలు చక్కిలాల్‌గావు, ఘనచక్రబాణాలు గారెలుగావు ।
ఆర్చిదూసెడికత్తు లరిసెలుగావు, పొడిచేటి బల్లెముల్ పూర్ణముల్‌గావు ।
కుంతముల్ రుచిఁ బప్పుకూరయుఁగాదు, కమ్మనిపాయసము కాదు కయ్యంబు ।
వండిన యాపిండివంటయు గాదు, బంటుతన మేయూరు బ్రాహ్మదేయూరు" । 20

తిక్కనభార్య అలసిన భర్తపాటును జూచి-

"కడువేగ విభునికి గ్రాగిననీళ్ళు, బిందెల జన్నీళ్ళు బిరబిరదెచ్చి ।
పసిడిచెంబులనీరు పాళాలుసేసి యక్కడ మంచంబు నడ్డంబుపెట్టి ।
యద్దశేరు పసుపు నమరంగనుంచి కూర్చుండి స్నానంబు గొబ్బునజేయుడు" । 21

అని చెప్పెను. ఎట్లో స్నానమాచరించి భోజనమునకు బోవ తల్లి విఱిగిన యావుపాలు అన్నములోపోసి, యుద్ధమున విఱిగిన నీవు యింటికివచ్చుట జూచి పశువులు విఱిగినపాలే యిచ్చెనని పలికెను. ఇన్ని అవమానములకోర్చి తిక్కన మరునాడు యుద్ధమున భీకరముగఁ బోరి మడసెను.

తిక్కన్న బ్రహ్మరుద్రయ్యలు యుద్ధమున నొండొరులను ఖండించుకుని దివికేగిరి యుద్ధభూమిలోని తిక్కన కండల నేరి యతని భార్య సహగమనము గావించెను ఆ యఱ్ఱగడ్డపాటి యుద్ధములో నిరుపక్షములలోను పలువురు రాజులు, యోధులు మడిసిరి తుదకు కాటమరాజు చేతుల్లో నలసిద్ధిరాజుకూడ మరణించెను గెలుపు యాదవులకే చెందెను

ఈ కథయందు బొల్లావు యుద్ధోదంతము అక్కజముగా చేర్కొనబడెను. యాదవుల యుద్ధమందు వారి పసుగణము గూడ బంటులకు మించి పోరినట్లు వర్ణింపబడినది ఈ కథాకాలమును నిర్ణయించుటకు శాసనరూపమైన చరిత్రాధారము లున్నను, ఆధారములన్నియు సమన్వయపడకుండుటచే కాలము కచ్చితముగా నిర్ణయింపజాలకున్నారు

కాటమరాజు కథకు సంబంధించిన శాసనమొకటి కందుకూరు తాలూకా గుండ్లపాలెము గ్రామములోని బ్రహ్మేశ్వరస్వామి ఆలయశిలమీద గలదు బట్టర్వర్తు వేణుగోపాలు సెట్టిగార్లు సంపాదించి దానిని ప్రకటించిరి.

అందు యదువంశావళిని పొందుపర్చి "స్వస్తిశ్రీ శాలివాహన శకవర్షంబులు 1 70 అనగా 1248 A D అగు నేటి కాళయుక్తి సం॥ కార్తీకశుక్ల 5-న నెల్లూరి నలసిద్ధిరాజు సర్వసన్నాహమెరసి లింగాలకొండ యఱ్ఱగడ్డపాటికూడలి సోమేశ్వరుని సందలిన మల్లరాజు లతని సుతులు పోలురాజు, పెద్దరాజు వారిపుత్రులు మొదలైన యాదవులు నలసిద్ధింగూడి యుద్ధముసేసి మృతులైరి" యనియున్నది

ఈ కథయే పట్టపురావి శాసనములో తిక్కన సిద్ధిరాజు పక్షమున కాటమరాజు కరియావులరాజుతో యుద్ధముచేసి దైవబలముచాలక యుద్ధమందు మరణించు వాకుగల కథగలదు యుద్ధమందు తిక్కన పరలోకగతుడైన స్థలము పట్టపురాయి గ్రామమునకు తూర్పుభాగమందు పెన్నానదితీరమందుగలదు దానికి తిక్కనపాడు అను వ్యవహారముకలదు

నెల్లూరును బరిపాలించిన నల్లసిద్ధిరాజు పల్లవరాజని, ముక్కంటి సంతతివాడని కాటమరాజు కథలోగలదు ఇక స్థానికచరిత్రల ననుసరించి నల్లసిద్ధిరాజు, చోళుడు సూర్యవంశజుడు నెల్లూరును బరిపాలించిన చోళరాజుల కొలువులోనివాడే. అందువలన సిద్ధిరాజు విషయము స్థిరపడలేదు

ఈ వ్యాసము మద్రాసు గవర్నమెంటువారు ప్రచురించిన కాటమరాజు కథ M సోమశేఖరశర్మగారి పీఠిక నాధారముగా గొని వ్రాయబడినది.

# 71.

# తిక్కన కవీంద్ర కర్ణపూరము

విద్యారత్న శ్రీ ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులు, యం.ఏ., ఏ.ఇ.యస్.

రిసెర్చ్: సంస్కృత ఎకాడమీ, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాదు.

[కవిబ్రహ్మయు, బుధారాధనవిరాజియు నగు తిక్కనసోమయాజిని ప్రశంసించుచు ప్రఖ్యాతాంధ్రకవులు ఒక సంస్కృతకవికోకిలయు రచించిన పద్యకుసుమముల నొక స్తబకముగాఁ గూర్చి, ప్రాతఃస్మరణీయుఁ డగు నామహాకవిశేఖరునకు కర్ణపూరముగా నిట నర్పింపఁ నది. ఈ పద్యప్రసూనములు ప్రబంధోద్యానముల నుండి సేకరింపఁ బడినవి.]

౧. గంగాదేవి (క్రీ. 1343-79) : మధురావిజయము. I. 13.

శ్లో॥ "తిక్కయజ్వకవేః సూక్తిః కౌముదీవ కళానిధేః,
సతృష్ణైః కవిభిః స్వైరం చకోరైరివ సేవ్యతే."

౨. కేతన (మూలఘటిక; క్రీ. 13వ శతాబ్ది)

సీ॥ సుకవీంద్ర బృంద రక్షకుఁ డెవ్వఁ డనిన వీఁ-
డను నాలుకకుఁ దోడ వైనవాఁడు — చూ. పే. 190

క॥ అగు ననఁ గొమ్మయ తిక్కఁడు జగతి నపూర్వార్థశబ్దచారుకవితమై,
నెగడిన బాణోచ్ఛిష్టం జగత్త్రియం బనినపలుకు సఫలం బయ్యెన్. 2

క॥ కృతులు రచియింప, సుకవులకృతులొప్పఁ గొనంగ, నొరునికిం దీరున వాక్
పతినిభుఁడు వితరణశ్రీ-యుతుఁ డన్నమసుతుఁడు తిక్కఁ డొకనికిఁ దక్కన్. 3

సీ॥ సరసకవీంద్రుల-సత్ప్రబంధము లొప్పఁగొను నను టధిక కీర్తనకుఁ దెరువు,
లలితనానాకావ్యములు చెప్పఁ నుభయభా-షలయందు ననుట ప్రశంసత్రోవ,
యర్థిమైఁ బెక్కూళ్ల నగ్రహారంబులఁగా నిచ్చుననుట పొగడ్తపాలము,
మహితదక్షిణ భైక్షబహువిధయాగంబు లొనరించు ననుట వర్తసముదారి,

తే॥ గీ॥ పరుఁ డొక్కఁని కిన్నియుఁ బ్రకటవృత్తినిజములై పెంపు సొంపార నెగడు నట్టి
కొమ్మనామాత్యుతిక్కనకొలఁదిసచివులింక నొక్కరుఁ డెన్నంగ నెందుఁ గలఁడు? 4

క॥ శ్రీకరవరవచనవిదూ-రీకరణవినోదశుభచరిత్రుని, ననుకం-
పాకరహృదయుఁ గులాబ్ధిసు-ధాకరశుభమూర్తి దిక్కదండాధీశున్. 5

క॥ శ్రీ విలసనరమణీయా! భావితభవపాదపద్మ! భావనిధానా,
భూవినుత శుభచరిత్రా! ధీవిభవాత్తస్వరూప! తిక్కచమూపా!
—దశకుమారచరిత్రము 6

ఈ క్రిందిపద్యమున మనుమసిద్ధి మహీపాలుఁడు రాజలాంఛనములతో (Royal insignia) తిక్కనకవిరాజును సంభావించినట్లు కేతన చెప్పియున్నాఁడు:

ఆ॥ వె॥ అందలంబు, గొడుగు, లడపంబు, మేల్కట్టు, చామరములు, జమిలిశంఖము,
లును గంబగట్లు భూమి గానికగాఁగఁ బెంపెసఁగురాచపదవులెల్లఁ బడసె.
—దశకుమార 7

తిక్కనకవీంద్రునకు సర్వాంగసుందరము నిర్దుష్టము నగుకావ్యమే
కాని నచ్చ దని, ఆతఁ డట్టి నిశితాభిరుచులుకలధీశాలి యనియు
నీక్రిందిపద్యమున కేతన వక్కాణించెను:

ఆ॥ వె॥ కవిత చెప్పి యుభయకవిమిత్రు నొప్పింప నరిది బ్రహ్మకైన, నతఁడు మెచ్చఁ,
బరఁగ దశకుమారచరితంబు చెప్పిన ప్రోఢ నన్ను వేఱ పొగడనేల? 8
—ఆంధ్రభాషాభూషణము 5

3. మారన : (క్రీ. 1295-1325) మార్కండేయపురాణము, I. 10.

చ॥ ఉభయకవిత్వతత్త్వవిభవోజ్జ్వలు, సంవిహితాధ్వరక్రియా
ప్రభు బుధబంధు భూరిగుణబంధురు భారతసంహితాకథా
విభుఁ బరతత్త్వబోధను, నవీనపరాశరసూను, సంతత
త్రిభువనకీర్తనీయయశుఁ దిక్కకవీంద్రునిఁ గొల్తు నర్థితోన్. 9

౪. ఎఱ్ఱాప్రెగ్గడ : (క్రీ. 1369) హరివంశము.

మ॥ తనకావించినసృష్టి తక్కొరులచేతం గాదు నా, నేముఖం
బునఁ దాఁబల్కినపల్కు లాగమములై పొల్పొందునా, వాణిన
త్తను నీతం డొకరుండ నాఁ జనుమహత్త్వాప్తిం గవిబ్రహ్మ నా,
వినుతింతుం గవిఁ దిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్. 10

ఎఱ్ఱాప్రెగ్గడ : లక్ష్మీనృసింహపురాణము.

ఉ॥ భాసురభారతార్థములభంగుల నిక్క మెఱుంగ నేరమిం
గాసటబీసటే చదివి, గాథలు ద్రవ్వ తెనుంగువారికిన్,

వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లము చేసినట్టి యు
శ్శాసనకల్పులం దలఁతు నాద్యుల నన్నయ తిక్కనార్యులన్. 11

౫. జక్కన : (క్రీ. 1400) విక్రమార్కచరిత్ర.

మ॥ పరువడి భారతాఖ్యఁ గలపంచమవేదము నాంధ్రభాష సు
స్థిరత రచించుచోఁ గృతిపతిత్వముఁ గోరి, ప్రసన్నుఁ డైన యా
హరిహరనాథుచేఁ బడసె నవ్యయసౌఖ్యపదంబు నెవ్వఁ డా
పురుషవరేణ్యుఁ దిక్కకవిఁ బూని నుతింతుఁ గృతాధ్వరోత్సవున్. 12

౬. బమ్మెర పోతన : (క్రీ. 1380-1440) భాగవతము.

వ. హరిహరచరణారవిందవందనాభిలాషిం దిక్కమనీషిం భూషింతు. 13

౭. శ్రీనాథకవిసార్వభౌముఁడు : (క్రీ. 1380-1440) భీమఖండము.

ఉ॥ పంచమవేదమై పరఁగు భారతసంహిత నాంధ్రభాషఁ గా
వించెఁ బదేనుపర్వములు విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁ డ
క్కాంచనగర్భతుల్యు నఖండితభక్తి నమస్కరింతు నిర్
వంచితకీర్తివైభవవిరాజికిఁ దిక్కనసోమయాజికిన్. 14

శ్రీనాథుఁడు : కాశీఖండము.

సీ॥ వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసాభ్యుచితబంధముగ నొక్కొక్కమాటు. 15

కాశీఖండము.

తే॥ గీ॥ శబ్దశాసను నన్నపాచార్యవర్యు సత్కవిశ్రేష్ఠుఁ దిక్కయజ్వను భజింతు. 16

౮. నిశ్శంకునికొమ్మయ (క్రీ॥ 1435-70) వీరమాహేశ్వరము (అలబ్ధము)

ఉ॥ నన్నయభట్టుఁ గావ్యరచనావిధిఁ, దిక్కనసోమయాజి న
చ్ఛిన్నమహత్త్వసంవిహితశేముషి......నింపునఁ బ్రార్థనాంజలుల్,
మున్నుగ నాత్మలోఁ దలఁతు. 17

(పెదపాటిజగన్నాథకవి ప్రబంధరత్నావళిలో ఉల్లేఖించినది-37పు)

౯. అనంతామాత్యుఁడు (క్రీ॥ 1435) : భోజరాజీయము.

చ॥ క్షితిఁ గ్రతుకర్త నా మహిమ చేకొని పంచమవేదమైన భా
రతముఁ దెనుంగుబాస నభిరామముగా రచియించినట్టి యు
న్నతచరితుండు తిక్కకవినాయకుఁ డాదట........ 18

౧౦ నూతనకవి సూరన (క్రీ 1400) ధనాభిరామము

చ అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజి నేఁ

దలఁతు నపూర్వ దివ్యకవితామహనీయ సమగ్రచిత్తులన్ 19

౧౧ పిల్లలమఱ్ఱి పినవీరన (క్రీ 1500) శృంగారశాకుంతలము

గీ ఉభయకవిమిత్రు నత్యంతశుభచరిత్రు భానుసమతేజుఁ గొమ్మయప్రభుతనూజు,
సుకృతి విభ్రాజిఁ దిక్కనసోమయాజిఁ బ్రణుతఁబహుదేశకవిరాజిఁ బ్రస్తుతింతు 20
తిక్కనయజ్వ వాక్ఫక్కి కామోదంబు చెలువు కర్ణముల వాసింపనేర్పు 21

౧౨ నంది మల్లయ్య, ఘంటసింగయ్య (క్రీ 475-90) వరాహపురాణము

గీ నన్నపాచార్యునకు వందనంబు చేసి తిక్కయజ్వకు మ్రొక్కిద 22

౧౩ హరిభట్టు (క్రీ 1513) వరాహపురాణము

గీ సూక్తిమణిరాజి తిక్కనసోమయాజి 23

౧౪ భట్టుమూర్తి (క్రీ 1560) వసుచరిత్ర

మ సహిమన్ నాగనుశాసనుండు సృజియింపం, గుండలీంద్రుడు తన్
మహనీయస్థితిమూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవన్, మహామహులై
సోముఁడు భాస్కరుండు వెలయింపన్, సొంపు వాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁ దత్ప్రాగల్భ్య మూహించెదన్ 24

౧౫ సైచరాజు వేంకటనాథకవి (క్రీ 1500-70) పంచతంత్రము

క ఎచనవు గలమహాహరసాచివ్యము నొంద నవ్యజనులకు మది నా
లోచింపఁ దిక్కయజ్వకు నాచనసోమునకు మఱియు నకుం దక్కన్ 25

౧౬ ఆంధ్రకవి రామయ్య (క్రీ 1500) విష్ణుకాంచీమాహాత్మ్యము (అముద్రితము)
ఉభయభాషారచనోన్నిద్రభద్ర వచోరాజి తిక్కనసోమయాజి 26
—(ప్రబంధరత్నావళి 134 పు)

౧౭ పెదపాటి సోమయ్య (క్రీ 1500) అరుణాచలపురాణము

సీ ఉభయభాషాప్రౌఢిమోద్యన్మహారాజ్య
భాజిఁ దిక్కనసోమయాజిఁ దలఁతు ? —(ప్రబంధరత్నావళి - 144 పు) 27

౧౮. చింతలపూడి ఎల్లన : (రాధామాధవకవి; 1520-30)
తారక బ్రహ్మరాజీయము.

ఉ॥ భారతకావ్యహార మొకభాగము నన్నయభట్టు గూర్చె, ము
త్తారమణీయవాక్యములఁ దక్కినభాగము సోమయాజి పెం
పార నొనర్చె, కంటెఁ గలయన్ శివదాసుఁడు మధ్యనాయక
శ్రీ రచియించె శారద ధరింపఁ గవిత్రయకీర్తి మించఁగన్. 28

౧౯. రామరాజు రంగప్పరాజు : (క్రీ. 1550) సాంబోపాఖ్యానము.
"తిక్కనమఖిసూక్తిఫక్కిక యొకకొంత"........... 29

౨౦. చదలవాడ మల్లయ్య : (క్రీ. 1580) విప్రనారాయణచరిత్ర.

క॥ ప్రాకటనవరసకలనా సాకల్యము తెలియు మధురస మధుద్రాక్షా
పాకప్రబంధరచనన్ జోకం దగు తిక్కయాయజూకుం దలఁతున్. 30

౨౧. పట్టుముట్ట సోమనాథసోమయాజి (క్రీ॥ 1530-70) సూతసంహిత.
"యోగ్యశ్రుతిహితప్రయోగుఁడౌ సోమయాజులరీతి వృత్తిశంశుద్ధి నెన్ని? 31

౨౨. కుమారధూర్జటి (క్రీ॥ 1550) కృష్ణరాయవిజయము.
"కుండలీంద్రసమాఖ్యఁ గొమరొందు కవిచంద్రు
ననువొంద శేషాహి యని తలంతు." 32

౨౩. కాకమాని గంగాధరకవి (క్రీ॥ 1560 కంటెఁ బూర్వుఁడు) బాలభారతము.

ఉ॥ ఆంధ్రకవిత్వతత్త్వ సముదంచిత కీర్తిని, దిక్కయజ్వ నీ
రంధ్రతరప్రభావనిధిఁ బ్రస్తుతి సేయుదు? నుల్లసత్
కంధరగర్భరమంజుతర గర్జిత విభ్రమభవ్యభంగి సై
రంధ్రికయైన చాటుమధురస్ఫుటబంధురవాగ్విజృంభిగన్. 33
(ప్రబంధరత్నావళి - 40 పు.)

౨౪. అంగర నృసింహకవి (క్రీ॥ 1650 కిఁ దరువాత) రాజరాజాభిషేకము.

ఉ అంజలి చేతుఁ బద్మజనిశాంతకరాంతనిరంతరోల్బణ
న్మంజులవల్లకీమధురమంద్రనినాదసముల్లసద్ ధ్వని

వ్యంజకవాఙ్నిగుంభనసమంచితనూతనసృష్టిచాతురీ
రంజితసత్కవీంద్ర బుధరాజికిఁ దిక్కనసోమయాజికిన్. 34

౨౫. రోసనూరి వేంకటపతి (క్రి. 1690) విష్ణుమాయావిలాసము.

ఉ॥ వ్యాసవచస్తరంగబహుళార్థజలగ్రహభారతాబ్ధి మేల్
వాసిగఁ బారముం గనఁ దలంచియు సద్గురుభక్తి గల్గ న
భ్యాసకవిత్వమార్గగమనాధి (వి ?) కుఁడై తగుతిక్కయజ్వ భా
షాసముదాత్తు శంభుపదసాగసమత్పదచిత్తుఁ గొల్చెదన్. 35

౨౬. గణపవరపు వేంకటకవి : (క్రీ. 1700)

"ప్రాబంధికపరమేశ్వరునర్థమహిమం బుభయకవిమిత్రుని పదలలితత॥ 36
— ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము.

౨౭. ఈదురుపల్లి భవానీశకవి (క్రీ. 1750) ధర్మఖండము.

"ఎలిమి నన్నన్నయభట్టుఁ దిక్కమఖి భీమేశాఖ్యునిన్ సోమునిన్. 37

౨౮. కనుపర్తి అబ్బయామాత్యుఁడు (క్రీ. 1800) కవిరాజ మనోరంజనము.

నన్నప భీము నెఱ్ఱమంత్రిని నలసోము
భాస్కరునిఁ దిక్కన బమ్మెరపోతనార్యునిన్. ౬8

౨౯. గోపినాథ వేంకటకవి (క్రీ. 1900) గోపినాథరామాయణము.

ధీరుల నన్నపార్య కవితిక్కన భాస్కరపోతనాదులన్. 3౯

# 72.

## తిక్కనసోమయాజి రాక

• ఆరీతి గణపతి నటుఁజూచు వేడ్కఁ, దిక్కనసోముడు నక్క డేతెంచె ।
నొక్కొక్క పండితుల్ (?) వక్కలాకులును, జక్కనితాంబూల (సమితులతోఁడ) ।
నొక్క పెట్టునరాఁగ నక్కజంబుగను, దిక్కుదిక్కులనుండి వెలలి విద్యార్థు ।
లక్కడనక్క (డ) కావ్య శ్లోకార్థ, మొక్కొక్క విధమున నొగివినిపింపఁ ।
జక్కనవినుచును మిక్కిలందలము, నెక్కి తిక్కనసోముఁ డక్కడేతెంచె ।
నారీతిగా సోమయాజుల రాక, వారక తా ఫణిహారు లేర్పఱుప ।
గణపతి మహారాజుగా రెదుర్కొనిరి, పణవ శంఖమామి (?) పటహ కాహళులు ।
వరుసతో వాద్య విరావంబులొలయ, భారతశాస్త్ర ప్రవీణాగ్రగణ్యుఁ ।
డారీతి వేదశాస్త్రాభ్యాసవిముఁడు, చాల విద్యావిద్య (?) జాలంబులెల్ల
పాలు నీరేర్పఱుపఁ (గల) హంసుండు, నట్టి మహాత్ముని నాసోమయాజి ।
నట్టన నెదురేగి నేర్పుగా రాజు, తెచ్చి యర్ధాసన స్థితునిగాఁజేసి ।
మెచ్చి తాంబూలాదు లెచ్చుగానిచ్చి, నవ్యసుగంధ మాల్యానుయుక్తుఁ (డుగ) ।
దివ్యవస్త్రిచ్ఛన్న భవ్యుగాఁ జేసి, పూజించి యందఱుఁ బూర్వోక్తముగను ।
రోజించి శాస్త్రంబు లొకకొన్ని వినుచుఁ, గొన్నిదినంబులు మన్ననసుండె ।
తిక్కనసోమయాజులు నక్కజముగ, పెక్కులుగాఁజెప్ప నొక్కొక్కయర్థ (?)
ద్వైత మద్వైత ముత్త (మ) జీవద్వైవ, మతి చిద్వివేకంబులగు ధర్మమర్మ ।
మగు రాజనీతియు నటుఁ బురాతనుల, కగు భారతాఖ్యాన మా వీరవరులు ।
తగఁజేయు యుద్ధప్రకారపర్వములు, వినియు సంతోషించెఁ గనివట్లుచెప్ప
మనుచుచుండెను రాజ్యమహిమలఁదనరి, యట నమ్మకొండలో నతిబొద్ధమతము ।

---

• హైదరాబాదు ఆంధ్రరచయితల సంఘమువారు కాసె సరప్ప రచించిన శ్రీ సిద్ధేశ్వర చరిత్రమును ప్రకటించిరి. అందు పేజి 114 న కాకతిగణపతి సార్వభౌముని, తిక్కనసోమయాజి దర్శించిన చారిత్రాత్మక విషయమున్నది. (ప్రచురణ కార్యవాహకులకు మేమెంతయు కృతజ్ఞులము)

ఘటనగా వాదంబు కావలెననుచు, బౌద్ధులు తమమత ప్రావీణ్యశాస్త్ర ।
వృద్ధులు, పాపసమృద్ధులు, వేదవిరుద్ధులు వాదసమృద్ధులు జైన ।
బౌద్ధులఁ బిలిపించి పట్టి వాదించి, యోడించె శాస్త్రార్థ పోడిమిగాఁగ ।
వాడిమి నితిహాస వరశాస్త్రవేద, పారముఖస్థ సిద్ధాంతప్రయుక్తి ।
నారీతినోడించి యావసదులెల్లఁ, గూలఁద్రోయించియుఁ గూడనాదైవ ।
ముల నామమంతయు మునుముట్టనణఁచి, నామంబులణఁచియు సీమవెళ్ళఁగను ।
దోమలఁగాజేసి తోలెవెళ్ళఁగను, ముప్పదాఱైనట్టి మునిజైనవసతు ।
లొప్పగాఁ గూలఁద్రోయించి నటకించి, యందఱజైనుల నటుఁజంపిచెండి !
ఒందరవందర జేసి చక్కాడె, సోమయాజులవారు సురుచిరోద్దండ ।
భీమపరాక్రమ బిరుదులొప్పార, నంతఁ దిక్కనసోమయాజికి మెచ్చి ।
వింతవస్త్రంబులు వివిధభూషణము, లత్యంతప్రీతితో నప్పుడిచ్చుదును ।
సత్యసంధుండును, సభ్యవర్తనుఁడు, నగుసోమయాజి దానారాజుకనియె,
తగుమాటవినుమొండు ధర్మకార్యంబు, సూర్యవంశంబున సొబగొందునట్టి ।
యార్యపూజితనయ్యుడా మన్మసిద్ధి, రాజుదా నెల్లూరు రమణతోనేల ।
నక్కన బయ్యన లధికబలిష్ఠు, లక్కడ సిద్ధిరాజును బాఱఁద్రోలి ।
చక్కనరాజ్యంబు దానేలుచుండె, నొక్కకాసైనను జక్కనసీఁడు ।
వారలదండించి వారి నెల్లూరు, వారి కిప్పించు మవారితప్రీతి ।
నన గణపతిరాజు లట్లకాకనుచుఁ, జని సవాలక్షయు సద్రవ్యహేమ ।
నిష్కముల్ నెచ్చించి నెఱమించుయజ్ఞ, శుష్కంబు పుటములు సొబఁగొందిమీఱు ।
యజ్ఞకుండలములు నలినికర్షింప, తిగ్మాంశుతేజుడై తేజరిల్లుచును !
నాగణపతిరాజు ననుమతినడసి, వేగరాఁబోవుచు వేదవేదాంగ ।
పాఠకపరమార్థ భవ్యతత్త్వార్థ, పఠనచిద్విజ్ఞాన బాదరాయణుఁడు ।
సదసద్వివేక లక్షణదక్షుండు, విదితశైవాగమ విద్వద్గరిష్ఠుఁ ।
డతులిత రాజసభామంత్రివరుడు, నైతగు మంత్రియై యారాజునొద్ద ।
నుండు శివదేవుని నుద్దండుఁజూపి, దండిగా నాయన పాండిత్యశక్తి ।
నుద్దండకోఁ యాడ రెండవ శివుఁడు, మండితయశుఁడని మాటికిఁ జెప్పి ।
మనుజమాత్రుఁడుగాఁడు మనకెంచిచూడ, ననుచు గణపతితో నానర్వరాజ్య !

[illegible] కదలిపోవుచును।
[illegible] జనుదెంచెదవు. [illegible] [illegible]
[illegible] [illegible]।
[illegible] కలుసించిపోయెను [illegible] చ (తుంగ) [illegible]।
[illegible], [illegible] [illegible]
[illegible] [illegible]।
[illegible] కొలిచిరి [illegible] గాల్పి
[illegible]।
[illegible] నెల్లూరు [illegible] [illegible]।
[illegible] భాగ్యంబులు [illegible]
[illegible] రుద్రదేవు [illegible]. నెల్లూరు [illegible]
[illegible]. నెల్లూరు పట్టంబు [illegible]।
[illegible] ( [illegible] ). [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]

## [illegible]

[illegible] నెల్లూరు [illegible] [illegible]
[illegible]
[illegible]
[illegible]

---

1 [illegible] 21. [illegible]
[illegible]

కం॥ "పనుచునెడ దిక్కమఖి యజ్జనవర సింహాసనమున సచివాగ్రణియై
దనరెడు శివదేవయ్యం గనుగొని యారాజుతోడ, కడకం బలికెన్"

తే॥గీ॥ వసుమతీనాథ! యీతఁ డీశ్వరుఁడెగాని మనుజమాత్రుండుగాఁడు పల్మారు నితని
యనుమతంబున నీవు రాజ్యంబునేమ్మి నేలుమని చెప్పి యాఘనుఁడేగుటయును.

(సోమదేవరాజీయము)

తే॥ మోక్షపరులు శుచిస్థానముగఁ బ్రశంస, సేయుదురు విజనత్వ విశేషమెఱఁగి
కాన యింపైశ్మశానంబు మానసమున, నొలసెఁ గావుననయ్యెడ నునికిగలిగె.

ఆను: IV - 437

క॥ ఉద్యోగము ప్రియవాదిత, విద్యాపరినిష్ఠ సంధి విగ్రహవిహితా
పద్యత దీనానాథ విపద్యాపన మాజ్ఞవెరపు పాటించు తగన్.

ఆను: V - 49

క॥ పరబలముపై నదరి నెత్తురు వఱ్ఱులువాఱ జంపుదురు దురమున న
వ్వరుసఁదనంబును బుణ్యోత్తరమని వేదములుసెప్పఁ దనుతరమధ్యా.

ఆను: V - 64

క॥ పోరులయందలి మరణము మారణముం బుణ్యలోకమహిత మహిమకుం
గారణమెఱుఁగు మహింసా, కారంబిట్టిదని నీవ కమలదళాక్షీ.

ఆను: V - 65


క॥ ధని యధనుఁడు రూపసి యొప్పనివాఁడ వివేకి మూఢభావుఁడ రోగుం
డను గతరోగుఁ డనక యంగన పతిఁబాటింపవలయుఁ గామధ్వంసీ.

ఆను: V - 295

# 73.

# కవిబ్రహ్మ, తిక్కనసోమయాజి

శ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ, B.A., (Hons.)



వ్యాసకర్త.

నన్నయ భట్టారకుఁడు ఆంధ్రమహాభారతము నారంభించి యనతికాలముననే యస్తమించిన పిమ్మట మతధర్మరాజకీయ కవితా సిద్ధాంతములలోఁ జెలరేఁగిన తమస్సమూహముల విరియింప భాస్కరుఁడో యన నుదయించినవాఁడు మహామంత్రి కవిబ్రహ్మ తిక్కనసోమయాజి. తిక్కనామాత్యుని తాత కొట్టరువు భాస్కరమంత్రి, గుంటూరి సీమకు పరిపాలకుఁడుగా నుండెను. పండ్రెండవ శతాబ్ద్యంతమునఁ బూర్వ చాళుక్య చోడ చక్రవర్తులకుఁ బ్రతినిధులై చందవోలురాజులు వేఁగిదేశమును బాలించుచుండిరి. భాస్కరమంత్రి, పృథ్వీశ్వరమహారాజుగాఁ బ్రసిద్ధుఁడైన యొక చందవోలు రాజునకుఁ గ్రింది యధికారులలో నొకఁడై గుంటూరి సీమను బాలించెను. ఈయనకుఁ గొమ్మమాంబయందుఁ గేతన, మల్లన, సిద్ధన, కొమ్మన యను నలువురు కుమారులు గల్గిరి. అందుఁ గొమ్మనదండనాథుని కుమారుఁడే తిక్కనామాత్యుఁడు. భాస్కర మంత్రి యనంతరము కొమ్మనదండనాథుఁడు కూడఁ గొంతకాలము గుంటూరి సీమను పరిపాలించెను. ఈయన అన్న యగు సిద్ధనామాత్యుఁడు నెల్లూరిలోఁ దిక్కభూపాలున కాప్తమంత్రియు సేనాపతియు నై యుండెను. పృథ్వీశ్వరమహారాజు గతించిన పిమ్మటఁ గొమ్మన దండనాథుఁడు గుంటూరు వదలి నెల్లూరికి వచ్చి తిక్కభూపాలుని యాస్థానమున నుద్యోగి యయ్యెను. తిక్కనామాత్యుఁడు నెల్లూరనే జన్మించి యుండును. కొమ్మన దండనాథుఁడు శ్రీకాళహస్తీశ్వరుని భక్తుఁడై తనకుమారునకు

ఆ దేవుని పేరట తిక్కన యని నామకరణము గావించియుండును. శ్రీకాళహస్తీశ్వరుఁడు ద్రావిడదేశమునఁ దిరుక్కాళత్తిదేవుఁడని వ్యవహరింపఁబడుచుండెను. తిరుక్కాళత్తి శబ్దమే తెలుఁగులో "తిక్కన" యయ్యెను

తిక్కనామాత్యుని జన్మకాలమును జీవితవ్యాప్తిని ఇదమిత్థమని నిశ్చయించుట కాధారములు కన్పించుట లేదు. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు రచించిన "తిక్కనసోమయాజి" యను గ్రంథమునఁ దిక్కభూపాలుని గూర్చి, యాతని పుత్రుఁడగు మనుమసిద్ధిని గూర్చియు నిట్లుగలదు "......చోళస్థాపనాచార్య బిరుదము గాంచిన తిక్కరాజు క్రీ. శ. 1240 వఱకుఁ బరిపాలనముఁ జేసెనని యిదివఱకే తెలిసికొనియున్నారము. అతని వెనుక నతని కుమారుఁడు మనుమసిద్ధిభూపాలుఁడు విక్రమసింహపురంబునఁ బట్టాభిషిక్తుఁడై పరిపాలనముచేసెను. ఏ సంవత్సరమున నీతఁడు సింహాసన మధిష్ఠించి పరిపాలనముచేయఁ బ్రారంభించెనో మనకు నిశ్చయముగాఁ దెలియరాదు గాని యీతఁడు 1240 సంవత్సరము తరువాత నుండి పరిపాలనము చేసినట్లు మనమూహింపవచ్చును." —పే. 33.

"మనుమసిద్ధి కుమారుఁడు తిక్కరాజు 1278 సంవత్సరమునఁ బట్టాభిషిక్తుఁడయ్యెను. 1262 తరువాత మనుమసిద్ధి శాసనములు గానరావు. (ఇచ్చట 1162 అని కలదు. అచ్చుపొరబాటు కావచ్చును.) మనుమసిద్ధికుమారుఁడు ఇమ్మడి తిక్కరాజు రాజ్యమునకు వచ్చుటకుఁ బూర్వము కొంతకాలము నెల్లూరి పట్టణము కాకతీయసైన్యాధిపతుల పాలనమున నున్నట్లు కొన్ని శాసనముల వలనఁ గానంబడుచున్నది." —పే. 58

పై వాక్యములనుబట్టి మనుమసిద్ధి క్రీ. శ. 1240 నుండి 1262 వఱకు నెల్లూరి సీమను పాలించెనని తలంపవచ్చును. ఇతఁడును తిక్కనయు బాల్యమిత్రులై యుండును. మనుమసిద్ధి తిక్కనార్యుని మామయని పిలుచుచుండుటచే ఆయకనన్నను సుమారు పదియేండ్లు చిన్నవాఁడై యుండును క్రీ॥ శ॥ 1240 మనుమసిద్ధి యిరువది యేండ్ల వాఁడైనచో తిక్కనార్యుఁడు ముప్పది యేండ్లవాఁడై యుండును. ఇట్లగుచోఁ దిక్కనార్యుఁడు క్రీ॥ శ॥ 1210 ప్రాంతమున జన్మించియుండును. మహాభారత రచన ప్రస్తావమున మనుమసిద్ధిప్రశంసగాని మంత్రిత్వప్రసంగముగాని లేకపోవుటచే మనుమసిద్ధి గతించిన యనంతరమే, క్రీ॥ శ॥ 1262 సంవత్సరమునకుఁ బిమ్మట 1265 నుండి 1285 ప్రాంతమువఱకును తిక్కనార్యుఁడు మహాభారత రచన మొనర్చి 1285-89

ప్రాంతమున దివంగతుఁడై యుండునని తలంపవచ్చును. కావున, కౌరవపాండవ చరిత్రమునకు సమకాలికమై దానినవేకవిధముల నుద్దీపింపఁజేసిన శ్రీకృష్ణదేవుని చరిత్రమువలె, మహామాత్యుఁడు కవిబ్రహ్మయునగు తిక్కనసోమయాజి జీవితము పదమూడవ శతాబ్దమునందలి యాంధ్రవాఙ్మయ మతధర్మరాజకీయ చరిత్రమును విజ్ఞానప్రభా తరళితము గావించె నని చెప్పవచ్చును.

ఆయన నివాసస్థానము నెల్లూరేయనుటకు సందియము లేదు. కేతన దశకుమారచరిత్రమున నిట్లు చెప్పెను.

"నా రచియింపంబూనిన కృతికధీశ్వరుండైన కొట్టరువు తిక్కనామాత్యునకు నిజస్థానంబగు విక్రమసింహపురంబు వర్ణించెద.

సీ॥ కరిఘటానిలయంబు తురగజన్మస్థలి సుభటనివాసంబు సుకృతకర్త ।

(ఈ సంపుటము పే. 911 నం. జూడనగును)

ఇట్టి నెల్లూరియందాయన బాల్యమెట్లు గడపెనో. ఎవరియొద్ద నెట్టి విద్యల నభ్యసించెనో తెలిసికొనుటకు సాధనములు లేవు. అన్నమాంబాకొమ్మనామాత్యుల యనుంగు కొమరుండుగా జనించుటవలన ఆయన ఆగర్భశ్రీమంతుఁడనుట స్పష్టము. అట్లే తండ్రి గౌతమగోత్రపవిత్రుఁడు, ఆపస్తంబసూత్ర పవిత్రుఁడు, సాంగవేదవేదియు నగుటచేఁ దిక్కనార్యునకు బాల్యము నుండియు వైదికాచారనిష్ఠ సంపన్నముగ నుండెనని చెప్పవచ్చును. కేతనయు ఆయనయందుఁ గల్గిన గుణసంపద దాక్షిణ్యపక్షి సంగ్రహముగా నాలంకారికముగా నిట్లు వర్ణించెను

"అతండు జాతకర్మప్రముఖ సంస్కారానంతరంబున వేదాదిసమస్త విద్యాభ్యాసవిభాసి యగుచు, వచనవిశ్రమవర్ధనంబుఁ జెంది తుహినభానుండునుంబోలె బహుకళాసంపన్నుండును, గార్తికేయునింబోలె నసాధారణశక్తియుక్తుండును నభరీకృతమయూరుండును నై, పరమేశ్వరుండునుంబోలె లీలావిసర్జిత కుసుమసాయకుండును నకలంక విభూత్యలంకృతుండునునై, నారాయణుండునుంబోలె వసంతభోగసంశ్లేష శోభితగాత్రుండును గ్రతుపురుషత్వప్రసిద్ధుండును లక్ష్మీసమాలింగితవక్షుండునై వెలసె"

—పీఠిక - 88.

ఈ వర్ణనమువలనఁ దిక్కనార్యుఁడు వేదాది సమస్తవిద్యల నభ్యసించి, యనంతరము బహుకళానిపుణుఁడగుటయే గాక యుద్ధవిద్యలయందును ఆరితేరెనని

వ్యక్తమగుచున్నది. నాఁటియతఁడు సౌందర్యమున మన్మథునిమించి మహాభోగవిలాస శోభితుఁడయ్యును గ్రతుపరాయణుఁడై యుండెనని స్పష్టమగుచున్నది. అప్పటి కాయన సోమయాజి కాకపోయినను హవిర్యాజియై యుండెనని గ్రహింపవచ్చును. మొత్తముమీఁద ఆయన మంత్రిపదవియం దధిష్ఠితుఁడగు నప్పటికి మహాపురుషుఁడై విలసిల్లుచుండెనని చెప్పవచ్చును.

కృతి స్వీకారము మహాపురుషుల వైహికాభ్యుదయమునకు పతాక. సకల విధముల సంపత్తిసౌఖ్యములు విలసిల్లుచుండఁగా హృదయ మానందడోలికల నూగుచుండునపుడే సాహిత్యగోష్ఠి, కావ్యరచనము, కృతిస్వీకారము సంభవించును. దశకుమారచరిత్ర కృతిస్వీకార సమయము తిక్కనార్యుని జీవితమున నైహికాభ్యుదయ పరసీమగా భావింపఁదగియున్నది. కొట్టరువువారి కుటుంబము చాలగొప్పది. తిక్కనార్యుని పెదతండ్రియగు సిద్ధనామాత్యునకు నిర్వురు పుత్రులుగలరు. వారిలో జ్యేష్ఠుఁడగు తిక్కన దండనాథుఁడు మనుమసిద్ధియొద్ద సేనాపతిగ, మంత్రిగను నుండెను. ఆతని తమ్ములు మూవురు కుమారు లిరువురును అచ్చటనే యున్నతోద్యోగములలో నుండిరి. అప్పటి యాకుటుంబము నిత్యకళ్యాణము పచ్చతోరణముగా నుండెను. తిక్కనార్యుని యావైభవమును కేతన చక్కఁగాఁ జిత్రించెను.

వ॥ "..... కొట్టరువు తిక్కనామాత్యుండు నిజకులక్రమాగతంబగు మంత్రి పదవి యందు వర్తిల్లుచు" 20

ఆ॥ అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు. (చూ: పే 734)

వ॥ ఇట్లు పడసి సమస్తసంపత్సమేతుండై రాజ్యసుఖంబులనుభవించుచు నొక్క నాఁడు విద్వద్గరిష్ఠగోష్ఠీ సమయంబునం గావ్యదర్పణ ప్రతిబింబితమూర్తులైన మహాపురుషుల సద్వర్తనంబులు విని పరమానందంబు నొంది కృతిపతిత్వంబు కృతకృత్యత్వంబుగా విచారించి. 22

—దశకుమార చరిత్ర పీఠిక.

ఇట్టి మహోన్నతస్థితియందు తిక్కనార్యుఁడు కేతనవలనఁ గృతిపతిత్వము నభ్యర్థించెను. అప్పటియాయన కవితావాల్లభ్యమునుగూడఁ గేతన కడురమణీయముగ వర్ణించెను. తిక్కనార్యుఁడు అపూర్వార్థ శబ్దకమనీయముగా కవిత్వముఁ జెప్పఁ బూనినపిదప, "బాణోచ్ఛిష్టం జగత్త్రియం" బన్నసూక్తి వ్యర్థమయ్యెనట. కృతులు రచియించుటకుఁ గాని, సుకవులకృతులు స్వీకరించుటకుఁగాని యోగ్యుఁడు తిక్క

ఆర్యునివంటి వాఁడింకొకఁడు లేఁడఁట. నానాభూవిభుని సభలోఁ దెనుఁగునఁ సంస్కృతమునను జతురుఁడై యాయన యుభయకవిమిత్రనామవిఖ్యాతుఁడయ్యెనఁట. ఆయన వాక్పతినిభుఁడనియుఁ గేతన చెప్పెను. ఇది "కవిబ్రహ్మ" బిరుదమునకు మూలమైయుండును. కాని అప్పటికి ఆయన వ్రాసినకృతులు పేర్కొని కేతన చెప్పలేదు. అప్పటికి ఉత్తరరామాయణరచనము జరిగియుండినచో దానిని కేతన యుపేక్షించి యుండుట సంభావ్యము కాదు. కావున ఉత్తరరామాయణరచనము తరువాతనే సంభవించెనని చెప్పవలసియున్నది. అప్పటికి ప్రత్యేకముగాఁ జెప్పఁదగిన మహాకావ్యములు వ్రాసియుండక పోయినను. తిక్కనార్యుఁడు అప్పుడప్పుడు చాటువులుగా పద్యములను, శ్లోకములను చెప్పుచు, ప్రాచీనకావ్యప్రౌఢిమలను వివరించుచు, సమకాలీనరచనముల గుణదోషములను సహేతుకముగా విమర్శించుచు, సత్కవితామార్గముల నిర్దేశించుచు కవికులగురువుగా విలసిల్లియుండును. ఇది కేతనపద్యముల వలన స్పష్ట మగుచున్నది.

గీ॥ కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప, (చూ: పే. 634)

మఱియును భోజరాజీయమును రచించిన యనంతామాత్యుని ముత్తాత యగు బయ్యనమంత్రి కవిత్వము చెప్పి తిక్కనసోమయాజిని మెప్పించి "భవ్యభారతి" యను బిరుదము నొందెనని భోజరాజీయమునందలి, "చం॥ క్షితిఁ గ్రతుకర్త నా......" మొదలగు పద్యమువలన విదితమగుచున్నది. ఇదియు నప్పుడే జరిగియుండవచ్చును. కావునఁ దిక్కనామాత్యుఁడు కృతిపతిత్వము నొందునప్పటికి సాహిత్యసార్వభౌమత్వమును గైవస మొనరించుకొనెనని చెప్పవచ్చును. కేతన వర్ణించిన గుణవిశేషములను జూచినచోఁ దిక్కనార్యునియందీ సాహిత్యవాల్లభ్య మొక లెక్కలోనిది కాదని వ్యక్తమగును.

సీ॥ సుకవీంద్రబృంద రక్షకుఁడెవ్వఁడనిన వీఁడను నాలుకకుఁ దొడవైనవాఁడు.
(చూ: పే. 190)

సీ॥ సరసకవీంద్రుల సత్ప్రబంధము లొప్పఁగొనునను టధికకీర్తనకుఁ దెరువు
లలితనానాకావ్యములు చెప్పు నుభయభాషలయందు ననుట ప్రశంసప్రోప
యర్థిమైఁ బెక్కూళ్ల నగ్రహారంబులుగా నిచ్చుననుట పొగడ్తపాలము
మహిత దక్షిణలైన బహువిధయాగంబు లొనరించు ననుట వర్ణనముచొప్పు
తే॥ గీ॥ పరుని కొకనికి నిన్నియుఁ బ్రకటవృత్తి
నిజములై పెంపు సొంపారి నెగడునట్టి

కొమ్మనామాత్యు తిక్కనికోలఁది సచివుఁ
డింక నొక్కరుఁ డెన్నఁగ నెందుఁ గలఁడు॥ 93

ఇట్టి మహనీయగుణసంపన్ను లేదేశమందైనను ఏకాలమందైనను అరుదుగ నేయుందురు. ఈ మహాపురుషుఁ డాంధ్రదేశమున జన్మించి యాంధ్రమున వాఙ్మయసేవకుఁ బూనుకొనుట యాంధ్రజనుల మహాభాగ్యమనియే తలంపవలసియున్నది.

ii

ఉత్తరరామాయణ రచనము తిక్కనార్యుని కవితావిలాసమునకు వసంతమయ్యెను. దీనికి దశకుమార చరిత్రమే ప్రోత్సాహకమని తలంప వచ్చును. ఈ కావ్యముఖమునఁ దనవంశముయొక్క తనయొక్క ప్రశంసామృతమును గ్రోలిన మనుమసిద్ధిమహీపాలుఁడు, తనయమాత్యుఁడు కృతికర్తయగుచుండగా తాను గృతీశ్వరుఁడు గావలయునని వాంఛించుట సహజము, సమంజసము. కావున నాయనయును తనయంతస్తునకుఁ దగినట్లుగాఁ దిక్కనామాత్యునివలన కృతికన్యక నభ్యర్థించెను. ఈ యభ్యర్థన ప్రకారము మిగుల సరసముగనున్నది.

కం॥ ఏ నిన్ను మామయనియెదు, దీనికిఁ దగనిమ్ము భారతీకన్యక నా
కీనర్హుఁడ వగు దనినను, భూనాయకుపల్కు చిత్తమున కింపగుడున్॥
(ఉత్తరరామాయణము, I ఆశ్వాసము - ౩)

అప్పుడా మహాకవికిఁ గలిగిన "యింపు" సామాన్యమైనదిగాదు. అది మహా[illegible]ము. కవిత్వశక్తి వేఱు. మహాకావ్యరచనము వేరు. కవులు సమర్థులైనంతమాత్రాన మహాకావ్యకర్తలు కాఁజాలరు. అందులకు దేశకాలములు, దైవమును అనుకూలింపవలయును. అప్పుడే యొకానొకమహాకవిని సమకాలికులు గుర్తించి సంభావించి మహాకావ్యరచనకుఁ బ్రోత్సహించుట సంభవించును అది మహాకవికి జన్మ సాఫల్యమగును. అట్టిది మనుమసిద్ధిమహీపాలుని యభ్యర్థనముచేఁ దిక్కనకు సమకూడెను. అదివారియాబాల్యమైత్రికి అక్షరయశఃపతాకయు నయ్యెను. ఆయన మనుమసిద్ధికిఁ గృతిపతిత్వము నొసఁగ నంగీకరించుటయందొక విశేషము కలదు. ఆయన అప్పటికిఁ జిత్తనిత్యస్థితి శివుఁడై యుండెనని కేతన చెప్పెను. ఆయనయే స్వయముగా మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండనని చెప్పుకొనెను. అట్టి స్థితియందాయన మహాకావ్యమును రచించునపుడు దానికధీశ్వరత్వమును మహేశ్వరున కొసంగ నభిలషించుట సహజము. దానిని గమనించియే కాఁబోలు మనుమ

సిద్ధి “నేను నిన్ను మామా యని పిలుచుచున్నాను గదా! నాకు నీవు కన్యనీయకుండుట తగునా?” అని మొగమోట నెట్టి యడిగెను. ఆమహాకవియును ఆలోచించి మనుమసిద్ధియును తక్కువవాఁడు కాదు లేయని సరిపెట్టుకొని కృతినంకితము సేయఁ బూనినట్లు కన్పించుచున్నది. మనుమసిద్ధి, “పద్మినీమిత్రవంశమున జన్మించెనని” “సౌందర్య సంపదసొంపు దాల్చెనని” “చతురత కల్మినప్రతిముఁడని” “శౌర్యత్యాగ విఖ్యాతకీర్తుల వెలసెనని” “వివిధవిద్యాపరిశ్రమవేది యని” “సరసబహుమానవిరచనా శాలియనియు” ఇన్ని గుణములను గమనించి తిక్కనార్యుడాయనను “సుభగుఁ గావించుట కుద్యుక్తుఁడనై తి”నని చెప్పెను. ఈసందర్భమున నన్నయభట్టు, రాజరాజు ఆయన దృక్పథమున మెదలుచున్నారని చెప్పవచ్చును. భట్టారకుఁడు రాజరాజు నిట్లు వర్ణించెను. రాజరాజు చంద్రవంశీయుడగుటచే నావంశవృత్తమగు మహాభారతమును నన్నయభట్టారకుఁడు రచింపఁబూనఁగా, మనుమసిద్ధి సూర్యవంశ్యుఁడగుటచే దిక్కనార్యుఁడు తద్వంశమహత్తరుఁ డగు శ్రీరామచంద్రుని చరిత్రమును జెప్పఁబూనెను.

శ్రీరామచంద్రుని చరిత్రమును చెప్పఁ బూనినపుడు కల్యాణాత్మకమైన పూర్వకథను విడిచి విషాదమేదురమగు నుత్తరకథను తిక్కనార్యుడేల చెప్పఁబూనెనను నది యొక జటిలసమస్యగా నున్నది. ఎత్తఱినైనను రామధరణీపతి సద్వృత్తముసంభావ్యమే కావున నుత్తరకథను జెప్పఁబూనితినని యాయనచెప్పిన సమాధానము సంతృప్తికరముగా లేదు. తాతయగు మంత్రి భాస్కరుఁడు పూర్వరామాయణము వ్రాసి యుండఁగా, దానినివదలి తిక్కనార్యుఁ డీయుత్తరభాగము వ్రాసెనని కొందఱు తలంచిరి. అట్లగుచో అట్టిగ్రంథమును కేతనగాని తిక్కనార్యుఁడుగాని పేర్కొనకుండుటకుఁ గారణము గానరాదు. ఇప్పటి భాస్కరరామాయణము శైలినిబట్టి యితరహేతువులనుబట్టియు తిక్కనార్యునకుఁ దరువాతి దనుట నిశ్చితము. ఆయనకు సమకాలముననో కొంచెము పూర్వముననో వెలసిన రామాయణము గోనబుద్ధారెడ్డిదే కన్పించుచున్నది. కావున దానినిజూచి మరల నా కథను రచించుట యనావశ్యకమనె తలంచి తిక్కనార్యుఁ డుత్తరకథను చేపట్టియుండును. వేదధర్మాభిమానమున, శ్రీరామచంద్రచరిత్ర రచనాభినివేశమున తమకు సామ్యమున్నను, బుద్ధారెడ్డి దేశికవితా మార్గమున ద్విపదనవలంబించుటచేత, మహాకావ్యశిల్పమున కాద్విపదలు చాలవని తాను బహుచ్ఛందోమహితమగు పద్యకావ్యపద్ధతి నవలంబించుటవలనఁ దిక్కనార్యుఁడు రంగనాథరామాయణమును పేర్కొనలేదని తలంపవచ్చును. ఆయన నన్నయభట్టారకుని సైతము పేర్కొనకుండుట గమనింపఁ దగినవిశేషము.

భట్టారకునిఁ జేకొనకున్నను తిక్కనార్యుఁడాయన రచనమును జూడ లేదని చెప్పుటకు వీలులేదు. సంస్కృత శ్లోకరూపముగా తిక్కనార్యుఁడు గావించిన కృత్యారంభము భట్టారకుని మహాభారతారంభ పద్ధతిని స్ఫురింపఁజేయుచునే యున్నది. ఉత్తరరామాయణ పీఠికను బరిశీలించినచో నొక్కయెడ నన్నయ్యభట్టారకుఁడు చెప్పిన లక్షణము కూడ స్ఫురించును. ఆంధ్రశబ్ద చింతామణియందు శబ్దవ్యవహారమును గూర్చి భట్టారకుఁ డొక నియమమును గావించెను "విరళములైన పేచోషాదిక శబ్దములను శబ్దజ్ఞులగువారు ప్రయోగింతురుగాక. ఇచట (ఆంధ్రకావ్యరచనమున) మాత్రము పూర్వకవి సమయసిద్ధములై ప్రసిద్ధములైన పదములనే ప్రయోగింపవలయును."

శ్లో॥ విరళాన్ పేచోషాదికశబ్దాన్ ప్రవ్యాహరంతు శబ్దజ్ఞాః
ఇహతు ప్రవ్యాహార్యం సత్కవితసుప్రసిద్ధమేవపదమ్ ॥
—ఆంధ్రశబ్దచింతామణి - 12

"తిక్కనార్యుడు చెప్పిన, "జాత్యముగాని నొప్పయిన సంస్కృతమెయ్యెడఁ జూన్ప" అనులక్షణము పై నియమమునే వ్యక్తీకరించుచున్నది. జాతివ్యవహారమున సుప్రసిద్ధమైనది జాత్యము. వ్యాకరణానుసారముగా సాధువులైన సంస్కృత పదములన్నియుఁ దెలుఁగువారి వ్యవహారములోనికి రాలేదు. అనేయమగు సంస్కృతపదజాలమునఁ గొంత మాత్రమే యాంధ్రదేశవ్యవహారమున రూఢమై జాత్యమయ్యెను. కావున పండితులైన కవులు తెలుఁగున కావ్యరచనము చేయునపుడు జాత్యమైన సంస్కృతపదజాలమునే యుపయోగింపవలయును గాని, సాధుశబ్దములైనంతమాత్రమున శాస్త్రాదులందు విరళముగా ప్రయోగింపఁబడు నప్రసిద్ధపదముల నుపయోగింపరాదనుటయే నన్నయ తిక్కనల లక్షణములకు సారాంశము. ఈ లక్షణములకు విరుద్ధముగా నన్నెచోడాది శైవకవులు రచించిరనుట యభిజ్ఞులకు విదితమే. "పలుకులపొందులేక రసభంగముసేయుచు" మొదలుగాఁ దిక్కనార్యుడు గావించిన యాక్షేపములు పాల్కురికి సోమనాథాదుల నుద్దేశించిన వనుటయు స్పష్టమే. కావున వారి నాయన మెచ్చకుండుట సహజమే. కాని నన్నయభట్టారకుని రచనము నైనను అప్పటికాయన మెచ్చినట్లు కన్పింపదు.

క॥ వచనము లేకయు వర్ణన, రచియింపఁగఁ గొంతవచ్చుఁ బ్రౌఢులకుఁ గథా
ప్రచయముఁ బద్యములనపొం దుచితంబుగఁ జెప్పుటార్యు లొప్పిదమనరే ॥
(ఉత్తరరామాయణ - I ఆశ్వాసము - 15)

దీనినిబట్టి కావ్యమధ్యమున వచనము నుపయోగించుకొనుట యప్రౌఢుల పద్ధతి యని ఆయన తలంచినట్లు వ్యక్తమగుచున్నది. ఈమాట కొంతవఱకు నన్నెచోడున కన్వయించును. కాని గద్యపద్యాత్మక రచనమును మొదటఁ దెలుఁగున వ్రాసి పెట్టిన నన్నయభట్టారకునకుఁ బూర్తిగా నన్వయించుచున్నది. తిక్కనార్యునకు వచన రచనముపై నభినివేశము కల్గుటకు కాళిదాస కుమారసంభవాది కావ్య శిల్పాభినందనమే కారణమని చెప్పవచ్చును ప్రాచీన సంస్కృతకావ్యములు ప్రాయికముగా నిర్వచనములే. ఆ మార్గమును తెలుఁగునకుఁ దేవలయు నని ఆయన కుతూహలపడెను. "ఆ పరితోషా ద్విదుషాం" మొదలగు కాళిదాసుని శ్లోకమును, "ఎట్టి కవికైనఁ దనకృతి యింపుఁ బెంపఁజాలు" అను పద్యమున ననువదించుకొనుట వలనఁ దిక్కనార్యుని దృక్పథమునందు కాళిదాసు ప్రముఖుఁడుగా భాసించుచుండె ననుట స్పష్టము. ఇట్లాయన తెలుఁగుకవులలో నన్నయభట్టారకునిగూడ మెచ్చలేదని వ్యక్తమగుచున్నది. కావుననే కాఁబోలు కేతన, "కవితచెప్పి యుభయకవిమిత్రు మెప్పింప నరిది బ్రహ్మకైన" అని యుద్ఘాటించెను చంపువగు దశకుమార చరిత్రమును తిక్కనార్యుఁడు మెచ్చినను, తా నుత్తరరామాయణమును వ్రాయునప్పుడు వచనమును వదలియే మహాకావ్యశిల్పమును నిర్వహించెను. దీనిని గమనించి కాఁబోలు కేతన తరువాతఁ దానువ్రాసిన విజ్ఞానేశ్వరమును నిర్వచనముగనే రచించెను. కావున అప్పటికి వెలసిన తెలుఁగు కవులందఱకన్నను కావ్యశిల్పమునఁ దానుమించినవాఁడ నని తిక్కనార్యుఁడు భావించుచుండెను. ఆ భావము నీ క్రిందిపద్యమున వాచ్యముగఁ గూడఁ జెప్పెను.

మ॥ అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడఁ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్ ॥

—ఉత్తరరామాయణము - I - 13

ఇట్లనేకుల నాక్షేపించుచు, వాగనుశాసనుని చంపూకావ్యమార్గమును గూడ వదలి క్రొత్తత్రోవల ద్రొక్కఁ బూనుట యాయనకే సాహసముగాఁ దోఁచి నట్లున్నది. కావుననే, "సారకవితాభిరాము గుంటూరి విభుని, మంత్రి భాస్కరు మత్పితామహుని, దలఁచి యైన మున్ననమెయి లోకమాదరించు, వేఱ నాకృతిగుణములు వేయువేల" (ఉ॥రా॥ - I - 11) అని ఆయన కొంత జంకునడియు నుండెల

తాతగారిని స్మరించి తన్నుదాను సమాధాన పెట్టుకొనెను. దీనిని బట్టి ఉత్తరరామాయణ రచనాకాలమునకు తిక్కనార్యుని చిత్తవృత్తి కవిత్వాహంకారవిషయ సంశయశబలితమై యుండెనని తలంపవచ్చును.

ఇంతకావ్య గుణదోషవిచారమును గావించిన యీయన వేదసమ్మిత సాక్షాద్వేదమే యనియుఁ బ్రసిద్ధమైన రామాయణమూలమును గూర్చి యొకమాటయైనఁ జెప్పకుండుట, వాల్మీకిమహర్షి ని నామమాత్రముగ నైన స్మరింపకుండుటయు మిగులఁ జిత్రముగ నున్నది. దీనినిబట్టి నన్నయభట్టారకుఁడు మహాభారతము నాంధ్రీకరింపఁ బూనిన విధముగా నీయన రామాయణోత్తరకాండము ననువదింపఁబూన లేదని స్పష్టమగుచున్నది. కాళిదాసాదులు కుమారసంభవాది కావ్యములకుఁ గావలసిన కథలను పురాణముల నుండి గైకొనినట్లే యీయనకూడ ఉత్తరకాండము నుండి కావలసిన కథను స్వీకరించి స్వతంత్రముగా నొక మహాకావ్యమును రచించె ననియే చెప్పవలసియున్నది. భట్టారకుఁడు మహాభారతము నాంధ్రమున రచింపఁ బూనినపుడు 'కృష్ణద్వైపాయనముని వృషభాభిహిత మహాభారతబద్ధనిరూపితార్థము' తెనుఁగునఁ జక్కగా వివరింప నిశ్చయించెను. తానును విరాటాదిపర్వముల రచింపఁ బూనినపుడు "సాత్వతేయ సంస్మృతి శ్రీవిభవాస్పదం" బయిన చిత్తముతోడ మహాభారతమును ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగఁ దెనుఁగున నిర్మింప నిశ్చయించెను. ఆ చిత్తవృత్తి, అట్టి నిశ్చయము ఈ యుత్తరరామాయణ రచనమునఁ గన్పించుటలేదు. అట్లగుచో రామాయణమహత్త్వమును గీర్తించి వాల్మీకిమహర్షిని ప్రస్తుతించి యుండును. దీని నొకస్వతంత్ర కావ్యముగా ఆయన యుద్దేశించుటవలననే కథను అత్యంత సంగ్రహముగాఁ జెప్పుటయేకాక, మూలమునఁ దుదియందుఁ గల లక్ష్మణోదంతము, శ్రీరామనిర్యాణమునువదలి కుశలవులను రాముఁడు స్వీకరించుటతో కథను ముగించి కావ్యమును మంగళాంత మొనరించెను. ఇది మూలమునుబట్టి యసమగ్రమను తలంపుతోనే తరువాతి కథను జయంతిరామభట్టనుకవి యేకాశ్వాసముగా రచించెను.

ఆధునిక విమర్శకులు ఉత్తరకాండమున నేయేభాగములను ప్రక్షిప్తములనుగా భావించుచున్నారో ఆ భాగములనే ప్రాయికముగా తిక్కనార్యుఁడును పరిహరించియుండుట గమనింపఁదగియున్నది. స్వీకరించిన భాగములను గూడ చక్కగా సంగ్రహించి కథను వేగముగా నడపుచు సహృదయుల నాకర్షించుటయందు ఈయన గొప్పకౌశలమును జూపెను. వర్ణనములను సందర్భములకు వలసినంతగనే విస్తరించెను.

ప్రథమాశ్వాసమున పూర్వరామాయణకథను సంగ్రహముగఁ జెప్పి యుత్తర కథకుఁ దగిన ప్రారంభము నేర్పఱచెను. కాని రామాయణకథనంతయు 23 పద్యములలో ముగించి, అయోధ్యాపురవర్ణనమును 19 పద్యములలో విస్తరించెను. ఈ పుర వర్ణనము తరువాతి ప్రబంధకవుల కాదర్శమైనట్లు తోఁచుచున్నది. మూలమున ధర్మార్థప్రతిపాదకములై వాల్మీకి రచితములనియే ప్రసిద్ధములైన యుపాఖ్యానములు పెక్కు కలవు. వాని నన్నింటిని ఈయన ఇది యనువాదము కాకపోవుటచే పరిహరించెను. ఇట్లే కావ్యకళాదృష్టితో మూలమున నత్యల్పముగనున్న చంద్రోదయ చంద్రికావర్ణనములను, సీతారాముల జలక్రీడావిహారాది వర్ణనములను మిగుల విస్తృతముగా వర్ణించెను.

ఈ కావ్యమున ప్రాయికముగా ప్రతి సందర్భమునను తిక్కనార్యుని కళా కౌశలము ప్రస్ఫుటముగా గోచరించును. ఆయన శైలిని నాటకరీతిగా పెద్దలు పేర్కొందురు. నాటకరీతి యనఁగా, సన్నివేశములన్నియు రంగమునందలి దృశ్యములవలెఁ గనులకుఁ గట్టునట్లు వర్ణించుచు పాత్రల ప్రసంగవర్తనముల మూలమున కథను వేగముగా నడుపుపద్ధతి. ఈ పద్ధతియం దాయన సిద్ధహస్తుఁడు. కావ్యమున ఈ పద్ధతికి దృశ్యవర్ణనకౌశల మత్యంత మావశ్యకము. సన్నివేశ ప్రారంభమున పాత్రలను ప్రవేశపెట్టునపుడు కథననిపుణతయు ఆవశ్యకమే. ఈ కావ్యమున మనకుఁ దన్మయత్వమును గలిగించు సన్నివేశము లనేకములు కథనవర్ణన సంవాదసంగమ త్రివేణీతీర్థములే. రావణుఁడు వేదవతి నవమానించు ఘట్టమును గమనింపుఁడు.

మ॥ హిమవంతంబున కేఁగి యొక్కయెడ నందేకాంత యొక్కర్తు చీ
రముఁ గృష్ణాజినముం గమండలువునై రాగంబు వర్జించి సం
యమముం గైకొని యున్నఁ జేరఁజని హృద్యాకారమున్ యౌవనో
ద్యమముం గాంతియుఁ జూచి రావణుఁడు కామాయత్తుఁడై యిట్లనున్.
(ఉ॥రా॥ V-4.)

ఈ యొక్క పద్యముననే తిక్కనార్యుఁ డెంతకథను ఎంత ప్రసన్నముగఁ జెప్పెనో చూడుడు. రావణుఁడు హిమవంతమునకుఁ బోయెను. అందొకచో చీరము, కృష్ణాజినము, కమండలువును ధరించిన యొక తపస్విని గాంచెను. చూడఁగానే రావణునకు ఆమెయందు హృద్యాకారము, యౌవనోదయము, గాంతియు గోచరించినవి. వెంటనే వాఁడు కామాయత్తుఁ డయ్యెను. ఈ రచనము కథన శిల్పమున

కలంకారముకదా. పిమ్మట జరిగిన సంవాదమున రావణుఁడు ఆమె వేదవతి యని యెఱింగి తనకోర్కెని తెలుపును. తరువాతి సన్నివేశమును జూడుడు.

చం॥ అని కలుషించి వేదవతి యచ్చటు వాసిచనం దలంచినం
గని దశకంధరుండడరి గ్రక్కున వేనలిపట్టికొన్న నం
గన యొకకేల వ్రేయ నది కత్తివిధంబునఁ దాఁకి కత్తిరిం
చినక్రియఁ ద్రెంచె వెండ్రుకలు చేతఁదెమల్చినయంత కిన్వలన్.

తే॥గీ॥ వెండ్రుకలు చేతవచ్చుడు వెఱగుపడుచుఁ
దపముపేర్మికి నలికి యద్దనుజవిభుఁడు
నిలిచె రోషమహానలజ్వలనమూర్తి
యగుచుఁ బిఱిదికిఁ బాసి యిట్లనియె సతియు.

(ఉ॥రా॥ V ఆశ్వాస. 17, 18.)

రావణుఁడు సాభిలాషముగా వేదవతిని జూచెను. ఆమె కోపించి వానిని నిందించి యటనుండి కదలెను. వాఁడు వెనుక నుండి యామెవేనలిని పట్టెను. ఆమె వెనుదిరిగి జుట్టుపైఁ జేతితోఁ గొట్టెను. అది కత్తితోఁ గొట్టినట్లుగా తెగెను చేత వెంట్రుకలతో రావణుఁడు నిలిచిపోయెను. అడుగు ముందునకు వేయలేక యతఁడు రోషమున మహానలజ్వలనమూర్తి యయ్యెను. రంగస్థలమున దృశ్యమిట్లేకదా యుండును. ఇందు మేళవింపఁబడి చరితార్థములైన రీతులు మాత్రము కథన వర్ణనములే.

ఈ కావ్యమునఁ దొలియాశ్వాసము అయోధ్యావర్ణనమునకు, పూర్వకథా సంగ్రహమునకు సరిపోఁగా, మిగిలిన తొమ్మిది యాశ్వాసములలో నాలింట రావణుని వృత్తాంతము, తుదిమూఁడింట సీతారాములకథయును గలదు. రావణుని కథయందు యుద్ధఘట్టములే హెచ్చు. అవి యన్నియుఁ గనులకుఁ గట్టునట్లుగా వర్ణింపఁబడినవి. అనఁగా ఇందును కథనవర్ణనముల కౌశలమే సఫలమైన దన్నమాట.

ఈ కావ్యమునకుఁ బ్రాణాస్పదము సీతాపరిత్యాగవృత్తాంతము. దీనిని నీ మహాకవి బహుకరుణరమణీయముగ నిర్వహించెను. రాముని మాటలలో నమ్మహా పురుషుని వ్యథ నెంతహృదయవిద్రావకముగఁ జిత్రించెనో చూఁడుఁడు.

ఉ॥ రావణునింట నుండఁగ ధరాసుత నేమరలంగఁ దెచ్చి సం
భావనసేత కష్టమని పల్కెరి చూచితె లక్ష్మణా మహా

దేవుఁడు బ్రహ్మయున్ మునులు దేవగణంబులు మెచ్చ నయ్యెడం
బావకుఁ డిచ్చె నాకుసతిఁ బాపపుమాటలు పుట్టె నియ్యెడన్ ॥

ఉ॥ వేవురు నేల నేనుబృథివీసుత చిత్తము పెంపెఱుంగనే
భూవలయంబు సంచలతఁ బొందిన వారిధి మేరఁదప్పినన్
దేవనగంబు పాఁతగలి త్రెళ్లిన నందొకకీడు గల్లునే
యావనజాక్షి నిట్లు సెడనాడిన నక్కట నోరు ప్రువ్వదే ॥

(ఉ॥రా॥ 8 - ఆశ్వాస. 116, 117.)

పరిత్యక్తయగు సీత విలపించుట, ఆమె నొంటిగా విడిచి లక్ష్మణుఁడు తిరిగివచ్చుటయు కరుణరసప్రవాహమున నావర్తములుగా నున్నవి.

క॥ అగుఁ గాక యట్లచేసెద, జగతీపతి పనుపుసేసి చను నీవును నీ
తెగువ రఘుపతికి నీకుం, దగవఁట యేననిడిదేమి తమ్ముఁడ చెపుమా ॥

ఉ॥ మేనికి నంతవంతఁ బడ మిక్కిలి కాఱియఁబెట్టి నొంపఁగాఁ
బూనితి నోర్వకున్ననదినోవునే యట్లు జగంబువారలున్
మానము లేక యీ తులువమాటల నాడెసనాడ మస్సహం
బై నది దీని మానుపునుపాయము చొప్పడదేమి సేయుదున్ ॥

మ॥ అనుచుండన్ మఱుమాటవల్కక సముద్యద్బాష్పుఁడై లక్ష్మణుం
డినవంశాగ్రణి దేవిపాదయుగళం బీక్షించి ధాత్రీతలం
బును ఫాలంబునఁ బొందమ్రొక్కి వినయంబుం దీవ్రశోకంబు నె
మ్మనముం జుట్టుకొనం బ్రదక్షిణముగా మందప్రచారంబునన్ ॥

(ఉ॥రా॥ 9 ఆశ్వాస.)

ఇట్లు రామునిమాటలను గాని, సీతావిలాపమును గాని రచించుట సంవాదకుశలుఁడగు మహానాటకకర్తకుఁ దప్ప సాధారణకవికి సాధ్యము కాదు. ఇట్టి ఘట్టములందు కథననిపుణతకుఁ గాని వర్ణనకౌశలమునకుఁ గాని ఎక్కువ తావుండదు. కాని యిట్టిదేయగు సీతాశపథ వృత్తాంతము నీయన యెందులకుఁ దెల్పివేసెనో తెలియదు. అదియుండఁదగినంత రసబంధురము గాలేదు. ఈ కావ్యమునకుఁ గరుణము ప్రధానరసమైనను ఈయన సీతారాముల శృంగారమునకుఁ చాలప్రాముఖ్యమును గలిగించి వర్ణించెను. ఇది మూలమున అల్పము. మఱియును వాల్మీకి రచనమునందు కేవలము అసంభావ్యమైన సంభోగశృంగారమును గూడ ఈయన యిందు వర్ణించెను.

ఈకావ్యరచనా కాలమునకు నీయనయందు ధర్మతత్త్వ పర్యాలోచనము కూడ లౌకిక వాసనా వాసితముగనే యున్నట్లు తోఁచుచున్నది. కృతిపతి యగు మనుమసిద్ధిని ప్రశంసించునపుడు, పద్మినీమిత్రవంశమున జన్మించుటయు, సౌందర్య సంపదసొంపుఁ దాల్చుటయు, సమానగుణములుగనే వర్ణించెను. ఆయన తాత యగు మనుమసిద్ధిని వర్ణించునపుడును, ధర్మాద్వైతమూర్తి యగుట, వరయోషిద్వర్గస్మరుఁ డగుటయుఁ గలిపి చెప్పెను. కృతినాయక వంశావతారమున నిట్టివర్ణనము లింకను గలవు. వీనిని బట్టి చూచినచో మహత్త్వమునందు శృంగారము నొకప్రముఖవిషయ ముగ ఆయన భావించుచుండెనని వ్యక్తమగుచున్నది. మఱియును ఈయన మహనీయ తకు మహావీరత్వమును కర్మయోగమును ప్రధానలక్షణములనుగా వర్ణించెను. ఈ కర్మయోగము సమతారూపమైనది. ఈ సమత్వమును కృతిపతియగు మనుమసిద్ధి యందుఁ జక్కఁగా నిరూపించెను.

సీ॥ అనుపమ బహురత్నహయవారణముల విద్విషులు గప్పములు పుత్తెంచుచోట
నెల్లి కయ్యంబని యెద్దియేనియు నొక్కకెలన శాత్రవదూతపలుకు చోటఁ
దలతలమని రెండుదడములవా రేటున కమానముగఁ జేరనడచుచోటఁ
బరసేన సచ్చియుం బాఱియు బయలైన యనిలోన జయముసేకొనెడు చోట.

ఆ॥ నొక్కరూపకాని యెక్కుడుడిగ్గును, గానరాదు ముఖవికాసమునకు
నన్యరాజులీడె యరిరాయవేశ్యాభు, జంగుఁడైన మనుమ జనవిభునకు.

(ఉ॥రా॥ ఆ. 1-44.)

భగవద్గీతలలో శ్రీకృష్ణదేవుఁ డర్జునునకుఁ జెప్పిన సమతారూపయోగమునే యిందీయన యుద్దేశించినట్లు తోఁచుచున్నది. శ్రీకృష్ణదేవుఁ డిట్లు చెప్పెను. "సంగ మును విడలి యోగస్థుఁడవై కర్మలను జేయుము. కార్యసిద్ధియందును, అసిద్ధియందును సముఁడవగుము. సమత్వమే యోగమని చెప్పఁబడుచున్నది."

శ్లో॥ యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనంజయ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వంయోగ ఉచ్యతే॥

(సాంఖ్యయోగ భ. గీ. శ్లో. 48.)

ఈ యోగమునే కర్మలయందుఁ గౌశలమనియును జెప్పి శ్రీకృష్ణదేవుఁడు స్థితప్రజ్ఞలక్షణములందుఁ గూడ దీనిని వివరించెను. తిక్కనార్యుఁ డీ సమతారూప కర్మయోగమునే సకలవేదాంతసారముగా భావించినట్లు తోఁచుచున్నది. విరాట

పర్వాదియందుఁ బ్రస్తావింపఁబడిన "కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా" అను హరిహరనాథ స్తవరూపమైన శ్లోకమునందును ఈ సమత్వమునే ఆయన వర్ణించి యుండుట గమనింపఁ దగియున్నది.

ఈ దృక్పథమువలననే కాఁబోలు తిక్కనార్యుఁడు శ్రీరాముని శీలమును, మూలమున లేని విశేషములతో, సమతాయోగ విశిష్టముగాఁ జిత్రించెను. మూలమున రామునియానతిపై లక్ష్మణుఁడు సీతను వనమునకుఁ గొనిపోయెనని కలదు. ఆ సమయమునకు సీతను సాగనంపుటకై రాముఁడు వచ్చినట్లుగా లేదు. కాని యీ కావ్యమునఁ సీత బయలుదేరునపుడు రాముఁ డచటికివచ్చి తాను వియోగదుఃఖమును నిగ్రహించుకొనఁ గలుగుటయేగాక, దుఃఖమున నుద్విగ్నుఁడై యున్న లక్ష్మణుని దైన్యమునకుఁ గారణమును కల్పించి చెప్పి తన సందేహమే కలుగకుండునట్లు చేసెను. తానామెను వనములకుఁ బంపఁదలంపఁగా, లక్ష్మణుఁడు దానికంగీకరింపలేదని, అతని యభిప్రాయమునకు విరుద్ధముగా జరుగుచుండుటవలన నాతనిముఖ ముద్విగ్నముగ నున్నదే కాని వేఱేమియుఁ గారణము లేదని రాముఁడు సీతాదేవిని నమ్మించెను. ఇట్లు తాను దుఃఖింపకుండుటయే కాక, లక్ష్మణుని దుఃఖమునకు నెపమును గల్పించి, మాటయందును ముఖమునందును ఎట్టిమార్పును లేకుండ, ఆ సంకష్టమున సీతతోడ బ్రసంగింపఁ గల్గుట మహాధీరునకుఁ దప్ప నితరునకు సాధ్యము కాదనుట యథార్థము. ఇది భగవద్గీతలలో శ్రీకృష్ణుఁడు స్థితప్రజ్ఞునిగూర్చి చెప్పిన "దుఃఖములందు నుద్వేగమును పొందనివాఁడు, సుఖములందుఁ గాంక్ష లేనివాఁడు" అను లక్షణమునకు సరిపోవుచున్నది. సీతాపహరణ సందర్భమునను, ఈ పరిత్యాగ సన్నివేశమునను, ఆమె భూమిలోఁ బ్రవేశించినప్పుడును శ్రీరాముఁడు మిక్కిలి యధీరుఁడై విలపించినట్లు వాల్మీకి చెప్పెను. ఈ సన్నివేశమున శ్రీరామునియందు మహాధీరత్వమును తిక్కనార్యుఁడు చిత్రింప యత్నించుట సమంజసమే. కాని యిది కొన్ని ధర్మసందేహములకుఁ దావొసంగుచున్నది. మూలమున లక్ష్మణుఁడు రాముని యాదేశమును వినిపింపఁబూనినపుడు తప్ప, అంతకుపూర్వము సీత యాతనియందలి దుఃఖమును గుర్తింపలేదు. అంతవఱకాతఁడు తన్నుఁదాను నిగ్రహించుకొని మిగుల ధైర్యముతోడనే వర్తించెను. ఈ కావ్యమునందలి పై కల్పనమువలన రాముఁడు ధీరుఁడగుచున్నను లక్ష్మణుఁడుమాత్ర మధీరుఁడగుచున్నాఁడు. మఱియును శ్రీరాముఁడు సీతయెదుటికి వచ్చి యథార్థమును జెప్పక దాఁచుచు అసత్యప్రసంగమున పతివ్రత యగు ధర్మపత్నిని అత్యంత దయనీయస్థితి

యందు మోసగించినవాఁ డగుచున్నాఁడు. ఇదియు నధీరతయే యగును గదా! శ్రీరాముఁడు మహాధీరుఁడు, మహాయోగియు కాకున్నచో నాతని మహాత్త్వమున కంతగా లోటురాదు, కాని యసత్యవచనములతో భార్యను వంచించుట నింద్యము కదా శ్రీరాముఁడు, శ్రీకృష్ణునివంటి యోగీశ్వరేశ్వరుఁడని వాల్మీకి చెప్పలేదు. లోకులను అట్లు తలంచుటలేదు. ఆయన మూర్తీభవించిన ధర్మమనియే వాల్మీకి చెప్పెను. అదియే శ్రీరాముని మహాత్త్వమునకు శీలమునకు నిదానము. ధర్మము భంగపడినచో యోగము, జ్ఞానము మొదలగునవి యేవియు మహాత్త్వమును కాపాడఁజాలవు, కావున తిక్కనార్యుఁడు శ్రీరామునియందుఁ జిత్రింప యత్నించిన సమతారూపయోగమహాత్త్వ మాభాసమే యగును.

## iii

ఈ కావ్య పీఠికయందు మనుమసిద్ధి సైన్యములు అద్దంకియొద్ద మహారాష్ట్రి సారంగుని అనాయాసముగా జయించి వచ్చినట్లు చెప్పఁబడినది. ఈ యుద్ధము క్రీ. శ. 1257 లో జరిగెనని చరిత్రకారులు చెప్పుచున్నారు. కావున ఈ కావ్యమును తిక్కనార్యుఁడు క్రీ. శ. 1257-58 ప్రాంతమున, సుమారు ఏఁబదియేండ్ల వయస్సులో రచించియుండును. దశకుమారచరిత్రము ఇంతకు కొంచెము పూర్వమున క్రీ. శ. 1255 ప్రాంతమున రచింపఁబడియుండునని తలంపవచ్చును. మంత్రియై, కృతికర్తయై, తాను కావ్యమును రచించి మహారాజున కంకితము గావించిన పిమ్మటనే తిక్కనార్యుఁడు మనుమసిద్ధిప్రోత్సాహముతో మహావైభవముతో యజ్ఞమొనరించి సోమయాజియై యుండును. పిమ్మటఁ గొంతకాలమున కీరాజునకు మంత్రికిని జీవితములం దొడుదుడుకులు ప్రారంభమైనట్లు కన్పించుచున్నది. క్రీ. శ. 1259-60 ప్రాంతమున మనుమసిద్ధి నాతని దాయాదులు అక్కనబయ్యనలు జయింపఁగా నతఁడు కందుకూరు సీమలోని పెంట్రాలకోటలోఁ గొంతకాలము దాఁగియుండెనఁట, అప్పుడు తిక్కనసోమయాజి కాకతి గణపతిదేవ చక్రవర్తి కడకుఁ బోయి, యాతనివలన మన్ననలు గాంచి, తన స్వామికి సాయముసేయుమని కోరఁగా, గణపతిదేవుఁడు సేనాసమేతుఁడై వచ్చి అక్కన బయ్యనలను పాఱఁద్రోలి, మనుమసిద్ధిని మరల నెల్లూరియం దభిషిక్తుని గావించెను. గణపతిదేవునకు నూఱుసంవత్సరములఁ దరువాత నున్నవాఁడుగా భావింపఁబడుచున్న కాసెసరప్ప యను కవి రచించిన ప్రతాపచరిత్రమను నామాంతరము గల సిద్ధేశ్వర చరిత్రమను ద్విపద గ్రంథమునందు, పదునేనిమిదవ శతాబ్దమువాఁడైన కూచిమంచి జగ్గకవి రచించిన సోమదేవరాజీయ మను ప్రబంధమునందును, ఈ వృత్తాంతము

ప్రస్తావింపఁబడినది. వీనియందు తిక్కనార్యుఁడు గణపతిదేవుని యొద్దకుఁ బోయినప్పుడు భారతాఖ్యానమును వినిపించి యాతనిచే సత్కృతుఁడయ్యెనని కలదు. (ఈ సర్వస్వమున కాసెసరప్పద్విపద వ్యా: 72. పుట 739 లో ముద్రింపబడినది.)

ఈ సంఘటనము తిక్కనామాత్యుని జీవితమున నత్యంతము ప్రముఖమైనది. దీనివలన ఆయనయొక్క ప్రభుభక్తి, రాజనీతికౌశలము, పాండిత్యప్రాభవమును లోకప్రఖ్యాతము లయ్యెను. ఆయన గణపతిదేవుని సామ్రాజ్యాస్థానమున జైనాదిమతములను ఖండించి యద్వైతమతమును స్థాపించుటవలన నఖిలాంధ్రదేశమున మరల సనాతనధర్మమునకుఁ బ్రాభవమేర్పడెను. నెల్లూరిలో నొకమంత్రిగా మాత్రము ప్రసిద్ధుఁడై యున్న తిక్కనామాత్యుఁడు యీ సంఘటనమునకుఁ బిమ్మట నాంధ్రదేశమహాపురుషులలో నగ్రగణ్యుఁడయ్యెను. పై గ్రంథములలో నీయన గణపతిదేవునకు భారతాఖ్యానమును వినిపించెనని యుండుటవలనఁ గొందఱు అప్పటికే ఆయన మహాభారతమును రచించెనని తలంతురు. కాని యిది సంభవముకాదు. ఉత్తరరామాయణరచనమునకు యీ సంఘటనమునకు నడుమ నెక్కువ వ్యవధానములేదు. ఈ యల్పకాలమున ఆయన మహాభారతమును తెనిగించెనని చెప్పుట యుక్తముకాదు. మఱియును యీ రెండు గ్రంథములందును భారతాఖ్యానమని యున్నదేకాని, తెలుఁగుభారతమని నిర్దేశింపఁ బడలేదు. కావున ఆయన గణపతిదేవునకు వినిపించినది సంస్కృతమహాభారతమే.

మనుమసిద్ధికష్టము లింతటితో తీరలేదు. తిక్కనామాత్యుని శేముషీప్రకాశమును పైతము కప్పుచు దుర్దినములు సింహపురికి తటస్థించెను. పుల్లరి నిమిత్తమై కాటమరాజుతో మనుమసిద్ధికి వివాదమేర్పడి యుద్ధము జరిగినది. ఆ యుద్ధమున ఖడ్గతిక్కన సేనానాయకుఁడై మొదటిసారి యోడి మరలివచ్చి, యింటియందవమానితుఁడై మరల నేఁగి యసమానశౌర్యమునఁ బోరాడి యస్తంగతుఁ డయ్యెనను కథ సుప్రసిద్ధము. (ఈ యుద్ధమునుగూర్చి చూ: వ్యా. 70, పుట 729) తరువాత మనుమసిద్ధియు స్వయముగా యుద్ధమున కరిగి వీరస్వర్గము నొందెను. ఆ యుద్ధమున తిక్కనవంశ్యులు, బంధువులును అనేకులు స్వర్గము నలంకరించి యుందురు. కాటమరాజాదులను నిగ్రహించి శాంతినెలకొల్పుటకై కాకతీయాంధ్రచక్రవర్తియొక్క సైన్యాధిపతియగు దాదినాగన్న యనువాఁడు నాగదేవమహారాజను నామముతో నెల్లూరి సీమను గొంతకాలము పాలించెను. ఇట్లు మహోన్నతస్థితి నందియుండిన తన కుటుంబము, మిత్రుఁడగు మనుమసిద్ధి కుటుంబమును తాను చూచుచుండఁగనే విచ్ఛిన్న

మగుచుండుట తిక్కనార్యున కత్యంతమగు పరితాపమును గలిగించి, యైహికమునందు విరక్తిని, తత్త్వపర్యాలోచనమునం దాసక్తిని ప్రోదిచేసి యుండును. కౌరవపాండవుల యభ్యుదయమును, వారియపక్షమును కనులారఁగాంచిన వ్యాసభగవానునకుఁ గల్గిన చిత్తవృత్తియే తిక్కనార్యునకును సంభవించి యుండును. అక్కనబయ్యనల రాజ్యకాంక్ష దుర్యోధనుని రాజ్యలోభమువంటిదే. కాటమరాజు తగవునకును మూలము అర్థలోభమే.

ఈ రాజ్యలోభమే పలనాటి యుద్ధమునకును మూలము. ఆ వృత్తాంతము భారతకథ ననేకవిధములఁ బోలియుండుట సుప్రసిద్ధము. బ్రహ్మనాయఁడు విష్ణుభక్తిని వీరత్వమును ప్రబోధించుచు వర్ణధర్మములఁ ద్రోసిరాజని చాపకూటి నేర్పఱచుట, దానిని నిరసించుచు ననేకులు నాయకురాలి పక్షమునఁ జేరుట, తుదకుఁ బోరిపోరి రెండుపక్షములందును మహావీరులు యోధులు అసంఖ్యాకముగ నశించుట, తిక్కనార్యుని దృక్పథమున భాసించుచునే యుండెను. కర్ణాటక దేశమున బసవేశ్వరుఁడును ఇట్లే శివభక్తిని, వీరత్వమును ప్రబోధించుచు వర్ణధర్మరహితమగు వీరశైవ సమాజమును విస్తరింప యత్నింపఁగా నది యనేక కల్లోలములకు అశాంతికిఁ ద్రోవఁ జూపెను. ఈ పరిస్థితుల నన్నింటిని గమనించుచుండిన తిక్కనార్యునకు, నన్నయభట్టారకుఁ డారంభించిన మహాభారతాంధ్రీకరణమును కొనసాగించుటయే ముఖ్యకర్తవ్యమని యు దెరిగి సకలసమస్యలకు సమాధానమార్గమై సనాతనధర్మతత్త్వ ప్రతిపాదనమూలమున సకలప్రజానీకమునకు సౌఖ్యశాంతిప్రదము కాఁగలదను నిశ్చయ మేర్పడెను. హరి యన్నను హరుఁ డన్నను పరతత్త్వమునందు భాసించు భిన్నచ్ఛాయలే కాని పరమార్థమున భేదములేదని సాధారణప్రజల కందఱకును సుబోధమగునట్లాయన హరిహరనాథతత్త్వము నుపాసించి, యాదేవునకంకితముగా మహాభారతమును రచింపఁ బూనెను.

ఉత్తరరామాయణ రచనాకాలమునకు మహాభారతాంధ్రీకరణ కాలమున కును నడుమ తిక్కనార్యుని దృక్పథమున గొప్పమార్పు కలిగెను. విరాటపర్వ పీఠికనుబట్టి మనము దీనిని గ్రహింపనచ్చును. "వైదికధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వమును" గొల్చుచు గ్రంథరచనమునకు నాంది యొనర్చుటయే కాక తిక్కనార్యుఁడు తాను నిర్వహించుచుండిన వైదికమార్గనిష్ఠ ముగు వర్తనమునకుఁ బరమేశ్వరుఁడు సంతోషించి కలలోఁ గన్పించి కృతిపతిత్వము నర్థించెనని అప్పుడు తాను-

"..........నీకరుణ నిట్లు పదస్థుఁడనైతి నింక జ
న్మాంతరదుఃఖముల్ తొలఁగు నట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే."

—విరాటపర్వ I ఆశ్వాస. ప. 21.

అని ప్రార్థించినట్లును చెప్పెను. అంత నా పరమేశ్వరుండును సకలసంసార దురితముల నుండి విముక్తి నొందుటకు సాధనముగా జ్ఞానరూపమగు వెలుఁగును ఆయనకుఁ బ్రసాదించెనఁట!

మఱియును పై ప్రసంగమువలన ఈశ్వరానుగ్రహమువలననే తత్త్వజ్ఞానము కలుగుననియు, ఈశ్వరానుగ్రహమును సంపాదించుటకు వైదిక కర్మనిష్ఠ, వైదిక ధ్యానమే, పరమసాధనము లనియు ఆయనవ్యక్త మొనర్చినాఁడు. వేదవిహిత కర్మాచరణ పూర్వకము కాని వీరశైవ బౌద్ధాదుల జ్ఞానము, ఎండమావులలో నీరువలె, ఆభాస మాత్రమే కాని దప్పి తీర్చి తృప్తి కలిగించుటకు సమర్థము కాదని స్పష్టమగుచున్నది. ఉపలాలితుండగు డింభకుండు మహాపదార్థంబు వేఁడువిధంబున తాను బ్రహ్మానందస్థితిని గోరఁగా నాలోకేశ్వరుఁడు దానిని వెంటనే ప్రసాదించెనని ఆయన చెప్పెను. దీనివలన శ్రోత్రియునకు బ్రహ్మానందస్థితి సులభమని వ్యక్తమగుచున్నది. తైత్తిరీయోపనిషత్తునందు ఆనందమీమాంసకలదు. అందు మానుషానందమునుండి హిరణ్యగర్భుని యానందమువఱకు ననేకము లగునానందపరిమాణములు లెక్కింపఁబడినవి. ఈ యానందము లన్నియు అకామహతుఁడైనఁ శ్రోత్రియున కెల్లప్పుడును సిద్ధములై యుండునని చెప్పఁబడియున్నది. ఈ వేదాంతరహస్యమే యీ పీఠికయందు వ్యక్తము కావింపఁబడినది.

ఇట్టిపరిణామమే ఆయనకు సాహిత్యపర్యాలోచనము నందును కలిగినది. విరాటపర్వారంభమున వేదవ్యాసు నత్యంతభక్తితో స్తుతించెను. మఱియును సాత్యవతేయ సంస్కృతి శ్రీవిభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వదీక్షావిధినొంది పదునేనుపర్వములను పుణ్యప్రబంధములుగా దేవసన్నిధియందు ప్రశంసించుట యను నొక యారాధన విశేషముగా రచింతుననియు ఆయన చెప్పెను. దీనివలన ఆయన యీ మహాభారతనిర్మాణమును కవితావిలాసముగాఁ గాక, వాఙ్మయంబైన యొక మహాయజ్ఞమునుగా భావించెనని స్పష్టమగుచున్నది. కావుననే యజ్ఞమునందువలెనే యీ కావ్యనిర్మాణమున ఆయన దీక్షావిధిని స్వీకరించెను. యజ్ఞదీక్షనొందినవాఁడు ఆ దీక్ష ముగియువఱకు కార్యాంతరమును తలంపక యజ్ఞప్రదేశమును వీడక యజ్ఞకార్యములందే నిమగ్నుఁడై యుండును.

ఉత్తరరామాయణ రచన పరిస్థితి యిట్టిదికాదు. అపుడు మంత్రాంగ కార్యముల నిర్వహించుచు నప్పుడప్పుడు విలాసముగా కావ్యరచనము గావించి యుండును. ఇప్పటికి రాజ్యాంగకార్యము లన్నియు కాలవశమున, దూరమై వదలి పోవుటచే, మనుమసిద్ధి గణపతిదేవుఁడు నొసంగినయగ్రహారములు జీవనమునకు పర్యాప్తములై, సకల సంసారమున గాఢమగు విరక్తి కలుగుటచేతను తిక్కనా ర్యుఁడు సకలలోక వ్యవహారములకు దూరుఁడై ఆంధ్రమహాభారత నిర్మాణైకలక్ష్య మున నిమగ్నుడయ్యెను. అప్పుడాయనకు ఉపాస్యమగు హరిహరనాథరూప పరతత్త్వము ఉపాసనారూప మగు భారతరచనము తప్ప మఱియొకటి భాసించి యుండదు.

నన్నయభట్టారకుని విషయమునను ఆయన దృక్పథము పూర్తిగా మారెను. "వచనము లేకయు వర్ణన రచియింపఁగఁ గొంతవచ్చుఁ బ్రౌఢులకు" అని యుద్ఘాటించిన యితఁడు మహాభారత విషయమున "పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్" అని చెప్పుట గమనింపఁదగియున్నది. సాధారణముగా కావ్యమును రచించునప్పుడు పద్యముల గద్యముల రచియింతు నని విశేషించి చెప్ప వలసిన యావశ్యకతయేమున్నది? కాని యిచ్చట తిక్కనార్యుఁడు తాను మొదట భట్టారకుని పద్ధతిని వదలి, సంస్కృతపద్యకావ్యమార్గము ననుసరించి యుత్తరరామా యణమును రచించియుండుటవలన, కాలక్రమమున తనకేయది తృప్తికరముగా తోఁచక పోవుటవలన, ఇప్పుడీమహాభారతము నింక నిర్వచముగ వ్రాయఁ దలంపక, భట్టార కుని పద్ధతియందు పద్యగద్యములతోనే రచింతునని చెప్పుచున్నాఁడు. సంస్కృతమున నిర్వచనముగ నున్నకావ్యము లన్నియు పండితులగు సహృదయుల కొఱకుద్దేశింపఁ బడినవే. ప్రజానీకమునకై యుద్దేశింపఁబడిన రామాయణము, మహాభారతపురా ణాదులు శ్లోకమయములుగ నున్నను, ప్రాయికముగా నవి యనుష్టుప్ఛందమున నుండుటవలన, అందు ప్రౌఢశైలి కవకాశము లేకుండుటచే వాని ప్రచారమున కంత రాయము కలుగలేదు. తెలుఁగున మొదటినుండియు కావ్యరచనమున ఉత్పలము, చంపకము, శార్దూలము మొదలగు వృత్తములు, సీసము, తరువోజ మొదలగు దేశీయ చ్ఛందములును సిద్ధములై యుండుటవలన, అవి పెద్ద పద్యములగుటచే వానియందు దీర్ఘసమాసములకు ప్రౌఢశైలికి నవకాశ మెక్కువగ నుండెను. అట్టి పద్యములతో నిర్వచనముగా కావ్యరచనము చేయఁబూనినచో సాధారణ సహృదయములకు అర్థ గ్రహణము క్లేశావహమగుట సహజము. సామాన్యముగా వచనముకన్న పద్యము

అర్థగ్రహణమున నెక్కువ యవధానము నపేక్షించును. అట్టియెడ నిర్వచనమగు పద్య కావ్యమును నిరంతరమగు నవధానముతో వినుచు నభినందింపఁ గల్గుట సాధారణ ప్రజానీకమున కసంభవము కాదు. కావుననే పండితపామరరంజకములగు పురాణప్రవచనాదులందు పౌరాణికులు పద్యములఁ బఠించుచు వెంటనే వచనమున వివరించుచుందురు. ప్రజలయందలి యీ యభిరుచిప్రకారమును నన్నయభట్టారకుఁడు అమోఘమగు లోకజ్ఞతతో గుర్తించి విశిష్టమగు చంపూపద్ధతి నాంధ్రము నందు ప్రవేశపెట్టెను. సంస్కృతమున చంపువులందు గద్యము ప్రధానమై యెడనెడ పద్యములు కూర్పఁబడుచుండును. భట్టారకుఁడు పద్యగద్యములకు సమప్రాముఖ్యము నొసంగెను. ఆయన విషయమును భావించునప్పుడు అదియే భావప్రాదుర్భావమును బట్టి పద్యముగనో గద్యముగనో రూపొందుచుండును.

ఒకవిధమగు విషయమును పద్యమునఁ జెప్పవలయునని, మఱియొకవిధమగు విషయమును వచనమునఁ జెప్పవలయునని యాయన తలంచినట్లు కన్పడదు. కావున ఆయన రచనమున పద్యగద్యములు పడుగుపేకవలెఁ గలిసిపోయి శైలికి సహజత్వమును ప్రసన్నతను గలిగించుచున్నవి. తిక్కనార్యుఁ డీరహస్యమును గుర్తించి భట్టారకుని యాంధ్రకవితామర్మజ్ఞతను గొనియాడుచు ఆయనను ఆంధ్రకవితావిశారదుఁడని ప్రశంసించెను. మహాభారతమును రచింపఁదలంపు గలిగిన పిమ్మట సోమయాజికి భట్టారకకృత మగుపూర్వగ్రంథ మేరీతిని రచింపఁబడినదని తెలిసికొనవలసిన యావశ్యకత యేర్పడియుండును. అప్పుడాయన ఆ గ్రంథమును అత్యంతశ్రద్ధతోఁ బరిశీలించియుండును. దానివలన మొదట గోచరింపని భట్టారకుని మహత్త్వాంశము లనేకములు భాసించి యుండును. నన్నపార్యునందలి యవిరళజపహోమతత్పరత్వము, విపులశబ్దశాసనత్వము సంహితాభ్యాసము, బ్రహ్మాండాది నానాపురాణవిజ్ఞాననిరతియు నుద్దేశించి, తిక్కనార్యుఁడాయనను విద్యాదయితునిగా కొనియాడెను, అనఁగా కవిబ్రహ్మయని స్తుతించెనన్నమాట. "ద్వైపాయనముని వృషభాభిహిత మహాభారతబద్ధ నిరూపితార్థమును" జగద్ధితంబుగఁ దెనుఁగున రచింపఁబూనిన భటారకున మహనీయత నుద్దేశించి, తిక్కనార్యుఁ డాయనను మహితాత్ముఁడని ప్రస్తుతించెను. ఆయని మూఁడుకృతులను దక్షతతో నొనర్చెనని చెప్పి, తాను గాని మఱియొకరుగాని పూర్వభాగములను మరల వ్రాయనక్కఱలేదని స్పష్టమొనరించెను.

ఉ॥ ఆదరణీయ సార వివిధార్థగతి స్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణ సంభృతమై పెనుపొందియుండ నం

దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యాదయితుండొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్ ॥
(విరాటపర్వ, ప్రథమాశ్వాస - ప. 6)

ఇట్లు పూర్వకవి యొక్క మహత్త్వమును నిశితముగఁ బరిశీలించి గుర్తించి నిస్సంకోచముగ ప్రశంసింపఁగల్గుట ఆయన మహనీయతకు మహోజ్జ్వలనిదర్శనముగా నున్నది.

పూర్వులైన మహాకవుల ప్రతిభామహత్త్వములను గుర్తించుటవలన తిక్కనార్యునియందు యథార్థ విద్యావిజ్ఞానఫలముగా, "అమలోదాత్త మనీష నేనుభయకావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుఁడం గళావిదుఁడ......" అని చెప్పికొన్న యహమిక యంతరించి, యిందు, "నా, నేర్చినభంగిఁ జెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్" అని వినయసంపత్తి విలసిల్లెను. మఱియును ఉత్తరరామాయణరచనా కాలమున కాయన, "మెచ్చుబుధజనము కృతిన్" అని, "సరసులైన కవులచెవులకు నెక్కినఁ గాని సమ్మఁడెందుఁ బరిణతి గలుగు కవీశ్వరుండు" అని, "సూరుల కివ్విధ మింపుఁ జెంపదే" యనియు పండితులను కవులను మెప్పించుటకు మాత్రమే ఆయన పూనుకొనియుండెను. ప్రజానీకమున కంతకును ప్రబోధము కాని ప్రమోదము కాని కలిగింపవలయు ననుతలంపే ఆయన కప్పటికి కలుగలేదు. ఇప్పుడు జనాభ్యర్చిత మైనభారతమును "ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ" రచించుటకు సంకల్పించెను. ఇట్లాయనయందు పెంపొందిన చిత్తవికాసౌన్నత్యములే విరాటపర్వాది గ్రంథ ప్రచార ప్రథానములకు హేతువులని చెప్పవచ్చును.

నన్నయభట్టారకుఁడు మూఁడుకృతులు రచించెనని యాయన చెప్పుట వలన, అప్పటికి అరణ్యపర్వము సమగ్రముగనే యుండెనని కొందఱు భావించుచున్నారు. కాని అప్పటివఱకును సమగ్రముగనేయుండి తిక్కనగారు పైపర్వములు రచించినపిమ్మట నేఁబదియేండ్లలోనే యది కొంతభాగము నశించినదనుట యుక్తిసహముకాదు. మఱియును, "విరచించె శబ్దవైచిత్రి నరణ్యపర్వము నశేషము" అని ఎఱ్ఱాప్రగడనుగూర్చి ప్రశంసించెను. శైలియందును శేషభాగమున నన్నపార్యుని రచనాపద్ధతికి భిన్నమగుభావవిస్ఫూర్తి స్పష్టముగా కన్పించుచున్నది. కావున అసమగ్రముగ నన్నపార్యునిచే వదలివేయఁబడిన యరణ్యపర్వమున శేషభాగము ఎఱ్ఱాప్రగడ రచించి పూరించెననుట నిశ్చితము. ఇంక తిక్కనార్యుఁడు

మూఁడుకృతులనుట యుపలక్షణమాత్రమే. సాహిత్యమున లెక్కలలోవలె అరలు ముప్పాతికలు పేర్కొనుట సగసము కాదుకదా! అట్లగుచో తిక్కనగారే ఆభాగము నేల పూరింప లేదను ప్రశ్న యుదయించును. దానికి పూజ్యపాదులు శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు సరసమగు సమాధానముఁ జెప్పిరి. ఆరణ్యపర్వము నారంభించిన భట్టారకుఁడు దానిని రాజరాజనరేంద్రుని కొఱకై యుద్దేశించెను. విరాట పర్వాదికమైన గ్రంథమును హరిహరనాథాంకితముగా రచింప సంకల్పించిన తిక్కన్నగారు, పూర్వమే యొకనికి నివేదితమై యుండిన గ్రంథభాగమును పరమేశ్వరోద్దిష్ట మగు రచనమునఁ జేర్చుట కిచ్చగింపక వదలివేసిరని వారు చెప్పిరి. మఱియును ఇంకొక కవి యెవరైన దానిని పూరింపవలసి వచ్చినచో భట్టారకుని రచనముగనే రాజరాజాంకితముగనే వెలయించుట తగునని యు తిక్కన్నగారు "మూఁడుకృతు" లనుమాటలో సూచించెననియుఁ జెప్పవచ్చును. దీనిని గ్రహించియే ఎఱ్ఱనార్యుఁడు ఆభాగమును "తద్రచనయకా" రచించి రాజరాజాంకితముగనే వెలయించెను.

కావ్యశిల్పమున ఉత్తరరామాయణ రచనమునకు విరాటపర్వారంభపద్ధతికిని హెచ్చుగా భేదము కన్పింపదు. పదునేనుపర్వములను ప్రబంధమండలిసగాఁ దీర్పవలయుననియే ఆయన సంకల్పించెను. ఈ ప్రబంధప్రక్రియ కావ్యాదర్శమున దండాచార్యుఁడు నిర్దేశించిన సర్గబంధరూపమగు మహాకావ్యపద్ధతి యనియే తలంపవచ్చును. ఆయన మహాకావ్యలక్షణమునందు నగరార్ణవశైలాదివర్ణనమునకు ప్రాముఖ్యము నొసంగెను. ఆయన రచించిన దశకుమారచరిత్రమును కేతన యాంధ్రీకరించుటవలన దానిని తిక్కనార్యుఁ డంకితముగొనుటవలనను వారికి దండచార్యుని యందు గౌరవాదరములు హెచ్చుగానుండెనని వ్యక్తమగుచున్నది. కావున తిక్కనార్యుఁడాయన నిర్దేశించిన మహాకావ్యమార్గమును వెనుఁగొనఁ దలంచుట యెంతయు సమంజసము. దీనివలన భట్టారకుని యనువాదపద్ధతికిని తిక్కనార్యుని రచనావిధానమునకు భేదము హెచ్చుగా నేర్పడెను. నన్నపార్యుఁడు వ్యాసభట్టారకుని తాత్పర్యమును ప్రసన్నకథాశైలిలో సంగ్రహముగాఁ జెప్పఁబూనెను అనఁగా ఆయనరచనయందు కావ్యశిల్ప మంతర్వాహినిగ నున్నను మహాభారతకథ యితిహాసముగనే రూపొందెను. తిక్కనగారు కథలోని యొక్కొక్కభాగము నొక ప్రబంధమునుగా చిత్రింప దలంచుటవలన విషయమున విస్తృతియు శైలియం దుజ్జ్వలతయుఁ బెంపొందెను. ఇది విరాటోద్యోగ పర్వములందు స్పష్టముగా కన్పించుచున్నది. నన్నయభట్టారకుఁడు సుమారు పదివేలశ్లోకములు గల యాదిపర్వమును

రెండువేలతొంబది గద్యపద్యములలోను, సుమారు నాలుగువేల మూడునూండ్ల శ్లోకములుగల సభాపర్వమును ఆఱువందల పదునెనిమిది గద్యపద్యములలోను నిర్వహింపఁగా, తిక్కనార్యుఁడు సుమారు మూఁడువేలయైదునూండ్ల శ్లోకములుగల విరాటపర్వమును పదునాఱువందల యిరువదినాల్గు గద్యపద్యములలో విస్తరించెను

తనకు లభించిన సంస్కృత మహాభారత ప్రతియందలి పర్వానుక్రమణికను శ్లోకసంఖ్యను నన్నయభట్టారకుఁడు పేర్కొనియుండెను. భట్టారకునకు లభించిన ప్రతివంటిదే తిక్కనార్యునకును లభించియుండునని మనము తలంపవచ్చును. కావున భట్టారకుఁడు అయిదాఱు శ్లోకముల కొక పద్యమునుగా రచింపఁగా, తిక్కనార్యుఁడు రెండు శ్లోకములకే యొకపద్యమును రచించువాఁడయ్యెను. భట్టారకుఁడే రచించినచో విరాటపర్వము ఏడెనిమిదవందల పద్యగద్యములలో నేర్పడియుండవచ్చును. దీనినిబట్టి తిక్కన మూలము నెంతగాఁ బెంచెనో యూహింపవచ్చును.

## iv

అనువాదరచనమును బట్టి కవియొక్క కావ్యకళాకౌశలమును నిర్ణయించుట కష్టసాధ్యము. ప్రతిపదమునను మూలమున నున్నకళాసంపత్తి ఎంత, అనువాదకుఁడు దానికి స్వయముగాఁ జేర్చినది, యెంతఅనునది ప్రబలసమస్యయగును. కావున ప్రతి ఘట్టమును మూలముతో పోల్చి పరిశీలించుచున్ననే గాని యనువాదకుని కళా కౌశలస్వరూపము గోచరము కాదు. లేకున్నచో మూలమునందే సిద్ధమై యున్న సౌందర్యసృష్టి యంతయు నొకప్పుడనువాదకుని ప్రతిభా మహత్త్వముగనే భ్రమించుట కవకాశమేర్పడుచుండును. ఇది మహాభారతాంధ్రీకరణ విషయమున నెంతయు జటిలమగు సమస్య. సంస్కృతమహాభారతము కేవల మితిహాసముకాదు; కవివృష భులు మహాకావ్యమని కొనియాడు చుండినట్టిది. తత్కర్త యగు వ్యాసభట్టారకుఁడును కేవల సంయమికాదు, భవ్యకవితా వేశుఁడు. బహురసనిరంతర మైనయితివృత్తము, ఆసేతుహిమాచలము ఆబాలగోపాలముగా ప్రసిద్ధములైన చిత్రచరిత్రములగు పాత్ర ములు, శ్రుతిస్మృతి విజ్ఞాన సర్వస్వసారరూప మగు ధర్మతత్త్వ ప్రబోధమును మూలమునందే సిద్ధములు. కాని యివి యన్నియు కేవల శ్లోకానువాదమున మఱి యొక భాషలోని కవతరింపవు. వీనిని అనువాదకుఁడు మిగుల గాఢముగ భావించి, మూలమును రచించిన మహర్షి యొక్క భవ్య కవితావేశమును విజ్ఞానమయత్వమును ప్రాపించిన చిత్త సమాధియందు భాషాంతరమున పునర్నిర్మించిననే వానికి జీవము

తేజమును సంక్రమించును. ఇది తాజ్‌మహల్ వంటి మహాభవనమును జూచి యట్లే మఱియొక భవనమును నిర్మించుటవంటిది. భవనరూపమును, కళావిన్యాసము కనులయెదుటఁ గన్పించుచున్నను మరలఁ బునాదులనుండి శిఖరపర్యంతము కుడ్యములు ద్వారములు మొదలుగా సర్వము తయారుచేసికొన వలసినదే కదా. అట్లే మహాకావ్యానువాదమునందును మూలములోని విషయముల నన్నింటిని మరల నిర్మింపవలసియే యుండును. ఇట్టి పునర్నిర్మాణమున తిక్కనార్యుఁడెట్టిపద్ధతుల నవలంబించెనో పరిశీలించినచో ఆయన కవితా మహత్త్వమును శేముషీవైభమును గుర్తింపవచ్చును. ఈ పరిశీలమున అనువాదమును మూలముతో పోల్చుట యావశ్యకము. కాని తిక్కనార్యునకు లభించిన సంస్కృతమూలము మన కిప్పుడు లభించుట దుర్ఘటము. ఆయన యిచ్చటి వాఁడు కాబట్టి యీప్రాంతమున లభించు దాక్షిణాత్య ప్రతులు ఆయనప్రతికి కొంతవఱకు సన్నిహితములుగా నుండవచ్చును. కాని వీని యందొక చిక్కు కలదు. తిక్కన యనువాదము ప్రసిద్ధమైనతరువాత ఆయనరచనలో రసవంతములుగా నేర్పడిన యంశములను మూలమునలేనివాని కొందఱు సంస్కృతీకరించి మూలమునఁ జొప్పించియుండుట సంభవమని నేటివిమర్శకులనేకులు భావించుచున్నారు. అయినను వావిళ్ల ముద్రణాలయము వారు తెలుగు లిపియందు ముద్రించిన గ్రంథము కుంభకోణప్రతిని నాధారముగాఁజేసికొని స్థూలముగఁ బరిశీలించినను కొంతవఱకు తిక్కనార్యుని యనువాదవిధానమును కవితాకౌశలమును గుర్తింపవచ్చును.

అనువాదరచనమునకు తిక్కనార్యుఁడు విరాటప్రారంభము నుండి తుదివఱకును అనేకపద్ధతుల నవలంబించెను. శైలియందును క్రమపరిణామము కన్పించుచున్నది. ఆయన కొన్నియెడల రేఖామాత్ర చిత్రములుగ నున్న సన్నివేశములను వివిధాలంకారశోభితములుగా వర్ణపూర్ణోజ్జ్వలములుగ దీర్చిదిద్దెను. సంబంధము స్పష్టముగా కన్పింపని కొన్ని సన్నివేశములకు సందర్భములకు కార్య కారణభావమును వ్యక్తమొనరించి చక్కని కూర్పును కలిగించెను. పాత్రల ప్రసంగములలో నున్నపునరుక్తులను బరిహరించి సారరూపమున సంగ్రహించి సంవాదములకు సరళత్వమును సరసత్వమును బెంపొందించెను. కథాకార్యప్రసారమునకు అడ్డుతగులుచు విపులముగనుండు వర్ణనములను తగ్గించి కథనమునకు వేగమును కలిగించెను. ఇట్లు కథాగమన మవ్యాహతముగ సాగించుటకొఱకే కాఁబోలు ఆయన ప్రముఖులగు ధర్మతత్త్వప్రసంగములను సైతము కొన్నియెడలఁ దగ్గించి మఱికొన్ని యెడల

బూర్తిగా వదలివేసెను. ఈపద్ధతుల వలననే మూలమున విసుగును కలిగించు చుండు ననేకసందర్భములు తెలుగునఁ కథాగమున సుందరములై, రంగస్థలమున దృశ్యములవలె నిరంతర రసపారవశ్యమును గలిగించుచున్నవి.

"ఆంధ్రభారత కవితావిమర్శన" మను గ్రంథమున శ్రీకోరాడ రామకృష్ణయ్యగారు సంస్కృతములోని ప్రతులను బెక్కింటిని పరిశీలించి తిక్కనార్యుని విరాటపర్వమును మూలముతోఁ బోల్చుచు ఆయన విశిష్టముగా వెలయించిన ప్రబంధ పద్ధతులను సాకల్యముగా వివరించిరి. ఇందు తిక్కనార్యుఁడు రేఖామాత్రములుగ నున్న పాత్రల యాకారేంగితాదులను, మానసిక సంఘర్షణములను, సంవాదములను, ప్రకృతిదృశ్యములను చక్కని వర్ణములతోఁ దీర్చి దిద్ది మూలకథను బహువిధముల శోభింపఁజేసెను. ఈపర్వమునందాయనకు ప్రత్యేకమగు నభిమానమున్నట్లు "హృదయాహ్లాది" "ఊర్జితకథోపేతంబు, నానారసాభ్యుదయోల్లాసి" అను విశేషమువలన వ్యక్తమగుచున్నది. కావుననే యిది యైదాశ్వాసముల ప్రబంధముగా రూపొందినది. ఇందు ప్రారంభమున జనమేజయుఁడు కావించిన ప్రశ్నయే వస్తునిర్దేశమువలె నెంత సాభిప్రాయముగా నున్నదో గమనింపుఁడు.

చం॥ మహిత సముజ్జ్వలాకృతులు మానధనుల్ జనసామ్య లంగనా
సహితము గాఁగ నేమిగతి సమ్యగుపాయ నిగూఢవృత్తిమై
యహితుల కప్రభేద్యమగు నాహవమూఁ డగునేఁడు మత్పితా
మహులు చరించి రంతయుఁ గ్రమంబున నాకెఱుఁగంగఁ జెప్పుమా. (I-44)

ఇందు "అంగనాసహితు" లనుటవలన ద్రౌపది వెంట నుండుటవలన కష్టము, ఆమెకుఁ గలుగనున్న పరిభవమును సూచింపఁ బడినది. "మానధను లనుట" వలనఁ గీచకసంహారమును సూచింపఁ బడినది. దీనికిఁ గలమూలమెంత నిర్విశేషముగ నున్నదో పరిశీలింపుఁడు. "మాపితామహులు దుర్యోధనుని వలనిభయమున విరాటనగరమున నెట్లజ్ఞాతవాసమును గావించిరి?"

శ్లో॥ కథం విరాటనగరే మమపూర్వ పితామహాః।
అజ్ఞాతవాస ముషితాః దుర్యోధన భయార్దితాః॥ (1 అధ్యా.శ్లో. 2)

విరాటనగరముఁ జేరవచ్చునప్పుడు ద్రౌపది మిక్కిలి పరిశ్రమమునొంది నేనింక నడువలేనని చెప్పెను. ఆ చెప్పుటలో ఆమెయొక్క సౌకుమార్యమును, అప్పుడు కలిగిన కష్టస్థితిని తిక్కనార్యుఁ డెట్లు చిత్రించెనో చూడుఁడు.

ఉ॥ డప్పి జనించె వ్రేళులపుటంబులు పొక్కఁ దొడంగె గోళ్లలోఁ
జిప్పిలఁ జొచ్చె నెత్తురులు చిత్తమునాకుఁ గడున్ వశంబుగా
దప్పుర మిచ్చటచ్చటను నాసలవచ్చితి నెంతదవ్వొకో
యిప్పటిభంగి నొక్కఁడుగు నేఁగెడిదానికి నోర్వనెమ్మెయిన్॥ (I-148)

ఇందులకు మూల మెట్లున్నదో చూడుఁడు. "విరాటునిరాజధాని ఇంకను దూరమున్నట్లే తోచుచున్నది. కాని నాకుఁ బరిశ్రమము అధికముగానున్నది. కావున ఈరాత్రి యిచ్చటనే నివసింతము"

శ్లో॥ వ్యక్తం దూరే విరాటస్య రాజధాని భవిష్యతి।
వసామేహాపదాంరాత్రిం బలవాన్ మే పరిశ్రమః॥

(అధ్యా. 5. శ్లో. 7)

కథలో కీచకుని ప్రవేశపెట్టునప్పుడే తిక్కనగారు వానిశీలమును నాలుగు విశేషణములతోడనే చిత్రించెను. ఇవి మూలమున లేవు. "రూపాభిమానియు, నానాభరణధరణ శీలుండును, దుర్విదగ్ధుండును, బలగర్వితుండును నగుసింహబలుండు", ఇట్లు చిత్రించుట కథమున నొకకౌశలము. (II-22)

కీచకుఁడు ద్రౌపదినిజూచి కామించి తపించుఘట్టమున తిక్కన వాని కామవికారవిశేషములను, ద్రౌపదియందలి భయసంభ్రమములను సూక్ష్మముగా క్రమపరిణామమున వర్ణించెను. ఇట్లే యద్యానసనమున వాఁడు విరహమునొంది ద్రౌపదిని గూర్చి బహువిధముల భావించుటయును తిక్కన యిరువదినాయిగు గద్యపద్యములలో చిత్రకల్పనములతో వర్ణించెను. కాని శ్రీ అక్కిరాజు ఉమాకాంతముగారు పలనాటి వీరచరిత్ర పీఠికయందు ప్రస్తావవశమున నుద్ఘాటించినట్లు, మూలమున లేని యీవిజృంభణ మంతయు అనుచితమని చెప్పవలసియున్నది. సౌందర్యవతులగు పతివ్రతలఁ గూర్చి దుర్జను లనేకవిధముల భావించుకొనుచుండుట లోకవర్తనమున నెంతవెగటుగా నుండునో కావ్యజగత్తునందును అట్లే యనుచితము. ఈకారణము ననే కదా సుహిళల విషయమున భంగపాటుకలిగినపుడు దానికి గూఢప్రతీకారము నన్వేషింతురే కాని మాసధనులు వాకొనుటకైనను పూనుకొనరు. అట్టియెడల మహాపతివ్రతలఁ గూర్చి నీచప్రసంగములను భావకల్పనములను విస్తరించుట వేఱుగాఁ జెప్పనక్కఱలేదు. మఱి యనౌచిత్యముకన్నను రసభంగహేతువు సాహి

త్యమున మఱియొకటిలేదు. ఆనందవర్ధనుఁడు ధ్వన్యాలోకమున నిట్లేగదా చెప్పెను. "అనౌచిత్యముకన్నను రసభంగకారణము వేఱొండులేదు. ప్రసిద్ధమగు నౌచిత్య బంధము రసమునకుఁ బరమగు నుపనిషత్తు".

శ్లో॥ అనౌచిత్యా దృతే నాన్య ద్రసభంగస్య కారణమ్।
ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోపనిషత్ పరా॥

(తృతీయోద్ద్యోతము - పరికరశ్లోకము.)

కీచకుఁడు సుధేష్ణతో ద్రౌపదిని వర్ణించి తన తలంపును వివరించుట ఆమె తమ్మునివారించుటకై యాతనియొద్దఁగల శృంగారవతుల విలాసములను వర్ణించి చెప్పుటయు సమంజసములుగా దోఁచుట లేదు. శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారును ఇట్లే తలంచిరి. "కులీన యగుస్త్రీ, ఉదాత్త చిత్త యగువనిత తమ్మునితో నిట్లుపలుకు ననుట మాత్రము సంభావ్యముగాఁ గనఁబడదు."

(ఆంధ్రభారత కవితా విమర్శనము - పే. 299)

ఇది ఉదాత్త చిత్తలయందే కాదు సాధారణ స్త్రీలయందును సంభావ్య మని చెప్పజాలము.

తిక్కనార్యుని మనస్తత్త్వచిత్రణకౌశల మీ పర్వమున ననేకవిధములఁ జరితార్థమైనది. సుధేష్ణ కీచకునింటికిఁ బొమ్మని చెప్పినప్పుడు ద్రౌపదికి కలిగిన సంకట స్థితిని ఆయన యెట్లు చిత్రించినో చూడుఁడు.

ఉ॥ ఉల్లము దల్లడిల్లఁ దను వుద్గతఘర్మజలంబుఁ దాల్చుచున్
డిల్లపడంగ నాకిది గడించివిచారముపుట్టె నందుఁ బో
నొల్ల ననంగరా దచటి కూరక పోవఁగరాదు నేర్పునం
దిల్లఁగ దీనిఁ బాపికొను దీమస మెట్టిది యొక్కొ దైవమా. (II-71.)

ఇందులకు మూలమున నింతమాత్రమే కలదు "ఓ రాజపుత్రి! నేను వాని యింటికిఁ బోను"

శ్లో॥ "నగచ్ఛేయ మహం తస్య రాజపుత్రి నివేశనమ్"

(అధ్యా. 17-శ్లో. 10)

తరువాత నామె సుధేష్ణను తమయొప్పందమును గూర్చి యడుగుచు నిది యన్యాయమని చెప్పుటయు, సుధేష్ణ ధూర్తప్రాగల్భ్యము నవలంబించి స్నేహధర్మ

మున మొగమోట బెట్టుటయు, తిక్కనార్యుని కల్పనములే. ద్రౌపది సుఖనిద్రసేయు చున్న భీమునియొద్దకుఁ బోయి యాతని నెత్తిపొడుచుట మిగుల సహజముగా నున్నది.

ఉ॥ నన్ను బరాభవించి సదనంబునకుంజని కీచకుండు ము
నున్న తెఱంగు దప్పక సుఖోచిత శయ్యను నిద్రసేయ నీ
కన్ను మొగుడ్చు నూఱటకుఁ గారణమెయ్యది భీమసేన మీ
యన్న పరాక్రమంబు వలదన్న నొకో దయమాలితక్కటా. (II-166.)

తుదిమాటగా నామె యాతనిని మందలించుటయు ఆమె దయనీయతకు, రాజసమునకు, స్త్రీస్వభావమునకు నెంతయుఁ దగియున్నది.

ఉ॥ అక్కట మోసపోయి యడియాసలఁ జావకయున్నదాన ము
న్నొకరునిన్ దురంత దురితోత్కట బాధలఁ బెట్టియున్న నా
కెక్కడి దుఃఖశాంతి కడయెద్దుట యెమ్మెయిఁ గల్గి నేర్చు మీ
ముక్కున నూర్పుగల్గ నొకమూర్ఖునిచేఁ బడితిన్ సభాస్థలిన్.

తే॥ వానిఁ దెగజూడవైతేని వాయుపుత్ర నీవుఁ గనుఁగొన నురినైన నీరనైన
నగ్నినైన విషంబున నైననేను మేనుదొఱఁగదు నెట్టునీయాన సుమ్ము.

దీనికి మూలమున నిట్లుకలదు. "వాఁడు జీవించియుండఁగా రేపు సూర్యుఁ డుదయించు నేని, విషమును త్రాగుదునుగాని నాకికి లోఁబడను. అంతకన్నను నీయెదుట మరణించుట నాకు శ్రేయము గదా!

శ్లో॥ తంచే జీవంత మాదిత్యః ప్రాతరభ్యుదయిష్యతి।
విషమాలోడ్య పాస్యామి మాకీచక వశంగమమ్।
శ్రేయో హి మరణం మహ్యం భీమసేన తవాగ్రతః॥ (2-48, 49)

ఆమె సహదేవునిగూర్చి భీమునకుఁ జెప్పినప్పుడు మాటలలో కుంతీదేవి యొక్క మాతృప్రేమ, అత్తకోడండ్రకుఁ గలయున్నట్టి విశ్వాసము ఎంత కరుణ రమణీయముగఁ జిత్రింపఁబడినదో చూడుఁడు. మూలమున నీభావమున్నను ఇంత రమణీయముగ లేదు.

చం॥ కడుపసిబిడ్డ వీడొకటి కాదవునా నెఱుంగడు ముందరె
య్యెడ నొకపాటెఱుంగఁ డెదయెంతయుఁ గోమల మెప్పుడైన నేఁ
గుడువఁగఁ బిల్తుగాని తనకుంగలయాఁకటిప్రొద్దెఱుంగఁ డీ
కొడుకిటు పోకకున్ మనము గుందెడు నిన్గని యారడిల్లెడిన్. (11-213)

v

ఎఱ్ఱనార్యునకు, శ్రీనాథాది ప్రబంధకర్తలకును మార్గదర్శకము లైన కావ్యశిల్పపద్ధతు లనేకములు ఇందు కలవు. వ్యక్తిని వర్ణించునప్పు డాతని గుణములను క్రమముగా వివరించుచు, ఈగుణములన్నియు నెవనికిగలవో యాతఁడు సామాన్యుఁడగునేయని ముగించుట యొకవిధమగు కౌశలము. ధర్మజునిగూర్చి ద్రౌపది గావించిన వర్ణన మిట్టిది.

సీ॥ ఎవ్వనివాకిట నిభమదపంకంబు రాజభూషణ రజోరాజి నడఁగు
నెవ్వాని చారిత్ర మెల్లలోకములకు నొజ్జయై వినయంబునొఱపు గఱపు
నెవ్వానికడకంట నివ్వటిల్లెడు చూడ్కి మానితసంపద లీనుచుండు
నెవ్వానిగుణలత లేడువారసుల కడపటికొండపైఁ గలయఁ బ్రాఁకు
తే॥ నతఁడు భూరిప్రతాప మహాప్రదీప దూర విఘటిత గర్వాంధకార వైరి
వీరకోటీరమణి ఘృణివేష్టితాంఘ్రి తలుఁడు కేవల మర్త్యుడె ధర్మసుతుఁడు.
(II-191.)

సందర్భోచితముగా సూర్యోదయాది దృశ్యములఁ జిత్రించుచుఁ బ్రకృతి యందలి విశేషములను ఉత్ప్రేక్షాద్యలంకారములతోఁ బద్యములందుఁ దీర్చిదిద్దుచు, నుదారముగ వచనరచనము గావించుటయు తిక్కనార్యుఁడు చక్కఁగాఁ బ్రవేశ పెట్టెను. ద్రౌపది భీమునియొద్దకుఁ బోయి తిరిగివచ్చిన పిదపఁ బ్రభాతంబయ్యెను. దానిని తిక్కనార్యుఁ డత్యుజ్జ్వలముగ వర్ణించెను. ఇది మూలమున లేదు.

సీ॥ నీరజాకరములు నిష్ఠమైఁ జేసిన భవ్యతపంబుల ఫలమనంగ
దివసముఖాభినందిత చక్రయుగ్మకంబుల యనురాగంపుఁ బ్రోవనంగ
హరిహరబ్రహ్మ మహానుభావంబు లొక్కటిగాఁగఁ గరఁగినగట్టి యనఁగ
నతుల వేదత్రయ లతికాచయము పెనుపొందఁ బుట్టెడు మూలకందమనఁగ
తే॥ నఖిల జగముల కన్నెఱయగుచు జన సమాజకర పుటహృదయ సరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొనర్చి భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె.
(II-241.)

సీస పద్యమున చరణములు నాలుగును శబ్దార్థసమృద్ధములై సమాన స్థాయిలో నాలుగు గుఱ్ఱములవలె నడుచుచుండఁగా, వాని కన్నింటికి నాయక మగు వర్ణ్య వస్తువు రథము నధిష్ఠించివచ్చు మహావీరునివలె నెత్తుగీతియందు నుజ్జ్వలముగా

ప్రత్యక్షమగును. ఎఱ్ఱనార్యుఁ డీ శిల్పమును గ్రహించి పెంపొందించెను. శ్రీనాథుఁడు దీనిని రాగతాళలయాన్వితముగ కదను త్రొక్కించెను. మనుచరిత్రపీఠికలోని "కలశపాథోరాశి గర్భవీచిమతల్లి" మొదలగు పద్యములకు ఈ శిల్పమే జీవము. తిక్కనార్యునకుఁ బూర్వము నన్నపార్యుఁ డీ పద్యశిల్పము నంతగాఁ బాటింపలేదు. నన్నెచోడుఁడు ఇట్టి పద్యరచనాకౌశలమునకు, ప్రబంధశిల్పమునకుఁ బాటుపడినను అది తరువాతికవుల నాకర్షించి వారికి మార్గదర్శకము కాఁజాలకపోయెను. కేతన గావించిన ప్రయత్నము తిక్కనార్యుని యీ మహారంభమున మఱుఁగుపడిపోయెను. కావున తిక్కనార్యుఁడే యీ ప్రబంధపద్ధతికిఁ బితామహుఁడని చెప్పవలసియున్నది.

భీముఁడు కీచకుని సంహరించిన పిదప శవమును ముద్దగాఁజేసి ద్రౌపదికిఁ జూపెను. అప్పుడామె యావికృతపు శవమునుజూచి నెఱిఁగంది భీమసేనుని పరాక్రమమునకుఁ బరమానందమునొంది యాతనిని మిక్కిలి శ్లాఘించెను. దీనిని తిక్కనార్యుఁడు "కీచక సంహార" మనునాటకమునకుఁ దుదియంకమునుగాఁ జిత్రించెను.

ఉ॥ చూచుచుఁ జేరి వ్రేల్మిడుచుచుం దలయూఁచి విలక్షచిత్తయై
యా చపలాక్షి మిక్కుపయి సంగుళమిం గదియించి దీసికై
కీచక యింత సేసితి సుఖత్వముఁ బొందుదు గాక యింక న
ట్లేచిన నిట్లు గాకుదుగునే యనుచున్ నెఱిఁగందుచుండఁగన్.

(ఇత్యాది. II-356-360)

ద్రౌపదియందలి భావశబలత భీమునియందలి విజయగర్వమును పాత్రల నభినయమునకు నిర్దేశకములుగా నున్నవి. వారి సంవాదములోని పద్యములు కూడ, ఎట్టిమార్పులు లేకుండ, అట్లే నాటకమున నుపయోగింపఁ దగినట్లున్నవి. ద్రౌపదిచేత భీమునియుత్తమనాయకత్వమును బ్రశంసింపఁజేయుచుఁ దిక్కనార్యుఁడు కానిందు రూపకపద్ధతుల నవలంబించుచున్నట్లు వ్యక్తమొనర్చుచున్నాఁడు. ద్రౌపది విస్మయానందనిర్మగ్ననైతి నని చెప్పుటయు గమనింపఁ దగియున్నది. నాటకమున నిర్వహణమునం దద్భుతమును పోషింపవలయునను లక్షణముకూడ నిందు సమన్వితమగుచున్నది. కావున తిక్కనార్యుఁడు నాటకరీతులతో శ్రవ్య ప్రబంధరచనమును మనోజ్ఞతర మొనర్చెనని గ్రహింపవచ్చును. ఈసన్నివేశమునకుఁ గల మూలమును జూచినచో ఆయనకావించిన పెంపు ఎట్టిదో వ్యక్తము కాఁగలదు. అంతట భీముఁడు అచ్చట నగ్నిని బ్రజ్వలింపఁజేసి కీచకుని జూపిపాంచాలితో నిట్లనెను. "శీలగుణాన్వితవైన నిన్నుగోరువారందఱు కీచకునివలెనే వధింప

బడుమను" అట్లు భీముఁడు దుష్కరమైనకార్యమును నిర్వహించి, ద్రౌపదికి నత్యం తసుగుప్రీతిని గలిగించి, రోషప్రశాంతిని బొంది వంటశాలకు వేగముగాఁ జేరెను".

శ్లో॥ తతోఽగ్నిం తత్ర ప్రజ్వాల్య దర్శయిత్వాతు కీచకమ్
పాంచాలీం సతాదా వీర ఇదం వచన మబ్రవీత్॥
ప్రార్థయంతి సుకేశాంతే యే త్వాం శీలగుణాన్వితామ్
ఏవంతే భీరు వధ్యంతే కీచక శ్శోభతే యథా॥
తత్కృత్వా దుష్కరం కర్మ కృష్ణాయాః ప్రియముత్తమమ్
తథా స కీచకంహత్వా గత్వారోషస్య వైశమమ్
ఆమంత్ర్య ద్రౌపదీం కృష్ణాం క్షిప్రమాయా న్మహానసమ్॥
(అధ్యాయ. 22. శ్లో. 87-90)

ఇట్లు శ్రవ్యకావ్యరచనమున రూపకరీతుల ననలంబించి రసపోషణమును గావించుట సాహిత్యశిల్పమునకుఁ బరాకాష్ఠ. దీనినే శ్రీనాథుఁడు గమనించి ప్రశంసించెను.

"వాక్రుత్తుఁ దిక్కయజ్వప్రకాగము రసాభ్యుచితబంధముగ నొక్కొక్కమాటు"
(కాశీఖండము-పీఠిక)

తిక్కనార్యుఁడు ఈ పద్యమునుగూర్చి చెప్పిన "ఊర్జితకథోపేతంబు" "నానారసాభ్యుదయోల్లాసి" అను విశేషణములుకూడ నాటకీయతకే సూచకములుగా నున్నవి ఊర్జమనఁగా నుత్సాహము, బలము. ఊర్జితమనఁగా దృఢమైనది. బలముకలది, వృద్ధినొందినదనునర్థములు కలవు. ఊర్జిత కథయనఁగా ఇతిహాస మాత్రమగు కథనముకాదు; వివిధభావదీప్తమై చిత్రసన్నివేశాత్మకమైన కథ. కావు ననే యది నానారసాభ్యుదయోల్లాసి యగుచున్నది. తిక్కనార్యుఁడీ విశేషణము లను మూలము నుద్దేశించి చెప్పినమాట నిజమే, అయినను వీనిని ప్రత్యేకముగా ఆయన పేర్కొనుటవలన తన రచనమున వీనికి ప్రాముఖ్యము నీయ సంకల్పించె ననుట స్పష్టము. దీనినిబట్టి ఆయన దండి కావ్యాదర్శమునే గాక వామనుని కావ్యాలంకార సూత్రవృత్తి, ఆనందవర్ధనుని ధ్వన్యాలోకము, మమ్మటుని కావ్య ప్రకాశమునుగూడఁ జూచియుండు నని తోచుచున్నది. వీరు ముగ్వురును ఆయ నకుఁ బూర్వులే. విద్యానాథుఁడు. క్రీ. శ. 1300 ప్రాంతమున కావ్యాలంకార సంగ్రహము కాకతీయ ప్రతాపరుద్రున కంకితముగా వెలయించుట ఈసందర్భమున

గమనింపవలసియున్నది. ఈ ప్రతాపరుద్రుఁడు గణపతిదేవుని మనుమఁడు. గణపతిదేవుని యనంతరము క్రీ॥ శ॥ 1265-85 ప్రాంతమున తిక్కన మహాభారతమును ఆంధ్రమున రచించుచుండె ననుట విదితమే. కావున తిక్కనగారికిని విద్యానాథునకును కాలమున వ్యవధానము హెచ్చుగాలేదు. విద్యానాథుఁడు అప్పటికి ప్రసిద్ధములైన సకలసాహిత్య శాస్త్రగ్రంథములను బరిశీలించి వానిసారమును సంగ్రహించి ప్రతాపరుద్రీయమును నిర్మించెననుట విజ్ఞుల కెల్లరకును విదితమే. అతఁడట్టి గ్రంథమును వ్రాయగల్గెనన్నచో ఆంధ్ర దేశమున ప్రసిద్ధవిద్యాస్థానములలో సాహిత్యశాస్త్రపఠన పాఠన సంప్రదాయము చిరకాలముగా నుండియుండునని యూహింపవలసి యున్నది. కావున తిక్కన ధ్వన్యాలోకాది ముఖ్యసాహిత్యశాస్త్రగ్రంథములను తప్పక పరిశీలించియుండునని చెప్పనచ్చును. కావ్యరచనమున నాటకరీతులను బాటించి రసపోషణముఁ గావించుట, అట్టి కావ్యములను ప్రబంధములనుగా ఆయన నిర్దేశించుటయు నిందులకు నిదర్శనముగా నున్నది.

భరతుని నాటశాస్త్రమునకుఁ బిమ్మట భామహుఁడు, దండి మొదలగువారు రూపకమును వదలి శ్రవ్యకావ్యలక్షణములనే వివరించిరి. దండ్యాచార్యుఁడు సర్గబంధరూపమైనది మహాకావ్యమని చెప్పి యందు వర్ణనములకు, గుణాలంకారములకుఁగల ప్రాముఖ్యమును వివరించెనే గాని, కథాసంవిధానమున సంధి సంధ్యంగ ఘటనమును రసపోషణపద్ధతులను వివరింపలేదు. కాని వామనుఁడు కావ్యాలంకార సూత్రవృత్తియందు కావ్యభేదములను జెప్పుచు, కథ, ఆఖ్యాయిక, మహాకావ్యము మున్నగు ప్రక్రియలన్నియు దశరూపక విలసితములే యని నిర్దేశించెను.

ఆనందవర్ధనుఁడు ధ్వన్యాలోకమున అలక్ష్యక్రమవ్యంగ్యమును వివరించుచు, దానికి ప్రబంధమంతయు వ్యంజకమే యగునని నిరూపించెను. ఆతఁడు ఆ సందర్భమున మహాకావ్యమునకు నాటకమునకును భేదమును పాటింపక రెండింటిని ప్రబంధశబ్దముతోడనే వ్యవహరించెను. "ప్రబంధాత్మకమైన యలక్ష్యక్రమవ్యంగ్యరూపమగు ధ్వని రామాయణ మహాభారతాదులలో ప్రకాశమానమై ప్రసిద్ధముగనే యున్నది. అది యెట్లు ప్రకాశించునో ప్రతిపాదింపఁబడుచున్నది."

కారికలు. "జరిగిన కథయందుఁ గాని, సృష్టింపఁబడుచున్న కథయందుఁ గాని, విభావము, భావము అనుభావము సంచారి యనువాని యౌచిత్యమును బాటించుచు కథాశరీరము నేర్పఱుపవలయును. ఇతివృత్తమునందు అననుగుణమై

యంశ మున్నచో, అభీష్ట మగురసమున కుచితమగునట్లుగా, కథయందు దానిని మఱి యొకవిధముగాఁ గల్పింపవలయును.........అలంకారములను సమగ్రముగా నిర్వహించుటకు శక్తియున్నను సందర్భమున కనురూపమగునంతవఱకే వానిని కూర్చు కొనవలయును. రసాదులకు వ్యంజకమైన ప్రబంధమున కిది నిబంధనము."

(ధ్వన్యాలోకము)

నాటకమునందు వలె విభావాదుల యౌచిత్యమును చక్కఁగా గ్రహించి పాటించుచు, కథాశరీరమును రసోచితముగా నిర్మించుకొనుచు మహాకావ్యమును నిర్మింపవలయునని, అట్టిదే ప్రబంధప్రశస్తి కర్హమగు ననియు వ్యక్తమగుచున్నది. ఉత్తరరామాయణమును, విరాటపర్వమును పరిశీలించినచో తిక్కనార్యుఁడిట్టి నాటక లక్షణోల్లసిత మగు మహాకావ్యనిర్మాణమునే తెలుఁగున ప్రబంధముగా నుద్దేశించెనని చెప్పవలసియున్నది. ఆయన కవివాగ్బంధన మను గ్రంథమును రచించెనని చెప్పుదురు. అందిట్టి సాహిత్యసిద్ధాంతముల నాయన చర్చించి యుండవచ్చును. ఏమైనను ఆయన యుద్దేశించిన యీ నాటకాత్మక ప్రబంధపద్ధతి యెఱ్ఱనార్యుని నృసింహపురాణముననే అష్టాదశవర్ణనాత్మక విధానముగాఁ బరిణమించినది. ఏది యుచితముకాదని యానంద వర్ధనుఁడు ప్రబోధించెనో, అట్టి యలంకార నిర్వహణ తాత్పర్య మాంధ్రప్రబంధముల యందతిశయించి సన్నివేశకల్పనము, పాత్రచిత్రణము, రసపోషణము, మొదలగునవి మఱుగుపడి పోయినవి. ధ్వన్యాలోకకర్త యీ యలంకార నిర్వహణవ్యామోహ మెట్టిదని హెచ్చరించుచున్నాఁడో చూడుఁడు. "అలంకార నిర్వహణమున సామర్థ్యము గలకవి యొకానొకప్పుడు, దానిచేత నాకృష్టుఁడై రసబంధము నపేక్షింపక ప్రబంధ రచనమునకుఁ బూనుకొనుచుండును. వాని కుపదేశము కొఱకిది చెప్పఁబడినది. రసము నపేక్షింపక యలంకార నిబంధనైకపరత్వమున ప్రబంధముల రచించు కవులు కన్పించుచునేయున్నారు."

ఈ దృష్టితో పరిశీలించినచో తిక్కనగావించిన కీచక విరహావర్ణనము సూర్యాస్తమయాదివర్ణనము మొదలుగు వానియందే యలంకారోజ్జ్వల వర్ణనాత్మ కత్వమునకు కృత్రిమ కళాసాధనమునకు బీజములు పడెనేమో యనిపించును.

## vi

ప్రత్యంశ వర్ణనమున గ్రంథమును బెంపొందించు పద్ధతిని తిక్కన ఉద్యోగ పర్వమునందే యుజ్జగించెను. విరాటపర్వమున మూఁడువేల యేడువందల శ్లోకముల

లోని కథను 1624 గద్యపద్యములలో విస్తరించిన వాఁడు, ఉద్యోగపర్వమున సుమారు ఏడువేలశ్లోకముల గ్రంథమును 1562 గద్యపద్యములలోనే ముగించెను. ఆయన తక్కిన పర్వములందుఁ గూడ ప్రాయికముగా నిట్టి సంగ్రహపరత్వమునే యవలంబించెను. కథాగమనమునకు నడ్డువచ్చు ధర్మతత్త్వ ప్రసంగములను, స్తోత్రములను పెక్కింటిని ఆయన వదలివేసెను. ఉద్యోగపర్వమున సంజయుఁడు రాయబారమునకు పోయి తిరిగివచ్చినపిదప, ఆరాత్రి విదురుని ప్రార్థనమున సనత్సుజాతుఁడరుదెంచి ధృతరాష్ట్రునకు తత్త్వవిశేషముల నుపదేశించెను. ఇదియే సనత్సుజాతీయమనుపేరఁ బ్రఖ్యాతమై యున్నది. దీనిని తిక్కన పూర్తిగా విడిచిపెట్టెను. పుత్రమోహావిష్టుఁడగు ధృతరాష్ట్రుఁ డట్టిపరమోపదేశమున కనర్హుఁడు, కావున వానిని పురస్కరించుకొని యామహర్షి గావించిన యుపదేశమును వివరించి, తుదకది యాధృతరాష్ట్రునియందు విఫల మయ్యెనని చెప్పుట యసంగతమని తిక్కనార్యుఁడు దానిని పరిహరించియుండు నని పూజ్యపాదులు శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు భావించుచున్నారు. అట్లయినచో అందలి విజ్ఞానవిశేషములు ఆంధ్రుల కెట్లు లభింపవలయునన్నచో, ఈ విశేషము లన్నియు శాంత్యనుశాసనికపర్వములందు ఇతోఽధికముగా వివరింపఁబడి యుండుటవలన వీని నిచ్చట వదలుటవలన నెట్టిలోపమును కలుగుట లేదని చెప్పవచ్చుచు.

## vii

భగవద్గీతను సంగ్రహించుటయందును తిక్కనకిట్టి యభిప్రాయమే కలిగియున్నట్లు తోఁచుచున్నది. రెండు సైన్యములు మోహరించి నిలిచియున్నప్పుడు పాఠకులును యుద్ధవార్తా కుతూహలురై యుందురు కాని, ధర్మతత్త్వప్రసంగములను వినుటకుఁ దగిన శ్రద్ధ కలిగియుండరు. అట్టియెడల శ్రీకృష్ణదేవుఁ డుపదేశించిన పరమార్థ విషయములను సాకల్యముగా నుపన్యసించినచో, పాఠకులు వానిను పేక్షించిపై కథలోనికిఁ బోవుట సహజము. కావున పాఠకుల కుతూహలమునకు భంగము కలుగకుండ నా యుపదేశములోని సారమును సంగ్రహముగా తిక్కనార్యుఁడు చెప్పెను.

"కం॥ మానుగ ధర్మక్షేత్రం । బైన కురుక్షేత్రమున......"

అని మొదలై,

"తే॥ అధిప యోగీశ్వరేశ్వరుండైన కృష్ణుఁడును......"

అను సంజయుని వాక్యముతో నంతమైన యీ భాగము 61 గద్యపద్యములు గలిగియున్నది. ఇందును ఆయన కథకు సంబంధించిన విషయమును సాధారణముగా ననువదించి, తత్త్వప్రసంగమును మాత్రము మిగుల సంక్షేపించెను. "ధర్మక్షేత్రే కురుక్షేత్ర....." అను దానితో నారంభమై, "తమువాచ హృషీకేశః ప్రహసన్నివభారత......" అను శ్లోకమునఱకును గల యుపోద్ఘాతరూపమగు భాగము 24 గద్యపద్యములలో ననువదింపఁబడినది. పిదప తిక్కనార్యుఁడు సాంఖ్యకర్మయోగాది విశేషముల నన్నింటిని 10 గద్యపద్యములలో ముగించి, వెంటనే శ్రీకృష్ణదేవుఁడు పార్థునకుఁ బ్రసాదించిన విశ్వరూపదర్శనము నుపక్రమించి 17 గద్యపద్యములలో చక్కఁగా వర్ణించెను; పిదప నొక పద్యమున గద్యమునను శ్రీకృష్ణదేవుఁడు అర్జునుని సందేహములఁ దీర్చి గుహ్యతర జ్ఞానం బుపదేశించె నని చెప్పి వెంటనే అష్టాదశాధ్యాయములోని చరమోపదేశమగు "సర్వధర్మాన్ పరిత్యజ్య......" అని మొదలగు శ్లోకమును.

"తే॥ క్రందుకొను సర్వధర్మవికల్పములను, నెడల విడిచి....."

అను పద్యమున ననువదించి, 7 గద్యపద్యములలో తక్కిన గ్రంథమును ముగించెను.

ఇందు సాంఖ్యయోగ కర్మయోగములకు సారముగా ఆయన రచించిన యీక్రిందిపద్యములు ప్రత్యేకముగా నేమూలశ్లోకములకును అనువాదముగా లేవు. భగవద్గీతార్థము ఆయనచిరకాలము మనన మొనర్చుకొని తత్సారముగా తనయనుభవమునుబట్టి యాచరణీయములుగా నిశ్చయించుకొన్న సిద్ధాంతముల నీపద్యములలో సూత్రీకరించినట్లు తోచుచున్నది.

కం॥ ఫలములయెడ బ్రహ్మార్పణ కలన పరుం డగుచుఁ గార్యకర్మము నడపన్
వలయుం దత్త్వజ్ఞానము దలకొనినం గర్మశమము దానై కలుగున్॥

కం॥ వైరమున నులిచి త్రెంపక కారాకులు డుల్లినట్లు కర్మములెల్లం
దార పెడఁబాయ వలయుట సారకృపం దెలియఁ జెప్పె శౌరియతనికిన్॥

(భీష్మపర్వము, ప్రథమాశ్వాసము) 202, - 204

యోగసాధకుఁడు ఫలములను బ్రహ్మార్పణముగా వదలి, అనఁగా వానియందు ఆసక్తిని వీడి, నిత్యనైమిత్తికములైన శ్రౌతస్మార్తకర్మములను ఆచరించుచునే యుండవలయును. ఇట్లు చేయుచున్నచో కొంత కాలమునకు ఈశ్వరాను

గ్రమున తత్త్వజ్ఞానము కలుగును. దానివలన నజ్ఞానము తొలఁగి సంకల్పములు నశించి కర్మములు శమించును. ప్రారబ్ధాధీనము లైన సంసారకర్మముల నడుమఁ జిక్కువడియుండు సాధకుఁడు, ఆకర్మబంధములను త్రెంచుకొనుటకై తొందరపడ రాదు. భార్యాపుత్రస్వామి సఖిత్వాదిరూప కర్మబంధములను ద్వేషించుచు శత్రువులనువలె నులిచి త్రెంచుటకుఁ బ్రయత్నించినచో, భావనాబలముచే నవి యింకను బలపడును గాని తెగవు. కావున అది మార్గము కాదు. ఫలాసక్తిలేక కర్తవ్యముల నిర్వహించుచున్నచో తత్త్వజ్ఞానము కలిగినంతనే యిప్పటివఱకును మానసమునావరించియుండు కర్మబంధము లన్నియు పండుటాకులవలె తమ యంతటఁ దామె వీడిపోవును. శ్రీకృష్ణదేవుఁడు గావించిన యుపదేశమును తిక్కనార్యుఁడు శాస్త్రిచర్చలకుఁ దావొసఁగక, అనుభవమునకు సూటిగా నందునట్లు రెండు చిన్న పద్యములలో సంగ్రహించెను. ఇది యాయనయొక్క బోధనకౌశలమునకు గొప్ప నిదర్శనము.

ఈపర్వమునందు మఱియొకమార్పు కనిపించుచున్నది. వావిళ్లవారు ముద్రించినప్రతియందు, కుంభకోణప్రతియందును, భగవద్గీతాపర్వమున కనంతరమున ధర్మజుఁడు భీష్మద్రోణాదుల యొద్దకుఁబోయి వారివలన యుద్ధమునకై యనుజ్ఞఁ బొందినట్లు కలదు. కాని తిక్కన అది భగవద్గీతాప్రవచనమునకు పూర్వమే జరిగినట్లుగా రచించెను. భగవద్గీతాప్రవచనమునకు కొన్నిగడియలు తప్పక పట్టియుండును. అప్పుడంతయు నూరకుండి ధర్మజుఁడు తరువాత బయలుదేరెనని చెప్పుటకన్న, యుద్ధరంగమునకు రాఁగానే భీష్మద్రోణాదులను చూచినంతననే యట్లు గావించెననుట సమంజసముగా నున్నది. పూజ్యులు కన్పింపఁగనే వారికి నమస్కరించుట యుచితము సహజము. అట్లుగాక కొంతసేపు వారివంక నూరక చూచుచుండి పిదప నమస్కరింప నేగుట యసంగతము. మఱియును ధర్మజుఁడాయుధములను కవచమును వీడి భీష్మాదులయొద్దకుఁ బోవునప్పు డర్జునుఁ డట్టియుద్ధసన్నాహత్యాగమును మెచ్చకపోఁగా ఆయనను వారించి యుద్ధోన్ముఖునిజేయఁ బ్రయత్నించెను. ఆయర్జునుఁడే తాను బాణప్రయోగము చేయవలసి వచ్చునప్పటికి శోకమోహవశమున నిర్విణ్ణుఁడై గాండీవమును వదలి రథమునఁ గూలబడుట కుతూహలాస్పదముగా నున్నది. కావున తిక్కనార్యుఁడు చేసినమార్పు చాల సంగతముగా నున్నది.

## viii

యుద్ధఘట్టములందు కొన్నియెడల మూలమును సారరూపముగా సంగ్రహించుకొను కౌశలముతో తిక్కన సాధించిన కథావేగము, భావదీప్తియు ననల్పములు. భీష్ముఁడు అర్జునుని బాణములను ప్రశంసించు సన్నివేశ మిందులకొక నిదర్శనము. మూలమునం దెన్ని పునరుక్తులున్నవో, అర్జునుని బాణములచే పీడితుఁడై భీష్ముఁడు దుశ్శాసనునితో నీబాణములు శిఖండివికావు, అర్జునుని బాణములే యని చెప్పెను.

మూలమునందు ఏడు శ్లోకముల విషయమును తిక్కనార్యుఁ డొక్కపద్యమున నెంత భావస్ఫూర్తితోఁ జెప్పెనో చూడుఁడు.

వ॥ అప్పుడు దేవవ్రతుండు దుశ్శాసను నాలోకించి. 404

సీ॥ అశనికల్పము లివి యర్జునిబాణముల్ గాని, శిఖండివి గావు సుమ్ము
కర్కటి గర్భంబు కరణి గాత్రముఁ బ్రచ్చి, నిట్టివి వీనికినెందుఁ గలవు
బ్రహ్మదండంబుల పాటివై మర్మంబు, లిట్లు నొనాటునే యితనిచేత
జముదూతలట్ల ప్రాణములు వెలార్పంగ, నీద్రుపదాత్మజుఁ డెన్నఁడేసె ॥

ఆ॥వె॥ దృఢవిముక్తములును దీప్తాకృతులు లక్ష్య శుద్ధిమంతములును సునిశితములు
నైననారసంబు లతనివి గాక యీ తనివి యగున యెవ్విధమునఁ జూడ ॥ 405

— భీష్మపర్వము III ఆశ్వాసము.

ఈ ఘట్టములలో ముఖ్యసన్నివేశములందు వ్యాసభగవానుని రచనము రసబంధురముగా నుండును. ఆయనశైలి గంభీరముగా గంగాప్రవాహమువలె సాగిపోవుచుండును. అట్టియెడల తిక్కనగాని మఱియెవరైనను ఆయన స్థాయిని, వేగమును, అందుకొనుటకు ప్రయత్నింపవలసినదే కాని, అంతకుమించి చేయఁదగినదేమియునుండదు. భీష్ముఁడు శరతల్పగతుఁడగుట, దుర్యోధనుని దుఃఖము, పతనము అనుఘట్టములను స్థాలీపులాకన్యాయముగాఁ బరిశీలించినచో వ్యాసభట్టారకుని కవిత్వమహత్త్వమును దానిని తెలుగునకుఁ దెచ్చుటలోఁ దిక్కనార్యుఁడు చూపిన కౌశలమును కొంతవఱకు గ్రహింపవచ్చును. భీష్మునకు సాయము మొనరింపవచ్చిన యోధుల నందఱను అర్జునుఁడు పాఱఁద్రోలెను. ఒంటరిగానున్న భీష్ముని పాండవయోధులు చుట్టుముట్టిరి. అప్పుడు ధృతరాష్ట్రునితో సంజయుఁడిట్లు చెప్పుచున్నాడు. పడఁగొట్టుఁడు, పట్టుకొనుడు, పోరాడుడు, నఱకుఁడు అను మొదలగు నాదములు తుములముగా

భీష్ముని రథమునొద్ద ప్రబలెను. వేయి విధములుగాఁ గొట్టబడుటవలన భీష్ముని శరీరమున రెండంగుళములయెడ మైనను కన్పించుటలేదు. ఇట్లు వికలీకృతుఁడైన మీ తండ్రి సూర్యుఁ డస్తమింప నుండఁగా, నీ కుమారులు చూచుచుండఁగనే, ఫల్గుని బాణములవలనఁ దూర్పుతలగా రథము నుండి పడెను. దేవతలును, రాజులును హాహాకారములు గావించిరి. అట్లమ్మహాత్ముఁడు పడుచుండఁగా మాయందఱ హృదయములును కూలిపోయినవి. ఉత్సృష్టమైన యింద్రధ్వజమువలె, ధనుర్ధరశ్రేష్ఠుఁడగు నమ్మహాభుజుఁడు భూమి ప్రతిధ్వనించునట్లుగా పడిపోయెను. శరసంఘములచే సమావృతుఁడై యుండుటవలన ఆయన దేహము భూమినంటలేదు. శరతల్పమున శయనించిన యమ్మహాపురుషుని దివ్యభావ మావేశించెను.

శ్లో॥ నిపాతయత గృహ్ణీత యుధ్యధ్వ మవకృంతత ।
ఇత్యాసీ త్తుములశ్శబ్దో రాజన్ భీష్మరథం ప్రతి ॥ 88-95 ఇత్యాది.

ఈసన్నివేశమును తిక్కనార్యుఁ డిట్లు చిత్రించెను.

తే॥ ఏచి గాండీవి కురుసేన నెగచ నతనినాస నెఱవక భీష్మునిఁ జేరి మొదల
వ్రేలెఁ జెడలేచియట్లుగ వివిధభంగి నిష్ఠురాస్త్రశస్త్రంబుల నిలిచి గదిసె॥ 411

వ॥ అంత నంశుమంతుండు శాంతుండగుచు వచ్చె నట్టి యెడం గదిసి కవ్వడి
గాంగేయుపైఁ గ్రూరనారాచనికరంబులు నిగిడించి పడం ద్రోచిన. 412

కం॥ తూర్పుతలగాఁగ నీసుతులేర్పడఁ గనుఁగొనుచు నుండ నిలఁ గంపింపన్
దర్పోజ్జ్వలుఁ డాభీష్ముఁ డహర్పతి యస్తాద్రి సేరునట్లుగఁ బడియెన్॥ 413

తే॥ తనువు ధరఁ బొందకుండఁగ దల్పభంగి శరము లూఁతయై పొలుపారె నరవరేణ్యు
యట్లు శరతల్పగతుఁడగు నమ్మహాను భావు దేవవ్రతుఁ దేవభావమందె॥ 414

—భీష్మపర్వము-III ఆశ్వాసము.

తొడలు విఱిగి పడియున్న దుర్యోధనుఁడు సంజయునితో మాట్లాడుటను వ్యాసభట్టారకుఁడు రంగస్థలమును దృశ్యమువలెఁ జిత్రించెను. దుర్యోధనుని విలాపము హృదయవిదారకము. కృపకృతవర్మాశ్వత్థామలు చేరఁదనుదెంచి చూచునప్పటి యాతని స్థితియు కరుణాపూర్ణముగ చిత్రింపఁబడినది. సంజయుఁడు ధృతరాష్ట్రున కిట్లు చెప్పెను. "తొడలువిఱిగిపడియున్న దుర్యోధనుఁడు ధూళిచేఁ గప్పఁబడి వెండ్రుకలను జక్కఁబఱచు కొనుచు, దిక్కు లన్నింటకిని కలయఁజూచుచు, ప్రయత్నపూర్వకముగా రోషమును నిగ్రహించి యురగమువలె నిశ్వసించుచుండెను. వేగా

క్రుధపూర్ణములైన నేత్రములంతో నన్నుఁజూచి యతఁడును త్తగజమువలె కొట్టినూటికి బాహువులు భూమిపైనైచి పీడించుచు, చెదరిన వెంట్రుకలను విదలించుచు పండ్లను కొఱుకుచు పాండవజ్యేష్ఠుని నిందించుచు గాఢముగ నిశ్శ్వసించి యిట్లనెను. సమర్థుఁడైన భీష్ముఁడు, శస్త్రభృద్వరుడైన కర్ణుఁడు, కృపుఁడు, శకుని, అస్త్రభృద్వరుఁడగు ద్రోణుఁడు, అశ్వత్థామ, శల్యుఁడు, శూరుఁడగు కృతవర్మయుఁ దోడుగాఁ గల్గియున్ననే నీయవస్థను పొందితిని. కాలము దురతిక్రమముగదా! ఏకాదశచమూభర్తనగు నాకిట్టిదశ పట్టినది. కాలము సమీపించినప్పు డెవ్వఁడును దాని నతిక్రమింపజాలఁడు, భీముఁడు రణధర్మమునతిక్రమించి నన్నుఁ బడగొట్టిన విధమును బ్రతికియుండిన మనవారికందఱకును జెప్పుము. క్రూరకర్మముల బెక్కింటిని పాండవు లొనర్చిరిగదా! వాని నన్నింటిని తప్పక చెప్పవలయును........... సమయఘ్నులైన పాండవులను మీరెవ్వరును నమ్మవద్దు అనియు పలికెను.

## ix

తిక్కనార్యుఁ డెడనెడఁ మూలమును దగ్గించుచు భావవేగమును పెంపొందించి చెప్పుట గమనింపఁదగియున్నది. పలుకుబడిలోని తెలుఁగుదనము మిగుల హృదయంగమముగా నున్నది.

వ॥ ......అతండు ధూళి పొదివినవదనంబుపై నరసిన వెండ్రుకలు వాయంద్రోచికొని నామొగంబుఁజూచి ధర్మనందను నిందించుచు నవ్వుడు గలచి కన్నీరుగ్రమ్మ నిట్టూర్పు నిగిడించి. 381

తే॥ నేల నాలుగు చెఱఁగులు నేలి భీష్మ, గురుకృపాదులపైఁ గార్యభరము నిల్పి
యున్నవానికిఁ దుదినిట్టు లుండవలసెఁ, గాలసంప్రాప్త మేరికిఁ గడవవచ్చు॥ 382

కం॥ ననుఁ బదునొకఁ డక్షౌహిణు, లనూన విభవమునఁ గొల్వ నఖిల నృపులు పం
చిన పనిసేసి మెలఁగిర,ట్లునికి గనిన నీవ యిట్టు లునికియుఁ గంటే॥ 383

ఆ॥ వాయునందనుఁడు గదాయుద్ధ ధర్మంబు, నుజ్జగించి నిందకోర్చి యిట్లు
సేసె నిత్తెఱంగు సెప్పుమీ సంజయ, మనకు నిపుడు గల్గుజనుల కెల్ల॥ 384

ఆ॥ కపటధర్మ కంచుకంబున నెలసిరి, గాని సత్యపురుషకార పరులు
గారు పాండుసుతులు వారల నమ్మంగఁ, గాదు సేత గుండెకాయ యిడిన॥ 397

తెలుగు మహాభారతమును మాత్రము చదువుకొనుచు నిట్టి ఘట్టములం [illegible] బరవశులగుచు మూలమున నైన నిట్లుండనా యని సందేహపడువారు పెక్కుమంది. కాని మూలమునం గూడ రచనము మహోరస ప్రవాహమే యని గుర్తింపవలసి యున్నది. తిక్కన క్రమక్రమముగా ప్రబంధరచనోద్యోగము నుజ్జగించి వ్యాసభట్టారకుని రచనామార్గమునకే వచ్చుచుండుటయు గమనింపఁ దగియున్నది. పశ్వ్రేయో నిదానమైన వాల్మీకి వ్యాసుల యార్ష కావ్య విన్యాసమునకు ప్రౌఢకావ్య శిల్పరూపమైన ప్రబంధపద్ధతికిని మిక్కిలి యంతరము కలదు. వాల్మీకి వ్యాసులు లోకసంగ్రహపరాయణులై ప్రజానీకమునకు ధర్మతత్త్వార్థముల నుపదేశింపఁబూని భవ్యకవితావేశముతో పూర్వగాథలను వర్ణింపఁగా నవి యార్ష కావ్య సంహితలుగా రూపొందెను. ప్రసిద్ధమైన యొక కథనో కథాంశమునో స్వీకరించి కవిత్వచమత్కృతితో వర్ణనోజ్జ్వలముగా రచింప రూపొందినవి కాళిదాసాదుల ప్రబంధములు. రెండింటి యందును రామణీయక మున్నను అంతరము కూడఁ గలదు. ఋషివాటికాపరికీర్ణములగు మందాకినీ తీరమహారణ్యముల గంభీర రామణీయకమునకు నగరోద్యాన లాలిత్యమునకుఁ గలయంతరమే వానికిని గలదు. పైన గమనించినట్లుగ వ్యాసభట్టారకుని రచనమున నుపమోత్ప్రేక్షా ద్యలంకారములు, దృశ్యచిత్రణములు భావసంఘర్షణములు తక్కువగా లేవు. కాని యవి ప్రవాహమునం దరంగఫేన బుద్బుద విహంగాదుల వలె సహజములుగ నుండును. అవి కథనమున నప్రయత్న సిద్ధములుగ నుదయించును. వానికై పృథక్ప్రయత్నము లేకపోవుటచే నవి కథన ప్రసన్నతకు నడ్డుపడవు. కావుననే యార్ష కావ్యసంహితలు ప్రసన్నకథాకలితార్థములై నిసర్గ రమణీయములై యుండును. ఇట్టి గ్రంథముల యనువాదమున నిట్టి శైలియే యుచితము. తిక్కనార్యుఁ డుత్తరరామాయణమున సంభావించిన ప్రౌఢకావ్యశిల్పమును విరాటపర్వమునఁ గూడఁ గొనసాగించెను. కాని క్రమక్రమముగా నాప్రబంధ పద్ధతిని వీడి యార్షమగు ప్రసన్న కథనమార్గమునకే వచ్చెను.

x

అయినను ఆకవిత్వ శిల్పకలనా మహోత్సాహము మరల స్త్రీపర్వమున నొకసారి పొంగివచ్చి వెంటనే శమించునట్లు తోఁచుచున్నది. ఆపర్వమునఁదకును తిక్కన ఆశ్వాసాద్యంతములలోఁ దప్ప కథారచనమున విశిష్టచ్ఛందములను హెచ్చుగా వాడ లేదు. కాని యీపర్వమున రెండాశ్వాసములయందును క్రొత్తఛందములఁ బెక్కింటి నుపయోగించెను. మణిగణ నికరము, లయగ్రాహి,

మానిని, మంగళమహాశ్రీ, సరసిజము, భాస్కరవిలసితము, లయవిభాతి. కవిరాజ విరాజితము, భుజంగప్రయాతము, నర్కుటము, ప్రహరణకలితము, అంబురుహము, జలధరము, మేదిని, ప్రణవము, స్రగ్విణి, ఉపేంద్రవజ, శుద్ధవిరాటి మొదలుగా క్రొత్తవృత్తముల పెక్కింటిని 365 గద్యపద్యములుగల యొక్కచిన్నపర్వమును ప్రవేశపెట్టెను. ఇందలి కథ విలాపాత్మక మగుటవలన, కరుణమునకు గీతి దోహద కారి యగుటవలనను తిక్కన ఇట్లు వివిధచ్ఛందముల నాదరించిరని కొందరు చెప్పు దురు. కరుణమునకు గీతి దోహదకారి యనుట నిజమే. శబ్దము, అర్థము, ఛందము రసాభిముఖము లగునట్లు చేయుటయే కళగా నుపాసించిన కాళిదాసాదు లీవిషయ మున కొన్నియత్నములు గావించి కృతార్థులై యుండుట యథార్థమే. కాళిదాసు వియోగినీవృత్తము నవలంబించి యజవిలాపమున కరుణము నత్యంతరమణీయముగఁ బోషించి, దానినే మరల రతీవిలాపమున స్వీకరించి యట్లే రసమును జిప్పిలఁ జేసెను. కాని యతఁడు సన్నివేశారంభమునుండి తుదివఱకును, అనఁగా ఆసర్గయంతయు ఆఛందముననే రచించుట గమనింపఁదగినవిషయము. అచ్చట నావియోగినీ వృత్తము, సంగీత విన్యాసమునకు శ్రుతివలె, విలాపమున కనుగుణమై మానసమును గరగించు చున్నది. మేఘసందేశములోని మందాక్రాంతము నిట్టిదే. ఇట్టిపట్ల శ్రుతి భంగ పడినచో నెంత కటువుగా నుండునో, మాటిమాటికి ఛందస్సు మారుచుండి నను అట్లే వెగటుగా నుండును. అందును తిక్కన నుపయోగించిన యీ వృత్తము లలో ననేకములు తెలుఁగునకు ఒదుగుట లేదు పెక్కింటియందు వాని కుండఁదగిన గమనము కన్పించుట లేదు. ఇట్టి వృత్తములు శృంగారవీరాదిరసభావపూర్ణము లగు విరాటోద్యోగాది పర్వములందు రచనమునకు రామణీయకమును బెంపొందించి యుండ నచ్చును. కాని యీ కథాభాగమునకు కరుణమునకు నివియనుకూలించుట లేదు. ఒక్కసారిగా ఇన్ని క్రొత్తవృత్తములను ఇంత చిన్నపర్వమున తిక్కన నేల ప్రవేశపెట్టెనో దురూహ్యముగా నున్నది.

శాంత్యనుశాసనికాది పర్వములందిట్టి ప్రయత్నము కన్పించుటలేదు. వానియందాయున రచనము మూలమున కత్యంతము సన్నిహితమై నిసర్గశోభా రమణీయమై యున్నది. కొన్నియెడల వ్యాసభట్టారకుఁడే యాంధ్రుఁడై యవతరించి యిట్లు రచించె నేమో యన్నట్లున్నది. తిక్కనార్యుఁడు వ్యాసభట్టారకుని మహత్త్వ మును సాహిత్యమును బహుముఖముల భావించుచు అనేకపర్యాయములు ఆశ్వా సాద్యంతములందు అన్మహర్షిని ప్రశంసించెను. అందుఁ గొన్నియెడల ఆయన సాహిత్యమును ప్రత్యేకముగా నుగ్గడించెను. కర్ణపర్వమునఁ దుదియందు, దానిని ప్రబంధమునుగా ప్రశంసించి హరిహరనాథుని “ప్రకట మహార్థసౌరభ పరాశరనందన

వాక్యమంజరీ ప్రకరసమన్వితా..." అని సంబోధించెను; అట్లే మహాప్రస్థానికపర్వమున, "పారాశర్యవచః పయోనిధిసుధాభంగీ..." అని సంబోధించెను. స్వర్గారోహణ పర్వమున గ్రంథమును ముగించుచు ఫలశ్రుతిని జెప్పుచు దీనిని గూర్చి మహాభారత సంహిత యని మహేతిహాసమనియుఁ జెప్పెనే కాని ప్రబంధమండలిని ప్రస్తావింప లేదు. దీనినిబట్టి చూచినచో విరాటపర్వారంభమునుండి గ్రంథము తుదివఱకును తిక్కనార్యుని సాహిత్యభావన పరిణతినందుచునే యుండెనని వ్యక్తమగుచున్నది. వ్యాసభట్టారకుని రచనము శిథిలబంధముగాఁ గన్పించుచున్నను ఆ వాక్యమంజరి మహార్థసౌరభమనోజ్ఞమే యని, అందు విభావానుభావాది సంఘటనవిశేషములు భాసింపకున్నను, అనూనప్రవాహమే యని, సాధారణకావ్యశిల్పాది లక్షణముల కది యతీతమనియుఁ దిక్కనార్యుఁడు పై ప్రశంసలవలన వ్యక్త మొనర్చుచున్నాఁడు. ఆయన ఇట్లు సాహిత్యమున నిజప్రాగల్భ్యము నతిక్రమించు సత్త్వస్థితి నందుకొని వ్యాసభట్టారకునితో నైక్యము భజించె నని చెప్పవచ్చును.

ఆయన తత్త్వచింతనమునందును ఇట్టి పరిణతియే సంభవించెను. ఆశ్వాసాద్యంతపద్యముల గమనించినచో నిది వ్యక్తము కాఁగలదు. ఆయన పూర్ణభోగి, త్యాగి, పరమేశ్వరుఁ డాయనకు శ్రీమత్త్వము, ఆయుష్మత్త్వము, సుధీమత్త్వము, మహాకవిత్వము తత్త్వజ్ఞతను అనుగ్రహించి పూర్ణపురుషునిగావించెను. ఇట్టి వైభవమునఁ గలుగు వ్యామోహమును గూడ ఆ పరమేశ్వరుఁడే రాజ్యైశ్వర్యాదులవినశ్వరత్వమును నాటకదృశ్యములందు వలె జూపి విరక్తిఁ బుట్టించి, శమింపఁ జేసెను. ఆయనయే కైవల్యానంద ప్రదాతయు నై యుండెను. ఇది యొక పద్యమున మనోజ్ఞముగా వ్యక్తీకరింపఁబడినది.

కం॥ శ్రీమత్త్వాయుష్మత్త్వ సుధీమత్త్వప్రద కటాక్ష దీపితభక్త
స్తోమా రామపసంతా! వ్యామోహ ప్రశమకరణ! హరిహరనాథా!
—ద్రోణపర్వము - 4 ఆశ్వా, పద్యము. 1

కావ్యమునారంభించునపుడు భక్తుఁడగుతాను, ఆరాధ్యుఁడగు హరిహరనాథుఁడు, ఆరాధనసాధనమగు మహాభారత సంహితయు త్రిపుటిగా నేర్పడియుండెను. నిరంతర మగునీసాహిత్యయోగ సాధనము సమాధిస్థితివలె ఆయన మానసమును లౌకికవ్యవహారమునకు దూరమొనర్చి రసతరంగితమొనర్చుచు సకలవాసనా క్షాళనమున నిర్మలమును శుద్ధసత్త్వమయము నగునట్లు చేసెను. గ్రంథము ముగియునప్పటికి కవిత్వయోగసాధనము కూడ వదలిపోయి ముముక్షువు మోక్షప్రదాతయు మిగిలిరి.

చం॥ పరమపదాప్తి హేతు వగు భారతసంహిత శౌనకాదిభూ
సురవరు లింపునం గరఁగు చొప్పునఁ జెప్పిన, వారు మోదసం
భరితతఁ బొంది యక్కథకుఁ బ్రాఁతిగ నర్చితుఁజేసి రర్మిలిన్
హరిహరనాథ సర్వభువనార్చిత నన్ దయఁజూడు మెప్పుడున్॥

—స్వర్గారోహణపర్వము - 94.

ఇంక ఆయన తనయందలి జీవభావమును హరిహరనాథునందలి పరమేశ్వరత్వమును మిథ్యగా జూచుచు నైక్యానుసంధానము గావించి పరతత్త్వమున లీన మగుటయు నచిరకాలముననే సంభవించి యుండును. కర్మతత్పరుం డగు నా సోమయాజి కృతకృత్యుండై మహాప్రస్థానంబు భావించి సర్వకర్మసన్న్యాస పూర్వకంబుగా ననుదినార్చితంబులగు నగ్నిహోత్రంబుల నుద్వాసించి సమాహితచిత్తంబున బ్రహ్మానుసంధానంబు గావించుచు నుత్తరాభిముఖుఁడై చని చని పరమపద ప్రాప్తుండగుట పరమభావరమణీయము. ఇట్టి మహానుభావుఁ డాంధ్రుఁడై యవతరించుటవలన నాంధ్రభూమి, నివాసస్థాన మగుటవలన నెల్లూరును ధన్యములైనవి.

ఉపయుక్త గ్రంథావళి

| | | | |
|---|---|---|---|
| 1) | తిక్కనసోమయాజి | ... | శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు |
| 2) | దశకుమార చరిత్రము | ... | శ్రీ కేతనామాత్యుఁడు |
| 3) | ఉత్తరరామాయణము | ... | శ్రీ తిక్కనామాత్యుఁడు |
| 4) | ఆంధ్రశబ్ద చింతామణి | ... | శ్రీ నన్నయభట్టారకుఁడు |
| 5) | ఆంధ్రమహాభారతము | ... | శ్రీ వావిళ్ళవారి ముద్రణము |
| 6) | ఆంధ్రభారత కవితావిమర్శనము | ... | శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు |
| 7) | సంస్కృత విరాటోద్యోగములు | ... | శ్రీ కుంభకోణప్రతి |
| 8) | సంస్కృత భీష్మపర్వాదులు | ... | శ్రీ వావిళ్ళవారి ముద్రణము |
| 9) | ధ్వన్యాలోకము | ... | శ్రీ చౌఖాంబా ప్రచురణము, వారణాసి |
| 10) | కావ్యాలంకార సూత్రవృత్తి | ... | శ్రీ వాణీవిలాసముద్రణము, శ్రీరంగము. |

# 74.

## కవిసార్వభౌమ శ్రీనాథస్తుతి: రత్నహారము

సంకలన కర్త : వాణీదాసుఁడు, నెల్లూరు-2.

1. మొల్ల (ఆతుకూరి) క్రీ॥ శ॥ 1540 మొల్లరామాయణము :

గీ॥ రసికుఁడై నట్టి శ్రీనాథు...నుతియించిమించి.

—ముద్రణ 1928. పద్యసంఖ్య 9

2. కుమార ధూర్జటి క్రీ. శ. 1550 ఇందుమతీ పరిణయము :

సీ॥ ...తనదు శ్రీనాథత్వ మనుపమనృప సభాంతర
చిత్రరచన బంధురత మెఱయ.

గీ॥ ...నిమధరాజేంద్రదసుచరి
తాంధ్రకవన నవీనవాగ మృతలీల
నతిశయించిన నెఱజాణ నభినుతింతు.

—1936. ప. 11

3. వెంగళ భూపాలుఁడు (దామరల) క్రీ. శ. 1560 బహుళాశ్వచరిత్రము :

మ॥ ఉపమానైపుణి...జాతివార్తారళో
ర్వ్యపదోజ్జృంభణ శబ్దగుంభనకళా శ్రీనాథు. —1906. ప. 12

4. బైచరాజు వేంకటనాథుఁడు. క్రీ. శ. 1570 పంచతంత్రము :

మ॥ హృదయబ్రహ్మ...దేలింతు నత్కృప్తవ
స్తుదులంబ్రాజ్ఞుల...శ్రీనాథునిన్. —1924. ప. 11

5. భట్టుమూర్తి. కీ. శ. 1580. వసుచరిత్రము:

మ॥ మహి మున్...శ్రీనాథుండు ప్రోవన్...
బహుళాంధ్రోక్తి...తత్ప్రాగల్భ్యమూహించెదన్.

—1920. ప. 10

6. రామరాజు రంగప్పరాజు. క్రీ. శ. 1600. సానందోపాఖ్యానము :

సీ॥ అభివందన సహస్ర మమరించి శ్రీనాథో క్తి కొంతనిగుడ.

—1932. ప. 57

7. రఘునాథభూపాలుఁడు. క్రీ. శ. 1633. రఘునాథరామాయణము :

క॥ నానాశాస్త్రపురాణ జ్ఞానము సందర్భమునఁ బొసంగఁగఁగృతులె
న్నేనియొనరించి మించిన శ్రీ నాథుని వచనవైఖరిన్ మదిఁదలఁతున్.

—1937. ప. 12

8. చెంగల్వకాళయకవి క్రీ. శ. 1650 రాజగోపాలవిలాసము :

క॥ నన్నన......శ్రీనాథాదుల
మన్ననతోఁదలఁతు లోకమాన్యుల. —1951. ప. 9

9. కాకునూరి అప్పకవి క్రీ. శ. 1700 అప్పకవీయము :

సీ॥ శబ్దశాసను...సకలవిద్యాసనాథ కవీంద్రుఁగొనియాడి.

—1922. ప. 27

10. ఈదురుపల్లి భవానీశకవి క్రీ. శ. 1750 ధర్మఖండము :

గు॥ ఎలమిన్...శ్రీనాథు...వినుతింతు.

—1911. ప. 9

11. కూచిమంచి తిమ్మకవి. క్రీ. శ. 1760 రసికజనమనోభిరామము :

సీ॥ బహుముఖవక్త...పురుషసింహుఁడనఁదగు
శ్రీనాథు...నభినుతింతు.

—1927. ప. 13

12. కూచిమంచి జగ్గకవి. క్రీ. శ. 1770. చంద్రరేఖా విలాపము :

క॥ భీమకవి...శ్రీమన్మథుఁడై చెలంగు శ్రీనాథకవిన్
...చిత్తవీథిఁదలఁచి —1922. ప. 9

13 కనుపర్తి అబ్బయామాత్యుఁడు క్రీ శ 1800 అనిరుద్ధచరిత్రము.
మ దినరాత్రంబుల శ్రీనాథుని వినుతింతున్ —1 24 ప 8

14 కటికనేని రామయకవి క్రీ శ. 1800 కువలయానందప్రకాశము
సీ॥ నన్నయభట్టు నన్నయభట్టు శ్రీనాథకవిని ప్రసిద్ధిగాఁగొనియాడి
—1893 ప 13

15 చెళ్లపిళ్ల నరసకవి క్రీ శ 1825 యామినీపూర్ణతిలకవిలాసము
క॥ ఘన శ్రీనాథుని మనమున వినుతింతు —1893 2

16 కృష్ణకవి క్రీ శ 850 శకుంతలాపరిణయము
గీ శ్రీనాథు నాంధ్రకవితా నిశాంతుల నభినుతింతు — 927 ప 5

7 కొటికెలపూడి వేంకటకృష్ణకవి క్రీ శ 1850 దిలీపచరిత్రము.
సీ చతురాస్య ముదుపదాచ్ఛాదిత ప్రభువను శ్రీనాథు
నభినుతించెద —1889 ప 11

8 తిరుపతి వేంకటకవులు శ్రవణానందము
సీ నన్నయ
శ్రీనాథకవిరాజశేఖరుండల పెద్దన
కవిత్వమునకుఁ బ్రాణమ్ములొసఁగ
. . వారు . మాకుఁబూజ్యులు — 9'8 ప 9

9 దుర్భాక రాజశేఖర శతావధాని [illegible]
మ॥ లలితంబై రసికానురాగమగు చిచ్చి... [illegible] గండుకో
యిలవిన్ [illegible] వసంతునట్టులు [illegible] వారు నొయ్యారపుం-
బలుకుల్ నూత్నవిలాసముల్ వడలవిన్నాణంపు సొంపుల్ గవి
త్వాల [illegible] నేర్పినట్టి యనఘున్ భావింతు శ్రీనాథునిన్
— 924 ప 7

20 కొమాండూరి వేంకటరామానుజాచార్యులు తల్పగిరిమాహాత్మ్యము
ఉ భూరిమనీష కొల్చెద నైషధకావ్యకర్తనున్ — 3 1 ప 25

### * సూఫీ వేదాంత తత్త్వగేయము *

తా సుర్మే సిఫత్ సుదా నగరదీ తహే సంగ్
హర్ గిజ్. బ సపా చష్మే నిగారే నరసీ.

తా శాన్ఏ సిఫత్ సర్ ననే హీ దరల్ హే ఆరా
హరగిజ్ బ సిరే జుల్ఫె నిగారే న రసీ

తా హమ్‌హూ దరే సుఫ్తా నగరదీ బతార్
హర్‌గిజ్ బతినా గోషే నిగారే న రసీ

తాఖాకే తురా కూజా న సాజన్ద కలాలా
హర్‌గిజ బలబే లాలే నిగారే న రసీ

తాహమ్ చూకలం సర్‌నేహీ దర్ తహే కారద్
హర్‌గిజ్ బ వరే అంగుష్తే నిగారే నరసీ

తాహమ్‌హూ హినా సుదా నగరీ తహే సంగ్
హరగిజ్ బకఫే పాయే నిగారే నరసీ

నీ అహము నశించి బూడిదై మట్టిలో కలసినగాని, నీవు ప్రియునికి నేత్రాంజనము కానేరవు. (సుర్మా)

నీ కేశముండన మైనగాని, ప్రియునికి దువ్వెనవై కేశసంస్కారమున కర్తవుగావు

నీ హృదయ ఛేదనమైనగాని ప్రియునకు కర్ణభూషణము కానేరవు

నీ దేహము భస్మమై మట్టిలో కలసి, అమృతపాత్రతో నీరము నిచ్చినగాని, స్వామి పానీయమును స్వీకరింపడు.

నీ శిరము గంట-కత్తి కొరమైనగాని ప్రభువు గంటముతో వ్రాయుటకు పూనికొనడు.

నీలో 'నేనను' మాయాతత్త్వము నిశ్శేషముగ లయించినగాని, నిన్ను తన చరణ పారణగా స్వామి స్వీకరింపడు

# 7౨.

# ఎఱ్ఱాప్రెగడ కవిచంద్రనీరాజనము

విద్యారత్న శ్రీ చేయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులు, యం ఏ ఏ ఇ యస్
రిటైర్డ్ సంస్కృత ఎకాడమీ - ఉస్మానియా యూనివర్సిటీ - హైదరాబాదు

• ❖ •

౧ శ్రీనాథుఁడు (క్రీ శ ౩80- 440) కాశీఖండము I ఆ ప 13

"పరిఢవింతు ప్రబంధపరమేశ్వరునిరేన, సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు" 1

—(వావిళ్ల 19 ౦)

"సత్ప్రబంధమహేశ్వరు శంభుదాసు, నధికతరభక్తిసంయుక్తి నాదరింతు" 2

౨ నూతనకవి సూరన్న (క్రీ శ 400-1500) ధనాభిరామము I 12

—(Ed. 1950 వావిళ్ల)

చ "అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజి ని
శ్చలమతి, శంభుదాసు బుధసన్నుతు, నాచనసోమునార్యు నేఁ
దలఁతు నపూర్వదివ్యకవితామహనీయసమగ్రచిత్తులన్" 3

(ఆంధ్రకవితరంగిణి - .0 సం ౨౪ పు)

శ్రీ చాగంటి శేషయ్యగారిచే రచింపబడెను కపిలేశ్వరపురము (1953)

3 జక్కన (క్రీ 1345-1404) విక్రమార్కచరిత్ర I (Ed 1914):

ఉ॥ "ఈత్రయిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁడై, విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమున, శేషము శ్రీనరసింహ-రామచా
రిత్రములున్ బుధవ్రజగరిష్ఠత నెఱ్ఱయశంభుదాసుఁ డా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితుఁ గొల్చెద భక్తియుక్తితోన్" 4

౪ నిశ్శంకుని కొమ్మయ · (క్రీ 1435-70) వీరమాహేశ్వరము:

ఉ॥ "నన్నయభట్టుఁ గావ్యరచనావిధిఁ దిక్కనసోమయాజి న
చ్ఛిన్నమహత్త్వసంవిహితశేముషి, నెఱ్ఱయప్రెగ్గడన్ సము
త్పన్ననవప్రబంధరసభావన, నింపునఁ బ్రార్థనాంజలుల్
మున్నుగ నాత్మలోఁ దలఁతు మువ్వుర, మువ్వురఁ బోలుపుణ్యులన్" 5

(ప్రబంధరత్నావళిలో నుదాహృతము - III. ప ౩౨ పు)

నంది మల్లయ్య, ఘంట సింగయ్య · (క్రీ 1475-1500) వరాహపురాణము—

కీర్తితములైన 1. ఆ 18

“శంభుదాసునివాగ్విలాసములు నెమ్మనంబులోపల నిలుపుదు” 6

౬ మాదయగారి మల్లన. (క్రీ 1500-31) రాజశేఖర చరిత్ర I ఆ 7

క్రీ “సరససంస్కృత పుష్పగుచ్ఛ ప్రభూత
మగు తెనుంగు నవసిత్తావి కఖిలదిశలఁ
1 దరుణపవమాన మగు కవిత్రయవిశేష
చతురవాచానిరూఢి కంజలి ఘటింతు” —1937

౭ పెదపాటి సోమయ (కవిలోకబ్రహ్మ క్రీ శ 1500, అరుణాచల పురాణము·

“భావబంధనిబంధకరమైన తిక్కయజ్వకు నెఱ్ఱయజ్వకు సన్నుతింతు”

*(ప్రబంధరత్నావళి- 491 ప, 144పు)

౮ ఆంధ్రకవి రామయ్య (క్రీ 1500) విష్ణుకాంచీమహాత్మ్యము

“లక్ష్యలక్షణకలాలంకారసౌభాగ్య, సత్కావ్యవిన్యాసు శంభుదాసుఁ దలఁతు”

(ప్రబంధ రత్నావళి, 422 ప ౧౨౮)

(శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారిచే సంపాదితము · మద్రాసు —1918

౯ రాధామాధవకవి (చింతలపూడి ఎల్లయ్య క్రీ 1520-30)

ఉ “భారతకావ్యహారమునకొక భాగము నన్నయభట్టు గూర్చె ము
క్కారమశేయవాక్యములఁ దక్కినభాగము సోమయాజి పెం
పార నొనర్చె రెంటిఁ గలయన్ శివదాసుఁడు మధ్యనాయక
శ్రీ రచియించె శారద ధరింపఁగ నిప్రియకీర్తి మించగన్”

(తారకబ్రహ్మరాజీయము - అముద్రితము)

౧౦ పట్టుపట్టు సోమనాథసోమయాజి (క్రీ 1530-73)

“సర్వోత్తమ సుసమాధినియతిశ్రీ యగు శంభు-
ౘ దాసు ప్రసాదమ్మాత్త, నుతింతు - (నూతనసంహిత అవతారిక-9 పు ౨ పు)

(ఆ ౨౬ ౩ III - ఆంధ్రకవి తరంగిణి 10 సం 14 ప)

౧౧. చదలువాడ మల్లన : (క్రీ శ. 1585-1060):

గీ॥ సుకవి సంస్తుత్యు శంభుదాసుని నుతింపనేర్తునే, యైన నేను వర్ణింతు నతని
చిన్నినాయనమాడ్కి గావునఁ జగతినాంధ్రకోదలు పలుకులు ముద్దుసేయు మరుగాదె?

సీ॥ "ప్రతిభతో నారణ్యపర్వశేషముఁ జెప్పెఁ, గవులకుఁ జెవులపండువులు గాఁగ.
—మిగత పద్యము పే. 232-3 న చూడుడు.

౧౨. గణపవరపు వేంకటకవి : (క్రీ. శ. 1650-74) :

"ప్రాబంధికపరమేశ్వరు వర్గనాహీనుంబు" 14

(ప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసము) 1892

౧౩. కోనసూరి వేంకటకవి : (చిక్కయజ్వనాపౌత్రుడు; క్రీ. 1680-1700):

"భాషానుదాత్తు శంభుపదసారసషట్పదచిత్తుఁ గొల్చెదన్." 15

(విష్ణుమాయావిలాసము)

౧౪. వక్కలంక వీరభద్రకవి : (క్రీ 1700-50)

ఉ. "భారతసంహితార్థముఁ బ్రబంధముగాఁ బటుసంస్కృతాంధ్రభా
షారచనన్ ఘటించి, భువి సన్నుతిఁ గాంచినవారి మువ్వురన్,
ధీరుల నాననంబున నుతింతు సుధీఘను నన్నపార్యు, నా
క్కారసగర్భుఁ దిక్కనాఖిచంద్రము, సుమహోన్నతు నెఱ్ఱప్రెగ్గడన్. 16

(వాసవదత్తా పరిణయము)

౧౫. ఏనుగు లక్ష్మణకవి : II (క్రీ. శ. 1770-80) :

గీ॥ "ఆంధ్రసూక్తుల బాదరాయణమునిప్ర.
ణీతభారతవేదంబు నేర్పులర్పఁ
గృతి యొనర్చిన వైభవోన్నతుల నన్న
యార్యు నెఱ్ఱనకవిఁ దిక్కయజ్వఁ గొలుతు? 17

(జాహ్నవీమాహాత్మ్యము. I. 13)

౧౬. మ. మ. కొక్కొండ వేంకటరత్నము : (క్రీ. 1842-1916) :

తే॥ గీ॥ భారతస్థాక్షరక్రమమును లగుటనో
భట్టు ప్రెగ్గడ క్రతుకర్త భారతమును

దెనుఁగుసేసి రటంచు నుతింతు వారిఁ
బ్రణవమున నుండు మూఁడుమాత్ర లన ముగుర." 18

ఉ॥ "వాగనుశాసనీయకృతిఁ బ్రబ్బుఁ బ్రసాదము శబ్దసౌష్ఠవం
బౌఁ గన శంభుదాసకృతి నాచ్చికతత్సమతుల్యభావము
న్బాగుగ సోమయాజికృతి నల్గొనుసద్రసపుష్టిసంగ్రహం
బీ గురుకావ్యమిత్రముల నీనెడునంశవులం గ్రహించెదన్." 19

—విశ్వేశ్వరీయము. I. బింబ. ౧౪౩, ౧౪౪

వరదే వీణావాదిని :

వరదే వీణావాదిని, వరదే
ప్రియస్వతంత్రరవ అమృతనవ భారతమే భరదే

కాట అన్ధ ఉర్ కే బంధనస్తర
బహా జనని జోతిర్మయ నిర్ఘర్

కలుషభేద్ తమ హర ప్రకాశ భర్
జగమగ జగకర్ దే వీణా...

నవగతి, నవలయ తాల ఛన్ద నవ
నవలకంఠ్ నవ జలదమంద్ర రవ

నవ నభకే నవ విహగవృన్దకో
నవపర్, నవస్వరదే, వీణా...

• • • • • •

నతానాం భక్తానాం నయనయుగ బాలార్క సుషమా
మహర్షీణామాశా, త్రిదశతరుణీ కైశ్యఘటి తా
స్వసంపర్కోత్సేకాత్సపది శివయంతీ శివతనుం
శివంకుర్యాన్మాతుః పదవనజ పాటల్య లహరీ.

—పుట్టపర్తి :: శివతాండవమ్.

• • • • • •

# 76.

# ★ ఎఱ్ఱాప్రెగడ ★

శ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ, బి.ఏ., (ఆనర్సు.)

ఉ॥ వేదవిభాగమున్ సలిపి విశ్వహితమ్ముగఁ గావ్యరీతి ధ
ర్మాదరవృత్తి భారతము నాపయి భాగవతమ్ము మత్స్యకూ
ర్మాదిపురాణవర్గము లనంతవిశేషమహాద్భుతంబుగాఁ
బ్రోదియొనర్చినట్టి ఋషిపూజితుఁ గొల్తుఁ బరాశరాత్మజున్ ॥

ఉ॥ నన్నయతిక్కనార్యులు మనంబున వైదికధర్మమూఁది కా
వ్యోన్నత సుప్రసన్న మధురోజ్జ్వలరీతుల భారతార్థ సం
పన్నతఁ గూర్ప నందు వనపర్వము పూర్ణమొనర్చినట్టి వి
ద్వన్నుతు నెఱ్ఱనార్యు హరివంశవిధాతను గొల్తు భక్తిమై ॥

నెల్లూరుమండలమున నుదయించి యఖిలాంధ్ర సాహిత్య ప్రపంచమున సూర్యచంద్రులవలెఁ బ్రకాశించుచున్న మహాకవులు తిక్కనయెఱ్ఱనలు. వారి యశోవిభవ మీ మండలసాహిత్యసరస్వతికమూల్య రత్నాభరణమై యొప్పుచున్నది. ఎఱ్ఱాప్రెగడ ఆంధ్రభారతీకన్యను తిక్కనార్యునుండి గైకొని పెంచి పెద్దదానినిగాఁ జేసి సాలంకృతనుగ శ్రీనాథున కొసంగిన మహనీయుఁడు. ఈయన ఆంధ్రప్రబంధకర్తలకు కులగురువుగాఁ జెప్పఁదగినవాఁడు. ఈ మహాకవికి పాకనాటిలో నీలకంఠేశ్వరస్థానమైన గుడ్లూరు నెలవుగా నుండెను. ఇది యీ మండలమున కందుకూరు తాలూకాలో నున్నది. విష్ణుపురాణమున వెన్నెలకంటి సూరన దీని నిట్లు వర్ణించెను.

సీ॥ గౌరీసమేతుఁడై గరిమతో నేవీట। నేపారు నీలకంఠేశ్వరుండు
వారాశికన్యతో వర్తించు నేవీట। గిరిధేనుసుతుఁడైన కేశవుండు
యోగినీసహితయై యొప్పారు నేవీటఁ। బసిఁడిపోలేరమ్మ భవునికొమ్మ
పాపవినాశయై ప్రవహించు నేవీట। మన్నేఱు మిన్నేఱు మాఱటగుచుఁ ॥

ఆ॥ వె॥ గుంజరములు వేయి కొలువంగ నేవీటఁ గొడుగుచక్రవర్తి పుడమియేలె
నట్టి రాజధానియై యొప్పు గుడ్లూరి నొనర నేలుచుండి యొక్కనాఁడు ॥

ఈయన క్రీ.శ. 1280 ప్రాంతమున జన్మించి క్రీ.శ. 1350 వఱకు జీవించినట్లు తెలియుచున్నది. పోతమాంబికా సూరనార్యు లీయనకు తల్లిదండ్రులు; తాతగారిపేరు ఎఱ్ఱపోతసూరి. ఇంతకుమించి యీయన కుటుంబవిషయము లేమియు దెలియుటలేదు.

నన్నపార్యునివలెనే యీయనయును తన్నుగూర్చి యరణ్యపర్వాంతమున చెప్పుకొనెను.

సీ॥ భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు। శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ.

(అను పద్యమున - అరణ్య 7-463)

దీనినిబట్టి యీయన "గుణగరిష్ఠత నొప్పుధన్యుఁడు", ధర్మైకతత్పరాత్ముఁడు, "శివపదాబ్జ సంతతధ్యానసంసక్తచిత్తుఁడు" అని వ్యక్తమగు చున్నది. నృసింహపురాణమునుబట్టి యీయన మహాయోగియైన శంకరస్వామికి శిష్యుఁడనియు తెలియుచున్నది. ఈయన శంభు దాసని ప్రఖ్యాతినందిన శివభక్తుఁడైనప్పటికిని, "గోవిందగుణాదరసంభృత సౌమనస్యధన్యుఁడ నెందున్" అని తాతగారి ప్రశంస నందుకొని నృసింహపురాణమును వ్రాసినవాఁడు రామాయణ హరివంశములును విష్ణుకథలే. కావున నీయనయును తిక్కనార్యునిమార్గమున "విష్ణురూపాయనమశ్శివాయ" అను నద్వైతభక్తినే కలిగి యుండెను.

వ్యాసప్రశంసామూలమున తిక్కనార్యుఁడు వ్యక్తీకరించిన మహాకవిత్వ లక్షణములు ఎఱ్ఱనార్యునియందును సమన్వయించును.

శా॥ విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుండు, విజ్ఞాన సం
పద్విఖ్యాతుఁడు సంయమిప్రకర సంభావ్యానుభావుండు, కృ
ష్ణద్వైపాయనుఁ డర్థిలోకహిత నిష్ఠంబూని కావించె, ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్॥

భవ్యకవితావేశము విజ్ఞానసంపద, మహితానుభావము అను నీమూఁడు లక్షణములచేతనే యెవఁడైనను మహాకవియగు చున్నాఁడు. వసంతము, వనసౌందర్యము మొదలగు సాధారణవిషయములపైఁ గలుగునది సామాన్యకవితావేశము. మానవానీకమునకు శ్రేయస్కరములైన రామకథ, పాండవులకథ మొదలగు నుత్తమ వస్తువులపై నభినివేశము కలిగి, వాని మూలమున ధర్మతత్త్వప్రబోధము కలిగింపవలయు ననునావేశము భవ్యకవితావేశము. ఇట్టిది వీరశైవ వీరవైష్ణవాది

మతావేశములవలె నితరమత ధర్మాదిద్వేషపూర్వకముగా నుండదు. పరమత దూషణదూషితమైన శివకవులయావేశము భవ్యముకాజాలకుండుట గమనింపఁదగినది. కావున పరమతద్వేషరహితమై, లోకహితలక్షితమై, ధర్మతత్త్వ ప్రబోధకముగా ప్రవర్తిల్లిన యెఱ్ఱనార్యుని కవితావేశము భవ్యమైనది. ఇఁక ఈయన విజ్ఞానసంపన్నుఁడనుట గ్రంథములవలననే సువ్యక్తమగుచున్నది.

ఈయన మహితానుభావము ప్రత్యేకముగా గమనింపఁదగినది. ఈయనను రెడ్డిరాజులు చేరఁదీసి బహూకరించి ప్రోత్సహించిరనుట స్పష్టము. కాని యిది సాధారణకవులు రాజుల నాశ్రయించి జీవించుటవంటిది కాదు. నన్నయ తిక్కనల రాజాశ్రయమెట్టిదో యిదియు నట్టిదే. వారియాశ్రయమున దైన్యములేదు. వారు రాజులకుమిత్రులు సమ్మాన్యులు. ఆరాజులు ధార్మికులగుటచే ఈకవులు వారియెడ మైత్రివహించి వారికిగ్రంథముల నంకితమొనర్చి కీర్తినిగలిగించుట దోషముకాదు. పోతరాజుగారన్నమాట మనుజేశ్వరాధములయందే వర్తించును. మఱిరాజరాజు, మనుమసిద్ధి ధీరోదాత్తులైన నృపోత్తములు. రాజరాజు సర్వవర్ణాశ్రమధర్మసంరక్షకుఁడు, "కలికాలజదోషతుషారసంహతిం దనయు దయప్రభావమున దవ్వుగఁజోపి"న వాఁడు. మనుమసిద్ధియు నిట్టివాఁడే. ఏవేదధర్మమును ఆంధ్రప్రజానీకమున కందింప వలయునని యీమహాకవులు తలంచుచున్నారో, ఆమహాధర్మమునే ఆరాజులును ప్రభుశక్తితో స్థాపించుటకు ప్రయత్నించినవారు. వారిప్రోత్సాహమున వీరు కృతులు రచించుట ఒక యుద్యమమునకై యిరుపక్షములనాయకులు మైత్రి నవలంబించుట వంటిది. వీరెల్లరును స్వతంత్రులు, కాని మైత్రీధర్మబద్ధులు. రెడ్డిరాజులకును ఎఱ్ఱాప్రగడకును గలసంబంధమును ఇట్టిదే. వల్లారెడ్డియే ఎఱ్ఱనార్యుని మిత్రునిగా జేసికొని "ఆతత శ్రీతోడన్ సముపేతుఁజేసి యెలమిం జేపట్టె"నాఁడు. ఈమాట వేమారెడ్డియే జెప్పెను.

శా॥ నాకమ్ముందు ఘనుండు మల్లరథినీనాథుండు ని
న్నాతత శ్రీతోడన్ సముపేతుఁజేసి యెలమిం జేపట్టెమా కిచ్చుటన్
జేతోమోద మెలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతింబొందితి నింకనేను దనియన్ గావ్యామృతాస్వాదనన్.

(హరి. అ. 1 - ప. 39)

వల్లారెడ్డి మహనీయత మిక్కిలి ప్రశంసార్హము. ఇతఁడు అన్నగారికి అత్యంతభక్తుఁడు. వేమారెడ్డి క్రీ. శ. 1320 ప్రాంతమున అద్దంకిని పరిపాలించు

చుండెను. క్రీ. శ. 1323 లో కాకతీయ సామ్రాజ్యము పతనమొందుటవలన దేశము తురుష్కాక్రాంతము కాజొచ్చినది. శక్తిమంతులగు రాజులు తురుష్కులకు లోబడక స్వతంత్రించిరి. అట్టివారిలో ప్రముఖుడు వేమారెడ్డి ఇతడు సాధ్యమైనంత వఱకు చుట్టునున్న ప్రాంతములను తురుష్కాక్రాంతములు కాకుండ రక్షించి వేద ధర్మమును వెలయించుటకు ప్రయత్నించెను. మల్లారెడ్డి, అన్నగారికి కుడిభుజమయ్యెను. ఇతడు మోటుపల్లిని జయించి సముద్రతీరమునఱకును రాజ్యమును విస్తరింపజేసిన మహాసేనాని. ఇతడు గుడ్లూరు, చదలువాడ ప్రాంతములకు రాజప్రతినిధిగ నున్నట్లు తోచుచున్నది. గుడ్లూరులో నున్నప్పుడు ఎఱ్ఱనతో మైత్రి సంభవించియుండును. ఇతడు ఆ మహాకవిని మిక్కిలి సంభావించెను. ఇది తాను ఖ్యాతిని సంపాదించుకొనుటకు గాదు; అన్నగారికి కీర్తినిగలిగించుటకు. ఇతడు మహాకవిని, అనర్ఘరత్నమును వలె, వెదకి చేపట్టి సమ్మానశోభితుని గావించి మహాప్రభువైన యన్నగారికి కానుక పెట్టెను. ఇది యీతని రసజ్ఞతకు, మహోదారతకు, అకలంకమగు భ్రాతృభక్తికి నిదర్శనము. ఇది మహనీయతకు మేలుబంతి.

ఈ మహనీయతయందు వేమారెడ్డియు తమ్మునకు అన్నగారే. వీరి సౌభ్రాత్రము లోకోత్తరమైనది. దీనిని ఎఱ్ఱనార్యుడు చక్కగా వర్ణించెను.

కం॥ రామునకు లక్ష్మణుడు, సుత్రామసుతుడు ధర్మజునకుఁ, దగసౌభ్రాత్రం
బేమెయి నెఱపుదు రామెయి వేమప్రభుఁగొల్చె మల్లవిభుడును భక్తిన్ ॥

దీనియందు మల్లారెడ్డి లక్ష్మణార్జునులవంటి వాడనియేకాక, వేమారెడ్డియును శ్రీరామధర్మజులవంటి వాడనియు నీ మహాకవి సూచించుచున్నాడు. వేమారెడ్డి బహుపురాణములు విని పాత్రోచితదానమే ధనమునకు వినియోగమని గుర్తించి, యగ్రహారము లొసంగి బ్రాహ్మణులను యజ్ఞకర్తలనుగాఁ జేసినవాడు. చెఱువులు, గుళ్ళు, చలివపందిళ్ళు మొదలగునవి నిర్వహించుటయేకాక సకలవ్రతదానములు చేసి ధన్యుడైనవాడు. నెల్లూరు జిల్లాశాసనములు, రెండవ సంపుటములో 549 పేజీలో ప్రకటింపబడిన కందుకూరు శాసనమున ప్రోలయ వేమారెడ్డి శంభుదాసు చేత రామాయణ హరివంశములను వ్రాయించెనని, హేమాద్రిచే చెప్పబడిన వ్రతదానములు చేసెనని, శ్రీశైలమున పాతాళగంగకు మెట్లు కట్టించెననియుఁగలదు. ఈ గుణవిశేషములనే ఎఱ్ఱనార్యుడు కడునుత్సాహముతో వర్ణించెను.

కం॥ ఘనుఁడు పరాక్రమసంభృత
ధనకోటికి ఫలము పాత్రదానమయని యెం
దును బహుపురాణముఖముల
వినుచుండుటఁ జేసి యధికవిశ్వాసమునన్ ॥

వ॥ ఇష్టాపూర్తరూపంబగు క్రియాకలాపంబు నిజకర్తవ్యానురూపంబుగాఁ దొడంగి,

సీ॥ అగ్రహారములు విద్యాతపోవృద్ధ వి
ప్రులకిచ్చి యజ్ఞకర్తలుగ నునిచె, (హరి : I. 17-19)

ఈధార్మికత్వమునకు ఔదార్యము వన్నెవెట్టుచున్నది. ఈయన ఎఱ్ఱనార్యునిబిలిచి "సవినయంబుగఁబూజించి" హరివంశమునురచింపు మనికోరెను. ఇట్లు ధార్మికుఁడైనరాజు తన్నుసవినయముగాఁబూజించి, జగద్ధితముగ నుత్తమగ్రంథమును రచింపుమని ప్రార్థించునప్పుడు, వానికంకితముగా రచించుచుట మిక్కిలి సమంజసము. ఇది పరస్పరశోభావహము.

ఈరాజకవుల యాశయము మిక్కిలి పవిత్రమైనది. మహాభారతరామాయణాదిగ్రంథములను ఆంధ్రప్రజానీకమునకు మాతృభాషలోనందించి వేదధర్మములను ప్రోదిసేయవలయునని రాజరాజునకునునుమసిద్ధికి ఏసంకల్పముకలదో, దానిని కొనసాగించుటయే వేమారెడ్డికిని అభితము. ఆయుద్యమ నిర్వహణ ధురీణులై దానికి తమ కవితా తపస్సును ధారవోసిన నన్నయ తిక్కనల సంకల్పమును గొనసాగించుట యెఱ్ఱనార్యుని యభీప్సితము. ధర్మైకసిరతులైన యీ రాజకవుల సంయోగము ఆంధ్రసాహిత్యమునకు మహాపర్వమైనది. వేమారెడ్డి చూపిన సాహిత్యపోషణ మార్గమే తరువాత రెడ్డి రాజులకు మార్గదర్శకమై ప్రోత్సాహకారణమైనది.

## ii

ఎఱ్ఱనార్యుఁడు ముందుగా అరణ్యపర్వశేషమును రచించి పిదప నృసింహపురాణమును రచించెను. (నృసిం. పీఠిక. ప. 17) వేమారెడ్డి కంకితములైన రామాయణ హరివంశములను పిమ్మట రచించినట్లు తోఁచుచున్నది. ఈ రెండు జంటలలో నేది ముందని శంకించువారనేకులు కలరు. కాని రచనమునుబట్టి చూచినచో నృసింహపురాణమునందుకన్న హరివంశమున గొప్ప పరిణామము కన్పించుచున్నది. కావున రామాయణ హరివంశములనే కడపట రచించెనని చెప్పవలసియున్నది.

అరణ్యపర్వపూరణ మాత్రముననే యీయనకు నన్నయ తిక్కనలతో సమానస్థానము లభించెనని తలంపనక్కరలేదు. నన్నపార్యుని రచనమును పూరించుచు అరణ్యపర్వశేషమును రచించినట్లే, ఈయన తిక్కనార్యుని భారత గ్రంథమునకు పూరణముగా హరివంశమును రచించెను; రామాయణము పైతము నిర్వచనోత్తర రామాయణమునకు పూర్వగ్రంథముగా రచించియుండునని యూహింపవచ్చును. ఇట్లీతఁడు మహాభారత రామాయణములను తెలుఁగువారి కందింపఁబూనిన యిద్దరు మహాకవుల సంకల్పములను గొనసాగించుటకై వారి గ్రంథభాగములను గొప్ప ప్రతిభతో వారివలెనే రచించి కృతకృత్యుఁడైనాఁడు, కావుననే యితనికి వారితో సమానస్థానము లభించినది. జగత్సృష్టికి మూర్తిత్రయమువలె ఆంధ్రసాహిత్య ప్రపంచమునకు కవిత్రయ మేర్పడినది.

అరణ్యపర్వపూరణము ఈ యనఘుని యుదారతకు గొప్ప నిదర్శనము. నన్నపార్యుని సరసమైన సారస్వతపద్ధతి కొంత ఈయనకు లభించినదని లోకులు మెచ్చిరి. అట్టి సాధుజనులకు హర్షమును కలిగించుటకై నన్నపార్యుని కవితారీతి కొంత తోఁచునట్లుగా, ఆయన రచనముగానే ఆరణ్యపర్వశేషమును పూరించినట్లు ఈయన చెప్పుకొనెను.

కం॥ ధీరవిచారుఁడు తత్కవి, తారీతియుఁగొంత దోఁపఁదద్రచనయ కా
నారణ్యపర్వశేషము, పూరించెఁ గవీంద్రకర్ణపుట పేయముగాన్ ॥

(ఆరణ్య. అ. 7. ప. 469)

తత్కవితారీతియుఁ గొంత దోఁపఁజేయుటయేగాక "తద్రచనయ కా" పూరించె ననుట గమనింపఁ దగినది. గ్రంథశేషమును పూరించునప్పుడు, మొదట నా గ్రంథమెవని కంకితముగా నారంభింపఁబడినదో, వానికే యంకితముగా రచింపవలయు నని నియమములేదు. తిక్కనార్యుఁడు పైగ్రంథభాగములను హరిహరాంకితము గావించెను. కాని ఎఱ్ఱనార్యుఁడు ఈ పర్వశేషమును రాజరాజునకే అంకితము గావించుచు రచించెను. ఇది నన్నపార్యునందు ఈయనకుఁగల భక్తికి, సాహిత్యపోష కుఁడైన యా మహారాజునందుఁ గల యాదరమునకును చక్కని నిదర్శనము. ఇది మహోదారులందు తప్ప సామాన్యులందు సంభవింపదు. ఈయన మహనీయత యిందే వ్యక్తమగుచున్నది.

ఈయన కావించినది శిథిలభాగపూరణమే కాని గ్రంథరచనముకాదని కొందఱందురు. కాని ప్రాచీను లైనకవులు పెక్కురు దానిని గ్రంథరచనముగానే భావించిరి. ఎఱ్ఱన వంశీయుఁడు చదలువాడ మల్లన విప్రనారాయణ చరిత్రలో-

"ప్రతిభతో నారణ్యపర్వశేషముఁ జెప్పెఁ, గవులకుఁ జెవుల పండువులు గాఁగ"

అని పేర్కొనెను. "ప్రతిభతోఁ జెప్పె" ననుమాటకు గ్రంథరచనమే యర్థమగునుగాని శిథిలభాగపూరణముకాదు. ఇట్లే జక్కనకవి విక్రమార్కచరిత్ర యందును ఇట్లు పేర్కొనెను.

ఉ॥ ఈత్రయిఁ దాఁబ్రబంధపర, మేశ్వరుఁడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వము సశేషము......

అప్పకవియును "స్ఫురదరుణాంశు..." అను పద్యము మొదలుకొని ఎఱ్ఱనార్యుఁడు రచించెననియే చెప్పెను.

వ॥ ఎఱ్ఱాప్రెగ్గడ తనకును, నారణ్యపర్వశేషము మొదలి పద్యమునకును నక్షర చక్రముఁ జూచుకొని నందులకుఁ దెలివిడి. తెనుఁగున శబ్దాది యకారములేదు గనుక నెఱ్ఱాప్రెగ్గడ నామాద్యక్షర మచ్చుగాన, ఎకారమది మొదలుకొని వ్రాయఁగాఁ బద్యాదివర్ణము "స్ఫురదరుణాంశు" అన్నాఁడు.

(అప్పకవీయము. ద్వితీయాశ. 304)

ఈ పూర్వకవుల యభిప్రాయములే కాక, ఎఱ్ఱనార్యుఁడు అరణ్యపర్వశేషమున గ్రంథరచనమే కావించెనని చెప్పుట కానేకధారములు కలవు. మధ్యాక్కర లక్షణమునందు నన్నయ యెఱ్ఱనలలో భేదము స్పష్టముగాఁ గన్పించుచున్నది. నన్నయ పంచమగణాద్యక్షరమునకు యతిని బాటింపఁగా, ఎఱ్ఱాప్రెగ్గడ నాల్గవగణము మొదటి యక్షరమునకు యతిని పాటించెను కేవలము క్రిమిదష్టభాగములను ఎఱ్ఱన పూరింపఁదలఁచినచో నిట్లు మాతృకయందు ఛందస్సునే మార్చుట అసంగతము.

మఱియును గ్రంథసంఖ్యలో వీరి రచనములలో ఏర్పడిన తారతమ్యము ఈ విషయమున నిర్ణాయకముగా నున్నది. దీనిని త్రోసివేయుటకు సాధ్యముకాదు. నన్నయభట్టారకుఁడు ప్రారంభమున మాతృకలోని శ్లోకసంఖ్య నొసంగియున్నాఁడు. ఆయన ఆదిపర్వమున 9984 శ్లోకముల గ్రంథమును తెలుఁగులో 2050 గద్యపద్య

ములలో, అనఁగా సుమారు 1/5 వంతునకు రచించెను; 4311 శ్లోకములు గల సభా పర్వమును, 610 గద్యపద్యములలో, అనఁగా సుమారు 1/7 వంతునకు రచించెను. అరణ్యపర్వమున్ను ఇట్లే సుమారు 9 వేల శ్లోకముల గ్రంథమును నన్నపార్యుఁడు 1300 గద్యపద్యములలో వ్రాయఁగా, మిగిలిన సుమారు 5000 శ్లోకముల గ్రంథ మును ఎఱ్ఱనార్యుఁడు 1597 గద్యపద్యములలో రచించెను. నన్నయభట్టారకుఁడైనచో ఈ శేషభాగమును సుమారు 800 గద్యపద్యములలో రచించియుండును. ఉపాఖ్యాన ములందును ఎఱ్ఱనార్యుఁడు గావించిన పెంపు స్పష్టముగాఁ గన్పించుచున్నది. వేయింటికి పైగా శ్లోకములుగల నలోపాఖ్యానమును నన్నపార్యుఁడు 230 గద్యపద్య ములలో రచింపఁగా, 750 శ్లోకములుగల రామోపాఖ్యానమును ఎఱ్ఱనార్యుఁడు 350 గద్యపద్యములలో రచించెను. మొత్తముమీఁద నన్నపార్యుఁడు ఒక పద్యమును వ్రాయుచోట నెఱనార్యుఁడు రెండు పద్యములుగా వ్రాసినట్లు స్పష్టమగుచున్నది. ఎఱ్ఱనార్యుఁడు స్వతంత్రముగ గ్రంథరచనను గావింపక, శిథిలభాగములను మాత్రమే పూరించియున్నచో, ఈ శేషభాగమున మాత్రమే నన్నయ రచనలో ఇంతగా గ్రంథ సంఖ్య పెరుగుట అసంభవము. ఇది ఎఱ్ఱనార్యుని వర్ణన ప్రధానమైన రచనావిధానము వలననే సంభవించిన దని చెప్పవలసియున్నది.

వీరి కవితారీతులందును మిక్కిలి భేదము కన్పించుచున్నది. నన్న పార్యుని రచనమున నంతగాఁదోచని సాలంకారమైన యుజ్జ్వలరీతి ఎఱ్ఱనార్యునిరచన మున బాగుగా కన్పించుచున్నది. దీనిని సమకాలికులును తరువాతివారును చక్కఁగా గుర్తించిరి. ఈ యరణ్యపర్వశేషణపూరణమును గూర్చి ఎఱ్ఱనార్యుని తాతగారు ఎఱపోతసూరి యిట్లు ప్రశంసించెను.

ఉ॥ ఉన్నత సంస్కృతాది చతురోక్తిపదంబులఁ గావ్యకర్తనై
యెన్నికమైఁ బ్రబంధపర మేశు డనంగ నరణ్యపర్వశే
షోన్నయ మంధ్రభాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి, తా,
నన్నయభట్ట తిక్కకవి నాథులకెక్కిన భక్తిఁ బెంపునన్॥ (నృసిం - పీఠిక - 17)

ఇందు “ఎన్నికమైఁ బ్రబంధ పరమేశుఁడనంగ” అనునది గమనింపదగినది. ఈ యరణ్యపర్వశేషమును గూర్చియే జక్కనయును “తాఁబ్రబంధపరమేశ్వరుఁడై విరచించె శబ్దవైచిత్రి” అని ప్రశంసించెను. “చతురోక్తిపదంబులు” “శబ్దవైచిత్రి”, “కావ్యకర్తవు” అను పదములు ఎఱ్ఱనార్యుని కవితారీతియందలి ప్రత్యేకతను

వ్యక్తీకరించుచున్నవి. అరణ్యపర్వశేషవచనమున వ్యక్తమగుచున్న యీకవితా విశేషమునవలననే యీయనకు ప్రబంధపరమేశ్వరుఁ డనుబిరుదము కలిగినదనియు స్పష్టమగుచున్నది. మఱి ఆయన గ్రంథరచనము చేయక శిథిలభాగములను పూరించినచో ఇట్టి బిరుదము కలుగుట అసంగతము. కావున ఆయన 1557 గద్యపద్యముల గ్రంథమును స్వయముగా రచించెననియే చెప్పవలసియున్నది.

## iii

పై ప్రసంగమువలన సమకాలికులును తరువాతి వారును ఈయన కవితా విశేషమును, మహత్త్వమును, ప్రబంధపరమేశ్వరుఁ డనుబిరుదము మూలమున గుర్తించినట్లు వ్యక్తమగుచున్నది. ఈ బిరుదమే చిత్రమైనది. ప్రబంధములకు పరమేశ్వరుఁ డనగా పరిపాలకుఁ డనియర్థము. తిక్కనార్యునకుఁ గల కవిబ్రహ్మ యను బిరుదమునకు సాటిగా పండితు (ఎఱ్ఱపోతసూరి) లీ బిరుదమును ఎఱ్ఱనార్యునకిచ్చి యుందురు. నన్నపార్యుఁడు విష్ణునన్నిభుఁడై తిక్కనార్యుఁడు కవిబ్రహ్మయగుచో, ఈయన ప్రబంధపరమేశ్వరుఁ డగుట సమంజసమని పండితులు భావించి యుండవచ్చును. అట్లయినను కవిబ్రహ్మకు సమానముగా "కవీశ్వరుఁడు" "కవిపరమేశ్వరుఁడు" మొదలగు పదముల నుపయోగింపక ప్రబంధపరమేశ్వరుఁ డనుట యేమి? ఇందలి ప్రబంధశబ్దము రచనలోని విశిష్టతను వ్యక్తీకరించుచున్నదని చెప్పవచ్చును. ప్రబంధ మనఁగా ప్రకృష్ట మైన కథాబంధము గలకావ్యము. దీనినే మహాకావ్యమని సంస్కృతసాహిత్యమున పేర్కొందురు.

ఇట్టి మహాకావ్యమునే తెలుఁగున మహాప్రబంధ మని చెప్పుచున్నారు. ఈ ప్రౌఢ కావ్యలక్షణములు అరణ్యపర్వశేషరచనమున కొంతవఱకును, నృసింహపురాణమున పూర్ణముగను గన్పించుచున్నవి. దేవలోకము నుండి ధరణి కవతరించుచున్న గంగా ప్రవాహమును పరమేశ్వరుఁడు తన జటాజూటమునందు ధరించి మరల భగీరథున కొసంగినట్లుగా, దేవభాషాసాహిత్యము నుండి దేశభాషలోని కవతరించుచున్న ప్రబంధకావ్యలక్షణములను ఎఱ్ఱాప్రెగ్గడ స్వీకరించి యాంధ్రకావ్యవిధానమున కనుకూలింపఁ జేసి, శ్రీనాథాది కవులకు మార్గదర్శకుఁ డయ్యెను. కావుననే ఆయన ప్రబంధపరమేశ్వరుఁ డయ్యెను. లేదా విడివిడిగానున్న నన్నయ తిక్కనల గ్రంథ భాగములను చక్కఁగా కూర్చుటవలనను ఆయనకు ప్రబంధ పరమేశ్వరత్వము సిద్ధించిన దని యైన చెప్పవచ్చును.

ఈ ప్రబంధరచనా విశేషభావనకు బీజములు వేసినవాఁడు ప్రోదిచేసిన వాఁడును తిక్కనార్యుఁడే. ఆయన రచించిన నిర్వచనోత్తర రామాయణము సంస్కృతమహాకావ్యమార్గముననే నడచినది. విరాటపర్వారంభమున ఆయన "ఈ ప్రబంధమండలి కధినాథునిఁగా నేపురుషునిఁ బేర్కొనువాఁడనో"...అని, ప్రతి పర్వమును ఒక ప్రబంధమువలె తీర్చిదిద్దఁ దగినది, యను తలంపును గలిగించెను. మఱియును విరాటపర్వముననే సూర్యోదయాస్తమయములు, కీచక విరహాము మొదలుగా ననేకవిషయములను, మూలమున లేని వానిని మిక్కిలి పెంచి వర్ణించి, వర్ణనాత్మకముగా కావ్యమును పెంచుపద్ధతికి ఆయనయే మార్గమును చూపెను. ఈ మార్గమునే యవలంబించి ఎఱ్ఱాప్రెగ్గడ సన్నివేశములను, పద్యములను, పదబంధములను తీర్చి దిద్ది ఆంధ్రప్రబంధకర్తలకు ఆదర్శప్రాయుఁడయ్యెను. ఈయనకు పూర్వమే నన్నెచోడుని కుమారసంభవము ప్రౌఢప్రబంధముగా వెలసియున్నను, తరువాతి కవులెవ్వరును దానిని స్మరించినట్లు కన్పింపదు. ఎఱ్ఱాప్రెగ్గడనే ఎల్లరును స్మరించి యనుకరించిరి. శ్రీనాథుఁడును-

"పరిఢవింతుఁ బ్రబంధపరమేశ్వరుని శేవ । సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు"

అని యాదరపురస్సరముగా పేర్కొనెను. కావున మొత్తముమీఁద ప్రౌఢమైన మహాప్రబంధ పద్ధతియందు ఆంధ్రకవులకు ఎఱ్ఱానార్యుఁడే కులగురు వని చెప్పవచ్చును.

## iv

ఈ ప్రబంధ కవితాస్వరూపమును చక్కఁగా గ్రహింపవలయు నన్నచో దీనికి మూలమైన సంస్కృత మహాకావ్యలక్షణములను పరిశీలించుట యావశ్యకము. కావ్యాదర్శమున దండ్యాచార్యుఁడు సర్గబంధము కలది మహాకావ్యమని, దానిలక్షణమును వివరించెను. "ఆశీస్సు, నమస్కారము, వస్తునిర్దేశము అనువానిలో నొక దానితో నది ప్రారంభమగును. అందు ఇతిహాసకథ కాని, సత్పురుషవృత్తాంతముగాని కథావస్తువుగ నుండును. చతుర్వర్గఫలప్రదమగు నీ మహాకావ్యమున నాయకుఁడు చతురోదాత్తుఁడై యుండును. ఇది నగరార్ణవశైలాదులైన పదునెనిమిది విషయముల వర్ణనములతో కూడి, యలంకృతమై, యసంక్షిప్తమై, రసభావనిరంతరమై యుండును. ఇందలి సర్గలు అనతివిస్తీర్ణములై, శ్రావ్యములైన వృత్తములతో, సుసంధులతో,

భిన్నవృత్తావసానములై యుండును. మంచి యలంకారములతో కూడిన యిట్టి కావ్యము లోకరంజకమై కల్పాంతరస్థాయి యగును".

(కావ్యాదర్శము, ప్రథమపరిచ్ఛేదము శ్లో॥ 14 - 19)

కిరాతార్జునీయ శిశుపాలవధాది కావ్యములందు పై లక్షణములన్నియు చక్కగా పొందుపడి యున్నవి ఈ కవులు అలంకృతము, అసంక్షిప్తము అను లక్షణమున కధికగౌరవము నొసంగినట్లు కన్పించుచున్నది. వీనియందు కథాగమనము ముఖ్యముకాదు. అది సుప్రసిద్ధము కావున, దానిని ప్రసన్నముగఁ జెప్పబూనుట యనావశ్యకము కావున వివిధ సన్నివేశములను లోకోత్తరముగ వర్ణించుచు, ప్రసంగములను నిపుణముగ తీర్చిదిద్దుచు పండితుల కాహ్లాదమును గలిగించుటయే ఆ కవులకు పరమప్రయోజనముగా నుండెను ఆ కావ్యములు సాధారణ ప్రజానీకము కొఱకు నుద్దేశింపఁ బడినవి కావు. కావుననే సాధారణముగా ప్రతికవియును సాధ్యమైనంతవఱకు అష్టాదశవర్ణనములను సాంగోపాంగముగా చేయుటకు ప్రయత్నించెను. కొన్నియెడల నిట్టివర్ణనలు విసుఁగును సైతము కలిగించుచుండును. దీని నిరూపించియే కాఁబోలు దండాచార్యుఁడు, "కావ్యమున కొన్ని యంగములను వర్ణించుటవలననే రసజ్ఞులకు నాహ్లాదము కలుగుచున్నచో, తక్కినవానిని వర్ణింపకున్నను దోషముకా" దని చెప్పెను. కావ్యమున రసపోషణకు ముఖ్యప్రయోజనముకాని వర్ణనము కాదని యాయన యభిప్రాయము. (కావ్యాదర్శ. I. పరిచ్ఛేద శ్లో॥ 20)

దీనిని పెక్కురు గుర్తింపక దీర్ఘవర్ణనములతో ప్రతి సన్నివేశమును ఒక్కొక్క సర్గగా దిద్దితీర్చుటకు ప్రయత్నించిరి. కుమారసంభవ నైషధాది కావ్యములందు ఇది స్పష్టముగా కన్పించును. వానిలో సౌందర్యము ప్రతిపద్యగతము మఱి తెలుఁగున నన్నయ తిక్కనల రచనలు అట్టివి కావు ఎక్కడనేని ఒకటి రెండు పద్యములు తీర్చినట్లున్నను తక్కిన పద్యములన్నియు కథాప్రధానములుగనే వచనముల వలెనే యుండును. తిక్కనయందు ప్రాబంధిక రచనోద్యోగము ఉత్తరరామాయణమున విరాటోద్యోగములందును కన్పించినను, పై పర్వములలో క్షీణించినది. నన్నపార్యుని యందీ ప్రయత్నము మృగ్యమనియే చెప్పవచ్చును. ఆంధ్రమహాభారతము సాధారణ ప్రజానీకముకొఱకు ప్రారంభింపఁ బడినది. ప్రాబంధిక రచనము ప్రజానీకమునకు ప్రయోజనకరముగాదు కావున నన్నపార్యుఁడు దానిజోలికి పోక వ్యాసుని మార్గముననే యవలంబించెను

## V

ఎఱ్ఱాప్రెగడ భట్టారకుని మార్గమున ప్రసన్నకథావిధానమును పాటించి యును, తన కభిమతమైన ప్రాబంధిక విధానమును సైతము అరణ్యపర్వశేష రచనము ననే ప్రవేశపెట్టెను. ప్రారంభముననే యిది స్పష్టముగ కన్పించుచున్నది. ఇందు శరదృతు వర్ణనమును గమనింపుఁడు.

శా॥ దానాంభః పటలంబునం బృథుపయో ధారావలిం దాల్చి గ
(అను పద్యములు అరణ్య. IV. 144 - 146)

వీనియందలి భావకల్పనము, పదసంఘటనమును మిక్కిలి యుజ్జ్వలముగా నున్నదనుట స్పష్టము. ప్రతిపద్యగతమైన యీ సౌందర్యము సైంధవపరాభవ ఘట్టమున నింకను చక్కఁగా ప్రకాశించుచున్నది. ద్రౌపది సైంధవుని బెదరించునపుడు పాండవుల నేవురను ముందొక పద్యములో చెప్పి, పిమ్మట నొక్కక్కరి నొక్కొక్క పద్యమున వర్ణించుచు నకులసహదేవుల నొక్కపద్యమునఁ జెప్పెను. తుదకు మరల నందఱ నొకపద్యమున చెప్పెను. తరువాత పాండవులు సైంధవుని తఱుముకొనుచు వత్తురు. అప్పు డాతఁడు వారినిగూర్చి యడుగఁగా నామె మరల నొక్కొక్కరుని యాకృతిని ఒక్కొక్క పద్యమున శౌర్యమును వర్ణించును. మొదట 6 పద్యములు, పిదప 9 పద్యములును గలవు. నన్నయభట్టారకుఁ డైనచో నిట్లు వర్ణించియుండఁడు. ఏమైనను ఎఱ్ఱాప్రెగడ దీనియందు ప్రసన్న కథాగమనమును వీడకుండుటచే, ఈ యుజ్జ్వలత్వ మంతయును దానికి శోభను కలిగించెను. ఈ పద్యములందు ధర్మ రాజాదులయాకృతులు కనులకుఁ గట్టినట్లుగా చక్కఁగా చిత్రింపఁ బడినవి. ఇట్లే సావిత్ర్యుపాఖ్యానమునను యమునియాకృతి కడురమణీయముగ వర్ణింపఁ బడినది.

మ॥ కనియెం గోమలనీలమేఘ విలస। త్కాలాంజనాకారు ఘో
(అను పద్యము, అరణ్య. VII. 216)

ఇట్టి రూపచిత్రణముకాక అచ్చటచ్చట శబ్దాలంకారములను సైతము ఎఱ్ఱాప్రెగ్గడ చక్కఁగా సమకూర్చినాడు.

వ॥ అట్టి శారదాగమంబున నుత్ఫుల్లకమలకల్హార కేసర కరాళకలిత కల్లోల మాలినియు ననేక మునిలోక సతతసంసేవ్యమాన విపులపులినోత్సంగయు నిరంతర తీర వానీర వనమండలీవిలసితయు నాకాశ సంకాశవిశద సలిలయు నైనమహా సరస్వతీనది ననుదినస్నానపానాది విశేషంబులం బరితోషంబు నొందుచు....
(అరణ్య. IV. వ. 148)

ఇందు శబ్దార్థాలంకారములతో సరస్వతినది మిక్కిలి రమణీయముగ చిత్రింపఁ బడినది. ఈ చిత్రణకౌశలమునే ప్రాచీనులు "చతురోక్తి పదంబులు", "శబ్దవైచిత్రి", "సూక్తివైచిత్రి" యనియు ప్రశంసించియుందురు.

ఇంత విశిష్టమైన వర్ణనాత్మకమైన శైలి తనకు సహజమైనను ఈయన గ్రంథమున చాలభాగము నన్నపార్యుని శైలికభిన్నముగ వ్రాయఁగల్గుట మిగుల నాశ్చర్యకరము. ఎవనికైనను తనమార్గమునఁ బోవుట ఎంత సులభమో, పరులమార్గమున బోవుట అంత కష్టమగును. అందును మఱియొక మహాకవిమార్గమున రచించి కృతకృత్యుఁ డగుట యింకను దుర్ఘటము. ఇది సాహిత్యమున నొకవిధమైన సాహసవీరము. ఇందు ఎఱ్ఱాప్రెగడ అఖండవిజయమును సాధించెనని చెప్పవచ్చును. భారతమును మొదలునుండి తుదివఱకును జదువుచుఁబోయినచో ఒకకవియే భిన్నదశలలో భిన్నవృత్తాంతములలో వివిధరచనావిధానములతో గ్రంథమును సాగించె ననుతలంపే కల్గును గాని, సూక్ష్మముగా పరిశీలించిననే తప్ప, భిన్నకవులు రచించినట్లు తోఁపదు. దీనివలననే మహాకవులైన నన్నయ్య తిక్కనల గ్రంథభాగములను ఎఱ్ఱాప్రెగడ ఎంతచక్కగా ప్రబంధించెనో వ్యక్తమగుచున్నది. అనేకస్థలములలో ముందుగా తెలియకపోయినచో నరణ్యపర్వశేషమున నన్నయరచనమో ఎఱ్ఱనరచనమో గుర్తించుట దుర్ఘటము. నన్నపార్యుని కథాప్రసన్నత, అక్షరరమ్యత, నానారుచిరార్థసూక్తికౌశలము ఎఱ్ఱాప్రెగడ ఎట్లు కైవసము కావించుకొనెనో చూడుఁడు. సత్యవంతుఁడు పునర్జీవితుఁడైన పిమ్మట తల్లిదండ్రులను గూర్చియిట్లు తలంచును.

ఆ॥ సంధ్యప్రొద్దు నన్ను జనని యొన్నఁడు నిలువెడల నీదు నేఁడు లిపినభూమి
మధ్యరాత్రివేళ మసలుట కాయమ యెట్టిపాటుపడునొ యేనెఱుంగ

సీ॥ కౌగిట ననుఁ జిక్కఁ గదియించి శిరము మూ
ర్కొంచును భాష్పముల్ గురియుచుండఁ

(అను పద్యము, అరణ్య VII 260, 261)

ఇట్లనేకస్థలములలో ఈరచనము నన్నపార్యుని రచనమున కభిన్నముగ కన్పించుచుండుట వలననే అరణ్యపర్వమంతయు నన్నయభట్టారకుఁడే రచించెననియు, దానిలో క్రిమిదష్టములైనభాగము లనుమాత్రమే ఎఱ్ఱాప్రెగ్గడ పూరించె

ననియు తలంచుట కవకాశము కలిగినది. ఇది యీయన పూరణకౌశలమునకు గొప్ప నిదర్శనము.

## vi

ఈయన నృసింహపురాణమున మాత్రము అచ్చముగా వర్ణనపూర్ణమైన ప్రబంధపద్ధతినే యవలంభించెను. సంస్కృతమున ప్రౌఢులైన మహాకవు లేర్పఱచిన కావ్యమార్గముననే తానును మహాప్రబంధము నిర్మించెదనని స్పష్టముగఁ జెప్పినాఁడు.

ఉ॥ మించినవేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు కూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁ గదంగు భంగిఁ బ్రౌ
ఢాంచిత శబ్దసారులు మహాకవు లాద్యులు కావ్యశయ్యఁ గీ
లించిన కీర్తిసంగసుఖలీలకు నేనును గాంక్షఁ జేసితిన్॥

వ॥ ఇట్లు మహాప్రబంధ కల్పనాకుతూహలాయత్తం బగుచిత్తంబుతో నొక్క నాఁడు.........

(నృసింహ - పీఠిక - 13, 14)

ప్రౌఢాంచిత శబ్దసారులనుటవలన భారవి మాఘభట్టబాణాదిమహాకవులు సంస్కృతసాహిత్యమున నెట్టికీర్తిని సంపాదించిరో అట్టికీర్తినే తానును ఆంధ్ర సాహిత్యమున సంపాదింపఁ దలంచెననుట స్పష్టము. ఈయన భట్టబాణ కాళిదాసాదికవులనే యిందు ఆదర్శముగాఁ గొనియుండునని చెప్పుటకు, ఈగ్రంథమున ఈయన వారి రచనావిధానము లననుసరించి యుండుటయే ముఖ్యకారణము. ఈప్రౌఢకావ్యపద్ధతిని గూర్చియే మునుల "ఊర్జిత శుభసంపదనొనరింతుఁ బ్రబంధము సదయన్నృసింహావతారసంస్తవ సంగతిన్" చెప్పినాఁడు తాతగారును ఈయనను "ప్రబంధరచనా ప్రావీణ్యము నీకు సహజపరిణత సిద్ధంబై వెలసినయది" ...ప్రశంసించినాఁడు కావున విశిష్టమగువిధానమున ఆంధ్రమున నొకమహాప్రబంధమును నిర్మించుటకై యీయనకు కుతూహలముకలిగె ననుటస్పష్టము.

అర్వాచీనకవుల కాదర్శప్రాయములైన ప్రబంధలక్షణము లన్నియు దీనియందు పొందుపడి యున్నవి. కథ ప్రహ్లాద చరిత్రము - ఉపాఖ్యానములు లేవు. రచనమునందు అసలుకథ నైనను ప్రసన్నముగ చెప్పుట ప్రధానముకాదు ప్రత్యంశమును ప్రౌఢముగ భావించి యుజ్జ్వలముగ వర్ణించుటయే ముఖ్యము.

ఇందులకు మొదటియాశ్వాసమునే యుదాహరణముగ గ్రహింపవచ్చును. దేవశ్రవుం డనుముని గాలవుం డనుమునికి అహోబలక్షేత్ర మాహాత్మ్యమును చెప్పం బూని ముందుగా పాలకడలిని 12 పద్యములలో వర్ణించును; వెంటనే దానిలోని శ్వేత ద్వీపమును, వైకుంఠనగరమును 17 గద్యపద్యములలో వర్ణించి, 7 గద్యపద్యములలో శ్రీమన్నారాయణుని నగరును వర్ణించును; వెంటనే 10 గద్యపద్యములలో శ్రీమన్నారాయణుని వర్ణించును. ఇట్లు దీర్ఘములు ప్రౌఢములునైన 46 పద్యగద్యములలో వర్ణనములైన పిదప సనకసనందనాదులు ప్రవేశింతురు. వారు జయవిజయులను శపించుట 26 గద్యపద్యములలో జరిగి ఆశ్వాసము ముగియును. భారతకథాగమన వేగమునకు అలవాటుపడినవారికి ఇది కొంత వెక్కసముగా నుండుట సహజము. మఱియును దీనియందు ప్రతిపద్యము ప్రత్యేకకల్పనలో తీర్చిదిద్దం బడి యుండును. వచనములు దీర్ఘములై సాలంకారములై సమాస భూయిష్ఠములై భట్టబాణుని కాదంబరిని, హర్షచరిత్రను దలపించుచున్నవి.

వ॥ మఱియు నప్పురంబు పురుషోత్తము మహిమయుం బోలె వర్ణనాతీతవైభవంబును, లక్ష్మీహృదయంబునుంబోలె నారాయణనివాస యోగ్యంబును...సముత్తుంగ గాంగేయభవన భాసురం బయ్యును శిఖండివిహారహృద్యంబును, వివిధ విలాసినీ విలసనోల్లసితం బయ్యును జితేంద్రియగమ్యంబును, సముద్రోదర స్థితం బయ్యును సుకవిరాజ మానంబును నై ... (నృసింహ - I 55)

ఈ వచనరచనమే తరువాతి పోతనార్యునకును, ప్రబంధకవులకును, మార్గము చూపినది. చూడుడు! భారతములోని ప్రసన్నమైన వచనరచనమునకు దీనికిని సంబంధమే లేదు. దేవతలు వైకుంఠమునకు పోయినప్పుడు శ్రీమన్నారాయణుని యాకృతి 77 పంక్తుల సమాస భూయిష్ఠగద్యములో వర్ణింపఁబడినది. దేవతలా మహావిష్ణువును [illegible]3 పద్యములలో స్తుతించిరి. ఇందలి పద్యము లనేకములు అనుప్రాసాలంకారశోభితములై శతకములలోని పద్యములకు మూలములుగా భావింపఁదగి యున్నవి.

ఉ॥ శ్రీవసుధాకళత్ర యతసీసుమనోతి మనోజ్ఞగాత్ర మా
యావిహితత్రిలోక నిగమార్థవివేక విపాకభవ్య సం
సేవక సౌమ్యమానస వశీకృతరూప భవాంధకార ని
ర్ధావనదీప దీప్తనవ తామరసేక్షణ విశ్వరక్షణా ॥
(నృసింహ - III - ప. 17)

vii

వర్ణనకల్పనములందు, పద్యగద్యరచనా శిల్పమునందును శ్రీనాథపోతనలకు, ప్రబంధకర్తలకును ఈయన అనేకవిధముల మార్గదర్శకుఁడయ్యెను. సీసమును కరగించి పోఁతపోసి యీయనయే శ్రీనాథునకందించెను. ఈ సీసపద్యమును చూడుఁడు. ఇందు చంద్రుఁ డుదయించుచున్నాఁడు.

సీ॥ తిమిరభూతముసోఁకుఁ దెలియ జగత్త్రియీ లలన దాల్చిన రక్తతిలక మనఁగ ॥
(అను పద్యము - నృ. III. 84)

పెద్దనార్యుని "కలశపాథోరాశి గర్భవీచిమతల్లి, కడుపార నెవ్వానిఁ గన్నతల్లి" యను భావమునకు మూలమనుగాఁ జెప్పఁదగిన యీ కల్పనమును జూడుఁడు.

సీ॥ అమృతాంబునిధి సముదంచితవీచిక । కుదయించు తుహినమయూఖుఁ డనఁగ ॥
(నృసింహ - III ప. 137)

పోతనార్యునిశైలికిమూలముగా భావింపఁ దగినపద్యగద్యము లనేకము లిందుఁ గలవు.

సీ॥ వాసుదేవుని పాదవనరూపంబుల భక్తి । తగ దనుతండ్రియుఁ దండ్రిగాఁడు
V. - 22

సీ॥ కలఁడు మేదినియందుఁ గలఁ డుదకంబులఁ
గలఁడు వాయువునందుఁ గలఁడు వహ్నిఁ V. - 78

స్తంభోద్భవవచనమును గమనింపఁ దగియున్నది.

వ॥ అమ్మహాస్తంభంబున విజృంభమాన జిహ్వాల విస్ఫారితావదన గహ్వర స్ఫురద సహ్య కహకహాట్టహాస గర్జానూర్జితంబును, వికట కఠోర ఘోరదంష్ట్రా దండదారుణ దహన దంచహ్యమాన దశదిశాభాగంబును...... (V. 82)

ఈయన రామాయణము నెట్లు రచించెనో తెలియదు. అదియిప్పుడు లభ్యమగుటలేదు. కొన్నిపద్యములుమాత్రము లభించుచున్నవి. కూచిమంచితిమ్మన రచించిన సర్వలక్షణసారసంగ్రహమునందు ఉదహరింపఁబడిన పద్యములనైదింటిని, ఒకసంకలిత గ్రంథమున ఎఱ్ఱనరామాయణములోని వని వ్రాయఁబడినవిగా "భారతి"లో కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించిన 27 పద్యములను, శ్రీ నందూరి

రామకృష్ణమాచార్యులుగారు తమ "కవిత్రయ" మను గ్రంథమున ప్రకటించిరి. శతావధాని శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారిచే పరిష్కరింపబడి యిటీవల ప్రకటింపఁబడిన హరివంశమున పీఠిక కనుబంధముగా ఎఱ్ఱనరామాయణములోనివని పద్యములనేకములు ప్రకటింపఁబడినవి. వీనిలోఁ బెక్కింటికి సందర్భము తెలియుటలేదు. పద్యరచనము చాలవఱకు ప్రసన్నముగానున్నది.

చదలువాడ మల్లన "రామాయణంబు నాంధ్రప్రబంధముగఁ జేసె" అని చెప్పుటవలన దీని నీయన నృసింహపురాణమువలెనే ప్రౌఢప్రబంధముగ రచించెనేమో యని తోఁచుచున్నది. నిర్వచనోత్తర రామాయణమునకు పూర్వగ్రంథముగా నుద్దేశించి దీనిని నిర్వచనముగ సైతము రచించియుండ వచ్చును. అట్లు నిర్వచనమై ప్రౌఢమైన కారణముననే యిది సామాన్య ప్రజానీకమునకు అందక ప్రచారమునకు దూరమై పోయియుండ వచ్చును.

## viii

ఈయన కవిత్వము హరివంశమున చక్కని పరిపాకస్థితికి వచ్చినది. ఇప్పటికి ప్రబంధరచనావేశము శమించినది. ఇప్పటివఱకును కథమీఁదకన్న కవిత్వముమీఁదనే చూపు హెచ్చుగా నుండెను. హరివంశమున మరల నన్నయ తిక్కనల మార్గమునకుఁ దిరిగి వచ్చినాఁడు. పీఠికయం దిట్లు చెప్పుచున్నాఁడు.

ఉ॥ నన్నయభట్ట తిక్కకవి నాథులు చూపినత్రోవ పావనం
బెన్నఁబరాశరాత్మజము నింద్రునివాఙ్మయ మాదిదేవుఁడే ॥

(హరివంశ - పీఠిక. ప 42)

వర్షాకాలములో వచ్చిన ప్రవాహమునందలి రొండుమట్టి శరత్కాలమునకు దిగిపోఁగా నీరు ప్రసన్నమగునట్లు ఎఱ్ఱనార్యుని రచనయును కాలక్రమ పరిపాకమున మిక్కిలి ప్రసన్నమైనది. అరణ్యపర్వశేషమునందుకన్నను దీనియందు రచన అనుజ్జ్వలమై సహజరమణీయముగా నున్నది. ఈయనకు సహజమైన వర్ణనానైపుణ్యము, చిత్రణకౌశలము, శయ్యాసౌభాగ్యము దీనియందు కథాగమనమున కనుకూలములై కమనీయముగా నున్నవి. బాలకృష్ణుఁడు పూతన ప్రాణములను పాలతోఁ గొనుట నెంత చక్కఁగా నీతఁడు వర్ణించెనో చూడుఁడు.

ఉ॥ ఎత్తిలి కావుకావు రన నేడ్చి తదీయ పయోధరాగ్రముల్
కుత్తుక దాఁకఁ బెట్టుకొని క్రోలెఁ గ్రమంబునఁ జన్నుఁ బాలతో
నెత్తురు మున్నుగాఁ గరఁగ గణీయములై చనుస ప్తధాతువుల్
పొత్తుగఁ బ్రాణముల్ చెనఁటి బొందియ త్రిక్కఁగ నొక్క వ్రేల్మిడిన్ ॥

కం॥ రక్కసికిని దానెక్కుతు రక్కసియై కృష్ణుఁ డిట్లు క్రౌర్యావేశం
బక్కజముగఁ బసరింపఁగ నక్కుటిలాచారి గెదెసె హా యనుచుభువిన్ ॥
(పూర్వ - ఆ. 5 - 151, 152)

కృష్ణుఁడు శకటాసురుని సంహరించినప్పుడు యశోదకు కలిగిన సంభ్రమము మిక్కిలి సహజముగ వర్ణింపఁబడినది.

వ॥ అతిత్వరితగతి నేతెంచి విపర్యస్తంబైన శకటంబు నంతంతం గని హా యనుచుం బఱతెంచి పుత్త్రు నెత్తి యుదరంబున నదిమికొని

ఉ॥ నిన్నిటు పాఱవైచి తగనిద్దుర వోయెడుఁ బాపఁడంచు నే
మిన్నక నీళ్లనాట యను మిత్తికి నేఁటికిఁ బోయితి న్నిజం
బన్న కుమార యింకిపుడ యర్థి భవజ్జనకుండు వచ్చి
నెన్ని తెఱంగులం జఱుపఁ డింకయుఁ జూచి తనర్చు సల్కతోన్॥
(పూర్వ - ఆ. 5 - 177, 178)

అల్లరిచేసిన కృష్ణునితో విసిగిఁ యశోద యిట్లనుచున్నది.

కం॥ వఱువాతలేచి నీదగు కొఱగాములు చక్కఁద్రోచికొనఁ బోయి దినం
బెఱులువడి చనిరొ నీపను లఱజాలివి నిన్ను నేమి యననేర్తు సుతా ॥
(పూర్వ - ఆ. 5 - 242)

కృష్ణుఁడు కాళియునిచేఁ జుట్టబడి నప్పుడు యశోద యెట్లు విలపించుచున్నదో చూడుఁడు.

ఉ॥ వెన్నలు దిన్న తప్పునకు వ్రేతల మెచ్చుగ నాఁడు రోలితో
నిన్నటు గట్టి త్రోచినయ నీతిఁ దలంచితొ నేఁడు నన్ను నో
చెన్నఁడ యిట్లు నొంచెదవు విశ్రుతసత్త్వుఁడ వీవు నీకునీ
చెన్నఁటి పాఁపపు ర్వొకటి సేయఁగ నోపెనె యేపునూవవే ।
(ఇత్యాది.)

ఈ ఘట్టములలోఁ గొన్నిమొదలఁ బోతనార్యుఁడు రసాతిశయమున రచించినమాట వాస్తవము. కాని భారతరచనామార్గమున నిందలి శైలిరసప్రవాహ సహితముగా నున్నదనుటయును వాస్తవమే.

భారతమునకు భాగవతమునకు మూలములలోనే కథలయందే కాక శైలియందును కొంతభేదము కలదు. భాగవతములో ననేక ఘట్టములు కావ్య శయ్యా సౌభాగ్య శోభితములై కాళిదాస రచనమువలె నుండును. రుక్మిణీదేవి కృష్ణున కంపిన సందేశము భాగవతమూలమున 7 మనోజ్ఞవృత్తములలో రమణీయముగ రచింపఁబడి యున్నది. హరివంశమున నది కానరాదు. దీనియందుఁగల కంసుని జన్మవృత్తాంతము పాత్రచిత్రణము భాగవతమున లేదు. ఎఱ్ఱనార్యుని వచనరచనా విన్యాసమున కంసుని పాత్ర యెట్లు చిత్రింపఁబడుచున్నదో చూడుఁడు. తన్ను మోసగించి కృష్ణుని తప్పించి రక్షించెనని వసుదేవుని కంసుఁడు నిందించుచున్నాఁడు.

వ॥ నీవు చక్రవర్తివంశంబున జనియించి బాల్యంబునం గోలెను మాతండ్రియ పెంపం బెరిగి, మాతోఁబుట్టువునకుం బెనిమిటివై, యాదవులు గురుస్థానంబుగా పాటింపంబడగి, జనులలో నెన్నికఁగని, పిదప నీనీచకర్మంబునకుం జొచ్చితి; నీ వెట్టివాఁడ వైన నగుదుగాని నే నిన్ను వధియింప నోప; నింతకుమున్ను బంధుమిత్ర ద్విజవధంబులు సేయ, నింకం జేయంగలవాఁడనుం గాను; నీచేయు దుర్ణయంబుల వలన మేలు వచ్చినం గీడొందిన నది దైవకృతం, బని యుండెద పూ. ఆ. 8 - 72

చ॥ జనకునిఁ గన్నఁగిన్నడును సభ్యుల బంధులఁ గాంచినం గడున్
గనలుదుఁ దల్లిదిక్కునను గౌరవబుద్ధి యొకింత లేదు నా
కనయము నట్టితండ్రి నిగళాభిసియుం గ్రతుఁ జేసి రాజ్యముం
గొని యనిరోధవీధి నధికుండన నిట్టిఁడనైతి నుద్ధతిన్॥ (పూర్వ. ఆ. 8-85)

ఇట్టి భావసంఘర్షణము కలవానియందు మనకును కొంతజాలి కలుగుట సహజము.

## ix

నాచన సోమనాథుఁడును తిక్కనసోమయాజి కనంతర స్థానమును సంపాదించుటకును తర హరివంశమును రచించెను. అందువలన నితనిని ఎఱ్ఱాప్రెగ్గడతో కొందఱు పోల్పఁదలంచుట సహజము. కాని అనావశ్యకము. సోమనాథుఁడు వ్యాసముని ప్రణీత పరమార్థమును దెల్లముచేయుటకై హరివంశమును చేపట్టినట్లు తోఁచుట లేదు. ఇతఁడు ఉత్తరభాగములోని కొన్ని రసప్రధానము లైనకథలను మాత్రమే తీసికొని ప్రబంధమార్గమున రచించెను. ఇతఁడీ కావ్యకళయందు ఎఱ్ఱనార్యునికన్న మిక్కిలి ప్రౌఢుఁడు. అందువలన రచనము ప్రసన్నతకు దూరమైనది. నృసింహపురా

ణమున నెట్టిన ఎంతగా ప్రబంధశైలి నవలంబించినను, ఆయనభక్తి భావాతిశయము రచనమునకు దీప్తిని ఉదాత్తతను పవిత్రతను గలిగించుచునే యున్నది. సోమనాథుని రచనమున నిది మృగ్యము, ఎచ్చటనైన నితఁడు భక్తిని వర్ణించినను. అది కడు శుష్కముగ నుండును. ఈతనికి శృంగార రసపోషణ మిష్టము. కాని ఆఘట్టములందు ఉదాత్తత కన్పింపదు. కదనరంగములపై నీతని కభిమానము మెండు. కాని ఆఘట్టములందు శబ్దాడంబర మధికమై విసుగును కలిగించుచున్నది. ఈతని గ్రంథమునకుఁ బీఠికను వ్రాసిన కీ॥ శే॥ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి యభిప్రాయము ఈవిషయమున గమనింపఁదగినది.

"ప్రాచీనాంధ్రకవి కృతులలో దురవబోధము లనబడువానిలో సోమనాథునికృతి ప్రధానమయినది. అప్రతీతపదప్రయోగాభిమానము చేతను, శయ్యానైగనిగ్యసంపాదనప్రీతిచేతను, అనుప్రాసవిన్యాసాభిరతిచేతను, నీతఁడు తనకృతిని బెక్కుపట్టులందు దురవబోధము గావించెను. అందును వచనరచనములో మఱియుఁ గఱకుఁదనముఁ జూపెను. ఆంధ్రకవులలోఁ జిత్రకవిత్వమును వెలయించినవారిలో నీతఁడే ప్రథముడుగాఁ గానవచ్చుచున్నాఁడు" (ఉత్తరహరివంశ పీఠిక - పే. XII)

ఈ చిత్రకవిత్వ ప్రియుని, పవిత్రకవితావేశముతో రసప్రవాహ మహితముగా రచించు మహాకవి యగునెఱ్ఱనార్యునితో పోల్చుట నిరర్థకము. కావుననే నాఁటినుండి నేఁటివఱకును రసజ్ఞమగు నాంధ్రప్రజానీకము సోముని త్రోసిరాజని ఈ మహాకవికే నన్నయ తిక్కనలతో సమానస్థాన మొసంగుచున్నది.

ఈ మహాకవికి ఆంధ్రసాహిత్యమునఁ గలస్థాన మచంచలమైనది. ప్రసన్న కథనమునకు నన్నయభట్టారకుఁడు, నాటకీయరచనమునకు తిక్కనసోమయాజియు ఆచార్యులు కాఁగా, వర్ణనాత్మకమైన ప్రబంధపద్ధతికి ఈయన కులగురువయ్యెను. ధర్మతత్త్వోపదేశరూపమగు వ్యాసవాల్మీకుల పరమార్థమును గుర్తించి, దానిని ఆంధ్రప్రజానీకమున కందించుటకై, ఆద్యులగు నన్నయ తిక్కనల మార్గమున తన కవితా తపస్సును ధారవోసిన యీ మహనీయుఁడు మనకు ప్రాతస్స్మరణీయుఁ డగుచున్నాఁడు.

[ శ్రీ వర్ధమాన సమాజ యాజమాన్యమున నిర్వహింపబడిన "ఎఱ్ఱాప్రెగడ జయంతి" మహాసభలో నెల్లూరు పురమందిరమున 10-4-1960 తేది నొసంగిన యుపన్యాసమే యీ వ్యాసము. ]

# 77.

# నవ్యాంధ్రసాహిత్యంలో నెల్లూరు మండలీయుల

## ★ క్రొత్త తెన్నులు ★

ఉండేల మాలకొండారెడ్డి. బి. ఏ.

నెల్లూరుమండల సాహిత్యమనగానే వేదం వెంకటరాయశాస్త్రి, దుర్భా సుబ్రమణ్యశర్మ, దీపాల పిచ్చయ్యశాస్త్రి, దువ్వూరు రామిరెడ్డి, మోచర్ల రామకృష్ణయ్య, పఠాభి, దుర్భా రామమూర్తి, నాగపరెడ్డి, ఆత్రేయ, రమణారెడ్డి మున్నగువారు జ్ఞప్తికివస్తారు. రచనావిధానాలనుబట్టి, వీరిలో కొందరు ప్రాచీనులు, కొందరు, నవ్యులు కొందరు నవ్యులలో నవ్యులు, కొందరు రెండుతెగలకు చెందిన వారూ ఉన్నారు.

నవ్యసాహిత్యంలో క్రొత్తతెన్నులుగూర్చి వ్రాసేముందు నవ్యసాహిత్యమంటే యేమిటో కొంత విచారిద్దాం. సాహిత్యంలోగాని, మరేవిషయంలోగాని "నవ్యత" అన్నది కాలానుగుణంగా మారుతూ ఉంటుంది. ఈనాడు మనం "క్రొత్త" అన్నది రేపటికి "ప్రాత" కావచ్చు కవిత్రయంలో ఆదికవియైన నన్నయభట్టారకుడు ఆనాటి నవ్యసాహిత్యస్రష్ట. పండితభాషయైన సంస్కృతానికున్న గౌరవం ఆనాడు ప్రజాభాషయైన తెలుగుకులేదు. సాహిత్యం కేవలం పండితులకేకాదు సామాన్యప్రజలకుకూడా అందుబాటులో ఉండాలన్న ఆశయమే బహుశః ఆనాడు మహాభారతాంధ్రీకరణకు నన్నయను పురికొల్పిఉండవచ్చును. సంస్కృతభాషా వాసనలు పూర్తిగావదిలిపోని నన్నయకవిత్వానికీ, తెలుగునుడికారపు సొంపుతో నిండియున్న తిక్కన కవితకు ఎంతో భేదముంది. నన్నయతో పోల్చినపుడు తిక్కన క్రొత్తతెన్నులు త్రొక్కినట్లే. సంస్కృతానువాదాలైన భారతభాగవతాదులతో పోల్చినపుడు ప్రబంధాలను నవ్యసాహిత్యం అనవచ్చు. ప్రబంధాలలో కథకంటె వర్ణనలు ప్రధానం. అలంకారశాస్త్రిపుకోలతల ప్రకారం ఒకేరకం శృంగారాది వర్ణనలతోనిండిన ప్రబంధసాహిత్యంపై కొన్నాళ్లకు ప్రజలకు వెగటుపుట్టింది.

భావకవిత్రయుగం ప్రారంభమైంది. దానివెన్నంటివచ్చాయి అభ్యుదయ కవిత్వం, ప్రజాకవిత్వం అని పిలవబడే యీనాటిరచనలు. కొందరు కొత్త ఛందస్సు

లను సృష్టించారు. కొందరు అసలు ఛందస్సేపనిలేదని వచనపద్యాలు వ్రాస్తున్నారు. కళ, కళకోసమేకాదు, ప్రజాసమస్యల పరిష్కారంకోసం అనేవాదం బలమౌతున్నది. మతసంప్రదాయపు కట్టుబాట్లపై ప్రజలుతిరగబడినట్లే ప్రాచీనఛందో నియమాలపై నవీనులు దండెత్తారు. ఇందులో ఆశ్చర్య పడవలసినదేమీ లేదు. ఇది హేతువాదయుగం. ప్రజలుగ్రుడ్డిగా ప్రాచీన మతరాజకీయసిద్ధాంతాలను అనుసరించ నిరాకరించారు. ఆర్థికవిప్లవాలువచ్చి ప్రభుత్వాలనే మార్చాయి. ప్రజల జీవన విధానాలలో మార్పులు వచ్చాయి. వారిలో నవ్యచైతన్యం ఉప్పెనలా పొంగి వచ్చింది. నవ్యభావాలు, నవ్యసిద్ధాంతాలు, ప్రచారంలోకివచ్చాయి. వీటి నన్నింటినీ, ప్రజాస్వామ్యానికి బోధపరచాలంటే ప్రాతఛందోమార్గాలుచాలవు. క్రొత్తసాహిత్యప్రక్రియలు కావాలి. దానిపరిణామమే నేటి నవ్యసాహిత్యం.

## ii

శ్రీ కందుకూరు వీరేశలింగం పంతులుగారు సంఘసంస్కరణ ప్రారంభించి, దానితోపాటు సాహిత్యంలోకూడ క్రొత్తఊపిరులు ఊదారు. సాహిత్యాని తన ఉద్యమవిజయానికి శాయశక్తులా ఉపయోగించుకొన్నారు. ఆయన నవలలు, ప్రహసనములు, కవిజీవితములు మున్నగునవిరచించి, ఆంగ్ల రచనావిధానములను, నూతనసాహిత్య ప్రక్రియలు ఆంధ్రవాఙ్మయంలో ప్రవేశపెట్టారు. ఖండకావ్యం, కథానిక, ఏకాంకిక మున్నగుప్రక్రియలు బహుళజనాదరణపాత్రాలైనాయి.

గ్రాంథికభాష కృత్రిమమైనదనీ, సహజమైన వ్యావహారిక భాషలో వ్రాయడం విజ్ఞానాభివృద్ధికి ఆవశ్యకమనీ శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు ఒక మహోద్యమాన్ని లేవదీసి విజయంసాధించారు

శ్రీ గురజాడ అప్పారావుగారు 'ముత్యాల సరాలు' అనే క్రొత్తఛందస్సులో గేయాలు వ్రాశారు. "కన్యాశుల్కం" నాటకాన్ని వాడుక భాషలో వ్రాశారు. ఆంధ్రాంగ్ల పదాల సమ్మేళనంగల సంభాషణలద్వారా హాస్యం పుట్టించారు. 'గిరీశం' వంటి సజీవపాత్రలను సృష్టించి, సాహిత్యాన్ని ప్రజాసాంఘిక జీవనానికి దగ్గరగా తీసుకవచ్చి, నవీనసాహిత్యానికి యుగకర్త అనిపించుకొన్నారు.

నవ్యసాహిత్యాన్ని గురించి కవిసమ్రాట్టు శ్రీ విశ్వనాథసత్యనారాయణ గారు అన్నమాటల్ని గమనించండి

"సాహిత్యం ఒకజాతి సంస్కారం. మనజాతి పూర్వం ఒక గొప్ప సంస్కార దశను పొందింది. ఆంగ్లేయులు మన్ని ఆక్రమించడంచేత ఆ మహాసంస్కారం మీద అభిమానం పోయింది. పాశ్చాత్య దేశీయుల సంస్కారంమీద అభిమానం ప్రబలింది. ఏతదభిమాన పురస్కృతములైన భాషాతత్త్వం, చరిత్రనిర్మాణం, సృష్ట్యాదికాలనిర్ణయం, సంఘధర్మాలు, విశ్వాసాలు, వీటిని యే గ్రంథం పరామర్శిస్తుందో అదంతా నవ్యసాహిత్యం".

ఇట్టి నవ్యసాహిత్యం ఆంధ్రదేశంలో పందొమ్మిదవ శతాబ్దపు ఉత్తర భాగంలో బయలుదేరిందనవచ్చు. దాదాపు అదేకాలంలో సింహపురిమండలంలో కూడ సాహిత్యంలో ఒక సంచలనం కలిగింది. ఈ సంచలనానికి కారకులైన కొందరు రచయితల్ని గూర్చి, వారి రచనల్ని గూర్చి పరిశీలిద్దాం. ఈ పరిశీలనలో ఎవరెవరు ఎట్టి క్రొత్త తెన్నులు త్రొక్కారో విశదంకాగలదు.

## iii

### శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి :

గురజాడ అప్పారావుగారు "కన్యాశుల్కం" రచించిన కాలంలోనే నెల్లూరులో వీరు "ప్రతాపరుద్రీయం" నాటకాన్ని రచించారు. రెండు నాటకాలూ ప్రజాదరణకు పాత్రములై నవ్యాంధ్రసాహిత్యంలో సుప్రతిష్ఠితమైన స్థానాన్ని సంపాదించుకొన్నాయి. "కన్యాశుల్కం" అంతా వాడుక భాష. "ప్రతాపరుద్రీయం"లో కొన్ని పాత్రలు మాత్రమే వ్యావహారిక భాష ఉపయోగిస్తాయి. అయినప్పటికీ నవ్యాంధ్రవాఙ్మయంలో ఉన్న ఉత్తమ నాటకాలలో "ప్రతాపరుద్రీయం" అగ్రశేణి లోనిది. ఇందులో పిచ్చివాని పాత్రను చిత్రించడం అసమానమనవచ్చు. దానిని అభినయించడానికే ప్రతిభ కావాలి. పిచ్చిమాటల్లో అంతరార్థం ? "తెలిసిన వాళ్ళకు సార్థకం; తెలియనివాళ్ళకు నిరర్థకం" అయినట్లుగా సంభాషణను కల్పించి పాత్రను "పరాకోటి" కెక్కించినాడు. మిగిలిన నాటకమంతా కూడా తగినట్లు రచించినాడు. పాత్రోచితభాష మొదలై నవానిలో అందెవేసినచేయి అనిపించుకొన్నాడు. ఆంధ్ర తురుష్క పద సమ్మేళనంవల్ల హాస్యంస్ఫురింపజేయు ఆంధ్ర ముసల్మానుల తెనుగు సంభాషణ వినండి.

"హౌవ్రూపేడామీరు హల్కీకొంటార్ హౌవ్రూవ్రూతీమీరు తాగీకొంటార్
హౌవ్రుమెక్వామీకీ మస్సీతక్వా యెబ్బెబ్బె యెబ్బెబ్బె యేమీమతం"

"ఆయన బాత్వింటువుంటె అదెసాల్‌నాకీ" మొదలైన వాక్యాలు ఎన్నటికీ మరపురానివి. "ప్రతాపరుద్రీయం"లో పాత్రపోషణం కథాసంవిధానం, మిక్కిలి రమణీయాలుగా ఉంటవి. ముఖ్య స్త్రీ పాత్ర లేకుండా, శృంగారవీరాల్లో ఒకటి ముఖ్యరసం కాకుండా, ఇంతరసవంతంగా నాటకం రచించడం శాస్త్రిగారి ప్రజ్ఞకు నిదర్శనం.

శాస్త్రిగారు కరడుగట్టిన ప్రాచీనవాది. ఆంధ్రసంస్కృతములలోను, ఆంగ్లంలోను ఉద్దండ పండితుఁడు. జంగమ గ్రంథాలయం అనదగినవాఁడు. విజయవిలాసం, శృంగారనైషధం, ఆముక్తమాల్యద వీటికి వ్యాఖ్యానాలు వ్రాశారు. కొన్ని వ్యాఖ్యానాలు అసలు గ్రంథాలకంటె జటిలంగా ఉంటవి. వ్యాఖ్యానాలలోని సందర్భవివరణాలనుబట్టి ఆయన కెన్ని శాస్త్రాలలో ప్రవేశముందో మనం ఊహించవచ్చు ఆయనది నారికేళపాకం. ప్రతాపరుద్రీయంలో నాందిపద్యం చూడండి.

"నీటనుదాగి, కొండతొలినెక్కొని, నేలనుబొత్తవెట్టి, పె
న్గోటను జక్కసేసి, యడుగుల్‌సగమేదియు దవ్వుదాటి, రా
పోటొనరించి, కట్టి, కలుముచ్చయి, దొంగిలి, లేదటంచు, టా
టోటుగఁ గత్తిదూయు టకటొంకరి ఆతని యాలునేలుతన్"

పై పద్యంలో విష్ణుమూర్తి దశావతారాలు వరుసగా వర్ణించబడ్డాయి. "నీటనుదాగి" అంటే మత్స్యావతారం. "దొంగిలి" అంటే వెన్నదొంగలించిన కృష్ణుడు. "లేదు" అంటే దేవుడులేడనే బుద్ధావతారం. క్లిష్టార్థంలో కూడుకున్న యిట్టిపద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు పండితులు చెప్తేతప్ప పామరులు తెలిసికోలేరు.

ఇంతటివాడే దేశంలోవస్తున్న నవ్యసాహిత్య ప్రభంజనానికి తట్టుకోలేకపోయాడు. ఒక అడుగు ముందుకువేసి తన నాటకంలో సజీవభాషయైన వాడుకభాషను ప్రవేశపెట్టాడు. ఆసాహసం చేయబట్టే ఆయన నాటకానికి అంతటిప్రజాదరణ, ఖ్యాతి లభించాయనడం సత్యదూరంకాదు. వీరికృతులలో కల్లా ఉత్తమమై, సర్వజనాదరణీయమై నవ్యసాహిత్యంలో ఆయనకు శాశ్వతస్థానాన్ని కల్పించిదీనాటకం.

## శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి.

శ్రీ వేదం వేంకట రాయశాస్త్రిగారితో సీకొట్టగలిగిన మహాపండితుడు, కవిపరిశోధకుడు విమర్శకుడీయన.

"రంగముమీద కెక్కుడుమురా!" అని ప్రతిపక్షులను సవాలుచేయగల ధీరుడు ప్రతిభాసంపన్నుడు.

"భూపతిఁజంపితిన్ మగడు భూరిభుజంగముచేతఁజచ్చె, నే
నాపదఁజెందిచెంది, ఉదయార్కుని పట్టణమేగి, వేశ్యనై
పాపముఁగట్టుకొంటి, నటపట్టి విటుండయిరాఁగఁ జూచి, సం
తాపముఁజెంది, అగ్గిఁబడి దగ్ధముగాకిటు, గొల్లభామనై
యీపనినోకొప్పుంటి, నృపతీ! వగపేటికి చల్లచిందినన్?"

అనే చాటుపద్యం ఆధారంగా ఒక కావ్యాన్నే రచించాడు.

"మృణ్మయంబని నిరసించెదేటికోయి!
ప్రేమతత్త్వమ్ము తెలియని పిన్నవాడ!
మృణ్మయంబైన, కాక హిరణ్మయంబ
యైన వెల సమమే ప్రణయాపణమున"

అని "ప్రణయకుసుమము" కావ్యంలో లోకానికొక్క చక్కని సందేశాన్నందించాడు. ప్రాచీనకవుల ధోరణికిచెందినా ఈయన రచనలు నవ్యతాముద్రను సంతరించుకొని, సింహపురికీర్తికి వన్నె తెస్తున్నవి.

## శ్రీ దుర్భా సుబ్రహ్మణ్యశర్మ.

నెల్లూరు మండలాన్ని నూతన సాహిత్యోత్సాహంతో ఉర్రూతలూగించిన వారిలో శ్రీ దుర్భాసుబ్రహ్మణ్యశర్మ ముఖ్యుడు. ఈయన అనేకయువకులలో సారస్వతాభిలాషకలిగించి, సింహపురిమండల సారస్వతజీవితంలో నవ్యచైతన్యాన్ని తెచ్చిపెట్టినాడు. చిన్ననాటినుండి ఆశుకవిత్వం చెప్తూవచ్చినాడు; అష్టావధానాలు చిన్నతనంలో ఎన్నోచేసినాడు. వేంకటగిరిరాజాగారి కళాశాలలో ఆంధ్రభాషాధ్యాపకులుగా పనిచేసి విశ్రాంతి తీసుకున్నాడు. చక్కని తెనుగు కవిత్వంచెప్పి "అభినవతిక్కన" అనీ "సాహిత్యస్థాపక" అనీ బిరుదనామాల్ని పొందాడు. శంకరుని

సౌందర్యలహరి వివేకచూడామణులను సరళశైలిలో చక్కగా ఆంధ్రీకరించిన కవి సత్తముడీయన. ఈయన అభినవసుమతిశతకము ప్రాతసుమతిశతకమంత ప్రజాదరణకు, ప్రశంసకుపాత్రమైనది. అందలి పద్యాలు చదువుతున్నప్పుడు వ్రాసినది ఏసుమతిశతక కారుడో సులభంగా చెప్పలేము.

దువ్వూరు రామిరెడ్డి, ముత్తరాజు సుబ్బారావు, మోచర్ల రామకృష్ణయ్య ఉండేల మాలకొండారెడ్డి మున్నగుకవులకు ఈయన గురుప్రాయుడై మార్గదర్శకుడై నాడంటే ఈయన శక్తిసామర్థ్యాలను, నవ్యసాహిత్యదృష్టినిగూర్చి వేరే చెప్పన క్కరలేదు.

శ్రీ దువ్వూరు రామిరెడ్డి :

ఆంధ్రదేశంలో అనన్యప్రశస్తిగాంచిన మధుర కావ్యాలు రచించి సింహపురి మండలానికి నవ్యసాహిత్య ప్రపంచంలో గర్వించదగ్గ విశిష్టస్థానాన్ని కల్పించిన వాడు కవికోకిల రామిరెడ్డి. ఈయన ప్రకృతి ఉపాసకుడు. నిరాడంబరజీవి. నవనాగరిక జీవితాన్ని చవిచూచినవాడైనా, స్వచ్ఛందమైన గ్రామసౌభాగ్యాన్ని అభిమానించు కొన్నాడు. రాజుల, రాణులప్రేమ పురాణాలువదలి, సామాన్య కర్షకునిదైనందిన జీవితాన్ని ఋతుధర్మాలతో మేళవించి, బహురసవంతంగా కృషీవలుడు అనే కావ్యంలో చిత్రించినాడు.

"గనిమలతుంగకున్ గరికకాడలకల్లిన సాలెగూళ్ళ స
న్నని పటికంపు మంచుపడి, నాణెపుముత్తె సరాలపోలికన్
గనుఁగొన రమ్యమయ్యె రవికాంతులఁదేలుచు, నిట్టిభావమో
హనపు నిసర్గశిల్పముల హాలిక! త్రొక్కక దాటిపొమ్మికన్."

అంటూ ప్రకృతి సౌందర్యాన్ని, శిల్పాన్ని ఆరాధించమని కర్షకుని హెచ్చరిస్తాడు. తన కవిత తోటమాలి కత్తిరింపులకు లోనుగాక, స్వేచ్ఛగా పెరిగిన వనలత అంటాడు. ఈయన భావనాశక్తిని జలదాంగనలో చక్కగా చూడవచ్చు. నవ్యసాహిత్యలోకంలో శ్రీ రాయప్రోలు సుబ్బారావు, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారల కోవకు చెందిన వాడీయన. దేవులపల్లి కృష్ణపక్షంలోని ప్రథమ గేయమూ, ఈయన నక్షత్రమాలలోని కవిసునోరథము కొన్ని సమానభావాలతో నిండియున్నవి.

శ్రీ రామిరెడ్డి, తనను పరమేశ్వరుడు "జలదార్భకుడు"గా "తుహినాంబుకళిక"గా "మలయూటకాల్వ"గా ఏల సృజించలేదని చాలా విచారపడ్డాడు. కృష్ణశాస్త్రి తానేమికావాలని చెప్పాడో చూడండి. "ఆకులోఆకు", "పూవులోపూవు", "నునులేతరెమ్మ", "చిన్నారిసిగ్గు", "జలదంపునీలంపునిగ్గు" కవికుమారుల ఊహాసామ్యమంటే యిదే.

ఆంగ్లవాఙ్మయంలోని అమృతమాధురులూ, సంస్కృత సాహిత్యంలోని మేలితెరగులనూ, పారసీభాషలోని సుకుమార పదభావ సంపదను అలవరచుకొని, నూతన భావాలను తన జిలుగు నుడికారములో తేనెతోడ రంగరించి తెనుగు జాతీయతకు క్రొత్తయందము కొనితెచ్చిన నవ్యకవి యీయన. క్రొత్తరుచులు నేర్చినా, అన్వయదోషంతోనో, అర్థకాఠిన్యంతోనో, భాషాచమత్కారంతోనో, భావాన్ని అగమ్యగోచరంచేసే "భావకవుల" చికిలితనం, శ్రీ రామిరెడ్డిలో లేదు. తేటతెల్లని మాటలతో చప్పున మనస్సుకు హత్తుకొనే రీతినిచెప్పే చాతుర్యం ఆయనశైలిలో ఉన్నది. ఉమ్రఖయ్యాం రుబాయతు ననుసరించి యీయన రచించిన "పానశాల" రసికాంధ్రలోకానికొక చక్కని విందు. చదివినంతసేపు సహృదయములను రసానందడోలికలలో ఊపగల కావ్యమిది.

"గతముగతమ్మె యెన్నటికి కన్నులగట్టదు, సంశయాంధ సం
వృతము, భవిష్యదర్థము, వివేకవతీ! ఒక వర్తమానమే
సతతమవశ్యభోగ్యమగు సంపద, రమ్ము విషాదపాత్రకీ
మతమునఁ దావులేదు, క్షణమాత్రవహింపుము పానపాత్రికన్."

అని తాను మత్తెక్కినట్లు కవితామధువుద్రాగి, యితరులచేత త్రాగించిన రసపిపాసువీయన.

భౌతికవిజ్ఞానశాస్త్రాలను కూలంకషంగా చదివి, శాస్త్రీయ విషయాలను కవిత్వంలోకి దించిన సాహసం ఈయనకు దక్కుతుంది. "కవి-రవి" అనే కావ్యంలో "భూమిపుట్టుక" మున్నగు విషయాలను చక్కగా వర్ణించాడు. రవి, కవితో యిలా సంభాషిస్తాడు

"ధరణి యిన్నూరుకోట్ల వత్సరములపుడు
గండరించెను నామేనినుండివీడి;
నెత్తురుంగండలోకబాట నెలవుకొనిరా
తండ్రియుష్ణత్వమ్ము తనయయందు."

"విధివశమ్మునఁ దనువులు వేరుపడియుఁ
బ్రేమసూత్రాలు తెగవు మా హృదయములను
మచ్ఛరీరభరాకృష్యమాణయగుచు
అవని నాచుట్టుఁ దిరుగుఁ జక్రానువృత్తి."

సూర్యునకు భూమికిగల గురుత్వాకర్షణశక్తిని తండ్రికూతుళ్ళ ప్రేమ బంధంగా వర్ణించి, విజ్ఞానశాస్త్రసూత్రవల్లికలను తెలుగుకైత చలువపందిళ్లకల్లించిన తోటమాలి యీయన.

అధునాతన నగరాలను, నాగరకతను, సౌందర్యాన్ని అలతిమాటలలో తెలుగుతనం కొరవడకుండా వర్ణించడంలో ఈయనకీయనేసాటి. "పలితకేశం" కావ్యంలోని యీ క్రింది పద్యం చూడండి :

"మగలవరియించు చదువరి మగువలకును
యువతులంగోరు విద్యార్థియువకులకును
వలపుపందేరములఁ పంచు తలపుతోడ
రతిమగండువసించు "మద్రాసు బీచి"."

"......కప్పులనెలకొన్నకాఫి అలపూవులవిల్తుని
మావిగుత్తులన్ జలజలనుట్టుతేనియలజాలని
క్రోలుదురచ్చటన్ యువల్."

ఇచ్చట వర్ణించినది మద్రాసు బీచిని, అచ్చట కాఫీసేవించుచు విచ్చల విడిగా విహరించు యువతీయువకులను, కాని కవి మాత్రం తాను ఛందస్సునువదలి విచ్చలవిడిగా విహరించలేదు. అందువలన భావంకుంటువడలేదు. ఇది కవికోకిల రామిరెడ్డిగారి ప్రత్యేకత. నవకవిత్వం అంటే ఎదలో రేగిన ఊహలను రేగినట్లే దెసమొలతో ప్రదర్శించు యతిగతిలేని వచనపుతుంటలు కావని ఈయన అభిప్రాయం. సిద్ధహస్తుడైన కవికి ఛందోనియమాలు అడ్డురావనీ, రసస్ఫూర్తికి ఛందస్సు అవసర మనీ విశ్వసించే నవ్యులలో వీరొకరు.

శ్రీ ప తా భి :

"నాయీ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో
పద్యాల నడుములు విరగదంతాను."

అని ప్రాచీనసాహిత్య ప్రపంచంపై విరుచుకపడిన నవ్యులలో నవ్యుడైన అహంభావ కవి "శ్రీ పఠాభి" అతని "ఫిడేలరాగాల డజను" "పఠాభి పంచాంగం" ఒకమారు కదలించి చూడండి :

"నా కన్నులలో టెలిస్కోపులు మయిక్రాస్కోపులూ ఉన్నవి."
ఇంగ్లీషుభాషా భాండారంలోనుంచి బందిపోటుంజేసి కావల్సిన
మాటల్ను దోస్తాను,..............
భావకవిన్మాత్రం కాన్నేనహం భావకవిని."

"శశీ !......కన్పిస్తావు, నీవు స్పెన్సరుకంపెనీ లేక నైటుహౌసులోకీ
దారితప్పిప్రవేశించి తందరాడుచున్న దరిజేసిగ్రామస్సుల్లాగ !

"కులకాంతకు అంకులకాంతకు,
పతివ్రతకు పతితకు వర్ణభేదంమాత్రమే."

"ఈ జూలై మూడవతారీఖు లలితా ! కాలేజి తెరుస్తారుకదా నీకు."

ఈతని వచనపద్యసంపుటి నవ్యసాహిత్యలోకంలో తీవ్రసంచలనాన్ని కల్గించింది. ఈపుస్తకాన్నిచూచినవారంతా దిగ్భ్రాంతులైనారు. కవిహృదయంలోని రాగాలాపన యెట్టిటీగలుగాసాగితే అదేగీతానికి ఆకారం నిర్ణయించాలె అనేది యీయన సిద్ధాంతం. నవకవులు సాధించిన మహాసిద్ధియని శ్రీ శ్రీ గారు ఈయన పుస్తకాన్ని తెనుగుదేశానికి సిఫారసుచేశారు. శ్రీ దువ్వూరు రామిరెడ్డిగారీపుస్తకముపై వెలువరించిన అభిప్రాయమిది:

"ఈ పుస్తకము చదినపుడు నాకుకలిగినభావమిది. యౌవనప్రాదుర్భావ సమయమున కామోద్రిక్తుడయి "కామార్తాహి ప్రకృతి కృపణా శ్చేతనాచేతనేషు" అను కాళిదాసు సూక్తికి ఉదాహరణప్రాయుడై, వలపుపస్తులతో నవసి వాలి చెడిన యువకుని ఉన్మత్తప్రలాపములుగా నాకు స్ఫురించినవి. బుర్రావేంకటసుబ్రహ్మణ్యంగారు చెప్పినట్లు ఒక Cleverness ఉన్నంతనే కవిత్వము కాదు"

ఈయన రచనలను గూర్చిన విమర్శ లెటులున్నా, సాహిత్యప్రపంచంపై ఒక బాంబువిసిరి, తన యునికి తెలియజేసి, ఒకే రచనతో నవ్యసాహిత్యరంగంలో పీఠంవేసుకొన్న "నెల్లూరు నెఱజాణ" యీతడు.

### శ్రీ మోచర్ల రామకృష్ణయ్య :

నెల్లూరు మండలపు కీర్తిని నవ్యులలో నిలబెట్టిన, నిలబెట్టుతూ ఉన్న ప్రతిభావంతుడీయన. సరసకవి, కవిశేఖర, సాహిత్యరత్న ఇత్యాది బిరుదాలు పొందినవాడు. నిండుకుండ. మితభాషి. తాత్వికదృష్టి ఈయనకు హెచ్చు. నిండు ప్రాచీన సాంప్రదాయానికి చెందినవాడైనా ఈయన నవ్యతను తనలో ఇముడ్చుకున్న వ్యక్తి. ప్రాచీన ఫక్కీలో ఎన్నో గ్రంథాలు వ్రాశాడు. సంస్కృతంలో "శారదా ప్రసాదమ్" అను గ్రంథాన్ని యిటీవల రచించి అఖిలభారతకీర్తిని గడించాడు.

ఈయన రచించిన "ఛత్రపతి శివాజీ," "ప్రేమలీల" అనే నాటకాలను శ్రీ పొట్టి శ్రీరాములనుగూర్చిన "అసురగౌరవము" కావ్యాన్ని గమనిస్తే ఈయన నవ్యుడనిపించి తీరుతాడు.

### శ్రీ దుర్భా రామమూర్తి :

ప్రసిద్ధ పండితుడు, కవియైన శ్రీ దుర్భా సుబ్రహ్మణ్యంగారిపేరు నిలబెట్టిన సుపుత్రుడీయన. ప్రస్తుతము నెల్లూరు వేంకటగిరి రాజాగారి కళాశాలలో ఆంగ్లభాషా ప్రధానాచార్యులు. "గౌతమబుద్ధుడు" మున్నగు కావ్యాలను నూత్నరీతులలో రసవత్తరంగా రచించాడు. షేక్స్పియర్ నాటకాలను కొన్నిటిని తెలుగులోకి అనువదించాడు. "మేగ్బెత్" నాటకాన్ని "రాజ్యకాంక్ష" పేరుతో తెలుగులోకి అనువదించి, ప్రదర్శించి, రసజ్ఞుల మన్ననలనందుకొన్నాడు. తలచుకొంటే నవ్యులలో అతినవ్యుడు అనిపించుకొనేటట్లు రచనలు చేయగల సమర్థుడు.

### శ్రీ నారపరెడ్డి :

"పేదజనములచింత ! ఓ పిచ్చుమంత !" అంటూ కష్టజీవుల పక్షంగా కలంపట్టి "బాష్పకణాలు" "నావీణ" "కవిత" మున్నగు పద్యగేయ కావ్యాలను పండించిన కవికర్షకుడు శ్రీ నారపరెడ్డి, నెల్లూరుజిల్లా కోవూరువాసి. "ఒడలి చెమ్మట తడిసి ధరణిగర్భము చీల్చి రత్నాలు త్రవ్విపోసే రైతుబిడ్డను నేను" అని చెప్పుకొన్నాడు.

"బాధితజనులంతా నాగుండెలలో పలవింతురు
పీడితజనులంతా నాగుండెలలో విలపింతురు"

అంటూ పీడితజనుల ప్రతినిధియై నిల్చినాడు.

ఇతడు వేదనాజీవి. ఈతని బ్రతుకు "కలలభూమి" కలలను నిజంజేయాలని, తాను నమ్మినదానికై విధినైనా ఎదిరిస్తానంటాడు :

"కలలోని కమ్మదనం వాస్తవాన కనిపించదు.
కలలులేక కవితరాదు కవితలేని బ్రతుకులేదు
అందుకనే నామకస్సు కలలభూమి విడిచిరాదు.
నాకవితలు వెలిగించే నవ్యకాంతి పథములందు
నాకలలకు రూపమిచ్చు కాలమొకటి కలదుముందు
విధిబలీయమన్న వెఱ్ఱివేదాంతము నమ్మలేను
బ్రదుకుచున్న కాలానికి బందీనై నిలువలేను
విధినైనా ఎదురుతిరిగి విప్లవాన్ని గగిలింతును"

మానవులవధను కథగా, మనోభాధను గాథగా మలచడంలో ఈయన సిద్ధహస్తుడు. మానవ సమాజంలోని హెచ్చుతగ్గులను అన్యాయాలను చూచి సహించలేడు. ఆవేశంలో తబ్బిబ్బైపోతాడు. జాతీయావిధ్వంసుకులై ప్రాతంతా రోత అనే ఆధునిక యాంత్రికుల ననుసరించి, ఆశాభంగంచెందాడు. జాతీయ దురావేశపరులైన సనాతనమాంత్రికులంటే మొదటినుంచి యితనికిగిట్టదు. ఈభావసంఘర్షణ ఈతని రచనలలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. ఆ శా ని రా శా భా వా ల ఉయ్యాలలో ఊగుతూ, ప్రజలకుసత్యాన్ని ప్రబోధిస్తూ హృదయానికి నూటిగాతగుల్తూ ఉంటాయి యితనిగేయాలు మచ్చుకొన్ని :

"ధరిత్రినాదను మూఢులారా! చరిత్రయెరుగని మూర్ఖులారా!
సాగిపోవు జీవధార ఆనకట్ట లాపలేవు
ముందుకురుకు జనవాహిని ముండ్లకంచెలాపలేవు
చరిత్రగతి కనుడోయ్ ధరిత్రి మనగలరోయ్"
"అదృష్టపు దేవత రెక్కలచప్పుడు
వినిపిస్తుందును మాకపుడపుడు
ఆపిట్టకోసమై మాచెయిజాపిన ఎగిరిపోవునది యెటకోతుల్లున"
"చేతనున్న ఈనాటిని రేపుకోఱకు బలివెట్టకు"
ఆశతీపు, ఫలంలేదు, ఆవేశం నందబోకు
ఫలంనంద పాలుపడకు ఆయాసంమిగులునీకు"

"బ్రతుకంటే మరణానికి ముందుపడేబాధేనోయ్"
"తగరపు నగరము" "రాక్షసనగరము"

అనే గేయాలలో హృదయమున్న మానవుడూ, జీవములేని యంత్రము గుత్తగొన్న నాగరిక జీవనాన్ని కండ్లకు కట్టేటట్లు మనస్సు హత్తుకొనేటట్లు ఎలా వర్ణించాడో చూడండి :

"తళతళమను తారురోడ్డు నీకునాకుగాదులెమ్మ్మ.
కాసులున్నవారిదారి దానివిడిచితొలిగిరమ్మ్మ"
మనపల్లెల రవిచంద్రులు ఇటచెల్లనికాసులు
ఇటకల్పిత శశిసూర్యులు నగరానికిదాసులు"
"నగరానికి మేధస్సును అమ్ముకొనేబుద్ధిజీవి
స్వర్గాన్నే ఊహిస్తూ నరకంలో బ్రతుకుతాడు"

సెంట్రల్‌స్టేషన్ గడియారం టవరుపై కెక్కి-దాన్ని బాగుచేసె కార్మికుని గూర్చియిలా అంటాడు:

ప్రాణంకోసం కాణీకై తపయిస్తాడాతడు కాణీకోసం ప్రాణం బలియిస్తాడాతడు
మృత్యువుకోరల నిల్చిన ఆతనికై తలపై కెత్తదు ఈనగరం
కాలుజారి ఆతడు పడినా జాలిజెందదీ నగరపుహృదయం
అతడెపుడో ఈ పాతగుండె పీకేస్తాడుఈ నగరానికి కొత్తగుండె అతికిస్తాడు.

శ్రీ శ్రీగా "రాబందులచప్పుడు" చేయకుండా, విప్లవభావాలను చిన్నచిన్న మాటలతో వ్యంగంగా చిత్రించి, తన ప్రత్యేకతను నిలబెట్టుకొన్నాడు శ్రీనారపరెడ్డి. ప్రతిదినమూ మనంచూస్తున్న సామాన్య సంఘటనల్ని కావ్యవస్తువులుగా స్వీకరించి, మనం చూడలేని అర్థాలను చూపించి జ్ఞాననేత్రం తెరిపించి, సాహిత్యప్రయోజనమేమిటో నిరూపిస్తాడీయన.

## శ్రీ కె. వి. రమణారెడ్డి

శ్రీ రమణారెడ్డిని చేరుకోవాలంటే "అడవి" దాటాలి. పఠాభి విడిచిపెట్టిన ఫిడేలును శ్రుతిచేసి "భువనఘోష" విన్పిస్తున్నాడీ గద్యకవి. ఇతని వచన బాణాలు

వాడిగా, వేడిగా ఉంటాయి. అడుగుజాడ గురజాడది. త్రిప్పుటలో వేములవాడభీము కవి. సాధారణంగా నారికేళపాకంలో ఉండి, శ్రీవేదం వేంకటరాయశాస్త్రిగారి పద్యాలనే మించినట్లుంటాయి మచ్చుకురెండు :

వాయు - లీనం

మరగ కాగినసీసం అదృశ్యవర్షం కురిసినశిరస్సున తాపం ముళ్లతోడుగు
సెగలెగసే చూపులముందు, భ్రమలేగనాగులు తరంగలించే శూన్యంనుడుగు"

యుగోగ్రమురళి

"నమస్తే అన్నయ్యా! భావనాశంఖం పూరించి అదృశ్యహస్తం సారించి, నిన్ను ఆదర్శాన్ని, నేను యథార్థాన్ని ఆలింగనం చేసుకొంటున్నాను".

నాటక సాహిత్యం

వేదంవారి "ప్రతాపరుద్రీయం" తర్వాత నెల్లూరికి కీర్తి తెచ్చిన నాటికలు నాటకాలు శ్రీ ఆత్రేయ రచించినవి. "గౌతమబుద్ధ" "అద్దెకొంప," "ప్రగతి" "విశ్వశాంతి" "కప్పలు" మున్నగు నాటికలను నాటకాలను రచించి ప్రదర్శించి ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించాడు శ్రీఆత్రేయ సూటిగా, చమత్కారంగా సంభాషణలను నడపడంలో ఈతనిని, మించిన వారెవరూలేరు.

నెల్లూరు మాండలికభాషనువాడి, "తుపాను" నాటికనువ్రాసి ఆంధ్రులను కడుపుబ్బనవ్వించిన కవ్వించిన శ్రీ పులుగుండ్ల రామకృష్ణయ్య ఈనాటి నాటక రచయితలలో పేర్కొనదగినవాడు.

ఇటీవలే రంగస్థలమెక్కి, ఆంధ్ర ప్రదేశములో విజయభేరి మ్రోగిస్తున్న "ప్రెసిడెంటు పట్టయ్య" నాటకరచయిత శ్రీ కొండేటి సుబ్రహ్మణ్యం. ఈయనే వ్రాసిన "వాపసిచ్చిన వరకట్నం" అనేనాటిక సున్నితమైన హాస్యంతోను, అధిక్షేపంతోను కూడినది. సంఘంలోని దురాచారాలను ఎవ్వరికి నొప్పితగలకుండా ఖండించడంలో ఈ రచయిత చూపే నేర్పు శ్లాఘనీయమైనది.

వచన సాహిత్యం

శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి, శ్రీ దీపాలపిచ్చయ్యశాస్త్రి, శ్రీ మామిడిపూడి వేంకటరంగయ్య, శ్రీ మామిడిపూడి రామకృష్ణయ్య, శ్రీమతి పార్వతీకృష్ణ

మూర్తి మున్నగువారు వచనగ్రంథాలు రసవత్తరంగా వ్రాశారు. కాని శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి వ్రాసిన "మంజీర గాథ" "కర్ణచరిత" మున్నగు వచన కావ్యాలశైలి వీటికంటె ఎంతో భిన్నంగా నవ్యంగావుంటుంది. ఇతడు ఒక నిరంకుశ స్వతంత్ర రచయిత. రెండువైపుల పదునుగల కత్తిలాంటివాడు. కలం కదిలించినా, నోరు మొదలించినా వచ్చేవన్నీ సూదుల్లాంటి మాటలు, నెల్లూరు ప్రాంతపు నుడులూ, *నానుడులూ చదవాలంటే యీయన రచనలనే చదవాలి. ఈయన మాట్లాడినట్లే వ్రాయగలడు. వ్రాసినట్లే మాట్లాడగలడు. సహజోక్తి చమత్కృతులతో కూడి యీయన రచనాశైలి పఠితలకు చక్కిలిగింత పెట్టూఉంటుంది.

---

*వీరు సేకరించిన 'నాడులు' ఈసర్వస్వమందు ముద్రితము.

తే॥ అల్పపుణ్యుండు తొలితొలి యమరతా సు
ఖంబుగయికొని మఱియు దఃఖములనొందు
భూరిపుణ్యుండు మునుమును ఘోరనిరయ
యాతనలనొంది వెండి సౌఖ్యంబులొందు.

స్వర్గా : 1 39

♦ ♦ ♦ ♦ ♦ ♦

క॥ పదిదినము లైదుప్రొద్దులు పదపడి రెన్నాళ్లు నొక్క పగలున్ రేయున్
మదమున రణమొనరించిరి నదిసుతగురుకర్ణశల్యనాగపురీశుల్॥

ఆది. I - 68.

♦ ♦ ♦ ♦ ♦ ♦

# ఆధునిక కవులు - రచయితలు

బడి గురవారెడ్డి

(సం. 22, పుట 384 తరువాయి)

## 148. రామిరెడ్డి నారాయణరెడ్డి.

సహజప్రతిభామనోజ్ఞత గల్గి నేఁడు కవితాగానము చేయుచున్న కవిపుంగవులలో, శ్రీ నారాయణరెడ్డిగారు పేర్వెన్నికగన్న పండితకవులు. వీరు 1-7-1921 వ సం॥లో పులివెందలతాలూకా ముత్తుకూరు గ్రామములో జన్మించిరి. తండ్రి ఓబులురెడ్డిగారు. తల్లి అంకమ్మ. వీరు మద్రాసు విశ్వవిద్యాలయమువారి విద్వత్పట్టమును బొంది ప్రస్తుతము నెల్లూరుజిల్లా పరిషత్తువారి యాజమాన్యమునఁగల కోవూరు ఉన్నతపాఠశాలలో నాంధ్రోపాధ్యాయులుగా నుద్యోగమును నిర్వహించుచున్నారు. వీరి రచనలు:- 1. నేటిభారత్ 2. జిగీష (నవల) 3. వైజయంతీవాచకములు. 4. వివిధవ్యాసములు. వీరు తెలుగు పుడమిలో బహుకాలము నిలిచి వెలుగొందు మెఱుపులవంటి "దక్షిణభారతీయభాషలు; మనదేశభాషలకు సాంకరలిపి; శతకవాఙ్మయము; దేశద్రోహి; మాతృహృదయము; ప్రబోధపద్యములు; వివిధగేయములు" మొదలుగాఁగల వివిధసాహిత్య ప్రక్రియలను గృహలక్ష్మి, త్రిలింగ, ఆంధ్రప్రదేశ్, శశి, మందాకిని, జమీన్‌రైతు, జనవాణి మొదలుగాఁగల పత్రికలలోఁ బ్రకటించి మిక్కిలి విఖ్యాతరచయితలుగా నెల్లూరుమండలమునఁ బరిగణింపఁబడియున్నారు. వీరి వచన రచనలో నొక క్రొత్తఁదనము చిక్కఁదనము, గోచరించుచుండును. వీరిపద్యములు తెలుఁగు కవితాశాఖకుఁ గైసేతలు. ఉభయభాషలలోను జక్కని సాహిత్య సంపదగలవారు శ్రీ నారాయణరెడ్డిగారు.

## 149. పాటూరి చిన్నయ్య.

చక్కని సాంప్రదాయిక లక్షణములతోఁ గవిత్వముఁ వ్రాయఁగల మేధావి చిన్నయ్యగారు. వీరు కోవూరుతాలూకా పాటూరు గ్రామములో జన్మించినారు. తండ్రి అనంతయ్య తల్లి తిమ్మాంబ. వీరి రచనలు:- 1 కపిల చరిత్రము. 2. రుక్మిణీ కళ్యాణము. రసానుగుణమైన శయ్యా సౌభాగ్యము వీరికవితకు నిసర్గజమైన సుగుణము. వీరి కవితలోఁ దెలుగుపదములపాలు హెచ్చుగా నుండును.

ప్రవేశించినారు. వెంటనే ఉద్యోగమును విరమించుకొని "జమీందారీరద్దు ఉద్యమము" ప్రచారమునకై జమీన్ రైతు పత్రికను స్థాపించినారు. చక్కని జాతీయ గేయములను, వ్యాసములనువ్రాసి తనపత్రికద్వారా బహుళప్రచారము సాగించినారు. ఆనాఁడు వీరిగేయములు మిక్కిలి ప్రచారము లోనికి వచ్చినవి. ఈవిధముగా జాతీయ రచనలు సలిపి, దేశీయులలో దేశభక్తిని, త్యాగగరిమను పురికొల్పి ముఖ్యముగా నెల్లూరుమండలమును ఉత్తేజితలూగించిన మరవునకురాని మధురమూర్తి శ్రీ నాయుఁడుగారు దివంగతులైనందులకు సింహపురి నేఁటికిని దుఃఖించుచున్నది. వీరి ముఖచిత్రము: రచయితలు, కవులు. నెం. 4.

## 161. చిల్లర వేంకటరమణయ్య.

చిల్లర వేంకటరమణయ్యగారు నిరాడంబరజీవి. గొప్పవిమర్శకుఁడు. పండితుఁడు. వీరు నెల్లూరు తాలూకా గంగపట్నం గ్రామములో 1912 జూలై నెల 18 వ తేది జన్మించినారు. తండ్రి గోపాలకృష్ణయ్యగారు. తల్లి వేంకటసుబ్బమ్మ. వీరి రచనలు:- 1. శ్రీ రమణ చరితశతకము 2. శ్రీ రమణతత్త్వశతకము 3. సాంఖ్యయోగము (అనువాదము) 4. విశ్వరూప సందర్శనయోగము (ద్విపదానువాదము) 5. ముద్దుబాల, ఖండకావ్యము 6. మహాపురుషులు (పద్యకావ్యము) వీరి రచనలన్నియు నముద్రితములు కాని జమీన్ రైతు, శశి, మందాకిని మొదలుగాఁగల పత్రికలలోఁ దఱచుగాఁ బ్రకటింపఁబడుచు వచ్చినవి. వీరి అభిమానకళలు ప్రాచీననవీన కవిత్వములు, సంగీతము. వీరు ప్రస్తుతము నెల్లూరు వేంకటగిరిరాజ ఉన్నతపాఠశాలలో నాంధ్రోపాధ్యాయులుగా నున్నారు.

## 162. సిద్ధాంతి మల్లికార్జునము, B.A., B.Ed.

అభ్యుదయ నాటికా రచయితలలో మల్లికార్జునము రాటుదేలిన రచయిత. వీరు నెల్లూరుమండలము కావలి తాలూకాలో 1923 డిసెంబరు నెల 22 వ తేది జన్మించినారు తండ్రి వేంకటసుబ్బయ్యగారు. తల్లి రుక్మిణమ్మ. వీరి రచనలు:- 1. ఎవరెస్టు శిఖరారోహణము (పూర్వగాథ - సాహసయాత్ర) 2. ఎవరెస్టు శిఖరారోహణము - విజయము 3. నేను (కథానిక) 4. విజయభారతి 5. దైవదృష్టి (హాస్యనాటిక) 6. సంభవామియుగేయుగే (చారిత్రిక కథానిక) 7. సామ్రాట్ అశోక (నాటకము) 8 తెల్లవారింది (నాటిక) ఈరచయిత అనేక సాంఘికసమస్యలను సన్నివేశములను వస్తువులుగా స్వీకరించి అభ్యుదయ ధోరణిలో నాటికలను కథానికలను

వ్రాసి సిద్ధహస్తుడైనాఁడు. వీరి రచనలన్నియుఁ బ్రజాదరణమును బొందినవి. ఇవి గాక కొన్ని గేయములు, వ్యాసములు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, రూపవాణి మొదలు గాఁగల పత్రికలలోఁ బ్రకటింపఁబడినవి, ఆంధ్ర విశ్వవిద్యాలయము వారు వ్రాయించిన వచనగ్రంథములలో వీరి ఎవరెస్టు శిఖరారోహణము అను గ్రంథమునకు వేయిరూప్యముల బహుమతి లభించినది. విశ్వవిద్యాలయమువారే ఆగ్రంథమును బ్రచురించినారు. వీరు ప్రస్తుతము సెంట్ పీటర్సు హయ్యర్ సెకండరీ స్కూలు (నెల్లూరు) లో నుపాధ్యాయులుగా నున్నారు. హైదరాబాదు నవ్య సాహిత్యసమితి సభ్యులుగా నున్నారు.

## 163. కనుపర్తి ముద్దుకృష్ణమూర్తి, B.A., B.L.

ముద్దుకృష్ణమూర్తి గారు దొడ్డ విమర్శకుఁడు. చక్కని సంగీత విద్వాంసుఁడు. వీరు నెల్లూరు మండలములో జన్మించినారు. వీరి రచనలు శ్రీ అన్నమయ్య విమర్శనాత్మకము వివరణాత్మకమునైన గ్రంథము. వీరు కొన్ని నాటకములను యన్. యస్. కృష్ణమూర్తిగారితోఁ గలసి రచియించిరి. కాని యవి ముద్రింపఁబడలేదు. వీరు పూర్వము నెల్లూరు మండలములోఁ బ్రసిద్ధులుగానున్న అధివక్తలలో నొకరుగానుండి, ప్రస్తుతము అమలాపురములో సబ్ జడ్జిగా నుద్యోగమును నిర్వహించుచున్నారు. తత్త్వపరమైనదృష్టితో వివరణమువ్రాసి ప్రకటించిన అన్నమయ్యగ్రంథము వీరి జీవితప్రబంధముగా నాంధ్రవాఙ్మయములో శాశ్వతమైన స్థానమును సంపాదించుకొనఁ గలదని నావిశ్వాసము.

## 164. గుంటూరు శేషేంద్రశర్మ, B A., B.L.

నెల్లూరు మండలమున సహజ కవితావేశముతోఁ గవితానిర్ఝరిణులను బ్రవహింపఁజేయుచున్న ప్రతిభావంతుఁడు శేషేంద్రశర్మ. వీరు నెల్లూరు మండలము తోటపల్లి గూడూరు గ్రామములో 1920 సం॥ ప్రాంతములో జన్మించినారు. వీరి రచనలు:- 1. వినోదకల్పలత (ఖండకావ్యము) 2. సొరాబు (పద్యకావ్యము) 3. ఋతుఘోష. వీరు ప్రస్తుతము ఒంగోలు మున్సిపల్ కమీషనర్ గా నుద్యోగమునిర్వహించుచున్నారు. వీరి కవిత ప్రసన్నగంభీరమై ప్రసాద సౌకుమార్యములతో సర్వత్ర మనకుఁ బ్రత్యక్షమగుచుండును. పద్యములు కల్పలతలో సహజముగా జాలువారుచున్నవి. ఈ చిరుకబ్బములోఁ గవినేర్పును బ్రదర్శించుచున్న యీ పద్యమును జదువుఁడు:-

హా! సంధ్యా! అవి వింధ్య పర్వతనభోవ్యాసంగశృంగంబులో
రాసుల్ రాసులుపోసి తెచ్చిన మహారంగత్తురంగంబులో
శాసించెన్ భవదీయకుంభకుచముల్ సర్వప్రపంచంబులన్
దాసీభూత సమస్తయౌవనజన ధ్యానైకరంగమ్ములై.

## 165. పదాల రామమూర్తి.

సంస్కృతాంధ్రభాషలలో సమగ్రపాండిత్యముగల కవిపుంగవులు శ్రీ రామమూర్తిగారు. జీవితమును మాతృభాష కంకితము చేయుచున్న సాహిత్యోపాసకులు. వీరు ఒంగోలు తాలూకాలో జన్మించినారు ప్రస్తుతము కావలిజిల్లా పరిషత్తువారి ఉన్నతపాఠశాలలో నాంధ్రభాషాధ్యాపకులుగానున్నారు. వీరి రచనలు:- 1. మేఘసందేశము (ఆంధ్రానువాదము) 2. రవీంద్రతేజోలహరి. ఈ కవి బహుబాల్యమునుండియుఁ గవితావ్యాసంగములోఁ గాలముబుచ్చుచు సారస్వత సేవ చేయుచున్నారు. అష్టావధానము చేయఁగల సమర్థుఁడు.

## 166. డాక్టరు వి. వేణు.

ఈ రచయిత వేంకటగిరిలో జన్మించినారు. వీరి రచనలు:- 1. నిరాశా ప్రొడక్షన్ నెం 1. (నాటిక) వీరిచే సంతరింపఁబడిన యీనాటిక నెల్లూరు, గూడూరు, కావలి కళాపరిషత్తులలో ప్రథమబహుమతుల నందుకొన్నది. 2. బిచ్చిబొమ్మలు (నాటిక) 3. చీఁకటిదొంగలు 4. రాజీనము (నాటిక) వీరి నాటికలన్నియు నించుమించుగా నాంధ్రదేశములోఁగల నాటక కళాపరిషత్తులద్వారా బహుమతుల నందుకొని, సర్వజనాదరణీయములైనవి

## 167. జీవన్ శ్రీ (యం. ఏ. ఖాదర్)

ఈ రచయిత జన్మభూమి నెల్లూరు మండలము. అభ్యుదయ నాటికా రచయితలలో, శ్రీ ఖాదర్ గారు రాటుదేలిన రచయిత. వీరి నాటికలు శాశ్వతసత్యమును సూత్రప్రాయముగఁ బ్రకటింపఁగల రచనలు. ఆంధ్రనాటక రంగములో నేఁడు కలుగుచున్న అభ్యుదయమున కీతని నాటికలు మచ్చుతునకలు. వీరి రచనలు:- 1. నీ బ్రతుకెంత? 2 వింత వైఖరి 3. కొలువిద్యము 4. కొడీ సల్లన్న 5 ప్రెస్ నర్సన్ 6. దేవాంగపిల్లలు. వీరి నాటికలన్నియు నించుమించుగా నాంధ్రదేశములో సర్వత్ర ప్రదర్శింపఁబడి కళాపరిషత్తులద్వారా ప్రథమ ద్వితీయబహుమతుల

నందుకొని ప్రజల మన్ననలకుఁ బాత్రములై యున్నవి. ఈ యువరచయితచే సంతరింపఁబడిన "నీ బ్రతుకెంత" అనునాటిక నాటికాప్రపంచమునకే శిరోమణి అని నాఅభిప్రాయము. సాంఘిక దృక్పథములో జీవితమును బహురమ్యముగాఁ జిత్రించినాఁడు ఆంధ్ర నాటికారంగము క్రొత్తబాటలలో నేఁడు పయనించుచున్నది. ఆపయనములో ఈనాటిక యొక మైలురాయి.

## 168. కొండేటి సుబ్రహ్మణ్యం.

నెల్లూరు మండలములోఁ బేరుమ్రోఁగిన నాటికా రచయితలలో శ్రీ సుబ్రహ్మణ్యంగారు అభ్యుదయపథములో వడివడిగా పయనించుచున్న రచయిత. వీరు నెల్లూరులో జన్మించినారు. వ్యాపార వ్యాసంగములో నిరంతరముఁ గాలము బుచ్చుచుండియు నుత్సాహము సడలనీయక తీరిక జూచుకొని రచనలను సాగించి, యాంధ్రనాటకరంగమున కమూల్యాలంకారములను సమర్పించి ధన్యచరిత్రుఁడై నాఁడు. వీరి రచనలు:- 1. వాపసిచ్చిన వరకట్నము (నాటిక) 2. ప్రెసిడెంటు పట్టయ్య (నాటకము.) వీరి ప్రెసిడెంటుపట్టయ్య నాటకము రాజకీయ, సాంఘిక, గ్రామీణవ్యంగ్యనాటకము. రేబాల లక్ష్మీనరసారెడ్డిగారి కీనాటకకన్య నంకితమిచ్చినాఁడు. గూడూరు, తిరుపతి, విజయవాడ పరిషత్తులలో నీనాటకము ప్రదర్శింపఁబడి ప్రథమ బహుమతుల నందుకొన్నది. వేంకటగిరిరాజ కళాశాల ఆంధ్రభాషోపన్యాసకులు శ్రీ గురువారెడ్డిగారీనాటకమునకు భూమికను వ్రాయుచు నేమని కొనియాడినారో ఆలకింపుడు:- "ఆంధ్రనాటక రంగము నేఁడు పొందుచున్న అభ్యుదయమునకీ ప్రెసిడెంటుపట్టయ్య అను నాటకమొక మచ్చుతునక. ప్రాత ప్రపంచము బూజుపట్టి క్రొత్తప్రపంచ మంకురించుచున్న యీరోజులలోఁ బ్రచారకవాఙ్మయావశ్యకత సమాజమున కెంతైనను గానలసియున్నది. ఈకవి కేవలము పూర్వులవలె ఊహాప్రేయసినిమిత్త మంబరవీధులలో విహరింపక అవనికి దిగివచ్చి ఆంధ్రాభిమానముతోను, దేశాభిమానముతోను రచనను సాగించి సారస్వత క్షేత్రములో నున్నతమైన స్థానమును సంపాదించుకొనినాఁడు"

## 169. నేదురుమల్లి వేంకటకృష్ణారెడ్డి.

నేదురుమల్లి వేంకటకృష్ణారెడ్డిగారు నవ ఆంధ్రులలో సర్వతోముఖ ప్రజ్ఞగల పరిశోధకులు. వీరు నెల్లూరు మండలములోని వాకాడు గ్రామములో జన్మించినారు. విద్యార్థులపాలిటి కల్పతరువుగాఁ బరిగణింపఁబడి, నెల్లూరు నుండి కీర్తి ప్రతిష్ఠలను నలుమూలల వ్యాపింపఁ జేసిన నేదురుమల్లి బాలకృష్ణారెడ్డిగారు,

వీరి సోదరులు. వీరి రచనలలో "ప్రకృతి పరిశీలనము" అనువైద్యగ్రంథ మతి ముఖ్యమై ప్రచారములోనున్నది. ఈ గ్రంథమునకుఁ గృతిభర్త శ్రీ బాలకృష్ణారెడ్డిగారు. ప్రకృతి పరిశీలనయందు భూమ్యంతర్గత జలపరిశోధనము పదమూఁడు వత్సరములు సాగించి యీగ్రంథమును సంతరించినట్లు పీఠిక యందు వివరించి యున్నారు. ఆదిత్యుఁడు తరతమ భేదములచే సృష్టికి మూలమై, ఋతుకర్తయై యలరారు చున్నాఁడనుట యీగ్రంథ సిద్ధాంతమై యున్నది. ఈవిధముగ ఓషధీ విభాగమును, ఖనిజ విభాగములను, గూడ రచించి విశ్వకల్యాణమునకుఁ దోడ్పడఁ బూనుట శుభావహము. వీరిచే సంతరింపఁబడిన ప్రకృతి పరిశోధనాత్మకములైన గ్రంథరాజములు ముద్రితములై నేటి శాస్త్రి పరిశోధకులకుఁ గనువిప్పును గలిగింపఁ గలవని మనము విశ్వసింపవచ్చును.

### 170. శ్రీ॥ శ్రీ॥ బూదుగుపల్లి వేంకటకృష్ణాచార్యులు.

నెల్లూరు మండలములోఁ బ్రసిద్ధులైన కవులలో శ్రీ వేంకట కృష్ణాచార్యులొకరు. పలుకులు మెత్తనివైనను బలుకుఁబడి మహాతీవ్రమైనది. పద్యరచనలో మంచి నైపుణ్యము గల కవి. వీరు నెల్లూరు మండలములో మధ్వబ్రాహ్మణ కుటుంబములో జన్మించినారు తల్లి సావిత్రమ్మ. తండ్రి జోగాచార్యులు. వీరి రచనలు:- 1. రామప్రభుశతకము. 2. కన్నడభజన కీర్తనలు 3. నీతిశాస్త్రము 5. రాజభక్తి (నాటిక.) శ్రీ కృష్ణ లీలా స్తవము, రామప్రభుశతకము ముద్రింపఁబడి యున్నవి. మిగిలిన గ్రంథముల ముద్రితములు. వీరు నెల్లూరు మండలములోఁ బేరువహించిన నటులు. బంటు మొదలుకొని రాజువేషమువఱకును పాత్రధారణ మొనర్చి ప్రేక్షకుల మన్ననలందుకొనినారు. వీరి కవిత క్రిందిపద్యమును దార్కాణముగ గ్రహింప వచ్చును.

ఉ॥ శ్రీరమగూడి సింహపురిఁ జెన్నలరారు పినాకినీనదీ
తీరమునందుఁ దల్పగిరి దివ్యులు మెచ్చఁగనిల్చి భక్తులన్
గోరిక మీరఁ బ్రోచి బుధకోటికి సౌఖ్యము లిచ్చుయోగని
ద్రారతుఁడైన రంగని పదంబులఁ గొల్తు నభీష్టసిద్ధికిన్

### 171. వేగుంటపాటి పరశరామయ్య.

కవిత్వము నభినివేశముతోఁ దమ రచనలద్వారా ప్రవర్తిలఁజేసిన పండితులలో శ్రీ పరశురామయ్యగారు పేర్కొనఁదగినవారు. ఈ విద్వత్కవి నెల్లూరుజిల్లా, కోవూరుతాలూకా వేగుంటపాడు గ్రామములో తే. 5-7-1910 ది

జన్మించినారు. ప్రస్తుతము నెల్లూరుజిల్లా, పరిషత్తువారి పాఠశాలలో నాంధ్రోపాధ్యాయుఁడుగా నుద్యోగమును నిర్వహించుచున్నారు. వీరి రచనలు:- 1. మనోరమ (ముద్రితము) 2. గురుదక్షిణ 3. భాగ్యలక్ష్మి 4. కురుక్షేత్రము 5. ప్రద్యుమ్నాభ్యుదయము 6. కుమారశతకము (అముద్రితములు) ఇతని రచనలలో నిశిత భావనాబలమును, దానికి మెరుగుపెట్టునట్టి రచనాసౌందర్యము మనకు సర్వత్ర గోచరించుచుండును. కవి సహృదయుఁడు హృదయము సుకుమారమైనది. మంచి ప్రతిభావంతుఁడు.

## 172. కోమండూరి రామానుజాచార్యులు.

ఆంధ్ర సాహిత్యరంగములోఁ బ్రవేశించి సాధనచేసినకవులలో శ్రీ కోమండూరి రామానుజాచార్యులొకరు. సహజముగ సంక్రమించిన సంస్కృతాంధ్ర భాషాపరిచయముతో వీరి గ్రంథములు పరిపుష్టములైనవి. ఈ విద్వత్కవి తక్కెళ్లపాడు గ్రామములో 1928 వ సం॥ జన్మించినారు. తల్లి కంచమ్మ, తండ్రి రంగాచార్యులు. ప్రకృత నివాసము నెల్లూరు మండలములోని కందుకూరు. ఉపాధ్యాయవృత్తి. వీరి రచనలు:- 1. శ్రీ వేంకటేశకరావలంబ స్తోత్రము (ముద్రితము) 2. మధురస్తుతి. 3. మణిహారము 4. వ్యాసమంజరి. 5. కవిసార్వభౌములు 6. రామప్రభుశతకము. 7. కందుకూరుసీమ (అముద్రితములు) వీరి కవిత మధురభావవిలసితము. సాహిత్యపరమైన జిజ్ఞాసతో గూడిన వివిధవ్యాసములు గూడ నితని లేఖిని నుండి వెలువడినవి. అనేక సాహిత్య ప్రక్రియలలోఁ జక్కని ప్రవేశముగల ప్రతిభావంతుఁడీ కవివసంతుఁడు.

## 173. అనుమలసెట్టి వేంకటేశ్వర్లు.

ఆంధ్ర కవులలో శ్రీ వేంకటేశ్వర్లుగారు విలక్షణమైన స్థానమును సంపాదించుకొని ఆంధ్రత్వము మూర్తీభవించిన రచనలను సంతరించి ప్రఖ్యాతి వహించినాఁడు. ఉత్తమభావ సంపత్తిగలవాఁడు. ఈ కవి నెల్లూరు మండలము కావలి గ్రామములో 1923 సం॥ జన్మించినాఁడు. తల్లి శేషమాంబ. తండ్రి వేంకటసుబ్బయ్య. ఇతఁడు. సంస్కృతాంధ్ర భాషలలో మంచి ప్రవేశము గలవాఁడై గ్రంథరచనను సాగించి వైశ్యకులమునకు వన్నెతెచ్చినాఁడు. ఇతని రచనలు:- 1. శకుంతల 2. కన్యకా సత్యాగ్రహము.

### 174. నరసింహదేవర సుబ్రహ్మణ్యము, B.A , B.Ed.

శ్రీ నరసింహదేవర సుబ్రహ్మణ్యముగారు 15-4-1909 తేది గోదావరి మండలములోని వెలగట్టు గ్రామములో జన్మించినారు. వీరిది పండిత వంశము. సంస్కృతాంధ్రములలో మంచిప్రవేశముగలవారు. వీరు విద్వాన్, పి. ఓ యల్. మొదలుగాఁగల ప్రాచ్యభాషాపట్టములను సంపాదించి మంచి రచయితగా వన్నె కెక్కియున్నారు. విచిత్రరామాయణ మహాకావ్య రచయితయైన శ్రీ నరసింహదేవర వేంకటశాస్త్రిగారు వీరి పితామహులు. తండ్రి:- నరసింహదేవర శేషయ్యశాస్త్రిగారు. వీరు ప్రస్తుతము నెల్లూరుజిల్లా పరిషత్తులో డిప్యూటి సెక్రటరీ (ఎడ్యుకేషన్) గా నుద్యోగమును నిర్వహించుచున్నారు. వీరు సంస్కృతాంధ్రములలో ప్రవేశముగలవారై చక్కని రచనలను సాగింపఁగల సమర్థులు. మద్రాసు, బందరు, రాజమండ్రి మొదలు గాఁగల ప్రదేశములలో నున్నతోద్యోగములను గూడ నిర్వహించియున్నారు.

### 175. జంధ్యాల జానకిరామశర్మ.

శ్రీ జానకిరామశర్మగారు సంస్కృతాంధ్ర హిందీభాషలలో విద్వాంసులు. సిద్ధహస్తులైన యాంధ్ర రచయితలు. వీరు నెల్లూరులో జన్మించినారు. తల్లి లక్ష్మమ్మ. తండ్రి వేంకటసుబ్బయ్యగారు. ప్రస్తుతము వీరు చిత్తూరు జిల్లా పరిషత్తులోఁ బ్రధానాంధ్ర పండితులుగ నుద్యోగమును నిర్వహించుచున్నారు. వీరు బహుబాల్యమునుండియుఁ గవిత్వమల్ల నేర్చిన ప్రతిభావంతులు. వీరి కృతులలో ముఖ్యమైనవి. 1. స్మరవిలాసము 2. ఆత్మసందేశము 3. రత్నావళి (నాటకము.) వీరు శంకరులు రచించిన "వేదాంత డిండిమ" మును మృదుమధురశైలిలో రచించి తమ తండ్రిగారికే అంకిత మొసంగి పితౄణమునుండి విముక్తులైన ధన్యజీవులు. ఇవిగాక ప్రాస్తావికముగ నప్పుడప్పుడు వివిధవిషయములపై రచించిన పద్యములు నందలకొలఁది గలవు. అవి మసిపాతను గురుగుపడిన మాణిక్యమువలె ముద్రణభాగ్యము నందక కృతికర్త పేటికాంతర్గతమున మ్రగ్గుచున్నవి. వీరి సారస్వత సమారాధనము సంపూర్ణముగఁ బండుచున్నదోగదా!

### 176. శిరోభూషణం వేంకటరంగాచార్యులు.

శ్రీ వేంకట రంగాచార్యులుగారు నైష్ఠికులు, పండితులు, కవులు, రసహృదయులు, శాంతచిత్తులు. వీరి జన్మభూమి కోవూరు తాలూకా పుచిణి

గ్రామము. పుదూరుద్రావిడ వంశీయులు. తల్లిపర్వతవర్ధనమ్మ. తండ్రి రాఘవాచార్యులు. సంస్కృతాంధ్రాంగ్లభాషలలో సమగ్రమైన పాండిత్యముగల విద్వత్కవివరేణ్యులు. వీరు బహుకాలము మద్రాసు క్రైస్తవ కళాశాలలో నాంధ్రోపన్యాసకులుగ నుద్యోగమును నిర్వహించి వన్నెకెక్కిరి. సనాతన ధర్మాభిమాని. నిత్యఖద్దరుధారి. వీరి రచనలలో కాలనేమి (నవల,) ప్రభావతి ప్రద్యుమ్నము, రంగరాజవిజయము, సాంగోపన్యాసశతకము, శబ్దకౌముది ముఖ్యములైనవి. వీరు వైదికమతోద్ధరణకై "బ్రాహ్మణ" అను మాసపత్రికను స్థాపించి కృషిసల్పిరి. శ్రీ దండిగుంట సూర్యనారాయణశాస్త్రిగారు వీరికి మేనమామ. వీరి కృతులు మనభాషకు భూషణములు.

## 177. చేరువింటి వేంకటసుబ్రహ్మణ్యము.

సుమధురము, సుప్రసన్నము నగు భాషలో కవిత్వము వ్రాయఁగల మేధావులు శ్రీ వేంకట సుబ్రహ్మణ్యకవిగారు. సంస్కృతాంధ్ర భాషలలోఁ జక్కని పరిచయముగలవారు. వీరు నెల్లూరు మండలము మైపాడు ప్రాంతమున నుండు ఊరుబిండి ఖండ్రిగలో జన్మించినారు. వీరు చక్కని కవిత్వముల్ల నేర్చియు "హాలికులైననేమి" అను పోతన మతము ననుసరించి వ్యవసాయము చేసికొనుచు సుఖజీవనము సాగించుచున్నారు. వీరి రచనలు:- 1. జయవిజయములు 2. విక్రమోర్వశీయము. 3. మహిళాభ్యుదయము. మచ్చునకు విక్రమోర్వశీయములోని ఈ పద్యమును జదువుఁడు:

ఉ॥ ఈహిమశైలశృంగములనేఁ దలఁదాల్చి మదీయభారతీ
సాహితినవ్యవీథుల వసంత ఋతూదయమైనయట్లు, పె
న్దాహము దీరినట్లు బలదర్పముల స్గడియించినట్లు, స
మ్మోహముచెంది మమ్ములను ముగ్ధులఁ జేయుసుమీ మనోహరీ.

## 178. కలబరిగ వేంకరమణకవి.

ఈ శబ్దారంభమునందు నెల్లూరు మండలమందు వన్నెకెక్కి యుండిన కవులలో శ్రీ వేంకటరమణకవిగా రతిప్రసిద్ధులు. సంస్కృతాంధ్ర భాషలలోఁ బండితులై అవధానము చేయఁగలిగిన ప్రతీతిగలదు. వారు కొంత కాలము తిరుపతి మహాంతు ఉన్నత పాఠశాలలోను, బిమ్మట నెల్లూరు శ్రీ వేంకటగిరి రాజాగారి ఉన్నత పాఠశాలలోను నాంధ్రోపాధ్యాయులుగ నుద్యోగమును బహుకాలము నిర్వహించి దివంగతులైరి. వీరి కావ్యము:- పరీక్షిజ్జననము.

## 179. కోవూరి పట్టాభిరామశర్మ.

ఇరువదవ శతాబ్దపూర్వార్థమున నెల్లూరు మండల కవులలో వన్నెకెక్కిన వారు కోవూరి పట్టాభి రామశర్మగారు. వీరు బడగణనాటికన్నడ బ్రాహ్మణులు. తండ్రి శ్రీ వేంకటరమణయ్యగారు. తల్లి నారాయణమ్మ. సంస్కృతాంధ్రము లలో నిరూఢప్రజ్ఞాశాలి. ధారాశుద్ధిగల కవివరేణ్యుఁడు. అన్నిటికిఁ దోడుగా సాధన చతుష్టయ సంపత్తిగలిగి గురుపరంపరాగత భూమవిద్యచేతఁ బ్రబోధ మందిన పండితుఁడు వీరు తొలుత కడప మండలమున మునసబుకోర్టులో నుద్యోగమును నిర్వహించినను, నడివయస్సులో కోవూరు నందు శ్రీ విశ్వనాథ సుబ్బరామయ్య ప్రభృతుల సాయమునఁ బ్రబుద్ధాశ్రమమును స్థాపించి, వేదాంత విచారముతోడను, గ్రంథరచనలతోడను, పరమార్థ బోధలతోడను, గాలము గడిపి దివంగతులైరి. వీరి రచనలు:- వివేక చూడామణి 2. మహాకావ్య దర్పణము 3. అపరోక్షానుభూతి 4. శ్రీ భగవద్గీతామంజరి 5. శ్రీమదాంధ్ర మహాభాగవతైకా దశస్కంధము. వీరు భాగవతమునందు బంధ, గర్భ, కవిత్వముల సుచిమాపించుట యేగాక, అచుంబిత నిరోష్ఠ్య, అచల జిహ్వా, స్వరలఘు వర్ణములతోఁగూడ పద్యరచన చేసియున్నారు. ఈ మహాకవిచే సంతరింఁపబడిన యీక్రింది అచుంబిత నిరోష్ఠ్య చంపకమాల నాఘ్రా ణింపుఁడు:-

చ॥ కరధృతశాతసాయకనికాయ నికృత్త దశాస్యకంధరా,
గరగళసాహ్యదగ్ధశరకర్కశ రాక్షస రాణ్ణికేతనా,
సరిదధినాథనిస్తరణ సాధకకాననచార దీక్షితా,
శరధిశయానదీనజన జాడ్యహరా సకలార్థదాయకా.

## 180. చావలి రామచంద్రరావు.

శ్రీ రామచంద్రరావుగారు 1926 లో జన్మించినారు. అత్యుత్సాహ వంతుఁడైన యీయువరచయిత ప్రస్తుతము ఉదయగిరి తాలూకా, సీతారామపుర ములో హిందీపండితులుగా నుద్యోగమును నిర్వహించుచున్నారు. స్నేహపా త్రుఁడు ఉత్తమకథా రచయితగాను, గేయరచయితగాను బ్రఖ్యాతి వహించుచు ననేక కథలను గేయములను బత్రికాముఖమున ఆంధ్రదేశమున కందించినాఁడు. వీరి రచనలు:- 1. కురుక్షేత్రము (హిందీకావ్యానువాదము) 2. ప్రేమ్‌చంద్‌కథలు 3. మంగళసూత్రము (హిందీమూలము) 4. పాపల్లారా!(బాలగేయాలు) 5. రంగ భూమి (హిందీనవల కనువాదము.)

వీరి కురుక్షేత్రమహాకావ్యము హిందీసాహిత్యమున నగ్రస్థాన మలంకరించిన శ్రీ రామధారీసింహ్ "దినకర్" రచించిన మహాకావ్యమునకు భావానువాదము. వీరి రచన ఆంగ్లభాషయందుఁగల "Blank Verse" ను బోలియున్నది. ఇందలి శయ్య మనోజ్ఞమై అనర్గళముగ మొదటినుండి చివరివఱకుఁ గొనసాగినది. ఈ రచయిత శైలి తత్సమశబ్ద భూయిష్ఠమయ్యు నట నట వ్యావహారిక భాషాసాంప్రదాయమును స్వీకరించెను. ఇది అనువాదకావ్యమయ్యు చదువుచున్నపుడు స్వతంత్ర్య కావ్యముగా మనకుఁ దోఁచుచుండును. కురుక్షేత్రసందేశము నీ చక్కని గేయరూపములో నెట్లందించుచున్నాఁడో తిలకింపుఁడు :-

"పుణ్యం పాపం బను ఇరురెమ్మలపై
కుసుమిస్తుం దీ ఆశ
కురుక్షేత్ర చితాభస్మంలో సైతం
నిబిడమైన దీ అభిలాష
ఏ నరు డీ సత్యం గుర్తిస్తాడో,
అతఁడే సాత్త్వికధర్మప్రవర్తకుఁడు
అతఁడే సత్సేనకుఁ డతడే
సమాజప్రియుఁడు
ఉత్తముఁడూ, అధినేతయు
అతడే అతడే!"

## 181. దామెర్ల వేంకట రమణ.

నేఁడు ప్రసిద్ధికెక్కిన నాటికా రచయితలలో శ్రీ వేంకటరమణ సాహిత్యము కొఱకు జీవించుచున్న కళామయుఁడు. ఈరచయిత ఆత్మకూరు తాలూకా చవుట భీమవరము గ్రామములో 5-11-1931 న తేది ఒక సామాన్య కుటుంబములో జన్మించినాఁడు. తండ్రి సుబ్బరామనాయుఁడు, తల్లి సావిత్రమ్మ ఇతని రచనలు:- 1. కాళ్లబేరము (నాటిక) 2. ప్రతీకారము (బొబ్బిలినాటిక) 3. దేవదాసు (నాటకము) బహుబాల్యమునుండియు నీ రచయిత ఉత్తమకథారచయితగాఁ బ్రఖ్యాతి నహించి, నేఁడు నాటికలను వ్రాయుచు భిన్నస్థలములలోఁ బ్రదర్శింపఁజేయుచు నుత్తమ బహుమతుల నందుకొనుచున్నారు. వీరు రచించిన నాటికలలో చారిత్రాత్మకమైన బొబ్బిలికథను నాటికగా సంతరించి, బహుముఖప్రజ్ఞను బ్రదర్శించి, ఇటీవలనే దానిని తిరుపతి నాటకకళాపరిషత్తునందు బ్రదర్శించి, బహుమతిని బొందినారు.

## 182. వి. సుబ్బరామయ్య.

శ్రీ సుబ్బరామయ్యగారు రాపూరు తాలూకా, మునగాల వెంకటాపురంలో జన్మించినారు. వీరు సంస్కృతాంధ్రభాషలలో సమగ్రమైన పాండిత్యముగల్గి కొన్ని ఖండకావ్యములను సంతరించియున్నారు. వీరి రచనలు:- 1. భక్తిమొలక 2. ముక్తిగిలక (అముద్రితములు) ఈరచయిత ధీరసంకల్పము ప్రశంసార్హము. రసజ్ఞులు కవితాప్రియులు. వీరి ఖండకృతులకు గతిగల్పింప వేడికోలు.

మ॥ అరయన్లేమ కవిత్రయాది రచితంబైనట్టి సద్గ్రంథముల్
గురుపాంతన్నిలవుండి విద్యగొనగల్గన్ లోకవిస్తారమున్
ఎఱుఁగన్ గోరి చరింపలేదెటకు నూత్నంబైన వార్తాప్రతుల్
గురిగానన్ సరివారిలో నెగడితిన్ కూపస్థభేకంబునై.

## 183. వెన్నెలగంటి హనుమాయమ్మ.

నెల్లూరు మండలములో ఎరగుడిపాటి గోపాలకృష్ణపంతులుగారికిని భూదేవమ్మగారికిని హనుమాయమ్మగారు 25-8-1875 వ సంవత్సరమున జన్మించిరి. ఈమె జన్మతః విద్యాజ్ఞాన సంపన్నురాలు. ఈమెను వెన్నెలగంటి నటేశముగారికిచ్చి వివాహము గావించిరి. కాని ఆమె కచిరకాలముననే భర్తృవియోగము సంభవించినది. ఈమెకు బహుబాల్యమందే చిరాభ్యస్త వాసనావిశేషముచే భక్తిజ్ఞానవైరాగ్యత్రిపుటి యలవడి బ్రహ్మచర్యమున నీమె జీవితశేషమును ప్రాప్యముచేసికొనినది. ఈమెకు గాయత్ర్యనుష్ఠానమున నభిమాన మతిశయించియుండెను. ఈమె సంస్కృతాంధ్రములలోఁ బాండిత్యము నార్జించి సంస్కృతమునఁ గొన్ని శతకములు వ్రాసి పన్నెకెక్కినది. తెనుఁగున నీమె అధ్యాత్మరామాయణమునకుఁ టీకాతాత్పర్యములుగూడ వ్రాసినది.

## 184. సిద్ధవరపు నారాయణరెడ్డి.

ప్రఖ్యాతకవిపుండరీకుఁడు శ్రీ నారాయణరెడ్డిగారు. నెల్లూరుమండలము మాచెర్లవారి పాళెములో 1895 ప్రాంతములో నొక సంపన్న కుటుంబమున జన్మించిరి. తండ్రి పిచ్చిరెడ్డిగారు. తల్లి ఆదెమ్మగారు. ఈ మహనీయుఁడు శ్రీమాన్ పరాంకుశ నరసింహాచార్యులయొద్ద విద్యనభ్యసించి సంస్కృతాంధ్రములలో సమగ్ర పాండిత్యము నార్జించిరి. వీరాంగ్లభాషలోఁగూడఁ జక్కని బరిచయము నేర్పఱచుకొని షేక్సిపియర్ వ్రాసిన "Merchant of Venice" అను

నాటకమును దెనిఁగించెను. వీరు ఆంగ్లేయప్రభుత్వపు పట్టాభిషేకమును జూడ 1936 లో ఇంగ్లడునకుఁబోయి, పిమ్మట స్వదేశమునకువచ్చి బహుకాలము సాహిత్య సేవచేసి దివంగతులైనారు.

## 185. గొల్లపూడి శ్రీరామశాస్త్రి.

ఆంధ్ర సారస్వత చరిత్రలో వచన రచనాప్రధానమైన ప్రస్తుత యుగములో శ్రీ శ్రీరామశాస్త్రిగారు విశిష్టమైన స్థానము నలంకరించియున్నారు. ఉభయ భాషాప్రవీణులు, వినయశీలురునైన శ్రీ శాస్త్రిలుగారు ఖరసంవత్సర శ్రావణ బహుళ పంచమినాఁడు ఒంగోలు తాలూకా బ్రాహ్మణ నిడుమామూరు గ్రామములో జన్మించినారు. తండ్రి గొల్లపూడి అయ్యవారు భొట్లుగారు. తల్లి వేంకమ్మగారు. వీరు బహుకాలమునుండి అనేకుల కావ్యమిత్రులై సాహిత్యముకొలకు జీవించియున్న కళామయులు. వీరు సంస్కృతాంధ్రభాషలలో సమగ్రపాండిత్యము నార్జించి బహుళ గ్రంథములను సంతరించి ఆంధ్రదేశమునకు సమర్పించి యున్నారు. వీరి రచనలు:- నాటక కళను గుఱించి నాట్యశాస్త్రమును సారముగఁ జెక్కు వ్యాసములు రచించి పత్రికాముఖమున వెలువరించియున్నారు. "నాటక జిజ్ఞాస-ఆంధ్ర నాటకరంగము" అను నామములతో రెండుగ్రంథములు గూడఁ బ్రకటింపఁబడి యున్నవి. ఇవి గాక 1 "దర్పదళనము (మహాకవి క్షేమేంద్రుని కృతికాంధ్రానువాదము" 2. నీతిపదవి (రెండుభాగములు) 3. సమపదేశము (రెండుభాగములు) 4. అహోబిల మాహాత్మ్యము 5. వ్యాసరచన 6. వాక్యరచనమొదలుగాఁగల గ్రంథములను కెక్కింకెని సంతరించి ఆంధ్రవాఙ్మయరంగమున విశిష్టమైన స్థానమును సంపాదించుకొని యున్నారు.

## 186. చక్కెరాల శ్రీనివాసులు.

విద్యకుఁ దగిన సుగుణసంపదగల యువకవి మన శ్రీనివాసులు. ఉపాధ్యాయత్వమునఁ గవిత్వమున చాలసమర్థులు. ఈ యువకవి 29-4-31 తేది నెల్లూరునందు జన్మించినారు. తండ్రి సుందరరామయ్యగారు. భారద్వాజ గోత్రము. రచనలు:- 1. ఉదయచంద్ర, 2. ఆఖరుకోరిక, 3. తీర్థయాత్ర, 4. చూపుమేరలో, 5. ఆధ్యాత్మిక సాధము. ఈతని కవితలో ననేకవిషయములు సంధానింపఁ బడియున్నవి. పద్య భావము లన్నియు నుదారములు. హస్తరేఖలనుబట్టి సాముద్రికము చెప్పుటయందు వీరికిఁ బ్రీతిమిక్కుటము. నాటకరంగములోఁగూడఁ జక్కని ప్రవేశము గలవాఁడు.

## 187. దంతు వెంకురెడ్డి.

వీరు గూడూరు తాలూక కడివేడు సమీపమునున్న తిమ్మనగారి పాళె ములో జన్మించినారు. తెలుఁగు భాషలో దిట్టమైన సాహిత్యము కలిగించుకొని గ్రంథ రచన సాగించినాఁడు. 1956 లో ధూర్జటి కవికృత శ్రీ కాళహస్తి మాహాత్మ్యము నందలి కన్నప్ప కథను హరికథగా రచించినారు. కవిత్వము భావయుక్తముగను భక్తిభరితముగను నుండును

## 188. మల్లవరపు సుబ్బయ్యశర్మ.

శ్రీ శర్మగారు గొప్ప విమర్శకాగ్రేసరులు. ప్రాచీన విద్యాపారంగతులు. నెల్లూరు మండలము గొల్లకందుకూరు గ్రామములో జన్మించి బహుకాలము గ్రామ కరణముగా నుద్యోగమును నిర్వహించిరి. వీరు 1936 లో "శ్రీ మహాభారత ప్రశ్నో త్తరములు" అను గ్రంథమును వ్రాసిరి. దీనిని వావిళ్లవారు ప్రకటించిరి. చిక్కును విడఁదీయఁగల ప్రత్యుత్తరము లీచిన్నిపొత్తమున నున్నవి.

## 189. టి. వి. సుబ్బయ్య.

వీరు నెల్లూరు వాస్తవ్యులు. 15-7-1922 వ తేది జన్మించిరి. శ్రీ భారతుల వేంకటేశశర్మగారి శుశ్రూషాసంస్కారముతో ఈ రచయిత సంస్కృతాంధ్ర భాషలలో చక్కని పరిచయమును లభించుకొని కొన్ని ఖండకృతులను సంతరించి "వేణుగానము" అను శీర్షికతోఁ బ్రచురింపఁబడిన యీ ఖండికలు రసవద్గుళికలు. 1. కర్షకుఁడు, 2. బైరాగి, 3. పురస్కృతి, 4. బోధి, 5. ప్రమోదు, 6. మాతృ ప్రేమ. రసానుగుణమైన శయ్యాసౌభాగ్యము వీరి కవితకు నిసర్గజమయిన సుగుణము.

## 190. పిశ్వారిసెట్టి కోదండరామదాసు.

సింహపురములో 19 - వ శతాబ్దమున నుండిన కవులలో శ్రీ దాసుగారు గొప్ప ప్రతిభావ్యుత్పత్తులుగల కవిపుంగవులు. మహాభక్తులు. తండ్రి వేంకటస్వామి దాసు, తల్లి సుభద్రమ్మగారు. వీరి రచనలు :- 1 రంగపతి శతకము, 2. తారావళి, 3. రంగనాయక శతకము, 4 నవరత్నమాల, 5. ఆంజనేయ నక్షత్రమాల, 6. రంగ నాయకీ నక్షత్రమాల. వీరిచే సంతరింపఁబడిన "రంగపతి శతకము" "తల్పగిరి రంగ పతీ సుకృతీ కృపామతీ" అను మకుటముతోఁ జంపకోత్పల మాలావృత్తములలో రచింపఁ బడినది. ఈ క్రింది పద్యములో నీ కవి తన విద్యావిషయముల నిట్లు చెప్పి కొని యున్నాఁడు.

అమరనిఘంటులక్షణము నాంధ్రములంకృతిఁ గావ్యనాటకా
దిమముల నెన్నఁడేని నియతిం బఠియింపగలేను భక్తిచే
విమలపదంబుఁ గోరి కడువేడుక నుత్పలచంపకంబులన్
రమణ రచింతుఁ దల్పగిరిరంగపతీ సుకృతీ కృపామతీ.

### 191. కోట సోదరకవులు (కోట సుబ్రహ్మణ్యశాస్త్రి - కోట సత్యరంగయ్యశాస్త్రి)

నెల్లూరు మండలమును సాహిత్యోత్సాహముతో నుఱ్ఱూతలూగించిన యీ జంటకవులు కనిగిరి తాలూకాలో జన్మించినారు. ఈ పండిత కవులు రచించిన శతాధిక గ్రంథములు ఆంధ్రదేశములో సర్వత్ర మిక్కిలి వ్యాప్తిలో నున్నవి. వీరు అవధానము చేయఁగల సమర్థులు. ఆంధ్రదేశములో నాఁడు నేఁడు జరుగుచున్న సాహిత్య సభలలో వీరతిథులుగాఁ బ్రత్యక్షమై తమ ఆశుకవితాప్రతిభను బ్రకటింపని సభలే లేవన్నచో నతిశయోక్తి యుండఁబోదు. ఈ జంటకవులు "అవధానములు" అను వ్యాసమునుగూడ నీ సర్వస్వములో వ్రాసియున్నారు.

### 192. పులుగుండ్ల నరసింహశాస్త్రి.

శ్రీ నరసింహశాస్త్రిగారు సంస్కృతాంధ్రభాషలలోఁ బేరుమోగిన పండితోత్తముఁడు. వీరు నెల్లూరు మండలములోని వేదసంస్కృత కళాశాలలో బహుకాల మాయుర్వేదాచార్యులుగ నుద్యోగమును నిర్వహించిరి. వీరి రచనలు:- 1 దర్పదళనము (క్షేమేంద్రునికృతి కాంధ్రానువాదము - పద్యకావ్యము) వీరు శాస్త్రగ్రంథములను గూడఁ గొన్నింటిని రచించియున్నారు.

### 193. సముద్రాల లక్ష్మణయ్య (శిరోమణి)

సముద్రాల లక్ష్మణయ్యగారు 19-11-1937 తేదిన "కాట్రకాయలగుంట" అను చిన్నగ్రామమున జన్మించిరి. బాల్యమున మహర్షి శ్రీ మళయాళ స్వాములవారు స్థాపించిన వ్యాసాశ్రమమునందు సంస్కృతవిద్య నభ్యసించిరి. తమతరి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమునందు "సాహిత్య శిరోమణి" లో సర్వప్రథములుగా నుత్తీర్ణులైరి. ప్రస్తుతము గూడూరు తాలూకాలోని "క్రొత్తపాళెం" గ్రామము నందలి సంస్కృతోన్నత పాఠశాలలో ప్రధానసంస్కృత పండితులుగాఁ బనిచేయుచున్నారు. వీరికి సంస్కృత భాషయన్న నెనలేని ప్రేమ. ప్రాచ్య కళాశాలలో విద్య నభ్యసించుకాలమున ఆంధ్ర సచిత్రవార పత్రికలో

కొన్ని చక్కని గేయములను వ్రాసి ప్రకటించిరి. వీరి రచనలు:- అమరవాణి ఇది వీరి ప్రథమకృతి. ఇందు 108 పద్యములలో సంస్కృత భాషా ప్రాశస్త్యము చక్కగా వివరింపఁబడినది. 1961 లో జిల్లాపరిషదుపాధ్యక్షులు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి గారీ గ్రంథము నావిష్కరించిరి. ఇది పలువురు పండితుల మన్ననలందిన గ్రంథము. మలయాళ సద్గురు శతకము. శ్రీ మహర్షి మళయాళ స్వాములవారి నుద్దేశించి భక్తిపూర్వకముగా వ్రాయబడిన పొత్తము. రచన సరళ సుందరమై పఠితల నాకర్షించుచున్నది. "బాలనైషధమ్" అను సంస్కృతకావ్యము, "శ్రద్ధాంజలి" అను తెలుగు గ్రంథము వీరి అముద్రిత రచనలు. అందు మొదటిది సంస్కృతము నభ్యసించు బాలురను దృష్టిలో నుంచుకొనియు, రెండవది బ్రహ్మభూత శ్రీ మహర్షి మలయాళ యతీంద్రుల నుద్దేశించియు రచింపఁబడినవి.

కవి వయస్సున పిన్నయయ్యు నేర్పుగల కైతయందు దిట్ట. ఉదాహరణమునకు వీరి "అమరవాణి" లోని ఒక పద్యమును తిలకింపుఁడు:-

సీ॥ వాల్మీకి వాక్సుధావర్ష ధారలఁ గ్రోల శక్తి చాలని యట్టి చాతకములు
వ్యాససంయమిచంద్ర వాక్చంద్రికల తీపు గ్రోలంగలేని చకోరకములు
కాళిదాసకవీంద్ర కావ్యాంబరమ్ములో విహరింపఁగాలేని విహగతతులు
మాఘభారవి వచోమకరంద మాధురీ మహిమ మెక్కఁగలేని మధుకరములు.

గీ॥ బాణకవికల్పనములు నాఁబఱగు రసాల పల్లవములు మేయఁగలేని పరభృతములు
మంజుభాషిణీ! నీమృదుమధుర ఫణితి కర్ణమెలుఁగంగ నేరని వ్యర్థమతులు.

## 194. శ్రీమతి ఆదిలక్ష్మి.

### (M.A., M.Litt - Dip. in Poltics and Public Administration)

ఆంధ్రమహిళలలో నంతర్జాతీయముగ యశమును గడించిన ఆదిలక్ష్మి నెల్లూరు మండలము కసుమూరు గ్రామమున 1931 ప్రాంతమున జన్మించినది. తల్లి రుక్మిణమ్మ. తండ్రి ములుమూడి ఆంజనేయులుగారు. ఈ కవయిత్రి బాల్యమునందే అరవము, సంస్కృతము నేర్చినది. కళాశాలలలోను విశ్వవిద్యాలయములలోను ప్రతి పరీక్షయందు ప్రథమశ్రేణిలో నుత్తీర్ణురాలై ప్రఖ్యాతివహించినది. తెలుఁగు, సంస్కృతము, ఇంగ్లీషు, అరవము, హిందీ భాషలలో నీమె ప్రవీణ యగుటచే నీమెను "పంచభాషిణి" అనవచ్చును. రష్యా ప్రభుత్వము వారీమెను లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయమున తమిళము, తెలుఁగు రెండు భాషలకు ప్రొఫెసరుగా నియమించిరి. క్రీ. శ.

1958-62 వఱకును నీమె అచ్చట పనిచేసినది. ఈమె రష్యన్ భాషలోఁగూడ మంచి ప్రవేశమును సంపాదించినది. 1962 లో నొక యాఁడుబిడ్డను గని లెనిన్‌గ్రాడ్‌లో ఇటీవలనే దివంగతురాలైనది.

ఈ కవయిత్రి కాలమొక నిమిషమైనను వ్యర్థముచేయక విద్యార్థినిగా నున్నప్పుడే నిడుదవోలు వేంకటరావుగారి సాహాయ్యముతో మదరాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారమున పరిశోధన గావించినది. తాళపత్ర విలేఖనములనుండి శుద్ధ ప్రతులనుఁ దయారుచేయుటయందేగాక, తెలుఁగు పూర్వలిపి, దేవనాగరి, నంది నాగరి, గ్రంథాక్షర లిపి మొదలుగాఁగల లిపుల నన్నింటిని చదువఁగల శక్తిని సంపాదించినది. అద్యతనకాలమున నాంధ్రమహిళా ప్రపంచమున నీమె యొకజ్యోతి.

ఈమె రచనలలో "పంచామృతము" అను పద్యకావ్య సంపుటి ప్రసన్న గంభీరాకృతితోఁ గమనీయమై విలసిల్లుచున్నది. దధి (పెరుగు), క్షీరము (పాలు), ఘృతము (నేయి) అనునవి శర్కర (చక్కెర) మధువు (తేనె) తోఁ గూడిన నది పంచామృత మగును. పూజా సమయములో శుద్ధోదక స్నానమునకు ముందుగా నీ పంచామృత స్నానము విధింపఁబడి యున్నది. ఈ కృతి అన్వర్థనామ్ని. ఇందయిదుగురు మహనీయులగు మహిళల యుదంతము లుట్టంకితములైనవి. తన కావ్య సంపుటిలో మొల్లనుగూర్చి యీ కవయిత్రి వ్రాసిన యీ పద్యమును వినుఁడు:

ఉ॥ కమ్మని తేటతెన్గుమడికారముతో సరసార్థయుక్తితో
ముమ్మరమైన నీకవనముం జవిచూచియు కొందఱయ్యలే
కుమ్మరిమొల్లయందు నినుఁ గూర్చి వచించిరి తెన్గునాఁట నీ
కు మ్మరిలేదదేల కులగోత్ర విచారము కావ్యచర్చలో.

## 195. ఎరగుడిపాటి వేంకటాచలంపంతులు.

శ్రీ పంతులుగారు కందుకూరు తాలూకా కరేడు గ్రామమున జన్మించిరి. తండ్రి అప్పయ్య పంతులు. భారద్వాజస గోత్రులు. 1801 నుండి 1874 వఱకు వీరు జీవించియుండిరని తెలియవచ్చుచున్నది. ఈ కవి జీవించియుండిన కాలమున నెల్లూరు జిల్లా సివిల్ అండ్ సెషన్సు కోర్టులో శిరస్తాదారుగ నుద్యోగమును నిర్వహించిరి. వీరు సంస్కృతాంధ్రభాషలలోనేగాక పారసీకము, ఆంగ్లము, కన్నడము, ద్రావిడము మొదలుగాఁగల భాషలలోఁ బాండిత్యము గల్గియుండిరి. అతఁడు గొప్ప వేదాంతి. భగవద్భక్తుఁడు. తన జీవితసర్వస్వమును నెల్లూరి రంగనాథున కర్పించి పుట్టువు ధన్య

మొనర్చుకొన్న మహితాత్ముఁడు. వారు కట్టించిన రంగనాథుని గోపురము నేఁటికిని సింహపురి కీర్తికి విజయపతాకముగ నున్నది. ఈ మహాకవి ముకుంద శతకమును, రాసక్రీడ యను (యక్షగానము), రంగనాథునిపై కొన్ని గేయములను వ్రాసి చరితార్థుఁ డయ్యెను

ముకుంద శతకములో 109 కంద పద్యములు గలవు. అన్ని పద్యములకు "ముకుందా" అను మకుటమున్నది. సుమతి శతకమున లేనిదియు నీతి బోధకమునైన ఈ కందమును దిలకింపుడు :-

గురుబోధ లేక గాంచఁడు [illegible] బుద్ధి పాటవమున్నన్
శరమెంత వాడియైనను గురిఁ [illegible] విల్లు నూతఁగొనక ముకుందా.

## 196. పులుగెండ్ల రామకృష్ణయ్య

నేఁటి మేటి నాటికా రచయితలలో శ్రీ పులుగెండ్ల రామకృష్ణయ్యగారు అందెవేసిన చేయి. వీరు నెల్లూరుమండలములో జన్మించినారు. వీరి రచనలు 1. తుపాను (నాటిక) 2. తలవనితలంపు (నాటకము) 3. విముక్తి (నాటకము) వీరి రచనలు ఆంధ్ర దేశములో సర్వత్ర ప్రదర్శింపఁబడి కళాపరిషత్తులద్వారా ప్రథమ బహుమతుల నందుకొన్నవి. వీరిచే సంతరింపఁబడిన "తుపాను" నేఁటి నాటికలకు మకుటాయమానముగ నున్నది. నెల్లూరుమండలపుఁ దెలుఁగున కియ్యది ప్రతిబింబము. వీరిటీవలనే వ్రాసిన "విముక్తి" నాటకమును అల్లాడి అన్నపూర్ణమ్మగారికి కంకితము గావించినాఁడు. వీరు వ్రాసిన నాటకములు సాంఘికదృక్పథముతో వ్రాయఁబడినవైనను శాస్త్రీయదృక్పథము సర్వత్ర మనకుఁ గన్పించుచుండును. వీరి పాత్రలు సజీవములై ప్రేక్షకులకు ముచ్చటఁ గొల్పుచుండును.

## 197. గ్రిద్దలూరు గోపాలరావు.

వీరు నెల్లూరు మండలములో జన్మించిన రచయితలు. వాస్తవిక దృక్పథముతో నాటికలు వ్రాయఁగల సమర్థులు. వీరి రచనలు:- 1. బంగారుభూమి (నాటకము) 2. కత్తీబంగారము (నాటిక-అముద్రితము) ఈరచయిత నాటికలలోఁ గీలకమేమో తెలిసికొని సజీవములైన పాత్రలను సృష్టించి, దేశకాల పాత్రముల కనుగుణమైన వస్తువును స్వీకరించి రచనను సాగించి ప్రజల మన్ననలకుఁ బాత్రుఁడైనాఁడు వీరి రచనలకు గొన్ని కళాపరిషత్తులు బహుమతులను గూడఁ బ్రసాదించినవి అభివృద్ధికి రాఁదగినరచయిత. కండపుష్టిగల రచనలు చేయఁగల సమర్థుఁడు.

### 198. అనుకొల్లు కృష్ణారెడ్డి.

దేశకాలపరిస్థితుల నవగాహనముచేసికొని అభ్యుదయపథములో నాటికలను వ్రాయుటలో నారితేరిన మేధావి కృష్ణారెడ్డి. వీరి రచనలను చదువుచున్నప్పుడు గుండెలు జలదరించుచుండును. నాటికకు శిల్పపరముగానొక రూపకల్పనచేయుటకుఁ బ్రయత్నము చేయుచుండును. ఇతని రచనలు:- అల్లుడుచూపిన ఆదర్శము (నాటిక)

### 199. డా. దేవరాపెంట సరస్వతి, MA. Ph. D.

నెల్లూరు మండలములో అధివక్తగా మిక్కిలి ప్రఖ్యాతివహించిన డి. సి. రాఘవయ్యగారి రెండవకుమార్తె డాక్టరు సరస్వతమ్మగారు. ఈమె చిన్నతనమునుండియు సంస్కృత విద్యావ్యాసంగము చేయుచు నద్భుతమైన తెలివితేటలను బ్రదర్శించుచు వచ్చినది. మద్రాసు విశ్వవిద్యాలయములో M. A. పరీక్షలో నుత్తమశ్రేణిలో నుత్తీర్ణురాలై, పిమ్మట ఆవిద్యాలయములోనే సంస్కృతపండితులైన డాక్టరు రాఘవన్‌గారి పర్యవేక్షణలో నీ విదుషీమణి సంస్కృతభాషా పరిశోధనచేసినది. సింగభూపాలు నాస్థానపండితుఁడైన విశ్వేశ్వరుని చమత్కారచంద్రికను పాఠనిర్ణయముచేసి, యాంగ్లీకరించి, Ph. D. పరీక్షకు సుదీర్ఘవ్యాసమును వ్రాసినది. విశ్వవిద్యాలయము వారీమె వ్రాసిన గ్రంథము నంగీకరించి, పి. హెచ్ డి. బిరుదముతో సత్కరించిరి. ఈ గ్రంథమును దేహళీగవర్నమెంటువారు ప్రచురించుటకై తీసికొనిరి. ఈమెకు జర్మనీ భాషలోఁగూడ బరిచయమున్నది ఈ విధముగా శ్రీ సరస్వతమ్మగారు బహుబాల్యమునుండియు తన జీవితమును గీర్వాణభాషకంకిత మొనర్చి, డాక్టరు బిరుదమును బొంది, మన నెల్లూరు మండలమునకుఁ బ్రతిష్ఠ చేకూర్చినది. మునుముందీ విదుషీమణి గీర్వాణభాషాయోష కమూల్యాలంకారములను సమర్పింపఁ గల సమర్థురాలు.

### 200. బండి గోపాలరెడ్డి B. Com, (Hons)

శ్రీ గోపాలరెడ్డిగారు వ్యాసరచనలో మంచి సాధకుఁడు. ఆంధ్రసారస్వతము నారాధించి, ఆంగ్ల సారస్వతము నవలోడనముచేసి, బి. కాం. ఆనర్సు చదివి, చక్కని సాహిత్య సంపత్తిని సంపాదించి, విలువగల వ్యాసములను వ్రాయుచు నాంధ్రవాఙ్మయ క్షేత్రములో స్థానము నేర్పరచుకొన్న ప్రతిభావంతులు శ్రీ రెడ్డిగారు.

ఈ వ్యాసరచయిత కోవూరు తాలూకా మినగల్లు గ్రామములో 1937 వ సం॥ ప్రాంతములో జన్మించినాడు. తండ్రి శంకరరెడ్డి. తల్లి శంకరమ్మ. వీరు 1959 లో విశాఖపట్టణములో స్రవంతి పత్రికకు సంపాదకులుగాను, పిమ్మట ఆంధ్రజ్యోతి దిన పత్రిక కుపసంపాదకులుగాను గొంతకాల ముండిరి. స్వతంత్ర, ఆంధ్ర జ్యోతి, జమీన్‌రైతు మున్నగు పత్రికలద్వారా యీరచయిత తఱచుగా వ్యాసములను వ్రాయుచు నాంధ్రదేశమునకుఁ బరిచయమైనారు. ప్రస్తుతము వీరు జమీన్‌రైతు పత్రిక కుపసంపాదకులుగా నున్నారు. నవ్యసాహిత్యోపాసనాబల మీ యువ రచయితను ప్రోత్సహింపఁజేసి, యేదేనొక యుద్గ్రంథమునకుఁ జేయూతనియ్యఁగల దేమో మనము వేచి చూడవలసి యున్నది. వీరీ సర్వస్వమున "నెల్లూరులోని పత్రికలు" అను నొక సుదీర్ఘవ్యాసమును వ్రాసి యున్నారు.

## 201. రేబాల దమయంతీ దేవి.

శ్రీమతి దమయంతీదేవిగారు నెల్లూరులో జన్మించినారు. ఈ విదుషీమణి భర్త శ్రీ రేబాల సుబ్బరామిరెడ్డి గారు. ఈ దంపతు లిరువురు నెల్లూరు మండలములో తఱచుగా సాంఘికసేవాకలాపములలో కాలముఁ బుచ్చుచుందురు. ఈమె స్త్రీల సాంఘికసమస్యలనుగూర్చి సజీవభాషలో జమీన్‌రైతు మొదలు గాఁగల స్థానిక పత్రికలలో తఱచుగా జనరంజకమైన వ్యాసములనుగూడ వ్రాయుచున్నది. ఈ విధముగ నీమె నెల్లూరు మండలములోని రచయితలలో సముచితమైన స్థానము నాక్రమించియున్నది.

## 202. పి. చెంచు సుబ్బమ్మ. M. Litt.

సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో సమగ్రమైన పాండిత్యము నార్జించిన శ్రీమతి చెంచు సుబ్బమ్మగారు నెల్లూరు తాలూకా కనుపర్తిపాడు గ్రామములో జన్మించినారు. ఈ విదుషీమణి బహుబాల్యమునుండియు విద్యావ్యాసంగములో కాలముబుచ్చి మద్రాసు విశ్వవిద్యాలయమువారి యమ్, ఏ పట్టమును సంపాదించి, ఇటీవలనే అద్వైతమును గూర్చి యొక పరిశోధనాత్మక గ్రంథమును వ్రాసినది. ఇందలి ప్రతిభను గుర్తించి మద్రాసు విశ్వవిద్యాలయము వారు యమ్. లిట్. బిరుదమును ప్రసాదించిరి. ప్రస్తుత మీమె వేంకటగిరి రాజ కళాశాలలో ఉపన్యాసకురాలుగా నున్నది. ఆధ్యాత్మిక విషయములలో నీమె యెనలేని కృషిచేసియున్నది.

## 203. ఇనుకొలను వేంకటరామయ్య.

ఆత్మకూరు, చిరమన గ్రామనివాసి. కవిత్వమందాసక్తికల్గి, పద్యరచన సుందరముగ చేయగల్గిన రచయిత. వీరు, సే. శ్రీ. కృష్ణమూర్తిగారు కలసి "రుద్రమదేవి" యను నాటకము రచించి, ప్రయోగించిరి. రుక్మిణీ కళ్యాణము చిన్న నాటికను రచించిరి. వీరు 12-3-1955 న, నెల్లూరునందు కీర్తిశేషులైరి. వీరు చనిపోవుటకు ముందు 7-[illegible]-1954 నకు పూర్వము అశ్వఘోషుని సౌందరనందన కావ్యమందలి నాల్గవ అధ్యాయమందలి 46 శ్లోకములను తెనిఁగించిరి. మచ్చునకు కతిపయ పద్యములు :-

శ్లో॥ మునౌ బ్రువాణేపితు తత్ర ధర్మం ధర్మంప్రతిజ్ఞాతిషుచా దృతేషు ।
ప్రాసాదసంస్థో మదనైకకార్యః ప్రియాసహాయో విజహార నందః ॥

గీ॥ శాక్యముని సేయు ధర్మప్రచారమునకు వశ్యమై బంధుగణ మెల్ల భక్తి నెఱప
మదన లీలావినోదియై మగువతోడ నందుడు తనదు ప్రాసాదమందె యుండె.

శ్లో॥ దత్వాథ సా దర్పణమస్య హస్తే మమాగ్రతో ధారయ తావదేనం ।
విశేషకం యావదహం కరోమీత్యువాచ కాంతం సచలం బభార ॥

గీ॥ దర్పణమ్మును ప్రియునిహస్తమ్మునందు నునిచి యేను విశేషకమును రచింతు
కొంత, నందాక నాకు ముకురముఁ జూపుడనియె సుందరి; నందు డట్లాచరించె.

శ్లో॥ అవాఙ్ముఖో నిష్ప్రణయశ్చ తస్థౌ భ్రాతుర్గృహే న్యస్యగృహే యథైవ ।
తస్మాదథో ప్రేష్యజన ప్రమాదాద్భిక్షామలబ్ధ్వైవ పునర్జగామ ॥

చ॥ పరులగృహమ్ములందెటులో భ్రాతృనికేతనమందు నట్టుల
ప్పరమగురుండు నిష్ప్రణయభావు డవాఙ్ముఖుడౌచు నిల్చినన్
బరిజన మన్యకార్యముల వ్యాపృతమై తను నాదరింపమిన్
మఱలి తథాగతుండు తనమార్గము బట్టె నలబ్ధభిక్షుఁడై.

(నందుని బౌద్ధస్వీకారము నాగార్జునకొండ యందలి శిల్పములందు కలదు)

# ముగింపు పలుకులు

మంజులవాగ్విలాసభాసమధుసుధామయోక్తులు చిప్పిలఁ గావ్యములను వ్రాసిన కవిపుంగవులును, సరససాహిత్యచతురులైన రచయితలు నెల్లూరు మండలములో లెక్కకు మిక్కుటముగా నున్నారు. వారిలో నొండు రెండు పుస్తకములను వ్రాసి ప్రచురించినవారు కొందఱు, బహుళగ్రంథకర్తలు కొందఱు, శతాధికకృతికర్తలు మఱికొందఱు నున్నారు "అచటఁ బుట్టిన చిగురుఁ గొమ్మైనచేవ" అన్నట్లు ఈ మండలములోఁ దిక్కన కాలమునుండియు, నేఁటివఱకుఁ బ్రభవించిన కవులు, రచయితలు, చక్కని చేవగల రచనలను సంతరించి సింహపురమండల సాహిత్యయశస్సును దశదిశల వ్యాపింపఁ జేసియున్నారు. అట్టి నెల్లూరు మండలములో జన్మించిన కవులను, రచయితలను నాంధ్రదేశమునకుఁ బరిచయము గావించుటయే ప్రధానోద్దేశ్యముగా నుంచుకొని, నేనీ వ్యాసమును వ్రాయ సంకల్పించితిని. అట్టి ప్రయత్నములో నా దృష్టికందనివారును గొంద ఱుందు రనుటకు సందియములేదు. వారిలోఁ గొందఱు తమ రచనలను గొన్ని పత్రికల ద్వారమునఁ గూడఁ బ్రచురించిన వారుందురు. మఱికొంద ఱొండు రెండు గ్రంథములను వ్రాసి ప్రచురింపని వారును గూడ నుందురు. అట్టి లోప మేదేని నా ప్రయత్నములో సంభవించినచో, సహృదయులు మన్నించి, వారి నామధేయములను నా కెఱింగించినచో, నా మలిప్రయత్నములో నా లోపములను సవరించుకొందు నని మనవి చేసికొనుచున్నాను. వ్యాసవిస్తరణభీతిచే నీ సంకలనమున కవులను గూర్చియు, రచయితలను గూర్చియు సంగ్రహముగఁ బరిచయము చేయఁగల్గితిని. ఈ యవకాశమును నాకుఁ బ్రసాదించిన నెల్లూరు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డిగారికి కృతజ్ఞతాభివందన సుమాంజలులను సమర్పించుకొనుచున్నాను. ఇఁక సెలవు. నమస్తే.

కదలేది కదిలించేదీ । మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేదీ । పెనునిద్దుర వదలించేదీ
మునుముందుకు సాగించేదీ । పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి. — శ్రీ. శ్రీ.

ఆకులందున అణగిమణగి
కవితకోవిల పలకవలెనోయి
పలుకులను విని దేశమం దభి
మానములు మొలకెత్తవలెనోయి. — గురజాడ.

జై హింద్!

# 78.

# నెల్లూరు మండల పత్రికలు

## (వెలుగుతున్నవీ, వెలుగునిచ్చినవీ)

శ్రీ బంకి. గోపాలరెడ్డి, బి. కాం. (ఆనర్సు,) డి. సి. ఆర్. ఎస్.

"వార్తయందు జగము వర్తిలుచున్నది, యదియు లేనినాడ యఖిలజనులు
అంధకార మగ్నులగుదురు గావున వార్త నిర్వహింపవలయు బతికి"

మహాభారతము (1)

"ప్రతికలు లేకుండా ప్రభుత్వాన్ని నడపడమో లేక ప్రభుత్వం లేకుండా పత్రికలు నడపడమో అనే ప్రశ్నే వస్తే నేను ప్రభుత్వం లేకుండా పత్రికలు నడపడానికే నిర్ణయిస్తాను" అని అన్నాడు అమెరికా ప్రెసిడెంటు జెఫర్సన్.

" పత్రికొక్కటున్న పదివేలసైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రికలేకున్న......" అని "నార్ల"గారి మాట.

పైరెండు మాటలు చాలు నేటినాగరిక ప్రపంచంలో పత్రికలకున్న ప్రబలమైన స్థానాన్ని వివరించడానికి. నిజానికి ఇది పత్రికాయుగం. 'పత్రికాయుధాల' యుగం. ప్రజల విజ్ఞాన చైతన్యానికి పత్రిక ఒక ప్రతీక.

మూలంగా విచారించి చూస్తే మనదేశంలో స్వాతంత్ర్య పోరాటపు రోజుల్లోనే ఒకఉద్యమంలాగ, ఉప్పెనలాగ పత్రికలు వెలశాయి. ప్రజలగుండెల్లో సాంఘిక చైతన్యపు ఘాకంపాల్ని సృష్టించి ఒక చరిత్రాత్మకమైన. పాత్రను నిర్వహించాయి.

" ఇతర ఉద్యమాలలో ముందుడుగు వేసినట్లుగానే ఈఉద్యమంలోనూ వంగదేశమే ముందడుగువేసింది. ఈకృషిలో ముం

---

1 "అన్నీ మన వేదాల్లోనే వున్నాయను" అనే అగ్నిహోత్రావధానుల ధోరణిలో నేను ఈ భారత పద్యానికి వార్త అంటే సమాచారమని అర్థంచెప్పి మనదేశంలో పూర్వకాలంనుండే వార్తాపత్రికలుండేవని, వాటిని రాజులు నడిపేవారని పౌరాణికార్థ మివ్వదం లేదు. వార్త అంటే వృత్తి విద్య అని "హాలికుని" వాదం. వాదప్రతివాదాలకు దిగడం నా అభిమతం కాదు. అయితే ఈవార్తాపత్రికల లాంటివి పురాణకాలంలో ఏమైనావుండేవా అని చరిత్రకారుల నభ్యర్థిస్తున్నాను. పురాణకాలంలో పత్రికల పని "నారదుడు" చేసేవాడని నా భావం. నేటికీ చాలమంది పత్రికలవాళ్లకు " నారదుడే " ఇష్టదైవంగా వుంటున్నాడు. " సరస్వతి " అధిష్టానదేవతగా వున్నది యేకొద్దిమందికో.

దడుగు వేసినవారు శ్రీరాంపురంమిషనరీలు "మార్షమన్" అనేమిషనరీ ఫిబ్రవరి 1818 లో 'దిగ్దర్శన్' అనే మాసపత్రిక నొకదాన్ని వంగభాషలో ప్రారంభించారు. ఇంచుమించుగా భారతీయ భాషల్లో వెలువడిన మొదటి పత్రికిదియే. 1821 డిసంబరులో రాజారామమోహనరాయలు 'సంవాదకౌముది' అనే పత్రికను స్థాపించి తనప్రతిభచేత అభివృద్ధికి తెచ్చి నవ్యభావప్రచారానికి ఉపక్రమించాడు. భారతీయులు స్వయంగా నడిపిన మొదటి దేశభాషాపత్రికిదే అనవచ్చును.

In general the "Samachar" is thought of as the first Bengali and Indian News paper, though mention can be found of a "Bengali gazette" published in 1816 that was feeble from birth and died in less than a year. The Sambad Kaumudi was practically the first Bengali paper edited and conducted by Bengalies. (" The Press "—by W. C. Wordsworth—modern India & West—oxford 1941)

'బొంబాయిలో మొదట 'బొంబాయి సమాచార్'అనేపత్రిక 1822 లో ప్రారంభమైంది. మద్రాసురాష్ట్రంలో కూడా ఇట్టిపత్రికలు బయలుదేరాయి. వాటిల్లో తెలుగువారు నడిపినవి చాలవున్నయి. వీటిల్లో ఇంచుమించు ప్రథమమైన పత్రిక శ్రీ గాజుల లక్ష్మీనర్సుశెట్టిగారు మద్రాసునుండి నడిపిన 'క్రెసంట్' అను ఆంగ్ల వారపత్రిక ఆరోజుల్లో మద్రాసులో జాతీయతను పెంపొందించుటలో, కుంఫిణీ పరిపాలలోని అన్యాయాలను విప్పిచెప్పడం లోను దీనివలె కృషి చేసిన పత్రిక మరొకటి లేదేమో అప్పటికి మద్రాసులో శ్రీ నారాయణస్వామినాయుడు అనే ఆయన యాజమాన్యంలో 'సర్క్యులేటర్' అనే ఇంగ్లీషు పత్రిక వుండేది. శ్రీ సెట్టిగారు దానినికొని, పేరును 'క్రెసంట్' గామార్చి, హార్లే అను దొరను సంపాదకునిగాచేసి పత్రికను నడిపారు. దీనిమొదటి సంచిక 1844 అక్టోబరులో వచ్చింది. 'హిందూదేశస్థులను సముచిత స్థితికి తీసుకొనిరావడమే' ఆశయమని అందులో వెల్లడించబడినది. (2)

ఈ సంధియుగంలో తెలుగు పత్రికలెన్నో వచ్చాయి. తెలుగులోవచ్చిన ఈతొలి పత్రికలను గూర్చి సి. పి. బ్రౌన్ ఇలా వ్రాశాడు. Among the Telugus, Printing commenced about the year 1806, but made little progress till 1830. About 1835 some of the Telugu and Sanskrit poems were printed at Madras. At present many volumes continually issue from Telugu presses managed by Hindus alone. There are atleast eight such presses at work besides those which are under management of Englishmen. Native newspapers both Telugu and Tamil exist; but are illsupported unless

2 శ్రీ కొత్తపల్లి వీరభద్రరావుగారి "తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము".

they deal in vituperation regarding points of religion or caste. (ఇవి 1852 లో అచ్చయిన బ్రౌణ్య నిఘంటువు లోని వాక్యాలు.)

'తెలుగులో మొదటిపత్రిక 1835 ప్రాంతంలో బళ్లారిక్రైస్తవ సంఘము వారిచే ప్రకటింపబడినది. ఇందులో వ్యవహారిక భాషనే వాడుక చేసేవారట. 1840 లో 'వృత్తాంతిని' యనుపత్రిక గ్రాంధికభాష ఉపయోగించెడిది. 1842-50 వరకు వెలువడిన 'వర్తమానతరంగిణి' వార్తలను ప్రచురించిన తొలివార్తాపత్రికయనవచ్చును. ఇది వాడుకభాషలోనే వచ్చినది. 'దినవర్తమాని' (1868 ప్రాంతంలో) ఇదేపద్ధతిని వచ్చిన వారపత్రిక...' (3) వర్తమానతరంగిణి 1849లో మద్రాసులో ప్రకటింపబడినట్లు బ్రౌన్ నిఘంటువులో ఒక ప్రస్తావనవుంది. ('గిన్నెకాసు'- A gold coin formerly in Use worth (17-8-0) five pagodas, see వర్తమానతరంగిణి, newpaper of 4th jan 1849, in a list of coins") ఈ పత్రికను గూర్చిన ప్రశంసలు తర్వాత వచ్చిన 'ఆంధ్రభాషాసంజీవని' 'వివేకవర్ధని' లోను అక్కడక్కడా తటస్థపడతాయి.

1862-67 ప్రాంతంలో బందరులో రెవరెండుషర్మ్కీ అనే క్రైస్తవ మతాచార్యుడు 'హితవాది' అనే పత్రికను నడిపాడు. బందరు నోబుల్ కళాశాల స్థాపకులైన నోబుల్ దొరకు సహాయకుడుగా వుండి, ఆంధ్రభాషా పాండిత్యాన్ని సంపాదించి ఈ పత్రికకు సంపాదకుడయ్యాడు. సామినేని ముద్దునరసింహాలు నాయుడుగారు ఇందు తరచువ్యాసాలు ప్రకటించేవారు. 1863-67లో బళ్ళారినుంచి శ్రీ యక్షిణి అనే పక్షపత్రిక సుబోధకమైన గ్రాంథికశైలిలో వచ్చేది. వీరేశలింగంగారు తమ వివేకవర్ధనిలో దీని శైలి మనోహరంగా వుందని వ్రాశారు. మద్రాసువేదసమాజంవారు 1864 అఖరులో ప్రకటించిన 'తత్వబోధిని' మాసపత్రిక చాలాప్రసిద్ధమైంది. ప్రథమంలో వేదసమాజం ప్రదర్శికగా వుండినా అఖరులో బ్రహ్మసమాజం వైపు మొగ్గు చూపినది. ఋగ్వేదంలో కొంత భాగాన్ని స్వరయుక్తంగా ఆంధ్ర భాషా వివరణతో ప్రకటించారు. వీరేశలింగంగారి స్వీయచరిత్రలో ఈపత్రిక ప్రస్తావన అక్కడక్కడా కనపడుతుంది. ("అప్పుడు నాకు స్త్రీ పునర్వివాహవిషయమై యేమి గ్రంథాలున్నవో తెలియదు. ఈ విషయమై 'తత్వబోధిని' లో ప్రకటింపబడిన ఉపన్యాసమొకటి లభ్యమైంది.") ఈ పత్రిక శైలినిగూర్చి వ్రాస్తూ "రుచిరఫణితి" అని అన్నారు వీరేశలింగంగారు. ఇంచుమించు ఇదే కాలంలో శ్రీమాన్ పింజమూరి కృష్ణమాచార్యులు, బహుజనవల్లి సీతారామాచార్యులు మొదలైనవారు మద్రాసునుండి రెండేండ్లు

3 శ్రీ యండమూరి సత్యనారాయణరావుగారి (శ్రీవాత్సవ) "ఉషఃకిరణాలు". 1962 మార్చి భారతిలో శ్రీ నిడదవోలు వెంకటరావుగారి "ప్రథమాంధ్ర వార్తాపత్రికలు" అనే వ్యాసం, 1914-15 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో శ్రీ కాశీభొట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి "తెలుగులో తొలి వార్తాపత్రికలు" అనే వ్యాసం చూడవచ్చును.

"సుజనరంజని" అనే పత్రికను ప్రకటించారు. (1864-67) ఈపత్రికలో చిన్నయ్యసూరిగారి తొలిరచనలు ముద్రింపబడినవి. ఈపత్రికనుగూర్చి 'తత్వబోధిని' ఈవిధంగా వ్రాసింది. "ఇది ఇంగ్లీషునందు జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వంటిదైనను, భాషా పరిజ్ఞానము నభివృద్ధి పొందించుటయందు దానికంటె పలుమడుంగుల మేలుగా నాంధ్రమందు ఈ "సుజనరంజని" యొప్పుచుండెను." "స్వదేశజన ప్రసిద్ధాభిప్రాయము" (Native public opinion) అని మద్రాసులో ఒకపత్రిక-అంతా ఇంగ్లీషులో వుంటూ రెండు పుటలుమాత్రం తెలుగులో వెలువడుతుండేది. ఒక సంవత్సరందాక వచ్చి 1870 లో ఆగిపోయింది. 1870 లో "గోదావరి విద్యాప్రబోధిని" అనే పత్రిక వ్యాప్తిలో వున్నట్లు వీరేశలింగంపంతులుగారు వివేకవర్ధనిలో వ్రాశారు. వీరేశలింగం తన "కవులచరిత్ర" లోగూడా ఈ పత్రికను పేర్కొన్నారు. కొక్కొండ వెంకటరత్నంపంతులుగారు 1871 నవంబరులో మద్రాసునుండి "ఆంధ్ర భాషాసంజీవిని" నిప్రారంభించారు. పంతులుగారీ పత్రికను మొదట 1883 దాక 12 యేండ్లు ప్రకటించి తిరిగీ 1892 లో పునరుద్ధరించి 1899 వరకు ప్రకటించారు. ఇది ఆకాలంలో బాగా ప్రచారంలోకి వచ్చిన పత్రిక. 1872 లో విశాఖపట్నంలో పరవస్తు వెంకటరంగాచార్యులుగారు "సకలవిద్యాప్రబోధిని" అనే పత్రికను ప్రకటించారు. సంస్కృతనాటకాల ఆంధ్రీకరణాన్ని ప్రారంభించిన మొదటిపత్రిక ఇదే. (కాళిదాసు శకుంతల.) 1874 లో వీరేశలింగంగారి విఖ్యాతివహించిన "వివేకవర్ధని" వెలువడింది......సమగ్రాంధ్ర వాఙ్మయ చరిత్రలో ఈపత్రికలకు సముచితమైన స్థానముంది.

నెల్లూరు ప్రథమ పత్రికగా 1865 ప్రాంతంలోనే "నెల్లూరు పయొనీర్" అనే పత్రిక వెలసినట్టుగా తెలుస్తున్నది. అప్పటినుండి నెల్లూర్లో దాదాపు ఈ నూరేళ్లలోను డెబ్భై పత్రికలు వెలశాయి. వెలుగునిచ్చాయి. సారస్వతంలోను, రాజకీయాల్లోను సుడిగాలులు సృష్టించి చైతన్యపుబావుటాలు ఎగరవేశాయి. నిలిచి వెలిగాయి, వెలిగి ఆరిపోయాయి; కొన్ని వెలుగునిచ్చాయి, మరికొన్ని వేడినిచ్చాయి. ఆరినవి ఆరిపోగా వెలుగుతున్న దీపాలుగా మన మండలంలో ఒకడజను పత్రికలుదాకవున్నాయి. మండలస్థాయి లో ఇన్నిపత్రికలుండడం ఆశ్చర్యమే. రాష్ట్రంలో మరెక్కడా ఇన్ని జిల్లాస్థాయి పత్రికలు లేవేమోకూడ.

మనదేశంలో నేడు దినవారపత్రికలు దాదాపుగా అన్నీ టాటా, బిర్లా, డాల్మియాల వంటి పెద్దపెద్ద వ్యాపారస్థుల కంపెనీల హస్తగతంలోనే వున్నాయి. ప్రాంతీయ స్థాయిలో నడిచే పత్రికల స్థితిగతులు, వాటి ఆర్థికవనరులు ఇందుకు కొంచెం భిన్నంగా వున్నప్పటికీ మన జిల్లాలోను పత్రికలు పెట్టుకొని జేబుల్లో డబ్బులు వేసుకొన్నవారు, డబ్బు పోగొట్టుకున్నవారు, పేరు మిగిల్చినవారు అనేకంగానే వున్నారు. మనమండల పత్రికల తీరుతెన్నులు చూస్తే అనేకానేక వైరుధ్యాలు కన్పిస్తాయి.

మనమండల పల్లెటూరి అషరాస్యుని గుండెతాహతుపై చేయిపెట్టి, సగటు

మనిషి స్థాయిపై శీతకన్ను వేయకుండా ఒక Rustic angle తో నిబ్బరంగా, నిండుగా నిలిచి చేసేసమీక్షలతో, వ్రాసేవ్యాసాలతో, వేసేవార్తలతో జిల్లాలో చెరగని స్థానమేర్ప రుచుకొన్న 'జమీన్‌రైతు'

పౌరుడంగా' పరుషంగా. దురుసుగా, ధైర్యంగా, నిరంకుశమైన పాషాషణపాక శైలీజాలంతో, ఒకవిధమైన urban sophiscation తో, ప్రాంతీయ. జాతీయ, అంతర్జాతీయ, వార్తలను అవలోడనచేస్తూ, మధ్యమధ్య అప్పటమైన నెల్లూరునానుడుల తో, 'కళాక్షేత్రాల' తో 'ముల్లుమొగ్గల తో పాఠకుణ్ణి జుట్టుపట్టుకొని ఈడ్చుకొని పోయే ప్రత్యేకమైన బాణీతో మధ్యమధ్య అగుతూ, వరుగిడుతూ నడుస్తున్న 'మందాకిని'

జిల్లారంకుల రాజకీయాల సమరం నుండి రంగులు సూరి, మాయాఇంద్రధను స్సులు ముద్రిస్తూ, నాయకుల ముసారాజ కీయపు ముసుగుల్లో 'సెర్చ్‌లైటు' వేసి వెలుగు లేని వేడివేడి వార్తలను వెదజల్లుతూ .రాజ కీయకలైనేషన్' లా, ఎన్నికల ఋతువుతో adventurous గా సాముగరిడీలు చేస్తూ సాగిపోయే నెల్లూరున్యూస్'

స్వతహాగా సంపాదకీయమైన వెన్ను ముక లేకపోయినా, కమ్యూనిస్టు పార్టీ బావుటా పట్టుకోవడంతో ఒక వ్యక్తిత్వాన్ని అలవర్చుకొని, ఒకవర్గానికి చెందిన మార్గం లో సహజపోరాటం సాగిస్తున్న 'వంచుకాగడా'

ఆపత్కాలలో నిర్దుష్టత లేకపోయిన, పత్రికా నిర్వహణలో అభిమానమున్నంత గా అభినివేశం లేకపోయినా, జంకుగొంకు లతో ఇంకా Mediocre level దాటిరాలే కున్న 'యూత్‌కాంగ్రెస్, స్వతహాగా వీరికున్న పత్రికా పరిశ్రమ తౌల్యమే (పూర్వం వీరు కొన్నాళ్లు 'యువశక్తి ని, నడిపారు) వీరిని ముందుకు తీసుకపోగలదు!

కొన్నెల్ల నుండీ మనమండల పత్రికా శంలో రెండుకొత్త రాకెట్లు విహరిస్తున్నాయి ఋతుపవనం త్రెండు నుగమనించి, నేటి పాఠకుల సాదా అభిరుచులను discover చేసి ఈరంగంలో ప్రవేశించారు. 1. తరం గిణి, (చిత్రజగత్) 2. 'చంద్రభాను, పాం డీబజార్ నుండి సినిమాన్యూస్ ఏరుకొని, చలనచిత్ర తారల చెరమరుగు వార్తలనిం పుకొని కేవలం సినిమాయాలోకానికి అర్పిత మైపోయిన చిత్రపత్రిక, బాలబాలికల పేరు మీద, సకల హంగులూ కూర్చుకొని, జాన పదస్థాయిలో, కాకమ్మ గీకమ్మ కథలతో సత్కాలక్షేపం కలిగిస్తున్న 'చంద్రభాను, పిటి standard ఎట్లా వున్నా, లాభసాటి గానే నడుస్తున్నట్టుగా తెలుస్తుంది.

ఐదారు సంవత్సరాల ఇటీవల వచ్చిన వాటిలో చెప్పతగినట్టిది 'జనవాణి, జనం లోకి వచ్చి నిర్భీతిగా విమర్శలు చేస్తూ మెరుగనిపించుకొంటున్నా, కొండంత తప్పు లు కుప్పతిప్పలుగా కతబడుతున్నవి ఇటీవల గా ఎందువల్లనో క్రమంగా రావడంలేదు.

ఇటీవలనే ''నవయుగం'' మళ్లీ rivive అయింది . ఒక ''కొత్త సోషలిస్టు దృక్పథం తొంగి చూస్తున్నది.

పదిసంవత్సరాలుగా ఇనమడుగు సత్యానందాశ్రమం నుండి వచ్చేపత్రిక

"విశ్వమీమాంస" వేదాంత విషయాలను చర్చిస్తూనేయుంది. అప్పల అంజనేయులుగారి "ప్రేమ సమాజం" వస్తూనేవుంది. "జైదండోరా" మామూలుగానే బజారున కనపడుతూవుంది. తీర్పులపత్రిక మళ్లీ పునరుద్ధరించ బడింది. కావలినుండి 'విశ్వశాంతి' అనేకొత్త గొంతుక వినపడుతూంది. 'సింహగర్జన' అని తాజాగా మరొకటి బయలుదేరింది. 'సింహపురి' అనే పాత పేరును. తగిలించుకొని. కొత్తగా రంగంలో కొచ్చింది. ఈ కొత్తవాటికి తమది అనే సంతకం ప్రత్యేకముద్ర ఇంకా యేర్పడ లేదు, వీటినిర్వాహణ కొన్నాళ్ళపాటు వేచి చూడాలి. అప్పటికిగాని వీటిల్లో సత్తాబయట పడదు.

మహమ్మద్ అజం హుస్సేన్ గారి "తబ్లీఘ్", ఉర్దూపత్రిక, అబ్దుల్ వహబ్ గారి 'ఫజ్మేహస్మాత్' అనే సైక్లోస్టయిల్డ్ ఉర్దూపత్రిక ఇప్పుడాగిపోయాయి. ఇదీ నేటి మనమండల పత్రికల స్థూలరూపం ఇంత విస్తృతమైన మండలస్థాయి పత్రికారంగానికి గర్వప్రాయమైన నూరేళ్ళ చరిత్రవుంది. ఈపూర్వ రంగంలో ఎన్నో పత్రికలుద్భవించాయి పెరగని జాడలు తీసి కాలగర్భాన కలసిపోయాయి.

II

నెల్లూరు మండలాన పత్రికా ప్రకటనోద్యమ జనకులు కీ. శే. శ్రీ దంపూరు నరసయ్య. 1865 అఖరులో "నెల్లూరు పయోనీర్" అనునది పత్రికా ప్రపంచమున నెల్లూరవెలసిన ప్రధమపత్రికా పుత్రికగా కన్పడుచున్నది. ఇయ్యది గత శతాబ్దపు టరువదియవ దశకాంతమున ఇంగ్లీషున ప్రవర్తింప బడుచుండినది. 4 అప్పట్లో కలెక్టరాఫీలో ఉద్యోగులుగా వుంటూవుండిన శ్రీ దంపూరు నరసయ్య శ్రీ నంబెరు మాళ్ళయ్య అనే ఇద్దరు ఈ "నెల్లూరుపయొనీర్‌ను" నడిపినట్టుగా తెలుస్తున్నది. అకాలపు సర్కారు కట్టుదిట్టాలలో ఇప్పటి చట్టాల చట్రాలు లేనందువల్లనే వీరు సర్కారు ఉద్యోగులుగా వుంటూ ఈ పత్రికను ప్రచురించ గలిగారు. అప్పట్లో ఉద్యమానికి తగిన అదరణ లభింప నందువల్లనే ప్రారంభించిన సంవత్సరంలోనే ఈ పత్రిక నిల్చిపోయినట్లు తెలుస్తున్నది.

---

4 20-4-1933 "సుబోధిని" పత్రికలో శ్రీ ఒంగోలు వెంకటరంగయ్యగారు "నెల్లూరు పత్రికల" గూర్చి వ్రాసిన వ్యాసం. వారు ఆనాడు ఈ వ్యాసాన్ని ప్రకటించివుండకపోతే- మన మండల పత్రికల చరిత్ర పూర్వరంగం అంధకారంగా, క్రమవికాసం గోచరంకాకుండా పోయేది. వారి వ్యాసంలో నేనీ అస్తికలు యేరుకొన్నాను. టౌన్‌హాలు లైబ్రరీలో పాతనెల్లూరు పత్రికలు తిరగేస్తుంటే, "కొందరు నెల్లూరు గొప్పవారు". "ప్రాతకాలపు నెల్లూరు" "నెల్లూరు సత్రాలు" "నెల్లూరు ప్రాంతాల దొరికిన శాసనాలు" మొదలగు అనేక విషయాలను గురించిన వీరి వ్యాసాలు కళ్లకద్దుకో తగినట్టుగావున్నాయి. వెంకటరంగయ్యగారు దారినపోతూ కాలికి తగిలిన రాయినికూడా వృధాగా పోనీయక ఆరాయి చరిత్ర నన్వేషించే నేతృత్వము కలిగిన ప్రజ్ఞాశాలురుగ కన్పించారు. ఇంత చిన్నవిషయాల్లో సైతం ఇమడిగలిగిన వీరి అమోఘమైన చరిత్రదృష్టికి కృతజ్ఞతాంజలులు ఘటిస్తున్నాను,

దంపూరు నరసయ్యగారికి పత్రికా నిర్వాహణ ఉగ్గుపాలతోనే వచ్చినట్లున్నది. నెల్లూరు పయొనీర్ ఉదయించి నప్పటికి వీరు నెల్లూరు కలెక్టరాఫీసులో ద్విభాషి (Translator) గ వుండినారట. మద్రాసులో పుట్టి పెరిగినారు. చిన్నతనంలో మద్రాసులో వుండగానే "Native Advocate" అనే ఇంగ్లీషు పత్రికను కొన్నాళ్ళు నడిపారు. ఆతర్వాత కీ. శే. వెంకటగిరి మహారాజా రాజగోపాల కృష్ణయాచేంద్రములకు ఇంగ్లీషు ఉపాధ్యాయులుగ వెంకటగిరిలో కొంతకాలం వున్నారు. అప్పటి కలెక్టరు వీరి విద్యాకుశలతను మెచ్చి వీరికి కలెక్టరాఫీసులో ద్విభాషి ఉద్యోగం ఇచ్చారు. అక్కడ కొంతకాలం వున్నపిమ్మట స్కూళ్ళ డిప్యూటి ఇన్స్పెక్టరుగ పనిచేశారు. అదీ అస్థిరమై తిరిగి చెన్నపట్నంలో 1882 ప్రాంతాన "Peoples Friend" అనే ఇంగ్లీషు వారపత్రికను పెట్టారు. 1898 ప్రాంతాల్లో మద్రాసు నుండి మళ్లీ నెల్లూరుకు వచ్చి స్థావరం యేర్పరచుకొని ఇక్కడనే 1900 ప్రాంతంలో „ఆంధ్రభాషా గ్రామవర్తమాని,, అనే వొక చిన్న తెలుగువార్తా పత్రికను ప్రారంభించారు. ఈ పత్రికలో పల్లెటూళ్ళ, రైతు సమస్యలనేకం చర్చించేవారు. ప్రజల నుండి తగినంత ఆదరణ లభించనందువల్లనూ, అదీగాక నరసయ్యగారు వృద్ధులు గావడంవల్లనూ „ఆంధ్ర భాషాగ్రామవర్తమాని,, శైశవంలోనే అంతరించింది. జీవించి వుండిన ఆ కొద్దికాలంలో జనోపయోగమైన అనేకవిషయాలు దీంట్లో చర్చించబడేవి. ముఖ్యంగా ఇది నెల్లూరు తాలూకా కోడూరు ప్రాంత గ్రామాలకే పరిమితమై వుండినట్టుగా తెలుస్తుంది. అముద్రిత గ్రంధ చింతామణిలో (1900 నవంబరు సంచికలో) ఒకచోట ఈ పత్రికను గూర్చిన ప్రస్తావన ఇట్లావుంది.........„పూండ్ల రామకృష్ణయ్యగారి ‚అముద్రితగ్రంధ చింతామణి, దివ్యమైన పత్రికయనుటకు నేలాటి సాక్షేపణ లేదు సదరు అయ్యవారు మంచి శోధకులు. బహు పాటుపడువారు.................అని 6-10-1900 గల ఆంధ్ర భాషా గ్రామవర్తమానిలో „పేట్రియట్,, అను చేవ్రాలుతో నెవ్వరో వ్రాసియున్నారని ఇతరుల అభిప్రాయాలు అనే శీర్షిక క్రింద పై వాక్యాలున్నవి.

దంపూరు నరసయ్యగార్ని గురించి గురజాడ అప్పారావుగారు 1909 జులై 7 వ తేదిన ఒంగోలు మునిసుబ్రహ్మణ్యంగారికి వ్రాసినలేఖలో ఈక్రింది ప్రస్తావన వుంది „వొక తెలుగు పుస్తకాన్ని రివ్యూ చేయాలో తెలుసువున్న వ్యక్తి నా ఎరికలో ఎవడూ లేడు. అస్సట్లు శ్రీ డి. నరసయ్య అనే పండితుడు వొకాయన „పీపిల్స్ ఫ్రెండ్,, అనే వొక వారపత్రికను నడుపుతుండేవాడు. ఆయన నెల్లూరు వాస్తవ్యుడు. ఇప్పుడు వున్నారా? వుంటే ఆయన చిరునామా నాకు పంపించు. ఆంగ్లభాషలో ఆయన గట్టివాడు (దంపూరు నర్సయ్యగారి Peoples Friend. లో 1897 జనవరి 21 వ తేది సంచికలో „కన్యాశుల్కం,, పై సుదీర్ఘమైన Review వచ్చింది.

„నెల్లూరు పయొనీర్,,-ఆంధ్రభాషా గ్రామవర్తమాని వీటి మధ్యకాలంలో కొన్ని గొప్పమార్పులొచ్చాయి దేశంలో తెలుగు

వైపుల వాడకం వృద్ధిఅయింది. మన మండలంలో కొన్ని గొప్ప పత్రికలు వెలశాయి మరువుకురాని సేవచేశాయి.

"నెల్లూరు పయొనీర్‌కు" కొంచెం ఇంచుమించు ముందు వెనుకల నెల్లూరు రెవెన్యూకు సంబంధించిన ఏవో కొన్ని ప్రకటనలు సాధించినట్లున్నది. శ్రీ ఆడక్క నారాయణరావు అని రెవెన్యూ ఉద్యోగి "Revenue Records" అనే పత్రికను కొంతకాలం నడిపినట్టుగా తెలుస్తున్నది.

1882-83 ప్రాంతంలో ఉల్లిగొండము రామచంద్రరావుగారు అనే ఆంధ్రపండితులు "విద్యాకల్పభూజము'. అనే పత్రికను నడిపారు. ఈయనగూడా కలెక్టరాఫీసులో ఉద్యోగిగా వుంటూ పత్రిక నడిపినట్లుంది. పాండిత్య ప్రౌఢిమ, వైద్యనైపుణ్యము, వాద కుశలత కలిగిన వీరి సంపాదకత్వాన ఈ కల్పభూజము చాలకాలం బ్రతకలేక పోయింది. వీరిని గురించిన ప్రస్తావన నిడదవోలు వెంకటరావుగారి 'చిన్నయ సూరిజీవితము' లో ఈక్రింద విధంగావుంది. 'వీరివెనుక నెల్లూరియందు 'విద్యార్థికల్పభూజ' మనుపత్రికకు సంపాదకులగు ఉల్లిగొండ రామచంద్రరావను ఆంధ్రపండితుడు సంధి విగ్రహములను (నీతి చంద్రికలోని మిత్రలాభ, మిత్రబేదముల తర్వాతి భాగములు) వచనరూపమున రచించెను. ఈతని శైలియు ప్రౌఢముగ నుండి పైవానికి తీసిపోకుండ నుండెను. దీనినిగూడ నొకప్పుడు కళాశాలయందు పఠనీయ గ్రంథముగ నేర్పరచి యుండిరి.'

వీరి స్నేహితులు శ్రీ పూండ్ల రామకృష్ణయ్యగారు 1885 జూన్ 1 వ తేదిన 'అముద్రితగ్రంథ చింతామణి' తెలుగుదేశాన అవతరింపజేసి ప్రఖ్యాతిగడించారు.

'అముద్రితగ్రంథ చింతామణి' పత్రిక ప్రచురణలో నొడయరు వీరనాగయ్య అనే అయన రామకృష్ణయ్యగారు కేవలం స్వయంకృషిచేత తెలుగులో నిరూఢ పాండిత్యాన్ని గడించారు. జన్మచే కొద్దిగా నత్తివాడైనా, పుస్తకాలు చదివేప్పుడు నిరంకుశధారగా చదివేవాడట.

ప్రాచీన తాళపత్రగ్రంథములు వెదికి, సంపాదించి, ముద్రించతగినవి, పరిష్కరించి వ్యాఖలతో, విమర్శలతో, లఘుటీకలతో ప్రకటించి అనేక ఉత్తమప్రబంధాలు క్రిమి ద్రష్టమై. నిర్మూలం గాకుండా రక్షించి, ఈపత్రిక లోకానికి సమర్పించినది. హరిశ్చంద్ర నలోపాఖ్యానము.చంద్రాంగద చరిత్ర, ప్రబంధరాజ వెంకటేశ్వర, మున్నగు ఆంధ్ర ప్రబంధాలు ఈ పత్రికలోనే మొట్టమొదట వెలువడ్డాయి. ఈపత్రికాముఖంగానే వాటికి పీఠికలు, వ్యాఖ్యలు, తదితర సాహితీచర్చలు, వాదప్రతివాదాలు వచ్చేవి. వీరి వాఙ్మయ విమర్శ పాతపద్ధతులపై నడిచినా ఆధునిక విమర్శ విధానానికి దార్లుతీసింది. 1897 మార్చి సంచికలో వీరికన్యాశుల్క నాటకవిమర్శ చూస్తే ఇటీవల ఇన్నేళ్ళ తర్వాత విశ్వనాధవారి పత్రిక "జయంతి" లో గురజాడపై వచ్చిన విమర్శ improve కాలేదని అనాలి.

ఈ 'అముద్రిత చింతామణి'కి మహాపండితులు, కవులు అయిన మండపాక పార్వతీశ్వరశాస్త్రి, మహోపధ్యాయ శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి ఉపలేఖకులుగ వుండి, అనేక భాషావిషయాలను. ఉన్నత

స్థాయి విమర్శలను, ఈ పత్రికా "మయూఖముల"లో చర్చించేవారు. వేదం వెంకటరాయశాస్త్రులవారి కీర్తికి ఈ పత్రిక ఒక ముఖ్యకారణము. వెంకటగిరిరాజాగారు ఈ పత్రికపట్ల ఎంతో ఆదరణ చూపేవారు. 1885 నుండి 1904 వరకూ 19 సంవత్సరాలు నిరంతరాయంగా నడిచింది. (1904 లో రామకృష్ణయ్యగారు దివంగతులయ్యారు.) నవ్యాంధ్ర వాఙ్మయ చరిత్ర వ్రాయాలనుకొన్న చరిత్రకారుడు ఈ పత్రిక చేసిన సేవను శ్లాఘించకుండా వుండలేడు.

పత్రిక ప్రారంభించిన ఆరు సంవత్సరాలకు రామకృష్ణయ్యగారు 1891 డిసంబరు సంచికలో వ్రాసిన సంపాదకీయాన్ని బట్టి, ఆకాలానికి ఆంధ్రదేశంలో ఈ క్రింది పత్రికలున్నట్టు తెలుస్తుంది:- ఆంధ్రప్రకాశిక, హిందూజన సంస్కారిణి, వివేకవర్ధిని, సునీతి, సత్యసంవర్ధని, శారద, సన్మతదర్శని, కృష్ణాన్యూస్, బుధవిధేయ, సుందరమంజరి, మనోరంజని, యదార్థవాది, ధర్మసంరక్షిణి, మనోవినోదిని, సకలకలాకల్పవల్లి, కళానిధి, చిత్తూరు వర్తమాని, సుజనమనోల్లాసిని, హిందూదేశాభిమాని, రాజయోగి, చింతామణి, ప్రబంధకల్పవల్లి.

"ఈ పత్రికలలో నముద్రితగ్రంథముల ముద్రించునట్టి పత్రికలరుదుగఁ గనబడుచుండుట బట్టి, యట్టి పత్రికయొక్కటి యుండిన నముద్రితగంథముల శైధిల్యము మానునని యెంచి 'ప్రబంధకల్పవల్లి' యను పత్రిక కొన్నిగ్రంథముల ముద్రించి ప్రకటించుచున్నది. ఇటీవల నేకారణముననో ప్రబంధకల్పవల్లి మతల్లి యల్లుకొనదయ్యె, ఇటీవల రాజమహేంద్రవరము నుండి ప్రకటింపబడుచు వచ్చిన 'వివేకవర్ధని' పత్రికయందు 'రామాభ్యుదయమును' గొంత ముద్రించిరే గాని పూర్తిగా ముద్రింపరైరి. ఇప్పుడు కాకినాడయందు ముద్రింపబడుచున్న 'రాజయోగి' యను పత్రికయందు కొన్ని యముద్రితములు ముద్రింపబడుచున్నవి.... ఈ పత్రికలన్నియు నించుమించుగ వార్తా పత్రికలుగ నున్నకారణమును బట్టి, మా పత్రికయందు వృత్తాంతములు వ్రాయుట మాని విద్యావిషయములను మాత్రము వ్రాయుదలపెట్టినది మొదలుగ ... ... '
(1891 డి. సం. అ. గ్ర.)

## III

'అముద్రితగ్రంథ చింతామణి' వచ్చిన ఆరుసంవత్సరాలకు నెల్లూరినివాసి అయిన న్యాపతి సుబ్బారావుగారు వీరేశలింగం తోడ్పాటుతో రాజమండ్రినుండి 'చింతామణి' అనుపత్రికను 1891 లో స్థాపించారు. 'మొల్లరామాయణం' మొదలగు అముద్రిత ప్రాచీనకావ్యాలు ఇతర సమకాలిక రచనలు ముద్రించడమేగాక తెలుగు నవలల పోటీపరిషలు' అనిజరిపేవారు. మొదటిపోటీ 1893 లో చిలకమర్తి లక్ష్మీనర్సింహంగారి నవలా ప్రకటనకు అవకాశం లభించినది.

1893 ప్రాంతంలో 'వార్తాదర్శిని' అను వారపత్రిక వెలసింది. ప్రథమంలో శ్రీ తూములూరి వేంకటరమణయ్యగారు దీనికి సంపాదకులుగా వుండి చక్కగానడిపారు. వీరు ప్లీడరుగా గూడూరు చేరినపిమ్మట నేలటూరు కృష్ణమాచార్యులుగారు సంపాదకత్వము వహించి కొన్నాళ్లు ఉచ్చస్థాయికి తెచ్చారు. తుదకు వార్తా పత్రిక నిర్వహణలో నిజమాడి నిష్ఠురపడి 1896 లో అర్తి చెందింది, జీవద్దశలో జనపదాలకు అత్యంత హితం చేసారు.

'వార్తాదర్శిని'కి సమకాలికంగా 1895 లో బుచ్చిరెడ్డి పాలెంలో 'వర్తమానతరంగిణి' అనే ఒకపత్రిక ఉదయించింది. బెజవాడ పట్టాభిరామిరెడ్డిగారి యాజమాన్యాన ఈ తరంగిణి ఉప్పొంగింది. ఆంధ్రాంగ్ల భాషలను బాగానేర్చిన శ్రీ బెజవాడ బాలకృష్ణారెడ్డి పత్రికాధ్యక్షులు. సంస్కృతాంధ్ర విదులగు కుండూరు వరదాచార్యులు పత్రికా పరిశీలకులు, యడవల్లి కామయ్య కార్యదర్శి ఇన్ని హంగులుండి కూడా ఈ పత్రిక 1896 దాటిబ్రతకలేక పోయింది.

వర్తమాన తరంగిణి అంతరించిన తర్వాత బుచ్చిరెడ్డిపాలెంనుండే 1896 జనవరిలో దొడ్ల వేంకటరామరెడ్డి యాజమాన్యాన 'శారద' అంకురించినది. విద్యావిషయ ప్రధానమైనది. కానిదురదృష్ట వశాత్తు అచిరకాలంలోనే అస్తమించింది. 1896 జూన్ శారద సంచికలో ఈక్రిందిమాటలవల్ల అప్పటి పత్రికల యిక్కట్లు కొంత అర్థమవుతాయి.

'అకటా! మన తెలుగు పత్రికల కష్టదశ యేమనిచెప్పగలము. ఇప్పటికెన్నియో లెక్కకు మించిన పత్రికలు పుట్టిగిట్టుచున్నవి. అల్ల యాంగ్లేయపత్రికలకన్నచో ముప్పది నలుబది సంవత్సరములక్రిందట బుట్టినను, వేరువేరగు విలేఖకులుమారినను వానికిమాత్రము నెంజెలి యేమాత్రము కలిగియుండలేదు. ఇందుకుకారణము యాంగ్లేయుల యాదరణమే. మన తెలుగువార్తా పత్రికలన్ననో ఈ రోజుపుట్టుటయు రేపుగిట్టుటయు నగుచున్నవి. అహో ఎంతయోహూనికగలిగి యారంభింపబడిన దేశోపకారియు, వృత్తాంతమంజిరియు, విబుధరంజనియు నిన్నమొన్న మనకండ్లయెదుటపుట్టి యిప్పుడంగలార్చుచున్నవిగదా! అట్టి వారపత్రికలకే యిట్టిచెట్టు సంభవింప చిల్లరపత్రికలమాట చెప్పనేల? ఇందుకుకారణము మనతెలుగు దేశపువారల నిరాదరణయే కాబట్టి యస్మద్దేశయులగు దేశాభిమానముగల మహానుభావులు కొందరైనను పడిపోవుచున్న పత్రికలయందు దగుదయజూపి యాదరించి వృద్ధిలోనికి తేచూతురని నమ్ముచున్నారు.'' అని తని పత్రికాసారప్రకాశిక పలికెను. దేశోపకారిమాట యేటికిగాని, సామాన్యముగ నవనాగరికోపన్యాసములు మహాజనాను మతములుగా నందుననే యుప్పత్రిక లప్పగిది నంగలార్చుచున్నవని యెన్నుచున్నారము; అని ఆంధ్రభాషాసంజీవని యుగ్గడించె. మేమిందుకు విరుద్ధముగ ప్రాచీనాచారముల గురించి కొంతయేని మాటాడుచు బత్రికలంతయు నవనాగరికోప యుక్తములగు నంశముల క్రింద నుపయోగింప నందుననే వీటికిట్టి చెడుపుట్టుచున్నవని మేమెన్నుచున్నాము.'' పై చెప్పిన పత్రికలేగాక, శారద న్యాయబోధిని, మందారమంజరి, కల్పవల్లి, జ్ఞానోదయ, సుజనవినోదనీ, రత్నాకరము, శ్రీమద్వర్తమాన తరంగిణి, వార్తాదర్శిని పత్రికలు అప్పటికే నిలిచిపోయినట్టుగాకూడ శారదలోని వ్యాసాన్నిబట్టి అర్థమౌతుంది.

ఇంచుమించు వర్తమాన తరంగిణికి సమకాలీనంగా అప్పుడు నెల్లూరు జిల్లాలోనే వుండిన ఒంగోలునుండి న్యాయబోధిని, మందారమంజిరి అను రెండు పత్రికలను కోపల్లి వెంకటరమణరావుగారు నిర్వహించినట్టుగావుంది. వార్తాదర్శినికి సమకాలీనంగా

రోమన్ కాథలిక్ మిషన్‌వారు తెలుగులో ఒక వారపత్రికను నిర్వహించారు.

ఇంచుమించు ఈకాలంలోనే వాగ్వల్లి, ఆనందదాయిని, భారతి అను మూడు సాహిత్యపత్రికలు, విద్యాప్రచారమున విలసిల్లినవి. 1899 జనవరిలో కొమాండూరు వెంకటరామానుజ శర్మగారు ,,వాగ్వల్లి'' అను పత్రికను ప్రారంభించారు. వాగ్వల్లి పూండ్ల రామకృష్ణయ్యగారిమీద వేదం వెంకటరాయశాస్త్రిలుగారిమీద ధ్వజమెత్తి తీవ్ర విమర్శలుచేసేది. బ్రతికినంతకాలం ఈ పత్రిక శాస్త్రిగారి కవిత్వాన్ని శస్త్రచికిత్స చేసి తప్పుల పట్టీ వల్లించేది. వీరే తర్వాత 1931 సంవత్సరంలో ,,వాగ్వవల్లి గ్రంధమాల'' అనేపేరున గ్రంధపచురణ సంస్థ స్థాపించి కొన్ని సాహిత్య గ్రంధాలు వెలువరించారు. నేలటూరి పార్థసారధి అయ్యంగారు మద్రాసులో ప్రకటించుచుండిన ,,శశిలేఖ'' వాగ్వవల్లికి దోహదమిచ్చింది. వీటికి ప్రతిగా మద్రాసులో ,,సూర్యాలోకము'' అను పత్రిక వెలసింది. విద్యా విషయాలపై వీటి మధ్య సాగుచుండిన చర్చలు అప్పటి సాహిత్య పాఠకులకు కొంత కాలక్షేపంగా వుండేది. ,,ఆనందదాయిని'' అనే మాసపత్రిక 1899 జనవరిలో ప్రారంభమై ఆసంవత్సరంలోనే అంతమైంది. జనమంచి శేషాద్రిశర్మగారు దీనికి సంపాదకులుగ పనిచేశారు. వావికొలను సుబ్బారావుగారు, 'భారతి' మాసపత్రికను 1900 జనవరిలో నెలకొల్పి సంవత్సరం మునే విరమించారు

1900 లో వచ్చిన దంపూరి సరసయ్యగారి 'ఆంధ్రభాషా గ్రామవర్తమాని' తర్వాత - దేశసేవాదీక్షాపరులైవుండి సత్రవ్వేమల వెంకటరాఘవయ్యగారు 1903 లో 'హిందూబాంధవి' అను ఆంధ్రాంగ్ల పత్రికను ప్రారంభించారు. మొదటి సంవత్సరాంతంలోనే చాలించి మళ్ళీ 1924 ఫిబ్రవరిలో ప్రారంభించి సంవత్సరానికిపైగా ప్రకటించారు. 1929 జనవరిలో మళ్ళీప్రారంభమై సంవత్సరానికిపైగా నడిచింది వీరు తిలక్ అభిమానులుగా వుండేవారు. సత్యసంధులు. సనాతనధర్మపక్షంగాను, కాంగ్రెసు ప్రచారకంగాను ఈ పత్రికవస్తుండేది. పల్లిపాడులో తిలక్‌సంస్కృతపాఠశాలను స్థాపించింది వీరే.

వైశ్యోద్ధరణదీక్షతో సుంకు నారాయణశెట్టిగారు 1906 లో వైశ్యాపత్రికను స్థాపించారు. దీర్ఘకాలం నడపలేకపోయారు. మళ్ళీ 1908 లో 'లాయలిస్టు' అనేపత్రిక పెట్టారు ఇదికొద్దికాలమే జీవించింది. సుంకు నారాయణశెట్టిగారు నెల్లూరుజిల్లాలో ప్రథమంగా B. A. పట్టాన్నిపొందినవారు. ఇంగ్లీషువాళ్ళ పైమక్కువ.

ఇంచుమించుగా వైశ్యాకు సమకాలీనంగా మంగు వెంకటరామానుజరావుగారు 'భవాని' అనుపత్రికనుస్థాపించారు. వీరు బహుశ్రుతులు, లోకజ్ఞులు, తెలుగులో సంచిపాండిత్యంకలిగినవారు. పత్రికానిర్వహణమునకు తగినవారు. అయినా రెండుసంవత్సరాలకంటె ఎక్కువకాలం జీవించలేకపోయింది.

## IV

నెల్లూరు హైస్కూల్విద్యార్థులు కొందరు 1912-13 లో Students' Magazine అనుపత్రికను నిర్వహించారు.

ఇంగ్లీషులో వొకమాసపత్రికను ప్రకటింప
గలిగిన విద్యాబుద్ధులుకలిగినవారుగా వుండ
టం ఆశ్చర్యమే. అయినా త్వరలోనే నిల్చి
పోయింది.

ఆతర్వాత నెల్లూరుజిల్లాలో కళాశాల,
పాఠశాలల పత్రికలలో చెప్పుకోతగినది.
కావలి కళాశాలవారి, విశ్వోదయ, తరంగిణి
పత్రికలు. చక్కని సంస్కృతి సౌరభాన్ని
వెదజల్లుతూ ఉన్నత ప్రమాణాలను స్థాపిం
చినదనవచ్చును. కాలేజిల్లోవున్న విద్యార్థి
నులు కొందరుకలసి 56-57 ప్రాంతాల్లో
"creative endevour" అనీ, 60-61
లో 'సృష్టి' అనేపత్రికలను నడిపినారు.
వీటిలో ఎక్కువగా సైన్సు సంబంధమైన
రచనలు సుబోధక శైలిలో ప్రకటింపబడేవి.

వెంకటగిరిలో 1919 లో 'విద్యాభి
వర్ధిని' అనే తెలుగుమాసపత్రిక ఒకటి రెండు
సంవత్సరాలుజరిగి నిల్చిపోయింది. నెమలి
సుబ్బారావు దీనిసంపాదకులు. సలక్షణమైన
శైలిలో సుబోధకంగా విద్యావిషయాలు అనే
కం చర్చిస్తుండేవారు.

1919-20 లో నెల్లూరు పత్రికారం
గం శూన్యంగావున్నట్టుంది. 'అముద్రిత
గ్రంథచింతామణి' 1904 లోనే అంతరిం
చింది. శారదావాగ్విల్లులు నిలిచిపోయి చాల
కాలమైంది, వార్తావర్తిని, హిందూబాంధవి
మూతబడ్డాయి. ఒకశూన్యం, ఒకమౌనం
ఆవరించింది. దేశంనలుమూలలా అనేక ప్ర
ధానమైన పత్రికలువెలశాయి. కృష్ణాపత్రిక
1902 లో ప్రారంభమై ప్రాచుర్యంలోవుం
ది ఆంధ్రప్రకాశిక, దేశాభిమాని వృద్ధిలో
వున్నాయి. 1908 లో ఆంధ్రపత్రిక వార
పత్రికగా, 1914 లో మద్రాస్కువచ్చిన
వెంటనే దినపత్రికైంది. గిడుగు రామమూర్తి
గారి తెలుగు 1919 లో వచ్చింది. రాజకీయ
సాంఘిక, సాంస్కృతికరంగాలో ఆంధ్రదే
శాన్ని, పరుగులు తేయిస్తున్న ఇట్టి వరిస్థితు
ల్లో నెల్లూర్లో పత్రికలేదనే కొరతను గమ
నించి శ్రీయుతులు అమంచర్ల కృష్ణరావుపం
తులు, రేబాల సుందరరామిరెడ్డి, బి. జె.
ప్రసాదరావు కలసి రంగనాయకులపేటలో
వున్న లక్ష్మీముద్రాక్షరశాలనుకొని నెల్లూరు
పత్రికా ముద్రాలయ మనే పేరుతో నెల్లూరు
పత్రికను సాపించారు. మొదటి సంచిక
14-?-20 న వెలువడింది. బి. జె. ప్రసాద
రావు సంపాదకులుగావుండి నడిపేవారు.
వీరంతాచేరి జ్ఞానప్రచారిణీ సంఘమనేపేరు
పెట్టి దానిపక్షాన ఈపత్రికప్రచురించేవారు.
కొన్నిమాసాలతర్వాత కలకత్తాకాంగ్రెసులో
సహాయనిరాకరణోద్యమ తీర్మానం అంగీక
రింపబడినపిమ్మట సభ్యుల్లో భిన్నాభిప్రా
యాలేర్పడి పత్రికను చాలించాల్సివచ్చింది.
అప్పుడు బి. జె. ప్రసాదరావుగారు ముద్రా
లయాన్నికొని ఆయనే కొనసాగించారు.
1920 డిసంబరుకల్లా ప్రారంభమైన తొమ్మి
దిమాసాల్లోనే గతించింది.

ఇంచుమించు ఇదేకాలంలో కావలి
నుండి పిన్నమరాజు వెంకటసుబ్బయ్యగారు
1920 నవంబరులో 'వర్ణాశ్రమధర్మసంస్థా
పనము' అనేమాసపత్రికను తెచ్చారు. అయ
న ఆంధ్రగీర్వాణ భాషలను బాగానేర్చినవా
రు. జ్యోతిషశాస్త్రంలోకూడా ప్రవీణులు.
కొన్నిసంవత్సరాలు ఒకవంచాంగాన్నికూడా
వీరు స్వయంగా ప్రచురించారు. వారు ఈ
పత్రికలో వైదికవిషయాలగూర్చి వర్ణాశ్రమ

విషయధర్మాలగూర్చి చర్చించేవారు. 1923 నుండి వారపత్రికగాకూడ కొన్ని నెలలు కొనసాగించి, ఆగిపోయింది. (వీరి చిత్రపటం ఈ సర్వస్వమున కలదు. చూ. చిత్రఫలకం VIII)

## V

దేశంలో జాతీయోద్యమం నలుదిక్కులా రాజుకొంటున్నది. కాంగ్రెసుజాతీయవాదం ప్రోత్సాహకరంగా వ్యాప్తి జరుగుతుంది. ఈదశలో 1922 లో నెల్లూరులో శ్రీ పాటూరు సుబ్బరామయ్యగారు 'సింహపురి' అనేవారపత్రికను ప్రారంభించారు. 'నెల్లూరుజాతీయోద్యమంలో సుబ్బరామయ్యగారు మరుపురానివ్యక్తి. ఆతొలిరోజులలో 'సింహపురి' పాత్ర అనన్యమైంది. సైక్లోస్టయిల్ పత్రికగా 1922 సెప్టంబరులో ప్రచురితమై స్వవిషయము వ్రాస్తూ సంపాదకులు ఇలా వ్రాశారు. 'నెల్లూరుమండలమునకు భరతఖండమున రాజకీయవాతావరణమున తీవ్రమారుతమువీచు స్వరాజ్యకవాదముల తెరచు నీకాలమున పెట్టి పత్రికయును లేనికారణమున నుడతకుడతభక్తి యనునార్యోక్తి ననుసరించి మేమీసింహపురిని ప్రకటింప సాహసించితిమి. ముద్రిత పత్రికల కలవడినవారికీ పత్రిక కొంత సులభ దూరమనుటయం దాశ్చర్యములేదు. ద్రవ్యాభావము మానవుల పటుటాంతలకు లాగుచుండును. నూతన పత్రికగనుక యెన్నియో లోపములు కలవని మాకుతెలియును...అంటూ కాంగ్రెసు ఆదేశాలను ప్రబోధంచేయడానికి ఉద్యమించింది. సింహపురి. 1923 జనవరి నుండి స్వకీయ సింహపురి ముద్రాలయమున పాటూరి జా॰ సరస్వతమ్మ సంపాదకురాలుగ, పాటూరు సుబ్బరామయ్య ప్రకాశకులుగ ప్రకటింపబడుచుండినది. కొంతకాలం తర్వాత సుబ్బరామయ్యగారే సంపాదకత్వాన్ని నిర్వహించారు. 1930 లో ప్రెస్ ఆర్డినెన్సుక్రింద కాంగ్రెసు పక్షానికి చెందిన పత్రికగనుక సెక్యూరిటీ కోరుచూ నోటీసు జారీ కావడంతో పత్రిక ఆగిపోవలసి వచ్చింది. 1933 ఏప్రెల్ మళ్ళ ప్రారంభమైంది. చాలకాలం కొనసాగింది. 1939 లో 'సింహపురి' తో 'శారద' అనే సాహిత్య మాసపత్రికనుకూడా నడిపారు. కొన్నాళ్ళకు ఆగిపోయింది. '50 లో నుండి' 60 దాక 'శశి' అనే సాహిత్య మాసపత్రికను 10 సంవత్సరాలు నడిపారు. అన్నీ గతించిపోయినయి.

శ్రీ పాటూరు సుబ్బరామయ్యగారిది చరిత్రాత్మకమైన కుటుంబం. కుటుంబంలో అందరికీ కంపోజింగ్ వచ్చు, వీరే కంపోజు చేసుకొని, వీరే ప్రింటుచేసుకొని, సంచిలో సంచికలు పట్టుకొని వీరే పంచేవారు. సింహపురి ప్రచురణరోజుల్లో ఏక్షణంలో పోలీసులు దాడిచేస్తారో అనే భయాందోళనలు వెంటాడుతుండినా కసికొద్దీ, పంతంకొద్దీ, మొండిగా నడిపారు పత్రికను, జైళ్ళకుపంపారు, వెళ్ళారు, ఇంటిని యాలంవేసారు. జాడుగింటిలోకి బిఛాణాఎత్తారు; ప్రెస్‌ను యాలంకు తెచ్చారు. మళ్లీ మరో press ను చిన్నగా నిర్మించుకోగలిగారు. యాత్రసాగించారు. తిరుగుబాటులో ఊపిరితీసుకొంటూ పోరాటంలో గుండెనిబ్బరాన్ని చిక్కబట్టుకొని, నిరాశతో జీవితంపట్ల ప్రేమనుపెంపొందించుకొంటూ జాతీయోద్యమజ్వాలల్లో దుమికి పత్రికారంగాన్ని చేపట్టారు. ఏం

తటి నిరాశామయమైన వాతావరణంలో వీరి పత్రికా ప్రచురణ సాగిందో ఈ క్రిందలేఖ తెలుపుతుంది.

“ఆశీస్సులు పంపమని పాటూరు సుబ్బరామయ్యగారి ఆదేశము...ఆలోచించే కొద్దీ ఆవేదన హెచ్చింది. ఒకసారి గతమంతా కనులముందు తిరిగింది. సింహపురి ప్రెస్సు, పత్రిక, సత్యాగ్రహోద్యమంలో ఇంగ్లీషు ప్రభుత్వంమీద దాడి, సంపాదకులకు జైలుశిక్ష...తర్వాత దానికాలానికి ఆశిథిలాలనుండే ‘శారద’ సాహిత్య మాస పత్రిక వికసించింది. ఆదినాలలో కోవూరులో వ్యవసాయం చేసుకొంటూ రైతుగా నా అనుభవాలు, అనుభూతులు, పద్యాలు ‘శారద’ ద్వారా లోకానికి తెలుపుకున్నాను. ఒకనెలలో నేను పద్యాలు పంపలేదు. సుబ్బరామయ్యగారు సూర్యోదయం కాకముందే కోవూరుకు వచ్చి, నా సోమరితనానికి చీవాట్లు వేసి, పద్యాలు తీసుకొనివెళ్ళారు. ఆయన యువకులను ప్రోత్సహించడానికి చూపిన ఉత్సాహం, పత్రికా ప్రకటనలో ఆయన అకుంఠితమైన దీక్ష, ఆనాటి నారైతు మనస్తత్వానికి గూడ ఆశ్చర్యం కలిగించింది. ‘శారద’ నిల్చిపోయింది. మళ్లీ విరామము. నాలుగేండ్ల నాడు తిరిగి ‘శశి’ గా పాటూరుసుబ్బరామయ్య బాలసరస్వతమ్మగారు కృషిని చూశాను. దిగ్భ్రాంతుణ్ణైనాను. శిథిలజీవితం, జీర్ణముద్రాలయం, బ్రతుకంతా బాధలమయం, దినాలు గడవడమే మర్భరము. అటువంటిస్థితిలో మరల పత్రికా ప్రచురణ, ఆయన ఆదర్శం కోసం, తనచుట్టూ విడిపన్నిన వలలు త్రెంచుకొని, విధిపై తొడచరిచి నిలబడ్డ ఆసాహిత్యారాధకులను, వారికృషిని చూడాలనిపించింది...శశి ఆఫీసుకుపోయాను. చూశాను నేనుచూసింది కలా? వాస్తవమా? నిర్ణయించుకోలేకపోయాను. ఆపాతకాలంనాటి బి.వి. వయస్సు దాదాపు 65 సంవత్సరాలు గాంధేయుడు, కవి, సంపాదకుడు, సుబ్బరామయ్య స్క్రిప్టుతీసుకొని కంపోజుచేస్తున్నాడు నాతో మాట్లాడుతూనే పారంబ్రెడిలు ఎక్కించాడు. ప్రూఫులు తనే దిద్దుకొంటున్నాడు. నేనేమడగాలో మాటలురాలేదు.

ఎక్కడో ఎప్పుడో హిందీ సినిమా ‘నయాసంసార్’ అనేదాంట్లో ఈ సంఘటన చూశాను. ఎక్కడో కథలో చదివాను. భావనా చిత్రాన్ని వాస్తవంగా చూశాను. అప్పుడు ఆపత్రికపై నాకు వెయ్యింతల గౌరవం పెరిగింది......తిట్లు’ బూతులు, వ్రాతలతోనున్న పత్రికల నాదరించి నిలబెట్టే భాగమధిగమించిన యీమహాకృషి, ఈసహిత్య వ్యవసాయం......చూసి గర్వపడ్డాను, ఆర్థికంగా శిథిలావస్థకేవయినిస్తున్న ఈపత్రికను నిలబెట్టి, సింహపురి ఈదంపతులను ఆదరించగలదా అనే ప్రశ్నవీడలేదు. కాని ఈ సంపాదకులకు పాఠకులపైగల నమ్మకం, తమకృషియందుగల విశ్వాసం దీక్ష’ ఫలించగలవని నా ఆకాంక్ష...” •

## VI

1925-26 ప్రాంతాల్లో అనేక పత్రికలు వెలిశాయి. అభయభారతి, భవాని, ఆంధ్రరంజని, దేశబంధు....అభయభారతి అనే మాసపత్రికను మద్దిరాల నాగభూషణ శర్మగారు ప్రారంభించారు. సారస్వత విషయాభివృద్ధికై పాటుపడినవాటిల్లో ఇదొక్కటని చెప్పవచ్చు కాని ఎక్కువకాలం

బ్రతుకలేదు. 'భవాని' అనే వైద్యసంబంధమైన వారపత్రికను శ్రీ వరగంటి కృష్ణారావుగారు ప్రారంభించారు. 'ఆంధ్రరంజని' అనే పక్షపత్రిక 25 జూన్‌లో ధూర్జటి సుబ్బారావు, రామకృష్ణయ్యగార్ల సంపాదకత్వాన వెలువడింది. అయిదునెల్లు పక్షపత్రిగావచ్చి కొన్నాళ్ళు వారపత్రికగామారి నిల్చింది.

1920 లో నెల్లూరుపత్రికను నడిపిన శ్రీ బి. జె. ప్రసాదరావుగారు 26 మేలో 'దేశబంధు' అనే పత్రికను స్థాపించారు. దేశభక్త చిత్తరంజన్‌దాస్ స్మరణార్థమై పత్రికకు 'దేశబంధు' అనే పేరుపెట్టారు. ఐదుసంవత్సరాలు సాఫీగా, సక్రమంగా నడిచింది. కాంగ్రెసు ఉద్యమాన్ని తీర్మానాల్ని జనానికి కొంత బోధపర్చింది. మండలానికి సంబంధించిన సాంఘిక రాజకీయ, వ్యవసాయిక రంగాలలో కొంత కృషిచేసి 31 సెప్టంబరులో నిల్చిపోయింది.

ఈకాలానికల్లా దేశంలో రాజకీయోద్యమం తీవ్రరూపందాల్చింది. కాంగ్రెస్-జస్టిస్. పార్టీలమధ్య తీవ్రపోటీ, స్పర్ధ. నవ్యసాహిత్యోద్యమం రూపురేఖలు దిద్దుకొంటుంది. సహకారోద్యం వ్యాప్తిచెందింది దేశంలో అనేక సంఘాలు సంస్థలు. దాదాపు ఈదశలో 1928 30ప్రాంతంలో నెల్లూర్లో అనేక పత్రికలు వెలువడ్డాయి. 1928 లో బెజవాడ రామచంద్రారెడ్డిగారి 'స్వతంత్ర' 30 లో నెల్లూరు రామానాయుడుగారి జమీందారీరైతు వచ్చింది.

1928-29 ప్రాంతంలోనే ఆంధ్రమాత అని తంగిరాల రామనాథశర్మగారి సంపాదకత్వాన సుమారు రెండుసంవత్సరాలువచ్చి నిల్చిపోయింది. ఈ కాలంలోనే "ఆయుర్వేదచంద్రిక" ప్రథమంలో కొన్ని గుచ్చాలుగా ప్రకటింపబడి క్రమంగా మాసపత్రికగా మార్చబడి ఇప్పటిదాక వస్తూవుండి పెరిదేపిలోని ఆయుర్వేద సమాజంవారి పక్షాన వస్తూండేది. 'వీరశైవ ప్రచారిణి' అని గురుదేని సుబ్రహ్మణ్యదేవర సంపాదకత్వాన కొన్నెల్లు మాసపత్రికగా అతర్వాత పక్షపత్రికగాను మార్చి ఆగిపోయింది. కేవలం ఆర్యక్షత్రియులోద్ధారణగా తంగిరాల రామనాథశర్మ సంపాదకులుగా, బుచ్చివాస్తవ్యులు అనంతయ్యగారు ప్రకాశకులుగా 'నిమిషాంబ' అనే మాసపత్రిక కొన్నెల్లువచ్చింది.

1928 మార్చిలో మన్నేపల్లి రామకృష్ణరావుగారి సంపాదకత్వాన జిల్లా కోఆపరేటివ్ ఫెడరేషన్ తరపున 'సహకారపత్రిక' అనే మాసపత్రిక వెలువడింది. (ఇంతకుముందు 27 లో సహకార జిల్లా ఫెడరేషను సెక్రిటరీగావుండిన అనంతరాజు నారాయణరావుగారు నెల్లూరుజిల్లా సహకార ప్రచారిణి, అనుపేర ఒక సంచికమాత్రమే వచ్చి నిల్చిపోయింది.) 1930 లో ఈ పత్రిక ముద్రింపబడుచుండిన రామకృష్ణ ముద్రణాలయంప్రెస్ ఆర్డినెన్సు క్రింద నోటీసు రావడంతో పత్రికఆగి మళ్ళీ 30 సెప్టెంబరులో పత్రిక పునర్దర్శనమిచ్చింది. 31 మే లో ఫెడరేషన్ సంస్థ వేయబడ్డంతో జిల్లాబ్యాంకింగ్ యూనియన్‌వారు ఈ పత్రికను నడిపేవారు. ఈ సంపాదకపదానికి శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగారు ప్రధాన సంపాదకులుగా కొంతకాలం పని

చేశారు. మన్నేపల్లి రామకృష్ణరావుగారి తర్వాత 33 లో వెన్నెలగంటి అప్పారావుగారు ప్రధాన సంపాదకులుగావుండి పత్రిక చాలకాలం నడిచింది. ఈ ప్రాంతాల్లోనే మన్నెపల్లి రామకృష్ణరావుగారు స్వయంగా 'సహకారమిత్ర' అనే పత్రిక నడిపేవారు ఆంధ్రదేశ సహకార రంగంలో ఈ పత్రికలు ప్రముఖమై ఖ్యాతి గడించాయి.

శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారు 1928 మార్చి లో నెల్లూరులో స్వతంత్ర ముద్రణాలయాన్ని, 'స్వతంత్ర' అనే వార పత్రికను స్థాపించి పోషించారు. 1928 మార్చి 17 వ తేదీన ప్రథమ సంచిక వెలువడింది. జస్టిస్ పార్టీ పక్షంగా దాదాపు 40 దాక పత్రిక వచ్చింది. (దీనికి సమకాలీనంగా కొంచెంముందుగానే జస్టిస్ పార్టీవారి పోషణలో మద్రాసునుండి 'సమదర్శిని' అను పత్రిక వుండేది. కొన్నాళ్లు ఇది దిన పత్రికగా వుండింది.) దీనిలో కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారు కొన్నాళ్ళు సంపాదకులుగాకూడా పనిచేశారు; ఆతర్వాత మరుపూరు కోదండరామరెడ్డిగారు సంపాదక వర్గంలో కొన్నాళ్ళు పనిచేశారు. ప్రథమ సంపాదకులు శ్రీ యం. సుబ్బారెడ్డి, వారు కొంతకాలముండి చనిపోగా, శ్రీ ముంగర సుబ్బారెడ్డి బి. ఏ. సంపాదకులుగా పనిచేశారు. ఈయనా 1932 అఖర్లో చాలించుకొన్నారు. తర్వాత వెన్నెలగంటి అంజనేయులుగారు సంపాదకులుగా పనిచేశారు. పేరుకువున్నా ఎక్కుభాగం బెజవాడ రామచంద్రారెడ్డిగారు, చూచుకొనేవారు. మద్రాసు శాసనసభలో వున్నప్పటికీ సకాలానికి వ్యాసాలు వ్రాసి పంపేవారు. గుప్త నామధేయముతో సరళమైన భాషలో ఇందు వ్రాస్తుండేవారు. భాషలో ఎక్కడా క్లిష్టత వుండేదికాదు. భావంలో ఎక్కడా అడంబరత వుండేదికాదు. వీరు నడిపిన 'నూదంటురాయి' శీర్షిక ప్రత్యేకం. ఎల్లప్పుడూ సకాలానికి వెలువడుతూ రాజకీయ చర్చలతో నిండి వుండేది. కాంగ్రెసుపార్టీలో అప్పటికి పొడసూపిన స్పర్థలను బయటపెడ్తూ, జస్టిస్ పక్షంగా సమకాలీన రాజకీయవిషయాలను. సుబోధకంగా వెల్లడిచేసేది.

## VII

ఈ కాలంలోనే ''జమీందారీరైతు'' వెలసింది. జిల్లా జమీందారీరైతు సంఘప్రాన 1930 మార్చిలో ''జమీందారీరైతు'' ప్రథమసంచిక ప్రకటితమై నెల్లూరుజిల్లా పత్రికాయుగంలో నూతన శకానికి నాందీ వచనంపలికి నూతనవెలుగును ప్రసాదించింది. శ్రీ నెల్లూరు వెంకట్రామానాయుడు దీనికి సంపాదకులు. ప్రకాశకులును సరి అయిన ముద్రణాలయపు సౌకర్యాలు లేకపోవడంవల్లనూ, ద్రవ్యసంబంధమైన ఇబ్బందులవల్లను, మధ్యమధ్య ఆగుతూ, నిలుస్తూ పునదర్శనమిస్తూ, బాలారిష్టాలన్నీ దాటుకొని 34 సెప్టంబరులో జమీన్‌రైతుగా అవతరించి నేటిదాక నెల్లూరుజిల్లా జీవపత్రికగా నిండ్రొక్కుకొని గొప్పవిజయాన్ని సాధించింది. జమీన్‌రైతు సాధించిన విజయఫలితాలను తర్వాత ప్రత్యేకంగా చర్చిస్తాము.

1929 సెప్టంబరులో 'వి. ఆర్. కాలేజి మేగజైను' ప్రారంభింపబడింది. ప్రిన్సిపాల్ శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగారి ప్రోత్సాహంతో స్థాపింపబడింది.

సంవత్సరానికి రెండుసంచికలు వచ్చేవి. ఉపాధ్యాయులు, విద్యార్థులుకలసి ఆంధ్రాంగ్లాలలోను వ్యాసాలువ్రాసేవారు. మూడు నాలుగు సంచికలు వచ్చి నిలిచిపోయింది. సంవత్సరానికి రెండు సంచికలైనా కూడ ప్రచురింపలేక.

1931 ఆగష్టులో "సుబోధిని" అనే వారపత్రికను శ్రీ మన్నేపల్లి రామకృష్ణరావుగారు స్థాపించారు, తమ రామకృష్ణ ముద్రణాలయంలో ముద్రింపబడేది; సహకార పత్రికకు చాల సంపాదకులుగావుండి చాలా అనుభవంగడించి సుబోధిని ప్రారంభించారు. కొన్నాళ్లు "సుబోధినికి" అనుబంధంగా సహకారమిత్ర వస్తుండేది. సుబోధిని ఎక్కువగా జాతీయరంగంలోని రాజకీయ చర్చలతోను, సారస్వత, సహకారవిషయాలతోను వుండేది. వ్యాసాలెప్పుడూ తీవ్ర ధోరణిలోగాక మితధోరణిలోగాక మితధోరణిలోవుండేవి. నెల్లూరుజిల్లాలో వచ్చిన మంచిపత్రికలలో ఇదొకటి. 5, 6 సంవత్స సంవత్సరాలువచ్చి నిలిచిపోయింది.

నెల్లూరు రామానాయుడి అనుయాయులుగా వుండిన దేశిరెడ్డి శేషురెడ్డిగారు. ఎందుకో విడిపోయి 1931 లో "స్వతంత్ర రైతు" అనే పత్రికను ప్రారంభించారు. సంవత్సరంనడిచి నిలిచిపోయింది. 'జమీందారి రైతుపత్రిక ఒకటివుండగా 'స్వతంత్రరైతు' అని వేరొకటి యెందుకని వచ్చినప్రశ్నకు అక్టోబరు సంచికలో ఇదు సమాధానమిస్తూ "జమీందారీ రైతుపత్రిక" నెల్లూరుజిల్లా జమీందారీ రైతుకష్టములనుగూర్చి వ్రాయుటకు స్థాపింపబడినదయ్యేను, ప్రస్తుతము ఆపత్రిక వెంకటగిరి జమీందారులను దూషించుటకునవకాశపోవుటచే రయితులకష్టములగూర్చి వ్రాయుటకు స్థలములేనందున-జమీందారీరైతు సంఘస్థాపకులు "స్వతంత్ర రైతు" అను పత్రికను స్థాపించవలసివచ్చినది. "అని వ్రాశారు. జమీందారీ రైతు సెప్టెంబరు 19 సంచికలో వీరిని గూర్చి 'ఊలికుడు' ఇట్లావ్రాశారు. "దేశిరెడ్డిశేషురెడ్డిగారి రంగు (రాజకీయ) మారింది. మార్పుకు కారణాలు ఎన్నోవుంటవి. వాటితో పనిలేదు. ఇక స్వతంత్రి ఎడిటరుగా 50 రు. జీతంతో రాజాగారి ప్రచారం సాగిస్తారట. మంచిదేకాని ఆనాటి ఉపన్యాస భాష ఆకార సదృశ ప్రతిభ సుద్దీపింపజేసింది. రెడ్డి పదేండ్లు ఆర్జించుకొన్న పేరు ఒక నోటి తుంపరలో కరిగిపోయినందుకు విచారం" అనివ్రాశారు.

1932 లో "తీర్పులపత్రిక" నేలటూరి సుబ్బారాయుడు గారి సంపాదకత్వాన వెలువడింది పక్షపత్రికగా. యాక్టులు, కోర్టుతీర్పులు, లిటిగేషన్ వ్యవహారాలు ప్రచురింపబడేవి. చాలకాలం నడిచింది. ఈపత్రిక మళ్లీ ఇటీవల ఈపేరుతో శ్రీ అయితంరాజు శ్రీనివాసులుగారు సాగిస్తున్నారు.

1932-33 లో రెండు క్రొత్తప్రయోగాలు సాహసమైనవి జరిగాయి ఇంగ్లీషులో రెండుపత్రికలువచ్చాయి. 'Scrutator' స్క్రూటేటరు, అనేవారపత్రిక, "Rural India" రూరల్ ఇండియా అనేపక్షపత్రిక వెలువడ్డాయి. శ్రీ P. S. R ఆంజనేయులు ఎడిటరుగాపనిచేశారు. మొదటి సంచిక 12-12-32 న వెలువడింది. 33 అఖరువరకువచ్చింది. Rural Indiaకు ఎడిటర్

శ్రీ జి. రాజరత్నం మొదటిసంచిక 1933 మేలో వెలువడి కొన్నినాళ్లేనడిచింది. ఈ రెండుపత్రికలు మరుపూరు కోదండరామి రెడ్డి ప్రభాత్ ప్రెస్‌లో ముద్రింపబడేవి. తెలుగుపత్రికలే అంతంత మాత్రంగావున్న పుడు ఇవిచాలాకాలం నడవగలవని ఎట్లా అనుకోగలము?

ఇంచుమించు ఈ కాలంలోనే ఘాలి సుబ్బరామయ్యగారు 'ప్రజాసేవ' అనుపేరు తో ఒక పత్రికను తీసుకొచ్చారు. 1934 మార్చిలో మొదటిసంచిక వెలువడింది. తరచు ఆంగ్లవ్యాసాలుకూడా వస్తుండేవి. నెలటూరు రామదాసయ్యంగారు దీంట్లో తరచు 'రసలుబ్ధులు' 'రసపాయి' అనుపేరు తో వ్రాస్తుండేవారు. ఆరేడు సంవత్సరాలు నడిచి ఆగిపోయినట్లున్నది. ఈప్రాంతలోనే వైశ్యులకు వాణిజ్యవార్తలకు ప్రాధాన్యత నిస్తూ 'దక్కన్‌వైశ్య' వెలువడింది. దీనికి జవ్వాజి సుబ్బరాయగుప్త (అష్టావధాని) గారు ఎడిటరుగావున్నట్టు తెలుస్తున్నది. ఇదీ కొన్నిసంవత్సరాలపాటు వచ్చినట్టుంది. ఈ రెండుపత్రికల సంచికలు దొరకనందువన ఎక్కువేమీ వ్రాయలేము.

'జమీన్‌రైతు' 1934 సెప్టంబరులో వచ్చినపుడు - దానికి సమకాలికంగా నెల్లూర్లో బెజవాడ రామచంద్రారెడ్డిగారి 'స్వతంత్ర' పాటూరు సుబ్బరామయ్యగారి 'సింహపురి' మన్నేపల్లి రామకృష్ణరావుగారి 'సుబోధిని' సహకారపత్రిక, గాలి సుబ్బరామయ్యగారి 'ప్రజాసేవ'దక్కన్‌వైశ్య, తిరుపులపత్రిక వర్తరాలుండేవి. రాజకీయంగా స్వతంత్రకు జమీన్‌రైతుకు తీవ్రస్పర్థవుండేది. పోటీగావుండేది. వ్రాతల్లో ఒకరిపైనొకరు కారాలుమిరియాలు నూరుకొనేవారు.

1940 లో 'కేసరి' వారపత్రికగా పి. వి. సుబ్బారావుగారు సంపాదకులుగా దర్శనమిచ్చింది. నెల్లూరుజిల్లాలో నిర్భయంగా నీశైన విమర్శలుచేసిన పత్రికగా దీన్ని చెప్పుకోవాలి. స్థానికవార్తలను, వ్యవహారాలను స్పష్టంగా ముక్తసరిగా, చిన్నచిన్న శీర్షికకలిచ్చి సూటిగావేసేది. ఘాటైనవిమర్శలుచేసేది. ఇటీవల, మంత్రి ఎ. సి. సుబ్బారెడ్డిగారు నెల్లూర్లో ఒక సభలోమాట్లాడుతూ 'కేసరి' నన్ను నిశితంగా విమర్శించి, తిట్టి, ఇండైరెక్టుగానాPopularityని ఇనుమడింపజేసింద'న్నారు. 5, 6 సంవతరాలు నడిచింది. పత్రికరూపురేఖలు పరిశుభ్రంగా, ముచ్చటగావుండేవి. వీరిని కేసరి సుబ్బారావనడం వ్యాప్తిలోకొచ్చింది.

ఆతర్వాత వచ్చిన పత్రికలలో చెప్పుకోతగింది. నారపరెడ్డి రామిరెడ్డిగారి 'అరుణరేఖ' ఒక సుడిగాలిరేపింది. మాసపత్రికగా 47. 48 లో వచ్చింది. నెల్లూరుజిల్లా అభ్యుదయ సాహిత్యపు మాగాణంలో పిడవాక సాగించింది. ఆంధ్రదేశంలో వచ్చిన అభ్యుదయ సాహిత్య పత్రికలలో గణుతికెక్కింది. తర్వాత తర్వాత కె. వి. రమణారెడ్డిగారు సంపాదకవర్గంలో ప్రవేశించారు. వీరి ప్రమేయంవల్ల ఈ పత్రిక సిద్ధాంతస్థాయి మరింత స్పష్టంగా విశదంగా ఉన్నత శ్రేణికిచెందిన మౌలికరచనల కాస్కారం యేర్పడింది. పక్షపత్రికగా కొన్నాళ్ళు వచ్చింది. ఈ సందర్భంలో అమెరికన్ సాహిత్యం గురించి వచ్చిన ప్రత్యేక సంచిక విశిష్టమైంది. శ్రీ శ్రీ

ఈశ్వర ప్రభువుగారు. ఈ పత్రికా ముఖంగాచేసిన పురాణాలపై చమత్కారం అరాచక ధోరణిలో సాగినా అలజడిరేపింది. వీటన్నిటివెనుక నారపరెడ్డిగారి భావుకత పనిచేసింది. నారపరెడ్డి సహజంగా రైతు, స్వతహాగాకవి. సరదాగా జర్నలిస్టు. ఈతని రచనల్లో ఈ మూడు ధోరణులు తొంగిచూస్తుంటాయి. రైతు మనస్తత్వం, కవిహృదయం, జర్నలిస్టుబాణీ సూటిగా, ఘాటుగా నేరుగా పాఠకుడి గుండెకు తగిలేటట్టు వ్రాయగలడు. మార్కిస్టు భావుకుడిగా జర్నలిజంలో అడుగుపెట్టాడు. విప్లవసాహిత్యోదయానికి శాయశక్తులా కృషిచేసి భావుకుడిగా మిగిలిపోయాడు. హృదయం ఎటులాక్కడితే అటు కళ్ళెంవదలి పయనించాడు. పాతంతారోత అనే అధునాతన యాంత్రిక ధోరణిని ప్రేమించి అనుసరించి ఆశాభంగం పొందాడు. జాతీయ మరావేశపరులైన సనాతన మాంత్రికకీర్తి అంటే మొదట సుంచీ గిట్టక ధ్వజమెత్తి రొష్టునడ్డాడు. ఈ భావ సంఘర్షణతోనే ఆశానిరాశమధ్య ఆశయ సిద్ధికై అల్లాడుతూ సత్య బోధకాకపోయినా చైతన్య ప్రబోధం చేయగలిగాడు. అందుకే ‹‹అరుణరేఖ'' అస్తమించిది. అరుణరేఖ అంత్యదశలో శ్రీ ఉ. సి. కొండయ్యగారు సన్నిహితంగా వచ్చారు. 51 లో కాబోలు అరుణరేఖ నిల్చిపోయింది. గొంతుసవరించు కొని 54 లో "కంచుకాగడా" "మెరుపు పెట్టాడు. 'మెరుపు' ద్వారా అతనిచ్చిన సందేశమంటూ ఏదీ లేకపోయినా పత్రికారచనలో మాత్రం కొన్ని కొత్తపుంతలు తొక్కాడు "కాంతులు-కత్తులు" 'చిటికెలు' 'కూనిరాగాలు' అని కొత్తకొత్త శీర్షికలు నడిపాడు 'నరుడు-నాయకుడు,' గ్యాసుమాస్టర్-పీధిమనిషి' 'సర్వాధికారి-సామాన్యుడు' అని సంభాషణాత్మకంగా వ్యంగ్యంగా, హాస్యస్ఫోరకంగా వార్తలను విమర్శలను అందిచ్చాడు. 'మెరుపులో' సంకీర్ణంగా కళానంద్ అనే పేరుతో చిన్నచిన్న సూక్తుల రూపంలో తన నిర్వేదాన్ని పాడుకొన్నాడు. ఆసూక్తులలో చక్కటి కవిత్వం వుంది. చెప్ప లేని ఆవేదనను నివేదించుకోజూచాడు. స్వేచ్ఛగా నిజంచెప్పలేక, అబద్ధం ఆడలేక నిష్ఠురంపాలై ‹‹మెరుపు'' మాయమైంది. ఆపత్రికలకూ, ఈ పత్రికలకూ ఇంకా గుప్త నామధేయాలతో వాడి అయిన రచనలు చేస్తూనే వున్నాడు. హృదయం ఉద్విగ్నమైకల గనినప్పుడు కలం చేతబట్టి కవితలల్లి పత్రికలకు పంపుతూనేవున్నాడు.

40-50 ప్రాంతాల్లో అనేక పత్రికలు తలలెత్తాయి, ఒకటి రెండు సంవత్సరాల్లోనే మాయమైయినాయి, కొన్ని ఒకటి రెండు సంచికలతో మాయమైయినాయి. ఈ సంవత్సరంలో 48-49 లో బత్తెనరామకృష్ణారెడ్డిగారి 'ప్రజారాజ్యం' జి. జె. రావు. బి. గుప్త జె. ఆర్. కృష్ణమూర్తిగారి 'నవయుగం' ఐదారు సంవత్సరాలు నడిచి ఆగిపోయాయి. ప్రజారాజ్యంలో యుగంధర్ గారి ‹‹కలంపోట,'' ప్రజాపార్టీ పక్షంగా రాజకీయాల విమర్శలు కొనసాగేవి. ‹‹నవయుగంలో'' కంకుపాట్లుగారి "కలంపోట్లు" ‹‹టుమ్రీలు'' మొదలగు శీర్షికలతో వచ్చేవి. 41 ప్రాంతంలో కొన్నాళ్లు యం. యస్. మూర్తిగారి సంపాదకత్వాన "ఆంధ్రప్రజ" అనే వారపత్రిక వచ్చింది. కావలినుంచి కొన్నాళ్ళు ‹‹సాహితి'' గూడూరు నుంచి

కొన్నాళ్లు "జయభేరి" పత్రికలు వచ్చిన ట్లుగా తెలుస్తుంది. 50 ప్రాంతాల్లో పెళ్లకూరు గోపాలకృష్ణారెడ్డిగారు "దీనబంధు" అనే పత్రికను వెలువరించినట్టు తెలుస్తుంది. 52-53 లో వాదారి కల్యాణసుందరంగారు "ప్రజావాణి" అనే వారపత్రికను తెచ్చారు ఎక్కువగా విద్యార్థులమధ్యనే వుండిపోయింది. రెండు సంవత్సరాలకంటె ఎక్కువగా నడిచినట్లులేదు. ఈ ప్రాంతాల్లోనే కోట వెంకటరంగంగారు "గీటురాయి" అనే పేరుతో ఒక పక్షపత్రికను కొన్నాళ్లు నడిపినట్లు జ్ఞాపకం. 45 ప్రాంతాల్లో నెల్లూరుపల్లెలో ఒకవిచిత్రమైన litigant గా ప్రఖ్యాతిగన్న కొళ్ళపూడి ఆదిశేషారెడ్డి గారు Civil Liberties అని ఒక పక్ష పత్రిక నడిపారు. ఇదిముఖ్యంగా లాయర్లు, కోర్టు చుట్టూ ధ్వజమెత్తివుండేది కాస్త విద్యాధికుల మధ్యనే పరిమితమై వుండేది....ఇలా ఇట్లాంటివెన్నో మఖలోపుట్టి పుబ్బలో అంతరించాయి.

## VIII

ఈ అవ్యవస్థలో ఒకజమీన్‌రైతేనిలిచింది. 54 లో మరుపూరు కోదండరామిరెడ్డిగారు 'మందాకిని' పెట్టారు. జమీన్‌రైతు 'చద్దిఅన్నం, అయితే మందాకిని వేడివేడికాఫీ జమీన్‌రైతుది పల్లెటూరు తత్వమైతే మందాకినిది urban దృష్టి. మందాకిని ఒకకొంత బద్దకు అందేదికాదు. ఒకనియమబద్ధమైన నిష్పత్తి లేకుండా ప్రపంచవార్తలంటాడు, ప్రాంతీయుల్ని వదిలేస్తాడు. ఒక్కొకసారి స్థానికాల్ని పట్టుకొని అవతల పొదిలేస్తాడు. జీవభాషఅని నీచగ్రామ్యాన్ని అపరించలేనంటారు. అస్పష్టమైన నాదుకపదాల్ని విరివిగా వినియోగిస్తూ మధ్యమధ్య క్లిష్టశైలి నిఘంటుబద్ధమైన గ్రాంధికాల్ని తగిలిస్తాడు. వారపత్రికఅనడు సాప్తాహికముఅని అంటాడు. తేదిఅనడు దినాంకముఅనిఅంటాడు. షీప్రావలో కనమంటాడు. లోకపు తెన్ను-గ్రస్థచూపుఅంటాడు. పోరటఅంటాడు. ఇట్లావీరిది ప్రత్యేకమైనపదజాలం ఇవాళ ఒకర్ని ఆకాశానికెత్తగలడు. రేపు పాతాళానికిదింపగలడు చెప్పేదిమాత్రం rashగాతప్పమరోలాచెప్పలేడు. Provocative గా Bitingగాతప్పమరోలాగ వుండవుపదాలు. ఒకపెద్దమనిషి దీన్ని Yellow Journal అని అన్నాడట దానికిఈయనేవ్రాస్తాడుఒకచోట 'పెద్దమనిషి విషయాలను బయటపెట్టినందుకు మమ్ములను 'యెల్లోప్రెస్' (అఘాయిత్యాలపత్రిక) అన్నారట. అవును! ఆయనచేసిన గట్టర్ (జలదారి) పనికి యెల్లోగాక బ్లాకావలనా వారికి అనివ్రాసుకోగలడు కవిత్వంలో తిట్టుకవి, వేములవాడ భీమ కవికున్న స్థానమే మనమండల జర్నలిజలంలో మరుపూరు గారికి భాకీగావుంటుంది. ఆదిమరొకరు ఆక్రమించలేరు. నెల్లూరు జర్నలిజంలో ఒక నిరంకుశవంశాన్ని సృష్టించాడు. అది అనితరసాధ్యం.

## IX

ఇన్ని పుట్టిగిట్టినా, మనమండలంలో నాలుగు కాలాలపాటునిలిచి నిజయమంతంగా నడుస్తున్నపత్రిక 'జమీన్‌రైత్' జమీందార్‌రైతు పత్రిక 'జననం' చిత్రంగాజరిగింది '1918 లో వెంకటగిరి జమీందారీయిలాకా నెల్లూరు తాలూకా పిడూరుగ్రామంలోబంగారుచెరువు క్రింద పాణకాకనకమ్మగారి కుటుంబానికి షుమారు 500 యకరాలపొలం వెంకటగిరి జమీందారువద్ద రు. 20,000 ప్రీమియం ఇచ్చి పాలేనా రు. 5000 శిస్తు చెల్లించేవద్ద

తినే పట్టా తెచ్చుకోబడింది. దానిమీద లక్ష రూపాయలదాక పెట్టుబడి పెట్టి భూములు బాగుచేసి, లక్షపైవేల రూపాయలదాక జమీందారుకు శిస్తులు చెల్లించబడినవి. భూములిచ్చేటప్పుడు నీటివసతులు బాగుచేస్తామనే షరతుకొ పట్టాయిచ్చారు. బంగారువెర్పు పెషయిక వెప్పు దానికి వరద కంట్లయేట్లోనుంచి యేర్పడివుంది. వెప్పకట్ట రిపేరు చేయనందువల్ల వరదకాలవతెగి సముద్రానికిపోతున్న గండెను బాగుచేయనందువల్ల నీటివసతి తగ్గిపోయింది. అదిగాక ఆ కుటుంబంవారు, సంఘమేర్పరచాలని తద్వారా రైతుల కష్టసుఖాలు తెలుసుకోడానికి, జమీందారులు తెల్సుకోడానికి అవకాశముంటుందని వీరు ప్రయత్నించారు. అది జమీందారుకు బొత్తిగా ఇష్టంలేదు. ఆకారణంతో ఈ కుటుంబం మీద ధ్వజమెత్తి అన్నివిధాల కష్టనష్టాలు కల్గించి ఈ ఆస్తినంతా వేలంవేసి అపహరించారు. ఈ ఆస్తి ఆహుతయిన అగ్నిగుండం నుండే జమీన్‌రైతు ఉద్భవించింది. జమీన్‌రైతు సంఘస్థాపనకు, జమీన్‌రైతు ఉద్యమానికి ప్రారంభం పోణకావారి కుటుంబం • బాలారిష్టాలు, తొలిఉపద్రవాలూ దాటుకొని నేడు స్థిరపడిపోయింది. తెలుగుజర్నలిజంలో జమీన్‌రైతు సాధించినఫలితాలు అమోఘమైనవి. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ విషయాల్లాంటివాటికి, సైద్ధాంతికమైనవి ఎన్నో పత్రికలున్నాయి కాని ఎవరూ శ్రద్ధచూపని పల్లెటూళ్లను, వాటి సమస్యలను లోకానికి పట్టిచ్చగల్గింది జమీన్‌రైతు. పల్లెటూళ్లకు ప్రపంచాన్నీ, ప్రపంచానికి పల్లెటూళ్లనూ పరిచయం చేయగల్గింది. పల్లెటూళ్ల వార్తలకూ, రైతుసమస్యలకూ మొదట్నుంచీ ప్రాధాన్యతనిస్తూ కేవలం పల్లెటూరివాణిగా జమీన్‌రైతు పేరొందింది. పాఠకులకు వార్తలపట్ల అభిరుచిని కల్గించి, పల్లెటూరిపత్రికగా ఆంధ్రదేశంలో నడుస్తున్నది 'జమీన్‌రైతు' ఒక్కటిగానే కనబడుతుంది. జమీన్‌రైతుకు గ్రామాల్లోవున్నంతమంది చందాదార్లు ఏ లోకపత్రికకు లేరేమో.

మొదట్నుంచీ జమీన్‌రైతు 'సర్కిలైటు' పల్లెటూళ్లపైనవే సామాన్యపాఠకుణ్ణికూడా ఆకట్టుకోడానికిచూసింది. అనేకానేక ప్రయోగాలుచేసింది భాషావిషయంలోను, శీర్షికలుంచడంలోను సామాన్య అక్షరాస్యునికి తేలేటట్లుగా శ్రద్ధ తీసుకొంది. కొవ్విచ్చుగారి పత్రాబులు, విరోమహామాటిగారి కొరడాదెబ్బలు, చెకుముకిగారి మనలోమాటలు, చిత్రగుప్తుని నెల్లూరుముచ్చట్లు, లోకాభిరామాయణం పంచాగం విమర్శకునిలఘు విమర్శలు, సంజయుని విను-వినకపో, అని అనేక వినూతన శీర్షికలను ప్రవేశపెట్టి పాఠకునిదృష్టిని అయస్కాంతంలాగ ఆకర్షించింది. సామాన్యుని హృదయానికి గురిచూసి తగిలేట్లు బాణాలు విసరింది, బాణీలు కూర్చుకుంది. ప్రజలమనస్సుల్లో మరులు గొల్పింది.

'34-, 7 ఏళ్లకాలంలో ప్రప్రథమంగా వ్యంగ్య చిత్రాలు Cartoon 'లు వేయడం ప్రవేశపెట్టి నూతనమైన ధోరణిలో జమీన్‌రైతు అమోఘంగా పనిచేసింది. నిప్పురవ్వలా, ఎలెక్షన్ ప్రచారంచేసింది

• జమీన్‌రైతు [illegible] సంచికలో రామానాయుడిగారి వ్యాసంలో కొన్ని వాక్యాలు.

(అప్పటికి వ్యంగ్య చిత్రాలలో ఎలక్షన్లలో ప్రచారం సాగించడం ఆంధ్రదేశపు పత్రికలలో అదే మొదటిప్రయత్నమని అంటారు రామానాయుడుగారు.) ఓటుపాటలు, రైతు గీతాలు ప్రకటించింది.

> ''రైతుకే ఓటివ్వవలెనన్నా, నీకష్టసుకాలు
> రైతుప్రతినిధి చెప్పగలడన్నా, దారిడొంకలు లేని యూళ్ళన్నా మన పల్లెలు
> దమ్మిడీకి పనికిరావన్నా''

''మాకొద్దీ జమీందారుపొందు''

> 'దండాలండోయి-మే-ముండలేమండోయి
> బాబో ఈ ముంతమోసిన జమీందారు-
> లుండెనేని బ్రతుకలేమోబాబో''

అని ప్రజల పెదాల మీద నర్తించే జానుతెనుగు మాటల్లో, దేశిమార్గపురీతుల్లో, రచనలుచేసి జనరంజకమైంది. ప్రజానీకానికి వెన్నెముకైంది. ఆనాటి కార్టూన్లలో ఒకటైన ''సింగిచెప్పిన జోస్యం'' జనాన్ని మరీ చిందులు తొక్కించింది. ఒక్క చల్లపల్లి రాజా తప్ప తక్కిన ఆంధ్రదేశంలో జమీందారులందరూ ఓడిపోయారు.

ముఖ్యంగా రామానాయుడిగారి ''నెల్లూరుముచ్చట్లు,'' 'ఉగాది పంచాంగం' మరుపుకురానివి. సజీవమైన హాస్యానికి మచ్చుతునకలు. (ఇప్పుడు నీరసంగా వున్నా యనుకొండి)

40 ప్రాంతాలలో ''యుద్ధంవార్తలు'' ''యుద్ధగమనం'' అనే శీర్షికలతో తెలుపుతుండేది. అంతర్జాతీయ రాజకీయాలతీరుతెన్నులు సరళంగా సమగ్రంగా వ్యాఖ్యానం చేస్తూ పాఠకులకు అందిచ్చేది. ఇట్లా అన్ని సమయాల్లోను ప్రజావసరాలకు సన్నిహితంగా వుంటూవచ్చింది. ప్రజానీకం సజీవ సమస్యల నుండి తప్పుకొనకుండా ఆ సంప్రదాయాల్ని మున్ముందు కూడా కొనసాగించగలదని ఆశిస్తాము.

''వెంకటగిరి రైతుల పక్షాన వెలువడిన ఈ పత్రిక కేవలం నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి జమీన్‌దారీ సమస్యలనే కాక, యావదాంధ్ర దేశమున నున్న, జమీన్ రైతుల సమస్యలను రైత్వారీ, ఇనాంరైతుల సమస్యలను చర్చించి ఒక నూతన చైతన్యమును ప్రజలలో కల్గించుటకు, జమీన్‌రైతు మిగుల సహాయపడినది. రైతు ఉద్యమమును గూర్చి ముఖ్యముగా జమీను రైతు ఉద్యమమును గూర్చి చరిత్రవ్రాయువారు, జమీనురైతు పత్రిక చేసిన అద్వితీయసేవను అకుంఠిత నిరతిని శ్లాఘించక విడువజాలరు.

''1937 లో జరిగిన శాసనసభ ఎన్నికలలో నూతనమార్గమున ఎలక్షన్ ప్రచారమును సాగించి బహుళవ్యాప్తిని, విశేష ప్రాముఖ్యమునకు జమీన్ రైతు వచ్చెను. అంతవరకు కేవలము చిన్న సమస్యకొరకై మాండలిక పత్రికగా వుండిన జమీన్‌రైతు ఆంధ్రదేశ ప్రముఖ పత్రికలలో ఒకటై యితర జిల్లాలోను వ్యాప్తిగాంచెను. ఇతర జిల్లాలలోను తర్వాత పుట్టిన అనేక పత్రికలు జమీనురైతును అనుకరించి పరోక్ష స్తుతిని గావించినవి''•

## X

మరో ప్రధాన పత్రికను మర్చిపోవడం అన్యాయం. ఇలాంటి పత్రిక ఆంధ్ర

• ''జమీన్‌రైతు'' రజతోత్సవ సంచికలో శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి వ్యాసం.

దేశంలో మరెక్కడా లేదేమో. ఇదే నెల్లూరు నగరజ్యోతి, సింహపురి దీప్తి. లాఠీచాక్ గోడపత్రిక. ఇది నూటికి నూరుపాళ్లు ప్రజా సామాన్యపు పత్రిక-ఒక Mass newspaper! స్వరాజ్యోద్యమం ముమ్మరంగా వున్న రోజుల్లోనే ఇది ప్రారంభమైంది. 1932 ప్రాంతంలో కీ. శే. తూములూరు పద్మనాభయ్యగారు భిత్తిలేఖకుడుగా ఈపత్రికను ప్రారంభించారు. తిప్పరాజువారి గోడను స్వాధీన పరచుకొని, సిమెంటుబూసి చాక్‌పీస్ కోపులతో వార్తలు వ్రాసేవాడు. నిత్యమూ రెండువేలమందికి పైగా చదువు తారు. ఈ గోడ వ్రాతపత్రికను గురించి ఆరోజుల్లో Harijan, Times of India పత్రికలు ఎంతో శ్లాఘించాయి. తూములూరు పద్మనాభయ్యగారు ప్రథమ భిత్తి లేఖకులు అధికారులకు భయపడకుండా వారి అక్రమాలను ప్రకటిస్తుండేవారు. ముత్తరాజు గోపాలరావు, కురుగంటి రాఘవ రెడ్డి లేఖకులుగా కొన్నాళ్లు కొనసాగించారు.

ఇప్పటి సంపాదకవర్గం కూడా అద్వితీయమే, ఇంద్రగంటి సుబ్రహ్మణ్యం, గంధవరపు హనుమారెడ్డి (గ. హ.) నేటి భిత్తిలేఖకులు. చందాలేని పత్రిక, వర్షాల్లో తప్ప ఎప్పుడూ వుంటుంది. ఇదొక విచిత్రమైన ప్రయోగం.

కాచ వార్తికా!?

కో మోదతే కిమాశ్చర్యం కః పన్థాః
మాసర్తు దర్వీ పరిఘట్టనేన
భూతానికాలః పచతీతి వార్తా

(జయగ్రథంము)

[ఈవ్యాసం వ్రాయడానికి తోడ్పడిన వారు శ్రీ పాటూరు సుబ్బరామయ్య, జమీన్‌రైతు సంపాదకులు శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తి, మందాకిని సంపాదకులు శ్రీ మురువూరు కోదండరామరెడ్డి; వర్ధమాన సమాజ గ్రంథాలయోద్యోగి శ్రీ సుబ్బారావు పి. టి. ఐ. విలేఖరి శ్రీ కొండ్రా ఆదిశేషయ్య; వీరందరికీ నాకృతజ్ఞతలు.]

• 866 పేజీలో శ్రీ పాటూరు సుబ్బరామయ్య గురించి వ్రాసినది నారపరెడ్డి రామిరెడ్డిగారి ఉత్తరంలోనుంచి తీసుకొన్నది.

క॥ మాయందు లేనిగుణములు, మీయనురాగమునఁజేసి మిగిలి వెలింగెన్. అరణ్య. I-8

♦ ♦ ♦ ♦

సర్వజనకరుచికరంబైన సూహారంబు రోగాతురునకు నరుచికరంబైనయట్లు. అరణ్య: I-53

♦ ♦ ♦ ♦ ♦ ♦

గృహాంతంబైన సర్పంబునుంబోలె — అరణ్య I-2 8

అడుకులు దిప్పట్లగునే, గడుపున ప్పైత్రినవుమి — ద్రో VI-89

అ... ంపు ప్రయుక్తంబులైన సుభాషితంబులుంబోలె. — అరణ్య I-3

కొలసిగాని వెట్టనే తలగ్రోలకగానక. — అరణ్య. V-1

ఘంటాతాపవశం కరీంద్రపగణాః ప్రఖ్యాపితాభోగినః
గాయిష్యృంగ నివారకా నిగదితాః విస్తీర్ణకర్ణా గజాః
యశ్చాభ్యంతర సంభృతోష్మ వికృతిః ప్రోక్తః శమీసద్రుమః
లోకేనేతి నిరర్థకం ప్రలపతా సర్వం విపర్యాసితమ్ — రాజతరంగిణి III-134

తే॥ సంభవింపరిట్టిలు షోడశంబుదాక
నెల్లవాడును ఋతుశక్తి యెడలకుండ
నెట్టికార్యము గలిగిన ఋతుమతీస
మాగమము దప్ప నీకున్న హాయువెక్కు

అను IV-126

వెంగలి మాటలు విడిచి, — ఉ II-283

ఉ॥ ఒకతఱి సమస్త జగములు నొకడ జనార్దనుడు నిలిచి యొకటలయైనన్
సకలము ననాంతమాత్రం డొకరుడ నసారంబు చాల నష్టక్లిష్టమగున్

ఉ II-298

# 79. నెల్లూరుమండల నానుడులు

సంపాదన:
శ్రీ మరుపూరు కోదండరామిరెడ్డి.

అబ్బాస్ అలీకాలము.

చిరకాలమునాడు జరిగిన విషయమని భావము. 150 సంవత్సరములకు ముందు ఉదయగిరి నవాబులలో అబ్బాస్ అలీఖాను ప్రసిద్ధుడు.

---

శుభం పల్కవే సుబ్బక్కా, అంటే; ప్రోలు కొయ్యలను పొయ్యిలో పెట్టు అన్నది.

"ప్రోలు" వివాహకార్యకలాపమున జరుగు శుభప్రదమగు సన్నాహము.

---

అలాగు కరణం బ్రతికి యేడ్పించాడు,
చచ్చి యేడ్పించాడు.

అతడు పన్ను వసూళ్ళలోను, శివాయి జమ మొదలగు వాటిలోను కాపుల నేడ్పించి, యేడ్పించి, చివరకు ప్రభుత్వధనమును హరించి. గుక్క తిప్పుకొనలేక ఆత్మహత్య కావించుకొనెట. ఆత్మహత్య, హత్యగా భావింపబడి ఊరివారికి బెడద అయినదట.

---

ఉత్తరఁజూచి, యెత్తరగంప.

ఉత్తరకార్తె నెల్లూరు వ్యవసాయము నకు ముఖ్యమగు కాలము. ఈ కార్తెలో వానలుండిన విత్తనముల గంపనెత్తుకొని పల్లు టకుపొమ్ము. లేదేని బ్రతుకుతెరువునకు గంప నెత్తినపెట్టుకొని దేశాంతరమున కేగు మని యర్థము.

ఉరు అడుగు వదలినా, ఉలవ అడుగు,
వదలరాదు.

ఊరి అడుగున ఉన్న సాటి మట్టికంటెను ఉలవవేసిన చేనుకు ఎక్కువగా సత్తువ ఉండుననుట.

---

ఎన్నడెక్కనిరెడ్డి గుఱ్ఱమెక్కితే, వెనుక
ముందైందట.

అలవాటులేని పని కుపక్రమించిన తాఱుమాఱగుననుట.!

---

ఎంత వేగువలేచినా చింతగుంటకడ,
తెల్లవారినది.

పంటల అల్లూరి సేద్యము ఊరికి చాలదూరమువరకు వ్యాపించి యున్నది. ఊరికి ఉత్తరాన నాల్గుమైళ్ళ దూరమున 'చింతగుంట' అను మడుగున్నది. ఎంత పెందలకడ లేచినను పొలముచేరుట కాలస్య మగునని నానుడి.

---

'వీదాడు అంటే కోదాడు'

వీదాడు, కోదాడు. అనునవి ఆత్మకూరు పరిసరములలోనున్న రెండు గ్రామములు ఒకరు ఒకమాటచెప్పిన, మరొకరు మరోమాట చెప్పి వివాదమును పెంచుకొనుట విభిన్నత్వమును సూచించును.

ఏపూరురెడ్డీ! అంటే, ఏట్లో మోకాలిబంటి నీళ్ళు, అన్నాడట.

ఒక విషయమడిగిన, దానికి సంబంధింపని వేరొక విషయమును సమాధానము చెప్పుట. సంస్కృతమున "ఆమ్రాన్ పృష్టః కోవిదారా నాచష్టే" మామిడిచెట్లున్నదా యనిన, కోవిదార మున్నదని చెప్పినట్లని యర్థము. పృచ్ఛకుని ప్రశ్నకు వలయు సమాధానమిక అజిజ్ఞాసితమై అప్రస్తుతమైన వస్తువునుగురించి సమాధానము జెప్పిన పుడీ న్యాయమును పండితులు చెప్పుదురు. పెసలున్నవాయనిన మొదటి నవంబరు కందివంపున్నదని షాహుకారు సమాధానము చెప్పనట్లు.

---

ఏఱుముందా, ఏకాశిముందా?

ఏఱు అనగా పెన్న. ఏకాదశి అనగా ఆషాఢశుద్ధ ఏకాదశి. ఈ యేకాదశికి ముందుగా పెన్నకు నీరు వచ్చినచో, ఆ సంవత్సరము సుభిక్షముగ పండుననియు, లేకున్న కాటకమువచ్చుననియు రెడ్లనివలె రైతులు భావింతురు. ఇప్పటికిని సాధారణముగ నీ యేకాదశికి కొంచెము వెనుక ముందుగా ప్రవాహము వచ్చుటకలదు. ఈ యేకాదశినే తొలి యేకాదశి యందురు. దానితో పండుగలు ప్రారంభమగుటచే దానికాపేరు వచ్చియుండవచ్చును.

---

కలువాయివేదాంతము (మెట్టవేదాంతము.)

అర్థములేని తలతిక్క వేదాంత వచనాలు పలుకు నిరక్షరాస్యులైన గురు పరంపరను హేళనచేయు వాక్యము. కలువాయి శతకమని ఒక శతకముకూడ నున్నది. అందలి వేదాంతము కూడ కొంత వెఱ్ఱిగనే యున్నది.

పూర్వమొక పాంథుడు దప్పిగొని కలువాయిలో నొక యింటికేగి 'దాహ' మిమ్మని యడుగ, ఆయింటియిల్లాలు, దప్పి నీకా? శరీరము క్షణికముకదా ఆత్మ నిత్యముకదా దాహమెవ్వరికి? అని ఉపన్యసింప మొదలిడెనట. బాటసారి తత్వమెరిగి అట నుండు 'చెంబు' ను తీసికొని పోవుచుండ ఆమె పాత్ర తమదని అడ్డువచ్చినదట. అంతనాతడు, పాత్ర శరీరమునకు సంబంధించినదా, ఆత్మకు సంబంధించినదా? నీవు, పాత్ర, కన్పించు ప్రపంచము, నేను మిధ్యయేకదా! పాత్రను అడుగు వాడెవడు, ఇచ్చు వాడెవడు, అని చెప్పుచు వెడలిపోయెనట, చెంబుతో.

---

కరేడు రామాయణము.

'రెడ్డివచ్చె మొదలెత్తుకో' అన్నట్లుగా కరేడు గ్రామములో పురాణ కాలక్షేపమేనాటికిని సాంతము కాదని భావము. ప్రారంభింపబడి, ముగియని పనులపట్ల ఈ నానుడి వాడుదురు.

---

కండ్లేఱు ముందువస్తే కాటకం.

పెన్నకుముందు ఆషాఢమాసములో కండ్లేఱుకు (మనుబోలువద్ద) నీరువచ్చిన ఆసంవత్సరము కఱవు తప్పదని చెప్పుదురు. ఆషాఢములో ముందుగా వానకురిసిన, తరువాతవచ్చు తొలకరులు చెడునని అర్థము.

కార్తికంతో వానలుసరి, కర్ణునితో భారతంసరి.

నెల్లూరి మండలానికి కార్తికమాసము వర్షఋతువునకు పరమసీమ.

---

టెంకాయచెట్టు ఎందుకురా ఎక్కావు?

జవాబు:-దూడకు పచ్చిగడ్డికొరకు!

(ఇందు అప్రస్తుతములేదు) పచ్చిగడ్డి లేనిచోట, టెంకాయ చెట్టుయున్నది. దాని నెక్కి నలుదిక్కుల చూచిన పచ్చిగడ్డియుండు తావు కనుబడును.)

---

కొండూరు జంగాలు.

ఆగ్రామములోనున్న జంగమ కుటుంబములన్నియు అదను ప్రకారము సేద్యము చేసికొని, ఘంటా శంఖములతో తిరిపెము నకై యూళ్ళపై బడుదురని కొందరివ్యాఖ్య.

ఆయూరి జంగమువారందఱును సందె ప్రొద్దుకు తమ యిండ్లకు జేరుకొని, రాత్రులయందు కొండలు పిండిచేయునట్లు గొప్ప గొప్ప కార్యాలోచనలు చేయుదురు (గాలిమేడలు) కాని తెల్లవారకముందే యెవరి పాటికివారు ఘంటా శంఖములతో ఆయవారమునకేగుదురట. అనగా యోచనలేతప్ప చేతులు చేయువారు కారని మరికొందరివ్యాఖ్య.

---

చింతలుపూస్తే సిరులు, మామిళ్లుపూస్తే మరణాలు.

గ్రామీణులు భావిసూచనగా ఈ నానుడి చెప్పుదురు. చింతచెట్లు ఎక్కువగా పూచిన సంవత్సరము దేశము సుభిక్షముగా నుండుననియు, మామిళ్లు ఎక్కువగా పూచిన సంవత్సరము మరణము లెక్కువగా నుండు ననియు విశ్వాసము,

---

దేసూరుపొందు దయ్యపుపొందు.

దేసూరుశాఖరెడ్లు పూర్వము కొంత మొరటుగా నుండువారట. ఈ కుటుంబములు వాగర్తనే (సముద్రతీరము) వాసము చేయుచున్నవి.

'గాడిదగుడ్డు' అర్థ శూన్యమైన సంభాషణ. అని నానుడి. పూర్వము క్రైస్తవ మతప్రావకులు తమ భాషణ ప్రారంభమున ఆంగ్లమున GOD THE GOOD అని వేడుకొనుచుండిరి. ఇంగ్లీషురాని శ్రోతవిని, విమవిడుచుగగా, అతడు గాడిదగుడ్డు అనెనట!

---

నాయాల.

నాకు ఆలు (భార్య) అగుదునుట. చనువుతో అనగలిగిన ఈ తిట్టు నెల్లూరు మండలమున మాత్రమే వాడబడుచున్నది. 'దానమ్మనాయాలిటిది లేవద్యా' అని నిష్ఠురోక్తితోకూడ వాడుటకలదు.

---

నెలతక్కువఅయినా కాపుయింట్లోపుట్టు.

నవమాసములు నిండకముందే బిడ్డ పుట్టుట శారీరక లోపమైనను రెడ్డింటబుట్టిన దర్పముచే ఆలోటును పూర్తి చేసికొందురని యర్థము.

---

పెదవిదాటితే పెన్నదాటును.

నోటినుండి మాట వెలువడినంతనే లోకమున వ్యాపించుననుట ఇది వెనుక

ముందు లాలోచింపక అతి ప్రసంగము చేయువారికి హెచ్చరిక యగును. నోటి నుండి వెలువడినమాట రేడియోవలె వెంటనే వ్యాపించును గనుక జాగ్రత్తగా మాటలాడుట ఉచితమని భావము.

---

పెన్నదాటితే పెరుమాళ్లసేవ.

పెన్నను దాటగనే రంగనాథునిసేవ అబ్బుననుట సామాన్యార్థము. ఈ తల్పగిరి రంగనాధస్వామికి ఇన్నూరేండ్లకు ముందు 'పళ్లికొండు 'పెరుమాళ్ళు' (పవ్వళించిన దేవు(డు) అని పేరుండినది. పెన్నదాటినది మొదలు దక్షిణాపథమునకు విలక్షణరూపమైన దేవాలయ, గోపుర, ప్రాకారాది నిర్మాణము కాన్పించుచున్నది. చోళ, పాండ్య, పల్లవ, విజయనగర దేవాలయ వాస్తు శిల్పములు దక్షిణ దేశమునందంతటను వెలసియున్నవి. అట్టి స్థితి యీ పెరుమాళ్ళ సన్నిధి నుండియే ప్రారంభమగుచున్నది. అకాలమున కోవెల నదీద్వీపమున నుండెనేమో.

---

పెద్దకత్తి పెరుమాళ్ళు.

విశృంఖలాధికారము గల నాయకునకు పేరు. పెరుమాళ్ళు అనగా దేవుడు. ఆదేవుని కత్తికి అడ్డులేదనుట.

---

'పేరు పెన్నమోసింది.

ఒకప్పుడు చాలప్రసిద్ధులై, యశస్సు నార్జించి కాలక్రమమున తగ్గుదల పొందిన వారి ప్రశంసయందీ మాట నుపయోగింతురు. పేరు పెన్నమోసినదనగా ప్రస్తుత మక్కరేమియు లేదనిసూచన.

పొదలకూరు వినాయకుడు.

పొదలకూరులో నూరివెలువల మట్టితో చేయబడిన పెద్ద వినాయకుడుకలడు భూరి ఆకృతిని వర్ణించునపుడు ఈ మాట చెప్పుటకలదు. నలుగురు మిత్రులు పోయి ఆస్వామియొక్క లోతైన బొడ్డులో నొకరు వ్రేలుపెట్టగా తేలుకుట్టినదట. అతడు చేయి లాగుకొని, వ్రేలిని వాసనచూచినట్లు నటించి, 'అబ్బ! ఎంతమంచి వాసన' అని పలుకగా వరుసగా మరియిద్దరును అట్లే చేసిరట. నాల్గవవాడు తేలుకుట్టినదని గోలచేయగా తక్కిన మువ్వురును మాగతి అంతే అనిరట అనగా నొకరికి వచ్చిన దుష్ఫలితాన్ని అందరకు ననుభవింపజేయు యత్నమునకు 'పొదలకూరి వినాయకుని బొడ్లోవ్రేలుపెట్టినట్లందురు.

---

పుంజులూరిపాటి వెధవ.

చిత్తూరువారు 'పుంగనూరు' అన్నట్లు అనగా పిచ్చిచేతలు చేయువాడనియు, అప్రయోజకుడనియు, భావము.

---

ప్రభగిరిపట్నం తాటిచెట్టు.

ఆ గ్రామ పొలములు ఇసుకతెరనేల యగుటచే తాళవృక్షములు చాల పొడవుగ పెరుగును. పొడవరియగు మనిషిని ఈ పేరున వ్యవహరించుట పరిపాటిగానున్నది.

---

జుబ్బా వెంగళరెడ్డి దానం.

వెంగళరెడ్డి పొట్టిగానుండి మహాదాతయై కోయలకుంట్ల తాలూకాలో వెలసినాడు దానములతోనే వారి కుంబము చితికిపోయి

నది, నిన్న నేడు కాస్త రెక్కొంటున్నది.

---

బొంగోడు.

వెదురు బొంగువలె పొడవైన మనిషిని 'బొంగోడు' అని వ్యవహరింతురు.

---

రామునికి సీత ఏమగును? ఇది పరధ్యానముతో రామాయణకథ విన్నవాని పిచ్చిప్రశ్నయని నానుడి.

బౌద్ధుల, జైనుల రామాయణకథలలో సీత రామలక్ష్మణుల సోదరియని వ్రాసియున్నది. వీటిని పురాణముగా చెప్ప, విని శ్రోత, వాల్మీకీయమును విని, పైవింత ప్రశ్నను వేసెను.

---

బ్రతికి కమ్మపొరుగున, చెడి కాపు పొరుగున చేర వలెను.

కాపులు నెల్లూరు జిల్లాలోని రెడ్లకన్వయించును.

---

మఖ తిమిరితే మడిమీది దరగూడ కాయును.

తిమురుట యనగా ఉఱుమకయే మెఱయుట యని అర్థము. నెల్లూరు మండలమున మఖకార్తెలో సేద్యపుటదను ప్రారంభమగును. అనగా మనజిల్లాలో వ్యవసాయము జూలైనెలలో ప్రారంభమై జనవరితో నంత్యమగును. గోదావరి అదను మేనెల. కృష్ణ అదను జూన్ నెల. అక్టోబరు, నవంబరు, డిసంబరు నెలలు మాత్రమే నెల్లూరున వాన కాలము. దీని కనువైన పైరే మొలగొలుకు. చెఱువులలో మిగిలిన నీటితో వఱడుగనెలలో కాపుపైరులు పెట్టుదురు.

మాటల సందట మనుబోలువారు పిడూరు చేరుట.

ప్రయాణము చేయుచు మాటలలో గమ్యస్థానమును వీడి, వేరొక్కచోటి కేగుట. తెల్పును. అంత సమీపములో నున్నవట.

---

ముఖాన మజ్జిగ పులుసు.

'నీముఖాన మజ్జిగ పులుసు కొట్ట' అనునది సామాన్యముగా స్త్రీలు ఉపయోగింతురు. ఒరీ! అప్రయోజకుడా! అని యర్థము.

---

మోపూరి జంఘాలు.

శ్రీమంతులైన ఆయూరి రెడ్లు అందరకంటె నెక్కువైన వారుగా భావించి, యితరుల నవహేళన చేయుదురు.

---

మోపూరి చక్కెర.

సర్వీరమను విషము చక్కెరవలె నుండును. అర్ధశతాబ్దమునకు ముందు మోపూరు రెడ్డిగారొకరు ఆస్తికొఱకు చిన్న ఆడబిడ్డకు చక్కెర తినుమని దీనిని పెట్టి ప్రాణములను హరించెనట.

---

రామాయపట్నం మధ్యస్థము.

'చెడిన సొమ్ము చెరిసగ' మన్నట్లు ఒకరి సొత్తును అన్యాయముగా మరియొకరు గుంజుకొనగా వివాద మేర్పడు నపుడు సాధారణముగా రామాయపట్నం (కందుకూరు తాలూకా) వారు 'ఎవరికైననేమి చెరిసగము చేసి తీసికొని సర్దుకోండు' అని తీర్పు చెప్పుదురట.

---

రావూరి రసికుఁడు

ఇందుకూరుపేటకు ఉత్తరముననున్న గ్రామమౌటచే పురుషులు చమత్కార వాక్య దక్షులని వెల్లూరి నెఱజాణలకు సరియుద్దిగా నిలువగలిగిన వారని ప్రతీతి నెఱజాణ యొకతె ఆయూరి రసికునకు వ్యంగార్థముతో లేఖవ్రాయగా, వాతడా లేఖార్థమును గ్రహించి, ఆవస్తువులను గొనిపోయెనట అది పెద్దది, మచ్చుకొక వాక్యము

దోవతలనెలలో (మార్గశిరమాసము భాగ్యవంతుని పెళ్లాన్ని (ధనియాలు) చెప్పు తోగొట్టి (బ్రద్దలు చేసినగాని మొలవవు) తీసికొని రావలసినది నపుంసకుని (నెమలి యొక్క పింఛములపై యీకలు పెరుకుకొని రావలసినది నెమలి నపుంసకమని ప్రతీతి వర్షఋతువులో మెఱుపులకు, ఉరుములకు, మగనెమలి కంటి కొలికిలో రేతస్సు విడ్వడగా ఆడ నెమలి దానిని పొడుచుకొనితిని, గ్రుడ్లు పెట్టునని ప్రతీతి ) రావూరి పెద్దమనిషి ధనియాలను, నెమలి యీకలను కొని పోయెనట.

---

సాగినమ్మ సంగంపోతే, బీడుమాలినమ్మ-
బిట్రగుంటకు పోయిందట

ఎవరికి తోచిన పనివారు చేయుట అని యర్థము

---

సిద్దారెడ్డి కూడుదిని, పెద్దారెడ్డి పశువులు-
కాచినట్లు.

ఒకరి పోషణను పొందుచు, మరియొకరికి సేవచేయుటను తెల్పును.

---

సుబ్బారాయుడు. బుడగారాయుడి కొలువు.

ఒకరు ఒకటి చెప్పగా మరొకరు మరియొకటి చేయుమని సేవకుల కాజ్ఞాపించి, కార్యమును చెడగొట్టుకొనుట ఈ సుబ్బారాయుడుగారే యిందుకూరు పేటలో మైకా ప్రిన్సు అని పేరొందినవారు. వారి తమ్ముడు బుడగారాయుడు వ్యవహారమంతయు వారే చూచుకొనుచుండి, పెద్దాయన ఔదార్యమును తికమక చేయుచుండెను

---

సైదాపురం రాచిప్ప

మొద్దు అని అర్థము సైదాపురప్రాంతము గనులకు ప్రసిద్ధి గనులలో మైకా సరుకున్న కొండనానుకొని 'దంపుడు అను మైకా పొట్టుతోఁగలసిన మెత్తటి బాతిదార సాగిపోవుచుండును ఆ శాతిని మలచి చిన్నని రాచిప్పలు చేయుదురు సామాన్యముగా బ్రాహ్మణ కుటుంబములు వానిని ప్రీతితో నుపయోగింతురు.

---

వడ్లగింజలో బియ్యపుగింజ.

వేదాంత రహస్యమిదియే. జీవి ఉపాధిని (పైనకప్పబడిన పొట్టును అనగా శరీర ధారణను వదలి) బ్రహ్మమును చేరును బాహాటమైన రహస్యమే, కాని సాధన కందరాని తత్త్వార్థము

---

# 80 A.

## మండలములోని వృత్తులు, పరిశ్రమలు

చలంచ్యాల వేంకటసుబ్రహ్మణ్యశర్మ,
బి. యస్., బి. ఇడి.,

మన జిల్లాయందు వ్యవసాయము, పశువుల పెంపకము ముఖ్యవృత్తులు. మాగాణిభూములుగల ప్రాంతములగు నెల్లూరు, కోవూరు, ఆత్మకూరు, తాలూకాల యందు వ్యవసాయము మాత్రమే ముఖ్యవృత్తిగా నున్నది. గూడూరు కావలి తాలూకాలయందలి కొన్ని ప్రాంతములందుగూడ వ్యవసాయము ముఖ్యవృత్తిగా నున్నది. మెట్టప్రాంతముల యందు నివసించువారు తమ భూములపై మాత్రమే ఆధారపడియుండజాలరు, వారితర వృత్తుల నవలంబించి జీవనమును గడుపుకొనుచుందురు. కనిగిరి, కందుకూరు తాలూకాలయందు ప్రత్తి బాగాపండుటవలన ఈ ప్రాంతములందలి ప్రజలు రాట్నముపై నూలుతీసి, ముతక బట్టలను నేసి, విక్రయించెదరు. కందుకూరు దుప్పట్లు ఇప్పటికిని మన జిల్లాయందు ప్రసిద్ధికెక్కియున్నవి. కోవూరు, బుచ్చిరెడ్డిపాలెము, వెంకటగిరి గ్రామములో సన్నని, నాజూకు వస్త్రములను నేయుదురు. వెంకటగిరి జరీబట్టలను నేయుటయందును, ఎల్లాయపాళెము మామిడంచు పంచెలను నేయుటయందును పేరుగాంచినవి. వెంకటగిరి, కందుకూరులయందు వివిధరంగులలో ముతకవి, నాజూకువి అయిన చీరలు నేయబడుచున్నవి. పొదిలి, దర్శి తాలూకాలలో గూడ కొన్ని కుటుంబములవారు ఈవృత్తిపైననే ఆధారపడియున్నారు. ఈనూలు బట్టల నేతపనిని కులవృత్తిగాగల వారిలో పద్మసాలీలు, దేవాంగులు, కర్ణసాలీలు, ఆది ఆంధ్రులు ముఖ్యులనవచ్చును. మన జిల్లా యందెచ్చటను సిల్కు నేయువారు లేరు. నెల్లూరు నందలి స్టోన్‌హౌస్‌పేట యందు కృత్రిమపట్టుతో కొద్దిగా నేతపనిని జరుపు కుటుంబములు కొన్నిగలవు. బుచ్చిరెడ్డిపాలెము, వెంకటగిరి, ఎల్లాయపాలెములలో నేయబడు వస్త్రములు సన్నముగను నాజూకుగ నుండుటవలన, మనజిల్లా యందేగాక, ఇతర జిల్లాలయందుగూడ వాటికి అమ్మకము గలదు. మహమ్మదీయులు లుంగీలుగా నుపయోగించు గళ్ళవస్త్రములు మన జిల్లాయందెక్కువగా తయారు కాబడి, యితర దేశములకు గూడ ఎగుమతిచేయబడుచున్నవి. సూళూరుపేట యందు గళ్ళ చేతి గుడ్డలు ఆఫ్రికా, బర్మా, జపాన్, ఇంగ్లండు, దేశములకు ఎగుమతి అగుచుండినవి. కందుకూరు తాలూకాలో కొందరు ఆది ఆంధ్రులు గుడారములకు కావలసిన మందమయిన గుడ్డలను నేయుచున్నారు. మొత్తము మీద పరిశీలించిన మన జిల్లాయందలి అనేక తెగలవారికి నేతపని కులవృత్తిగా కనుపించుచున్నది. చిన్న అగ్గిపెట్టెయందు ఇమడ్చగల ఎనిమిది గజముల చీరను నేయగల వారు మనజిల్లా యందుండినటుల తెలియు

చున్నది. మిల్లు బట్టలపైగల మోజుచే ఈనే తపనివారు గూడ ప్రస్తుతము కరువైరి.

మన జిల్లాయందలి వేరొకవృత్తి బట్టలఅద్దకము. ఈ జిల్లా పాలచెంగాపి అద్దకమునకు పేరొందినది. నెల్లూరు సూళ్ళూరుపేట యందు అద్దకము ఎక్కువగా జరుగుచున్నది. కోవూరు, గండవరము, బుచ్చిరెడ్డిపాలెము, కోడూరు, కందుకూరు, సూళూరుపేట, నాయుడుపేట గూడూరు, కావలి తాలూకాలలో గూడ కొన్ని బలిజ కుటుంబములలోని వారును, మహమ్మదీయులును యిప్పటికిని అద్దకమునే వృత్తిగా కలిగియున్నారు. నెల్లూరు కాపువీధియందును ఈ వృత్తిపనిని చూడవచ్చును.

నెల్లూరు ఇందుకూరుపేట తాలూకాల యందలి ముత్తరాచకుటుంబములవారు శ్రీహరికోటయందు పేముతో కుర్చీలు, బుట్టలు, తట్టలు మొదలయినవి అల్లుట వృత్తిగా కలిగియున్నారు.

నెల్లూరు నందలి వన్నెకాపులు అగ్నికుల క్షత్రియులు ఇత్తడి రాగి పాత్రలను చేయుట వృత్తిగా కలిగియున్నారు. వారికి అవసరమయిన లోహపు రేకులను మదరాసునుండి తెప్పించుకొనుచున్నారు. కనిగిరి తాలూకా యందలి కొన్ని మహమ్మదీయకుటుంబములవారు ఇనుముతో కత్తులను, కత్తెరలను, గొడ్డలను, లాడాలను, వ్యవసాయమున కవసరమయిన పారలు, గడ్డపలుగులు మొదలగు సాధనములను తయారు చేసి స్థానికముగా జిల్లాయందు మాత్రమే అమ్ముకొని జీవయాత్ర సాగించుకొను చున్నారు.

ఈజిల్లాయందలి అనేక మేదర కుటుంబములు వెదురుపనిని వృత్తిగా కల్గియున్నవి. వెదురు బద్దలతో తడికెలు, జల్లెళ్ళు, చేటలు, బుట్టలు మొదలయిన వాటిని అల్లి, జీవించుచున్నారు వీరికి కావలసిన వెదురు చంద్రగిరినుండియు, కడప కర్నూలు జిల్లాలయందలి నల్లమలై కొండలనుండియు లభించుచున్నది.

కావలి, కోవూరు, నెల్లూరు తాలూకాలయందు సముద్రప్రాంత గ్రామములలో నివసించు గవుండ్ల, యానాది కుటుంబములవారు తాటియాకు బుట్టలనల్లి జీవించుచున్నారు. చేపలు, ఉప్పు మొదలగువాటిని ఒక స్థలమునుండి వేరొక స్థలమునకు తీసికొనుపోవుటకు యీబుట్టలెక్కువగా నుపయోగపడుచున్నవి. ఎరుకలవారు ఈతపుల్లలతో వివిధములయిన బుట్టలు ఆకుతో చాపలు అల్లుట వృత్తిగా గలిగియున్నారు. గవుండ్ల వారిలో కొందరు తాటిచెట్లనుండి కల్లుగీచి నీరాను, తాటిబెల్లమును తయారు చేయుటలో పేరుగాంచి యున్నారు.

బుచ్చిరెడ్డిపాలెము, కోవూరు, పొట్టేపాలెము, సీతారామపురము, నాగులవరము ముళ్ళపాడు, దుక్కల మడుగు ప్రాంతముల యందు తుంగ ఎక్కువగా పెరుగుచున్నది. ఈ తుంగతో చాపలల్లుట పిచిగంట తెగవారికి కులవృత్తిగా నున్నది. ఈ తెగవారె ఎక్కువగా బుచ్చిరెడ్డిపాలెము, ఉప్పలపాడు గ్రామముల యందున్నారు కావలి, నెల్లూరు తాలూకాలలో కొన్ని ప్రాంతముల జమ్ము పెరుగుచున్నది. దీనితో కొన్ని గవుండ్ల ఆది ఆంధ్ర కుటుంబములవారు చాపలల్లుకొని జీవించుచున్నారు. ఈ జమ్ముతో

వర్షమునందు గొడుగునకు బదులుగా ఉప యోగించుటకు వీలగు 'గూడ' అల్లబడుచున్నది. వీరినెక్కువగా వ్యవసాయము చేయునట్టి వారుపయోగింతురు. ఆత్మకూరు, పొదిలి, దర్శి, కందుకూరు తాలూకాలలో కొన్ని గ్రామములయందు గోగునారతోను, టెంకాయ పీచుతోను త్రాళ్ళను, నులకను, పేని జీవించు కుటుంబములవారు మట్టి, ముంతమామిడి, మోదుగ ఆకులతో విస్తళ్ళను కుట్టి, అమ్ముకొని జీవించుచున్నారు.

నెల్లూరు, ఉదయగిరి పట్టణములలో కొంతమంది గాజులబలిజె, మహమ్మదీయుల కుటుంబములవారు లక్కతో వివిధరంగులతో గాజులను తయారుచేసి స్థానికముగా అమ్ముకొని జీవితమునడుపు కొనుచున్నారు. కాని ప్రస్తుతము లభించు వివిధరకముల ప్లాస్టిక్ గ్లాస్ గాజులముందు ఈ లక్కగాజులు నాణ్యత తగ్గినందున ఈ వృత్తి సన్నగిల్లుచున్నది. రాపూరుతాలూకా సైదాపురము నందు కొంతమంది బలిజె, కంసాలి, మహమ్మదీయ కుటుంబములవారు ఆప్రాంతమునందే భూమియందు లభించునట్టి జాతితో వివిధరకములయిన పాత్రలను, ఆటవస్తువులను చేసి అమ్ముకొని జీవించుచున్నారు. కనిగిరి, పొదిలి తాలూకాల యందలి కొన్ని ముత్తరాచ కుటుంబముల వారు అచ్చట లభించు జాళ్ళతో బోళ్ళను, దబ్బుడు పత్రములను, వచ్చిపి బండలను తయారుచేసి, వాని అమ్మకముతో - జీవనము జరుపు కొనుచున్నారు. ఉదయగిరి తాలూకా యందు కొన్ని మహమ్మదీయ కుటుంబముల వారు కొయ్యపనిని వృత్తిగా గల్గియున్నారు. ఇచ్చట ఎక్కువగా పాలకోళ్ళు, మడత కుర్చీలు, కొయ్యగిన్నెలు తయారు చేయబడు చున్నవి. ఇచ్చట అనేక మంది కమ్మరివారు మట్టిలో వివిధ రకములయిన కూజాలను తయారుచేసి వివిధ ప్రాంతముల కెగుమతి చేయుచున్నారు. నెల్లూరు తాలూకా కృష్ణాపట్టణము, కోవూరు తాలూకా ఇసుకపల్లి గ్రామములయందు అనేక కుటుంబముల వారు ఉప్పును తయారుచేయుట వృత్తిగా గలిగి యున్నారు. తుమ్మలపెంట, రామాయపట్టణము, దాకిచెర్ల మొదలగు సముద్ర ప్రాంతపు గ్రామముల యందుండు పట్టపు వారు చేపలబట్టి వానిని ఇతర ప్రాంతములకు ఎగుమతిచేసి జీవించుచున్నారు. కొంతమంది బలిజవారు, యానాదివారు ఇటుకలను తయారుచేయుట, గవ్వసున్నము, కట్టె సున్నము, మొదలగునవి తయారుచేయుట వృత్తిగా గలిగియున్నారు. కావలి మునునూరు గ్రామము లందలి వడ్డెవారు భూమి నుండి బొంతరాయిని తీయుట ముఖ్యవృత్తిగా కలిగి యున్నారు.

మన జిల్లాయందు వృత్తులే ప్రాధాన్యముగా గలవారు పెక్కుమందిగలరు. కాని వారివృత్తులకు సరి అయిన పోషణ లేక నశించుపోవుచుండుట వలన, ఆవృత్తులపై ఆధారపడి యుండువారికి జీవనోపాధి కష్టతరమగు చున్నది. పరిశ్రమలలో మన జిల్లా వెనుకబడియుండుట వలన కార్మికులుగా పనిచేయుటకు గూడ ప్రజలకు తగు అవకాశము కలుగుట లేదు. మన జిల్లాయందు చెప్పుకోదగ్గ పెద్ద పరిశ్రమ- మైకా పరిశ్రమ. గూడూరు. రాపూరు,ఆత్మకూరు, కావలి తాలూకాలయందు మైకా గనులు

గలవు. కలిచేడునందు ఎక్కువగా గనులు గలవు. కలిచేడునందు గల గని చాల ప్రసిద్ధికెక్కినది. ఈపరిశ్రమ వలన మన మండల ప్రశస్తి ఇతర దేశములకుగూడ ప్రాకినది. దీనినిగూర్చి వేరు వ్యాసమున్నది.

ధాన్యమును మరబట్టి బియ్యమును తయారుచేయుట గూడ మన జిల్లాయందలి పెద్దపరిశ్రమ. ఇచ్చట మరపెట్టబడిన బియ్యము ఇతర రాష్ట్రముల కెగుమతి అగుచున్నవి.

గూడూరునందు పింగాణి గాజుపరిశ్రమ దినదినాభివృద్ధి నొందుచున్నది. ఎనామిల్ సామానులు, శాస్త్రపరికరములు గూడ ఇచ్చట తయారుచేయుటకు అవసరమయిన ఏర్పాట్లు జరుగుచున్నవి. ఇప్పటి ప్రస్తుతము తయారయిన పింగాణీ, గాజు వస్తువులు ఇతర ప్రాంతముల కెగుమతి అగుచున్నవి.

నెల్లూరు నందు అగ్గిపుల్లల పరిశ్రమ అట్టల పరిశ్రమ నెలకొల్పబడి యున్నవి. నెల్లూరు, కావలి పట్టణములయందు స్టెయిన్ లెస్ స్టీలు ఫ్యాక్టరీలు కలవు. ఇచ్చట వివిధ రకములయిన స్టెయిన్ లెస్ స్టీలు సామానులు తయారు కాబడి చవుకగా ప్రజలకు లభించుచున్నవి. కావలియందు నెలకొల్పబడిన 'విజయ, రేడియోల ఫ్యాక్టరీ ప్రస్తుతము నెల్లూరునకు తరలింప బడినది. నెల్లూరులో కూడ పెక్కురు రేడియోలను తయారుచేయుచున్నారు. కొద్దికాలములోనే మన జిల్లాయందు తయారు చేయబడిన రేడియోలు దేశవ్యాప్తముగా పేరు పొందగలవు. ఇదిగాక తోళ్ళ పరిశ్రమ గూడ ఈ జిల్లాయందిప్పుడే అభివృద్ధి నొందుచున్నది. వివిధ రకములయిన పాదరక్షలు, సూటు కేసులు, బెల్టులు. మనీపర్సులు తయారు చేయబడి ఎగుమతి కాబడుచున్నవి. వంటచెఱకు ఇతర ప్రాంతములకు ఎగుమతి చేయబడుటగూడ మన జిల్లాయందలి పెద్ద పరిశ్రమ అనియేచెప్పవచ్చును. వీనికితోడు అనేక కుటీర పరిశ్రమలుగూడ ప్రతి తాలూకాయందును గలవు. మూడవ పంచవర్ష ప్రణాళిక అంత్యమునకు మనజిల్లా పరిశ్రమలలో కొంతవఱకు ముందంజవేయగలదని ఆశింపవచ్చును.

క॥ సురనికరానంతకరా, సురారికాంతవిలాస శోభాపహరా
కరుణాసక్తమనస్కా సరిద్వరా బర్హిబర్హచారుశిరస్కా.

ఎట్టివారలకైన నెఱుఁగంగ నగునె కార్యంబుల గతుల. సాక్షి. II-13

ఇలధి వెడలి సన్నవుఁగ్రయ్య; మునిఁగి రూపడంగు జనుల మాడ్కి. సాక్షి. II-17

కొంగున నగ్నిఁదాచినట్టు. స్త్రీ II. 178

౮౦ B.

# మండల. శిల్పవిద్య

నవులూరు రాఘవయ్య పంతులు
కావలి.

ఇతర కళలతో బాటు శిల్పవిద్య నెల్లూరు మండలమున ననాదినుండియు నభివృద్ధి గాంచుచుండినది. ఈనాడు కావలిలో నాల్గు శిల్ప కుటుంబములు గలవు. వీరు ఆర్యక్షత్రియులు. వీరినే జీనిగల వారనియు నందురు. వీరి పూర్వులు మొదట కందుకూరి రెడ్డిరాజులయాస్థానమున నుండి యారాజ్య పతనానంతరము అతాలూకా లోని, లింగసముద్రము, వరగంటుపాడు గ్రామములందు నివాస మేర్పఱచుకొని తమ శిల్పమే తమ కులవృత్తిగా జీవించుచు నావిద్య యందద్భుత శక్తి సామర్థ్యములు సంపాదించిరి.

వరగంటుపాటినుండి డెబ్బది సంవత్సరములకు బూర్వము. వెల్లాల కోదండ రామయ్య నెల్లూరుజేరెను. ఆకాలమున యావదాంధ్ర దేశమునేగాక దక్షిణదేశమునను వారి కీర్తికాంతులు వ్యాపించెను. ఇతడు శిల్పము నందేగాక, కవితా శిల్పమునందును బ్రవీణుడట. వరగంటుపాటి నుండి వెల్లాల కోదండరామయ్యగారి తమ్ముడు ఉదయగిరి తాలూకా పొట్టవల్లెకు బోయెను. ఇతడును దద్విద్యయందె గొప్ప యశము నార్జించెను.

ఆదిశేషయ్య కుమారుడు వెల్లాల వెంకయ్యవర్మ షుమారు ముప్పది సంవత్సరములక్రింద గావలికిజేరి యపటినుండి బెజవాడకుబోయి కనక మర్గాలయమున నొక శిల్ప కర్మాగారము నడుపుచున్నాడు. సర్వ దేవతా విగ్రహాది శిల్పవిద్యయందు మన యాంధ్రదేశమున నేడాచార్యస్థానము వీరిదే.

శ్రీ వెల్లాల వెంకయ్యవర్మగారి మేనల్లుడగు ఆనందిగము పురుషోత్తమవర్మ, పాండురంగవర్మ మున్నగువారు గలసి కావలిలో నొక శిల్పకర్మాగారము నడుపుచున్నారు. వీరు శిల దారు, లోహములతో సకల విధములగు దేవతా విగ్రహములను, వాహనములను శాస్త్రోక్తముగా నిర్మింతురు. వీరు శివ, విష్ణు, నృసింహ, రామ, కృష్ణ, విఘ్నేశ్వరాది సమస్త దేవతాది విగ్రహములనే గాక, నంది, భృంగి, గజ, గరుడ, శేష, హనుమదాది సమస్త వాహనముల నద్భుతముగా జేయుదురు. కొయ్యతో నిర్మించినవి రంగుల నతిరమణీయముగా వేయుదురు. ఇదిగాక దేవతా విగ్రహములకు సర్వాభరణములు, కవచములు, మకర తోరణములు, మున్నగు వస్తువుల నన్నింటిని జేయుదురు.

పైనజెప్పిన పురుషోత్తమగారి కర్మాగారమునకు బ్రక్కననే మఱియొక శిల్ప కుటుంబము కలదు. వీరు విశ్వబ్రాహ్మణులు. వీరి స్వగ్రామము కనిగిరి తాలూకా మోపాడు. వీరిపేరు ముక్కమూరి కోటయ్య

వీరును వీరి కుమారులును చక్కని శిల్పులు. పైన జెప్పిన సమస్తవిధ దేవతా విగ్రహ వాహనాదుల నన్నింటిని వీరతి నిపుణముగాఁ దయారుచేయుదురు.

ఆంధ్ర దేశమున వివిధ ప్రాంతముల వారెల్లప్పుడు నీరెండుతావులలో వివిధములగు విగ్రహ వాహనాదులఁ జేయించుకొని గొంపోవుచుందురు.

# 80 c.

# నావికా నిర్మాణములు

Ship : Liner.

పంచనావాం శతాని అను సమానిన్యుః,సమంతతః॥
ఆన్యాః స్వస్తిక విజ్ఞేయా, మహాఘంటా వరాః
శోభమానాః పతాకాభిర్యుక్తవాతాః సుసంహతాః
తతః స్వస్తిక విజ్ఞేయాం పాండుకంబళ సంవృతాం
సనందిఘోషాం కళ్యాణీం, గుహోనావ ముపాహరతు

II—89-8, ౧౦ వాల్మీకి రామాయణము.

అయోధ్యా రాజ్యాధికారము పొందతగిన భరతుని, పరివారమును, గంగాతరణ మొనరించుటకు 500 ఓడలను గుహుడు తెప్పించి యానమునకు సిద్ధము చేసెను ఇది వాల్మీకీయ వర్ణనము. ఈ నౌకానిర్మాణ మప్పటినుండి మన భారత దేశమున అనుభవమున నున్న నౌకాకళ.

మన మండలములో శ్రీహరికోట సముద్రతీరమున నావికల నిర్మించు వ్యాపారమున్నది. అచ్చటి అటవీ దారువుల సంధానముచేసి, నావికల నిర్మించి, కట్టె, కలప, గుల్లలు, రవాణా చేయుటకు ఉపయోగించుచున్నారు.

ఒకప్పుడీ తీరమునుండి సముద్రవ్యాపారము విరివిగా జరుగుచుండెడిది.

# ౮1.

# నెల్లూరు వ్యాయామ క్రీడలు

శ్రీ వేగూరు వెంకటప్పయ్య, B. A, B. Ed.,

నెల్లూరు నగరము చాలా కాలము నుండి వ్యాయామక్రీడలకు ప్రోత్సాహమును గడించి బాడ్మింటను Football ఆటలకు అత్యధిక ఉన్నతస్థాయిని అలంకరించినది.

1920 ప్రాంతములలో డాక్టరు యస్. రఘునాధసింగుగారు ఎంతయో మూల్యమును వెచ్చించి C R. దాస్ మెమోరియలు టూర్నమెంటును కొన్ని సంవత్సరములు జరిపెను. వీటిలో ఆంధ్ర రాష్ట్రమండలి పేర్గాంచిన జట్లు పాల్గొనెను. అమిత జనాదరణ ఆకర్షణలను పొందెను.

తరువాత నెల్లూరు కలీగ్స్ అసోసియేషను వారు ఫుటుబాలు టోర్నమెంట్సు జరుపగా, విశాఖపట్టణము, కాకినాడ, రాజమహేంద్రవరము, మద్రాసు, బెంగళూరు, కోలారు జట్లు పాల్గొనగా జయప్రదముగా సాగించిరి. వీరు నెలకొల్పిన 4 అడుగుల ఎత్తుగల కప్పును మరల నెల్లూరులో అధికారకేళ్యా టూర్నమెంటును కొనసాగతలపెట్టుట ముదావహము.

బాడ్మింటను :

మన పూరి అనేక ఖ్యాతిగడించిన ఆటగాండ్రను కలిగియుండెను. గౌసు, సాలెసోదరులు, గట్టువల్లి సుబ్రహ్మణ్యంగారు. డి. సుబ్రహ్మణ్యంగారు, పోలీసు ఆఫీసు రత్నంగారు, యం. యస్. రాఘవను, యస్. నరసింహయ్యగారు, గారలు పూర్వము ఆటగాళ్లలో ముఖ్యులు.

ఫుటుబాలు :

నెల్లూరు నగరము ఫుటుబాలు ఆటలలో అఖండమైన కీర్తి గాంచినది. ముఖ్యముగా ఎక్కువ ప్రసిద్ధిగాంచిన Rising Star Club యీ ఆటయందు నెల్లూరునకు



వ్యాసకర్త.

దక్షిణప్రాంతములలో మద్రాసు నగరములో మంచిపేరును జనరంజకత్వమును పొందినది. దీని అధ్యక్షులు యిప్పటి Public Works మంత్రిగారైన శ్రీ పి. సి. సుబ్బారెడ్డిగారు, కార్యదర్శులు శ్రీ వేగూరు వెంకటప్పయ్యగారు స్వర్గీయ డి. విజయంగారల ఆధ్వర్యమున Rising Star Club వారు మద్రాసు, కోయంబత్తూరు, మధుర, తిరుచినాపల్లి, బెంగుళూరు, మైసూరు, ఆలెప్పి నగరములలో జరిగిన Tornments లో పాల్గొనిరి. మద్రాసు, తిరుచినాపల్లి, కోయంబత్తూరులకు అనేకమార్లు ఆహ్వానములనుపొంది పాల్గొనుట సంభవించెను. మొదటిసారి మద్రాసులోని యం. యస్. సి. టోర్నమెంటులో లో పాల్గొనినపుడు Finals లో వచ్చి యప్ప టీముతో ఓడెను. కాని రెండవసారి పాల్గొనినప్పుడు యం. యస్. సి. టూర్నమెంటులో గెలుపొంది Hussian Cup గెలుచుటయేగాక ఆ సంవత్సరమే యస్. ఐ. ఎ. ఎ. లో జరిగిన జటుప్రోలు కప్పును గెలువగల్గినను మద్రాసులో జరుగు ముఖ్య టూర్నమెంటులలో ఒకసంవత్సరము రెండు కప్పులను సాధించినవారిలో మొదటివారను ఖ్యాతిని R. S. Club గాంచినది. యీ టీములలో పాల్గొనిన ఆటగాళ్లలో ఖ్యాతి గాంచిన వారు శ్రీయుతులు తొహరుల్లా Captain, పి. యర్. దామోదరం, M. L. పాల్‌నార్లు పలుమార్లు మద్రాసు Foot Ball Association వారిచే ఆహ్వానింపబడి State Teams లో ప్రాతినిధ్యము వహించిరి. గులాబుసింగు కూడా బాలాఖ్యాతి పొందిన ఆటగాడు యీటీమువారే.

ఇప్పుడు రేబాల విజయకుమారరెడ్డి, డి. శంకరయ్యగారల నాయకత్వమున Young Rising Star Club అను పేర Football, Volley Ball, Basket Ball ఆటలలో నెల్లూరు కీర్తిని ప్రజ్వరింప చేయుచున్నారు. విజయకుమార రెడ్డి యువ ఆల్‌రౌండరు, ఫుట్‌బాలు, వాలిబాలు, బాస్కెటుబాలు, బాడ్మింటనులలో అధిక ప్రతిభకలిగియున్నాడు. బాస్కెటుబాలు ఆటలో ఆంధ్రరాష్ట్ర జట్టులో నొకరుగ ఎన్నికై హైదరాబాదులో జాలుర పోటీలో గౌరవము అతనికి దక్కినది.

నెల్లూరు వ్యాయామ క్రీడారంగ ప్రస్తావనలో యిరువురిని గురించి ఎరుక పరచక పోయిన సమగ్రతను పొందదు. వారెవరనగా కీర్తిశేషులు డి. విజయంగారు, రక్తదాత యస్. వి. నరశింహరావుగారులు.

కీ. శే. డి. విజయంగారు. ఫుటుబాలు ఆటలో ఆంధ్రరాష్ట్ర ఫుటుబాలు ఆటలలో అతిపున్నతమైన ఖ్యాతిపొంది నెల్లూరునగర ప్రతిష్ఠను నిలబెట్టినారు. మన నగరమందే గాక, వీరి ప్రజ్ఞ రాజమండ్రిలో పేరుపొందిన Nimbles Club వారిని ఆకర్షించి అందలి తాతయ్యనాయుడు, బుచ్చిగాళ్లలో కలసి ఆంధ్రరాష్ట్రములో ముఖ్యస్థానమును వహించిన కొరుకొండ విశాఖపట్నం Gold Cup టూర్నమెంటులో పాల్గొని కీర్తి నార్జించెను. Ball Control లో యీయన పేరు నుడివి తరువాత యితరుల పేరుల చెప్పవలయును. నెల్లూరులో సి. ఎ. యం. స్కూలులో చదువునప్పుడు



కీ. శే. డి. విజయం.

విజయ, ఒకరు ఆహ్మాయ Retired Executive Engineer గారేసాహ బంధుత్రయము అత్యధిక బహురంజకముగా నుండెను. ఆటలో జీవితములోవలెనే సామ్యతప్రదర్శించి నెమ్మదిగా ఒడుదుడుకులు లేకుండా మంచి Sportsmanship ప్రదర్శించుటలో విజయంగారు ఎక్కువ గౌరవమును పొందిరి.

---

కీర్తిశేషులు రక్తదాత శ్రీ యస్. వి. నరసింహారావు గారు మిక్కిలి గొప్ప All Rounder. Football, Hockey, Badminton, Tennis, ఆటలలో అందకీర్తి నార్జించినవారు పేరుమార్చుకొనుటకు పూర్వము వారిపేరు "వెంకటనరసు" అని వెంకటగిరి R V. M. High school ఉపాధ్యాయులైన కృష్ణస్వామి అయ్యంగారి సుశిక్షణ క్రింద గుణగతములు ఆటలలో నైపుణ్యమును శ్రీ నరసింహారావు విశేషఖ్యాతి గాంచెను. ఫుటుబాలు ఆటలో మద్రాసు, నెల్లూరు, ఏలూరు, మొదలగు నగరములలో పెద్ద పేరు గడించినవారు నరసుగారు. యీయన Toekick అని, Coner shot కొట్టినప్పుడు ఎవరి గోలుకీపరునకేగాక జట్టున కంతటి



కీ. శే. యస్. వి. నరసింహారావు.

కిని గుండె దడ, కమానువలె వంపుతిరిగి బాలు గోలులోనికి పొప్పుకొనును.

బాస్కెటును ఆటలో వెంకటనరసు గారు చాలా ప్రతిభ కలిగి యుండిరి. పెద్ద వారయిన తరువాత మన నగర వాసులు రిటైర్డు రీజియనలు డెప్యూటీ డైరక్టరు of Physical Education మల్లారామయ్యగారిద్వారా ప్రకటితమగు వ్యాయామ విద్య అను మాగజైనులో ఎన్నియో వ్యాసములు వ్రాసిరి.

టెన్నిసు ఆటలో నరసింహారావు గారు ప్రెసిడెన్సి కాలేజి తరఫున M.U.C టూర్నమెంటులో Doubles Finals కు రాగల్గిరి.

వింతవిషయ మేమనగా కాయము స్థూలమైనది. అయినను పరుగు పందెములు ముఖ్యముగా short distance running races లో నరసింహారావుగారు మంచి పేరు గడించి S. I. A. A.Grounds లో జరిగిన పందెములలో మొదటివాడుగ వచ్చెను.

వయసు మీరిన తరువాత నరసింహారావుగారు ఆంధ్రరాష్ట్ర ఫుటుబాలు అసోసియేషను Referee Association లో ఎక్కువ శ్రద్ధ తీసికొనుచుండిరి.

క్రీడల ప్రోత్సాహములో వారు అపారమైన శ్రద్ధచూపి ధనవ్యయము చేసి నెల్లూరు, గూడూరు. వెంకటగిరి యింకను అనేకచోట్ల కప్పులను, షీల్డులను ఇతరులకు బహూకరించిరి.

రక్తదానము విషయమున ఆయన కీర్తి అఖిలభారతస్థాయిని అందికొని ఢిల్లీలో ప్రప్రథమముగ నెలకొల్పబడిన Blood Bank లో రక్తమునిచ్చు మొదటి స్థానమునకు ఆహ్వానించబడిరి.

# 82.

ప్రపంచపటంలో నెల్లూరు స్థానం కల్పించిన

# 75 సం॥ల నెల్లూరు జిల్లా మైకా (అభ్రక) పరిశ్రమ చరిత్ర

సేకరణ: శ్రీ బండి గోపాలరెడ్డి, బి. కాం., అనర్సు, డి. సి. ఆర్. ఎస్.

ఇంద్రుడు శతృసంహారార్థం వజ్రాయుధం ఝళిపించగా వెలుగురేణువులు కొండలపైబడి అభ్రకరూపమున దాచబడినవని పెద్దలనమ్మకం (ఆయుర్వేదప్రకాశము.) మైకా ప్రకృతి మార్పుకాలంలో కొన్ని లోహవస్తు సముదాయ సంయోగం వల్ల యేర్పడిన అపూర్వ ఖనిజమని ఆధునిక శాస్త్రము.

కాకిబంగారము (Kakabu-I-az, The Star of the Earth) కాకబు లాజ్ అని అరబ్బీభాషలోను, హిందూస్థానిలో 'Abrak' అభ్రకమని, Mico-l-shine మైకో అనే ల్యాటిన్ పదమునుండి ఇంగ్లీషులో మైకా అని వాడుకయేర్పడింది. జర్మనిలో "గ్లిమ్మర్" అంటారు.

పూర్వం అభ్రకాన్ని శ్వేతం, కృష్ణం అని ప్రధానంగా రెండు పేర్లతో పిలిచేవారు తెల్లనిది బ్రహ్మ, యెఱ్ఱనిది క్షత్రియ, పసుపు రంగు వైశ్య, నల్లనిది శూద్ర అని నాలుగు జాతులుగ నిర్ణయించి, మరణాన్ని సైతం ఆపగలిగిన అనేక ఔషధాలు చేస్తుండేవారట. నేడు-మస్కొవైట్, బయొటైట్, ఫ్లొగొపైట్ లెపిడొలైట్ అని ప్రధానంగా నాలుగు విధాల మైకాలు పొటాష్ సంబంధమైంది. మస్కొవైట్, మాంగనీస్ సంబంధమైంది ఫ్లొగొపైట్. స్టవ్‌లకు, లాంతర్లకు, గాస్ బర్నర్ల చిమ్నీలకు, రష్యాయుద్ధ నౌకల గవాక్షాలకూ, ఔషధాలకూ, అలంకారాలకూ పరిమితమైన మైకా నేడు అనేక పరిశ్రమలకు మూలాధారమైంది.

---

• శ్రీ మరుపూరు పిచ్చిరెడ్డిగారు-మైకా పరిశ్రమలో స్వయంగావున్న అపార అనుభవం వల్లనే గాక, ఎనలేని academic interest తో-మైకా పరిశ్రమ విశ్వరూపాన్ని చూపిస్తూ "జమీన్‌రైతులో" 1948 నుండీ దాదాపు ప్రతిసంవత్సరమూ ఏదోవొక వ్యాసం వ్రాస్తూనే వున్నారు. శ్రీ పిచ్చిరెడ్డిగారితో స్వయంగా మాట్లాడి వారి వ్యాసాలలోని విషయాలను స్వేచ్ఛగా వాడుకొంటూ ఈ చిన్నవ్యాసం వ్రాయడానికి పూనుకున్నాను. శ్రీ పుష్పాదు బలరామిరెడ్డిగారు, వినుగ నరహరిరెడ్డిగారు "జమీన్‌రైతులో" వ్రాసిన వ్యాసాలుగూడ ఇందుకు చాలతోడ్పడ్డాయి. వీరికి నాకృతజ్ఞతలు.

విద్యుత్ వాహకం కాని కారణంగా విద్యున్నిరోధకాలకు (insulators) ఇది బాలప్రశస్తమైంది. ఎటువంచితే అటు వంగే మృదువైన దీని రేకులు డైనమోలలో (Armatures) నిర్మాణమందు ఎక్కువగా ఉపయోగపడుతుంది. అభ్రకంలో పొటాషియమ్ కల్పివుండడం చేత ఇది ఎరువుల పరిశ్రమకూ కొంత ఉపయోగకరంగా వుటుంది. లిథియమ్, రుబిడియమ్ క్షారాలను ఉత్పన్నం చేయడానికి లెపిడొలైట్ అభ్రకం పనికివస్తుంది.

నేడు మైకా ప్రధానంగా ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ లకు సంజీవి వంటిది కావడం వల్లనూ, ప్రపంచ మార్కెట్టుకు కావల్సిన మైకా ఉత్పత్తి కొనసాగక పోవడం వల్లనూ కృత్రిమంగా తయారు చేయబడిన నకిలీ మైకా (synthetic mica) వాడకం ఇటీవల కొన్ని దేశాలలో ఎక్కువైంది. కృత్రిమంగా తయారుచేసిన నకిలీమైకా ఇన్సులేటర్లుగాని, ప్లాస్టిక్ ఇన్సులేటర్లుగాని మన దేశపు మైకా ప్రపంచ మార్కెట్లలో యిప్పటికీ విలువగలిగివుంది. మన మైకా తగినంతగా ఉత్పత్తి చేసి, సరైన పద్ధతుల్లో మార్కెట్టుకు అందజేయ గలిగిననాడు ఈ నకలు మైకాకుగాని, ఇతర ఇన్సులేటింగ్ పరికరాలకుగాని ప్రపంచమార్కెట్లో స్థానం వుండదు. ప్రపంచంలో బ్రెజిల్, మెడగాస్కర్, రొడీషియా, ఆఫ్రికాలు మైకా వ్యాపారంలో కొంతకు కొంత మనకు పోటీగా వున్నాయి.

అభ్రకం వుత్పత్తిలో ప్రపంచంలో ఇండియాకు అగ్రస్థానంవుంది. ప్రపంచం మొత్తం మైకా ఉత్పత్తిలో నూటికి యనభై పాళ్ళ వరకు ఇండియా ఉత్పత్తి చేస్తున్నది. ఇండియా ఉత్పత్తిలో బీహారు ప్రథమస్థానం రెండవది నెల్లూరు, మూడవది రాజపుటానా. బీహారు ప్రథమస్థానంలోవున్నా, విదేశ మారక ద్రవ్యవిషయంలో మొదటినుండీ నెల్లూరు మైకా విలువైనది.

ప్రప్రథమమున బీహారు మైకాబెల్టు 12 మైళ్ళ వెడల్పు, 60 మైళ్ళనిడివి-గయా, హజారీబాగ్, మాంఘిర్ మూడుజిల్లాలో కలసివున్నట్లు కనుగొనన బడినది. క్రమేపీ 20 మైళ్ల వెడల్పు 90 మైళ్ళ నిడివి వరకు స్థిరపడింది. నెల్లూరుజిల్లాలో అభ్రక శ్రేణి విజయవంతమైనది V ఆకారంతో ఓజిలివద్ద ప్రారంభమై 15 మైళ్ళ వెడల్పు 80 మైళ్ళ నిడివిన వుంది. గూడూరు, రాపూరు, ఆత్మకూరు కావలి, ఉదయగిరి తాలుకాలలో కలిసివుంది. బీహారు మైకా 1826 సంవత్సరాన కనుగొనబడి 1898 సం॥ నాటికి 250 గనులుదాక పనిచేస్తూ వుండినవి. నెల్లూరు 1888 సం॥ లో ఒక్క గనితో ప్రారంభమై 1898 నాటికి 71 గనులవరకు మాత్రం పెరిగింది. 1929 సం॥ లో బీహారులో 63 గనులు పని జరుగుతుండే, నెల్లూరులో 24 గనులు వున్నట్లు మైనింగ్ మ్యాన్యుయల్ వల్ల తెలుస్తున్నది 48 నాటికి గనులకంటె ఎక్కువున్నట్లులేదు.

ప్రథమంలో బీహారు-నెల్లూర్ల మైకా ఎగుమతుల వివరం ఈక్రింద లెక్కలు గమనించితే నెల్లూరు మైకా ప్రాధాన్యం తెలుస్తుంది.

మైకా ఎగుమతులు :

1898. బీహారు :- 267 టన్నులు, 15004 పౌ.విలువ. నెల్లూరు (మద్రాసు):-

151 టన్నులు 37350 పౌ. వి. 1899 బీహారు 356 టన్నులు 20466 పౌ. వి. నెల్లూరు (మద్రాసు):- 262 టన్నులు 40153 పౌ. వి.

బీహారు మైకా క్వాలిటీ మంచిదై విలువవస్తే, నెల్లూరు మైకా సైజు పెద్దదైనందువల్ల విలువ యెక్కువ వచ్చింది. బీహారు 250 గనులకంటె నెల్లూరు 71 గనులు ఉత్పత్తి తక్కువైనా వెల అధికము. బీహారు మైకా పరిశ్రమ 110 యేళ్ల నాటిది. నెల్లూరు మైకా పరిశ్రమకు 75 యేళ్లు మాత్రమే నిండాయి. ఇతర చోట్ల రెండు విధాలైన మైకాలు. మస్కోవైటు, ఫ్లొగోపైటు సాధ్యం పక్కపక్క నడుస్తున్నవి. మన జిల్లాలో ఉత్తమజాతికి చెందిన మస్కోవైట్ పచ్చ రూబీ, (Green & Ruby) గ కనబడుతున్నవి.

పరిశ్రమలు రెండువిధాలు: యెక్కువ పెట్టుబడి యెక్కువ కాలంబట్టే పరిశ్రమ ఒకటి; స్వల్పకాలంలో కొంచెం తక్కువ పెట్టుబడితో ప్రారంభింపగల్గింది రెండవది మైకా రెండవదానికి చెందుతుంది. అయితే అనేక ఒడుదుడుకుల (risks) తో కూడివుంటుంది.

ఖనిజాలు రెండురకాలు. భూమి పై భాగాన యేర్పడి క్రిందికి పోవునవికొన్ని-అడుగుభాగమున పుట్టి పైకి వచ్చునవి కొన్ని రాతిసిబొగ్గు, జిప్సం, సున్నము మొదలగునవి, మొదటి తెగకు చెందినవి. మైకా, వెండి, బంగారు రెండవజాతికి చెందినవి. మొదటిదానిని యెప్పుడో తప్ప సాధారణంగా త్రవ్వి తీయుట సులభము. రెండవది వ్యయ ప్రయాసలతో కూడినది. మొదటి వాటిని బోరింగు సహాయంతో, ఏప్రదేశంలో ఎంత లోతులో యెన్నిటన్నుల ఖనిజమున్నదీ సులభంగా లెక్కవేయవచ్చును. మైకా బోరింగుకు చిక్కదు. కంటికగపడదు. చేతికందదు. అందువల్ల స్వయంగా గని చేసితేనే తప్ప మైకా రాతిలో, గుహలో, దంపులో కనపడుతుంటుంది. అయితే అది ఉపయోగపడేది మాత్రంకాదు. మంచిలక్షణాలుగల కొండవున్నప్పటికీ ఉపయోగపడే మైకా వుండదు. ఇతర లోహాలవలె ప్రదేశమంతా కొంచెమో గొప్పో ఉపయోగపడేది మాత్రంకాదు.

"The special features of each vein must be settled in every particular case by intelligent prospecting; there is no rule to supersede commonsence. Nearly every occurance of valuable Pegmatite has its peculiarities, in the relations of the mica to the other constituents, but the variety is too great for detailed description and the veins present no common charactor which would be of general use as a guide in exploitation.

(Thomas H. Holland)

మైకా నడక సాలుమీద ఒకచోట మూలననుసరించి ఒకచోట, క్రమంగ మరొకచోట సాలుమూలలేక వేరొకచోట వంకర టింకరగా ఇంకొకచోట శాఖోపశాఖలుగా పోయి మరొకప్పుడు వక్రగతి నడుస్తుంది. ఒకప్పుడు అదృశ్యమై ఎక్కడో

తేల్తుంది. అడుగుమేరలో మనదొకదారి దానిదొకదారి అవుతుంది. ఒక గనిలక్షణాలు యింకొక దానికుండవు. కొన్నిటిలో ఒక చోట పెద్ద సుడివుండి తరువాత ఎంతవెదికినా పిక్కుము (గంపసుక్క) ఒకగనిలో పెద్ద సూసలుంటయిగాని పనికిరాని సోడి ఒక గనిలో తోళ్ళవంటి పెద్ద మెతువు కట్టలుంటయి. ఎంత దూరం పోయినా మార్పుండదు. అన్నిప్రదేశాలు శాస్త్రసమ్మతంగానే కనపడుతుంటాయి. "Each mine is a problem and each tunnel is a problem" అని వొక గొప్ప అనుభవజ్ఞుడు చెప్పే మాటల్లో ఎంతో సత్యముంది.

మైకా మైనింగ్ ఒక speculation వంటిదని, అంతా అదృష్టంమీద ఆధారపడి వుంటుందని ప్రతీతి. రత్నగర్భ ఆవాసంలో అగోచరమై వున్న మైకా అదృష్టవంతులకు కొద్దిమందికి మాత్రమే సులభంగా లభ్యమౌతుంది. మైనింగ్ జేసి లాభంపొందిన వారికంటే నష్టపడిన వారి సంఖ్యే యెక్కువ. నూటికి పది గనులు విస్తారమైన లాభాలిచ్చాయి, ఇరవై లాభనష్టాలు లేకుండా వుండినయి. తక్కిన అరవై అపార నష్టంతో కూడినవై వున్నయి. ఇట్లని మైకా మైనింగ్ చేయకూడదనేమీకాదు. నెల్లూరు జిల్లాలో లాభం సంపాదించ గలిగిన పరిశ్రమలలో ఇదే ముఖ్యమైంది. అయితే శాస్త్రీయ పద్ధతులలో మైనింగ్ జరగందే మనుగడవుండదు.

సమస్యలు ఉత్పన్నమైన తర్వాత వాటిని తీర్చే ప్రయత్నాలు చేయడం గని యజమానులకు పరిపాటైనది. ఇందువల్ల గనుల అభివృద్ధి కుంటుపడుతుంది. ముందుగానే ముఖ్యమైన సమస్యల నూహించి శాస్త్రీయంగా ఎదుర్కొనే ఏర్పాట్లు చేసుకోవడం అవసరం. కొండను త్రవ్వి మైకా లేని భూగర్భంలోకి పోయిన కొన్నాళ్ళకు లోతు ఎక్కువై పగులకొట్టిన రాతిని పైకి తీయడం కష్టంగాను, కిందకు సరిగా గాలి పోక ఉక్కయేర్పడి కార్మికుల ఆరోగ్యం దెబ్బతినవచ్చు. ఈలాంటి సమస్యలేర్పడ్డ తర్వాత గనిపనిని నిల్పి మట్టి తీసుకొనడానికి కావల్సిన సొరంగాలు కొట్టడం, గాలి పోడానికి దారులు చేయడం వంటి పనులు చేయడం పొరపాటు మైకా తీసేటప్పుడే కావల్సిన సొరంగాలు కొట్టడం, గాలిపోడాకి దారులు చేయడం వంటపనులు చేయడానికి పూనుకొనడం అశాస్త్రీయం మైకా తీసేటప్పుడే గనిని సరిగా సర్వే చేయించి మట్టిని Hollage ని గాని shaft ను గాని యేర్పాటు చేసుకొంటూ వారి స్వేచ్ఛగా పోడానికి కావల్సిన సొరంగాలు గూడా ఏర్పాట్లు చేసుకోవడం శాస్త్రీయం. ఇంతేగాకుండా గనిలో ఒకచోట మైకా తీసేటప్పుడే ఇతరచోట్లగూడా మైకాకోసం ఒకే పర్యాయం అన్వేషణ జరుపుకోవాలి మైకా రాబడి వున్నప్పుడే, కొత్త అన్వేషణగాని ఉన్నదారనే తక్కువ ఖర్చుతో లోతు ప్రదేశాల్లో తీసే ఏర్పాటుగాని చేసుకావాలి మైకారాక నిల్చిపోయినప్పుడు ఈ ప్రయత్నాలు చేయడం కష్టం. అందువల్ల చాల గనుల్లో పని నిల్చిపోయిందికూడా. ఇట్లా మైకా తీయడంతో కూడానే గనిని అభివృద్ధి పర్చడం, కొత్తదారలు కనుక్కోవడం (Exploration) ఒకే పర్యాయంగా జర

పడం మొదట కొంత కష్టంగా కన్పించినా క్రమేణా లాభదాయకంగా వుంటుంది. సరైన మిషనరీ పరికరాలు సకాలంలో గనికి అమర్చాలంటే ఎక్కువ డబ్బు పెట్టుబడి కావల్సివున్నా గనియజమానులు వెనుకంజ వేయకుండా, నిపుణుల సలహాను తీసుకొంటూ, గనిపరిస్థితుల్ని అనుసరించి శ్రద్ధతో యంత్రాల వాడకాన్ని గుర్తించి-గని తవ్వకానికి కావాల్సిన పరికరాలు Tungstan Carbide Bits లాంటి వాటిని వాడటం-ఇట్లా యంత్రీకరణ చేయడం ఆధునిక ధోరణి.

మైకామైనింగ్ ఒకవిధంగా నిరంతరం పరిశోధించడం(Broad Prospecting) వల్లనే విజయవంతమవుతుంది. ఇతర ఖనిజాలకు ప్రారంభంలోనే కొన్నిలక్షల పెట్టుబడితో కాని ప్రారంభించడానికి వీలు లేదు. మైకా కొన్నివేలతోనే ప్రారంభించ వచ్చు. అపాయం (risk) కూడా ఎక్కువే. ప్రకృతిసైజమైన ఈ ఖనిజసంపద నెల్లూరు జిల్లాలో అనంతం. ఇప్పటికి కనుగొన్న మైకా ప్రదేశం బహుకొద్ది. శోధించవల్సింది విస్తారంగావుంది. నెల్లూరుజిల్లాప్రాంతాల్లో సమగ్రమైన భూగర్భపరిశోధన జరిపించాలి. ఇరవై, ఇరవైపు యేళ్ళ క్రితం దాల అసమగ్రమైన సర్వే జరిగింది. క్రమపద్ధతిలో లోతురంధ్రాలను (Boreholes) నుకనీసం 1000 అడుగులవరకైన వేయించి, ఈ ప్రాంతాలలో పెగ్మటైట్‌కొండ (Pegmatite rocks) ఎట్లా విస్తరించి వున్నాయో సూచించే సమగ్రమైన పటాలు తయారుచేయించాలి.

## నెల్లూర్లో మైకా చరిత్ర

ప్రకృతి సహజమైన మైకాపొంగు (outcrop) యినుకుర్తి ('డి'మైను) సైదాపురం (షామైను) చాగణం (తెల్లబోడు) వూటుకూరు (పాలమాను) తలుపూరు (కోదండరామా) మొదలైన కొన్నిప్రదేశాలలో పైకి కనుపడ్తుండేదట. ఎక్కడనుంచో మొలకజంగాలు బిడార్లుగా వచ్చి పైకి కనపడ్తుండే మైకాను తీసుకొనిపోతూవుండే వారట. కంప్లేటి ఒడ్డున 'డి' మైనుకు దక్షిణంగా వాళ్ళు మకాం చేస్తుండిన స్థలానికి యిప్పటికీ జంగాలదిన్నె అనిపేరు. అప్పుడే చేజర్ల శ్రీరాములుశెట్టి అనేవారు జాబలాపురంలోవుంటూ జాబలాపురం నర్రెడ్డి పోలుగాడు, రాముడు, జోగిగాడు అనేవాళ్ళచేత మైకా తెప్పించి చెక్కడు చేయించి మద్రాసుకు తీసుకొనిపోతుండినట్లు వినికిడి. జాబలాపురం యానాదులు పాలమాను, తెల్లబోడులలో కట్టెలు మండేసి కాలినరాతిమీద నీళ్ల చల్లగా పగుళ్ళు దాపిన కొండను సరుగొళ్ళతో కొట్టి మైకా తీసే వాళ్ళట. చేజర్లవాండ్లు మొదట పని చేయించినారు గనుక తెల్లబోడులో ఒక భాగానికి యిప్పటికీ చేజర్లవాండ్లగని అనే పేరు వుంది.

మొట్టమొదట ఈస్టిండియా కంపెనీ వారు మనదేశంలో జియలాజికల్ సర్వే చేయించి కొంత మహోపకారమే చేశారు. మొదట 1880 సంవత్సరంలో D.r W. King గారిచేత సర్వే చేయబడి తర్వాత 1891 సంవత్సరంలో Dr. H. Warth గార్లచేత స్థిరపరుపబడిన మైకా బెల్టు

(V. shape లో) ఓజలివద్ద ప్రారంభమై ఉదయగిరి వరకు షుమారు 90 మైళ్ళ వెడల్పు వున్నట్లును బెల్టు తూర్పు భాగంలో మాత్రం యెక్కువ మైకా వున్నట్లు

(The eastern of the schist complex is traversed by a large number of intrusive sheets and lenses of pegmatite often very rich in Muscovrite of great economic value) కనుక్కొన్నారు.

మొట్టమొదట ఈ జిల్లాలో 1887 సం॥లో పొదలకూరు, వూటుకూరు, దాగణం గ్రామాలలో మూడు ప్రదేశాలకు మైకాకు దరఖాస్తు పెట్టినారు. తీసుకొనే హక్కు 2 సంవత్సరాల కొకసారి వేలం వేయమని రెవిన్యూబోర్డువారు నెల్లూరుజిల్లా కలెక్టరుకు పుత్తర్వు పంపుటకు ఒక సంవత్సరంపట్టింది. పై మూడుప్లాట్లు వేలం పెట్టగా ఒక వూటుకూరులో మాత్రం అయిదు ఎకరాలు 75-00 యేలం పాడినారు. ఆ పాడినవారు గూడూరు పెళ్లేటి రామిరెడ్డిగారని అంటారు, పాలమానుకు యిప్పటికీ రామిరెడ్డిగని అని వాడుకలో వుంది,

1889 లో బెంగుళూరు "లాన్సడేట" (Mr. Lonsdate) అనే ఆయన యినుకుర్తిలో 10 యకరాలు రు. 250 లకు మక్తా తీసుకొని మైకా రాలేదని వదలి వదలిపెట్టారు. 1890 లో దానినే సార్జంటు (H. E Sargent) గారు 'D' mine తీసుకొని బాగా లాభం సంపాదించినట్లు న్నది. వీరే మరుపూరులో "రాక్‌ల్యాండ్సు" (Rock lands) న్యూలాండ్సు (New lands) కలసగని, వైదేహిరామా (యిప్పటికీ సార్జంటుగని అని పిలుస్తారు.) పని చేసినట్లు తెలుస్తుంది. 1890 సంవత్సరములో 2 సం॥ లకు యేలంపాడిన వూటుకూరు ప్లాటుమీద అనేక దరఖాస్తులు రావడంతో, యేలంవేస్తే రు 3005/- కు పాడినారు. 1891 ప్రాంతాల్లో అనేకులు చాలచోట్ల దరఖాస్తులుపెట్టి గనులు చేసి నష్టపడి మానుకొన్నట్లుంది.

నెల్లూరు జిల్లాలో మైకా మైనింగ్ సార్జంటుగారితో ప్రారంభమైందని అనవచ్చు. మనవారిలో తొలుత ఆకర్షింపబడి ప్రవేశించినవారు పెళ్లేటి రామిరెడ్డిగారని అంటారు.

తర్వాత దశలో 1890 ప్రాంతాల్లో శ్రీ అంచూరు సుబ్బానాయుడు జోగిపల్లె జమీన్ Non Royalty) చుక్కగని తీసుకొని ప్రారంభించి శ్రీరాములు శెట్టిగారి సోలుగాడు, రాముడు, జోగిగాడు గర్ల యాజమాన్యాన సైదాపురం, మొదలు పొదలకూరువరకు శోధించి, చీర్ల బోడు, తెల్లబోడు, పాలమాను తలుపూరు E. F. G. గనులు సంపాదించగలిగినారు, 'డి' గని 1898 సం॥ వీరి స్వాధీన మందున్నట్లు తెలియుచున్నది. విడవకుండా పరిశోధనకు మనుష్యుల నియమించి (Permanent Prospecting staff) గూడూరు, రాపూరు, ఆత్మకూరు మూడుతాలూకాలు పూర్ణంగా పరిశోధించినట్లు కనబడుతుంది. వీరే తెల్లబోడు మదరాసు మష్ బబ్బాసాహెబు గారికి ఇవ్వగా అది నచ్చనందున చీర్లబోడు (షామైను) తీసుకొని తెల్లబోడు వారికే యిచ్చినట్లు ఋజువవుతుంది

1897 లో తిరుణ్ణామలై ప్రాంతము వారు ఆర్. వి. కుప్పుస్వామయ్యర్, ఆర్. వి. వెంకటసుబ్బయ్య అను వారు అప్పటి పూర్‌హౌస్ ప్రెసిడెంటైన రాజా శ్రీ ముద్దు కృష్ణ యాచేంద్రులగారివద్ద కలిచేడు శ్రోత్రియం కౌలుకు తీసుకొని 'కళ్యాణరామా' ప్రారంభించి తకరార్లు వచ్చినందున మాను కొని తర్వాత శంకరా మైనింగ్ సిండికేటు స్థాపించినట్లు తెలుస్తున్నది.

1900 ప్రాంతములో కీ॥ శే॥ రేబాల లక్ష్మీనరసారెడ్డిగారు లక్ష్మీ నారాయణ (L N.) ప్రారంభించినారు. ఆ తరువాతనే కాజీ సాహెబులవారు బషీర్ మైను ప్రారంభించారని తెలుస్తున్నది.

H.E. సాల్టంటుగారిచే 1887-89 లో జనుకుర్తి 'డి' మైనుతో ప్రారంభమై 1891 సంవత్సరానికి 30 గనులు, 1898 నాటికి 2442 యకరాల విస్తీర్ణంలో 71 లీజుల వరకు పెరిగి రూ.35, 000 రాయల్టీ చెల్లించే స్థితి నందుకొంది. 1897 లో బెంగాలు (బీహారు) 13267 పౌనులు వెలకలిగిన 445 టన్నులమైకాను, మద్రాసు 81324 పౌనులు విలువ కలిగిన 246 టన్నులు మైకా ఎగుమతి చేశాయి. తక్కువ ఎగుమతికి ఎక్కువ డబ్బు రావడం మన నెల్లూరు పెద్దసైజు మైకా ఉత్పత్తి చేయడం వల్లనే. 'డి' మైనులో వది మొదలు పదిహేను అడుగులు వచ్చిందట. లక్ష్మీనర్సింహా (L N.) రోజుకు 750 పౌనులు, షామైను 900 పౌనులు, 'డి'మైను 1000 పౌనులు, తెల్లబోడు 2000 పౌ. మైకా కటింగైనట్లు పూర్వచరిత్ర చెప్తున్నది.

1910 వరకు అంపూరు సుబ్బానాయుడు, ఖుదుష్ పాద్షాసాహెబు, రేబాల లక్ష్మీనరసారెడ్డి మూర్తిత్రయ యుగం మహోజ్వలంగా సాగింది. 1914 దాక ఎలిగన్, డెన్‌హోందొరలు రూపురేఖలు దిద్దారు. 1916 మొదలు ఐరోపాయుద్ధంలో ధరలు బాగా పెరిగాయి. అయితే ఈ ధరలు స్థిరంగా నిలవక 1919 నుండి '23 వరకు కొంచెం తగ్గుదల గాంచాయి. 1920-22 ప్రాంతాల్లో శ్రీనివాసయ్యంగారు విదేశ వ్యాపారంమీద మోజు కలిగించారు. ఏనుగ నర్సారెడ్డి వగైరాలు వ్యాపారరంగలో ప్రవేశించింది, పొన్నలూరు చెంగారెడ్డిగారు విదేశాలకు రాచబాట నిర్మించింది ఆ రోజుల్లోనే. పరిశ్రమకు అధునికరూపం ఇచ్చిన వారు గోగినేనివారు

1939 వరకు పరిశ్రమ కొంచెం మందకొడిగా సాగింది. 1942 వరకు పరిశ్రమ బాగా ముందంజవేసి, '52 లో మూడుపువ్వులు ఆరు కాయలుగా వికసించింది. గూడూరు కళకళలాడింది. షామైను పొంగి పొరలు కట్టలు త్రెంచుకొని గూడూరును ముంచెత్తింది. రాపూరు మాగాణము బంగారు పంటభూములు. నేటికీ బంగారు పండుతూనేవుంది. మళ్లీ ఇటీవలగా మైకా పరిశ్రమలో కొంచెం స్తబ్దత అవతరించినట్లున్నది.

ప్రథమంలో-1915 వరకూ జరిగిన పనిఅంతా 150 అడుగులకు లోపల్నే. విస్తారమైన మైకా పొంగు (out crops) మాత్రమే తీసినట్లున్నది. మరుసటిలో ఇన్నూటఖై అడుగులవరకు లోతుకు వెళ్ళ తప్పిందికాదు. నేడు 1700 అడుగులవరకు

వెళ్ళి ఆగింది. ఇట్లా గనులు బాగా లోతుకు తెగినయి. పైపొరలు చిక్కడంలేదు. గ్రీన్ (green) 500 అ.-700 అ. మధ్య రూబీ (Ruby) మైకా 250 అ.-400 అ. మధ్య మైకా 250 అ. మధ్య అంతరిస్తున్నట్లు కనపడుతుంది. భూమిపై పుట్టినపొరలు 120 అ. వచ్చి తిరిగి 300 అ మొదలు 500 వరకు నిల్చిపోతున్న నిదర్శనాలు కానవస్తున్నయి ఎక్కడో ఒకటి రెండు అసాంతం నడక సాగినవి అరుదుగా లేకపోలేదు. ఈపరిస్థితుల్లో కొత్తపొరలు (new lenses) కనపడక పోతే పరిశ్రమాఘాతం యేర్పడవచ్చు.

2, 3 వేల అడుగుల లోతులో ఇనుము ఖనిజాన్ని కనిపెట్టే యంత్రాలు, 10,000 అడుగుల లోతులో వున్న చమురు జాడలు తీసే యంత్రాలున్నయి. కాని మైకా వునికి తెలిపే పరికరాలు ఇప్పటికీలేవు. అలాంటప్పుడు సామాన్య సంస్థలకు కొద్ది లోతుకు వెళ్ళడంకూడా కష్టం. ఇండియన్ బ్యూరో అఫ్‌మైన్స్ ఈపనికి పూనుకోవల్సి వుంటుంది. మనుష్యశక్తికి తోడు యాంత్రిక శక్తి వృద్ధిచేసుకొని నేర్పరులైన పనివారిచేత ఉత్పత్తి, పెంచుకోనిదే గిట్టింపుకాని రోజులు. గిరాకి వున్నపుడూ, లేనపుడూ కూడా ఉత్పత్తిదారులే దేశీయ విదేశీయ మార్కెట్లను అదుపులోవుంచు కోనిదే పరిశ్రమ దెబ్బతింటుంది. విదేశీ యెగుమతులు ధారాళంగా వున్నపుడు యెన్నో గనులు పనిచేయడం, అదికొంచెం తగ్గగానే గనులపనులు తగ్గిపోవడం జరుగుతున్నది. ఈ సంప్రదాయానికి స్వస్తి చెప్పాలి. ముడి పదార్థలు లభించేతావులందే పరిశ్రమాగారాలు నిర్మించి ముడిసరుకంతా వుపయోగపడేటట్లు చూపినప్పుడే పరిశ్రమ బాహుళ్యంగా వృద్ధి చెందుతుంది. నెల్లటూరులో స్థాపించి పని జరుగుతున్న మైకా నైటు ఫ్యాక్టరీవల్ల వ్యర్థమవుతుందనుకొన్న మైకా దుగ్గుకు సైతం కొంత వెలరాగలదు. అటువంటివే ఇంకా కొన్నిటినిగూడా స్థాపించే అవకాశముంది. నెల్లటూరు ఫ్యాక్టరీ ఎందువలనో ఆశించినంత ఉత్సాహకరంగా పని చేసినట్లుగా లేదు. ఇటీవలనే ఇది మూసివేయబడినట్లు తెలుస్తున్నది. రాజస్థాన్‌లో బిల్వారావద్ద క్రాఫ్ట్ పత్రో అభ్రకం ఇటుకల్ని తయారు చేసే ఫ్యాక్టరీని స్థాపించారు. అలాంటిది ఇక్కడకూడా స్థాపించడం మంచిది.

కేంద్ర ప్రభుత్వ సహజసంపద శాస్త్రీయ పరిశోధనాశాఖ, జూలాజీకల్ సర్వే అఫ్‌ఇండియా, ఇండియన్ బ్యూరో ఆఫ్‌మైన్స్, నేషనల్ మెటలర్జికల్ లేబరేటరీలు యీ పరిశ్రమముందుకు వెళ్లేదానికి యెంతవరకు సహాయపడుతున్నవి? విదేశమారక ద్రవ్యాన్ని సంపాదించిపెట్టే కీలకమైన ఖనిజాలలో మైకా అతిముఖ్యమైంది. ఇంత ప్రధానమైంది ఈనాటికీ శాస్త్రబద్ధంగా సమర్ధవంతంగానిర్వహింపబడకుండా వుండడం, ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు లేకపోవడం శోచనీయం ఈ సమస్యల్ను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలదృష్టికి తేలేకపోవడం పరిశ్రమదారుల లోటు. గనుల యజమానులందరొకటై యజమానుల సంఘం (Miners' Association) కార్మికుల సంఘం (Employees Association) కూలీల సంఘం (Coolies Association) అనే సంఘాలు స్థాపించుకొని వాటి ద్వారా కష్టసుఖాలు చర్చించుకొన్నపుడే

పరిశ్రమలో అవతరించిన అసంతృప్తి కొంతకు కొంత తీరుతుంది. మైనింగ్ ఏరియాలో మలేరియా, సిలికోసిస్ మొదలైన వ్యాధులు విస్తారంగా వుంటాయి. గవర్నమెంటు వైనాడు (నీలగిరి) అరకులోయ, కోరాపుట్టులలో మలేరియా నివారణకు కొన్ని కోట్లు ఖర్చుపెట్టింది. మైకాగనులు, ఫ్యాక్టరీలలో సుమారు 30,000 మంది పనిచేస్తున్నారు. మైకా ఏరియాలో 70,000 జనాభావుంది. ఈ విషయం గవర్నమెంటు దృష్టికి తీసుకొచ్చేదానికి-వ్యక్తులు అడిగేదానికంటే సంఘాలు అడిగేదానిలో ఫలితముంటుంది.

మైకా పరిశ్రమ యీనాడు చారిత్రక పరిణామదశలో వూగిసలాడే స్థితిలోవుంది. స్వర్ణయుగం గతించినట్లుగావుంది. విస్తారమైన ప్రాంతంలోని ఖనిజాన్ని శోధించలేకపోవడానికి ఆర్థికలోటే కారణం. పనిఖర్చులు పెరిగినంతగా (Working costs) పనిపాటవంగాని, ఉత్పత్తిగాని పెరగడంలేదు. కావల్సిన పరికరాలు కొరతగా వున్నపుడు, పేట్టకొకటి, పుట్టకొకటి సంస్థలు యేర్పడడం పరిశ్రమ పురోగమనానికి ఆటంకం. ఉత్పత్తి ప్రదేశాలను కొన్నింటినైనా నిర్ణయించుకోవడం జరగాలి. మైకాకొండకు బీడు తప్పనిసరి కావున పనిపాట్లు ఎక్కువ చేయడం, ఉత్పత్తిని అదుపులో వుంచడం; అంటే రేపటి పెట్టుబడికి ఎదురుకొనక గనిలోనే నిల్వవుంచుకోవడం పరిశ్రమ భద్రతకు అవసరం, ఉత్పత్తి వున్నకాలంకంటే లేనిరోజులే యెక్కువ (always gap in production) ఉత్పత్తి అయినపుడు గిరాకీ లేకపోవడం (gap between production and demand) ప్రభుత్వ సహాయం లేకపోవడం, మార్కెట్టు చూపలేకపోవడం యీ పరిశ్రమను తొక్కివేస్తున్నవి.

ఆదినుండి నేటివరకు మైకాసంపద నిలుపుకొన్నవారు యేకొద్దిమందో అయినందున పరిశ్రమ శాపగ్రస్తమేమీ కాదు. రాక నష్టపడినవారు కొందరు, వచ్చీరాక నష్టపడినవారు కొందరు, బాగావచ్చి నష్టపడినవారు కొందరు. కట్టుబాటులేని పరిశ్రమకు మనుగడలేదు. మితవ్యయంలేని పరిశ్రమకు స్థాయి లేదు. నిజాయితీలేని పరిశ్రమకు అభివృద్ధి, నియమనిబంధనల్లేని పరిశ్రమకు భవిష్యత్తు లేదు. ఈ నాటికి పాత పద్ధతులు ఫలప్రదం కాలేదని తోస్తుంది. ఏకవ్యక్తి యాజమాన్యం, పరిపాలనవల్ల పరిశ్రమ క్లిష్టస్థితికి కారణమగుచున్నది. మైకా పరిశ్రమలో యజమానీ కార్మికుడూ పూర్తి ప్రయోజనాన్ని పొందాలంటే ఇపుడు జరుగుతూన్న పద్ధతినిగాక ఆర్థికరంగంలో విప్లవకరమైన మార్పులు జరగాలి. సహకారపద్ధతినిగాని, లిమిటెడ్ కంపెనీవల్లగాని ఆర్థికస్థితి పటిష్ఠమవుతుంది. ప్రతికూలివాడు పరిశ్రమలో కొంచెమో గొప్పో భాగస్వామి ఐనపుడు పటిష్ఠమైన సంస్థగా రూపొందుతుంది. ఇతర ఆస్తిపాస్తులు దెబ్బ తగులకుండా అన్యోన్య సహాయం దీని అంతరార్థం. అన్ని వర్గాల ఉత్సాహశక్తులే పరిశ్రమను ఉచ్ఛస్థితికి తెస్తుంది. పరిశ్రమ నేడు విషమ ఘట్టంలో వుంది. రేపు యేమి జరుగనున్నదో ఎవరూ వూహించలేకుండా వున్నారు. అప్పుడప్పుడూ వాతావరణం భయపెడుతుంది. ఆర్థికకాటకం తరుముకొస్తున్నది. అన్నిటికీ తట్టుకోగలిగింది సామూహిక పద్ధతి

ఒక్కటే. మనజిల్లాలో మైకా మైనింగ్ నష్ట సమస్యా పరిష్కారానికి సహకార పద్ధతి మీదకాని లిమిటెడ్ కంపెనీల ద్వారాకాని గనులు చేయడం సక్రమమార్గంగా తోస్తుంది అప్పుడు ప్రభుత్వ సహకారంకూడా కొంత వరకు లభించవచ్చు. బరంపూరులో ఉత్కళ కో-ఆపరేటివ్ మినరల్ సిండికేటు అనే సంస్థ ద్వారా గనులు నిర్వహిస్తున్నారని తెలుస్తున్నది. మనజిల్లాలోకూడా సహకార, సాముదాయక సంస్థలు కొన్ని స్థాపించి పని చేయడం అవసరం. జాతీయ సంపద కొంచె మకూడా వృథాగాకుండా శాస్త్రసమ్మతంగా పనిచేయడానికి స్థిరమైన పునాదులతో సక్రమమైన మేనేజిమెంటుతో సహకార పద్ధతిని గనులు చేసిననాడు కొత్త పరిణామాలు తప్పకరాగలవు, తాత్కాలికమైన ఒడిదుడుకులు ఎన్నోవస్తివి; పోతవి. కాని పరిశ్రమ మాత్రం ఆగదు. అమర వాహినులింకినాయి అంతర్వాహినులు పైకుబుకవల్సివుంది. చరిత్ర పునరావృత్తంకావాలి.

ఉరిసిన పుండుల నుప్పువెట్టి. ద్రో. V -858

మాటల నలిగడేని వ్రేటున శిక్షించెద. ద్రో. V 371

వినియును వినని చెవులు ద్రో IV - 95

పసులు పులికిం బాయు తెఱంగున్ ద్రో IV - 156

కయ్యంబునకుం గాలుద్రవ్వుచుండె ద్రో V - 22

జాతికి బైకొని యడరి తగరు చెరలిన మాడ్కిన్ ద్రో III 255
(తగరు - గొఱ్ఱె)

కొలువిం డాసిన తెఱంగు ద్రో IV 44

# 83.

# నెల్లూరుజిల్లాలో హరిజన ఉద్యమం

సౌభాగ్యవతి అల్లాడి అన్నపూర్ణమ్మ.

నెల్లూరుజిల్లాలో హరిజన ఉద్యమం నాలుగు దశాబ్దాలక్రితం ప్రారంభమైనది. యీ ఉద్యమాభివృద్ధి కొరకు ప్రముఖులనేకులు ఎన్నో కష్టములకు లోనై తీవ్రమైన ప్రతిఘటనలను లెక్కచేయక మహత్తరమయిన కృషిచేసిరి. ఈనాడు హరిజనులు ఉన్నతస్థితిలో వుండుటకు వారి కృషియే ప్రధానకారణము.

మొట్టమొదట హరిజనోద్ధరణకుగాను పాటుపడినవారిలో శ్రీచతుర్వేదుల కృష్ణయ్య, బి. రామస్వామి, డి. హనుమంతరావు, కొండపర్తి పున్నయ్య ప్రధానముగ పేర్కొనతగినవారు. వీరు పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమవాసులు. మహాత్మాగాంధీగారి శిష్యకోటిలోని వారు. సబర్మతీ ఆశ్రమానికి తరుచుగా వేళ్లుచూవచ్చుచూ ఉండువారు. ఈ జిల్లాలో ఆదర్శప్రాయమైన ఒక ఆశ్రమము. ఉండుట మంచిదని భావించి 1920 సంవత్సరములో పినాకినీ నదీతీరమున పల్లిపాడు గ్రామసమీపమున తమ ఆశ్రమమును స్థాపించిరి. దానికి కావలసిన స్థలము కీ॥ శే॥ శ్రీమతి పొణకా కనకమ్మగారికృషివలన లభించినది. ఆశ్రమమునకు 1921 లో మహాత్మాగాంధీగారు శంఖుస్థాపనము చేసిరి. రుస్తుంజీ గారు భవన నిర్మాణము గావించిరి. ఈ ఆశ్రమవాసుల కార్యక్రమములో హరిజనోద్ధరణము అగ్రస్థానము వహించెను.

అస్పృశ్యతా నిర్మూలనము :

హరిజనోద్ధరణమునకు అస్పృశ్యతా నిర్మూలనము ప్రధాన సాధనమని వీరు భావించి అంటరాని తనమును రూపుమాపుటకు వీరు కంకణము కట్టుకొనిరి. 1921 వ సంవత్సరములో పల్లిపాడు గ్రామములోని బ్రాహ్మణ వీధిలోనికి వీరు హరిజన ప్రవేశము గావించిరి. గ్రామములో అనేకులు దీనికి అడ్డుతగిలినను, వారిని తుదకు ఒప్పించగలిగిరి.

క్రమక్రమముగ ఇతరులనేకుల కృషి వలన అస్పృశ్యత చాలవరకు నిర్మూలింపబడెను. 1957 లో హరిజన సేవకసంఘము వారు ఒక కొత్త ప్రణాళికను ఇందు నిమిత్తమై ప్రవేశపెట్టిరి. దానిననుసరించి జిల్లాలో ఒక హరిజనుడు ఒక సువర్ణుడు కలిసి ప్రచారకులుగ నియమింపబడిరి. వారు ప్రతి సంవత్సరము కొన్ని గ్రామములను తీసుకొని వాటిలో పర్యటించి అస్పృశ్యత నివారణముగురించి ఉపన్యసించుచూ హరిజనుల ఇబ్బందులను తొలగించుచున్నారు. ఆ గ్రామములోని బావులను ముఖ్యముగా ప్రభుత్వమువారు త్రవ్వించిన

బావులను అన్ని జాతులవారు ఉపయోగించుకొనునట్లు చేయగలిగిరి. లాండ్రీలు, క్షౌరశాలలూ కాఫీ హోటళ్లు మొదలగు వాటిలో హరిజనులకు సవర్ణులతో పాటు ప్రవేశము కలిగించుటలో వారు గొప్ప విజయము సాధించిరి. హరిజనులమధ్య అనగా మాల మాదిగ కులములమధ్య వున్న విభేదములను తొలగించి వారికి గాంధీ తత్వమును బోధించుచుండిరి. ప్రభుత్వము పరిష్కారము చేయలేని సమస్య లనేకములను జిల్లా హరిజన సేవా సంఘపు ప్రెసిడెంటూ సెక్రిటరీ, వారి తరపున పనిచేయు ప్రచారకులు పరిష్కారము చేయగలిగిరి.

ఈ సందర్భములో హరిజనసేవా సంఘమువారు శ్రీహరికోటలో చేయుచుండు కృషి ప్రత్యేకముగ పేర్కొనతగియున్నది. శ్రీహరికోట 55 చిన్న చిన్నగ్రామములతో కూడుకొన్న పులికట్ సరస్సులోని ప్రదేశము. ఇచట హరిజనుల సంఖ్య చాల ఎక్కువ. అస్పృశ్యతను పాటించువారు అనేకులు యిచటనున్నారు. హరిజనులకు విద్యాసౌకర్యములుగాని, యితర సౌకర్యములుగాని యీ ప్రదేశమందు లేదని చెప్పవచ్చును. హరిజన సంఘమువారు ఈ ప్రదేశమును సర్వేచేసి హరిజనుల ఇబ్బందులను ప్రభుత్వముదృష్టికి తీసుకొనివచ్చిరి. ఐదు సంవత్సరముల క్రిందట కేంద్రమంత్రియగు శ్రీ బి. యస్. దాతార్‌గారు స్వయముగ నచ్చటికివచ్చి హరిజనోద్ధరణమునకై కొన్ని ఏర్పాటులు చేయగలిగిరి. అప్పటినుండి నచ్చటి హరిజనుల స్థితి చక్కబడసాగెను. ఆ ప్రదేశమునందు 150బావులలో సవర్ణులతో పాటు హరిజనులుకూడ నీళ్ళు తీసుకొనుటకు వీలు కల్పింపబడెను. ప్రభుత్వము వారు కొన్నిరోడ్లను,అస్పత్రిని, వృత్తి విద్యల నేర్పుటకు ఒక విద్యాలయమును స్థాపించిరి. ఇందు తాటిపీచు, పేము మొదలైన పరిశ్రమలయందు శిక్షణ యివ్వబడుచున్నది. యీ విధముగ ప్రభుత్వమువారూ హరిజనసేవా సంఘమువారూ కలసి హరిజనుల స్థితిగతులలో గొప్పమార్పును తేగలిగిరి.

### విద్యాభివృద్ధి

హరిజన ఉద్ధరణములో విద్యాసాధనమను మాటను అనేక సంవత్సరముల క్రిందట జిల్లాలోని పెద్దలు గ్రహించిరి. 1927 లో కొందరు పెద్దలు కలిసి ఆది ఆంధ్ర ఉద్ధరణసంఘమును స్థాపించిరి. దానికి ప్రథమమున శ్రీ అమంచర్ల కృష్ణ రావుగారు ప్రెసిడెంటుగాను, తిక్కవరపు రామిరెడ్డి, వెన్నెలగంటి రాఘవయ్యగారు జాయింటు సెక్రటరీలుగను ఎన్నుకొనబడిరి. అప్పుడు శ్రీ రామిరెడ్డిగారు మునిసిపల్ ఛైర్మెన్‌గనూ, శ్రీ రాఘవయ్యగారు కౌన్సిలర్‌గనూ ఉండువారు. శ్రీ రామిరెడ్డిగారి సహాయమువలన ప్రస్తుతము బాలుర హాస్టలుగనుండు ఇంటిని హరిజనులకు ఒక ప్రత్యేక హాస్టలు వుండుట మంచిదని తలచి నెల్లూరు ముత్యాలపాళెములో ఒక హాస్టలును స్థాపించిరి. ఇదే మొదటిబాలికల హాస్టలు. దీని పర్యవేక్షకులలో ఒకరైన బొడ్డు పుల్లయ్యగారి కుమార్తెలు యిందులోచేరి దీని ఫలితముగ ప్రస్తుతము వున్నతస్థితిలో నున్నారు. రెండు సంవత్సరములు ఈగృహమును జరిపిన తర్వాత చదువుకొనిన బాలికలకు విద్యనేర్పుకొనిన తగిన యువకులు దొరకడం ఒక సమస్యగా తేలినది.

ఆకారణముచేత ఒక బాలుర హాస్టలుకూడా కట్టడము ఉచితమని భావించి మూలపేట మున్సిపల్ అవరణములో బాలుర హాస్టలును స్థాపించిరి. దానిని చాలాకాలము తూములూరు సుబ్రహ్మణ్యంగారు నిర్వహించిరి. కొంతకాలమయిన తర్వాత హరిజనులకు గాను కట్టబడిన సత్రము సక్రమముగ ఉపయోగించని కారణమున బాలుర హాస్టలును 1929 లో అక్కడికి మార్చిరి. యిప్పుడు కూడా ఆహాస్టలు ఆసత్రములోనే ఉన్నది. ఆటుతర్వాత 1940 వరకు అన్నదాత ఆదినారాయణగారు దానిని నిర్వహించిరి. ప్రతిరోజు బాలుర నందరినీ పినాకిని నదికి తీసుకొనివెళ్ళి వారిచేత స్నానముచేయించి, దారి పొడుగున భజనపాటలు పాడుచు వారు హాస్టలు చేరుచుండిరి. క్రమశిక్షణ, శుచి, శుభ్రత బాలురకు చక్కగా అలవాటు చేసిరి. తరువాత ఎనుగ పట్టాభిరామరెడ్డిగారు దీనికి కార్యనిర్వాహకులై సర్వతోముఖ ప్రజ్ఞతో దీనిని నిర్వహించుచున్నారు. ఇందు వందలకొలది బాలురు ఉన్నారు. ఇదేవిధముగ చిన్న చెరుకూరు బుచ్చిరెడ్డిపాళెం వాకాడు మున్నగు ప్రదేశములలో బాలబాలికల వసతి గృహములు విరాజిల్లుచున్నవి.

బాలికల విద్యాభివృద్ధికై స్థాపింపబడిన హాస్టలులో నెల్లూరు పట్టణమునందుండు తిక్కవరపు మీనమ్మ హరిజన బాలికల హాస్టలు ప్రత్యేకముగ పేర్కొనతగివున్నది. దీనికి శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారు అధ్యక్షులు. శ్రీమతి అల్లాడి అన్నపూర్ణమ్మగారు కార్యదర్శి, ఈమె గొప్ప ప్రయత్నము చేసి విరాళమును సంపాదించి హాస్టలుకుగాను విశాలభవనమును నిర్మాణము చేయగలిగెను.

ఇందులో 120 మంది బాలికలువున్నారు. వీరిలో కొందరు, బ్రాహ్మణాది వర్ణములకు చెందినవారు అస్పృశ్యతను నివారించుటలో అన్నివర్ణములకు చెందిన బాలికలు ఒకే హాస్టలులో నివసించుట గొప్పసాధనమయ్యెను. ఇందు బాలికలకు ఇంగ్లీషు విద్యతోపాటు లలితకళలు సంగీతము, నృత్యము, చేతిపనులు గీతాపఠనము మొదలైనవి నేర్పబడుచున్నవి. సమాన అవకాశములున్నప్పుడు హరిజనులు ఇతర వర్ణముల వారికి ఎందులోనూ తీసిపోరని యిది చాటించుచున్నది.

బాలబాలికల హాస్టలులందు విద్యనభ్యసించినవారు స్త్రీలు పురుషులు గొప్ప ఉద్యోగములలో ఉన్నారు. డాక్టర్లుగాను ఇంజనీర్లుగాను వెల్‌ఫేర్ ఆఫీసర్లుగాను నర్సులూ టీచర్లుగాను అనేకులు వుద్యోగములు చేయుచున్నారు. వీరిలో విద్యాధికులయిన హరిజనస్త్రీలు ఉత్తమ గృహిణులుగా తమతమ కుటుంబములను సరిదిద్దుకొనుచున్నారు.

జిల్లాలో హరిజనాభివృద్ధికై కలెక్టరుగ నుండిన శ్రీ మలయప్పగారు, జోగప్పగార్లు చిరస్మరణీయమైన కృషినిగావించిరి. వీరితోపాటు స్మరించతగినవారు శ్రీచిలకమర్తి సుబ్బరాయ గుప్తగారు, ఇంజనీర్‌గ నుండిన సి. వి. యస్. నరసింహరావుగారు. వ్యవసాయకూలి తగాదలను పరిష్కరించుటయందును పిచ్చుమంతను మాన్పించుటలోనూ బంజరుభూములను పంపకము చేయుటలోను నీటిపారుదల విషయములోను వీరు హరిజనులకు ఎంతో వుపకారము గావించిరి.

**దేవాలయ ప్రవేశము :**

హరిజనాభివృద్ధిలో దేవాలయ ప్రవేశము ఒక ప్రధానమైన అంశము. ఈవిషయములోను అంటరాని తనమును నిర్మూలించుటలోను కీర్తిశేషులయిన పొట్టి శ్రీరాములుగారు అమోఘమైన కృషిని గావించిరి 1944 లో ఆయన ఒక పెద్ద అట్టలో హరిజనులకు దేవాలయప్రవేశము ఇయ్యవలెను, సవర్ణులతో పంక్తిభోజనము జరుపవలెను, అంటరానితనము నిర్మూలము చేయవలెను, అని పెద్ద అక్షరములతో వ్రాసి ఆ అట్టను మెడకు తగిలించుకొని పట్టణమంతటను సంచారము చేయుచుండువారు. వారు జాతీయ కీర్తనలను పాడుచు ఇంటింటికి పోయి భిక్షము అడిగితెచ్చి దానితో నెలకొకపర్యాయము అన్ని కులములకు చెందిన హరిజనులకు పంక్తిభోజనమును ఏర్పాటుచేయుచుండువారు.

మద్రాసు ప్రభుత్వమువారు హరిజన దేవాలయ ప్రవేశచట్టమును చేయుటకు పూర్వమే అట్టి చట్టమొకటి అవసరమని భావించి శ్రీరాములుగారు ఉత్తర ప్రత్యుత్తరములద్వారా మద్రాసు రాష్ట్రముఖ్యమంత్రి అయిన ప్రకాశంపంతులుగారితో సంప్రదించిరి. కాని పంతులుగారివద్దనుండి తృప్తికరమగు జవాబురాని కారణమున శ్రీరాములుగారు ప్రాయోపవేశము చేసిరి. అప్పుడు ముఖ్యమంత్రి హరిజన దేవాలయప్రవేశ విషయమై త్వరలోనే చట్టమును చేయునట్లు శ్రీ బి. యస్. మూర్తిగారి ద్వారా సందేశము పంపగా వారు ఉపవాసదీక్షను వారము రోజులైన తర్వాత విరమించిరి.

శ్రీరాములు హరిజన దేవాలయ ప్రవేశవిషయమై చేసిన ప్రయత్నములలో ఒకదానిని ప్రధానముగ పేర్కొనతగియున్నది. నెల్లూరు పట్టణములో మూలపేట యందుండు శ్రీ వేణుగోపాలస్వామివారి దేవాలయము మిక్కిలి ప్రఖ్యాతి గాంచినది. అందులోనికి ప్రవేశము కలిగిన యెడల హరిజన ఉద్యమమునకు బలము చేకూరునని తలచి దేవస్థానపు మేనేజింగుట్రస్టీగారితో సంప్రదించిరి. కాని వారు దానికి సుముఖులుగా నుండని కారణమున శ్రీరాములుగారు మహాత్మాగాంధీగారి అనుమతినిపొంది దేవాలయము యెదుట 7-3-46 సం॥ లో ఉపవాసము మొదలుపెట్టిరి. అటుపైన కొన్నిదినములు గడచిన తర్వాత దేవస్థానపు ట్రస్టీలు గవర్నెంటువారి అనుమతిని పొంది హరిజనులకు దేవాలయ ప్రవేశము గలిగించెదనని హామీ యియ్యగా వారు ఉపవాసదీక్షను మానుకొనిరి. తర్వాత కొంత కాలమునకు ఆ దేవాలయములో హరిజనులకు ప్రవేశము లభించెను.

శ్రీరాములవంటి యితరుల కృషిఫలితముగ నెల్లూరులోని రంగనాయకస్వామి వారి దేవాలయములోనికిని, జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గండవరము, సంగం మొదలైన దేవాలయములలోకి హరిజనులకు ప్రవేశము క్రమక్రమముగ లభించెను. వారు సవర్ణులతోపాటు అన్నిదేవాలయములలో పూజా కైంకర్యముల చేయగలిగిన వారైరి.

గాంధీగారి నిర్యాణాంతరము రాష్ట్ర ప్రభుత్వమువారు ప్రతినెల 30 వ తేదిని హరిజనదినముగ ప్రకటించి ఆ రోజున గ్రామములలోనూ పట్టణములలోనూ హరి

జనోద్ధరణ కార్యక్రమములను జరిపింప వలసినదిగా వుత్తరవు చేసిరి. కాని 1948 లో మద్రాసు ముఖ్యమంత్రిగా నుండిన రామస్వామిరెడ్డిగారు ఆ విషయమై శ్రద్ధ వహింపని కారణమున పొట్టి శ్రీరాములు మద్రాసువెళ్ళి ముఖ్యమంత్రి ఆఫీసుఎదుట 10-9-48 నుండి వుపవాస దీక్షను ప్రారంభించగా వారికి ప్రభుత్వమువారు ఒకనెల కఠిన శిక్షనువిధించిరి. అటుతర్వాత శ్రీరాములుగారు రాష్ట్రపతి రాజేంద్రప్రసాదు గార్ని సేవాగ్రామములో కలుసుకొనగా, రాజేంద్రప్రసాదుగారు రామస్వామిరెడ్డిగారికి తగిన సలహాయిచ్చి హరిజన దినకార్యక్రమము చక్కగా అమలులోనికి వచ్చునట్లు ఏర్పాటుచేసిరి. ఇప్పుడు ప్రస్తుతము జిల్లాయందంతటను అధికారులు అనధికారులు కలిసి పంక్తిభోజనములద్వారా హరిజన దిన కార్యక్రమము జరుగుచున్నది.

**ఆర్థికాభివృద్ధి :**

స్వరాజ్యము లభించిన తర్వాత హరిజనులు ఆర్థిక అభివృద్ధికై ప్రభుత్వమువారు విశేషద్రవ్యమును ఖర్చుపెట్టు చున్నారు. ఇండ్లనివేశములకు, బావులకు, వ్యవసాయమునకు, ఇండ్లను కట్టుకొనుటకు, కుటీర పరిశ్రమలు స్థాపించుటకు, వ్యవసాయ పనిముట్లు, పశువులు, మొదలగు వాటికినీ విద్యార్థులుగ నుండు హరిజనుల మధ్యాహ్న భోజనములకును, పుస్తకములకునూ, ఇతర ఖర్చులకునూ, విశేష ద్రవ్యమును ఖర్చు పెట్టుచున్నారు. వీటిలో ఏ ఏ పద్దులక్రింద ఎంతెంత ద్రవ్యము 1947 నుండి యిప్పటివరకు కర్చుపెట్టబడినదో యీక్రింది పట్టికల వలన స్పష్టముకాగలదు.

1947-48 నుండి, 1954-55 వరకు ఈక్రింది శీర్షికలక్రింద హరిజనోద్ధరణకై ధనము సద్వినియోగమైనది.

1, ఇండ్లస్థలములు. (1947; 50,52,53) రు. 21113-61.
2. మధ్యాహ్నభోజనము. రు. 538834-36.
3. ఉపకారవేతనములు. రు. 298039-37.
4. వస్త్రములు. (47,48,49,52) రు. 1164-86.
5. పుస్తకములు. రు. 17879-94
6. మంచినీటి బావులు. రు. 133341-00
7. దారులు, రస్తాలు (49 నుండి 55) రు. 59515-00
8. భోజనవసతి. రు. 289075-00
9. భూములు కొనుక్కొనుటకు, (47,54, నరుతేదు.) రు. 51770 14

పై వివరణమువలన నెల్లూరుజిల్లాలో గత 20, 30 సంవత్సరముల నుండి హరిజన ఉద్యమము ఎంతటి అభివృద్ధి గాంచినదో స్పష్టమగుచున్నది. కాని జరిగిన పని కంటె జరుగవలసిన పని ఎంతో ఎక్కువగ వున్నది. గ్రామప్రాంతములలో అంటరానితనము పూర్తిగ నిర్మూలనము కాలేదు. దారిద్ర్యము హరిజనులను పట్టి పీడించుచున్నవి. విద్యాభివృద్ధికి కావలసిన అవకాశములు యిప్పటికికూడ పరిమితములుగనే వున్నవి. హరిజనసంఘమువంటి సంస్థలు హరిజనోద్ధరణ విషయమై మరింత శ్రద్ధ వహించిన గాని హరిజనులకు సంఘములో తగిన స్థానము లభించదు. ఇందుకుగాను జిల్లాలోని నాయకులు పంచాయితీ రాజ్యసంస్థలు ప్రభుత్వోద్యోగులు కలిసి పనిచేయవలసి ఉన్నది.

కర్ణోత్పల : సముక్తి కర్ణామృత.

అంగాకృష్ట మకూలయా సరభసం గూఢౌ భుజాభ్యాం స్తనా-
వాకృష్టే జఘనాంశుకే కృతమతః సంసక్త మూరు ద్వయమ్।
నాభీ మూలనిబద్ధ చక్షుషి తయా వ్రీడానతాంగ్యా ప్రియే
దీపః ఫూత్కృతి వాతవేపితశిఖః కర్ణోత్పలేనాహతః॥

ఔచిత్యం వచసాం ప్రకృత్యనుగతం, సర్వత్ర పాత్రోచితా।
పుష్టిః స్వావసరే రసస్యచ, కథామార్గే చ నాతిక్రమః।
శుద్ధిః ప్రస్తుత సంవిధానక విధౌ, ప్రౌఢిశ్చ శబ్దార్థయోః
విద్వద్భిః పరిభావ్యతా మవహితై రేతావదేవాస్తు నః
యశోవర్మః రామాభ్యుదయ

ఏకోఽప్యసౌ సకల సత్త్వహితాయ కాయమిచ్ఛావినిర్మిత మనేక ముపాదధానః
నానాగ మానుపదిశన్ వివిధా విభక్తి తాస్తాస్సమస్త భువనప్రథితాః సమాఖ్యాః
ఏకః శివః పశుపతిః కపి లోఽథ విష్ణుః సంకర్షణో జినమునిః సుగతో మనుర్వా।
సంజ్ఞాః పరంపృథ గిమాస్తనవోఽపి కామ మవ్యాకృతే తు పరమాత్మని నాస్తి భేదః॥
జయంత : ఆగమ డంబర

యమునా - త్రివిక్రమ. (నలచంపూ VI-I) వినోద నామములు.

ఉదయగిరి గతాయాం ప్రాక్ ప్రభాపాండుతాయా-
మనుసరతి నిశీథే శృంగమస్తాచలస్య।
జయతి కిమపి తేజః సాంప్రతం వ్యోమ మధ్యే
సలిలమివ విభిన్నం జాహ్నవం యామునం చ॥

హర్ష చారిత.

సంరంభారవి భావితత్రిభువనాయాసస్య కామద్విషో
నృత్తారంభ విజృంభితైరవయవై ర్బ్రహ్మాండముద్భిన్నతః।
నిర్యన్మౌళి వినిర్గతాగ్రచరణం ప్రోల్లాసిదోః పల్లవం
పాయాద్వో బహిరంభసః ప్రవిచల కూర్మాయమాణం వపుః

# ౮4.

# సినిమా - నెల్లూరు

శ్రీ బండి గోపాలరెడ్డి, బి. కాం. (ఆనర్సు) డి. సి. ఆర్. ఎస్.

సినిమా మంచి చెడ్డలగూర్చి ఎంత మంది ఎన్నిరకాలుగా మాట్లాడుతున్నా నేడు మనదేశంలో ఒక పెద్ద పరిశ్రమగా స్థిరపడిపోయింది. నాగరికులకు, జానపదులకు ఒక ప్రధానమైన కాలక్షేపంగా తయారైంది. సత్యజిత్ రాయ్ వంటి ఉత్తమ కళామూర్తుల వల్ల ప్రపంచ సినిమారంగంలో భారతీయ చలనచిత్రాలకు ఎనలేని గౌరవప్రతిష్ఠలు చేకూరుతున్నవి.

దాదారావ్ ఫాల్కే అనే మరాఠీ కళాకారుడు 1913 లో మొట్టమొదట భారతీయ చలనచిత్రాన్ని (హరిశ్చంద్ర Full length picture) సృష్టించి మూకీ సినిమా యుగాన్ని మనదేశంలో శ్రీకారం చుట్టాడు. ఒకరకంగా చూస్తే-దక్షిణదేశ చలనచిత్ర పరిశ్రమకేగాక భారతదేశ చలనచిత్ర పరిశ్రమకే పితామహులన తగినవారు కీ. శే. రఘుపతి వెంకయ్యగారు. వీరు తెరమీద చలనచిత్రంతోబాటు, గ్రామఫోను రికార్డు ద్వారా శబ్దాన్ని కూడా కలిపి ఒక వింతైన ప్రదర్శనను ప్రారంభించారు. ,,క్రోనో మెగఫోన్'' అనే యంత్ర సహాయంతో వీరు 1910 లోనే చిన్నచిన్న ఆంగ్లచిత్రాలను ప్రదర్శిస్తూ భారతదేశమంతా పర్యటించారు. బర్మా, సిలోన్ లలో కూడా పర్యటించారు. మద్రాసు మూకచిత్రాల ప్రదర్శనం ప్రారంభించింది వీరే. 1912 లో గెయిటీ థియేటరును నిర్మించారు. 1914 లో మింట్ స్ట్రీటులో క్రౌన్ థియేటరునూ, 1917 లో పరుశువాకంలో ప్రస్తుతం రాక్సీ అనబడే గ్లోబ్ థియేటరునూ నిర్మించారు.

వీరు తమ కుమారుడైన కీ. శే. ఆర్. ప్రకాశ్‌ను, ఫిల్ము నిర్మాణాన్ని అధ్యయనం చేసేందుకని ఇంగ్లండు, అమెరికా దేశాలకు పంపారు. వీరు స్వదేశానికి తిరిగివచ్చిన తర్వాత ,,స్టార్ ఆఫ్ ఇండియా'' అనే పేరుతో స్టూడియోను నిర్మించి ఎన్నో మూకచిత్రాలు (గజేంద్రమోక్షం, భీష్మ, నందనార్, మొ॥) నిర్మించారు. నెల్లూరు మండలీయులైన శ్రీ. వై. వి. రావు శ్రీ పుల్లయ్య వీరిక్రింద తర్ఫీదు పొందినవారే.

'మూకీ' యుగం పోయి, 'టాకీ' యుగం-,,ఆలంఆర'' అనే హిందీ చిత్రంతో 1931 మార్చిలో ప్రారంభమైంది. అదే సంవత్సరంలో కీ. శే. హెచ్. యం. రెడ్డి గారు ,,భక్తప్రహ్లాద'' అనే చిత్రాన్ని తీసి దక్షిణ దేశంలో ఈ పరిశ్రమకు అంకురార్పణ చేశారు. అప్పుడే భారతీయ సినిమాల్లో సంగీతం ఆవిర్భవించింది. నేడు ప్రపంచ

పరిశ్రమలో అమెరికా తర్వాత ద్వితీయ స్థానాన్ని ఆక్రమించుచున్నది మనదేశం.

1936-37 ప్రాంతంలో రాజమండ్రి వైజాగ్‌లో "దురాసినీటోన్" అనే స్టూడియోలు ప్రారంభమైనా, ఒకటి రెండు చిత్రాలు తీసిన అనతికాలంలో మూతబడి పోయాయి. 1934 లో పి. వి. దాసు అనే ఆంధ్రుడు మద్రాసులో వేల్ పిక్చర్స్ లిమిటెడ్ అనే పేరుతో ఒక స్టూడియో స్థాపించారు. ఆనాడు మద్రాసు రాష్ట్రంలో చెప్పుకోదగిన పెద్ద స్టూడియో అదొక్కటే. ఈ పరిశ్రమకు క్రమంగా మద్రాసు నగరమే కేంద్రమైంది. ఇప్పుడిప్పుడు హైద్రాబాదులో కొన్ని స్టూడియోలు వెలసి కొన్ని చిత్రాలు నిర్మాణమవుతున్నాయి.

ఎన్ని అస్తవ్యస్తాలున్నా-ఈ పరిశ్రమ ఒక ప్రధానమైన కీలకస్థానాన్ని ఆక్రమించుకొన్నది. ఒక్క నెల్లూరులోనే రోజుకు సగటున 6 వేల రూపాయలు సినిమాప్రదర్శనలకు వసూలవుతున్నది. వినోదపుసుంకం కింద నెలనెలా 60 వేలదాక ప్రభుత్వానికి చెల్లిస్తున్నది. కొత్త చట్టంప్రకారం సినిమాల వల్ల నెల్లూరు మునిసిపాలిటీకి నెలకు 50 వేల దాక వస్తుంది.

నెల్లూర్లో ప్రప్రథమంగా కట్టిన సినిమా ప్రదర్శనశాల - క్రిష్ణసినిమాహాలు 1924 ప్రాంతంలో నిర్మించారు. 1927 పెద్దగాలివానకు కూలిపోయింది. తర్వాత వినాయకహాలూ, కొత్తహాలూ వచ్చాయి కాని వీటన్నిటికంటెముందుగానే 1917-18 ప్రాంతంలో సిద్దారెడ్డి రామలింగారెడ్డిగారు టౌన్‌హాలులో స్తంభాలు నిర్మించి, తెరలు గట్టి, బాల్కనీ యేర్పాటుచేసి,కొంతకాలం పాటు సినిమాప్రదర్శనలను జయప్రదంగా జరిపినారు. ఇందులో వీరు చేతితో త్రిప్పే యంత్రపరికరాలు వాడినట్టు తెలుస్తున్నది. ఆపరేటరుగా అందులో అప్పుడు రేబాల సుబ్బరామరెడ్డిగారు పనిచేశారు.

సినిమా పరిశ్రమలోకి మొట్టమొదట ప్రవేశించిన నెల్లూరువారు శ్రీ వై. వి. రావు బహుముఖమైన ప్రజ్ఞాపాటవాన్ని సంపాదించి, తెలుగు తమిళంలో కొన్ని మంచి కళాఖండాలను ప్రసాదించి, కొన్నేళ్ళు ఈ రంగంలో తిరుగులేని వ్యక్తిగా ఒకయుగాన్ని సృష్టించారు. ఆతర్వాత వచ్చినవానిలో ముఖ్యులు శ్రీ. పి. పుల్లయ్య, శ్రీ ఘంటసాల బలరామయ్య.

సినిమా నిర్మాణములోకి మన జిల్లా వాళ్లు 1935-36 లో గాని ప్రవేశించలేక పోయారు. అప్రవేశించిన వారిలో నూ స్థిరంగా నిలిచి కృషి చేయలేకపోయారు. అప్పట్లో నెల్లూరుకు మంచి అవకాశం వుండింది. ఇతర మండలాలకన్నా నెల్లూరు మద్రాసుకు దగ్గర్లో వుండడమే కాకుండా పెట్టుబడి పెట్టడానికి చాలినంతడబ్బూ, చాలినంతమంది భాగ్యవంతులూ, మైకాలో లక్షలు గడించిన ధనాఢ్యులూ, చాలమంది వున్నమండలం. సినిమాకళలలోనే గాక అవ్యాపారంలోనూ మర్మాలు, అన్యంతాలూ తెల్సిన అనుభజ్ఞులైన నెల్లూరువారు శ్రీ వై. వి. రావు, ఘంటసాల బలరామయ్య మొదలైన వారు మద్రాసు చేరిపోయారు. ఈ అవకాశాలన్నిటినీ సమీకరించుకొని పదికాలాలుపాటు నిలిచి పెద్దయెత్తున కళారచన చేస్తూ వుండవలసిన నెల్లూరుమండలం,

అనేక కారణాలవలన భిన్నాభిన్నమైన ప్రయత్నాలకు మాత్రమే నెలవైంది. అప్పట్లోనే మైకాలో బాగా భాగ్యవంతులైన కీ. శే. మవ్వూరు నారాయణరెడ్డిగారు గూడూరు పరిసరాల్లో ఒక పెద్ద సినిమా స్టూడియో నిర్మించాలని ప్రయత్నం చేశారు. ఇదెందువల్లనో ఫలించలేదు. జరగని వాటి ప్రస్తావనమాని, జరిగినవాటి కొచ్చినపుడు-తొలి భారీప్రయత్నంగా పేర్కొనతగింది, «శ్రీరామాఫిలింన్'' వీరు 1936 లో చిత్ర నిర్మాణానికి పూనుకొన్నారు. రెండు చిత్రాలు మాత్రమే తీయగలిగారు. తర్వాత ఈసంస్థ భగ్నమైంది. వీరు తీసిన చిత్రాలు 1936 లో «సతీతులసి''; 1938 లో నల దమయంతి. వీటికి దాదాపు 3 లక్షలా యాభైవేలు ఖర్చుఅయింది.

కీ. శే. ఘంటసాల బలరామయ్యగారి ప్రోత్సాహముతో నెల్లూరు ధనాఢ్యులుకలసి సాముదాయకంగా స్థాపించిన సంస్థ ఇది. శ్రీ రేబాల దశరథరామరెడ్డి, వందిపాటి సుబ్బరామరెడ్డి, ఆడపాల వెంకటకృష్ణారెడ్డి, సానికొమ్ము మాలకొండారెడ్డి మొదలగువారు ఇందులోని ప్రధానులు. వీరి మొదట చిత్రమైన "సతీతులసి" కి ఘంటసాల బలరామయ్యగారు నిర్మాణనిర్వాహకులుగా పని చేశారు. చిత్రపు నరసింహారావుగారు దర్శకులు. కథ, సినేరియా, మాటలు, పాటలు వ్రాసినవారు కవికోకిల దువ్వూరు రామిరెడ్డి. ఈ చిత్రం 1936 చివరలో విడుదలైంది. నిర్మాతలదృష్టిలో గట్టిదెబ్బతిన్నది. దాదాపు 30-40 వేల నష్టం వచ్చింది. అయితే కళాకారుల దృక్పథనుండి అది ఉత్తమోత్తమం గాకున్నా పరవాలేదనిపించే చిత్రమని చెప్పవచ్చు. 1937 ఫిలిం ప్యాలెస్‌లో దానికి అగ్రస్థానం దక్కింది. గంగయ్య, మాధవపెద్ది, నెల్లూరు నాగరాజరావు, రామతిలకం, శ్రీరంజని మొదలగువారు నటించారు.

"సతీతులసి''ని నమ్ముకొని శ్రీరామా ఫిలింస్ దెబ్బతిన్నది. అయినా నిరుత్సాహపడలేదు. మరునాడే దమయంతిని ఆశ్రయించారు. రెండవచిత్రంగా "నలదమయంతి''ని తీశారు. కీ. శే. దువ్వూరు రామిరెడ్డిగారు దీనికి పూర్తి నిర్మాణబాధ్యతను వహించారు. సినేరియా మాటలు, పాటలు ఆయనే సమకూర్చి దర్శకత్వాన్నిగూడా నిర్వహించారు. ఈ చిత్ర నిర్మాణమొక విషాద చరిత్ర. ఇప్పటివలె స్టూడియోలు ఎక్కువగా లేని మద్రాసును కాదని కలకత్తాలో చిత్రనిర్మాణం పూనిక చేశారు దీనివిషయమై ట్రంకురోడ్లో రోజుకొక పుకారు; దర్శకుడైన రామిరెడ్డిగారికి పక్షపాత మొచ్చిందని నెల్లూర్లో వదంతులు. కలకత్తాలో కొంత, బొంబాయిలో కొంత, తిరిగి మద్రాసులో మిగతా కొంత చిత్రనిర్మాణం కొనసాగి 1938 లో విడుదలైంది. నెల్లూరు నాగరాజరావు, మాధవపెద్ది, అద్దంకి, శ్రీరంజని, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, మొదలగువారు నటీనటులు మూడు నగరాల్లో చిత్రనిర్మాణం కొనసాగింది. కనుక ఈచిత్రం వెనుక, ఈ నిర్మాతల మధ్య కవికోకిల పొందిన ఆత్మక్షోభను బాగా అర్థం చేసుకొన్నారు. గనుక శ్రీ ఓ. ఎస్. రెడ్డిగారు దీన్ని A Tale of Three Cities"అని చమత్కరించారు. "Whatever originality was there in the picture was lost sight of

in the wake of discredit" అని అన్నాడు. ఎంతవరకు నిజమోకాని కంపెనీ దివాలా తీస్తుందని భయం ఏర్పడి వంది పాటి సుబ్బరామిరెడ్డి వంటి భాగస్తులు 5000 రు. షేర్లను రు. 3000 లకు అమ్ముకొన్నారట. కళాపోషణం చేయడానికి అల వాటుపడ్డ నెల్లూరు రెడ్డ్యాగ్రణులు-కష్టార్జితమో కాదోగాని, పెద్దమొత్తాలు పెట్టుబడి పెట్టారు. గనుక అవి గుట్టుపెట్టి రావాలని కలలుగని కళా రచనలో కాలుపెట్టి, గల్లా పెట్టెతో సరదాలాడారు, వ్యవసాయిక మన తత్వం సున్నితమైన ఈ కళా వ్యాపారంలో బెడిసింది. అంతచిత్రాలు వచ్చి "శ్రీరామా ఫిలింస్" భగ్నమైపోయింది. భారీ యెత్తున ప్రారంభమైన నెల్లూరువాళ్ళ ఈ సాముదాయక కృషి ఇలా అంతరించిపోయింది.

కవికోకిల దువ్వూరు రామిరెడ్డిగారు దీనితర్వాత-మరి దేనికీ దర్శకత్వ బాధ్యత వహించలేదుగాని శ్రీ పి. పుల్లయ్యగారు నిర్మించిన బాలాజీ (వెంకటేశ్వర మహాత్మ్యము) కి. ఘంటసాల బలరామయ్యగారు నిర్మించిన "పార్వతీ పరిణయా"నికి కొన్ని పాటలు వ్రాసిచ్చారు. బలరామయ్యగారు నిర్మించిన "సీతారామజననా"నికి పూర్తిగా సంభాషణలు వ్రాశారు.

జగదీష్ ఫిలిమ్స్ సంస్థ నిర్మాతలు :

శ్రీ వై. వి. రావు (యరగుడిపాటి వరదారావు) సినిమా కళలో సిద్ధహస్తులు సినిమా రంగంలోకి వెళ్ళిన నెల్లూరు వాళ్ళలో ప్రథములు నెల్లూరు నాటక సంఘాల్లో గడించిన అనుభవాన్ని ఆసరాగా చేసుకొని సినిమాల్లో ప్రవేశించి, నటన, దర్శకత్వం, యెడిటింగ్ మొదలైన అనేక శాఖల్లో ప్రవీణతను సంపాదించారు. చాల సంవత్సరాలు మద్రాసు చిత్ర జగత్తులో ప్రధాన పాత్ర వహించారు.

తెలుగు, తమిళం కన్నడ, హిందీ, అంగ్లభాషల్లో మంచి సాహిత్యవిజ్ఞానం సంపాదించి సినిమాదర్శకులుగా, నటకులుగా తమిళం, తెలుగు, హిందీల్లో ఎన్నో చిత్రాలు నిర్మించారు. తమిళంలో వీరు తీసిన "సావిత్రి" ద్వారా, వీరి పేరు తమిళనాడులో ప్రాచుర్యం వహించింది. వీరు తీసిన "మళ్ళీపెళ్ళి" "తాసీల్దారు" మరువరాని కళామూర్తులు. తెలుగు సాంఘిక చిత్రాలయుగంలో వాటికి విశేష ప్రాధాన్యత వుంది. 1936-40 తో మళ్ళీపెళ్ళి, విశ్వమోహిని; 41-44 లో సత్యభామ, తాసిల్దారు తీశారు. తమిళంలో మీరాబాయి, స్వర్ణలత, లవంగి, రామదాసు నిర్మించారు. లవంగి, రామదాసును హిందీలో తీశారు. వీటికి ముందు డజను మూకీచిత్రాలుగూడా తీశారు. 1950 ప్రాంతంలో "మంజరి" కాని చెప్పుకోతగిన చిత్రమేమీకాదు.

"శ్రీరామా ఫిలింస్" సంస్థ పుట్టుకకు కారకులై మనవాళ్ళకు ఈ వ్యాపారాన్ని రుచి చూపించిన ఘంటసాల బలరామయ్యగారు ఆ సంస్థతో విడిపోయిన తర్వాత-సొంతంగానే కృషిచేసి 1938 లో కుబేరా ఫిలిమ్స్ ద్వారా ఒకటి రెండు చిత్రాలు నిర్మించారు. ఇవీ కీచులాటకు లోనై పటాపంచలైంది. ఆ తర్వాత తన ప్రతిభావిశేషాలతో ప్రతిభాఫిలిమ్స్ అనే సంస్థను స్థాపించి చిత్ర నిర్మాణంలో స్థిరపడిపోయి 5, 6 చిత్రాలువరకు నిర్మించారు. వీరిసినిమా నిర్మాణ ప్రయత్నాల్లో ద్రవ్యవసతిని

చేకూర్చి తోడ్పడిన వారిలో నాస్తరాజు పాకెం శాస్త్రుల్లు శ్రీ పినుమూరు వెంక రెడ్డిగారు ముఖ్యులు. తెలుగు చలనచిత్ర రంగంలో కలకాలం నిలిచిన సంస్థలలో "ప్రతిభా పిక్చర్స్" ఒకటి. వీరు తీసిన "బాలరాజు" "స్వప్నసుందరి" "ముగ్గురు మరాటీలు" ఆంధ్రదేశంలో ఒక నూతన శకాన్ని సృష్టించాయి. కనకవర్షాన్ని కురిపించాయి. కథలు ఎన్నుకొనటంలో, వాటిని చిత్రీకరించడంలో సామాన్యజనం గుబుళ్ళకు అనుగుణంగా, వారి హృదయాలకు అమితదగ్గరగావుండే విధంగాచిత్రనిర్మాణం చేయడం వీరి ప్రత్యేకశక్తి. 1938-38 లో భక్తమార్కండేయ, మైరావణ; 41-44 లో పార్వతి, గరుడగర్వభంగం, సీతారామ జననం, 46-48 లో ముగ్గురు రాటీలు, బాలరాజు; ఆ తర్వాత స్వప్నసుందరి, సాయి బాబా చిత్రాలు నిర్మించారు. ప్రతిభావారి "రేచుక్క" తీస్తూ తీస్తూ చనిపోయారు. ఆ తర్వాత దాన్ని శ్రీ పి. పుల్లయ్యగారు పూర్తి చేశారు. వీరు తీసిన డజను చిత్రాలకూ దాదాపు 25 లక్షల దాక పెట్టుబడి పెట్టారు. అన్ని గొప్పగా విజయాన్నే సాధించాయి.

నాలుగు కాలాలపాటు పౌరాణిక చిత్రాలుతీసి, సినిమాజగత్తులో నిలదొక్కుకొని, పదికాసులు గడించి, మళ్ళీ పోగొట్టుకున్నవారు చుండూరు రామానుజంశెట్టిగారు. "ఫేమస్ ఫిలిం సర్క్యూట్" సంస్థాపకులు. షిరాక్‌తో చేరి- చిత్రనిర్మాతగానే గాక, డిస్ట్రిబ్యూటరుగానూ, మంచి పేరు వ్యాపారదక్షతా సంపాదించుకొన్నారు. 1938 39 ప్రాంతంలో "వెంకటేశ్వర మహాత్మ్యం", "ధర్మపత్ని" తీశారు. ఈ రెంటికీ దర్శకత్వ బాధ్యత వహించినవారు శ్రీ పి. పుల్లయ్యగారు. 1945 లో 'నారద-నారది' అనే పౌరాణికాన్ని కూడా తీశారు. వీటి నిర్మాణవ్యయం దాదాపు 4 లక్షలయింది. డిస్ట్రిబ్యూషనుకుగాను దాదాపు 10 లక్షల దాక పెట్టుబడి పెట్టారు.

కావలి ఎమ్. ఎస్. ఆర్. గుప్తాగారు 1937 ప్రాంతంలో "ద్రౌపది మానసంరక్షణ" అనే చిత్రం నిర్మించి అంతటితో చాలించుకున్నారు. ఈ మానసంరక్షణానికి లక్షాఇరవై వేలయ్యింది. సింగపేట కొండూరు సట్టెయ్య ప్రభృతులు కలసి "కాలచక్రం" అనే చిత్రానికి లక్షకు పైగా ధారపోశారు. "నదీనాం సాగరంగతిః" అయ్యింది. కోవూరు చేనేతవారు కొందరు కల్సి "ఛత్రపతి ఫిలిమ్స్" క్రింద "రాధిక" చిత్రాన్ని తీశారు లక్షయాభైవేల పెట్టుబడి. ఇదీ సరిగా ఆడ్చిరాలేదు. కొత్తహాలు ప్రొప్రయిటర్ అహ్మద్‌ఖాన్‌గారు 1939 ప్రాంతం లో సినిమానిర్మాణంలో కాలుపెట్టారు. కాని సాఫీగా నిర్వహించలేకపోయారు. ఆతర్వాత డిస్ట్రిబ్యూషన్‌లోనూ కొంత ఖర్చుపెట్టి చాలించారు. కాళ్ళకూరు సదాశివరావు, బి. డి. ప్రసాదరావు ప్రభృతులు కలసి స్వర్ణలతా బేనర్ కింద "స్వర్ణమాల" తీశారు. అంతటితో విరమించుకొన్నారు. ఇట్లా తగిన అనుభవంకాని, అభిరుచికాని, పుష్కలంగా ధనంగాని లేకుండా చేతగాని వ్యాపారంగా కొనసాగించి పోగొట్టుకొన్న జాప్తా యెక్కువగా కన్పిస్తుంది. "లలితా ఫిలిమ్స్" అనేపేరుతో తూములూరు ఆదినారాయణ సారథ్యంతో రేబాల సోదరుల సంస్థ ఒక చిత్రనిర్మాణంతో కొండెక్కి

నట్టుంది. రేబాల దశరథ రామిరెడ్డిగారు మళ్లీ ఇటీవల "వచ్చిన కోడలు నచ్చింది" తీసి ఈ రంగంనుంచి పూర్తిగా విరమించినట్టున్నారు.

ఇటీవల వారిలో శ్రీ అల్లారెడ్డి శంకర రెడ్డిగారు పేర్కొనతగిన సాహసోపేతమైన ప్రయోగాలు చేసినవారు. 30 లక్షలకు పైగా కర్చుపెట్టి దక్షిణ భారతదేశంలో మొదటి సంపూర్ణ గేవాకలర్ చిత్రం 'లవకుశ' ను ఇటీవలనే విడుదల చేశారు. నెల్లూరుజిల్లా నాయుడుపాళెం వీరి స్వగ్రామం. యం. వీ. బి. యల్. చదువుకొన్నారు. 1941 లో ఆంధ్రదేశంలో ప్రధమ సిరమిక్ ఫ్యాక్టరీని తెలకొల్పారు 1946-48 లో చిత్ర నిర్మాణంలో ప్రవేశించారు. '48 లో 'మానవతి'ని తెలుగు, తమిళంలో విడుదలచేశారు. ఆర్థికంగా దెబ్బతిన్నా '54 లో "చరణదాసి" తెలుగు, తమిళంలో తీశారు. చక్కటి చిత్రమని అనిపించుకోవడమేగాక, మంచి ఆర్థిక విజయాన్నిగూడా సాధించింది. ఇప్పుడు మళ్లీ భారీయెత్తున పౌరాణికచిత్రం తీయాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

పొన్నలూరి బ్రదర్స్ ఇటీవల కొన్నాళ్లు సుడిగాలి సృష్టించారు. భాగ్యరేఖ, దైవబలం, శోభ, కాడెద్దులు ఎకరంనేల-పరంపరగా చిత్రాలు తీశారు. సినిమాహాలు, స్టూడియో నిర్మించారు. ఇప్పుడు వారి జాడే కనపడ్డం లేదు. 'నల్లపరెడ్డి బ్రదర్స్' ఒకటి రెండు డబ్బింగ్ చిత్రాలతో మానుకొన్నారు. 'ఫిలిమ్స్' రమణారెడ్డిగారి 'అన్నా-చెల్లెలు' పెల్లేటి వెంకటకృష్ణారెడ్డి (పద్మనాభరావు) గారి "బావమరదళ్లు"...వగైరా వగైరాలు ఎన్నొవచ్చాయి. యువదర్శకుడుగా అనుంచర్ల గోపాలరావు పైకివస్తున్నాడు.

"ఫిడేల్ రాగాలడజన్" ఆలాపించినవజాభి (తిక్కవరపు పట్టాభిరామరెడ్డి) ఆర్. వి. కృష్ణారెడ్డి, P. S. Reddy, బుచ్చిరెడ్డిపాళెం ప్రముఖులుకలసి గట్టిపునాదులతోనే "జయంతీ ఫిలింస్" స్థాపించి, "పెళ్ళినాటి ప్రమాణాలు" "కృష్ణార్జున యుద్ధం" తీశారు. ఆర్థికంగా మంచి విజయాన్నే సాధించాయి కాని ఎందువల్లనో ఈ సంస్థకూడా స్థిరపడ్డట్టులేదు.

సినిమా నటకుల్లో నెల్లూరు నాగరాజరావు, రంగస్వామి అయ్యంగారు, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, గాదేపల్లి రామయ్య, కాశీచెందు రాళ్లపల్లి నటేశం, ఘంటసాల, రాధాకృష్ణయ్య, వై. హెచ్. రావు మొదలైనవారి తర్వాత......ఇటీవలి కాలంలో రమణారెడ్డి, రాజనాల దీప్తతారలుగా వెలుగుతున్నారు. దొరస్వామి ఇటీవలె కీర్తి శేషులయ్యారు.

వెంకటగిరి నాటక సంఘాల ద్వారా రంగంలోకి ప్రవేశించిన ఆదార్య ఆత్రేయ (కిడాంబి నరసింహాచార్యులు) ఇప్పుడు Top ranking Cine writer అయ్యాడు. ఎన్నొ చిత్రాలకు బిగువైన సంభాషణలు వ్రాసి జీవంపోశారు, ఇంకా వ్రాస్తున్నారు. నారపరెడ్డిగారు చాల సినీమాలకు సంభాషణలూ, కొన్ని మంచి పాటలూ వ్రాసి-చెదిరిన కలలతో తిరిగి వచ్చేశారువ్యవసాయంలోకి. దరమాక అది శేషారెడ్డిగారు రికామీగా ఒకటీ, అర పాటలు వ్రాస్తున్నారు. "అమ్లాన పుష్పోపహారములతో ఆంధ్ర కవితా భారతి నారాధించుచున్న", 'లలిత కవితా కళానిధి' విద్వాన్ శ్రీ బడి గురవారెడ్డిగారుకూడ ఈ రంగంలో

జొరబడాలని ఉబలాటపడుతున్నారు! నెల్లూరు వాడైన శ్రీ టి. వి. యస్ శర్మగారు ఉత్తమ కళాదర్శకులుగా, ఫిల్ము పబ్లిసిటీ శాఖ నిర్వాహకులుగా సినిమారంగంలో బాగా స్థిరపడి పోయారు.

వెంకటగిరి రంగనాధదాస్ అకటవికటాలుపడి, ఘటనా ఘటనా సమర్థులై కొన్ని చిత్రాలు తీశారు. ఇటీవల ఎట్లనో "తోబుట్టువులు" విడుదల చేయించారు. తుంగా రాజగోపాలరెడ్డిగారి "జన్మహక్కు" ముగ్గా కొనసాగడంలేదు. ఈ చిత్రానికి యువరచయిత వేణు (వెంకటగిరి) సంభాషణలు కూర్చినట్టు తెలుస్తున్నది.

ఈ ప్రయత్నాలన్నీ ఇలా వెల్లా చెదురుగా వున్నయి. కాకిబంగారపు తళతళలు కొందర్ని కవ్విస్తున్నాయి. గల్లాపెట్టె గలగలలు కొందర్ని పరుగులు తీయిస్తున్నయి. ఏవేవో టెక్నికలర్ fascinating దృశాలు కొందరిని కన్నుగీటుతున్నాయి. ఎవరికీ ఉద్యమశీలత్వం ప్రేరకంగా మాత్రం లేదు. ఈ వాతావరణంలో పరిశుభ్రమైన వ్యాపారం మాటగాని, ఉన్నతమైన కళారచనమాటగాని ఎత్తడం అవివేకం. నెల్లూర్లో ప్రస్తుతం 11 సినిమాహాళ్ళున్నాయి. ఇందులో ఒకటి air conditioned హాలు. కాలక్షేపానికి మరోమార్గం లేదు గనుక, జనం విరగబడి సినిమాలు చూస్తూనే వున్నారు. పూర్వకాలంలో "జమీన్‌రైతు" లోను, ఇటీవలి కాలంలో 'మందాకిని'లోను సినిమాలపై చక్కటి వ్యాసాలు, సమీక్షలు వస్తుండేవి. ఇప్పుడవి కరువయ్యాయి. అడ్వర్టయిజుమెంట్ల కోసం కక్కుర్తి మాటలు తప్ప సవిమర్శకమైనవి బొత్తిగా కనపడ్డమే లేదు.

(ఈ వ్యాసరచనకు తోడ్పడినవి- నెల్లూరు సినిమాలగూర్చి శ్రీ మరుపూరు కోదండరామరెడ్డితో జరిపిన సంభాషణలు 6-11-47 నాటి జమీన్‌రైతు వ్యాసం; శ్రీ కె. వి. రఘునారెడ్డిగారి "కవికోకిల జీవితం" (అచ్చులోవున్న గ్రంథం) లోని "విచిత్ర లోకంలో కొన్నేళ్లు" అన్న ఖండిక తెలుగుభాషా సమితి వారి 'తెలుగు సంస్కృతి' సంపుటం 3 లో తెలుగుసినిమాపై పా. వ. గారి వ్యాసము.)

చిత్ర విచిత్రాలు - 16.

## నెల్లూరు "నగరజ్యోతి" కుడ్యపత్రిక

### (Mural News Catering)

కేవలం నెల్లూరు జర్నలిజంలోనేగాక, భారతీయ జర్నలిజంలోనే అపురూపమూ అపూర్వమైనట్టిది ఈ కుడ్యపత్రికా ప్రయోగం. ఇది నిజమైన Democrative Newspaper. చందాలేని పత్రిక. ప్రజాస్వామ్య పత్రిక, ప్రజాసామాన్యపు పత్రిక; a mass news paper వర్షాల్లోతప్ప మిగతా అన్నికాలాల్లో వుంటుంది. రోజూ మూడువేలకు పైగా చదువుతారు. గత 30 యేండ్లనుంచీ నిర్విఘ్నంగా కొనసాగుతున్న పత్రిక. (చూః "నెల్లూరు మండల పత్రికలు" దీనికి సంబంధించిన కొన్ని సంక్షిప్త వివరాలు. (Operational statistics)



ఇంద్రగంటి సుబ్రహ్మణ్యం.
నగరజ్యోతి విలేఖరి.

1. ఈ పత్రికా స్థాపన — 1932 సంవత్సరం.
2. పత్రిక సైజు : 26 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు.
3. ఈ 30 సంవత్సరాల్లో 3,33,00,000 సార్లు చదివి వుంటారు.
4. రోజుకి 3,000 అక్షరాలు, 30 సంవత్సరాలకు 3,28,50,000 అక్షరాలు. అక్షరం ప్రక్కన అక్షరం చేర్చిన దూరం 120 మైళ్ళు అవుతుంది.
5. చాక్‌పీసులు : దినం 1 కి 15 చొ॥న మొత్తం 1,24,000. (పలురంగులవి)
6. గోడ తుడిచినందుకు దినం 1 కి 19 న. పై. మొత్తం రు. 1925-00.
7. పత్రికను కొనుటకు దినం 1 కి 25 న. పై. చొ॥న రు. 2590-00.
8. దినం 1 కి 3 గంటలు వ్రాయుటకు —
యిప్పటి వరకు $3 \times 30 \times 12 \times 30 = 32400$ గంటలు నిలుచుక వ్రాసినట్లయినది.
ఇంద్రగంటి సుబ్రహ్మణ్యం, గండవరపు హనుమారెడ్డి (గం. హ.) ప్రస్తుతపు భిత్తికా లేఖకులు, సంపాదకులు.

## ౮౫.

పాతపురాణం:

# నెల్లూరు పాతసత్రాలు [I]

సేకరణ: బి. గో. రె.

"అంతములేని ఈ భువనమంత పురాతన పాంథశాల, వి
శ్రాంతి గృహంబు, అందు నిరుసంజలు రంగుల వాకిళుల్, ధరా
క్రాంతులు బహరామ్ జమిషీదులు వేనకువేలుగా
కొంత సుఖించి పోయిరెవరికో పెరవారికి చోటొసంగుచున్"

(కవికోకిల పానగాం)

నెల్లూరువద్ద పెన్నకు ఆనకట్ట కట్టిం తర్వాత ఆనకట్టమీద రహదారి రంగనాయకులపేటగుండా బండ్లు మనుషులు రావడం యేర్పడినదేకాని, ఆనకట్టలేని కాలంలో రంగనాయకుల పేటగుండా పెద్ద రహదారి వున్నట్లుగా లేదు. పాతకాలంలో అంటే రంగనాయకులపేటవద్దర పెన్నానది ఆనకట్ట నిర్మాణానికి పూర్వం (ఈ ఆనకట్ట నిర్మాణం 1852 ప్రాంతాలనుండి 1855 వరకు జరిగి, ఆతర్వాత పదేండ్ల లోపల వెల్లువ తాకిడి తగిలి 1865 ప్రాంతాల దీన్ని కొంతమార్చి పొడిగించినట్లుంది.) మొదట్లో పశ్చిమోత్తర దిక్కులనుండి పడమటి నెల్లూరు రావడానికి ప్రసిద్ధమైన రెండు త్రోవలున్నట్లు తెలుస్తున్నది. పడమటివైపు నుండి రాకపోకలకు ఓసుగులరేవు అనబడే దోరణాల రొట్టిరేవు-ఉత్తరవైపునుండి అంటే కోవూరు మొదలైన ప్రాంతాలనుండి రాకపోకలకు సంతపేటలోని శ్రీ ఆంజనేయస్వామివారి దేవాలయంమీదుగా ఏట్లోకి దిగే చోటునుండి బొజ్జమ్మగారి ఆంజనేయుల దేవళమురేవు. నెల్లూరుకు తూర్పున సముద్రం దాదాపు పదేను మైళ్ళలోనే వున్నందున ఈ వైపునుండి దూరప్రయాణీకులు రారాలరు. నెల్లూరుకు దక్షిణాన చాలవిస్తారమైన దేశమున్నది కనుక అవైపునుండి దూరప్రయాణీకుల రాకపోకలుండేవి.

పూర్వీకుల లోకజ్ఞానవిస్తృతి, లోకోపకారబుద్ధి పాతకాలపు సత్రాలవలన తెలుస్తుంది. మునుపు దారి రంగనాయకులపేట రహదారి కానందువల్ల, ఈ పేటలో పాతకాలపు సత్రాలున్నట్లు లేదు. శ్రీ రంగనాయకులస్వామిగారి తేరువద్దవుండే కీర్తిమూర్తులు (శ్రీ రంగనాయకులస్వామి గోపుర నిర్మాతలు) దురగుడిపాటి వెంకటచలంగారి సత్రమూ' ఇక్కడకు ఫర్లాంగు దక్షిణాన

I ఒంగోలు వెంకటరంగయ్యగారి "ప్రాతకాలపు నెల్లూరు" (ఇతి) "నెల్లూరు ప్రాతకాలపు సత్రాలు-పుట్టుపూర్వోత్తరాలు" (జమీన్‌రైతు) అను వ్యాసములనుండి సంగ్రహించడమైనది.

వేమనగుంట బొజ్జమగారి సత్రమూ ఈ పేట లోవున్నాయి కాని ఇవి పినాకినీ సేతుబంధ ప్రాస్తాలుకావు. వాటిని శతమానములు సమీపించి నిండు శిథిల స్థితిలోనున్నవి. (ఇటీవల వీటికి కొంత మరామత్తులు జరిగి నట్లున్నది.) ఇక కోవూరు రస్తామీదను దోర్నాదుల రస్తామీదను నెల్లూరుకు వచ్చే బాటసారులకు, బండ్లకు సౌకర్యార్థమై ఏర్ప డివుండిన నాలుగు సత్రాలు గూర్చి ఇక్కడ పేర్కొనవచ్చును. మొదటిది కాళారెడ్డి సత్రము, రెండవది బాలక్కసత్రము, మూడవది సుందరగిరివారి సత్రము, నాల్గోది గౌస్సాహెబు సత్రము, ఇవన్నీ నెల్లూరు కోట వెలుపలవున్నవే. ఇటు అంజ నేయస్వామి వీధినుండి వచ్చేవారికి, దోర్నా దుల రస్తానుండి వచ్చేవారికీ కాళారెడ్డి సత్రం కూడలిలో వుంది. దక్షిణాన ఆసు పత్రిరోడ్డు, తూర్పున ట్రంకురోడ్డు, పడమట చిన్న బజారునుండి రంగనాయకుల పేటకు పోవురస్తా కలియు చోటువరకూగల త్రిభుజా కృతిగల విశాల స్థలములో ఈ సత్రము వెలసివుంది. ఇప్పటికీ పేరుకు సత్రముంది కాని, ఇదీ, దీనిచుట్టూవున్న బయలు స్థలమూ ఇండ్లయినాయి. ఆరవై, డెబ్బయేండ్ల కిందట ఈ సత్రంలో జనమూ, బండ్లూ క్రిక్కిరిసి వుండేవి. దీనికనేక గ్రామాలలో మాన్యాలు జారీ అయివుండినట్లు తెలుస్తున్నది.

ఇంతకంటె ఎక్కువ సులభ ప్రయో జనకరంగా వుండాలనే తలంపుతో కోడూరు బాలక్క అనే కాపుస్త్రీ దొర్నాదుల రోడ్డున ఏరుదాటి ఈవల గట్టున కెక్కే చోట వొక గొప్ప సత్రము కట్టించారు. ఇదీసహా చాలకాలం చాల ఉపయోగంలో వుండి ఇప్పుడు నామమాత్రావశిష్టమై సత్రపు నివేశస్థలం మాత్రం ఊహించడానికి వీలుగా వుంది. ఆ కాలపు వర్తక శిఖామణులు ఈ సత్రమును దాటి యేటిగట్టు చేరువరకూ ఇండ్లుగట్టుకొని వాణిజ్యము సాగించుచుండే వారు. రైలులేని కాలాన కడపజిల్లా మొద లైన ప్రాంతాలనుండి, అడవి వీడు కలప సామానులన్నీ ఈ తెప్పలమీద కీసుగుల రేవుకడ లంగరై చేతులమీద అమ్ముడగు చుండేవి. పాతకాలపు నెల్లూరు సంతకూడా ఈ సత్రం సమీపాన (ఇప్పుడు ట్రయినింగ్ స్కూలు, మహమ్మదీయుల ఈద్గాపట్టుస్థల ములలోను) జరుగుచుండినది. అందువల్ల ఆ ప్రదేశానికి పాత సంతఅనే పేరుగూడా మన పెద్దవారెరుగుదురు. బాలక్క సత్రపు దూలాలు, వాసాలు, గోడలరాళ్ళు ఎట్లా ఏమైపోయాయో!

శ్రీ అంజనేయస్వామిగారి రేవున ఏరుదాటి ఇవతల గట్టెక్కగానే సుందరగిరి వారి సత్రమూ, దీనికి చేరిన మూడు నాలు గెకరాల స్థలమూ, చింతతోపూ, ఆ తోపులో ఒక చిన్న అంజనేయ స్వామిగుడీ పాంథు లకు స్వాగతమిచ్చుచుండేవి. ఆ దేవాలయా కారము మాత్రము ఊహ్యమగుచున్నదికాని ఈ సత్రము యేమై పోయినదో?

దీని కరభర్లాంగులో వున్నది గౌస్సా హెబుసత్రం. ఇది ఇప్పటికివుంది. బాగుంది వీరి మేనల్లుడు కీ. శే. హాజీమహమ్మద్ రహంతుల్లా సాహెబు మస్తాంగారు (వీరు కొంతకాలం ప్లీడరుగా వుండి ఆతర్వాత వెంకటగిరి సంస్థానం దివాంజీగారై శ్లాఘ్య మైన కృషిచేశారు. పార్సీ కవిపండితులు కూడా.) దీని జీర్ణోద్ధారం చేశారు. ఇప్పుడు

దీని అదృష్టం చూడండి. దీనిచుట్టూ మిక్కుటంగా అంగళ్లు. సత్రంలో ఎప్పుడూ ఇసుక రాలకుండా జనం. నాళ్ళ నడీపట్టు అటు రైలుకు పోవు త్రోవ, ఇటు రంగనాయకుల స్వామి దేవాలయానికి పోయే రాజమార్గం ఇందొక వంక ట్రంకురోడ్డు బజారువీధి కూడలి. స్నానానికి వాటికీ ఏరు సమీపంలోనే వుంది. ఇన్ని సంపదలతో వర్థిల్లుతున్నది సాహెబుగారి సత్రం.

నెల్లూరు దక్షిణపు భాగంలో-కుంఫిణీ దొరతనమునకు ముందు ట్రంకురోడ్డులేదు. వాకరు అనే జిల్లా జడ్జీగారి కాలంలో ఇది యేర్పడినట్టున్నది. అంతకుముందు ట్రంకురోడ్డు పట్టును ఇరుపక్కలా తోటసాగుబడులూ, మాగాణి సాగుబడులూ, కొనసాగు సాగుచుండిన భూములుండేవి. ట్రంకురోడ్డు యేర్పడుటకుముందు ట్రంకురోడ్డు, రోడ్డు నుండి పత్తేఖానుపేట మీదుగా పోవు మార్గమే పురప్రవేశమార్గం. దానివెంట నడిచి సర్వేపల్లి దర్వాజాగుండ పట్టణములోనికి జనము ప్రవేశము కలిగియుండిరి. ఇదొక గొప్ప కూడలి స్థలంగా వుండేది. అందుచే ట్రంకురోడ్డును పత్తేఖాన్‌పేట వీధియు చీలు బాటు ఆగుచోట భోగందాని సత్రమనే వొక ధర్మసత్రమున్నది. ఇదీ పూర్వపు స్థితిలో లేదుగాని కొద్దిగానే వుంది. బాస్వెలు నెల్లూరు జిల్లా మాన్యుయల్ నెల్లూరులోని సత్రములను పేర్కొనుచూ పత్తేఖాన్‌పేటలో వరలక్ష్మి సత్రమని వొకదానిని చెప్పారు. బహుశ పై భోగందాని సత్రమనేది ఇదిగానే వుంటుంది. భోగంస్త్రీలు చేసిన ధానధర్మాలనేకం వున్నాయి. నెల్లూరు అదారివీధిలో శివకేశవులకు రెండు మండపాలున్నాయి. ఇవి ఆతెగ స్త్రీలచే సమర్పింపబడినట్లు తెలుస్తున్నది. శ్రీ రంగనాయకుల స్వామివారి దేవాలయపు పడమటి గోడమీద వొకశాసనములో "శ్రీ స్వామివారిసానిది" పాత చింతగుంటలో కొంతభూమిని ఆ స్వామి వారి కిచ్చినట్లున్నది.

ఊరిలో నడుగు పెట్టగానే "రారమ్ము ఇందు విశ్రమింపుము" అని పిలిచినట్లు పూరి గవనులలో అనకట్ట నిర్మాణానికి ముందు సత్రాలిట్లు వెలసి లోకానికి ఉపకరించుచుండేవి. రహదారుల మారిపోవడం వల్లనూ, దేశ కాలపరిస్థితులూ, జనుల సౌకర్యాలు మారి పోవడంవల్లనూ పై చెప్పిన సత్రాల వుపయోగాలు తగ్గిపోయాయి.

ఆనకట్ట పుట్టినవెంబడి, వెంబడి కొన్ని సత్రాలు ఏర్పడినవి. కాని వాటికి పైన చెప్పినవాని వంటి లోకోపయోగ సన్నివేశాలేర్పడలేదు. ఇవి కొన్ని హైరోడ్ల ప్రక్కల అంగడి వీధులలోను వుండి యథోచితంగా వుపయోగపడుతున్నవి. రైలు వచ్చినతర్వాత బసలు కొరకు సత్రాలనపేక్షించేవారు అరుదయ్యారు. "ధర్మసత్రం" అని బోర్డుచూసినా చూసీచూడక పోతుంటారు.

పూర్వ సత్రాలగూర్చి చెప్పవలసిన విశేషం-సత్రమెంత తొట్టికట్లు కలిగి యెంత పెద్దదిగా వుండినా దాని సమీపంలోనే వేరుగా ముసాఫిర్‌ఖానా అనేది వొకటివుండేది. ఇది ప్రాయకంగా మహమ్మదీయ బాటసారుల కొరకు వుద్దేశింపబడినది. వారి స్త్రీల గోషాకు భంగంలేకుండా కొంచెం యెడంగానే ముసాఫిర్ ఖానావుండేది. ఆ ముసాఫిర్‌ఖానాలూ ఇప్పటి సత్రాలవెంత కన

వద్దంటేప. గౌస్సాహెబుగారి సత్రానికి చేరిన ముసాఫిర్ ఖానా రంగనాయకులపేట పోవురోడ్డుకు పడమట సదరు సత్రానికి సమీపానవుండేది. ఇప్పుడేమైందో!

పాతకాలంలో పైనచెప్పిన సత్రాలు గాక కొంచెం తక్కువ దర్జాలు చలివేంద్రలు (చలిపందిరి) కూడావుండేవి. కాళారెడ్డి సత్రానికి పడమట అనుసత్రిరోడ్డు నానుకొని ఉత్తరాన చీమకుర్తివారి చలివేంద్ర మొకటి వుండింది. వీరు నెల్లూరు కాపువారు. ఇదీ కొంచెం పాతదే దీనికి కొన్ని గ్రామాలలో మాన్యాలున్నవి. ఈ పాత చలివేంద్ర సత్రమేమయిందో పక్కనే మున్సిపాల్టీవారి కొళాయివుండగా.

ఈ చలివేంద్ర ఉపయోగం విచిత్రంగావుంది. ఊరి పెండ్లింట్లవాళ్లు (ప్రాయకంగా కాపువాళ్ళు, బలిజవాళ్లు మొదలగువారు) పెండ్లికి తరలివచ్చి ఈ చలివేంద్రలో విడిది చేస్తారు. కాపరి అట్టివారిని ఆదరించి గౌరవించి వారివారి ఆడవారు సంధ్యవేళలో అలంకరించుకోడానికి వారికి తలనూనె, పువ్వైన మొఖానికి కుంకుమ, కంటికి కాటుక. మొదలగువస్తువులు సమర్పిస్తారు. వారివారి సింగారింపులు అయిన వెంటనే పెండ్లికొడుకువారో, పెండ్లికొమార్తెవారో మేళతాళాలతో అక్కడనుండి బయలుదేరి వూరేగింపుతో వారివారి విడుమల చేరుతారు. ఈ చలివేంద్రలకడ జరిగే ఈమంగళ కార్యానికి సందిరేవు అని సంకేతం. పై చీమకుర్తివారి చలివేంద్రసత్రం ఇట్టి సందిరేవులకు ముఖ్యస్థానంగా వుండింది. బాలక్కసత్రంవద్దా కొంతకొంతగా సందిరేవులు జరుగుచుండేవి. ఇప్పుడు నాగరికత ముదిరి, తెలుగుమీరి సందిరేవులకు స్వస్తి చెప్పారు.

పూర్వపు చలివేంద్రలకడ ఇంకొక గొప్ప విశేషం. ఆవూరి దేవుళ్ల ఉత్సవాల్లో వేంచేసేటప్పుడు సత్రము ఎదుట దిగడానికి పెద్ద పెద్ద అరుగులుగాని మండపాలుకాని వుండేవి. కాళారెడ్డి సత్రంవద్ద కాళారెడ్డి మండపమొకటి ఇప్పటిదాక నిల్చివుంది. దేవుని వూరేగింపులులేని కాలంలో అప్పట పండ్లో, పలహారాలో అమ్మేవాళ్ళుంటుండేదికాబోలు.

బాలక్క సత్రంముందర వొక పెద్ద అరుగువుండేది శ్రీరంగనాయకస్వామి, శ్రీ మూలస్థానేశ్వరస్వామి, వేదగిరి శ్రీ నరసింహస్వామి, అక్కడ దిగుచుండేవారు. ఉత్సవకాలంలో సత్రం ముందర చలవ పందిరి వేసేవారు. సత్రమును నిర్మించిన ధర్మాత్ములు ఇట్టి నైమిత్తిక విశేషాషాలన్నిటికీ తగిన వసతులు, మూలధనాలు ఏర్పరచినట్లు ఆ యొక్క సత్రముల పూర్వచరిత్ర వలన తెలిస్తుంది. సత్రపు కాపరి ఆ యొక్క ధర్మాలు జరిపించాల్సిందేగాని చేతినుంచి అచ్చుకోవల్సి వుండేదికాదు. మొగుళ్ళూరువారిసత్రం, కందప్ప మేస్త్రీవారి సత్రం, తిప్పరాజువారి సత్రం, అయలూరివారి సత్రం మొదలగునవి వీటి తర్వాత వచ్చిన సత్రాలు

• • •

## బాట వెంటడి సత్రాలు

నెల్లూరు మండలములో ఉత్తర ముండు దక్షిణముదరకు పాలేరుమొదలు ప్రళయకావేరి సరస్సు, (Pulicat Lake) వరకు సముద్రతీరమనసే దండుబాట అను పేర ఒక రాజమార్గము గలదు. ఇది పెద్ద డొంక ఇప్పటికిని వాగర్తన. రాకపోకలకు ఉపయోగపడుచున్నది. పూర్వము కుంపిని (ఈస్టిండియా కంపెని) సైన్యములు ఈ దారిన పోవుచుండినవి.

అతర్వాత నేటి ట్రంకురోడ్డు నిర్మింపబడినది. ఉత్తర దక్షిణములకు సూటిమార్గము ఇదే అయినది. అవల కొన్ని ఏండ్లకు ఇనుపదారి దీని ప్రక్కననే నిర్మింపబడినది. యాభైఏండ్లకుముందు మదరాసురాకపోకలకు ట్రంకురోడ్ ఆధారమై యుండినది. కాలినడకను పోవువారికి బండ్లకు విశ్రాంతి కలుగునట్లుగా ఈరోడ్ పొడుగునా జమమైళ్ళకు ఒకచోట ఒక సత్రము ఒక బావి, ఒకతోపు, నిర్మింపబడియుండినవి. పాంథులు ఈ మజిలీలుగా విశ్రాంతి తీసుకొని అటుఇటు సాగిపోవుచుందురు.

పాలేరుమొదలు మదరాసువరకు పేర్గాంచియుండిన కొన్ని సత్రములను క్రింద ఉదహరించుచున్నాము. లారీ బస్సుల ప్రవేశముతో అడుగడుగు చలువపందిళ్ళకు అవసరము లేనందున నేడు ఈ సత్రము లన్నియు శిథిలములై పోయియున్నవి.

1. ఉలవపాడులో కోటమ్మ సత్రం. నేటికిని దేవరపల్లివారు సదావర్తిని జరుపుచున్నారు.

2. తెట్టు, 3. కావలి 4. మునుమూరు. 5. కడనూతల 6. ఉలవపాళ్ల 7. రాచర్లపాడు 8. రాజుపాళెం 9. కోవూరు

నెల్లూరు దాటినతర్వాత 10. రుమ్ందాసత్రము. దీనిని శ్రోత్రియం. బుజబుజ నెల్లూరు అనుచున్నారు. కాని పాతశాసనములో బుజబల నెల్లూరు అనికలదు. ఈ భుజబలుడు ఒక సేనాని. నెల్లూరు చెరువు కట్టించినది ఇతడే అందురు.

11. వెంకటాచల సత్రం. 12. రామదాసు సత్రం. 13. కంచేవారి మండపం (మనుబోలుదగ్గర) 14. మనుబోలుకు దక్షిణాన కండ్లేటదగ్గర మరియొక సత్రము 16. గూడూరు తర్వాత రైటర్ సత్రము 17. దొరవారి సత్రం 18. నెలబల్లి సత్రం 19. బోడెమ్మవారు సత్రం పోలిరెడ్డిపాళెం స్టేషనుదగ్గర 20. తురకోడి సత్రం మదరాసు దగ్గరుండి రెడ్‌హిల్స్.

ఈసత్రములన్నియు గ్రామము, లేనిచోట నెలకొల్పబడి యున్నవి. గ్రామము పట్టణము దారిమధ్య తగిలినచోటు ఊరి బయట సత్రములు నెలకొల్పబడి యున్నవి.

నెల్లూరు మండలములో రాకపోకలకు మదరాసునుండి బెజవాడవరకు ఉప్పు కాలువ అను బకింగుహామ్ కెనాలు సముద్ర తీరముననే త్రవ్వబడియున్నది. బకింగ్‌హామ్ గవర్నరుగా ఉండిన కాలములో కరువుపనిగా ఈ కాలువ త్రవ్వబడియున్నది. మదరాసునుండి దక్షిణ 90 మైళ్ళు ఉత్తరం 90 మైళ్లు మొదట ఈ కాలువ తీయబడినది. ఉత్తరాన బాపట్ల పంటకాలువలో కలిపి వేయబడుటచే అదిమొదలు, విశాఖపట్నం వరకు మంచినీటి కాలువ యైనది. దీనిలో పడవలతో మదరాసు సరకుల రవాణా జరుగుచున్నది.

దొరవారిసత్రము నాయుడుపేట పోలూరు తాలూకా యేకొల్లు గ్రామము పొలములో దొరవారి కోనేరు అను నామధేయముగల యొక కోనేరును, నొక సత్రమును, బంగారు యాచమనాయని వారు క్రీ. శ. 1760 లో నిర్మింపజేసిరి. ఆ కోనేరును, దొరవారి కోనేరని, ఆ సత్రమును దొరవారి సత్రమని పేరొందినది. బంగారు యాచమనాయని వారిదేకాలమున నొక

పేటను కట్టించిరి. దీనిని నాయని పేట (నేడు నాయుడుపేట యందురు.)

ఆనఘుఁడా బంగారు యాచతి
భూమీశుండు
కాశికాసేతు మార్గంబునందు
పేరైన నాయనిపేటఁగట్టించి యు
చ్చట విశాలంబుగా సత్రమొకటి.
నిర్మించి దానికి నిండార సగుటూరి
సీమాన్తరస్థమై వెలఁగుచిన్న
మాలయు జువ్వలపాలెంబు నారెండు
గ్రామంబులిచ్చి, ధర్మంబొనర్చి
నింపుమీఱ నాసత్రమందిప్పటికిని
వచ్చుజనులకు నెపుడు నవ్వారి
గాఁగ
నిచ్చుచుందురు భూపాలుఁడేర్పరించి
నట్టి భోజన సామాగ్రి యను
దినంబు
గీ॥ మఱియు బోలూరి సీమలో మాని
తముగ
నొప్పునే మల్లుమాలములో నొక్క
సత్ర
మొక్కనోసేరం నిర్మించె నుర్విదాని
సన్నుతింతురు దొరవారి సత్రమనుచు
(శిశుపాలవధ. 1-29,30)

నాయనిపేట దొరవారి సత్రములను గూర్చి శ్రీ గోపీనాథం వేంకటకవిగారు తమ శిశుపాలవధయందు వ్రాసిరి.

## చిత్రవిచిత్రములు - 18

### శాతవాహనకాలము నాటి నాణేములు, మృత్తికా ఘటములు.

విజయవాడనుండి మద్రాసునకు రెండవ రైలుమార్గము రచించుటకై, ఎత్తుగనుండు దారికై కట్టవేయుటకు మట్టి కావలసి, కొడవలూరువద్ద, రైల్వేదారికి తూర్పుననుండు 20, 30 అడుగుల, ఎత్తయిన దిబ్బలను కూలివారు త్రవ్విరి. మట్టిఅడుగున మృత్తికాఘటములు పగిలిన పెంకులు కానబడినవి. ఒకటో రెండో రాగినాణెములును కానవచ్చెను. వాటి కాలము అంచనా మీద, కీ. పూ. శతాబ్దులవనియు, ఆనాడు ఈ ప్రాంతమును శాతవాహనులు పాలించిరనితెలియ వచ్చుచున్నది. ఆ పురాతన వస్తువులు, ప్రభుత్వశాఖాధికారులవద్ద నున్నవి. వాటిని తఱచి పరిశీలించిన ఆంధ్ర రాజుల చరిత్రకు దోహదమొసగు విషయము లనేకములు తెలియవచ్చును.

ఆ దిబ్బలుండినది S. No. 435 కొడవలూరు (శ్రీ పొలిచర్ల రామిరెడ్డిగారి భూమి)

చరిత్రకు పూర్వవిషయముల గుఱించి, మాన్లిదొరగారు బాలకాలము క్రిందటనే వ్రాసియున్నారు. కాని వారికి దొరికిన సామాగ్రి వేరు.

# 86.

# నెల్లూర్లో పురుగులు తినే మొక్కలు


శ్రీ సి. పి. రావు, M. Sc.

ముత్తుకూరుకుపోయేవారిలో "కప్పల దొరువు" అనేగ్రామం ఈశాన్యదిశన మంచి నీటిగుట్టలో పసుపుపచ్చని పూలున్న నీటి మొక్కలు విస్తారంగా వున్నయి. ఇవే "యుట్రికులేరియా" అనే పురుగులు తినే మొక్కలు. (మొక్కలలో మాంసాహారులు.) ఇవి నెల్లూరుకు పశ్చిమానవుండే కొళ్లపూడి గ్రామ పరిసరప్రాంతాలలో గూడా వున్నట్లు తెలుస్తున్నది. సామాన్య పరిశీలనవల్ల ఈ మొక్కల వింత కనపడదు. ఎందువల్లనంటే ఈ మొక్కలలో పురుగులను పట్టే బోనులు చాల చిన్నవిగా వుంటాయి. సూక్ష్మదర్శిని తోతప్ప అదిగూడా బోనులో పురుగులు చిక్కివున్నపుడు చూస్తునే యీ వింతవిషయం తెలుస్తుంది.

అనేక చిన్న బొడిపల వంటి "బోనులు" వుంటాయి. దీని శరీర కణాలలో హరిత పదార్థము అనబడు పచ్చని వర్ణపదార్థం తయారు చేసుకుంటుంది. నీటిలో మునిగి పై భాగాన తేలుతుంటాయి. పుష్పాలు వివిధ రంగుల్లో వుంటాయి. నెల్లూరు మొక్కలపుష్పాలు పసుపు పచ్చవిగాయున్నవి.


ప్రపంచ వ్యాపితమైన యీ 'యూట్రికులేరియా' జీనస్‌నందు 275 స్పీషీస్ (రకాలు) వర్ణింపబడివున్నయి. మద్రాసు, ఆంధ్రరాష్ట్రాలలో 16 రకాలు వర్ణింపబడి వున్నయి.

అతిసున్నిత నిర్మాణంకలిగిన ఈ పురుగులను బట్టే "బోనులు" స్థావరజీవుల అవ




ఈ మొక్కకు వేర్లు, ఆకులు, కొమ్మలు అనే భేదములేక, శాఖోపశాఖలుగా వున్న నూలుపోగుల్లాంటి శరీరమూ, దానిపై

యవాలలో అత్యద్భుతమైనవి. బోను పరిమాణము సాధారణంగా 3 మిల్లీమీటర్ల పొడవు వుంటుంది. బోనుల నిర్మాణం పురుగులను





బట్టే విధానాలను, గూర్చి పలుదేశాల శాస్త్ర వేత్తలు విపులపరిశీలనలను చేసివున్నారు.

తొలిశాస్త్రవేత్తలు ఈ "బోనులు" నీటిలో తేలడానికి, మునగడానికి "గాలిసంచులను" కొన్నారట. కోహన్ అనే శాస్త్రజ్ఞుడు తన మూలికా ప్రదర్శని (Herbarium) లోని మొక్కల బోనులలో డాఫ్నియా, సైక్లాప్స్ అనే పురుగులుండడం గమనించాడు. ఆ తర్వాత యీ మొక్కలను నీటి తొట్టిలో పెంచి, కొన్ని "ఓస్ట్రికోడ్" పురుగులను ఆ నీటిలో వుంచగా తర్వాత రోజే యీ పురుగులనేకం బోనులలో పట్టుబడివుండడం గమనించాడు. ఆతర్వాత అనేకమంది శాస్త్రజ్ఞులు-ఆ బోనులలో పురుగులు యేవిధంగా పట్టుబడతాయో తెలుసుకొనడానికి అనేక పరిశోధనలు చేశారు. బోనులవద్ద పురుగులు హఠాత్తుగా ఏదో శూన్యతలోకి (partial vacum) లాగబడి మ్రింగబడునని కడకు తేలింది. వీటికి సంబంధించిన పరిశోధనలుచేసి సూత్రీకరించిన శాస్త్రజ్ఞులలో ముఖ్యులు కోహన్, డార్విన్, శ్రీమతి మెర్రీట్రీట్.

ఈ యుట్రికులేరియా బోను కోడిగుడ్డు ఆకారం పోలివుంటుంది. దీని గోడ రెండు

వరుసలలో వున్న జీవకణాలచే నిర్మింపబడి వుంటుంది. బోను నోరు ఒకవైపు పెదవి వంటి భాగంవుంటుంది. పడవ ఆకారం పోలిన తలుపుయొక్క కొన పెదవి నాను కొనివుంటుంది. బోనునోటి వద్ద వున్న రోమాలుస్పర్శజ్ఞానము కలిగినవై పురుగులు, చిన్న చేపలు యీ రోమాలు తాకగానే బోను తలుపు తెరుచుకోవడం, బోనుగోడలు వెనకకుబ్బడం ద్వారా నీటిని, నీటితో అక్కడ వుండే జీవులను లోపలికి పీల్చుకోవడం జరుగుతుంది. బోనులో వున్న నీరు క్రమేణా బోనుగోడల జీవకణాలలోని ఆస్మాసిస్ ద్వారా ప్రవేశించి తర్వాత వెలుపలకు పంపి వేయబడడంతో బోను గోడలో కిముడుచు కొని పోతుంది. అంటే ఇప్పుడు ఆబోను మళ్లా పురుగుల్ని పట్టుకొనడానికి తయారుగా వున్నదన్నమాట ఈ విశేషాలను స్విస్ కీటక శాస్త్రవేత్త బ్రోకెర్, భారతీయ జీవ శాస్త్రవేత్త పీతాంబరం, బ్రిటిష్‌విద్యార్థి ఓతి కోంబ్‌లు వేర్వేరుగా ప్రచురించారు.

సహజంగా యిట్లు బోను తయారు కావడానికి 15 మొదలు 30 నిమిషాలవరకు పడుతుంది. కొన్ని స్పీషిస్‌లలో కొన్ని గంటలు పట్టవచ్చు. నెల్లూరు మండలంలో లభించే ఈ యుట్రకులేరియా బహూశా "యుల్జినోసా" స్పీషిస్‌కు చెందినట్లుగా భావించబడుతుంది. మన జిల్లాలో లభించే మరోరకం మాంసాహారులే "డ్రాసెర" మొక్కలు ఈ డ్రాసెరేసి కుటుంబంలోనిదే అయిన "డయోనియా" అనేమొక్క అమెరికాలో మాత్రం లభిస్తుంది. నెల్లూరుకు పశ్చిమానవున్న నరసింహులు కొండపైన కోనేట్లు దాటినతర్వాత పిట్టడిపికి పోయేదారిలో వున్న చిన్నచిన్న కాలవలలో ఈ మొక్కలు కొన్ని వున్నట్లు తెలిసినది. (వి. యర్. కాలేజిలో భద్రపరచబడి వున్నవి.) ఈ మొక్కలు ఎర్రగా నిగనిగ మెరుస్తూ చూడడానికి చాల అందంగా వుంటాయి. ఆకుపచ్చని ఆకులు నేలపై ఒకేచోట గుత్తిగా 1/2 అంగుళం వ్యాసార్థం గల వలయంగా ఏర్పాటై వున్నయి. కాండ మగపడడంలేదు.




ఆకుమొదలు సన్నగా వుండి కొసలో వెడల్పు గుండ్రంగా వుండి జల్లిగరిటె ఆకారంలో వుంది. ఆకు పైవరితలంలో అనేక రోమాలున్నయి. వీని కొసలలో గుబ్బలవంటి గ్రంధులున్నయి స్టిప్యూల్స్‌దువ్వెన వల్లవలె Pectinate వున్నయి. ఆకుల

మధ్యనుండి నిటారుగా పెరిగేకాడపై (3-5 అడుగుల పొడవు) కొన్ని పువ్వులున్నాయి. పువ్వులన్నీ కాడకొసలో అన్నీ వొకేవైపుగా, పెద్దపూలు క్రిందగాను, చిన్నవి పై భాగం గాను రెసిమోస్ క్రమంలో వున్నవా అన్నట్లేర్పాటై వున్నవి. పుష్పం అండాశయంపై 5 కీలములున్నాయి. ఈ నెల్లూరు ప్రాంతపు మొక్కలు "డ్రాసెరబర్మాన్నై" స్పీషీస్‌కు చెందినవని భావింపబడుచున్నది.

ఆమంచర్ల సమీపంలో ఒక కొండ గుట్టచెంత బురద ప్రాంతాల్లో కూడా ఈ 'డ్రాసెర' మొక్కలు పెరుగుతున్నట్లు కనుగొన్నారు. ఈ మొక్కలను యిక్కడ ప్రజలుకొందఱు 'పిల్లిఅడుగు' మొక్కలు అని పిలుస్తారు. (నల్లచీమల్ని పట్టి చంపే 'పిల్లిఅడుగు' మొక్కలు. ముత్తుకూరు దగ్గర 'కట్టు' కుపోయే దారిలోనూ ఈ 'డ్రాసెర' మొక్కలు లభించినవి.

(నెల్లూరు బాటనీ క్లబ్‌వారి "సృష్టి" పత్రికకి కృతజ్ఞతలు)

**కొమ్మల తాటిచెట్లు,**

(చిత్రఫలకము XIV; XV)

కల్పవృక్ష కుటుంబము నందలి రెండువందల జీనసులలో, హైఫేన్ (Hyphaene) అను పేరుగల జీనస్‌లకు చెందిన 27, స్పీషిస్‌లలో మాత్రము చెట్లకు సహజముగా శాఖలుపుట్టును. ఇవి తాటిచెట్ల వలె నుండును. శాఖోత్పత్తి కూడ విలక్షణముగా నుండును. కాండము రెండుశాఖలుగా చీర్పడి, ప్రతిశాఖ మరల రెండు శాఖలగా చీర్పడి ఈ విధముగా శాఖోపశాఖ లుత్పన్నమగును. (Dichotomous branching) ఈచెట్లు ఈజిప్ట్, సిలోన్, ఇండియా, దేశములలో మాత్రము పెరుగును. ఈ హైఫోనే చెట్లలో తప్ప మిగిలినఅన్ని కల్పవృక్షకుటుంబము చెట్లయందు కాండము శాఖలు లేకుండా నిటారుగా పెరుగుట స్వాభావిక లక్షణము. కానిమనరాష్ట్రములో కొమ్మలున్న తాటిచెట్లు, టెంకాయచెట్లు, ఈతచెట్లు గమనింప బడియున్నవి. విక్రమ సింహపురి మండలమున రెండు మొదలు ఇరువది శాఖలున్న తాటిచెట్లను నెల్లూరు సైన్సు సంఘసభ్యులు (జగదీశ్ చంద్రబోస్ బాటనీక్లబ్) ఫోటోలను తీసియున్నారు. 6 కొమ్మలున్న తాటిచెట్ల ఫోటో సిద్ధీపురంలో శ్రీ యం. బాలసుబ్బారావు B.Sc.,Ed,, (సైన్సుమాస్టర్) గారిచే తీయబడినది. రెండు, మూడు, ఇరువది కొమ్మల చెట్లు నెల్లూరు సమీపమున పినాకినీ నదీతీరమున పెరుగుచుండినవి. ఇరువది కొమ్మలచెట్టు జంగాలపాళెం గ్రామం వద్ద నున్నది. పన్నెండు కొమ్మలున్నవి. ఎనిమిది శాఖలు విరిగిపోయినవి. (చిత్రఫలకము,XV)

ఇక, ఈశాఖ లుత్పన్నమగుటకు కారణమేమి?

ఫిలిప్పైన్స్ దీవులలో ఒక టెంకాయ చెట్టుకు కొమ్మ లుత్పన్నమైనవి. ఈ రెండు తలల టెంకాయచెట్టును పరిశీలించి అచ్చటి వృక్షశాస్త్రవేత్త ఒక వివరణ చేసినారు. చెట్ల శరీరములన్నియు (జంతువుల శరీరములుకూడా-మానవ శరీరములతో సహా) ప్రోటోప్లాసం అనబడే జీవపదార్ధముతో చేయబడిన సూక్ష్మమైన, వివిధరకముల జీవయిటుకులచే (Cells) నిర్మింపబడి

యున్నట్లు శాస్త్రవేత్తలు 1838 సం॥న తెలిసికొనిరి. ఈ జీవయిటుకుల వివిధవర్గములు శరీరమున జరుగు వివిధ జీవకార్యములను సాగించుచుండును. పెరుగుదలకు కారణమైన జీవయిటుకలకు తమవంటి జీవయిటుకలను తయారుచేయుశక్తి యుండును. ఇట్టి జీవయిటుకల వర్గము కల్పవృక్ష జాతిచెట్ల కాండ అగ్రభాగమున నున్నవి. ఏదో ప్రమాదమువల్ల ఈ జీవయిటుకలవర్గము రెండు లేక అనేక వర్గములుగా చీలినచో ప్రతి చిన్నవర్గము ఒకొక్క శాఖగా పెరుగును. (జంతువులలో కూడ రెండుతలలు జీవులు ఉత్పన్నమగుట, కవలలు ఉత్పన్నమగుట, (Identical twins.) పిండదశలో జీవయిటుకల రెండు వర్గములుగా చీలినందుననే కలుగుచున్నది. ఏ. ఆర్. కాలేజి జంగమజీవశాఖ ప్రదర్శనాలయములో రెండు తలల బాలకుని శరీరమున్నది. ఆత్మకూరులో జన్మించిన ఈ బాలకునికి రెండుతలలు పూర్తిగా ఏర్పడి యున్నవి. శరీరము కాళ్లు, చేతులు, మామూలుగా నున్నవి.)

తాటిచెట్లలో ఆకులు కొట్టివేయునపుడు కాండ అగ్రభాగము ప్రమాదవశాత్తున దెబ్బతిని జీవయిటుకలు రెండు లేక మూడు వర్గములుగా చీలినందున ఇట్టి శాఖలుత్పన్న మగుచున్నవని భావింపవచ్చును. కాని ప్రయోగాత్మకముగాచేసి చూచిగాని ఏ నిర్ణయమైనను చేయుట సబబుకాదు. ఎవరైన ఇట్టి నిరూపణ చేయువరకు మన ప్రశ్న ప్రశ్నవలెనే యుండవలెనేమో.

మొక్క ఒకొక్కటి 5 రూపాయలు!

[చిత్రఫలకము XXIV. D]

నేతి గిట్టిగడ్డలు, అనబడు ఈ మొక్కలను అరుదైనవిగా భావించి ఒక్కొకటి 5 రూ. వంతున విక్రయించియున్నారు. కాని ఈ మొక్కలను విక్రమ సింహపురి మండల ప్రజలు రెండువందల సం॥ పైగా ఎరిగియుండుటేగాక గంపల కొలది తినుచుండిరి. ఈ మొక్క యొక్క అంతర్జాతీయ శాస్త్రీయ నామధేయము ఐసాయిటిస్. (Isoetes, భారతదేశమున ఈ జీనస్‌నందు 5 స్పీషిస్ యున్నవి. ప్రపంచమున మొత్తము 60 స్పీషిస్ (రకములు) వర్ణింపబడియున్నవి. నెల్లూరు మండలమున లభించు ఈ మొక్కలపై సి. వి. రావ్. యం. యస్. సి, కె. యస్. రావ్. యం. యస్. సి. గారలు పరిశీలనచేయు చున్నారు. వీరు సేకరించిన మొక్కలలో ఆశ్చర్యకరమైన ఎత్తురకం పెరుగు మొక్కలు గూడయున్నవి. ఇంత ఎత్తైయిన మొక్కలు జపానులో తప్ప ప్రపంచమున మరెచ్చటను సేకరింపబడనట్లుగా తెలియుచున్నది. చిత్రఫలకము-XXIV-D లో సూళ్ళూరుపేట-వాటంబి చెరువువద్ద సేకరించిన చిన్నరకపు మొక్కలు చూపబడినవి. పుష్పించని మొక్కల వర్గమైన టెరిటోఫైటా (Pteridophyta) కు చెందిన యీ ఐసాయిటిస్ మొక్కలపై వృక్ష శాస్త్రవేత్తలకు ఆసక్తిమెండు.

నెల్లూరులో లభించు ఐసాయిటిస్ మొక్కలను లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియమ్ అమెరికాలోని గ్రే-హెర్బేరియమ్; న్యూయార్క్ బొటానికల్ గార్డెన్స్ హెర్బేరియమ్-లకు అచ్చటి వృక్ష శాస్త్రవేత్తల కోరికపై పంపబడుచున్నవి.

**సింహపురిలో "కల్పవృక్ష కుటుంబము"**

బోటనీ ప్రొఫెసర్ బ్లాటెర్ రచించిన ఆంగ్లగ్రంథము "ది పాల్మ్స్ ఆఫ్ ఇండియా అండ్ సిలోన్" (The Palms of British India and Ceylon) నందు "తాళవిలాసము" అనే తమిళపద్యమునకు ఆంగ్ల అనువాదము వ్రాయబడియున్నది. ఈ పురాతన తమిళ పద్యములో భూలోకమున కల్పవృక్ష సృష్టి. దానివలన కలిగె 800 ఉపయోగములు వర్ణించబడియున్నవి. బ్రహ్మసృష్టి వలన పూర్తిగా మానవుల కోరికలు తీరనందున ప్రజలు పరమేశ్వరుని ప్రార్థించుట, మహేశ్వరు డాగ్రహించి బహ్మ, విష్ణుదేవులను రప్పించి విచారించుట, బ్రహ్మ తన యశక్తతను తెలుపగా, మహేశు తాలోచించి, భూలోకమున "కల్పవృక్ష" మును సృజింపుమని యాజ్ఞాపించుట బ్రహ్మదేవుడు తాటిచెట్టును సృష్టించుట, మున్నగు విశేషములీ "తాళవిలాసము" న వర్ణింపబడియున్నవి.

కల్పవృక్ష కుటుంబమును వృక్షశాస్త్రమున పాల్మె (Palmae) అందురు ఇందు 200 జీనస్‌లకు జెందిన 1500 స్పీషీస్ ప్రపంచ వ్యాపితముగా వర్ణింపబడియున్నవి. నెల్లూరు పట్టణమున, నాకుతెలిసి, 9 స్పీషీస్ వున్నవి. 1. తాటిచెట్టు అంతర్జాతీయ శాస్త్రీయ నామధేయము బొరాసస్ ఫ్లబెల్లిఫర్ (Borasses Flabellifer)
2 టెంకాయచెట్టు కోకాస్ న్యుసిఫెర (cocos nucifera)
3. ఈతచెట్టు (Phoenix Sylnestris) ఫోనిక్స్ సిల్వెస్ట్రిస్
4. పోకచెట్టు (Areca Catechu) అరెక కటాచు. నెల్లూరు మునిసిపల్ వాటర్ వర్క్స్ వద్ద నున్నవి.

5. వాషింగ్‌టోనియ ఫిలిఫెర Washingtonia Filifera) ఇది తాటిఆకుల వంటి గల్గి ఉద్యానవనములందు పెంచబడును.

6. కొరిఫ అంబ్రకులిఫెర (Corypha unbraculifera) ఇవికూడ తాటిఆకుల వంటి ఆకులను కల్గియుండును. ఒక్కొక్క ఆకు 8 మొదలు 16 అడుగుల పరిమాణముండును. ఈ చెట్టు జీవితమున ఒక్కమారె పుష్పించి ఆ పిదప మరణించును. సాధారణముగా 80 సం॥ల కొకసారి పుష్పించునని శాస్త్రవేత్తలు రచించియున్నారు. జిల్లా పరిషత్ ఆఫీసు ఆవరణలో 2 చెట్లుండినవి. ఇప్పుడు 2 చెట్లు వి. ఆర్. కాలేజిలో పెంచబడుచున్నవి.

7. కరియొట యురెన్స్ (Caryota urens) ఇది పుష్పించినపుడు పూలగుత్తులు పొడవుగా వ్రేలాడుచు చాల అందముగా నుండును. ఇవి తిరుపతి కొండలలో సహజముగా పెరుగుచున్నవి. తిరుపతినుండి తెచ్చిన మొక్కలు వి. ఆర్. కాలేజిలో పెంచబడుచున్నవి.

చిత్రఫలకము XXIV "E"

8. అరెడాక్స రీజియ (Oredoxa regia) వీనికి టెంకాయచెట్టు ఆకులవంటి ఆకులుండి నిటారుగా పెరిగి కాండము తెల్లగా, నునువుగా తేలి చూచుటకు చాల అందముగా నుండును. చిన్నమొక్కలు వి. ఆర్. కాలేజిలో పెంచబడుచున్నవి.

9. లివిస్టోన చైనెన్సిస్ (Livistone Chinensis) టేబిల్‌పామ్ అని పిలువబడు యీ చెట్లు తోటలో అలంకరణార్థము పెంచబడుచుండును. డాక్టర్ ఎమ్. శ్రీనివాసరావుగారి హాస్పిటల్ వద్ద నున్నవి.

ఉద్యోగపు పరిధిని దాటి

సంఘజీవితంలో గణనీయమైన కృషి చేసిన

# కొందరు నెల్లూరు పూర్వకాలపు ఉద్యోగస్థులు

శ్రీ నవులూరి రాఘవయ్య.

కొందరు ఉద్యోగస్థులు ఉద్యోగస్థులుగానే వుండిపోతారు. సంఘజీవితంలో వాళ్ల వునికి ప్రభావమేమీ లేకుండానే రిటైరై పోతారు, చచ్చిపోతారు. అంతే. ఉద్యోగి అంటే ఒక నిర్వచనం వుంది; 'పౌరజీవితం' నుంచితీయబడ్డ వ్యక్తి అని. కాని నెల్లూర్లో ఉద్యోగాలు చేసిన కొందరు జ్ఞాపకానికొచ్చినపుడు ఇందుకు పూర్తి భిన్నమైన విషయాలు స్మరణకొస్తాయి.

నెల్లూరుకు కలెక్టరుగా వచ్చిన 'గెలటీ' దొర రోమన్ లిపిలో తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును ప్రసాదించాడు. సజీవమైన జానపద తెలుగుపదాలను, వ్యవహారికంలో వున్న అనేక నానుడులను అందులో పేర్చికూర్చి వాటికొక ప్రామాణికతను కల్గించాడు. తర్వాత ఆయనకొడుకు చిన్న 'గెలటీ' కూడా నెల్లూరు జిల్లాకలెక్టరుగా కొంత కాలముండినాడు. తెలుగులో మంచి పండితుడు. ఆకాలంలోనే ఆయన 'తెలుగు'లో రిపోర్టులు వ్రాస్తూ ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాడు.

పూర్వం ఐటిక్‌వర్త్‌గారు నెల్లూరు కలెక్టరుగా వచ్చి, జిల్లా జడ్జిగావుండిన వేణుగోపాలశెట్టిగారి సాయంతో మండలంలోని ప్రాక్తన శిలా శాసనాలన్నిటిని ఫోటోలు తీయించి అర్థాలతో అచ్చువేయించి మన చరిత్రకు పునాదులు వేశారు. మూడు సంపుటాలు ప్రచురింపబడ్డాయి. ఈ విధమైన కృషి మరే జిల్లాలలోను జరిగినట్లులేదు. ఈ సందర్భంలోనే మెకన్జీ కైఫీయతులు జ్ఞాపకానికొస్తాయి. మెకన్జీగారు రివెన్యూశాఖలో సర్వేయరుగా వుండి అనేక మండలాలు తిరిగి జానపద స్థల పురాణాలు ఎన్నో సేకరించి భద్రపరచి పోయారు. మద్రాసు ప్రభుత్వ రికార్డు కార్యాలయములోను, మరికొన్ని, లండను పుస్తక భాండాగారములోను భద్రపరుపబడి వున్నవి. వీటిలో మన నెల్లూరు మండలములోని అనేక గ్రామాలకు సంబంధించిన విషయాలు అనేకంగా వున్నవి. మన పరిషత్‌లు, పంచాయితీ సమితులు వీటి విషయంలో తగు శ్రద్ధవహించి వీటి ప్రచురణకు ఉద్యమించడం బాగుంటుంది.

1860 ప్రాంతాల్లో మన మండలంలో రిజర్వు పోలీసు ఇన్‌స్పెక్టరుగా వుండిన బైరాన్ అనేదొర ఒకచిత్రమైన పుస్తకం వ్రాశాడు. ఆ పుస్తకం పేరు

"MEMOIRS OF TYROLL (Lt" A truthful record of a somewhat Eventful life of a Police Officer" ఈ పుస్తకమంతా చదివే అదృష్టం నాకింకా లభించలేదు. 76 వ పేజీ నుంచి 123 వ పేజీ వరకు మాత్రమే చదవగలిగాను. ఇందులో ఆయన సమకాలిక జీవిత విశేషాలను ఒక అపూర్వమైనరీతిలో గ్రంధీకరించాడు. అప్పటి సాంఘిక జీవిత విశేషాలు కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. అప్పుడు (1860 ప్రాంతంలో) జరిగిన పశుగణ ప్రదర్శనల గూర్చి వ్రాస్తూ, " The shows were an unqualified success and some of the bulls and cows exhibited could scarcely be surpassed by any animals exhibited at agricultural shows in England." అని చెప్పియున్నాడు. కొందరు నెల్లూరు వుద్యోగస్థులను అందులో ప్రస్తుతించి వున్నాడు. హెడ్‌క్వార్టర్స్ ఇన్‌స్పెక్టరు శ్రీ అప్పయ్య, డిప్యూటీ కలక్టర్ శ్రీ దొర స్వామీ మొదలియాగుగార్లను గూర్చి పలు విధాల ప్రస్తావించివున్నాడు. నేను చదివిన 44 పేజీలు ఎన్నో ఆసక్తజనకమైన విషయ సంపన్నంగా వుండినవి. అప్పటి నెల్లూరు స్వరూపం కళ్ళకు కట్టినట్టుగా అభివర్ణించి వున్నాడు.

ఇక మన నెల్లూరివారి దగ్గరకు వచ్చినపుడు ముందుగా చెప్పవలసినవారు కీ. శే. వెన్నెలగంటి సుబ్బారావుగారు. వీరు ఆ తొలిరోజుల్లో, అంటే ఇంగ్లీషువారి ప్రభుత్వం మనప్రాంతాల్లో స్థాపించబడిన రోజులో మద్రాసు హైకోర్టులో "ప్రధాన ద్విభాషి"గా వుండి ఖ్యాతిలోనికి వచ్చినవారు. వీరిది నిడుమసిలి ప్రాంతం. వీరి కాలం 1784-1839. ఇంగ్లీషు, తెలుగు, కన్నడం, అరవము, మరాటీ మొదలగు భాషలలో మంచి పండితులు. దక్షిణ కన్నడ జిల్లాలలో అనేకచోట్ల ఇంగ్లీషు దొరల క్రింద అనేక ఉద్యోగాలనుచేసి కన్నడభాషకొరకు వ్యాకరణాన్ని రచించారు. ఇంకా ఆశ్చర్యమేమంటే చక్కని ఇంగ్లీషు శైలిలో తమ జీవితచరిత్రను రచించారు. బహుశ ఆంగ్ల భాషలో జీవితచరిత్రను రచించిన మొదటి భారతీయుడు ఈ వెన్నెలగంటి సుబ్బారావే అయివుండవచ్చును. ఆనాటి ఆంగ్లేయుల మధ్య ఉద్యోగజీవితస్థితిగతులు తెలుసుకొనడానికి ఇది చక్కటి సూచీగ్రంధము.

ఆ కాలంలోనే మనవూరివారైన కీ.శే. గుర్రం అప్పన్నశాస్త్రిగారు వేదశాస్త్రములందు అసమాన పాండిత్యమును సంపాదించి హైకోర్టులో హిందూలా పండితులుగావుండి హిందూధర్మశాస్త్రముపై 'అథారిటీ' అనిపించుకొన్నారు. అప్పటి హైకోర్టు జడ్జీలు హిందూలా విషయాలపై చిక్కువిషయాలు వచ్చినపుడు వాటిని పరామర్శించి తీర్మానించడానికి వీరివద్దకు పంపుతుండేవారు. వీరి వంశజులే ఇప్పటి గుర్రం సుబ్బరామయ్య సోదరులు.

తర్వాత కాలంలో పక్కి చంచల్ రావు పంతులు సి. ఐ. ఇ. గారు అప్పటి నెల్లూరు మిషన్‌స్కూలులో చదువుకొని డిప్యూటీ కలెక్టరై బోర్డు శిరస్తదారుగా ప్రఖ్యాతి గడించారు. వీరికాలము 1832-1901 రెవిన్యూ బోర్డువారి స్టాండింగ్ ఆర్డరులన్నిటిని సమన్వయించి క్రోడీకరించడా

నికి గవర్నమెంటువారు వీరిని నియమించి, వీరిచే వారకపుస్తకాన్ని వ్రాయించారు. మన్వాది ధర్మ శాస్త్రాల్లోని ధర్మ సూత్రాలను బ్రిటిష్ వారి న్యాయస్థానాల్లో సమన్వయం చేసిన ప్రజ్ఞా మూర్తులు. పరాశరస్మృతి లిఖితస్మృతి, లిఖిత సంహిత-జీవనస్మృతి మొదలైన 18 స్మృతులకు తెలుగు అర్థాలు వ్రాయించి ప్రకటించారు. ఋగ్వేద వివాహ ప్రయోగమును తెలుగు అర్థంతోటి ప్రకటించారు. మైసూరు మహారాజా వీరికి రాజ్యతంత్ర ప్రవీణ అనే బిరుదాన్నిచ్చారు. నెల్లూరు పర్మనెంట్ హిందూ మ్యూచువల్ బెనిఫిట్ ఫండు (ఇప్పటి ఫండాఫీసు) ను నెలకొల్పిందికూడా వీరే చూ. వ్యాసము.

యరగుడిపాటి వెంకటాచలం పంతులుగారు నెల్లూరుకు చేసిన బహుముఖసేవలను గురించిన వివరాలు ఈ సర్వస్వంలో అనేకచోట్ల అనేకులు వ్రాసివున్నారు. వీరు జిల్లాకోర్టు శిరస్తదారుగా ఉద్యోగాన్ని నిర్వహించినారు.

1850-60 ప్రాంతాల్లో కలెక్టరాఫీసులో ఉద్యోగం చేస్తూ వరగంటి వెంకటకృష్ణరావు పంతులుగారు కన్నడ రామాయణాన్ని రచించారు. వీరికి కొంచెం అవతలి కాలంలో తాసీల్దారుగా వుండిన సంబెపమాళ్ళయ్యగారు- అకాలపు Civil Higher-Revenue Higher మొదలైన పరీక్షలకు కావల్సిన పుస్తకాలను లఘుటీకలతో అచ్చువేయించారు. దంపూరు నరసయ్యగారితో కలసి “నెల్లూరు పయొనీర్” అనే పత్రికను నడిపారు. (చూ॥ “నెల్లూరు మండలపత్రికలు”) నాయుడుపేటలో చాలకాలం డిప్యూటీ కలెక్టరుగా వుండిన అడక్క నారాయణరావు పంతులుగారు “రెవిన్యూ రికార్డు” అనే పత్రికను నడిపారు. కలెక్టరాఫీసులో ఉద్యోగస్థులుగా వుండిన ఉల్లిగొండము రామచంద్రరావుగారు. తెలుగులో మహాపండితులు “విద్యార్థి కల్పభూజము” అనే పత్రికను నడిపారు. “అముద్రిత గ్రంథచింతామణి” సంపాదకులు పూండ్ల రామకృష్ణగారికి గురుప్రాయులు. హెడ్ శిరస్తదారుగా వుండిన రోజుకర్తి వెంకటకృష్ణరావు బి. ఏ. గారు. ‘నెల్లూరు జిల్లా మాన్యుయల్’ (బాస్వెల్ సంపాదకత్వాన ప్రకటితమైనది.) లో రెవిన్యూ పరిపాలననుగూర్చిన అధ్యాయాన్ని రచించారు.

తాలూకా శిరస్తదారుగా వుండిన శ్రీమాన్ నేలటూరు రాఘవాచార్యులుగారు వడ్డీలు-కూలీలు గుణించడానికి పనికొచ్చే ‘ఇంటరెస్టు మాన్యుయల్’ అనే పుస్తకాన్ని వ్రాశారు. ఆతర్వాతివారిలో చెప్పుకోదగిన వారు ఫారెస్టాఫీసులో గుమాస్తాగా వుంటూ తెలుగులో గొప్ప పండితులుగా ప్రసిద్ధకెక్కిన శ్రీ దుర్భా సుబ్రహ్మణ్యశర్మగారు. విద్యా ప్రచారంలో ఎనలేని కృషిచేసిన వారు.

నెల్లూరు పూర్వకాలపు ఉద్యోగస్తులిట్లా తమ ఉద్యోగాలు చేసుకొంటూ గ్రంథాలు రచించి వాఙ్మయరంగంలో గణనీయమైన కీర్తి ప్రతిష్ఠలు గడించారు. ఒక్క రోజు కర్తి వెంకటకృష్ణరావుగారు తప్ప మిగిలిన వారెవ్వరూ బి. ఏ. లు కారు. నేడు ప్రతి ఆఫీసూ బి. ఏ. లతో నిండిపోయి వున్నయి. అయినా విద్యా ప్రచారం చేసే వారగపడడం లేదు. గొప్పగా చదువుకొన్న విద్యార్థులు అనేకంగా వుంటున్నా

వ్యవధిలేకపోవడంవల్లనో, వ్రాయడానికి విషయాలులేక పోవడంవల్లనో విద్య జోలికి వెళ్ళేవారు అంతగా అగపడ్డంలేదు. కాని ఆధునికుల్లో వేళ్ళపై ఎంచతగినవారు, సాహిత్య రంగంల్లో జొరబడి కీర్తిగడించిన వారు గలరు. కె. అనంతంగారు, కరుణకుమార మారుపేరుతో చిట్టి కథలు వ్రాసి, పేరుగాంచారు. నెల్లూరుజిల్లాలోని జానపద వాతావరణాన్ని బహురమ్యంగా, కళాదృష్టితో, పాత్ర పోషణ అద్వితీయంగా తీర్చి కథల సృష్టించారు. ఇట్లనేకులు వెలికివత్తురుగాక! (కీ. శే, ఒంగోలు వంకటరంగయ్యగారు చెదురు మెదురుగా వ్రాసిన వ్యాసాలు ఇందుకు చాల తోడ్పడ్డాయి.)

చిత్రవిచిత్రములు - 22.

చిత్రఫలకము XIII. విస్కమ్ డైకాటమ.

(1) ఇందుండు పరాన్నజీవి (Viscum Dichotoma)

ఈ మొక్క చిన్నపొదవలెనుండి, గుబురుగా పచ్చారి (Dalbergia) చెట్లకొమ్మలపై పెరుగుచుండును. ఆకుపచ్చని రంగుగలిగి, కావలసిన ఆహారమును తయారుచేసికొని, నీరు, ఖనిజలవణములు మాత్రము పై తెల్పిన పచ్చారి మొక్కనుండి, పీల్చుకొనును. దీనికి ఆకులుండవు. కొమ్మలెప్పుడును రెండుగా ప్రసరించును.

రిక్సియా. (Riccia)

నాచు మొక్కల వర్గమునకు చెందినది. (Brayophta-Bryos బ్రయాస్= నాచు) Phyta ఫైటాన్= మొక్క.

నేలపై గుండ్రముగా విస్తరించి కాండము, వ్రేళ్లు, ఆకులు అను వృక్షావయవములు లేక, శరీరమంతయు పలుచని ఆకులవలెనుండి, రాళ్ళపైన, తేమ ప్రదేశములందు పెరుగుచుండును. అందువలని ఇట్టి శరీరమును Thallus అందురు. (థాలస్)

# ౪౮.

# నెల్లూరు మండలి సమాజములు

**1. నెల్లూరు వర్థమాన సమాజము**

సింహపురి మండలి సారస్వత సాంస్కృతిక సంస్థలలో ముఖ్యమైనది ఈ సమాజము 1906 సంవత్సరమున, ది అమెచూర్ డ్రామెటిక్ సొసైటి, 'ది యిజాన్‌సొసైటి' యను రెండు సంస్థల కలయికచే నేర్పడినది మొదట ట్రంకురోడ్డులోని కీ. శే. పెళ్లేటి పెంచలురెడ్డిగారి భవనమున స్థాపింపబడినది. ఇది 1913 సం॥రంలో సొసైటీస్ ఆక్టు క్రింద రిజిష్టరు చేయబడినది. కీ. శే. రేబాల లక్ష్మీనరసారెడ్డిగారు 1915 సం॥ రంలో పురమందిరము నిర్మించి యందలి యుత్తరపు భాగమును వర్థమాన సమాజమునకు దానమిచ్చిరి. 1952 సం॥ రమున కీ॥ శే॥ రేబాల పట్టాభి రామరెడ్డిగారి సతీమణి శ్రీమతి సుజాతమ్మగారు తన భర్త కోరిక ప్రకారము వారిపేర ఇరువదివేల రూపాయలతో నొక సుందర భవనము నిర్మించి బహూకరించిరి.

ఈ సమాజమునకు రాజకీయములతో సంబంధము లేదు. సర్వతోముఖ విజ్ఞాన ప్రచారమే సమాజముయొక్క లక్ష్యము సాహిత్యసేవ, సాంస్కృతికాభ్యున్నతి. లలిత కళాపోషణ యిత్యాది అభ్యుదయ ఆశయములు సాధించుటకై నీ సమాజము పాటుబడుచున్నది.

ఇది రాష్ట్రములోని పెద్ద గ్రంథాలయములలో నొకటి. ఇదొక పఠనాలయమును నడుపుచున్నది. నేమి గ్రంథాలయమున 21,000 గ్రంథములు గలవు. ఆంధ్ర గ్రంథములు 1. తిక్కన గ్రంథాలయమునను 2. ఆంగ్ల గ్రంథములు కారొనేషన్ గ్రంథాలయమునను 3. సంస్కృత గ్రంథములు వేదము వేంకటరాయ శాస్త్రి గ్రంథాలయమునను గలవు. ,,రేబాల సుందరరామిరెడ్డి సరస్వతమ్మ గ్రంథాలయములో కొన్ని నూతన గ్రంథములు గలవు. ఇవన్నియు సమాజ గ్రంథాలయ భాగములుగా నున్నవి. తిక్కన గ్రంథాలయము 1910 లోను కారొనేషన్ గ్రంథాలయము 1912 లోను, శాస్త్రి గ్రంథాలయము 1931 లోను రేబాల సరస్వతమ్మ సుందరరామిరెడ్డి గ్రంథాలయము 1948 లోను, పఠనాలయము 1907 లోను స్థాపించిరి.

మొదటనుండియు సమాజము సాహిత్యసభలు, సాంస్కృతికోత్సవములు, కవితాగోష్ఠులు. గానసభలు, శాస్త్రవిషయక చర్చలు కవిసన్మానములు, గ్రంథప్రారంభోత్సవములు లేర్పాటు చేయుచున్నది. ప్రతియేట రవీంద్రనాథ ఠాగూరు జయంతి వేంకటరాయశాస్త్రి వర్థంతి, రామకృష్ణ వివేకానందుల జయంతులు జరుపుచున్నారు.

1915 నుండి తిక్కన జయంతి జరుపబడుచున్నది. 1936 నుండి యీ జయంతిలో తిక్కవరపు రామిరెడ్డిగారు కవి, పండితులను రు. 116 ల పారితోషికముతో సమ్మానించుచున్నారు.

తిక్కన జయంతి సభలలో సమ్మానింపబడినవారు :

శ్రీమతి కాంచనపల్లి కనకమ్మ, శ్రీ కవికోకిల దువ్వూరు రామిరెడ్డి, శ్రీ పింగళి లక్ష్మీకాంతము, శ్రీ కాటూరు వెంకటేశ్వరరావు, శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి, శ్రీ యేటూరు శ్రీనివాసాచార్యులు, శ్రీ జి. జాషువ కవి, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. శ్రీ రాయప్రోలు సుబ్బారావు, శ్రీ [illegible] శివశంకరశాస్త్రి, శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి, శ్రీ మద్దా రామమూర్తి, శ్రీ గడియారం వెంకటశేషశాస్త్రి, శ్రీ రాజశేఖర శతావధాని. శ్రీ శ్రీరాం వీరబ్రహ్మం, శ్రీ జె. కృష్ణశర్మ, శ్రీ ముదివర్తి కొండమాచార్యులు, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి, శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డి, శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ, శ్రీ మోచర్ల రామకృష్ణయ్య, శ్రీ మానవల్లి రామకృష్ణకవి, శ్రీ సి. నారాయణరెడ్డి.

1958 సం॥ రం. నుండి కవిత్రయ జయంతులు జరుపుచున్నారు. అందు శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారిచే సమ్మానింపబడినవారు.

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి. శ్రీ దాశరథి, శ్రీ జంగా నరసింహశాస్త్రి, శ్రీ పుండేల మాలకొండారెడ్డి, శ్రీ మరుపూరు కోదండరామిరెడ్డి, శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు, శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు, శ్రీ షేక్ దావూద్, శ్రీ గుఱ్ఱం వెంకట సుబ్రహ్మణ్యం శ్రీ కొండా రామచంద్రారెడ్డి, శ్రీ దర్భా వెంకట కృష్ణమూర్తి, శ్రీ కేతవరపు రామకోటశాస్త్రి శ్రీ మామిడిపూడి రామకృష్ణయ్య, శ్రీ పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రి, శ్రీ ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ, నిడుదవోలు వెంకటరావు.

కవిత్రయ జయంతులు శాశ్వతముగ జరుపుటకై రు. 11000 ల నిధితో నొక ట్రస్టును 1962 యేర్పాటు చేసియున్నారు.

ప్రతి సంవత్సరము కవికోకిల దువ్వూరు రామిరెడ్డిగారి జయంతి 1952 సం॥ నుండి జరుపబడుచున్నది. ఈ సందర్భమున దువ్వూరు రామిరెడ్డిగారి కుమారుడు శ్రీ వేణుగోపాలరెడ్డిగారు తెలుగున విజ్ఞాన గ్రంథములు రచించిన వారికి రు. [illegible]00 లు పారితోషిక మిచ్చుచున్నారు.

కవికోకిల జయంతులలో సమ్మానింపబడినవారు :

శ్రీ గొబ్బూరు వెంకటానంద రాఘవరావు, శ్రీ కాశీపట్నం కొండయ్య, శ్రీ వసంతరావు వెంకటరావు, శ్రీ విసా, అప్పారావు, శ్రీ యస్. వి. యల్. నరసింహరావు, శ్రీ కొడవటిగంటి కుటుంబరావు, శ్రీ మేడేపల్లి వరాహ నరసింహస్వామి శ్రీ గాలి బాలసుందరరావు.

ఇట్లు సాంస్కృతిక సేవచేయుచున్న వర్ధమాన సమాజము సభ్యుల చందాలతోను దాతల విరాళములతోను నడుపబడుచున్నది. ప్రభుత్వము నామకార్థమైన కొద్ది సహాయము

చేయుచున్నది. ఇటీవల శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారి సహాయముతో సమాజ కర్తలు పదివేల రూపాయల శాశ్వత నిధిని యేర్పాటుచేసినారు.

—పి. వి. రమణారెడ్డి.


• • •

## 2. నెల్లూరు ఆంధ్రసభ (రిజిష్టర్డు)

స్థాపితము 1918 సం. 1921 సం. రిజిష్టరు కాబడినది. స్థాపకులలో ముఖ్యులు సర్వశ్రీ తూములూరు శివరామయ్య, ముత్తరాజు సుబ్బారావు, గొట్టుపల్లి ఆదిశేషయ్య, అల్లాడి మహాదేవయ్య, తూములూరు సాంబశివరావు, రామప్రోలు సుబ్రహ్మణ్యం, యం. బాలసుబ్రహ్మణ్యం, నేలనూతల రామకృష్ణయ్య, యం. యస్. శర్మగారలు.

ఈ సంస్థ ఉద్దేశ్యములలో ఉచిత పుస్తకభాండాగారము, పఠనమందిరముల నేర్పరచుట, ఉపన్యాసములు, వ్యాసరచనములు, ఆంధ్రనాటకములు ప్రయోగించుట, దేహవ్యాయామవసతులు నేర్పరచుట. ఇవన్నియు నేటికిని జరుపబడుచున్నవి.

శ్రీ త్యాగబ్రహ్మ మహోత్సవములు జరుపు సందర్భమున బాలబాలికలకు సంగీత పోటీలుజరిపి బహుమతుల నిచ్చిరి. సాహిత్య గోష్ఠులు, రచయితల, కవుల, నటుల సమ్మానములు జరుగుచున్నవి.



శ్రీ త్యాగబ్రహ్మ రజత విగ్రహము



శ్రీ త్యాగరాజు

ప్రథమ అధ్యక్షులుగానున్న శ్రీ తూములూరు శివరామయ్య నాటకప్రయోగమునకు వలయు దోహదమెంతయో నిచ్చిరి. వారికి కుడిభుజముగా శ్రీ ముత్తరాజు సుబ్బారావు గారు నాటకకర్తగానుండి, నటులను ప్రోత్సహించుచుండిరి.

నటు లనేకులు ఈ సభలో పాల్గొని కీర్తి నార్జించిరి. అందరును అమెచ్యూర్సుగా నుండి నాటకకళను పోషించిరి. వారిలో ముఖ్యులు, దావిప్రోలు సుబ్రహ్మణ్యం బాహుక, విశ్వామిత్ర, కృష్ణాది నాయక పాత్రల, శ్రీ శ్రీనివాసచార్యులు అనేక నాయకపాత్రల, శ్రీ నేలనూతల రాధాకృష్ణయ్యగారు నారద, సుదేవ, అభిమన్యాది పాత్రల, యరగుడిపాటి హనుమంతరావు హిరణ్యకశిపు, పఠాన్ భూమికల ధరించి పేర్గాంచిరి.

ఈ నగరములో నాట్యకళావిద్యలో యువకుల ప్రోత్సహించి, సామాజికులకు రసాస్వాదనాకౌశలముల నేర్పించిన ముఖ్య సంస్థలలో ఈ సభ యొక్కటి.

శ్రీ దుర్భా సుబ్రహ్మణ్యశర్మగారు వారి పాండిత్యబోధనచే, శ్రీ మోచర్ల, కె. నారాయణరావు ఇత్యాదులను ప్రసిద్ధ కవులుగా నొనరించిరి. ఈ సంస్థ ప్రచారమునకై ప్రథమఅధ్యక్షులు వినియోగించిన శక్తిసామర్థ్యములు బహుముఖములుగా విస్తరిల్లెను. తరువాత రేబాల పట్టాభిరామిరెడ్డిగారు, చివ

కుల మాలెకొండయ్యగారు, శ్రీ ముంగ మూరు సుబ్బారావుగారు సభ ఔన్నత్యము నకు పాటుపడిరి.

శ్రీ మోచర్ల, శ్రీ పులిగెండ్ల రామ కృష్ణయ్యగారలు బహునాటకముల వ్రాసి నుతికెక్కిరి.

పై సభకు శాశ్వతముగ భవననిర్మా ణము స్థాపించిన వారిలో ముఖ్యులు శ్రీ పి. పి. కృష్ణయ్యగారు, కె. నారాయణరావు గారు, వీరి ఆనుంగుమిత్రు లనేకులు. దీని ట్రస్టీగా ఇప్పుడు శ్రీ వ. సత్యగోపాలకృష్ణ మూర్తిగారున్నారు.

ఈ భవనప్రాంగణమున శ్రీ చతు ర్వేదుల రామచంద్రయ్యగారు భగవద్గీతా మందిరమును నిర్మించి, అందు భక్తిప్రప త్తులు పెంపొందచేయు కార్యక్రమముల నేర్పాటు చేయుటకై నిధి నేర్పరిచిరి.

ముహర్నవమి నాడు భగవద్గీత శ్లోక పఠనపోటీలు ప్రతి సంవత్సరము జరుగు చున్నవి. ఉత్తీర్ణులకు పారితోషికములు బహూకరింపబడుచున్నవి.

నటకులలో మననగరమున ప్రఖ్యాతి గడించిన వారిలో ముఖ్యులు, సర్వశ్రీ ముంగ మూరు నరసింహారావు, కోట శ్రీనివాస రావు, కామరాజుగడ్డ శ్రీనివాసరావు, జి.సి. సుబ్బారావు, కేసరి వేంకటరామయ్య ప్రభృ తులు.

నగర సంస్కారిక, నైతిక, దైవిక, క్రీడానిక జీవితమునకు ఈ సంస్థ బహు ముఖములుగా తోడ్పడుచున్నది.

—శ్రీ చిప్పకుల సత్యనారాయణమూర్తి,
బి.ఏ., బి. యల్., అధివక్త.

▲ ▲ ▲

ఇతర నాటక సంఘములు :

పాఠకులు ముందు చదివిన వ్యాసము నందు నెల్లూరు నాటక సంఘముల, నటకుల చరిత్రను స్థూలముగ తెలిసికొని యున్నారు. అవిగాక మరికొన్ని సంస్థలును, నెల్లూరులో పనిచేసినవి. వాని చరిత్రయు సంగ్రహ ముగ నిట పేర్కొనబడుచున్నది.

**3. సింహపురి ఆంధ్ర బాలగంధర్వసభ :**

ఈసభ 1926 లో ఈగ లక్ష్మినరసా రెడ్డిగారి అధ్యక్షతక్రింద స్థాపింపబడినది. అందు సి. యల్. నరసింహారావు, జంధ్యాల జానకిరామయ్య; కాశీ విశ్వనాథ రావు, యన్. చంద్రభూషణం యన్. కనకంబాబు చెన్నూరు. శేషగిరిరావు. • పూండ్ల. రామ కృష్ణయ్య ప్రభృతులందు సభ్యులుగానుండిరి. ఆసంఘమునకు శ్రీ కె. అరుణాచలం నాయుడుగారు. సంగీత బోధకులుగ, పి. పి. నరసింహంగారు అభినయ బోధకులుగ నుండిరి. వీరు లవకుశ, తులాభారము, బుద్ధిమతీ విలాసము, మొదలగు నాటకము లను, మన మండలమునందేగాక, మండ లాంతరములందును ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలందిరి. ఆ సంస్థ 1931 వరకు పని చేసినది. సభ్యులలో కొందరు ఉన్నత విద్య కొఱకును, మరికొంతమంది ఉద్యోగ వశముననను సింహపురి వీడుటవలన సమా జము నామ మాత్రావశిష్టమైనది.

**4. సరస్వతి అమెచ్యూర్సు :**

ఇదియు 1930 లో శ్రీ యాహ్యాలీ సాహెబు (పురపాలక సంఘాధ్యక్షులు) గారి అధ్యక్షతన స్థాపితమై 5, 6 సంవత్సరము లుత్సాహముతో పనిచేసినది. శ్రీ యరగుడి

పాటి వేంకటసుబ్రహ్మణ్యం, వైష్యల చంద్రశేఖరంగార్లు సంయుక్త కార్యదర్శులుగ నుండిరి. ఆంగ్ల నాటకములను ప్రదర్శించుటలో వీరుత్సాహముజూపిరి. వీరు తొలుత 'మర్చెంట్ ఆఫ్ వెనీస్' అను ఆంగ్లనాటకమును కీ॥ శే॥ వి. వి. శ్రీనివాసయ్యంగారాంగ్లమున రచించిన ట్రాజిక్ డెనోమా, సర్జన్ జనరల్స్ ప్రిస్క్రిప్షన్, మొదలగు నాటికలను రసవంతముగ ప్రదర్శించుచుండిరి. ఈ సభవారు 'సబ్ అసిస్టెంట్ మాజస్ట్రేటు ఆఫ్ సుల్తాన్‌పేట' అను నాటికను బురమందిరమున ప్రదర్శించినపుడు గ్రంథకర్తయగు శ్రీనివాసయ్యంగారు (మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి) స్వయముగ దర్శించి కొండాడిరి. ఆనాటికలో శ్రీ వై. వి. సుబ్రహ్మణ్యం. వి. చంద్రశేఖరంగార్లు ప్రధాన భూమికలను ధరించి ప్రేక్షకులను ముగ్ధులగావించిరి. ఆ సంస్థకు కీ॥ శే॥ స్వయంపాకుల జానకి రామమూర్తి వెన్నెముకగ నుండిరి. సోరాబ్‌రుస్తుం, చంద్రగుప్త, ప్రతాప రుద్రీయము, వరవిక్రయము. మొదలగు తెలుగు నాటకములనుగూడ వీరు ప్రదర్శించుచుండిరి. సోరాబ్ రుస్తుంలో కీ॥ శే॥ నెల్లూరు నాగరాజరావుగారు రుస్తుం పాత్ర అసమానముగ నటించెడివారు. ఈ సమాజమువారు పిన్నవారిలో నాటక కళాభివృద్ధిని చేయుటకుగా కొంతకాలము నాటక పోటీలను జరిపిరి. సయ్యంపాకుల జానకి రామమూర్తి అకాల మరణమువలనను, యాహారీ సాహేబుగారు జిల్లాజడ్జీగా నియమితులై నెల్లూరు వీడుటచేతను, సంస్థయు నిలిచిపోయినది.

5. ఫైన్‌ఆర్ట్స్ సొసైటి :

ఇది 1938 లో శ్రీ వై. వి. సుబ్రహ్మణ్యంగారిచే నెలకొల్పబడినది. ఆసమాజము వారు 'కవికోకిల' గారి మీరాబాయి నాటకమును ప్రదర్శించినప్పుడు రాణాపాత్రధారియగు వై. వి. సుబ్రహ్మణ్యంగారి అభినయ వైశిష్ట్యమును గ్రంథకర్తయగు రామరెడ్డిగారే ప్రశంసించిరి. వీరు 'వేదం' వారి బొబ్బిలి నాటకమును అపర్వ ప్రాయముగ ప్రదర్శించెడి వారు. ఆ నాటి వారి నాటకములో శ్రీ వై. వి. రావు, రంగరావుగ బి. అర్. పంతులు వెంగళరావుగ, వై. వి. సుబ్రహ్మణ్యం ధర్మారావుగ, నెల్లూరు. నాగరాజారావు పాపారావుగ, బెంగుళూరు రంగస్వామి హైదరు జంగుగ, నేలటూరు. రామదాసయ్యంగారు బుస్సీగ, స్థానం నరసింహరావు మల్లమ్మదేవిగ నటించిరి. వీరు తెలుగు నాటకములనే కాక 'జూలియస్ సీసరు' మొదలగు ఆంగ్ల నాటకములనుగూడ ప్రదర్శించెడివారు.

6. ఫ్రెండ్స్‌యూనియన్ (మిత్రమండలి) :

ఈ సంస్థ జమీందారులగు రేబాల సోదరులు, వదాన్యులగుట. వి. శివరామయ్యగార్ల వంటి పెద్దల సాయసానుభూతులతోడను పలువురు కళాభిమానుల సహాయముతోడను, 1935 లో స్థాపించబడినది. వీరు ప్రేక్షకుల అనుకూల్యము ననుసరించి సాయంకాలము గం॥ 6 లకు నాటకములను ప్రారంభించి గం॥ 9 లకు ముగించుట; సీనుకు సీనుకు మధ్య ఎక్కువ కాలవ్యవధానము లేకుండుట మొదలగు చక్కని ఆదర్శములను పాటించిరి. సంఘమునకు కార్యదర్శి, కోశాధికారి. ఉపాధ్యక్షుడు అను

గొడవయే లేక సర్వము 'అర్గనైజరు' అను వ్యవహారముతో శ్రీ తూములూరు పరమశివం. బి. ఏ. బి. యల్. గారు కార్యభారము వహించుచుండిరి. చిప్పకుల మాలె కొండయ్య, చుండూరు సుబ్బయ్య సెట్టి పి. టి. గోపాలచారి, బి. రామస్వామయ్య, రావపూడి రామలింగంసెట్టి వేదాంతాచారి వరణికోట సుబ్రహ్మణ్యం. పి. వి. కృష్ణయ్య, రేబాల దశరథరామిరెడ్డి. మేనకూరు ఆదిశేషారెడ్డి, కాకుటూరి నరసింహరావు డా॥ ఉదయాచలరావునాయుడు మొదలగు కళాభిమానులు పెద్దలు ఈ సంస్థకు పోషకులుగను, అభిమానులుగ నుండిరి. తూములూరు. వెంకటేశ్వర్లు, కొత్రా వెంకటచలం, రేబాల. వెంకటరెడ్డిగార్లు ఆనాటక **సమాజాభివృద్ధిని ధ్యేయంగా నుంచుకొని పనిచేసేవారు.**

ఈ సమాజమున పాత్రధారణ మొనర్చిన నటులలో కీ॥ శే॥ టి. వి. శివకామయ్య, ఓరుగంటి వేంకటకృష్ణయ్య, జి. రామచంద్రయ్య, యస్. సుబ్రహ్మణ్యం (లాయరు), కేసరి కృష్ణమూర్తి, కేసరి వేంకటరామయ్య, ఏ. బాలన్, చెన్నూరు శేషగిరిరావు, ఆర్. వెంకటరెడ్డి, కొత్రా వెంకటచలం, కీ॥ శే॥ యస్. రామదాసయ్యంగారు, కామరాజు రామమూర్తి భాగవతరు, కామరాజుగడ్డ శ్రీనివాసరావు, కొళందవేలు మొదలియారు, పత్రి సుబ్బారావు మొదలగువారు మేటులుగనుండిరి. వీరి ప్రదర్శనములలో ఖిల్జీ, పక్కుబాయి, తులాభారము, చంద్రగుప్త నాటకములు ఖ్యాతి కెక్కించిరి.

1935 లో మద్రాసులో జరిగిన నాట్యకళాపరిషత్తు సందర్భమున ఈ సమాజమువారు 'ఖిల్జీ' నాటకమును ప్రదర్శింపగా కీ॥ శే॥ గోవిందరాజుల వేంకటసుబ్బారావుగారు తమ ఆనందమును బట్టలేక వేదికపై నెక్కి "నెల్లూరువారి నాటకము ఉత్తమశ్రేణికి చెందినదనియు, టి. వి. శివకామయ్య, ఓరుగంటి కృష్ణయ్య, కేసరి సోదరులు, ఆర్. వెంకటరెడ్డి, కొత్రా వెంకటచలం, చెన్నూరు శేషగిరిరావు, పత్రి సుబ్బారావుగార్ల నటనాకౌశలం అప్రతిమానమనియు శ్లాఘించిరి. 1938 లో పురమందిరంలో ప్రతాపరుద్రీయము ప్రదర్శింపగా పేరిగాని పాత్ర ధరించిన కొళందవేలు (బుల్లా) గారికి శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి స్వర్ణపతకమునిచ్చి బహూకరించిరి. వీరు ప్రదర్శించెడి 'రాకీదాసు'లో 'కాళిదీ' పాత్రకు చెన్నూరు శేషగిరిరావు, భోజపాత్రకు కేసరి వేంకటరామయ్యగార్లు పేర్గాంచిరి. వీరి నాటకములలో మిడుతూరు బాలకృష్ణమూర్తి, కీ॥ శే॥ రామానుజాచార్యులు, చెన్నూరు శేషగిరిరావు, పత్రి సుబ్బారావు ప్రభృతులు స్త్రీపాత్రధారణమున రాణించిరి. ఈ నాడు మహోన్నతస్థాయిలో ప్రతిక్షణ విజృంభణమందుచున్న సినిమాల ధాటికి నిలువజాలకయు, తగినంత ఆర్థికపోషణ లేకపోవుటయు కారణముగ నీ సమాజముకూడ కథావశేషమైనది.


**7. మదనమోహన మాళవీయ సాహిత్య మండలి.**

ఈ మండలి 1956 లో మూలపేట యందు గ్రంథాలయ రూపమున ప్రారంభమైనది. కొంతకాలము. "మహామాళవ్య"

అను వ్రాత మాసపత్రికను నడిపిరి. అదియే క్రమముగ విద్యార్థుల ఉత్సాహోద్రేకముల ననుసరించి సాహిత్యమండలిగా రూపొందెను. కొంత కాలమీ సంస్థకు శ్రీ అక్కెళ్ల అప్పన్నశాస్త్రి (సంస్కృత కళాశాలోపన్యాసకులు) గారు గౌరవాధ్యక్షులైరి. 56 లో మూలప్పేట వీరశైవ సత్ర ప్రాంగణమున తొలిసారిగా మాలవీయ జయంతిని జరిపిరి. ఈ సమాజమువారు ప్రతినెల ఆంధ్రమున 'జ్యోత్స్న' ఆంగ్లమున 'డయల్' అను వ్రాతపత్రికల నుపక్రమించిరి. 57 లో స్వాతంత్ర్య సమరవీరుల సప్తాహము జరిపి. యువతీ యువకులలో నూతనోత్తేజమును పొదుకొల్పిరి. దీని ననుబంధముగ కుమారి ఎం. సుగుణ యం. ఎ. బి; యల్. టి. గారి అధ్యక్షతన బాలానంద సంఘము స్థాపింపబడి ఆటపాటల పోటీలు నిర్వహింపబడినవి. ఈ మండలివారు సంస్కృత భాషావ్యాప్తికై సంధ్యాకాల కక్ష్యలను కొంతకాలము జరిపిరి అందు శ్రీ మాన్, కే. యస్. రామానుజాచార్యులు (సంస్కృత కళాశాలా పండితులు) నిస్వార్థముగ పనిచేసిరి. వీరు కొంతకాలము కాళిదాసజయంతిని, కవితాగోష్ఠిని, భారత భాగవతోత్సవములనుగూడ జరిపి సాహిత్య ప్రచార మవిరళముగ సాగించిరి. 1961 డిసంబరులో మాళవీయ శతజయంత్యుత్సవమును జరిపిరి. అందు ప్రభుత్వోస్థానకవులు శ్రీ కాశీ. కృష్ణాచార్యులు, శ్రీ కె. వైద్యనాథన్,, ఉడాలి. సుబ్బరామశాస్త్రి, జొన్నలగడ్డ. సత్యనారాయణమూర్తి (విజయవాడ) మొదలగు పెద్దలు పలువురు పాల్గొనిరి. దినదిన ప్రవర్ధమానముగు ఈ సంస్థ హితోధికముగ సారస్వత సేవచేయగలదని ఆశింపవచ్చును. ప్రస్తుతమీ మండలికి శ్రీ పోలూరి హనుమజ్జానకి రామశర్మ యం. ఎ. గారు. పర్యవేక్షకులుగా నున్నారు. సమాజ సమావేశములను జరుపుటకును, పత్రికా ప్రకటనకును, సంఘమైనందిన కార్యక్రమము నుత్సాహముతో జరుపుటకును ముఖ్యముగ పేర్కొదగిన.వారు శ్రీ పి. బి. రాఘవేంద్రరావు. బి. ఎ. వీరుత్సాహవంతులగు యువకులు.

8. మెక్లిన్ పఠనమందిరము :

ఇది 1875 లో నెల్లూరు జిల్లాలోని ప్రత్యేకించి నెల్లూరులోని అధికార బృందమువారు సాయంకాలమప్పుడు వినోదముగ టెన్నిసు, బిలియర్డ్స్ మొదలగు ఆటలాడుకొనుటకును. వివిధవార్తా పత్రికలు, పుస్తకములు చదువుకొనుటకును ఈసంస్థ 'ఇంగ్లీష్ క్లబ్' అను పేరుతో నవతరించినది. దానికే మెక్లిన్ సంఘ మనియు వ్యవహరించుటకలదు. తొలుత ఆ సంస్థయందు యూరోపియన్లు మాత్రమే సభ్యులుగ నుండినను, క్రమముగ పలువురు న్యాయవాదులు, వైద్యులు, ఉపాధ్యాయులును సభ్యులైరి. 1930 ప్రాంతమున ఆసంస్థలో సభ్యుడుగ నుండుట ఒక విధమైన హోదాగా లెక్కింబడెడిది. వీరు కొంతకాలము సారస్వత చర్చలు ఉపన్యాసములు, ఆటలపోటీ ప్రదర్శములు జరిపిరి. కాని క్రమముగ అ కార్యక్రమ మంతయు మూలపడి పేకాడుట. ఒకటి రెండు పత్రికలు చదువుటే ఆధారమై 1959 నాటికి సంఘమే మూలబడినది. గ్రంథాలయములోని కొన్ని పుస్తకములు చెదలు పురుగుల కాహారమైనవి.



పర్మనెంటు ఫండాఫీసు భవనము

ఈ సంస్థను పునరుద్ధరించుటకై శ్రీ ఏనుగు సుందరరామరెడ్డిగారు నడుముకట్టిరి. కాని 1961 లో అకాల మరణము పొందిరి. అనంతరము వారి సోదరులు శ్రీ పట్టాభిరామరెడ్డిగారు అన్నగారి ఆశయ పూర్తికై కృషి సల్పుచున్నారు. ప్రస్తుతమీ సంస్థకు శ్రీ కె. వి. రమణారెడ్డి (అధివక్త) గారు కార్యదర్శిగ నున్నారు. త్వరలో సంఘము పునరుద్ధరింపబడి, శతవార్షికోత్సవమును జరుపుకొను భాగ్యము నందగలదని ఆశింప వచ్చును.

9. హరిజన బాలుర హాస్టలు :

ఈ హాస్టలు 1928 లో శ్రీ తిక్కవరపు రామిరెడ్డి మొదలగు పెద్దలచే నెలకొల్పబడి 1932 నుండి సుబేదారుపేటలో మునిసిపల్ ఆది ఆంధ్ర సత్రమున పనిచేయుచున్నది. [illegible]త కీ. శే. అన్నదాత ఆది నారాయణయ్య బి. ఎ; బి. యల్. గారు కార్యదర్శిగ నుండిరి. 1943 నుండి శ్రీ ఏనుగు పట్టాభి రామరెడ్డిగారు. పట్టుదలతో హాస్టలు నిర్వహణకై కృషి చేయుచున్నారు. 1943 నాటికి 9 మంది విద్యార్థులుండిన ఈ హాస్టలు నేడు 873 బాలురతో విరాజిల్లుచున్నది. ప్రతి సంవత్సరము బాలుర సంఖ్య పెరుగుచున్నందున దొడ్డు దాకర 1950 లో శ్రీ ఆర్. యల్. రెడ్డిగారి పార్కులో కొంత స్థలమును 99 సం॥ ములకు లీజుకు తీసికొం బ

డింది. సోషల్ వెల్ ఫేర్ డిపార్టుమెంటు వారు ఉపకార వేతనములను, వి రా. ళ ము లను ఉదారముగ నిచ్చుచున్నందున సంస్థ నిర్విఘ్నముగ సాగుచున్నది.

**10.** పర్మనెంటు ఫండాఫీసు :

నెల్లూరు ప్రాచీన ఆర్థిక సంస్థలలోనిది యొకటి ఈ సంస్థ 1888 లో నెలకొల్పబడి నది. రాజమంత్ర ప్రవీణ, పన్నె చంచల రావు పంతులుగారు మద్రాసు మైలాపూ రులో స్థాపింపబడియుండిన మైలాపూరు ఫండువలె ,,నెల్లూరు పర్మెనెంటు మ్యూచి యల్ బెన్ ఫిట్ ఫండు' అను నామకరణ మున స్థానికుల సాయమున నెలకొల్పిరి. ప్రథమదశలో నిధి మూలధనము లక్షరూ పాయలుగ నిశ్చయింపబడినది. సి. కోటయ్య, అయలూరు. వెంకయ్య, పి. ఆదినారాయ ణయ్య, టి. వి. వెంకట్రామయ్యరు, గుండ్ల పల్లి రామయ్య, పత్తి, సుబ్బయసెట్టి, మొగి ళ్ళపల్లి, వెంకటసుబ్బయ్య. రామానుజరావు. నాయుడు. ఓలేటి పాపయ్యసెట్టి ప్రభృతు లందు సభ్యులుగ నుండిరి. ఈ సంస్థకు ముందు నెల్లూరు జిల్లాలో ఎట్టి బ్యాంకియు లేదు. కరెంటు అకౌంటు, చెక్కుపుస్తకములు మొదట ప్రవేశపెట్టినది, ఈ సంస్థయే 1923 లో ఇంపీరియల్ బ్యాంకి నెలకొల్ప బడినది. 1904 లో ఫండాఫీసు భవనము కట్టబడినది. 100 అంకణముల స్థలము రు. 1000 లు భవనము రు. 5000 లు అయినవట ప్రస్తుతమా సంస్థకు శ్రీ మేన కూరు ఆదిశేషారెడ్డిగారు అధ్యక్షులుగా నున్నారు. ఈ సంస్థ భూములపైన, ఇండ్ల పైన, నగలపైన, గవర్నమెంటు సెక్యూరి టీలమీద నెల్లూరు, కోవూరు, గూడూరు, వెంకటగిరి తాలూకావాసులకు అప్పులిచ్చుచు న్నారు. ఇప్పుడు 77 వేల రూపాయల రిజర్వుఫండుతో, దాదాపు 500 మంది మెం బర్లతో పనిసల్లుచున్నది. ఈ 1963 సెప్టెం బరులో రత్నోత్సవము జరుపుకొన్నది.

సంస్కృత విశ్వపరిషత్తు, సింహపురిశాఖ, నెల్లూరు.


12-9-63 ది నెల్లూరు కలెక్టరాఫీసు భవనమున జిల్లాకలెక్టరు గారగు శ్రీ యం. వి. రాజగోపాల్, ఎం. ఎ. ఐ. ఎ. యస్. గారి అధ్వర్యమున పలువురు పండితులను సంస్కృత భాషాభిమానముగల అధికార అనధికారులును సమావిష్టులై ప్రజాసామా న్యమున సంస్కృత భాషాభిమానమును గలి గించి, భారతీయ సంస్కృతిని కాపాడుటకై బొంబాయి సంస్కృత విశ్వపరిషత్తుకు అను బంధముగ నెల్లూరులో సంస్కృత విశ్వపరిష త్తును స్థాపింపవలసినట్లు నిశ్చయింపబడినది. తన్నిర్ణయానుసారముగ పలువురు సభ్యులుగ చేర్పబడి 29-10-63 కలెక్టరాఫీసు భవన మందే శ్రీ యం. వి. రాజగోపాల్‌గారి అధి పత్యమున సమావేశమై పరిషత్తుకీ క్రింద విధమున కార్యనిర్వాహక వర్గ మెన్నుకో బడినది.

శ్రీ యం. వి. రాజగోపాల్, ఎం. ఎ; ఐ. ఎ. యస్. (అధ్యక్షులు)

శ్రీ తిక్కవరపు రామిరెడ్డి, పైడా. సుబ్బ రామశ్రేష్ఠి. (ఉపాధ్యక్షులు)

శ్రీ ఉడాలి సుబ్బరామశాస్త్రి సంస్కృత కళాశాలా ప్రిన్సిపాల్, (కోశాధికారి)

శ్రీ వేగూరు వేంకటప్పయ్య, బి. ఎ. బి. ఇడి. (కార్యదర్శి.)



# శ్రీ సంస్కృత విశ్వపరిషత్

సింహపురిశాఖ — నెల్లూరు.

కార్యనిర్వాహకవర్గము 22-'-1964.

కూర్చున్నవారు :

కుమారి ఉ. ఛాయాదేవి, సౌ. ఆర్. దమయంతి, కుమారి ప్రభారాజగోపాల్, సౌ. జయలక్ష్మీరాజగోపాల్, శ్రీ యం. వి. రాజగోపాల్, శ్రీ పైడా సుబ్బరామశ్రేష్ఠి, దీనబంధు శ్రీ యస్. బాలకృష్ణారెడ్డి, ఆర్. సుబ్బారెడ్డి, శ్రీ ఉ. సుబ్బరామశాస్త్రి.

నిలుచున్నవారు :

శ్రీ వి. యస్. దత్తు, యస్. యస్. కృష్ణమూర్తి, శ్రీ వి. వెంకటప్పయ్య, శ్రీ కె. రామచంద్రారెడ్డి, శ్రీ కే. యస్. సుందరరాజారావు, శ్రీ కేసరి సుందరరామశర్మ.

---

సభ్యులు :

శ్రీ ఆర్. సుబ్బారెడ్డి (వి. ఆర్. కళాశాల ప్రిన్సిపాలు) శ్రీ యస్. యస్. కృష్ణమూర్తి (అధివక్త) కే. యస్. సుందర రాజారావు, కావులూరి. రామచంద్రారెడ్డి, శ్రీమతి రేబాల దమయంతిదేవి, కుమారి. ఉడాలి ఛాయాదేవి, నేదురుమల్లి. బాలకృష్ణా రెడ్డి, (వాకాడు) కేసరి సుందరరామశర్మ, (కావలి) వి. విశ్వనాధ శ్రౌతులు, వెలగ పూడి. సుందరరామదత్తు (కోశాధ్యక్ష సభ్యులు)

కార్యక్రమము :

1. సంస్కృత కవుల జయంతులను జరుపుట 2. విశ్వపరిషత్తువారి సంస్కృత పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధముచేసి పంపుట. 3. సంస్కృత కవులను, పండితు లను సముచితరీతి సమ్మానించుట 4. మండ లములోని తాలూకా ప్రాంతములందును సంస్కృత భాషా ప్రచారము సాగించుట. 5. గ్రంథాలయ స్థాపన, పరిశోధనాను కూల వాతావరణమేర్పరచుట మొదలగు నవి.

ఈ పరిషత్తువారు ప్రథమముగ కేంద్ర ప్రభుత్వమువారి విజ్ఞానప్రసారముగ 2-11-63 సోమయాజులు ఆ. ఆర్. కళా శాలా భవనమున "మహర్షి వాల్మీకి జయంతి" ని 30-11-63 ది వ్యాసజయంతిని 6-12-63 ది మహాప్రభుల్లోని జయంతిని 28-12-63 నాడు మహాకవి కాళిదాస జయంతిని జరిపిరి

ఈ పరిషదధ్యక్షులు శ్రీ రాజగోపాల్‌గారు ఆంధ్ర విశ్వ విద్యాలయము, రిజిష్ట్రారుగా పోవు సందర్భమున, వారి కుటుంబముతో కార్యనిర్వాహక సభ్యులు, గౌరవించిరి. 22-1-64 ఆసందర్భమున తీసికొనిన సాముదాయక ఛాయా చిత్రము ఇందు ప్రకటితమైనది.



శ్రీ పూండ్ల రామకృష్ణయ్య
అముద్రితగ్రంథచింతామణి పత్రికాధిపతి.



శ్రీ కొట్రా ఆదిశేషయ్య-పి. టి. ఐ. విలేఖరి.



రచయిత్రి

సౌభాగ్యవతి. డా. ము. ఆదిలక్ష్మమ్మ.




సౌభాగ్యవతి పాటూరు బాలసరస్వతమ్మ.



శ్రీ మదుపూరు కోదండరామిరెడ్డి,
పాలకుడు; మందాకినీ సంపాదకులు.



✻ కోట సోదరకవులు - కనిగిరి. ✻



బ్రహ్మశ్రీ
గన్నవరపు సుబ్బరామయ్య.



పాటూరు
సుబ్బరామయ్య.



అప్పల ఆంజనేయులు,
రాష్ట్రపతి.



శ్రీ నెల్లూరు వేంకట్రామా నాయుడు
జమీన్‌రైతు : స్థాపకులు - సంపాదకులు.



కీ. శే. దువ్వూరి రామిరెడ్డి
చూ. పే. 310, 820.


ఈ బ్లాకులను జమీన్ రైతువారు దయతో మా కొసంగిరి



బడి గురవారెడ్డి




శ్రీ కేసరి సుందరరామశర్మ (సహాయ సంపాదకుడు)
వ్యా. నెం. 39, 47 పే.:461, 553



శ్రీ యస్. మాలెకొండయ్య
వ్యా. నెం. 19 పే. 185



శ్రీ కాసుఖేల రామస్వామిరావు
వ్యా. మండల విద్యావ్యాప్తి



శ్రీమాన్ కె. రామానుజాచారి
వ్యా. నెం. 14 పే. 113



శ్రీ చలంద్యాల వె. సుబ్రహ్మణ్యశర్మ
వ్యా. నెం 4 పే. 19



శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి
వ్యా. నెం. 67 పే. 702



శ్రీ వి. కుమార్
వ్యా. నెం. 52 పే. 585



శ్రీ రషీద్‌బాషా
వ్యా. నెం. 18, 38 పే. 177, 453



శ్రీ డా॥ రావిప్రోలు సుబ్రహ్మణ్యం
వ్యా. నెం. 5, 15 పే. 27,117



శ్రీ ఇండ్ల సుబ్బారావు
వ్యా. నెం.57, 70 పే. 637, 729



శ్రీ వావింటపర్తి కృష్ణమూర్తి
వ్యా. నెం. 7, 16 పే. 49, 123



శ్రీమాన్ ఇముణ్ణి వేంకట వీరరాఘవాచార్యులు
వ్యా. సం. 71, 75 పే. 733, 791



శ్రీ ఆర్. సుబ్బారెడ్డి
వ్యా. సం. 6, 17 పే. 33, 129



నాట్యాచార్య శ్రీ కోట సుబ్రహ్మణ్యశాస్త్రి.
వ్యా సం. 53 పే. 599

శ్రీః

# శ్రీ విక్రమ సింహపురి మండల సర్వస్వము

శోభకృత్
1963

## తృతీయ ఖండము

# III

జ్ఞానాగ్ని పరిపూతో యః
సర్వాత్మైకైక కల్పకః
సవః ప్రకాశతాంకామః
మత్స్యరూపాదనన్తరః

డా. వి. రాఘవభట్ల

# శ్రీ విక్రమ సింహపురి మండల సర్వస్వము

## వ్యాసావిష్కరణ సూచిక

## తృతీయ ఖండము


| వ్యాసము | పుట |
|---|---|
| 1. కవిసార్వభౌముడు - తిరుకాళిచోళుడు<br>Kavi Sarvabhouma & Tirukkalachola:<br>N. Sivasundareswara Rao | 1 |
| బి. వేమూరి శ్రీరామశాస్త్రి | 3 |
| 2. నెల్లూరి కవి కుటుంబము<br>Family of Poets : E. V. V. Raghavacharyalu. | 7 |
| 3. మాఘుడు - గోపీనాథ వేంకటకవి<br>Magha & Gopinatha Venkatakavi.<br>Puttaparti Narayana Charyulu. | 15 |
| 4. నెల్లూరు మండల దేవాలయాల శిల్పశోభ<br>Nellore Temples and sculpture<br>Dr. S. Gopala Krishna Murthy. | 21 |
| 5. ఎ. సెకండరీ విద్యావికాసము<br>Secondary Education : C. Ramaswamy Rao. | 35 |
| బి. బోధనాభ్యసన పాఠశాలలు<br>Trainning Schools : D. Ramamurti | 46 |
| సి. వేదసంస్కృత కళాశాలా<br>Veda & Sanskrt College : K. Ramanuja Charyulu. | 48 |
| డి. కళావేత్తలు<br>Artists : S. Sanjiva Dev | 52 సి |
| 6. ఎ. ప్రముఖులు<br>Famous Persons : M. Kothanda Rami Reddy. | 53 |

బి. నెల్లూరి నెఱవాదులు
The Great-men of Nellore : Mocherla Ramakrishnaiah 85

సి. ప్రముఖ న్యాయవాదులు
Famous Vakils : P. Audinarayanamurti. 91

7. భారతీ భాష
Samskrt : Dr. D. C. Saraswati. 98

8. శిల్ప సంపద
Sculptural wealth : N. S. Krishnamurti, 99

9. సంస్కృత విద్వత్కవి చరితము
Samskrt & Samskrtists : U. Subbarama Sastry. 133

10. ఇంగ్లీషు వ్యాప్తి
Spread of English : C V. Ramachadra Rao 151

11. 2000 నాటికి నెల్లూరు
Nellore in 2000 A. D. : Mogalluru Siviah. 163

శ్రీ రంగనాథ స్తుతి

అ ను బం ధ ము

ఆవిష్కరణ మహోత్సవ సమీక్ష
Festival of the Release and Publication of this work :
a resume : B. Gurava Reddy.

చిత్రవిచిత్రములు. సూచి

చిత్రములు. సూచి

చిత్రఫలకములు I నుండి XXV వరకు.

ప్రసిద్ధ పద సూచి : ద్వితీయ తృతీయ ఖండములు

# 1. కవిసార్వభౌముడు - తిరుకాళచోళుడు

శ్రీ నిడదవోలు శివసుందరేశ్వరరావు

## A

*కాశాః శ్రీరసికాశాఽదధిశరవర్ణాని సప్త పర్ణాని।
నవనీతసితశ్చంద్రః శరది చ తత్ర ప్రథాజ్యోత్స్నా॥

అను శ్లోక మొకటి గండ గోపాలునిదిగా సుభాషిత రత్నసందోహమను ప్రాచీన సంస్కృత సంధాన గ్రంథమందు పేర్కొనబడినది. ఈ గండగోపాల బిరుదాంచితులు నెల్లూరు నేలిన తెలుగుచోళభూపతులలో చాలమంది గలరు. వారందఱిలో చరిత్రలో ప్రాణకెక్కినవాడు తిరుకాళచోడుడు. ఇతడు నిర్వచనోత్తర రామాయణ కృతిభర్త మనుమసిద్ధి తండ్రి సాహిత్యసమరాంగణములయందు సమానమైన కీర్తిగడించినవాడు. క్రీ. శ 1210 నుండి 1250 వఱకు కడుసమర్థతతో రాజ్యమేలిన తిరుకాళవిభుని శౌర్యప్రతాపాదికములు తిక్కన ఉత్తరరామాయణమున వర్ణితములైనవి. అందు ముఖ్యముగాఁ బేర్కొనదగిన పద్యములు.

రాయగండగోపాలు పరారి భయద
రాయపెండారిబిరుదాభిరాము నుభయ
రాయగండాంకు ఖండియరాయఁ దిక్క
ధరణివిభుఁ జోళరాజుల కరిదికాదె.

సీ॥ భృత్యానురాగంబు పెంపుఁ జెప్పఁగ నేల పరివారసన్నాహ బిరుదుగలుగ
వంది ప్రియత్వంబు వర్ణింపఁగా నేల పాఠక పుత్రాఖ్య పరఁగుచుండ
సకల విద్యాపరిశ్రమముఁ దెల్పఁగనేల కవిసార్వభౌమాంక మవని నెల్ల
సుభగతామహిమఁ బ్రస్తుతిసేయఁగా నేల మన్మథనామంబు మహి నెగడ,

తే॥ గీ॥ నుభయబలవీరుఁ డనుపేరు త్రిభువనములఁ
బ్రచురముగ ఘోరబహుసంగరముల విజయ

---

*Some forgotten Sanskrit Poets of Karnataka Annals of B.O.L. Silver Jubilee Volume (1917-42) PP. 415-423.

లక్ష్మిఁ జేకొను బాహుబలముసొంపు
పొగడనేటికిఁ దిరుకాల భూవిభునకు.
(నిర్వచనోత్తర రామాయణము 1-33, 35)

పైపద్యమునందు తిరుకాలచోళుడు సకలవిద్యా పరిశ్రమమున జితశ్రముడై కవిసార్వభౌమ బిరుదము నొందినట్లు టిక్కన చెప్పియున్నాడు. కవితచెప్పి యుభయకవి మిత్రుడైన తిక్కనసోమయాజి మెప్పించుట కష్టమని ఆనాటికవుల యభిప్రాయము. అట్టి తిక్కనసోమయాజి తనగ్రంథమున తిరకాలవిభుని కవిసార్వభౌమునిగా బేర్కొనుట విశేషము గదా! ఈ తిరుకాల విభుని కేతన

"యొద హరిహరరాయపెండరుఁడు భయకటక
సీరుఁ నభినవభోజుఁ డాకారమదనుఁ
డనని భారతేరేయమహాత్మ విజిత
దిక్కరీంద్రుఁడు ఘనచోళ తిక్కన తిక్కనృపతి"

అని తనదశకుమారమున తిరుకాళచోళుని కవి సార్వభౌముడు "అభినవ భోజుఁడని" బలపరచినాడు. ఈవిభునియాస్థానము సంస్కృత ప్రాకృత శౌరసేన్యాదుల ఘటికలోనొక శతకంబుఁ జెప్పగలవాగును, నాంధ్రకవిత్వమునందుఁ బ్రబంధంబుమేలుగాఁ దద్దులు మెచ్చఁ జెప్పినవాడును, చిత్రగర్భకవిత్వ నేర్పరియునగు పెద్దయామాత్యుడను కవీశ్వరుడు గలడు. జక్కన విక్రమార్కచరిత్రయం దీ పెద్దనను

నెల్లూరి తిరుకాళ మనుజవిభుని
సమ్ముఖమ్మున సాహిత్యసరణి మెఱసి
మహిమగాంచిన పెద్దయామాత్యసుకవి. (వి.చ. 1-20)

యని శ్లాఘించియున్నాడు.

తిక్కన సోమయాజి పెద్దతండ్రి సిద్ధన, తిరుకాళ భూపతిమంత్రి. కేతన దశకుమార చరిత్రమున

స్థాపితసూర్యవంశతసుధాపతినాఁ బరతత్వధూత వా
ణీపతి నానుదాత్తనృపనీతి బృహస్పతినాగృహస్థ గా
రీపతి నాఁగృపారస సరిత్పతినాఁ బొగడొందె సిద్ధిసే
నాపతిబోడ తిక్కజననాథశిఖామణికి ప్రమంత్రియై.

సిద్దనమంత్రియు, కొమారుడు ఖడ్గతిక్కనయు తిరుకాళవిభుని కొలువువారే. సిద్దన ప్రగడదిగా శాకుంతలమునుండి నొకపద్యము సంకలన గ్రంథములం దుదాహృతమయ్యెను.

ఉ॥ నీరజ మిత్రుతో బయల నిల్చి చలంబునఁగిట్టి మెయుయుం
బోరుట దుర్లభంబనుచు భూరి తమః పటలంబులొక్కమై
నూరెలఁ గోటనట్టి పొడనూపఁగ నొక్కొ యెనిర్చినాఁగఁ బ్రా
కారి నిబద్ధనీలమణి కాంతిఁగనుంగొనదొప్పు నింతయున్.

సిద్ధనమంత్రి తండ్రి భాస్కరుఁడు. సారకవితాభిరాముడు. పెద్దన్న కేతన ప్రగ్గడయు కాదంబరి కర్తగా ప్రాచీన లక్షణగ్రంథములందు తెలుపబడెను కాని వీరికిని తిరుకాళవిభునకు మధ్య నెట్టిమైత్రి యుండెడిదో తెలియకున్నను, కవిసార్వభౌముడును, అభినవ భోజుడునునైన తిరుకాళవిభుని వీరెరింగియున్నారు. తిక్కన సోమయాజి పూర్వుల గ్రంథములుగాని, తిరుకాళవిభుని విద్యావైదుష్యములను చాటుటకు ప్రబల ప్రమాణములుగాని కాలవాహిని దాటి వచ్చినవిగావు.

## B

## వేమూరి శ్రీరామశాస్త్రి

జననము జువ్విగుంట, నెల్లూరు. వలస నిజాము హైదరాబాదు. వెలనాటి వైదికులు. హరితస గోత్రోద్భవులు. 15-9-1870 జననము. తండ్రి రామజోగిసోమయాజి. తల్లి కోటమ్మ సోమిదేవమ్మ. తాత లక్ష్మీనారాయణ పౌండరీకయాజులు. శ్రీ కాళహస్తి సంస్థానాస్థాన విద్వాంసులు. 1894 యావద్భారతదేశము పర్యటించిరి. 1898 లో బరోడా మహారాజసమక్షమున 14 గంటలలో శతావధానమును, 1903 లో శ్రీ కాశ్మీర మహారాజా వారిని గ్రైవేయక బంధమ్ అను చిత్రకవితా చమత్కృతిచే మెప్పించి "మణికంఠ" మనెడు హారము బడయుటయు, 1911 లో జార్జి చక్రవర్తిగారి పట్టాభిషేకమహోత్సవ సందర్భమున "ఢిల్లీప్రథ" లేక "దర్బారుకనేదా" అను సంస్కృత గ్రంథము రచించి ప్రథమ కక్ష్యయందు గౌరవము పొందుటయు, శృంగేరి పీఠాధిపతులు వీరు రచించిన "సప్తలాభ స్తుతి"ని మెచ్చి, నైజాము రాజ్యమందు తమ ప్రతినిధిగాఁ జేయుటయు, వీరి జీవితమందలి రసవత్తర ఘట్టములు. వీరి చరిత్రను

కాఠీ - కథియవాడలలో "అవిచ్ఛిన్నాహితాగ్నివంశ" మనియు, మళయాళమున "అపార చరిత్య" అని ప్రకరణోచితముగఁ బ్రకటితమైనది. ఈయన హేమవతీ దండకమును రచించెను. (ఆధునిక కవిజీవితములు. పుట 27-31)

*తిరునాళ్ళ దండకము:-* దీనిని బంగారు యాచమనాయని కొమారుడగు కుమార యాచమనాయకుని కంకితముగా నెవరోకవి రచించినట్లు చెన్నపురి ప్రాచ్య లిఖితపుస్తక భాండాగారమునందలి R. 717 మూలమున తెలియుచున్నది. ఇది వెంకటగిరిలోనుండు కాశీవిశ్వనాథనాయకుని వర్షోత్సవ సమయమున రచింపబడినది. శతఘంటం రంగన్న హేమవతీదండక మొకదానిని రచించినని వెలుగోటి వారివంశ చరిత్రయందు వ్రాయబడినది. అది ఇదియగునో? కాదో?

*ప్రభులింగలీల:-* కన్నడమున చామరసనుకవి రచించిన ప్రభులింగలీల యను వీరశైవగ్రంథమునకిది ద్విపదయనువాదము. కవి పిడుపర్తి సోమన. కృతిభర్త కాంచీపురమున ధర్మరుద్రావిశాఖ్యయని పేరెక్కిన నెల్లూరి రామలింగము 16 దశతాబ్దమునాటిది. ఈ పిడుపర్తి వంశీయులు చుండిప్రాంతమువారు. నిమ్మనాథుడను కవి నిజలింగచిక్కయకథను యక్షగానమున రచించియున్నాడు. ఇది చుండి కలికేశ్వరున కంకితము. పిడుపర్తికవులు ప్రౌఢదేవరాయలు ఉదయగిరి దుర్గమును చేబట్టి నప్పటి నుండియు ప్రఖ్యాతి నొందుచునచ్చిరి.

## C

### నెల్లూరు - చాటువులు.

వల్లెల్ మొల్లలు క్షేమమా? శుభములా మాకందముల్? జాజులున్
మొల్లంబారకయుండునా? సుదతులున్ మోదంబు వాటింతురా?
విల్లుం గోలయు (మోహరూఢమరునా) వేమాల నూ-యున్నదా?
నెల్లూరన్ పెదసోమవీథిని కదా నీరాక చైవాత్రికా?

### వీరనకనుపూరు - కొల్లుకదురు.

ఆ॥వె॥ ఊరిమట్టుముండ్లు నుదకంబు మధ్యంబు పాడిపంటసున్న ఫలము నాస్తి
తీరుదినుసులేని వీరనకనుపూరు పాడుకొంప దీనిత్రాడుత్రెంప.

ఆ॥వె॥ ఒక్కపాలెగేసి యొక్కపాలుదిగేసి ఉన్నయూరిమీఁద మన్నుబోసి
పాపరాజుపోమోఁ బారుపత్తియుఁ బోయె కొల్లుకుదురుమీఁద గోఁజివిపెట్టి.

వేంకటగిరి.

ఏమందము పురగణికల కేమందము భోగలీల కింమున్న ఫలం
జేమందము వెంకటగిరి సేనుండమటంచ నమ్మేంద్రుని గణికల్.

(మండపాక పార్వతీశ్వరశాస్త్రి. రాధాకృష్ణ సంవాదము)

కొడమగుంట కేశవాచార్యులు. కొండూరివారి అగ్రహారము. బంధకవిత్వమున నేర్పరులు.

వెంపటి రామనాథశాస్త్రి వెలనాటి వైదికులు. తండ్రి సుబ్బాభట్టు, తల్లి రామలక్ష్మి. జననము రుధిరోద్గారి ఆశ్వయుజ బహుళషష్ఠి. వెలుగోటివారి హైస్కూలునం దుపాధ్యాయులుగా నుండెడివారు. సంస్కృతమున కృష్ణచరితమ్, తెలుగున దశావతారచరిత్ర వ్రాసిరి.

## 15. నెల్లూరు చిత్రవిచిత్రములు

నెల్లూరునకు 1-11-1927 సం॥న గాలివాన వచ్చెను. ఆ విషమ, విషాద, ఘోర సందర్భముల వివరించుచు బ్రహ్మశ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు :-

"ప్రభవకార్తిక శుద్ధసప్తమిని భౌమవాసరోదయవేళఁ జూపెట్టె సింహ
పట్టణంబున నొకకొంత వర్షరేఖ చిటుకుపాటుకునఁ జిటిపొడి చినుకుతోడ"

గాలిరేగి, వర్షమెక్కువై వాతావరణము బీభత్సయుతమై, ప్రాణహాని, వస్తువాహనాది ధ్వంసము, చెట్లకు చేటు ప్రాప్తించెను.

ఉ॥ పెక్కులు తేనిపట్టులన పేకులమూఁక లనేక మేకమై
చక్కలఁద్రోవఁ బర్విలిడెఁ జోద్యముగాఁ గడుదవ్వులెవ్వనన్
గ్రిక్కిఱియుంగన నింపినబిగింపులు వంపులుపోయి త్రెయ్యఁగా
నక్కసుతీఱఁ గాడ్పుదొరహామిక వైచెడు చక్రపంక్తినా.

గీ॥ అయిదుదినముల పసికందు నబ్బకిచ్చి వెంటజనలేక చనుచుండె వెలఁది యొర్తు
ఆమెకాత్యరమును గన్నయపుడు నాకుపట్టజాలక కనుల బాష్పములుదొనికె.

ఇట్టి ఆకలంకలమైన మండలమునకు సాయమొనర్పుటకై సంఘసేవకులు :

శ్రమపడి పల్లెపల్లెకును సారెకుఁగ్రుమ్మరి పేదవారి క
న్నము మఱివస్త్రమిచ్చిరి ఘనంబుగ నాపయిఁ జిన్నచిన్నగే

హములను గట్టియిచ్చిరి సమంచిత సౌహృదమొప్ప రామకృ
ష్ణమిషను వారలత్తరి నొనర్చినసాయము నెన్నశక్యమే.

సీ॥ తనచేతనయినంత తానొనరించె సాయమ్మును దగమండలాధికారి
అరుదెంచ గౌర్నరత్యాదృతిఁ దగినంత ధనమిత్తుననుచు వాగ్దానమొసఁగె
దేశభక్తుం డేఁగుదెంచి ప్రచారమ్ము నొనరించి కొంతచేయూఁతనిచ్చె
స్వచ్ఛంద సేవకసంఘము శక్తివంచనయింతలేకుండ సాయపడియె.

వారివారికిఁదగు నుపకారమెల్ల వారొనర్చిరెకాని యపారకష్ట
ములకుఁబాలైన యొక్కమండలమునెల్ల నుద్ధవిడి నుద్ధరింపగ నోపునెవడు.

రెండురోజులలో జరిగిన విషాదస్థితినుండి రెక్కొనుటకు తరువాత రెండు, మూడు సంవత్సరములు పట్టినది.

మ॥ కలవారెల్లరు సౌహృదంబలర సాకల్యంబుగా సాయమున్
సలుపన్ బేదలు పెంపుగైకొనఁగ, వృక్షవ్రాతములె క్రొత్తకొ
మ్మలతో సొంపిలి పల్లవప్రకరసామగ్రిన్ గగన్, బల్లెటూ
ళ్లలు వృద్ధింగనఁ బూర్వవైఖరిని నెల్లూర్ సీమ శోభిల్లుతన్.

ఈ తుపాను వలన కల్గిన క్షోభదృశ్యములు 'భారతి' ప్రభవ మార్గశిరమాస సంచిక యందు గలవు.

♦ ♦ ♦ ♦ ♦ ♦

195? సం॥ నవంబరు 1,2 తేదీలన అనగా 1927 సం॥న ఆవేశించిన గాలివాన, మఱొక వికృతరూపమున ముప్పైసంవత్సరముల తరువాత సుళ్లూరుపేట ప్రాంతముల నాశ నము చేసినది. అనాటి వైపరీత్య సంఘటనలో యా క్రింది స న్ని వే శ ము ఆంధ్రపత్రిక 12-11-1957 న ప్రచురింప బడినది.

"కోటవల్లూరు గ్రామంలో మాగాణి చేలో కాపురం ఉంటున్న అయిదుగురి కుటుం బము వరదకు భయపడి ప్రాణాలు దక్కించుకునేందుకు గడ్డివామమీదకెక్కి కూర్చున్నది. గడ్డివామి వరదలో ప్రయాణం సాగించి అయిదుమైళ్ళ దూరంలోని కుదిరి గ్రామం చేరువకు చేరింది. అట్లాగే ఆ గడ్డివామిమీదనే ఆ కుటుంబం ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని యుండగా 6-వ తేదీన వారిని అవతలకు చేరవేశారు."

ఇట్టి వైపరీత్యము లనేకములు జరిగినవి.

————

# 2.

# నెల్లూరి కవి కుటుంబము

'విద్యారత్న' ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులు.
(యం. ఏ., ఏ. ఇ. యస్. రిటైర్డ్)
సంస్కృత-ఎకాడెమీ, ఉస్మానియా యూనివర్సిటీ.
హైదరాబాద్.

౧. భూమిక :

నేటి నెల్లూరుమండలము ప్రాచీనకాలమున పాకనాడని వ్యవహరింపఁబడు దేశమునందలి భాగము. ఈ మండలము క్రీ. శ. 1200 ప్రాంతమునుండి నేటివఱకు పరశ్శతసంస్కృతాంధ్ర కవికోవిదతల్లజులకు పుట్టినిల్లు. తిక్కనకంటె నించుక పూర్వుఁడును జ్యేష్ఠుఁడు నగు పెద్దయామాత్యుఁడు మనకుఁ దెలిసినంతవఱకు నెల్లూరు మండల ప్రథమాంధ్రకవి. ఈయన పౌత్రుఁడే విక్రమార్కచరిత్ర కర్తయగు జక్కన. తిరుకాళత్తి రాజసభయం దీ పెద్దన ఆశు - చిత్ర - మధుర - విస్తరములను చతుర్విధ కవితావినోదములను సాహిత్యవిద్యాప్రదర్శనములను నెఱపుచుండినట్లు విక్రమార్క చరిత్రవల్లనే తెలియుచున్నది. పెద్దన కాలము క్రీ. శ. 1240 ప్రాంతము.

౨. దేశరాజు విద్వత్కవి కుటుంబము :

కాశ్యప గోత్రజులు, ఆఱువేలనియోగి బ్రాహ్మణులు, ఆపస్తంబసూత్రులు నగు దేశరాజువారే. తర్వాత వీణవారనియు, నెల్లూరియందు వసించుచుండుటచేఁ బిమ్మట నెల్లూరివారనియు ప్రసిద్ధినందిరి. ఈ కవి కుటుంబమున వీరరాఘవామాత్య కవియు, అతని తనయుఁడగు శివరామకవియు విద్వత్కుంజరులనియు, కవితల్లజులనియు ఖ్యాతినందిరి. ఇందు వీరరాఘవకవి, వీరరాఘవీయ మనఁబడు విశేషణ రామాయణమును సంస్కృతమున రచించుటయేకాక యాదవపాండవీయము, వసుంధరాపరిణయము మొదలగు 61 ఆంధ్ర గ్రంథములను రచించి ఖ్యాతినందెను. ఇతని తనయుఁడు శివరామకవి కామకళానిధి, రామగీతలు అను రెండు గ్రంథములను రచించెను. ఈ యిరువురు కవులనుగూర్చి యీ వ్యాసమున ప్రసంగింపఁబడును.

శ్రీ వీరేశలింగము పంతులుగారు ఆంధ్రకవుల చరిత్రమున[1] వీరరాఘవ కవినిగూర్చి వ్రాసిరి. కాని యీ కవి సంస్కృత కవియని గుర్తింపలేదు. శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు సంస్కృత కవిజీవితమున[2] యీకవినిగూర్చి వ్రాయుచు నీతఁ డాంధ్రమునఁగూడ కవియై బహుగ్రంథ నిర్మాత యయినట్లు గుర్తింపలేదు. వీరరాఘవకవి ఆంధ్రముననేకాక సంస్కృతముననను కవియని గుర్తించినవారు ఇరువురు. ఆంధ్ర కవిస ప్తశతియందు శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు, దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయమును నిర్మించిన శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు.

౬. *వీరరాఘవకవి వంశాదికము :*

వీరరాఘవకవి రచించిన యాదవరాఘవ పాండవీయమున అవతారికలో (౧౦-౨౮ పద్యములలో) కవివంశానుక్రమణిక వివరింపఁబడెను. విశేషరామాయణ మునందును ఈ యంశము వించుక సూచింపఁబడెను.

సీ. ఎవ్వనేతంౘిపే రిల దేశరాజువారన నింటిపేరు ము న్నమరఁ దెచ్చె,
ఎవ్వనిసవ్విద్య హెచ్చుగా వీణవా రన నింటిపేరు ము న్నమరఁగూర్చె,
ఎవ్వనికొమరుఁ డింబల పెద్దవేంకటపతిరాయలకు దళవాయి యయ్యె,
ఎవ్వఁడు గీత సాహిత్యవిద్యల నేర్చి దిగ్విజయంబునఁ దేజరిల్లె,

గీ. ఎవఁడు ఢవిణములహరియు ధవళశంఖ మాదిగాబిరుదుల నెల్ల నంది మించెఁ
బ్రౌఢరాజులచే నిమ్మహం డనంగనతఁడు నుతికెక్కెఁ గొండలాహ్వయుఁడుజగతి.

(యా. రా. పాం. అవతారిక, ౧౫ ప.[3])

శ్లో. "శ్రీమత్కాశ్యపగోత్రపూతమహితాప స్తంబసూత్రస్య చ
శ్రీమనెల్లూరిరంగమంత్రిసుధియః పాత్త్రస్య విద్యానిధేః,
శ్రీమత్కొజితవీణ-వేంకటపతేః పుత్త్రస్య రామాయణం
కావ్యం స్వీకురు వీరరాఘవ కవేంః శ్రీరామ! మే వాఙ్మయమ్."

విశేషణరామాయణమ్ (ఉపసంహార శ్లోకః)

1. తృతీయ భాగము ౬౩-౫. (1911)
2. ప్రథమ సంపుటము ౬౨౨-౨౩. (1950)
3. ఆంధ్రకవుల చరిత్రము - తృతీయభాగము ౬౩ పు. రాజమహేంద్రవరము 1911 శ్రీ. యా రా. పాం. వఠిపెల్ల విశ్వనాథశాస్త్రిగారి 'ఆనందజ్యోత్స్న' వ్యాఖ్యతో. (1961-ప్రకటితము.)

వీరరాఘవకవి ప్రజ్ఞావైభవము, విద్యావైదుష్యము, కవితాప్రావీణ్యము మొదలగు సంశము లీక్రింది పద్యమువలనఁ దెలియనగును.

సీ. సకలమంత్రరహస్యశాస్త్రసర్వంకష ప్రజ్ఞాధికస్ఫూర్తిఁ బరఁగవిల్లి,
నిఖిలయోగరహస్య నిరుపమ శివిధోరు రాజయోగాభ్యాసరక్తి మీఱి
ఆగమాంతరహస్య భాగోపనిషదర్థ సర్వస్వవిజ్ఞానసార మెఱిఁగి,
నాటకాలంకార నానావిధవిశేష రసభావభేదముల్ పొసఁగఁ దెలిసి,

ఆ. శబ్దముఖ్యశాస్త్ర - సదసద్వివేకల స్మృతిపురాణవస్తు రతిరహస్య
గణితతురగ రత్నగజపరిజ్ఞానత నమరు వీరరాఘవాఖ్యకవిని.
(యా.రా.పా. 1. ౨౫ ప.)

క. నానావిధావధానము - లానృపనీతియును భరతమాహాత్మ్యదుల్,
మానుగ నిచ్ఛాలిపియున్, మానితముగఁ గల్గుఁ గోపనంబును మఱియున్.
(యా.రా.పా. 1. ౨౬)

క. ప్రాకృతముఖషడ్భాషల వ్యాకరణంబులును దెలుఁగు వ్యాకరణంబుల్,
ప్రాకటసాముద్రికమును వీకను జ్యోతిషముఁ జాపవిద్యావిధమున్. (1. ౨౭)

క. సాంగముగఁ దెలిసి మును యోగాంగీకారమతి నిశ్చలానుభవాప్తిన్,
బొంగియు, నియోగవృత్తిఁ బొసంగి చెలంగితిని సారసాహిత్యనిధిన్. (1. ౨౮)

సీ. [4]శతలేఖనీపద్య సంధానచాతురి, ఘటికాశతగ్రంథ కరణపటిమ,
ఆశుప్రబంధ బంధాదిక్రియాస్ఫూర్తి సంకరోష్ఠ్య నిరోష్ఠ్య చాటుకలన,
విస్తర మాధుర్య వివిధచిత్రస్ఫూర్తి పాదమాత్ర ప్రతిపాదఘటన
వ్యస్తాక్షర విమిశ్ర బహుపద్యగుంభన మచల జిహ్వాదిక ప్రచురరచన
బహుజనమనోంతరస్థిర బహువిధార్థ బహుసమస్యాప్రపూర్తియు బహువిభేద
సకలవినమనసమస్వాని సంవిధాన మనుర గూర్తును నెల్లి రాఘవాఖ్యకవిని.
(యా.రా.పా. 1. ౨౯

క. పంచాశచ్చాటుకథా - చంచత్కృతులను రచించి సత్కవిపూజా
సంచితకీర్తిని దగు సాధ్వంచితుఁడను వీరరాఘవాఖ్య నియోగిన్. (1. 30.)

4. భట్టుమూర్తి నరసభూపాలీయమున (1 అ. ౧౩ వ.) రచించిన యీ క్రింది పద్య మును అనుకరించియే పై పద్యమును వీరరాఘవకవి రచించినట్లు స్పుటముగ గోచరించును.

సీ. శతలేఖనీపద్య సంధానధౌరేయు ఘటికాశతగ్రంథకరణధుర్యు.

చ. అవునన గావ్యపంక్తి పదియర్థములన్ రచియింపనేర్తు సత్
కవులదయన్, శిరీషకవితామృదుతామహితార్యవైఖరిన్,
భువి నటులైన సత్కథల మూటినొనర్తును బాలబోధకై
తివిరి బహుత్వమందు నలత్రిత్వము పర్యవసాన మూటచేన్. (1. 3౧.)

౪. వీరరాఘవకవి కృతులు :

తన కృతులను వీరరాఘవకవి వసుంధరాపరిణయమున[5] నిట్లు పేర్కొని యున్నాడు.

సీ. "సప్తకాండమ్ములు సప్తవిభక్తులు హరి కథము విశేషగాప్తిఁ దనర,
రమణవిశేషణ రామాయణంబు నాఁ గృతిరచించితి చమత్కృతి రహింపఁ
గృష్ణభుజంగంబు కృష్ణలీలామృత త్రిపురరారిదండకకృతి రచించి,
అలర స్తంభోద్భవం బాదిగాఁ దత్కథ గద్యకావ్యంబుగా ఘటనఁ జేసి,
యొంచ రసమంజరిని దెనిఁగించి, నీతి సర్వలోకేశశతకంబు సంఘటించి,
మంత్రపాదస్తవంబును మఱియుఁ గృతులు ఘటనఁ జేసితి వీరరాఘవకవీంద్ర!
(ద.దే. ఆంధ్రవాఙ్మయము ౨౫౭-౯ పు.)

(అ) వీరరాఘవకవి కృతులు: ఆంధ్రము 1. అష్టదిగ్గజంబుల సీసపద్యములు-రత్నమాలికలు, 2. కృష్ణభుజంగము, 3. కృష్ణలీలామృతము, 4. చాటు కృతులు, 54. త్రిపురారి దండకము, 55. మంత్రపాద స్తవము, 56. యాదవ-రాఘవ పాండవీయము (ముద్రితము). 57. రసమంజరి (ఆంధ్రీకృతము; భానుదత్తుని సంస్కృత రసమంజరికి పరివర్తనమై యుండును), 58. వసుంధరా పరిణయము, 59. సర్వలోకేశ శతకము, 60. సానంద చరిత్ర-ద్విపద?, 61. స్తంభోద్భవగద్య.

(ఆ). సంస్కృతము: 62. విశేషరామాయణము (వీరరాఘవీయము)

౫. యాదవ రాఘవ పాండవీయము: ("మహాప్రబంధ రాజ శిరోరత్నము")

వీరరాఘవ కవి కావ్యములలో లభించిన మూఁడింటిలో పై ప్రబంధమొకటి. ఉపలబ్ధములై, ముద్రితములైన యాతని రెండాంధ్ర గ్రంథములలో నిది యొకటి. రెండవది వసుంధరా పరిణయము. యా.రా.పాండవీయము నాలుగా శ్వాసముల త్ర్యర్థి కావ్యము. త్ర్యర్థక (=త్ర్యర్థి) కావ్యమనఁగా వర్ణనాత్మకములగు నే కొన్ని యో

5. అముద్రిత గ్రంథచింతామణి - వెల్లూరు (1902.)

యేకార్థపద్యములుతప్ప, ప్రతిపద్యమును అనుస్యూతముగా ఇతివృత్తత్రయమున కన్వయించునట్లు మూఁడుకథలు ముప్పిరిగొనునట్లు ర చిం ప ఁ బ డి న ప్రబంధము. ఈ రామ - కృష్ణ - పాండవుల కథలను మూఁడు సూత్రముల నేకసూత్రముగా అల్లి, బ్రహ్మవిష్ణుశివాత్మకమైనను ఏకమూర్తిగాఁ గన్పట్టు భాస్కరబింబమువలె ఒక్క ప్రబంధమువలెనే రచింపఁబడి ఇతివృత్తత్రయమున కన్వయించును. గంగాయమునా సరస్వతులు కలసి ఏకనదివలె భాసించినట్లే ముప్పేటలవంటి మూఁడు కథలును కలసి ఒక్క ప్రబంధమువలె చూపట్టును.

వీరరాఘవకవి తా ననుసరించిన త్ర్యర్థికావ్యరచనా విధానము నీ క్రింది పద్యమున వివరించెను.

సీ. ఒకచోట శబ్దార్థయుగళచమత్కార సందర్భగర్భితచతురవృత్తిఁ,
ఒకవంక సకలంకితోదయధ్వనిముఖ్య మొకవంక వాచ్యార్థ యోగవిభవ
మొకచక్కఁ జక్కనిప్రకటితశ్లేషోక్తి నొకచక్కని సభంగయుతపదాప్తి,
ఒకదారి పద్యవాక్యనికరగవ్యంగంబు నొకదారి బహుళార్థయోగ్యగవ్య

గీ. మొకట పూర్వాపరాన్వయయోగగతుల నొకట నేకార్థసౌభగప్రకటయుక్తి,
సరసగుణముల విలసిల్ల సరసకీర్తి వృత్తుల రసప్రబంధంబు విస్తరింతు ?

(యా. రా. పా 1 32)

భాగవతరామాయణ భారతకథా ప్రసిద్ధి యాదవరాఘవ పాండవీయంబు సభంగాభంగశ్లేష చిత్రవ్యంగ్య చమత్కారసందర్భవిభ్రమంబున సర్గత్రయ శ్లేష చిత్రంబుగాఁ బ్రబంధంబు నిబంధింపఁ దలంపు నొదవినంత, అంతర్ ధ్యానంబు చాలించి, మనంబున సకలాంతర్యామియు, సర్వప్రియయామునోంచనుం. బుద్ధి పోలఁ దగు గోపాలబ్రహ్మంబు నియోగంబని నిశ్చయించి, యువ్విధానంబున నుభయలోక క్షేమకరంబును, పూజాకరంబును, లాభాపాదనంబును, ఆనందావహంబును. నిర్గతా హేతుకంబును, ప్రియోపదేశసనాసభాసమానంబును నగునని విచారించి. యాదవరాఘవపాండవీయంబు, మిశ్రకావ్యంబును, చంపూప్రబంధంబునుగా నాంధ్ర భాష నిబంధింప నిశ్చయించితిని"

(యా. రా. పా.) 1. 6)

వీరరాఘవకవి తనకిష్టదైవమగు గోపాల బ్రహ్మమును (= శ్రీ కృష్ణుని) ప్రార్థించెను. చూ. పుట 243.

౬. *రసమంజరి (ఆంధ్రీకృతి) :*

మిథిలాదేశ సంస్కృతకవి శేఖరుఁడగు భానుదత్తుఁడుఁ (=భానుకరుఁడు) రచించిన సంస్కృతకృతి కిది ఆంధ్రప్రతిబింబ మని చెప్ప నగును. భానుదత్తుఁడు కృష్ణదేవరాయలచే సత్కృతుఁ డయ్యెను. భానుదత్తుని రచనకే వీరరాఘవకృతి అనువాదమగుచో పై గ్రంథమునకుఁగల ఆంధ్రీకృతులలోనిది రెండవది కావచ్చును. భానుదత్తుని రసమంజరికి ఆంధ్రానువాదములు మొత్తము పది కలవు:

1. గణపవరపు వేంకటకవి: (క్రీ. 1650.) రసమంజరి (అముద్రితము)
2. నెల్లూరి వీరరాఘవ కవి. ”
3. పుదుకోట నారాయణఅయ్యంగారు (=మన్నారయ్య) క్రీ. 1730-69. (అము).
4. గుడిపాటి కోదండకవి. (అముద్రిత. 1913)
5. మంచెళ్ళ వాసుదేవకవి: గంధవహము ( ,, 1912)
6. బహుజనపల్లి సీతారామాచార్యులు సంస్కృతాంధ్ర రసమంజరి. (ముద్రితము) 1872
7. తాడూరి లక్ష్మీనరసింహారావు: ర. మం. ( ,,...19)
8. చింతలపల్లి అచ్చతెలుఁగు రామకృష్ణమూర్తి శాస్త్రి) ర. మం. (ఉత్పన్నకల్పము)
9. అమరవాది నీలకంఠయజ్వ: ర. మం. (ముద్రిత: 1945)
10. తాడేపల్లి సాంబమూర్తి శాస్త్రి): ర. మం. (అము.)

పైవానిలో 5. మాత్రము ముద్రితములు. తక్కినవానిలోకొన్ని ఉత్పన్న కల్పనములు, కొన్నిటిజాడ తెలియదు

౭ *వసుంధరా పరిణయము :*

ఇది పూర్వభాగము : ఉత్తరభాగము, అని 2 భాగములుగా విభజింపఁబడెను. ఇందుపూర్వభాగము మాత్రము క్రీ. శ. 1902 న వత్సరమున అ. గ్ర. చింతామణి గ్రంథావళిలో ముద్రితము.

౮ ***విశేషణ రామాయణము :***

(సంస్కృతకావ్యము.) ఇందుత్తరకాండముతో నేడు కాండములలో రామాయణకథ సంగ్రహింపఁబడినది. (అముద్రితమగు నీకావ్యపు వ్రాతప్రతి తంజా

వూరు సరస్వతి మహల్ గ్రంథనిలయమున గలదు. (162 తాళపత్త్రములు) గ్రంథాగ్రము : 350

పైగ్రాంతమునుండి మచ్చుశ్లోకము లేదు వివరణాత్మకసూచికలో నుల్లేఖింపఁబడినవి.

"సప్తకాండమ్ములు సప్తవిభక్తులు హరికర్థము విశేషణాప్తిఁ దనరఁ,
రమణ విశేషణరామాయణంబు నాఁగృతి రచించితి చమత్కృతి రహింపఁ"

అని వసుంధరా పరిణయమునఁ జేర్కొనఁబడినకృతి యిదియే. ఈకావ్యోప సంహారశ్లోక మొకటి యిట నుదహరింపఁబడును.

శ్లో. "శ్రీరామాంఘ్రిసరోరుహాంకిత మిదం రాఘువాఖ్యావతా
ప్రోక్తం చారుతరం విశేషణమహారామాయణం వా నవమ్,
శ్రీమచ్చాటుకథాసు కావ్యరచనాచాతుర్యవాగ్వైఖరీ
శ్రీవైచిత్ర్యధురంధరేణ కవినా చంద్రార్కతారం వసేత్"

## నెల్లూరి శివరామకవి

కామకళానిధి యను కామశాస్త్రగ్రంథమును, రామగీతల కాంధ్రీకృతియు రచించిన శివరామకవి, పైని పేర్కొనఁబడిన వీరరాఘవకవికి, తనయుఁడు. తంజావూరు మహారాష్ట్ర ప్రభువగు శహాజీ మహారాజు దర్బారున (క్రీ. 1684-1712) ఆస్థాన విద్వత్కవి శేఖరుఁడై, సంస్కృతాంధ్రములందే కాక అష్టభాషలయందును కవితా కౌశలము కలవాఁడై, శహరాజ విలాసము, సరస్వతీకళ్యాణమను ఆంధ్ర గ్రంథములను, ఆంధ్రవ్యాకరణ మను సంస్కృత గ్రంథమును నిర్మించి, కనకాభిషేక మహాసత్కారమును అందోళికాది విశేషబహుకృతులను, "ఆంధ్రపాణిని" యను బిరుదము నందిన నివృత్తి శేషాచలకవి కుంజరునికి శిష్యచూడామణియే శివరామకవి కామకళానిధియందు కవి తన విద్యాగురుఁ డగు నీ శేషాచలకవి నిట్లు స్మరించియున్నాఁడు.

మ. సకలాంధ్రోక్తుల కాంధ్రపాణిని యనన్ శాస్త్రంబు గల్పించి, తత్
ప్రకృతిప్రత్యయనిర్ణయంబుకొఱకై భాష్యంబు గావించి, దే
శికుఁడై రాజులచేతఁ బూజఁగొను నాశేషాచలర్షిన్, నివృ
త్తికులస్వామిని, మద్గురున్ గొలుతు భక్తిన్ మానసాబ్జంబునన్?

తంజావూరు మహారాజగు ప్రతాపసింహుని (క్రీ. 1739-63) యగ్రజులలో జయసింహుఁడు ద్వితీయుఁడు. కవికోవిదకల్పద్రుమమగు నీతఁడే శివరామకవి రచించిన కామకళానిధికి కృతిపతి. ఈ కృతియందలి అవతారిక యంతయు తంజావూరు మహారాష్ట్ర మహీపతుల వంశచరిత్ర కెంతయో యుపకరించును. జయసింహమహీజుని తనతో నిట్లు నుడివినట్లు శివరామకవి కామకళానిధిలో వ్రాసికొని యున్నాఁడు.

కామకళానిధి నాలుగాశ్వాసముల గ్రంథము. దీనికి కొక్కోక కవి సంస్కృత మున నిర్మించిన "కొక్కోక" మాధారము.

కామకళానిధి గద్య: "ఇది శ్రీ గురుచరణారవింద మిళిందాయమాన మానస, నెల్లూరి వీరరాఘవామాత్యతనూభవ - సూరమాంబాకుమార, సంస్కృతాంధ్ర సాహిత్యసార్వభౌమ - శివరామనామప్రణీతంబైన కామకళానిధి యను కామ శాస్త్రంబునఁ జతుర్థాశ్వాసము."

## రామగీతలు

సంస్కృతముననున్న రామగీతల కీగ్రంథము ఆంధ్రీకృతి. తన పోషకులలో నొకఁడగు మట్లికృష్ణభూపాలుని ఆజ్ఞచే, రామకృష్ణపుర దైవమగు శ్రీరామున కంకిత మొనర్చెను. ఈ గ్రంథమున 6 ఆశ్వాసములు గలవు. ఈ గ్రంథమునందలి పుష్పిక కామకళానిధిలో 'ని దానికంటె నించుక భిన్నముగ నున్నది.

"ఇది శ్రీ గురుచరణారవింద మిళిందాయమానమానస, శ్రీ రామచంద్ర పూజావాప్తసమస్త సంపద్విలాస - నెల్లూరి వీరరాఘవ ప్రధానతనూజాత సూర మాంబ (బా?) కుమార, సకలాంధ్రశాస్త్రలక్షణ సామ్రాజ్యసార్వభౌమ శివరామ నామ ప్రణీతంబైన రామగీతలయందు...ప్రథమాశ్వాసము"

పై గ్రంథమున యోగశాస్త్రము సమగ్రముగా 804 పద్యములలో వివ రింపఁ బడినది.

## ఉపసంహారము

వీరరాఘవకవి పూర్వపురుషులలో కొండన్న వీణావాద్యప్రవీణుఁడు. ఇతని సోదరుఁడు వేంకటాచలము, సాహిత్యవేత్త. కొండన్న ధవళముల హారి, ధవళశంఖము మొదలగు సన్మానములను మహారాజులనుండి పడసి, మహారాజులచే నిమ్మపండని వినుతి కెక్కెను. వీరరాఘవకవి పితామహుని సోదరుఁడు వెంగనయు వైణికశిఖామణి. వీరరాఘవకవి జనకుఁడు వేంకటపతి విశృంఖలవాగ్గేయ వృత్తియేకాక, మహమ్మదీయ ప్రభువులనుగూడ తన గానకళాకౌశలముచే మెప్పించిన గాయకశిఖామణి.

సంస్కృతవాఙ్మయమునకు, ఆంధ్రసారస్వతమునకు సేవ చేసిన కవికుటుం బము లెన్నియోకలవు. ఇట్టి కవికుటుంబముల సారస్వతజీవితములను లభించునంత వఱకు సప్రమాణముగ రచించుట యెంతయో వాంఛనీయము.

కృతజ్ఞత :- ఈ వ్యాసములను రచించు నవసరమున నాకు లభింపని యంశములఁ గొన్నిటిని నొసఁగిన భూతపూర్వాంతేవాసి చి. నిడుదవోలు శివసుందే శ్వరరావు సాయము నిట స్మరించుచున్నాను.

3.

# మాఘుడు : గోపీనాథ వేంకటకవి

సరస్వతీపుత్ర,
మహాకవి,
శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు.

## శిశుపాలవధ

• కాళిదాసు రచించిన మూడుగ్రంథములను "లఘుత్రయి" యని పిలుతురు. ఇవిగాక "బృహత్త్రయి" యని మఱిమూడుగ్రంథములున్నవి. మాఘనైషధములకును, భారవికిని సముదితముగా, ఈపేరు చెల్లుచున్నది. శాబ్దికమైన దృష్టితో చూచినప్పుడు కాళిదాసుగ్రంథములకంటెను పైమూడును ప్రౌఢములు.

మాఘుడు ఘూర్జరదేశమునకుఁ జెందినవాడని ప్రతీతి అగుటచే ఈతని రచని "ఘనతర ఘూర్జరీ కుచ యుగస్థితి" వలెనే గూఢముగ నుండును. మాఘుడను పేరే క్రొత్తగానున్నది. ఇది భవభూతి మొదలైనవానివలె బిరుదనామమే కావచ్చును. మల్లినాథుడు "మేఘే మాఘే గతం వయః" అనిచెప్పిన శ్లోకప్రసిద్ధియున్నది. మాఘమేఘములు రెండును ఆతనికంతప్రియమైనవన్నమాట. మాఘమునకు శిశుపాలవధ యని మారుపేరు. కాని ఆనామమంత ప్రసిద్ధికిరాలేదు. ఇతనికి ఘంటామాఘుడని యొకబిరుదుకలదు. అందులకీశ్లోకము ఉదహరింపబడినది. IV-20.

ఉదయతి వితతోర్ధ్వరశ్మిరజ్జా వహిమకరే హిమధామ్ని యాతి చాస్తమ్।
వహతి గిరిరయం విలంబిఘంటాద్వయపరివారిత వారణేంద్రలీలామ్॥

ఇతడు గిరిరయ (రైవతకాద్రిని) మును, గజరాజముగా, సూర్యచంద్రబింబములు, దాని కుథమున కిరువైపుల వ్రేలాడుచున్న ఘంటికలుగా నుత్ప్రేక్షించెను.

---

• చూ. డిసెంబరు భారతి. పే. 47. పోచిరాజు వీరన తెనుగు చేసెను.

ఈ శ్లోకమునకు గోపీనాథకవి తెనుగు. I-295.

సుభగ వితతోర్ధ్వరశ్మిపాశులగు శశిభరోష్ణకరు లుదయాస్తంబు లొందుచుండ
నీయుగంబు విలంబిఘంటాయుగ పరి వృత మాదావళిలీల వహించె నదిప.

మాఘుడు మహాదాత. ఇతని దాతృత్వమునుగూర్చి యనేక గాథలున్నవి. అర్థిజనుల కోరికలను తృప్తిగా తీర్చలేక పోయితినే యను చింతతోనే యాతడు మరణించినట్లు చెప్పుదురు. ఆతని భార్యయు, వెంటనే సహగమన మాచరించెను. ప్రాచీన మహాకవుల జీవితములలో వైచిత్రికిది చక్కని ఉదాహరణము. ఈ కవి పేరిట నిప్పుడున్నది శిశుపాలవధమాత్రమే. కాని వల్లభదేవుడీ క్రిందిశ్లోకములను, మాఘునివని ఉట్టంకించెను.

శీలం శైలతటాత్పత త్వభిజనః సందహ్యతాం
వహ్నినా మాక్లేషంజగతి శ్రుతస్యవిఫల క్లేసస్య నామాప్యహామ్
శౌర్యేవైరిణి వజ్రమాశునిపత త్వర్థోఽస్తుమే సర్వదా
యేనైకేనవినా గుణా స్తృణబుసప్రాయాః సమస్తా అమీ॥

శీలము శైలతటంబునుండి పడుగాక! అభిజనులు అగ్నిచే దహింపబడుదురుగాక! విఫలక్లేశముయొక్క పేరుకూడా నాచెవులలో పడకుండుగాక! శౌర్యముపై వజ్రాయుధ నిపాతమగుగాక! నాకు ధనమే కావలసినది. ధనములేకున్నచో సర్వ సద్గుణములును గడ్డిపోచవలె, పొట్టువలె వెలలేని వగుచున్నవి.

నాకీనితంబఫలకే ప్రతిబధ్యమానా హంసీవ హేమరశనా మధురం రరాస
తన్మోచనార్థమిన నూపురరాజహంసా శ్చక్రన్దు రార్త ముఖరం చరణావలగ్నాః॥

నారీనితంబ ఫలకమున ప్రతిమానమగు హేమరశన మధురముగా ధ్వనించెను. అచ్చటనుండి విడిపించుకొనుటకై హంసయరచుచున్నదని రాజహంస దానిని విడిపింపబూనెను. నూపురమును రాజహంసతో పోల్చినాడు. కాని ఏమిచేయును. అదికూడ చరణావలగ్నమై యున్నది. మేఖలను హంసముతోడను, నూపురమును రాజహంసతోడను పోల్చుట ఇందలి విశేషము. భ్రాంతి మదలంకారము రమణీయముగా గూర్పబడినది. క్షేమేంద్రుడుగూడా నౌచిత్యవిచారచర్చలో ఈ క్రింది శ్లోకము మాఘునిదని యుద్ధృతీకరించినాడు.

బుభుక్షితై ర్వ్యాకరణం నభుజ్యతే పిపాసితైః కావ్యరసో నపీయతే
నవిద్యయా కేనచిదుద్ధృతంకులం హిరణ్యమే వార్జయ నిష్ఫలాః కలాః ॥

ఆకలి కొన్నవాడు వ్యాకరణమును తినుటలేదు. దప్పిక కావ్యరసముతో నారుటలేదు. విద్యమాత్రముచే, నేకులమును గౌరవము ననుభవింపలేదు. ధనము నార్జింపుము. కళలు నిష్ఫలములు సుమా!

సంస్కృతమునుండి గ్రంథములను భాషాంతరీకరణ మొనర్చుటలో నారంభమైన యాంధ్రకవితావాహిని మూడునాల్గుశతాబ్దములలో పురాణవాఙ్మయము నంతటిని ముంచివేసినది. శ్రీనాథునినాటికే పురాణయుగ మంతరించినదాయనిపించుచున్నది. అతడందుకే నైషధమునకుఁ జేయివేసెను. హరవిలాసము పురాణములనుండి గ్రహించిన నాలుగైదుకథల కూర్పు. కాశీఖండము స్కాందములో నొకభాగము. జైమినీభారతము పిల్లలమఱ్ఱి పినవీరభద్రునిచేతిలో బంగారుగా తయారైనది. అటు తరువాత ప్రబంధరచన యొకవైపును సంస్కృతకావ్యపరివర్తన మొకవైపును సాగెను. భారవి తెనుగున సాక్షాత్కరించెను. చంపూరామాయణ పరివర్తనము వచ్చెను. ఆమహాకవుల కోవలో చెందినవారైన గోపీనాథము వేంకటకవిగారు మాఘమును పరివర్తింప బూనుకొనిరి. వీరి రామాయణము ప్రసిద్ధమైనది. రసవత్తరము. గత దశాబ్దములలో వచ్చిన రామాయణములలో గోపీనాథులవలె సుందరముగ ప్రవర్తించినవారు లేరని చెప్పవచ్చును. కైవర్తపురాణమునుండి శ్రీకృష్ణజన్మఖండమునుకూడ వీరనువదించిరి. ప్రాచీన మహాకవుల కుండవలసిన యన్నియోగ్యతలును గోపినాథులకుండెను. వారు మహావ్యుత్పన్నులు. లోకజ్ఞులు. రచన ప్రౌఢసుందరమైనది: వేంకటగిరిరాజులొనర్చిన గొప్పకార్యములలో నొక్కటి గోపీనాథుల నభిమానించి పోషించుటయని చెప్పవచ్చును. ఈ కవికి కవిత్రయము వారిపైకన్నను ప్రబంధ కవులపై నెక్కువ మక్కువ యున్నట్లున్నది. గోపీనాథమువారు మాఘమున కాంధ్ర పరివర్తనమొనర్చిరి. ఇందనేక చోట్ల మను, వసు చరిత్రాది గ్రంథములలోని శైలిని అనుసరింపవలెనను తీవ్రమైన అభినివేశము కనుబడుచున్నది. పెద్దన్నగారి:-

అంకముఁజేరి శైలతనయా స్తనదుగ్ధము లానువేళ బా
ల్యాంక విచేష్టఁ దొండమున నవ్వలిచన్ గబళింపఁబోయి యా
వంకఁగుచంబుఁగాన కహివల్లభహారముఁ గాంచి వేమృణా
లాంకుర శంకనంటెడు గజాస్యునిఁగొల్తు నభీష్టసిద్ధికిన్. (మను: పీఠిక ప: 4.)

పైపద్యమును దృష్టిలో పెట్టుకొని వ్రాసినదే, గోపీనాథుని ఈక్రిందిపద్యము:

అరయ నభేదరూపధరులౌ తలిదండ్రుల ముందు బాల్యమం
దురమున నొక్కనంకఁగుచ, మొక్కెడ నహినాథహారము
స్ఫురువడిఁజూచి మార్గ్యమున, భవ్యకపిత్థమృణాళ శంకచేఁ
గరమటుసాచు విఘ్నపతి, గావుత సత్కృతినాథు నిత్యమున్. I: 3

వసుచరిత్రలోని శైలి ననుకరించిన ఘట్టములుచాల కలవు.

> నను శ్రీరామపదారవిందభజనానందున్ జగత్ప్రాణనం
> దనకారుణ్య కటాక్షలబ్ధ కవితాధారాసుధారాశి సం
> జనితైకైక దినప్రబంధఘటికా సద్యశ్శత గ్రంథ క
> ల్పను సంగీతకళారహస్యనిధిఁ బిల్వంబంచి పల్కెం గృపన్. (వసు: I-16.)

ఈ క్రిందిపద్యము, గో: వేంకటకవిగారిది :

> నను శ్రీరామపదారవిన్దభజనా, నన్దప్రపూర్ణాత్ముఁ ద
> ద్ఘననామస్మరణాతిపూతరసనుం, దద్భూరికారుణ్య ల
> బ్ధనితాన్తోజ్వల సత్కవిత్వమహితు, న్ధాత్రీసుర గ్రామణిం
> బ్రణుతప్రజ్ఞుని వేంకటాఖ్యసుకవి, న్రావించి పల్కెంగృపన్. I-23

భట్టుమూర్తి వసురాజును వర్ణించుచు,

> ఆరాజధాని కధిపతియై రాజిలు వసునృపాలుఁడతఁ డసిధారా
> ధారాధర ధారాజల భారాహత రాజహంస పద్మోదయుఁడై I-114.

పైవిధముగా వ్రాసెను. వేంకటకవియు, వేంకటగిరిరాజు నిట్లు వర్ణించినాడు:-

> ఆరాజధానికధిపతియైరాజిలు శారదాబ్జహారహారార
> క్షీరపటీర సురద్విప, హీరాఞ్చిత యశుఁడు కృష్ణయాచేంద్రుడిలన్. I.-15.

వసుచరిత్రలో వలెనే అనేకచోట్ల శ్లేషపూర్ణరచనయు కనుపించును. ఆకాలమున వసుచరిత్రము ననుసరించుట, దానిని గౌరవించుట యొకగొప్ప యోగ్యతగా నెంచబడుచుండెడిది.

గోపీనాథుని శయ్య ప్రౌఢసుందరమని ముందేచెప్పితి. వారి రచన సాధారణముగా నిట్లుండును.

> ప్రాగల్భ్యంబునఁ గాంతుపైఁ బ్రియకుసాంద్రప్రక్రియం దొల్లి యే
> రాగంబుద్భవమై హృదంతరమునన్, బ్రచ్ఛన్నమై యుండెనా
> రాగంబప్పుడు మద్యపాన మదసం రంభోత్థితంబై రహి
> న్బాగొప్పన్వెలి కుద్గమించెరయ మొప్పన్నేత్ర మార్గంబులన్. II-242.

మాఘములోని ప్రౌఢిమశబ్దగతమని యన్నాను. అట్టి కావ్యము ననువదించుట చాలకష్టము. కాని వేంకటకవి అనువాదమును సమర్థముగనే నిర్వహించిరని చెప్పవచ్చును.

మాఘము లోనిదీ శ్లోకము :- VI-2.

నవపలాశవనం పురః స్ఫుటపరాగ పరాగత పంకజమ్
మృదు లతాన్తలతాన్త మలోకయస్య సురభింసురభిం సురంభింసుమనోభరైః॥

దానికి తెనుగిది :

నవపలాశ పలాశవనంబు మఱియుఁ బటుపరాగపరాగత పంకజంబు
మృదులతాంతలతాంతమై, మెఱయు కుసుమ సురభిసురభిని గృష్ణుఁడు, చూచెనపుడు.

ఈ పై శ్లోకము నందలి శబ్దాలంకారమును చెడనివ్వక పరివర్తించుట గొప్ప ప్రతిభయని చెప్పవచ్చును. ఈ శిల్ప మాతని కావ్యము నచ్చటచ్చట గనుపించుచుండును. మూలకారుని భావము తనకు సరిపడనప్పుడు, కొంత ప్రక్కకు తొలగిన ఘట్టములును లేక పోలేదు. ఈ క్రింది శ్లోకము చూడుడు. VI-3

విలులితాలక సంహతి రామృశ న్మృగదృశం శ్రమవారి లలాటజమ్
తను తరంగతతిం సరసాం దలత్కువలయం వలయన్మరుదావవౌ

దీని కనువాదము : II 4.

విలులితాలకనికరమై జలజలముఖుల గొదలి చెమ్మటలార్పుచు, నుత్పలములు
తరళతవహింప సరసుల తనుతరంగవిసరము చలింప వాయువువిసరె నపుడు.

మారుతవర్ణనమిది. స్త్రీల లలాటములందు జన్మించిన శ్రమవారిని బోకార్చు గాలివీచినదని మాఘుడన్నాడు. లలాటమునందు బుట్టిన స్వేదమునే మారు డెందుకుబోకోర్చెనో మాఘుడు చెప్పలేదు. తక్కిన శరీరముమందు జన్మించిన చెమట యక్లేయున్నదా? గోపీనాథుడు దీనిని సవరించి జలజముఖుల గొదలి చెమట లార్చుచు అని అనువదించినారు. ఈ సవరణ మెంతయో యుచితముగానున్నది.

ప్రభాతమును వర్ణించుచు ఘట్టమున మాఘమహాకవి చెప్పిన రెండుశ్లోకములను కలిపి వేంకటకవి ఒక పద్యముగ నొనర్చిరి. మాఘుని శ్లోకము లివి :- XI. (1), (2)

శ్రుతిసమధికముచ్చైః పంచమంపీడ్యన్తః సతతమృషభహీనం భిన్నకీకృత్యషడ్జమ్
ప్రణిజగదురకాకుశ్రావకస్నిగ్ధకంఠాః పరిణతి మితిరాత్రే ర్మాగధా మాధవాయ.

రతిరభస విలాసాభ్యాసతాన్తం నయావన్నయనయుగమ మీలత్తా
వదేవాహాతో౽పా
రజనివిరతిశంసీ కామినీనాంభవిష్య ద్విరహవిహితనిద్రా
భంగముచ్చైర్మృదంగః.

గోపీనాథుల యనువాదము : III-(2)

చతురతనవికృతశ్రావక సుస్నిగ్ధకంఠులై యొప్పమాగధులువచ్చి
సమధికశ్రుతులైన షడ్జస్వరంబును బంచమస్వరము ప్రభాతకాల
మందునిషిద్ధంబు లౌటచేవర్జించితతవేణు వీణామృదంగతాళ
కలితంబుగఁ బ్రభాతకాలముచ్చైస్వర ఘనరాగమున మాధవునకుదెల్పి
రతనురతితాంత నయ్యనద్వయంబుమూసి మూయకయమున్న గురుతరమురజ
వరము
కల్యసమయంబు దెలుపుచు, గాంతభావి విరహసూచకమగునట్లు, వేగమ్రోసె.

పైపద్యమున సీసములోని యందము చెడినది. మూలములోని శబ్దమాధుర్యమును సరిగా తేలేక పోయినాడు. ఇది వేంకటకవి యసమర్థతగాదు. అనువాదములోని కష్టమిట్లుండునని చెప్పుటకు చూపితి నంతే.

గోపీనాథులు చాలప్రసిద్ధులైన విద్వత్కవులు. శాస్త్రపాండిత్యముతో, పంకిపక్వమైనది వారి సాహిత్యము. ప్రాచీన మహాకవుల కోవకుచెందిన వారిలో వీరు కడపటివారు.

ఇతి శమ్

Horace.

All you who write choose your subject in accordance with your powers, turn over in your mind what your shoulders can bear and what they cannot.

Purpose of poetry.


To assert eternal Providence.
And justify the ways of God to men.

# 4.


# నెల్లూరు మండల దేవాలయాల శిల్పశోభలు

డాక్టరు
శ్రీమాన గోపాలకృష్ణమూర్తి,
M. A., D. Sc., (Lond.)

భైరవకొండ గుహాలయాలే నెల్లూరు మండలపు ప్రాచీనదేవాలయాలు. ఇవి సీతారామపురానికి ఏడు మైళ్ళలో వున్న కొండ వరుసలోని ఒక కోనలో వున్నవి. పెద్దబండకు తూర్పువైపు చెక్కిన ఎనిమిది గుహాలయాలు ఇవి. ఆ బండయొక్క వంపును బట్టి ఒక్క గుహాలయము మాత్రము ఉత్తరముఖముగా ఉన్నది. ఈ కారణము వ్యతిరేకముగా ఉన్నప్పటికీ, సారూప్యాన్నిబట్టి, ద్వారపాలకుని కొమ్ములకిరీటాన్ని బట్టి, ఇదే అతిప్రాచీనమనీ, మహేంద్రుని గుహాలయాలకు సమకాలికమనీ అనిపిస్తున్నది. ఇక్కడి నంది మాత్రము మరి యొక శతాబ్దము దాటిన తరువాత రాజసింహ శిల్పకాలము వరకూ లాగుతుంది ఈ గుహని. ఈ గుహలు కట్టుడు ఆలయ సంప్రదాయాలు స్పష్టమైన పిమ్మట, త్రవ్వినవే అనిపిస్తున్నది నాకు. ఇక్కడి పల్లవశిల్ప లక్షణములు జ్ఞాపకాన్నిబట్టి సంప్రదాయాన్నిబట్టి నిలిచినవేకాని పల్లవప్రాబల్యాన్నిబట్టి కాదని పిస్తున్నది. గుహలు చాలా చిన్నవి చెక్కిన సంప్రదాయమూ, పైనించి క్రిందకు సాగినందులనూ, గర్భాలయాల ముందు ప్రాంగణములను నిర్మించినట్లు కానవస్తూన్నది కాని మహా



భైరవకొండ : గుహాదేవళము



భైరవకొండ : ద్వారపాలకుడు



ఉదయగిరి : పార్వేట్ల మండపము



ఉదయగిరి




భైరవకోన : దేవాలయము, అంతస్థులు.

బలిపురములోవలె గళ్లుకొట్టి నడిమి ముక్కలను చెక్కుతూ సాగినట్లు కానరాదు. ఆ రీతినే అవలంబించియుంటే యీ గుహాలు బాగా లోతుగావుండి యుండును. ఇవన్నీ ఒకే కాలానివికూడా కావు. ఇక్కడి గర్భాలయాలలోని లింగముల మీద బ్రహ్మ సూత్రాలు భేదముతో కనపడుతున్నాయి. అన్నీ ఒక లాగులేవు. రెండు నిలువుగీతల నడిమి గీత ఇక్కడి వింత. పల్లవులెరిగిన ధారా (ద్రోణి యాల) లింగము ఇక్కడ లేనేలేదు.

ఇక్కడ "త్రిభువనాదిత్యం" అంటూ చాళుక్య రాజుల పేర్లు మాత్రమే కాక, చాళుక్య శిల్ప గుణాలు చాలా కనబడుతున్నాయి. పల్లవ గుహాలయాలలోని దేవతా విగ్రహాలకు తలచుట్టూ ప్రభా మండలాలు కానరావు. చాళుక్యుల దేవతా విగ్రహాలకు ఉంటాయి. అవి ఇక్కడ హరిహరనాథునికీ ద్వారపాలకుల ప్రక్కనున్న అర్ధశిల్ప విగ్రహాలకీ ఉన్నాయి. హరిహరనాథుడు చాళుక్య త్రిశూలము పట్టినాడూ, బాదామి హరిహరునివలె నడ్డిత్తో గోడకంటుకు పోయినాడు. నటరాజుకిన్ని చేతులున్నాయి. పల్లవ విగ్రహాలకు నాలుగు మించి సామాన్యంగా ఉండవు. నటరాజు వస్త్రానికి చాళుక్య శిల్పంలో లాగ గీరలున్నాయి. ఏడవ గుహా స్తంభాల హారాల అలంకారమూ, గూళ్ళ అజంతా వాతాయనపు పోలికలూ, పరశురాముని పట్టదక్కల్, విరూపాక్ష శివుని జటాభరమూ, ద్వారపాలుర పృష్ఠస్వస్తికా విన్యాసపు జ్ఞాపకమూ ఈ గుహాలయాల చాళుక్య సంప్రదాయాల్ని నిరూపిస్తాయి. ఇక్కడి పానవట్టాలు పశ్చిమ చాళుక్య ఆలయాలలో

ఉన్నట్టే చతురస్రాలూ, వాటి ముక్కులు సన్ననివి.

ఈ గుహలు రాజుల నిర్మాణాలు కావు, తపస్సుల గౌరవార్థము శిల్పులు మలచినట్టివై యుంటాయి. ("కరువది గ్రామము వాడా? చీమకుర్తిలో శిల్పసంప్రదాయాలు చిరకాల మునాటినుంచీ ఉన్నట్టివే.) కనుకనే ఇంత చిన్నవిగా ఉన్నవి. అయితే ఇవి దేవాలయాలు మాత్రమూను. వీటిలోని శిల్పముల ఏర్పాటుచూస్తే ఇవి కట్టుడు ఆలయాల్ని-చొక్కా తిరగవేసినట్టు-తిరగవేసి కట్టుడుఆలయాలకు వెలిప్రక్క అమర్చే విగ్రహాల్ని వీటిలో లోనైపు అమర్చినారా అనిపించింది నాకు. పల్లవుల ఆలయాల పార్శ్వాలలోనూ చోళచాళుక్య ఆలయాలలోనూ దేవతా విగ్రహాలుంటాయి. బిక్కవోలులోని చాళుక్య ఆలయానికొకదానికి ఉత్తరాన్న మహిష మర్దనీ, పశ్చిమాన్న సూర్యుడూ, దక్షిణాన్న నటరాజూ ఉన్నారు. చోళఆలయాలలో అర్ధనారి, బ్రహ్మ, దక్షిణామూర్తి కలరు. ఇక్కడ పార్శ్వాల బ్రహ్మవిష్ణులు ద్వారపాలకుల ప్రక్కకి వచ్చారు. వీరు గూళ్లలో ఉన్నారు. కనుక త్రిమూర్తుల సూచన యేమీలేదు. కట్టుడు ఆలయాల అంతరాళాలకు ఇటూ అటూ విఘ్నేశ్వరుడూ, మహిషమర్దని వుంటారు. ఇక్కడ పరశురాముడు మహిషమర్దని స్థానంలో కూర్చునివున్నాడు. విఘ్నేశ్వరుడు యథాస్థానంలోనే వున్నాడు ముందు నంది ఉన్నది. ఆలయములనడానికి సందేహమేలా? పరశురాముణ్ణి నిలపడము శైవభేదాల్లో దేనిదో సంప్రదాయము




చుండి : ఈశ్వరాలయము



చుండి : ఆంజనేయులు




కందుకూరు : దుర్గ



చుండి : ఈశ్వరాలయమండలి అర్ధ మండపము. భిత్తికా శిల్పములు

కాబోలు. అన్నిఆలయాల్లోనూ విఘ్నేశ్వరుడూ పరశురాముడూ ఉన్నారు. హరిహరుడూ, నటరాజూ ఆలయాలకోసము కాక శిల్పులు సరదాకు ఈ ఆలయాల ఎదుటవున్న బండలో చెక్కినట్లున్నది. ఆ బండమీదనే భైరవుణ్ణి నిలిపేరు. ఈయన ప్రాచీనుడు కాడు విజయనగర కాలము వాడు. ఈయన చుట్టూ లేచిన చిన్నఆలయము ప్రాగుటూరు ప్రాంతపు ఘూర్జర ప్రతీహారాలయ పోలికతో ఉన్నది. ఈ భైరవుణ్ణిబట్టి ఈ కొండనూ, కోననూ భైరవుని పేరుతోనే వ్యవహరిస్తున్నారు.


ఈ గుహాలయాలు రాజులు త్రవ్వించినవి కావనిపిస్తుంది వీటి మొత్తపు చేతకలో సౌందర్యము లోపించడముచూస్తే.



చుండి : ఏకశిలా ధ్వజస్తంభము

## ii


సంగంలోని ఈనాటి ఆలయము ఎన్నో నవకర్మలకు లోనైన ఆలయము. క్రీ. శ 1183 నాటిది. ఈఆలయాన్ని పేర్కొనే శాసనమున్నది. పెన్నానదిలో బొగ్గేరుకలిసే చోట నున్న ఆలయమిది ప్రాచీనమే కావలెను. బసవేశ్వరునినాటి కూడలి సంగమము. ఉభయగోదావరి మండలములోని పలివెల కొప్పేశ్వరాలయమూ నదీసంగముల కడ నెలసిన ఆలయాలే. విశేషించి ఈ ఆలయములోని లింగము ద్రోణియాలున్న ధారాలింగము, చోళులు తిరువొత్తియూరులో ప్రతిష్ఠించిన లింగము వంటిది. ఈ నాటి ఆలయపు తూర్పునైపున్న మండపపుగోడ ప్రాచీనము. కాళహస్తి గుడిమల్లం, అత్తిరాల లేబాక తల్పగిరి రంగనాథ ఆలయాల అధిష్ఠానము వంటిదే దీని అధిష్ఠానము. దీనిమీది గోడకు




చుండి : జనార్దనస్వామి దేవలము

అలంకారముగా ఉన్న తొమ్మిది అంగుళాల వెడల్పు అర్ధస్తంభాలు చోళులవే దీనిచూ సుకు కుంభాండులపట్టి కలదు ఈఆలయానికి ముఖమంటపంలో అమర్చిన గర్భాలయము పెన్న వరదలకు పడిపోయిందా అని అనుమానంగా ఉన్నది ఏమంటే, ఈనాడు సంగమేశ్వరాలయముగా చెల్లుబడి అవుతూన్నట్టిగ విజయనగరకాలపు ఆలయము క్రీ శ 551 నాటి సదాశివ రాయల సామంతుని శాసనము దీని గోడమీద ఉన్నదీ, దేవాలయపు చూరు చూస్తున్నా అర్ధమండపపు చూరుచూస్తున్నా తేడా స్పష్టంగా తెలుస్తున్నది మండపముయొక్క పూర్వపుగోడా, ఈశాన్యపు మలుపూ ఉత్తరపు గోడ తెలుగుచోళుల నిర్మాణాలని చెప్పవచ్చును ఈనాడుకూడా స్వామికి ఎదురుగా ద్వారము లేదు కిన్నాలపలక అమర్చిన కిటికీ మాత్రమున్నది దేవాలయములోనికి ప్రవేశము దక్షిణము వైపునుంచి పూర్వపువైపు గోడలోని కన్నాలపలకకు వెలుపలి వైపు మండపములో విజయనగరం కాలపు అలంకారాలతో నంది ఆలయము పడిపోయిననాటి స్తంభాలూ ద్వారబంధాలు కొత్తమండపానికి ఉపయోగించి సదాశివరాయలకాలంలో కట్టినారు ద్వారపాలకులు లేకపోక ఆ [illegible] ద్వారపాలురలవలె [illegible] నారనారు


ఆలయపు [illegible] మహిషమర్దని చోళుల [illegible] శిల్పాలు సంప్రదాయములు చూపుచున్నవి దక్షిణపు గూటిలోని యోగదక్షిణామూర్తి చోళ దక్షిణామూర్తే కాకతీయుల దండయాత్ర కాల



చండి ఈశ్వరాలయము



వీరశిలలు



వీరశిలలు

ములో కాబోలు ఇక్కడ నిలువబడిన చాముండి (అర్ధ) శిల్పము కత్తి, గిన్నె, త్రిశూలమూ, డమరుకమూ ధరించినది - శిల్పించబడినది. ఆలయము బయట నల్లరాతి వీరకల్లూ, ఆకుపచ్చని శిలలో ముగ్గురు రాణులు సతిచేసిన శిలా ఇక్కడ యుద్ధము జరిగినట్లు సూచిస్తున్నాయి. రాణుల చీరకట్టు విజయనగర కాలము నాటిది. దిగువ భాగంలో అయిదుగురుస్త్రీలూ పైభాగంలో విష్ణు, పార్వతీపరమేశ్వరులూవున్న అర్ధ శిల్పము ఇక్కడి, పాతనాటి పతివ్రత గుడిలోని పంచపతివ్రతల శిల్పము కాబోలు.

## iii

రామతీర్థపు దేవళశిఖరము శేర్ ఆలయమువలె గజపృష్ఠాకారము. తిరువొత్తియూరు ఆలయ నిర్మాణానికి ముందుదే కాబోలు. పొత్తపిలోని మూల స్థానేశ్వరాలయమూ గజపృష్ఠాకార శిఖరముతోనేవుంది. ఇవి తెలుగుచోళుల తొలి కాలపుటాలయాలు అయి యుండవచ్చును. (అత్తిరాల పరశురామేశ్వరాలయము గజపృష్ఠాకార శిఖరమేకాని తిరుచుట్టు మండపము ఆలయానికి అతిచేరువగా ఉండడమూ, ఆలయపు చూరుచుట్టూ శిల్పవలయమూ, గూళ్లూ కనబడుతూండముచేతనూ నెల్లూరి చోళుల ఉచ్ఛదశ నాటిదేమో అని అనుమానిస్తున్నాను) అయినా రామతీర్థమన్న పేరు ప్రాచీనము. ఆలయ శిఖరపు రూపమూ ప్రాచీనమే. ఇక్కడి శాసనము ఒకటి తిరుకాళత్తి దేవుడనే నెల్లూరి తెలుగు చోళరాజు. నెల్లూరిలోని మనుమకేశవ పురములోని మనుమకేశవ పెరుమాళ్లుదేవరకు ఇడప్పూరు అనే గ్రామాన్ని ఇచ్చినట్టు చెపుతూన్నది. నెల్లూరి శాసనము ఇక్కడికి ఎవరు ఎందుకు తెచ్చినారో? ఈ మనుమకేశవదేవర మహమ్మదీయుల హయాములో చేయి పోగొట్టుకొని ఏ హిందువు మొగమాటమువల్లనో ఈ నాటి రంగనాథస్వామి ఆలయ స్నానఘట్టము ఎడమ వైపు ప్రహరిగోడలో బిగింపబడి యున్నాడు. ఆ కాలములోనే శాసనశిలరామతీర్థము పోయినదేమో.




పెన్నగట్టునఉన్న మనుమకేశవ.

తెలుగు చోళవంశాలు కల్కడ, పొత్తపి, నెల్లూరు, ఓపిలి, కొణిదెన, పానగల్లు, పెండేకల్లు, కందూరు, కోడూరు, వర్ధమాన పురములలో చిన్నచిన్న రాజ్యాలు ఏర్పరచుకొని పరిపాలిస్తూ, అవకాశము చిక్కినప్పుడు స్వతంత్ర పాలనము

చేస్తూ విజృంభించారు. నెల్లూరిశాఖ పొత్తపినుంచి వ్యాపించినశాఖ. తెలుంగు బిజ్జన వీరి మూలపురుషుడు. పదకొండో శతాబ్దములో ఈ వంశపుశాఖ నెల్లూరివైపు విస్తరించి 1159 లో పెన్నచెయ్యేరుల సంగమస్థానమువద్ద మూలవంశపు సోమేశ్వర రాజును ఓడించడము జరిగింది. నెల్లూరిశాఖవారు నిర్మింపించిన దేవళాలు చోళ దేవాలయాలను చక్కగా అనుకరిస్తూ గండవరములోని ఉదయకేశ్వరాలయమువలె కొన్ని, నెల్లూరి రంగనాథస్వామి ఆలయమువలె-ఆలయానికి అయిదంగుళాల దూరములో మూసిన తిరుచుట్టు మండపమూ, అర్ధమండపమూ కలిసిన మండపముతో వున్న ఆలయాలుకొన్ని యున్నవి.

## iv


రంగనాథస్వామి ఆలయము గర్భాలయమూ శుకనాసి అన్న రెండు గదులుగా ఉన్నది. ఈ రెండింటికీ నడుమ ద్వారము మూడునాలుగు అడుగుల దళసరిగోడలోని ఖాళీ. దీనికి ద్వారబంధములేదు. శుకనాసి ఇరుకైనగదే. నెల్లూరి మూలస్థానేశ్వరాలయమూ, చిన్నత్రాక మల్లిఖార్జునాలయమూ ఈరీతిగానే గర్భాలయమూ శుకనాసీ చేరినఆలయములే. శుకనాసికి ద్వారబంధమున్నది ఆత్మకూరు అళహానాథాలయమూ, కొడవలూరి శ్రీధరస్వామి ఆలయమూ, నాగేశ్వరస్వామి ఆలయమూ; నెల్లూరి ఇరుకల పరమేశ్వరి ఆలయమూ, గౌరవం చెన్నకేశవాలయమూ ఈరీతిగానే వుండి, శుకనాసికి చేర అర్ధమండపానికీ పెంచుకున్నాయి అర్ధమండపానికి అంతరాళమున్నది. కొన్ని ఆలయాలకు అర్ధమండపమూ, నడుమ నాలుగు స్తంభాల మండపమూ, దానిలోకప్పునకు అంతరాంతర సముచతురస్రాలంకారమూ కానవస్తుంది. ఈచతురస్రాల దూలపు కమ్ములు కాకతీయుల దేవళాలలో శిల్పావృతాలు. అర్ధమండపానికి దక్షిణము వైపుమాత్రమే ద్వారబంధముంది. స్వామికి ఎదురుగా వాతాయనమూ, దానబిగించిన కన్నాలశిలాఫలకమూ ఉన్నవి



శ్రావణ మునికుమారుడు పితరులను సేవించుట. (కృష్ణాపట్నం)

విశేషాలు. ఇది చోళ ఆలయాల లక్షణము. నెల్లూరి రంగనాథ, కొడవలూరి నాగేశ్వర, జలదంకి శివ, సంగం ఈశ్వర, ఆలయాలకు ఈ కన్నాల పలక గలదు. గుడిమల్లము పరశురామేశ్వరాలయానికీ ఉంది ఈపలక. మధ్య మండప స్తంభాలు శిల్పావృత్తాలూ, లేకుంటే చతురస్రపు నిర్మాణముగల వీని తక్కిన స్తంభాలు-మన ఇళ్లలోని స్తంభాలవలె-స్థూపకాలు. వీటిపైని అడ్డంగా అమర్చే బోధికలు చోళదేవలయాల బోధికను అనుసరించి నాసికనూ ఆ నాసికకు తీగలనూ అమర్చుకుంటాయి.

కన్నాలపలకకు వెలుపల నందిమండప ముంటుంది. సంగం, కొడవలూరులో లాగ. లేదా, రంగనాథస్వామి ఆలయానికి లాగ ధ్వజమండపముంటుంది. దక్షిణ ద్వార మండప స్తంభాలూ శిల్పావృతములుగా నుండడము కద్దు, కొడవలూరు, గుడిమల్లములలోనవలె, శ్రీ మల్లిఖార్జునాలయమునకూ దక్షిణ ద్వారమునుండే ప్రవేశము. ఈ ద్వారబంధానికి పద్మదళాంచలమూ, సన్నని కుంభపంజరమూ, (పన్నీరు బుడ్డి రూపపు అర్ధశిల్పాలంకారము) మూడడుగుల ఎత్తున సర్పశిరములూ లక్షణాలు. ఈ సర్పశిరాలు చాళుక్యుల అలంపూరూ మహానందీ ఆలయాలలో నాగులూ తలమీద పాము పడగలూను, అలంకారమే శిధిలమై తెలుగుచోళ సంప్రదాయములో యీ సర్పశిరములైనవి. అసలు దేవళము గర్భాలయమూ, శుకనాసీతో వున్నప్పుడు, దానికి [illegible]అంగుళాల దూరాన్న తిరుచుట్టు (ప్రదక్షిణపు) మండపముండి గుడిముందటి అర్ధమండపంలో కలసిపోవడము (గుడిమల్లం, అత్తిరాల, కాళహస్తి) నెల్లూరి రంగనాథ, మూలస్థానేశ్వర, ఆలయాలలో కానవస్తుంది. తిరుచుట్టు మండపములో అంచుకు స్తంభాలుంటాయి. వెలుపల అంచుగోడని మూతపెట్టే ప్రాకారమౌతుంది రంగనాథస్వామి గుడికి, ఈ ప్రాకారము వెలుపలివైపున్నాయి శాసనాలు. తిరుచుట్టు మూలలో అంచుకడ నిలబడి పైకిచూస్తే దానికప్పు అంచుకీ, గుడికీ నడుమ శాళీలో నుంచి ఆకాశము కనబడుతుంది. ఈ అమరిక చోళులనుంచి చంద్రగిరి యాద



వాలి సుగ్రీవుల యుద్ధము. (కృష్ణాపట్నం)

వులూ స్వీకరించినట్లు అక్కడి కోటలోని శిథిలాలయాలు చూస్తే తెలుస్తుంది. పశ్చిమ చాళుక్యుల అలంపూరు దేవళాలలోనూ, భువనేశ్వరపు తోట్లతోలి ఆలయాలలోనూ గుడికి చేరువగావుండే ప్రదక్షిణ పథాలకప్పు గుడిమీదకు చొచ్చుకుపోయే రాతిపల కలవేర్పు. వర్షపునీరు జారిపోవడానికని ఈ పలకలు వాలుగాకుండా ఉంటాయి ఈ చోళదేవళాలు చిన్నవి. కనుక తిరుమట్టు మూలలో అంచుకడ స్తంభాల వరుస అమర్చి దాని కప్పును ఆలయానికి చేరా నిలబెట్టారూ, (దొంగలు దిగకుండా!) వీటి నడిమి కాలీని బాగా సన్నము చేశారు

ఈ ఆలయాలకు ప్రాకారముంటుందీ, ప్రవేశముకడ గోపురములేని మహాద్వార ముంటుంది. నెల్లూరి ఇరుకల పరమేశ్వరీ; కొడవలూరి శ్రీధర, నాగేశ్వర, కందుకూరి జనార్దన, కృష్ణాపట్నపు కనుమ సిద్ధేశ్వర, గండ గోపాల, జలదంకి శివ ఆలయాల కీనాటికీ మహాద్వారాలేవున్నాయి. (గోపురాలు తరువాత కట్టినట్టివి.) ఈ మహాద్వార మండప స్తంభాలమీద కృష్ణాపట్నమునుము సిద్దేశ్వరాలయానికి లాగ శిల్పావృత్త స్తంభాలుగాని, అక్కడి గండగోపాలాలయానికి లాగ సామాన్య స్తంభాలుగానీ ఉండవచ్చును. ఆలయమునకు చేరువగా స్నాన సౌకర్యానికి చెరువు గానీ నదిగానీ లేనిచోట దిగుడుభావియైనా ఉంటుందని నెల్లూరు-కావలిరోడ్డుకిటూ అటూ ఉన్న శిథిలాలయాల ప్రక్కని పాడుబావులు నిరూపిస్తాయి. ఆరోజులలో పూలతోటలుండినట్లు శాసనాలు నిరూపిస్తాయి.

శిల్పము దేవతావిగ్రహాల్లో, అర్ధమండప స్తంభాలమీదా, దేవళపు వెలిగూళ్లలో, అంచు వెంబడీ, కానవస్తుంది. అయితే ఇదంతా చోళ శిల్పానుకారియే. లింగములు జానెడు వ్యాసమూ మూరెడు. ఎత్తూగలిగి, రుబ్బురోట ఆకారపు పొట్టిపానవట్టముపైకి పొడుచుకుని వచ్చినట్లుంటాయి. ఇవి తెల్ల శేనపురాయినీ, నెల్లూరి మూలస్థానేశ్వరాలయమూ కృష్ణాపట్నపు సిద్దేశ్వరాలయమూలలో చూడవచ్చును. వీటిని నెల్లూరు చోళ సంప్రదాయపు శివలింగాలని అనబుద్ధి వేస్తున్నది. (చోళులవి వీటికి భిన్నములు.) మండప స్తంభాలమీది శిల్పము చోళసంప్రదాయపు శిల్పమైనట్టు కొడవలూరులో మహిష శిరముగల మహిషాసురుడూ, కాలు అడ్డముగా చాచి నటించే ఈశ్వరుడూ సాక్ష్యము పలుకుతారు. కృష్ణాపట్నపు సిద్దేశ్వరాలయ ప్రవేశ మండప స్తంభాలు నల్లశిలవి. చెక్కడపుపని విజయనగర కాలాంతరపుపని. శైవాగమమంతా అక్కడ రూపొందినదా అన్నంత వివిధిగా ఉంది అక్కడి శిల్పము. విశేషించి పూర్వకారణాగమోక్త విఘ్నేశ్వరులూ, మూడడుగుల ఎత్తు విడివైష్ణవీ,

వీరభద్ర (ముత్తుకూరులో కేశవ మూర్తులూ) కనబడుతూండడముతో ఆవూరి మట్టిలో ఎన్నిశిల్పాలు పగిలిపోయినవో అనిపిస్తున్నది. ఈశిల్పాలు పల్లవులలో పరిపాలించిన నాగవంశీయుల నాటివేమో నంటున్నాను. వారు నిర్మించిన సుబ్రహ్మణ్యాలయ మండపాన్నిగురించిన చోళశిల్పకథ ఒకటున్నది. కనుక వీరికి చోళ సామంతులైన కారణముచేత చోళశిల్పసంప్రదాయాలు పట్టు పడ్డాయి. వింతలలో వింత (అత్తిరాలా) కృష్ణాపట్నమూ. ఆత్మకూరు దేవళాలలో చూఱు వెంబడి ఉన్న శిల్పము. ఇది అలంకారశిల్పము కాదు, గాథాశిల్పము. చోళమహాదేవాలయాలలో గూళ్లలో బృహద్రూపాలూ, ఆరూపాలకిటూ అటూ చిన్నవిగ్రహాలతో కథాసూచనా కానవస్తుంది. అంచుకడ సింహాలో, కుంభాండులో వరుసదీరి వుంటారు. అత్తిరాలలో ఈశిల్పము అక్కడి ఆలయముసైజుకు సరిపోయేటట్టు చిన్నదై చూరుచేరువకు పైకిఎక్కింది, కృష్ణాపట్నంలోనూ ఆత్మకూరులోనూ చూరువెంబడి అందపు పట్టీఅయింది. ఆత్మకూరు అళహనాథాలయంలో ఉత్తరము వైపునుంచి గజేంద్రమోక్షమూ, గోపి కావస్త్రాపహరణమూ, కాళీయమర్దనమూ రామాంజనేయ సమావేశమూ, వాలివధా, నరసింహ అవతారమూ, వామనావతారమూ, సప్తతాళ భేదనమూ, గోపాలకృష్ణుడూ, బుద్ధుడూ కలరు. చూరువెంబడి కుంభాండుల పట్టీ, వలయాలలో ముఖాలపట్టీ దానిపైన సింహాముఖాలపట్టీ, కలవు. ఉత్తరపు గూడుపైన చోళచిహ్నము సింహామున్నది. కృష్ణాపట్నంలో దశరథుడూ మునికుమారుడూ కథా, రతీ మన్మథులూ సప్తతాళ భేదనమూ కలవు.

దేవాలయాలలో మూలవిరాట్టులుగా నైతేనేమి విడిగా నైతేనేమి ప్రతిష్టించిన విగ్రహాలు స్థానికములు కావు. నెల్లూరి ఇరుకుల పరమేశ్వరి అసలు విగ్రహము. చాముండీవిగ్రహము. ఎవరో శిథిలముచేశారు. ఇప్పుడు మండపంలో వుంది. గుడ్లగూబ చిహ్నంతో వున్న చాముండి అరుదు. ఈ అంశమూ ఈమె చతుర్బాహువుల విన్యాసమూ రాష్ట్రకూట ఎల్లోరా సప్తమాతృకలను జ్ఞాపకము చేస్తోంది. కృష్ణాపట్నపు సిద్ధేశ్వరాలయ భైరవుడు దాక్షిణాత్యుడు, గోపీనాథరావుగారి భారతీయ విగ్రహశిల్పంలో కానవస్తాడు. తిరుప్పోరూరి వేణుగోపాలుడు నందలూరి సౌమ్యనాథస్వామి సబ్రహ్మచారి, దాక్షిణాత్యుడే, అందమైనమూర్తి. నెల్లూరు బారకాసు ప్రాంతంలో వుండిన కామాక్షి దేవాలయము, కందుకూరికామాక్షి ఆలయమూ, చండి అమ్మవారి ఆలయము కంచిలోని స్వర్ణకారుల కామాక్షి ఆలయాలవంటివి. ఈకామాక్షి చాముండియే. కళ్యాణనగరపు కాంస్యపరిశ్రామికులు కంచిలో రాజ

వల్ల పొందిన మరణాన్ని జ్ఞాపకము చేస్తాయి. వారి తలలు మూడూ, అమ్మవారి పాదాలకు దిగువన-ఆమె పాదపీఠము వారి శిరస్సులమీద పడేటట్లు శిల్పించబడ్డాయి. చండి అమ్మవారి గుడిలో శిల్పి కామాక్షి అంశమూ, చాముండి అంశమూ చేర్చి శిల్పించిన కారణమువల్ల ఒక విగ్రహము పనికిరాకపోతే ఒకప్రక్కన ఉంచినారు. సంప్రదాయాల బలముమాట చెప్పేదేమిటి?

తెలుగు చోళుల అనంతరము నెల్లూరి ప్రాంతాన్ని కాకతీయులూ, రెడ్లూ పరిపాలించారు. దర్శి తాలూకా కొచ్చెర్లకోటలోనూ, రాపూరు తాలూకా కొంపేడులోనూ, త్రికూటాలయాలున్నాయట. అవి కాకతీయ సంప్రదాయపు కట్టడాలేకావాలి. మూడు ఆలయాలు పొయ్యిగడ్డలుగా అమరి వుంటాయి, నడిమి మండపములోనికి నాలుగో వైపునుంచి ప్రవేశము. అటలూరి (అల్లూరి) ఇష్టకామేశ్వరాలయమూ, మొత్తంగా స్వయంభు శివాలయాలూ, చాముండి అవతారభేదాలైన అసంఖ్యాక గ్రామ దేవతల విగ్రహాలూ, కాకతీయుల ప్రవేశఫలములే, రెడ్లు కూడ ఆమెను మూలగూరమ్మ అన్నారు. ఆలయాలు లేవుగాని జైనతీర్థంకర విగ్రహాలు నెల్లూరిలో మూడు, కృష్ణాపట్నంలో ఒకటీ యీనాటికీ వున్నాయి. నెల్లూరు దండువారివీధిలో నరసింహస్వామి గుడిమండపంలోనిది పెరుమాళ్ చెట్టి 1263 లో కానుక యిచ్చిన శాంతీశ్వరుని విగ్రహమేమో. వానుహాలులోనిదీ, కృష్ణాపట్నానిదీ కొప్పార్ పరికరముల అనుకరణములు, దాక్షిణాత్య జైనుల నిర్మాణాలు. వీర శైవము కాకతీయులతో నెల్లూరు మండలముమీద విరుచుకు పడింది. దానశాసనాలు మహేశ్వరుల పాలనమునకు వదలడమూ, వివిధ యుద్ధస్థలాలలో వీరశిలలు నిలపడము యీ 13-వ శతాబ్ద శైవ విజృంభణములోనే జరిగినవి. నెల్లూరి జిల్లా పరిషత్తు భవన ఆవరణలో (కరవాడి యలుగుల గనపపాతరలో కాబోలు) కట్టి చేరులుకోసి ఉరికేవాడూ, శూలము అధిరోహిస్తానని శపథము పట్టేవాడూ ఉన్నారు. నెల్లూరి చెఱువు వీరు, కవతల కత్తినివంచేశిన వీరశైవు డున్నాడూ, జలదంకిలో పాన వట్ట లింగములు అరచేతిలో పెట్టుకొని ప్రతిజ్ఞచేసేవా డున్నాడు. సంగంలో ఉన్నాడొక "వీరుడు" కోటవద్ద శివునికో, దేవికో శిరస్సు సర్పించేవారు - రెండు చేతులతో కత్తి రెండు పిడులుపట్టి వెనకనించి తల కోసుకునేవారూ - చాలామంది ఉన్నారు. ఇదే గండకత్తెర. సంగం వీరభద్రాలయము యీనాటిదే.

సంగమ వంశమూ, తుళువ వంశమూ విజయనగర సామ్రాజసింహాసనాధికారము చేస్తూఉండిన రోజులలో నరసింహస్వామిగుళ్లు నెల్లూరి మండలమునందు

తటా పెరిగినవి ఉదయగిరిలో ఈ విజయనగర కాలములో రఘునాయకస్వామి, చెన్నకేశవస్వామీ ఆలయాలు, గోపుర ప్రాకారాలూ కళ్యాణ మండపాములూ తెప్ప కోనేరులతో పూర్తి విజయనగర పద్ధతిలో వెలిశాయి మండపాల జమిలి - శిల్ప, - స్తంభాలూ నంపుల చూరుటంచులూ గోపుర ద్వారములో వృక్షకీట్టూ లతలూ, నాలుగుకాళ్ల మండపాలూ, ఎత్తైన ప్రాకారాలతో పూర్తిగా దిగి పోయింది విజయనగర శిల్పము పాపము రాయసము కొండమురుసయ్య తిమ్మరుసు మంత్రి యంతటి సిరిమంతుడు కాకపోయె లేకుంటే తాడిపర్తిని ఉదయగిరి మించి పోయి యుండును ఇది రాజధాని అది కాదు

విజయనగరసామ్రాజ్య విజృంభణానంతరము లేచిన ఆలయాలలో చుండి కలికేశ్వరాలయము నాయకమణి ఆ ఆలయపు నేటిపేరు తప్పు రెమళిగబిమ్మనాథుని నిజలింగచిక్కయ్యకథ చుండి కలికేశ్వరునికి అంకితము (సుగ్రీవ విజయము కందుకూరి జనార్దనస్వామికి) ఈ ఆలయము వెనుకవైపునించిచూస్తే త్రికూటాలయమువలె కానవస్తుంది ముందువైపు స్తంభాల ప్రాంగణమున్నది ఆ ప్రాంగణపు గోడలు- లేపాక్షి వీరభద్రాలయ అర్ధమండపము వెలిగోడలవలె శిల్పావృత్తములు శిల్పమంతా పట్టీలుగా ఉంది అట్టడుగున-లేపాక్షిలోవలె-ఏనుగుల పట్టీ తక్కిన మూడూ కథాశిల్పాలతో కిక్కిరిసి ఉన్నాయి వ్యాఘ్రపాదమహర్షీ, పతంజలీ (?) దర్శనమిచ్చే పార్వతీ పరమేశ్వరులూ, - లేపాక్షివారు - ఇక్కడా వున్నారు అర్జునుని తపశ్చర్య, ఇంద్రుడు వారించుటా, అప్సరసల నిష్ఫలయత్నమూ, అర్జునుని నిష్ఠ, వరాహాగమనమూ, యుద్ధమూ, అక్కడివే ఇక్కడా ఉన్నాయి అక్కడవలెనే ఇక్కడా పార్వతీపరమేశ్వరు లిద్దరూ వృషభవాహనారూఢులై దర్శనమిచ్చారు అర్జునుడికి సిరోజములు కిరీటపు పార్శ్వములనుంచి దిగుట అక్కడా ఇక్కడా కూడా కలదు ఈ ఆలయముకూడ అచ్యుతరాయల కాలమునాటిదే ననుకుంటాను

[illegible] చుండి జనార్దనాలయము రెడ్డిరాజుల కాలమునాటిదీ, (క్రీ శ. 1408) కోమటిరెడ్డి తమ్ముడు మల్లాయరెడ్డి, భార్యా ఇద్దరూవున్న శిల్పముంది ప్రాంగణములో అయితే తాడిప్రమాణమున్న ఏకాండశిల రాతిస్తంభము విజయనగర కాలమునాటిదే, సోమపాలెము, చిప్పగిరి స్తంభాల కోవలోనిది చేరువన రోడ్డు కెదురైవున్న ఆంజనేయ విగ్రహము విజయనగర కాలానిదే బోయరాజులు మహావీరులు విజయనగర సైన్యానికి మూలస్తంభాలు వారి పాలనలో ఉండిన వీస్థల దుర్గాలు కందుకూరి జనార్దనస్వామి, కోటలోని కలికేశ్వరాలయము బాగా మారి

పోయినవి. కలికేశ్వరుని దేవియే కాబోలు పద్మముకుళహస్త కందుకూరు స్కూలు మైదానపు టంచున వెల్లకిలబడి ఉన్నది. కలికేశ్వరుడూ, జనార్దనస్వామీ కందుకూరి లోనూ, చుండిలోనూ కూడా ఉన్నారు.

బ్రాహ్మణక్రాకలోని కాకతమ్మ దేవళములో నిలబడ్డ స్త్రీవిగ్రహమున్నది. ఈమె పాదాల దిగువన పాము చిహ్నమున్నది. ఆమె ఎడమచేతా కుడిచేతా పాములున్నాయి. ఈమె ఏకవీరాదేవి, కాకతమ్మకు సైదోడు. ఈమె గుడిమెట్ల శిఖరములో కాకతీయుల దేవళాల్ని పోలివుంది. ఈ గుడి ప్రక్కన శిథిలాలయమున్నది. అది ఒకప్పుడు పూర్తిగా ఉండివుంటే, దానిలో కాకతమ్మ (చాముండి) బొమ్మ ఉండి యుండును. చుట్టుపట్టుల భైరవుని బొమ్మ కలదు. (భైరవునికీ చాముండికీ ఆయుధాల్లో భేదము లేదు)

నెల్లూరూ, గూడూరు తాలూకాలలో ధర్మరాజదేవళాలు చాలా వున్నాయి. నెల్లూరు ఊళ్ళోనే రెండున్నాయి ఇవి చేపలుపట్టి జీవించేవారివి. మరి, పల్లెవారికీ ధర్మరాజుకీ ఏమి సంబంధమో? కళింగపట్నపు పల్లెవారు తమ కులానికి చెందిన మహీనాయకునికి ధర్మరాజు గొప్పగౌరవమూ, పూజా చేసినట్లు రాగిశాసనము మీద వ్రాసుకొన్నారు.

బౌద్ధక్షేత్రాలు నెల్లూరుమండలములో ఎక్కడనగ లేవు రామతీర్థము చేరువన చిహ్నాలున్నాయంటారు. నాగాసు ప్రాంతంలో బుద్ధవిగ్రహము ఉష్ణీషముతో చక్కని శిల్పము 11 వ శతాబ్దము నాటిది కాబోలు ఒకటి దొరికింది. అంతకుమించి బౌద్ధచిహ్నాలు ఏవీ లేవు.

యాదవ్రులవంశము వారు దొనకొండలో పరిపాలించారు సామంతులుగా. వారికి గంగాంబ ఇష్టదైవము ఈమె శ్రీకృష్ణునికి బాల్యసోదరి, యోగమాయ. ఈమెకు దొనకొండలో ఆలయము కలదు. యాదవుడైన కాటమరాజుకునూ నెల్లూరి రెండోమనుమసిద్ధికీ యుద్ధము జరిగింది, పంచలింగాలకొండవద్ద. ఆ యుద్ధములో ఆవులు కూడా యుద్ధము చేశాయట. యాదవులు రక్షణకోరకు ఆవులను తరిమినారు కాబోలు సిద్ధిరాజుసేన మీదకు. జలదంకి ఆలయములో ఇంటికొమ్ముగల ఆవుబొమ్మ ఇత్తడిది గలదు. "ఆవుల పఱుపు" పండుగకు ఈ విగ్రహాన్ని ఊరేగిస్తారట. ఈ పూజ నెల్లూరు మండలానికే ప్రత్యేకమైనా, కాటమరాజూ భార్యబొమ్మలు యాదవులున్నచోటనల్లా నిలుపుతారు. విశాఖమండలము భోగాపురంలో కాటమరాజు చేతిలో నెమలిగడతో గుర్రపువాహనంతో ప్రక్కన భార్యబొమ్మతో ఉన్నాడు.

ఆత్మస్థితం గుణవిశేషమహం కృతస్య శృంగార మాహురిహ జీవితమాత్మయోనేః।
తస్మాత్మశక్తిరసనీయతయా రసత్వంయుక్తస్య యేన రసికోఽయమితి ప్రవాదః॥

స్వాత్వాత్మనా మమలజన్మ విశేష జన్మాజన్మాన్తరాను భవనిర్మితవాస నోత్థః।
సర్వాత్మ సంపదుదయాతి శయై కహేతుఃజాగర్తి కోఽపిహృది మానసమయో వికారః॥

—డా. రా. శృ. పు. 466

వాక్య ప్రతీతిమాత్రార్థ ముపాత్తేషు పదేషు యః
ఉపస్కారః పదైరన్యైః పల్లవం తు ప్రచక్షతే॥
అపల్లవంతు యద్వాక్యం కవిభ్యస్తన్న రోచతే
ప్రయుజ్యతే తథాభూతముదీచ్యైః కవిగర్హితమ్॥

—డా. రాఘవన్ : శృం ప్ర. 363

రసోఽభిమానోఽహంకారః శృగార ఇతి గీయతే
యోఽర్థః తస్యాన్వయాత్ కావ్యం కమనీయత్వమశ్నుతే॥
విశిష్టాదృష్టజన్మాయం జన్మినామన్తరాత్మసు
ఆత్మసమ్యగ్గుణోద్ భూతేః ఏకోహేతుః ప్రకాశతే॥
శృంగారీ చేత్ కవిః కావ్యే జాతం రసమయం జగత్
సఏవ చేదశృంగారీ నీరసం సర్వమేవ తత్॥

—భోజుని సరస్వతీ కంఠాభరణము. V 1-3.

అపరాధ సుందర :

నపుః ప్రాదుర్భావా దనుమితమిదం జన్మనిపురా
పురారే న ప్రాయః క్వచిదపి భవన్తం ప్రణతవాన్।
నమన్ముక్తః సంప్రత్యహమతనురగ్రేఽప్యనతి మాన్
మహేశక్షన్తవ్యం తదిదమ పరాధద్వయమపి॥

# 5 A.

# మండలములో సెకండరీ విద్యావికాసము

శ్రీ సి. రామస్వామిరావు,
ఎం.ఏ., ఎల్.టి.
(Head master)
Z.P.M.P. School, Kavali.

**పూర్వచరిత్ర :**

1832-33 ప్రాంతమున పాశ్చాత్యవిద్య మనదేశమున ప్రవేశపెట్టవలెనని ఆనాటి ఆంగ్ల ప్రభుత్వము సంకల్పించినది. పాఠశాలలయందు బోధింపబడు విషయములు భారతీయ విజ్ఞానాను గుణముగ నుండవలెనా, లేక పాశ్చాత్య విజ్ఞానాను గుణముగా నుండవలెనా? బోధ దేశభాషలందు జరుపవలెనా, ఆంగ్లమున బోధింపవలెనా? అని మీమాంస కల్గినది. తుదకు 'మెకాలే' దొరగారి అభిప్రాయాను సారము పాశ్చాత్య విజ్ఞానము ఆంగ్ల భాషాముఖమున బోధింప బడవలెనని నిశ్చితమైనది. ఆ లక్ష్యసిద్ధికై ప్రభుత్వమువారును, క్రైస్తవ మిషనరీ సంస్థల వారును, దేశమున పాఠశాలలను నెలకొల్ప బూనిరి. 1857 లో మద్రాసు విశ్వవిద్యాలయము నెలకొల్పబడినది. నాటి నుండియే సెకండరీ పాఠశాలల స్థాపన ప్రారంభమయ్యెను. 1842 లో లూథరన్ మిషన్‌వారు గుంటూరులో ఒక విద్యాలయమును, 1866 లో ఒంగోలులో అమెరికన్ బాప్టిస్టు మిషన్‌వారు వేరొక పాఠశాలను నెలకొల్పిరి. ఆ కాలమందే (1841) డా॥ కూపరన్ అను విద్యావేత్త నెల్లూరునందొక పాఠశాలను నెలకొల్పి, కొంత కాలమైన పిదప ఫ్రీచర్చి ఆఫ్ స్కాట్‌ల్యాండు మిషన్‌వారికి వశ మొనర్చిరి. అందు జగ్గయ్య నాయుడను వారు ఆంగ్లమును సామర్థ్యముతో బోధించుచుండిరి. ప్రజ్ఞానిధియగు పళ్ళె చంచలరావు పంతులుగారు బాల్యమున వారికడనే విద్యాభ్యసించిరట! ఆనాటి కాపాఠశాలయే మండలములోని విద్యార్థులకెల్ల పట్టుకొమ్మ అయ్యెను. అప్పటి కాపాఠశాలలో కీ॥ శే॥ సుంకు నారాయణశెట్టిగారు సహాయోపాధ్యాయులుగ నుండిరి. 1904 లో ఆస్కూలు అమెరికన్ బాప్టిస్టు మిషన్‌వారి కప్పజెప్పబడెను. ఆనాడు జాన్ కోళందవేలు, ఆర్. పరంజ్యోతి అనువారలు ఉత్తమ శ్రేణికి జెందిన ఉపాధ్యాయులుగ పరిగణింప బడుచుండిరి. వారు బోధనా విధానమునందును, క్రమశిక్షణా పద్ధతి యందును మేటులుగ నెన్నబడు చుండిరి. అదియే నేటికిని కోల్సు ఎకర్మెన్ మెమోరియల్ హైస్కూలు (C. A. M. High School) అనుపేరుతో సరస్వతీ నిలయమై యొప్పుచున్నది. మనమండలములో ఒక్క శతాబ్దముక్రిందట స్థాపింపబడిన మొదటి హైస్కూలు అదియే.

**రాజాగారి స్కూలు :**

క్రైస్తవ మిషనరీలు మనదేశమున పాఠశాలను నెలకొల్పి విద్యాదానము చేయుచుండినను, వారి ఆశయము మతవ్యాపన విషయమున ప్రగాఢముగ నుండెను. ఆదినములలో మిషన్ హైస్కూలులో ప్రతివిద్యార్థియు, ప్రత్యుపాధ్యాయుడును నిర్బంధముగ బైబిలు తరగతికి హాజరు కావలసియుండెను. వారి పండుగలన్నను పబ్బములన్నను సెలవులిచ్చి వేడుకగ కాలము గడుపుచుండిరి. హిందువుల పండుగలలో కొన్నిటికి విరామము లిచ్చెడివారు కారు. అది హిందూమతాభిమానులలో సంచలనములను కలిగించి, హిందువుల ఆచార సంప్రదాయాను గుణముగ వేరొక పాఠశాల స్థాపింపబడవలెనను ప్రచారమునకు దారితీసెను. ఆపరిస్థితులలో 1875 లో సుంకు నారాయణశ్రేష్ఠిగారు మిషన్‌వారి పద్ధతులు గిట్టనందున ఉపాధ్యాయ పదవికి రాజీనామా యొసగిరి.

హిందూమహాజనుల సంకల్ప మహిమచే 1875 మే నెల 3 ది "హిందూ వర్నాకులర్ స్కూలు" ప్రారంభమైనది. శ్రీ సుంకు నారాయణశ్రేష్ఠి, బి. ఏ; గారు ప్రధానోపాధ్యాయులుగను శ్రీమాన్ వీరవల్లి కస్తూరి రంగాచార్యులు; ఆదూరు వేంకటాచార్యులు; యద్దనపూడి లక్ష్మయ్య; పిట్టి రామరెడ్డి; వీరనాగయ్య దేవర గార్లు సహాయోపాధ్యాయులుగ నియమింపబడిరి. హిందూ మతాభిమానముగల తల్లిదండ్రులు చాలమంది తమ పిల్లలను ఆ పాఠశాలకు పంపసాగిరి. అదియే క్రమముగ "హిందూ హైస్కూలు" అని వ్యవహరింప బడసాగెను. ఆ కాలమున బి.ఏ. చదివినవారు అరుదుగ నుండుటచేతను, నారాయణశ్రేష్ఠిగారు బి.ఏ; పట్టభద్రులగుటచేతను, ఆ పాఠశాల, బి.ఏ. స్కూలు అనియు, వారు బి.ఏ. నారాయణశ్రేష్ఠి అనియు రూఢమయ్యెను. ఆ స్కూలు స్థాపింపబడిన ముహూర్త బలమో, సంస్థను స్థాపించిన పెద్దల భావనాబలమో తెలియదుగాని, ఆపాఠశాల శుక్లపక్ష చంద్రునివలె క్రమాభివృద్ధిచెంద జొచ్చెను. అంతలో నారాయణశ్రేష్ఠిగారు ఉపాధ్యాయ పదవిని వదలి శ్రీ వేంకటగిరి ప్రభువులకడ దివాన్‌గిరి పదవిలో నియమింపబడి వారి ఆదరణను పాత్రులైరి. వారి ప్రోత్సాహముచే 1836 లో వేంకటగిరి రాజాగారు దాని ఆధిపత్యమును స్వీకరించిరి. తదాదిగ "వేంకటగిరిరాజా స్కూలు" అని వ్యవహరింపబడసాగెను. తెలుగున సుప్రసిద్ధ సాహిత్యపరులును, సౌజన్యమూర్తులును అగు శ్రీ కొప్పిసెట్టి వెంకటరామానుజరావునాయుడు, బి. ఏ. గారు కొంతకాలము హిందూ హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగ నుండిరి. ప్రస్తుతము నెల్లూరు మండలముననుండు

సెకండరీ పాఠశాలలోకెల్ల ఆ పాఠశాల ఛాత్రుల సంఖ్యలోను ఉపాధ్యాయుల సంఖ్యలోను మిన్నయై విరాజిల్లుచున్నది. కే. సంతానరామయ్యంగారు, దర్భల వేంకట సుబ్బయ్య, బైరవరసు సుబ్బారావు, కాకుటూరి నరసింహారావు, వేగూరి వేంకటప్పయ్య మొదలగు పెద్దలా పాఠశాలకు ప్రధానోపాధ్యాయులై సంస్థకీర్తిని ఇనుమడింపజేసిరి. ఇప్పుడది హయ్యర్ సెకండరీ స్కూలుగ పనిచేయుచున్నది. శ్రీ సంతాన రామయ్యంగారి పరిపాలనలో రాజాగారి స్కూలు ఉత్తమప్రతిష్ఠ సంపాదించెను. వారు శ్రమించియే ప్రాగ్భవనము (East Hall) ను నిర్మించిరి. వారు ఆంగ్ల వ్యాకరణ బోధనయందు మిక్కిలి ప్రసిద్ధిచెందినవారు.

**కావలి స్కూలు :**

మనమండలమున మిషన్ స్కూలు, వేంకటగిరి రాజాగారి స్కూలు తర్వాత పేర్కొనదగినది కావలి పాఠశాలయే కావచ్చును. 1890 ప్రాంతమున కావలిలో లోయర్ సెకండరీ స్కూలుమాత్రముండెను. దానికి కీ॥శే॥ కాసుఖేల విశ్వనాథరావుగారును కొంతకాలము యరగుడిపాటి రామకృష్ణయ్యగారును ప్రధానోపాధ్యాయులుగ నుండిరి. అందు పబ్లికు సర్వీసున కుపయోగపడుటకై ప్రైమరీ, మిడిల్ స్కూలు పరీక్షలను జరుపుచుండిరి. అదియే 1912 లో బోర్డు మాధ్యమిక పాఠశాలగను, 1914 లో ఉన్నత పాఠశాలగను మార్పుచెందెను. 1917 నుండి 1924 వరకు ఆస్కూలునుండి S.S L.C. పరీక్షకు హాజరగు విద్యార్థులలో 75 % కృతార్థులగుచుండిరి. పరీక్షాఫలితముల కాశ్చర్యపడి అప్పటి రాష్ట్ర విద్యాశాఖాధికారి శ్రీ లిటిల్ హేల్సు దొరగారు స్వయముగ కావలికివచ్చి, విద్యాలయమున సంచరించి ప్రశంసించిరట. అత్తి లి. గురుమూర్తి పంతులు, అంబారుఖానా, జయరామరావు పంతులు, అద్దేపల్లి లక్ష్మినారాయణ, కనుపర్తి సుబ్రహ్మణ్యం, యరగుడిపాటి కోదండరామయ్య ప్రభృతులు ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగ పనిచేసి. విద్యాధికారుల మన్ననలబడసిరి. తొలితనుండియు కావలి పాఠశాల విద్యాబోధనకు, క్రమశిక్షణకు ప్రసిద్ధిచెంది యుండుటచే పెన్నకు ఉత్తరముగనుండు సంపన్న గృహస్థులెల్లరు తమ పిల్లలనెల్ల ఆ పాఠశాలకే పంపుచుండిరి. శ్రీ దొడ్ల వేంకటరామిరెడ్డి, పోణకా గోవిందరెడ్డి, బెజవాడ రామచంద్రారెడ్డి, నలమోతు చెంచురామానాయుడు, మొదలగు వారాస్కూలు ప్రాతవిద్యార్థులై యుండుటయే అందుకు నిదర్శనమగుచున్నది. ఇప్పుడది హయ్యరు సెకండరీ మల్టీపర్పస్ స్కూలుగ పనిచేయుచున్నది.

ఏ. బి. యం. బాలికోన్నత పాఠశాల, నెల్లూరు :

మండలములోని రెండు, మూడు ఉన్నత పాఠశాలలలో బాలురతో పాటు బాలికలును విద్యనభ్యసించుచుండినను బాలికలకు ప్రత్యేక పాఠశాల లేకుండుట కొరతగనే యుండెను. 19 వ శతాబ్దాంతమున స్త్రీలకై ఒకవీధిబడి మాత్రముండిన దట. అందుపాధ్యాయులు పురుషులే 1988 లో నెల్లూరులోనుండిన మిస్ ఫ్రాన్సెస్ బెన్‌కేట్ (అమెరికాయువతి) గారికి స్త్రీ జనాభ్యుదయమునకై బాలికోన్నత పాఠ శాలను నెలకొల్ప వలెననియు, అందు స్త్రీలే ఉపాధ్యాయులుగనుండుట మంచిదనియు సంకల్పము కలిగి, అమెరికామిషన్ వారికి వ్రాసినదట. మొదట వారామె కోర్కెను నిరాకరించినను కడపట ఆమెకృషిచే 1904 లో అమెరికా మిషన్‌వారి పక్షమున బాలికోన్నత పాఠశాల స్థాపితమయ్యెను. అప్పుడచ్చట నుండిన బక్నెల్ మెమోరి యల్ మాధ్యమిక పాఠశాలను అల్లూరికి మార్చిరి. ప్రారంభమున బాలికల హైస్కూలుకు ఫ్రాన్సెస్ బెన్‌కేటుగారే ప్రిన్సిపాలుగ నుండిరి. ఆనాడు ముగ్గురు బాలికలతో ప్రారంభమైన ఆ పాఠశాల క్రమాభివృద్ధి చెంది, నేడు 600 మంది బాలి కలతో, మహోన్నత భవనముతో, సమర్థులగు ఉపాధ్యాయ ఉపాధ్యాయినులతో కలకలలాడు చున్నది. 1954 ఆ పాఠశాల రజతోత్సవముకూడ జరుపుకొని మండల మునకు చేయుచున్న సేవ ఆదర్శ ప్రాయమైనది.

**వేంకటగిరి హైస్కూలు :**

వేంకటగిరిలో 1894 వ సంవత్సరమున ప్రారంభింపబడిన రాజాగారి స్కూలు 1895 నుండి ఉన్నత తరగతు లారంభింపబడి నేటివరకును పురమున కలంకారముగ, వేంకటగిరి ప్రభువుల యశోపతాకగ నవిచ్ఛిన్నముగ జరుగుచున్నది.

**అల్లూరు హైస్కూలు :**

అల్లూరులో చిరకాలముగ ఏ. బి. యం. మాధ్యమిక పాఠశాల నడుపబడు చుండినను, ఆసంస్థ పరిపుష్టము కానందున 1927 లో రద్దుచేయబడి. 1928 లో రామకృష్ణమాధ్యమిక పాఠశాల. ప్రారంభమైనది. అప్పుడు శ్రీమాన్ కీ. శే. శేషా చార్యులు ప్రధానోపాధ్యాయులుగ నుండిరి. అదియే కీ.శే. నూకలపాటి కృష్ణారెడ్డి; నూకలపాటి లక్ష్మీరెడ్డి; చేవూరి బలరామిరెడ్డి; సి. వి. రంగంశ్రేష్టి; వావిళ్ల సుబ్బమ్మ అల్లంపాటి రఘునారెడ్డి మొదలగు పెక్కురు వదాన్యుల సాయమున ఉన్నత పాఠ శాలయయ్యెను. 1947 లో తొలిసారిగ S. S. L. C. కి విద్యార్థులు హాజరైరి.

అదియే 1957 లో ఉన్నతోన్నత పాఠశాలగ (హయ్యర్ సెకండరీస్కూలు) మార్పుచెంది 1961 లో 10 వ తరగతి ప్రభుత్వపరీక్షకు విద్యార్థులు పంపబడిరి. ఇప్పు డాపాఠశాలలో 764 మంది బాలురు, 238 మంది బాలికలు చదువుచున్నారు. 32 మంది అర్హులగు ఉపాధ్యాయులు పనిచేయుచున్నారు. తత్ప్రాంతీయులకా పాఠశాల సరస్వతీ పీఠముగా నున్నది.

శ్రీ కస్తూరిదేవి విద్యాలయము - నెల్లూరు:

చిరకాలముక్రిందట శ్రీమతి పొణకా కనకమ్మగారు నెల్లూరిలో బాల బాలికలకై "జాతీయ విద్యాలయమును" స్థాపించి కృషిసల్పుచుండిరి. అదియే మహాత్మాగాంధీగారి ఆశీస్సులతో "కస్తూరిదేవి బాలికాపాఠశాలగ" వ్యవహరింపబడసాగెను. ఆరోజులలో కనకమ్మ, నెల్లూరు వెంకట్రామానాయుడు ప్రభృతులు వివిధ పట్టణములలో సమర్థులగు నటులచే నాటకములు వేయించియు, ఉదారులకడ చందాలువేయించియు ధనమును ప్రోగుచేసి, పాఠశాలను నడుపుచుండిరి. ఆ ప్రాంతమే నేడు "కస్తూరి నగర్" అని వ్యవహరింపబడుచున్నది. కనకమ్మగారు సత్యాగ్రహోద్యమమున పాల్గొని కారాగారమున కేగుటతో ఆ పాఠశాల మూసివేయబడినది. మరల మండలములోని నెఱదాతలు బాలికోన్నత పాఠశాల అవసరమని తలంచుటచేతను, కనకమ్మగారి అమోఘ కృషిఫలితముగను 1944 లో దర్గామిట్టలో కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాల స్థాపితమైనది. సంస్థ మూలధనముకై వదాన్యశేఖరులగు శ్రీ తిక్కవరపు. రామిరెడ్డిగారు రు. 50, 000 లు విరాళమొసంగిరి. మరియు శ్రీ మేనకూరు. బలరామరెడ్డిగారు 10, 000; కీ. శే. రేబాల కోదండరామిరెడ్డి (మోపూరు) నిధినుండి రు 9, 000 లు పాఠశాలకు విరాళముగా నిచ్చిరి. ఇంకను పెక్కురు దాతలు చేసిన భూరి విరాళములు ఆపాఠశాలలో ఫలకములపై లిఖింపబడి యున్నవి. కీ శే. రేబాల. పట్టాభిరామిరెడ్డిగారి పేర దాదాపు రు 30, 000 వ్యయముతో, వారి ధర్మపత్ని సుజాతమ్మగారు హాస్టలు కట్టించిరి. అందు 50 మంది బాలికలున్నారు. ఈ సంవత్సరము కేంద్ర ప్రభుత్వ సహాయముతోడను, వదాన్యుల విరాళముతోడను రు 70,000 లు వ్యయపఱుపబడి సర్వాంగసుందరమగు ప్రేక్షకసదనము (ఆడి టోరియం) కట్టబడినది. ఈసంవత్సర మాపాఠశాలలో పిల్లలకు భరతనాట్యము నేర్చుకొనుటకు వీలు కల్పింపబడినది. 1956 లో ఈ స్కూలు బహుళార్థసాధక పాఠశాలగ మార్పుచెంది, నేడు 400 మంది బాలికలతోడను, 20 మంది ఉపాధ్యాయినులతోడను, నిత్యోన్నత్యము నొందుచు మండల లక్ష్మికి కైసేతగ నున్నది.

కావలి విశ్వోదయ పాఠశాలలు :

1951 లో కావలి పట్టణమున విశ్వోదయ సంస్థ నెలకొన్నది. 'తమసోమా జ్యోతిర్గమయ' అనునది దాని ఆదర్శము. ఆధునిక ప్రపంచమున మానవజీవిత విధానము మారిపోవుటచే పవిత్రమగు గురుశిష్య సంబంధములోపించి, విద్యాసంస్థలు వ్యాపార సంస్థలైనవి. ఇట్టి పరిస్థితులలో విద్యావివేకములు గల బాలబాలికలను శాస్త్రజ్ఞులు, కళాకారులుగ, కవులుగ, రసజ్ఞులుగ, నొనర్చుటయే ఆసంస్థధ్యేయము. ఆ లక్ష్యసిద్ధికై 1955-56 లో బాలకోన్నత పాఠశాల 136 నుండి పిల్లలతో ప్రారంభింపబడినది. అదియే 1960 లో ఉన్నతోన్నత పాఠశాలగ మార్పుచెంది, నేడు 306 మంది బాలికలతో విరాజిల్లుచున్నది. దాని కనుబంధముగ గా॥ శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారిపేర నొక సంగీత - నృత్య పాఠశాలకూడ స్థాపింపబడి, బాలికలకు సాహిత్యమునందేకాక, సంగీతమునందును, భరతనాట్యమందును 55 మంది బాలికలకు ప్రత్యేక శిక్షణ గఱుపబడుచున్నది. ఆ విశ్వోదయ సంస్థవారే 1959-60 లో బాలుర కొక ఉన్నత పాఠశాలను ప్రత్యేకముగ నెలకొల్పిరి. ఆ సంస్థల కనుబంధముగ విశ్వోదయ సేవాసమితి, విద్యావినోద మందిరము, నాట్య మందిరము మొదలగునవియు నున్నవి. వయస్సున పిన్నవారైనను "విశ్వోదయ" ఉన్నతాదర్శ సిద్ధికై నిరంతరము శ్రమించుచున్న శ్రీ దొడ్ల రామచంద్రారెడ్డిగారి కృషి అమోఘము.

నెల్లూరు మున్సిపల్ పాఠశాలలు :

నెల్లూరు టవునులో మున్ను పేర్కొనిన పాఠశాలలుకాక, పురపాలక సంఘమువారి అధ్వర్యమున 3 ఉన్నత పాఠశాలలు, 2 మాధ్యమిక పాఠశాలలు, పనిచేయుచున్నవి. నవాబు పేటలో 350 మంది బాలికలుగల బాలికోన్నత పాఠశాలయు, స్టోన్ హౌస్ పేటలో 1400 మంది పిల్లలుగల ఉన్నతోన్నత పాఠశాలయు పని చేయుట గమనార్హము.

**విద్యావిధానము - మార్పులు :**

మొట్టమొదట ఉన్నతపాఠశాలలో మెట్రిక్యులేషన్ పరీక్షా విధానమే అమలు నందుండెను. అందు ఇంగ్లీషు, మాతృభాష, చరిత్ర, సామాన్యశాస్త్రము విధిగ నేర్పబడుచుండెను. భాషేతర విషయములన్నియు ఆనాడు ఆంగ్లముననే నేర్పబడెడివి. ఆంగ్లేయులు మనలను బానిసలుగ జేసి, గుమస్తాలుగ తయారుచేయుటే లక్ష్యముగా నుంచుకొన్నందున, అప్పటి విద్యాలయములందు వ్యాసరచన ప్రధానముగ నుండెను.

1912 లో ప్రభుత్వమువారా విధానమును రద్దుచేసి S. S. L. C. పద్ధతి నమలు పఱచిరి. అందు రెండువిషయము లైచ్ఛికముగను; ఆంగ్లము, మాతృభాష లెక్కలు, నిర్బంధములుగ నుండెను. అందును భాషేతరవిషయము లన్నియు నాంగ్లముననే బోధింపబడు చుండెను. ఆపద్ధతి కొంతకాలము సాగిన పిదప 'బి' గ్రూపువిషయములు పరీక్షింపబడకుండుట లోపముగ నెంచబడినది. అందుచేత 1929 లో విద్యావిధానమున మరల కొన్నిమార్పులు సూచించబడినవి. నూతన విధానమునందు "బి" గ్రూపు రద్దుచేయబడి ఐచ్ఛికవిషయమొక్కటిగ నిర్ణయింప బడినది. ఇంగ్లీషు, మాతృభాష, లెక్కలు, చరిత్ర, భూగోళము, సామాన్యశాస్త్రము నిర్బంధములయ్యెను. ఆపద్ధతి 1950 వరకును జరిగినది.

1947 దాస్యాంధకారము నశించి, స్వాతంత్ర్య భానూదయముతో దేశ మెల్లెడల నూతనోత్తేజము, భావావేశము వెల్లి విరిసినది. పాఠశాలలందు మనజాతీయతానుగుణమగు విద్యావిధానము అమలుపఱుపబడవలెనని ఆందోళన సాగినది. వృత్తివిద్యలకు, సాంకేతిక విద్యలకు ప్రాధాన్యమియ్యదగునని విద్యావేత్తలు సూచించిరి. గాంధీగారి బేసిక్ విద్యావిధానమునకు ప్రాముఖ్యమీయవలెనని మరికొందరు వాదించిరి. ఆ తర్జనభర్జనలకు ఫలితముగ సెకండరీ విద్యావిధానమున 1948 లో మరికొన్ని మార్పులు చేయబడినవి. ఆ విధానము ననుసరించి 9-వ తరగతి (IV ఫారము) నుండి చరిత్ర - భూగోళముల స్థానమున సాంఘిక శాస్త్రము ప్రవేశ పెట్టబడెను. భాషేతరవిషయము లన్నియు మాతృభాషలోనే బోధింపవలెననిరి. మాతృభాషకు ప్రథమ స్థానము, ఇంగ్లీషుకు ద్వితీయ స్థానము. హిందీకి తృతీయ స్థానము కల్పింప బడినవి. ప్రాంతీయభాష సామాన్య - విశేషభేదములచే రెండుగా విభజింపబడి, రెండవ భాగమున సంస్కృతము, ఉర్దు భాషలకును అవకాశమివ్వ బడినది.

కాలక్రమమున విద్యాభ్యాస మొనరించు బాల-బాలికల సంఖ్య హెచ్చుటచే పాఠశాలల సంఖ్యయు పెరిగినది. అనువత్సరము వేలకొలది బాలురు S.S.L.C. లో కృతార్థులగుటయేకాని, వారికి కళాశాలలో ప్రవేశముకాని, ఉపాధిగాని దొరకుట దుర్లభమయ్యెను. నిరుద్యోగ సమస్య వృద్ధిగాజొచ్చెను. ఆ విషమ సమస్య నెదుర్కొనుటకై కేంద్ర ప్రభుత్వమువారు డా. పి. లక్ష్మణస్వామి మొదలియారు ఆధ్వర్యమున పలువురు విజ్ఞానవేత్తలను కమిటీగా నేర్పఱచి, సెకండరీ విద్యావిధానమును జాత్యానుగుణముగ రూపొందింపవలసినదిగ సూచించిరి.

వారు దేశమందలి పలుసంస్థలను, ప్రజ్ఞానిధులను కలిసికొని, పిల్లల మన స్తత్వమును కూలంకషముగ చర్చించి, 1957-58 లో 12-వ తరగతి పద్ధతి నేర్పరచిరి. పలుచోట్ల బహుళార్థక పాఠశాలలు-ఉన్నతోన్నత పాఠశాలలు స్థాపింప బడినవి. తత్ఫలితముగ కళాశాలలలో పి. యు. సి. ఒక సంవత్సరము; మూడు సంవత్సరముల డిగ్రీకోర్సు అమలులోనికి వచ్చినది. బాలురున్నత పాఠశాలలలో భాషేతరవిషయము లన్నియు మాతృభాషలో జరిగి, కళాశాలలో పి.యు.సి. లో చేరుటయు; అచ్చట అన్ని విష యము లాంగ్లములో బోధింప బడుటను, అర్థము చేసికొని, ఆ వాతావరణము నను సరించునప్పటికి పుణ్యకాలము గడచి, పరీక్షలు సమీపించు చుండుటచేతను ఎక్కువ మంది కృతార్థులగుటకు వీలుగాకున్నది VII ఫారము చదివి కళాశాలలో డిగ్రీ కోర్సు చదువు బాలురస్థితియు నిట్లేయున్నది. అందుచేతనే కొందరు విద్యావేత్తలీ నూతనవిధానమునట్ల సైముఖ్యము ప్రకటించినవారును లేకపోలేదు. ఇక భవిష్య త్తులో నెట్టి పరిణామములు రానున్నవో తెలియదు. నేటి హాయ్యర్ సెకండరీ పాఠ శాలలో శాస్త్రవిద్యకు (సైన్సు) ప్రాధాన్యమున్నది. కొన్ని పాఠశాలలో వృత్తి విద్యలకు సంబంధించిన కోర్సులు నేర్పబడుచున్నవి ఆ విధానము ననుసరించియే కావలి, గూడూరు జిల్లాపరిషత్ హైస్కూలులో ఇంజనీరింగు, కమర్షియల్ సబ్జక్టు లును, కస్తూరిదేవి గరల్సు హైస్కూల్లో గృహశాస్త్రమును, అల్లూరులో వ్యవ సాయశాస్త్రమును బోధింపబడుచున్నవి.

**జిల్లాపరిషత్ పాఠశాలలు :**

విద్యా వ్యాపన విషయమున మన జిల్లాపరిషత్తువారు చేయుచున్న కృషి. అమూల్యమైనది. గ్రామప్రాంతములోని బాలబాలికలకు కూడ సెకండరీ విద్యా వసతులు కల్పించుచున్నారు. ఈనాడు మాధ్యమిక పాఠశాలలు 62 ఉన్నత పాఠ శాలలు 49, ఉన్నతోన్నత పాఠశాలలు 9, మొత్తము 120 పాఠశాలలను మనజిల్లా పరిషత్తువారు నిర్వహించుచుండుట సంతోషప్రదము. గత సంవత్సరము వరకు మన జిల్లాలో 94 పాఠశాలలుమాత్రమే యుండెను. విద్యాభిమానులగు శ్రీ నల్లపరెడ్డి. చంద్రశేఖరరెడ్డిగారు పరిషదధ్యక్షులైన ఈ కొలదికాలములో కొత్తగా 26 పాఠ శాలలు స్థాపింపబడినవి. పరిషత్పక్షమున వెంకటగిరిలో బాలికోన్నత పాఠశాల నెలకొల్పబడి విధి నిర్వహణమున కీర్తిగడించు చున్నది. మూడు బాలికల మాధ్యమిక పాఠశాలలు కలవు. అంతేకాక రెండు ఓరియంటల్ హైస్కూళ్లను


ఒక ఓరియంటల్ మిడిల్‌స్కూలును కలవు. కావలి, బుచ్చిరెడ్డిపాళెం, హైస్కూళ్లలో మన భారతీయ నాగరకతకు మూలకందమైన సంస్కృతము కూడ మాతృభాషలో రెండవపార్టుక్రింద నేర్పబడుచుండుట గమనింపదగి యున్నది.

మహమ్మదాపురం హైస్కూలు :

జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఆత్మకూరు తాలూకా మహమ్మదాపురం లోని శ్రీ దొడ్ల శేషారెడ్డిగారి పేర స్థాపింపబడిన హయ్యర్ సెకండరీ స్కూలు ప్రగతి పథమున పురోగమించుచున్నది. శ్రీ దొడ్ల సుబ్బారెడ్డిగారు తన తండ్రి శేషారెడ్డిగారి జ్ఞాపకార్థమై రు, 10,000 లు విరాళమొసగి ఉన్నతస్థానమును నెల్ల



వదాన్యులు :
శ్రీ దొడ్ల సుబ్బారెడ్డిగారు.



మహమ్మదాపుర మండలి
పాఠశాల భవనము.

కొంపిరి శ్రీ దొడ్ల సుబ్బారెడ్డి, ఆనం సంజీవరెడ్డి ఏ. సి. సుబ్బారెడ్డిగార్ల కృషిఫలితముగ ప్రభుత్వమిచ్చిన రు 1, 61, 000 లతోను దొడ్ల సుబ్బారెడ్డిగారి 50, 000 ల విరాళముతోను ససమానమగు హాస్టలు శ్రీమతి శంకరమ్మ, శ్రీ సుబ్బారెడ్డితల్లి గారి పేరట కట్టబడి 310 మంది విద్యార్థులకు వసతి కల్పింపబడి యున్నది. గ్రామములో ఉపాధ్యాయుల గృహనిర్మాణమునకు కృషి జరుగుచున్నది. ఉపాధ్యాయుల కో[illegible] స్టోరును స్థాపించి చౌకగా సామాన్లను అందజేయుచున్నారు. అన్నిటి కన్నను అక్కడ ఉత్సాహవంతులును, యువకులును అగు వారు ప్రధానోపాధ్యాయులుగ నుండుట ఆపాఠశాలా పురోభివృద్ధికి మూలకారణ మనవచ్చును. ఈ పాఠశాల మండలము లోని తక్కిన పాఠశాలలకు, వదాన్యులకు ఆదర్శప్రాయము కాగలదనుటలో సందే

హము లేదు. 1962 లో ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు ఆపాఠశాలను సందర్శించి, అట్టి పాఠశాలాభవనము నెచ్చటను తాము చూడలేదని సెలవిచ్చిరి.

**వాకాడు హైస్కూలు :**

ఈ పాఠశాల కనుబంధముగ 1500 మంది బాలుర భోజన నివాసముల కనువగు హాస్టలు స్థాపింపబడియుండుట ముదావహము. ఆసంస్థకు సంబంధించి యొక హయ్యర్ గ్రేడు ట్రైనింగుస్కూలు కూడ నెలకొల్పబడినది. ఆపాఠశాలయొక్కయు, హాస్టలుయొక్కయు అభివృద్ధికి శ్రీ నేదనూరి బాలకృష్ణారెడ్డిగారి అకుంఠిత కార్యదీక్షయే కారణ మన వచ్చును. వారి త్యాగనిరతి ఇతర విద్యాసంస్థల కాదర్శప్రాయము.

**నెల్లూరు కళాశాల :**

చిరకాలముగ మనమండలమున సెకండరీ విద్య సర్వతో ముఖముగ వ్యాపించి, వృద్ధి పొందుచున్నను, మన జిల్లావాసులు కళాశాలవిద్య నభ్యసింపవలయునన్న ఏ మదరాసుకో, ఏ విశాఖపట్టణమునకో పోవలసి వచ్చుచుండెను. ఆ కష్టమును తొలగించుటకై వేంకటగిరి రాజా స్కూలు 1920 లో సెకండరీ గ్రేడు కళాశాలగ మార్పుకాబడి; అదియే క్రమముగ 1944 లో ఫస్టు గ్రేడు కళాశాలగ పరివర్తన కాబడి నేడు మన మండలమునకెల్ల మకుటాయమానమై యున్నది. రాయసం వేంకటశివుడు, మామిడిపూడి వేంకటరంగయ్య, యం.యస్. రాఘవన్, కే. సచ్చిదానందపిళ్లె మొదలగు విద్యాధను లాకళాశాలకు ప్రధానాచార్యులై వన్నెతెచ్చిరి. మన మండలములోని విద్యావంతులలో ముప్పాతిక మంది ఆకళాశాలా ప్రాతవిద్యార్థులే యనవచ్చును.

**కావలి కళాశాల :**

మండలమున ఉన్నత పాఠశాల లెక్కువైన కొలదియు, కళాశాలలో చదువు బాలబాలికల సంఖ్యయు విస్తారమయ్యెను. మన మండలమున రాజాగారి కళాశాల మాత్రమే యుండుటచేత చాలమంది బాలురు కాలేజి విద్యకై పెరమండలముల కగ్రాకవలసి వచ్చెను. అందుచేత మండలములోని పెద్దలు పెన్నకు ఉత్తర భాగమున వేరొక కళాశాలను స్థాపించుట అవసరమని తలంచిరి. అట్టి వదాన్యుల సంకల్ప బలముచేతనే 2-7-1951 ది కావలిలో 110 పిల్లలతో కావలి కళాశాల (సెకండరీ గ్రేడు కళాశాల) ప్రారంభమయ్యెను. అదియే 1953 లో ఫస్టు గ్రేడు

కళాశాలగ మార్చబడినది. ఇప్పుడా కళాశాలలో 495 మంది బాలురు, 34 మంది బాలికలు చదువుచున్నారు. వదాన్యులగు శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారా కళాశాలకు రు. 50,000 లు వ్యయపరచి చక్కని భవనమును కట్టించిరి. శ్రీ సామి శేషాచలం శ్రేష్ఠిగారు తమ తండ్రి కీ॥ శే॥ ముత్యాలసెట్టిగారి పేరట దాదాపు రు 40,000 లు వ్యయించి చక్కని విద్యార్థి వసతిగృహమును గట్టించిరి. అచ్చట బాలబాలికల విజ్ఞానవినోదముల కనువగు వసతు లన్నియు కల్పింపబడి యున్నవి. ఆ కళాశాల ప్రారంభమున శ్రీ యం. రామానుజరావునాయుడు (ప్రస్తుతము వేంకటేశ్వర విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు) గారును. తర్వాత ఏ. యం. సి. జి. సి. టాంపో, M. A. (రిటైర్డు ఐ. సి. యస్. ఆఫీసరు) ప్రధానాచార్యత్వమును నిర్వహించియుండిరి. కళాశాలాపక్షమున సొగసైన ప్రేక్షకమందిరము, బహిరంగనాటకశాలయు కట్టబడి చూపరుల నాకర్షించుచున్నవి. సుప్రసిద్ధాంగ్లోపన్యాసకులుగ శ్రీ పెద్దాడ రామస్వామిగారు ఆ కళాశాలయందు కొంతకాలము పనిచేసి, సంస్థకు వన్నెతెచ్చిరి శ్రీ తిక్కవరపు, రామిరెడ్డిగారు నెల్లూరు కళాశాలకు రు 25,000 నిధిగా నేర్పాటు చేసి సం 1కి 5/- వంతున వచ్చువడ్డీ రు 1250 లను ఆయాకళాశాలలో జదివి ఉన్నత విద్యాభ్యాసము చేయు పేదపిల్లలకు కులమత విచక్షణ లేక మెరిట్ స్కాలర్షిప్పు లిచ్చుచున్నారు. "త్యాగాయ సంభృతార్థానాం," అనికదా కాళిదాససూక్తి.

శుభోదర్కము :

బుచ్చిరెడ్డిపాళెం పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ దొడ్ల లక్ష్మీనరసారెడ్డిగారు మనజిల్లాలో ఆంగ్లబోధనావిధాన విద్యాలయమును స్థాపించుటకై రెండు లక్షల రూప్యములను విరాళమొసగుటకు వాగ్దానము చేసియున్నారు. ప్రభుత్వము వారుకూడ నిరువదిలక్షలు ఆపాఠశాలకై వ్యయపరచుటకు సిద్ధముగానున్నది.

త్వరలో స్త్రీలకళాశాలకూడ నొకదానిని నెల్లూరులో స్థాపించుటకు తీవ్ర ప్రయత్నములు సాగుచున్నట్లు తెలియుచున్నది. వదాన్యులగు శ్రీ దొడ్ల సుబ్బారెడ్డిగారు రెండు లక్షలు దాన మిచ్చుటకు వాగ్దానము చేసియున్నారు. ఆ రెండు ప్రయత్నములును కార్యరూపము నందిననాడు మన మండలము విద్యారంగమున మరొక అడుగు ముందుకువేసి రాణింపగల దనుటకు నిశ్చయము.

# 5 B.
# నెల్లూరు మండల బోధనాభ్యసన పాఠశాలలు

శ్రీ డి. రామమూర్తి,
ఎం.ఎ., బి.ఇడి.
ప్రభుత్వ ట్రైనింగ్ కాలేజి,
నెల్లూరు.

విస్తీర్ణతను బట్టిచూచినను, జనసంఖ్యను బట్టిచూచినను ఆంధ్రరాష్ట్రము లోని నాల్గు మండలములలో మన నెల్లూరు "కనిష్ఠకాధిష్ఠిత కాళిదాసా" అన్నట్లు ప్రఖ్యాతిగాంచియున్నది. మన మండలమునం దనేక పాఠశాలలు, పలువురు ఉపాధ్యాయులుకలరు గాని, వారిలో కనీసము నాల్గవవంతు శిక్షణ పొందినవారుగ లేరు. ఈ దశ 1934 నాటిదని పాఠకు లెఱుంగ దగును. బాలికా పాఠశాలలయందు పనిచేయు ఉపాధ్యాయినులలో అర్ధాంశము ఉపాధ్యాయ శిక్షణ నందినవారనియే చెప్ప నగును. ఆ కాలమున 42 మంది బాలుర కొక ఉపాధ్యాయుడును, 35 మంది బాలికల కొక ఉపాధ్యాయినియు పాఠశాలలయందు పనిచేయుచుండిరి. 1936 నాటికి ఉపాధ్యాయుల సంఖ్య పెరిగి, 38 మంది బాలుర కొక ఒజ్జయు, 29 మంది బాలికల కొక ఉపాధ్యాయినియు నియమితులై పనిచేయ మొదలిడిరి.

1956 నుండి 500 మంది జనాభాగల ప్రతి గ్రామమున కొక పాఠశాల ఉండవలెనను నిబంధన యేర్పడెను. అంతకు తక్కువ జనసంఖ్య గల గ్రామములకు 27% మాత్రమే విద్యాసంస్థల నేర్పఱుపవలసినట్లు ఆదేశింపబడెను. అప్పుడు ఉపాధ్యాయులు 92.2 శాతము బాలురకును, 99.7 శాతము బాలికలకును వృద్ధికాబడిరి. సుశిక్షితులగు ఉపాధ్యాయులు పాఠశాలలయందు పనిచేయుచున్నందున, బడులలో 30.8 శాతము బాలురును, 30.6 శాతము బాలికలును వృద్ధికాబడిరి. అది మన మండలమునకు యశోభూషణ మనవచ్చును.

మనమండలమునకు ఉత్తర దక్షిణములందుండు గుంటూరు, చిత్తూరు మండలములందు క్రమముగా 35-1; 34-2 బాలురకొక ఉపాధ్యాయినియు పనిచేయుచున్నారు. ఈ సాదృశ్యమును బట్టిచూచినచో మనమండలము ప్రగతిపథమున ఎట్లు పురోగమించుచున్నదియు స్పష్టమగును.

సామాన్యముగ ప్రాథమికవిద్యను గఱపు ఉపాధ్యాయు లెల్లరు మన మండలీయులేయగుటచేత, వారందఱును ఈ బోధనాభ్యసన పాఠశాలయందు శిక్షణ

నందిన వారనవచ్చును. మన మండలమున ఉపాధ్యాయ శిక్షణ (హయ్యర్ సెకండరి) నొసగు పాఠశాలలు మూడును; ఉపాధ్యాయినులకు శిక్షణ నొసగు పాఠశాలలు రెండును గలవు. అవిగాక ప్రత్యేకముగ బి. ఇ. డి. కళాశాలయు కలదు.

చాలకాలముక్రిందట మహాత్మాగాంధి, జమునలాల్ బజాజీగార్లు తమ దక్షిణదేశ పర్యటనలో పల్లిపాటిని సందర్శించుటను పురస్కరించుకొని "బేసిక్ ట్రైనింగు పాఠశాల" బాలురకై స్థాపింపబడినది. అయ్యది నానాట వృద్ధిచెంది మండలమున కెనలేని సేవచేయుచున్నది. ఇటీవల వాకాడులో అట్టిదే శ్రీ యన్. బాల క్రిష్ణారెడ్డిగారు స్థాపించి చక్కగ నడుపుచున్నారు. ప్రభుత్వమువారిచే నడుపబడు నవి 4 అనధికారప్రముఖులచే నడుపబడునవి 3 మొత్తము 7 ట్రైనింగు సెంటర్లు మండలములో పనిచేయుచున్నవి. వానిలో స్త్రీలకేర్పఱుప బడినవి. వానిలో వెంక టగిరి, నెల్లూరు సంస్థలు పురాతనములన వచ్చును.

తొలుత నెల్లూరు సంతపేటలో నుండిన ట్రైనింగు సెంటరును 1956 లో వెంకటగిరికి మార్చి అందు 1956 జులై నుండి బి ఇ. డి. కళాశాలను ప్రారంభించిరి. ఇది వేంకటేశ్వర యూనివర్సిటీకి సంబంధించి యున్నది. ఇందు శిక్షణ నందిన పట్టభద్రులు ఉన్నత పాఠశాలలందును, ఉన్నతోన్నత పాఠశాలలందును పనిచేయుట కర్హులు. ఇది గవర్నమెంటు సంస్థ. అందు వివిధ మండలములనుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులందు దేశపురోభివృద్ధి కనువగుశిక్షణ నందుచున్నారు. ఇది మన మండల సాంస్కృతికావసరముల కాదుకొనుట; బోధనాపద్ధతులను బోధించుటకాక, వృత్తి విద్యలగు, కొయ్య, నేత పనులుకూడ నేర్పుచున్నది.

# 5 C.
# వేదసంస్కృత
# కళాశాలా - నెల్లూరు

మన సింహపురిమునకు వన్నె దెచ్చిన ప్రధానసంస్థలలో శ్రీ వేదసంస్కృత కళాశాల యొకటి. ఇది క్రీ॥శ ౮౮౦ వ సంవత్సరమున శ్రీ వేదం బ్లావెడుస్కీ కరల్ ఆర్కాట్ మహాశయుల ప్రోత్సాహమున క్రీ॥శే॥ శ్రీ ఆయలూరి వెంకయ్యపంతులు గారిచే చిన్న పాఠశాలగ స్థాపింపబడిన మహోన్నత భారతీయ సారస్వత రసాసాలమునకు నా యమృతహృదయులు బీజావాపముచేయ వదాన్య శేఖరులు క్రీ॥శే॥ శ్రీ కుప్పచ్చి లక్ష్మయ్యపంతులు మున్నగు మహనీయులు జీవనదానాదులచే పోషించి క్రమముగ వంకురింపజేసిరి. నాటి పాఠశాలయందు వేదము సంస్కృతకావ్య పాఠములు మాత్రమే బోధింపబడుచుండెను. నాడు పాఠశాలోచితమగు విశాలస్థలము భవనములు లేనందున రాయజీ వీధిలోని శ్రీ శంకర మఠమున మూలపేటలోని శ్రీ వానమామలై మఠమున మొదలగు స్థలములందు నిర్వహింపబడుచుండెను. ఇట్లు 1926 వ సంవత్సరము వరకు సామాన్య పాఠశాలగనే నడుపబడుచుండెను. ఆనాటి ఉపాధ్యాయులలో శ్రీ బసూరి వేంకటాద్రిశాస్త్రిగారు, శ్రీమాన్ కోటికన్యాదానం సుందరరాజ తాతాచార్యులుగారు, శ్రీ వేదం నారాయణసోమయాజులుగారు, శ్రీ కుంపట చలపతిశాస్త్రిగారు, శ్రీ గొట్టుముక్కల సుబ్బరామావధానులుగారు ప్రసిద్ధులు.

పిదప కొంతకాలమునకు వైయాకరణ సార్వభౌములు క్రీ॥శే॥ గాజులపల్లి హనుమచ్ఛాస్త్రిగారు ఈపాఠశాలారథమునకు సారథ్యమును నిర్వహింప నభ్యర్థింపబడి అంగీకరించిరి. నాటినుండి శ్రీ శాస్త్రిగారి యఖండవైదుష్యముచే పాఠశాలయు ఇట్టి విద్యాస్థానమునకు మహాచార్యత్వము లభించుటచే శ్రీ శాస్త్రిగారును "అన్యోన్య శోభాజననాద్బభూవ సాధారణో భూషణభూష్యభావః" అను రీతికి విరాజిల్లిరి. శ్రీ శాస్త్రిగారి యాధిపత్యములో పాఠశాలకు కౌమారావస్థ ప్రారంభమైనది. నాపరస్పరేక్షణలో విద్యాపాటవముతోపాటు విద్యార్థుల సంఖ్యయు నభివృద్ధి కాజొచ్చినది. పాఠశాల రాజాలసౌగంధ్యము లను సుదూర ప్రాంతములకు వ్యాపింపజేసి సారస్వతమధుపిపాసువుల నాకర్షించి భారతీయ విజ్ఞానమును దేశమున నంతట పంచవలయునను కోరికలు రేకెత్తినవి. పరమేశ్వరానుగ్రహమునకు పాత్రములగుటచే నవిదాన త్యాగ సముద్దీపితములైనవి. వెంటనే 1926 లో పాఠశాలను కళాశాల

ముగ నూతనోత్సాహము స్పష్టముగా కనిపించినది. [illegible]
సభ్యులైన శ్రీ శ్రీ. యాదవరెడ్డి రంగారెడ్డిగారు [illegible]
కమిటీ సభ్యులైరి. కళాశాల ప్రిన్సిపాల్ కార్యదర్శి శ్రీ కానుపర్తి సీతాపతిరావు పంతులు,
శ్రీ సంపగిరి లక్ష్మణరావు పంతులు, శ్రీ హనుమచ్ఛాస్త్రిగార్లు కార్యనిర్వాహకు
లుగ నుండిరి.

నెల్లూరు పట్టణమున మూలపేటయందు సువిశాలమైనస్థలము సంపాదింప
బడినది. విజ్ఞాన వ్యాప్తికి విశ్వభవనాదికము కావలసి వచ్చినది. సత్యసంకల్పులు,
త్యాగధనులు కార్యదక్షులునైన మహనీయుల సహకారము లభించినది. శ్రీమత్పర
మహంస పరివ్రాజకాచార్యులు శ్రీ రాజరాజేశ్వరీ పీఠాధిపతులు సంస్థాపకులు శ్రీశ్రీశ్రీ
మలయాళస్వాములవారు శంకుస్థాపనగావించి సంస్థ [illegible]
మరి యాశీర్వదించిరి. శ్రీవారి యాశీస్సులు [illegible]
సంకల్పులైన శ్రీ కానుపర్తి సీతాపతిరావు పంతులు, శ్రీ యాదవరెడ్డి రంగారెడ్డి,
శ్రీ గాజులపల్లి హనుమచ్ఛాస్త్రి, శ్రీ పాములూరి శివరామయ్య పంతులు చిప్ప
గుల కోదండరామయ్య మొదలగు మహనీయుల యవిరళ కార్యదీక్షచే నచిరకాలము
వనే కళాశాలాభవనములు నిర్మింపబడినవి. ఇట్లు కళాశాలాకార్యభారమును అత్యంత
సామర్థ్యముతో నిర్వహించుచున్న వీరికి పలువురు వదాన్యులు సహకరించిరి. శ్రీ మేన
కూరు బలరామిరెడ్డి, శ్రీ కానుపర్తి సీతాపతిరావుపంతులు, శ్రీ టి. వి. శివరామయ్య
పంతులు, శ్రీ చతుర్వేదుల శ్రీరామయ్య మొదలగు వదాన్యులు కళాశాలకును,
పండితులకును కావలసిన భవనములను కట్టించిరి.

విశ్వవిద్యాలయాను బంధము :

క్రీ. శ. 1926 వ సంవత్సరమున ఈ పాఠశాల ఆంధ్రా యూనివర్సిటీవా
రిచే కళాశాలగా గుర్తింపబడి వారి పాఠ్యప్రణాళికను బట్టి పాఠములు బోధింపబడ
సాగెను. కళాశాల విద్యార్థులు వ్యాకరణ, సాహిత్య విద్యాప్రవీణ పరీక్షలకు పంప
బడుచుండిరి. గవర్నమెంటువారి పాఠ్యప్రణాళిక ననుసరించి సంస్కృత ప్రాథమిక,
మాధ్యమిక తరగతులును నిర్వహింపబడు చుండినవి. వేద సంస్కృతములతో బాటు
వృత్తివిద్యలుగూడ ఉండినగాని విద్యాలయము సర్వాంగసంశోభితము కాజాల
దని తలంచి జ్యోతిష, ఆయుర్వేద, ఋగ్యజుస్స్మార్త శాఖలనుగూడ నెలకొల్పిరి.

భోజనశాల :

మొదటినుండియు నీపాఠశాలయందు విద్యార్థులకు భోజనసౌకర్యములుండెడివి. ఇందులకై వదాన్యు లనేకులు దానముల నొసంగియున్నారు. వేణుగోపాల స్వామివారి దేవాలయమునుండియు, రేబాలవారి కుటుంబమునుండియు నార్థిక సహాయము లభించుచుండెడిది. సుమారు 30 మంది విద్యార్థుల కుచిత భోజనసౌకర్యము కల్పింపబడుచుండినవి.

గ్రంథాలయము :

ఈ కళాశాలయందు శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాది గ్రంథములతోడను, కావ్యనాటకాది సాహిత్య గ్రంథములతోడను, ఆంధ్రాంగ్లాది భాషా గ్రంథములతోడను నొక గ్రంథాలయము స్థాపించబడినది. నేడీ గ్రంథాలయమున సుమారు 2300 గ్రంథములు గలవు.

ఉభయభాషాసేవక సమితి :

ఇందు పాఠశాలా విద్యార్థులందరును సభ్యులు. దీనిద్వారా సభలు, సమావేశములు నిర్వహింపబడుచుండును. 1932 వ సంవత్సరమున నప్పటి జిల్లాజడ్జీగారైన రావుసాహెబు, సి.వి. కృష్ణస్వామి అయ్యరుగారు శ్రీ కాళిదాస సమాజమను దానికీ సమితికి అనుబంధ పరచి తదభివృద్ధికై రూ. 116 లను విరాళ మొసంగిరి. 1932 వ సంవత్సరమున నవంబరు 19-20 తేదులలో కాళిదాస జయంతి ఈ సమాజముద్వార జరుపబడినది. నాటి విద్యార్థులు నెల్లూరు పురమందిరమున కాళిదాస శాకుంతలమును ప్రదర్శించి పౌరుల మన్ననలనందిరి. అందు దుష్యంత పాత్రధారి మిడుతూరి గురునాధశర్మగారు. శకుంతలా పాత్రధారి ఆయత్తు సుబ్రహ్మణ్యముగారు. కణ్వ పాత్రధారి ముప్పిరాల వేంకటనారాయణ. శ్రీ సుబ్రహ్మణ్యముగారి అభినయమునకు మెచ్చి శ్రీ సి. వి. కృష్ణస్వామి అయ్యర్ స్వర్ణ పతకమును బహూకరించిరి. ఇప్పటికిని ఈ కాళిదాస జయంతి నిర్వహింపబడుచునే యున్నది.

విద్యార్థి నిధి :

బీదవిద్యార్థుల సహాయము కొరకు శ్రీ హనుమచ్ఛాస్త్రిగారు విద్యార్థి నిధిని స్థాపించిరి. సంక్రాంతి భిక్షజేసి ఇందులకు కావలసిన ద్రవ్యమును సమకూర్చుచుండిరి. ఈ నిధివలన ఇప్పటికిని బీదవిద్యార్థులు తగుసహాయమును పొందుచున్నారు.

**ఆర్థిక క్లేశము :**

1940 వ సంవత్సర ప్రాంతమున నీ సంస్థకు కొన్ని క్లిష్టపరిస్థితులు సంభవించినవి. శ్రీ వేణుగోపాలస్వామివారి దేవాలయమునుండి లభించుచుండిన యార్థిక సహాయము కారణాంతరములచే నిలిచిపోయినది. ద్వితీయ ప్రపంచ సంగ్రామము వలన ఆహారపదార్థాముల ధరలధికములైనవి. అప్పటి ఉపాధ్యాయుల కిచ్చుచుండిన యల్పవేతనములనుగూడ నెలనెలకు నీయజాలని స్థితియేర్పడినది. భోజనశాలను నిర్వహించుట యసాధ్యమైనది. 1946 వ సంవత్సరము నుండియు భోజనసౌకర్యమును నిలిపి స్టైఫండులనీయ నారంభించిరి. ఇట్టి క్లిష్టపరిస్థితులయందును ఈ విద్యాసంస్థను సంరక్షించినవారు నాటి కార్యనిర్వాహణ ధురంధరులు శ్రీ ఇంగువ శ్రీకృష్ణయ్యగారు, శ్రీ కాసుఖేల రామారావుగారు, బ్ర. శ్రీ గాజులపల్లి హనుమచ్ఛాస్త్రిగారు ఆసమయమున వీరు న్యాయవ్యవహార రాజకీయదక్షులతో సంప్రదించిరి. భూస్వాముల నాశ్రయించిరి. అధికారులకు నచ్చజెప్పిరి. దాతలను ప్రోత్సహించిరి. పర్వదినముల యందు భిక్షాటనము గావించిరి. ఎంతజేసినను ప్రభుత్వావలంబనము లేనిదే సంస్థను నిర్వహించుట దుస్సాధ్యమని తోచుటచే రసజ్ఞులు సంస్కృతభాషాభిమానులు, గౌరవనీయులు డా. శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారిని సందర్శించి ఈవిద్యాసంస్థయొక్క ఆర్థిక దుస్థితిని నివేదించిరి. వారును సానుభూతితో తగు సహాయమొనర్ప వాగ్దానము గావించిరి. నేటి యీ సంస్థ అభివృద్ధికి ఆ మహనీయుడే కారకుడు.

**ఇతర శాఖలు :**

ఆంధ్రులకు సంస్కృత సరస్వత్యుపాసన తోబాటు ఆంధ్రసారస్వత సంసేవనముగూడ ముఖ్యమని దలంచి 1950 వ సంవత్సరమున ఆంధ్ర విశ్వవిద్యాలయానుమతితో భాషాప్రవీణ శాఖనుగూడ నెలకొల్పిరి. 1953-54 సంవత్సర ప్రాంతమున ప్రభుత్వ నూతన ప్రణాళిక ననుసరించి కొలది మార్పులతో ప్రాథమిక శాఖను సంస్కృత ఎలిమెంటరీ స్కూలుగను, మాధ్యమిక శాఖను సంస్కృతోన్నత పాఠశాలగను రూపొందించిరి. పిమ్మట ఈకళాశాల 1952 వ సంవత్సరమునుండి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమున కనుబంధింపబడినది. కావున తదనుసారముగ సాహిత్యవ్యాకరణ శిరోమణి తరగతులును, A,B, విద్వాన్ తరగతులును నిర్వహింపఁబడుచున్నవి.

**నాటి పండితులు :**

విద్యాభూషణ, వైయాకరణకేసరి, బ్ర శ్రీ గాజులపల్లి హనుమచ్ఛాస్త్రిగారు (ప్రిన్సిపాల్.) శ్రీమాన్ కవితార్కికసింహం గోవిందాచార్యులుగారు

వ్యాకరణ శిరోమణి-మైసూరు విద్వాన్, శ్రీమాన్ సహాదూపు రంగరామానుజాచార్యులుగారు. శిరోమణి. బ్ర శ్రీ. N. N. హరిహరశాస్త్రి M. A. గారు ఆయుర్వేదాచార్య - బ్ర శ్రీ పులగుండ్ల, నరసింహశాస్త్రిగారు. జ్యోతిశాస్త్రవిశారదులు. బ్ర శ్రీ. నజ్ఝల - గురుమూర్తిశాస్త్రి గారు. ఋగ్వేదక్రమపాఠి. బ్ర. శ్రీ. గొట్టుముక్కల సుబ్రహ్మణ్యావధానిగారు. యజుర్వేద క్రమపాఠి. బ్ర శ్రీ. సింగరాజు, వెంకటేశ్వరవధానులు గారు.

ఈ సంస్థ సాధించిన యభ్యుదయము :

ఇప్పటికి సుమారు 500 మంది విద్యార్థులు ఈ కళాశాలయందు విద్య నభ్యసించి వ్యాకరణ, సాహిత్యవిద్యాప్రవీణ, భాషాప్రవీణ, శిరోమణి విద్వాన్ పరీక్షలయందు కృతార్థులై యాంధ్ర దేశమునందేగాక యితరప్రాంతములయందుగూడ నధ్యాపకులై భాషాసేవ యొనర్చుచున్నారు. అందు సర్వప్రథములుగ విశ్వవిద్యాలయ పరీక్షలయం దునుత్తీర్ణులైనవారు - సాహిత్య విద్యాప్రవీణ, శ్రీ గుడిమెళ్ళ వీరరాఘవాచార్యులు (పర్లాకిమిడి).

వ్యాకరణ విద్యాప్రవీణ, విద్వాన్ శ్రీ ఊటుకూరి ఆంజనేయశర్మ M. A. Prof. & Head of the Telugu Department B. T. college Madanapalle (A. P)

సాహిత్య విద్యాప్రవీణ, విద్వాన్ శ్రీ M. జానకిరామిరెడ్డి, సంస్కృతోపన్యాసకులు V. R. college

వ్యాకరణ ప్రవీణ ఉపద్రష్ట వేంకటరామయ్య B. A. సీనియర్ తెలుగు పండితులు S. K. P. V. V. హిందూహైస్కూలు Vijayawada

సాహిత్య విద్యాప్రవీణ, భాషాప్రవీణ శ్రీమాన్ K. వెంకటాచార్యులు B. A. సంస్కృతోపన్యాసకులు Narasapuram College.

భాషాప్రవీణ సాహిత్యవిద్యాప్రవీణ కుమారి శ్రీ W. ఛాయాదేవిగారు.

సాహిత్య శిరోమణి శ్రీ చుండి శేషగిరిరావుగారు. సంస్కృత పండితులు. ఓరియంటల్ మిడిల్ స్కూల్ తణుకు.

పరిశోధనశాఖ :

ఈసంస్థయందు పరిశోధన శాఖయు గలదు. మొదటి పరిశోధకులు ఊటుకూరి ఆంజనేయశర్మ M. A. వీరీకళాశాలయందు (1938 - 39 - 40) రెండు సంవత్సరములు ప్రభుత్వమువారి Post graduate research scholarship తీసుకొని (బ్ర. శ్రీ. గాజులపల్లి హనుమచ్ఛాస్త్రిగారి పర్యవేక్షణక్రింద) పాణినీయవ్యాకరణ శాస్త్రమున పరిశోధన గావించి ప్రాచీన మతెదూషణోద్ధార మనువ్యాసమును ప్రకటించిరి.

కుమారి W. ఛాయాదేవి: ప్రకృతమీమె సెంట్రల్ గవర్నమెంటు వారి స్కాలర్‌షిప్ పొందుచూ "సంస్కృ సాహిత్యం, తెలుగు సాహిత్యంచ" అను విషయమును పరిశోధన గావించుచున్నారు.

నేటి పండితులు :

1956 వ సంవత్సరమున బ్ర. శ్రీ హనుమచ్ఛాస్త్రిగారు స్వర్గస్థులైన పిమ్మట న్యాయశిరోమణి విద్వాన్ బ్ర శ్రీ ఉడాలి సుబ్బరామశాస్త్రి యం. ఏ. గారీ సంస్థకు నధ్యక్షులై మిక్కిలి శ్రద్ధతో కార్యభారమును నిర్వహించుచున్నారు. ప్రకృత మీ కళాశాలయందు నేడుగురు నుపన్యాసకులు సాహిత్య, వ్యాకరణ శిరోమణి A,B విద్వాన్ పరీక్షలకు పాఠములను బోధించుచున్నారు.

వ్యాకరణ విద్యాప్రవీణ, భాషాప్రవీణ బ్ర. శ్రీ పుష్పగిరి వేంకటకృష్ణశాస్త్రి.

సాహిత్య విద్యాప్రవీణ భాషాప్రవీణ బ్ర. శ్రీ తంగిరాల శ్రీరామమూర్తిశాస్త్రి.

వ్యాకరణ శిరోమణి విద్వాన్ బ్ర. శ్రీ నేలభొట్ల కోటయ్యశాస్త్రి.

వ్యాకరణ శిరోమణి శ్రీ మాన్ కిడాంబి వేంకట నరసింహాచార్యులు.

సాహిత్యవిద్యా ప్రవీణ భాషాప్రవీణ ఆయుర్వేద విశారద శ్రీమాన్ చిలకపాటి శ్రీ నివాసాచార్యులు సాహిత్యవిద్యా ప్రవీణ భాషా ప్రవీణ శ్రీయుతులు అకెళ్ళ అచ్చన్నశాస్త్రి.

సాహిత్యవిద్యాన్ ప్రవీణ. శ్రీ K. S. రామానుజాచార్యులు.

బ్ర శ్రీ A. కృష్ణమూర్తి ఘనపాఠి. యజుర్వేదోపాధ్యాయులు.

బ్ర శ్రీ కేసరి - కోదండరామయ్య గారు (ఋగ్వేదస్మార్తోపాధ్యాయులు)

బ్రి శ్రీ వావిలాల సుబ్రహ్మణ్యముగారు (యజుర్వేదోపాధ్యాయులు.)

నిగమనము :

1882 వ సంవత్సరమున నొక చిన్న పాఠశాలగ ఏర్పడిన ఈ సంస్థ నేటికీ విధముగ సంస్కృత ప్రాథమిక, ఉన్నతపాఠశాలా కక్షలతోడను కళాశాలా కక్ష లతోడను బహుముఖముగ సంస్కృత భాషాసేవ గాంచుచు మండలమున కెనలేని కీర్తి పతాకగ విరాజిల్లు చున్నది.

ఈ వ్యాసమును కళాశాలోపాధ్యాయులగు
శ్రీమాన్ కె. రామానుజాచార్యులుగారు
మా కోరికపై రచించిరి.

కవుల వినోదనామములు :

తాల రత్నాకర (హరవిజయ కావ్యకర్త)

అస్తావలంబి రవిబింబ తయోదయాద్రి చూడోన్మిషత్సకల చంద్రతయాసాయమ్.
సంధ్యా ప్రనృత్తహరవాద్య గృహీత కాంస్యతాలద్వయేన సమలక్ష్యత నాకలక్ష్మ్యాః

క్రీడా చంద్ర ।

చ్యుతామిన్దోర్లేఖాం రతికలహభగ్నం చవలయం
ద్వయం చక్రీకృత్య ప్రహసితముఖీ శైలతనయా
అవోచద్యం పశ్యేత్యవతు స శివః సాచగిరిజా
సచక్రీడా చంద్రో దశనకిరణా పూరితతనుః.

ఇతిహాసపురాణాభ్యాం వేదార్థముప బృంహయేత్
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రతరిష్యతి.

యఈశిరే భువనస్య ప్రచేతసో విశ్వస్య స్థాతుర్జగతశ్చమన్తవః
తేనః కృతాదేన సస్పర్యద్యా దేవాసః పిపృతా స్వస్తయే.

— ఋ. X - 63; 8

# 5 D
# కళావేత్తలు

శ్రీ యస్. సంజీవదేవ్
తుమ్మపూడి

స్వర్గీయ పిట్టమండలం వేంకటాచలపతి (డా॥ పి. వి. పతి)

(వీరు నెల్లూరు మండలీయులు. స్వగ్రామమును గూర్చిన మరే వివరములు తెలియరాలేదు. వారినిగూర్చి, కళావేత్త, చిత్రకళా విశారదులు, లోకమంతు మంచినే చూడగల్గిన యోగి, శ్రీ యస్. సంజీవ దేవ్‌గారు ఇట్లువ్రాసి, మన సర్వస్వమున కొరకు శోభనుగూర్చినారు.)

ఇక్కడ తాను నివసిస్తూ ఫ్రాన్సులో వుంటూన్న ఫ్రెంచి భార్యనూ, ఇద్దరు పుత్రులనూ నిత్యము స్మరిస్తూ, తాను అక్కడకు వెళ్ళి వారితో వుండడమా లేక వారు ఇక్కడకువచ్చి తనతో వుండడమా అని తేల్చుకోలేక ఒక నిర్ణయానికి రాకముందే డా. పి. వి. పతి (పిట్టమండలం వేంకటాచలపతి) అనారోగ్యంతో బాధపడుతూ కొంతకాలం క్రిందట మద్రాసులో భౌతికశరీరాన్ని విసర్జించాడు. ఆయన పూర్వులది నెల్లూరు మండలం.

అంతర్జాతీయ ఖ్యాతిగడించిన గొప్ప డాక్యుమెంటరీ ఫోటోగ్రాఫర్, చక్కని ఫ్రెంచిరచయిత. అంతకంటే చక్కని ఇంగ్లీషు వ్యాసకర్త, ఆంధ్రప్రముఖుడు, డాక్టర్ పతి. తెలుగునాటకరంగాన్ని గురించి థీసిస్ (ఫ్రెంచిలో) వ్రాసి పారిస్‌లోని లోక విఖ్యాతమైన సార్‌బాన్ విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ ఆఫ్ లిటరేచర్ పొందిన ప్రథమఆంధ్రుడు. గొప్పప్రాచ్యవేత్తలగు ప్రొఫెసర్ సిల్వేన్ లీవీకి పతిసన్నిహిత శిష్యుడు. డాక్టర్ పతి నిర్మించిన డాక్యుమెంటరీ చలన చిత్రాలు సెల్యూలాయిడ్‌లో భావగీతాలు! వెనక ఆయన తీసిన "where the Jumuna Flows" అనే డాక్యుమెంటరీ నిజంగా ఒక గొప్ప కళాఖండం, నైసర్గికశోభ అందులో నవ కాంతుల్లో, నవ్యరూపాల్లో, అభివ్యక్తమైంది. యమునానదికి అందులో దివ్యత్వం ప్రసాదించబడింది. ఈ చలనచిత్రాన్ని న్యూయార్కులోని యునైటెడ్ ఆర్టిస్టు కార్పొరేషన్‌వారు విడుదల చేశారు.

యాంత్రిక సాంకేతిక నైపుణ్యం, భాషాపాండితి, భావసౌకుమార్యం, కళాసృష్టి, విశాలదృష్టి, ఒకేవ్యక్తిలో తగుమాత్రంగా ప్రస్ఫుటమైవుంటే ఆవ్యక్తి ఏది నిర్మించినా కళాఖండంకాకుండా వుండలేదు.

భారతదేశానికి తిరిగివచ్చిన తరువాతనుంచి మరణించేవరకు ఎన్నెన్నో అద్భుతమైన డాక్యుమెంటరీ చిత్రాలను సృష్టించాడు. చలన చిత్రాన్ని తీయటంలో ఎంత నైపుణ్యం ప్రదర్శించేవాడో స్థిరచిత్రాన్ని (Stills) తీయటంలో కూడ అంత నైపుణ్యం కనపరచేవాడు. యునైటెడ్‌నేషన్సుకూ, భారతప్రభుత్వానికీ

ఇంకా ఇతర విదేశాలవారికీ ఎన్నో డాక్యుమెంటరీలు తీసి యిచ్చాడు. కొండల్లో కోనల్లో, గుట్టల్లో, చెట్లల్లో, చేమల్లో ఎక్కడెక్కడో తిరిగి ఇతర్లు చూడలేని నూతన సౌందర్యాన్ని వాటిలో దర్శించి దాన్నంతా తన కళాకౌశలంద్వారా, సాంకేతిక నైపుణ్యంద్వారా ఇతర్లను దర్శింపచేసేవాడు!

తన నిశిత సాహిత్యజ్ఞానం ఇలాంటి నిర్మాణాలలో ఎంతగానో తోడ్పడేది. ఆయన రంగు ఫోటోగ్రాఫీలో ప్రత్యేక కృషిచేశాడు. విదేశాలలోని అనేక పత్రికల్లో ఆయన వ్యాశాలతో సహా ఆయనతీసిన రంగుఫోటోగ్రాఫులు ప్రకటితమవుతుండేయి. భారతీయ పత్రికల్లోకూడా ఆయన తీసిన నలుపుతెలుపు ఫోటోగ్రాఫులు విరివిగా ప్రకటించబడేయి. తన చిత్రనిర్మాణంలో వెలుగునీడలకెంత విలువనిచ్చేవాడో రచనా చమత్కారానికికూడ అంత విలువనిచ్చేవాడు ఏవస్తువు ఎటుండాలి, ఏది వెనకుండాలి, ఏది మధ్యవుండాలి, ఖాళీస్థలాన్ని రసాత్మకంగా ఎలా రచనాత్మకం చేయాలి, అనే మర్మాలు ఆయనకు కరతలామలకాలు.

బర్మాషెల్ కంపెనీకి తీస్తున్న "మాన్‌సూన్" అనే రంగులచిత్రం అది. దానికి కథ వ్రాసింది డాక్టర్ ముల్కరాజ్ ఆనంద్. ఆకథా సందర్భంలో ఆంధ్రగ్రామాన్ని సృష్టించాడు అందులో. ఆగ్రామదృశ్యాన్ని తీయడానికే పతిగారి తుమ్మపూడి ఆగమనం. నాలుగైదు రోజులపాటు తుమ్మపూడిలోని వివిధదృశ్యాలనూ తీశారు. వేళకు నిద్రా భోజనం వుండవు ఆయన పని ప్రారంభిస్తే. బుద్ధిజీవి అయిన డాక్టర్‌పతి శ్రామిక జీవిలాగా పనిచేస్తాడు తన చలనచిత్ర, కేమెరాదగ్గర!

రాత్రులు వెన్నెలలో అటూ ఇటూ తిరుగుతూ ఎన్నోవిషయాలను గురించి-టెన్నిసులు మొదలు మరణాంతర సైన్సులు వరకూ-చెప్తూండేవాడు ఉల్లాసంగా. ఆయనకు ఆధ్యాత్మికవిషయాలపై మొగ్గుహెచ్చు. ఫ్రెంచి మిస్టిక్ కవులూ కవయిత్రులూ వాళ్ల ఆనందమయ కవితలూ మొదలైన విషయాలను గురించి ఎంతో గాఢంగా చెప్పేవాడు. భౌతికవిజ్ఞానం ఎంతగానభివృద్ధిల్లినా దానితో సమానంగా ఆత్మజ్ఞానం కనుక లేకపోయిందా అంటే అదంతా అజ్ఞానమే అవుతుంది అనేవాడు.

శబ్దంలోనూ, రూపంలోనూకూడ సమానంగా రసదృష్టి కలిగి రససృష్టి చేసిన రూప నిర్మాత, సాహితీసంపన్నుడు స్వర్గీయ డాక్టర్ పి వి. పతి!

# 6 A

# నెల్లూరు మండల ప్రముఖులు

### శ్రీ మరుపూరు కోదండరామిరెడ్డి.

~~~~

## యరగుడిపాటి వేంకటాచలము పంతులు

వీరి తల్లిదండ్రులు:- రఘుపతియమ్మ, అప్పయ్య. విద్య:- సంస్కృతము నభ్యసించిరి. సంగీతాభినివేశము గలదు. శిల్పము, వాస్తుప్రకరణములను తెలిసినవారు. వేదాంతశాస్త్ర మభిమాన విద్యగా నేర్చిరి. తెలుగున కవిత్వము వ్రాయుటయు వీరి కలవాటు. ''విష్ణుమాయా విలాస''మను గ్రంథమును రచించిరి. ఉద్యోగము:- వీరు జిల్లాకోర్టు శిరస్తాదారుగ పనిఁజేసిరి. ఉద్యోగధర్మ నిర్వహణమున నిపుణులని పేరొందిరి. భాషాంతరీకరణము చేయుటలో నేర్పుబడసిరి. కృతులు:- ముకుందశతకము, రాసక్రీడ, సీతారామచంద్రమానస పూజ అనునవి రచింపబడెను. ఇందలి రచన భక్తియుక్తమై భాషాలాలిత్యము కలిగి, రసస్ఫూర్తిగ నుండును. చేసినపనులు:- నెల్లూరు రంగనాయకులపేటలో చిత్రకూటము, గోపురము, సత్రము, రాయజీవీధిలో శంకరమఠము, శ్రీ వేదగిరి నరసింహస్వామివారి రథము, పుణ్యకోటి విమానము వీరే నిర్మింపజేసిరి. వీరి యర్ధాంగలక్ష్మి సీతమ్మ.

## వెన్నెలగంటి సుబ్బారావు పంతులు

జననము 28-11-1784. మరణము 1-10-1839. తల్లిదండ్రులు:- వెంకమ్మ, జోగన్న. ఆరువేలనియోగిబ్రాహ్మణులు. శ్రీ సుబ్బారావు ఆంగ్లమున మంచి యభినివేశము కలవారు. వీరు కోర్టులో ద్విభాషిగను, ఇంగ్లీషు రైటరుగను నుండిరి. వీరు సాంసారిక కష్టసుఖములను కృష్ణశుక్ల పక్షములవలె భావించి, కాలమొక్కరీతిగ గడపిన ధీరహృదయులు. వీరు కర్ణాటకభాషా వ్యాకరణమును రచించిరి. అరవము, కన్నడము, మహారాష్ట్రము, హిందూస్థానీ, ఇంగ్లీషు భాషలలో పాండిత్యము కలవారై భాషాంతరీకరణము చేసెడివారు. బాలుర కుపయోగించు వాచకములను రచించిరి. పనులు:- చాకిచర్లకు
~~~~

సమీపమున నొక ధర్మసత్రమును కట్టించిరి. ఉద్యోగ ధర్మమున పేరొందిన వారై, న్యాయస్థానములో దేశభాషల నెఱుగనివారికి మహోపకారులైరి. ఆంగ్లమున స్వీయచరిత్రను బ్రకటించిరి. వారియిల్లు రాయజీవీధి ఆంజనేయ దేవాలయమున కెదుట నున్నది.

## మహమ్మద్ రహమతుల్లాసాహెబు మర్హూం

జననము 1820. తల్లిదండ్రులు: అచానాబీబీ, హాఫీజ్ మీరాన్ సాహెబు. వీరి మొదటిపేరు ఖుదరతుల్లా. వీరు బాల్యమునుండియు విద్యాసక్తిగలిగి ఉర్దూ పార్శీ, అరబ్బీ భాషలలో నాయా మున్షీలవద్ద శ్రద్ధగా చదివి పాండిత్యము గడించిరి. వీరు శ్రీ వేంకటగిరి రాజాగారి సంస్థానమున దివాన్జీగా నియమితులైరి. భూసంబంధ వ్యవహారములను విచారించి, రైతుల కుపకారమొనరించిరి. చెరువులకు, జలాధారముల కల్పించిరి. నెల్లూరు చిన్నబజారులో 'కలశమహల్' అను సుందర భవనము నిర్మించిరి. రసవత్తరమైన కవిత వ్రాసెడివారని పార్శీ లాక్షణికులు ప్రశంసించిరి. వీరు చేసిన పనులలో స్థిరస్థాయియైనది శ్రీ వేంకటగిరి రాజా పాఠశాలకు భవనదానముచేసి నిర్మించుట యనదగును. వీరు మక్కాయాత్ర చేసియుండుటచే 'హాజీ' అని పిలువబడెను. వీరు వినయమూర్తులై, పరోపకారపరాయణులై ప్రసిద్ధినొందిరి.

## సుంకు నారాయణస్వామిశెట్టి, B.A.,

జననము 1852 ఏప్రెల్. తల్లిదండ్రులు:- లక్ష్మిదేవమ్మ, చెంగల్వరాయశెట్టి. నెల్లూరులో మొదటి B. A., అగుటచే B.A. నారాయణశెట్టి అని వ్యవహరింపబడిరి. నెల్లూరులో వర్ణాక్యులర్ స్కూలును స్థాపించిరి. అద్దియే నేడు 'వేంకటగిరి కాలేజ' అనబడుచున్నది. వీరిందు మొదట ప్రధానోపాధ్యాయులుగ నుండిరి. వీరు కొన్నాళ్లు జిల్లాకోర్టు ప్లీడరుగ పనిచేసిరి. స్వభావముచే వీరు మహాదర్పము గలవారు. స్కూలులో వీరియాజ్ఞ సుగ్రీవాజ్ఞగ నుండెడిది. 'వైశ్య', 'లాయలిష్టు' అను పత్రికలను స్థాపించిరి.

## కంటాబత్తుని పాపిరెడ్డి

వీరు మంచి రూపవంతులు. వీరికి గుఱ్ఱపుస్వారియందు మిగుల ప్రీతి. పుస్తకపాండిత్యముకన్నా లోకానుభవము వీరికి మిన్న. వీరుచేసిన పనులు:-

(1) మూలస్థానేశ్వరస్వామి ధ్వజస్థంభము శిథిలమైయుండ నూత్న ధ్వజప్రతిష్ఠ జేసిరి. (2) భువనేశ్వరీదేవ్యాలయము నుద్ధరించి పునర్నిర్మాణము గావించిరి. (3) మూలస్థానేశ్వరాలయ జీర్ణోద్ధారణముచేసి అందముగ కట్టించిరి. (4) పుష్కరిణికి రాతికట్టడములు కట్టించిరి. (5) మహాగణనాథుని స్థూలవిగ్రహ మును తూర్పునకు జరిపి త్రినేత్రదృష్టి తిలోధానముగ గట్టించిరి. (6) మూల స్థానేశ్వరాలయమునకు పూర్వోత్తర దిగ్భాగమున నొక యగ్రహారమున తొమ్మిది యిండ్లు కట్టించి వేదమూర్తులగు బ్రాహ్మణుల కర్పించిరి. (7) వేణు గోపాలస్వామి ప్రతిష్ఠ జరిపించి, గోపుర ప్రాకారముల నిర్మించిరి. (8) శ్రీరంగ నాయకుల గోపుర శంఖుస్థాపనం జేసి ద్వారమును పూర్తి చేసిరి. (9) నెల్లూరు వేదసంస్కృత పాఠశాల కెంతో సహాయము చేసిరి.

## వెలగపూడి సుందరరామయ్య పంతులు, M.A.,B.L.,

వీరు సుందరరామయ్య, రంగమ్మగారల పుత్రులు. దేహపుష్టి కలిగి స్ఫురద్రూపులై యుండిరి. మద్రాసులో యూనివర్శిటీ స్థాపించబడిన తర్వాత మొట్టమొదట వీరు ఎం.ఏ., పట్టమును పొందిరి. తర్వాత బి.ఎల్., పరీక్షలో నుత్తీర్ణులైరి. వీరు రిజిస్ట్రార్ జనరలుగను, డిస్ట్రిక్టు మునిసిబుగను నుద్యోగము చేసిరి. నిరాడంబర వేషధారణము గలిగి, సంస్కృతభాషను నేర్చి, ఖగోళ పరిస్థితులను తెలిసికొనిరి.

## రావుబహదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డిగారు

వీరు 1868 లో రేబాల పట్టాభిరామరెడ్డి, అక్కమ్మ గారల కుద్భ వించిరి. వీరు గొప్ప భూస్వాములు, దాతలు. నెల్లూరు టౌన్‌హాలు నిర్మించినది వీరే. శ్రీ వేదము వేంకట్రాయశాస్త్రిగారిచే రచించిన శృంగార నైషధ కావ్య సర్వంకషవ్యాఖ్య నచ్చొత్తించుటకు వలసిన ధనము నిచ్చిరి. రంగనాయక స్వామి యాలయమున శిలామంటపమును గట్టించిరి. అమెరికన్ ప్రసూతి చికి త్సాలయమున వసతిగృహముల కట్టించిరి. దీనులకు నిరతాన్న దానము చేయు టకు మున్సిపాలిటీకి కొంత ధనమిచ్చిరి. 30-10-1917 లో వీరు దివంగతులైరి.

## శ్రీమాన్ ముప్పరాల చిననరసింహాచార్యులు

వీరు 22-12-1858 లో జన్మించిరి. జన్మస్థానము కోవూరు తాలూకా లోని నాయుడిపాళెము. వీరు మొదట నాంగ్లము నభ్యసించి తర్వాత భగవ

కుపాధ్యక్షులుగా నుండినను మిత్రుడు బెజవాడ రామచంద్రారెడ్డిగారితో గలసి వస్త్రధారణమందు జంటనాయకు లనిపించుకొని, జస్టిస్‌పక్ష వాసనలు కలిగి యుండిరి. మాంటుఫర్డ్ రిఫారముల తర్వాత ఢిల్లీ శాసనసభకు నెల్లూరు నిర్వాచన క్షేత్రమునకు సభ్యులుగా నెన్నుకొనబడిరి. కొంతకాలము జిల్లాబోర్డున కధ్యక్షులుగా పనిఁజేసిరి. కాంగ్రెసు పక్షములోఁజేరి శాసనసభకు పోటీచేసి ఓడిపోయిరి. వీరు పక్షవాతముచే మరణించిరి; అనగా భూతలకలుషమును కడిగికొని పోయిరేమో అని యనిపించుచున్నది.

## కాకుటూరు వెంకట్రమణారెడ్డి

అధివక్తగా పనిచేసిన వీరు గోవిందరెడ్డిగారికి ముందు ఢిల్లీ శాసనసభకు మండల ప్రాతినిధ్యమును వహించియుండిరి. సరసులు, హాస్యరసప్రియులు.

## పొణకా పట్టాభిరామరెడ్డి

మినగల్లునందలి పొణకా మల్లారెడ్డి, వెంకటసుబ్బమ్మగారల పుత్రుడు. పొణకా కనకమ్మగారి మఱది. అన్న సుబ్బరామరెడ్డిగారి (కనకమ్మభర్త) పోట్లపూడిచేరి ఆనాడు మండలమున పుట్టిపెరిగిన అన్న అభివృధ్యున్ముఖ జాతీయోద్యమములకు పోట్లపూడిని పురిటిల్లు చేసినారు. గ్రంథాలయోద్యమమున పాల్గొని 'వివేకానందస్వామి గ్రంథాలయమును సాంఘిక రాజకీయాభివృద్ధికి' సుజనరంజనీ సమాజమును నెలకొల్పి, ఉత్సాహవంతులైన మిత్రబృందముతో మండలమునకేగాక రాష్ట్రమున కంతటికిని, యీ కుగ్రామమును నాయకమణిని చేసినారు. ఆంధ్రోద్యమమునకు పట్టుకొమ్మ అగుటయేకాక, ఆనాటి వంగ విప్లవోద్యమమునకుగూడా యిచట నవమెత్తి ప్రాకినది. స్వర్గీయులు సి. వి. కృష్ణ, నెట్టూరు వెంకట్రామానాయుడు, వెన్నెలకంటి రాఘవయ్య, గండవరపు హనుమారెడ్డి, పాటూరు సుబ్బరామయ్య, మరుపూరు పిచ్చిరెడ్డి, వేమూరు లక్ష్మయ్య మొ॥ వారందఱు యీ తిరుగుబాటు బడిపిల్లలే! పొణకా కనకమ్మగారు వీరందఱికి తల్లిగా, అక్కగా, యీ యుద్యమములకుతోడ్పడి తన కుటుంబాన్ని, మాతృదేవత పూజాపీఠమున సమర్పించినది. విశాఖపట్ణం మొదలు మద్రాసు వఱకు సుజనరంజనీ సమాజ వార్షికోత్సవములందు పాల్గొనుటకురాని, పేర్గాంగాచిన ఆంధ్రుడు లేడు. ఆచార్య రాయప్రోలు సుబ్బారావు పొణకావారి యాతిథ్యమును స్వీకరించుచునే 'అమరావతీపట్టణాది' రసవత్తర ఖండ కావ్యముల రచించినారు.

పట్టాభిరామరెడ్డి రాజకీయ సంస్కరణల విషయమై విచారించుటకు దేశము పర్యటించిన యిండియా కార్యదర్శి 'ఎడ్విన్ మాంటెగు' గారిని ఢిల్లీలో కలిసికొనిన ప్రాతినిధ్యవర్గమునందు సభ్యులుగా పనిచేసిరి. స్వదేశీయోద్యమవృద్ధికి పోట్లపూడిలో చేనేతసంఘమును స్థాపించియుండిరి.

## సి. వి. కృష్ణ

ఈ చతుర్వేదుల వెంకటకృష్ణయ్యగారు రాఘవయ్యగారి యేకైక పుత్రుడు. బ్రహ్మచారి, వీరు మద్రాసునందు H. V. కృష్ణ (గాడిచర్ల హరిసర్వోత్తమరావు, చిలుకూరు వీరభద్రరావు, చతుర్వేదుల వెంకటకృష్ణ) అను మూర్తిత్రయమువారు స్థాపించిన ఒక పబ్లిషింగ్ సంస్థను నెలకొల్పి తెలుగు పుస్తకాల ముద్రణమునకు తీరుతెన్నుల జూపిరి. ఆనాడు యీ కంపెనీ అచ్చు వేయని పుస్తకమునకు యోగ్యతాపత్రమే అబ్బెడిదికాదు.

కృష్ణ నెల్లూరునకు తిరిగివచ్చి పల్లిపాడునందు గాంధీ యాశ్రమమును స్థాపించిరి. దీనికి వలసిన ఆర్థికసహాయమును తను, పొణకా కనకమ్మగారే చేసిరి. వీరు ఆనాడు రహస్య విప్లవోద్యమమునకు కావలసిన ఆయుధములను, వాఙ్మయమును, నెల్లూరు మండలమునకు సమకూర్చుచుండిరి. చివరకు వేదాంతియై, అరవిందయోగి శిష్యులై పుదుచ్చేరి యాశ్రమమున పలుకుబడికలిగి వ్యవహారమును నిర్వహించుచు, పక్షవాతోపహతులై యీమధ్య మరణించిరి.

## అన్నదేవుల గోవిందరెడ్డి

వీరు మూలపేటలోనివారు. సరస్వతీ సమాజమును రిక్రియేషన్ క్లబ్బును నడిపి మూలపేట వాతావరణమును సజీవము చేయుచుండిరి. లక్ష్మీనరసారెడ్డి పురమందిరమునకు చాలకాలము ఉపాధ్యక్షులుగా నుండిరి. గాలివాన తరువాత ఆ మందిరమునకు జరిగిన జీర్ణోద్ధారణమునకు వీరు చాల శ్రద్ధచూపిరి. యాహ్యాలీసాహెబు మున్సిపల్ చైర్మన్‌గా నున్నంతకాలము రెడ్డిగారు వైస్ చైర్మన్ పనిచేసి చివరకు చైర్మన్ గూడా అయిరి.

## రామిశెట్టి సుబ్బానాయుడు

శరభలింగంనాయుడుగారి పుత్రుడు. వరిగొండలో పుట్టిన యీ నాయుడుగారు పదవీ నిశ్రేణిలో మొదటిమెట్టు మొదలు కడపటి మెట్టువరకు

నెక్కఁగలిగిన అపూర్వ అదృష్టవంతులలో నొకరు. రెవిన్యూ గుమాస్తాగా ప్రారంభించిరి. చివరకు మద్రాసు కార్పొరేషన్ కమీషనరుగా, కుచ్‌బిహారు సంస్థానాన దివాన్‌గా, మలయాలో ఇండియా యేజెంటుగా పనిచేసి యీ మధ్యనే మరణించిరి. వీరి కుమార్తె భర్తయే ప్రస్తుతము హైకోర్టు జడ్జి కె. వి. ఎల్. నరసింహంగారు.

## రేబాల పట్టాభిరామరెడ్డి

నరములేని చేతితో దానముచేసి వారల పెద్దల వంశగౌరవమును నిలిపి ముప్పదియేండ్లు నిండకమునుపే చనిపోయిన, వీరు మండల ప్రముఖులలో ప్రముఖులు. వీరు వీరిసోదరులు 1927 లో గాలివానలో పడిపోయిన పుర మందిరమును (వీరి పెదతండ్రి లక్ష్మీనరసారెడ్డిగారు నిర్మించినది) పునర్నిర్మాణము గావించి పట్టణశోభకు వెలితి లేకుండా చేసిరి.

## రావికొలను నరసింగరావు

వీ రధివక్తలుగా నుండి ఆకాలపు పాత తాలూకా బోర్డుకు ప్రెశి డెంటుగానుండిరి. జాతీయాభిమాని. వంగ విప్లవమునందు పాల్గొని రహస్య ముగా పుదుచ్చేరికి పయనించుచుండిన అరవిందఘోషుగారికి నెల్లూరునుండి పుదుచ్చేరి చేరు ఖర్చులను, యిచ్చిన గుప్తదాత వీరు.

## సౌదాగర్ మహబూబ్‌ఖాన్

ఒక సర్వసామాన్యునివలె జీవితము ప్రారంభించి, మండలములో బస్సు ఓనర్లలో పెద్దవాడై అనేక వ్యాపారములలో అదృష్టదేవత ఆదరించగా కోటికి పడగెత్తిన గుణవంతు డితడు. చాల టరములు మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌గా నుండి శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారు మంత్రికాగా, వారిస్థానే ఛైర్మనై 1963 ప్రారంభమున మరణించిరి. వీరు కాంగ్రెసు ఉద్యమమునకు లీగు ఆందోళన దినములలో గూడ అండగా నుండిరి.

## బోడిరెడ్డి రంగారెడ్డి

అడయారులో అనిబిసెంటు యాజమాన్యమున ప్రపంచ ఖ్యాతిగాంచిన దివ్యజ్ఞాన సమాజమునకు మద్రాసుశాఖ పాలనయందు ప్రముఖపాత్ర వహించిన

వారు. సమాజపెద్దలందఱికి అత్యంతముఖ్యులై యుండి వారి భవన నిర్మాణ కార్యక్రమమును సాగించుటలో సహాయపడి యెక్కువగా గౌరవింపబడిన నిగర్వి, నిరాడంబరజీవి యీ రెడ్డిగారు. వీరు రెవిన్యూశాఖోద్యోగిగా పనిచేసి పింఛను తీసికొని యీ మతసంస్థ సేవయందు కాలము గడపుచుండిరి. అడయారులో స్వధనముచే కొన్ని భవనముల నిర్మింపఁజేసి దివ్యజ్ఞానసమాజమున కొసంగిరి. నెల్లూరు మూలపేటవాసియైన వీరు అచ్చటి వేణుగోపాలస్వామి ధర్మకర్తలుగా కడు భక్తిశ్రద్ధలతో పనిజేసిరి. వీరి హయాములో స్వామికి మూలనిధి యెక్కువగా నేర్పడినది.

## తుమ్మల శేషారెడ్డి

మూలపేటనివాసి. ధర్మనిరతిలో జీవితము నుపాదించి, మూలపేట ధర్మరాజుల దేవాలయమునకు ధర్మకర్తగను, వేణుగోపాలస్వామి ధర్మకర్తగను, గుడిమణియముచేసి దేవాలయాల అభివృద్ధికి భక్తితో పాటుబడినవారు. 1951 సెప్టెంబరులో మరణించిరి.

## డాక్టరు ఏనుగు సుందరరామరెడ్డి

వీరు వైద్యపట్టభద్రులై జిల్లా హెల్తు ఆఫీసరుగా నుద్యోగవిరమణము గావించిరి. వీరు కీర్తిశేషులు. పెద్దమనిషని పేరుగాంచిన సుప్రసిద్ధ న్యాయవాది ఏనుగు రాఘవరెడ్డిగారి సోదరులు. వీరికి స్వజనాభిమానము మెండు. ఇష్టపడిన వారికి వ్యయప్రయాసలను లెక్కింపక సహాయపడెడివారు. రాజాగారి కళాశాల పాలకవర్గములో చేరి భవన నిర్మాణమును పట్టుదలతో కొనసాగించిరి. వీరు లేకున్న ఆ విద్యాసంస్థ కీనాటి రూపము లేకుండెడిదేమో!

## రాళ్లపల్లి రామసుబ్బయ్య

అప్పటమైన గాంధేయుడు. దేశభక్తియే తన ఊపిరిగా గాంధీ శకారంభమున మండలమున జాతీయోద్యమ వ్యాప్తికి విత్తనములు జల్లి, మోసు లెత్తించిన త్యాగి. వీరి ఉపన్యాసధోరణే ఒక వేదాంత విషయముగా ప్రాకినది. వీరు ఒక జాగంటను కొట్టి ప్రజలను సభకు ఆహ్వానించుచుండుటచే జాగంట అయ్యవారని పేర్గాంచిరి. కారాగారములలో క్రుగ్గి రోగపీడితులై మరణించిరి.

## కె. సుబ్రహ్మణ్యంనాయుడు

బీదకుటుంబమున పుట్టి పెద్దపదవులకు వచ్చిన మండలీయులలో వీరొకరు. సహకార శాఖయందు ప్రవేశించి, క్రిందనుండి పైకి ఎక్కి రిజిష్ట్రారుగా పదవీ విరమణపొంది ఆవల స్టేటుబ్యాంకు ఉద్యోగిగా పనిచేసిరి. ఆంధ్రయూనివర్సిటీ వారు సహకార విద్యకు ప్రత్యేకశాఖను నెలకొల్పి నాయుడుగారి ఆధ్వర్యమున పెట్టిరి. ఆశాఖ పూర్ణరూపమును పొందుటకు ముందే వీరు దివంగతులగుట విచారకరము.

## బత్తెన పెరుమాళ్లనాయుడు

కందుకూరు ప్రాంతీయుడు. పట్టభద్రుడు. మాంటెఫర్డు రిఫారమ్సు సంస్కరణములక్రింద ఢిల్లీ శాసనసభకు కాంగ్రెసు పక్షమున సభ్యుడుగా ఎన్నుకొనిరి. అపుడు కాంగ్రెసుపై ఊపు ఎట్లుండినదనగా వీరు తగినంత పనిచేయక పోయినను గెలుపొందినారు. కాబట్టే "భగవంతునిపై భారమువేసెను. బత్తిన పెరుమాళ్లు" అన్న చలోక్తి ప్రతివాని నోట నానినది.

జాతీయోద్యమమున చెరసాలకు పంపబడిరి. కందుకూరు తాలూకా బోర్డు ప్రెశిడెంటుగా పనిచేసిరి. కాంగ్రెసువారు శాసనసభలలో ప్రవేశించిన తర్వాత నాయుడుగారు సభ్యులుగాకూడా ఎన్నుకోబడిరి.

## వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రి

అల్లూరుప్రాంత గ్రామమునుండి వ్యాపారమునకై మదరాసు వెడలి ముద్రాపకులుగా పేర్గాంచిన రామస్వామిశాస్త్రిగారి పుత్రుడు. ఈ సంస్థ ఆంధ్రలోకమునకు అచ్చువేసిన పుస్తకముల బిక్ష పెట్టినది. సంస్కృతాంధ్రమున పూర్వ వాఙ్మయ ప్రచురణకు వారు పెట్టిన బిక్ష. ఆంధ్రవిశ్వవిద్యాలయము వెంకటేశ్వరశాస్త్రిగారికి 'కళాప్రపూర్ణ' అను బిరుదమును నొసంగినది.

## ముత్తరాజు గోపాలరావు

1920 లో విద్యార్థిగానున్న సమయమున జాతీయోద్యమ యజ్ఞగుండమున దూకి, యమగుండె పిల్లవాడనిపించుకొనిన స్వాతంత్ర వీరుడు. నిషేధింపబడిన "మాకొద్దు తెల్లదొరతనము" అన్న గీతమును పాడి మొదట జైలుకు పోయినారు. ఆవల ప్రతి జాతీయోద్యమమందును శిక్షింపబడినారు. ఆంధ్ర దేశమునకు అపూర్వమైన "నగరజ్యోతి" అను గోడ పత్రికకు సంపాదకుడుగా నుండెను. మూడు పర్యాయములు మునిసిపల్ కౌన్సిలరుగా ఎన్నుకోబడి మంచి సేవజేసిరి.

## రక్తదాత నరసింహారావు

వెంకటగిరి న్యాయవాదులు. విద్యార్థిదశలో స్వర్గించిన ఆటగాడు. సజ్జనుడై నందున తన రక్తమును రోగార్తులకు దానముచేసి ప్రాణదానముచేయ సంకల్పించుకొని రమారమి యాభైమార్లు రక్తదానమిచ్చిన దీనబాంధవుడు. మరణానంతరం తన దేహమును పరిశోధనలకై తన కళేబరమును ఇవ్వవలెనని మరణశాసనము వ్రాసియుండిరి.

## డాక్టరు బెజవాడ గోపాలరెడ్డి

'కొందఱు గొప్పవారుగా పుట్టుదురు. మఱికొందఱు పుట్టి పెద్దవారగుదురు' అన్నమాటకు సజీవ తార్కాణము శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు. 1920 లో వి. ఆర్. హైస్కూలునందు నాల్గవఫారము చదువుచు, గాంధిమహాత్ముని స్వాతంత్ర్య శంఖారావము విని, చకితులై ప్రభుత్వపాఠశాలలను బహిష్కరించి, జాతీయోద్యమములకు పుట్టినిల్లయిన బందరునందు కోపల్లె హనుమంతరావు స్థాపించిన జాతీయ కళాశాలలోచేరి, ఆవల రవీంద్ర కవీంద్రుని 'విశ్వభారతి' జేరి పట్టభద్రులైరి. ఇచ్చట వీరి జాతీయత పండినది. ఇంగ్లీషు, బెంగాలీ, హిందీ, భాషలందు పండితులై, గుజరాతి, ఉర్దూల నభ్యసించిరి. రవీంద్రుని ప్రత్యక్ష శిష్యులైన యాంధ్రులలో వీరు ప్రథములు.

మండలముఁజేరి 1930 లో చెలరేగిన జాతీయోద్యమమునందు 23-వ యేట పాల్గొని అది మొదలు స్వరాజ్యము వచ్చినంతవరకు పెక్కుమారులు

చెఱసాలకు కొనిపోబడిరి. ఆ చెఱసాలావాసమే వీరి విద్యాభివృద్ధికి, మానసికాభివృద్ధికి, తోడ్పడి యావద్భారత మహానాయకుల పరిచయము సమకూర్చినది. మండల మహానాయకుడై, రాష్ట్రనాయకుడై, యావద్భారతనాయక గణమున లెక్కింపబడిరి. 1937 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికలందు కాంగ్రెసు పక్షమున కభ్యర్థిగా కావలి డివిజన్ నిర్వాచన క్షేత్రమున కెన్నుకొనబడి సి. రాజగోపాలాచారిగారి మంత్రివర్గమున స్థానిక స్వపరిపాలన శాఖామాత్యులైరి. ఆనాటికి భారతదేశములో అధికారమునకు వచ్చిన మంత్రులలో పిన్నవారనిపించుకొనిరి. అదిమొదలు కాంగ్రెసు అధికారములోనికి వచ్చినప్పుడెల్లా మంత్రిగానుండి ప్రకాశంగారి కాలంలోతప్ప (1952 లో శాసనసభకు ఓడిపోయినప్పుడు తప్ప) ఆంధ్రరాష్ట్రావతరణ తర్వాత ముఖ్యమంత్రియై, కేంద్ర మంత్రిగా నుండిరి.

ఇంతవరకు వీరి మంత్రిపదవీ క్లుప్తకాలము 16 యేండ్లు జరిగినది.

ఆంధ్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా భాషాసేవ చేయుచున్నారు. ఆంధ్రాంగ్లములందు విషయానుగుణ్యమైన ఆవేశముతో మాట్లాడగలిగిన వక్త. బహుభాషావేది. కళాప్రియుడు. శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీవారు వీరికి 'డాక్టరు ఆఫ్ లెటర్సు' బిరుదమునిచ్చి సమ్మానించియున్నారు. వీరి సాహిత్య సేవనుగూర్చి నెం 20-వ వ్యాసమున జూడనగును.

## శ్రీ ఆనం చెంచుసుబ్బారెడ్డి

వీరి తల్లిదండ్రులు నారాయణమ్మ, సుబ్బారెడ్డిగారలు. ఆబాలగోపాలము ఏ. సి. అనుటయందే వీరి సర్వజనానురంజకత వ్యక్తమగుచున్నది. పుట్టువుతోనే నాయకుడై ఆశ్రితజన పారిజాతమై, పెద్దవాడైన యీ వ్యక్తి ఒక సామాన్య కుటుంబమునకు జెంది, సామాన్యవిద్య నలవరచుకొని మండలచరిత్రలో అపూర్వ ప్రతిష్ఠాస్థానము నాక్రమించుకొనిరి. రమారమి యిరువదియైదేండ్లు ఒకవ్యక్తి, ఒకేకుటుంబము, యిట్టి అవిచ్ఛిన్న పర్యాప్తాధికారము ననుభవించిన వారే లేరు. ఈ బలమును చేకూర్చినది బంధువులు, అనుయాయులైనను, వీరి మంచితనమే పెట్టుబడిగా సాగినది. మాట ఎంత కటువో, మనసంత మెత్తువు. అంతేకాదు, దయారసపూర్ణము. ఈయన పాలించినన్ని పదవులు మరెవ్వరూ పాలించి యెరుగరు. రాష్ట్రీయ రాజకీయములలో చరమగమ్యమైన, మంత్రి

పదవి నలంకరించి, ఆత్మస్వాతంత్ర్య సిద్ధాంతమునకు పదవిని బలిపెట్టి వచ్చిన యీ ధీరునికి రెండవమారు మంత్రిపదవియే పిలిచి పేరంటముపెట్టినది.

## శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి

బుచ్చిరెడ్డిపాళెములో అనాది విఖ్యాత కుటుంబమైన, దొడ్లావారి సంయుక్త కుటుంబమునకు చెందినవారు వీరు. పట్టభద్రులై పిన్నవయస్సు నందే (1924) మద్రాసు శాసనసభకు సభ్యులైరి. అది మొదలు బ్రిటిషు ద్వంద్వ పరిపాలనాకాలమున రాచరికములు నలిపిన 'జస్టిస్‌పార్టీ'లో నెన్నదగిన వ్యక్తిగానుండిరి. నెల్లూరు బోర్డు అధ్యక్షులుగను, శాసనసభాపతిగను, అతి సమర్థతో పనిజేసిరి. 1952 లో నెల్లూరునుండి పార్లమెంటుకు ఎన్నుకొనబడి రైతు సమస్యలపట్ల శ్రద్ధజూపిరి.

రెడ్డిగారు మృదుమధురవచో భూషణులై, అన్నివర్గములవారిని గౌరవించి, గౌరవింపబడుచున్నారు. చమత్కారవచన ప్రియులు. రాజకీయములందు వివిధ సమస్యలను గట్టిగా నర్థముచేసికొన్నవారు. సమయానుగుణ్యముగ లాభానుగుణ్యముగ, రంగులుమార్చు రాజకీయపు ఊసరవెల్లి కానందుననే కాంగ్రెసులోచేరి పదవులను అనుభవించలేకున్నారు. ప్రస్తుతము రాష్ట్రీయ స్వతంత్రపక్ష అధ్యక్షులుగా నున్నారు.

## శ్రీ రేబాల దశరథరామిరెడ్డి

విఖ్యాత మోపూరు, రేబాలవంశ కీర్తికి విద్యాగంధమును పూసిన, ప్రథమవ్యక్తి వీరు. నేడు మండల అధినేతలలో నగ్రగణ్యుడు. చల్లనిమాట, చల్లని మనస్సుతో, ప్రేమించి, ప్రేమింపబడి, అడిగినవారికి, ఓపినకొలది సర్వ విధముల సహాయముచేయు అనాసక్త కర్మయోగి. వీరు సహకారోద్యమమున ఆసక్తినిజూపి యిరువదేండ్లకుపైగా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకున కధ్యక్షులుగా పనిచేసి రాష్ట్ర సహకార బ్యాంకున కధ్యక్షులైరి. కాంగ్రెసు వాదియై, జైలుకుపోయిరి. పబ్లిక్ ప్రాసిక్యూటరై సాక్ష్యములను నేర్పించక, 'క్రొత్త మూనా' పెట్టిరి. ప్రస్తుతము కమ్యూనిష్టుల కంచుకోట అనబడుచుండిన కోవూరు నిర్వాచన క్షేత్రమున కమ్యూనిష్టును ఓడించి, విధానసభ కెన్నుకోబడినారు. వివిధ రంగములందు వీరికి మిత్రకోటి పెద్దగాగలదు.

## శ్రీ పసుపులేటి సిద్దయ్యనాయుడు

గూడూరులో అతి సామాన్యవ్యక్తిగా జీవితమును ప్రారంభించి, అదృష్ట దేవత కృపాంగానవలోకనములకు పాత్రీకరింపబడి, శ్రీమంతుడయ్యు, దానికి 'నడమంత్రపుసిరి' యన్న అపవాదము నాపాదింపజేయక పూర్వమును మరువక తన ప్రవర్తనచే పొగడ్తలంది, ప్రతివానిని 'అన్నా' అనిపిలిచి, 'అన్నా' అని మరల అనిపించుకొనిన 'అతి మంచిమనిషి' ఈయన. వచ్చినది వచ్చినట్లు దానముచేసి పూర్వమెఱిగిన వీరు భావినెరుగలేక ఉదారులై, బాధపడు చుందురు.

గూడూరు మున్సిపాలిటీ కాగానే వీరే మొదట 'చైర్మన్' అయిరి. ప్రస్తుతము సూళ్ళూరుపేట పక్షమున విధానసభ కెన్నుకోబడియున్నారు.

## శ్రీ. ఆనం సంజీవరెడ్డి

శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారి అన్న రంగారెడ్డిగారి పుత్రులు. న్యాయ శాస్త్రము చదువుచు మధ్యలో విరమించుకొనిరి. విద్యార్థిదశనుండి రాజకీయ ములందు ప్రముఖపాత్ర వహించిన కార్యకర్త. ఈయన కార్యోత్సాహమునకు ఆటు, పోటు, అలుపు లేదు. సుబ్బారెడ్డిగారి రాజకీయ సౌధమునకు వీరొక భిత్తిమూలము. 1958 లో బెజవాడ గోపాలరెడ్డి స్థానే ఆత్మకూరు ప్రతినిధిగా విధానసభా సదస్యులైరి. మరల 1962 లో అదేస్థానమున కెన్నుకోబడిరి. యువజన కాంగ్రెసు వుద్యమనాయకులలో సంజీవరెడ్డిగారు రాష్ట్రమునందంతటి లోను లెక్కబడినవారు. నిర్మొగమాటి. ఒకరిమిబట్టిన ఆశ్రితుని యేనాటికీ విడనాడని పలుకుబడి కలిగినవ్యక్తి.

## శ్రీ నలమోతుల చెంచురామానాయుడు

అదృష్టము కలిగిన మండల రాజకీయ నాయకులలో వీరొకరు. అతి ప్రాచీన సంపన్న కమ్మకుటుంబీకుడు. నిదానము (నెమ్మది) పెన్నిధిగాగలిగిన వాడు. ప్రతివిషయమునందును 'స్తబ్ధత' చూపినను కొన్ని విషయములందు ఆవేశమును చూపినను, వర్తనమునందు వ్యత్యస్తము లేనివాడు. రాజకీయ నాయకుని పలుమారు మార్చు అలవాటులేని వ్యక్తి. పలుమారు శాసనసభకు సభ్యులుగా నెన్నుకోబడి, ప్రస్తుతము ఆపదవియందే వున్నవాడు. పూర్వము

జిల్లాబోర్డు ప్రెసిడెంటుగా అదృష్టదేవతచే చేయబడిరి. మొన్నటివరకు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గానుండిరి. అచంచలమైన కాంగ్రెసువాది.

## శ్రీ ఆనం వెంకురెడ్డి

వీరు శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారి తమ్ములు. నేడు జిల్లాలో పలుకుబడి నంతా తన పిడికిట పట్టుకొని తన క్రీగంటి చూపులతో పదవులను ప్రసాదించ గలిగి, అన్నగారైన మంత్రి ఏ. సి. సుబ్బారెడ్డిగారి ప్రాబల్యములకు పునాదియై యుండికూడా, బయటి పేరునకు ప్రాకులాడని పదిమంది కూటమిలోచేర సహింపని విచిత్రవ్యక్తి యీ ఆజానుబాహుడు. శరీర పటుత్వమునకు మించిన కార్యశక్తి యీయన కార్యదీక్ష, ఒక పర్వతము ప్రేలుడుకు దీటైనది. ఎంత మిత్రప్రియుడో అంత శత్రుభయంకరుడు. చూచి, చూచి, ఒకవ్యక్తిని చేర దీసిన, ఆ వ్యక్తిని విడనాడు గుణము యీయనకు లేదు. వారే విడవడిపోయిన యీయన ప్రాకులాడడు. పట్టువిడుపులు లేని వీరి పట్టుదల యిప్పుడిప్పుడు కొంత దోరగిలబారుట ఆయన అత్యున్నతికే శ్రేయస్కరము.

## శ్రీ మహమ్మద్ రఫీవుద్దీన్ అన్సారి

వీరు నెల్లూరు మండలమునకు 'ఖాజీ' (ముస్లిం పెండ్లిండ్ల రిజిస్ట్రారు) వీరిది సుప్రసిద్ధ కుటుంబము. న్యాయశాస్త్ర పట్టభద్రులై, పబ్లిక్ ప్రాసిక్యూటరుగ పనిచేసి ప్రస్తుతము చిత్తూరులో జిల్లాజడ్జిగా పనిచేయుచున్నారు. సౌమ్యులు.

పూర్వము వీరు ముస్లిం లీగు సభ్యులైయుండి శాసనసభకు సభ్యులుగా నెన్నుకోబడిరి. స్వరాజ్యము వచ్చినతర్వాత అందరివలెనే వీరును కాంగ్రెసులో చేరిరి.

## శ్రీ ఉస్మాన్ ఆలీఖాన్

వీరు స్వర్గీయ మహబూబ్‌ఖాన్‌గారి ప్రథమ పుత్రులు. ఇంజనీరింగ్ పట్టభద్రుడు. చాల పెద్దమొత్తున కంట్రాక్టులు, వ్యాపారము, తండ్రితో కలియకయే చేయుచుండిరి. వీరు కాంగ్రెసుపక్షమున 1957 లో కర్నూలుజిల్లా నుండియు. 1962 లో అనంతపురము జిల్లానుండియు లోకసభకు సభ్యులుగా

నెన్నుకోబడిరి. తండ్రిగారి వ్యాపారము లన్నిటని సోదరుని సహాయముతో వీరే చూచుకొనుచున్నారు. చాల ఉదార స్వభావము కలిగిన సౌమ్యులు.

## శ్రీ దర్శి చెంచయ్యశెట్టి

మొదటి ఐరోపా సంగ్రామమునందు అమెరికాలో విద్యార్థిగానుండిన వీరు స్వాతంత్ర్యవీర శ్రీ లాలా లజపతిరాయ్‌గారు స్థాపించి నడపిన 'గదర్' విప్లవపక్షమున రహస్యసభ్యులై పనిచేసిరి. స్వదేశమునకు తిరిగివచ్చునపుడు జపాన్‌లో అరెస్టుచేసి నానాహింసలపాలు చేసిరి. 1920 లో విడుదల పొందినది మొదలు స్వాతంత్రోద్యమమున పాల్గొనిరి. వీరు సంఘసంస్కరణాభిలాషి. ప్రస్తుతము కమ్యూనిష్టుపక్ష వాసనలు కలిగియున్నారు.

## శ్రీ దర్శి రంగయ్యశెట్టి

వీరు చెంచయ్యగారి సోదరులు. జిల్లా జడ్జీగా రిటైరై సంఘాభివృద్ధి కృషియందు ఆసక్తిని జూపుచు నెల్లూరునందే కాలమును గడపిరి. మెత్తటి మనస్సు గలవారైనను, ధర్మపరాయణులు.

## శ్రీ పేడూరు లక్ష్మణగుప్త

ఈ ప్రముఖపౌరుడు కాంగ్రెసును, ఆనంవారిని, వీడనిఫలితముగా మహబూబ్‌ఖాన్ మరణానంతరము నెల్లూరు మున్సిపల్ ఛైర్మన్ అయిరి. ఇంతకు ముందు ఒకటి రెండు టరములు వీరు వైస్‌ఛైర్మన్‌గా పనిచేసి యుండిరి. పెద్దతనమును గుర్తించి, పెత్తనముచేసి పలుకుబడిని సాగించుకొనిన మిత్రవత్సలుడు యీ గుప్తగారు. ప్రతిపక్షుల కోలాహలమును హాలాహలముగ మ్రింగగలిగిన మూడవకన్ను లేని సాంబశివు డీతడు.

## శ్రీ ఏనుగు పట్టాభిరామరెడ్డి

స్వర్గీయ డాక్టర్ సుందరరామిరెడ్డిగారి సోదరుడు. న్యాయవిద్యా పట్టభద్రుడయ్యు, హరిజనసేవా నిరతుడై, హరిజన హాస్టలును నడుపుచున్న అనాసక్తయోగి. తన విద్యార్థుల వున్నతిని మాత్రమే కాంక్షించి, వారి యున్నతోద్యోగములపట్ల సంతోషపడి, నష్టపడుచు హాస్టలును నడపుచు,

అడిగినవారికి ఓపినకొలది సహాయము చేయుచున్నారు. వీరి హాస్టలునందు చదివిన విద్యార్థులలో చాలమంది పెద్దపదవుల నలంకరించి యున్నారు.

## శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి

వీరు కీ॥ శే॥ పట్టాభిరామరెడ్డిగారి తమ్ముడు. అన్నతోకలిసి వీరు చాల దానధర్మములు చేయుటయేగాక వారి మరణానంతరము మరికొన్ని దానములు చేసిరి. భార్యావియోగానంతరము ధర్మపరాయణ దీక్షనుబూని వైద్యాలయములకు, విద్యాలయములకు కొన్నివేలను విరాళము లొసంగి యున్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఒక టరము పనిజేసిరి. 1957 లో కాంగ్రెసు పక్షమున లోకసభకు ఎన్నుకోబడిరి. తాలు దుగలము లేనట్లుగా పౌరధర్మము నిర్వర్తించుచు మిత్రగోష్ఠులలో కాలము గడుపుచు, సంచార ప్రియులై యున్నారు. విద్యార్థులకు ఎక్కువ సహాయము చేసియున్నారు, చేయుచున్నారు. పాశ్చాత్యదేశములకు పయనముల పలుమార్లు సాగించిరి.

## శ్రీ దొడ్ల సుబ్బారెడ్డి

సామాన్య రైతుగా జీవితము ప్రారంభించి, కంట్రాక్టునందు లక్ష్మీకటాక్షమునకు పాత్రుడై, శ్రీమంతుడైనను, ముందువెనుకలను మరువక, పాత, క్రొత్త మనుష్యులను గమనించి సరళ హృదయముతో, సరసతజూపు ప్రియ వచస్కుడు యీ సుబ్బారెడ్డి. తండ్రిపేర కుగ్రామమైన స్వగ్రామములో ఉన్నత పాఠశాలను నెలకొల్పి దాని భవన నిర్మాణమును నగర విద్యాలయములకే అపూర్వమనిపించుకొను వాటిని నిర్మింపజేసిరి. ఇంతేగాక నెల్లూరున వైద్యాలయమునకు మూడులక్షల వాగ్దానము చేసిరి. భార్యపేర స్త్రీలకళాశాలను నెలకొల్పిన మరి మూడులక్షల నిత్తునని వాగ్దానము చేసియున్నారు. ఇట్లు దినదిన ప్రవర్ధమానమగుచున్న నిజకీర్తి, సంతానములేని సంతాపదోషమును పరిహరించుకొనుచున్నారు. ఈ సర్వస్వ ప్రచురణకు ధనసహాయముచేసినదాత.

## శ్రీ తిక్కవరపు రామిరెడ్డి

ధన మెంత గట్టిగా ఆర్జింపవలెనో అంత ఉదారముగా, వితరణగా, దానముచేత, అనుభవముచేత, వ్యయించుట జీవితకళా రహస్యము అన్న సిద్ధాంత స్థాపనాచార్యుడు, ఈ కవిపుల చకోరచంద్రుడు రామిరెడ్డిగారు.

ప్రహ్లాదునకు హరి యెట్లో రామిరెడ్డిగారికి 'తిక్కన' అట్లు. కవిత్రయ వర్ధంతులు జరిపి, కవులను పండితులను పోషించుటయేకాక, వైద్యాలయములకు, విద్యాలయములకు — పేరుకొనుటకు ప్రాకులాడకయే, భూరిదానము లొసంగిన వితరణశీలి వీరు. మొత్తముగ యింతపెద్ద సొమ్మును దానముచేసిన మండలీయులలో వీరగ్రగణ్యులేమో! మంత్రి శ్రీ గోపాలరెడ్డిగారి మామ. 1920 ప్రాంతమున అసహాయోద్యమమున పాల్గొని కారాకారవాసము ననుభవించిరి. మున్సిపల్ చైర్మన్ పదవిలో కొంతకాలముండిరి.

## శ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరులు

ఈ యువకుడు పట్టభద్రుడై వంశానుగతమైన వ్యాపారమును సాగించుచు యువగణమునకు మార్గదర్శకులుగా వున్నారు. పెక్కు వ్యాపార సంస్థలలో పాల్గొని సమిష్టి వ్యాపారమునకు గౌరవమును గూర్చుచున్నారు.

## శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య

వీరు విద్యార్థి దశనుండి మాతృదేవి ఆరాధనలోలురై జాతీయతా వ్యాప్తికి పాటుబడుచుండిరి. లోకమాన్య తిలక్‌తో సన్నిహిత పరిచయము కలిగివుండిరి. పోట్లపూడిలో పుట్టిపెరిగిన ప్రతి జాతీయోద్యమమునందును వీరికి పాలుయుండినది. న్యాయవాదులైన తర్వాత ఏనాదుల అభివృద్ధియే ఏకైక లక్ష్యముగా పాటుపడిరి. నెల్లూరుమండల నిమ్నజాతుల పురోగతి, ఈయన జీవితముతో పెనవేసుకొని పోయినది. 1920 మొదలు ప్రతి జాతీయోద్యమమునందు పాల్గొని చెరసాలకు పంపబడిరి. అసెంబ్లీసభ్యులై ప్రకాశం మంత్రివర్గములో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిరి. అలుపులేని ఉత్సాహశక్తితో నేటికిని ఆదిమవాసుల అభివృద్ధికి పాటుపడుచున్నారు.

## శ్రీమతి పొణకా కనకమ్మ

మినగల్లు పొణకా మల్లారెడ్డి కూతురు కామమ్మ, మడమనూరు మరుపూరు కొండారెడ్డిగారల ప్రథమ పుత్రిక. మేనమామను పెండ్లియాడి పోట్లపూడి చేరి, మరది పట్టాభిరామిరెడ్డిగారితో కలిపి, మండల జాతీయోద్యమ మహానౌకకు కర్ణధారిణియైనది. సభలకు, ఆతిథ్యములకు అంతపెద్ద ఆస్తిని కరిగించివేసి బంధుజనములకు కీర్తిని మాత్రము మిగిలించినది. రాష్ట్ర నాయ

కత్వమున మొదటి బంతిలో చేరినది. అనేక పర్యాయములు అనుభవించిన కారాగార శిక్షలచే ఆరోగ్యముచెడి బాధపడినది. కస్తూరిదేవి బాలిక విద్యాలయమునకు పురుడుబోసి, పెంచిపెద్దజేసి తిక్కవరపు రామిరెడ్డిగారి చేతిలో పెట్టి బయటికి వచ్చినది. కస్తూరిబా పారిశ్రామిక విద్యాలయమును స్థాపించి సాగించినది.


ఈమె మంచివక్తయగుటయేగాక మృదుమధురశైలి అబ్బిన రచయిత. ఆధ్యాత్మికముగా రమణమహర్షి, రామయోగుల శిష్యురాలు. సాహిత్యసేవ 20-వ వ్యాసము చూడుడు. పే 35.

## శ్రీ వంగల్లు కోదండరామిరెడ్డి

మాటల నేర్పుతో, ప్రవర్తన మంచితో అభిమానపాత్రుడై 25 ఏండ్లు మండల రాజకీయములలో ద్వితీయశ్రేణిలో ప్రథముడుగా వన్నెకెక్కినవారు. బుచ్చిరెడ్డిపాళెం వదలి, తోటపల్లి గూడూరులో మేనమామ ఇల్లుచేరినది మొదలు అదృష్టము తనకుతానై వచ్చి ఈయనను వరించినది. తాలూకాబోర్డు ప్రెసిడెంటుగా, జిల్లాబోర్డు ప్రెసిడెంటుగా పనిజేసిరి. కాన్‌స్ట్యూయన్‌ట్ అసెంబ్లీని కాంగ్రెసు పక్షమున ఎన్నుకోబడిరి. ఒక టరము 1961 వరకు అసెంబ్లీ సభ్యులుగా ఒక్కటరము ఉండిరి. సహకారోద్యమమున ముప్పదియేండ్లు అనుభవము గలదు. అందు పెద్ద పదవులను నిర్వహించిరి. పదవులను కోరక, పదవులందుండిన వారికి ప్రీతి కూర్చుచు పనులు చక్కబెట్టు వీరికి, కాలముకలిసి రాక 62 ఎన్నికలలో దెబ్బతగిలెను.

## శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి

కోట వాస్తవ్యులు. అనాదిగా పేరుగాంచిన కుటుంబీకులు. తన గ్రామమైన కోటకు, ఆధునిక యుగములో అవసరమైన సర్వ సౌకర్యములను సమకూర్చిపెట్టి ఆదర్శగ్రామముగా జేసిరి. సమితి అధ్యక్షులై, ఆనల జిల్లాపరిషత్ చేర్మెను అగుట వారి కృషికి నాయకులపై విశ్వాసమునకు, మిత్రులపై ప్రేమకు, పారితోషికము. వీరు సరసులు. అందరికి అందుబాటులో ఉండి ఓపినకొలది సహాయముచేయ గలిగిన ప్రియభాషణుడు. ఈ సర్వస్వ యత్నమునకు యాజమాన్యము వహించి కృతకృత్యులైనవారు.



వాకాడు హరిజనహాస్టలు రజతోత్సవ చిహ్నిత స్తంభము

## శ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి

మాదుమూల గ్రామమున ఒకవ్యక్తి అవిరళ గాఢ కార్యదీక్ష ఎంతటి మహత్తర రూపము దాల్చునో, అనుటకు శ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఉదాహరణ ప్రాయుడు. వారి వాకాడు హాస్టల్సు, అచటి విద్యాలయములే సాక్షీభూతములు. క్రమశిక్షణతో పోషించి, చదువు అబ్బునట్లు చేయు హరిజనహాస్టల్సులో ఇది ప్రథమగణ్యమనక తప్పదు. ఇక పది హేనువందలమంది విద్యార్థులను పాలించుట అనునది కని విని ఎరుగనిది. ఆ హాస్టలు ప్రాంతమే ఒక గురుకులావాసమువలె, సరస్వతీదేవి విహారభూమియై యున్నది. లాభసాటి కాకపోయినను హరిజనేతర బాలురకు ఆశ్రయమిచ్చి బాలకృష్ణారెడ్డిగారు మానవ సేవ చేయుచున్నారు. దీనిని వచ్చి చూచిన వారిలో పొగడనివారు లేరు.

## — హైకోర్టు జడ్జీలు —

నెల్లూరు మండల ప్రముఖులు నేడు హైకోర్టు జడ్జీలుగా ఉండుట గర్వకారణము గదా!

### 1. ప్రధాన న్యాయమూర్తి శ్రీ పలగాని చంద్రారెడ్డి

దామరమడుగు వాస్తవ్యులు. వెంకటగిరి రాజాగారి కళాశాల విద్యార్థి. మద్రాసులో న్యాయవాద వృత్తియందు ప్రవేశించి, నాడు రాచరికముల నెరపు చుండిన జస్టిస్‌పార్టి ప్రముఖులకు సన్నిహితులై యుండిరి. పానుగల్లు రాజా

గారిపై వీరికి భక్తివిశ్వాసము మెండు. స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత జడ్జి చేయబడి ఆంధ్రరాష్ట్రము ఏర్పడిన కొంతకాలమునకు ప్రధాన న్యాయ మూర్తులైరి. ఇటీవల ఆంధ్రప్రదేశ గవర్నరుగా నూస ముండిరి.

## 2. జడ్జి శ్రీ కొండగుంట ఉమామహేశ్వరం

వీరు నారాయణయ్య కుమారుడు, ఆముదాలదిన్నె వాస్తవ్యుడు. పుదూరు ద్రావిడులు. సర్ అల్లాడి కృష్ణస్వామిఅయ్యర్ అల్లుడు. వినయ సంపన్నులు.

## 3. జడ్జి శ్రీ మైదవోలు శేషాచలపతి

నెల్లూరు న్యాయవాదులలో ప్రఖ్యాతిగాంచి మున్సిపల్ చేర్మెనుగా, పబ్లిక్ ప్రాసిక్యూటరుగా పనిచేసిన చెంగయ్యగారి పుత్రుడు. విద్యార్థి దశనుండి మహా మేధాసంపత్తిని ప్రదర్శించుచుండిరి. రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ గారి అల్లుడు.

## 4. జడ్జి శ్రీ కూరపాటి వేంకటలక్ష్మీనరసింహం

మిలిటరీ శాఖనుండి న్యాయశాఖకు ప్రవేశించి గుణముచే న్యాయ మూర్తిస్థానమును అలంకరించి యున్నవారు. స్వర్గీయ ఆర్. సుబ్బానాయుడు గారి అల్లుడు.

* * *

## శ్రీ బెజవాడ శివకోటారెడ్డి

డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారి పెదనాయన, బాలకృష్ణారెడ్డి పుత్రుడు, పట్టభద్రుడు. 1959 సత్యాగ్రహములో పాల్గొని ఒక ఏడాదిపాటు చెఱసాల కంపబడిరి. ఆ సమయమున రాయవేలూరు జయిలులో నేతాజీ సుభాస్‌చంద్రబోసుగారి సాన్నిధ్యము లభించి రెడ్డిగారి దేశాభిమానమునకు సానలు తీర్చబడినది. నిశితమైన ధారణశక్తిచే చదివిన పుస్తకములందలి రసవత్తర వాక్యములను సమయస్ఫూర్తితో చెప్పుచుందురు. వీరికి పేదలన్నను దీనులన్నను మమత. వారి సహాయమునకై ఇంటిని దోచిపెట్టినారు. కొంత

కాలము కమ్యూనిజముపై వ్యామోహము కలిగియున్నందున వారికి అండగా నిలిచి కొల్లబోయినాడు. మదరాసులో కాసా సుబ్బరావు నెలకొల్పిన స్వతంత్ర పత్రికకు, వాకాటి వీరారెడ్డిగారి సత్రమునకు భూరి విరాళముల నిచ్చియున్నారు. ప్రేమించిన బంధువులకు ఆస్తిలో పెద్దభాగములను దానము చేసినారు. ఈ ఔదార్యము లన్నిటికి కారణము వారి సహజ ధార్మికబుద్ధియేగాక బ్రహ్మచారి యగుటకూడా కారణ మగుచున్నది. బుచ్చి హరిజన హాస్టలునుకూడా నడుపుచున్నారు.

## శ్రీ వాకాటి వీరారెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం నుండి 50 ఏండ్ల నాడు బియ్యపు బేరమునకుగా మదరాసు వెడలి అచటనే నిలబడిపోయినను మండలీయులపై చూపు శ్రద్ధాసక్తులచే నెల్లూరు సంబంధమును కలిగియే యున్నారు. ఇన్ని ఏండ్లు చికిత్సకై మదరాసుకు వెడలిన ఆంధ్రులకు, పెద్దడాక్టర్లచేత, పెద్దాసుపత్రులలో చికిత్స పొందుటకు సహాయపడుచున్నారు. కడకు బస్సుచార్జీలను కూడా అడుగక రోగులవెంట తిరిగి సర్వసహాయములు వారికిచేసి అనాసక్తయోగమును అవలంబించిన సాధకుడు ఈ రెడ్డిగారు. మండలాభిమానమునకు మించిన శాఖిదే మానము కలిగియు జస్టిస్ పక్ష రాజకీయములు నచ్చినవి. ఆయనకు కాంగ్రెసులోని, పెద్దలు, చిన్నలు అందరూకూడా అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. మాటలు దాచుకొనక ముఖాన అడిగినను బెట్టపడకుండుట వీరి అదృష్టము. వీరి ఆర్తజనసేవానురక్తి॥ స్మృతిగా, మదరాసు రాయపేటలో ప్యాటడ్సురోడ్డునందు ఒక ధర్మసత్రము నెలకొల్పబడి యున్నది.

## శ్రీ దువ్వూరు బలరామరెడ్డి

సుప్రసిద్ధ రేబాలవంశము వారి ఆడపడుచు కుమారుడు. జాతీయోద్యమములందు పాల్గొనుచు వంశగౌరవ మిచ్చిన పలుకుబడితో చుట్టుప్రక్కల ప్రేరేపించినాడు. 1939 ప్రాంతాన మొలకెత్తిన రహస్య విప్లవోద్యములో పాల్గొని ముఖ్యమైన ముద్దాయిలలో ఒకడైనాడు. అంతకుముందు కాంగ్రెసు యోద్యమములో కూడా జైలుకు పంపబడినాడు. జయిలునందున్నపుడు భగత్ సింగు స్నేహితుడు, భక్తేశ్వరదత్తు (ఢిల్లీ అసెంబ్లీలో బాంబువేసినవాడు) పరిచయము

సంపాదించుకొనిరి, కొంతకాలము కమ్యూనిజమువైపు వీరి మనస్సు మొగ్గి యుండినను ఇపుడు కాంగ్రెసు వాదియే! ఇందుకూరుపేట సమితి అధ్యక్షులుగా, సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులుగా పనిచేసిరి. శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారితో వియ్యమంది వంశగౌరవమునకు రాజకీయ గౌరవమును జత జేసినారు.

## శ్రీ బెజవాడ పాపిరెడ్డి

బెజవాడ రామచంద్రారెడ్డి పుత్రుడు. పట్టభద్రుడు. జననం 5-1-'27, మంత్రి శ్రీ పి. వి. జి. రాజుగారి సోషలిష్టుపార్టీయందు ఒక ప్రముఖ సభ్యుడుగా ఉండి ఆ పక్షమువారు సాగించిన సత్యాగ్రహములో ఒకసారి చెఱసాలకు నంపబడిరి. వీరి రాజకీయ పరామర్శ, విమర్శ కడు నిశితములు. మెత్తటి హాస్యరసము మాటలగుండా పారుచుండును. ఆంధ్ర విధానపరిషద్ సభ్యులుగా 1962 వరకు నాలుగేండ్లుండిరి.

## డాక్టర్ డి. గోవిందురెడ్డి

మునునూరు జన్మస్థానము. కడు పేదగా జీవితము ప్రారంభించి విద్యార్థిగా ప్రతిభనుజూపి వైద్య పట్టభద్రుడైనారు. అదిమొదలు వైద్య కళాశాలలో అధ్యాపకులుగా పెద్ద ప్రభుత్వోద్యోగము చేసి రిటైరు అయిరి. వినయ సౌశీల్యములతో సామర్థ్యముతో పేర్గాంచి గతమును తలచుకొని వినమ్రులగుచున్నారు.

జడ్జిగా పనిచేసి తీర్పరితనమునకు పేర్గాంచిన కీర్తిశేషులు మజ్జిగ బలరామరెడ్డి ఏకైక పుత్రికను పెండ్లాడిరి.

## శ్రీ వై. సి. రెడ్డి

యరబోలు చంద్రశేఖరరెడ్డిగారు అల్లూరు వాస్తవ్యులు. అమెరికా, మొదలగు దేశములలో ఊరుపేరు లేనివాడు పెద్దలగుచుండు అన్నమాటను అదృవ పరచి భారతదేశమునందు కూడా, అవకాశము, అదృష్టమున్న పెద్దవాడు కాగలడు అను సిద్ధాంతమును నెలకొల్పిన వ్యక్తి, కట్టుగుడ్డలతో నెల్లూరుచేరి, ఇప్పుడు హైదరాబాదులో 20 లక్షల పెట్టుబడితో జపానువారి సాహాయ్యముతో

వాటరు మీటర్ల కర్మాగారము నెలకొల్పి తన జీవితాభివృద్ధిని తామరతంపరలుగా చేసుకొనిన అదృష్టశాలి. పదవులయందున్న ఉద్యోగులను లోబరుచుకొను సమ్మోహన విద్యలో ఆరితేరి కొలతకురాని పలుకుబడిని కలిగియున్నారు. జపాను మొదలగు విదేశయాత్రలు వీరికి మంచినీళ్ళ మర్యాద.

ఈ అదృష్టశాలిలో ఆకర్షణీయ గుణము తన ఆదిని మరువక అభిమానులు ఆదరించుటే!

## శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య

అలగానిపాడు వాస్తవ్యులు. పంటకులజుడు. మదరాసులో చదివి, జాతీయోద్యమమున పాల్గొని కాంగ్రెసువాడై, కమ్యూనిష్టుగా పరిణామము జెందిన ప్రముఖులలో వీరు ఒకరు. కమ్యూనిష్టులలో ఈయన అతివాది.

సేవచేత, ప్రజల అభిమానమును నాయకత్వమును గడించుకొనినవారు. శాసనసభారంగమున విషయమును బాగా చదివి ప్రతిపక్షవాదమును ప్రదర్శించ గలిగిన నాయకుడుగా లెక్కబడి యున్నాడు. భాషాసౌష్ఠవముగాని, ఉచ్చారణ సౌలభ్యముగాని, వక్తృత్వముగాని లేకపోయినను అనుకొనిన విషయమును అన్ని వేదికలమీదను నచ్చచెప్ప సమర్థుడు.

## డాక్టర్ చివుకుల కృష్ణమూర్తి

కందుకూరు ప్రాంతీయులు, భూమి సత్తువ విషయములోను, ఎరువుల విషయములోను ప్రత్యేక ఉన్నతవిద్య నభ్యసించి పరిశోధనలు గావించి, డాక్టర్ (Phd.) బిరుదమును పొందిరి. ప్రస్తుతము రాయలసీమలో Soil Experts గా పనిచేయుచున్నారు. నెమ్మదిగల పెద్దమనిషి. మిత్రప్రియులు.

## — ఇంజనీయర్లు —

మండలీయులు చాలామంది ఇంజనీరింగుశాఖలో పెద్ద ఉద్యోగములను అనుభవించుచున్నారు. వారిలో కొందరు—

## 1. శ్రీ సి. కృష్ణారెడ్డి

ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజనీయర్లలో ఒకరు. మంత్రి చెంచుసుబ్బా రెడ్డిగారి మేనల్లుడు. నీతి, సామర్థ్యములు యోగ్యతాపత్రములుగా వృద్ధికి వచ్చినవారు.

## 2. శ్రీ పొణకా గోపాలకృష్ణారెడ్డి

సూపరింటెండింగు ఇంజనీరు, అనంతపురం. పొణకా పెంచలురెడ్డిగారి (పొణకా పిచ్చిరెడ్డిగారి అన్న) కుమార్డు. దువ్వూరు బలరామిరెడ్డిగారి పినతల్లి గారి కుమార్డు. 'నిప్పుకు చెదలు అంటదు' అనునట్లుగా ఉద్యోగముచేయు ఇంజనీరు.

## 3. శ్రీ ఎ. కోదండరామయ్య

మైపాడు, సాలి కులజులు. విద్యార్థిగా వీరి మేధాసంపద పరాకాష్ఠ నొందినది. రైల్వేశాఖలో పెద్ద ఇంజనీరుగా పనిచేయుచున్నారు.

## 4. శ్రీ మలిరెడ్డి రామగోపాలరెడ్డి

ఇనమడుగు, శ్రీ సానికొమ్ము మాలకొండారెడ్డి అల్లుడు. దండకారణ్య రైల్వే నిర్మాణములో ప్రధాన ఇంజనీరింగు ఉద్యోగిగా ఉన్నారు,

## 5. శ్రీ చెరుకూరు ప్రభాకరరెడ్డి

ఎల్లాయపాళెం చెరుకూరు గోపాలరెడ్డి బి.ఏ., బి.ఎల్. గారి సోదరుడు. హీరాకుడ్ ప్రాజక్టు నిర్మాణములో పనిచేసి రైల్వే శాఖలో ప్రవేశించి డివిజనల్ ఇంజనీరై ఉన్నారు.

## 6. శ్రీ పొన్నలూరు నారాయణరెడ్డి

ములుమూడి. విద్యార్థిదశ చాలా ప్రతిభాపూర్ణము. తన పేదతనములో

ధనసహాయము చేసినవారికి తాను సంపాదించుకో కలిగిన తర్వాత దాతలకు ఋణము అన్నట్లుగా చెల్లించిన అపూర్వ వ్యక్తి యితడు.

## 7. శ్రీ సానికొమ్ము గోపాలరెడ్డి

కనిగిరి. టెలిఫోను శాఖలో పెద్ద ఉద్యోగములో ఉన్నాడు.

## 8. శ్రీ ఉండేలు మాలకొండారెడ్డి

మొగ్గ విరియగనే సువాసనల వెదజల్లిన ప్రజ్ఞాధురీణుడు ఇతడు. మెట్ట తాలూకాలవాడు. నిరుపేదగా, విద్యాభ్యాసమునకు అల్లూరుకు వచ్చి తెలివిచేత, నడవడికచేత కొల్లగొట్టినాడు. ఇంజనీరు అగువరకు ప్రతి కక్షలో ప్రథమ తరగతియందు ఉత్తీర్ణుడై ఇంజనీరింగు పట్టభద్రుడై వరంగల్లు ఇంజనీరింగు కళాశాలయందు అధ్యాపకుడుగా వున్నారు.

## 9. శ్రీ గునుపాటి కృష్ణారెడ్డి

కొత్తూరు గునుపాటి బలరామరెడ్డి పుత్రుడు. మొదట లేబర్ డిపార్టుమెంటులో పనిజేసి తర్వాత ఇంజనీరింగు శాఖలో చేరిరి. ప్రస్తుతము నాగార్జునసాగర్ వద్ద ఒక డిపార్టుమెంటుకు అధికారిగా పనిచేయుచున్నారు.

* * *

## శ్రీ పొన్నలూరు కోటారెడ్డి

మైకా వ్యాపారమునందు విశేష అనుభవమును ధనమును గడించిన యువకుడు. వ్యాపార విషయమై పలుమారు ప్రపంచమును చుట్టివచ్చియున్నారు. ప్రస్తుతము గూడూరు మునిసిపల్ చేర్మెనుగా వున్నారు.

వీరి అన్న పొన్నలూరు వీరరాఘవరెడ్డిగారు కాంగ్రెసు పక్షమున ఆంధ్ర విధానపరిషత్ సభ్యులుగా ఉన్నారు. వీరుకూడా ఎన్నిమోమారులు విదేశయాత్ర సలిపియున్నారు.

## శ్రీ యన్. ఆర్. రెడ్డి

నల్లపరెడ్డి రామరాఘవరెడ్డి. కోట ప్రాంతీయుడు. వీరు ప్రస్తుతము ఢిల్లీ సచివాలయములో పెద్ద ఉద్యోగిగా పనిచేయుచు అడిగినవారికి ఓపినకొలది సహాయముచేసి తమ అదృష్టమును ఇతరులకు పంచిపెట్టుచున్నారు. తాను చేసిన సహాయము వలన పేరిన పలుకుబడిన ఇతరులకి వినియోగించు యిట్టి వ్యక్తులు మరి ఒకరిద్ద రుండిన మండలము ఎంతయో బాగుపడియుండును.

## శ్రీ వేమారెడ్డి రామరాఘవరెడ్డి

చినచెరుకూరు. అప్పటమైన గాంధేయుడు. కలగలుపులేని హరిజన ప్రీతితో హాస్టల్సును స్థాపించి ఆ గ్రామమును ఆదర్శగ్రామముగా చేసినారు. హాస్టలు నిర్వహణమును వ్యాపారముగా సాగించినందువలననే ఇల్లు గుల్ల చేసు కొనినారు. కరుణాంతరంగుడు.

## శ్రీ వాకాటి సంజీవశెట్టి

వ్యాపారమునందు, రాజకీయమునందు పేర్గాంచుటకు వైశ్య కులమున వీరు ప్రథము లనవచ్చు. వైశ్య విద్యార్థులకు వసతి గృహమును నెలకొల్పి ఎందరినో బీదవారిని ముందుకు తీసుకొనివచ్చిన కులాభిమాని.

## శ్రీ గోగినేనివారు

కృష్ణజిల్లా, మానికొండనుండి మన మైకాగనులకుగా మండలమునకు వచ్చి ఎక్కువ ధన మార్జించినవారిలో గోగినేనివారు మొదటివారు. స్వర్గీయ వెంకటసుబ్బానాయుడుగారు ఒకచేత సంపాదించి మరియొకచేత అనుభవించి దానముచేసి మండలమున మహాదాతగా పేర్గాంచినారు. తమ గనులలో వచ్చిన సరుకును చిన్న పెద్ద అనక అందరు వ్యాపారులకు సరసముగా యిచ్చి వారి లాభమే తన లాభముగా ఆనందించిన సరస హృదయుడు. గూడూరు నందు వీరి ప్రాపున వృద్ధికి వచ్చినవారు చాలామంది వ్యాపారులు గలరు.

ప్రస్తుతము యాజమాన్యను నెరపుచున్న శ్రీ వెంకటేశ్వరరావుగారు ఆంధ్ర కావ్యపరిచయము గలిగి మిత్రగోష్ఠిలో కాలము గడుపుచు తమ పెద్దల సాలును విడిచిపెట్టకున్నారు. ఈ కుటుంబమువారు ఉత్తరాన హృషీకేశము మొదలు, మానికొండలోను, విజయవాడలోను, సైదాపురం మొదలగుచోట్ల సత్రములను విద్యాలయములను నెలకొల్పుటకు భూరి సహాయముచేసి యున్నారు.

## శ్రీ సుంకు చెంగల్‌రాయశెట్టి

విఖ్యాతిగాంచిన బి.ఏ. నారాయణశెట్టిగారి పౌత్రుడు. ఇరువది ఏండ్లుగా అనాధ శిశు శరణాలయము నడుపుచు దీనులకు ప్రాపై విద్యాబుద్ధుల గరపి పైకి తెచ్చుచున్నారు. మునిసిపల్ వైస్ చేర్మెనుగా ఒక పర్యాయము పని చేసిరి. నిగర్వి.

## శ్రీ యం. ఏ. అబ్బాయినాయుడు

ఊళ్లపాళెం, జస్టీస్‌పక్ష నాయకుడుగా కందుకూరు పరగణాలలో రాచరికములు నెరపిన నెఱజాన. కందుకూరు తాలూకాబోర్డు అధ్యక్షులుగా, డిస్ట్రిక్టు ఎడ్యుకేషనల్ కౌన్సిలు ప్రెసిడెంటుగను పనిచేసిరి. రాజకియ సన్యాసము చేసి ప్రస్తుతము ముత్తుకూరు సమీపమున, కండ్లేటి సాల్పున విడిదిపెట్టి చేపలు పట్టి ఆనందించుచున్నాడు. మదరాసునుండి వారాంత్యమున విహారార్థము అరుదెంచు నానావర్గముల పెద్దలకు ఆతిథ్యమిచ్చి పేర్గాంచియున్నారు.

## శ్రీ తిక్కవరపు వెంకటరామిరెడ్డి

పొట్టెపాళెం. తాను నమ్మిన ఆదర్శమునకుగా సర్వమును త్యాగము చేయగలిగిన నిష్కామయోగిగా ధైర్యముగల సాధుపుంగవుడు, ఈ చినరామి రెడ్డిగారు! 1920 ప్రాంతమున గాంధీ ఉద్యమ ప్రేరితుడై దేశభక్తుడైనాడు. లోపల యిమిడియుండిన ఆధ్యాత్మికవాసనాబలము ఉబ్బి బయటపడి వెల్లువ బెట్టినది. పుదుచ్చేరియందలి అరవిందయోగి మహిమచే ఆకర్షితుడై అచట

జేరి ఆయన భక్తుడైనాడు. తన యావదాస్తితో, పసిపాపగా వుండిన ఏకైక పుత్రునికి సగభాగమునిచ్చి పోషణకర్తల పరముజేసి తన సగమును అమ్మి అరవిందయోగి, మాతా అనబడు పాల్ రిచ్చార్డ్సు సతీమణికి పాదపూజచేసి అర్పించి నాడు. అదిమొనలు అక్కడనే సాధన చేయుచున్నారు. సత్యకర్మ అను పేరుతో ఆశ్రమమున నేడు ప్రధాన కార్యకర్తయై గౌరవింపబడుచున్నాడు.

## శ్రీ అల్లాడి వాసుదేవన్

కందుకూరు వాస్తవ్యులు. రైల్వే ఇంజనీరుగా పెద్ద పదవిలో ఉన్నారు. ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యాగారి అల్లుడు.

## శ్రీ కాళహస్తి వేంకటసుబ్రహ్మణ్యం

సుప్రసిద్ధ ఆంధ్ర ఉపాధ్యాయులు. బంధువుల రామచంద్రశాస్త్రిగారి పౌత్రుడు. మినగల్లు భూగర్భవస్తుశాస్త్రమున మహాప్రవీణుడు. విదేశములకు వెడలి విశేష పరిశోధనలు గావించి వచ్చిరి. ధన్‌బాగ్ మైనింగు కళాశాలలో అధ్యాపకులుగా ఉండి పని చాలించుకొని ప్రస్తుతము గనులవారికి సలహా లిచ్చుచున్నారు.

## శ్రీ బద్దెపూడి వెంకటనారాయణరెడ్డి

కోటపోలూరు. జమీందారీ విధానము రద్దుకావలనన్న ఉద్యమము మొట్టమొదట మోనులెత్తినది. వెంకటగిరి సంస్థానమునందే ఆ ఉద్యమమున ప్రధానపాత్ర వహించినది. పిడూరులో చేరిన పొణకావారి కుటుంబము బద్దె పూడివారి కుటుంబము, వెంకటగిరిలో కల్యాణరావుగారి కుటుంబము. వీరికి నాయకుడుగా ఆచార్య రంగాగారు నిలువగా నెల్లూరు వెంకట్రామానాయుడు, బద్దెపూడి వెంకటనారాయణరెడ్డి స్థానిక నాయకులై ఉద్యమము నడిపినారు. ఆ ఉద్యమ ప్రచారమునకు పుట్టినదే నేటి జమీన్ రైతు (నాటి జమీందారిరైతు) నిరంకుశులైన జమీందారులను ఎదిరించుటకు వెంకటనారాయణరెడ్డిగారు వెను

దీయక చాల కష్టముల పాలైరి. జాతీయోద్యమములో చెఱసాలకు పంపబడిరి. తమ జమీందారినే యెదిరించి శాసనసభకు కాంగ్రెసు పక్షమున ఎన్నుకోబడిరి.

## శ్రీ కె. కోటేశ్వరరావు

జంగమకులజుడు. యం.ఏ., పట్టమును పొందువరకు విద్యార్థిదశను తేజోమయముగ నడపి వాతావరణశాస్త్ర నిపుణుడై, నేడు ఈ శాఖలో అత్యంత ఉన్నతపదవిని అలంకరించుచున్నారు. క్రిందనుంచి పైకివచ్చి తాను ఎక్కిన మెట్లను మరచిపోవని సుజనుడు.

## రియల్ అడ్మిరల్ శ్రీ కూరపాటి లక్ష్మీకాంతరావు

నెల్లూరు కూరపాటి వంశము విద్యాధికులను పుట్టించినది. ఒక కూరపాటి లక్ష్మీనరసింహరావుగారు హైకోర్టు జడ్జిగా నున్నారు. ఈ లక్ష్మీ కాంతరావుగారు నావికాదళమున సేనాపతులలో ద్వితీయ స్థానమును అలంకరించుచున్నారు. వీరు రాష్ట్రపతికి A. D. C. గా కూడా నున్నారు. తండ్రి రామానుజులునాయుడు, తల్లి చిన్నమ్మ. పోలీసు డిప్యూటి సూపరింటెండెంటుగా తండ్రి రిటైరైరి. యం.ఏ. చదివి న్యాయశాస్త్ర పట్టభద్రులైరి. ఆ దినాలలో నేరుగా నావికాదళమునకు తీసుకొనబడిన భారతీయులలో వీరు ప్రథములు. అది మొదలు క్రమముగా అనేక పదవులను కీర్తిప్రదముగా పాలించి నేడీ ఉన్నతోద్యోగమునకు వచ్చియున్నారు.

## డాక్టర్ బడి రామలింగారెడ్డి

మైసూరు ప్రభుత్వ వైద్యశాఖా డైరెక్టరుగా పనిచేసి రిటైరు అయినవారు. వెంకటగిరి రాజాగారి పాఠశాలలో వీరు విద్యార్థిగావుండు కాలమున ఫుట్ బాల్ ఆటగాడుగ మహాప్రవీణుడుగా నెన్నబడినాడు. ఉన్నత వైద్యవిద్యకు వెడలినపుడు హాకి ఆటగాడుగా పేర్గాంచినాడు. మైసూరు రాష్ట్రమున ఉద్యోగమున ప్రవేశించి సంస్థానాధిపతులకు ప్రీతిపాత్రుడై మిత్రులను ఆదరించి చుట్టముల చేరదీసి ప్రేమపాత్రుడై యుండిరి.

ఇవి ఈ మండల కీర్తిజ్యోతుల ఉదంతము.

చిత్రవిచిత్రములు-17.

## "సింహపురి చిన్నతరహా సాలార్‌జంగ్ మ్యూజియం"

నెల్లూరు పొగతోటలో డాక్టర్ యం. శ్రీనివాసరావు, ఎల్.ఎం.పి. గారున్నారు. వీరిదొక చిత్రమైన కళాదృష్టి. సృష్టిలోని సర్వవస్తువులు వీరికి రసప్రేరకములే. గత ఇరవై ముప్పై సంవత్సరములనుండి వీరు వివిధ ప్రదేశములనుండి సేకరించిన వస్తు సముదాయము చాల విలువైనది. వీటిలో వివిధములైన గాజు, పింగాణీ, పోర్సెలిన్, చందనపుకొయ్య పరికరాలు, నెల్లూరు పరిసర ప్రాంతాలలో లభ్యమైన లోహాలు, రసాయనిక ద్రవ్యాలు— ఇట్లా వీరు సేకరించి, తమ యింట్లో అమర్చిన వివిధ వస్తుజాలము చూపరులకు హాయి గొల్పుతుంది. ఈ వస్తు సంచయాన్ని కస్తూరిబా పారిశ్రామిక పాఠశాలకు బహూకరించడం మిక్కిలి సంతోషించదగిన విషయం.

వీరి యిల్లు "శ్రీనివాస్"లో ముందువెనుకల అనేక చిత్రవిచిత్రాలైన వృక్ష సముదాయముతో పెంచినతోట Botany (వృక్షశాస్త్ర) విద్యార్థులకు ఒక చిన్న ప్రయోగశాల.

♦ ♦ ♦ ♦ ♦

చిత్రవిచిత్రములు-19.

## తిక్కనపేరు 'తిక్కన' తిక్కన కన్న ప్రాచీనమైనదే

క్రీ. శ. 968–69? నాటి శాసనము పొదిలి తాలూకా సన్నమూరు గ్రామమున నున్నది. అయ్యది అచ్చటి శ్రీ రామలింగేశ్వర దేవాలయమున కెదురుగా దొఱకినది.

నె. శా. పే. 1201. పొదిలి 38. దానశాసనము.

అందు:—

19...దీనికి సాక్షి జేసరట్టయు
20...యు మఱుపూరి తిక్కనయు—
21...కల్లెకయు వీరి ఉభయ సన్మదబు (సమ్మతంబున)
22...న వ్రాసినవారు తిప్పనయుం—

ఇందలి సాక్షి: మఱుపూరి తిక్కన.

చిత్రవిచిత్రములు-20.

## పాతాళగంగ [ARTESIAN WELL]

నెల్లూరు తాలూకా, మైపాడు, కొత్తపాళెం సమీపమున కోడూరు ప్రాంతమున ఇసనాక కామిరెడ్డి, నాగారెడ్డివారి కుటుంబముల భూములలో సుమారు 40 సం॥ క్రింద ఒక శాశ్వత జలోద్భవము (నీరును పైకి చిమ్ముట) కనుబడెను. ఆ నీటితో ఈనాటికిని 10 నుండి 20 ఎకరములు మాగాణి పంట కనువుగ సాగు కాబడుచున్నది. ఇట్టివి మరెక్కడను కానరాలేదు. ఫ్రాంసులో ఇట్టివి ప్రథమమున కనుగొనిరి.

ఇందలి సూక్ష్మమేమన భూగర్భమున జలప్రవాహము లుండును. ఆ ప్రవాహము ఒక స్థాయిలో గాక ఎత్తు పల్లములుగ పాఱుచుండును. తగ్గు స్థాయిలో పారు ప్రవాహ ముండుచోట త్రవ్వి, ఆ జలప్రవాహము తగిలిన, ఆచోట నీరు యిరుప్రక్కల నుండు ఎత్తులనుండి ఒత్తిడిచే పైకి చిమ్మబడును. ఈ ఉద్భవము ఎడతెగనిదై యుండును.

♦ ♦ ♦ ♦ ♦

చిత్రవిచిత్రములు-21.

నెల్లూరున 1956_57 సం॥ సర్వలోక విఖ్యాతుడైన కంటివైద్యుడు పద్మశ్రీ డాక్టరు మోదీగారు ఉచితముగ, కంటిజబ్బువారికి వైద్యముచేసి సుమారు 600 మందికి బాగుచేసినారు. శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారి దీక్షతో, అనేకులు అందు ముఖ్యముగ నెల్లూరు మునిసిపాలిటివారు ధన, వస్తు శ్రమ సహాయము చేసిరి. ఈ ఆసుపత్రి వి.ఆర్. కాలేజీలో జరుపబడినది.

డా. మోదీగారి కంటి వైద్యము నభూతో నభవిష్యతి. ప్రతి సంవత్సరమునను, గత పది సంవత్సరములుగా పాశ్చాత్య దేశీయులు, వీరిని పిలిపించికొని, వారి వారి దేశములలో వీరిచే ఆపరేషను చేయించుకొనుచున్నారు. ఇదియే వీరి ప్రతిభ, ధర్మవీరత్వము, నేత్ర దాతృత్వము. రోగియొద్ద ఏలాటి ప్రతిఫలము కోరకుండుటయే వీరి విఖ్యాతికి తార్కాణము. ఇటీవల అమెరికాలో ఈ వైద్యశిఖామణి కంటి శస్త్రచికిత్స చేయుచుండ టెలివిజన్ ద్వారా కోట్ల కొలది జనులుచూచుట తటస్థించెను.

# 6 B

# ★ నెల్లూరి నెఱవాదులు ★

సాహిత్యరత్న, సరసకవి శ్రీ మోచర్ల రామకృష్ణయ్య
అధివక్త - నెల్లూరు

"అఱువది నాలుగు విద్యలు నఱువదినాలుగు దినంబులంతన వారల్
నెఱవాదులైన కతమున నెఱనొక్కొక్కనాటివినికి నేర్చిరిలేశా!"

అని శుకమహర్షి పరీక్షిన్నరేంద్రునకు బలరామకృష్ణులను గూర్చియు వారి విద్యార్జనమును గుఱించియు చెప్పినట్లు తెలుఁగు భాగవతము. పోతనామాత్యుఁడు బలరామకృష్ణులను నెఱవాదులని పేర్కొనియున్నాఁడు. నెఱవాదులనఁగా నేర్పులని యర్థము.

నానారంగములలో నేర్పులుగా వాసిగన్న నెల్లూరివారు ఎందఱో కలరు. తిక్కన సోమయాజి మనుమసిద్ధి, ఖడ్గతిక్కన, కేతనవంటి మహనీయులు లబ్ధప్రతిష్ఠులు: చరిత్రకెక్కినవారు. చిటిపెద్దప్రభువు సకల దిగ్జేతగా పశస్తి వహించి నెల్లూరులో రాజ్యమేలెను. ఆయనంగూర్చి శ్రీనాథుఁడు తన శృంగారనైషధములో ఇట్లు పేర్కొనినాఁడు :

"కుటిలారాతి వరూథినీ ధవశిరః కుట్టాక ధాటీమహా
పటహధ్వాన విపాట్యమాన దశదిగ్భాగుండు; త్రైలోక్యసం
పుటపేటీ పరిపూర్ణకీర్తిమయకర్పూర ప్రకాండుండు, శ్రీ
చిటిపెద్దప్రభుఁడొప్పె విక్రమసింహాసనాధ్యాసియై.

శ్రీనాథమహాకవియును నెల్లూరు మండలము వాఁడనియు, కాల్పట్ణ నామాంతరముగల కృష్ణాపట్ణ నివాసియనియు పెద్దలు చెప్పుదురు. ఆయనచే హరవిలాసమునఁ గుర్తింపఁబడిన పావాణిసెట్టియు ఆయన కుమారుఁడు అవచి తిప్పయ్యయు నెల్లూరి వారలే,

"సింహ విక్రమ పట్టణ శ్రేష్ఠుఁడైన సెట్టి జగజెట్టి పావాణి సెట్టివిభుఁడు
ఘనుఁడు నగరేశ చంద్రశేఖర పదాబ్జ వందనానంది తాత్ముండు వంశకరుఁడు"

అని కదా శ్రీ నాథునిచే బావాణిసెట్టి ప్రశంసింపఁ బడినాఁడు. "నగరేశ చంద్ర శేఖరుఁడు" మూలస్థానేశ్వరుఁడు కావచ్చును. నాటికొండలు మహనీయులు ఈ వ్యాసమున ఉగ్గడింపబడుచున్నారు.

క్రీస్తుశకము పదునెనిమిదవ శతాబ్ది కడపటి భాగమున ఆంగ్లేయుల మదరాసు ప్రభుత్వ వ్యవహారములలో ప్రముఖపాత్ర వహించిన అవధానము పాపయ్య అసమాన ప్రతిభా ప్రాభవముగల రాజతంత్ర ప్రవీణుఁడు. ఈ మేధావి నెల్లూరు మండలమువాఁడు: తుమ్మగుంట ద్రావిడ బ్రాహ్మణ విద్వత్కుటుంబమున జన్మించినవాఁడు: అనేక భాషలు నేర్చినవాఁడు: కుంఫిణీ దొరతనమునారికి వాదోడు వేదోడుగా వర్ధిల్లిన "ద్విభాషి." ఈ "ద్విభాషి" శబ్దమే "దుబాష్" అను వికృతినందినది. కొంతకాలమీ మనీషి మద్రాసు ఆక్టింగ్ గవర్నరుగా వ్యవహరించినాడని జనశ్రుతి. ఆనాటి వేంకటగిరి ప్రభువు పాపయ్యగారి విలువగల పలుకుబడి సంపాదించుకొనుట కెంతేని శ్రమపడి యెంతో లాభము పొంది తన కృతజ్ఞతా సూచకముగా పాపయ్యగారికి సూళూరుపేట పరగణాలో ఒక గ్రామమును దత్తమొనర్చినాఁడు. అది యిప్పటికిని పాపయ్య వంశీయులు అనుభవించు చున్నారు.

మదరాసు గవర్నరు హాలెండుకు పాపయ్య దుబాసిగా నుండిన కాలమున హాలిబర్టన్ అను ఆంగ్లేయాధికారికి ఒక సందర్భమున అవమాన పరిస్థితి కల్గించి, అతని యాగ్రహమునకు పాత్రుఁడయ్యెను. హాలిబర్టన్ పగపట్టి పాపయ్యపై రాజద్రోహాభియోగము తెచ్చెను. 1792 వ సంవత్సరము జులై నెల 11, 12, 13 తారీకులలో విచారణ జరిగెను అభియోగము తెచ్చినవాఁడు శ్వేతముఖుఁడు; నిందితుఁడు నీలవర్ణుఁడు. దొరతనము "కుంఫిణీ" వారిది. ఇట్టి పరిస్థితులలో కేసు ఎట్టిదిగా నుండవలయునో అట్లే తారసిల్లినది. పాపయ్య దోషి యని న్యాయాధికారులచే నిశ్చయింపఁ బడెను. ఆయన నిర్బంధితుఁ డయ్యెను. నిర్బంధమును ఆయన ఎచ్చట అనుభవించెనో ఆ వీధి ఇప్పటికిని చెన్నపట్టణమున (చూళై) అవధానము పాపయ్య వీధిగా విఖ్యాతమై యున్నది. పాపయ్య ఆంగ్లేయ కథాసారస్వతమునఁ జొచ్చుకొని చిరస్థాయిగా నిల్చియున్నాఁడు. సుప్రసిద్ధ కథారచనా ధురంధరుఁడు సర్వాల్టర్ స్కాట్ వెల్వరించిన "ది సర్జన్స్ డాటర్" అను పేరఁబరఁగు నవలలో దుబాసి పాపయ్య ఒక ప్రముఖ పాత్రగా చిత్రింపఁబడియున్నాఁ డని ఆంగ్లేయ వాఙ్మయములో పరిచయముగల సరసు లెఱుంగుదురు.

అతిప్రయాసకులోనై ఆంగ్ల విద్యాభ్యాసముచేసి, న్యాయశాస్త్ర నిష్ణాతుఁడై యావద్భారతదేశ న్యాయవాదులలో అగ్రశ్రేణి నందుకొని అడ్వొకేటు జనరలుగా నియమితుఁడై భారతరాజ్యాంగ నిర్మాతలలో సుప్రసిద్ధుఁడుగా విరాజిల్లిన అల్లాడి కృష్ణస్వామయ్య నెల్లూరు మండలములోని పుదూరు వాస్తవ్యుఁడు.

అనేక సంవత్సరములు పబ్లిక్ ప్రాసిక్యూటరుగాను, గవర్నమెంటు ప్లీడరుగాను పనిచేసి, పిమ్మట జిల్లా జడ్జీగా నియమితుఁడై, ఆవల మద్రాసు హైకోర్టు జడ్జీగా విరాజిల్లి కీర్తిశేషుఁడైన యాహ్యాలీ సాహెబు నెల్లూరి పౌరవతంసులలో నొకఁడు.

లండనునగరి కరిగి, ప్రీవీకవున్సిలులో సైతము వాదించు అవకాశమును ఉపయోగించుకొనఁ గలిగిన అదృష్టశాలి ఆమంచర్ల సుబ్బుకృష్ణరావు, సింహపురీయుఁడు.

ఆంగ్ల భాషలో ఉత్తమ రచయితగా, పత్రికా సంపాదకుఁడుగా జగద్విఖ్యాతినొందిన ఖాసా సుబ్బారావును గన్న సింహపురి నిశ్చయముగా ధన్యురాలు.

వార్తాపత్రికా రంగమున మాననీయుఁడై బొంబాయి నగరమున నలుబది యేండ్లు జీవితము గడపి యిటీవలనే తనువు చాలించిన నిష్కలుష హృదయుఁడు భైరవరసు హనుమంతరావు జన్మించిన పురము సింహపురమే.

"భారతి" పత్రికా సంపాదకుఁడుగా రమారమి రెండు శతాబ్దుల కాలము పరిశ్రమించినవాఁడు, బహుభాషాకోవిదుఁడు, మళయాళ భాషనుండి రెండు నవలలను తెలుఁగులోని కనువదించి ఆంధ్ర సరస్వతి కర్పించిన నెల్లూరి రచయిత గన్నవరపు సుబ్బరామయ్య మనకు స్మరణీయుఁడు.

"వర్ణాశ్రమ సంస్థాపనము" అను వారపత్రికను సమర్థుఁడై పెక్కేండ్లు వర్తిల్లఁజేసినవారు, కాశీపట్టణమునకు కాలినడకతో అరువది యేండ్లనాఁడు పయనించి, జగన్నాథాశ్రమిస్వామి సన్నిధిలో మంత్రశాస్త్రము నభ్యసించినవారు, శతాహ్నికదేవీ మహాయాగము జరిపినవారు, జ్యోతిష్యపాండితీ మండనుఁడుగా విలసిల్లినవారు ఆహితాగ్నులు తొంబది సంవత్సరములు పవిత్ర జీవితము గడిపి 2-1-62 తేదీన కావలిలో ఆశ్రమమువంటి స్వగృహములో పరమపదించిన ఋషితుల్యులు పిన్నంరాజు వేంకటసుబ్బయ్యగారు నెల్లూరు మండలీయులగుట మనభాగ్య విశేషము.

నెల్లూరి మండలము విద్యారంగమున అనాదిగా అత్యంత ప్రశస్తి వహించిన దనుటకు ప్రబలసాక్ష్యమున్నది. అనేక శాస్త్రములలో అందెవైచిన చేయియై, నవద్వీప పండితులచే మెప్పు సంపాదించి, యెన్నో గ్రంథములు రచించిన విద్యారణ్య పంచాననుడు విక్కిరాల రామచంద్రాచార్యుడు సింగరాయకొండ చేరువనున్న కలికివాయిగ్రామము నెలవుగా వర్ధిల్లిన అంతర్వాణి. అనర్ఘములైన ఈ మహాత్ముని రచనములు అప్రకటితములు ఈయన కుమారుడగు శేషాచార్యుల యొద్ద నున్నవి. వానిని ముద్రించుటకు వలసిన సౌకర్యములు కల్పించుట సాహిత్యఅకాడమీవంటి సంస్థల కర్తవ్యము.

మఱియొక మహావిద్వాంసుడు విశ్వనాథ కళాస్తోత్ర గ్రంథకర్త నెల్లూరు మండలీయుడు గంద్రకోటకుమారస్వామిశాస్త్రి. ఈయన స్వగ్రామము బుచ్చిరెడ్డిపాలెము సమీపమునందున్న మినగల్లు. ఆంధ్రసంస్కృత భాషలయందు అనర్గళ పాండిత్యముగల దిట్టయై సారస్వతవిషయములను గూర్చియేగాక ఆర్షమత రహస్యములు వెల్వరించుచు ఈమాన్యుడిచ్చుచుండిన ఉపన్యాసములు వేలకొలది శ్రోతలను ఆకర్షించినవి. "ప్రౌఢసరస్వతి" యను బిరుదముతో ఆర్షమత ప్రచారము, కావించి, అహోబలము శ్రీశైలము మహానంది మున్నగు క్షేత్రములలో జీర్ణస్థితిలోనుండిన దేవాలయముల నీమహానుభావుడు పునరుద్ధరింపజేసి ఉత్సవాదులు క్రమముగా సాగుటకు వలసిన యేర్పాటులు కావించెను: యాత్రికులకు అన్నప్రదానాది సౌకర్యములను కల్పించెను. తుంగభద్రాతీరమునందున్న అలంపూరు పట్టణమున దన చరమ దశలో నివాసమేర్పఱచుకొని శివధ్యాన తత్పరుడై యిహలోక జీవితమును సమాప్తముచేసెను. ఈపుణ్యమూర్తి విద్వత్కవిత్వమునకు మచ్చుతునకలుగా క్రిందిపద్యములను పొందుపఱచు చున్నాను.

చం॥ హరిహరభక్తులై సముదితాద్వయతత్త్వము నేర్పఱింపగే
సరి పురి కుత్తరంబున లసత్సరిముజ్జ్వల దక్షిణాశ భూ
సురలోక యాలయంబు మునుజొప్పడ నిల్పిననాటగోలె, శ్రీ
హరిహరనాథ సంజ్ఞను శివాచ్యుతు లచ్చోటనొంట నిల్చిరా.

శా॥ పాటూరన్ నసయించు తిక్కన మహావైదాంతికుండొట న
ప్పాటన్ వేయిటవచ్చి యద్వయపరబ్రహ్మార్థసందర్భమై
వాటంబేర్పడునట్లు శ్రీహరిహరప్రఖ్యం బరేశుం గృతి
స్ఫోటార్థప్రదుగాగ శ్లేషముగ విస్ఫూర్తిన్ నుతుల్ సేయుచోన్.

కం॥ ఆద్యంత పద్యముల నన వద్యవిశేషార్థ ఫణితి భవకేశవులు
ద్వ్యద్వైతనంబునఁ బండిత వేద్యత నుతులగుటఁ గానమే వినమె బళీ!

నెల్లూరికి ఉత్తర దిక్కునఁ బినాకినీ నదికి దక్షిణ భాగమున అద్వైతులగు బ్రాహ్మణ్ములు కొందఱు నెలకొల్పిన హరిహరాలయము ఉన్న సంగతి ఈపద్యత్రితయములోని ఆద్యపద్యమువలన మనకు స్పష్టమగుచున్నది.

తెలుగునేకాక గీర్వాణభాషలో సైతము హృద్యమయిన కవిత్వము చెప్పిన మనీషా మాన్యులు నెల్లూరివారు కలరు. ప్రహ్లాదుని వంటి పరమభాగవతోత్తముఁడు, అన్నవరపు వేంకటరాఘవశాస్త్రి ఆస్తికులందఱకు ప్రాతస్స్మరణీయుఁడు. ఉద్దండ పండితులగు ఇంగువ వెంకట రామశాస్త్రిలు, పట్టాభి రామశాస్త్రులు మున్నగు వారియొద్ద కావ్యనాటకాలంకారములు చదివి, కాశీయాత్రచేసి, శాస్త్రపరిజ్ఞానము నభివృద్ధిపఱచుకొని, దక్షిణదేశమున కరిగి శ్రీ పెరుంబుదూరు చేరి పంచార్ జీయర్ స్వామి సన్నిధిలో రామానుజ సిద్ధాంత విషయముల నాకళింపుచేసికొని, కాంచీపుర వరదరాజస్వామిని సేవించి, కుంభఘోణ సమీపస్థమగు తిరువెననల్లూరు నివాసులు మహామహోపాధ్యాయ రామసుబ్రహ్మణ్యశాస్త్రిగారి యంతేవాసియై శ్రీ మచ్ఛంకరభాష్యము శాంతిచేసిన మహానుభావుఁడీతఁడు. ఈయనను సేవించి జ్ఞానము సంపాదించిన వారనేకులుండిరి. శిష్యులకు పాఠముచెప్ప వీరినేర్పు అనుపమానము. "వీరి ధారణ అద్భుతము. శంకరసూత్ర భాష్యమునకు ముఖ్యములగు టీకలైన బ్రహ్మవిద్యాభరణము, ఆనందగిరీయ రామానందీయము వాచస్పతీయము మొదలగు గ్రంథములనుండియు భాగవత విష్ణుపురాణములనుండియు సందర్భము వచ్చినప్పుడు రెండు మూడు పంక్తుల పొడవగు వాక్యములను శ్రీ రాఘవశాస్త్రిలవారు గడగడ క్రుమ్మరించెడివారు" అని ఈపూజ్యుని శిష్యులలో నొకఁడగు వడ్లమూడి బ్రహ్మయ్య పంతులు కావించిన ప్రశంస స్మరణార్హము. సుధామధురకవితాసృష్టికర్త యీ పుణ్యమూర్తి రచించిన చైతన్య లీలాసుధానిధి యను సంస్కృత కావ్యము నేఁటికిని ప్రకాశితముగ నిల్చియుండుట ఆంధ్రుల దురదృష్టము "బ్రహ్మసూత్రార్థ దీపిక" యను గ్రంథము ఈయనచే రచితమై 1897 వ సంవత్సరమున ముద్రితమై ప్రకటితమైనది. చైతన్యలీలా సుధానిధియొక్క వ్రాతప్రతి ఈ కవివరేణ్యుని కుమారుఁడగు శ్రీనివాసులయొద్ద నున్నది.

వాణిజ్యలక్ష్మీ కటాక్షమునకు పాత్రుఁడైన మఱియొక సింహనగరమండలీయుఁడు కోట-నరకేసరి. ఈయన చిన్ననాఁటి పేరు నరసింహము. కోట గ్రామమే యీయన యభిజనము. చెన్నపురిచేరి ఆయుర్వేద విజ్ఞానము వర్ధిల్ల జేసికొని, స్త్రీల వ్యాధుల నివారింపఁజేయు "లోధ్ర" యను ఔషధమును తయారుచేయుటలో అందె వేసినచేయిగా పెంపొందించినాఁడు. దానికితోడు ఇంక రెండు మందులను అర్కామృతములను జోడింపఁ జేసినాఁడు. అపారముగా విత్తమార్జించినాఁడు. కే. యన్ కేసరివారి రత్నత్రయమునకు యావద్భారతఖ్యాతియేకాదు జగద్విఖ్యాతి చేకూర్చుకొనఁ గల్గినాఁడు. అంబర చుంబితములైన సౌధములను మద్రనగరమున నిర్మింపజేసినాఁడు. ముద్రాయంత్రములను నెలకొల్పి "గృహలక్ష్మి" యను స్త్రీజనాభ్యుదయ మాసపత్రికను స్థాపించి సారస్వత వరివస్య కావించినాఁడు. దానధర్మములాచరించి కీర్తిశేషుఁడైనాఁడు.

మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజిలో అనేక సంవత్సరములు ఆంగ్ల భాషాచార్యులుగానుండి, సుప్రసిద్ధ రచయితగా వెల్గొందిన శ్రీ దిట్టకవి సుబ్రహ్మణ్యశర్మగారు (డి.యస్.శర్మ) నెల్లూరు తాలూకా లేబూరు గ్రామమున జన్మించినవారు.

ఆంగ్లేయ చికిత్సా ప్రక్రియలను గూర్చి విశేషముగా, పరిశ్రమించి వ్యాసములువ్రాసి ప్రకటించియు, పరిశోధన లొనర్చియు వైద్య శాస్త్రోపన్యాసాలుగా ఉన్నత పదవులధిష్ఠింపఁ గలిగిన డాక్టరు శ్రీ డి. వి. సుబ్బారెడ్డి (దండే వెంకటసుబ్బా రెడ్డి) గారు. M. B, B. S; M. Sc, ప్రొఫెసర్-ఉస్మానియా యూనివర్సిటీ-నెల్లూరివారు. "ఇంటర్నేషనల్ ఎన్ సైక్లోపీడియా ఆఫ్ మెడిసిన్" అను మహా గ్రంథమున సుఖసంకట వ్యాధులను గూర్చి వీరు విలువగల వ్యాసము ప్రకటించియుండుట ప్రశంసా పాత్రము.

# 6 C

# నెల్లూరు జిల్లా ప్రముఖ న్యాయవాదులు

శ్రీ పులుగుండ్ల ఆదినారాయణమూర్తి, బి.ఏ., బి.యల్. నెల్లూరు.

నెల్లూరు మండలమున అఖండకీర్తి గడించిన న్యాయవాదులు పలువురు కలరు. అందు కొందరు మనమండలము నందేకాక, రాష్ట్రములందును పరరాష్ట్రములందును ఖ్యాతినార్జించిన పుణ్యమూర్తులును గలరు. అట్టివారిలో కొందరిని గూర్చిన వివరములిట నుగ్గడింపబడును.

**కీ. శే. టి. వి. వేంకటరామయ్యగారు :**

వీరు తమిళ దేశస్థులు. అయినను బాల్యముననే నెల్లూరికివచ్చి, చిరకాలము న్యాయవాదులుగ నుండి, ప్రసిద్ధిచెందిరి. సివిల్ దావాలు విచారణ జరుపుటలోను, లాపాయింట్లు ఆర్గుమెంటులోను కడు సమర్థులని పేరుగాంచిరి. వారు కొంత కాలము నెల్లూరు పురపాలక సంఘాధ్యక్షులుగకూడ నుండిరి,

**కీ. శే. యఫ్. టి. నార్గుదార :**

వీరు పట్టభద్రులే కాని. బి. యల్. చదివినవారు కారు. మొదటిగ్రేడు ప్లీడరు పరీక్షయం దుత్తీర్ణులైరి. అయినను గొప్పగొప్ప సివిల్, క్రిమినల్ కేసులలో సాక్షులను పృచ్ఛచేయుటలో నిపుణులని పేర్గాంచిరి.

**కీ. శే. చివుకుల మాలెకొండయ్య :**

వీరు కొలది కాలము టి. వి. వేంకటరామయ్యారు కడ జూనియరుగా నుండిరి. నెల్లూరున్యాయవాదులలో ప్రముఖులని కీర్తిగాంచిరి. ప్రతికేసును క్షుణ్ణముగ నర్థముచేసికొని, వాదించి, విజయముగాంచెడి వారని ప్రతీతి. వీరి కొమారులు సత్యనారాయణమూర్తి, రాఘవయ్యగార్లు ప్రస్తుతము న్యాయవాదులుగ నున్నారు.

**కీ. శే. బి. రామస్వామి అయ్యరు :**

వీరు కుప్పం వాస్తవ్యులు. బి. యల్. ప్యాసై నెల్లూరికివచ్చిన అనతికాలములోనే బారులీడరైరి. వారి వాగ్ధాటి అమోఘము. కష్టించి పనిచేయువారని

పేరుగాంచిరి. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులైన కీ. శే. బి. సోమయ్యగారు. వీరి అన్నగారు. వీరి కుమారులలో నొకరగు బి. వెంకట రమణగారు సబ్ జడ్జిగాను, మరొకరు బి. విశ్వనాథంగారు అఫిషియల్ రిసీవరుగాను పనిచేయుచున్నారు.

కీ. శే. టి. మణ్ణుగంపిళ్లై:

సెషన్సు కేసులు జరుపుటలో వీరు చాలనిపుణులు. లఘువుగ, చాకచక్యముతో క్రాసు చేయుటలో ప్రసిద్ధులు.

కీ. శే. మైదవోలు చంగయ్యపంతులు:

వీరు చాలకాలము నెల్లూరులో పబ్లికు ప్రాసిక్యూటరుగను, గవర్నమెంటు ప్లీడరుగను పనిచేసిరి. నిష్పక్షపాతముగ ప్రాసిక్యూషన్ కేసులు జరిపెడివారని పేరు గాంచిరి. వీరు కొంతకాలము హిందూమతాలయముల బోర్డు కమీషనరుగ నుండిరి. కొంతకాలము మునిసిపల్ ఛేర్మెనుగాను, రాజాగారి కళాశాలా కమిటీ ప్రెసిడెంటుగాను ఉండిరి. సభలకు అధ్యక్షించి, కార్యసరణిని నడుపుటలో నిపుణులు. వీరి పుత్రులు శ్రీ శేషాచలపతిగారు ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగానుండిరి. వీరు భారత రాష్ట్రపతి డా. రాధాకృష్ణగారి వియ్యంకులు.

కీ. శే. మండభూషి నరసింహాచార్యులు:

వీరు చాలకాలము వేంకటగిరిరాజాగారి వకీలుగనుండిరి. చిరకాలము వేంకటగిరి రాజాకళాశాల కమిటీ సెక్రటరీగా పనిచేసిరి. వారికుమారులు వరాహాచార్యులును రాజాగారి ప్లీడరుగానుండి విశ్రాంతి గైకొనుచున్నారు. రెండవకుమారుడు గోపాలాచార్యులు అధివక్త, గాయకుడు. ఈ సర్వస్వమున వ్యాసకర్తయునై యున్నాడు.

కీ శే గ్రిద్దలూరు సాంబశివరావు:

వీరు కొంతకాలము శ్రీ టి. వి. శివరామయ్యగారికడ జూనియరుగా నుండి ఘటికులని ప్రసిద్ధిచెందిరి. విచారణ జరుపుటలోను, ఆర్గుమెంటు చేయుటలోను నిపుణులు. రమణమహర్షి భక్తులు.

కీ. శే. ముంగమూరు విశ్వనాథరావు:

క్రిమినల్ లాయరుగా ప్రసిద్ధిచెందినవారు. నిర్భయముగా వాదించు నేర్పుగలవారు. వీరికుమారులు లక్ష్మణరావుగారు హైదరాబాదులో ప్రాక్టీసు చేయుచున్నారు.

కీ. శే. పి. వి. కృష్ణయ్యగారు :

వీరు వకీలయిన కొలదిరోజులలోనే ఎక్కువ ప్రాక్టీసు సంపాదించిరి. కొంత కాలము గవర్నమెంటు ప్లీడరుగ నుండిరి. కళాభిమానులగుటచేత కష్టపడి "ఆంధ్ర సభను" ప్రసిద్ధిలోనికి తెచ్చిరి. శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు రచించిన "వివేకానంద చరిత్రమును" కృతిపొందిరి.

కీ. శే. యేనుగు రాఘవరెడ్డి :

కష్టపడి అభియోగముయొక్క పూర్వాపరములను అవగాహన చేసికొని, పట్టుదలగా వాదించెడివారని ప్రతీతి చెందినవారు. పెక్కు మత గ్రంథములందును గణిత శాస్త్రములందును కృషిచేసినవారు.

కీ. శే. కొండూరి రంగయ్యశాస్త్రి :

వీరు చాలకాలము కావలిలో ప్రాక్టీసుచేసి ప్రసిద్ధి చెందిరి. సంస్కృతాంధ్ర ములందును ప్రవేశము కలవారు. వారి అల్లుడు శ్రీ యం. వేంకటనారాయణయ్య గారు కావలిలోను, కుమారుడు శ్రీ కే. శ్రీనివాసమూర్తి నెల్లూరులోను ఇప్పుడు ప్రాక్టీసు చేయుచు నుంచి పేరుప్రతిష్టలందుచున్నారు.

కీ. శే. పి. ఆదినారాయణయ్య :

వీరు చాలకాలము నెల్లూరులో న్యాయవాదులుగ నుండి, ఆవల మునసబు అయినారు. వీరు శ్రీ పి. పున్నయ్య తండ్రిగారు. వీరి పెద్దకుమారుడు శ్రీ పి. చెంచయ్య గారు మద్రాసులో న్యాయవాదిగా నుండి ఆవల పుదుక్కోట ఛీఫ్ కోర్టు జడ్జీగా నుండిరి. మరియొక కుమారుడు పి. కుటుంబరావు డాక్టరుగను, మరియొక కుమారుడు పి. ఆది నారాయణరావుగారు వేదాంతోపన్యాసకులుగను పనిచేయుచున్నారు.

కీ. శే. యస్. నరసింహారావు :

వేంకటగిరి వాస్తవ్యులు. వీరు బి. యల్. ప్యాసయి న్యాయవాది వృత్తి నవలంబింపలేదు. వీరు అనేక పర్యాయములు రక్తదానముచేసి ప్రసిద్ధి చెందిరి.

కీ. శే. నంగోలు. వేంకటరంగయ్య :

వీరు చాలకాలము నెల్లూరులో న్యాయవాదులుగ నుండిరి. వారు సంస్కృత, ఆంధ్ర, హిందీభాషలలోకూడ గొప్ప పండితులు. గొప్ప చరిత్ర పరిశోధ

కులుగకూడ విఖ్యాతి చెందెరి. వీరు సంస్కృతములోని భరతనాట్య శాస్త్రము లోని 4 వ అధ్యాయమగు తాండవలక్షణమును ఆంగ్లములోనికనువదించిరి. రాజవోలు, బ్రాహ్మణక్రాక శాసనములను పరిశోధించినవారు కొందరు. నెల్లూరు గొప్పవారు అనుపేరుతో వేరొక పుస్తకమునుగూడ రచించిరి.

**కీ. శే. కోట. నరసింహం పంతులు :**

వీరు నెల్లూరుజిల్లా కోర్టులో నౌకరిలో చేరి, ఆతర్వాత మునసబు, సబ్ జడ్జిగా పనిచేసి, రిటైరై, పెన్షనుపుచ్చుకొని, కొన్నాళ్లు న్యాయవాదిగానుండి కాల ధర్మనుందిరి. గొప్పవక్త వేదాంతమునిన వీరి కభిమాన మెక్కుడు.

**కీ. శే. టంగుటూరు. ప్రకాశం పంతులు :**

వీరు జగమెరిగిన బ్రాహ్మణులు వంగోలు తాలూకా వల్లూరువారి జన్మ భూమి. 1910 సం. వరకు వంగోలు తాలూకా నెల్లూరు మండలమున చేరియుండెను. వీరు కొంతకాలము రాజమహేంద్రనగరము నందును. ఆతర్వాత మద్రాసు హైకో ర్టులోను సుప్రసిద్ధ న్యాయవాదులుగ నుండిరి. వారు నెల్లూరు న్యాయవాదులనుట కంటెను యావద్భారత ధర్మవీరులనుట యుక్తమని తలంపవచ్చును వారినిగూర్చి వ్రాయుట కరదీపికతో దిననాథుని చూపుట వంటిదగును. సంపాదించిన ఆస్తి నం తయు దేశసేవకై వ్యయించిన త్యాగధనుడు. తెల్లదొరల తుపాకిగుండ్లకు 'రొమ్ము' చూపిన హంవీరుడు. ఆంధ్రకేసరి బిరుదము వారిపట్ల సార్థకము.

**టి. వి. శివరామయ్య :**

వీరు శ్రీ టి. వి. వేంకటరామయ్యగారి వద్ద జూనియరుగా కొలది నెల లుండి బారులీడరైరి. కేసు విచారణ జరుపుటలోను, కేసు ఆర్గుమెంటు చేయుట లోను సిద్ధహస్తులు. వీరి సమయస్ఫూర్తి, వాదసరణి ప్రత్యేక ప్రశంసార్హములు. ఇప్పుడు వయోవృద్ధులు. "బాటిల్ వాలాకేసు" వంటి రాజకీయకేసులలో పాల్గొని ప్రసిద్ధిపడసిరి. వీరు జరిపిన బాటిల్ వాలాకేసులో మద్రాసు నుండి పబ్లిక్ ప్రాసి క్యూటరు లేట్ వి. యల్. యతిరాజ్ గారు వచ్చి ప్రాసికూషన్ జరిపిరి. అందులో శ్రీ బులుసు. సాంబమూర్తి, పట్టాభి రామయ్య, జయప్రకాశ నారాయణ్ మొద లగువారు సాక్షులుగావచ్చిరి. నాట్యకళయందు వీరికి గల అభిమానము మెండు. చాలకాలము ఆంధ్రసభకు అధ్యక్షులుగ నుండిరి. కొంతకాలము గవర్నమెంటు

ప్లీడరుగను, జిల్లాబోర్డు ప్లీడరుగను ఉండిరి. మునిసిపల్ కౌన్సిలరుగను వి. ఆర్. కాలేజి. కమిటీ సభ్యులుగను పనిచేసిరి. ఇప్పుడును సభ్యులే. కవి సార్వభౌములు ఆస్థానకవులు నగు కీ. శే. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారిచే వ్రాయబడిన "నలచరిత" అను కావ్యమునకు కృతిభర్తలు.

వవ్వేటి. విశ్వనాథరావు :

వీరు కొంతకాలము పబ్లిక్ ప్రాసిక్యూటరుగను, గవర్నమెంటు ప్లీడరుగను, పనిచేసిరి. కష్టపడి పనిచేయువారని ప్రతీతి. పెక్కు ధర్మసంస్థలయందు సంబంధము కలవారు. కోఆపరేటివ్ సంస్థలో చాలకాలము పనిచేసిరి. ధార్మిక ప్రవరులు. ప్రస్తుతము న్యాయవాది వృత్తిని విడనాడిరి.

వి. వేదాంతాచారి :

వీరు కొంతకాలము నెల్లూరులో ప్రాక్టీసుచేసి పిదప మద్రాసునకు వెళ్లి ప్రాక్టీసు చేయుచున్నారు వేంకటగిరి రాజాగారి వకీలుగా నుండిరి. ఎస్టేటుల్యాండు ఆక్టుకు వ్యాఖ్యాతలు.

యస్. మాలకొండారెడ్డి :

వీరు కొంతకాలము నెల్లూరులో పబ్లిక్ ప్రాసిక్యూటరుగానుండి, ప్రస్తుతము హైదరాబాదులో ప్రాక్టీసు చేయుచున్నారు. క్రిమినల్ లా గ్రంథకర్తలు.

ఓరుగంటి వెంకటసుబ్బయ్య :

వీరు చాలకాలము కావలిలో న్యాయవాదులుగనుండి, స్వాతంత్ర్య శంఖారావముతో, వృత్తిని వీడి దేశసేవకు బూనిన దేశభక్తుడు. కారాగారశిక్షల ననుభవించినాడు. ప్రస్తుతము వయోవృద్ధులుగ నున్నారు.

వెన్నెలగంటి రాఘవయ్య :

వీరు కొంతకాలము వకీలుగా పనిచేసి, దేశీయోద్యమమున పాల్గొని కారాగారశిక్షల ననుభవించినవారు. చాలకాలముగ వెనుకబడిన జాతిగానుండు యేనాదుల ఉద్ధరణ కొరకు పాటుపడుచున్నారు. యేనాదుల గూర్చి కూలంకషముగు గ్రంథమును ఆంగ్లమున రచించిరి. కేరళ గవర్నరు శ్రీ వి. వి. గిరి గారి వియ్యంకులు.

మామిడిపూడి రామకృష్ణయ్య :

వీరు కొంతకాలము ప్రభుత్వపక్షమున న్యాయవాదిగా నుండిరి. రామాయణమును వచన గ్రంథముగ వ్రాసిరి. సహృదయులు.

మోచర్ల రామకృష్ణయ్య :

"సరసకవి" సాహిత్యరత్న బిరుదాంకితులు. పెక్కు గద్య పద్య గ్రంథములను రచించి మేటి కవులని పన్నెకెక్కినవారు. గొప్ప నటకులు.

జి. సారంగపాణి :

వీరు 3-4 సంవత్సరములనుండి పబ్లిక్ ప్రాసిక్యూటరుగా పని చేయుచున్నారు. ఎట్టి సిఫార్సులను చెవిని బెట్టక ఉద్యోగ ధర్మమును నెరవేర్చుచు పేరు సంపాదించినారు.

వసంతపురం బాలసుబ్రహ్మణ్యం :

వీరు కావలి న్యాయవాదులైన కీ.శే. వి.కే. వేంకటసుబ్బయ్యగారి కుమారులు. యం.యల్. ప్యాసై మద్రాసులో కీ.శే. అల్లాడి కృష్ణస్వామిఅయ్యరిగారి కడ కొంతకాలము జూనియర్‌గా పనిచేసిరి. ప్రస్తుతము మద్రాసు లా కాలేజీలో ప్రొఫెసరుగా నున్నారు. మేధావి.

కే. విమలమ్మ :

వీరు ఒక్కరే ప్రస్తుతము నెల్లూరులో స్త్రీ న్యాయవాదినిగా నున్నారు. ఈమె ప్రఖ్యాత సాహిత్యవేత్తలైన కీ.శే. గన్నవరపు సుబ్బరామయ్యగారి దౌహిత్రి. డా॥ కే. ప్రసాదరావుగారు ఈమె తండ్రి.

పి.వి. రమణారెడ్డి :

యువకులు, సౌమ్యులు. అధివక్తగా వృద్ధికివచ్చు సమయముననే ప్రభుత్వము వారు గమనించి గవర్నమెంటు ప్లీడరు పదవియందు నియమించి, వీరి గుణగణములకు భూషణమును గూర్చిరి.

నెల్లూరులో న్యాయవాదులుగా నుండి, ప్రస్తుతము
మునసబులు, జడ్జీలు, మేజస్ట్రేటులు అయినవారు.

బి. వేంకటరమణ :

శ్రీ. శ్రీ. బి. రామస్వామిఅయ్య కుమారులు. ప్రస్తుతము సబ్ జడ్జీగా ఉన్నారు.

కే. యం. కృష్ణమూర్తి :

సంగీత విద్వాంసులుకూడాను. అమలాపురం సబ్ జడ్జీగా నున్నారు.

యం. గోపాలాచారి :

విడవలూరు నివాసులు. నెల్లూరులో న్యాయవాదులుగ నుండి ప్రస్తుతము తిరుపతిలో మున్సిఫ్‌గా నున్నారు.

కే. సి. నారాయణరావు :

సంగీతశాస్త్రవేత్తలు, వైణికులు. మదనపల్లిలో మునసబుగా ఉన్నారు.

యస్. వి. రమణారెడ్డి :

కావలిలో న్యాయవాదిగా నుండి ప్రస్తుతము మున్సిఫ్ అయిరి.

టి. శంకరం :

శ్రీ టి. వి. శివరామయ్యగారి కుమారులు. మున్సబు.

జగర్లపూడి చంద్రశేఖరము :

వీరు కావలి వాస్తవ్యులు. ప్రస్తుతము సత్తెనపల్లిలో మునసబుగానున్నారు

దేశభట్ల రంగయ్య :

కావలి న్యాయవాది ముఖ్యులు. ప్రస్తుతము ఢిల్లీలో హరిజనోద్ధర సంస్థకు కార్యదర్శిగా నున్నారు.

# 7

## ★ భారత భాష ★

డా॥ డి. సి. సరస్వతి, యం. ఏ., పి. హెచ్. డి. (మద్రాసు విశ్వవిద్యాలయము)

దేశతః కాలతః ప్రాప్త చిత్రప్రసర శాలినః ।
సాహిత్యస్యాస్య దృశ్యేతే బీజమైక్యం చ సంస్కృతే ॥

అర్థతః శబ్దతశ్చాపి సర్వం భారత వాఙ్మయమ్ ।
ఓతప్రోతతయా వ్యాప్య సంస్కృత బ్రహ్మరాజతే ॥

మనుం వ్యాసం చ వాల్మీకిం కాళిదాసం చ శంకరమ్ ।
కవీంశ్చ శాస్త్రకారాంశ్చ వ్యాఖ్యాతౄన్ మతదేశికాన్ ॥

ఉత్పాద్యనైవ విరతా సంస్కృత ప్రతిభాఖనిః ।
అద్యాపి నవరత్నానాం ప్రసవిత్రీ ప్రకాశతే ॥

ధర్మోబ్రహ్మ రసోనామ శివం సత్యం చ సున్దరమ్ ।
యాత్రిధాతత్త్వమూచేతాం సంస్కృత ప్రతిభాం నుమః ॥

— డా॥ వే. రాఘవభట్టు

సర్వోదేవమయోఽయ మక్షరగణో దేవా మనాద్యాగణా
శ్ఛందో దైవతసద్మ శబ్దనివహో దైవం వచః సంస్కృతమ్ ।
కావ్యం విష్ణుమయం సమస్తమపి తచ్ఛాస్త్రేషు సన్దృశ్యతామ్
దైవీం తాం న గిరం నిపాతయతి యోగర్తే సవన్ద్యః కవిః ॥

మధుర పదధ్వని చారాం ప్రసన్న రూపా ముదారతాదిగుణైః ।
సురమాం రమా మివైనా ముపభుంక్తే విబుధ మూర్ధన్యః ॥

వ్యవస్థా వర్ణానా మతి రుచిర కల్పా వ్యవసితా
తదర్థం ధర్మాణాం విధిరిహ నిగూఢార్థ విపులః ।
విచిత్రా జీవానాం గతిరపిచ శాస్త్రేషు భణితా
సదేమం దైవీ వాక్ సకల జనకల్యాణ మహితా ॥

ప్రతిష్ఠా విద్యానాం నిధిరపి కలానా మవికలా
చిరత్నా గత్నాలీ రజని రుడుభి శ్చంద్ర విమలా ।
దినశ్రీః సర్వస్వం కిముపి విపులం భారత భువః
స్వయంభూ సంభూతా జగతి జయినీ సంస్కృతగిరా ॥

— డా॥ హరిదత్తపాలీవాలే

సంస్కృత వాఙ్మయమొక తరుగని పెన్నిధి, నిరవధిక వారిధి, నాటికిని నేటికిని కరువగని హిమగిరి. మనభారత సంస్కృతికి సంస్కృతభాష పతాక ప్రాయమై ముక్తిదాయకమగు బ్రహ్మవిద్య (ఆధ్యాత్మిక విద్య) కొక ఖనియై యలరారుచున్నది. ఈఖనియం దేపదలేశమును పట్టిజూచినను అర్థరాసుల ననంతముగ నీనుచునేయుండును.

సంస్కృత వాఙ్మయ విస్తరణము నందుగాని తద్విభేద సంఖ్య యందుగాని సరితూగగల భాష మఱియొకటి కానరాదు. దీనితో బహుప్రాచీనము లనబరగు లాటిన్ గ్రీకు భాషల వాఙ్మయముల రెంటినిగూడ పోల్చిచూచిన హస్తిమశకాంతర మున్నది.

నేడు మనము దేశస్వాతంత్ర్యము ననుభవించుచున్నాము. ఈ స్వాతంత్ర్యము సంఘైక్యత మీదను, యీసంఘైక్యత భాషైక్యత మీదను ఆధారపడి యున్నదనుట సువిదితము. కనుక మన దేశపు ప్రాచీన సంస్కృతికి కారణభూతముగా నున్న సంస్కృతభాషా ప్రాముఖ్యతగూడ గమనార్హము. ఇదియే ప్రపంచ సంస్కృతికి గూడ అవలంబ మయినందున యీ సంస్కృతభాషను విశ్వభాషయని కూడ యనవొప్పును.

చారిత్రకముగా నెన్నియో శతాబ్దములకు పూర్వమార్యభాషగా బహుదేశ దేశములకు బయనించి విశ్వవ్యాప్తి చెంది ఇండో యూరోపియన్, ఇండో జర్మానిక్ మొదలగు నామధేయముల బొందిన వేదవాక్కే యీ దేవవాక్కు. ప్రాచీనభాషలన్నిటిలో నేటికిని ప్రచారములో నున్న దీ భాషయే. నేడు విశ్వసంస్కృతిని గౌరవించు ప్రతి విశ్వవిద్యాలయము నందును యీభాష గౌరవనీయస్థానము నలంకరించుచున్నది.

ఈ దేవవాణి వాగ్దేవిని మాలారూపమున మండనమొనర్చు మాలాక్షరములకు (బీజాక్షరములకు) మూలము. ఈబీజాక్షరములలో నేకైకము సహితము నివురుగప్పిన నిప్పువలె నిగూఢమయిన శక్తిని గ్రక్కుశక్తిగలది. ఈ బీజాక్షర కూటమునే భారతదేవి రూపమనిగూడ భావింతురు.

కనుక యీవాఙ్మయము భారతీయుల భాగ్యరాశి. పూర్వులొసగిన పుణ్యసంపద. ఈ సంస్కృత వాఙ్మయస్నేహముతో వెలుగు భారతి సంస్కృతి జ్యోతి విశ్వప్రకాశమై సర్వప్రశంసకు పాత్రమయినది. ఇట్టి వాక్కు విశ్వవ్యాపినియై అనేక భాషలకు సన్నిహితయై భారతదేశ భాషలన్నిటికిని మాతృభాషయన బరగుచున్నది. సర్వోత్కృష్టమయిన సర్వమునకు నీ పునీత వాక్కు పుట్టినిల్లు. వేదముల. ప్రపంచమునందలి ప్రతివిషయము నీభాషాదర్శమున ప్రతిబింబించుచున్నది. హైందవ బౌద్ధ జైన మతములకు గీర్వాణి మాతృదేవియై విశ్వప్రశంసనీయముగా నున్నది.

ఈ గీర్వాణ వాఙ్మయమొక అగాధ సముద్రము. మూడు నాల్గువేల సంవత్సరములుగా పెరిగిపెరిగి రానురాను అపారమై వివిధ శాస్త్రరత్నరాసులతో విరాజిల్లుచూ నిరవధికమై యున్నది. ఇందొక కణముమాత్రమే ముద్రారూపమును పొందినది.

సంస్కృతమున కేవల మాధ్యాత్మిక వాఙ్మయమున్నదని కొందఱి యభిప్రాయము. కాని యిది సర్వశాస్త్రములకు నెలవు-ఆయుర్వేదము నందలి త్రిదోష శాస్త్రము, యిట్లే నాడీశాస్త్ర తత్త్వము నేటికిని పాశ్చాత్యులకు దురవగాహము గానున్నది. ఇట్లే వాస్తుశాస్త్రాది వాఙ్మయములును వారి నాశ్చర్య చకితులను గావించు చున్నవి. ఇట్లు ప్రపంచ భాషలలో ప్రకృష్టతమమై ప్రజాదరణ ముఖ్య పాత్రమై ప్రచారమునందున్న ప్రాచీన భాషయిది.


పాశ్చాత్యులు సహిత మీ భాషయందెంతయు శ్రద్ధవహించి వివిధభాషా తౌలనిక్య పరీక్షా పూర్వకముగా నవగాహన మొనర్చుకొని నూత్న పద్ధతులతో నిందు పరిశోధన గావింప నవకాశమును గల్గించిరి. ఇంతేగాక పలుదిశల ప్రసరించుచున్న మన ప్రాచీన వివిధశాస్త్ర కుసుమముల పరిమళముచే నానాదేశముల విద్వాంసుల నాకర్షించుచున్నది. ఇట్టి యీవాఙ్మయము విశ్వమంతటికి విజ్ఞానజ్యోతిని వెలిగించగలదన్న విశేషోక్తి లేదు.

ఇతర దేశములలో దినదినము శాస్త్రాభివృద్ధి జరుగుచుండ, మనకున్న శాస్త్రములుగూడ నామరూప రహితములగు చున్నవనుట కన్న శోచనీయమన్యమున్నదా? ఉన్న శాస్త్రముల నుపయోగించుకొనుటకు తెలియదనుట హాస్యాస్పదము. అనాదిగా సంఘైక్యతకు తోడ్పడుచున్న యీ సంస్కృత భాషాభివృద్ధి గల్గిన భారత సంస్కృతియు భావిలో సంభావనార్హయగు ననుటలో సందియము లేదు.

ఇట్టి యీసంస్కృత భాషను మృతభాషని చాటుట మనవారికి పరిపాటి అయినది. సర్వభాషలలో శ్రేష్ఠమై ప్రపంచ సంస్కృతికే పట్టుగొమ్మై, సమస్త శాస్త్రసంపదకు సంస్థానమై, సర్వభాషలతో సమన్వయించి సతతము వృద్ధినొందుచున్న యీ సంస్కృతభాష మృతభాషయగునా? అమృతభాష యనఁ దగును; నమ్మదగియున్నది

# 8
# శిల్ప సంపద*

శ్రీ నేలనూతల శ్రీకృష్ణమూర్తి



వినాయకుడు

"........రూపం సర్వజగన్మయస్య।
ఏకం శరీరేణ జగత్సమగ్రం బిభర్తి
దేవః స జగత్ప్రధానః" ॥
(విష్ణుధర్మోత్తర. III-47-1-18.)

భారతదేశమందలి శిల్పసంపదయంతయు పూజార్హమగు దేవతా విగ్రహమయము. విగ్రహమొక ప్రతీకము. దీని యుపయోగము అనిర్వచనీయమగు పరమార్థమును సూచించుట. ధ్యానమున ఏకాగ్రతకు దోహదమొసగును (Supports to contemplation.) ఈ ప్రతీకతత్త్వమెఱుగని యెడల విగ్రహారాధనయొక్క పరమార్థ మర్థము కాదు. భారతీయశిల్పము మనదేశపు అనాది సంస్కృతిపై సంపూర్ణముగ ఆధారపడి యున్నది. వేదకాలనాటినుండి ఉపనిషత్తులలో, పురాణములలో, మహాకావ్యములలో ఇమిడ్చి, పెంచి, వ్యక్తపఱచినందున ఇందలి కథనములు శిల్పులకు మహోత్సాహము నొసంగినవి. మతాంతరము లున్నప్పుడు, ఆయా మతాభిమానములతో శిల్పములును వెల్లివిరిసినవి.

"The images of HARIHARA, ARDHANARISWARA and such others can be distinctly shown to bear traces of this different mental approach to religious problems."

ఈ శిల్పములు కేవల పూజనీయ ప్రతీకములుగనే ఖ్యాతినొందక, కళా దృష్టితో చూచిన కౌశల్యమే మూర్తీభవించిన కళాజన్యములుగా (artefact) విగ్రహసృష్టి యందలి సౌందర్యము, వేషభూషణ వసనాదుల, అస్త్రశస్త్రవాహన

* ఈ వ్యాసరచనకు జితేంద్రనాథ బెనర్జీ రచించిన 'హైందవబింబ రచన' ఉపకరించినది.

ముల, దేవతాసహచర్యములనుబట్టి, అనేక రాజకీయ, కళాపరిణామ చరిత్రలను తెలిసికొనవచ్చును. వీని చెంతనుండు శాసనాక్షరములబట్టియు, విశేషములనేకము లను గనుగొనవచ్చును.

శిల్పరచనయందు వ్యక్తమగు రూపసిద్ధియును వివిధ శిల్పశాస్త్రములందు ప్రభు సమ్మితముగా విధించబడినవి. ముఖ్య గ్రంథములు, శుక్రనీతిసారము, మాన సారము, విష్ణుధర్మోత్తరము, కాశ్యపశిల్పము, శిల్పరత్నాకరము, మరియు వివిధ పురాణాంతర్గత శిల్పాధ్యాయములు. ఇట్టి శిల్పశాస్త్ర విషయములు జైన, బౌద్ధమత గ్రంథములందును గలవు. ఇవిగాక వాస్తుశాస్త్రములగూర్చి మత్స్యపురాణము 18, విశ్వ - కర్మలనుగూర్చి పేర్కొని యున్నది. (ch. 252-V.2-4)



వీరసతులు

భృగు ర త్రి ర్వశిష్ఠశ్చ విశ్వకర్మా మయస్తథా
నారదో నగ్నజి చ్చైవ విశాలాక్షః పురందరః
బ్రహ్మకుమారో నందీశః శౌనకో గర్గయేవచ
వాసుదేవో ఽనిరుద్ధశ్చ తథా శుక్ర-బృహస్పతీ
అష్టాద శైతే విఖ్యాతా వాస్తుశాస్త్రోపదేశకాః॥

ఈవాస్తుశాస్త్రమునకును సర్వశాస్త్ర కళలకునను పితామహుడే ఆదికర్త. బ్రహ్మ నుండి మాభికముగా ప్రపంచమున వెలసినవి. స్థపతి (Architect) సూత్రగ్రాహి (draughtsman and designer) వర్ధకి expert in proportions and తక్షకుడు (శిల్పి.) స్థపతియే మిగత ముగ్గురకు దేశికుడు. సర్వకళలకు పునాదివంటి కౌశల సామర్థ్యముగలవాడు స్థపతి.


## II

ప్రతీకోపాసన పరిణామము.

భక్తి ప్రపత్తులే పూజాది కైంకర్యములకు పునాది. అనిర్వచనీయమగు పరబ్రహ్మమును వాఙ్మానసగోచరముగ చేసికొనుటకు, అర్చించి ఆరాధించుటకును, ఈశ్వరుని ప్రతీకముగా చేసికొని పూజించుట ప్రాముఖ్యము చెందెను.

(శ్వేతాశ్వ: III - 20-VI-23)

ధాతు ప్రసాదా న్మహిమాన మాత్మనః
(దాతుః ప్రసాదా న్మహిమాన మీశం)
యస్య దేవే పరాభక్తి ర్యథాదేవే తథా గురౌ
త స్యైతే కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః



వీరుడు - సతులు


ఇందు యోగధ్యానోపాసనలచే అద్వైతస్థితి సిద్ధింపచేసికొనుటయు పరమేశ్వరుని కృపాకటాక్షమేయని నమ్ముట. భక్తయొక్క పరాకాష్ఠ. ఈ భక్తిమార్గమునకు సులభమైనదే ప్రతీకోపాసన (విగ్రహారాధన)

శాన్తిపర్వము-నారాయణీయ పర్వాధ్యాయము. 334. శ్లో. 14-45.

యత్తత్ సూక్ష్మ మవిజ్ఞేయ మవ్యక్త మచలం ధ్రువం
ఇంద్రియై రింద్రియార్థైశ్చ సర్వభూతైశ్చ వర్జితమ్ ॥
స హ్యన్తరాత్మా భూతానాం క్షేత్రజ్ఞశ్చేతి కథ్యతే
త్రిగుణవ్యతిరిక్తోవై పురుష శ్చేతి కల్పితః ॥

తస్మా దవ్యక్త ముత్పన్నం త్రిగుణం ద్విజసత్తమ
అవ్యక్తావ్యక్త భావస్థాయా సా ప్రకృతి రవ్యయా ॥
తాం యోని మానవా వృద్ధి యా ఉపాసదసదాత్మకః
ఆభాభ్యాం పూజ్యతే సో౽హి దైవే పిత్ర్యేచ కల్పతే ॥

నారదుడు బదరికాశ్రమమునకు పోయి, అచ్చట నరనారాయణుల దర్శించెను. నారదుడు అచ్చట నారాయణుడు పూజానిమగ్నుడై యుండుటచూచి చకితుడయ్యెను. సకల చరాచరముల లక్ష్యమే, వేరొక లక్ష్యమును పూజించుట, నారదునకు వింతగానుండెను. అనుకొని ఆదేవుని ప్రశ్నించెను. ప్రభువు సర్వస్వమునకు మూలమైన ప్రకృతిని పూజించుచున్నానని బోధించెను. విగ్రహముల రూపముల భక్తుడగు శిల్పికి ధ్యానసమగ్నతాస్థితిలో గోచరించిన ఆకారములు.



దుర్గాదేవి

The coneept of the image is based on its unique sublimation to the very position of the god-head, the object of deep loving adoration to the devotee. The process presupposes a mental preparation, a studied effort on the part of the worshipper, which culminates in the attainment of that frame of mind in which an object fashioned by human hands reaches such on august level.

భాగవత పురాణ, పంచరాత్రగ్రంథములలో విగ్రహ, బేర, తను, ప్రతిమ, రూప నిర్ణయముల గూర్చియు, వానికి చేయతగిన పూజాది కైంకర్యముల గూర్చియు, విరివిగా చెప్పబడియున్నది. శుక్రనీతిసార: IV. 4-152-3. (హయశీర్ష పంచరాత్ర)

అభిరూప్యాచ్చ బింబానాం దేవః సాన్నిధ్య మృచ్ఛతి
యథో క్తానయవైః పూర్ణాపుణ్యాదా సుమనోహరా
అన్యథా యుగ్ధనహరా నిత్యం దుఃఖ వివర్ధనీ॥

వైష్ణవమున సాలగ్రామములు, శైవమున బాణలింగములు, శాక్తేయమున యన్త్రములు పూజార్హములైనవి



మన్నారు పోలూరి గరుత్మంతుడు

పాణిని. సూ. V.-3-99. భాష్యము.

అపణ్య ఇత్యుచ్యతే తత్రేదం న సిధ్యతి శివః స్కందః
విశాఖ ఇతి కిం కారణం? మౌర్యై ర్హిరణ్యార్థిభి రర్చాః ప్రకల్పి
తాః భవే త్తాసు న స్యాత్ యాస్త్వేతాః
సంప్రతి పూజార్థా స్తాసు భవిష్యతి॥

ప్రతీకములు పూజార్థమై పణ్య వీథులలో విక్రయమునకు దొఱకు చుండె నట. (పాతంజలీయము) ప్రతీక పూజచే భక్తి ప్రపత్తులున్న భక్తునకు అగ్నిష్టోమాది యజన ఫలములు ప్రాప్తించుననిః భారద్వాజ సంహితయం దున్నది.

నందీశ్వర :- XIII -25. 21


నందీశ్వరస్య మూర్తిం తు దృష్ట్వా ముచ్యతే కిల్బిషైః

III - 84 - 102.

ధర్మం తత్రాభిసంస్పృశ్య వాజిమేధ మవాప్నుయాత్

III . 83 - 103 -4.

తతో గచ్ఛేత రాజేంద్ర బ్రహ్మస్థానమనుత్తమం
తత్రాభిగమ్య రాజేంద్ర బ్రహ్మాణం పురుషర్షభ
రాజసుయాశ్వమేధాభ్యాం ఫలం విందతి మానవః॥




ఉదయగిరి : రామపట్టాభిషేకము


భారతీయ రాజగు పురుషోత్తము నెదుర్కొనునపుడు, గ్రీకు మాసిడోనియా రాజు అలెగ్జాండరు హెర్కులిస్ విగ్రహమును, వైరిముందు త్రిప్పుటకై ఊరేగింపు పంపెనట! ఆ విగ్రహము శివలింగమో లేక శ్రీ కృష్ణ విగ్రహమో యని శ్రీ ఆనంద కుమారస్వామి అభిప్రాయము ఇది క్విన్‌టస్ కర్టిస్ (Quintus Curtis) యను చరిత్ర కారుడు 500 A. D. లో చరిత్రను వ్రాయుచు ఆన్ టోని యస్ 218-222

A. D. లో సిరియా దేశమును పాలించు నష్ఠుడు అర్ధనారీశ్వర విగ్రహమును గూర్చి వర్ణించెను. అశోక చక్రవర్తి నాల్గవ శిలాశాసనమున (IV Rock Edict)

విమానదర్శనా చ హస్తిదర్శనా చ
అగ్నిఖంధాని చ అంగాని చ దివ్యాని
రూపాణి దసయిత్వాజనం॥



భువనేశ్వరి



విష్ణు - లక్ష్మి

జనులకు రథగజ, అగ్నిజ్వాలాది దివ్యబింబముల చూచుటకు యోగ్యముగ నుండెను. గజములు ఐరావతములనియు రథములు లోకపాలురనియు, అగ్నిశిఖలు దివ్యపురుషుల తేజస్సులనియు తెలిసికొనవలయును. "ధర్మ" మును ప్రబోధించుటకై ఆ మౌర్యపృథ్వీపతి ఈ బింబముల గూర్చి ప్రశంసించెను.


క్రీ. స్తునకు పూర్వము కొన్ని శాసనముల బట్టి భాగవతతత్త్వ ప్రాచీనమగు దేవాయతనము లున్నట్లును, అందొకటి 1934-1935 లో శ్రీ. డి. ఆర్. భండార్కరు గారు ఒక శాసనమును ప్రచురించిరి.

(1) కారితోయం రాజ్ఞా భాగవతేన గాజాసయన పారాశరీ పుత్రేణ స
(2) ర్వతాతేన అశ్వమేధ యాజినా భగవద్భ్యాం సంకర్షణ వాసుదేవాభ్యాం
(3) అనిహతాభ్యాం సర్వేశ్వరాభ్యాం పూజాశిలా ప్రాకారో నారాయణ వాటికా.


(ఘోసుండి - ఉదయపురి - రాజస్థాన్) నందలి నాతిగోడపై నుండిన శాసనము)

తా. అశ్వమేధయాగము సల్పిన గాజా యవంశీయుడును కులీనుడైన సర్వతాత యనుభాగన గోత్తముడు, నారాయణ వాటికయను దేవాయ తనమునకు రాతి ప్రాంగణముకట్టి, అందు సంకర్షణ వాసుదేవుల వేంచేయింప చేసెను.

ఈ స్థాపన 100 బి. సి. నాటి దని భండార్కరు పండితుని యభిప్రాయము. ఇట్లు విగ్రహముల చరిత్ర 2000 సం॥ పూర్వముననే యున్నట్లు శిలాస్థగితములైన సాక్ష్యములను, చరిత్ర కారులు వెలికితీసి గుణములు వర్ణించియున్నారు.



శివయోగి



సూర్యుడు

## III

ప్రతిమా రచనము.

ప్రథమమునబింబములు దారునిర్మితములని తెలియుచున్నది. ఈ కళాప్రయోగమునకు యోగ్యమగు కొయ్య ఎట్టిదని బృహత్సంహితలో ప్రతిమాలక్షణమను 57. అధ్యాయమున వరాహమిహిరుడు శాసించియున్నాడు శ్లో. 5, 6.


సురదారు చందన శమి మధుకతరవః శుభాద్విజాతీనాం
క్షత్ర స్యారిష్టాశ్వత్థ-ఖదిర బిల్వా వివృద్ధికరాః
వైశ్యానాం జీవక ఖదిర సింధుక స్యందనాశ్చ శుభఫలదాః
తిందుక కేశర సర్జార్జు నామ్ర శాలాశ్చ శూద్రాణాం॥

ఈ ప్రతిమా నిర్ణయమునకు వసతియగు చెట్లు పరిశుద్ధములై యుండవలెను. ఆవృక్షములందు తేనెతుట్టె లుండరాదు. అట్టి నిషేధదారువులును నిర్ణయింపబడినవి. ప్రజలలో అన్ని జాతులవారును ఈ క్రియాకలాపములందు పాల్గొనవలయును.

మన మండలపు మండ్రిగ్రామమున దేవీమూర్తి యొకటి ఇటీవల శిల్పించ బడియున్నది. దారునిర్మిత శిల్పములు శిలాభేరములవలె దీర్ఘకాలము చెక్కుచెదరక యుండవు. ఈ దారువులు చెట్లనుండి విడదీయుటకు పూజాదిక యుక్తమగు మన్త్రములు గలవు. వరాహమిహిరుడు, రాక్షస, నాగ, అసుర, గణ, వినాయకుల కుప యుక్తమగు చెట్టును నిశావేళ క్రింద ఉదహరించిన మన్త్రముతో ప్రార్థించవలెనని విధించెను. శ్లో. 10-11.

అర్చార్థ మముకస్య త్వం దేవస్య పరికల్పితః
నమస్తే వృక్షపూజేయం విధివత్ సంప్రగృహ్యతాం
యానీహ భూతాని వసంతి తాని బలిం గృహీత్వా విధివత్ ప్రయుక్తం
అన్యత్ర వాసం పరికల్పయన్తు క్షమన్తు తాన్యద్య నమోఽస్తు తేభ్యః

(ఈ మన్త్రమే భవిష్య పురాణమందలి ప్రతిమా విధియను అధ్యాయమున గలదు)



గొల్లవాడు : ఉదయగిరి




దేవి


"ఓ వృక్షరాజమా నీకు నమస్కారము. నీస్కంధము గణేశ్వరాది బింబ రచనకు గ్రహింప బడుచున్నది. మేము సమర్పించు బలిని స్వీకరింపుము. నీపై వసించియుండు భూతములన్నియు మా బలులనుచే కొని, వేరొక స్థావరమునకు పోవును గాక. ఈ నాడు మావలన కలుగజేయబడిన విపర్యములకు క్షంతవ్యులము" మఱు నాడుదయమున ఆచెట్టుపై ఉదకమును చల్లి, గొడ్డలికి తేనె, నెయ్యిపూసి, దానితో వృక్షస్కంధమును ఈశాన్యమునుండి, కుడివైపునకు ఛేదింపవలయును. విష్ణుధర్మోత్తర పురాణమున విధులును అనేకములున్నవి.

"ఆయామ పరిణాహోర్ధ్యం శిలైః సంభూషితాయాతు
విదిత్వై స్త్రీంపుమిశ్రితా."

అనగా (alkaline) శిలగానున్న, మృదుత్వోపహితముగానున్న చుక్కటున్న ఖండ, ఖండములుగానున్న బింబరచనకు యోగ్యముకాదు. తరువాత శిలను పరీక్ష చేయనగును దీనికై నిర్ణీతమైన శిలాలేపనములపూసి, అటుపై గోచరమగు మార్పుల గ్రహించి, శిలను ప్రతిమానిర్మాణమునకై నిర్ణయించుకొని, దానిని దేవాయతనమునకు తెచ్చవలెను. గోపాలభట్టుని హరిభక్తి విలాసమున శిలాగ్రహణమను అధ్యాయమునకలదు. ఇందు హయశీర్ష పంచరాత్రగ్రంథమందలి శ్లోకములే వ్రాయబడినవి ఈ బండను కొండనుండి స్వీకరించి విష్ణువిగ్రహమును చేయ తలంచినపుడు ఈ క్రింది ప్రార్థన చేయవలయునని యున్నది.



శివయోగి






స్వర్ణముఖర యందలి దొరికిన బుద్ధుడు

విష్ణుబింబార్థ మస్మాకం యత్రైషా కేశవాజ్ఞయా
విష్ణ్వర్థం యద్భవే త్కార్యం యుపాకమపి తద్భవేత్
అనేన బలిదానేన ప్రీతాభవథ సర్వథా
క్షేమేణ గచ్ఛతాన్యత్ర ముక్త్వాస్థానమిదం పునః ॥

ఈ ఘట్టమున కుశలురగు శిల్పులకు బింబరచనచేయ నిర్మించుకొనుకాలమున సృష్టింపబోవు విగ్రహారూపము స్వప్నదృష్టమగునని దీర్ఘముగా చెప్పబడినది.

మఱునా డుదయమున శిల్పి 'టంకి' ము Chisel, ఉలిని చేకొని ఆశిలను మలచుటకు ప్రారంభించవలెను. ఈశిలల పూర్వ పరీక్షవిషయమై గ్రంథమందిట్లున్నది.

శ్మశానాన్తసేవితా యాచ నదీతీర సముద్భవా
పురమధ్యస్థితా యాచ తథా పితృవనే స్థితా
చతుష్పథే స్థితాయాచ మృచ్ఛిలా పక్వకేచ యా
ఊషరేచ తథామధ్యే వల్మీకే వా యాస్థితా॥
సూర్యరశ్మి ప్రతప్తాయా యాచదగ్ధా దావాగ్నినా
అన్యకర్మోపయుక్తా యా అన్యదేవార్థ నిర్మితా
క్రవ్యాదాద్యై రుపహతా వర్జ్యా యత్నేన వైశిలా
యేనకేనచి దానీతా వర్జనీయా తథాశిలా॥



రంగనాయక దేవళమునగల అధునిక శిల్పరచన (సిమెంటు)

శిల్పములు మలచుటకు యోగ్యమగు పద్ధతి మత్స్యపురాణమున :

వివిక్తే సంవృతే స్థానే స్థపతిః సంయతేంద్రియః
పూర్వవత్ కాలదేశజ్ఞః శాస్త్రజ్ఞః శుక్లభూషణః
ప్రయతో నియతాహారో దేవతాధ్యాన తత్పరః
యజమానానుకూలేన విద్వాన్ స్వకర్మ సమాచరేత్॥

ఏకాన్తస్థలమున దైవభక్తుడగు స్థపతి జితేంద్రియుడై, యేమూర్తిబింబమును రచింప మన్నాడో ఆవిగ్రహమును ధ్యానించుచు ప్రతిమానిర్మాణము చేయవలెను. ఇట్లే నవరత్నములందును బింబరచన మొనర్పవచ్చును దీనినే "రత్నజ" శిల్పమందురు. (శిల్పరత్న I Ch 46. V. 144. పూజావిగ్రహముల ప్రతిష్ఠించుటకు యోగ్యమగు దేవకులముల గూర్చి విష్ణుధర్మోత్తరమున నిట్లున్నది. ఇది కలియుగలక్షణము. పూర్వయుగము లందెట్లున్నదియుచెప్పబడినది.

సత్యయుగే దేవానాం ప్రత్యక్షపూజనం
త్రేతాద్వాపరయోః ప్రత్యక్షపూజా ప్రతిమాసుచ-
తత్రాపి త్రేతాయుగే గృహే ద్వాపరే చారణ్య
కలౌచ దేవాయతననిర్మితి ర్నగరేషు సమారబ్ధా
భూమిదానం విధాయైన దేవాయతనప్రతిష్ఠా
కార్యా దేవాలయ యోగ్యభూమిః

## IV

*శిల్పశాస్త్ర నిరుక్తము.*

దేశానురూప భూషణ వేశాలంకార మూర్తిభిః కార్యా.

విగ్రహముల హస్తముల ముంజేయి తీరు ముద్రలందురు. భావానంతయు నొకభంగిమ నందున్న "హస్త" మందురు. ఉదాహరణము. దండహస్తము, గజ హస్తము, కటిహస్తము. ముంజేతులు జ్ఞానసముద్ర, చిన్ముద్ర, లేక వ్యాఖ్యానముద్ర యోగ లేక ధ్యానముద్రలలో నుండును. ఒక్కొక్కచోట హస్త పదములు పర్యాయములుగా ప్రయోగింప బడును. ఈహస్తభంగిమములు "హస్తము"లని నాట్యశాస్త్రీయ గ్రంథములందు విరివిగా వర్ణింపబడినవి. ఇట్టి ముద్రలు తన్త్రిశాస్త్రము లందు పూజలకు, ధ్యానములకు ప్రఖ్యాతముగా లక్షణములతో వర్ణింప బడినవి. వరదహస్తమనగా అరచేతిని వెలికి చూపుచు వ్రేళ్లకొనలను క్రిందిపైపునకు. చూపుట.

ఉత్తానోఽధోంగుళి రస్తో వరదః

అంజలి లేక వందనీయ హస్తములు నమస్కారములు.


ధ్యాన, యోగ లేక సమాధి ముద్రయందున్న ప్రతిరూపమునకు కుడిముంజేయి, యెడమచేతియదుంచి, ఈ రెండును పద్మాసనమందున్న, మోకాళ్ల క్రిందప్రదేశమున ఉంచబడును. ఇందు బింబము కూర్చొనియున్నట్లుండును. భగవద్గీతయందు VI-13.

సమం కాయశిరోగ్రీవం ధారయ న్నచలం స్థిరః
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశ శ్చానవలోకయన్

ఇట్టి లక్షణమే సామన్నఫల సుత్తమను బౌద్ధగ్రన్థమున.

నిసాదతి పలంకం ఆభుజిత్వా ఉజుం కాయం
పణిధాయ పరిముఖం సతిం ఉపట్ఠపేత్వా.

"నాసికాగ్రం" అను విధికి ఆదిశంకరులు వ్యాఖ్యానించుచు చూపును లోనికి ప్రసరింపచేయుట యని బోధించిరి. నాసికాగ్రము కనుబొమల మధ్యనుండు ప్రదేశము. (నాసికమూలము) బౌద్ధగ్రన్థమునను మొత్తైయిన ప్రదేశమున పద్మాసనాసీనుడై, స్కంధమును ఋజువుగానుంచి ధ్యానించులక్ష్యముపై చూపును కేంద్రీకరించుటయని తాత్పర్యము. కుమార సంభవమందు కవికుల గురువు, ధూర్జటిధ్యానమునుగూర్చి వర్ణనమున్నది. అందు ముంజేతి విన్యాసమునుగూర్చి :



బాలకృష్ణుడు

పర్యంక బంధ స్థిరపూర్వకాయం ఋజ్వాయతం సన్నమితోభయాంసం ।
ఉత్తానపాణిద్వయ సంనివేశా త్ప్రఫుల్ల రాజీవ మివాంకమధ్యే ॥

దృష్టుల నాసాగ్రము చేయ్యుటనుగూర్చి కుమారసంభవమును III - 47

కించ త్ప్రకాశ స్తిమితోగ్రతారై ర్భ్రూవిక్రియాయాం విరతప్రసంగైః ।
నేత్రై రవిస్పందిత పక్ష్మమాలై ర్లక్ష్యీకృత ఘ్రాణ మధోమయూఖైః ॥

చిన్ముద్ర.

చూపుడువ్రేలి కొనను, బొటనవ్రేలి కొనతో చేర్చి, వ్రేళ్ల మధ్యభాగము మండలాకారముగ నుంచుట. ఇట్లు విన్యసించిన చేయి హృదయస్థానమునకు పూర్వ భాగముగ నుండవలెను.

ఇట్టి చేతినే కుక్షివైపుననుండునది వ్యాఖ్యానముద్ర. గురువు, దక్షిణామూర్తి ప్రతిమలు మౌనమునుండి ఈముద్ర నుంచిన భావము :

మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం

అనిర్వచనీయమగు పరమ రహస్యమును మౌనముదాల్చి శిష్యునకు బోధించును.

*కట్యావలంబిత లేక కటిసంస్థిత హస్తము.*

ఇందు బాహువును ప్రక్కన క్రిందకు వ్రేలాడునట్లుంచి, ముంజేతిని తొడపై నుంచవలెను. అనగా మణికట్లు నుంచవలెను. సామాన్యముగా ఈ ముద్ర యెడమ చేయిచే ప్రయోగింప బడును. ఇందు బింబము నిలబియుండును.

*కటక లేక సింహకరణ హస్తము.*

వ్రేళ్లకొనలను విలంబముగానుంచి కేంద్రీకరించి కలపిన ఈముద్ర సూచి తగుగును. ఇట్లున్నచేతిలో అర్చన సమయమున కమలాది పుష్పముల నుంచవచ్చును.

*దండహస్త, గజహస్తి.*

ఇందు హస్తమును దీర్ఘముగా దృఢముగా (దండమువలె) లేక తొండ మువలె క్రిందికి వ్రేలాడు నట్లుంచుట.

*తర్జనీ హస్తము :*

కుడిచేతి చూపుడు వ్రేలిని పైకిచూపుట. ఇది సూచీహస్తమగును. అట్టి వ్రేలు క్రిందికిచూపిన తర్జనీహస్తమగును. ఇట్టి తర్జనీ హస్తముప పాశమును చిత్రించి నిల్పించిన తర్జనిపాశహస్తమగును. ... దేవతాహస్తములు పాశముంచును. దేవతల చేతులందు కమండలము, అక్షమాల, దర్పణ, కపాల, పుస్త కపద్మములుండును.

**V**

*సూర్యుడు.*

మనజిల్లాలో సూర్యదేవాలయ మున్నట్లు కానబడదు. కాని దేవకులము లందు ఉపదేవతలగా సూర్యబింబములు ప్రతిష్ఠింపబడి యున్నవి. - (నెల్లూరు మూల స్థానేశ్వర దేవళము) సూర్యప్రతిమలో రథచక్రము, గుండ్రని స్వర్ణమయ పళ్లెరము, కమల పుష్పము లుండును. బృహత్సంహిత Ch 57. V. 46-8 న ఆపాద హృదయ మునకు ఉత్తరాది (ఉదీచ్యవేషము) వానివలె వస్త్రములుండి, మకుటధారియై రెండుచేతులందు కమలములు తొడిమెలతో నుండవలెను. కర్ణభూషణ ముండవలెను. విష్ణు ధర్మోత్తరమున నాల్గుచేతులుండవలసినట్లు విధింపబడనది. శరీరమునకు కవచము, ఎడమచేతిలో దండము, సీరాబుడ్డి, లేఖని, లేక తాటియాకు (వ్రాయుట కుపయుక్త మగునది). సింహధ్వజము, నల్గురు పుత్రులు, రేవంతుడు, యముడు, ఇద్దరు మనువులు,

నల్గురు భార్యలు, రాజ్ఞీ, ప్రభ, ఛాయా, సువర్చస; రథము, సప్తాశ్వములు, సారథి యగు అరుణుడు కలిపి, సూర్యబింబమును సృష్టించవలెను. పాదములకు ఉపానత్తులు (పాదరక్షలు) ఉండును.

ఉపాన త్పినద్ధ పాదయుగళమ్.

ఈపాదరక్షలుండుటచే పాశ్చాత్య మర్యాదయని అపోహయుగలదు.

**విష్ణువు.**

విష్ణుత్వ భావమునకు మూలమంత్రములు ఋగ్వేదమందలి స్తుతులే. ఉరుక్రమ, త్రివిక్రమ మనుపదములు, "త్రివిక్రమ" పేరును సాకముని వ్యాఖ్యానించి సూర్యుని దృష్టికి గోచరించు నభోమార్గమనియు, (ఉదయ, మధ్యాహ్నము, సాయంసమయములు). ఆశక్తియే భూమిపై అగ్నిగాను అంతరాళమున ఇంద్రలేక వాయువుగాను, ఆకాశమున సూర్యుడని చెప్పబడెను. కాని ఔర్ణభావుడను పూర్వ వ్యాఖ్యాత సూర్యుని ఆకాశమార్గ ప్రయాణమే త్రివిక్రమ పాదచలనమని దృఢపఱచెను. ఈభావమునే పురాణములందలి దశావతారములందు చేర్చి వామనావతారముగ విష్ణుసంరక్షణ కర్తృత్వము విరివిగా వర్ణించబడినది. భారద్వాజ సంహితా పరిశిష్టమందలి నారద పంచరాత్రమందు (III -57-8) వారి నెల్లప్పుడు ప్రతీకముల ద్వారా అర్చించవలెను. అట్టి ప్రతిమలు లేనియెడల సాలగ్రామమే ఉత్తమమగు ప్రతీకము. సాలగ్రామ రూపమే హరిదివ్యరూపము. వైష్ణవ దేవతులయము లేని గ్రామమున, యతి తన పర్యటనమున ఒక పూటకంటె నెక్కుడుగ వాసము చేయరాదు.—

విష్ణుబింబ రూపనిర్ణయము బృహత్సంహితలో Ch 57. V. 31 - 5

కార్యోఽష్టభుజో భగవాం శ్చతుర్భుజో ద్విభుజో యేవవా విష్ణుః
శ్రీవత్సాంకితవక్షః కౌస్తుభమణి భూషితోరస్కః
అతసీకుసుమశ్యామః పీతాంబర నివసనః ప్రసన్నముఖః
కుండలకిరీటధారీ పింగలోరస్సలాంస భుజః
ఖడ్గగదాశరపాణి ర్దక్షిణతశ్శాన్తిద శ్చతుర్థకరః
వామకరేషుచ కార్ముక ఖేటక చక్రాణి శంఖశ్చ
అథచ చతుర్భుజ మిచ్ఛన్తి శాన్తిదవకో గదాధర శ్చాన్యః
దక్షిణపార్శ్వే హ్యేవం వామే శంఖశ్చ చక్రంచ

ద్విభుజస్యతు శాన్తికరో దక్షిణహస్తే పరశ్చ శంఖధరః
ఏవం విష్ణో ప్రతిమా కర్తవ్యాభూతి మిచ్ఛద్భిః

విష్ణురూపమునకు, ఎనిమిది, నాల్గు లేక రెండుచేతు లుండవలెను. రొమ్మున శ్రీ వత్స మను పుట్టుమచ్చయు, కౌస్తుభమణియు, గల్గి శరీరవర్ణము అవిశ పువ్వురంగును బోలియుండవలెను. పసుపుపచ్చని రంగుగల వస్త్రమును చెవులకు భూషణములు, రత్నఖచిత కిరీటము నుండవలెను ఎనిమిదిచేతులున్న కుడివైపుగల హస్తములలో, కత్తి, గద బాణము, అభయముద్ర లుండవలెను. ఎడమవైపుచేతులలో ధనుస్సు, డాలు, చక్రము, శంఖము మూండవలెను. నాల్గుచేతులున్న కుడిచేతులలో, అభయ ముద్ర, ఎడమచేతులలో శంఖచక్రము లుండవలెను. రెండే హస్తములున్న కుడిచేత అభయముద్ర, ఎడమచేత శంఖము నుండవలెను. ఇట్టి రూపము విష్ణు ప్రతిమలక్షణము.

వైఖానసాగమమున విష్ణువు నిలుచుండిగాని, కూర్చుండిగాని, లేక శయనించిగాని యుండవచ్చునని విధింపబడినది. ఇవిగాక అభిచారికస్థానక మూర్తులుకూడ విధింపబడియున్నవి.

కాళీయుని భార్యలు పతిభిక్షకై వేడికొనుచు కాళీయమర్దను నిట్లు స్తుతించిరి.

నమః కృష్ణాయ రామాయ వాసుదేవసుతాయచ ।
ప్రద్యుమ్నాయా నిరుద్ధాయ సాత్వతాంపతయే నమః ॥

కృష్ణ, రామ, ప్రద్యుమ్న, అనిరుద్ధులను నాల్గునామములే చతుర్వ్యూహములుగా శిల్పరచనయందు స్వీకరింపబడి చతుర్ముఖముగా కొన్ని బింబములు పూజకై సృష్టింపబడినవి. ఈ విష్ణుబింబమూర్తులు చతుర్వింశతి మూర్తులుగా భారత దేశమంతటను ప్రతిష్ఠింపబడియున్నవి అన్నియు నిలిచియుండునవే.

శివ.

వేదమున శివుడు రుద్రుడైన సంహారప్రళయకారకుడు. ఇంతియగాక సృష్టి స్థితి కారకుడుగను స్తుతింపబడుచున్నాడు. ఇంకను శివుడు అనుగ్రహప్రసాదముల కధిపతి ఇవిగాక తిరోభావసహితుడు ఇట్టి పంచకృత్యములకు పునాది శివుడు. యోగనిరతుడై మౌనమున పరవిద్యావ్యాఖ్యాన మొసంగును ఇతడు భూతపతి, పశుపతి, భూతనాథుడు. ఇతడే మహేశ్వరుడు, ఉమాపతి.

శివ సహస్రనామము మహాభారతమందు కలదు. XIII - 17 శతరుద్రీయమునను శివస్తుతి ప్రఖ్యాతమై యున్నది. పాశుపతవ్రతులకు, పాశుపత సూత్రములు ముఖ్య గ్రంథములు. వీనికి కౌండిన్యఋషి వ్యాఖ్యానము వ్రాసెను. వీరే కాపాలికులు. శైవసంప్రదాయములు శుద్ధశైవమని, ఆగమాంతశైవమని ద్వివిధములు. వీరుగాక వేదాంతశైవులును గలరు. శుద్ధశైవులు ఆగమములందు వేదాధిక్యత గలదని నమ్మిరి.



రామోఽసౌభువనేషు విక్రమ గుణైర్యాతః ప్రసిద్ధింపరామ్
అస్మద్భాగ్య విపర్యయాద్యదిపరం దేవోనజానాతితం।
వందీవైషయశాంసి గాయతిమదుద్యస్యైక బాణాహతి
శ్రేణీభూత విశాలతాళవివరోద్గీర్ణైః స్వరైస్సప్తభిః ॥

(రామాభ్యుదయ - N. L. R. K. 1660)

ఆగమశైవుల గ్రంథములు 28. ఇందు శివుడుపతి. జీవుడు పశువు. సంసారికబంధములే పాశములు. వీరలు చార్యా, క్రియా, యోగజ్ఞాన మార్గములే సుకర్మమార్గములని భావింతురు.

శివుని వ్యక్తరూపము లింగప్రతిష్ఠితము. బాహ్యమైన వ్యక్తప్రపంచమునకతీతమైన పరతత్వస్థూలచిహ్నము. లింగాకారము ప్రాచీనమైన శివలింగము. రేణిగుంటవద్దనున్న గుడిమల్ల లింగము (200 బి. సి.) ఈ శివలింగములును బహురూపములుగా, ఆగమవిధి నిర్దేశ్యములై ప్రతిష్ఠింప బడినవి విచివిరిగా నున్నవి ఇందు బ్రహ్మభాగము (నలుచదరముఖములు), విష్ణుభాగము అష్టభుజముఖముగాను, మూడవభాగము స్థాపించిన పిదప కనుబడు లింగరూపము. ఈ స్థాపన పీఠిక, పీఠికపై వేంచేయింప చేయుదురు.

బృహత్సంహిత. ch. 57. 53-4.

లింగస్య వృత్తపరిధిం దైర్ఘ్యేణా సూత్రేణ త్రిధా విభజేత్
మూలే తచ్చతురశ్రమ్ మధ్యేత్వష్టాశ్రివృత్త మతిః ॥
చతురశ్రే మవనిఖాతే మధ్యంకార్యంతు పిండికా శ్వభ్రే
దృశ్యో చ్ఛ్రాయేణ సమాప మన్తతః పిండికాశ్వభ్రాత్,

ఉత్పలుని పై అంత్యపాదమున కర్థము :-

యావత్ప్రమాణం వృత్తభాగస్య దైర్ఘ్యం తావత్ప్రమాణం సమన్తతః
పీఠికా పృథుత్వం కార్యమితి.

లింగాకారమూర్తులు పలువిధములుగా, బహురూపములుగా ప్రతిష్ఠింపబడియున్నవి. శివుని ప్రళయపరిసన్న తాండవ మూర్తులు, నాదాంత, లలిత, లలాట తిలక, కటిసమ, తలసంస్ఫోటిత, మరియున్నవి.

శివుడే యోగమూర్తిగా, వ్యాఖ్యానప్రబోధకుడుగా దక్షిణామూర్తిగా లేక వీణాధర దక్షిణామూర్తిగా నుండును. మఱియు అర్ధనారీశ్వరునిగా, హరిహరుడుగా, హర్యర్ధరూపముగా నుండుటయు కలదు. పాశుపత మతస్థులు లకులీశ విగ్రహముల నిర్మించుకొనిరి. ఇట్టివి విరివిగా ఒరిస్సా యందుగలవు.

రుద్రుడు ఉగ్రమూర్తిగా, అసితాంగుడుగా, చండ, క్రోధ ఉన్మత్త భైరవునిగా రూపములుగలవు. అస్త్రములు ఖట్వాంగము, శూలము, కపాలము ఉండును.

శక్తి.

సృష్టి, అనగా సంకల్పమాత్రమున సృజింపబడు వ్యక్తరూపమైన ప్రపంచ స్థితికి మూలము శక్తి Kinetic Energy) దీనిని దేవిగా వర్ణించిరి. తమస్సును లేక తమోరాంధ కారమును ధ్వంసముచేయు మూర్తియే మహిషాసురమర్దనము.

మార్కండేయ పురాణము 82 - 1-18

తతః సమస్తదేవానం తేజోరాశి సముద్భవాం
తాం విలోక్య ముదంప్రాపు రమరా మహిషారితాః

ఇందు మహిషము మృగరూపమున నుండుటొక సంప్రదాయము. మఱికొన్నిచోట్ల మహిషశిరస్సుకల్గిన మానవుగా శిల్పంపబడి యుండుటయు దర్శనీయము. మన

మండలమున ఇవన్నియు గలవు. సంగమునందలి దేవళమున మహిషము తోకను నొక చేతితో పైకెత్తి పట్టి దాని శిరమును శూలముతో పొడుచుచున్నను సుందరముగానున్నది.

బ్రహ్మ. (ముండక ఉ.)

బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ విశ్వస్యకర్తా భువనస్య గోప్తా

మహనమండల దేవాలయమునందలి గర్భగుడి చుట్టును, దక్షిణమున దక్షిణామూర్తియు, పడమర విష్ణువును, ఉత్తరమున బ్రహ్మయు నుందురు. అచ్చోట దేవి రూపమును యుండును. నాల్గుమోములుకల్గి, చేత కమండలముండి, పద్మాసీనుడై యుండుట బ్రహ్మ బింబస్వరూపము.

బ్రహ్మా కమండలుకర శ్చతుర్ముఖః పంకజాసనస్థా
లేక
బ్రహ్మా చతుర్ముఖో దండీ కృష్ణాజిన మండలీ (బృహత్సంహిత)

అష్ట దిక్పాలురు.

తూర్పునకు ఇంద్రుడు, దక్షిణమునకు యముడు, పడమటకు వరుణుడు; ఉత్తరమునకు కుబేరుడు. నైఋతికి అగ్ని వాయు ఈశానుడు మిగతి దిక్కులకు.

ఇంద్రుడు. వాహనము ఐరావతము నాల్గు దంతములు.

శుక్లశ్చ తతుర్విషాణో ద్విపో మహేంద్రస్య వజ్రపాణిత్వం
తిర్యగ్లలాట సంస్థం తృతీయమపి లోచనం చిహ్న

అగ్ని.

గడ్డము, నాల్గు చేతులు, నాల్గు కోరలు, మూడు కండ్లు కల్గి రథస్థుడై పొగయే ధ్వజముగా కల్గి, ఆ రథమును గాలి సాయమున నాల్గు చిలుకలు లాగుచుండును. స్వాహాసతి ఎడమవైపులో నుండును చేతులందు త్రిశూలము, అక్షమాల ధరించును. సప్తజిహ్వాలుండు. (విష్ణు ధర్మోత్తరము III ch. 56-1-10.)

యముడు.

హస్తమున దండము ధరించి యుండును.
"దండీ యమో మహిషగో" (బృ. సం: 57-57)

విష్ణుధర్మోత్తరమున విపులముగా రూపము వర్ణింపబడినది. నాల్గుచేతులు కల్గిధూమ్రోర్ణాదేవిని ప్రక్కనుంచికొని చేతులలో జ్వాలలు, ప్రసరింపు, త్రిశూలము, అక్షమాల ప్రక్కన చిత్రగుప్తుడు, ఉదీచీవేషియై తాళపత్రము, గంటము కల్గియుండును.

వరుణ. హంసారూఢుడైన పాశధారి.

"హంసారూఢశ్చ పాశ బృహద్వరుణః" (బృ. సం: 57-57)

(విష్ణుధర్మోత్తరమున III - 52-1-21.)

కించిత్ప్రలంబ జఠరయుతుడు. సప్తహంసలు లాగ, రథస్థుడై, నాల్గుహస్తములుకల్గి, కమలము, పాశముకల్గి, శంఖము, భూషణములుగల మంజూష చేతులందుండును. దేవిగౌరి. ప్రక్కల గంగ, యమున లుందురు. ఒకచేయి వరదముద్రయందుండును.

వాయువు.

వాయువ్య దిక్కున కధిపతి. రెండుచేతు లుండును. ధరించిన ఉత్తరీయకొనల పట్టుకొనియుండును, నోరు తెఱచికొనియుండును. జటలు వికృతరూపముగ నుండును.

వరం ధ్వజధం పతాకాచ కమండలు కరైర్ధరత్
మృగారూఢో హరిద్వర్ణః పవనో వాయుదిక్పతిః.

కుబేర.

"రూపమండన" మను గ్రంథమున నాల్గుచేతులు, దండము, నిధి యుండును. చేత నిమ్మపండు, నీటిపాత్ర లుండును.

గరుత్మంతుడు.

"దివ్యః స సుపర్ణో గరుత్మాన్"
రెండు రెక్కలుండి, నమస్కారముచేయు చేతులుండును.

నంది.

కైలాస ద్వారపాలకుడు. ఎడమచేతన కనక దండము బూనియుండును.
(రామాయణము VIII - 16 : 14.)

కరాళలః కృష్ణపింగళః: "వామనో వికటో ముండీ నందిర్హ్రస్వభుజో బలీ"

మఱియు :

"దీప్తం శూల మవష్టభ్య ద్వితీయమిమ"

నంది రూపమునుగూర్చిన సాహిత్యము, శివపురాణమును, లింగపురాణమును, మఱియొక "కింకవినా" గ్రంథమున కలదు. వీనియందు మానవరూపముండి కొన్ని శివలాంఛనము లున్నట్లున్నది. విష్ణుధర్మోత్తరమున (III. 73-15-77.) మూడు కన్నులు, నాల్గుచేతులు, వ్యాఘ్రాజినముగల్గి, త్రిశూలము ధరించి భిండిపాలమను ఆయుధము పూని, తర్జనీ ముద్రతో నుండును. మఱియొక గ్రంథమున :-

బిభ్రాణం పరశుం మృగం కరతలే ఈశ ప్రణామాంజలిం భస్మో
ద్ధూలితపాండురం శశికలా గంగా కపర్దోజ్జ్వలం.

నందిని వృషభాకృతిగా నిర్మించునట్లు మత్స్యపురాణమునన్నది. దేవవీక్షణతత్పరుడై శివుని కెదురుగా నుండుట లోకవిదితము.

*మిశ్ర విగ్రహములు* (Syncretistic Icons)

పంచాయతన విగ్రహములు :

1) నల్లనిరాయిని విష్ణువుగాను, 2) తెల్లనిరాతిని శివతత్త్వముగాను, 3) ఎఱ్ఱనిరాయి గణేశునిగాను, 4) లోహపు ఖనిజమును పార్వతిగాను, 5) స్ఫటికమును సూర్యునిగను కలపి పంచాయతనమను పళ్లెరముపై నుంచి పూజచేయుటకలదు.

హరిహర లేక హర్యర్థమూర్తి బాదామి గుహలోనిది కడుప్రాచీనమైనది. నాల్గుచేతులతో ఈ మూర్తి నిలుచుండ, వెనుక కుడిచేయిలో పరశువును, రెండవ చేయి భుజంగావృతమై యుండును. ఎడమచేయి కటిబద్ధము. కుడివైపు పార్వతి నందియు, ఎడమవైపు గరుత్మంతుడు, లక్ష్మియు నుందురు.

ఒకానొకచోట ఈహరిహరమూర్తి కిరువైపుల బుద్ధ, సూర్యులున్నారు. ఇవి వేరు పీఠములపై నున్నవి. అర్ధనారీశ్వర, జనార్దన జగన్మోహిని విగ్రహములు నిట్టివే.

## VI

*విగ్రహ ప్రతిష్ఠ బృ. సం: 59.*

ఆయుః శ్రీ బల జయదా దారుమయీ మృణ్మయీ తథా ప్రతిమా
లోకహితాయ మణిమయీ సౌవర్ణీ పుష్టిదా భవతి

రజతమయీ కీర్తికరీ ప్రజావివృద్ధింకరోతి తామ్రమయీ
భూలాభంతు మహాన్తం శైలీప్రతిమా థవా లింగం
శంకూపహతా ప్రతిమా ప్రధానపురుషం కులంచ ఘాతయతి
శ్వభ్రోపహతా రోగా నుపద్రవాంశ్చ క్షయం కురుతే॥

దారు, మృత్తికలో రచింపబడిన విగ్రహములు దీర్ఘజీవితములై శ్రీ సంపదలను ప్రసాదించును. భూషణములున్న సర్వజన శ్రేయస్సును గూర్చును. స్వర్ణవిగ్రహములు భాగ్యమును కూర్చును. వెండితో చేసిన, కీర్తినిచ్చును. తామ్రబింబములు ప్రజాసమృద్ధిగూర్చును. శిలానిర్మితశి వలింగములు భూరిభూముల నొసంగును. సౌష్ఠవ సంపద లోపించిన అనిష్టములు కల్గును.

విగ్రహ ప్రతిష్ఠాపనకు వేదమన్త్రనిష్ఠ ముఖ్యమైనది. హోమమన్త్రములను చేయదగినవి.

హయశీర్ష పంచరాత్రమున:

పూజయిత్వాతః ప్రతిమాం శిల్పినాం తోషయేత్ తతః
గంధపుష్పాదిభి ర్విప్రం తోషయేద్ కటకాదిభిః
సర్వేఽథ కర్మిణస్తస్యా స్తస్మిన్ కాలే పృథక్ పృథక్
క్షమాపయిత తాన్ సర్వాన్ ప్రియప్రశ్నేన సర్వథా॥

## VII

జీర్ణోద్ధారణ.

దేవకుల నిర్మాణధర్మకార్యమునకంటే శిథిలావస్థయందుండి, పూజాదికములు జరుగక, జీర్ణమైన దేవళముల ఉద్ధరించుట, ఉన్నతపుణ్యఫలము లిచ్చునని ఆగమశాసనములు ప్రవచించుచున్నవి. చరిత్రకు గోచరించిన జీర్ణోద్ధరణ మినాండర్ రాజునాటి బౌద్ధదేవాలయము. అగ్నిపురాణమునను జీర్ణోద్ధారణగురించి వివరము లున్నవి.

శిల్పరత్నము. భా II పే. 206.

దోషే లఘుతరేబింబం నైవత్యాజ్యం కదాచన
బాహుచ్ఛేదే కరచ్ఛేదే పాదచ్ఛేదే తథైవచ
తథైవ స్ఫుటితే భిన్నే యస్మి న్నవయవేగతే
వైరూప్యం జాయతేయస్య తత్ త్యాజ్యం ప్రాయశో భవేత్
అంగుల్యాది పరచ్ఛేదే బంధనం సనఽయతే బుధైః

విగ్రహములు కొద్దిగ దెబ్బతినియుండినను; వాటిని బాగుచేయించి, పునరుద్ధరించవలెను. అట్టివియు పూజార్హములే కాని విగ్రహము విపరీతరూపముగ మారిన, త్యజింపదగును. పూజాదికమునకు గాని ఈకాలమున అట్టివి వస్తుప్రదర్శన శాలలందుంచిన, బహువిషయ బోధకములగు కళారత్నముల వలె భాసిలును. మన మండలమునను ఇట్టి జీర్ణోద్ధరణ కావలసిన విగ్రహములు, దేవళములు పెక్కులున్నవి. వైదిక మతానుసారులు మనసున కెక్కించుకొనిన పరమేశ్వర ప్రీతి కర్తలగుదురు.

## VIII

*వీరకల్లు.*

వీరశైవులు మనమండలములం దుండినట్లు శిలాప్రతిమలే తార్కాణములు. శివైక్యమును పొందుటకు కర్మావశిష్టమైన దేహమును వీరత్వమున తుదిపొందింతురు. శివసాయుజ్యముపై సంపూర్ణ నమ్మకముండును. ఖడ్గముచేబూని, వీరశైవుడు, తన తలను కోసి లింగరూపియగు పరమేశ్వరున కర్పించును. కోట పరిసరగ్రామమైన కొత్తపాడు గ్రామదేవత యగు చాముండేశ్వరి కోవెల ఎదుట వీరశైవుని శిల్పము కలదు. ఇందు వీరుని కుడిచేతిలో తన తలను నఱకిన చ్ఛురిక కలదు. ఎడమచేతిలో ఖండింపబడిన తన శిరస్సు కలదు. పైన లింగైక్యమైనట్లు శైవప్రతీకము కలదు. ఈ శిల్పఖండము విచిత్రాతిచిత్రమైన సన్నివేశము. ఆధునిక పాశ్చాత్య విజ్ఞాన భిషక్కులు నమ్మని సన్నివేశము ఇచట చిత్రింపబడినది. మతావేశమేమి, శివునిపై అనితరమైన గాఢమగుభక్తి యేమి. శరీరము ఏనాటికైనను ఖిలమగునని నమ్మి, సంచిత ప్రారబ్ధముల లయింప చేయుటకే ఈ వీరుని ఆత్మార్పణమందలి తత్త్వ మా శిల్పమున పరాకాష్ఠ చెందినవి.

హరిహరవిలాసమున దేహత్యాగము చేయునవసరమునుగూర్చి కవిసార్వభౌముని పద్యము. II - ప: 80.

తే॥ అధ్రువంబైన మలభాండమైనదేహ, మనఘ యన్యోపకారార్థమైవ్యయించి,
ప్రవిమలంబుఁ గల్పాంతరధ్రువమునైన, కీర్తికాయంబుఁ గైకొంటకార్తి యేల?

శరీరక్షయ మొనర్చుటకు ఆర్తియుండదనుట ధ్రువము.


ఇట్టివి మల్లామందును, నెల్లూరులోనుకలవు. ఇవన్నియు నూతనముగా జిల్లాపరిషత్ యాజమాన్యమున స్థాపించిన పురావస్తు ప్రదర్శనశాలయందు భద్రపఱుప బడి, సర్వజనులకు చూచుటకు యోగ్యముగా నున్నవి. ఇందొకటి, పూర్వము మండపాలవీధిలో నుండెను. ఇందు వీరుడు తన తలను వెనుకనుండి ఖడ్గపాతము చేసికొను

చున్నట్లు శిలాప్రతిమ రచింపబడినది. మఱొకటి వీరుడు ఎడమచేతిని శపథము తీసి కొనుచున్నట్లును, కుడిచేతనున్న ఖడ్గముతో కుడిరెట్టను సతముగా కోసి కొనునట్లు శిల్పి చిత్రించినాడు. వీరుని ధర్మనిష్ఠ దేహాభిమానశూన్యత ప్రశంసనీయములు.

మూలపేట స్వర్ణాల చెఱువు కలుజుకు దక్షిణముగా నొక వీరశిల కలదు. అందు వీరుడు బల్లెము కొనపై అరచేతి నుంచి, నత్తి ఆ ములుకును నంచివేసినాడు. తదుపరి శివసాయుజ్యము చెందుటకై కత్తిని చేబూని శిరః త్యాగముచేయ సిద్ధుడై యున్నట్లున్నది.

మైలార వీరభటుడు (క్రీడాభిరామము)

" కరవాండి యలుగుల గనప పాతర్లలో
సుట్టి చేరులుగోసి యుఱుకువారు"



వీరుడు : ఛురిక

పాతరత్రొవ్వి, అందుశూలములపాతి (కోణాగ్రములు పైకియుండునట్లు) దాని మీదుగా ఉయ్యాలను త్రాటితో కట్టియుండును. అసిధారుడై వీరభటుడు ఆమోకుపైకూర్చుండి ఉయ్యాలలూగు సమయమున, కత్తితో ఉయ్యాలత్రాటిని కోసి కొని, పాతిన బల్లెలములపై కుఱుకును. ఈదృశ్యమును విశదీకరించు శిలాప్రతిమ జిల్లా పరిషత్ పురావస్తు ప్రదర్శనశాలయందు భద్రితమైయున్నది. శ్రీ డాక్టరు శ్రీపాద కృష్ణమూర్తిగారు, ఈశిల్పార్థము నిట్లు వివరించి, ఎచ్చటనో పడియుండినశిలను, భద్ర

పఱిపించిరి. ఈబింబసృష్టి మఱియొకఅర్థ స్ఫురణకును తావొసంగుచున్నది. కొల్హాట మును దేశీయ నృత్యముగూర్చి సంగీతరత్నాకరమున శార్ఙ్గదేవుడును నృత్యరత్నావళి (అముద్రితము) యందు జాయసేనానియు వర్ణించియున్నారు.

సం.ర VII—31

విషమం వికటం లఘ్వి త్యేతద్భేదత్రయం విదుః।
నృత్తస్య తత్ర విషమం స్యా ద్రజ్జుభ్రమణాదికమ్॥

కొల్హాటిక లక్షణము VII-1330—I

భారస్య భ్రాయమోశోఢా ప్రౌఢో భ్రమరికాదిషు।
రజ్జుసంచారచతుర శ్ఛురికా నర్తనే కృతీ।
శస్త్రసంకట సంపాతపటుః కొల్హాటికోమతః॥

ఇందు రజ్జుభ్రమణముగాని, రజ్జువుపై సంచారముగాని సూచింపబడినది. చేత చ్ఛురిక యుండవలసినట్లున్నది. ఉయ్యలనూగుటయు రజ్జుసంచారమే శస్త్రములపైన దుముకుట అతికష్టమైనపని. ఇయ్యది ప్రౌఢులచేతనే ప్రయోగార్హము. పైశిల్పమేమైన నిట్టి దేశీయ నృత్యమగు "విషమ" "కొల్హాట" ప్రయోగ ఉదహరణమా? ఇట్లుగాక పోయిన శ్రీనాథుని మైలార వీరభటసహాసమే శిల్పితము.

నృత్యరత్నావళి VII

బాహళై ర్మార్గపటహై కాంస్యం తాళసమాన్వితైః।
మర్దళై ర్జయఘంటాభి ర్భేరీ స్తంపటైరపి
వాద్యమానేషు వాద్యేషు వాదకై ర్భావ్యమద్భుతః।
వరత్రాగమనైశ్చిత్రైః కరణై రంచితాదిభిః।
ప్రాంశో రుపరివంశస్య భ్రమరై రతిమత్కటైః।
ప్రాణసందేహకరణై శ్శస్త్రధారాగ్ర నర్తనై
మను దుర్వ్యవ్యదుర్వహై చ్ఛాభరై ర్మద్వరమ్మద్వంగ పరివర్తనైః।
ఉచ్చైః ఖగవదుస్వినైః శస్త్రాగ్రాం చాలనాదిభిః
యత్ర నృత్యంతి కొల్హాట స్తస్యా కొల్లాట నర్తనం॥

జాహళములు మార్గపటహములు, కాంస్యతాళములు, మర్దళములు, జయ గంటలు, భేరులు, తంపటములు మున్నగు వాద్యములు వాయింపబడుచుండ, అంచి

తాండవ కరణములతో, చిత్రములగు గమనములతో ఎత్తుగడపై అతిదుష్కరములగు భ్రమణములను, ప్రాణహానికరములగు శస్త్రధారాగ్రనర్తనమును, మెత్తనగు శరీరముతో దుర్వహములగు భారముల వహించి పైకి పక్షులవలె ఎగురుటయు, శస్త్రముల చాలనము చేయుట కోలాటకము దేశీయనృత్యము. ఈ వర్ణనము 1250 ఎ.డి. నాటిది. ఈ నృత్యరత్నావళి గ్రంథమును జ్యాయసేనాని వ్రాసి ఆనంద సంవత్సరమున కాకతి గణపతిసార్వభౌమున కంకితమిచ్చెను.

సత్రవపురమున (కందుకూరు) బస్సుస్టాండు వద్దనున్న శిలాశాసనము 1683-84 నాటిది. ఈలముక్కలమ్మ దేవళము వెలుపలనున్న నలుచదరపు నల్లరాయి. ఈయి నృత్యప్రదర్శన మొకటి ఆ యూర జరిగెను. ప్రభువు బాలుపనహోఖాను, నర్తకులు మన్నెకారి అన్నారెడ్డి, పాపయ. వీరు గడలు వేసికొని "మోకుల మీదను, నానాఆపుమేళాలు ఆడుచు వుండ్డంగాను అన్నారెడ్డి మోకుమీదనుండి సభామధ్యమమందు పడి మృతిబొంద్దె, గనక యీ సభవారు అంతా ప్రభువుతో విన్నపంచేసి పిండ్లకు యీ గ్రామం చెరువువోట్టు గ్రామం ఆయను విరి...ండ్లకు ముందరగతి గల్పించవలెను."......యిప్పించి కద్మ యిరువైనాల్గు కులాల దొమ్మర్లకున్నూ పని లేకుండా నిర్నయంచేశి శిలాశాసనం వేయించ్చిరి. (నె. శా. కందుకూరు 41)

ఇట్టి వైపరీత్యవిషాదాంతముల నెదుర్కొనుటకు ఈ కాలమున "భీమా" కంపెనీలు ఇట్టి నర్తకులచే భీమా చేయించుదురుగాక!

"వీరకల్లు" శిల్పములు పైనచెప్పినవిగాక మఱొకవిధమైనవి మనమండలమున కలవు. యుద్ధవీరుడు సమరమున వీరస్వర్గ మలంకరింపబోగా, వాని భార్యలు "సతి" యొనర్పగా, వారిని ప్రతిమలందు చిత్రించి యశశ్శరీరముల నిచ్చుట శిల్పుల పరిపాటి. వీటిని సతీశిల లనవచ్చును. ఇట్టివి మన మండలమున విరివిగా గలవు. రాపూరు వేంకటగిరి రోడ్డులో ఎలికలపల్లి దాటగనే రోడ్డు పడమటంచున, వీరు డొకడు వైరియగు గుఱ్ఱపురౌతుతో పోట్లాడునట్లును, అతని వెనుక ఇద్దఱు భార్యలును చెక్కబడియున్నవి. సోమశిల దేవళములో ఇట్లె కొంచెము పెద్దరాతి ఫలకములపై వీరుడగు ఛత్రపతి వీరస్వర్గమునకు ప్రయాణ మగుచున్నట్లు రెండు ఫలకములున్నవి. (ఇవి రంగలిక్కనవికావు) కేవల వీరశిలలు. మనుబోలుపాడు చెఱువుకట్టులోను ఇట్టి శిలలు రెండున్నవి. బ్రాహ్మణక్రాక (క్రాక యనగా యజ్ఞవాటిక) కాకమ దేవ రాజు నానుకొని రాజు, భార్యలు, చెలికత్తె సహగమనోద్యుక్తు లయినట్లు శిల్పము ది. ఈ మండలము వీరభూమిగా వెలసినట్లు, ఈ వీరశిలలే తార్కాణములు

## IX

ఏకశిలాధ్వజ స్తంభములును సుమారు 60 అడుగుల పొడవైనవి మనమండలమున గలవు. ఒకటి చెక్కుచెదరక చుండి ప్రాంతగ్రామమున విష్ణు దేవాలయమునందున్నది. దీనిపై నలువైపుల లతావర్ణన శిల్పించియున్నది. ఇంతటి రాయి ఇచ్చటికెట్లువచ్చె నను ప్రశ్నకు జవాబు వచ్చుటలేదు. ఇట్టిది సంగం దేవళము నందొక ఏకశిలాధ్వజ స్తంభము కలదు. ఇది స్థాపించిన చోటుగాక, వేరొకచోట భద్రతకై, నాటబడి యున్నది. పైవైపు రెండుచోట్ల విరుగగా, ఇనుపబద్దలతో అంటింపబడియున్నది. ఇట్టిది వేంకటగిరియందు కలదు. ఇట్టి ధ్వజ స్తంభములు హంపిలో చూడనగును. ఇవిగాక మనమండలముల దేవాలయములలో కుడ్యములపై, మండప స్తంభములపై పురాణగాథలు శిల్పమున చెక్కబడియున్నవి. కృష్ణాపట్నము విష్ణ్వాలయమున, వెలుపల గర్భగుడిచుట్టును, చూరునకు క్రిందభాగమున భాగవతములోని గజేంద్రమోక్ష కథనము శిల్పమున గలదు. ఉత్తరపువైపు అదే శ్రేణిలో రామాయణమందలి మునికుమారుడు నీరుత్రాగ ఏనుగగా దలంచి, యువరాజగు దశరథుడు చెట్లు చాటునుండి శబ్దవేధికౌశలముతో బాణమోక్షముచేయు ఘట్టము చిత్రముగా శిల్పమున వ్యక్తము చేయబడినది. ఈ చిత్ర మొక్కటిగాక క్రమముగా మూడు గలవు. (Series)

ప్రథమమున అంధులగు పితరులను కావడిలో కూర్చుండచేసి, సర్వకాల సర్వావస్థలందు సేవించు మునికుమారుడును, ద్వితీయమున, వారికి నీరుకొనివచ్చుటకై ఆకావడిని చెట్టుకొమ్మకు తగిలించి, జలాశయమునద్దకు పాత్రగొనిపోచుండినట్లును, మూడవప్రతిమలో చెంతనున్న చెట్టువెనుక యువరాజు బాణము సంధానించియుండుట. ఇట్లే, గోపికా వస్త్రాపహరణాది భాగవతగాథలును శిల్పమునగలవు. కృష్ణాపట్టణమందలి శివాలయమున స్తంభములపై, వివిధములగు దేవతామూర్తులు శిల్పింపబడియున్నవి. స్తంభముల నాల్గువైపులను చిత్రములు అర్ధశిల్పమున (Relief) గలవు.

నుండి పాతూరి అడవిలోనుండు శివాలయమున ప్రవేశమండపమున భిత్తికలపై బారులుదీర్చి శిల్పములనేకములు మలచబడియున్నవి. ఇందు భారతకథనుండి శైవగాథలనుండి బేరములు అర్ధశిల్పమున గలవు ఈ రెండు దేవాలయములగల శిల్పములగూర్చి, చిత్రోదహరణాపూర్వకముగ నొకగ్రంథము వెల్వరచుటకు యోగ్యముగానున్నది.

ఇతిశమ్

# శిల్పసంపద - వాకాడు

ఈ శిల్పములు వాకాడు గ్రామము [illegible] ప్రత్యేకముగా దొరికినవి. విగ్రహముల నిర్మాణ వివరములు శ్రీ డా. డా. సుబ్రహ్మణ్యంగారి, నాయకుల్, వర్ణింపబడినవి.

శ్రీ లక్ష్మీనరసింహము


స్వామి ఆసీనుడై కుడికాలును లంబమానముగనుంచి, ఎడమకాలినివంచి పీఠముపై నుంచుకొన్నట్లున్నది. శిరస్సుపై కరండమకుటమున్నది (తేనెతుట్టెను పోలినది) నాల్గు చేతులున్నవి. వెనుకవైపునున్న రెండుచేతులలో శంఖ చక్రములున్నవి. ముందరికుడిచేయి అభయహస్తముంచినది. మఱొక చేయి దేవిని పట్టుకొనినట్లున్నది. స్వామినాభియందు కమలము కలదు.



ఎవి రెండుచేతులు అంజలి బద్ధమైయున్నవి. కిరీటము కరండమకుటము. ఈ శిల్పరచన విజయనగర కాలమునాటి దనవచ్చును.

మహిషాసురమర్దని :

ఈ బింబము కొంతశిథిలమై యున్నది. విగ్రహముపై భాగము విరిగి పోయినది. పాదములు సమభంగమందుండి, దేవి సుస్థిరముగనిలచి యున్నది. పాదముల అధోభా



గమున మహిషాసురుని శిరస్సు మాత్రమున్నది. దేవి వెనుక వాహనమగు సింహ మున్నది. ఈ సింహముయొక్క జూలు కృత్రిమ బింబరచనా రీతిని బోలియున్నది.

ఈ విగ్రహనిర్మాణము విజయనగర కాలము తరువాతిదై యున్నది.


వీరుడు: ఈ బింబము, వీరునిదో లేక రాజపోషకుడగు సదాన్యునిదై యున్నది. ప్రతీక రచనాశైలి పురాతనమైనది ఈ నిలిచియున్న పురుషుని పాదములు ప్రక్క-



లకు తిరిగియుండుటచే, వణుచు మన్నట్లూహింప వలెను. సుందరని ముఖముకలిగి, శిరస్సుపై జుట్టుముడి వేయబడి, రత్నచకిత కర్ణాభరణములుకల్గి, కంఠాభరణ, హస్త భూషణములతో విరాజిల్లుచున్నాడు పుష్పగుచ్ఛము బోలునది కుడిచేతియందు కలదు కట్టుపట్టము మోకాళ్ళవఱకు నున్నది. భుజము నుండి వచ్చుక వస్త్రము వ్రేలాడి ఎడమ కుడిచేతితో పట్టుకొనబడి యున్నది. పాదములయందు ఆభరణములు లేవు

దేవి :


దేవి బింబము నిలచియుండి - పాదములు భూమిలోనికున్నవి త్రిభంగమున నిల్చియున్నది కిరీటము కరండమకుట రూపమునయుండ, పైభాగము శిథిలమై




యున్నది ఈ చిత్రవైభవముగల దేవీమూర్తి ద్విహస్తయుతము కుడిచేయి లంబ హస్తముగను, ఎడమచేతియందు కమల పుష్పస్తబకమును కలదు భువనేశ్వరిగా నుండును విజయనగరకాలము తరువాతి శిల్పరచనము

వీరుని విగ్రహము :

వీరుడు, వీరపత్ని (సతి)గా నుండును, లేక వదాన్య దంపతులుగ నుండును నిలచియుండి, స్త్రీ కుడివైపున యున్నది వీరపత్ని శిరోజములు సౌందర్య యుత



ముగ ముడివేయబడి యున్నవి. ఆభరణ భూషణములచే అలంకృత. ఆమె కుడిచేయి లంబహస్తమున నున్నది. ఎడమచేతియందు పద్మమున్నది. ఈమె త్రిభంగ సూచితముగా నిలుచున్నది. వీరుడు పూర్ణముగ త్రిభంగమున యున్నాడు. ఈతని శిరస్సున జుట్టు ముడి వేయబడియుండెను. కాని శిథిలమైయున్నది. కర్ణభూషణములు, కంఠాభరణములు కల్గియున్నాడు. కుడిచేయి విరిగియుండుటచే ఏమి [illegible] తెలియరాదు (కమలమై యుండునా?) వస్త్రమా? [illegible] వస్త్రమును ధరించియున్నాడు. ఈ అలంకారయుత వస్త్రము [illegible] చేతి క్రిందుగ వచ్చి [illegible] చేతితో పట్టుకొనబడి యున్నది.

ఈ బింబరచన కడు ప్రాచీనమైనది.

శాస్తా:

హరిహరనాథుని పుత్రుడు. ఈతడే అయ్యనారు, శాస్త యని పిలువబడును. ఈ దేవత గ్రామరక్షకుడు. ఇందు యీ దేవత పద్మాసీనుడై యున్నాడు. జటామకుటయుతుడై, శిరశ్చక్రము కల్గి, వలయితమగు కర్ణకుండలముల ధరించి ఆగమ శాస్త్ర నిర్ణితమైన భూషణములతో వెలుగొందుచున్నాడు. కంఠాభరణము, భుజకీర్తులు, ముంజేతి భూషణములు కల్గి యున్నాడు. త్రిసూత్ర యజ్ఞోపవీత యుతుడు. (మాలిక ఉపవీతమున కలదు?) ఉదరబంధమునకును కాళ్ళకును భూషణములు కల్గియున్నాడు.



కటివస్త్రము చిన్నది. ద్విహస్త యుతుడు. కుడిచేతియందు వజ్రాయుధము కలదు. (దీనిని తమిళములో సెండు అందురు) ఇది కరణాగము సమ్మతము. ఎడమచేయి, ఎడమతొడపై యున్నది. వెనుక కుడివైపున మూడు అంబులు, ఎడమవైపు విల్లు అమర్చినట్లు శిల్పింపబడి యున్నది. పీఠముక్రింద జీనుతో అలంకరింపబడిన గుఱ్ఱమున్నది. ఈ వాహనము వెంబడి చిన్న గుఱ్ఱమొక్కటి కలదు. ఈ శిల్పము 12, 13 శతాబ్దముల నాటిదై యుండును.

శాస్తా జన్మమునుగూర్చి భూతనాథోపాఖ్యానమున కలదు. ఈ గ్రంథము మళయాళ భాషలో నున్నది. వీరికి వాహనములు గుఱ్ఱములు. వీరిని అయ్యప్పన్ అని మద్రాసుకు దక్షిణమున వ్యవహరింతురు. తెనుగు దేశమున గురునాథుడని పూజించుట ఆచారము. దక్షిణాగ్ర దేశమున, పంపానదీ తీరమున, శబరి మలయమున వేంచేసి యున్నారీ దైవము. లక్షలాది జనులు పవిత్ర మనస్సులతో సేవింతురు.

దుర్గ :

ఈమె ఆసీనయై కుడికాలిని లంబమానముగ నుంచి, ఎడమకాలిని పీఠమున నుంచి యున్నది. చతుర్భుజములలో రెండు కుడిచేతులు విరిగిపోయినవి. ముఖాంగ




ములును శిథిలములు. కరండమకుట కిరీటముకల్గి, పత్రకుండలహారాదిక భూషణములు కల్గి, మేఖలాభూషితయై యున్నది. రెండు ఎడమచేతులలో శూలకపాలములున్నవి.


బింబరచనా కాలము 16,17 శతాబ్దములదై యుండవచ్చును.

సుబ్రహ్మణ్యస్వామి :

మయూర వాహనారూఢుడై యుండి, కుడికాలు లంబమానముగ, ఎడమ కాలు వాహనముపై నున్నవి. కుడిచేతులందు వజ్రాయుధము కలదు. ఎడమచేతులందు మరికొన్ని ఆయుధములుకలవు. కరండమకుటము, కర్ణ, కంఠభూషణాలుగలవు. భుజకీర్తులును గలవు. విజయనగరకాలమునాటి బింబరచన.



ఈ విగ్రహము లన్నింటిని భద్రపఱచి, దృశ్యనీయముగ వాకాడు విద్యాలయమున వస్తు[illegible]శాలయందు స్థాపింపబడినవి.



శ్రీకృష్ణసమేత ధర్మరాజు దేవళమున జరిగిన అగ్నిగుండ ప్రవేశము.

# ౧

# నెల్లూరు మండల సంస్కృత విద్వత్కవి చరితము

ఉడాలి సుబ్బరామశాస్త్రి, M A

ప్రిన్సిపాల్, వేద సంస్కృత కళాశాల, నెల్లూరు.

[ఈ వ్యాసకర్త పదినెలలు వ్యాసవస్తువునకు వలయు విషయముల కొఱకై పర్యటించి యన్వేషించి వ్యాసమును గ్రంథసమానమగు సుదీర్ఘ పరిమితితో (164 పుటలు) మాకందించిరి. సర్వస్వ మిప్పటికే 1200 పుటల ప్రచురణము మీరియుండెను. ఈ బహు వ్యాప్త వ్యాసము తనే పుస్తకముగా ముద్రింపబడనున్నది. కావున, ఇందు దాని సంక్షిప్త రూపము ప్రచురింప నగ్గిమన్నాము ]

నెల్లూరు మండలము ఆంధ్ర దేశములోని యితర మండలముల కంటెను సాంఘిక సారస్వత సంస్కృతి నాగరికతా విషయముల యందు చాల ముందడుగు వేసినది. ఈ మండలమున వైష్ణవులు, ద్రావిడులు, సంస్కృతమున గొప్ప విద్వాంసులుగను నియోగులు తెలుగునందు గొప్ప వైదుష్యమును సంపాదించి యుండి నట్లును మనము గ్రహింప వచ్చును. ఇందు పండితులను పోషించు చుండిన సంస్థానములు పెక్కు లుండినవి. సారస్వత చరిత్ర ఎల్లప్పుడును పరిసరపు ఆర్థిక పరిస్థితితో ముడివేయబడి యుండును గాన పండితుల ఆర్థిక పరిస్థితిని, సంస్థానములు శ్రోత్రియములు అగ్రహారములు మున్నగు వాని నొసంగి, యుద్ధరించుట వలన, వాని నాధారముగఁ జేసికొనియే సాంఘిక చరిత్రను చిత్రించుట యుక్తము, సహజము. మన మండలమున వేంకటగిరి ఉదయగిరి, చుండి పెద్దపవని మున్నగు సంస్థానములు ముఖ్యముగా కవి పండితుల నాదరించుచునే యుండినవి. నెల్లూరు చిర కాలమునుండి మనుమసిద్ధి మున్నగు రాజుల పరిపాలనయందు కవి పండిత పోషణకు గొప్ప ప్రసిద్ధి పొందిన విద్యాక్షేత్రము.

విక్రమ సింహపురి యను నామాంతరముతో శాసనముల యందు గూడ ప్రసిద్ధి నొందిన నెల్లూరు అతిప్రాచీన చరిత్రగల్గిన పురాతన పట్టణము. నాటి చిహ్నములు నేడును గానవచ్చుచున్నవి. ఆంధ్రదేశమున సంస్కృతము కొంతకాలము

శాసన భాషగను, చిరకాలము గ్రాంథిక సారస్వత భాషగను నుండినది. కాని శాసనములను మించి రాజకీయ ప్రాముఖ్యముగాని, వ్యావహారిక ప్రాముఖ్యముగాని యీ భాష కున్నట్లు గోచరించదు. ఆంధ్రదేశమున జైన బౌద్ధ మతప్రచారము వలన, పాళీ భాష, వ్యవహారిక రాజకీయ రంగముల యందు ప్రాముఖ్యము వహించి యుండిన కాలము గలదు. క్రమముగా నాంధ్రరాజుల పరిపాలన ప్రారంభమయిన కాలది, ఆంధ్రభాష నెలకొని శతాబ్దుల తరబడి పరిణామము నందుచు నేటి స్థితి యందు మనకు దక్కినది. కాని సంస్కృతము నాటికిని నేటికిని ఒక్కరూపములోనే కానవచ్చు చున్నది. నెల్లూరు మండలమున సంస్కృతము మంచి యున్నతస్థితి నందినట్లే భావింపవచ్చును.

వ్యాస వాల్మీకి, కాళిదాసాదుల కవితా వాహినులు దేశ కాల కృతములగు నవధులను భేదించియే ప్రవహించినవి. ఆ సేతు హిమాచలము వ్యాప్తి నొందిన సంస్కృత మంతటను నొక్క విధమయిన స్వరూప స్వభావ సౌందర్య సంపత్తిని చూపుచున్నదే గాని దేశ కాల కృతములగు కృత్రిమ వికృతులకు లోబడలేదు. భారత భాగవత, రామాయణాదులను దేశభాషలకు, పరివర్తనము చేయుటకు ముందు గాని, తర్వాతగాని అంతటికిని అధ్యేయమయినది సంస్కృత మొక్కటియే. సంస్కృతములో మహాపండితు లయినందు వలననే, కవిత్రయము భారతము నాంధ్రీకరింప గల్గిరి.

సంస్కృ తాంధ్ర సాహిత్యములకు రెంటికిని ప్రచారమున్నను, అందు విశేషించి తెనుగునకు ప్రచార ముండినదని మన మూహింప వచ్చును. సంస్కృతమున కంటెను తెనుగుభాష రాజులకును ప్రజలకు నందుబాటులో నుండుట వలనను, అందు వ్రాయబడిన గ్రంథములే విశేష ప్రచారమును బొందుచుండినవి. ఈ మండలమున సంస్కృత మున్నతి స్థితినొందిన దనుటకు శాసనములే ప్రమాణములు. విషయ సౌకర్యమునకై శాసన కవులు, మధ్యమ కవులు, ఆధునిక కవులు సంస్కృత పండితులు అని స్థూలముగ విభజించి యొక్కొక్క శీర్షకమును ప్రత్యేకముగ వివరింపబడుచున్నది.

# శాసనకవులు

నెల్లూరు మండల శాసనములు పరిశీలింపగా సుమారు పదముగ్గురు కవి పండితులు కనబడుచున్నారు. శాసన రచయితలను కూడ కవులక్రింద జమకట్టినచో నింకను కొంతమంది కవులు కానవచ్చుచున్నారు. ఈ శాసనములలో మిక్కిలి ప్రాచీనమయినది 663 క్రీ. శ. నకు చెందినది. మిక్కిలి అర్వాచీనమైనది 1647 క్రీ.శ. నకు చెందినది.

663. క్రీ.శ. శ్రీమేఘా చార్యులు, 2) వజ్రశర్మ పశ్చిమ చాళుక్య రాజైన ప్రథమ విక్రమాదిత్యుడు "ఎకుసంతతి" గ్రామమును వీరికి దానము గావించెను. మేఘాచార్యులు ఈ విక్రమాదిత్యునకు వేదాంతగురువులు. "సాంగో పాంగ విదుషే వాసిష్ఠ సగోత్రాయ శ్రీమేఘాచార్యాయ స్వగురవే" యని యున్నది.

వైద్య కుటుంబమునకు చెందిన వజ్రవర్మ యను నతడు శాసనమును రచియించెను. (ఈ శాసనము తలమంచిగ్రామ సమీపమున దొరికినది.)

తిరుకచ్చినంబి క్రీ. శ. 1299

కూమూరు ప్రాంతమున వీరన్నకనుపూరు నందలి వీరభద్రస్వామి దేవాలయమునందలి పై రాతిపై "పిళ్ల యడయ నారాయణ పెరుమాళ్" పూజకై తిరుకచ్చి నంబిపేర నొక దానశాసన మున్నది. ఈ తిరుకచ్చి నంబి నెల్లూరులోని అంగడివీధి యందు నివసించి యుండినట్లు తెలియుచున్నది. నెల్లూరుసీమ వడనాడనియు, మడనాడనియు, జయకొండ చోళమండలములోని భాగమనియు తెలియుచున్నది. నంబి పేరుచే అర్చకుడని తెలియుచున్నది.

శ్రీకంఠనాథుడు, భోగనాథుడు క్రీ. శ. 1356.

తెలుగులిపిలో వ్రాయబడిన పై సంస్కృత శాసనమున శ్రీకంఠనాథుడు, భోగనాథుడు పేర్కొనబడిరి. సంగమభూపాలుడు తన వేదాంతగురువైన శ్రీకంఠనాథుని ప్రార్థనవలన ఇరువదియెనమండుగురు పండితులకు ఈ గ్రామమును దానము చేసెను. అందుచే దీనికి శ్రీకంఠపుర మని పేరు కల్గెను.

ఇదిగాక "సుంకేసరి" యను గ్రామము దానము చేయబడినట్లు చెప్పబడు చున్నది.

భోగనాథుడను రాజవిదూషకుడు ఈ శాసనమును రచియించెను.

దేవరాజమిశ్రుఁడు క్రీ.శ. 1390.

ఉదయగిరి రాజైన రామచంద్రుని యాస్థానమున దేవరాజమిశ్రుఁడను కవి యుండెను. అతఁడే యీ శాసనమును గూడ రచించెను. దేవరాయపురమను గ్రామమును ఋగ్వేద భారద్వాజగోత్ర చెన్నుభట్టునకు రామచంద్రభూపతి దానము చేసినట్లు తెలియు చున్నది. దానమునుబట్టిన చెన్నుభట్టుడు పురాణ మార్గమున గొప్ప పండితుఁడని తెలియుచున్నది. దేవరాజమిశ్రుఁడు మహాపండితుఁడు మహాకవి యని తెలియుచున్నది.

"యస్య ప్రతాపానల జృంభమాణ జ్వాలావలీ డే భువనాంతరాళే
తమః పరం ప్రాప దనుప్రవేశం ప్రత్యర్థి పృథ్వీపతి హృద్గరీషు"

సూరభట్టుడు క్రీ. శ. 1515.

కృష్ణరాయ మహారాజు విద్వాంసుడైన సూరభట్టునకు "నాగులవరము"ను దానము చేసెను.

సభాపతి క్రీ. శ. 1536.

దర్శితాలూకా పోలేపల్లిని అచ్యుతరాయలు దానముచేసిరి. శాసనమున
"అచ్యుతేంద్ర మహారాయ శాసనేన సభాపతిః
అభాణీత్ మృదుసందర్భం తదిదం తామ్రశాసనమ్"

తిరుమలభట్టు సభాపతి క్రీ శ. 1541.

అచ్యుతమహారాజు తిరుమలభట్టునకు "ఎడకల్లి"యను గ్రామమును దానము చేసెను. ఇయ్యది ఉదయగిరికి సమీపమున నున్న చిటమన గ్రామమునకు పూర్వముగా నున్నది. ఈ తిరుమలభట్టు

"భైరభట్ట పుత్రాయ తిరుమలభట్టాఖ్య శాలినే, తంత్ర వార్త-
మహాభాష్య ప్రతిభా ప్రథవిష్ణవే"

ఆచారయ్య, సభాపతి స్వయంభువు క్రీ.శ. 1549.

మామిడిపూడి యను గ్రామమును సదాశివరాయలు ఆచారయ్యకు దానము చేసినట్లు తెలియుచున్నది. ఈ గ్రామము పాకనాడునందు వుదయగిరి రాజ్యమున సర్వపల్లిసీమలో "తాళ్లపూడి" గ్రామమునకు తూర్పుగా నున్నట్లు సర్వసస్యశోభిత మైనట్లు చెప్పఁబడి యున్నది. ఇందలి శ్లోకసంఖ్య 78. దీనిని రచియించినది సభాపతి స్వయంభువు

"షణ్ణామపి చ శాస్త్రాణాం, నిర్ణాయక నిజోత్తమే
వైష్ణవా గమ సిద్ధాంత వేదినే, బ్రహ్మవాదినే
విశిష్య శిష్యవర్గాణాం, శ్రీభాష్యోద్ధోప దేశినే"

ఇందలి శ్లోకముల శైలి మధురమై రచన శ్లేషా ద్యలంకార ములతో నొప్పియున్నది.

"సకమ్ప స్వేద రోమాంచాఃి, సమరే మకరాంకితాః
యస్యా భీమరతాః సత్యః, శత్రవో భీరవోఽ భవన్"

శ్రీరంగరాజార్యుఁడు - చిదంబరకవి క్రీ. శ. 1602.

శ్రీరంగరాజ పండితునకు "ముంగళంపాటి" (జగన్నాథపురం - పోలూరు) గ్రామమును శ్రీ వేంకటరాజు దానమిచ్చెను. ఈ గృహీత

"శ్రీమ ద్రామానుజార్యస్య యోమహావసికో మహాన్
ప్రఖ్యాత సర్వశాస్త్రేషు వేదాంతో దయ నాహ్వయః"

ఇత్యాది గుణములు గలిగిన

"జగన్నాథార్య వర్యస్య పుత్రాయ గుణశాలినే
శిష్ట వైష్ణవ సామ్రాజ్య శ్రీ స్వయంవర కామినే
అష్టాదశ పురాణార్థ హృష్టాశయ సరోరుహా
శ్రీరంగరాజ వర్యాయ విద్యా వినయశాలినే"

దానమిచ్చిన రాజు

"వితరణ పరిపాటీం యస్య విద్యాధరీణాం
నఖర ముఖర వీణా నాద గీతాం నిశమ్య

అనుకల మయమా వాలాంబు బింబాపదేశాత్
అమర నగరశాఖి లజ్జయా మజ్జతీవ
శ్రీరామరాజ క్షితిపస్య తస్య
చింతామణే రర్థి కదంబ కానామ్
లక్ష్మీ రివాంభోరుహ లోచనస్య
లక్కాంబి కాఽముష్య మహిష్యలాసీత్॥

"తస్యాధికైః సమభవ త్తనయ స్తపోభిః
శ్రీరంగరాజ నృపతిః శశివంశదీపః
ఆసర్గ సముల్లసతి ధాయ నియస్యచిత్రం
నేత్రాణి వైరిసుదృశాంచ నిరంజనాని"

ఇందు ఉపమారూపకో త్ప్రేక్షాలంకారములు చక్కగా కుదిరియున్నవి.

అనంతాచార్యులు - రామకవి క్రీ. శ. 1647.

ఉచ్చూరు గ్రామమును కర్ణాటక రాజ్యాధిపతి యగు ఆరవ రంగరాజు అనంతాచార్యులకు దానమిచ్చెను. ఇందలి శ్లోకసంఖ్య 71. దీనిని రచించినది రామకవి

"రాజన్యా స్థానరత్నాయ రక్షితా శేషబాంధవే
వైష్ణవాగమ సిద్ధాంత వావధూ కైకశాలినే
విఖ్యాతోఽభయ వేదాంత వ్యాఖ్యా వైభవశాలినే"

ప్రెగ్గడపాటి శాసనమున: "భట్టబాణు" కవి పేరు కనబడుచున్నది.

## III

కవి సీతారామయ్య:

షుమారు నూఱుసంవత్సరములకు పూర్వము వేంకటగిరి రాజాస్థాన కవిగానున్నట్లు తెలియుచున్నది. "హిమవతీతాండవము"ను కావ్యము నితడు రచించెను. ఈ "హిమవతి" యా రాజాస్థాన మందలి నాట్యకత్తె.

సూరి రామశాస్త్రి :

కోట గ్రామకాపురస్థుడు. ఎనభై సంవత్సరముల క్రిందట జీవించియుండెను. శ్రీకృష్ణలీలలు వర్ణించుచు "మాధవీయ" మను కావ్యమును రచించెను. నెల్లూరు నవాబుపేటకు చెందిన సంస్కృతాంధ్ర పండితులగు వింజమూరు నరసింహాచార్యులు పినాకినీమాహాత్మ్యమును తెనిగించెను. మహిమలూరు పంతులయ్య : ఇతడు మహిమలూరున పశువులను మేపుకొనుచు అడవిలో తిరుగుచుండగా పురాకృత విశేష భాగ్యముచే నితనికి కృష్ణభగవానుడు ప్రత్యక్షమై బీజాక్షరముల నుపదేశించెను. అందుచే నీతడు కవియై కొన్నిసూక్తులు రచించినట్లు ప్రసిద్ధి— వేంకటగిరికి చెందిన గడియారము భాస్కరశాస్త్రి: సంస్కృతమున శివునిగూర్చి అష్టపదులు రచించెను— కొండూరివారి అగ్రహారమునకు చెందిన కొదమగుండ్ల కేశవాచార్యులు బంధ కవిత్వ మయమగు నొక కృతిని రచించెను— వెంపటి రామనాథశాస్త్రి సంస్కృతమున శ్రీకృష్ణచరిత్రమును వ్రాసెను— చాగంటి మల్లికారాధ్యుడు. ఇతనిది కందుకూరు. ఇతడు "శివలింగాదిత్యభవ మీశ్వరో వ్యలిఖత్ ముదా" అనుటచే సంస్కృత గ్రంథము వ్రాసెనని తెలియుచున్నది— ఆలూరు బ్రహ్మభట్టు కుమారుడైన మాధవపంతులు "త్రిపదోద్ధూళిని" అను గ్రంథమును రచించెను— కందుకూరునం దుండిన కవివాది భేరుండ నృసింహయజ్వ కుమారుడు ఈశ్వరభట్టు శివలింగారెడ్డి ఆస్థానమున నుండి "స్తుతిసూక్తిమాల"యను గ్రంథమునకు "తత్వప్రకాశిక"యను వ్యాఖ్య రచించెను— వీరుగాక, నెల్లూరు రంగకవి, కందుకూరి నాగనాథుడు, తదితరులు నగు మఱికొందఱు నెల్లూరు మండలీయుగా నుండినట్లు తెలియుచున్నది.

## IV

## ఆధునిక కవులు - పండితులు

పిక్కిరాలవారు :

ఈ కుటుంబీకులు శ్రీవేంకటగిరి ఆస్థానమున పండితులై యుండిరి. కొందఱు కొన్ని కారణములచేత నితర సంస్థానముల నాశ్రయించి యుండిరి. వీరిలో ముఖ్యులు కళత్తూరు పిక్కిరాల రాఘవాచార్యులు: వేదవేదాంగదర్శన వేత్తలై వారణాశి

యాదు "షడంగవేదజ్ఞ" యని బిరుదము నొందిరి. పంచాంగ రచనకు సులభమైన గణితమార్గమును కనిపెట్టిరి. వీరి జననము తే 11-4-1844. వేంకటగిరి రాజాస్థానమునందు వేదప్రామాణ్యమును నిలబెట్టిరి. వీరు పెక్కు యజ్ఞములలో సదస్యులై యగ్రపూజల నందుచుండిరి. బహు గ్రంథకర్త—

విక్కిరాల రామచంద్రాచార్యులు :

వీరికి గల బిరుదములే వీరి పాండిత్యమునకు పతాకములు— విద్యారణ్య పంచానన, విద్యావాచస్పతి, అష్టసిద్ధాంత తంత్రవేత్త, కళానిధి— వీరి స్వగ్రామము కవిపండితాగ్రామమైన "కలికివాయి". వీరు హయగ్రీవ సాక్షాత్కార మందిన వుపాసనా సంపన్నులు. ముత్యాలపాటి సంస్థానమం దాస్థాన పండితులు. 1919-వ సంవత్సరములో పునహా నగరమందును, 1920-22 లో కలకత్తా నగరమందును జరిగిన సభలలో విద్వద్బిరుదముల సంపాదించిరి. కలకత్తాలో "విద్యాశేఖరు"లుగ ప్రసిద్ధినొందిన అష్టోష్ముఖర్జీ మహాశయుని వలన మన్ననలందెను. నేపాళదేశ పండిత సభలో "కళానిధి" యను బిరుదు నొందిరి. కులపతులై వైదిక విద్యార్థులకు వేద వేదాంగములను బోధించిరి. గ్రహములచారము కాల పరిణామమునందు పరిశోధన సల్పిన స్వామికణ్ణుపిళ్ళె గారికి గణితమును బోధించిరి. వీరు పండితుల నాశ్చర్య చకితుల గావించు పురాణ నిగూఢరహస్యముల నెన్నియో విద్వత్సభలయం దుపన్య సించిరట. చాంద్రమానము, సౌరమానము, క్రీస్తుశకము, హిజరీ మానములకు గల తారతమ్యతలను కనిపెట్టి సమన్వయించుట కుపయోగపడు అద్భుతగణితమును కను గొనిన మేధానిధులు వీరి జననము తే 6-6-1878. వీరు తే 7-4-1932 మరణము.

పండిత శ్రీమాన్ విక్కిరాల రాఘవాచార్యులు :

1909 లో జన్మించిరి. వీరు సంస్కృతమున, సృష్టితత్వప్రకాశిక, సుభాషిత శ్లోకములను రచించిరి.

విక్కిరాల శేషాచార్యులనువారు :

4-6-1915 లో జన్మించిరి. చతుర్విధ కవితావిశారదులు. వీరి రచనలలో ప్రసిద్ధి నొందినది "శ్రీనివాసప్రసాదః" అను కావ్యము.

ఏక్కిరాల శేషాచార్యులు :

వీరు కాళహస్తి సంస్థాన కవులు. "కంఠీరవ" బిరుదము గలవారు. "మదనవిజయభాణ" కర్తలు. ఈ ఏక్కిరాలవారి కుటుంబము మూడునాల్గు తరముల వారు కవులై, పండితులై విలసిల్లుచున్నారు.

వెన్నెలకంటి హనుమాయమ్మ :

జననము తే 25-8-1875. వెలగపూడివారి ఆడబడుచు. ఈమె గురుస్వాములగు శ్రీ శ్రీ శ్రీ పరమహంసపరివ్రాజ కాచార్యవర్య శ్రీ బ్రహ్మానంద సరస్వతీ స్వాములవారి "పాదుకాపూజన"మను గ్రంథమును సంస్కృతమున రచించినది. 1916 లో యీ కృతి నిర్ణయసాగర ముద్రణాలయము (బొంబాయి)న దేవనాగర లిపిలో ముద్రితమైనది. ఈ గ్రంథమందు ఆ గురుస్వాములవారి పాదుకాపూజా విధాన మామూలాగ్రముగా వర్ణింపబడియున్నది. ఇందలి ధ్యానశ్లోకము.

"సర్వీజాది సమాధి సంస్థితపదం, నీవార శూకోపమం,
నిష్పాపం, నిగమాంత వేద్యనిలయం, నిర్లేపకం, నిర్గుణం,
నిర్ద్వంద్వం, నిరుపద్రవా త్మకపదం, నిర్వాణదీపం, నిజం.
బ్రహ్మానంద సరస్వతీగురు పదం, మోక్షప్రదం తం భజే"

ఈ గ్రంథమున శ్రీ గురుస్వాములవారి అష్టోత్తర నామావళియు ముప్పది రెండు శ్లోకములును గలవు. ఈమె శ్రీదత్త పూజాగీతా కదంబమను గ్రంథమున దత్తాత్రేయ పూజావిధాన మంతయును గీతములు రాగములు తాళములతో సన్నయించి వ్రాసియున్నది. ఇది 1920 లో బొంబాయి. ఇందు ప్రకాశ ముద్రణాలయమున ప్రచురితమైనది. ఇందు నలువదిరెండు గీతములు కతిపయ శ్లోకములును గలవు. మచ్చున కొక గీతము

— "లాలి - మధ్యమావతి రాగము - జంపె తాళము" —

"లాలీతి జగు రమరలలనా స్త్వాం దత్తా
నారద స్తైవ కదా శ్రీబ్రహ్మ నపసి
లోహ చణకా భ్యాష పాకపరిశీలా
అతి జాయాపతి వ్రతేతి ప్రశ శంస ॥లాలీ॥

శ్రుత్వాఽథ వాణీ రమోమాతి రుష్టా
ప్రేరయంత్యా షరీ తస్యాః సత్వహృత్యైః" ॥లాలీ॥

ఈ గీతములు బొంబాయి ప్రాంతము నందలి దత్తోపాసకులు చాల గౌర వించెదరు. ఈమె 1926 లో జగద్గురు శ్రీశంకర భగవత్పాదాచార్య పూజావిధి రచించినది. ఇది కాశీలో "జ్ఞానమండల యంత్రాలయము వారిచే దేవనాగర లిపి యందు ముద్రితమై యున్నది. ఇందు శ్రీవారి షోడశోపచార పూజావిధానము వివరింపబడి యున్నది. ధ్యానశ్లోకము

"భాష్యం వామకరేసిధాయ పరత శ్చిన్ముద్రయాబోధితం
ప్రాక్కుండీ వరదండ శిష్యసహితం పద్మాసనస్థం ప్రభుం
ఫాలే భస్మధరం సుధాకరనిభం రుద్రాక్ష హారాన్వితై
శ్రీ మచ్ఛంకర పూజ్యపాదమనిశం ధ్యాయామ్యహం సద్గురూ"

ఇందు శంకరులవారి జీవితచరిత్ర దెల్పు నష్టోత్తర శతనామావళి యిమిడ్చి యున్నది. 1933 న, ఈపరమవిజ్ఞాని 329 అనుష్టుప్ శ్లోకములలో "ఓం"కార పూర్వక నమోంతములగు 1021 నామములు విభక్తములైన సహస్రనామావళిని రచించియున్నది. ఇందలి శ్లోకము

"చిత్త వ్యాఘ్ర మదధ్వంసీ మనో మర్కటసూదనః

మోహగ్రహ గాయత్రీదేవిపై నక్కవ మక్కవ. ఆదేవిపై రచించిన పుష్పమాలికా బంధమున గూర్పబడిన శ్లోకము నుదహరించడమైనది.

"హంసస్థాం సత్యసంధాను గజగ నిగమాధార తారస్వరస్థాం
గాయత్రీం యజ్ఞయజ్ఞాం సురనరవరదాం పంకజాం కంబుకంఠీం
సావిత్రీం విశ్వవిద్యాం శ్రుతినుతిగళితాం దేవ సౌవర్ణవర్ణాం
వందేహం దేవదేవీం విమలమణిమయీం కుంద సౌందర్యదన్తామ్"

ఈ మహాభక్త కవయిత్రిని గూర్చిన వివరములన్నియు బ్ర.శ్రీ. వొంగోలు వెంకటరంగయ్య పంతులుగారు గృహలక్ష్మి యందు విపులీకరించియున్నారు.

శ్రీ యరగుడిపాటి వేంకటాచలం పంతులుగారు :

వీరు "శ్రీ సీతారామచంద్ర మానసపూజా విధానము" (షోడశోపచార ములు) అను గ్రంథమును 27 శ్లోకములు 27 గేయములలో రచించిరి. గ్రంథాది శ్లోకము —

"శ్రీవాల్మీకి పరాశరాది సుకవీన్ నత్వా గురూంశ్చాదితః
శ్రీ సీతా రఘురామ చంద్ర విషయాం నిర్వాణ సౌఖ్యప్రదాం
పూజా మానసికీం సుయోగ విదితాం వక్ష్యే సమా సేవధీ
విశ్రాప్తే సకలోపచార సహితాం తుష్యంతు సంతోశయా"

దీనియందు, విషయప్రయోజన సంబంధాధికారులను గ్రంథకర్తగారు సూచించి యున్నారు. ఈయన కవిత మృదుమధురమై మానసిక పూజకు వలసిన భావనా శక్తిసంపదలతో నొప్పారుచు, రాగరస రంజితములైన గేయములతో కూడి భక్తుల హృదయానంద కందముగా నున్నది.

"శ్రీరామ జాగృహి నవారుణ రస్మిజాలైః
ఫుల్లాని పద్మముకుళాని చరన్తి భృంగాః
నందంతి కోకమిథునాని సురాః స్తువంతి
సీతాపతే రఘుకులోత్తమ సుప్రభాతమ్"

ఇట్లుగా అష్టపదులలోని శ్లోకములు చెప్పి తర్వాత గేయములు వ్రాసి యున్నాడు.

— గేయము —

"అరుణ కిరణారుణా ప్రాచీ దిగాభాతి
సురభి సుమ గంధయుత మలయ మరుదాయాతి
ఘనతర తమిస్రమ త్సంత విలయం యాతి
కోక మిథునంచ సంయోగ మోద ముపైతి"

ఈ మానసపూజ ప్రత్యేకతను యోగశాస్త్ర విషయములతో స్వానుభవము నీక్రింద వివరించియున్నాడు.

"హనుమదాది సద్భక్తాన్ నత్వా
ఆగమార్థ నిచయం విదిత్వా
ఘన సచ్చిత్సుఖ బ్రహ్మాభిన్నం
మనసా దశరథ రామం ధ్యాత్వా"

"హృదయ కమల కుట్మల మధోముఖం
సంఫుల్లం కృత్వా, త దనుకర్ణి కోపరి మండలాని తపన సోమ
వహ్నీనాం ధ్యాత్వా, అనల మండలే సీతారామ మమిత
తేజసాం సిధిముఖ, రామ మనిశం ధ్యాయాత్ ప్రేమభక్త్యా"

శ్రీమాన్ తిన్మనూరు అద్దంకి తిరుమల లక్ష్మీనృసింహ కుమార తాతాచార్యులు :
(కవిభూషణస్వామి)

వీరు ఒంగోలు తాలూకా తక్కెళ్ళపాడున జన్మించిరి. ఉభయవేదాంత పారంగతులు. వీరు కాళహస్తి రాజాగారి ప్రశంసలకు పాత్రులయిరి. రాజునుగూర్చి:-

ఆ చక్రవాళా దవనీపతిత్వం ఆ బ్రహ్మలోకా దచలాంచ కీర్తిం
ఆయుష్య మారోగ్య మశేష వృద్ధిం దదాతు తే వేంకటశైలనాథ॥

వీరిని కేరళవర్మ తనదేశమునకు ఆహ్వానింపగా—

శ్రియస్సంతు క్షోణీపతిషు సముద్రో త్కుంజరఘటా
చల త్కర్ణో దీర్ఘై రళిభి రభిశస్తా ప్రతిదినం
వయం తావల్లక్ష్మీ రమణ చరణద్వంద్వ చరణః
తృణాయాఽపిక్షు ల్లాప దమిత నమవ్యామహ ఇమే ॥

సమాధానమంపి వారికి తన చిత్రపటమంపి, బదులు రాజుగారి చిత్రపటమును బొందిరి.

వీరి కుమారులు తిరువేంగడ తాతాచార్యులును సంస్కృత కవి. కాని చిన్నతనముననే పరమపదించిరి. ఆ సమయమున కవిభూషణస్వామి "తత్త్వపదవి" అను గ్రంథము వ్రాసిరి. అందు—

"సమే సూను ర్భాక్యే స్వజనమపహా యాత్రనకలం
పరం ధామ ప్రాప్తః ప్రియ సహచరః కార్యకరణే
వివేకీ విద్యావాన్ వినయ మన్యూనో వేంకటకవిః
సమాజే... ...భజతు బహుమానా త్కృతిమామ్"

కుమారునకు అంకితమిచ్చెను.

వీరు పెక్కు సంస్కృత గ్రంథముల వ్రాసిరి.

"విజ్ఞాన చింతామణి" యను సంస్కృత పత్రికయందు పెక్కు సమస్యలను బూరించియున్నారు. వీరు తర్క-శాస్త్రి పండితులకు లేఖలు వ్రాయునపుడు శాబ్దిక బోధముల తోడను, వ్యాకరణ శాస్త్రి పండితులకు ప్రకృతి ప్రత్యయములతోఁ బ్రచురము లయిన శ్లోకములను వ్రాసిరట.

వీరు తమ సౌమిత్రివిజయమున—

"యం తావదప్రాప్త ఇవ త్వమేవ
వవ్రే స్వయంవాక్ సరసోక్త దామ్నా"

పంచాగ్నుల దక్షిణామూర్తిశాస్త్రి:

న్యాయ వేదాంత పండితులు. పుష్పగిరి ఆస్థానమున చాలకాలము పండితులగు నుండిరి. నెల్లూరున కలెక్టరు రామచంద్రరావుగారి మన్నన బడసిరి. వీరికి నవద్వీపమునందు "తర్కాలంకారరత్న"మను బిరుద మొసంగి గౌరవించిరి.

జరూరు వేంకటాద్రిశాస్త్రి:

వీరు "సాహిత్యకేసరి" యను బిరుదముచే గౌరవింపబడిరి. ఈ మండలమున సంస్కృత పాఠశాలా పద్ధతిని స్థాపించుటకు బీజముల నాటిరి. వీరికి శిష్యు లనేకు లుండిరి.

వీణ అయ్యనశాస్త్రి:

వేంకటగిరి యందుండిరి. వీరు వ్యాస తాత్పర్యనిర్ణయ మను గ్రంథమును రచించిరి.

ఇంగువ వీరరాఘవ సోమయాజి :

కరేడు వాస్తవ్యులు. చతుస్తంత్రవేత్త. వీరు "అద్వైత తత్త్వప్రకాశిక" యను గ్రంథమును రచించిరి. ముద్రితము. కాని అలభ్యము.

అన్నవరపు రాఘవశాస్త్రి :

1840 క్రీ.శ.న కొత్తపట్నమున జన్మించిరి. వేదాంతవిధులు. "జీవన్ముక్తి వివేకము, పంచదశీ వ్యాఖ్య, బ్రహ్మసూత్ర భాష్యము" ఇత్యా ద్యనేక గ్రంథముల వ్రాసిరి.

కాశీదాస వేంకటసుబ్బయ్యశాస్త్రి :

కందుకూరు తాలూకా, తూమాడు అగ్రహారమునకు చెందినవారు. ఈ మండల మొదలి సంస్కృత పాఠశాలలో చాల సంవత్సరములు ఒజ్జగా నుండిరి. సంస్కృతమున నిష్ణాతులైన పండితులు.

చదలువాడ అనంతరామశాస్త్రి (చిన్నాయన శాస్త్రి), మినుములమూడి మునుస్వామి, శ్రీహసం, మునుస్వామిశాస్త్రి, పూని వీరస్వామి, మేలనాదూరు నరసింహశాస్త్రి, అల్లాడి వీరాస్వామిశాస్త్రి, కొండూరు సీతారామశాస్త్రి, కొండూరు వేంకటేశ్వరశాస్త్రి, తొండపి బంగారయ్య, వేదము నారాయణ సోమయాజులు, ఆల్లాడి రామబ్రహ్మశాస్త్రి, అల్లాడి సీతారామశాస్త్రి, మహాదేవశాస్త్రి పూని మహాదేవశాస్త్రి, సింగరాజు సూర్యనారాయణశాస్త్రి, అల్లాడి భట్టులు, ఉడాలి సూర్యనారాయణశాస్త్రి, చదలువాడ సుందరరామశాస్త్రి, పురాణం హయగ్రీవశాస్త్రి, గుఱ్ఱం వెంకన్నశాస్త్రి, వేదము వేంకటరమణశాస్త్రి— వీరు ఈ మండలమున ప్రసిద్ధ సంస్కృత పండితులుగా అసమాన కీర్తిగడించిరి. ఇంకను అనేకులు అనర్గళమైన పాండిత్యము సంపాదించి వాగ్దేవికి సేవచేసిరి.

పిసుపాటి చిదంబరశాస్త్రి :

వీరు శతావధానులు. కవిత్వము వీరి సొత్తుగ నుండెను. కాముకీ విరాగుల సంభాషణరూపమగు శతకము రచించిరి. అందలి శ్లోకద్వయము—

కాముకీ: తన్వ్యాస్తు శారద కళానిధి పూర్ణబింబ
స్వీకారి హాస సదనం వదనం సరాగం
యోవా నపశ్యతి తదేకమతిః పురస్తాత్
ధిక్ తస్యజీవిత మజాగళగ స్తనాభమ్.

విరాగి: పాలేచ భస్మిత మనోభవ మక్షియస్య
సుప్తే కళానిధి కలాకమనా విభాతి
తంయో నపశ్యతి తదేక మనాస్సమాధౌ
ధిక్ తస్య జీవిత మజాగళగ స్తనాభామ్ ॥

వీరు ఆంధ్రేతర మండలములో, తమ అవధాన కౌశలమును ఆశుకవితా నైపుణ్యమును ప్రకటించి గొప్ప సత్కార గౌరవములను పొందిరి.

వీరు మైసూరు మహాసభలో—

చిత్తైకాగ్ర్య మిహావధాన ముదితం దేశే వివిక్తేపునః
రాత్రౌ తత్సమవా వ్యతే సుకృతిభిః కాలే తురీయే తథా
అభ్యాసే సతి దేశకాల నియమోఽప్యాస్తాం నిరస్తః స్వయం
సైషా యోగవిద శ్చిదంబరకవే రాత్మానుభూతి స్మృతిః

1915-వ సం॥ సెప్టెంబరు నెల 15, 16 తేదులలో నిజాము శాస్త్రసభయందు జరిగిన అవధానగోష్ఠిలో "మానపూజాపహారః" అను సమస్య నిట్లు పూరించిరి.

సోయంరాజా భువివిజయతాం సుస్థిరం రాఘవేంద్రః
క్రీడాకాలే పటుతరబలే దానధర్మా ప్రసంగే
సంకల్పత్వాన్మృగం హరిహర పదాంభోరుహ ద్వంద్వభాగే
కీర్తిశ్యామా కుచయుగతలే మానపూజాపహారః ॥

విరివిగా అవధానము లవలీలగ జరుపుటయే గాక, గ్రంథము లనేకముల వ్రాసిరి. సంస్కృతమునకు ఎనలేని సేవచేసి 11-2-1951 లో స్వర్గస్థులైరి.

చక్రాల లక్ష్మీనృసింహశాస్త్రి :

వీరి జననము 24-7-1882. కూలంకష పాండిత్య సంపన్నులు. వ్యాకరణ శాస్త్రమున ప్రతిభ నార్జించినవారు. శ్రీ కామకోటి యతీశ్వరుల మన్నన బడసిన వారు. ఆసన్నసమయమును తెలిసికొని, సన్యసించి బ్రహ్మీభూతులైరి.

గాజులపల్లి హనుమచ్ఛాస్త్రి :

1-11-1893 జననము. పూర్ణప్రజ్ఞులు. నెల్లూరు నందలి వేదసంస్కృత పాఠశాల వృద్ధికి వచ్చుటకు వీరే ముఖ్యులు. వీరికి శిష్యపరంపర యున్నది. నెల్లూరున సంస్కృతమన, వీరినే ప్రజలు గౌరవముగా చూచుచుండెడివారు.

నడాదూరు రంగరామానుజాచార్యులు :

తర్క వ్యాకరణ శాస్త్రవేత్త. వీరు మంజూషా వ్యాఖ్య, ప్రచురణ పంచకా వ్యాఖ్య, ఆగమ మీమాంసా, ధాతుపాఠ కారికలు, పూర్వ మీమాంసా పరామర్శము, గీతాభాష్య పరామర్శమను ఉత్తమ గ్రంథముల రచించిరి.

యస్. యస్. హరిహరశాస్త్రి :

పాలఘాటు వారయ్యును, తిరువయ్యారునందు సంస్కృతము నేర్చి నెల్లూరున సంస్కృత పండితులుగా ప్రఖ్యాతి గడించిరి.

కవి తార్కికసింహ గోవిందాచార్యులు :

వీరు నెల్లూరి సంస్కృత పాఠశాలలో న్యాయ సాహిత్యములను బోధించిరి.

దావలి లక్ష్మీకాంతశాస్త్రి :

ప్రఖ్యాతులైన వేదాంత పండితులు. వీరు నెల్లూరున 1955 లో నేతెంచి, శిష్యులకు ప్రస్థానత్రయమును పూర్తిగా బోధించి 25-11-1959 న పౌరసన్మానము, గురుదక్షిణ పొందిరి.

పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రి :

వీరు గొప్ప పండితులు. రాజధర్మ కావ్యములకు సంస్కృత వ్యాఖ్య వ్రాసిరి.

మోచర్ల రామకృష్ణయ్యగారు :

వీరు ఆంధ్రకవివర్యులయ్యు, సంస్కృతమున, "శారదాప్రసాద"మను ఖండ కావ్యము రచించి, ద్వారకయందలి జగద్గురు శంకరస్వాముల మన్ననల నందికొని, వారిచే సాహిత్యరత్నమను బిరుదముతో సత్కరింపబడిరి.

శారదాప్రసాదమందలి శ్లోకములు :

జగన్నిర్మాణ కల్పప్రవీణాం పతిం గిరాభారతి కారయన్తీం
భజే సవిత్రీం భవతీం జనేఽస్మిన్ కించిద్భవత్యాః కరుణాభవేత్కిమ్ ?
యథాప్రకాశం రవిరశ్మిజానాం తథాన్యృణాం వాణి కరోషి వాచం
జ్యోతిశ్చిరం దీప యతేహినూతః శబ్దాహ్వయం సంసరణాని పుంసామ్॥

విద్యారత్న ఆకిలి శ్రీరామశర్మ (ముత్తుకూరు) :

వీరు తెలుగు, హిందీయందే గాక దేవవాణియందును కవిత్వము చెప్పిరి. గురుదేవాద్వైతస్తుతిః అను 50 శ్లోకముల స్తుతినివ్రాసి, 1943 సం॥ ఆనందప్రెస్‌నందు ప్రచురణమైనది. ఇయ్యది మౌనస్వాముల కంకితము. అందలి శ్లోకఘటిక —

పరం యన్మహస్సాను విశ్వప్రపంచ ప్రశాంతం శివం సుందరం చేతిలోకే
సమాక్రమ్య మన్మానసం వైసమన్తాత్ తదేవైధతా మేకమేవాద్వితీయమ్॥

పండితులు, కవులేగాక, సంస్కృతమునకు సేవచేసిన మహామహులు ఎందరో గలరు. అందులో ముఖ్యులు బ్రహ్మశ్రీయుతులు ఇంగువ శ్రీకృష్ణయ్యగారు. వీరు కర్మిష్ఠులు. వేదసంస్కృత పాఠశాలకు ఉన్నతసేవ చేసిరి. వీరితోకూడ కాసుభేల సీతాపతిరావుగారు, వారి కుమారులగు రామారావుగారు - ఈ సంస్థకు అపారముగు సేవచేసిరి.

ఇంకను, మండలమున సంస్కృతమందభిమానముంచి, గ్రంథము లనేకములు సేకరించి, పండితుల, కవుల సన్మానించి దేవభాషపై అవ్యాజప్రేమను, గౌరవమును చూపినవారు కీ. శే. శ్రీ రేబాల శంకరరెడ్డిగారు. భాషపై వీరికున్న అభిలాష చిరస్మరణీయమైనది.

నిశి నిశి విరహే తవప్రియా యా
        భవతి విలోచన మిందు కాంతలీలం
భవతిచ వదనం సరోజ మస్యాః
        బిసతను సూత్రసమాతనుశ్చతన్వీ

♦ ♦ ♦

ఆనందాశ్రుజలం సితోత్పలరుచోరాబధ్నతా నేత్రయోః
ప్రత్యంగేషు వరాననే! పులికేషు స్వేదం సమాతన్వతా ।
కుర్వాణేన నితంబయోరుపచయం సంపూర్ణయోరప్యసౌ
కేనా ప్యస్పృశతాఽప్యధో నివసన గ్రంథిస్తవోచ్ఛ్వాసితః ॥

—విశాఖదత్తుని: దేవీచంద్రగుప్త.

♦ ♦ ♦

దుర్గం భూమిరమాత్య భృత్యసుహృదో దారాః శరీరం ధనం
మానో వైరి విమర్ద సౌఖ్యమనురక్తప్రఖ్యేణ సఖ్యోన్నతిః ।
యస్మాత్ సర్వమిదం ప్రియా విరహిణః తస్మాద్య శక్తావయం
నస్వేచ్ఛాశులభైః పథోపి ఘటనే శైలా మఖండైరపి ॥

—మాయాపుష్పక - నాటకము.

♦ ♦ ♦

ధరణిదేవుల రామయామాత్యుని దశావతార చరిత్రము

కరపద్మంబునబర్హిబర్హము వాసంగం, జూళికాహీనమై
శిరముం బంగరుబొంగరంబువలె రాజిల్లం, గటీలోహితాం
బరమొప్పారఁగ, నుజ్జ్వల ప్రభదలిర్పన్, వార్ధికన్యామనో
హరుఁడా దైత్యులఁ జేరఁగాఁ జనియె, బౌద్ధాకారమేపారఁగన్.

—(9 అ - 35 ప.)

~~~
~~~

# 10

# మన మండల ఆంగ్లభాషా వికాసము

కాపుటూరు వేంకటరామచంద్రరావు, M.A.,
చరిత్రోపన్యాసకులు, వి. ఆర్. కాలేజి

భారతదేశమున నేడు ఆంగ్లమున కుండవలసిన స్థానమును గురించి తర్జన భర్జనలు దేశవ్యాప్తముగ జరుగుచున్నవి. ఇవి యెట్లున్నను, నేడు ప్రపంచమున ఆంగ్లభాష తక్కిన భాషలకు లేని యొక విశిష్టస్థానము నాక్రమించినది. ఆంగ్లము అంతర్జాతీయ భాష. అంతర్జాతీయ సమావేశములలో. శాస్త్రచర్చలును, రాజకీయ దౌత్య సంభాషణలును, వాణిజ్యవ్యాపార వార్తలును ఈ భాషలోనే జరుగుచున్నవి. ఈ భాషకు ఈ ఉన్నతస్థాయి లభించుట దైవనిర్ణయమని తోచక తప్పదు. ఆంగ్ల భాష నేడు ప్రపంచ విజ్ఞాన సాగరమున విహరించుటకు ఉపయోగించు మనోహర మగు యానపాత్ర. ప్రపంచ ప్రజలలో నేడు 250 మిలియన్ల (మిలియన్ అనగా 10 లక్షలు) మంది, అనగా ప్రతి పదిమందిలో నొకరు ఆంగ్లభాషను మాట్లాడు తున్నారు. ప్రతి నలుగురిలో నొకరితో ఏదోవిధముగ మనము ఆంగ్లమున సంభాషణ సాగింపవచ్చును. అన్ని మతములవారు, అన్ని జాతులవారు. అన్నివర్ణముల వారు ఈ భూగోళమున నాల్గవవంతు వైశాల్యమున గల ప్రజలు, ఆంగ్లమును కొంచెమో, గొప్పో నేర్చియున్నారు. సంఖ్యాధిక్యత యందేగాక, భౌగోళిక పరిధి యందును, ఆంగ్లము ప్రథమ స్థానము నాక్రమించుచున్నది. ఐక్యరాజ్యసమితి సభ్యులలో సగముమంది పైగా ఆంగ్లభాషయందు చర్చలను కొనసాగించు చున్నారు. ప్రపంచ తపాలలో 70 శాతము ఆంగ్లమునందు నెరపబడుచున్నది. రేడియో ప్రసారములలో 60 శాతము ఆంగ్లభాషలో జరుగుచున్నది. 1955 సం॥ జరిగిన బ్యాండంగ్ సమావేశములో 29 ఆఫ్రికా, ఆశియా రాజ్యములకు చెందిన 1.4 బిలియన్ల ప్రజల ప్రతినిధులు తమ చర్చలను ఆంగ్లమున నడపిరి. బహుభాషలకు చెందిన ఈ ప్రజా ప్రతినిధులు ఒకరి నొకరు నర్థము చేసికొనుటకు ఆంగ్లభాషయే శరణ్యమైనది. పండిత నెహ్రూ చెప్పినట్లు ప్రపంచమును పరిశీలించుటకు ఆంగ్లభాష ఏలైన వాతాయనము.

ఈ గవాక్షమును మూసిన రోజు మనము అంధకారమున మునిగి, కూపస్థ మండూకముల వోలె నుండు ననుటకు సందేహము లేదు.

మనదేశము ఆంగ్లమును తనదిగా చేసికొన్నది. భారతీయ మేధావులకు ఆంగ్లభాషలో గల ప్రతిభ, వశత్వము, ఆంగ్లేయులనే ఆశ్చర్య చకితులను చేసినది. అరవింద, వివేకానందాది మహాయోగులు, సరోజినీదేవి, తోరుదత్తు, రవీంద్రుడాదిగా గల కవి-గాయకులు, రాధాకృష్ణునివంటి తత్త్వవేత్తలు, V. S. శాస్త్రి, కట్టమంచి వంటి మహావక్తలు, గాంధి, నెహ్రూల వంటి రాజకీయ నాయకులు, తమ తమ దివ్య సందేశములను, ఆంగ్లభాషలోనే సర్వప్రపంచమున కెఱుకపఱచి, విశ్వవిఖ్యాతి నార్జించిరి. ఆర్. కె. నారాయణ్, ప్రవీర్ జాబ్‌వాలా వంటి భారతపుత్రులు ఆంగ్లమున నవలారచయితలుగా నేడు ప్రపంచ విఖ్యాతి నార్జించియున్నారు.

## II

ఆంగ్లభాషా వికాసమునకు భారతదేశమునగల మిగిలిన అన్ని రాష్ట్రములతో పాటు ఆంధ్రదేశముకూడ పరిశ్రమ గావించినది. రాధాకృష్ణ పండితుడు, కట్టమంచి రామలింగారెడ్డి, పట్టాభి సీతారామయ్య, చలపతిరావు, ఖాన్ మొదలగు ఆంధ్రపుత్రులు ఆంగ్లభాషయందు అనన్యసామాన్యమైన ప్రతిభ గడించి, తమ రచనలచేత విశ్వవిఖ్యాతి నార్జించిరి. ఆంగ్లభాషా ప్రపంచమున ఆంధ్రదేశము విశిష్ట స్థానము నాక్రమించుటకు మిగిలిన మండలములతో పాటు నెల్లూరు మండలముకూడ దోహదకారియైనది.

భారతదేశమున, ప్రథమముగా స్వీయచరిత్రను ఆంగ్లమున రచించిన భారతీయుడు నెల్లూరు పట్టణ నివాసియైన శ్రీ వెన్నెలకంటి సుబ్బారావుగారని చెప్పినప్పుడు, నెల్లూరు మండలమునకు ఆంగ్లభాషా వికాసమున ఎట్టి ప్రాముఖ్యము కలదో వేరుగా చెప్పబనిలేదు. కాని వీరు ప్రజానీకమున కపరిచితులు. వీరు అప్పటి మద్రాసు సాదర్ కోర్టునందు 1815—1829 వఱకు TRANSLATOR గాను INTERPRETER గాను ఉద్యోగమును నిర్వహించిరి. మీదు మిక్కిలి ధారాళమైన శైలిలో తమ స్వీయ చరిత్రను ఆంగ్లమున రచించిరి. ఈ చరిత్ర వారి బంధువుల

స్నేహితుల ఉపయోగార్థమై తిరునెల్వేలు జిల్లా మునసబుగా నుండిన సుబ్బారావుగారి తనయులు, గోపాలరావుగారు అచ్చువేయించిరి. దీనిని 1873 సం॥న మద్రాసునందలి C. FOSTER & Co., వారు ముద్రణము చేసిరి.

(వీరి వంశీయులు నెల్లూరునందున్నారు. వారి పౌత్రులలో నొకరగు శ్రీ వి. యస్. రామచంద్రరావు నేడు వేంకటగిరి రాజాగారి కళాశాలలో ఆంగ్లభాషోపన్యాసులుగా నున్నారు. వీరి సౌజన్యమున, ఆ అపూర్వ పుస్తకరాజము మాకు లభ్యమైనది.)

ఈ స్వీయచరిత్రయందు, తమ జీవితవిశేషములనేగాక, ఆనాటి ఆంగ్లేయు, భారతీయోద్యోగుల పరస్పర సంబంధ సౌహార్ద్రములను చక్కగ విశదీకరించియున్నారు.

వె. సుబ్బారావుగారి వలనే, మద్రాసు హైకోర్టునందు, అట్టి పదవిని అలంకరించినవారు మన్నూరు గుర్రం వెంకన్నగారు. వీరి రచన లేమియు లభ్యపడ లేదు. ఈ కాలమునకు కొంచెము పూర్వము అవధానం పాపయ్యగారు E. I Coy కొలువునందుండి, మద్రాసు గవర్నరుగా కొద్దికాలము పనిచేసి, ప్రఖ్యాతి వహించిన రాజ్యతంత్రజ్ఞుడు. ఆంగ్ల నవలారచయిత యగు స్కాటు, ఈ మహామహుని తన SURGEON'S DAUGHTER అను కల్పిత గద్య కావ్యమున నొక పాత్రగా గైకొనెను.

మద్రాసు విశ్వవిద్యాలయమందలి ప్రథమ ఎం. ఏ., పట్టపరీక్షయందుత్తీర్ణులైన వెలగపూడి సుందరరామయ్యగారు, మన పట్టణవాసి. వీరిని గూర్చిన వివరములను శ్రీ ఆచార్య నిడదవోలు వేంకటరావుగారు, తమ పరిశోధక వ్యాసమున వ్రాయుచున్నారు.

మధ్వపతి హనుమంతరావుగారు మద్రాసు విశ్వవిద్యాలయమునుండి ఆంగ్లభాషయందు ఎం. ఏ., పుచ్చుకొని, ఈ నగరమున అధ్యక్షులుగానుండి METAPHYSICAL POETS OF ENGLAND అను వస్తువుపై సుదీర్ఘమగు విమర్శనా పూర్వకమగు వ్యాసమును ఆంగ్లమున రచించిరి. ఇది అముద్రితముగనే రాజిల్లుచున్నది.

ముత్తరాజు సుబ్బారావుగారు, బందరు కాలేజిలో చరిత్రోపన్యాసకులుగా నుండి HISTORY OF ANDHRAS అను గ్రంథమును ఆంగ్లమున రచించిరి.

వంగోలు వేంకటరంగయ్యపంతులుగారు (1867-1949). వీరు బహుభాషాకోవిదులు. వీరు భరతనాట్యశాస్త్రాంతర్గత చతుర్థ అధ్యాయమును తాండవలక్షణ మను గ్రంథమును ఆంగ్లమున ప్రకటించిరి. వీరి ప్రతిభయంతయు, అపారమగు పాండిత్యమును, పరిశోధనయందు వ్యక్తమై యున్నది.

ఆసూరి రంగస్వామి సరస్వతిగారు చరిత్ర పరిశోధనల యందు అందెవేసిన చేయి. వీరు నాగార్జునకొండ యొక్క చారిత్రక ప్రాముఖ్యమును గుర్తించిన వారిలో ఆద్యులు. వీరాంగ్లమున HISTORY OF NELLORE అను పరిశోధకా గ్రంథమును వ్రాసియున్నారు. ఇంకను భారతీయ ప్రాచీన చిత్రకళమీదను, బహు విషైక పరిశోధనాయుత వ్యాసరాజముల ఆంగ్లమున వ్రాసిరి. (వీరి చిత్రము ఇందు ప్రకటితము. చూ. చిత్రఫలకము VIII). చరిత్ర పరిశోధనలలో కృషిసల్పి, వివిధ ప్రభుత్వ శాఖలలో అధికారముల నాక్రమించి ఆంగ్లభాష నలవరచుకొని, ముఖ్య గ్రంథములు వ్రాసినవారిలో నగ్రగణ్యులు; శ్రీమాన్ సి. రామకృష్ణమాచార్యులు, డా. యన్. వేంకటరమణయ్య. వీరి చారిత్రక పరిశోధనలు ప్రఖ్యాతములు.

## III

నెల్లూరు పట్టణము నలంకరించిన ప్రతిభాశాలురగు ఆంగ్ల విద్యాధికులలో వేదము వెంకటాచలమయ్య (1894—1931) గారు ముఖ్యులు. వీ రధివక్తలుగా నుండిరి. వీరు స్వయంకృషితో 11 విదేశభాషలను, 9 భారతీయ భాషలను అభ్యసించి, పాండిత్య మార్జించిరి. వీరు రచించిన ఆంగ్లకావ్యములలో ప్రశస్తమైనది మహాభాగతముపై వ్రాసిన విమర్శ. ఈ రచన పండితుల నాకర్షించినది.

చరిత్ర, రాజనీతులపై ఆంగ్లమున విస్తృతముగా రచించి, అంతర్జాతీయఖ్యాతి నార్జించినవారు మనమండల వాసియైన ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారు. వీరు 1929 నుండి 31 వరకు స్థానిక రాజాగారి కళాశాలధ్యక్షులుగా నుండిరి. కొన్ని దినములు విజయనగర సంస్థాన దివానులుగా నుండిరి, తరువాత బొంబాయి, ఆంధ్ర విశ్వవిద్యాలయములందు చరిత్ర రాజకీయ శాఖలకు అధ్యక్షులుగా పనిచేసిరి.

## IV

పత్రికావ్యాసంగము ద్వారా ఆంగ్ల భాషయందు తమ బహుముఖ ప్రజ్ఞను లోకమునకు వెల్లడించిన వారిలో, మన మండలీయులు, దంపూరు నరసయ్య 1860-ఖాసా సుబ్బారావుగార్లను పేర్కొనవలసి యుండును. దంపూరు నరసయ్యగారిని నెల్లూరు మండలమున "పత్రికాప్రకటనోద్యమ జనకులని చెప్పవచ్చును. వీరు 1865 ప్రాంతమున "నెల్లూరు పయొనీర్" అను ఆంగ్లపత్రికను స్థాపించిరి. వీరు కలెక్టరు ఆఫీసులో ఉద్యోగము చేయుచూ, ఈ పత్రికను కొనసాగించిరి. వీరి చిన్నతనంలో మద్రాసులో 'Native Advocate' అను ఆంగ్ల పత్రికను నడపిరి. తరువాత కొంతకాలము కీ।శే। వెంకటగిరి మహారాజా రాజగోపాలకృష్ణయాచేంద్రులకు ఇంగ్లీషు ఉపాధ్యాయులుగ నుండిరి. 1882 ప్రాంతమున 'Peoples Friend' అను ఆంగ్ల పత్రికను ప్రారంభించిరి. ఆంగ్లములో వీరి రచన మిక్కిలి పటిష్టమై, గంభీరమై యున్నది. జనవరి 21, 1897 నాటి Peoples Friend నందు వీరు గురుజాడ అప్పారావుగారి "కన్యాశుల్కము"ను సమీక్షించి యున్నారు. గురుజాడ అప్పారావుగారు 1909 జూలై 7వ తేదిన ఒంగోలు మునిసుబ్రహ్మణ్యం గారికి వ్రాసిన లేఖలో ఈ విధముగా చెప్పియున్నారు- ఒక తెలుగు పుస్తకాన్ని ఏలా రివ్యూ చేయాలో తెలుసున్నవ్యక్తి నా ఎరుకలో ఎవరూ లేదు. అన్నట్టు శ్రీ డి. నరసయ్య అనే పండితుడు వొకాయన "పీపుల్స్ ఫ్రెండ్" అనే వొక వారపత్రికను నడుపుతుండేవాడు. ఆయన నెల్లూరు వాస్తవ్యుడు. ఇప్పుడు వున్నారా? వుంటే ఆయన చిరునామా నాకు పంపించు. ఆంగ్ల భాషలో ఆయన గట్టివాడు" నరసయ్యగారి ఆంగ్లభాషా శైలి మిక్కిలి పటిష్టమైనదని చెప్పియుంటిని. ఉదాహరణకు వారి కన్యాశుల్క సమీక్షనుండి ఈక్రింది వాక్యములను గమనించుడు—

> "........... Mr. Appa Row, is apparently, a man of original ideas in literary matters........ He has wisely and happily discarded for the purposes of his comedy the unnatural, stilted, pedantic, literary dialect, so much beloved of Telugu Pandits............ The book, therefore, marks a new and bold departure in Telugu dramatic composition, for or the matter of that, in Telugu composition in general........
>
> —(*The Peoples Friend, Junuary, 21, 1897.*)

ఖాసా సుబ్బారావుగారు పత్రికా లోకమున జగమెరిగిన బ్రాహ్మణులు. వీరు తమ పత్రికాజీవితమును ఆంధ్రకేసరి స్థాపించిన "స్వరాజ్య"లో ప్రారంభించిరి. కొద్దికాలము నెల్లూరున న్యాయవాదులుగ నుండిరి. తరువాత వీరు స్థాపించిన వార పత్రిక "స్వతంత్ర"లో "సాకా" అను ప్రచ్ఛన్ననామముతో "Side lights" అను శీర్షికక్రింద సమకాలీన రాజకీయ, సాంఘిక పరిస్థితులను గురించి చేసిన విమర్శనా పూర్వక రచనలు, వాని రచనాశైలియందు ప్రత్యేకస్థాన మాక్రమించును. ఖాసా వారి సంపాదకీయములు పత్రికాలోకమున గీటురాళ్ళు. వారి "Side lights" ను పఠించని ఆంగ్ల విద్యార్థియుండు అరుదని చెప్పవచ్చును. ఖాసావారు "Men in Lime-light" అను గ్రంథమును రచించియున్నారు. దీనిలో వీరు మన రాజకీయ నాయకుల వ్యక్తిత్వ చిత్రణము బహు మనోహరముగ నొనరించిరి. ఖాసావారు పత్రికా లోకమున జంకులేని విమర్శలకు పేరుగాంచిరి. వీరి రచనాశైలి నిశితమై యుండును. ఆంగ్ల పదజాలమును వాని అర్థపాటవము నెరిగి వాడుటలో వారికి వారేసాటి.

ఆంగ్ల పత్రికారంగమున యశస్సు గడించిన మరియొక నెల్లూరు మండలీయుడు భైరవరసు హనుమంతరావుగారు. వీరు Times of India పత్రికకు ప్రధాన వార్తా శాఖా సంపాదకులుగా నుండి, ఇటీవలనే స్వర్గస్థులైరి.

"Blitz", "Times of India" మొదలగు సుప్రసిద్ధ పత్రికలలో విలేఖరిగా నుండి అనతికాలములో విశేషకీర్తి నార్జించిన నెల్లూరు యువకుడు గునుపాటి కేశవరామిరెడ్డి. వీరు ప్రస్తుతము విదేశములందు Times of India విలేఖరిగా నున్నారు

నెల్లూరు పట్టణమున 1932-33 వ సంవత్సరమున "Scrutator", "Rural India" అను వారపత్రికలు ప్రారంభింపబడినవని, చెప్పినపుడు నిచట ఆంగ్లభాషా ప్రాభవ మెంతగా నుండెనో యూహించవచ్చును. P. S. R. ఆంజనేయులుగారు "Scrutator" నకు సంపాదకులుగా నుండిరి. శ్రీ D. రాజరత్నం "Rural India" సంపాదకులుగా నుండెడివారు. ఈ సందర్భమున "హిందూ" పత్రికా స్థాపకులలో ముఖ్యులు, నెల్లూరు పౌరులు నగు న్యాపతి సుబ్బారావుగారిని పేర్కొనవలసి యుండును.

## V

నెల్లూరు పట్టణ న్యాయవాదులలో కీ. శే. ఆనుంచర్ల సుబ్బుకృష్ణారావు గారు ఆంగ్లమున గొప్పవక్తలు. వీరు ఆవేళయందు నిద్రలేపినను, ఆంగ్లమున అనర్గళముగా ఉపన్యసించగల మేధావులు. ఈ కోవకు చెందినవారే శ్రీ తూము లూరి శివరామయ్య పంతులుగారు. న్యాయవాదిత్వమందు అగ్రశ్రేణికి చెందిన మహామహులు నెల్లూరు మండలీయులు. సుప్రసిద్ధ న్యాయవాదులు అల్లాడి కృష్ణ స్వామయ్యగారి నెరుగనివా రుండరు. వీరు మన రాజ్యాంగచట్ట నిర్మాతలలో నొకరు. ఆంగ్లమున గొప్పవక్తలు.

## VI

నేడు మనపట్టణమున అధివక్తలుగానున్న అష్టకాల రామనాధము తండ్రిగారగు అష్టకాల సుబ్రహ్మణ్యంగారు ఆంగ్లమున INDIRA అను నవలను రచించిరి. నెల్లూరు మండలమునకు చెందిన దువ్వూరు రామిరెడ్డిగారిని తెలుగుకవిగా అందరెరుంగుదురు. కాని వీరు ఆంగ్లమునకు హృద్యమగు కవిత నల్లగలరని బహుకొద్దిమంది ఎరుగుదురు. వీరి "Voice of the Reed" అను ఆంగ్ల పద్య సంపుటియందు, ఆంగ్లసారస్వతమున "Pastoral Poetry" ప్రభావము గన్పించును. చిరకాలము వెంకటగిరి రాజాగారి కళాశాలలో ఆంగ్లభాషాధ్యక్షులుగా నున్న గుట్టా వెంకటసుబ్బరామయ్యగారు ఆంగ్లోపన్యాసకులుగా పేరుగాంచుటయేగాక రమణమహర్షియందు తమకుగల భక్తి ప్రపత్తులను వెలిబుచ్చుచు "Songs and Sonnets" అను పద్యసంపుటిని ఆంగ్లమున రచించియున్నారు. ప్రస్తుతము వెంకటగిరి రాజాగారి కళాశాలయందు ఆంగ్లభాషాధ్యక్షులుగనున్న దుర్భా రామమూర్తిగారు, ఆంధ్రమున కవులగుటయేగాక, ఆంగ్లమున కొన్ని పద్యములు పత్రికాముఖమున ప్రచురించియున్నారు. నెల్లూరు పట్టణమున లాయరు వృత్తిలోనున్న నేలనూతల శ్రీకృష్ణమూర్తిగారు ఆంగ్లమున అనేక వ్యాసములను, ఆనందకుమారస్వామిని గూర్చి రచించియున్నారు. వీరి ఆంగ్లగీత సంపుటి "Thoughts Minims" (చూ. పేజి 329) అముద్రితము. వీరు భరత

నాట్యమును, ఆంధ్రనాట్యశిల్పముల కన్వయించి ఆంగ్లమున వ్రాసిన గ్రంథము ఆంధ్ర ప్రదేశ్ లలితకళా అకాడమీ వారిచే ప్రచురింపబడుచున్నది.

భారతీయ ఆదిమజాతి సంఘాధ్యక్షులుగను, సభ్యులుగను, బహుకాలము ఆదిమజాతుల ఉద్ధరణకై కృషిగావించుచుండిన గాంధేయుడు, విప్లవవాది యగు వెన్నెలకంటి రాఘవయ్యగారు ఆదిమజాతులలో నొకరగు యానాదులపై ఆంగ్లమున ప్రామాణికమగు నొక సుద్గ్రంథమును రచించియున్నారు.

నెల్లూరు మండలమున పల్లెపాడు గ్రామమునకు చెందిన డా. రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారు నేడు పురావస్తు శాఖాధికారులుగ చెన్నపట్టణమున నున్నారు. వీరు ఓఢ్రగజపతులను గురించి ఆంగ్లమున Ph.D. Thesis ను వ్రాసిరి. వీరు. నాగార్జునలోయయందు పురాతత్త్వఖననము విరివిగా జరిపి, అధికారరీత్యా పరిశోధనా ఫలితములను ఆంగ్లమున రచించి యున్నారు. గ్రంథములు రచించకపోయినను, వెంకటగిరి రాజాగారి కళాశాలయందు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన సంతాన రామయ్యంగారిలాంటి మహామహులు మన మండలమున ఆంగ్లభాషావికాసమునకును, వ్యాప్తికిని దోహదకారకులైరి.

ఇట్లు నెల్లూరు మండలమున ఎందరో మహానుభావులు ఆంగ్లభాషా నిష్ణాతులై పేరెన్నదగిన రచనలు గావించి, మండలమునకు యశస్సు నార్జించిరి. ఇచట మనము మన ఎరుకకు వచ్చినవారిని మాత్రమే సూచ్యప్రాయముగ పేర్కొన గలిగితిమి.

ఇందు అనుబంధముగా కీ. శే. దువ్వూరి రామిరెడ్డిగారి "వాయిస్ ఆఫ్ ది రీడ్" నుండి, వాల్మీకిని గుఱించిన ఆంగ్ల పద్యభాగమును, ప్రచురింపని "చిరుగీతములు" అను ఆంగ్ల శ్లోకముల, ఉదాహరణ కిచ్చుచున్నాము. ఇదిగాక నే. శ్రీ. కృ. గారు ఆంధ్రకేసరిని గూర్చి వ్రాసిన ఆంగ్లపద్య స్తోత్రమును శ్రీ దుర్భా రామమూర్తిగారి ఆంగ్లగీత ఖండికను ప్రచురించుచున్నాము.

*Duvvuru Rami Reddy*

## VALMEEKI

O Valmeeki, king of poets!
Who art thou, perching on the bough of poetry
As a koil, warbling a celestial note?
What soil is hallowed by thy birth?
Who is the worthy mother
Whose breasts suckled the peerless ministrel of the age?
O poet of eternity?

♦ ♦ ♦

With a thousand *namaskarams* I take
The dust of thy feet on my head.
As a man standing
under the infinite starry heaven
Thinks of his insignificance
I, standing in thy presence,
Confess with pride my own frailty.

♦ ♦ ♦

## HINDU (OPINION)

Mr. Rami Reddy's is assuredly the authentic voice of poetry, which speaks through these poems; and there is, in these translations, a genuine attempt to preserve the spirit of the tradition and speech native to the author. There is also that simplicity of language and a rhythmic quality that are adequate as well as satisfying."

## LITTLE POEMS

Some times
Little poems,
Float in my mind
Like phantoms.
When I try to ensnare them
With my words,
They elude my grasp
And some where fly.
or do they die?
If they die,
They go to Heaven,
Grow there with nectar food,
Enjoy the cool sprays
Of the Ganga's waves,
Inhale the odours
Of deathless flowers,
And in full-blown youth
Descend to the earth
And reincarnate
As sweet poems,
In the heart of a great
Poet laureate.

*N. S. K.*

## A PAEAN

Illuminator and The Illumined thou art
Thy stature always was above others.
Thy sacrifice was never the result of design and calculation
Thou art donor Par-KARNA
But never were you revengeful.

•Love of motherland was deep in you,
That affection reigned supreme in you
You championed the Nation's cause
Heart and soul you marched abreast.

You realised the supramacy of THE ATMAN
When you laid bare your breast to the muskets levelled.
You knew the futility of the brute force.
You remained the thirty three crores of humanity.

You reigned as the All-surviving ATMAN,
Which could not be either pierced or shot.
You gave the defeat to the mundane
and TRUTH triumphed with you.

You were a born leader
You were a born patriot
You were born to be a martyr
Thy fame is everlasting.

You once belonged to us,
Now we all belong to you.
You were then one of us
Now you are ONE in all of US.

*D. Rama Moorthy*

# GLIMPSES

The dim half-moon scrambles up the eastern mount.
Like a weary watchman of the night.
The stray stars look like fiery pyramids
Scattered on the sky:
The world's agony broods in silence
Over sleeping humanity:
And spectral dreams hold their devilish revelry
In the inner court of restless sleep.
My eyes burn and yet do not shut
But wander from star to star
In restless search
To catch the divine spark
That sets afire
The mighty straw-world of illusion.
The night crawls along like a [illegible] reptile
Devouring its own eggs, the tiny stars.
And when the morning comes
I wake to find
The slimy darkness still clinging to my brain.

# 11

# క్రీ. శ. 2000 నాటికి, నెల్లూరు.

దైవజ్ఞ. మొగల్తూరు శివయ్య,
అధివక్త.

భారతీయ జ్యోతిషశాస్త్ర గ్రంథములలో నెక్కువ భాగము మనుజుల జాతకఫలితములు నుదహరించునవియేగాని దేశముల భవిష్యత్తును గురించి తెలియ జేయు గ్రంథములు కొన్ని నాడీగ్రంథము లున్నవి. అట్టి నాడీగ్రంథములలో కాకాభుజందర్ నాడి, తమిళములోను మంజులాచార్యులవారి నాడీగ్రంథము సంస్కృతములోను వ్రాయబడివున్నవి. ఆ రెండు గ్రంథములలోను భారతదేశముయొక్క భవిష్యత్తును గురించి వ్రాయబడి వున్నది.

పాశ్చాత్యుల మత గ్రంథములలోను, జ్యోతిషశాస్త్ర గ్రంథములలోను ప్రపంచము యొక్క భవిష్యత్తును గురించి వ్రాయబడివున్నది. కాని అతిప్రాచీనమైన "యురేనియ" జ్యోతిషశాస్త్రి గ్రంథములలోను ప్రపంచ జాతకము పేర్కొనబడి వున్నది. అది "జాంద్ఆకాశ్" అను జొరేస్ట్రియన్ మతగ్రంథములో నున్నది. ఆ ప్రపంచ జాతకము మానవాళి జాతకమనియే చెప్పవచ్చును. ఆ జాతకచక్రము ప్రకారం ప్రపంచలగ్నము కటకరాశిలో $19^{\circ}$ అయివున్నది. కటకములో గురువును, తులలో శనియు, ధనస్సులో కేతువును, మకరములో కుజుడును, మీనములో బుధ శుక్రులును, మేషములో రవియును, వృషభములో చంద్రుడును, మిథునములో రాహువు నున్నారు. ఈ జాతకచక్రము వాల్మీకి రామాయణములో శ్రీరామ చంద్రుని జాతకచక్రమును పోలివున్నది. ఒక నక్షత్రమున్నూ, తత్కారణముచే చంద్రుని స్థానము మాత్రము భిన్నముగా వున్నది.

భారత జ్యోతిశ్శాస్త్రములో వింశోత్తరీదశాక్రమము వలెనే "యురేనియన్" ప్రపంచ జాతకమునకు దశలు కల్పింపబడినవి. వింశోత్తరీదశా పరిమాణము 120 సంవత్సరములు రాహుకేతువుల దశతోకలిసి కాగా ప్రపంచ జాతకమునకు గురు, కుజ, సూర్య, శుక్ర, బుధ, చంద్ర, శని మహాదశలు క్రమముగా, 11, 17, 4, 9,

13, 12, 15, వేల సంవత్సరములును కలిగి, 81 వేల సంవత్సరములై వున్నవి. గ్రహ దశలలో యిదే క్రమమున అంతర్దశ విదశలును కల్పింపబడి వున్నవి. ఆ ప్రాచీన గ్రంథము ప్రకారం యిప్పుడు కుజ మహాదశ జరుగుచున్నది. అది క్రీ.శ. 12 సంవత్సరములో ప్రారంభమయినది. దీనికిముందు జరిగిన గురుమహాదశ బుధాంతర్దశలో శ్రీకృష్ణపరమాత్మ జన్మించినట్లును, శన్యంతర్దశలో బుధవిదశలో బుద్ధదేవుడు జన్మించినట్లును, శన్యంతర్దశలో చంద్రవిదశలో జీసస్ క్రైస్టు జన్మించినట్లును వ్రాయబడివున్నది.

ఇపుడు జరుగుచున్న కుజమహాదశలో కుజాంతర్దశ కుజవిదశలో క్రైస్తును శిలువ వేయుట జరిగినది. కుజ మహాదశలో కుజాంతర్దశలో శుక్రవిదశలో 493 క్రీ.శ. లో మహమ్మద్ ప్రవక్త జననము. ఆవిదశలో "యిరాన్" రాజ్యపతనము జరిగినది. కుజాంతర్దశలో బుధ విదశ క్రీ.శ. 693 లోను, చంద్రవిదశ క్రీ.శ. 1003 లోను, గురువిదశ క్రీ.శ. 1680 లోను ప్రారంభమయినవి. గురువిదశ క్రీ. శ. 1940 వరకు జరిగినది. 1941 నుండి 1951 వరకు కుజమహాదశలో రవ్యంతర్దశలో రవివిదశ జరిగినది. యీ కాలములో భారతదేశమునకు స్వాతంత్ర్యము లభించినది. ప్రపంచములో గొప్ప యుద్ధములు జరుగుననియును, యీ కాలములో భారతదేశములో నొక అవతార పురుషుడు జన్మించుననియును, ఆ మహానుభావుడు ప్రపంచ రక్షకుడు కాగలడనియును తెలుపబడివున్నది. 1951 నుండి రవ్యాంతదశలో శుక్రవిదశ జరుగుచున్నది 1971 వరకు. 1971 నుండి 2001 వరకు బుధవిదశ. యీ కాలములో "యిరాన్"లో పార్శీలు పునఃప్రవేశించెద రనియును మరల జొరేస్ట్రియాంజ యిరాన్‌లో ప్రబలగలదనిన్నీ, హిందూదేశమునకు ఉత్తమ కాలమనియును, ప్రపంచ మంతటను వేడిగాడ్పు లుండుననియును, అణు, యుద్ధభయ ముండుననియును తెలుపబడివున్నది. అణు యుద్ధము వచ్చినను భారతదేశమున కెట్టి బాధయు నుండదు. 2002 నుండి 2022 వరకు రవ్యంతర్దశలో చంద్రవిదశ. యీ కాలములో ప్రపంచములో శాంతిసౌభాగ్యములు అవతారపురుషుని అనుగ్రహముచేత నెలకొల్పబడుననియు తెలుపబడినది. కుజమహాదశలో రవ్యంతర్దశ 2833 A. D. లో అంతమగును.

పాశ్చాత్య జ్యోతిషశాస్త్రవేత్తలు అయనాంశనుబట్టి యిపుడు మీనరాశిదశ ప్రపంచమునకు జరుగుచున్నదనుచున్నారు. పరాశరమహర్షి కాలములో అయనాంశ

కృత్తికా నక్షత్రములో నుండెను. అందువల్లనే వింశోత్తరీదశలకు "కృత్తికాదిక్రమేణ" అని నిబంధించినారు. వరాహమిహిరుని కాలములో అయనాంశ అశ్వినీ నక్షత్రములో నుండినందున మేషరాశిలో నుండెను. యిపుడు మీనరాశిలో 6వ డిగ్రీలో నున్నది. క్రీ.శ. రెండువేల సంవత్సరములకు కుంభరాశిదశ ప్రారంభము కాదలదు. ఈ దశలను కొందరు పాశ్చాత్యులు యుగము (ages) లనియు పేర్కొందురు. కుంభ రాశి యుగము ప్రారంభమగునప్పటికి శాస్త్రవిజ్ఞానము చాలా అభివృద్ధి నొందగలదు. కుంభరాశి లగ్నముగాగల రష్యాదేశము శాస్త్రవిజ్ఞానములో ప్రపంచదేశములలో నగ్రగామిగా నుండగలదని కొందరు పాశ్చాత్య శాస్త్రజ్ఞులు భావించుచున్నారు. ఈ సిద్ధాంతము ప్రకారము చంద్రలోకయాత్ర మానవులు జయప్రదముగా జరుగ వచ్చును. కుజశుక్ర గ్రహములకు యాత్రాప్రయత్నములు జరుగవచ్చును. అన్ని రంగములలోను మానవుల విజ్ఞానప్రతిభ ప్రస్ఫుటము కాగలదు. కుంభరాశియుగము పూర్తియగు లోపల అనగా క్రీ. శ. 4000 వచ్చునప్పటికి శాస్త్రవిజ్ఞానము చేతను, ఆత్మవిజ్ఞానముచేతను మానవుడు పరిపూర్ణత్వము పొందుటకు ప్రయత్నించి జయము నొందగలదని వూహించవచ్చును.

ప్రపంచ భవిష్యత్తును గురించి యోజించునపుడు యుగసిద్ధాంత మొకటున్నది. మన ప్రాచీన ఋషిప్రోక్తమగు శాస్త్రప్రకారం సత్య, త్రేత, ద్వాపరకలియుగములు గ్రీకుదేశ జ్యోతిష్కుల ప్రకారం స్వర్ణ, రజత, కాంస్య, లోహయుగములు. అయనాంశ మార్పునుబట్టి రాశికి రెండువేల సంవత్సరముల ప్రకారం యిరువైనాలుగు వేల సంవత్సరములలో పన్నెండురాసులు ఆరోహణ, అవరోహణ క్రమముగా విభజించినపుడు కలియుగము క్రీ.శ. 500 సంవత్సరములో ప్రారంభమైనట్లును క్రీ. శ. 1700 సంవత్సరమువరకును కలియుగమనియు. క్రీ.శ. 1700 సంవత్సరమునుండి రెండువేలా నాలుగువందల సంవత్సరములు అనగా క్రీ శ. 4100 వరకు ద్వాపరయుగ కాలమని, తమ గురువగు శ్రీ యుక్తేశ్వరస్వామి చెప్పినట్లు స్వకీయమగు ఆత్మకథలో శ్రీ పరమహంస యోగానందగారు వ్రాసియున్నారు. (Autobiography of yogi by Paramahamsa Yogananda) వారి సిద్ధాంత ప్రకారము కలియుగములోదనగా 500 మొదలు 1700 సంవత్సరములవరకు సామాన్య నాగరకతోగూడిన కాలమని

రాజ్యములలోను సోషలిస్టు (సామ్యవాద) ప్రభుత్వములు రావచ్చునని సూచింపబడి వున్నది.

భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పినట్లు "పరిత్రాణాయ సాధూనాం। వినాశాయచ దుష్కృతాం । ధర్మసంస్థాపనార్థాయ । సంభవామి యుగేయుగే। ఒక అవతారపురుషుడు జన్మించుట కవసరమైన పరిస్థితులు 1970 సంవత్సర ప్రాంతములలో కలుగవచ్చును. అణుయుద్ధము సంభవించుటతో "యురేనియస్" జ్యోతిష శాస్త్రప్రకారము భారతదేశములో జన్మించిన అవతారపురుషుడు రంగమునకు వచ్చి తన ప్రబోధముచే ప్రపంచ వినాశము నరికట్టవచ్చును. యీకాలములో ధర్మసంస్థాపనావసర మొంసేని కలదని భవిష్యోత్తర పురాణములోను చెప్పబడి వున్నది. కాబట్టి నాడీగ్రంథములు సూచించని విధముగా "యురేనియస్" జ్యోతిషశాస్త్రము నిర్వచించినట్లు ఒక అవతారపురుషుడు భారతదేశములో జన్మించి, ప్రపంచశాంతి నెలకొల్పగలడని విశ్వసించవచ్చును.

ప్రపంచజాతకచక్రములో భారతదేశమునకు లగ్నాధిపతి బుధు డని చెప్పబడినది. ఆ కారణముచేత 1971 నుండి 2001 సంవత్సర మధ్యకాలము భారతదేశమునకు శుభ ఫలిత మిచ్చునదై యున్నది. ఏలన, ప్రపంచమున కప్పుడు కుజమహాదశలో రవ్యంతర్దశలో బుధపిగళ జరుగును. అప్పటికి భారతదేశములో శాస్త్రవిజ్ఞాన మభివృద్ధిచెంది విద్యుచ్ఛక్తి, అణుశక్తి ఉత్పత్తి పాశ్చాత్యదేశములతో సమాన స్థాయిలో నుండగలదు. భారతదేశములో వ్యవసాయము మిక్కిలి అభివృద్ధి నొంది సంపూర్ణ ఫలితముల నొసగగలదు. రెండువేల సంవత్సరములనాటికి భారతదేశము సర్వతోముఖాభివృద్ధి నొందగలదని భావించవచ్చును.

అప్పటికి నెల్లూరు మండలము కూడ సర్వతోముఖాభివృద్ధి నొందగలదు. నెల్లూరు పట్టణము మహానగరమై విలసిల్లగలదు. మండలములోని మెట్టతాలూకా లన్నిటికి నీటిపారుదల సౌకర్యము యేర్పాటుచబడి, మండల మన్నిభాగములును సస్యశ్యామలములై విరాజిల్లగలవు. కృష్ణాపట్టణము, దుగరాజపట్నము పెద్ద రేవుపట్టణములు కాగలవు. ప్రతి గ్రామమునకు, విద్యుచ్ఛక్తి, టెలిఫోన్, టెలివిజన్ సౌకర్యములు

కలిగివుండును. అవతారపురుషుని ప్రబోధముచేత ప్రజలలో ఆస్తికృత పెరిగి, ఆత్మ విద్యలయం దాసక్తి కలవా రగుదురు. నెల్లూరు మండలములోని కళాశాలలో యోగశాస్త్రము, జ్యోతిశ్శాస్త్రము, సాముద్రిక శాస్త్రములు పాఠ్యవిషయములుగా నుండగలవు. మండలములోని ఖనిజసంపదను భారతప్రభుత్వము సంపూర్ణముగా వినియోగించుకొను చుండును. వ్యవసాయములోనేగాక, నెల్లూరు మండలము పారిశ్రామికముగా కూడా రాష్ట్రములో నగ్రస్థాన మాక్రమించ గలదు. మండలములో పెక్కు ప్రదేశములలో యంత్రాగారములును, కర్మాగారములును స్థాపింపబడును. నెల్లూరు మండలములో నొక వైమానిక కేంద్రము నెలకొల్ప బడును. రాష్ట్ర రాజకీయములలోను కేంద్రప్రభుత్వములో నెల్లూరు మండలీయుల కున్నత స్థానముండగలదు. నెల్లూరు మండలము సర్వతోముఖాభివృద్ధి నొందగలదు.

సర్వేజనా స్సుఖినో భవంతు

ఓం తత్ సత్.

# శ్రీ పిల్లారిసెట్టి కోదండరామదాసుగారు

శ్రీ కోదండరామదాసుగారు నెల్లూరు వాస్తవ్యులు. తండ్రి వేంకటస్వామిదాసు, తల్లి సుభద్రమ్మ. వీరి జననము క్రీ శ 1816 ప్రాంతమున నయ్యెను. వారి అర్ధాంగి శ్రీమతి వేంకటరంగమ్మగారు. వీరు ఆదినెలను తెగరుం జెందినవారు. ప్రహ్లాదునివలె చేఁ బ్రాయమునుండియే విష్ణుభక్తులైనారు. వారుద్యోగమునుండియు “మాళిస్థకుంభకరిగిరస్థూ భీష్మటీకా” చిత్తము భగవదాయత్తమొనర్చి శాంతిసౌఖ్యము లనుభవించిన పుణ్యమూర్తులు. భజనకాలమున తంబురను, కరతాళములను ధరించి నృత్యము చేయుచుండెడివట. నెల్లూరి రంగనాథస్వామి కైంకర్యమునకై జీవితము నర్పించిన ధన్యజీవి. వీరు క్రీ శ. 1891 మార్చి 17 వ దివంగతులైరి.

వారు పెక్కు గ్రంథములను రచించిరి. వీరి చరిత్రాదికమును గూర్చి 1919 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల “గృహలక్ష్మి” పత్రికలయందు కీ॥ శే॥ నంగోలు వేంకటరంగయ్యగారు వ్రాసియున్నారు.

## వారి తల్పగిరి రంగపతీ శతకమునుండి కతిపయ పద్యములు

శ్లో. శ్రీ రంగ భోగిశయనోపరిజాతనిద్రం, నీలాకృతిం నిఖిలపావన నాగరూపం
శ్రీరామచన్ద్ర కులదైవత మంజనాభం, శ్రీరంగనాయక మహం ప్రణమామినిత్యమ్॥

శ్రీ మద్రంగేశచరణ పరిచర్యైక మానసాః
నిర్మలా నిరహంకారా నిత్యముక్తనిభాః పరే
యే రంగధ్యాన నిరతా యే రంగేశ్వర చిన్తకాః
ఇదం భక్త్యా జపన్నిత్యం పఠేద్వా శృణుయాన్నరః॥

శ్రీ రమణీ మణీ మణిమయిష్ట మహోన్నత వక్ష నాగనా
గారిముఖార్చితాంఘ్రియుగ హాటకచేల కుచేల దుఃఖసం
హార! స్వనాభికంజసముదంచిత ధాతృకుమార ప్రోవఁగా
రార యువార తల్పగిరిరంగపతీ సుకృతీ కృపామతీ॥

భూరిసుఖప్రమోద పరిపూర్ణ నిరంతరము బాసి సత్యలో
కోప సవర్గమానియు సమాప్యమనింపఁగవేద్యతేక నె
ల్లూర పినాకినీ సతటనోత్సవ కౌతుకవృత్తిరమ్య మ
హ్యారబలాఢ్య తల్పగిరి..........

శాంతు ననంతసద్గుణనిశాంతు నరాతికృతాంతు దాంతుసా
మంతు నహార్యకుంతు మతిమంతు భవత్పదకంజభావనై
కాంతు వసంతకంతు శతకాంతు మదిన్ హనుమంతుఁ గీర్తివి
శ్రాంతుఁ దలంతు దల్పగిరి.........

ప్రకటితబాదరాయణ పరాశర శౌనక వాసులూరు డిం
భక శుకముఖ్య దావనులఁ బార్థ విభీషణ భీష్ములన్ హిర
ణ్యకశిపుపుత్రు ద్రౌపది నహల్యను నాశబరిన్ ఫలంబుగో
రక స్మరియింతు దల్పగిరి........

యతికులసార్వభౌముని యనంతరకాలమునందు జీవసం
తతులకుఁ గల్పవృక్షమనఁ దా నవతారమునాచరించి య
ద్భుతగతిఁ బెక్కుగ్రంథములఁ బొత్తుగజేసిన పెర్యవియ్యరున్
వ్రతముగ గొల్తు దల్పగిరి.........

తానొక కామధేనువు విధంబున నాకడకేగుదెంచి యెం
తోనెనరొప్ప నద్భుతవుధోరణి నాకఖిలాగమాంతవి
జ్ఞానముగల్గఁజేసిన ప్రశాంతు నృసింహగురున్ దలంతు న
గ్లానిఁగులోద్భవతల్పగిరి.........

జలనిధి నీదినన్ నగముదాటున డాగిన భూమిమోసినన్
బలిమినృసింహమైన వటుభావముగన్న బరస్వధంబు కే
ల్తలమునఁబట్టినన్ జడలుదాల్చిన నాగలిబూన బుద్ధతన్
జెలఁగినఁ గల్కివైన నినుఁజిత్తమునన్ విడనాడ మాధవా
ప్రలలితదేహ తల్పగిరి..........

గారుడరత్నవర్ణుడగు కస్తురిరంగ విహారికన్నఁ గా
వేరినినుండు రంగవృషభీపతికన్నఁ నవూపరంగ సం
చారక పాండురంగవిభుచంద్రుల కన్నను మేటివీవు దు
ర్వారశమాఢ్య తల్పగిరి..........

రంగముమేలుకోట మధురాపురి తిర్మలకంచి జోతనై
లాంగణభూమి భూతపురి యప్పురుషోత్తమ కుంభకోణము
ల్మంగళసింహభద్ర నిగమాచలము ల్మొదలైనచోటులన్
రంగుగనుండు తల్పగిరి..........

గంగ సరస్వతిన్ జమున గౌతమి నర్మద తుంగభద్రను
తుంగగయన్ ప్రయాగమునఁ దోయధి కృష్ణ పినాకినీనదిన్
మ్రుంగిన నబ్బుపుణ్యములు పొల్పుగచేకురు రంగరంగశ్రీ
రంగ యటన్న తల్పగిరి.........

* తారావళి *

శ్రీ మత్పినాకినీ ప్రాగ్భూమిస్థిత తల్పశిఖరి పుంగవభాస్వ
ద్ధామ రవిధామ సద్గుణసీమా నెల్లూరివాస శ్రీ రంగేశా॥

హరిహరయని కొనియాడెడు హరిదాసుల పాదధూళి నానందముతో
బిరబిరఁదాల్చెద యిదే నాశిరమున నెల్లూరివాస శ్రీ రంగేశా

మంగళము రంగనాయక మంగళమిదె భవ్యదివ్యమంగళరూపా
మంగళము సింహపుర కుళింగత నెల్లూరివాస శ్రీ రంగేశా॥

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయోభూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ॥

భగవద్భక్తి యుక్తస్య తత్ప్రసాదాత్మ బోధతః
సుఖం బన్ధవిముక్తిః స్యాదితి గీతార్థ సంగ్రహః

శ్లో. యదక్షరపదభ్రష్టం మాత్రాహీనంతు యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ నారాయణ నమోఽస్తుతే

పరాశక్తి ర్మహాదేవో జాగరూకౌ హిమాలయే
భారతం లోకశాన్తిం చ రక్షేతా మాదిదంపతీ

—డా. పి. రాఘవభట్టు.

సంపూర్ణం

విక్రమ సింహపురి మండల సర్వస్వము


ముఖ్యసంపాదకులు శ్రీ చంద్రశేఖరరెడ్డిగారు
సహాయ్యకర్తలు శ్రీ పి. వి. సుబ్బారెడ్డిగారికి
మా కృతజ్ఞతలను చేయుచున్నాము.




డాక్టరు
వెన్నారెడ్డిగారు
సర్వస్వమును
ఆవిష్కరించు
చున్నారు.



సంపాదక
సభ్యులు శ్రీ బడి
గురవారెడ్డిగారు
సహాధ్యక్షులకు
సర్వస్వప్రతిని
అందజేయు
చున్నారు.



శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు సర్వస్వమును
సమీక్షించుచు ఉపన్యసించుచున్నారు.



సభాధ్యక్షులు శ్రీ వి. సి. సుబ్బారెడ్డిగారు
ఉపన్యసించుచున్నారు.

# అనుబంధము

## శ్రీ విక్రమ సింహపురీమండల సర్వస్వావిష్కరణ మహోత్సవం

## కార్యక్రమ సమీక్ష ★ రచన : శ్రీ ఐవి సుబ్బారెడ్డి

ఆ రోజు శోభకృన్నామసంవత్సరం మాఘ బహుళ పాడ్యమి. బాల భానుని బంగారు కిరణాల్తో ప్రకాశిస్తూన్న పసిడిప్రభాతంలో నెల్లూరు జిల్లా పరిషత్కార్యాలయం తళతళలాడుతూవుంది. లేత పొందమెరుగులు ఆ కార్యాలయ ప్రాంగణాన్ని అలంకరించడంచేత ఆ దృశ్యం చూడ్డానికి ఎంతో మనోజ్ఞంగావుంది. ఆ పరిసరాల్లో అధికార్లు, అనధికార్లు తండోపతండాలుగా నిండిపోయి ఆనాటి గ్రంథావిష్కరణ మహోత్సవం ఎప్పుడు ప్రారంభమౌతుందా అని ఉవ్విళ్లూరుతూ ఎదురు చూస్తూన్నారు. ఆవిష్కరణ మహోత్సవ సమావేశం ఇటీవలనే మహోత్సవాలకు సర్వాంగసుందరంగా నిర్మించుకొన్న మహాప్రాసాదంలో ఏర్పాటు చేయబడింది. ఆ ప్రాసాదం తెరచివున్న ద్వారాల్లోనుంచి బరువైన పూలవాసనలు, సుగంధధూపాలు ఎగసెత్తుకొనివచ్చి ఆ పరిసరాలన్నింటిని ముంచెయ్యడమేగాక ఆనాటి మహోత్సవానికి వస్తూవుండే ప్రజానీకానికి ఘనమైన స్వాగతాలిస్తూన్నవి. అతిథులందరు లోపల ప్రవేశించేసరికి కమ్మని వాసనలు గుమ్మని గుబాళిస్తూన్నవి.

ఆ మహాప్రాసాదంలో వేదికపైన గుట్టలుగుట్టలుగా నున్న పూలమాలల పరిమళాన్ని నాటిసభకు వచ్చేసే పెద్దలకు అందించడానికి కాబోలు పిల్లగాలులు సదస్యులను పలకరించుకుంటూ ఎదురుగా వస్తూవుండే మంత్రులవైపు ప్రయాణం చేస్తూన్నాయి. అంతలోనే నాటి పి. డబ్ల్యు. శాఖామాత్యులు శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారు, ప్రణాళికాశాఖామాత్యులు డాక్టర్ శ్రీ చెన్నారెడ్డిగారు శరవేగంతో ఆలయ పరిసరాల్లోకి వచ్చిన కార్లల్లోనుండి అఖండస్వాగతాలమధ్య క్రిందికి దిగారు. పరిషత్ అధ్యక్షులు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డిగారు, జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ఆనం సంజీవరెడ్డిగారు, జిల్లా అధికార అనధికార సభ్యులు మంత్రులకు ఎదురేగి వారిని పూలమాలల్తో ముంచెత్తారు. అందరు పరిషత్కార్యాలయంలోకి ప్రవేశించారు.

ప్రాసాదం ముందుభాగంలోని వరండాలో పూలు, గంధం హరిహరనాథుని పేర అంకిత [illegible]పత్రాలు అమర్చబడ్డ ఒక బల్ల వేయబడి వుంది. ఆ బల్లకు ఇరుపార్శ్వాల్లో కార్యాలయోద్యోగులు స్వాగతం చెబుతూ నిలబడి వున్నారు. మంత్రులా బల్లను

సమీపించి, పూలను గంధాన్ని స్వీకరించి, కరపత్రాలు చేతబట్టుకొని ఆవిష్కరణ మహోత్సవ సభను ప్రారంభించడానికి ప్రాసాదంలోకి ప్రవేశించారు. వెంటనే సభా కార్యక్రమం ప్రారంభ మైంది.

పరిషదధ్యక్షులు, సర్వస్వముఖ్యసంపాదకులు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖర రెడ్డిగారు ఆనాటి సభాకార్యక్రమంలో పాల్గొనవలసిన పెద్దల్ని పండితుల్ని వేదికపైకి ఆహ్వానించారు. శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారు అధ్యక్షస్థానాన్ని అలంకరించి కరతాళధ్వనులమధ్య సభను ప్రారంభించారు. పి. ఆర్. నాగేశ్వర సిద్ధాంతి పరంజీవి శ్రీనివాసులు తన గంధర్వగానంతో మంగళాచరణం గావించ, ప్రేక్షకులను ముగ్ధులను గావించారు.

శ్రీ విక్రమసింహపురీమండల సర్వస్వావిష్కరణ మహోత్సవం వైభవోపేత వాతావరణంలో ప్రారంభమైన వెంటనే, శ్రీ మోచర్ల రామకృష్ణయ్యగారు, ఏతద్గ్రంథప్రాశస్త్యాన్ని వక్కాణించి, సంపాదకవర్గపక్షాన హరిహరనాథునకు అంకితము గావించారు. ఈ సందర్భాన రసకవిగారు తిక్కన మహనీయ మహత్కార్యాల భాగాన్ని సంతరించి అంకితం గావించిన హరిహరనాథునకే ఈ బృహద్గ్రంథం అంకితం గావింపబడడం అత్యద్భుతమైన సంఘటనం అని నుడివి, తన శ్రావ్యమైన కంఠంతో అంకిత పద్యమును చదివారు.

బత్తిన గురవారెడ్డిగారు సంపాదకవర్గం ప్రతినిధిగా ఉపన్యసిస్తూ, నెల్లూరు మండలం ధీరోదాత్తనాయకులైన శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారు ఈ గ్రంథావిష్కరణ మహోత్సవానికి అధ్యక్షులుగా ఉండడం, సారస్వతప్రియులు, సరస్వతీసర్వతోముఖ ప్రీతిపాత్రులు శ్రీ చెన్నారెడ్డిగారు ఏతద్గ్రంథాన్ని ఆవిష్కరించడం, మోచర్ల, దీపాల వంటి పండితులు వేదిక నలంకరించిఉండడం, పేరుమోసిన పండితులు, పత్రికా సంపాదకులు, విమర్శకులు ఈ సారస్వత సభను అలంకరించి వుండడంవంటి ఉజ్జ్వల ఘట్టాలు భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాల్లో లిఖింపదగిన విషయాలని వక్కాణించారు. నెల్లూరు మండలం దాదాపు రెండువేల సంవత్సరాల చరిత్రగల ప్రాచీన నగరమని, వేదశాస్త్రపారంగతుడు సనాతన ధర్మానుష్ఠానపరతంత్రుడునైన తిక్కనకు స్తన్యమిచ్చిన ధాత్రి అని, వేదం వేంకటరాయశాస్త్రులు, దువ్వూరి రామిరెడ్డివంటి కవులకు జనయిత్రి అని, శ్రీ ఏ. సి. గోపాలరెడ్డివంటి రాజకీయవేత్తలకు మాతృభూమి అని వర్ణించింది, ఏతత్ మండల ప్రాశస్త్యాన్ని ఈ బృహద్గ్రంథంద్వారా సర్వతోముఖంగా బహుముఖ వ్యాసాల్లో పాఠకలోకాని కందజేస్తున్నామని చెప్పి, ఈ ఉద్యమంలో

సహకరించిన వారందరికి కృతజ్ఞతాభివందనసుమాంజలులను సమర్పించారు. పిమ్మట డాక్టరు మర్రి చెన్నారెడ్డిగారు సర్వస్వ సంపాదకసభ్యులను ఖద్దరు శాలువలతో సమ్మానించారు.

శ్రీ ఆర్. సుబ్బారెడ్డిగారు (ప్రిన్సిపల్ వి. ఆర్. కాలేజి నెల్లూరు) మాట్లాడుతూ నెల్లూరు మండలానికి ఘనమైన చరిత్ర ఉన్నదని, మనలను గూర్చి తెలుసుకోవడానికి ఈ సర్వస్వం ఉపయోగపడగలదని, సాహిత్యం, లలితకళలు, భూగోళశాస్త్ర విషయాలు, చారిత్రకవిషయాలు, ఆర్థికవిషయాలు, సామెతలు, వ్యవసాయం మొదలగు అనేక విషయములపై వ్యాసాలీ సంపుటంలో ప్రకటించబడ్డాయని, ఈ బృహద్గ్రంథం ద్వారా ఎందరో పెద్దలు లోకానికి పరిచయం చేయబడ్డారని అన్నారు. ఇంకా ప్రకటించబడ్డ వ్యాసాలు ప్రజాసామాన్యానికికూడా చక్కటి అందుబాటులో ఉండగలవన్నారు. ఈ సంపుటంలో ఉండే ప్రతివ్యాసం ఒక పరిశోధనాత్మక వ్యాసంగా వున్నాయన్నారు. పరిశోధనచేసే విద్యార్థులకీ సర్వస్వం ప్రామాణికంగా పరిగణించబడుతుందని విశ్వసిస్తున్నానని అంటూ, ఇంతటి మహత్తరమైన కృషిచేసిన సంపాదకవర్గాన్ని నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తన సంతోషాన్ని వెలిబుచ్చారు

విమర్శకాగ్రేసరులు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు హాస్యరసస్ఫోరకంగా తన ఉపన్యాసాన్ని ప్రారంభిస్తూ సంపాదకులచే ఇంతటి బృహద్గ్రంథం తయారైన యీ సంపుటం చిక్కించుకుని దేశానికి ఎంతో ఉపకారం చేశారని, ఈ సర్వస్వానికి ఆధారభూతంగా విషయసామగ్రి ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు. సర్వస్వ వేషధారులపై విమర్శలు వ్రాసే సమయంలో ఈ గ్రంథావతారానికి కారకులైన మహారాష్ట్రులైన ప్రముఖ వ్యక్తి పేరు చదివితే విజ్ఞానాన్ని అలవర్చుకోగలమని నొక్కి చెప్పారు. పిమ్మట పీర మంత్రులను, చంద్రశేఖరరెడ్డిగారిని అభినందిస్తూ శ్రావ్యమైన కంఠంతో ఈ క్రింది పద్యాలను చదివారు.

గీ॥ చంద్రశేఖరకార్యదీక్షాపతాక । సింహపురమండలోజ్జ్వలశ్రీనిధాన
మీమహాగ్రంథ మఖిలాంధ్రహృదయములకు । హర్షసంధాయకం బగు నలరు నిపుడు

క॥ విద్యాద్యాభామాత్యుడు । విద్యోత్పద్యోత్ప్రభావవిశ్రుతుఁ - పి. సి.
అద్యసభాధ్యక్షుడుగా । నుద్యద్దయవచ్చుటయె శుభోదయ మయ్యెన్.

క॥ చెన్నారెడ్డి మహోదయు । మన్ననసేయం బాత్రమగుట మనసర్వస్వం
బిప్పుడి మిన్నగ వాసియు । వన్నెయుఁ గని చెన్నుమిగిలె; భాగ్యమదాదే!

శ్రీ ఆకిలి మల్లికార్జునయ్యగారు సర్వస్వంలో చివర ప్రకటింపబడ్డ "రంగనాథ స్తుతి"లోని కొన్ని మంగళాంత పద్యాలనుచదివి సదస్యుల కాహ్లాదాన్ని కలగజేసారు.

వెంటనే సభాధ్యక్షులు శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారు తమ మలిపలుకుల్లో మన పూర్వులు గొప్పవారు అని చెప్పుకోవటంతోనే తృప్తిచెందక వారికంటే గొప్పవారు కావడానికి ప్రయత్నంచేసి, ప్రతికార్యాన్ని దీక్షతో సాధించాలని చెప్పారు. మున్నూరేండ్లకుముందు మనదేశం విజ్ఞానానికి, సిరిసంపదలకు పొగడ్త కెక్కిందని ఇప్పుడు బీదతనాన్ని అనుభవిస్తూ వున్నదని, మన దారిద్ర్యాన్ని పోగొట్టుకోడానికి ప్రతివ్యక్తి అర్హతకొలది దేశాభ్యున్నతికి పాటుపడాలని నుడివారు. ఈ మండల సర్వస్వాన్ని సర్వతోముఖంగా, సర్వాంగసుందరంగా సృష్టించిన సంపాదకవర్గాన్ని తా నభినందిస్తూన్నానని చెప్పారు.

పిమ్మట డాక్టర్ మత్తి చెన్నారెడ్డిగారు నెల్లూరు మండల ప్రాశస్త్యాన్ని ఇంతటి బృహద్గ్రంథంగా తయారుచేసిన ఈ సంపుటాన్ని ఆవిష్కరించే మహాద్భాగ్యం తనకు లభించినందుకు మిక్కిలి సంతోషంగా ఉందని నుడివారు. నెల్లూరులోని ప్రాచీనకవి తిక్కనలోని "తిక్క" నవీనకవి దీపాల పిచ్చయ్యలోని "పిచ్చి" రెండు గుణాలు మిమ్మింతటి బృహద్గ్రంథ రచనకు పురిగొల్పి వుంటాయని చమత్కరించారు. ఉపయోగకరాలైనవి, ఆదర్శాలైనవీ యెన్నో విషయాలు ఈ సంపుటంలో ప్రకటింపబడి మీ మండలం గొప్పతనాన్ని ప్రతిపాదిస్తూన్నవి. వీలైతే ఇట్టి మహత్తరమైన కృషి పరిషత్తు యాజమాన్యాన ప్రభుత్వమే చేయిస్తే బాగుంటుందని నుడివారు. ఇతర మండలాలకే సర్వస్వం ఆదర్శప్రాయం కాగలదని, తానుగూడ ఇతర మండలాలలో సంప్రదించి వారిని ప్రోత్సహిస్తానని చెప్పి సర్వస్వ సంపాదకవర్గాన్ని అభినందించారు.

సభాంతమున ముఖ్యసంపాదకులు చంద్రశేఖరరెడ్డిగారు సంపాదకవర్గానికి, ఈ ఉద్యమానికి ధనసాహాయ్యముచేసిన దాతలకు, తదితర మిత్రులకు తమ కృతజ్ఞతలను వెల్లడించారు. జిల్లాపరిషత్ కార్యదర్శి వందనసమర్పణతో నాటిసభ ముగిసింది.

# చిత్రవిచిత్రాలు

(వివిధ విగిన విషయములు)


| నెం. | | పుట |
|---|---|---|
| 1. | మహేశ్వరసుందరి రంగనాథ దేవాలయము | 430 |
| 2. | పందనాపురము | 432 |
| 3. | ఉదయగిరి నీటివసతి | 460 |
| 4. | సర్ పిన్స్టన్ చర్చ్ | 482 |
| 5. | సతి - సహగమనము | 482 |
| 6. | భైరవకోన - శ్రీనాథుని శ్రీకాళహస్తీశము | 486 |
| 7. | ఖాజీ | 294 |
| 8. | వెంకటగిరి సంస్థాన పుస్తక భాండాగారము | 294 |
| 9. | శ్రీ వెల్లంకొండ రామరాయకవి | 298 |
| 10. | దేవళములు - ఇప్పటిస్థితి | 583 |
| 11. | దేవళములు - ఇప్పటిస్థితి | 533 |
| 12. | మానవసేవ - మాధవసేవ | 538 |
| 13. | మాలెకొండ - B.C. నాటిది | 555 |
| 14. | డా॥ గో॥ కృష్ణయ్య గడియారము | 695 |
| 15. | నెల్లూరు గాలివాన | తృ. ఖం. 5 |
| 16. | నగరజ్యోతి | ద్వి. ఖం. 915 |
| 17. | చిన్న సాలార్ జంగ్ మ్యూజియమ్ | తృ. ఖం. 83 |
| 18. | శాలివాహనునినాటి నాణెములు - కొండవలూరు | ద్వి. ఖం. 922 |
| 19. | "తిక్కన" పేరు | తృ. ఖం. 83 |
| 20. | పాతాళగంగ | తృ. ఖం. 84 |
| 21. | డా॥ మోదీ | తృ. ఖం. 84 |


# చిత్రపటములు : ప్రథమ ఖండము


| నెం. | | పుట |
|---|---|---|
| 1. | జారెట్ చిత్రము | |
| 2. | ముఖ్య సంపాదకులు శ్రీ నల్లారెడ్డి చంద్రశేఖరరెడ్డి | |
| 3. | నెల్లూరు జిల్లా పటము | 1 |
| 4. | సంపాదకవర్గ సభ్యులు | 2 |
| 5. | సమకాలిక పోషకులు | 3 |
| 6. | మహాత్ముని రాక 1915 | 4 |
| 7. | రాష్ట్రపతి, ప్రధాని, ఆర్థికమంత్రి | 4 ఎ |
| 8. | డాక్టర్ సుబ్బారెడ్డి: వారు నిర్మించిన విద్యాభవనము | 5 |
| 9. | నసనూరి రామచంద్రారెడ్డి గారు - హైద్రాబాదులో నాయకులుగారికి బహూకృతి నిచ్చుట | 6 |
| 10. | జిల్లా పరిషత్ సమావేశము - వారు జిల్లా పరిషదధ్యక్షులకు బహూకృతి | 7 |
| 11. | జైన విగ్రహము | 8 |
| 12. | బుద్ధ విగ్రహము | 9 |

గౌరవనీయుల చిత్రాలు

| | | |
|---|---|---|
| 1. | జకీర్ హుసేను | 1 |
| 2. | నీలం సంజీవరెడ్డి | 2 |
| 3. | ఎ. సి. సుబ్బారెడ్డి | 3 |
| 4 | బి. గోపాలరెడ్డి | 4 |
| 5. | ఎం. చెన్నారెడ్డి | 5 |
| 6. | కె. బ్రహ్మానందరెడ్డి | 6 |

| సం | | పుట |
|---|---|---|
| 7 | యస్ రామచంద్రారెడ్డి | 7 |
| 8 | ఎ బలరామరెడ్డి | 8 |
| 9 | యం ఆర్ అప్పారావు | ( |
| | (సం 7 పొరపాటు) | |
| 0 | బి యస్ మూర్తి | 0 |
| | (సం 8 పొరపాటు) | |
| | డి సంజీవయ్య | 11 |
| 2 | కె ఉమామహేశ్వరము | 5 |
| 3 | జి బ్రహ్మయ్య | 16 |
| 4 | ఆ సంజీవరెడ్డి | ( ఎ |
| 5 | ఎ సి సుబ్బారెడ్డి | |
| | ఆనం సంజీవరెడ్డి | |
| | నాయకులు | |
| | సర్వశ్రీ | |
| | వి శ్రీరాములు | 1 |
| | పి సుబ్బరామయ్య | 2 |
| | వై రామకృష్ణారెడ్డి | |
| | జి తిరుపతినాయుడు | |
| | పలి వెంకటరెడ్డి | |
| | రా దశరథరామిరెడ్డి | |
| | వ శ్రీనివాసులురెడ్డి | |
| | కా వెంకటరమణమ్మ | |

| సం | | పుట |
|---|---|---|
| 4 | అల్లం కృష్ణయ్య | 4 |
| | కోరాఖత్తిన చిన్నయ్య | |
| | డి రామానుయ్య, వి పెంచలయ్య | |
| 5 | జి కొండయ్యనాయుడు | 5 |
| | సింగరాజ రామకృష్ణయ్య | |
| | కా శ్రీనివాసులురెడ్డి | |
| | ఎ కృష్ణారెడ్డి | |
| | పల్లిరెడ్డి ఆదినారాయణరెడ్డి | 6 |
| | జి సి కొండయ్య | |
| | పి అయ్యపరెడ్డి | |
| | బి ఎ నరసింహం | |
| | కా నారాయణస్వామి | 7 |
| | జి ప వేమారెడ్డి | |
| | పి వెంకటస్వామిరెడ్డి | |
| | సి హెచ్ రాఠయ్యనాయుడు | |
| 8 | కె పి రమణారెడ్డి | 8 |
| | మెట్టా రాజగోపాలురెడ్డి | |
| | కె తిరుపతినాయుడు | |
| | కె గురుస్వామిరెడ్డి | |
| | కా మహానంద | |
| | బి రామసుబ్బారెడ్డి | |
| | ధనికుల నరసింహం | |
| | కా వ విమలాదేవి | |
| 0 | ఈ కుమారస్వామిరెడ్డి | ( |
| . | బి స్వామిదాస్ | 96 |


## చిత్రములు : ద్వితీయ ఖండము


| సం | | పుట |
|---|---|---|
| | వ్యాసపల్లి - రంగవల్లి | |
| 2 | ఉదయగిరి కొండ | 03 |
| 3 | ఉదయగిరిలో కోనేరు | 17 |
| 4 | పెదపగిరి బాలకృష్ణ దేవాలయము | 09 |
| 5 | అల్లామ్ముల్లంపేట మసీదు | -- |
| 6 | ఆలా ముమ్ముడంపేట సమాధి | 8( |
| 7 | ప్రాచీన తాళపత్ర గ్రంథములు | 185 |
| 8 | శ్రీ నవలూరి మాలకొండయ్య పంతులు | 285 |
| 9 | శ్రీ బెజవాడ గురవారెడ్డి | 2 9 |

నెం. పుట

10. శ్రీ ఆకిలి మల్లికార్జునయ్య 421
భారతరత్న శ్రీ బాబు రాజేంద్రప్రసాద్
11. శ్రీ పొట్టి శ్రీరాములు 425
12 బుజబుజ నెల్లూరి గణపతి 435
13. శ్రీ మహాత్మాగాంధీ శ్రీ పొట్టి శ్రీరాములకు వ్రాసిన కార్డు 438
14. పైకార్డు నందలి అడ్రసు 446
15. బ్రాహ్మణక్రాక శాసనములు 461
16. ,, ,, 465
17. ,, ,, 469
18. భైరవకోన యందలి కొండలో మలచిన శివాలయము 517
19. ఘంటి యందలి నంది 518
20. వీరభద్రుడు 519
21. కోటవద్దయున్న వీరశైవుడు తన శిరస్సును శివున కర్పించినాడు 519
22. మైలార వీరభటుడు శిరస్సు నర్పింప సిద్ధముగ నుండుట 520
23. మైలార వీరుడు ఎడమ రెట్టను ఖండించుకొనుట 520
(ఈ రెండుచిత్రములు శిల్పకలు తాడుమాలైనవి)
24. శ్రీ కుసుమహరనాథభగవానుడు 529
25. శ్రీ కుసుమహరనాథ దంపతులు, రాధాకృష్ణుల అవతారములు 531
26. సత్యానంద మహర్షి 541
27. సత్యానందాశ్రమము 542
28. శ్రీరామయోగి 544
29. శ్రీ నారాయణ అవధూత 545
30. శ్రీరామయోగి 552
31. మాలెకొండలోని ఒక గుహ 555
32. శ్రీ రంగనాయక దేవాలయ గోపురము 562
33. ఏకనటముచే బహుపాత్రాభినయము సాయిబాబా, రామకృష్ణ, 592
కం. వీరేశలింగము, పటనరంగ స్థలము
34. పాము డ్యాన్సు 601
35. జైనీడివాడు 631
36. పంజాబువాడు 632
37. కొమ్ములవాడు 633
38. గంగదేవళము 634
39. వేంకటగిరి కోలో టీము 654
40. ,, మహార కోలో టీము 657
41. హాస్టేశ్వ పోరాటము ఘంటి యందలి శిల్పము 663
42. కుమారి హెలెన్ బెన్‌జిమన్ 691
43. డాక్టరు బెన్‌జిమన్ 692
44. తిక్కన గంటపుటోర 701
44 ఎ. తిక్కన 701 ఎ
45. హరిహరనాథుడు - పాదాము 705
46. శ్రీ ప్రొ. హా. జానకిరామశర్మ 748
47. వేమూరు వెంకటకృష్ణమ్మ 78[illegible]
48. డి. విజయం 831
49. యస్. వి. నరసింహారావు 892
50. ఇంద్రగంటి సుబ్రహ్మణ్యం 916
51. పురుగులుతినే మొక్కలు 923
52. ,, ,, 924
53. ,, ,, 925
54. శ్రీ త్యాగబ్రహ్మ రజత విగ్రహము (అర్ధశిల్పము) 925
55. శ్రీ త్యాగరాజ వస్త్రచిత్రము 93[illegible]
56. పండాఫీసు భవనము 941
57. సంస్కృత విశ్వపరిషత్ కార్యవర్గ సభ్యులు 933

| నెం | | పుట |
|---|---|---|
| | [illegible] - [illegible] | |
| | ద్వితీయ ఖండము విషయ | |
| | వూండ్ల రామకృష్ణయ్య | I |
| | నా టా ఆదిశేషయ్య | |
| | నా వా ము ఆదిలక్ష్మి | |
| | శా సా పాల[illegible]తమ్మ | |
| | [illegible]కపూప [illegible]దండరామిరెడ్డి | II |
| 0 | [illegible]టి [illegible]దరకవులు | III |
| | గన్నవరపు సుబ్బరామయ్య | |
| | పా సుబ్బరామయ్య | |
| | అ[illegible] ఆంజనేయులు [illegible] | |
| | [illegible] | _V |
| ( 2 | [illegible] | V |
| ( | మఫూ[illegible] రామిరెడ్డి | VI |
| | [illegible] సురవారెడ్డి | |

| నెం | | పుట |
|---|---|---|
| | వ్యాసకర్తలు | |
| 64. | కేసరి సుందరరామశర్మ | 1 |
| | యస్ మాలెకొండయ్యపంతులు | |
| ( 5 | సి రామస్వామిరావు | [illegible] |
| | కె రామానుజాచారి | |
| | చలంద్యాల వే సుబ్రహ్మణ్యశర్మ | |
| 66 | దీపాల పిచ్చయ్యశాస్త్రి | ? |
| | వి కుమార్ | |
| | రషీద్ ఖాషా | |
| 67 | డా రా సుబ్రహ్మణ్యం | 4 |
| | ఇండ్ల సుబ్బారావు | |
| | వా [illegible]కృష్ణమూర్తి | |
| ( 8 | E V V రాఘవాచార్యులు | 5 |
| | ఆర్ సుబ్బారెడ్డి | |
| | కోట సుబ్రహ్మణ్యశాస్త్రి | |


## చిత్రపటములు : తృతీయ ఖండము


| నెం | | పుట |
|---|---|---|
| . | భైరవకోన [illegible] | _ |
| 2 | , [illegible] | _ |
| [illegible] | [illegible] | _2 |
| | [illegible] - [illegible] పార్శ్వదృశ్యము | 22 |
| | (ఉదయగిరి - పొంబపాటు) | |
| 5 | భైరవకోండ - గుహలు | 22 |
| ( | చుండి - [illegible]రాలయము | 23 |
| [illegible] | చుండి ఆంజనేయులు | 23 |
| 8 | [illegible] - మిర్గ | 23 |
| [illegible]. | చుండి - [illegible] శిల్పములు | 24 |
| | చుండి - ఏకశిలా ధ్వజస్తంభము | 24 |
| 1 | చుండి - జనార్ధనస్వామి [illegible] | 24 |

| నెం | | పుట |
|---|---|---|
| 1_ | చుండి - [illegible]రాలయము | [illegible] |
| [illegible] | వీరశిలలు - మసునోలుపాడు | [illegible] |
| 4 | వీరశిలలు - మసునోలుపాడు | 25 |
| 1[illegible] | [illegible] స్వామి | 26 |
| 16 | శ్రావణ కుమారుడు | 27 |
| 17 | వాలి, సుగ్రీవులు | 28 |
| 18 | దొడ్డ సుబ్బారెడ్డి | 4[illegible] |
| [illegible] | మహ్మదాపురం [illegible] | 4[illegible] |
| [illegible] | [illegible] వాకాడు - స్తంభము | 72 |
| 21 | వినాయకుడు | [illegible]0 |
| 2[illegible] | వీరసతులు - మసునోలుపాడు | [illegible]0 |
| 22 | వీరుడు సతులు - బ్రాహ్మణక్రాక | 103 |
| 2[illegible] | దుర్గాదేవి - మసునోలుపాడు | [illegible]4 |

| నెం. | | పుట |
|---|---|---|
| 24. | గరుత్మంతుడు - మన్నారుపోలూరు | 105 |
| 25. | రామపట్టాభిషేకము - ఉదయగిరి | 106 |
| 26. | భువనేశ్వరి - నెల్లూరు | 107 |
| 27. | విష్ణు, లక్ష్మి - నెల్లూరు | 107 |
| 28. | శివయోగి - నెల్లూరు | 108 |
| 29. | సూర్యుడు - నెల్లూరు | 108 |
| 30. | గొల్లవారు - ఉదయగిరి | 109 |
| 31. | దేవీయుత విష్ణువు | 109 |
| 32. | దేవీమూర్తులు - చుండి | 110 |
| 33. | బాలలు - దేవతా నిర్మాతలు - చుండి | 110 |
| 34. | వినాయకుడు - మనుబోలుపాడు | 111 |
| 35. | వృషభకందము అలారవస-చుండి | 111 |
| 36. | శివయోగి - నెల్లూరు | 112 |
| 37. | బుద్ధుడు | 112 |
| 38. | రంగనాథ దేవాలయమునగల సిమెంటు విగ్రహములు | 113 |
| 39. | బాలకృష్ణుడు | 115 |
| 40. | సప్తతాళ భంజనము | 119 |
| 41. | వీరుడు - ధునిక | 126 |
| 42. | లక్ష్మీనృసింహుడు | 130 |
| 43. | మహిషాసురమర్దని | 131 |
| 44. | వీరుడు - దాత? | 131 |
| 45. | దేవి | 132 |
| 46. | సతిశిల | 132 A |
| 47. | శాస్తా | 132 B |
| 48. | దేవి చాముండి | 132 C |
| 49. | సుబ్రహ్మణ్యస్వామి | 132 D |
| 50. | అగ్నిగుండము | 132 D |
| 51. | జిల్లాపరిషత్ కార్యాలయ సభ్యులు : అధికారులు | |


## చిత్రపటములు


| నెం. | | పుట |
|---|---|---|
| 1. | రంగనాథస్వామి - మోపేర్లపురము | I |
| 2. | హరిహరనాథుడు - మహాబలిపురము | II |
| 3. | హరిహరనాథుడు - కంజనగరము | I I |
| 4. | హరిహరనాథుడు - గంగైకొండ చోళపురము | IV |
| 5. | వాకాటి హోస్టలు - శ్రీ॥ వి. ఎస్. మూర్తి రాక | V |
| 6. | చిత్రలేఖనము - కె. కృష్ణమూర్తి కావ్లూరు | VI |
| 7. | జి. ప. చైర్మన్ - సమితిలో మాట్లాడుట | VII |
| | జిల్లా కలెక్టరు గూడలి రోడ్డు ప్రారంభించుట, రోడ్డ | |
| 8. | జనసాగరం కెలువు ఉదయగిరి సిటీపాలుదల అనూరి రంగస్వామి సరస్వతి పిన్నంరాజు వృద్ధదంపతులు | VIII |
| 9. | కోట | IX |
| 10. | భారతము - అప్పు పేటి | X |
| 11. | ఉదయగిరి కొండలోయ ఉదయగిరి కోట | XI |
| 12 | వెంగుపల్లి లోయ, గయ్యి రాతివుప్పు, వెలిగొండ దేవళము | XII |
| 13. | జలపాతము - కానాకిర ఉదయగిరి, రాతి సమాధి, కిష్కిందా (హా. శ. 923 క్రీ.శం.) | XIII |

| నెం. | | పుట |
|---|---|---|
| 14. | ఆంధ్ర కల్పవృక్షములు - 2, 3, 6 శాఖలు | XIV |
| 15. | ఆంధ్ర కల్పవృక్షములు - 12 శాఖలు | XV |
| 16. | మల్లాం - మండపము | XVI |
| 17. | భైరవకోన - గుహాలయము | XVII |
| 18. | స్తంభాలకోన - ప్లాను | XVIII |
| 19. | ద్వారపన్నా - చిత్రలేఖనము జి. చంద్రశేఖరము | XIX |
| 20. | భైరవకోనయందలి - నాతిహారనామము, నటరాజు | XX |
| 21. | డా. గొంగళ్ళకృష్ణయ్యగారు తయారుచేసిన గడియారములు | XXI |
| | అనలతో సాగర వెలుపురాహు | |
| 22. | ఉదయగిరి - పాలక్షేత్రము కావలి కలుగోళ్ళమ్మ | XXII |
| 23. | పాకాల హోస్టల్ విద్యార్థులు కోట హైస్కూలు - హిందూపేట జయయుడు | XXIII |
| 24. | కందుకూరు మద్గద్వారము నాగూరు కోటద్వారము వల్లూరు - నర్సాపల్లి వారధి చింతమొక్కలు. చింతచెట్టు (నూ. పే. 327 చూ.) | XXIV |
| 25. | బ్రిటిష్ మ్యూజియమ్‌లోని గడియారము | XXV |

# విశేషపద సూచి
## (ద్వితీయ, తృతీయ ఖండములు)

అ


| | | | |
|---|---|---|---|
| [illegible] | తృ | ఖం | [illegible] |
| అనంత కావ్యసంగ్రహ | తృ | ఖం | 1[illegible] |
| [illegible] | తృ | ఖం | [illegible] |
| [illegible] | తృ | ఖం | [illegible] |
| [illegible] | | | [illegible]8 |
| [illegible] | | | 18 |
| [illegible] | | | [illegible] |
| అ[illegible] | తృ | ఖం | 5B |
| [illegible] | | | [illegible] |
| [illegible] | | | 7[illegible] |
| [illegible] | | | [illegible] |
| [illegible] | | | [illegible] |
| [illegible] | | | 78 |
| [illegible] | | | 8[illegible] |
| [illegible] | తృ | ఖం | 85 |
| [illegible] | తృ | ఖం | 9 |
| [illegible] | | | 98 |
| [illegible] | | | 0[illegible] |
| [illegible] | తృ | ఖం | 05 |
| [illegible] | తృ | ఖం | [illegible]5 |
| [illegible] | తృ | ఖం | 09 |
| [illegible] | | | 1[illegible]9 |
| [illegible] ([illegible]) | | | 15 |
| అగ్రకాలము | | | 7 |
| అష్టదిక్పాలుడు (అ) తప్పు | | | 2 |
| అగ్ని | తృ | ఖం | 1[illegible] |
| అక్షయసంపద? | తృ | ఖం | 25 |

[illegible] - శిలా[illegible]
అమ్మలేంద్ర
అక్బర - [illegible]
[illegible]
[illegible]
అద్దంకి - [illegible]
[illegible]
అనవేమారెడ్డి
అవచి తిప్పయ్య
అమృత[illegible]లు
[illegible]
[illegible]
[illegible]
అనుముద్రంపేట
అనుముద్రంపేట
దాన గ్రామములు
[illegible]
[illegible]
అనుముద్రముపేట - [illegible]
[illegible]
అరణ్యపర్వము
అహోబిల నరసింహస్వామి
అప్పయామాత్య
[illegible]వెన్నెలకంటి
[illegible]
అన్నయామాత్య[illegible]
అవతార దర్పణము

పుట

అవి విస్మృతించుచేసిన 201 అనంతపద్మనాభరావు
అ్ని పిచ్చువెంగళు వలంద 21 అరనిముసంబుగూడ
పదపాదమున, బిల్లల. రాఘపారము అనంతాచార్యులు నేటువాడు
్రి వెంపపూడి 206 అర్ధదేహమొకతె
ఆహార మస్నా 2 2 ఆది యసురావతిన
అ పితాక చింతామణి 212 అపరాన్యుడు
మామాస్మర వెంపా 4 అన్నాస్వామి బి
223
238 అనిబీసెంటు
41 అమృతసర్ లో
అప్పలా
24 అంగన్నమెంచు
248 అరెష్టులు
అంజ, జగదా వలటు
2 5 ఆడిగినది
అంతరశైత్యముల
అన్యులభావ
అమరాకాసము
అవన్ హరిహర
8 అంగాదిపేదా
2 3 అష్టావక్రులు
2 8
అభీతది . వాదిన
20 అల్లారు దేవవంటి
2 అనంతరాము
అరవాహి
అరువర్నాయి
అలోచనము
అనాది సంప్రదా
అతత్వధవృత్తికి
అతిథిపూజ